# తెలుగు సాహిత్యం - మహిళాభ్యుదయం

## ఎం.ఏ. తెలుగు, సెమిస్టర్ - III - ఐదవ పేపరు


<u>పాఠ్య రచయితలు</u>

ప్రొఫెసర్ కె. మలయవాసిని, ఎం.ఎ.,పి.హెచ్.డి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు
ఆంధ్రాయూనివర్శిటీ,
విశాఖపట్నం.

ప్రొఫెసర్ యు. ప్రహ్లాదనాయుడు, ఎం.ఎ.,పి.హెచ్.డి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ సాంస్క్రిట్
శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటి,
తిరుపతి.

ప్రొఫెసర్ కె. కాత్యాయని విద్మహె ఎం.ఎ.,పి.హెచ్.డి
కాకాతీయ యూనివర్శిటి,
వరంగల్

ప్రొఫెసర్ టి. సత్యవతి ఎం.ఎ.,పి.హెచ్.డి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు & ఓరియంటల్ లాంగ్వేజెస్
శ్రీ పద్మావతి మహిళా యూనివర్శిటి,
తిరుపతి

*<u>సంపాదకులు</u>*

ఆచార్య తేళ్ళ సత్యవతి, ఎం.ఏ., పి.హెచ్.డి
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు & ఓరియంటల్ లాంగ్వేజస్
ఆచార్య నాగార్జున యూనివర్శిటీ, నాగార్జున నగర్

*<u>డైరెక్టర్</u>*

డా. నాగరాజు బట్టు
యంహెచ్ఆర్ఎమ్., ఎంబిఏ., ఎల్ఎల్ఎమ్., ఎం.ఎ (సై) ఎం.ఎ (సో)., ఎం.ఇడి., ఎంఫిల్., పిహెచ్.డి
దూరవిద్యా కేంద్రం
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510
ఫోన్ నెం. 0863-2346208, 0863-2346222, 0863-2346259 (స్టడీ మెటీరియల్)
వెబ్‌సైట్: www.anucde.info, ఇమెయిల్: anucdedirector@gmail.com

# ఎం.ఏ తెలుగు - తెలుగు సాహిత్యం - మహిళాభ్యుదయం

First Edition: 2023

No. of Copies :-

© Acharya Nagarjuna University

This book is exclusively prepared for the use of students of **M.A. TELUGU** – Women Studies in Telugu Literature, 3rd Semester Centre for Distance Education, Acharya Nagarjuna University and this book is mean for limited circulation only

Published by

**Dr.Nagaraju Battu**

Director

Centre for Distance Education

Acharya Nagarjuna University

Nagarjuna Nagar-522510

Printed at

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే గ్రేడ్ 'A' ను సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పీజి స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003–04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తిస్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యాకేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్సి., పీజీ స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్సి., ఎం.సి.ఏ., ఎల్.ఎల్.ఎం., ఎం.బి.ఏ., కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా జీవన నైపుణ్యాలు అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు సులభంగాను, సరళంగాను విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకునేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైనవారు ఇచ్చే సలహాలు, సూచనలు, సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలు గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, అభివృద్ధి కోసం సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే కాక చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వార దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూరవిద్యాకేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికీ అందుబాటులో ఉండాలని అకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూర విద్యాకేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కోఆర్డినేటర్లకు, అకడమిక్ కౌన్సిలర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్. పి.రాజశేఖర్**

ఉపకులపతి

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# SYLLABUS

## M. A.Telugu

## Semester - III - Paper - V

## 305TL21 - Women Studies in Telugu Literature

### తెలుగు సాహిత్యం మహిళాభ్యుదయం

1. సాహిత్యవిర్భావానికి పూర్వం స్త్రీ- మాతృ స్వామిక యుగంలో స్త్రీ - గుంపు పెళ్లిళ్లు - దాంపత్య బంధం - పితృ స్వామిక యుగారంభం.

2. వైదిక యుగం - ఋగ్వేదం- వివాహ వ్యవస్థ- కుటుంబం - స్త్రీ పరిస్థితి - విద్య - బహు భార్యత్వం సాంఘిక నియమాలు,

3. శాస్త్రకాలం - మను స్మృతి - స్త్రీ, పురుషులు - న్యాయ వివక్ష - స్త్రీల ప్రత్యేక ధర్మాలు ద్వంద్వ నీతి ప్రమాణాలు.

4. ప్రాచీన తెలుగు సాహిత్యం భారత రామాయణాలు - స్త్రీ సమస్యలు- బాల్య వివాహాలు, స్త్రీవిద్య, వైధవ్యం, సహగమనం - బహు భార్యత్వం, పాతివ్రత్యం, వేశ్యా సమస్య - కన్యాశుల్కం - వరశుల్కం - అస్తిత్వ రాహిత్యం,

5 . ఆధునికాంధ్ర సాహిత్యం - ప్రవేశిక - సామాజిక నేపథ్యం - హితసూచని..

నాటకాలు: కన్యాశుల్కం, వరవిక్రయం

నవలలు: వేయిపడగలు, శశిరేఖ, జానకి విముక్తి, స్వేచ్ఛ

**ఆధార గ్రంధాలు**


1. ఆంధ్ర నాటక వికాసం - అప్పారావు పి. ఎస్. ఆర్

2. చలం నవలలు - ఈదారెడ్డి

3. కుటుంబం, వ్యక్తి గత ఆస్తి, రాజ్యాంగాల పుట్టుక ఏంగెల్స్

4. విశాలాంధ్ర ప్రచురణ -కొడవటిగంటి సాహిత్యం

5. ప్రత్యర్థ ప్రకాశిక - దయానంద సరస్వతి..

6 . మహోదయం - రమణారెడ్డి కె.వి.

# తెలుగు సాహిత్యం మహిళాభ్యుదయం

## విషయ సూచిక


| | |
|---|---|
| 1. మాతృస్వామ్యం నుండి పితృస్వామ్యం వరకు | 1.1 – 1.15 |
| 2. వైదికయుగంలో స్త్రీ | 2.1 – 2.20 |
| 3. మనుధర్మ శాస్త్రం | 3.1 – 3.19 |
| 4. మహాభారతం– స్త్రీల సమస్యలు | 4.1 – 4.10 |
| 5. ఆంధ్ర మహాభారతంలో స్త్రీ పాత్రల పరిచయం | 5.1– 5.14 |
| 6. రామాయణము – స్త్రీ సమస్యలు | 6.1 – 6.8 |
| 7. రామాయణము – స్త్రీ పాత్రలు | 7.1 – 7.16 |
| 8. ఆధునిక సాహిత్యం– సామాజిక నేపథ్యం | 8.1 – 8.18 |
| 9. హితసూచని | 9.1 – 9.15 |
| 10. కన్యాశుల్కం | 10.1 – 10.16 |
| 11. కందుకూరి వీరేశలింగం – బ్రహ్మ వివాహము – ప్రహసనం | 11.1 – 11.14 |
| 12. వర విక్రయం | 12.1 – 12.16 |
| 13. గురజాడ కథానికలు – స్త్రీలు | 13.1 – 13.13 |
| 14. రంగనాయకమ్మ కథలు | 14.1 – 14.13 |
| 15. విశ్వనాథ సత్యనారాయణ చెలియకట్ట నవల | 15.1 – 15.16 |
| 16. విశ్వనాథ సత్యనారాయణ– వేయిపడగల నవల | 16.1 – 16.23 |
| 17.1. శశిరేఖ | 17.1.1–17.1.12 |
| 17.2 బ్రాహ్మణీకం | 17.2.1– 17.2.9 |
| 18.1. చలం రచించిన "వివాహం" నవల – ఒక పరిశీలన | 18.1.1 – 18.1.6 |
| 18.2 పంచకళ్యాణి | 18.2.1–18.2.11 |
| 19.1 "కాలాతీత వ్యక్తులు" | 19.1 – 19.8 |
| 19.2 స్వేచ్ఛ | 19.2.1–19.2.8 |
| 20. జానకి విముక్తి | 20.1 – 20.20 |

పాఠం - 1

# మాతృస్వామ్యం నుండి పితృస్వామ్యం వరకు

**పాఠ్య నిర్మాణక్రమం :**


1.1. ఉద్దేశం

1.2. పాఠం

ఎ. మాతృస్వామ్యం

బి. గుంపు పెళ్ళిళ్ళు

సి. జంట పెళ్ళిళ్ళు

డి. దంపతీ వివాహాలు

ఇ. పితృస్వామ్యం

1.3. సారాంశము

1.4. నమూనా ప్రశ్నలు

1.5. ఉపయుక్త గ్రంథాలు


## 1.1. ఉద్దేశ్యం :

సామాజిక పరిణామ క్రమంలో స్త్రీ పురుషుల మధ్య అసమానతలు పెరగటానికి లైంగిక సంబంధాలు, పునరుత్పత్తి సంబంధాలు ఏ మేరకు కారణమైనాయో తెలియజేయటం ఈ పాఠం ఉద్దేశం. స్త్రీ పురుషుల అసమానతలు మొత్తం సామాజిక అసమానతలలో భాగం. సామాజిక అసమానతలంటే ప్రధానంగా ఉత్పత్తి సంబంధాలు. ఉత్పత్తి విధానాన్నిబట్టి ఉత్పత్తి సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలను బట్టి సామాజిక నిర్మాణం మారుతూ వుంటాయి. అందులో భాగంగానే స్త్రీ పురుష సంబంధాలూ రూపాంతరం చెందుతుంటాయి. ఈ విషయాలను పరిచయం చేయటం ఈ పాఠం ఉద్దేశ్యం. స్త్రీ పురుష అసమానతలను వ్యవస్థీకరించిన పితృస్వామ్య భావనను పరిచయం చేయటం ఈ పాఠం ముఖ్య ఉద్దేశ్యం. మహిళా జీవన అధ్యయనానికి కావలసిన ప్రాథమిక సమాచారం ఇది. ఇది ఎంత అవగాహనకు వస్తే మహిళాజీవన అధ్యయనం అంత శాస్త్రీయంగా, సలక్షణంగా ప్రయోజనవంతంగా వుంటుంది. సాహిత్య అధ్యయనానికి, విశ్లేషణకు ఈ అవగాహన ఎంతయినా ఉపయోగపడుతుంది.

## 1.2. పాఠం :

పురాతత్త్వ శాస్త్రవేత్తలు, చరిత్రకారులు, సమాజ శాస్త్రవేత్తలు, జీవశాస్త్రవేత్తలు ప్రపంచం మొత్తం మీద మానవజాతి పరిణామ క్రమాన్ని వివరిస్తూ అభివృద్ధి అంతా జాతి అస్తిత్వానికి ప్రాథమిక అవసరమైన ఆహారాన్ని కేంద్రంగా చేసుకొని అభివృద్ధి చెందిందని నిరూపించారు. మానవ జీవయాత్ర అట్టడుగు నుంచి ప్రారంభమై అనుభవ జ్ఞానంతో ఆదిమ ఆటవిక స్థితి నుంచి నాగరిక దశకు చేరుకుంది. ఇదంతా చరిత్ర పూర్వయుగ దశ. ఇందుకు పట్టినకాలం చాలా సుదీర్ఘమైంది. ఈ కాలవ్యవధి మీద రూపొందిన జీవనోపాధి నైపుణ్యాలు మానవజాతి జీవన పరిస్థితులను ప్రభావితం చేస్తూ నాగరికతాభివృద్ధికి తోడ్పడ్డాయి.

మానవజాతి చరిత్ర ఆహారాన్వేషణతో ప్రారంభమైంది. గుంపులు గుంపులుగా వున్న మానవులు పరిమిత ప్రదేశాలలో తిరుగుతూ ప్రకృతిలో లభించే దుంపలు, కాయలు, పండ్లు సేకరించుకొని తిని జీవించిన దశ అది. జాతి ఉనికికి, విస్తరణకు

సంబంధించిన భావనలే ఇక్కడ ప్రధానం. ఈ దశ ఎంతో కాలం కొనసాగలేదు. తింటూ కూర్చుంటే ప్రకృతి వనరులు తాత్కాలికంగానైనా తరిగిపోతాయి. పండ్లను దుంపలను అన్వేషిస్తూ నదీపరివాహ ప్రాంతాల వెంబడి మానవసంచారం ప్రారంభమైంది. విస్తరించే కొద్దీ గుంపు ఆహారావసరాలు కూడా పెరుగుతాయి. గుంపు రక్షణ కోసం అడవి జంతువులతో తలపడటం అవసరమైన పరిస్థితులలో జంతు మాంసం మానవ ఆహారంలో చేరింది. క్రమంగా ఆహారం కోసం జంతువులను వేటాడటం మొదలైంది. ఆ రకంగా ఆహారాన్వేషణా దశలోనే వేట కూడా అందుకు సాధనంగా చేరింది. వేటకు ప్రకృతిలో లభించే రాళ్ళను అయుధాలుగా చేసుకొని వాడే స్థితిలోనే అనుభవం నుండి అంతకంటే వాడి అయిన వేగవంతమైన సాధనాల అవసరం మనిషికి తెలిసివచ్చింది. ఆ అవసరమే విల్లు అంబుల ఆవిష్కరణకు దారితీసింది. ప్రాచీన కాలపు సమాజ పురోగతికి ఊపునిచ్చిన ఆవిష్కరణగా దీనిని పేర్కొంటారు.

అంటే మానవ సమాజంలో మొదటి ఉత్పత్తి విధానం ఆహార సేకరణ, వేటలతో కూడిన ప్రాథమిక రూపం. ఉత్పత్తి విధానంలో భాగస్వాములయ్యే స్త్రీ పురుషుల మధ్య సంబంధాలు ఉత్పత్తి సంబంధాలు అనబడతాయి. అవి ప్రధానంగా శ్రమ సంబంధాలు, ఆహార సేకరణ పరిమిత ప్రాంతాలలో జరుగుతున్నప్పుడైనా సంచార జీవితంలోనైనా స్త్రీ పురుషులిద్దరూ కలిసే తిరిగారు. చెట్లకు వున్న కాయలను పండ్లను రాలగొట్టటానికి రాళ్ళువిసరటం, భూమిలోని దుంపలను తవ్వితీయటానికి ఆత్మరక్షణ కోసం జంతువులపై దాడి చేయటానికి కర్రముక్కలు రాళ్ళు ఉపయోగించటం స్త్రీ పురుషులు తప్పనిసరిగా అవసరంగా చేయవలసినదే అయినాయి. ఆ దశలో స్త్రీ పురుషుల మధ్య శ్రమ విభజన లేదు. కానీ వేట ఆహార సేకరణ దశలోకి వచ్చిచేరేసరికి శ్రమవిభజనకు తొలిబీజాలు పడ్డాయి. వేటలో నిలకడ వుండదు. పరిగెత్తే జంతువుతో వేగంగా పరిగెత్తాలి. పరిగెత్తే జంతువు మీదికి ఆయుధాన్ని బలంగా విసరాలి. స్త్రీ పురుషులిద్దరూ ఈ రకమైన శ్రమలో సహజంగా సమంగానే భాగస్వాములైనారు. అయితే గర్భవతులైన స్త్రీలకు, నెలలు నిండుతున్న స్త్రీలకు, ప్రసవించిన స్త్రీలకు స్వీయస్థితి ఈ రకమైన శ్రమచేయటానికి తాత్కాలింకగానైనా అవరోధం అవుతుంది. అట్లాగే పసిపిల్లలు, వృద్ధులు కూడా వేటలో పాల్గొనటం కష్టమే అవుతుంది. ఈ అనుభవం నుండి లింగ వయోబేధాలను అనుసరించిన శ్రమ విభజన ప్రారంభమైంది. పురుషులు వేటకు, స్త్రీలు ప్రకృతి నుండి ఆహారాన్ని సేకరించటానికి పరిమితం కావటం మొదలైంది. కర్రలు, రాళ్ళు, రాతి ఆయుధాలతోపాటు విల్లును కూడా స్త్రీ పురుషులిద్దరూ సమంగానే ఉపయోగిస్తూ వేటలో పాల్గొన్నా స్త్రీలు గర్భధారణ,ప్రసవం మొదలైన ప్రకృతి సహజ కారణాల వల్ల వాటిని నిరంతరం ఉపయోగించే అవకాశం లభించకపోయి వుండవచ్చు. ఆ క్రమంలోనే లింగభేదం ప్రాతిపదికగా ఉత్పత్తి సాధనాలను వినియోగించి చేసే శ్రమ పురుషులదిగానూ, వినియోగించకుండా చేసే శ్రమ స్త్రీలది గానూ స్థిరపడుతూ వచ్చింది.

ఆహారసేకరణ వేటలతో కూడుకొన్న ఉత్పత్తి విధానంలో అవసరం అయినప్పుడు ఆహారం దొరకకపోవటం, ఆహారం సమృద్ధిగా దొరికినప్పుడు అది గుంపు అవసరాలకు మించి వ్యర్థమైపోవటం, ప్రకృతి సంపద, పశు సంపద నశించిపోవటం మొదలైన సమస్యలున్నాయి. వీటిని పరిష్కరించుకొనే దిశలో జరిగిన ప్రయత్నాలలో వ్యవసాయం, పశుపోషణలతో కూడుకొన్న కొత్త ఉత్పత్తివిధానం ఆవిష్కరించబడింది. పశువులను మచ్చిక చేసుకొని, పశుపోషణకు కావలసిన పచ్చిక మైదానాలను వెతుక్కొంటూ మందలతో పురుషులు ముందుకు సాగటం మొదలైంది. ఆహారసేకరణ చేస్తున్న స్త్రీలు ప్రకృతి తోటి నిత్యసంబంధాలలో చెట్ల నుండి రాలే విత్తనాలు మొక్కలై చెట్లయి మళ్ళీ విత్తనాలిస్తున్న నిరంతర క్రమాన్ని తెలుసుకున్నారు. తనను పోలిన మనుషులను గర్భధారణ ద్వారా పునరుత్పత్తి చేయగలుగుతున్న స్త్రీలు భూమియొక్క ఉత్పత్తిశక్తిని అతి సహజంగా సులభంగా గ్రహించగలిగారు. తేమనేలలో గడ్డివిత్తనాలు చల్లి గడ్డి పెంచటంతో వ్యవసాయానికి తొలిబీజాలు వేశారు. ఈ దశలో పశుపోషణ పురుషులది తృణధాన్యాల ఉత్పత్తి స్త్రీలదిగా స్థిరపడింది. పశుసంపద పెరిగే కొద్దీ వాటిని మేపుకు వస్తున్న పురుషుడికి ఆధిపత్యం స్థిరపడటం పశువులు స్వంత ఆస్తిగా గుర్తింపు పొందటం జరిగింది. పశువుల పోషణకు అవసరమైన పచ్చిక బయళ్ళకోసం, తొలియుద్ధాలు ప్రారంభమైనాయి. పశువుల కోసం యుద్ధాలు, యుద్ధంలో గెలిచిన వాళ్ళు ప్రతిపక్షంలోని పశువులను తెచ్చి తమ

మందలో కలుపుకొని పశుసంపదను పెంచుకొనటమూ జరిగింది. ఆ క్రమంలోనే ప్రతిపక్షంలోని స్త్రీలను కూడా తెచ్చి తమ గుంపులో కలుపుకొనే పద్ధతి మొదలైంది. సామాజిక పరిణామ చరిత్రలో దీనినే 'ఆదిమ కమ్యూనిస్టు సమాజం' అని అంటారు. మాతృస్వామ్యం దీని లక్షణం.

విభిన్న మానవజాతులు తాము నివసిస్తున్న సహజ పర్యావరణలో లభించే భిన్నభిన్నమైన వనరులను ఉత్పత్తి సాధనాలుగా మలుచుకుంటూ పురోగమిస్తున్న క్రమంలో లోహం వాడుకలోకి రావటం ఒక గుణాత్మక పరిణామానికి దారితీసింది. ఇనుమును కరిగించి సాధనాలుగా చేసుకునే దిశలో వికసించిన మానవమేధ వ్యవసాయ నాగరికతాభివృద్ధికి దారితీసింది. పశుపోషణలోని సంచార జీవితంలోని అస్థిరతకు, పచ్చిక మైదానాల కోసం జరిగే నిరంతర యుద్ధాలలోని అభద్రతకు ఒక సమాధానంగా స్థిర వ్యవసాయ జీవితం కనబడింది. పశుపోషణలో పెంచుకున్న పశుసంపదను, ఇనుముతో తయారుచేసుకొన్న నాగలి వంటి సాధనాలను ఉపయోగించి పెద్ద ఎత్తున వ్యవసాయం చేయటం మొదలైంది. ఇది అంతవరకు చిన్నచిన్నమళ్ళలో కర్రలను, పదునైన రాతిపనిముట్లను ఉపయోగించి తృణధాన్యం పండిస్తున్న స్త్రీలను వ్యవసాయ రంగం నుండి పక్కకు తప్పించింది. పునరుత్పత్తి విధులకు పరిమితం చేసింది. బానిస యజమాని వ్యవస్థ రూపొందింది. కుటుంబం ఏర్పడింది. బానిసల భౌతిక శ్రమశక్తిని భూమిమీద వినియోగపరచి అధికోత్పత్తులను రాబట్టే మేధో ప్రణాళికలు, సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధిపరిచే ప్రణాళికలు రూపొందించి అమలుచేసే యాజమాన్య వర్గం స్థిరపడింది. వ్యవసాయోత్పత్తుల పెరుగుదల నేత మొదలైన కొత్త ఆవిష్కరణలకు దారితీసింది. శాస్త్ర సాంకేతిక తాత్త్విక కళాజ్ఞానవృద్ధికి అవకాశాలు ఏర్పడ్డాయి. సామాజిక పరిణామ చరిత్రలో బానిస యజమాని వ్యవస్థగా చెప్పబడే ఈ దశలో స్త్రీ పురుషుల మధ్య అసమానతలు స్పష్టంగా పైకి తేలాయి. భూమి మద పురుషులు యాజమాన్యం స్థిరపడే క్రమంలో స్త్రీలపై కూడా అది అమలయింది. బానిసలతో పాటు స్త్రీలు కూడా శారీరక శ్రమచేసే వాళ్ళుగా మిగిలిపోయారు. పిల్లల్ని కనటంతో పాటు పెంచడం, అనేకమంది బానిసలతో కూడుకున్న యజమాని కుటుంబానికి సంబంధించిన పనులు చక్కబెట్టటం స్త్రీల పని అయింది. పితృస్వామ్య వ్యవస్థకు ప్రారంభం ఇక్కడే జరిగింది.

బానిస యజమాని వ్యవస్థలో అభివృద్ధి చెందిన సాంకేతికశాస్త్ర తత్వజ్ఞానాన్ని ఉపయోగించి పనిచేయాలన్న ఉత్సాహం, ప్రేరణ తమకున్న దుర్భర పరిస్థితుల కారణంగా బానిసలకు లేకుండా పోయాయి. ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి తద్వారా యజమాని సంపద అభివృద్ధికి అది అవరోధమైంది. దానికి పరిష్కారంగా భూస్వామ్య ఉత్పత్తి దశ ప్రారంభమైంది. భూమి స్వంత పరిష్కారంగా భూస్వామ్య ఉత్పత్తిదశ ప్రారంభమైంది. భూమి స్వంత ఆస్థిగా స్థిరపడింది. బానిసకు యజమాని నుండి స్వతంత్రం, స్వంత జీవితం లభించాయి. బానిస రైతుగా నిలదొక్కుకొనటానికి తనలో సహజంగా పెల్లుబుకే ఉత్సాహంతో శ్రమ చేయసాగాడు. తద్వారా సృష్టించే సంపదను వశం చేసుకునే వ్యూహాలు కూడా ఈ దశలో రూపొందాయి. బానిస యజమాని వ్యవస్థ నాటికే బానిస శ్రమ సృష్టించిన మిగులు విలువను వశం చేసుకొన్న యజమాని వర్గం బలపడుతూ వర్గసమాజం రూపొందింది. భూస్వామ్య సమాజంలో వేరూనుకొని విస్తరించింది. స్త్రీ పురుషుల మధ్య వ్యత్యాసాలను కూడా ఇది పెంచి పోషించింది. పితృస్వామ్యాన్ని సమర్థించి కీర్తించే భావజాల వ్యవస్థను అభివృద్ధి పరిచింది. ఆదిమ కమ్యూనిస్టు సమాజాలలో గుంపులోని మనుషుల అంతర్గత అవసరాలు, ప్రయోజనాలరీత్యా స్త్రీ పురుష బేధం ప్రాతిపదికగా ప్రారంభమైన శ్రమవిభజన భూస్వామ్య వ్యవస్థలో స్త్రీని పురుషుడు అణిచివుంచటానికి అదుపు చేయటానికి వీలయిన రూపానికి పరిణమించింది. ఆడపని, మగపని అన్న భావన అభివృద్ధి చెందింది.

భూస్వామ్య ఉత్పత్తి వ్యవస్థ చాలాకాలం కొనసాగింది. మిగులు సంపద చేతిపనుల అభివృద్ధికి వర్తకరంగ విస్తృతికి దారితీసింది. పరికరాల తయారీలో వేగాన్ని పెంచటానికి, నైపుణ్యతను మెరుగుపరచటానికి వీలుగా సూక్ష్మస్థాయిలో శ్రమ విభజన జరిగింది. ఈ రకంగా అనేకమంది ఒకే దగ్గర ఒకే వస్తువుకు సంబంధించిన విడివిడిభాగాల తయారీలో పొందే శిక్షణ

నైపుణ్యం యంత్రోత్పత్తికి కావలసిన కొత్త పరిస్థితులను సృష్టించాయి. భారీ యంత్రాల నిర్మాణం వస్తూత్పత్తిని పెంచటమే కాక ఉత్పత్తుల అమ్మకానికి కావలసిన మార్కెట్టును సృష్టించింది. పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్థ నిర్మాణానికి ఇవి దోహదం చేశాయి.

ఈ వ్యవస్థలో వస్తూత్పత్తి క్రమమంతా పెట్టుబడిదారుల స్వప్రయోజనాల ప్రకారం నిర్దేశించబడుతుంది. యంత్ర పరికరాల ద్వారా జరుగుతుంది. వస్తువుకు సంబంధించిన విడివిడి భాగాలను యంత్రాల ద్వారా రూపొందించే కూలివాళ్ళుగా కార్మికులుంటారు. మొత్తం వస్తువుకు సంబంధించిన అవగాహన కానీ, వస్తువు మీద స్వామ్యం కానీ వాళ్ళకు వుండదు. తక్కువ వేతనాలకు కార్మికుల శ్రమను కొని అదనపు విలువను పొందే పెట్టుబడిదారీ వ్యవస్థ స్త్రీల శ్రమను మరింత చౌకగా కొనుక్కొంటుంది. ఆదిమ కమ్యూనిస్టు సమాజాలలోని శ్రమవిభజనలోని అసమానతలు బానిస యజమాని, భూస్వామ్య సమాజాలకు వచ్చేసరికి స్త్రీల పని విలువను తగ్గించేవిగా పరిణామం చెందాయి. పెట్టుబడిదారీ సమాజం దానిని సమర్థవంతంగా వాడుకొనటానికి ముందుకు వచ్చింది. పితృస్వామ్య వ్యవస్థలోని స్త్రీ పురుష అసమానతలు పెట్టుబడిదారీ ఉత్పత్తి వ్యవస్తలోని మరింత ఘనీభవించటం, కొత్త రూపాలను తీసుకోవటం జరిగింది.

పెట్టుబడిదారీ ఉత్పత్తి సంబంధాల అభివృద్ధి క్రమంలో గుత్తాధిపత్యం, సామ్రాజ్యవాదం అభివృద్ధి చెందటం, బహుళజాతి సంస్థలు అంతర్జాతీయ మార్కెట్టును నియంత్రించటం మొదలైనవి జరుగుతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంక్షోభానికి అవి కారణం అవుతూనే అంతర్జాతీయంగా శ్రామికుల ఐక్యతకు,సంఘీభావానికి పరిస్థితులను సానుకూలం చేస్తాయి. 20వ శతాబ్ది ప్రారంభం నుండి ప్రపంచచరిత్రలో శ్రామికోద్యమ నిర్మాణం జరుగుతూ పెట్టుబడిదారీ ఆస్తిని, అధికారాన్ని అభావం చేసే సోషలిస్టు సమాజాల ఏర్పాటుకు కృషిచేయటం గమనిస్తూనే ఉన్నాం. శ్రమ విభజనలోని అసమానత్వాన్ని అమానుషత్వాన్ని రద్దుచేయటానికి బౌద్ధిక శ్రమకు భౌతిక శ్రమకు మధ్య వున్న అంతులేని అగాధాన్ని, మగపనికి ఆడపనికి మధ్య వున్న వ్యత్యాసాన్ని పరిష్కరించటానికి ప్రయత్నాలు అందులో భాగంగానే ప్రారంభమయ్యాయి. సోషలిస్టు ఉత్పత్తిదిశగా సమాజ పరిణామం ఇంటి పనిని సమాజపరం చేస్తుంది కనుక, సామాజిక ఉత్పత్తి రంగాలలో స్త్రీల భాగస్వామ్యాన్ని ఆచరణ వాస్తవం చేస్తుంది. కనుక వ్యతిరేకమైన శ్రమ విభజనను రద్దుచేస్తుంది కనుక స్త్రీలకు అనుకూలమైంది. అలాంటి మానవీయ ఉత్పత్తి సంబంధాల దిశగా సమాజ పరిణామానికి చేయవలసిన ప్రయాణం అంతా ముందే వుంది.

విభిన్న చారిత్రక కాలాలలో కొత్తరూపాలను తీసుకుంటూ మారుతూ వస్తున్న ఉత్పత్తి సంబంధాలు మానవ సంబంధాలను నిర్దేశించడంలో ప్రముఖపాత్ర వహించాయి. శ్రమవిభజన క్రమంలో కొందరు ఇతరుల శ్రమను నియంత్రించటం, శ్రమను నియంత్రించటం ద్వారా ఒక వర్గం మిగిలిన వర్గాలు సృష్టించిన సంపదల మీద పెత్తనాన్ని పొందటం మనుషుల మధ్య అధికార సంబంధాలకు పీడకపీడ్య సంబంధాలకు కారణమైనాయన్నది స్పష్టం. మానవ సమూహమంతా స్త్రీ పురుషులుగా విభక్తమై వుంది. అందువలననే ఉత్పత్తి విధానాల పరిణామ చరిత్రకు అనుకూలంగా స్త్రీ పురుష సంబంధాలు కూడా మారుతూ వచ్చాయనేది వాస్తవం. స్త్రీ పురుష సంబంధాలు ప్రాథమికంగా లైంగిక సంబంధాలు, తరువాత అవి సామాజిక సంబంధాలు. ఉత్పత్తి విధానాల పరిణామ చరిత్ర నడిచిన దారుల వెంబడి స్త్రీ పురుష సంబంధాలు మాతృస్వామ్యం నుండి పితృస్వామ్యానికి పరిణామం చెందాయి. ఈ క్రమాన్ని పరిచయం చేయటం ఇక్కడ జరుగుతుంది.

## ఎ) మాతృస్వామ్యం :

ఆదిమ కమ్యూనిస్టు సమాజం యొక్క అభివృద్ధిలోని ఒకానొక చారిత్రక దశ మాతృస్వామ్యం. సహజసిద్ధమైన మానవ సంబంధాల ప్రాతిపదిక మీద రూపొందించే వ్యవస్థ. మానవ సమూహాలు ప్రకృతి శక్తులతో సంఘర్షిస్తూ, ప్రకృతి భీభత్సానికి నశించిపోయే జాతిని నిలబెట్టుకొనటానికి ఆరాటపడుతున్న ప్రాథమిక దశలో స్త్రీ పురుషులు సహజాతులు మాత్రమే తెలిసినవారు.

ఆకలిదాహం తీర్చుకొనటానికి చుట్టు పరిసరాలలో ఆహారం కోసం అన్వేషించినంత సహజంగా, లభించింది స్వీకరించినంత సహజంగా గుంపులోని తోటి స్త్రీ పురుషులతో లైంగిక వాంఛలను తీర్చుకున్న దశ అది. అక్కడ ఎటువంటి విధి నిషేధాలు లేవు. స్వేచ్ఛాయుత సంబంధాలు - స్త్రీ పురుషులు తమ గుంపులోని స్త్రీ పురుషులలో ఎవరి పట్ల కోరిక కలిగితే వారితో సంబంధాలు ఏర్పరచుకొనటం. ఈ దశాలక్షణం. సంతానోత్పత్తికి లైంగిక వాంఛలకు, సంబంధాలకు మధ్య వున్న కార్యకారణ సంబంధ జ్ఞానం ఇంకా అభివృద్ధి చెందని దశ అది. గర్భం మోసేదీ కనేదీ కనుక స్త్రీ తల్లికావటం తెలుస్తుంది. సంతానానికి తల్లి ఎవరో తెలుస్తుంది. కానీ తండ్రి ఎవరో తెలియదు. కన్న పిల్లలకి తిండిపెట్టి కాపాడుకొనటం సర్వజంతు సహజధర్మం. స్త్రీలలో కూడా అదే ప్రధాన ప్రవృత్తి అయి తన సంతానానికి అవసరమైన ఆహారాన్ని సమకూర్చేందుకు తాపత్రయపడేట్లు చేస్తుంది. అందువలన ఆహార సేకరణ దశలో స్త్రీల చొరవ ప్రధానమైంది. తన గుంపులో బలమూ శక్తీకలిగిన యువతీయువకులను వెంట వేసుకొని ఆహారం కోసం అన్వేషించారు. కాయలూ పండ్లూ కోసుకొచ్చారు. వేటాడి జంతుమాంసాన్ని సంపాదించారు. వాటిని తమ గుంపులో జనం మధ్య సమానంగా సక్రమంగా పంపిణీ అయ్యేట్లు చూడటం కూడా సహజమైన చర్యగానే వాళ్ళు చేపట్టి చేశారు.

సంతానం తల్లి ద్వారా మాత్రమే గుర్తించబడతారు కనుక గుంపులు గుంపులుగా తిరిగిన ఆదిమ సమాజాలలో మానవ సమూహాలన్నీ తల్లి గుంపులే. తల్లి, ఆ తల్లి కన్న కూతుళ్ళు కొడుకులు, వాళ్ళ పిల్లలు అందరూ ఆ గుంపులో వుంటారు. తల్లి నుండి విస్తరించిన గుంపు కనుక అది తల్లి గుంపుగానే గుర్తింపబడుతుంది. పిల్లలతో ప్రత్యక్ష సంబంధం తల్లిదే కనుక పిల్లలపై పెత్తనం తల్లిదే అవుతుంది. ఈ పెత్తనం వాళ్లందరి ఆహార అవసరాలు, రక్షణ అవసరాలు తీర్చాల్సిన బాధ్యతతో ముడిపడి వుంది. అందువల్లనే అది మాతృస్వామ్య వ్యవస్థ అయింది.

మాతృస్వామ్యం అంటే సంతానాన్ని తల్లి ద్వారా గుర్తించే స్థితి మాత్రమే కాదు. ఆ సంతానం యొక్క ఆహార అవసరాలను, రక్షణావసరాలను తీర్చే బాధ్యతను సహజ ధర్మంగా నిర్వర్తించే క్రమంలో ఆదిమ సమాజాల ఆర్థిక వ్యవస్థ - అది చాలా ప్రాథమికమైనదే కావచ్చు - స్త్రీల చేతులలో కేంద్రీకృతం అయింది. తద్వారా గుంపుమీద పాలనాధికారం తల్లికే దఖలు పడింది. పశుపోషణ పురుషులదయిన సమయంలో కూడా పశుపోషణకు అవసరమైన గడ్డిని ప్రయత్నపూర్వకంగా పండించటం ద్వారా స్త్రీలు ఆర్థిక రంగాన్ని ప్రభావితం చేస్తూనే వున్నారు. అంటే మాతృస్వామ్య వ్యవస్థ ఆహారసేకరణ వేట దశల నుండి పశుపోషణ, ఆహారోత్పత్తి దశకు పరివర్తన చెందుతున్న కాలమంతా పరచుకొని వున్నదన్నమాట.

గుంపు యాజమానురాలై స్త్రీ మాతృస్వామ్య వ్యవస్థలో గుంపు పోషణ, రక్షణ భారాలను స్వీకరించటం, గుంపు కోసం ఆహారాన్ని అన్వేషించి సేకరించటానికి కావలసిన నాయకత్వాన్ని అందించటం మాత్రమే చేయలేదు. ఆహారాన్ని రేపటి అవసరాల కోసం నిలువ చేయటానికి, చలి నుండి రక్షణగా శరీరాన్ని కప్పి వుంచటానికి కావలసిన వస్తుజాలం సమీకరించుకొనటాన్ని గురించి ఆలోచించవలసి వచ్చింది. గుడ్డుడొల్లనో, పక్షి గూడునో, ఆ కులనో పాత్రలుగా, వేటాడిన జంతు చర్మాలను వస్త్రాలుగా వాడుకొంటూ స్త్రీలు మట్టిపాత్రల తయారీవరకు పురోగమించారు స్త్రీలు ఈ దశలో. అవసరమే అన్ని ఆవిష్కరణలకు తల్లి అంటారు. అవసరాల ఒత్తిడి నుండే తల్లి కుండల తయారీ, వ్యవసాయం మొదలైన వాటిని ఆవిష్కరించగలిగిందని మాతృస్వామ్య వ్యవస్థ చరిత్రను బట్టి అర్థం అవుతుంది.

మాతృస్వామిక యుగంలో ఒకే గుంపులోవున్న స్త్రీ పురుషుల మధ్య ఒకే తల్లి రక్తం పంచుకుపుట్టిన పిల్లలకు, పిల్లల పిల్లలకు మధ్య వయసుతో కూడా సంబంధంలేని సంబంధాల దశ స్వేచ్ఛాయుత స్త్రీ పురుష సంబంధ దశ. ఇది మొదటిది. గుంపుకు నాయకత్వం వహించేది స్త్రీ గనుక నాయకత్వం వల్ల లభించే గౌరవ ప్రత్యేకతలు, పెత్తనం కారణంగా గుంపులోని పురుషులలో తనకు కావలసిన వాళ్ళను ఎంపిక చేసుకునే విషయంలో ప్రాధాన్యత ఆమెకే వుంటుంది. సహజంగా ఆమె

యవ్వనులు, బలిష్టులు అయిన పురుషులనే కోరుకొనటం - తద్వారా గుంపులో యువతులు వయస్సు పై బడిన పురుషులతో లైంగిక వాంఛలు తీర్చుకొనటం అనివార్యం కావటం జరుగుతుంటుంది. ఇది యవ్వనంలో ఉన్న స్త్రీ పురుషులిద్దరికీ అసంతృప్తిని మిగల్చటమే కాక పునరుత్పత్తిలో సత్ఫలితాలియ్యదు. జాతి ఉనికికి విస్తరణకు ఇది ఆటంకం అవుతుంది. తల్లిగుంపు విస్తరించే కొద్దీ గుంపులోని సమాన సామర్థ్యం కలిగిన తల్లుల మధ్య అధికారం కోసం పెనుగులాట ప్రారంభమై తల్లులు తమ తమ సంతానంలో విడివిడి గుంపులుగా జీవించటం మొదలవుతుంది. వేట క్షేత్రాల మీద ఆధిపత్యం కోసం తల్లుల గుంపుల మధ్య యుద్ధాలు కూడా అనివార్యం అవుతాయి. ఈ పరిస్థితులలో గుంపు అభివృద్ధికి స్వేచ్ఛాయుత స్త్రీ పురుష సంబంధాలు మరీముఖ్యంగా, తరానికీ తరానికీ మధ్య సంబంధాలు అవరోధం అవుతాయి. గుంపు ప్రయోజనాల దృష్ట్యా సమస్యను పరిష్కరించుకొనే క్రమంలో తల్లి గుంపులు ఒక తరానికీ మరొక తరానికీ మధ్య సంబంధం నిషేధం స్వచ్ఛందంగా అమలు చేస్తున్నాయి. ఒకే వయో సమూహం మధ్య సంబంధాలు ఫలవంతమై గుంపు అభివృద్ధికి కారణమయ్యాయి. ఇక ఇక్కడ నుండి లైంగిక సంబంధాలు గుంపులోని సోదరీ సోదరుల మధ్య పరిమితమయ్యాయి. అయితే ఒకే తల్లిపిల్లలు దాంపత్యం నిర్వహించి సంతానాన్ని కనటం ఎక్కువ కాలం కొనసాగదని జీవశాస్త్రవేత్తలు అంటారు. దగ్గరి రక్తబంధువుల మధ్య ప్రతితరంలోనూ లైంగిక సంబంధాలు ఏర్పడుతుంటే వాళ్లకు కలిగే సంతానంలో జీవసంబంధమైన అవలక్షణాలు ఏర్పడతాయని ఈనాటి విజ్ఞానశాస్త్ర పరిశోధనలు నిరూపిస్తూనే వున్నాయి. గుంపు జీవితంలో మనుషులు అనుభవం నుండి ఈ విషయాన్ని గ్రహించి వుంటారు. తత్ఫలితంగా సోదరీ సోదరుల మధ్య కూడా సంబంధాన్ని నిషేధించుకొని కొత్త లైంగిక సంబంధ వ్యవస్థను ఆవిష్కరించుకొన్నారు. వాటినే గుంపు పెళ్ళిళ్ళు అన్నారు.

## బి) గుంపు పెళ్ళిళ్ళు :

రక్త సంబంధీకులు కాని స్త్రీ పురుషుల మధ్య లైంగిక సంబంధాలకు ఇది ప్రారంభం. ఋగ్వేదంలోని యమీయమ సంవాదం సోదరీ సోదరుల మధ్య సంబంధాన్ని పాపమని చెప్పి నిషేధించటం, గుంపు పెళ్ళికి ప్రోత్సాహించటం గమనించవచ్చు. యమీ తన అన్న అయిన యముడిని ప్రేమించి, కామించి అతనితో సంబంధాన్ని కోరుతుంది. నీవు నా సోదరివి కనుక ఇందుకు తగవు అని చెప్పి తనకంటే భిన్నమైన మరొకనితో ఆనందించమని ఆమెకు బోధించాడు. తనకంటే భిన్నమైన మరొకవ్యక్తి అంటే తన గుంపుకు చెందినవాడు కాక మరొకడనే అర్థం. ఏకకాలంలో అనేక గుంపులుండి, ఆ గుంపుల మధ్య ఇచ్చి పుచ్చుకునే వ్యవహారాలు నడుస్తుంటే తప్ప అన్యులతో సంబంధం గురించిన ఆలోచనకు తావు వుండదు. గుంపులో నాయకత్వం తల్లి సంతానంలో యవ్వనబలం వున్న స్త్రీది అవుతుంది. నాయకత్వం కోసం, తద్వారా గుంపులోని యువకులతో సాంగత్యం కోసం ఆ తల్లి సంతానంలోని స్త్రీల మధ్య పోటీ కూడా వుంటుంది. ఆ పోటీ కారణంగానే స్త్రీ తన పిల్లలతో గుంపు నుండి విడిపోవటం, కొత్త గుంపుకు నాయకురాలవుతుండటం జరిగేది. ఆ రకంగా గుంపులు విస్తరించి వ్యాపించాయి.

సంచార జీవితంలో గుంపులు పరస్పరం తటస్థపడటం ప్రయోజనాల కోసం సంఘర్షించటం జరుగుతున్నా కాలక్రమంలో సహకారం అవసరం కూడా వాళ్ళకు తెలిసి వచ్చింది. ఒక గుంపు సేకరించిన ఆహారం ఆ గుంపు అవసరాలకు మించి వున్నప్పుడు ఆ ఆహారం, పండ్లయినా జంతు మాంసమైనా నిలవ వుండేది కాదు. కనుక వ్యర్థం చేయటం కంటే మరొక గుంపులోని ఆహారపు అవసరాలు తీర్చటానికి ఉపయోగించటం మేలైన పని అనుభవంలో అవగాహనకు రావటమే గుంపుల మధ్యఇచ్చి పుచ్చుకునే వ్యవహారాలకు దారితీసి వుంటుంది. ఇది గుంపుల మధ్య లైంగిక సంబంధాల వినిమయం గురించిన ఆలోచనలకూ కారణం అవుతుంది. యముడు అందువల్లనే యమికి తనకంటే భిన్నుడైన మరొక వ్యక్తితో సంబంధం ఏర్పరచుకోనమని చెప్పగలిగాడు.

గుంపు పెళ్ళిళ్ళు అంటే ఒక గుంపులోని స్త్రీలందరికీ మరొక గుంపులోని పురుషులు ఉమ్మడి భర్తలుగా ఉండటం. అట్లాగే ఆ గుంపులోని పురుషులకు వేరొక గుంపులోని స్త్రీలు ఉమ్మడి భార్యలుగా వుండటం. సోదరులంతా ఉమ్మడిగా గుంపుగా భార్యలను కలిసి వుంటారు. అలాగే అక్కచెల్లెళ్ళు ఉమ్మడిగా గుంపుగా భర్తలను కలిగి వుంటారు. ఇక్కడ సోదరులన్నా, అక్కచెల్లెళ్ళన్నా ఒకే తల్లి పిల్లలకు మాత్రమే వర్తించే మాటలు కావు. దూరపు బంధుత్వం కూడా దీని పరిధిలోదే. దీనినే మోర్గాన్ పునలాన్ కుటుంబం అన్నాడు. పునలాన్ అంటే మైత్రీ అని అర్థం.

గుంపులు పెరిగి పెద్దవయి అవసరాలు పెరగటం, వేట వల్ల జంతువులు నశించి ఆహారపు వనరులు తగ్గిపోవటం, వేట కోసం జంతువులు బాగా తిరిగే ప్రాంతాల మీద ఆధిపత్యం కోసం గుంపుల మధ్య యుద్ధాలు జరగటం, ఫలితంగా గుంపులో స్త్రీపురుషుల సంఖ్యలో సమానత్వం చెదిరిపోయి స్త్రీల సంఖ్య ఎక్కువగా ఉండటం గుంపు సంబంధాలు బలపడటానికి దారితీసాయి. స్త్రీ పురుష సంబంధాలలోని ఈ కొత్తరూపం సమాజ పురోగతికి మంచి ఊపునిచ్చింది. శారీరకంగానూ మానసికంగానూ మంచి జీవశక్తిగల సంతానం కలిగింది. గుంపు పెళ్ళి వ్యవస్థలో కూడా సంతానానికి తల్లి ఎవరో తెలుస్తుంది తప్ప తండ్రి ఎవరో తెలియదు.

అనుభవంలో ఈ గుంపు సంబంధాలు స్త్రీలకు బాధాకరంగా పరిణమించాయి. గుంపులు కలుసుకున్నచోట అందుబాటులో వున్న ఇతర గుంపులోని స్త్రీలతో పురుషులకు, పురుషులతో స్త్రీలకు ఏర్పడే ఈ లైంగిక సంబంధాలు వస్తుమారకం లాంటివి, తాత్కాలికమైనవి అయినాయి. సంచార జీవితంలో ఒక గుంపు మరొక గుంపుకు ఎక్కువసార్లు తారసపడటం సాధ్యంకాదు. అందువల్ల ఎప్పుడైనా గుంపు సంబంధాలు అపరిచిత స్త్రీ పురుషుల మధ్య సంబంధాలుగానే వుంటాయి. ఆ తరువాత అయినా వారిమధ్య ఆ సంబంధం కొనసాగదు. ఒకే స్త్రీని అనేకమంది పురుషులు, ఒకే పురుషుడిని అనేకమంది స్త్రీలు ఒకేసారి కోరుకునే అవకాశం కూడా ఇందులో వుంది. ఇది స్పర్ధకు, స్త్రీల మీద ఒత్తిడికి కారణమవుతుంది. ఈ సమస్యకు పరిష్కారంగా జంటపెళ్ళిళ్ళు ఉనికిలోకి వచ్చాయి.

### సి) జంట పెళ్ళిళ్ళు :

మాతృస్వామిక యుగంలో పశుపోషణ దశకు సంబంధించిన స్త్రీ పురుష సంబంధ వ్యవస్థ జంటపెళ్ళిళ్ళు. పశుపోషణ పురుషులది అయి పచ్చిక మైదానాల వెంబడి పశువులను తోలుకుంటూ పురుషులు సంచార జీవనం చేస్తున్నప్పుడు గుంపు ఆహారపు అవసరాలను తీరుస్తూ పిల్లలను వృద్ధులను చూచుకుంటూ చిన్నచిన్న మళ్ళలో వ్యవసాయం చేస్తూ స్థిరజీవనం చేస్తూ తటస్థపడిన స్త్రీలతో సంబంధాలు ఏర్పరచుకోవటం జరుగుతుంది. అయితే ఇక్కడ ఈ సంబంధం ఒక స్త్రీకి ఒక పురుషునికి మధ్య ఏర్పడేది. ఈ పద్ధతిలో స్త్రీ పురుషులు తమకు ఇష్టమున్నంతకాలం జంటగా కలిసి వుంటారు. అంతమాత్రాన ఇవి ప్రేమానురాగ బంధం వల్ల ఏర్పడినవని అనుకొనటానికి వీలులేదు. పెద్దల నిర్ణయం ప్రధానపాత్ర వహించేది. ఇష్టం లేనప్పుడు విడిపోయే హక్కు ఇతరులతో సంపర్కం పెట్టుకునే స్వేచ్ఛ ఇద్దరికీ వుంది. అంటే తాత్కాలికంగా మాత్రమే వారు ఒకరికి ఒకరు కట్టుబడి వుంటారు. జంటలుగా ఏర్పడ్డ స్త్రీ పురుషులు సహచరులుగా జీవించటానికి అవకాశం ఏర్పడింది. పురుషుడు తన పశుసంపదతో స్త్రీ తన వ్యవసాయోత్పత్తి పనిముట్లతో కలిసి జీవిస్తారు. ఈ సంబంధంలో సంతానానికి తండ్రి ఎవరో తెలిసే అవకాశం ఏర్పడింది. స్త్రీ పురుషులిద్దరిలో ఎవరికి ఆ సంబంధం ఇష్టంలేకపోయినా వాళ్ళు ఆ సంబంధాన్ని అంతటతో తెగతెంపులు చేసుకొని తమ తమ తల్లిగుంపులకు చేరుకుంటారు. పురుషుడు తానుతెచ్చి పోషించి పెంచిన పశుసంపదతో సహా తన తల్లిగుంపుకు చేరితే స్త్రీ తన వ్యవసాయ పనిముట్లతో పాటు తాన ఆ సంబంధం కాలంలో కన్న సంతానంతో సహా తన తల్లి గుంపుకు చేరుకొంటుంది. పురుషుడు పెంచే భౌతిక సంపద అతని తల్లి గణానికి స్త్రీ ఉత్పత్తి చేసే మానవసంపద ఆమె తల్లి గణానికి చెందినవి అవుతాయి.

స్థూలంగా ఇవి మాతృస్వామ్య యుగానికి చెందిన స్త్రీ పురుష సంబంధాలే అయినా సూక్ష్మంగా చూచినప్పుడు మాతృస్వామ్యం మాతృవంశక్రమ లక్షణాన్నిసంతరించుకొనటం కనబడుతుంది. మాతృస్వామ్యంలో ప్రధానమైన తల్లి హక్కు స్వేచ్ఛాయుత సంబంధాలలోను సోదరీ సోదరుల మధ్య సంబంధాలలోను, గుంపు సంబంధాలలోనూ కొనసాగుతూ జంటపెళ్ళి దశవరకు వచ్చింది. అయితే మాతృస్వామిక వ్యవస్థలో గుంపుపై తల్లికి వున్న అధికారం మాత్రం ఎక్కువకాలం కొనసాగలేదు. ఆహార సేకరణ దశ నుండి వేటకు గుంపు జీవనం పరివర్తన చెందటంతో అందుకు బీజాలు పడ్డాయి. వేటలో స్త్రీలు పాల్గొన్నా ప్రకృతి సహజ అవరోధాల వల్ల వాళ్ళు అందులో నిరంతరం భాగస్వాములు కాలేకపోయినారని, వేట సాధనాలను నిరంతరం ఉపయోగించే పురుషుల ఆధిపత్యం ఆ రంగంలో స్థిరపడుతూ వచ్చిందని ఇంతకుముందు అనుకొన్నాం. అట్లాగే పశుపోషణ ప్రధాన జీవికఅయి, పశుసంపద మీద పురుషుల ఆధిపత్యం స్థిరపడటం గురించి కూడా తెలుసుకున్నాం. సరిగ్గా ఈ అంశాలే గుంపులో తల్లి అధికారం స్థానంలోకి పురుషాధికారాన్ని ప్రవేశపెట్టాయి. పాలనావ్యవస్థగా గణం రూపొందింది. గణంలో తల్లి సంతానానికి మాత్రమే స్థానం వుంటుంది. అంటే ఒక తల్లి సంతానంలోని ఆడపిల్లల పిల్లలు, వారి ఆడపిల్లల పిల్లలు ఆ గణం సభ్యులవుతారన్నమాట. ఆ గణంలోని మగపిల్లలు పిల్లల వాళ్ళ తల్లిగణానికి చెందుతారు. సంతానం యొక్క తల్లి నిశ్చయంగా తెలుస్తుంది గనుక తల్లిద్వారా సంతానానికి గుర్తింపు సహజాంశంగా గణంలో కొనసాగింది. స్త్రీ వైపు నుండి నిర్దిష్టమైన పారంపర్యం, రక్తసంబంధం అనే రెండు సహజ లక్షణాలతోపాటు అంతర్వివాహ నిషేధం గణసమాజ నిర్మాణంలో ముఖ్యాంశం. అంటే స్త్రీ పురుష సంబంధాలు స్వేచ్ఛాయుత సంబంధాల నుండి తరానికీ తరానికీ మధ్య సంబంధాలు కొనసాగిన గుంపు సంబంధాలుగా పరివర్తన చెందిన క్రమంలో గణసమాజ నిర్మాణం జరిగిందని అర్థం చేసుకొనవచ్చు. ఒక గుంపులోని స్త్రీ పురుషులు వేరొక గుంపులోని స్త్రీ పురుషులతో లైంగిక సంబంధాలు ఏర్పరచుకొనటం అంటే ఒక గణంలోని స్త్రీ పురుషులు వేరొక గణంలోని స్త్రీ పురుషులతో సంబంధం ఏర్పరచుకొనటమే. వారి సంతానం తల్లి పారంపర్యం రీత్యా తల్లుల గణానికే చెందుతారు. అయితే ఇది పూర్తిగా మాతృస్వామ్య వ్యవస్థ మాత్రం కాదు.

ఇక్కడ తల్లి హక్కు కొనసాగుతుందే కానీ పాలనాధికారం స్త్రీ నుండి పురుషుడికి బదలాయించబడింది. ఉత్పత్తి విధానంలో ఆహార సేకరణ నుండి వేటకు, పశుపోషణకు జరిగిన పరివర్తన అందులో భాగంగా స్త్రీ పురుషుల మధ్య జరుగుతూ వచ్చిన శ్రమ విభజన అందుకు కారణమయినాయి. పాలనాధికారం పురుషునిదే అయినా ఆ పురుషుడు తన తల్లిగణ పారంపర్యానికి చెందినవాడై వుండాలన్నదే ఇక్కడ నియమం. గణ వ్యవస్థలో స్త్రీ పారంపర్యం కొనసాగుతున్నా గణపాలనా వ్యవస్థలో పదవులు పురుషుల నుండి పురుషులకు సంక్రమించటం జరుగుతుంది. అన్న నుంచి తమ్ముడికి మేనమామ నుండి మేనల్లుడికి సంక్రమిస్తాయన్నమాట. దీనిని మాతృవంశ క్రమమని అంటారు. మాతృస్వామ్యం యుగంలో భాగమే అయినా స్వరూప స్వభావాలలో మాతృస్వామ్యం కన్నా భిన్నమైన ఆర్థిక సాంస్కృతిక వ్యవస్థ ఇది.

ఈ మాతృవంశక్రమం కూడా పితృవంశ క్రమంగా మారటానికి కావలసిన తండ్రి హక్కుకు బీజం వేసింది జంట పెళ్ళి దశ. ఒక స్త్రీ ఒక పురుషుడు నిర్దిష్టకాలం సహజీవన సంబంధాలలో వుంటారు కనుక ఇదివరకటి స్త్రీ పురుష సంబంధాలలో వున్న పితృత్వ అనిశ్చిత ఇప్పుడు తొలగిపోయింది. సంతానానికి తండ్రి ఖచ్చితంగా ఎవరో తెలిసిన సందర్భం ఇది. కానీ జంట విడిపోయినప్పుడు తల్లి హక్కు కారణంగా సంతానం తల్లితోపాటు తల్లి గణానికే వెళ్ళిపోయేవారు. పశుసంపద పురుషుడి ఆస్తిగా అభివృద్ధి చెందినా స్త్రీ పారంపర్యం కొనసాగి వస్తున్న వ్యవస్థలో అది అతని తల్లిగణానికే చెందుతుంది. జంటపెళ్ళి వ్యవస్థలో పురుషుడు తన సంతానాన్ని గుర్తించగలిగాడు. కనుక తన సంపదను వారసత్వంగా తన సంతానానికి ఇవ్వాలన్న కోరికను అది పెంచి పోషించింది. ఆ సంతానాన్ని తన గణంలోకి మార్చుకుంటే తప్ప పురుషుడి కోరిక నెరవేరదు. దానితో మొత్తం మీద స్త్రీ పారంపర్యం స్థానంలో పురుష పారంపర్యాన్ని తీసుకొని రావటానికి అంతర్గత ప్రయత్నం జరిగింది. స్త్రీని తన మాతృగణం నుండి తప్పించి పిల్లలతో సహా మగవాడి గణంలోకి బదలాయించే కొత్తవిధానాన్ని రూపొందించటంలో భాగంగా దంపతీ వివాహాలు ఉనికిలోకి వచ్చాయి.

**డి) దంపతీ వివాహాలు :**

ఒక స్త్రీకి ఒక పురుషుడు, ఒక పురుషునికి ఒక స్త్రీ అన్న సూత్రం ప్రాతిపదికగా రూపొందిన వ్యవస్థ దంపతి వివాహ వ్యవస్థ. ఒకసారి లైంగిక సంబంధాలలోకి వచ్చిన స్త్రీ పురుషుల జీవితకాలం ఆ సంబంధానికి కట్టుబడి జీవించాలి. మూడో మనిషితో సంపర్కం నిషేధం. పశుపోషణ దశ నుండి ఆస్తిని పెంపొందించటంలో పురుషుడి పాత్ర పెరుగుతూ వచ్చి జంట పెళ్ళి ద్వారా నిశ్చితమైన పితృత్వం ఆ ఆస్తిని తనదైన సంతానానికి వారసత్వంగా అందించాలన్న పురుషుడి ఆకాంక్షకు బలం చేకూర్చి క్రమంగా అది వివాహ పద్ధతికి దారితీసింది. చారిత్రక పరిణామ క్రమంలో ఉత్పత్తి దశలలో రెండవది అయిన బానిస యజమాని వ్యవస్థలో ఇందుకు ప్రారంభం జరిగింది. లోహపరిశ్రమ అభివృద్ధి చెంది ఆస్తి పాదనకు అది అత్యంత దోహదకారి అయిన సందర్భంలో కొంతమందిని బానిసలుగా చేసి వారి శ్రమను ఉపయోగించటం ద్వారా వ్యష్టి సంపదను పెంచుకొన్న యజమాని కుటుంబాలు భూమిని స్వంత ఆస్తిగా మార్చుకొన్న క్రమంలో దంపతి వివాహాలు అమలులోకి వచ్చాయి.

దంపతి వివాహానికి మూలం ఆస్తి. మానవుని మనసులో పుట్టి పెరిగిన ఆస్తి భావనకు దానిని వారసత్వంగా తమ సంతానాన్ని అందించటానికి అనుగుణంగా హక్కులను స్వీకరించే ప్రయత్నానికి, ప్రక్రియకు ఫలితమే దంపతి వివాహం. వివాహం ద్వారా స్త్రీ పురుషుని గణానికి మారుతుంది. తద్వారా స్త్రీ సంతానం మీద పురుషగణ వారసత్వం స్థిరీకరించబడుతుంది. అది తండ్రి ఆస్తికి వాళ్ళను హక్కుదారులుగా చేస్తుంది. ఈ క్రమంలో ఇంతకు ముందరి లైంగిక సంబంధ వ్యవస్థలలో స్త్రీకి తన సంతానం మీద వున్న సమస్త హక్కులు రద్దయి పోయినాయి. ఈ విధంగా తల్లిహక్కును కోల్పోవటం స్త్రీ జీవితంలో పెద్ద పరాజయం. ఇక్కడి నుండి స్త్రీల జీవితం పూర్తిగా పరాధీనమైంది. స్త్రీ పురుష సంబంధాలలో స్త్రీ అంతవరకు అనుభవిస్తున్న స్వేచ్ఛ, హక్కులు పూర్తిగా హరించుకుపోయినాయి. పాతివ్రత్యం ప్రధాన ధర్మంగా నిర్దేశించబడింది. కానీ పురుషుడు మాత్రం ఒకే స్త్రీకి కట్టుబడి వుండాలనే బాధ్యతను పాటించకపోవటం వలన బహుభార్యాత్వం కొనసాగింది. దాంపత్య సంబంధాలకు బయట వేశ్యావ్యవస్థ ఏర్పడింది. అంటే లైంగిక సంబంధాలలో పూర్వ వ్యవస్థలలో వున్న స్వేచ్ఛ స్త్రీవైపు నుండి నిషేధించబడింది. అరికట్టబడింది. కానీ పురుషుడి వైపు నుండి యధేచ్ఛగా కొనసాగుతూనే వుంది. ఆ రకంగా దంపతీ వివాహాలు స్త్రీకి ఒకనీతి, పురుషుడికి ఒక నీతి అన్న ద్వంద్వ విలువల పునాది మీద నిర్మించబడ్డాయి. తత్ఫలితంగానే స్త్రీపురుష సంబంధాలు అంతకు ముందెన్నడూ లేనంతగా రాజకీయం అయినాయి.

స్త్రీ పురుష సంబంధాలను దంపతి సంబంధాలుగా వ్యవహరించే పవిత్రకర్మకాండతో వివాహ వ్యవస్థ రూపొందింది. స్త్రీని పురుషుడి సమస్త కార్యకలాపాలకు సహాయకారి స్థానంలో నిలబెట్టింది. భర్త కోరిక మేరకు పిల్లల్ని కనటం, ఆమె కర్తవ్యమైంది. కనటం వరకే ఆమెకు పిల్లల మీద అధికారం. భర్తకు అత్తమామలకు విధేయురాలిగా గృహకృత్యాలను చక్కబెట్టటం స్త్రీ ధర్మంగా నిర్దేశించి ప్రచారం చేసే ధర్మశాస్త్రాలు భూస్వామ్య సమాజంతోపాటు అభివృద్ధి చెందాయి. మతం దానిని స్థిరీకరించేందుకు తోడ్పడింది. ఈ క్రమంలో స్త్రీ పురుషులు దంపతులుగా జీవితం ప్రారంభించి కొనసాగించటం వాళ్ళిద్దరి కాంక్షా పరితృప్తికో, ప్రేమానురాగాల అనుభవానికోకా పూర్తిగా పితరులకు సద్గతులను కలిగించగల సంతానాన్ని కనటం కోసమే అయింది. ఆ రకంగా ఆస్తిని వారసత్వంగా అందించటం కోసం పురుషుడిపైన సంతానాన్ని ఖచ్చితంగా గుర్తించటం అన్న అసలు వాస్తవికతను మరుగుపరిచే భావజాలం అభివృద్ధి చేయబడింది. స్త్రీ పురుషుల మధ్య వుండవలసిన లైంగిక సంబంధాలను నిర్దేశించటంలో దంపతీ వివాహాలు లైంగిక సంబంధాల పరిధిని దాటి స్త్రీ పురుష సంబంధాలను సాంఘిక రాజకీయార్థిక సాంస్కృతిక సంబంధాలుగా పరివర్తింప చేశాయి.

మానవజాతి అంతవరకు పొందిన అనుభవాలూ, దాని పురోగతి దంపతీ వివాహాలలో మూర్తివంతమైన మాట నిజమే. సంతానం విషయంలో పితృత్వం గుర్తింపు ఒక ముందడుగే. సంతానానికి సంబంధించిన పోషణ రక్షణ బాధ్యత తానొక్కతే

మోయవలసిన పరిస్థితి నుండి స్త్రీని తప్పించింది. అయితే స్త్రీ పురుషులిద్దరూ సహజీవన సాహచర్యంలో పంచుకునే బాధ్యతగాకాక అది పురుషుడు స్త్రీ మీద చేసే అధికారంతో సంతానంపై తానొక్కటి హక్కును స్థాపించుకొనటం దంపతీ వివాహాలలో అనర్థానికి, స్త్రీల హైన్యానికి కారణమైంది. పురుషుడి ఉనికి కోసం, వంశం కోసం, అభివృద్ధి కోసం ప్రయోజనాల కోసం స్త్రీ తనను తాను అభావం చేసుకొనటం మీదనే దంపతీ వివాహవ్యవస్థ కొనసాగుతున్నది వాస్తవం. అసమానతలు, వాటి మూలకారణాల గురించిన అవగాహన పెరుగుతున్న ఆధునిక కాలంలో స్త్రీ పురుష సంబంధాలు సమానత ప్రాతిపదికగా అధీన అధికార సంబంధాలుగ కాక ప్రజాస్వామిక సంబంధాలుగా వుండాలన్న ఆకాంక్ష బలపడుతున్నది. పితృస్వామ్యం, దానికి మూలమైన స్వంత ఆస్తి ఈనాడు తీవ్రంగా ప్రశ్నించబడుతున్నాయి. వీటి పరిష్కారంలోనే దంపతీ వివాహాలు అసమ అప్రజాస్వామిక అమానవీయ స్వభావాన్ని వదలించుకొని స్త్రీ పురుష సమసంబంధాలుగా పరివర్తన చెందగలుగుతాయి. సమానత ప్రాతిపదికగా స్త్రీ పురుష సంబంధాలు అధీన అధికార సంబంధాలుగాకాక ప్రజాస్వామిక సంబంధాలుగా వుండాలన్న ఆకాంక్ష ఈనాడు బలోపేతమవుతున్నది. అనియత సంబంధ వ్యవస్థను, రక్త సంబంధీకుల వ్యవస్థను, గుంపు సంబంధాల దశను, జంట సంబంధాల దశను దాటి ఏర్పడిన దాంపత్య సంబంధాలు కూడా అందులోని అసమ అప్రజాస్వామిక అమానవీయ స్వభావాన్ని వదిలించుకొని స్త్రీ పురుష సమసంబంధాలుగా పరివర్తన చెందగలవని ఆశించవచ్చు.

## ఇ) పితృస్వామ్యం :

పితృస్వామ్యం అంటే తండ్రి పరిపాలన అని అర్థం. బానిస యజమాని వ్యవస్థలోనే దీనికి తొలిరూపం వుంది. పశుపోషణ ద్వారా పెంచుకున్న పశుసంపదను, కొత్తగా కనుక్కొన్న ఇనుమును ఉపయోగించి రకరకాల ఉత్పత్తి సాధనాలను తయారు చేసుకోగలిగిన సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి పెద్ద ఎత్తున వ్యవసాయాన్ని అభివృద్ధిపరిచి స్థిరజీవనంతో స్థానబలాన్ని సంపాదించుకొని, గ్రామాలను, నగరాలను నిర్మించుకొన్న మానవ నాగరికతాభివృద్ధి దశలో పితృస్వామిక కుటుంబాలు ఆవిర్భవించాయి. వీటినే యజమాని కుటుంబాలు అని కూడా అంటారు. అంటే ఇవి మాతృస్వామిక గణాల స్థానంలో వచ్చిన పురుషాధిపత్య కుటుంబాలు. స్త్రీలు, పిల్లలు, వయసులో చిన్నవాళ్ళయిన మగవాళ్ళు, బానిసలు అందరూ కుటుంబం పెద్ద అయిన ఒక పురుషుని ఆధిపత్యంలో వుండటం వీటి లక్షణం. యజమాని అదుపు ఆజ్ఞలలో వుంటూ ఉత్పత్తి ప్రక్రియలో పాల్గొని అతని సంపదలు పెంచే బానిసలకు పునరుత్పత్తి ప్రక్రియలో పాలుపంచుకొంటూ అతని వంశాన్ని అభివృద్ధి చేసి అతని సంపదకు వారసులను అందించే భార్యకు మధ్య బేధం వాస్తవానికి ఏమీలేదు. ఆ రకంగా దంపతీ వివాహ కుటుంబం పురుషుడికి సంబంధించిన మానవ మానవేతర సమస్త సంపదతో కలిసిన పితృస్వామిక కుటుంబంగా తొలి అవతారం ఎత్తింది.

బానిస వ్యవస్థ అంతరించటంతో సమిష్టి కుటుంబాలు పోయి ఉమ్మడి కుటుంబాలు ఏర్పడ్డాయి. ఇవి కూడా తండ్రి అధికారం కలిగిన కుటుంబాలే. బానిసలు మినహా స్త్రీలు, పిల్లలు పురుషాధికారానికి తలవొగ్గి ఈ కుటుంబంలో జీవిస్తారు. కుటుంబానికి పెద్ద అయిన పురుషుడు అతని భార్యలు, కొడుకులు, కోడళ్ళు, వాళ్ళ సంతానం ఉమ్మడి కుటుంబంలో సభ్యులు. భార్య భర్తకు, పిల్లలు తల్లిదండ్రులకు, చిన్నవాళ్ళు పెద్దవాళ్ళకు లొంగి వుండటం ఆదర్శం అయింది. కుటుంబంలో అధికారం పురుషుని నుండి పురుషుడికి సంక్రమిస్తుంది. తండ్రి తరువాత కొడుకు యజమాని అవుతాడు. కుటుంబంలోని వారంతా అప్పుడు అతని అధీనంలోకి బదలాయించబడతారు. స్త్రీలు బాల్యంలో తండ్రిచేత, యవ్వనంలో భర్త చేత, వృద్ధాప్యంలో కొడుకు చేత రక్షింపబడతారన్న మనుధర్మశాస్త్ర వాక్య తాత్పర్యం దానినే సూచిస్తుంది. ఈ విధంగా పితృస్వామిక కుటుంబం బానిస వ్యవస్థ నుండి రూపొందుతూ భూస్వామ్య వ్యవస్థ వచ్చేసరికి పూర్తిగా పటిష్టం అయింది. అప్పటినుండి పితృస్వామిక యుగం కొనసాగుతూనే వుంది. పెట్టుబడిదారీ సమాజంలోనూ అది స్థిరంగానే వుంది.

ప్రత్యేకించి స్త్రీలపై పురుషుల పెత్తనానికి అవకాశం కల్పించే అధికార సంబంధాల అల్లిక, స్త్రీలను తక్కువస్థాయిలో వుంచే వ్యవస్థల నిర్మాణం, భావజాల నిర్మాణం పితృస్వామిక యుగలక్షణాలు.

### ఎ) మగపిల్లలకు ప్రాధాన్యత :

పురుషుని వైపు నుండి ఆస్తిని సంతానానికి వారసత్వంగా సంక్రమింప చేయాలన్న సంకల్పం నుండి రూపొందిన పితృస్వామ్య సమాజంలో క్రమంగా ఆ సంతానం మగపిల్లవాడే కావాలన్న కోరిక కూడా బలపడింది. పితృస్వామ్య వ్యవస్థా ప్రయోజనాలకు అనుగుణంగా రూపొందిన మతం కూడా ఆధ్యాత్మిక, పారలౌకిక అవసరాలను తీర్చే అధికారం పురుషుడికి ఇయ్యటం ద్వారా ఆ భావనను బలపరిచింది. ఋగ్వేదంలో పుత్రుల కోసం ప్రార్థనలు జరిపిన సన్నివేశాలు, వీరపుత్రులను కన్న తల్లులను గౌరవించిన సందర్భాలు, అధర్వణ వేదంలో చెప్పబడిన మగపిల్లవాడి పుట్టుకను కోరుతూ జరిపే ఉత్సవాల సంగతి, గర్భస్థ పిండం ఆడపిల్ల కాకుండా మగపిల్లవాడే కావాలని చేసే ప్రార్థనల సంగతి చూస్తే పితృస్వామిక యుగంలోని తొలిదశల్లోనే మగపిల్లలకు పెరిగిన సామాజిక ప్రాధాన్యత తెలుస్తుంది.

### బి) పిల్లల తల్లిగానే స్త్రీలకు గుర్తింపు :

ఈ క్రమంలోనే మగపిల్లలను కన్న స్త్రీలకే గౌరవం ఆదరణ లభించాయి. దంపతీ వివాహాల ద్వారా పురుషుడి ఆస్తికి వారసులు కాదగిన సంతానాన్ని కని ఇవ్వటమే స్త్రీకి జీవితంగా నిర్దేశించబడినపుడు ఆ స్త్రీలు పిల్లలు కలగకపోయినా, పిల్లలు కలిగినా వాళ్ళు మగపిల్లలు కాకపోయినా నిరాదరణకు, నిర్లక్ష్యానికి గురిఅవుతారు. భార్య సంతానవతి కాకపోతే ఎనిమిదేళ్ళకు, బిడ్డలు పుడుతున్నా చచ్చిపోతుంటే పదేళ్ళకు, చావకపోయినా పుట్టిన వాళ్ళంతా ఆడవాళ్ళే అయితే పదకొండేళ్ళకు పురుషుడు వేరొక వివాహం చేసుకోవచ్చునని మనుస్మృతి చెప్పిన విషయం దీనినే సూచిస్తుంది. అంటే పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీకి పిల్లల తల్లిగా తప్ప ప్రత్యేకమైన ఉనికి లేదన్నమాట. అందువల్లనే ఈ యుగంలో స్త్రీకి 'మాతృత్వం మహాభాగ్యం' అయికూర్చుంది. పునరుత్పత్తి సాధనంగా మాత్రమే స్త్రీ మిగిలిపోయింది.

### సి) స్త్రీ గృహబానిస :

పురుషుడిదైన కుటుంబానికి బాధ్యత వహించిన వలసిన స్థితికి స్త్రీ నెట్టబడింది. పిల్లల్ని కనటం, పెంచటం, ఇంటి పనులను నిర్వహించటమే స్త్రీ జీవన విధానంగా నిర్దేశించబడింది. ఉత్పత్తి రంగంలోకానీ, మేధో సృజన రంగాలలో కానీ స్త్రీలు సమాజపు చివరి అంచులకు నెట్టివేయడం దీని అంతిమ పరిణామం. గార్గి మైత్రేయి వంటి వేదాంత చర్చల్లో పాల్గొనగలిగి ప్రజ్ఞను చూపగలిగిన బ్రహ్మవాదినులున్న కాలంలో కూడా స్త్రీ ప్రజ్ఞ గృహకృత్య నిర్వహణకు సంబంధించేదనని బృహదారణ్యోకపనిషత్తు నిర్ధారించి చెప్పటం దీనినే సూచిస్తుంది. మనుస్మృతి స్త్రీకి గృహకృత్య నిర్వహణనే విద్యగా చూపించి స్త్రీల గృహబానిసత్వాన్ని స్థిరీకరించింది. స్త్రీల జీవితకాలపు ఉచిత శ్రమ, సేవలు పురుషుడికే స్వంతం అవుతాయి. అయినా అది శ్రమగా గుర్తించబడదు. ఫలితంగా స్త్రీ బ్రతుకు భర్తపై ఆధారపడినదే అవుతుంది.

### డి) స్త్రీ పై పురుషుల పెత్తనం :

పితృస్వామిక యుగంలో స్త్రీ జీవితమంతా పురుషాధీనమే. తండ్రి, భర్త, కొడుకు ఎవరైనాసరే ఆమె జీవితగమనాన్ని ప్రవర్తనా సరళిని నిర్దేశించేవాళ్ళే. వాళ్ళ ఇష్టాలు, సూచనలు, ప్రయోజనాలకనుగుణంగా ఆమె తనను తాను ఎప్పటికప్పుడు సరిచేసుకొనాలి. స్త్రీలపై పురుషుని పక్షాన పురుష ప్రయోజనాలకనుగుణంగా పెత్తనం చేయగలిగిన వాళ్ళుగా అత్త, ఆడబిడ్డ,

తోడికోడలు మొదలైన సంబంధాలలో వున్న స్త్రీలు తయారు చేయబడతారు. ఆ రకంగా స్త్రీలపై పురుషుల పెత్తనం స్త్రీల ద్వారా కూడా అమలు చేయబడటం పితృస్వామ్య వ్యవస్థ లక్షణం. తద్వారా అది తిరుగులేని విధంగా స్త్రీని స్త్రీకి శత్రువుగా నిలబెట్టేపని పూర్తి చేయగలిగింది.

స్త్రీపై పురుషుల పెత్తనం స్త్రీల శ్రమను నియంత్రించటంగా వుంటుంది. స్త్రీల శ్రమ కుటుంబ సేవలకే అని నిర్ధారించటమైనా, స్త్రీలు తమ శ్రమశక్తిని సమాజంలో వినియోగించకుండా అడ్డుపెట్టుటమైనా, స్త్రీలు తమ శ్రమశక్తిని ఏ రంగంలో ఎలా ఉపయోగించాలో నిర్దేశించడమైనా, స్త్రీల శ్రమ ఫలితాలను స్వంతం చేసుకొనటమైనా శ్రమ నియంత్రణలో భాగమే. ఈ నాటికీ పెద్ద పెద్ద చదువులు చదివిన స్త్రీలయినా తాము ఏ రకమైన పని ఎక్కడ చేయాలో స్వయంగా నిర్ణయించుకునే పరిస్థితి లేకపోవటం పితృస్వామిక సమాజ లక్షణమే. స్త్రీలను ఆర్థికంగా తక్కువస్థాయిలో వుంచటం పురుషుల అధికారం కొనసాగటానికి మొదటి షరతు.

స్త్రీపై పురుషుల పెత్తనం స్త్రీల లైంగికత్వాన్ని నియంత్రించేదిగా కూడా వుంటుంది. పురుషుల అవసరాలకు, కోరికలకు అనుగుణంగా స్త్రీలు లైంగిక సేవలు అందించాల్సిందే కానీ స్వతంత్రంగా వాళ్ళకు వాంఛలు వుండటానికి, వాటిని వ్యక్తీకరించటానికి వీలుండదు. స్త్రీల లైంగికత మీద నిరంతర నిఘా కొనసాగుతుంటూంది. పురుషుడితోపాటు కుటుంబం, సమాజం, ధార్మిక న్యాయవ్యవస్థలు కూడా ఈ నియంత్రణను ఆమోదించి అమలుచేస్తాయి. పురుషుడికి కుటుంబంలోనే బహుభార్యాత్వానికి అవకాశం వుండగా స్త్రీకి భర్తతో తప్ప వర్గపురుషులతో సంబంధం నిషిద్ధమవుతుంది. కుటుంబం బయట స్త్రీల లైంగికత పురుషుడికి భోగవస్తువైంది. అంతమాత్రమే కాదు. స్త్రీల లైంగికత పురుష ప్రయోజనాలను తీర్చగల మార్కెట్ వస్తువుగా కూడా చేయబడుతుంది. పురుషుల అధికార ప్రదర్శనకు స్త్రీ శరీరం రంగభూమి అయిందంటే స్త్రీల లైంగికత మీద పితృస్వామ్య సమాజం ఎంతటి నియంత్రణ కలిగి వుందో అర్థం అవుతుంది.

స్త్రీకి ఋతుకాలం పునరుత్పత్తి యోగ్యమైన సమయం కనుక, దానిని దాచి వుంచి పురుష సంపర్కాన్ని స్త్రీ పరిహరిస్తే అది పురుషుడి కుటుంబాన్ని నిలిపే వంశవారసుల పుట్టుకకు అవరోధం అవుతుంది. కనుక నేరం అవుతుంది. కౌటిల్యుని అర్థశాస్త్రం ఆ విషయాన్నే చెప్పింది. స్త్రీ ఏడు ఋతుకాలాలు భర్తతో సంగమాన్ని పరిహరిస్తూపోతే భార్యగా తనకున్న హక్కును కోల్పోతుందని అర్థశాస్త్రం నిర్దేశించింది. భార్యగా స్త్రీకి లభించిన సామాజిక హోదా ఆమె లైంగికత మీద పురుషాధికారాన్ని ఎలా స్థిరీకరించిందో స్పష్టం చేసిన సందర్భం యిది.

## ఇ) స్త్రీ స్వేచ్ఛాహరణం :

పితృస్వామ్యం ప్రపంచాన్ని పబ్లిక్ ప్రయివేటు ప్రపంచాలుగా విడగొట్టి పబ్లిక్ ప్రపంచంలో స్త్రీకి ప్రవేశాన్ని నిషేధించనైనా నిషేధిస్తుంది. నియంత్రించనైనా నియంత్రిస్తుంది. తద్వారా స్త్రీల జీవితాన్ని ప్రయివేటు ప్రపంచానికి పరిమితం చేస్తుంది. సమాజంలో చర్చనీయాంశాలు పబ్లిక్ విషయాలే కానీ, ప్రయివేటు విషయాలు కాదని నిర్ధారిస్తుంది. ఆ రకంగా స్త్రీకి ప్రపంచంతో సంబంధం ఏర్పరచుకొనటానికి, స్వేచ్ఛగా ప్రవర్తించటానికి ద్వారాలు మూసేస్తుంది. అంతేగాక వ్యక్తిగత విషయాలు చర్చనీయాంశాలు కావనటం ద్వారా, సంసారం గుట్టు, కుటుంబ గౌరవం, వంశమర్యాద మొదలైన భావనల ద్వారా స్త్రీలపై పురుష పెత్తనాన్ని స్థిరీకరిస్తుంది. కుటుంబ హింసను ప్రశ్నించటానికి వీలులేనిదిగా చేస్తుంది.

ఆత్మరక్షణలూ, అర్థమూ, కామమూ, మాతృత్వమూ సహజ ప్రేరణలు. జీవిత చైతన్యానికి మూలకారణాలు. వీటిలో దేనికి ఏ విధమైన అంతరాయం కలిగినా ఆ మేరకు జీవితం దుఃఖభాజనమవుతుంది అని చెప్పి కొడవటిగంటి కుటుంబరావు స్త్రీల జీవితంలో జీవిత చైతన్యానికి కారణమైన ఈ సహజ ప్రేరణలకు అంతరాయం కలుగుతున్నదన్న సూచన చేశారు. ఆచారంగా

కానీ, చట్టపరంగాకానీ ఆడదానికి హక్కులు లేకపోవడం, తనకు ఇష్టంలేని సంబంధాల నుండి తప్పుకొనటానికిగానీ దైర్జన్యం నుండి శరీరాన్ని, అభిమానాన్ని రక్షించుకొనటానికిగానీ అవకాశం లేకపోవటం పితృస్వామిక యుగలక్షణమే. అర్థలోపం లేకుండా జీవించటానికి స్త్రీ ఈ వ్యవస్థలో భర్తపై ఆధారపడటమే అనివార్యం అవుతుంది. అర్థం పట్ల ఆకాంక్ష భర్తమీద లేని ప్రేమ నటించటానికి కారణమవుతుంది తప్ప స్వీయ చైతన్యాన్ని ప్రేరేపించే అవకాశం ఇక్కడలేదు. అర్థ ప్రేరణ గురించే తెలియని స్త్రీలు భార్య అయి భర్తమీద ఆధారపడి జీవించటమే సుఖమనుకొనే స్థాయికి చేరుతారు. స్త్రీలో 'కామం' అనే ప్రేరణ వికసించక ముందే ఆమెకు వివాహమవుతుంది. కామ ప్రేరణ కలిగేసరికి అది ప్రసరించవలసిన స్థానం నిర్దేశింపబడి వుంటుంది కనుక ప్రేమగా అది వికసించటానికి అవకాశమే రాదు. మాతృత్వం స్త్రీ కనటం వరకే కానీ పిల్లల ఆరోగ్యానికి అభ్యుదయానికీ వినియోగపడగల సంస్కారంగా అభివృద్ధిచెందదు. ఎందుకంటే వాటినన్నిటినీ నిర్ణయించేది పురుషుడు. ఈ రకంగా చూచినపుడు పితృస్వామ్యం స్త్రీల సమాజ ప్రేరణల వికాసాన్ని ఎట్లా మొగ్గలోనే తుంచేసి వాళ్ళ జీవితాన్ని దుఃఖభాజనం చేస్తుందో అర్థమవుతుంది.

పితృస్వామ్యం దానంతట అది సర్వతంత్ర స్వతంత్రంగా వునికిలో వుండవలసిన వ్యవస్థ కాదు. స్త్రీ పురుష సంబంధ వ్యవస్థను నిర్మాణాన్ని, భావజాలాన్ని నిర్దేశించి నియంత్రించేదిగా జీవితాన్ని ఆవరించుకొని విస్తరించి ఊడలు దిగిన మర్రిచెట్టు. అది కుటుంబం, మతం, రాజ్యం, ఉత్పత్తి రంగం, న్యాయవ్యవస్థ, విద్యాసంస్థలు మొదలైన వాటినన్నింటినీ ఆశ్రయించి తనను తాను ఆవిష్కరించుకొంటుంది. ఆ క్రమంలోనే కుటుంబం పురుషుడికి అధికారాన్ని స్త్రీకి అధీనతను అలవాటు చేస్తుంది. మతం పురుషుడి అధికారమైనా స్త్రీ అధీనత అయినా దైవసంకల్పం, దైవనిర్మితం అన్న భావాన్ని ప్రచారం చేస్తుంది. ఆ రకంగా కుటుంబంలోని వివక్షను మతం స్థిరీకరిస్తుంది. రాజ్యం దానికి భంగం కలగకుండా చూస్తుంది. కుటుంబంలో పురుషుడు స్త్రీ&త ప్రవర్తనపై తీర్పరి అయినట్లుగానే బయట స్త్రీ పురుష సంబంధమైన నీతుల విషయంలో న్యాయస్థానం స్త్రీ ప్రవర్తనపై తీర్పులిస్తుంది. పురుష ప్రయోజనాలకు పురుష న్యాయానికే అక్కడ ప్రాధాన్యత. కుటుంబ పెద్దగా పురుషుడిని గుర్తించటం భర్తగా భార్యపై పురుషుడి అధికారాన్ని, ఆధిపత్యాన్ని ఆమోదించటం న్యాయవ్యవస్థ చేసే పనులు. కుటుంబంలో అధికారం అనే మాటే తెలియకుండా అధీనతలో ఆర్థిక స్వావలంబన గురించిన స్పృహే లేకుండా వుండే స్త్రీకి ఆర్థిక రాజకీయ రంగాలలో అధికార స్థానం లభిస్తుందనుకొనటం పెద్దభ్రమ. స్త్రీల ప్రయోజనాలకనుకూలమైన చట్టాలు చేయాలన్న ఆలోచనకే వీలులేకుండా చేసింది. చట్టసభలల్లో స్త్రీల అల్పభాగస్వామ్యం. విద్యావ్యవస్థలు ఈ లింగవ్యవస్థకే పాఠ్యాంశాల ప్రబోధం ద్వారా లేతమెదళ్ళకు ఎక్కించి వివక్షణే కుటుంబం ఇచ్చే శిక్షణను సమగ్రం సంపూర్ణం చేస్తుంది. ఆ రకంగా పితృస్వామ్యం పురుషాధికార భావనను, స్త్రీ అధీనతా స్థితిని గర్వించదగినవిగా, గౌరవనీయమైనవిగా ఒక తరం నుండి మరొక తరానికి తీసుకొని వెళ్తుంటుంది.

స్త్రీ పురుష అసమానతకు ఎన్నేళ్ళు గడిచినా, ఎన్ని వ్యవస్థలు మారినా, ప్రభుత్వాలు మారినా సాధ్యం కాని స్త్రీల అభివృద్ధికి మూలం పితృస్వామ్యంలో వుందని గుర్తించటం, పితృస్వామ్యం యొక్క విస్తరణ లక్షణాన్ని, విశ్వరూపాన్ని తెలుసుకొనగలగటం అంతర్జాతీయ మహిళా సంవత్సరం నాటికి సాధ్యమైంది. పితృస్వామ్యం గురించి తెలిశాక స్త్రీ విద్య, బాల్యవివాహాల నిషేధం వంటివి స్త్రీ జీవితాన్ని సగౌరవంగా నిలబెట్టలేవన్న స్పృహ కలిగింది. స్త్రీల పరిస్థితి మెరుగుకావాలంటే రాజ్యం తండ్రి పాత్ర నిర్వహిస్తే సరిపోదని కూడా అర్థం అయింది. తండ్రి వాత్సల్యంలో కూతురు అడిగినవి చెయ్యనూవచ్చు. చేతకాకపోతే నోర్మూసుకొనమని గద్దించనూవచ్చు. స్త్రీ పురుషుల మధ్య వుండవలసినది సమత్వం. సమానతను కోరటమంటే సాంఘిక విప్లవాన్ని ఆహ్వానించటమే. ఆధునిక స్త్రీ అందుకు సిద్ధమవుతున్నది. పితృస్వామ్యం మీద యుద్ధ ప్రకటనచేసింది. అయితే ఈ యుద్ధం బహుముఖాలుగా సాగనున్నది. ఇంట్లో అధీనత నుండి విముక్తికి అధికారంపై ధిక్కారంగా అది కొనసాగుతుంది. ఆర్థిక రాజకీయ రంగాలను కైవసం చేసుకొని స్వావలంబన సాధికారతల దిశగా ప్రయాణం సాగుతుంది. స్త్రీల అనుభవం నుండి నూతన జ్ఞానాన్ని చైతన్యవంతంగా ప్రధాన స్రవంతి జ్ఞానానికి పూరకంగా రూపొందించి నిలబెట్టటం జరుగుతుంది. ఇవి చేస్తూనే పితృస్వామ్యం స్వంత ఆస్తి భావనతో ముడిపడి వుందన్న విషయాన్ని విస్మరించకుండా దానిని కూడా సరి చూడాల్సి వుంటుంది.

పితృస్వామ్యం ఆస్తిభావన సంబంధంలో అభివృద్ధి చెందింది కనుకనే ఈనాడు ప్రపంచీకరణ క్రమంలో పితృస్వామ్యం స్త్రీల జీవితాలపై తిరిగి ఎంత బలంగా రుద్దబడుతున్నదో గ్రహిస్తూ స్త్రీలు దానిని కూడా లక్ష్యం చేసుకోవలసి వుంది. చేసుకుంటున్నారు కూడా.

## 1.3. సారాంశము :

సామాజిక పరిణామ క్రమంలో ఉత్పత్తి విధానాలు ఆహారసేకరణ - వేటల దగ్గర నుండి పశుపోషణ ఆహారోత్పత్తి, వ్యవసాయ స్థిరజీవనం, అనే దశలను దాటుకొంటూ పెట్టుబడిదారీ వ్యవస్థకు చేరుకొన్న క్రమంలో ప్రాకృతిక భౌతిక కారణాల వలన స్త్రీ పురుషుల మధ్యజరిగిన శ్రమ విభజన వారిద్దరి మధ్య అసమానతలకు దారితీసింది. సమాంతరంగా స్త్రీ పురుష లైంగిక సంబందాలు కూడా మారుతూవచ్చాయి. ఆహార సేకరణ - వేట ప్రధాన జీవన విధానంగా వున్న ఆదిమ కమ్యూనిస్టు సమాజంలో స్వేచ్ఛాయుత స్త్రీ పురుష సంబంధాలు వుండేవి. అనుభవంలో సాధకబాధకాలు తెలిసివచ్చిన క్రమంలో ఒక తరం స్త్రీ పురుషులకు మరొక తరపు స్త్రీ పురుషులతో సంబంధాలు నిషేధింపబడుతూ సోదర సోదరీ సంబంధాలు ఉనికిలోకి వచ్చాయి. గుంపులు విస్తరిస్తూ సంచరిస్తూ ఆహారాది వస్తుసామగ్రి వినిమయం చేసుకొంటున్న దశలో గుంపు పెళ్ళిళ్ళు అమలులోకి వచ్చాయి. ఒకే గుంపులోని సోదరీ సోదరులు మధ్య అంతవరకు కొనసాగివస్తున్న సంబంధాలు నిషేధించబడ్డాయి. ఒక గుంపులోని స్త్రీ పురుషులు మరొక గుంపులోని స్త్రీ పురుషులతో సంబంధాలు పెట్టుకొనే ఈ దశపశుపోషణ దశలో జంట సంబంధంగా పరిణమించింది. ఒకస్త్రీ ఒక పురుషుడు నిర్దేశిత కాలం కలసి జీవించే ఈ పద్ధతి వల్ల సంతానానికి తండ్రి ఎవరో తొలిసారి తెలిసివచ్చింది. అంతవరకు వున్న స్త్రీ పురుష సంబంధాలలో సంతానానికి తల్లి మాత్రమే తెలుస్తున్నది. కనుక తల్లి హక్కు అమలవుతున్నది. దానినిబట్టి మాతృస్వామ్య వ్యవస్థ అయింది అది. సంతానానికి ఆహారరక్షణ బాధ్యతలు నిర్వహించే పాలనాధికారి కూడా తల్లే ఆ వ్యవస్థలో. జంటపెళ్ళి దశలో సంతానానికి తండ్రి ఎవరో తెలిసినా తల్లి హక్కే చలామణిలో వుంది. పశుపోషణ వలన అభివృద్ధి చెందిన సంపద పురుషుడు సంపాదించిందే అయినా అది అతని తల్లిగణానికే చెందుతుంది. ఈ స్థితిని మార్చి తన సంపదను తన సంతానానికి వారసత్వంగా ఇవ్వాలనే పురుషుడి కోరిక దంపతి వివాహానికి దారితీసింది. ఒక స్త్రీకి ఒక పురుషుడు ఒక పురుషుడికి ఒక స్త్రీ అన్న సూత్రం ప్రాతిపదికగా ఏర్పడిన ఈ రకమైన స్త్రీ పురుష సంబంధ వ్యవస్థలో స్త్రీ తన మాతృగణం నుండి పురుషుడి మాతృగణానికి బదలాయించబడింది. తత్ఫలితంగా ఆమెకన్న సంతానం పురుషుడి గణం వాళ్ళయి పురుషుడి ఆస్తికి వారసులు కాగలిగారు. దంపతీ వివాహవ్యవస్థలో స్త్రీ తన తల్లి హక్కును కోల్పోయింది. చరిత్రలో ఇది స్త్రీల పరాజయం. ఇక్కడి నుండి స్త్రీలదంతా అధీనచరిత్రే.

జంటపెళ్ళి దశలో తెలియవచ్చిన సంతానానికి సంబంధించిన పితృత్వజ్ఞానం పితృస్వామిక యుగానికి దారితీసింది. తల్లిహక్కును త్రోసి రాజని సంతానంపై తండ్రి హక్కును స్థాపించే దంపతి వివాహాల వల్ల ఇది స్థిరరూపం ధరించింది. స్త్రీలను పురుషులకు అధీనులుగా పురుషాధికారాన్ని ఆమోదించి బ్రతికేవాళ్ళుగా చేయటానికి అనుగుణంగా మతం, ధర్మశాస్త్రాలూ, సాహిత్యం అభివృద్ధి చెంది కుటుంబాన్ని, అంతస్తులవారీ అధికార సమాజాన్ని స్థిరీకరించాయి. పితృస్వామ్యం స్త్రీల ఉత్పత్తి పునరుత్పత్తి శక్తులమీద పూర్తి నియంత్రణ కలిగి ఉంటుంది. పురుష ప్రయోజనాలు అవసరాల మేరకు స్త్రీల సృజన మేధోశక్తులను అది నియంత్రిస్తుంది. స్త్రీని ఇంటిలోపలి ప్రపంచానికి పరిమితం చేసి పురుషుడికి విశాలమైన బయట సమాజాన్ని కార్యక్షేత్రంగా చూపించి సామర్థ్యాన్ని పదునెక్కించుకొనమంటుంది. స్త్రీల జీవితంలోని ప్రతి అంశాన్ని వ్యక్తిగతమని చెప్పి బహిరంగ చర్చకు రాకుండా చేసి అధీనతను కొనసాగిస్తున్నది. కుటుంబం, మతం, రాజ్యం, న్యాయవిద్యావ్యవస్థలు పితృస్వామ్యాన్ని రకరకాల ముఖాల నుండి అమలుపరుస్తూ ఒకదానికొకటి సమర్థకంగా పనిచేస్తుంటాయి. పితృస్వామ్యం స్త్రీలను అణచి వుంచే రాజకీయశక్తి అని తెలిసిన తరువాత అది స్త్రీ పురుషులిద్దరిని సహజప్రేమమూర్తులుగా సమానులుగా మానవీయ స్వభావంతో ప్రవర్తిస్తూ

జీవించేటట్లు చేయలేక పోతున్నదని అర్థమైన తరువాత దానిమీద దాడి అనివార్యం అవుతుంది. వర్తమానం పితృస్వామ్యం మీద ప్రారంభమైన యుద్ధ చరిత్రే.

## 1.4. మాదిరి ప్రశ్నలు :

1. మాతృస్వామ్యం అంటే ఏమిటి ? మాతృస్వామిక యుగలక్షణాలేమిటి ?
2. మాతృస్వామ్యానికి మాతృవంశ క్రమానికి వున్న సంబంధాన్ని భేదాన్ని వివరించండి.
3. స్త్రీ పురుష లైంగిక సంబంధాలలో వచ్చిన పరిణామాల గురించి వ్రాయండి.
4. దంపతీ వివాహాల స్వభావం, ప్రయోజనం వివరించండి.
5. పితృస్వామ్యం అంటే ఏమిటో వివరించండి.

## 1.5. ఉపయుక్త గ్రంథాలు :

1. చరిత్ర వ్యాసాలు, వ్యాసప్రపంచం - 2 : కొడవటిగంటి కుటుంబరావు, విరసం ప్రచురణ, కూర్పు : కృష్ణాబాబుప్రసాద్, 1999, అక్టోబరు
2. చరిత్రలో ఏం జరిగింది - గోల్డెన్ చైల్డ్, హైద్రాబాద్ ట్రస్ట్ ప్రచురణ , జనవరి 1985, అనువాదం : వల్లంపాటి వెంకటసుబ్బయ్య
3. పురాతన సమాజం - లూయీహెన్రీ మోర్గన్, విజ్ఞాన వికాస సమితి, విజయవాడ ప్రచురణ, అనువాదం : మహీధర రామ్మోహనరావు, జనవరి 1987
4. పితృస్వామ్యం - ఒక పరిచయం - కమలాభసీన్, స్త్రీవాద ప్రచురణలు, అనువాదం : ఓల్గా, మార్చి 1996.
5. మహిళా జనజీవన సమస్యలు - మూలాల అన్వేషణ : కాత్యాయినీ విద్మహే, జ్యోతిరాగి, శోభ, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ ప్రచురణ, మార్చి 1994.
6. సంప్రదాయ సాహిత్యం - స్త్రీవాద దృక్పథం - కాత్యాయినీ విద్మహే, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ ప్రచురణ, 1997.

**- ఆచార్య కాత్యాయినీ విద్మహే**

పాఠం - 2

# వైదికయుగంలో స్త్రీ

**ఉద్దేశం :**

వైదికయుగం నాటి స్త్రీ స్థితిగతులను, ఆనాటి సమాజంలో స్త్రీల స్థానాన్ని నిరూపించటం.

**పాఠ్య నిర్మాణక్రమము**


- **2.1.** వేదప్రాశస్త్యము
- **2.2.** ఋగ్వేదము
  - **2.2.1** స్త్రీల స్థితిగతులు
  - **2.2.3** సమీక్ష
- **2.3** అథర్వణ వేదం
  - **2.3.1** అథర్వవేద నిర్మాణం
  - **2.3.2** అథర్వవేద విషయ వివేచనం
  - **2.3.3** సమీక్ష
- **2.4** ముగింపు
- **2.5** ప్రశ్నలు
- **2.6** సంప్రదించవలసిన గ్రంథాలు


## 2.1 వేద ప్రాశస్త్యము :

వేదాలు ప్రాచీన భారతీయ సాహిత్యంలోనే గాక విశ్వసాహిత్యములోను ప్రాచీనమైనవి. వేదాల్లో భారతీయ ధర్మం, సాహిత్యం, సంస్కృతి, సభ్యత, కళలు, జీవనవిధానం, ఆలోచనా సరళి, ఆచార వ్యవహారాలు మొదలైనవి ఎన్నో వున్నాయి. వేదాలు జ్ఞానానికి నిలయాలు. మ్యాక్సిముల్లర్ మాటల్లో చెప్పాలంటే ప్రపంచ చరిత్ర పరిపూర్ణతకు వేదాలు చేసే సేవ ఏ ఇతర గ్రంథాలు చేయడం లేదు.

'విద్' జ్ఞానే అనే ధాతువుకు 'ఘయ్' ప్రత్యయం కలిపితే వేద శబ్దం ఏర్పడుతుంది. దీని సామాన్యార్థం జ్ఞానం. అమరకోశ వేదాన్ని ఈవిధంగా నిర్వచించింది. 'విదన్త్యనేన ధర్మం సవేదం' దీన్ని బట్టి ధర్మమార్గాన్ని తెలిపేదే వేదమని గ్రహించవచ్చు. వేదం మొదట ఒక్కటిగానే ఉండేది. అది విషయ గ్రహణానికి ప్రతిబంధకంగా ఉండేది. విష్ణుపురాణంలో ప్రజలకు బాగా అర్థం అయ్యేందుకు ఒక్కటిగానే వున్న వేద సాహిత్యాన్ని వ్యాసుడు విషయానుక్రమాన్ని బట్టి నాలుగ్గా విభజించాడు.''

వేదాలు ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అథర్వణవేదమని లోకంలో ప్రసిద్ధి పొందాయి. వేదాలు సకల ధర్మాలకు మూలం. పితృ దేవతలకు, మానవులకు వేదం సనాతనము, అక్షయము, అపరిమేయము అయిన చక్షువు అని పండితుల అభిప్రాయం. వేదాలు అపౌరుషేయాలు. స్వతః ప్రమాణాలు. మంత్రద్రష్టలైన ఋషుల చేత లోకహితం కోసం ప్రతిపాదింపబడ్డాయి. ఇవి ప్రకృతి దేవతల్ని స్తుతిస్తాయి.

ప్రతివేదము తనలోని విషయాన్ని నాలుగు విభాగాల ద్వారా ఆవిష్కరిస్తుంది. ప్రతి వేదములోను మొదట ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధించే చంధోబద్ధంగా మంత్రాలు ఉన్నాయి. ఇవి ప్రకృతి దేవతలు మానవులకు చేసే ఉపకారాన్ని మానవులు వాటిని ఆరాధించవలసిన ఆవశ్యకతను ఉద్ఘాటిస్తాయి. కర్మకాండలో ఉపయోగించే మంత్రాలకు వ్యాఖ్యానాలే బ్రాహ్మణాలు. యజ్ఞయాగాదులను నిర్వహించే విధి విధానాలను సమగ్రంగా వివరించే విధివాక్యాలు. పరబ్రహ్మతత్వాన్ని గ్రహించిన బ్రాహ్మణుడు అధ్వర్యం వహించడంవల్లను పరబ్రహ్మస్తుతి ఈ గ్రంథాల్లో ఉండటం వల్లను వీటికి బ్రాహ్మణాలనే పేరు సార్థకమైంది. మూడో విభాగానికి చెందినవి ఆరణ్యకాలు. ఇవి ఉపాసనా విధులను గురించి చర్చిస్తాయి. వీటిలోని విషయాలు రహస్యాలు. అందువల్ల గ్రామాల్లో కాక అరణ్యాల్లోనే శిష్యులకు బోధించతగినవి. కాబట్టి వీటికి ఆరణ్యకాలని పేరు వచ్చింది. అరణ్యేభవం ఆరణ్యకం అని ఆరణ్యక శబ్దానికి వ్యుత్పత్తి. ఈ మంత్రాలు, బ్రాహ్మణాలు, ఆరణ్యకాలు కలిపి కర్మకాండ అని పేరు. చివరివి ఉపనిషత్తులు. పరబ్రహ్మ సమీపానికి నిశ్చయంగా చేర్చే నిత్య సత్యజ్ఞానాలే ఉపనిషత్తులు. ఇవి వేదాల చివరి భాగాలైనందువల్ల వేదాంతాలని మొదటి మూడు భాగాల సారాంశాన్ని జ్ఞానరూపంగా ఆవిష్కరించే గ్రంథాలు. కాబట్టి ఉపనిషత్తులను జ్ఞానకాండ అని వ్యవహరిస్తారు.

### ఋగ్వేదము :

ఋచ్యతేస్తూయతే ప్రతిపాద్యార్థోయయాసా ఋక్ అని నిర్వచనం. ప్రతిపాదించే అర్థాన్ని స్తుతించేవే ఋక్కులు. ఋగ్వేదమంటే ఋక్కుల సమాహారమే. శాకల్య మహర్షి చేత సూక్తమండల రూపంగా ఈ ఋక్కులు విభజించబడ్డాయి. ఈ వేదాలు గురుశిష్య పరంపర ద్వారా ధారావాహికంగా కొనసాగిన జ్ఞాన పరంపరే. వీటికి కర్తలు లేరు.

### ఋగ్వేద ప్రాధాన్యత :

ఋగ్వేదం ఇండో యూరోపియన్ భాషా కుటుంబానికి చెందిన అతి ప్రాచీన సాహిత్యము. తులనాత్మక భాషాధ్యయనానికి కావలసిన ఖచ్చితమైన విషయ పరిజ్ఞానము సమకూర్చడం వల్ల ఋగ్వేదానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యం ఉంది. ఆదిమానవుని చరిత్రను ఆవిష్కరించడంలో దీనికి ఎంతో పాత్ర ఉంది. మతపరమైన విషయాలు వేదాంత దర్శనాల ఆవిర్భావ వికాసాల సమగ్ర పరిశీలనకు ఋగ్వేదం అమూల్యమైన విషయాలను అందజేస్తుంది. ఋషులు ఆవిష్కరించిన సౌందర్యోపాసన, వారి ఆలోచనా సరళిలో జీవన విధానం, వారి కల్పనలలో దైవశక్తి పాత్ర మరియు వారు వర్ణించిన కల్పనల, గాథల ప్రాధాన్యత మొదలైన విషయాలు పరిశోధకులకు, విమర్శకులకు అత్యంత మనోహరంగా భాసించి వారి ఆసక్తిని పెంచుతాయి. ఋగ్వేదములో వున్న వేదాంతతత్వాలు దీని ప్రాధాన్యతను పెంచుతాయి. ఈ విషయాన్నే బ్లూమ్‌పీల్డు మహాశయుడు ఈ విధంగా పేర్కొన్నారు. "The paramount importance of Rgveda is as philosophy. Its mythology represents a clearer even if not always chronologically earlier stage of thought and religious development than is to be found in any parallel literature" ఋగ్వేదము ఆర్యులకు సంబంధించిన అతి ప్రాచీన సాహిత్యము. తులనాత్మక భాషా శాస్త్ర విషయంలో ప్రాక్ పశ్చిమ భాషా సాహిత్యాలకు సామాన్య వారధిగా ఉపకరిస్తుంది. ఋగ్వేదంలో కల అద్భుతమైన అపురూపమైన సూక్తాలు చూచి వాగ్దేవి సగర్వంగా పొంగిపోతుంది. ఇందులో గల అగ్ని, సవితృస్తోత్రాలు నవ్యమై, సౌందర్యభరితమై సహృదయుల మనస్సులను పులకింపజేస్తాయి. ఋగ్వేదం ప్రతిపాదించే దార్శనికత ఆచరణాత్మకమై సర్వులను ఆకర్షింపజేస్తుంది. ఇచ్చిపుచ్చుకోవడమే (give and take) దీని యొక్క కీలకతత్వం. ఇది ఆర్యులకు చెందిన అతి ప్రాచీన గ్రంథం. మానవాళి చరిత్రకు, ఆదిమానవుని మతపరమైన భావాలకు ప్రాచుర్యం కల్పించడంలో ఇది నిర్వహించిన పాత్ర అమోఘం. ప్రపంచ సాహిత్యాన్ని విస్తృతంగా పెంచిపోషించడంలో అపురూపమైన పాత్రను నిర్వహించింది. కైగి (Kaegi) మహాశయుని మాటల్లో ఇందులో అమూల్యమైన విషయాలెన్నో నిక్షిప్తమైయునవి. "The gold is largely hidden under a mass of dross". ఋగ్వేద ప్రాధాన్యతను విట్నీ మహాశయుడు చక్కగా పేర్కొన్నారు. "If contains the germ of the whole after

development of Indian Religion and Poetry. It is respected by students or humanity because of its remote antiquity, its unique character and the light it sheds upon the evolution of mankind especially in India."

ఋగ్వేద మంత్రాలను బోధించువారు, అధ్యయనం చేసేవారు ఈ మంత్రాలను ప్రతిపాదించిన ఋషులను, వాటి ఛంధస్సును, అవి ఏ దేవతనుద్దేశించి చెప్పబడ్డాయో తెలుసుకోవాలి. అలా చేయనట్లయితే వారికి పాపము కలగుతుంది. వారికి స్వరం, ఉచ్చారణ పరిజ్ఞానము తప్పనిసరిగా ఉండితీరాలి. అలా కాని పక్షంలో దుష్టఫలితాలను పొందుతారు.

"ఋషిచ్ఛందో దేవతాని బ్రాహ్మణార్థం స్వరాద్యపి।
అవిదిత్వాప్రయుం జానోమంత్రకంటక ఉచ్యతే॥
స్వరోవర్ణోక్షరం మాత్రా వినియోగార్థమేవచ।
ఆవిదిత్వాప్రయుంజానో వినిపాతః పదేపదే॥

**ఋగ్వేద నిర్మాణం :** (Arrangement) :

ఋగ్వేదం ఎనిమిది అష్టకాలుగా, ప్రతి అష్టకము అధ్యాయవర్గంగా, ఈ అధ్యాయాలు మంత్రక్రమంగాను విభజింపబడ్డాయి. ఇది మొదటి విభాగం. రెండవ విభాగంలో ఋగ్వేదం పదిమండలాలుగ, ఈ మండలాలు అనువాకాలుగ, ఈ అనువాకాలు సూక్తాలుగ, సూక్తాలు మంత్రాలుగను విభజింపబడ్డాయి. ఈ రెండు విభాగాలను పరిశీలించినట్లయితే మండల విభాగము ప్రాచీనమని శాస్త్రీయమని మనకు తెలుస్తుంది. మొత్తం మీద ఇందులో 1017 సూక్తాలు ఉన్నాయి. ఎనిమిదవ మండలములో ఉన్న పదకొండు వాలఖిల్య సూక్తాలు చేర్చినట్లయితే ఈ సంఖ్య 1028 కు చేరుతుంది. శౌనకమహర్షి ప్రకారం 10580 మంత్రాలు, 1,53,826 పదాలు, 4,32,000 అక్షరాలు ఋగ్వేదంలో వున్నాయి. ఈ మంత్రాలు పదునాల్గు ఛంధస్సులో వ్రాయబడ్డాయి. పాశ్చాత్య పండితులు రెండవ మండలము నుండి ఏడవ మండలమే ఋగ్వేద మూలగ్రంథమని, ఇవి కుటుంబ గ్రంథాలని పిలువబడుతున్నవని చెప్పారు. దీనికి కారణం ఈ ఏడు మండలాల్లోను పరస్పర సాదృశ్యం ఎక్కువగా కలిగివుండడమే. తక్కిన మండలాలు కాలక్రమంలో చేర్చబడ్డాయని వీరి అభిప్రాయం. మరి కొందరు పండితులు ఎనిమిది మండలాలే మూలగ్రంథమని, తొమ్మిదవ మండలము తర్వాత చేర్చినారని వాదించారు. దశమ మండలం ఆధునిక కాలంలో చేర్చబడినదని వీరి అభిప్రాయం.

**ఋగ్వేదకాలం :**

ఋగ్వేదకాలం గూర్చి అనేక అభిప్రాయాలు వున్నాయి. మ్యాక్సిముల్లర్ మహాశయుడు ఋగ్వేద సంహితకారాన్ని క్రీ.పూ. 1200 నిర్ణయించాడు. బుద్ధుని నిర్యాణము క్రీ.పూ. 483 ఉపనిషత్తులు అంతకు ముందే వెలశాయి. వాటి కాలం క్రీ.పూ. 800 నుండి 600 దాక ఉండవచ్చుని, మంత్ర కాలము ముందే కాబట్టి క్రీ.పూ. 1000 అని, ఛంధస్ కాలం క్రీ.పూ. 1200 అని, ఈ విధంగా ఋగ్వేదకాలం క్రీ.పూ. 1200 గా ప్రతిపాదిస్తూ దీనినే ఋగ్వేదకాలంగా నిర్ణయించారు. విట్నీ మరియు కైగి మహాశయులు కూడ క్రీ.పూ. 1400 నుండి 1200 దీని కాలం అని వాదించారు. పై వాదాలన్నీ ఋగ్వేదములో గల భాషావిశేషాల మీద (Linguistic data) ఆధారపడ్డవే. జాకోబీ పండితుడు ఋగ్వేదంలో గల ఖగోళ శాస్త్రాంశాలను ఆధారంగా చేసుకొని దీనికాలం క్రీ.పూ. 4000 లని వాదించాడు. బాలగంగాధర తిలక్ ఋగ్వేదం ఎలా చూచినా క్రీ.పూ. 600 కి పూర్వమేనని చెప్పాడు. సంప్రదాయవాదులు ఋగ్వేదం, ఇతర వేదాలు సృష్టితోనే లోకంలో ఉద్భవించాయని చెప్పారు. ఏదిఏమైనా ఋగ్వేదకాలాన్ని ఖచ్చితంగా నిర్ణయించడం కష్టం. ఎందుకంటే చరిత్ర కన్నా, చారిత్రక స్పృహ కన్నా ముందే ఋగ్వేదం రూపుదిద్దుకోవడం వల్ల (Prehistoric).

**ఋగ్వేదమతం :**

ఋగ్వేద కాలంనాటి ఆర్యుల మతాన్ని ఆధునిక హిందూమతంతో పోల్చినట్లయితే ఎన్నో తేడాలు కనబడుతాయి. కాని ప్రస్తుత హిందూతత్వ మౌలికాంశాలు వేదాల మీదనే ఆధారపడి వున్నాయి. గోవధ నిషేధం, పంది మాంస వ్యతిరేకత మొదలైన ఆధునిక హిందూతత్వములోని మూలధర్మాలు వైదిక కాలంలో వున్న భావాలే. ఋగ్వేదం ప్రతిపాదించిన మతంలో ఏకదేవతారాధన ఉండేదో లేక బహుదేవతారాధన ఉండేదో తేల్చి చెప్పడం కష్టం. ఇంద్ర, వాయువు, వరుణుడు, అగ్ని మొదలైన దేవతలను ప్రార్థించడం వల్ల ఋగ్వేదాలలో బహుదేవతారాధన ఉందని మొదట మనకు స్ఫురిస్తుంది. కాని అగ్ని, యమ, మాతరిశ్వ మొదలైన భిన్న దేవతలు ఒక దేవత యొక్క అంశాలని "ఏకం సత్ విప్రాః బహుధా వదన్త్యగ్నిం యమం మాతరిశ్వానమాహుః" ఋ.వే. I - 164 సూక్తము చెప్తూ వుంది. కాని ఇలాంటి సూక్తాలు కొన్ని మాత్రమే వున్నందువల్ల ఋగ్వేదం లో బహుదేవతారాధన ప్రతిపాదింపబడిందని ఎక్కువమంది పండితుల అభిప్రాయం. మాక్సిముల్లర్ మహాశయుడు ఈ విషయాన్ని గురించి విపులంగా చర్చించాడు. అయితే అందరికి ఆమోదయోగ్యమైన ప్రతిపాదనను ఇంతవరకు ఆవిష్కరించలేదు. ఋగ్వేదం విశ్వదేవ వాదాన్ని ప్రతిపాదిస్తుందని భారతీయ పండితులు అభిప్రాయపడ్డారు.

**ఋగ్వేద సంరక్షణ :**

గురుశిష్య పరంపర ద్వారా మౌఖికముగ ఋగ్వేదము అవిచ్ఛిన్నంగా తరతరాలుగా కొనసాగింది. దీనిని పఠించే విద్యార్థి స్వర, ఉచ్ఛారణ దోషాలు లేకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవడం వల్ల, విదేశీ ప్రభావం ఏమాత్రం దీని మీద పడలేదు. ఋగ్వేదం క్రమబద్ధంగా మౌఖిక సంప్రదాయంలో కొనసాగినప్పటికి ఎలాంటి మార్పులు లేశమాత్రంగా కూడ చోటు చేసుకోకపోవడం గమనార్హం. అందువల్లనే వేదానికి శ్రుతి అని మరో పేరు. ప్రాచీన కాలం నుండి, సంహితపాఠము, పదపాఠము, క్రమపాఠము, జటాపాఠము, ఘనపాఠము, మాలా పాఠము, లేఖా పాఠము, శిఖా పాఠము, ధ్వజ పాఠం మొదలైన బహువిధాల పాఠంలలో ఋగ్వేదం ఎటువంటి మార్పు, దోషము లేక అవిచ్ఛిన్నంగా కొనసాగుతూ వుంది.

**విద్యాభ్యాసం :**

ప్రాచీన కాలపు భారతీయ విద్యావ్యవస్థ చతుర్విధ పురుషార్థ సిద్ధి కోసం చక్కగా రూపకల్పన చేయబడింది. బాలబాలికలను, పరిపూర్ణ వ్యక్తిత్వం గల పౌరులుగా తీర్చిదిద్దడమే దీని పరమ ప్రయోజనంగా ఉద్దేశింపబడినది. వ్యక్తి చక్కగా శిక్షణ పొంది ధర్మార్థ కామాలనే త్రివర్గాన్ని చక్కగా అవగాహన చేసుకొని మోక్షాన్ని పొందేందుకు సమర్థులుగా తయారు చేయడమే ఈ విద్య అంతిమ లక్ష్యం. ధర్మం పరబ్రహ్మతత్వం విద్యాభ్యాసములలోని ముఖ్యాంశాలు. కాబట్టి విద్యార్థికి పరమసత్యం, ఋతాల స్వరూపం, వాటిలోని రహస్యాలను పరిశీలించడం, ధర్మ మార్గములోని వివిధ కోణాలను పరిశోధించి వారిని తయారుచేయడం జరుగుతుంది. ఈవిధంగా విద్యార్థి తన వ్యక్తిత్వాన్ని పూర్తిగా వికసింపజేసుకొని పరమార్థతత్వం మీద దృష్టి కేంద్రీకరించేందుకు వారిని సన్నద్ధులుగా చేస్తుంది. పై లక్షణాలు సాధించేందుకు సంపూర్ణమైన అర్హతలు కలవారుగా తీర్చిదిద్దడమే నాటి విద్య ముఖ్యోద్దేశం. భౌతికంగా, నైతికంగా, బుద్ధి కుశలత ప్రధానంగా, మతానికి సంబంధించి, ఆధ్మాత్మికంగా వ్యక్తులు అన్ని విధాలా రాణించేందుకు విద్య సాధనంగా చెప్పబడింది. జ్ఞానం సత్యానుభవంతో కూడుకొని, జీవిత గమ్యాన్ని నిర్దేశించి, ఆలోచనల్లో, మాటల్లో, చేతల్లో ప్రతిబింబించాలి. గ్రంథాలు కంఠస్థం చేయడం కంటే, పసలేని చర్చల కంటే ఆత్మావబోధ లేక పరబ్రహ్మ తత్వావబోధే ముఖ్యం అని ఋగ్వేదం ప్రతిపాదించింది. (ఋ.వే. I - 164 మరియు X - 71, 4). విద్యార్థులు మంత్రోచ్ఛారణ చేసినంత మాత్రాన (మంత్ర విత్) సరిపోదని వారు పరబ్రహ్మతత్వ జ్ఞాన సంపన్నులుగా (ఆత్మ విత్) రూపొందాలని భావించారు. జ్ఞాన సముపార్జనకు తపోమార్గమే గొప్పదని ఋగ్వేదం తెలియజేసింది. ప్రశంసించింది. ఎవరైనా

ఋషిగా, మునిగా, విప్రుడుగా, మేథావిగా భావించబడాలంటే అతను తప్పక దృఢ సంయమన మార్గం ద్వారా సర్వోత్కృష్ట జ్ఞానం పొందాలి. (ఋ.వే. X - 109, 4, 136,2 మరియు 190 -1). జ్ఞాన సముపార్జనకు ఇంద్రియ జయం, సంయమనము ఉత్తమ మార్గాలని ఋగ్వేదం ప్రతిపాదించింది. విద్య లక్ష్యం అజ్ఞాన నాశనం, శీల నిర్మాణం శీలమే ప్రతి వ్యక్తికి గొప్ప ధర్మం. విద్యావంతుడు విచక్షణ గుణాన్ని మంచి చెడులను విడమరచి ధర్మపథాన్ని ఆశ్రయించాలి. ఋగ్వేద ఋషులు విద్య యొక్క అమూల్య విలువను గుర్తించారు. జ్ఞానమే సర్వసుఖాలకు ఆధారమని తద్వారా మోక్షం పొందవచ్చని విశ్వశించారు. జ్ఞానం కంటే ఉత్కృష్టమైంది ఈ లోకంలో ఏదీలేదని ఋగ్వేద ఋషుల తలంపు. జ్ఞానరహితుడు పశువుతో సమానమని వారు భావించారు. అందువల్లే జ్ఞాన పాండిత్యాలకు దివ్యత్వాన్ని ఆపాదించారు. పాండిత్యాన్ని, పండితులను భక్తిభావంతో ఆనాటివారు ఆరాధించేవారు. జ్ఞానాన్ని బ్రహ్మంగా, గురువును పరబ్రహ్మంగా మరియు సంపూర్ణ జ్ఞాన ప్రదాత్రిగా సరస్వతిని దైవంగా భావించి ఆరాధించేవారు. విద్యాలయాలను దేవాలయాలుగా భావించి, వాటిని నిర్మించడం, విద్యార్థులను దేవాలయాలుగా భావించి, వాటిని నిర్మించడం, విద్యార్థులను పోషించడం, పాండిత్యాన్ని ఆరాధించడం, ఎలాంటి రుసుం లేకుండా విద్యాబోధన చెయ్యడం పవిత్రకార్యాలుగా గృహస్థులు నిర్వహించేవారు. విద్యార్థి పరమోత్కృష్టమైన జ్ఞాన సముపార్జన కోసం బ్రహ్మచారిగా ఉండేవాడు.

### ప్రాచీన విద్యాలయాలు :

ఋగ్వేద కాలంలో మొట్టమొదటి విద్యాలయం గృహమే. తల్లి గాని, తండ్రిగాని పిల్లల విద్యాభ్యాస ప్రాథమిక దశలో అక్షరాలను, లెక్కలను బోధించేవారు. చదవటానికి, వ్రాయటానికి నేర్పేవారు. ఈవిధంగా వారికి ఉచ్చారణ, జ్ఞాపకశక్తి వారిలో కలిగించేవారు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్గాల్లో తండ్రి కుమారుడికి స్వయంగా ఉపనయనం చేసి గాయత్రీ మంత్రాన్ని ఉపదేశించేవాడు. తల్లిదండ్రులు తమ సంతానానికి చక్కని శిక్షణ యివ్వడంలోను, మంచి విద్యను నేర్పడంలోను తపన కనబరచేవారు. ఈ ఉద్దేశంతో ప్రముఖ గురువుల దగ్గరికి తమ పిల్లలను పంపి వారికి విశేష శాస్త్ర జ్ఞానము బోధింపజేసేవారు. విద్యార్థులు తమ గృహంలోనే మతపరమైన ఆచారాలు, కర్మకాండకు సంబంధించిన విధులు, వారి వారి వృత్తులకు సంబంధించిన మెళుకువలు తెలుసుకొనేవారు.

### గురు కుల విధానం :

ఋగ్వేద కాలంలో గురుకులాలు గురువు నివాసాలే. అవి విద్య, సాంస్కృతిక కేంద్రాలుగా విరాజిల్లాయి. విద్యార్థులకు బోధన, శిక్షణ ఇక్కడ యిచ్చేవారు. ఈవిధంగా ప్రాచీన కాలంలో గురుకులాలు శాస్త్రాలను, వేదాధ్యయనాన్ని, విశేష జ్ఞానాన్ని చక్కగా బోధించాయి. అవి సంఘంలో ప్రముఖ స్థానాన్ని పొందాయి. కాలక్రమంలో ఈ గురు కులాలే అగ్రహారాలుగా, పాఠశాలలుగా, మఠాలుగా రూపొందాయని చెప్పవచ్చు. గురుకుల విధానంలో ముఖ్యమైన అంశం సాంఘీక జీవనం. గురువు ఒక పర్ణశాలలో తన కుటుంబ సభ్యులతో నివశిస్తూ విద్యార్థులను కూడా తన కుటుంబ సభ్యులుగా చేర్చుకొని వారికి ఎటువంటి రుసుం లేకుండా, నివాసం, భోజనం, వైద్యం, విద్య మొదలైన వసతులు కల్పించేవాడు. విద్యార్థి గృహ, మత, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేవాడు. అతనికి నీతి, ఆధ్యాత్మిక విషయాల్లో మంచి శిక్షణ యిచ్చి అతని వ్యక్తిత్వ వికాసానికి అవకాశాన్ని కల్పించేవారు. తన ప్రవర్తన, గుణగణాల విషయాల్లో సంతృప్తి కలిగిస్తే ఉన్నత విద్యాభ్యాసానికి ప్రోత్సహించేవారు.

ఈ గురుకులాలు నది లేక చెరువు గట్టున వుండి ప్రశాంత వాతావరణంతో భాసిల్లేవి. విద్యార్థికి పక్కనున్న వృక్షాలు, పుష్పాలు, పక్షులు, జంతువులకు సంబంధించిన ప్రత్యక్ష జ్ఞానం వారికి లభించేది. ఇక్కడ బాలబాలికలు చక్కగా కలిసి పాడడం, వేదాధ్యయనం చేయడం వాగ్వివాదాల లోపాల్గొనడం మొదలైన పనులు చేసేవారు. రాజు పిల్లలైనా, ధనికుల పిల్లలైనా గురుకులంలో దైనందిన కార్యక్రమాలైన పారాయణం మొదలైన వాటిల్లో పాల్గొని తీరాల్సిందే. ఇందువల్ల వారిలో సహజీవనం,

కలుపుగోలుతనం లాంటి విలువలు కలుగుతాయి. ఈవిధంగా గురుకులాశ్రమాలు సాంస్కృతిక, ఆధ్యాత్మిక విద్యాకేంద్రాలుగా విలసిల్లినాయి. గురువు కూడ క్రమశిక్షణతో నడుచుకొని తన శిష్యుల్లో క్రమశిక్షణ నెలకొల్పేవాడు. గురుకులంలో వున్నంతకాలం తప్పనిసరిగా బ్రహ్మచర్య జీవితం గడపాల్సిందే. నియమబద్ధ జీవితం గడపడం వల్ల ధర్మాచరణపై అతనికి ఎక్కువ ఆసక్తి కలుగుతుంది. ఋగ్వేదం నాటి విద్యావిధానాన్ని పరిశీలిస్తే స్త్రీలకు విద్యావకాశాలున్నాయి.

ఈ కాలంలో మతపరమైన విద్యలకు ఎక్కువ ప్రాధాన్యత యివ్వబడింది. విద్యార్థులు వేదాల పఠనం కావించేవారు. ఎన్నో శాస్త్ర గ్రంథాలను కంఠస్థం చేసేవారు. ఆత్మవిద్యకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడేది. సంగీతం, నృత్యం మొదలైన కళల్లో స్త్రీలకు మంచి ప్రోత్సాహం ఉండేది.

**కుటుంబ జీవనం :**

ఋగ్వేదంలో ప్రతిబింబించిన సాంఘీక జీవనం, నిరాడంబరంగ, పవిత్రంగా గోచరిస్తుంది. ఆర్యులు గ్రామాల్లో నిర్మలనియమబద్ధ జీవితం గడిపారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అందులో కనిపిస్తుంది. కుటుంబంలో తండ్రి లేక వయస్సులో పెద్దయిన పురుషుడు కుటుంబపెద్దగా వ్యవహరిస్తాడు. అతనికి కుటుంబం మీద సర్వాధికారము, నియంత్రణ ఉంటాయి. అతనిని గృహ్యపతి అనేవారు. ఇంటి పెద్ద చనిపోతే అతని పెద్ద కుమారుడికి అతని స్థానం సంక్రమిస్తుంది. మతపరమైన ఉత్సవాలన్నిటిని నిర్వహించడం, దానాలు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి వేదమంత్రోచ్ఛారణ చేయడం మొదలైనవి అతని కర్తవ్యాలు. తండ్రికి తన సంతానము మీద సర్వాధికారము వుండేది. జూదమాడిన కుమారుణ్ణి తండ్రి పూర్తిగా గ్రుడ్డివాణ్ణి చేసినట్టు ఋగ్వేదంలో ఆధారాలు కనిపిస్తున్నాయి. అతడు తన సంతాన వివాహంలో ప్రముఖపాత్ర నిర్వహిస్తాడు. ఆస్తికి అతనే హక్కుదారు. పశువులు, గుఱ్ఱాలు మరియు బంగారం మొదలైన వాటి మీద వ్యక్తిగత హక్కులు గుర్తించబడేవి. దత్తత హక్కులు అంగీకరింపబడ్డాయి. భర్త, భార్య, తల్లిదండ్రులు, సోదరులు, సోదరీమణులు, కుమారులు, కుమార్తెలు మొదలైనవాళ్లు ఆనాటి కుటుంబ సభ్యులు. ఈవిధంగా ఋగ్వేద కాలంలో ఉమ్మడి కుటుంబవ్యవస్థ ప్రోత్సాహకరంగా ఉండేది. కుటుంబసభ్యుల మధ్య సుహృద్భావం, పరస్పర సహకారం, సర్దుబాటు ధోరణి ఉండేవి. అతిథులను చక్కగా గౌరవించడం, అతిథి మర్యాదలు చేయడం మనకు కనిపిస్తుంది. పెద్దలను గౌరవించడం చిన్నవారి బాధ్యతగా భావించబడేది. కుటుంబ పెద్దే తక్కిన కుటుంబ సభ్యుల ఆహారం, వస్త్ర, విద్య, వైద్య సదుపాయాలు చూచుకొనేవాడు. మతపరమైన విధులు, క్రమశిక్షణ నేర్పడం, వ్యక్తిత్వ నిర్మాణం ఆయన బాధ్యతలు. ఆయన పాత్ర ప్రముఖంగా ఉంటుంది. కుటుంబ యజమాని కుటుంబ సభ్యుల మధ్య పరస్పర విశ్వాసం, సమన్వయం ఉండవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పేవాడు. ఋగ్వేదంలోని అనేక సూక్తాలు ఈ విషయాన్ని స్పష్టపరుస్తాయి. "ఇల్లాలే ఇల్లు, ఆమె ఒడే నిజమైన విశ్రామస్థానం (ఋ.వే. - 53,4) శుభకరమైన భార్యే సర్వ సౌభాగ్యాలకు మూలం (ఋ.వే. III - 53,6) ఓ అగ్నీ తండ్రికి కుమారుడు ఎలా అందుబాటులో వుంటాడో, ఆవిధంగా మాకు సులభంగా అందుబాటులో వుండు'' (ఋ.వే. I - 1,9)''. ఈవిధంగా కుటుంబ జీవనమే సహజీవనానికి, సమాజ స్థిరత్వానికి ప్రాతిపదిక. కుటుంబ సభ్యుల సంఖ్యలో పరిమితి ఏమీ లేదు. ఈ సుహృద్భావాన్ని, సమాజానికి, ప్రపంచానికి విస్తరించినా ఎలాంటి అభ్యంతమూ లేదు. ఋగ్వేదం వసుధైక కుటుంబకమ్ అనే ఉదాత్త భావాన్ని ప్రతిపాదించింది. ఈ కుటుంబ జీవనమే వారి మధ్య సఖ్యతను ఏర్పరచి కొన్ని నిర్దేశించిన సామాన్య లక్ష్యాల వైపు పురోగమించేందుకు దోహదం చేసింది. వారిలోని స్వార్థ సేవాభావం, కొంతవరకు త్యాగబుద్ధి, సుఖ సంతోషాలల్లో పాలుపంచుకోవడం లాంటి విలువలను పెంపొందించింది. భారతీయ సంస్కృతిలో మూలధర్మాలైన సర్వజన ప్రేమ, సమాజ స్థిరీకరణ, సహనం, సమాజాభివృద్ధికై ప్రయత్నం, ఆర్తులను ఆదుకోవడం లాంటి వాటిని ప్రోత్సహించింది. అనేక వృత్తులవారు కలిసి పనిచేయడం ఆవశ్యకమైంది. అలా చేయడంవల్లనే వారి సర్వతోముఖాభివృద్ధి, సంరక్షణ, సమాజాభివృద్ధి కలుగుతాయనే గట్టి నమ్మకం వారిలో ఏర్పడింది. అలా సహఋషివనం

సాగించినప్పుడే వారు తమ మతపరమైన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి ఆధ్యాత్మిక శిఖరాలు చేరుకోగలరనే విశ్వాసం వారిలో కలిగింది.

## వర్ణాశ్రమ వ్యవస్థ :

ఋగ్వేదములోని దశమ మండలములో గల పురుష సూక్తం నాలుగు కులాలను ప్రస్తావించింది. పురుష సూక్తానుసారం, బలి ఇవ్వబడిన పురుషుని ముఖం నుండి బ్రాహ్మణులు, బాహువుల నుండి రాజులు, తొడలనుండి వైశ్యులు, పాదముల నుండి శూద్రులు జన్మించారు.

ఋగ్వేదంలో కఠినమైన కుల వ్యవస్థ లేదు. మొదటి మూడు కులాల మధ్య వర్ణాంతర వివాహాలు, వృత్తుల మార్పిడి ఉన్నట్లు తెలుస్తుంది. బ్రాహ్మణులు అధ్యయనం, అధ్యాపనం, పౌరోహిత్యం నిర్వహించేవారు. క్షత్రియులు యుద్ధాలు, ప్రజాసంరక్షణ, మొదలైన విధులు క్షత్రియుల బాధ్యతలు. వైశ్యులు వ్యవసాయం, వ్యాపారం చేసేవారు. ఈ కులవిభజన వంశానుక్రమం కాదు. అగస్త్య మహాముని విదర్భ రాజకుమార్తె లోపాముద్రను వివాహం చేసుకొన్నాడు. శుక్రమహర్షి కుమార్తె దేవయాని క్షత్రియుడైన యయాతిని పెళ్లాడింది. ఈ ఆధారాలను బట్టి ఋగ్వేద కాలంలో కులవ్యవస్థ అంత కఠినంగా లేదనిపిస్తుంది. కులవ్యవస్థ కాలక్రమంలో పటిష్టమైన అవాంఛనీయస్థితికి చేరుకుంది.

## ఋగ్వేదంలో జీవన విధానం :

ఆర్యులు స్థిరనివాసం ఏర్పాటుచేసుకొని కట్టెలతో, తాటాకులతో పర్ణశాలలు నిర్మించుకొనేవారు. వారు ఎక్కువగా వ్యవసాయంపై ఆధారపడి జీవించారు. గోధుమలు, వరి, ప్రత్తి, నూనె గింజలు పండించేవారు. ఎద్దుల సహాయంతో వ్యవసాయం చేసేవారు. నేలను దున్నేవారు, నాగలిని ఎద్దులు లాగేవి. పంటలను కోసేందుకు కొడవళ్ళు ఉపయోగించేవారు. రైతులు వర్షము మీదనే ఆధారపడేవారు. నీటిపారుదల కూడా వారికి తెలుసు. నీటిపారుదల కోసం వారు బావులను, నదులను, చెరువులను ఉపయోగించేవారు. వ్యవసాయం తర్వాత పశుపోషణ మీద ఎక్కువగా ఆధారపడేవారు. వారి సంపద, అభివృద్ధి వారు పెంచే పశువుల సంఖ్య మీద ఆధారపడి వుండేది. వారు పోషించే పశుగణంలో ఆవులు, గుఱ్ఱాలు, మేకలు, గొర్రెలు, గాడిదలు మొదలైనవి ఉండేవి. ఆవులను అమూల్యమైనవిగా భావించేవారు మరియు వీటిని వినిమయ వస్తువులుగా ఉపయోగించేవారు. ఆవులను పెంచే గ్రామాల వర్ణన ఋగ్వేదంలో అనేకచోట్ల కనిపిస్తుంది. మంగలి, కంసలి, కుమ్మరి, కమ్మరి, వడ్రంగి మొదలైన వృత్తిపనివారు కూడా ఆ సంఘంలో ఉండేవారు. ఏ పనిచేసినా వృత్తి గౌరవము ఉండేది. ఏ వృత్తిని కించపరచేవారుకారు. ఋగ్వేదకాలంనాటి ప్రజలు వేటను జీవనాధారంగా చేసుకొని బ్రతికేవారు.

## 2.2 స్త్రీల స్థితిగతులు :

ఋగ్వేదకాలంలో స్త్రీలకు గౌరవప్రదమైన స్థానం ఉండేది. వారికి పురుషులతో సమాన స్థానం ఇవ్వబడింది. మతపరమైన యజ్ఞయాగాదులలో వారు పాలుపంచుకోకపోతే వాటిని అసంపూర్ణంగా భావించేవారు. వారు చాలా స్వేచ్ఛాయుత జీవితం గడిపేవారు. పురుషులతో సమానంగా విద్యనభ్యసించేవారు. సభల్లో, వాగ్వివాదాల్లో పాల్గొనేవారు. ఋగ్వేదకాలంలో విద్యలో ప్రావీణ్యం పొంది సమున్నతమైన స్థానం పొందిన స్త్రీలు ఎందరో ఉన్నారు. లోపాముద్ర, విశ్వవర, గార్గి, మైత్రేయి, ఘోష, ఉత్పల మొదలైనవారు ఈ కోవకు చెందుతారు. అనేకమంది స్త్రీలు, సూక్తాలు, కవిత్వము రచించి సాహిత్య జగత్తులో కూడ ప్రముఖ స్థానం పొందారు. స్త్రీలు నృత్యం, సంగీతం నేర్చుకొనేవారు.

ఋగ్వేద ఋషులు స్త్రీలను పురుషులకు విడదీయరాని మిత్రులని అభివర్ణించారు. వారు సర్వశుభాలు కలిగించేవారుగా భావింపబడేవారు. పరబ్రహ్మను కూడ సగం పురుషుడుగా, సగం స్త్రీగా వర్ణించడం కనిపిస్తుంది. (త్వం స్త్రీ, త్వం పుమాన్'. స్త్రీ పురుషుల మధ్య శాశ్వత మిత్రత్వం అనివార్యం అని చెప్పబడింది. వారి మధ్య ఉండే శాశ్వత సఖ్యత, సంఘీభావం మంత్ర బ్రాహ్మణంలో చక్కగా వర్ణించబడింది.

"నువ్వు ఏడడుగులు నాతో నడిచి నాకు స్నేహితురాలుగా ఉండు
ఏ జంట ఏడడుగులు కలసి నడుస్తారో వారు స్నేహితులవుతారు!
నేను నీ స్నేహాన్ని సర్వదా పొందుతానుగాక!
నేను నీ స్నేహం నుండి దూరము కాకుండునుగాక!
మనమిద్దరం కలిసిపోదాం! ప్రేమే మనల్ని బంధించుగాక !
అలా అని నిర్ణయం చేద్దాం!
ఒకరి స్నేహంలో మరొకరు ప్రకాశిస్తూ సర్వసుఖ
సంతోషాల్లో పాలుపంచుకొంటూ!
మన భావాలను, విధులను, ఆశయాలను ఐక్యం చేద్దాం!"

### దుహితగా స్త్రీ పరిస్థితి :

ఆర్యుల గృహస్థ జీవితంలో ఆడపిల్లలు మగపిల్లలు వున్నారు. ఇద్దరిని తల్లిదండ్రులు ప్రేమానురాగాలతో పెంచి పెద్దచేసినట్లు కనిపిస్తోంది. అబ్బాయి ఎక్కువ అనిగానీ, అమ్మాయి తక్కువ అనిగాని ఎక్కడా తేడా కనిపించదు. అలా అని అమ్మాయి కావాలని కోరుకొన్న సందర్భాలు ఎక్కడా లేవు. పుత్రులు లేనప్పుడు పుత్రిక ద్వారా ఆమె గర్భాన పుట్టిన పుత్రునకు స్థానం కల్పించేవారు. ఋగ్వేదానికి చెందిన ఐతరేయ బ్రాహ్మణంలో ఒక ప్రాచీన గాథ వుంది. అందులో పుత్రిక ఒక అనర్థం (కృపణం) అని పేర్కొనబడింది. ఋగ్వేదకాలంలో ఆడబిడ్డలను అత్యంత ప్రేమాభిమానాలతో పెంచినట్లు అతి జాగరూకతతో తల్లిదండ్రులు పోషించినట్లు అనేక సందర్భాలు స్పష్టపరుస్తున్నాయి. తల్లి ఆడబిడ్డను పెంచటం తన కర్తవ్యంగా భావించేది. తండ్రి, సోదరుడు ఆమెకు ఎంతో రక్షణ కల్పించేవాడు. ఎదిగిన ఆడపిల్లలకు ఆవుపాలు పితకడం ముఖ్యమైన పని. బిడ్డను కనిపెంచే బాధ్యత ఆమెది కనుక చిన్నప్పటి నుంచే ఆవును పెంచటం, పితకటం లాంటి పనులు ఆమెకు అప్పగించడం జరిగేది. తల్లిదండ్రులకేగాక 'దుహితపై' సోదరునికి కొంత అధికారం వుండేది. తండ్రి తర్వాత కుటుంబ భారాన్ని వహించాల్సినవాడు కాబట్టి, అన్న తన సోదరి బాగోగులు పట్టించుకొనేవాడు. రక్షణ కూడా కల్పించేవాడు.

### వివాహ వయస్సు :

సూర్యాసోమల వివాహ వర్ణనను బట్టి (ఋ.వే. I - 85) ఋగ్వేద కాలంలో యుక్తవయస్సు వచ్చినవారికే వివాహం సామాన్యంగా జరిగేదని మనకు తెలుస్తుంది. మరొక ఋగ్వేద సూక్తంలో కుమార్తె వివాహము కాక చాలారోజులు తండ్రి ఇంటి వద్దనేవున్నట్లు, ఆ తర్వాత చాలా కాలానికి వివాహమయినట్లు విశదమవుతుంది. (ఋ.వే. ( - 117,7). మరొక సూక్తములోని ( - 85) నీలలోహిత శబ్దము కూడ స్త్రీకి యుక్తవయస్సు వచ్చిందని, వివాహానికి తగినదని స్పష్టపరుస్తుంది. ఈ అన్ని ఆధారాలు ఒకే విషయాన్ని తేటతెల్లం చేస్తాయి. యౌవనదశంలోనే స్త్రీలకు వివాహాలు జరిగేవి. బాల్య వివాహాలు అరుదు. చాలామటుకు తల్లిదండ్రులే వివాహం ఏర్పాటుచేసేవారు. అమ్మాయిలకు తమ భర్తలను ఎన్నుకోవడంలో పరిమిత స్వేచ్ఛ వుండేది. ఇద్దరి అంగీకారంతోనే జరగడం వల్ల స్వయంవరం వివాహాలకు ఆడంబరము, కాంతి ఎక్కువగా ఉండేది.

## వివాహవ్యవస్థ :

వివాహబంధం పవిత్రమైందిగాను, జీవితంలో ఒక ముఖ్య సంఘటనగాను పరిగణించబడేది. వివాహ వ్యవస్థ ఋగ్వేదకాలంలోనే ఎంతో అభివృద్ధి చెందింది. వివాహం పరస్పర కామ సంతృప్తికేకాక, గృహాన్ని ఆనందమయం చేసుకోవడానికి, మతపరమైన బాధ్యత నిర్వహించడానికి సంతానార్థము మరియు సాంస్కృతిక వారసత్వానికి ఉద్దేశింపబడినది. అన్ని కార్యాల్లో నేర్పుకలవాడు (కర్మణ్య), గృహ కార్యాల్లో నిష్ణాతుడు (సదన్య), యాగాలు నిర్వహించేవాడు (విదథ్య), పండితుల సభల్లో రాణించి సముచిత స్థానం పొందేవాడు (సభేయ), కుటుంబ గౌరవమును పెంచేవాడు (పితృశ్రవణ), అయిన కుమారుణ్ణి కనడమే వివాహ లక్ష్యం. (ఋ.వే. I - 91, 20 మరియు III - 4 - 9). ఋగ్వేదములోని అనేక సూక్తాలు (ఋ.వే. VIII - 31,5,9) వివాహమైన దంపతులకు సకల సంతోషాలు కలిగించాలని ఆకాంక్షిస్తాయి. ఇవి యువ దంపతులను వారి మధ్య పరస్పర ప్రేమ, విశ్వాసం అలవర్చుకోమని కోరతాయి. ఈ గుణాలే గృహంలో చక్కటి సంఘీభావాన్నీ, సమన్వయాన్ని కలిగించి, సంఘంతో మరియు దేశంలో ఐక్యతను పెంపొందిస్తాయి. వివాహం జీవితంలో ఒక శుభ పరిణామం, సుఖ సంతోషాలు పొందేందుకు లభించే చక్కటి అవకాశం.

వివాహమనేది సాంఘిక, నైతిక ప్రవర్తనకు, క్రమశిక్షణకు దోహదం చేస్తుందనే విషయాన్ని ఋగ్వేదములోని ప్రసిద్ధమైన వివాహ సూక్తము (ఋ.వే. ఒ - 85) స్పష్టపరుస్తుంది. నీతికి అధిపతియైన వరుణదేవుడి సంకెళ్ళ నుండి వివాహమనేది పెండ్లి కుమార్తెను విముక్తురాలను చేస్తుందని చెప్పడం ఆమె బ్రహ్మచర్యావస్థ పూర్తయిందని అర్థం. ఋతమనే ధర్మమార్గాన్ని అనుసరించేందుకు వధువును వరునికి ప్రదానం చేయడం జరిగిందని ఈ సూక్తం ప్రవచిస్తుంది. ఈ విధంగా పెండ్లికి పూర్వం, తర్వాత కూడ పెండ్లి కుమార్తె కఠినమైన నైతిక ప్రవర్తన కలిగి వుండాలి. వివాహమనేది ప్రతి ఒక్కరికి తప్పనిసరి పవిత్ర సంఘటన అని భావించాలి. కాని ఈ నియమాన్ని ఋగ్వేదకాలంలో అందరూ తప్పనిసరిగా పాటించాలనే నిబంధనేదీ విధించబడలేదు. అనేకమంది యువతులు వివాహం చేసుకోకుండా తమ తల్లిదండ్రులతో ఇళ్ళలోను కవయిత్రులై అనేక సూక్తాలు రచించినట్లు మనకు ఋగ్వేదం ద్వారా తెలుస్తుంది. కొంతమంది స్త్రీలు విద్వత్సభలల్లో కూడ పాల్గొని తమ పాండిత్య ప్రకర్షను ప్రదర్శించారు. కానీ వివాహం కాని యువతులు తమకు తగిన వరుణ్ణి ప్రసాదించమని దేవతలను ప్రార్థించడం కనిపిస్తుంది. (ఋ.వే. II - 36, 1-3) ఈ వివాహ సూక్తమే వివాహం నాటికల్లా వధూవరులిద్దరు యుక్తవయస్సు కలిగివుండాలని నిర్దేశిస్తుంది.

వివాహ సూక్తములో (ఋ.వే. ఒ - 85 - 36) దంపతుల మధ్య వుండవలసిన అనురాగాన్ని ఉద్ఘాటించడం జరిగింది. భార్య ఎలాంటి సౌభాగ్యం కలిగిస్తుందో, ఆమె వల్ల సకల సంపదలు ఎలా కలుగుతాయో ఈ సూక్త వర్ణించింది. యజ్ఞయాగాదులు చేయడం వల్ల మాత్రమే ఇలాంటి సకల సంపదలు కలుగుతాయని ఋగ్వేదకాలం నాటి వారి విశ్వాసం. వివాహం జరిగే సమయంలో పాటించే ఆచారాలు, వివాహ శుభతిథి, వధువుకు యిచ్చే బహుమతులు, వధువు ఇంటి నుండి వరుని ఇంటికి సాగే ప్రయాణం మొదలైన అంశాలను ఈ సూక్తం వివరించును. దీనిని బట్టి వివాహవ్యవస్థ ఋగ్వేదకాలంలోనే సంపూర్ణంగా అభివృద్ధి చెందిందనిపిస్తుంది.

## వివాహమైన స్త్రీ పరిస్థితి :

వివాహమైన స్త్రీ గృహములో గౌరవప్రదమైన స్థానం పొందేది. కుటుంబసభ్యులు అవసరాలు తీర్చేందుకు కావలసిన సర్వ స్వేచ్ఛ గృహిణి కలిగివుంటుంది. సాంఘిక, మతపరమైన అన్ని కార్యాల్లోను ఆమె బాగస్వామ్యం తప్పనిసరి. ఆవిధంగా ఆమె సహధర్మిణీ. అగ్ని ముందు భర్త, ధర్మార్థ కామ పురుషార్థాలకు సంబంధించిన సర్వ విషయాల్లోను, భార్య మాట

అతిక్రమించనని వాగ్దానం చేస్తాడు. భార్య లేని భర్తకు మతపరమైన విధులు, కార్యాలు నిర్వహించే హక్కు లేదు. గృహిణీ గృహమని చెప్పడంవల్ల, గృహంలో ఆమె ప్రముఖ స్థానం అలంకరిస్తుంది. స్త్రీ లేకుండా కుటుంబము లేదు. సమాజం అసలు ఉండదు. స్త్రీ చాలా విలక్షణమైన వ్యక్తి. ఆమె నిర్వహించే పాత్ర సమున్నతమైంది. ఆమె తల్లి అవుతుంది. తల్లిగా దేవతారూపంలో ఆరాధింపబడుతుంది. తన జీవితంలో మాతృత్వమే మగువ కోరుకొనే పరమార్థం. ఉత్కృష్ట ధర్మం. ఋగ్వేద ఋషులు స్త్రీ నిర్వహించే విలక్షణ పాత్రను చక్కగా అవగాహన చేసుకొని ఆమె స్థానాన్ని, విధులను సముచితంగా నిర్ధారించారు. స్త్రీ పొందే మాతృస్థానమే ఆమెకు ప్రముఖ స్థానాన్ని కొన్ని ప్రత్యేక విధులను కల్పిస్తుంది. బాల్యంలో తల్లిదండ్రులు, సోదరులు ఆమెను తగిన విధంగా సంరక్షించడమే గాక విద్యాబుద్ధులు నేర్పి గృహిణిగా, మాతృమూర్తిగా సముచితపాత్ర నిర్వహించే సామర్థ్యాన్ని ఆమెకు కలిగిస్తారు. ఆమె నిర్వహించే పాత్రను బట్టే కుటుంబ భవిష్యత్తు సుఖసంతోషాలు, భవిష్యత్తరాల గుణగణాలు, సమాజ స్థితిగతులు ఆధారపడివుంటాయి. ఈవిధంగా స్త్రీ గుణగణాల మీద, శీల ప్రవృత్తి మీద సమాజపు పురోగమనం, సంపదలు, నిలకడ, నైతిక ప్రవర్తన ఆధారపడతాయి. ఇందువల్ల ఆమె ఔన్నత్యం పవిత్రత బాగా పెరుగుతాయి. మాతృత్వం ఆనందదాయకమే అయినా, కష్టాలను, త్యాగాలను స్త్రీ చేయవలసి వుంటుంది. సమాజ హితము జరగాలంటే, మానవజాతి నిరంతరం కొనసాగాలంటే మాతృత్వం అనివార్యం. కాబట్టి ఋగ్వేద ఋషులు స్త్రీకి దైవత్వాన్ని ఆపాదించి, కుటుంబంలో గౌరవము, హోదా, అధికారం యివ్వడమే కాక ఆమెకు తగిన సంరక్షణ కల్పించవలసిన ఆవశ్యకతను గుర్తించారు.

వివాహం పురుషునికిలాగ స్త్రీకి తప్పనిసరి అయినప్పటికి ఇది స్త్రీలు ఆధ్యాత్మిక శిఖరాలు అందుకోవడానికి ప్రతిబంధకం కాలేదు. పురుషుల్లాగ స్త్రీలు కూడ వేదాధ్యయనం చేయవచ్చు. ధర్మాచరణలో పాలుపంచుకోవచ్చు. కుటుంబంలో వున్నా బ్రహ్మవాదినులుగా ఎదగచ్చు. ఋషుల భార్యలు తమ గృహాల్లోనే జీవిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకొన్నారు. ఋగ్వేద ఋషులు స్త్రీలు తమ గృహ, సమాజ విధులను త్యజించి ధర్మాచరణకు పూనుకోవడాన్ని, సన్యాస జీవితం గడపడాన్ని అనుమతించలేదు. కాని పురుషుని వలె తమ గృహస్థాశ్రమ జీవితాన్ని గడపాలో లేక దాన్ని పరిత్యజించి సన్యాస జీవితాన్ని గడపాలో నిర్ణయించుకొనే స్వేచ్ఛ ఋగ్వేద కాలంలో స్త్రీలకు ఉండేది. మొత్తం ఇరవై ఏడు గురు స్త్రీలు ఋగ్వేదసూక్తాలు రచించారు. వారిలో కొంత మందే అవివాహితలు. వారు కూడ వివాహ జీవితాన్ని ప్రశంసించారు. దానికై తపించారు. గృహస్థ జీవితంలో, మాతృత్వంలో ముక్తి ఉందని విశ్వసించిన స్త్రీలు అన్నిరకాల ప్రశంసలు అందుకొన్నారు. భార్యగా తల్లిగా విధులను సక్రమంగా నిర్వహిస్తే ఆమెకు ముక్తిదానంతట అదే వస్తుందని అందరు విశ్వసించారు. ఆధ్యాత్మిక రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించినవారు, చిత్రలేఖనం, నృత్యం, సంగీతం లాంటి కళల్లో రాణించిన స్త్రీలు ఎంతోమంది ఉన్నారు.

ఋగ్వేద సూక్తాల్లో, ఋషులుగా, త్యాగధనులుగా రాణించి ఎందరో స్త్రీలు, తమ అనురాగంతోను, పాతివ్రత్య మహిమతోను గొప్పగా ప్రకాశించి సమున్నత జీవిత శిఖరాలు అధిరోహించిన నారీమణుల వర్ణనలు కూడా ఎన్నో ఉన్నాయి. ఈ స్త్రీ పాత్రలు అతిశయోక్తులతో నిండినవిగాని, ఊహాజనితాలు కానీ కావు. జీవితం నుండి గ్రహించి వాటికి విలక్షణత్వము ఆపాదించిన వర్ణనలే. అటువంటి స్త్రీలు ధైర్యము, స్వాతంత్ర్య ప్రవృత్తి మొదలైన సుగుణాలతో విరాజిల్లారు. అత్రి కుటుంబానికి చెందిన విశ్వవార తాను రచించిన ఆరు మంత్రాల్లో, సమర్థమైన వ్యక్తిత్వం, ఘనత, నిబద్ధత గల విశిష్ట వ్యక్తిగా తనను ఆవిష్కరించుకొంది. ఆమె దేవతలకు నైవేద్యము సమర్పించే సందర్భంలో చేసిన ప్రార్థనను బట్టి ఆమె అనురాగమయ వాతావరణం కోసం గృహంలో వెల్లివిరియాల్సిన సుహృద్భావం కోసం తపించే ఆమె స్త్రీ హృదయం అభివ్యక్తమవుతుంది. ఋగ్వేదంలో ఇంద్రసేన ముద్గలానికి సంబంధించిన మరొక స్త్రీ వృత్తాంతం కూడా ఉంది. ఈమె తన భర్తకు రథము నడపడమే కాకుండా వందలకొలది, వేల కొలది పశువులను జయించడానికి సహాయపడి, స్త్రీలు కూడా ధైర్యం వంటి వీరోచిత నాయక లక్షణాలు కలిగి వుండేవారని నిరూపించింది. స్త్రీ కుటుంబ జీవితం, వివాహ వ్యవస్థ పరిశీలించినట్లయితే ఋగ్వేద కాలంలో గృహస్థ సుహృద్భావం ఆధ్యాత్మిక పురోగమనంతో మిళితమై ప్రకాశించిందని భావించవచ్చు.

## ఋగ్వేద కాలంలో కనిపించే వివాహ వ్యవస్థలు :

ఋగ్వేదకాలంలో వివాహానికి స్త్రీ పురుషుల మధ్య ఉండే కామమే పరమావధి కాదు. వారసత్వాన్ని కొనసాగించే స్త్రీని నైతిక ఆధ్యాత్మిక శక్తిగా, సంఘ గమనాన్ని నిర్దేశించే శక్తిగాను భావించారు. కాబట్టి సాంకరాన్ని ఆమోదించలేదు. విశ్వామిత్ర మహర్షి భార్యకు గృహానికి అభేదము తెలుపుతూ సకల సంపదలకు, సుఖాలకు ఆధారంగా ఆమెను అభివర్ణించాడు. "జాయేదస్తంమఘవన్‌సేదు యోనిత దిత్వాయుక్తా హరయోవహన్తు" ఈ విధంగా వివాహానికి పవిత్రత కల్పించబడింది. యమయమీసంవాద సూక్తం సోదరీ సోదరుల మధ్య లైంగిక సంబంధాన్ని నిషేధించెను.

## వివాహ భేదాలు :

ఋగ్వేద కఆలంలో 'వహతు' అనే ఒకరకమైన వివాహోత్సవం జరిగేది. ఇందులో తల్లిదండ్రులు వధువును అలంకరించి, అన్ని కానుకలు యిచ్చి వరుని ఇంటికి తీసికెళ్ళేవారు. తండ్రో లేక సోదరుడో విలువైన వస్త్రాలను, ఆభరణాలను వరుడికి ప్రదానం చేసేవారు. ఆ తరువాత వరుడు వధువు చేయి పట్టుకొని తన ఇంటికి తీసికెళ్ళేవాడు (ఋ.వే. X - 109-3). ఇది ఒకరకమైన వివాహంగా భావించాలి.

2. విమద పుష్యమిత్రుని కుమార్తెను బలవంతంగా ప్రియుని ఇంటికి తీసుకువెళ్లి వివాహం జరిపించింది. ఇందులో వధువును బలవంతముగను, తండ్రి అభీష్టానికి వ్యతిరేకంగాను తీసికెళ్లడం కనిపిస్తుంది.

   (యువంరథేన విమదాయ . . . . . . . . . . . . . . . . పురుమిత్రస్య యషణామ్ (ఋ.వే. I - 116,1, X - 39,7).

3. ఋగ్వేదంలో చోటుచేసుకున్న మరొక వివాహ విధానం. వధువు తండ్రి వరుని చేత డబ్బు తీసికొని తన కుమార్తెను ప్రదానం చేయడం కనిపిస్తుంది. 'అశ్రవమ్‌హి భూరిదావత్తరావామ్ విజామాతురుతవా ఘాస్యాతాత్ ఋ.వే. I - 10-92). జామాత, విజామాత అని అల్లుళ్ళు రెండు రకాలు. కొంతధనాన్ని కన్యతోపాటు ఇచ్చి తెచ్చుకున్న వరుడు విజామాత. ఇతనికి సంఘంలో గౌరవం తక్కువ. ఇది కన్యాశుల్కాన్ని తలపిస్తుంది.

4. ఋగ్వేదంలోని కొన్ని సూక్తాలు స్వయంవర వివాహ పూర్వరూపాన్ని ఆవిష్కరించాయి. దీని ప్రకారం వధువే తన వరుణ్ణి ఎన్నుకోవడం జరుగుతుంది. ఈ సూక్తాన్ని గాంధర్వ వివాహానికి ఉదాహరణంగా చెప్పవచ్చు. ఇందులో వధూవరుల మధ్య వున్న పరస్పర ప్రేమే వివాహానికి కారణం. క్రియతీయోషామర్యతోవధూయోః పరిప్రీతాపన్యసా వార్యేణ। భద్ర వధూర్భవతి యత్ సుపేశాః స్వయం సామిత్రం వనుతేజనేచిత్ (ఋ.వే. X, 27-12).

పైన పేర్కొన్న వివాహ వ్యవస్థలలో మొదటి 'వహతు' వివాహ విధానం మినహా తక్కిన వివాహాల్లో వధువుకు పత్నీత్వం సిద్ధించడం గాని, వేదమంత్రోచ్చారణ ద్వారా పతిగోత్రాన్ని ఆమె స్వీకరించడం గాని జరుగదు. వహతు విధానంలో భార్యకు తన క్రొత్త హోదాలో కుటుంబ సభనుద్దేశించి ఉపదేశించే హక్కు లభిస్తుంది. (వివిథమావిధాః ఋ.వే. ఒ - 85,7). సూత్రకాలంలో గల మరికొన్ని వివాహాలను కూడా గౌతముడు పేర్కొన్నాడు. బ్రాహ్మ, దైవ, ఆర్ష, ప్రాజాపత్య వివాహాలను పేర్కొంటూనే, నాడు గాంధర్వ, రాక్షస వివాహాలు కూడా మరికొందరు పేర్కొన్నట్టు చెప్పాడు. దీన్ని బట్టి సూత్రకాలంలో కూడ గాంధర్వ రాక్షస వివాహాలు ఒక నిర్దిష్ట స్థానాన్ని పొందలేదని మనకు తెలుస్తుంది.

## వేరు తెగలతో వివాహం (Exogamy) :

వహతు వివాహంలో వధువు వరుని ఇంటికి తీసికెళ్ళారని చెప్పడాన్ని బట్టి వారు ఎంతో ప్రయాసతో దూరప్రయాణం చేసినారని తెలుస్తుంది. దీనిని బట్టి వధూవరులు ఒకే గ్రామానికి గాని, ప్రదేశానికి గాని చెందినవారు కాదని గ్రహించవచ్చు.

వారిద్దరు దూరంలో వున్న భిన్న గ్రామాలకు చెందినవారు. వివాహ ఉత్సవంలో వధువు గోత్రం తప్పనిసరిగా మార్చుకోవాలి కాబట్టి వధూవరులు ఇద్దరు భిన్న తెగలకు, భిన్న గోత్రాలకు చెందినవారని తెలుస్తుంది. సగోత్ర వివాహాలు ఆనాడు వ్యవహారంలో లేవనుకోవాలి.

**బహుభార్యాత్వము :**

బహుభార్యత్వమున్నట్లు అనేక ఋగ్వేదసూక్తాలు తెలియజేస్తున్నాయి. (ఋ.వే. X-145). ఇవి ఒక భార్య భర్త తన సవతుల నుండి దూరం చేసేందుకు ఉపయోగించే తంత్రములను వర్ణిస్తాయి. ఇంద్రుని భార్య శచీదేవి అనేక మంది సవతులను నాశనం చేసినట్లు, చంపినట్టు తద్వారా ఇంద్రుని మీద సర్వాధిపత్యము సంపాదించినట్లు వర్ణించబడింది. (ఋ.వే. X-159, 5-6). ఇంకను ఇలాంటి సూక్తాలు కొన్ని ఋగ్వేదంలో వున్నాయి. (ఋ.వే. I - 105, 8 మరియు X-116-10). వీటిని బట్టి ఋగ్వేద కాలంలో రాజుల్లోను, ధనికుల్లోను బహుభార్యాత్వం ప్రబలంగా ఉండేదని చెప్పక తప్పదు. ఋగ్వేద వివాహ సంబంధ సంస్కారాలు పరిశీలించినట్లయితే సవతులకు యజ్ఞయాగాది ధర్మకార్యాలు నిర్వహించే అవకాశం ఏమాత్రం లేదని స్పష్టమవుతుంది. ఋగ్వేద సమాజం ఏకభార్యత్వమునే గొప్పగా ప్రశంసించింది. కాని కొన్ని సందర్భాల్లో స్త్రీలకు అనర్థహేతువైన బహుభార్యత్వాన్ని అనివార్య సమాజపరిణామంగా అంగీకరించింది.

**బహుభర్తృత్వం :**

కొన్ని ఋక్కులు (పరశుభ్రా అయాసోయ వ్యాసాధారణ్యేవమరుతో మిమిక్షుః (ఋ.వే. I -167, 4-6) మరుత్ దేవతలు రోదసిని తమ ఉమ్మడి భార్యగా పరిగణించారని, ఆమె వారి పట్ల భక్తి ప్రపత్తులతో వ్యవహరించిందని చెప్పడంవల్లా ఆనాడు బహుభర్తృత్వం అనే దుష్టసంప్రదాయం వుండేదని మనం భావించాలి. అశ్వినీ దేవతలు ఒకే స్త్రీతో కలిసి నివశించారని మరో ఋక్కు తెలుపుతుంది. (ఋ.వే. IX - 5, 27 మరియు 28).

**వైధవ్యము :**

కొంతమంది పాశ్చాత్య పండితులు ఋగ్వేదములో పదవ మండలము పద్దెనిమిది సూక్తంలోని ఏడు, ఎనిమిది మంత్రాల అర్థము చక్కగా గ్రహించకుండా, ఋగ్వేద కాలంలో సతీసహగమనం, నియోగం (పునర్వివాహం) ఉండేవని వాదించారు. వారి అభిప్రాయం సరిగాదు. ఋగ్వేద కాలంలో సతీసహగమనం అనే దురాచారము పూర్తిగా లేదు. అలానే వితంతు పునర్వివాహాన్ని కూడ ఋగ్వేద సమాజం ఆమోదించలేదు. కాబట్టి ఆనాడు వితంతువులు పరిస్థితి ఆశాజనకంగా లేదని చెప్పవచ్చు.

**స్త్రీల హక్కులు : నియమాలు :**

ఋగ్వేద సమాజం ప్రారంభదశలో వున్నందువల్ల ఆనాటి స్త్రీలు ఎలాంటి హక్కులు కలిగివున్నారో చెప్పటం చాలా కష్టం. కాని స్త్రీలకు తండ్రి ఆస్తిలో కొంత హక్కు ఉండేదని ఊహించాలి. ఈ కాలంలో అవివాహితలుగా తండ్రి ఇంటనే వుండి వృద్ధులయిపోయిన వారి ప్రస్తావన వుంది. అందువల్ల ఆమెను పోషించే భారం తండ్రి కుటుంబ సభ్యులదేనని భావించాలి. అది ఆమెకు జన్మతః వచ్చిన హక్కు. ఆమె పెండ్లి చేసుకొని భర్త కుటుంబంలో సభ్యురాలయ్యేదాక ఈ జన్మహక్కు వుంటుంది. వివాహ సమయంలో ఆమెకు తల్లిదండ్రులు యిచ్చిన ధనం, నగలు, నాణాలు ఆమెకే చెందుతాయి. వివాహం చేసుకోని ఆడపిల్లలకు పుత్రునితో సమానంగా తండ్రికి దహన సంస్కారాలు చేసే హక్కు కూడా వుండేదని ఋగ్వేదం ద్వారా తెలుస్తోంది. ఋగ్వేదకాలంలో కన్య అమాయకురాలు కాదు. బలహీనురాలు కూడా కాదు. అన్నిటికి మించి సిగ్గుతో తలవంచుకొని పోయే ముగ్ధా కాదు. ఆమె ధైర్యశాలి. విశిష్ఠ వ్యక్తిత్వం కలిగి ఉండి, ఆలోచించుకొని నిర్ణయాలు తీసుకొనే సమర్థురాలు.

**ఆహారం మరియు అలంకరణ :**

ఋగ్వేదకాలంనాటి ఆర్యులు నిరాడంబర ఆహారం భుజించేవారు. గోధుమ, యవలు, పాలు, పెరుగు, వెన్న, నెయ్యి మొదలైనవి వారి సాధారణ ఆహారం. కూరగాయలు, పండ్లు, ధాన్య దినుసులు వారి ముఖ్యమైన ఆహారం. బలిచ్చే మేక, గొఱ్ఱెల మాంసం భుజించేవారు. ఆవును పవిత్రంగా భావించి దాన్ని వారు సంహరించేవారుకాదు (అఘ్నన). సోమరసం, సురాపానం చేసేవారు. కాని సురాపానం చేయడాన్ని గర్హించేవారు. ఋగ్వేదనవమమండలం పూర్తిగా సోమరసాన్ని గురించిన చర్చే వుంది.

ఆర్యులు నూలు, ఉన్ని, పశు చర్మంతో తయారుచేసిన వస్త్రాలను ధరించేవారు. ఈ వస్త్రాలను మూడు రకాలుగా విభజించవచ్చు. నీవీ వస్త్రాలు అంటే లోపల ధరించేవి. పరిధానం అంటే చొక్కాలాంటివి. శరీరంపైన ధరించేవి. అధివాసం పై వస్త్రాలు. తలపాగలు సామాన్యంగానే ధరించేవారు. ఋషులు జింక చర్మాలు ధరించేందుకు ఇష్టపడేవారు. చెవిపోగులను స్త్రీలు పురుషులు కూడా ధరించేవారు. స్త్రీలు అందెలు బాహుకవచాలు, హారాలు మొదలైన ఆభరణాలు ధరించేవారు.

**వినోదక్రీడలు :**

గుఱ్ఱం పందేలు, రథం పందేలు, నృత్యం, గానం, సంగీతం, జూదమాడడం లాంటివి వారి వినోదక్రీడలు. జూదం పందేలలో వుండటం వల్ల అనేక కుటుంబాలు సర్వనాశనమయ్యేవి. సంగీతంతో కూడిన నృత్యంలో స్త్రీలు, పురుషులు పాలుపంచుకొనేవారు. డోలు, దుందుభి, పిల్లనగ్రోవి, వీణ వారు ఉపయోగించే సంగీత సాధనాలు.

## 2.3 సమీక్ష :

వైదిక సంస్కృతి పరిణితి చెందిన సంస్కృతే కాని ప్రారంభ దశలోనిది కాదు. కొందరు ఏకపత్నీత్వం ఉండేదని, మరికొందరు సవతులలో బాధ ఉండేదని నిర్ధారణ చేశారు. వీనినిబట్టి ఏకపత్నీత్వమే సర్వ సాధారణం. కానీ రాజులు, శ్రీమంతులు, బహుభార్యత్వాన్ని ప్రోత్సహించారని భావించవచ్చు.

పురుషుడు భార్య లేకుండా దేవకార్యాలు జరపడానికి వీలులేదని వేదప్రమాణం. సంతానం లేనిదే మనిషికి సంపూర్ణత లేదు కాబట్టి వివాహం అవసరం. పురుషుడు స్త్రీలో నుండి మరల పుత్రుని రూపంలో జన్మిస్తున్నాడు. భర్తకు జన్మను ప్రసాదిస్తున్నది గనుక తల్లివలె పూజ్యురాలు. అందుకే భార్యకు 'జాయ' అనే పేరు వచ్చిందని ఐత. బ్రా. దీనినిబట్టి గృహిణీత్వం ఆ కాలంలో ఉత్తమ లక్ష్యంగా భావించబడింది.

ఆర్యుల కుటుంబ జీవన విధానం అత్యున్నతమైన స్థాయిలో నడిచింది. స్త్రీ, పురుషుల సంబంధ బాంధవ్యాలు ఈ కాలంలో ఉత్తమశ్రేణిలో ఉన్నాయి.

భోజనం తయారుచేయడం, వండిన దాన్ని వడ్డించడం మొదలైన ముఖ్య బాధ్యతలు నిర్వర్తించటం స్త్రీ బాధ్యత కాబట్టి పురుషునిస్థానం కుటుంబంలో బాహ్యంగాను, తల్లియైన స్త్రీ స్థానం ముఖ్యమైనదిగాను భావించబడింది. ఈ సిద్ధాంతంపైనే ఋగ్వేద కాలపు కుటుంబ వ్యవస్థ ఏర్పాటు చేయబడినదని 'విల్డ్యూరాంటే' అంటాడు. ఈ కారణాన ఆమె సమాజంలో జరుగుతున్న ముఖ్య కార్యక్రమాలకు దూరమైపోయి అప్రధానంగా భావించబడింది.

ఋగ్వేద కాలంనాటి ఆర్యులకు ఇంటి మీద, గృహస్థ జీవితం మీద ప్రీతి మెండు. ప్రేమ, ఆప్యాయత, అనురాగం వారి హృదయాల్లో వెల్లివిరిసినట్లు వారి మాటల వల్ల, చేతల వల్ల ధృవపడుతుంది. ఆడ, మగ పిల్లలందరినీ సమాన ప్రేమానురాగాలతో తల్లిదండ్రులు పెంచినట్లు తెలుస్తుంది. పుత్రుడు ఎక్కువని గాని, తక్కువని గాని భావించిన సంఘటనలు

ఋగ్వేదంలో ఎక్కడాలేవు. ఆడపిల్లను ప్రేమాభిమానాలతో లాలించి జాగ్రత్తగా పెంచినట్లుంది. తల్లి ప్రేమతో పెంచడం తన కర్తవ్యమని ఎంచితే, తండ్రి, సోదరుడు ఆడబిడ్డను రక్షణ కల్పించినట్లుగా వర్ణనలున్నాయి. దంపతి అనే మాటను బట్టి భార్యాభర&త కలిసి సమాజంలో ఒక భాగమన్న భావం ఉంది. దంపతుల మధ్య వచ్చిన మనస్పర్థలను పోగొట్టమని దేవతలను ప్రార్థించారు. దాంపత్య బంధం వీడిపోని స్నేహబంధంగా భావించబడింది. గృహం యొక్క శోభంతా గృహిణి మీదనే ఆధారపడి ఉన్నట్లు, గృహరాజ్యసీమకు ఇకమీదట ఆమె మహారాణి కాబోతున్నట్లు సంబోధనలున్నాయి.

ఋగ్వేదకాలంలో స్త్రీకి నిమ్నోన్నతాలు రెండూ జీవితంలో ఉన్నాయి. ఐనా ప్రతి రంగంలో గౌరవం ఉంది. ధర్మాన్ని ధిక్కరించిన పట్టు కూడ సమాజం సానుభూతి చూపింది. ధర్మాచరణలోను, కుటుంబ విధుల నిర్వహణలోను భారతీయ స్త్రీకున్న విశిష్ఠస్థానం మరే యితర దేశాల ప్రాచీన సాహిత్యంలోను, పురాణ గ్రంథాల్లోనూ కన్పించదు.

## 2.3 అథర్వవేదం

అథర్వవేదం సంహితలకు బ్రాహ్మణాల మధ్యకాలంలో ఆవిర్భవించినట్టు పండితులు అభిప్రాయపడుతున్నారు. అథర్వ, అంగీరస అనే మంత్రద్రష్టలైన ఋషిద్వయంచే ఆవిష్కరింపబడిన మంత్ర సమూహమే ఈ అథర్వవేదం. కాబట్టే దీనికి అథర్వాంగీరసమని మరొక పేరు. ఈ వేదంలో అనేక సూక్తాలు మానవకళ్యాణానికి, ప్రత్యర్థుల వినాశానికి ఉపయోగించేందుకు ఉద్దేశింపబడ్డాయి.

### 2.3.1 అథర్వవేద నిర్మాణం :

అథర్వవేదం ఇరవై కాండాలుగా విభజింపబడింది. వీటిలో పదునెనిమిది కాండాలే మూలగ్రంథంగా భావిస్తారు. చివరి రెండు కాండాలు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా ఋగ్వేదంలోని విషయాలనే పునరావృత్తం చేస్తున్నాయి. అందువల్ల ఇవి ప్రక్షిప్తాలని పండితుల అభిప్రాయం. ఈ కాండాలు మరలా అనువాకాలుగా, అనువాకాలు సూక్తాలుగా విభజింపబడ్డాయి. కాని ఈ విభజన విషయాధారంగా జరగలేదు. ఒకే విషయం అనేక కాండాలలో చర్చించడం కనిపిస్తుంది. అథర్వవేదం నవశాఖల్లో వున్నట్లు పతంజలి పేర్కొన్నప్పటికి, శౌనక, పైప్పలాదశాఖలు మాత్రమే మనకు లభిస్తున్నాయి. వీటిలో శౌనక శాఖే ఎక్కువ ప్రసిద్ధి గాంచింది. దీనికి శాయనాచార్యులు భాష్యం కూడా వ్రాశారు. తక్కిన వేదాల్లాగే ఈ వేదానికీ కూడా బ్రహ్మ అనే పురోహితుడు నాయకత్వం వహిస్తాడు. ఇందులోని యజ్ఞయాగాలు అతని నేతృత్వంలోనే జరుగుతాయి. కాబట్టే ఈ వేదాన్ని బ్రహ్మవేదమని కూడా అంటారు. ఈ బ్రహ్మ పురోహితునికి తక్కిన మూడు వేదాల సంపూర్ణ పరిజ్ఞానం తప్పనిసరిగా వుండాలని నిర్దేశింపబడింది.

మొదటి మూడు వేదాలు ఆముష్మిక ఫలాలను ప్రదానం చేస్తాయి. అథర్వవేదం ఐహిక ఫలాలను ప్రదానం చేస్తుంది. జీవనం సుఖమయం కావాలంటే ఈ వేదం ముఖ్య సాధనమని పండితుల అభిప్రాయం. దీనికోసం అనేక అనుష్ఠాన కర్మలు ఈ వేదంలో వున్నాయి. పురోహితులకు అథర్వవేద పరిజ్ఞానం అత్యంతావశ్యకం. అది లేకపోతే రాజులకు సంబంధించిన శాంతికర్మలు, పౌష్టి కర్మలు చేయడం దస్సాధ్యం. అందువల్లనే ఏ రాజు ఆస్థానంలో అథర్వవేద తత్వజ్ఞుడైన బ్రాహ్మణుడు వుంటాడో, ఆ రాజు రాష్ట్రంలో ఏలాంటి ఉపద్రవాలు లేకుండా అభివృద్ధి చెందుతుందని చెప్పబడింది. ఈవిధంగా ఐహికాముష్మిక లౌకికపారలౌకిక విషయాలకు నిలయమైన అథర్వవేదం వైదిక వాఙ్మయంలో ఒక విశిష్ట స్థానాన్ని అలంకరించింది.

అకుటిల ప్రవృత్తి, అహింసా మార్గానికి సంబంధించిన అనేక ప్రసంగాలు ఇందులో ముఖ్యంగా ప్రస్తావింపబడ్డాయి. బ్రహ్మకర్మలు ఇందులో ప్రతిపాదింపబడినందువల్ల దీనిని బ్రహ్మవేదమని చెప్పబడింది. పరబ్రహ్మ జ్ఞానానికి సంబంధించిన కొన్ని అంశాలేవున్నప్పటికి వాటికి ఎంతో వైశిష్ట్యం వుంది.

## 2.3.2 అథర్వవేదం - విషయ వివేచనం :

అథర్వవేదం ప్రతిపాదించే విషయాలు తక్కిన వేదాల్లోలాగే చాలా గూఢంగాను, విలక్షణంగాను వున్నాయి. ఈ వేదంలో విషయాలను స్థూలంగా మూడు రకాలుగా విభజించవచ్చు.

1. ఆధ్యాత్మిక ప్రకరణం : ఇందులో ముఖ్యంగా పరబ్రహ్మ, జీవునికి సంబంధించిన విషయాలు, పరమాత్మక విషయాలు వున్నాయి.

2. ఆధిభౌతికమ్ : రాజు, రాజ్య పరిపాలన సంగ్రామాలు, శత్రువాహనాది విషయాలు ఇందులో ప్రధానంగా వున్నాయి.

3. ఆధిదైవత ప్రకరణం : ఇందులో నానా దేవతలు, వివిధ యజ్ఞాల కాలసంబంధ విషయాలు కన్పిస్తున్నాయి.

## విస్తృత విషయ వివేచనం :

**1. భైషజ్య సూక్తాలు :** ఈ ప్రకరణంలో వివిధ రోగాల చికిత్సకు సంబంధించిన మంత్రాలు వున్నాయి. రోగాలు పుట్టడం, వాటి వల్ల కలిగే కష్టాలకు రాక్షస, భూత, పిశాచాదుల ఉపద్రవాలే కారణాలని చెప్పబడింది. అందువల్ల ఈ ప్రకరణంలోని అనేక మంత్రాలలో ఈ ఉపద్రవశమనోపాయాలు వర్ణింపబడ్డాయి. ఈ మంత్రాల సహాయంతో చేసే అనేక అభిచార విశేషాలు కౌశిక సూత్రంలో వున్నాయి. ఇందులో వర్ణించబడిన వివిధ రోగాల లక్షణాలు, వాటి వల్ల సంభవించే శారీరక వికారాలు ఆయుర్వేద దృష్ట్యా ఎంతో ప్రాముఖ్యాన్ని కలిగివున్నాయి. క్షయ (6-14) గండమాలా (inflammation of the glands of the neck) (6-83) యక్ష్మ (Pulmonary disease) (6-85) మొదలైన రోగాల నుండి విముక్తికి వరణం అనే ఓషధిని సేవిస్తే ఉపయోగం వుంటుందని చెప్పబడింది. కాసం (దగ్గు) (6-104) దంతరోగాలు (6-140) వాటిని నివారించడానికి ఉపయోగించే ఓషధాలు అథర్వవేదంలో చక్కగా వర్ణింపబడ్డాయి. సర్వవిష వినాశనానికి అనేక చికిత్సా మార్గాలు చెప్పబడ్డాయి. అనేక ఓషధులు, వృక్షాల ఉపయోగాన్ని తెలిపే మంత్రాలెన్నో ఇందులో వున్నాయి.

**2. ఆయుష్యసూక్తాలు :** దీర్ఘాయుస్సు కోసం అనేక ప్రార్థనా మంత్రాలు ఈ వేదంలో వున్నాయి. బాలురముండనం, ప్రథమ క్షౌరకర్మలు, ఉపనయన సంస్కారం మొదలైన వాటి మంత్రాలు ఇందులో వున్నాయి. శతవర్షాలు జీవించడానికి అనేక మృత్యువుల నుండి రక్షింపబడడానికి వివిధ రోగాల నుండి రక్షణ పొందడానికి సంబంధించిన ప్రార్థనా మంత్రాలు వున్నాయి. అథర్వవేదంలో ఆయుస్సు పెరగడానికి చేతికి రక్షాసూత్ర ధారణం ఎలా చెయ్యాలో వర్ణింపబడింది. రక్షాసూత్రధారణ వల్ల సంపూర్ణ ఆరోగ్యం, దీర్ఘాయువు వెంటనే ప్రాప్తిస్తుందని చెప్పబడింది.

**3. పౌష్టిక సూక్తాలు :** గృహనిర్మాణం, సీరకర్షణం, బీజవపనం, అన్నోత్పత్తి, పుష్యభివృద్ధి, విదేశగమనం, వ్యాపార హేతువులు మొదలైన కార్యాల సిద్ధి కోసం ఆశీర్వాద ప్రార్థనలున్నాయి. ఈ విషయాలన్నీ సుష్ఠు సూక్తంలో (4-15) ప్రధానంగా వున్నాయి. ధాన్యాలకు కీడు చేసే కీటకాల నివారణ, పశుసంపద అభివృద్ధికి కూడా ఇందులో సూక్తాలున్నాయి. జూదంలో విజయానికి కూడా మంత్రాలున్నాయి.

**4. ప్రాయశ్చిత్తసూక్తాలు :** చారిత్రక లోపాలు, ధార్మిక విరోధం, ధర్మశాస్త్ర అజ్ఞానం, ధర్మశాస్త్ర విరుద్ధ వివాహాలు, జ్యేష్ఠులను విడిచిపెట్టి వివాహం చేసుకోవడం మొదలైన అపరాధాల నుండి విముక్తి పొందడానికి ప్రాయశ్చిత్త విధులు తెలిపే అనేక సూక్తాలు ఇందులో వున్నాయి. ఆయా మంత్రాలను పఠించడం వల్ల శారీరక దుర్బలత, మానసిక లోపాలు, దుఃస్వప్నాలు, అపశకునాల నివారణ, వాటిని అధిగమించడం ఎలాగో మనకు తెలుస్తుంది.

**5. స్త్రీ కర్మసూక్తాలు :** ప్రేమకు, వివాహానికి సంబంధించిన సూక్తాలు ఈ వేదంలో వున్నాయి. ఈ సూక్తాలాధారంగా ఆనాటి సమాజస్వరూపం మనం తెలుసుకోవచ్చు. పుత్రుడు పుట్టడానికి, పుట్టిన బిడ్డను రక్షించడానికి ప్రార్థనా సూక్తాలు ఇందులో వున్నాయి. ఈ విషయాలను పదునాల్గవ కాండం విశేషంగా చర్చిస్తుంది. ఈ విషయాలనే 3-25, 6-130, 6-138, 6-130, 4 మొదలైన మంత్రాలు చర్చిస్తాయి. వీటిలో మారణ, మోహన, ఉచ్చాటన, వశీకరణం మొదలైన క్రియలు ప్రయోగింపబడినట్లు కనిపిస్తుంది.

కౌశిక సూక్తంలో స్త్రీల ప్రేమ పొందడానికి అభిచారిక క్రియలు పేర్కొనబడ్డాయి. వివాహమైన దంపతుల సుఖమయ జీవితానికి, వధువు వరుని ప్రేమను పొందడానికి సంబంధించిన మంత్రాలు ఎన్నో వున్నాయి. స్త్రీలను గొడ్రాళ్ళుగా చేయడానికి కూడా మంత్రాలున్నాయి. సవతులపైన ఆధిపత్యం సాధించేందుకు కూడా మంత్రాలు ఇక్కడ వున్నాయి.

**6. రాజకర్మ సూక్తాలు :** రాజులకు సంబంధించిన విషయాలను తెలిపే సూక్తాలు అథర్వవేదంలో వున్నాయి. వీటిని బట్టి ఆనాటి రాజకీయ పరిస్థితులు మనకు చక్కగా గోచరిస్తాయి. శత్రువినాశనానికి, సంగ్రామంలో వుపయోగించే రథ, దుందుభి, శంఖాలు మొదలైన సాధనాల విశేష వివరణ, యుద్ధంలో అనుసరించే వ్యూహాలు తెలపడంవల్ల ఈ వేదం ఎంతో ప్రాముఖ్యత కలిగి వుంది. ఈ కారణం వల్లనే దీనిని క్షత్రవేదమని కూడా పిలుస్తారు. రాజు పట్టాభిషిక్తుడయ్యే సమయంలో, రాజు రాజకీయాధిపత్యం పొందడానికి, కీర్తి, తేజస్సు పొందడానికి ప్రార్థనా సూక్తాలున్నాయి. అంధసూక్తం (3-3) బట్టి దేశం నుండి బహిష్కారం పొందిన రాజు తిరిగి రాజ్యాధికారం, ప్రతిష్ఠ పొందడం మొదలైన రాజకీయ పరిస్థితులు అవగతమవుతాయి. సంగ్రామంలో పాల్గొనే వీరులను ఉత్సాహపరచడానికి, దుందుభి వర్ణన మనోహరంగాను, వీర రససంపూర్ణంగానుంది. దుందుభి గర్జనలు విన్న శత్రుస్త్రీలు తమ పుత్రులను విడిచిపోయే వర్ణనలు కరుణ రసభరితంగా వున్నాయి.

**7. సాంమనస్య సూక్తాలు :** సమాజంలో సమైక్యత సహృద్భావం విరాజిల్లాలనే సూక్తాలున్నాయి. ప్రజల మధ్య అనైక్యత తొలగిపోయి స్నేహ వాతావరణం నెలకొల్పాలన్న ఆశయం ఈ అథర్వవేద సూక్తాల్లో సార్వజనీకమైన ప్రాముఖ్యతను ఆవిష్కరిస్తున్నాయి.

**8. పృథివీ సూక్తం :** పృథివీ మహిమను వర్ణించే ఈ సూక్తంలో అరవైమూడు మంత్రాలున్నాయి. మాతృభూమిని జననీరూపంలో స్తుతించే ఈ సూక్తం ఎంతో ఉదాత్తమైంది. దేశభక్తిని ప్రేరేపించే ఈ సూక్తం మాతృభూమిని సజీవరూపంలో చిత్రించడం చూడవచ్చు. 'మాతాభూమిః, పుత్రోహం పృథివ్యాః (12-1,12) అనే సూక్తం నా తల్లి భూమి, నేను ఈ తల్లి పుత్రుడను అని చెప్పడం ఎంతో ఉదాత్తభావన. పృథివిపై వుండే నదులు, పర్వతాలు లాభదాయకాలగుగాక! ఆరు ఋతువులాగమనం ప్రజా కళ్యాణానికే అగుగాక, వర్షాకాలంలో భూమిపై సంచరించే సర్పం, వృశ్చికం, రోగాలను కలిగించే కీటకాలు నన్ను చూడగానే పారిపోవుగాక! ఎప్పుడూ శుభాలే కలుగుగాక అనే ఈ సూక్తం ఎంతో మనోహరంగా వుండి విశ్వకళ్యాణమే ముఖ్యమని తెలుపుతోంది.

**9. బ్రహ్మణ్య సూక్తాలు :** ఈ సూక్తంలో సర్వజగత్తుకు పరమతత్వభూతుడైన పరమాత్మ లేక పరబ్రహ్మ స్వరూప వివేచన ఇక్కడ వుంది. ఈవిధంగా పరబ్రహ్మతత్వాన్ని చర్చించటం వల్ల దీనికి బ్రహ్మవేదమని ప్రసిద్ధి. అందువల్లే దార్శనిక దృష్ట్యా దీని వైశిష్ట్యం పెరిగింది. పరమాత్మతత్వం అనేక పేర్లతో వ్యవహరింపబడుతోంది. ఆయనే కాలమనే పేరుతో సర్వలోక నియంత్రకుడు. కాలమే సర్వప్రపంచానికి అధిష్టానంగా వుంది. కాలమే సర్వేశ్వరుడైన ప్రజాపతికి కూడా తండ్రి. ఆయన సంకల్పం వల్లే జగత్తు ఆవిర్భవిస్తుంది. కాలమే జగత్తు యొక్క పరమతత్వం. ఈ విషయాన్నే అథర్వవేదం స్పష్టపరచింది.

కాలేతపఃకాలే జ్యేష్టం కాలే బ్రహ్మసమాహితమ్।
కాలోహ సర్వస్యేశ్వరో యఃపితాసీతో ప్రజాపతేః (19-53-8)

అథర్వవేదం ఋగ్వేద విషయాలను పూరిస్తుందని చెప్పవచ్చు. ఋగ్వేదం సమాజంలో ఉన్నత వర్గాల విచారధారలుగా, వారి సృజనాత్మక ఆలోచనా సరళిని ప్రతిబింబిస్తుంది. అలాకాక అథర్వవేదం నిమ్నవర్గాల విలక్షణమైన ఆచారాలు, ఆలోచనలను ఆవిష్కరిస్తుంది. ఈ వేదంలో సామాన్య జనజీవనం చిత్రింపబడింది. వారిపై భూత, ప్రేత, పిశాచ, డాకినీ, శాకిన్యాదుల ప్రభావం వుంది. ఈ విధంగా అథర్వవేదం సామాన్య జనజీవన దర్పణమని చెప్పవచ్చు.

**9. అభిచారకర్మ సూక్తాలు :** ఈ వేదంలో కొన్ని అభిచారకర్మలు వర్ణించే సూక్తాలున్నాయి. () ఇవి అన్ని సందర్భాలల్లో చేసే కర్మలు కావు. ఇవి ఆచరించటంవల్ల శత్రువులు, రోగాలు ఇతర కష్ట నష్టాల నుండి తమ కుటుంబాన్ని రక్షించడానికి ఇవి ప్రయోగించేవారు. ఆత్మ సంరక్షణమే ప్రధాన ఆశయంగా వీటిని వారు ఆచరించేవారు. అరిష్టాల నుండి మారణ మోహన ఉచ్చాటనాది కర్మల ద్వారా వారు ఆత్మరక్షణ పొందారు.

## 2.3.3 సమీక్ష :

వైదిక యుగంలో ఋగ్వేదం తరువాత అథర్వణ వేదం పేర్కొనదగినది. అథర్వణ వేదంలో ముఖ్యమైన వర్ణన ఇల్లు, ఆ ఇంటిలోని స్త్రీ. గర్భవతి మనస్థత్వం చక్కగా చిత్రింపబడింది. తన భార్యాబిడ్డలు క్షేమంగా ఉండాలనీ, పాడిపంటలు అభివృద్ధి చెందాలని గృహస్థు దేవుని ప్రార్థించేవాడు. తనకు పుట్టబోయే బిడ్డ మగబిడ్డే కావలనే భావం ఏర్పడింది. ఈ భావం ఆడబిడ్డ వద్దనేంతవరకు పెరిగింది. తల్లి ఒడిలో మగశిశువు ఉన్నట్లుగానే ఊహించుకునే వర్ణనలున్నాయి. తన భార్య గర్భస్థ పిండాన్ని దుష్టగ్రహాలు పుత్రునికి బదులు పుత్రికగా మార్చకూడదని ప్రార్థించారు. వివాహం తప్పని సరయింది. మంచి భర్త కోసం చేసిన ప్రార్థనలున్నాయి. ఋగ్వేదకాలం కంటే వివాహానికి ఎక్కువ ప్రాధాన్యముంది. వివాహం కాని ఆడపిల్ల జీవితం దుర్భరం. ఆమెకు యమధర్మరాజే భర్త అనే భావం ఉంది. మంచి భర్త, మంచి పుత్రుల కోసం స్త్రీలు ప్రార్థించారు.

వధూవరులు ఇష్టపడితే తల్లిదండ్రులు వివాహం నిశ్చయించేవారు. బ్రాహ్మ, గాంధర్వ వివాహాలు అమలులో ఉన్నాయి. యువతి ప్రేమను పొందడం కోసం మంత్రతంత్రాలతో ప్రయత్నించిన సందర్భాలున్నాయి. ఇంట్లోని వారంతా నిద్రపోతున్న సమయంలో ప్రేమికుడు ప్రియురాలిని కలిసిన వర్ణన కన్పిస్తుంది. సమన అనే ఉత్సాహంలో అందరి ప్రశంసలు పొందడం వివాహానికి ఎదురుచూస్తున్న ఆడపిల్లకు మంచి గుర్తింపు. స్త్రీ తెచ్చే వరదదక్షిణనుబట్టి ఆమె విలువ పెరిగింది. వధువుగా ఉన్న స్త్రీని "మంచి బిడ్డలకు తల్లివిగా ! అదృష్టాన్ని, ఐశ్వర్యాన్ని తీసుకవచ్చి నీ భర్తకు విధేయురాలివై మసలుకో ! అమరత్వానికి దారితీసిన దానవవుతావు" అని విధేయతను ప్రదర్శించమని చెప్పే దశ వచ్చింది.

పితృదేవతలకు అర్ఘ్యం యివ్వడానికి పుత్రుడు అవసరం కనుక అతడి కోసం అనేక వివాహాలు చేసుకోవడం జరిగింది. అవివాహితయైన స్త్రీకి పుత్రులు కలిగితే వారిని సమాజం గుర్తించింది. అథర్వణ వేదకాలపు స్త్రీ పిల్లలను కని వారిని పెంచి పోషించి పెద్ద చేయగలిగిందేకాని ఋగ్వేదకాలపు స్త్రీలాగ జీవిత భాగస్వామిని కాలేకపోయింది. ఈమె నాలుగు గోడలకు పరిమితమైపోయి ఆమె పుట్టటమే దురదృష్టకరంగా మారింది.

## 2.4 ముగింపు :

నేటి సమాజానికి కావ్యాలు దర్పణాలైనట్లే నాటి సమాజానికి మణిదర్పణాలు వేదాలు. సంస్కృత సాహిత్యం లౌకిక సాహిత్యం, అలౌకిక సాహిత్యమని రెండు విధాలు. అపౌరుషేయమైన వేద వాఙ్మయం అలౌకిక సాహిత్యం. ఏకరాశిగా ఉన్న వాఙ్మయాన్ని వ్యాస భగవానుడు నాల్గువిధాలుగా విభాగించి వేదవ్యాసుడైనాడు.

సంహిత, బ్రాహ్మణ, ఆరణ్యక, ఉపనిషత్తులని వేదవాఙ్మయం నాల్గు విధాలుగా విభజింపబడింది. ఈ నాల్గు విధాల సాహిత్యాన్నీ వైదిక సాహిత్యం అంటారు. అట్టి వైదిక సాహిత్యంలో స్త్రీ ఆధిక్యం అనేక విధాలుగా చెప్పబడింది. ఋగ్వేదంలో 22వ సూక్తం 9వ మంత్రం నందు "ఓ అగ్నీ! నీవు దేవతల పత్నులను తీసుకొని రమ్ము". 10వ మంత్రము నందు "ఓ అగ్నీ! నీవు మమ్ము రక్షించుటకు దేవపత్నులను, నీ పత్నిని తీసుకుని రమ్ము". 12వ మంత్రము నందు "మా యజ్ఞమునకు శుభములు కలిగించుటకు ఇంద్రపత్నిని, అగ్ని పత్నిని, వరుణ పత్నిని సోమపానమునకు ఆహ్వానించుచున్నాను". ఈ మంత్రముల వలన దేవతలతో పాటు వారి పత్నులకు కూడా సమాన స్థానము లభించినట్లు తెలియుచున్నది. ప్రత్యేకించి మా యజ్ఞమునకు శుభం కలిగించుటకు అనుట వలన స్త్రీ సహితము కాని యజ్ఞం శుభావహం కాదని చెప్పబడినది. ఇది స్త్రీ ఆధిక్యమును చెప్పక చెప్పుచున్నది. స్త్రీలను సోమపానమునకు ఆహ్వానించినందువలన వారి స్వయం ప్రతిపత్తి వెల్లడియగుచున్నది. స్త్రీ స్వేచ్ఛను కూడా సూచించుచున్నది. అత్యంత నాగరికములని చాటుకొనుచున్న యూరప్ సమాజములో నేటకీ, లేని స్త్రీ సమానత్వం వేల వేల సంవత్సరాలకు పూర్వమే ఋగ్వేదంలో ఉన్నట్లు పై మంత్రాలు చాటిచెప్పున్నవి. 126వ సూక్తం 6వ మంత్రము నందు బిడ్డను కన్న ముంగిస ఎలా వారిని విడిచి ఉండదో అలా భార్యను భర్త విడువకూడదు. అను విషయం సోదాహరణముగా చెప్పబడింది.

3వ మండలం 2వ అష్టకం 1వ అనువాకం 7వ సూక్తం 4వ మంత్రం "ఇంద్ర! గృహిణియే గృహము" అని చెప్పబడింది. "నగృహం గృహమిత్యాహుః గృహిణీ గృహ ముచ్యతే" అను సూక్తి వెలువడుటకు ఈ మంత్రమే మూలకారణమనిపించును.

ఋగ్వేదం 4వ అష్టకం 5వ మండలం 1వ అనువాకం 30వ సూక్తం 90వ మంత్రం "నముచి" అను రాక్షసుడు స్త్రీలను యుద్ధ సాధనములగు యుద్ధసేనలుగా చేసినట్లు చెప్పబడింది. ఇది నేటి అత్యాధునిక యుగము నందు కూడా లేని విశేషము. దీనిని బట్టి నేటి కంటే నాడే స్త్రీలు అన్నిరంగములలో సమానత్వమును వహించిరని తెలియుచున్నది. 61వ సూక్తం నందు "శశీయసి" అను స్త్రీవృత్తాంతం చెప్పబడింది. 61వ సూక్తంలో 8వ మంత్రము నందు శశీయసి భర్తను మాత్రమే స్తుతించుట సంపూర్ణ స్తుతి కాదనియు శశీయసిని కూడా సోత్రం చేసినప్పుడే పరిపూర్ణమగునని చెప్పుట వలన స్త్రీ యొక్క ఆధిక్యం మరియు "వియా జానాతి జసురిం - - - " అను మంత్రము నందు శశీయసి ఆధిక్యం చెప్పబడింది. శశీయసి వల్లనే భర్తకు కీర్తి కల్గింది. ఈ సందర్భము నందు చెప్పబడిన మరియొక వృత్తాంతము కూడా స్త్రీల ఆధిక్యముచే తెలియచేయుచున్నది.

రథవీతి అను రాజు ఆత్రేయ వంశజుడైన అర్చనానుని హోతగా ఏర్పరచాడు. యజ్ఞ సందర్భమున హోత రాజకూతురిని చూసాడు. ఆమెను తన కొడుకు శ్యావాశ్వునకు ఇవ్వవలసినదని రాజును అడిగాడు. రాజు అందుకు అంగీకరించినా రాణి ఋషి కాని వారికి తన కుటుంబములోని పిల్లను ఇవ్వనన్నది. శ్యావాస్వుడు ఆ పిల్లను వివాహమాడదలచి ఋషి కాదలచాడు. కఠోర నియమాలు పాటిస్తూ భిక్ష చేయుచూ సంచారం సాగించాడు. సంచారంలో శశీయసిని కలిసాడు. ఆమె అతని రాకను గుర్తించి భర్తకు చెప్పింది. శశీయసి భర్త తరంతరుడు వచ్చిన వానిని ఆదరించమని చెప్పాడు. శశీయసి పశువులను ఆభరణములను శ్యావాశ్వునకు ఇచ్చింది. తరంతరుడు ధనం ఇచ్చాడు. శ్యావాశ్వుని రాజు తన తమ్ముడు పురుమీహ్లుని వద్దకు పంపాడు. శ్యావాశ్వుడు పురుమీహ్లుని వద్దకు వెళ్ళుచుండగా దారిలో మరుత్తులు దర్శనమిచ్చారు. శ్యావాశ్వుడు వారిని స్తోత్రం చేసాడు. మరుత్తులు శ్యావాశ్వుని ఋషిగా గుర్తించి వేదస్తోత్రముల ద్రష్టను చేసారు.

ఆవిధముగార ఋషి అయి శ్యావాశ్వుడు రథవీతిని చేరాడు. అతడు తన భార్య సమ్మతితో తన కూతురిని శ్యావాశ్వునకిచ్చి వివాహం చేసాడు. 6వ మండలం, 5వ అష్టకం 6వ అనువాకం 8వ సూక్తం 4వ మంత్రంలో "ఇంద్రావరుణులారా! మానవులలో స్త్రీ పురుషులు, సమస్త దేవతలు, స్వయంగా ఉద్యతలై మిమ్ము స్తుతులతో వర్థిల్ల చేసినప్పుడు మీరు మహిమాన్వితులు కండి.

వారికి ప్రభువులు కావలసినది" ఈ మంత్రం నందు స్త్రీపురుషులు అని ప్రత్యేకంగా స్త్రీకి భాగస్వామ్యం కల్పించుట గమనింపదగిన విశేషం. 95వ సూక్తం నందు సరస్వతి యొక్క ఆధిక్యం చెప్పబడింది.

10వ మండలం 5వ అష్టకం 7వ సూక్తం 10వ మంత్రం "స్త్రీల మీద యుద్ధం చెయ్యటానికి పంపేవాడి ధనాన్ని హరించి భక్తులకిచ్చెదను". ఈ ఇంద్రవచనం అనుసరించి మహిళా సైన్యవిభాగం కలదనియు వారిపైకి పురుషులను పంపుట సముచితం కాదనియు తెలియుచున్నది. 94వ సూక్తం నందు స్త్రీ ఔన్నత్యం చెప్పబడింది.

"రణాయ వర్థయన్దస్యుహత్యాయ దేవాః" అని ఊర్వశి పురూరవుని ప్రబోధించినది. ఇది నేడు "కరణేషు మంత్రీ" అను వాక్యానికి మూలం. దేవతలు నిన్ను యుద్ధమునకు దస్యుహత్యకుగాను వర్థిల్లచేసిరి. అని పురూరవునకు కర్తవ్యమును ఎఱుకపరచినది. నేను వచ్చినప్పటినుండి నీవు నాకొంగు పట్టుకొని తిరుగుచున్నారు. రాచకార్యములను మరచినావు. వాటిని నిర్వర్తించుము. పురూరవుని కర్తవ్య పరాయణుని చేయుటకే ఆమె స్వచ్ఛందముగా విరహమును కోరినది. ఆమె హృదయమున వలపు గూడు కట్టుకొని సూదులు గుచ్చుచున్ననూ భరించినది. పురూరవుని కంటే ఊర్వశీ విరహం రెండింతలు. ఆమె బిడ్డను ప్రియునకు ఇచ్చుటకును సిద్ధపడినది. ఆమె వేదన అక్షరములకందనిది. ప్రేమ, త్యాగము స్త్రీకి మాత్రమే సాధ్యమగునను విషయమును చాటినది. "నవై స్త్రైణాని సఖ్యా సన్తి" అనుట కేవలం పురూరవుని మందలించుటకే కాని సత్యము కాదను దాశరథి గారి వచనము పై వేదమంత్రమునకు మరింత వన్నె చేకూర్చినది.

109వ సూక్తంలో బృహస్పతి ఆతని భార్యయైన జుహును వదిలివేసాడు. అందువల్ల అతనికి బ్రహ్మహత్యాపాపం చుట్టుకుంది. 1వ మంత్రం అప్పుడు దేవతలు, సప్తర్షులు ఈమె అత్యంత పవిత్రమైన శీలము కలది అని మరల బృహస్పతికి అప్పచెప్పినారు. ఆ సందర్భంలో బృహస్పతి తపస్సు చేసినాడు. ఈ సూక్తం ఏడు మంత్రాలతో కూడి ఏడడుగుల సంబంధమైన వివాహాన్ని వివాహంతోపాటు ఏడేడు జన్మల బంధాన్ని కూడా సూచిస్తోంది.

యజుర్వేదం 7వ కాండ 13వ అనువాకం 3వ మంత్రము నందు స్త్రీలతో ఇంద్రుని భార్య పతివ్రత అని చెప్పబడింది. ఇంద్రుడు తన బ్రహ్మహత్యా పాపం యొక్క మూడవ భాగాన్ని స్త్రీలకు పంచినాడు. ఇంద్రుడు భరించలేని ఆ పాపాన్ని స్త్రీలు స్వీకరించారు.

సామవేదం 7వ ఖండము నందు ఉషాదేవి స్తుతించబడినది. అథర్వణ వేదము నందు పోయిన వస్తువు జాడ తెలుసుకొనుటకు రజస్వల కాని స్త్రీల ఉపయోగం చెప్పబడింది.

"సేనేంద్రస్యధేనా . . . . . . . . . . . . "

"ఇంద్రుడు, బృహస్పతి మొదలగు దేవతల భార్యలైన సేనా, ధేనా మొదలగు స్త్రీలు ఈ యజ్ఞమునకు వైకల్యం లేకుండా చేయుదురుగాక" అని చెప్పుట వలన యజ్ఞము నందు దేవతల పత్నులను కూడా గౌరవించుట వలన స్త్రీల విశిష్టత స్పష్టమగుచున్నది.

"అయజ్ఞో వా ఏషః యో అపత్నీకః" పత్ని లేకుండగా యాగము చెయ్యరాదను ఈ మంత్రం స్త్రీ ఆధిక్యమును నిరూపించినది. కృష్ణ యజుర్వేద బ్రాహ్మణము నందు "భగస్యాపరాహ్ణః . . . . . . . . ." స్త్రీలు అలంకరించుకొనుటకు అపరాహ్ణకాలం సౌభాగ్యదేవత యొక్క కాలం కావున ఆ సమయమున అలంకరించుకొనవలెనని వేదం చెప్పుచున్నది.

వివాహ సమయము నందు "నాతిచరామి" అని పురుషుడే ప్రమాణము చేయును.

"మూర్ధానం పత్యురారోహ ప్రజయా చ విరాట్భవ" అని గంగాదేవి పరమేశ్వరుని నెత్తినెక్కినట్లు నీవు నీ భర్త శిరస్సునెక్కుము అని పతి శిరఃస్థానమును సతికి సూచించుట స్త్రీ ఆధిక్యమునకే చిహ్నము.

వేద వాఙ్మయంలో స్త్రీలు గృహిణి, మాతృమూర్తి, సహచరి అని మూడు పదములతో వ్యవహరింపబడటం స్త్రీ గౌరవాధిక్యాలనే సూచిస్తోంది. నమస్కారవిధి యందు మాతృదేవతదే అగ్రతాంబూలం. "పితుశ్శత గుణం మాతా" అని తండ్రి కంటే తల్లి నూరురెట్లు గొప్పదని వేదవాఙ్మయం ఘోషించింది.

పురుషునకు వలెనే స్త్రీకి కూడా పునర్వివాహ వ్యవస్థ చెప్పినది. పరిణామశీలమైన కాలం వలెనే సమాజంలో మార్పులు వచ్చుటచే నాటి వేద సందేశం వైదిక సాహిత్యము నందలి స్త్రీ స్థానం నేడు కనుమరుగగుచున్నది. జా బాల సత్యకాములు జాబాల అను తల్లి పేరుతోనే ప్రసిద్ధుడౌట స్త్రీ మహత్త్వ సూచకమే. అలనాటి స్త్రీ వైశిష్ట్యాన్ని గుర్తించిన కవి సమ్రాట్టులు తమ ఆంధ్రప్రశస్తిలో "వేదకాలము నాటి ముత్తైదువట్లు" అని పురలక్ష్మిని వైదిక సాహిత్యంలోని స్త్రీతో పోల్చుట నాటి స్త్రీ ఔన్నత్యాన్ని తెలియచేయుచున్నది.

పత్నీహి సర్వస్య మిత్రం మిత్రత్వాయ - లోకంలో పత్ని సర్వజనులకు మిత్రురాలని, సూర్యుడు తన ప్రియురాలైన ఉషాదేవిని అనుసరించే నడుస్తుంటాడని పేర్కొనడం వల్ల స్త్రీ పాశస్త్యం తెలుస్తుంది.

## 2.5 ప్రశ్నలు :

1. ఋగ్వేద కాలం నాటి సమాజాన్ని పరిశీలించండి.
2. వైదిక యుగమందలి స్త్రీ స్థితిగతులను పేర్కొనండి.

## 2.6 సంప్రదించవలసిన గ్రంథాలు :

1. ఋగ్వేద సంహిత
2. వేదసార రత్నావళి - ఉప్పులూరి గణపతిశాస్త్రి
3. యుగయుగాల్లో భారతీయ మహిళ - జె. వరలక్ష్మి

**- డా॥ యు. ప్రహ్లాద నాయుడు**

పాఠం - 3

# మనుధర్మ శాస్త్రం

**ప్రణాళిక :**

3.0 ఉద్దేశ్యం
3.1. మనుధర్మశాస్త్ర పరిచయం
3.2. స్త్రీలకు ప్రత్యేక ధర్మాలు
  1) స్త్రీలు - సమస్యలు
  2) స్త్రీల స్వభావం - లక్షణాలు
  3) స్త్రీలు - నియమాలు
  4) స్త్రీ ధనం - రకాలు
  5) స్త్రీ - వివాహ స్వరూపం - పద్ధతులు
3.3. ద్వంద్వ నీతి ప్రమాణాలు
3.4. ముగింపు
3.5. మాదిరి ప్రశ్నలు
3.6. ఉపయుక్త గ్రంథాలు

## 3.0 ఉద్దేశ్యం :

ధర్మశాస్త్రాలలో మనుధర్మశాస్త్రం ముఖ్యమైనదని, మనువు చెప్పిన స్త్రీ ధర్మాలను, స్త్రీల హక్కులను పరిచయం చేయడం.

## 3.1 మనుధర్మ శాస్త్ర పరిచయం :

**స్మృతులు :**

ధర్మశాస్త్రాలు దాదాపు 46 ఉన్నాయి. ధర్మశాస్త్రాలు రాసిన వాళ్ళల్లో గౌతముడు, బోధాయనుడు, సిష్ఠుడు ముఖ్యులు. అనేక విషయాల మీద వీరికి ఏకాభిప్రాయం లేదు. ధర్మశాస్త్రాల ఆధారంగా తరువాత స్మృతులు రచించబడ్డాయి. మనుస్మృతి, యాజ్ఞవల్క్య స్మృతి, నారదస్మృతి, పరాశర స్మృతి వాటిలో 'మనుస్మృతి' ముఖ్యమైనది.

**మనుస్మృతి :**

మనుధర్మశాస్త్రం క్రీ.పూ. 105వ సం॥లో బ్రాహ్మణ సాంప్రదాయాలకు అనుగుణంగా రచించబడిందని పరిశీలకుల అభిప్రాయం. మనుధర్మ శాస్త్రం హిందూ న్యాయశాస్త్రానికి పునాది లాంటిది. హిందూ న్యాయశాస్త్రానికి మూలం మనుధర్మ శాస్త్రం మాత్రమేకాదని, కౌటిల్యుని అర్థశాస్త్రం కూడా ప్రముఖపాత్ర వహిస్తుందని 'జైస్వాల్' పేర్కొన్నాడు.

"యత్ర నార్యస్తు పూజ్యన్తే రమంతే తత్రదేవతాః" అంటూనే "పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే" అంటూ " న స్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అన్నాడు. ఇలా ఒకదానితో ఒకటి సంబంధంలేని భావాలు మనుధర్మశాస్త్రంలో కనిపిస్తాయి. ఇది ఒక వ్యక్తి రచన కాదని, మనువులు అనేకమంది ఉన్నారని, ఈనాడు మనం చెప్పుకుంటున్న మనుధర్మశాస్త్రం వైవస్వత మనువు చేత రచించబడిందని అంటారు. ఇతను చివరివాడు. మనువు అనేది ఒక పదవేగాని పేరు కాదని మరికొందరి భావన.

మను భృగు మొదట ఈ స్మృతిని రచించాడంటారు. మనువు సమాజాన్ని దృష్టిలో పెట్టుకొని, కుటుంబ శ్రేయస్సును కాంక్షించి, బిడ్డల సంరక్షణ, వివాహ వ్యవస్థ, కుటుంబ విధానం ఎలా ఉండాలో ఆలోచించి కొన్ని నియమాలు విధించాడు. మొదట రాసిన మనుధర్మ శాస్త్రానికి కాలక్రమంగా అనేక మార్పులు చేర్పులు జరిగి ఉండవచ్చు. మనుధర్మ శాస్త్రం క్రీ.పూ. 200 నుండి క్రీ.శ. మధ్యకాలం నాటిదని డా॥ కానే; 2000 సంవత్సరాల నాటిదని జయస్వాల్ పేర్కొన్నారు.

మనువు ధర్మశాస్త్రంలో స్త్రీకి కొన్నిచోట్ల మంచిస్థానం కల్పించాడు. కానీ కొన్నిచోట్ల స్త్రీపట్ల కఠినంగా వ్యవహరించాడు.

**"ప్రజానార్థం మహాభాగాః పూజార్హ గృహదీప్తయః**
**స్త్రియః శ్రియశ్చగేహేషున విశేషో స్తిఽ కశ్చన"**

సంతానం కలగడానికి కారణభూతులు స్త్రీలు. వీరు మహోపకారులు. వీరు వస్త్రాలు, భూషణాలతో సన్మానింపదగినవారు. స్త్రీలును, శ్రీలును ఇంటికి కాంతినిస్తారు. శ్రీ (సంపద) లేని గృహం ఎలా ప్రకాశింపదో అలానే స్త్రీలేని గృహంకూడా రంజిల్లదు అన్నాడు.

**"ఉత్పాదనమపత్యస్య జాతస్య పరిపాలనం**
**ప్రత్యహం లోక యాత్రా యాః ప్రత్యక్షం స్త్రీ నిబంధనమ్"**

బిడ్డను కనడం, బిడ్డను పోషించటం, ప్రతిరోజు అతిధి మిత్రులకు భోజనం పెట్టడం మొదలైన పనులు జరగడానికి ప్రత్యక్షంగా భార్య కారణం. ఇవన్నీ భార్య విధులుగా చెప్పి, సంతతి, స్వధర్మానుష్ఠానం, శుశ్రూష, అనురాగం, తనకు, తన పితరులకు స్వర్గం మొదలైనవన్నీ భార్య ఆధీనాలంటాడు.

**"ద్విధా కృత్వాత్మనో దేహమర్థేన పురోషో భవత్**
**అర్థేన నారీ తస్యాం సవిరాజ మస్సృజత్ప్రభుః" తతతత**

బ్రహ్మ తన దేహాన్నీ రెండుగా విభజించుకొని ఒక భాగాన్ని పురుషుడుగాను, మరోభాగం స్త్రీగాను అయ్యాడు. ఆ పురుషుడు ఆ స్త్రీ యందు విరాట్టును సృషించాడు. స్త్రీ పురుషులను సృష్టించడంలో బ్రహ్మ ఎలాంటి వ్యత్యాసం చూపలేదు. ఇద్దరినీ సమానంగా తన శరీరంలో సగభాగంలో నుండే సృష్టించాడు. కానీ అలా సృష్టించబడిన పురుషుడు ఆ స్త్రీ నుండి విరాట్టును సృష్టించి తన ఆధిపత్యాన్ని చాటుకున్నాడు.

స్త్రీలకు పేర్లు పెట్టడంలో కూడా మనువు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాడు. సులభంగా ఉచ్చరించడానికి వీలయ్యేవి, క్రూరమైన అర్థాన్నివ్వనివి, వ్యక్తార్థముగానివి, మనోహరం, మంగళవాచకం, దీర్ఘాచ్చు చివరగలదయి చివరగా ఆశీర్వాదమును ఇచ్చునదై ఉండాలట.

ఉదా : యశోదా దేవి, భారతీదేవి.

**స్త్రీలకు జాతక కర్మ మొదలైన సంస్కారాలన్నీ కాలం తప్పుకుండా శాస్త్ర ప్రకారంగా వారి శరీర పరిశుద్ధి కోసం అమంత్రకంగా చేయాలి.**

**"వైవామికో విధిః స్త్రీణాం సంస్కారో వైదిక స్మృతః**
**పతి సేవా గురౌ వాసో గృహార్థో గ్ని పరిక్రయా"**

స్త్రీలకు వివాహమే ఉపనయనం. పతి శుశ్రూషే గురుకుల వాసం గృహకృత్య నిర్వహణే అగ్ని హోత్రం. కాబట్టి వివాహం మొదలైన వాటిని ఉపనయనాదులతో పోల్చిచెప్పాడు. చదువు, సంధ్యల ప్రాముఖ్యం చూపలేదు.

ఆచార్యుడు పరమాత్మ స్వరూపుడు. తండ్రి హిరణ్యగర్భ స్వరూపుడయితే తల్లి భూదేవి స్వరూపురాలు గనుక దేవతా స్వరూపులయిన వీరికి నమస్కరించాలన్నాడు. ఎంత కోపం వచ్చినా, బాధపడినా తల్లిదండ్రులను తిరస్కరించుకూడదన్నాడు. తల్లిదండ్రులు పిల్లల కోసం పడే కష్టాన్ని నూఱు సంవత్సరాలయినా తీర్చుకులేరన్నాడు. వీరి శ్రమ ఎన్ని జన్మలకైనా తీరదు. తల్లిదండ్రులకు, గురువులకు ఎప్పుడూ ప్రతీతి కలిగేలా చేయాలి. వారు తృప్తిపడితేనే సకల తపస్సులు పూర్తవుతాయి. వారి ముగ్గురికి సేవ చేయడమే ఉత్తమ తపస్సు. వారి అనుమతి లేకుండా మరి ఏ ఇతర పుణ్యకార్యం చేయకూడదు. వారు ముల్లోకాలు వారే వేదాలు. త్రేతాఙ్నులు. తండ్రి గార్హపత్యమనే అగ్ని. తల్లి దక్షిణాగ్ని గురువు అహవనీయ అగ్ని. ఈ అగ్నిత్రయం మిక్కిలి శ్రేష్టమైనది. ఎవరు ఈ ముగ్గురినీ ఆదరించరో వానిని ఎవరూ ఆదరించరు. ఎవరు వీరిని తిరస్కరిస్తారో అతని స్మార్త క్రియలన్నీ విఫలమవుతాయి. స్త్రీగాని, శూద్రుడుగాని ఏదైనా మరచి పనిచేసేటప్పుడు దానిని చక్కగా ఆలోచించి చేయాలి. శాస్త్రనిషిద్ధం కాని పనిని చేయాలంటూ శూద్రునితో సమానంగా స్త్రీని భావించాడు. అలాగే

**"యత్రనార్యస్తు పూజ్యంతే రమంతే తత్రదేవతా :**
**యత్రై తాస్తు న పూజ్యంతే సర్వాస్తత్రా ఫలాః క్రియాః'**

ఎక్కడైతే స్త్రీలు గౌరవింపబడతారో అక్కడ దేవతలు ఉంటారు. ఎక్కడ మన్నన లేదో అక్కడ చేసే పనులన్నీ నిష్ఫలాలే అంటూ స్త్రీ మీద గౌరవం చూపించాడు. ఏ కులంలో తోబుట్టినవారు, భార్యలు, కోడళ్ళు, దాయాదులు అయిన స్త్రీలు పిత్రాదులచే పూజితులు కారో ఆ కులం శీఘ్రంగా నశిస్తుంది. ఎక్కడైతే వీరంతా పూజాదులచే బాధలు లేకుండా ఉంటారో ఆ కులం సర్వదా అభివృద్ధి చెందుతుంది. తమకు గౌరవం లేనందువల్ల స్త్రీలు ఏ కులాన్ని శపిస్తారో ఆ కులం శక్తితో కొట్టబడినట్లు నశిస్తుంది అన్నాడు కాబట్టి.

**"తస్మాదేతాః సదా పూజ్యా భూషణాచ్ఛాదనా శనైః**
**భూతి కామైర్నరైర్నిత్యం సత్కారేషూ త్సవేషు చ" (3-59)**

ఐశ్వర్యం కావాలనుకునే మానవులు ఉత్సవాలలోనూ, వివాహాలలోనూ తోబుట్టువులు మొదలైన వారిని ఎల్లప్పుడు వస్త్ర భూషణాలతో సత్కరించాలి.

## 3.2. స్త్రీలకు ప్రత్యేక ధర్మాలు :

ప్రాణి ఒంటరిగానే పుడతాడు. ఒంటరిగానే లయిస్తాడు. ఒంటరిగానే సుకృతుడవుతాడు. కాబట్టి తల్లి, తండ్రికన్న ధర్మం ముఖ్యమని స్త్రీకి కొన్ని ముఖ్యమైన ధర్మాల్ని చెప్పాడు.

**"బాలయా వా యువత్యావా వృద్ధయా వాపి యోషితా**
**న స్వాతంత్ర్యేణ కర్తవ్యం కించిత్కార్యం గృహేష్వపి"**

బాలికైనా, యువతి అయినా, వృద్ధురాలైనా స్త్రీ ఇంటిలో స్వతంత్రంగా ఏ పనినీ చేయకూడదు. ఇంటిలో నిర్ణయాధికారం ఆమెకు ఇవ్వలేదు.

**"బాల్యే పితుర్వశే తిష్ఠేత్పాణి గ్రాహస్య యౌవనే**
**పుత్రాణాం భర్తరి ప్రేతే న భజేత్ స్త్రీ స్వతంత్రతామ్"**

స్త్రీ బాల్యంలో తండ్రి వశంలోనూ,యౌవనంలో భర్త ఆధీనంలోనూ ఉండాలి. భర్త చనిపోయిన తర్వాత పుత్రుల అధీనంలోనే ఉండాలి తప్ప ఎన్నడూ స్వేచ్ఛతో జీవించరాదు.

తండ్రిని, భర్తను, కొడుకును వదిలి జీవించరే స్త్రీ మాతా పితరుల వంశాలు రెండింటికి చెడ్డపేరు తెస్తుంది.

భర్తకు తనమీద ప్రేమ లేకున్నా భార్య నవ్వు ముఖంతో ఇంటి పనులలో నేర్పరితనం కలిగి ఇంటిలోని వస్తువులను చక్కగా సర్దుకుంటూ ఖర్చు పెట్టనిదై ఉండాలి.

తండ్రి కన్యను ఎవరికిస్తాడో లేక తండ్రి అనుమతితో సోదరుడు ఎవరికి ఇస్తాడో అతడు జీవించి ఉన్నంతకాలం అతనికి సేవచేస్తూ ఉండాలి. అతడు చనిపోయిన తర్వాత మరో పురుషుణ్ణి వివాహం చేసుకోకూడదు. వ్యభిచార వృత్తి చేయకూడదనీ, భర్తకు శ్రాద్ధ తర్పణాలు చేయకుండా ఉండకూడదని పరలోకాన్ని పొందదగిన క్రియలు చేయనందువల్ల భర్తను అధోగతికి పంపిన వారవుతారన్నారు.

మొదట వాగ్దత్తం జరిగిన వెంటనే భర్తకు భార్యపై ప్రభుత్వం (అధికారి) కలుగుతుందట. వివాహ సమయంలో శాంతికోసం చెప్పే మంత్రాలను చదవడం, ప్రజాపతి కోసం చేసే హోమం ఇవన్నీ ఆమె మంగళార్థమే. వివాహం చేసుకున్న భర్త ఇహలోకంలో సుఖాన్నిస్తాడు. తనను ఆదరించడం వలన పరలోక సుఖం కూడా ఇస్తాడట.

**"విశీలః కామవృత్తోవా గుణైర్వా పరివర్జితః**
**ఉపచర్యః స్త్రియా సాధ్వ్యాసతతం దేవవత్పతిః"**

సదాచార శూన్యుడైనా, మరో స్త్రీ మీద అనురాగం కలవాడైనా, విద్యాది సుగుణాలు లేకపోయినా భర్తను పతివ్రత అయిన స్త్రీ ఎల్లప్పుడూ పూజించాలట.

పురుషుడు భార్య లేకపోతే మరో భార్య వలన యజ్ఞం చేయవచ్చు. కానీ స్త్రీ ఒక భర్తను వదిలి మరో భర్తతో యజ్ఞం చేయకూడదు. భర్త అనుమతిలేకుండా వ్రతంగానీ, ఉపవాసం గానీ చేయకూడదు. భర్తకు సేవ చేయడం వల్లనే భార్య స్వర్గలోకంలో పూజ్యురాలవుతుంది.

భర్తమీద ప్రేమగల స్త్రీ భర్త ఉన్నా, చనిపోయినా అతనికి వ్యతిరేకంగా ఏ పనీ చేయకూడదు. చనిపోయిన భర్తకు ఇష్టంలేని పని చేయడం - అంటే మరో పురుషునితో కలవడం లేక శ్రాద్ధం చేయకుండా ఉండటంగా భావించాలి.

**"కామం తు క్షపయేద్దేహం పుష్పమూల ఫలైశ్శుభైః**
**న తు నామాపి గృహ్ణీయాత్ పత్యౌప్రేతే పరస్యతు"**

భర్త చనిపోయిన తర్వాత పతివ్రత అయిన స్త్రీ పరిశుద్ధమైన కందమూలాలతో దేహాన్ని కృశింపచేయాలే తప్ప పరపురుషుని పేరు కూడా స్మరించకూడదు.

పతివ్రత అయిన స్త్రీ భర్త మరణించిన తర్వాత ఏ వ్రతాలు చేయవచ్చో అవి చేస్తూ మద్యమాంసాలు సంభోగం కోరనటువంటిదై మరణించే వరకు బ్రహ్మచర్యాన్ని పాటించాలి. అంటే పుత్ర సంతానం కోసం పరపురుషుణ్ణి కోరకూడదు.

సనక, వాలభిల్యాది బ్రాహ్మణులు వేలకొలది మంది బాల్యం నుంచే బ్రహ్మచర్యం పాటించి సంతానం లేకుండానే పరలోకానికి వెళ్లారు. కనుక సంతానం లేదనే దుఃఖం పొందకూడదు. ఆమె కూడా ఆ బ్రహ్మచారులవలె పుత్రులు లేకపోయినా పుణ్యలోకం పొందుతుంది.

పుత్రుల నాశించి ఏ స్త్రీ పరపురుషునితో కలుస్తుందో ఆ స్త్రీ ఈ లోకంలో నిందల పాలవుతుంది. పరలోకంలో ఆ కుమారుని వలన స్వర్గాది పుణ్యలోకాలు పొందదు.

భర్త లేకుండా మరో పురుషుని వలన పుట్టిన సంతానం ఆమెకు శాస్త్రీయమైన సంతానం కాదు. పతివ్రతలైన స్త్రీలకు ఎక్కడా రెండవ భర్తను చెప్పలేదు. దీనినిబట్టి విధవా వివాహం (నిషిద్ధం) అప్రసిద్ధం.

ఎవరు నికృష్టుడైన భర్తను వదిలి గొప్పవాడిని భర్తగా పొందాతారో వారు ఆలోకంలో నిందితులవుతారు.

పరపురుషునితోడి సాంగత్యం వలన అపవాదం పొందడమేకాక చనిపోయిన తర్వాత నక్కగా పుడుతుందట. కుష్ఠు మొదలైన నికృష్ఠ రోగాల పాలవుతుంది.

ఏ స్త్రీ మనోవాక్కాయములచేత భర్తను వదిలి మరొకరిని కోరదో ఆమె భర్త ఉండే లోకానికి వెళుతుంది. పతివ్రత అని పెద్దలచే గౌరవింపబడుతుంది. మనోవాక్కుల చేత వ్యభిచారం చేయకూడదని అర్థం.

ఈ స్త్రీ ధర్మాలతో నడుచుకున్న స్త్రీ ఈ లోకంలో గొప్ప కీర్తి పొంది చనిపోయిన తర్వాత భర్తృలోకాన్ని పొందుతుంది.

## 1 స్త్రీలు - సమస్యలు :

స్త్రీ సమస్యల్ని కూడా మనువు స్పృశించాడు.

**ఓలి : (కన్యాశుల్కం)**

**"కన్యాయాం దత్తశుల్కాయాం మ్రియతేయది శుల్కదః**
**దేవరాయ ప్రదాతవ్యాయాది కన్యానుమన్యతే"**

వరుడు ఒక కన్యను వివాహం చేసుకొనదలచి ఓలి ఇచ్చిన తర్వాత అతడు చనిపోతే ఆ కన్యను మఱిదికిచ్చి చేయాలి. శాస్త్రం తెలియని వాడైనా, శూద్రుడైనా కన్యనిచ్చి ఓలి తీసుకోకూడదు. ఓలి గైకొన్నవాడు కన్యను అమ్ముకున్నట్లే. పూర్వం ఓలిని తీసుకొన్నారని గాని, కన్యా విక్రయానికి పెద్దలు పాల్పడ్డారనే విషయంగాని మేము వినలేదన్నాడు.

**"తథానిత్యం యతే యాతం స్త్రీ పుంసౌ తు కృత క్రియౌ**
**యథా నాభిచరేతాం తా వియుక్తా వితరేతరమ్"**

స్త్రీ, పురుషులు వివాహం చేసుకొని ధర్మార్థ కామాలలో ఒకరినొకరు వదలకుండా జీవించేలాగ ప్రయత్నించాలి. ఇది ముఖ్యమైన ధర్మం.

**"అన్యాం చేద్దర్శయిత్వా న్యావోఢుః కన్యా ప్రదీయతే**
**ఉభేతే ఏకశుల్కేన వ హేదిత్య బ్రవీన్మనుః"**

ఓలి తీసుకొని కన్యనిచ్చేవాడు మొదట మంచి లక్షణాలుగల కన్యను చూపించి, తర్వాత అవలక్షణాలు గల కన్యనిచ్చినట్లయితే ఆ వరుడు ఈ ఓలికి ఇద్దరు కన్యలను స్వీకరించగల హక్కు కలిగినవాడు అవుతాడు. అలాగే ఇంకోచోట

**"న కన్యాయాః పితా విద్వాన్ గృహ్ణీయాచ్ఛుల్కమణ్వః**
**గృహ్ణంఛ్ఛుల్కం హి లోభేన స్యాన్నరోఽపత్య విక్రయీ"**

వివేకి అయిన కన్నతండ్రి వరుని దగ్గర నుండి కొద్దిగావైనా ఓలి తీసుకోకూడదు. లోభంతో స్వీకరిస్తే అతడు బిడ్డను అమ్ముకున్నట్లే.

కన్యకు వివాహకాలంలో ఇచ్చిన ధనాన్ని, వాహనాలను వస్త్రాలను తాము ఉపయోగించుకున్నట్లయితే అలాంటిఆరు పాపాలు చేసినవారై అధోగతి పాలవుతారు.

ఆర్ష వివాహంలో గోమిధునాన్ని (ఒక ఎద్దు, ఆవు) ఓలిగా తీసుకొనవచ్చని కొందరు అన్నారుగాని అది అబద్ధం. ఓలి కొద్దిగా పుచ్చుకున్నా అది అమ్మడంతో సమానమే.

వివాహ కాలంలో బంధువులు స్త్రీ దగ్గర నుండి సుంకం (ఓలి) తీసుకోకపోతే అది అమ్మడం కాదు. ఆమెకు ప్రీతితో ఇచ్చిన ధనాన్ని ఆమె కోసమే వాడాలి. వివాహ సమయంలో వరుడు ఇచ్చిన ధనమే కాకుండా ఆమె మేలుకోరె తల్లిదండ్రులు, తోబుట్టువులు, మఱుదులు ఇచ్చినది కూడా స్త్రీ ధనమే. స్త్రీలను భోజనాదులచే పూజించి వస్త్రాభరణాలతో ఆదరించాలి.

అలాగే కన్యాశుల్కం గూర్చి చెబుతూ . . .

**"పిత్రే న దద్యాచ్ఛుల్కం తు కన్యామృతు మతీం హరన్**
**సహి స్యామ్యాదతి క్రామే దృతూనాం ప్రతి రోధనాత్"**

ఋతువతియైన కన్యను వివాహం చేసుకున్న వరుడు కన్నతండ్రికి 'ఓలి' ఇవ్వనక్కరలేదు. తన బిడ్డ ఋతుకార్యమైన సంతతిని ఆపుట వలన ఆమె మీదున్న అధికారాన్ని కోల్పోయాడు. (సకాలంలో వివాహం చేయలేకపోవటం)

30 ఏళ్ళవాడు 12 సం॥ల అమ్మాయిని, 24సం॥ల వాడు 8 సం॥ల అమ్మాయిని వివాహం చేసుకోవాలని వయోభేదాన్ని చూపాడు.

ఏకన్య తనకు దేవతలచే ఇవ్వబడిందో ఆ దేవతలకు ప్రియం కలిగేటట్లు ఆమెను భార్యగా స్వీకరించాలే తప్ప స్వతంత్రించకూడదు. పతివ్రతయైన తన భార్య తనకు విరోధియైనా దేవతలకు మేలు చేస్తూ ఆమెకు కూడుగుడ్డలిచ్చి పోషించాలి.

అలాగే ఉత్తమమైన కన్య గూర్చి చెబుతూ తల్లికి సపిండురాలు, తల్లికి సగోత్రురాలు కాని కన్య ద్విజులకు అగ్ని ఆ దానాది కర్మలకు, సంతతికి ప్రశస్తమన్నాడు.

**"కామమా మరణాత్తి ష్ఠేద్గృహే కన్యర్తు మత్యపి**
**న చైవైనాం ప్రయచ్ఛేత్తు గుణహీనాయ కర్హిచిత్"**

విద్యాగుణాలు లేనివాడికి కన్యనిచ్చే కంటే ఋతుమతియైన కన్యను జీవితాంతం అవివాహితగా తండ్రివద్దనే ఉంచటం మంచిది అన్నాడు. మంచి కులములో పుట్టినవాడు, చక్కని రూపు, సజాతీయుడు వరుడుగా లభించినపుడు తగిన వయసు రాకపోయినా కన్యను బ్రహ్మాది వివాహ విధానంలో వివాహం చేయమన్నాడు.

ఋతుమతియైన కన్యను తగిన వరునకిచ్చి తండ్రి వివాహం చేయనపుడు ఆమె 3 సం॥లు నిరీక్షించి మంచి లక్షణాలు గలవాడు దొరకకపోతే తనతో సాటియైన వానిని వివాహం చేసుకోవచ్చు. ఇలా వివాహం చేసుకున్నందువల్ల ఆమెకుగాని, ఆమె భర్తకుగాని ఎలాంటి పాపము రాదు. స్వయంగా తానే భర్తను ఎంచుకొని వివాహం చేసుకున్న స్త్రీ వివాహానికి పూర్వం ఆమెకు తల్లిదండ్రులు గాని, అన్నదమ్ములుగాని ఇచ్చిన ఆభరణాలను తిరిగి ఇవ్వాలట. అలా ఇవ్వకపోతే ఆమె దొంగ అనిపించుకుంటుంది అన్నాడు.

అలాగే కన్యను దానం చేసేటప్పుడు -

**"అద్భిరేవ ద్విజాగ్ర్యాణాం కన్యాదానం విశిష్యతే**
**సర్వంశ్రుణుత తం విప్రాః సర్వం కీర్తయతోమమ" (3 - 39)**

బ్రాహ్మణ కన్యను దానం చేసేటప్పుడు జలధారతోపాటు చేయాలట. మిగిలిన వర్ణాలకి ఈ నియమం లేదంటూ కన్యాదానంలో కూడా వర్ణ విభేదాన్ని ప్రదర్శించాడు.

## 2. స్త్రీల స్వభావం - లక్షణాలు :

మంచినీరు ఉప్పునీటి సముద్రంలో కలిసి ఉప్పయిన విధంగా స్త్రీ మంచి గుణాలున్న భర్తనుగానీ, చెడ్డగుణాలున్న భర్తనుగానీ ఎంచుకున్నప్పుడు (వివాహితం తర్వాత) ఆమె భర్త గుణాల్ని పొందుతుంది. అందుకు ఉదాహరణ కూడా చెప్పాడు మనువు. 'అక్షమాల' అనే నీచజాతి కన్య వశిష్ఠుని, 'చటక' అనే స్త్రీ మందపాలుడనే ఋషిని వివాహం చేసుకొని ప్రజల మన్ననలు పొందారు.

**ఏతాశ్చాన్యాశ్చలోకేఽస్మిన్న పకృష్ట ప్రసూతయః**
**ఉత్కర్షం యోషితః ప్రాప్తాః స్వైస్వైర్భర్తృ గుణైశ్శుభైః"**

అనేకమంది అధమజాతిలో పుట్టిన స్త్రీలు మేలిమి గుణాలు గల భర్తలను పొంది వారి మేటి లక్షణాల వలన తాముకూడా గొప్పదనాన్ని పొందారు. ఇది లోక మర్యాద అన్నాడు.

ఏ స్త్రీ వాక్కునకు, దేహానికి కట్టుబడినదై భర్తను తప్ప పరపురుషుని కోరదో అలాంటి భార్యభర్తతోపాటు పుణ్యలోకాన్ని పొందుతుంది. సజ్జనులచేత సాధ్వి అనిపించుకుంటుంది.

**"వ్యభిచారాత్తు భర్తుః స్త్రీలోకే ప్రాప్నోతి నింద్యతాం**
**సృగాల యోనిం చాప్నోతి పాప రోగైశ్చ పీడ్యతే"**

పరపురుషుని పొందువలన స్త్రీ లోక నిందిత అవుతుంది. జన్మాంతరంలో నక్కగా పుడుతుంది. పాపరోగాలచే పీడింపబడుతుంది. ఈ రెండు శ్లోకాలు స్త్రీ ధర్మాలను చెప్తూ పంచమాధ్యాయంలోనూ, సంతతిని గూర్చి చెబుతూ తొమ్మిదో అధ్యాయంలోనూ మళ్ళీ చెప్పాడు. సంతానం కోసం పాతివ్రత్యం ఎంత ముఖ్యమో నొక్కి చెప్పదలచుకున్నాడు మనువు అని దీనినిబట్టి అర్థమవుతుంది.

అలాగే భార్యకు కొన్ని లక్షణాలు ఉండాలని చెబుతూ

**"విధాయ వృత్తిం భార్యాయాః ప్రవసేత్కార్యవాన్నరః**
**అవృత్తి కర్శితాహి స్త్రీ ప్రదుష్యేత్ స్థితిమత్యపి"**

భార్యకు కూడు, గుడ్డలు మొదలైన వసతులు ఏర్పరచిన తర్వాత భర్త కార్యాంతరం దేశాంతరం వెళ్ళాలి లేనిచో ఆమె పతివ్రతయైనా అన్నపానాదులు లేనందువల్ల, వేరొక పురుషుని దరి చేరుతుందన్నాడు. అతడు దేశాంతరం వెళ్ళాక అలంకారం చేసుకోకూడదనీ, పొరుగు ఇండ్లకు వెళ్లకూడదని నియమాలు విధించాడు. భర్త ఏమీ ఇవ్వకుండా వెళ్ళినట్లయితే నూలు వడుకుతూనో లేక ఎవరిచేత దూషింపబడని పని చేసుకుంటూనో జీవించాలన్నాడు.

అలాగే శౌచాది గుణాలు కలిగిన వారైన స్త్రీలు చపలబుద్ధి గలవారు కనుక అప్పు తీసుకున్న మొదలైన విషయాలలో విచారించవలసి వచ్చినపుడు సాక్షులుగా పనికిరారు.

మద్యపానం, దుష్టుల సహవాసం, భర్తను వదిలి ఉండటం, త్రిమ్మరితనం, పొరుగిండ్లలో నివశించడం, ఈ ఆరు లక్షణాలు స్త్రీలు చెడిపోవటానికి మార్గాలు. ఎందుకంటే యౌవనంలో లేనివాడైనా, అందగాడినైనా, కురూపినైనా పురుషుడైతే చాలని తలంచి అనుభవిస్తారు. పురుషుణ్ణి చూడగానే వానిని పొందాలనే తపనతో మనసు నిలవకుండటం వలన ప్రయత్న పూర్వకంగా సంరక్షించబడే భార్యలు వ్యభిచార దోషం వలన భర్తల మీద అనురాగం మానుకుంటారని వివరించాడు.

బ్రహ్మ సృష్టి చేసినప్పటినుండి వీరి స్వభావం ఇలా ఉందిగదా అని తెలుసుకొని వారిని అదుపులో పెట్టడానికి ప్రయత్నించాలట. స్త్రీలకు శయ్య, భూషణాలు, కామోద్రేకాలు, కపటం, పరద్రోహం, పరహింస, కుత్సితపు నడవడి ఉన్నాయని మనువు చెప్పి, అందువలన వారిని పురుషులు సంరక్షించాలంటాడు.

## 3. స్త్రీలు - నియమాలు :

స్త్రీల విషయంలోనూ, వివాహ విషయంలోను చాలా జాగ్రత్తగా వ్యవహరించాడు మనువు. స్త్రీ గుణవంతుడిని పొందితే గుణవంతమైన సంతతి, గుణహీనుని పొందితే గుణహీనమైన సంతతి కలుగుతుంది. పరిశుద్ధమైన సంతానం కోసం భార్యను కాపాడే ప్రయత్నం చెయ్యాలి. అందుకని స్త్రీలకు కొన్ని నియమాల్ని చూపాడు.

సంభోగాపేక్షతో తన కంటే ఉత్కృష్టజాతి పురుషుని కలిసిన స్త్రీని కొంచెం కూడా దండన చేయకూడదు. హీనజాతి పురుషుని కోరిన స్త్రీని గృహ నిర్భంధంలో ఉంచి అతడికి దూరం చేయాలి.

హీనజాతి పురుషుడు ఉత్కృష్టజాతి స్త్రీని ఆమె ఇష్టంతో గాని, ఇష్టం లేకపోయినా మోహంతో అనుభవిస్తాడో అతడు లింగచ్ఛేదన వధకు అర్హుడు. సమానజాతి స్త్రీని అతనిని ఇష్టపడిన ఆమెను పొందినట్లయితే ఆమె తండ్రిని ఒప్పించి అతడడిగిన ఓలిని ఇచ్చి ఆమెను వివాహం చేసుకోవాలి.

ధనమున్నదన్న గర్వంచేత గానీ, సౌందర్యవంతురాలిననే గర్వంతోగాని, పరపురుషుని రాకవలనగాని, భర్తను ఉల్లంఘిస్తే ఆ స్త్రీని అనేకమంది జనులున్న ప్రదేశంలో కుక్కలచే తినిపించాలని రాజుకు బోధించాడు.

బ్రాహ్మణ స్త్రీని శూద్రుడు కలిస్తే రక్షణ లేని స్త్రీ అయితే అతనికి లింగచ్ఛేదన చేసి ధనమంతా లాక్కోవాలి. రక్షిత స్త్రీ (భర్త మొదలైన వారిచే) అయితే దేహాన్ని నరికివేసి సర్వధనం లాక్కోవాలి.

రక్షితమైన బ్రాహ్మణస్త్రీని వైశ్యుడు కలిసినట్లయితే ఒక సం॥ చెఱలో వుంచి వాని సకల ధనం తీసుకురావాలి. క్షత్రియుడు పొందితే వెయ్యి రూకలు చెల్లించాలి. గాడిద ఉచ్చతో తల గొరిగించాలి. రక్షణలేని బ్రాహ్మణ స్త్రీని వైశ్యక్షత్రియులు పొందినట్లయితే వైశ్యునకు 500 రూకలు, క్షత్రియునకు వెయ్యి రూకలు దండన వేయాలి.

గుణవతి, సంరక్షితయగు బ్రాహ్మణిని వైశ్య, క్షత్రియులిద్దరునూ చేరినట్లయితే శూద్రుని వలె వారిని చాపలో చుట్టి నిప్పుపెట్టి కాల్చాలి.

రక్షితమైన బ్రాహ్మణిని బలవంతంగా పొందిన విప్రునికి వెయ్యి రూకలు దండన. వధ అంటే బ్రాహ్మణునికి బోడితల చేయడమే (గుండు) మిగిలిన వారికి వధ అంటే ప్రాణం తీయడమే. అలాగే రెండు నెలలు నిండిన గర్భిణీస్త్రీని పడవకేవు (బాడిగ) తీసుకోకుండా దాటించాలని భావించాడు.

**"భార్యాపుత్రశ్చ దాసశ్చ త్రయ ఏవాధనాః స్మృతాః**
**యత్తే సమధి గచ్ఛంతి యస్యతే తస్య తద్ధనమ్" (7 - 41)**

పుత్రుడు, భార్య, దాసుడు వీరు ధన హీనులని మనువు అభిప్రాయం.

వీరు ఏకారణంచేత ధనం సంపాదించినా అది వారు ఎవరి సంబంధులో అది వారిదే అవుతుంది.

ఈ విధంగా స్త్రీలకు కొన్ని నియమాల్ని సూచించాడు. అలాగే స్త్రీ యొక్క సంరక్షణను కూడా చెప్పాడు.

భర్త రేతస్సు రూపంలో భార్య యందు ప్రవేశించి గర్భమై ఆ భార్య యందు పుత్రుడుగా జన్మిస్తున్నాడు. అందుకే భార్యకు 'జాయ' అని పేరు. అంటే భర్త తన భార్య వలననే మరలా జన్మిస్తున్నాడు గనుక ఎల్లప్పుడూ స్త్రీని రక్షించాలని మనువు

చెప్పాడు. స్త్రీలను బలవంతంగా కాపాడటం ఎవరి తరమూ కాదు. అందువలన ఏ ఏ ఉపాయాలతో వారిని కాపాడవచ్చో చెప్పాడు. ధనాన్ని కాపాడటం, వ్యయపరచడం, శరీరాన్ని పరిశుద్ధపరచడంలోనూ, భర్తకు శుశ్రూష చేయడంలోనూ, వంట వార్పులోనూ, ఇంటిలోని వస్తువులను సంరక్షించడంలోనూ వారిని నియమించాలి. కాపలావాళ్ళతో రక్షింపబడే భార్యలు రక్షితులు కాదు. ఏ స్త్రీ తనను తాను కాపాడుకుంటుందో ఆమె రక్షిత అన్నాడు.

అలాగే జాతకర్మ, నామకరణాలు స్త్రీలకు మంత్రవత్తుగా లేవని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి గనుక వీరు పాపరహితులు కాదు. మంత్రాలతో చెప్పలేరు గనుక పాపాలు పోగొట్టుకోలేరు. ప్రమాణాలయిన వేదస్మృతులను చదువనివారు ధర్మజ్ఞులు కారు. పాపాలను పోగోట్టే మంత్రాలు, జపాలు చేయరు గనుక పాపం చేసినప్పుడు దానిని పోగొట్టే శక్తిలేక అబద్ధం వలె అశుభలు (కల్లమాడిన శుభాలు) అని శాస్త్రాలు చెప్తున్నాయి. కాబట్టి వారిని రక్షించాలి, ఇలా ఏ శాస్త్రాలు చెప్పాయో మనువు చెప్పలేదు.

స్త్రీలకు వ్యభిచారం స్వాభావికమనీ, అందుకు వేదవాక్యాలు ప్రమాణాలని చెప్తూ అందుకు ప్రాయశ్చిత్తాన్ని కూడా తెలుపుతానంటూ ఒక ఉదాహరణ చూపించాడు.

**"యన్మేమాతా, ప్రలులుభే విచర్యంత్య పతివ్రతా**
**తన్మే రేతః పితావృఙ్క్తాం మిత్యస్యైతన్ని దర్శనమ్"**

ఒక పుత్రుడు తన తల్లి యొక్క మానసిక వ్యభిచారాన్ని తెలుసుకొని ఇలా అంటున్నాడు. మనోవాక్కాయ కర్మల చేత భర్తను తప్ప మరొకరిని కోరని స్త్రీ పతివ్రత. అలాంటిదికాని స్త్రీ అపతివ్రత (వ్యభిచారిణి). మా తల్లి అపతివ్రతయై పొరుగిండ్లకేగి పరపురుషుని కోరింది. అలా పరపురుషుని తలంచడం వల్ల దురదృష్టమైన మా తల్లి యొక్క రజోరూపమైన తేజస్సును మా తండ్రి శోధించును గాక. ఇది మంత్రవాక్యము. ఇది నిదర్శనమంటాడు మనువు. భర్తకు ఏదైనా చెడుచేయాలనే తలంపు స్త్రీకున్నట్లయితే అలాంటి వ్యభిచార దోషానికి ఈ మంత్రం చక్కని ప్రాయశ్చిత్తమని మనువు మొదలైనవారు చెప్పారు. ఇందులో 'మాతా' అనడం వలన ఈ మంత్రం పుత్రునికి ప్రాయశ్చిత్తంగా చెప్పబడిందని తెలుస్తుంది గానీ, తల్లికి కాదు.

అలాగే కొన్నిచోట్ల స్త్రీలను సంగ్రహించిన వారికి శిక్షలు విధించాలని చెప్పాడు. ఉన్మాది (వెఱ్ఱిది), కుష్ఠురోగి, వివాహానికి పూర్వమే పురుష సంపర్కం గల స్త్రీని వరునకిచ్చేటప్పుడు ఆమె దోషాలను ముందే ఓలి తీసుకునే పిల్ల తండ్రి వరునకు చెప్పినట్ల యితే అతడు దండనార్హుడు కాడు. లేనిచో అతడు శిక్షార్హుడు.

తల్లిని, తండ్రిని, భార్యను, తోడబుట్టిన వానిని, కొడుకును, గురువును నిందించేవారికి, గురువుకు దారిఇవ్వని వారికి 100 రూకలు దండనగా విధించాలి.

భార్య, పుత్రుడు, నౌకరు, శిష్యుడు, తోడబుట్టిన తమ్ముడు నేరం చేస్తే వారిని తాటితోగాని, బెత్తంతోగాని కొట్టాలి. అలా కొట్టేటప్పుడు వీపు లేక శరీరభాగం మీద మాత్రమే కొట్టాలి తప్ప తలపై కొట్టగూడదు.

అలాగే స్త్రీలను సంగ్రహించిన మానవులకు చెవులు, ముక్కులు, పెదవులను కోయుట మొదలైన వెగటు కలిగించే శిక్షలు వేసి దేశభ్రష్టుల్ని చేయాలి. ఇతరుల భార్యలను పొందినందు వలన వర్ణ సంకరం కలిగితే ఆ కారణంగా వర్ణసంకరం వలన నిర్మలమైన భార్యలు గల గృహస్థులు లేకపోతే యజ్ఞాది క్రియలు సరిగాజరగవు. అధర్మం పెరిగిపోయి సృష్టియను జగన్మూలానికి నాశనం కలుగుతుందన్నాడు.

ఏటి రేవులలో గాని, అడవులలో గాని ఊరిది. వెలుపల పొదలు తీగలు గల నిర్జన ప్రదేశాల్లోగాని, అనేక వృక్షాలతో నిండి వుండే వనాలలోగాని, నదీ సంగమమునందు గాని పరస్త్రీతో కారణమున్నా సరే ఏ పురుషుడైనా మాట్లాడితే అతడు పరస్త్రీ సంగ్రహాభిలాషి గలవాడని ఎంచి వెయ్యి రూకలు దండన చెల్లింపవలసిన వాడవుతాడు.

పూలదండలు, గంధం మొదలైనవి ఆమెకు పంపడం, వేళాకోళం చేయడం, కౌగిలింత, సొమ్ములు, వస్త్రాలు తాకడం, ఒక మంచం మీద కూర్చోవడం యివన్నీ సంగ్రహణానికి (పర స్త్రీల వలపునకు) సంకేతాలని మనువు చెప్పాడు.

ఎవడు స్త్రీని తాకరాని ప్రదేశాలలో తాకుతాడో, ఆ స్త్రీ తనను అట్టి తాకరాని తావులలో తాకినా ఊరుకుండునో వారు పరస్పరం సంభోగాభిలాష గలవారని గుర్తించాలి. వారు దోషులవుతారు.

బ్రహ్మణీతరుడు తనను ప్రేమించని బ్రాహ్మణ స్త్రీని కోరితే వాడు ప్రాణాంతమగు దండానికి అర్హుడు. అలాగే నాలుగు వర్ణాలవారు ధనాదుల కంటే భార్యను ఎల్లప్పుడూ జాగ్రత్తగా కాపాడుకోవాలి. ధన లాభం కోసం ఏ నటులు భార్యల మూలమున జీవింతురో అట్టి స్త్రీలతో ఎవరూ మాట్లాడినా తప్పు లేదంటూ నటులు, నాయకుల భార్యలకు నిషేధ విధానంలో మినహాయింపు యిచ్చాడు. బ్రహ్మచారిణిలైన బౌద్ధ సన్యాసినులు, బానిస స్త్రీలతోను సంభాషించిన వాడికి కొద్దిగా అపరాధం విధించాడు.

బ్రాహ్మణేతరుడు ఎవడు తనను కోరని కన్యను పొందునో వెంటనే లింగచ్ఛేదన దండన విధించడానికి అర్హుడు. యజమాని చేత అడ్డగింపబడిన సేవకుడు స్త్రీలతో మాట్లాడకూడదు. అట్లా మాట్లాడితే **16** మాషాల ఎత్తు బంగారు నాణ్యాలను అపరాధంగా చెల్లించాలి. పై విధంగా స్త్రీలకు కొన్ని నియమాల్ని మనువు చెప్పాడు.

## 4. స్త్రీ ధనం - రకాలు :

తల్లి చనిపోయిన తర్వాత ఆమె పుత్రులు, పెండ్లికాని కూతుళ్ళు తల్లి ధనం సమంగా పంచుకోవాలి. పెళ్లయిన కుమార్తెలకు తండ్రి ఆస్థిలో లాగానే తల్లి ఆస్తిలో కూడా నాలుగవ పాలు ఇవ్వాలి.

**"అధ్యగ్న్యధ్యావాహనికం దత్తం చ ప్రీతి కర్మణి**
**భ్రాతృ మాతృ పితృ ప్రాప్తం షడ్విధం స్త్రీధనం స్మృతమ్" (9 - 194)**

స్త్రీ ధనం '6' విధాలు. వివాహ కాలంలో అగ్నిముందు తండ్రి మొదలైన వారు కూతురుకిచ్చేది 'అధ్యగ్ని'. ఆమె అత్తవారింటికి వెళ్ళేటప్పుడు ఇచ్చేది 'అధ్యావాహనిక'. సంతోష సమయంలో భర్త మొదలైనవారు ఇచ్చేది, మిగిలిన సమయాలలో తోబుట్టువులు, తండ్రి ఇచ్చేది. వివాహం తర్వాత తండ్రి ఇంట్లో గాని, భర్త గృహంలోగాని దొరికింది, ప్రేమతో భర్త ఇచ్చేది. ఇవన్నీ భర్త జీవించియుండగా భార్య చనిపోతే ఆమె సంతానానికీ, ఆమె భర్తకన్నా ముందు చనిపోతే, సంతానం లేకపోతే ఆమె భర్తకు చెందుతాయి.

అసుర, రాక్షస, పైశాచిక వివాహాలలో మాత్రం సంతానం లేక చనిపోయిన స్త్రీధనం ఆమె తల్లిదండ్రులకు చెందుతుంది. బ్రాహ్మణుడు నాలుగు వర్ణాల స్త్రీలను వివాహం చేసుకుంటే క్షత్రియ, వైశ్య భార్యలు పిల్లలు లేకుండా చనిపోతే వారి స్త్రీధనం బ్రాహ్మణి సంతానానికి గాని, ఆమె సవతికి గాని చెందుతుంది. (బ్రాహ్మణి)

పెద్ద కుటుంబంలోని సభ్యురాలైన స్త్రీ ఉమ్మడి ధనం నుండి సొమ్ములు మొదలైన వానికోసం కొంతవేరుగా పెట్టకూడదు. భర్త అనుమతి లేకుండా అతని ధనం కూడా తీసుకోకూడదు. ఇది స్త్రీ ధనం కాదు. భర్త జీవించి ఉన్నప్పుడు అతడు చేయించిన ఆభరణాలను అతడు చనిపోయిన తర్వాత అతని పుత్రులు పంచుకోకూడదు. అలా చేస్తే పాపాత్ములవుతారు.

## 5. స్త్రీ - వివాహ స్వరూపం - పద్దతులు :

కపిల వర్ణపు జుట్టున్నది, పెద్ద శరీరం గలది, వ్యాధిగ్రస్తురాలు, ఎక్కువ రోమాలున్నది, కఠినపు మాటలు మాట్లాడునది, పచ్చని కనులు (పిల్లి కన్నులు) గల కన్యను వివాహమాడకూడదు.

నక్షత్రాలు, నదులు, వృక్షాల పేర్లు గల దానిని, హీనజాతి, పర్వతాల పేర్లు, భయంకరమైన పేర్లు గల దానిని వివాహం చేసుకోకూడదు. చక్కని మెఱవలు లేని అవయవాలు గలది, క్షామ్యమైన పేరుగలది, హంసలా, ఏనుగులా చిన్నగా నడిచేది, పలుచని రోమాలు, కురులు దంతాలు కలిగి మృదుశరీరం గల దానిని వివాహం చేసుకోవాలి.

ఏ కన్యకైతే తోబుట్టువు లేడో, ఎవరికి తండ్రి తెలియదో అలాంటి కన్యను పుత్రికాత్వశంక చేత, అధర్మ శంకతోను ప్రాజ్ఞుడైనవాడు వివాహం చేసుకోకూడదన్నాడు. అంటే సోదరుడు లేని కుటుంబం గనుక అచ్చంగా ఆడపిల్లలు పుడతారనే భయంతోను, తండ్రి ఎవరో తెలియదు గనుక అధర్మ సంతానమేమోననీ ఆ లక్షణాలు ఈ తరానికి కూడా వస్తాయేమోనన్న భయంతో నిరాకరించి ఉండవచ్చు.

బ్రాహ్మణ, క్షత్రియ వైశ్యులకు ప్రథమ వివాహం చేయవలసి వచ్చినపుడు బ్రాహ్మణస్త్రీనే చేయాలి. కామంతో ప్రవర్తించిన వారికి అనులోమ వివాహాలు శ్రేష్ఠం. కామియైన శూద్రునికి శూద్రకన్య, వైశ్యునకు శూద్ర, పరజాతి కన్యలు శ్రేష్ఠులు. క్షత్రియునకు శూద్ర, వైశ్య, స్వజాతి, బ్రాహ్మణునికి శూద్ర, వైశ్య, క్షత్రియ, బ్రాహ్మణ కన్యలు శ్రేష్ఠురాళ్ళు బ్రాహ్మణ, క్షత్రియులు కష్టాల్లో ఉన్నాసరే శూద్రకన్యను వివాహం చేసుకోవచ్చని యితిహాసాలలో ఎక్కడా లేదు. మోహంతో హీనజాతి స్త్రీని వివాహం చేసుకున్న బ్రాహ్మణుడు తన కులానికి, సంతానానికి శూద్రత్వం యిస్తున్నాడు.

శూద్రస్త్రీని వివాహం చేసుకున్న బ్రాహ్మణుడు భ్రష్టుడవుతాడని అత్రి, గౌతమ మహర్షులన్నారు. శూద్రస్త్రీ యందు పుత్రుని పొందిన క్షత్రియుడు పతితుడని భృగుమహర్షి అన్నాడు. శూద్రస్త్రీ వలన సంతతిగల బ్రాహ్మణుడు బ్రాహ్మణత్వాన్నేకోల్పోతాడని మనువు అన్నాడు. బ్రాహ్మణుడు తాను చేసే కర్మకాండలు శూద్రస్త్రీ చేత చేయిస్తే అవి దేవతలు, పితృదేవతలు స్వీకరించరని, ఆ విప్రునకు స్వర్గలోక ప్రాప్తి లేదన్నాడు. శూద్రస్త్రీ అథప్రాసం చేసినా, నిట్టూర్పు సోకిన వానికీ, సంతానం పొందిన బ్రాహ్మణునికి ప్రాయశ్చిత్తం లేదన్నాడు మనువు.

**అష్టవిధ వివాహాలు :**

**"బ్రహ్మో దైవస్త థైవర్ష ప్రాజాపత్యస్తథాసురః**
**గాంధర్వో రాక్షసశ్చైవ పైశాచశ్చాష్టయోఽధమః" (3 - 21)**

బ్రాహ్మం, దైవం, ఆర్షం, ప్రాజాపత్యం, అసురం, గాంధర్వం, రాక్షసం, పైశాచికం అని వివాహాలు ఎనిమిది విధాలు. ఇందులో పైశాచికం అధమం. ఏ వర్గం వారికి ఏది శాస్త్రీయమో, ఎలాంటి వివాహం వలన గుణాలు, దోషాలు సంభవిస్తాయో, ఎలాంటి వివాహం వలన పుట్టిన సంతానానికి ఎలాంటి గుణ గణాలు కలుగుతాయో వివరించాడు.

అష్టవిద వివాహాలలో మొదటి ఆరు బ్రాహ్మణులకి శాస్త్ర సమ్మతాలు. అందులోనూ మొదటి నాలుగు మేలని, క్షత్రియునికి రాక్షసం, వైశ్య, శూద్రులకు అసుర వివాహం మాత్రమే మేలని పెద్దలంటారని మనువు చెప్పాడు.

**వివాహ స్వరూపం :**

1) వేదాధ్యయనం చేసి ఆచారవంతుడైన బ్రహ్మచారిని పిలిపించి అతనికి మర్యాదలు చేసి అలంకరించిన కన్యను అతనికి ఇచ్చినట్లయితే అది బ్రాహ్మ వివాహం.

2) జ్యోతిష్టోమం మొదలైన యజ్ఞాలలో అధ్వర్యం చేసే ఋత్విజునకు అలంకరించిన కన్యనివ్వడం దైవ వివాహం.

3) యాగసిద్ధి కోసం గాని, కన్యనివ్వడానికి గాని ఒక గోమిధునాన్ని గాని రెండు వృషభాలనో వరుని వద్ద నుండి తీసుకొని శాస్త్ర ప్రకారంగా వరునకు కన్యనివ్వడం ఆర్షం.

4) మీ ఇద్దరూ కలసి ధర్మమాచరించడని చెప్పి వధువు తల్లిదండ్రులు వరుని పూజించి పిల్లనివ్వడం ప్రాజాపత్యం.

5) జ్ఞాతులకు, పిల్లకు కావలసినంత ధనమిచ్చి వాళ్ళ ఇష్టప్రకారం వివాహం చేసుకోవడం అసురం.

6) స్త్రీ పురుషులిద్దరి సమ్మతితో కలిసి జీవించడం గాంధర్వం. ఇది నామ సంబంధమైన దంటాడు మనువు.

7) కన్య బంధువులు ఇష్టపడకపోతే వారిని చంపిగాని, నరికిగాని, చీల్చిగాని బంధు నాశనం కోసం బాధపడుతున్న కన్యను బలవంతంగా తీసుకెళ్ళడం రాక్షసం.

8) నిద్రపోతున్న దానిని, ఏమరుపాటుతో ఉన్న దానిని గాని, కైపుతో ఉన్న దానిని గాని బలవంతంగా ఏకాంతంలో కలిస్తే పైశాచం. ఇది అధమం అన్నాడు.

అలాగే పెళ్ళయి సంతానంలేని స్త్రీ తన మగడు, గురువు, తల్లిదండ్రులు వీరి అనుమతి పొంది మరిది వలన గాని, సపిండదాయాదుల వలన గాని సమర్థుడైన పుత్రుని పొందవచ్చు. సంతాన యోగ్యత లేని భర్త అనుమతితో సంతానం ఇవ్వబోయేవాడు ఒళ్ళంతా నూనె పూసుకొని మౌనంగా ఒక పుత్రుని కలిగించవచ్చు. అంతకంటే ఎక్కువ అవకాశం తీసుకోకూడదు.

## పునర్వివాహం :

ఈ వివాహంలో పురుషుని గూర్చి చెబుతూ మొదటి భార్యకు ఎనిమిది సం॥లు సంతానం లేకపోయినట్లయితే ఎనిమిదోఏట, పుట్టిన బిడ్డలు చనిపోతుంటే పదో ఏట, ఆడపిల్లలు పుడుతుంటే 11వ ఏట, నిష్ఠూరాలు పలుకుతుంటే వెంటనే మరోస్త్రీని వివాహం చేసుకోవచ్చుట స్త్రీ రోగిష్టిదైనా భర్తకు అనుకూలంగా ఉంటూ, పాతివ్రతం కలదైతే ఆమె అనుమతితో వేరే వివాహం చేసుకొమ్మన్నాడు. ఆమెను అగౌరవముగా చూడవద్దన్నాడు. ఇక్కడ ఆమె పాతివ్రత్యానికి, అణకువకు విలువ ఇచ్చాడు.

భర్త మరో వివాహం చేసుకున్నాడని భార్య కోపంతో ఉన్నట్లయితే ఆ కోపం పోయేవరకు తాడుతో కట్టివేయడమో లేక పుట్టింట వదలడమో చేయాలన్నాడు.

## వితంతువు - వైధవ్యం :

**"అయం ద్విజైర్హి విద్వద్భిః పశుధర్మో విగర్హితః**
**మనుష్యాణామపి ప్రోక్తోవేనే రాజ్యం ప్రశాసతి"**

పశుధర్మమైన పునర్వివాహం పెద్దలైన విద్యాంసులచే నిందింపబడిది కనుక ఇది ఆచరింపకూడదు. వేనుడనే అధర్మిష్టుడు రాజ్యం చేస్తూ కామంచే బుద్ధి చెడ్డవాడై భ్రాతృ భార్యా సంగమం చేసి వర్ణసంకరాన్ని కలిగించాడు. అతని కాలం నుండే ఈ అధర్మం ప్రబలిందిన్నాడు. వేద కాలం నుండీ ఎవరైతే సంతానార్థం విధవకు నియోగం విధిస్తున్నారో వారంతా పెద్దలచేత నిందిపంబడతారన్నాడు.

విధవకు గర్భధారణ ప్రయోజనం నెరవేరిన తర్వాత పెద్దవాడు కోడలి వలె తమ్ముని భార్య తండ్రిలాగా చూసుకోవాలి. అన్నదమ్ములిద్దరూ తాము భార్యలతో పరస్పరం ఇష్టానుసారంగా జీవిస్తే వారు కోడలిని కలిసినవాడు, గురుభార్యను పొందినవాడిగా భావించి పాపం పొందుతారు.

బ్రాహ్మణుడు మొదలైనవారు స్త్రీని భర్తకంటె వేరొకని యందు నియమించకూడదు. అలా నియమించినట్లయితే స్త్రీల యొక్క పాతివ్రత్యాన్నీ, అనాది ధర్మాన్ని చెరిపిన వారవుతారు.

**"నో ద్వాహికేషు మంత్రేషు నియోగః కీర్త్యతేక్వచిత్**
**న వివాహ విధా వుక్తం విధవా వేదనం పునః"**

'అర్యమణం మదేవ కన్యా' అనే మంత్రాలలో ఎక్కడా నియోగం చెప్పబడలేదు. వివాహ విధిలో కూడా విధవకు పునర్వివాహం ఎక్కడా చెప్పబడలేదు.

**"ద్వితీయమేకే ప్రజనం మన్యంతే స్త్రీషు తద్విదః**
**అనిర్వృతం నియోగార్థం పశ్యంతో ధర్మ తస్తయోః"**

నియోగం వలన ఒక పుత్రుని పొందినా ఒంటి పుత్రుడు పుత్రులు లేనివాడే అనే పెద్దల వాడుకననుసరించి, నియోగ ప్రయోజనం నెరవేఱనట్లుగా భావించి రెండోపుత్రుని పొందటం యుక్తమేనని కొందరు భావించారు.

నియుక్తమైన స్త్రీకి శాస్త్రవిధి ప్రకారం శరీరం మీద నేతిపూత లేని పురుషునికి జన్మించిన పుత్రుడు ఆమె భర్త (క్షేత్రస్వామి) ఆస్తికి వారసుడు కాడు. ఎందుకంటే పతితుని వలన జన్మించాడు గనుక.

అన్నదమ్ములు ఆస్తులు విభజించుకున్న తర్వాత విధవయైన వదిన తన ఆస్తిని కాపాడుకోలేకపోతే ఆ ధనాన్ని కాపాడుతూ నియోగధర్మం చేత ఆమె యందు బిడ్డను కని అన్నగారి ఆస్తిని అతనికి అప్పచెప్పాలన్నాడు. మరిది వలన గానీ, దాయాదుల వలన గాని, కామం లేనటువంటి నియోగం వలన పుట్టిన పుత్రుడు క్షేత్రస్వామి ధనానికి అర్హుడని మనువు చెప్పాడు. ఇదంతా సవర్గ చర్యలకు చెల్లుతుంది.

అలగే కన్య గత నియోగం గూర్చి చెబుతూ ఒక కన్యను ఒక పురుషునికిచ్చి వివాహం చేస్తానని వాగ్దానం చేసిన తర్వాత అతడు చనిపోతే ఆమె మఱిది ఆమెను వివాహం చేసుకుని తెల్లని వస్త్రంతో వాఙ్మనః కాయశుద్ధి కలదైన ఆ కన్యను గర్భధారణ వరకు ఒక్కొక్క ఋతువులో ఒక్కొక్క సారే ఆమెను పొందాలట.

ఒక కన్యను ఒక పురుషునికి వాగ్దత్తం చేశాక అతడు చనిపోతే మరొకనికి ఆమెను ఇవ్వకూడదట. అలా చేస్తే అతడు పురుషానృత దోషాన్ని పొందుతాడన్నాడు. ఆ కన్య వైధవ్య లక్షణాలు గలది, రోగిణి దుర్లక్షణాలు గలది అన్నాడు. అలాంటి కన్యను తెలియక మోసగింపబడి వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పటికి సప్తపదికి ముందే తెలిసినట్లయితే ఆమెను వదిలిపెట్టినా దోషం లేదన్నాడు.

## 3.3 ద్వంద్వనీతి ప్రమాణాలు :

స్త్రీని క్షేత్రంతోనూ, పురుషుని బీజంతోనూ పోలుస్తారు కొన్నిచోట్ల బీజమైన సోమునికి (తండ్రి) బుధుని వలే, వ్యాసునికి ఋష్య శృంగునివలే బీజం ముఖ్యం. విచిత్ర వీర్యుని క్షేత్రమైన క్షత్రియకాంత యందు బ్రహ్మణుని వలన పుట్టినా దృతరాష్ట్రులు క్షేత్రసంబంధులై క్షేత్రస్వామి పుత్రులయ్యారు. రాజ్యపాలనకు సంతానం కావాలి గనుక ఇక్కడ క్షేత్రానికి ప్రాధ్యామిచ్చారని అనిపిస్తుంది. కాని మనువు -

'ఉభయం మ సమం యత్ర సా ప్రసూతిః ప్రశస్యతే'' - అంటూ బీజ క్షేత్రాలు రెండూ సమానమైన సంతతి శ్రేష్టమైనదని పెద్దలు అంటారు అన్నాడు.

బీజానికున్న వర్ణరూపాల చిహ్నాలు సకల జీవరాశుల ఉత్పత్తిలో ఉంటాయి. గనుక బీజయోనులలో బీజమే ప్రధానం అన్నాడు. వర్షం వలన పదును చేయబడిన నేలలో ఏ రకం విత్తనం వేస్తామో ఆ రకం మొక్క వస్తుంది. అదే విధంగా ఏ పురుషుని

బీజం స్త్రీ యందు వుంచబడుతుందో ఆ పురుషుని లక్షణాలతోనే ఆ బీజం (శిశువు) అభివృద్ధి చెందుతుంది అన్నాడు. క్షేత్ర ప్రధానమని కొందరంటారుగాని ఆ క్షేత్రంలో వేసిన బీజాలు దానికి కారణమైన క్షేత్ర గుణాలను పొందనట్లే యోని కూడా అంతే. అందువలన బీజమే ప్రధానమన్నారు. విత్తు ఒకటి వేస్తే చెట్టు ఒకటి మొలవదు. కనుక బీజమే ప్రధానమని, ఈ విధంగా బీజ క్షేత్రాల ప్రాముఖ్యం మన స్త్రీ పురుషుల మధ్యగల తారతమ్యాన్ని చెప్పాడు. అలాగే క్షేత్ర ప్రాధాన్యం గూర్చి చెబుతూ 'ఒక విలుకానిచే కొట్టబడిన మృగాన్ని మరో విలుకాడు బాణం వేసినా నిష్ప్రయోజనమైనట్లే పరక్షేత్రంలో వేసిన బీజం కూడా నిష్ఫలమౌతుంది. మొదట కొట్టిన వానిదే 'మృగం'.

పూర్వం పృథు చక్రవర్తి పృధ్విని చేపట్టినందు వలన తరువాత ఎంతోమంది రాజులు చేపట్టినా పృధువు భార్య అనే అన్నారు. అలాగే మొదట వివాహం చేసుకున్న వాడే క్షేత్రాధికారి.

పురుషుడు, భార్య, బిడ్డ ముగ్గురూ కలసి పురుషుడవుతాడు. కనుక ఎవరు భర్తో అతనిదే స్త్రీ. ఆ స్త్రీ నుండే కుమారుడు ఉద్భవిస్తున్నాడు గనుక అతను భర్తకే చెందినవాడు.

అలాగే తండ్రి తన ధనాన్ని అన్నదమ్ములకు ఒక్కసారే పంచిపెడతాడు. మరలా మరలా మార్చి చేయలేడు. తండ్రి చేత కన్య ఒక్కమారే ఒకనికి ఇవ్వబడుతుంది. తండ్రి ఒకవేళ వేరొకనికిచ్చినా ఆమెకు పుట్టిన బిడ్డ ఆ క్షేత్ర స్వామిదేకాని బీజస్వామిది కాదు. అలాగే గోవులు కూడా ఒకరికిచ్చాక మరొకరికి ఇవ్వకూడదు. సజ్జనులైనవారు ఈ మూడును ఒక్కసారే చేస్తారు. (అంటే పునర్వివాహాలు, బహుభర్తృత్వాలు సహించలేదు) జంతువులలో సంతానం పుట్టించిన వాడివలె పరస్త్రీయందు సంతానం పొందినవాడు ఆ సంతితికి సొంతగాడు కాదు. ఇలా చేయడాన్ని తన దగ్గరున్న విత్తనాలు చల్లడానికి భూమిలేక ఇతరుల పొలాల్లో చల్లితే అతనికెంత ఫలితమో ఇది కూడా అంతే అన్నాడు. ఈమె వలన సంతానం కలిగితే ఆ సంతానం మన ఇద్దరిదీ ఒప్పందం కుదిరితే ఇద్దరికీ చెందుతుంది. సొంత భార్యను వదలి పరభార్యయందు సంతానాన్ని పొందటం నదీవేగానికి, గాలికి కొట్టుకొని పోయిన బీజం వేరే క్షేత్రంలో మొలిస్తే ఆ ఫలితం క్షేత్ర స్వామిదైనట్లు ఇక్కడ కూడా సంతానం కలుగునపుడు అవలంబించాల్సిన ధర్మాన్ని చెప్పాడు.

**"భ్రాతర్జ్యేష్ఠస్య భార్యా యా గురు పత్న్యను జన్యసా**
**యవీయసస్తుయా భార్యా స్నుషాజ్యేష్ఠస్యసాస్మృతా"**

అన్న భార్య తమ్మునికి గురుపత్నితో సమానురాలు. తమ్ముని భార్య అన్నకు కోడలితో సమానమని మునులంటారు.

అలాగే పుత్రుడు గూర్చి చెబుతూ -

**"పుత్రేణ లోకాన్ జయతి పౌత్రేణానంత్యమశ్నుతే**
**అథపుత్రస్య పౌత్రేణ బ్రధ్యస్నాప్నోతి విష్టపమ్"**

మానవుడు తనకు పుత్రుడు కలిగినందువల్ల స్వర్గాది పుణ్యలోకాలను పొందుతాడు. పౌత్రుని జన్మవలన ఆ లోకాల్లో చిరకాలముంటాడు. పుత్రునికి పౌత్రుడు (ముని మనవడు) పుట్టిన యెడల సూర్య లోకాన్ని పొందుతాడు. ఆస్తి పంపకాల విషయంలో చెప్పబడిన ఈ విషయంవల్ల తండ్రి ఆస్తికి తల్లి కన్నా కుమారుడు, మనవడు, ముని మనవలకే అధికారమున్నదని చెప్పడమే మనువు అభిప్రాయం.

**"పున్నామ్నో నరకాద్యస్మాత్త్రాయతే పితరం సుతః**
**తస్మాత్పుత్ర ఇది ప్రోక్తః స్వయమేవ స్వయంభువా"**

పుత్ అనే నరకం నుండి తండ్రిని రక్షించేవాడు గనుక పుత్రుడు అని బ్రహ్మ తానే చెప్పాడని మనువు పేర్కొన్నాడు. పుత్రుడు తండ్రికి మహోపకారం చేస్తున్నాడు. కనుక పుత్రునికి, అతడి పుత్ర సంతానానికి తండ్రిధనం చేరుతుందని మనువు చెప్పాడు.

అలాగే పుత్రిక గూర్చి చెబుతూ -

**"అ పుత్రోనేన విధినా సుతాం కుర్వీత పుత్రికాం**
**యదపత్యం భవేదస్యాం తన్మమస్యాత్స్వధాకరమ్"**

పుత్రులు లేనివాడు తన కుమార్తెకు వివాహం చేసేటప్పుడు ఈమెను నీకిస్తున్నాను. ఈమెకు జన్మించే పుత్రుడు నాకు ఉత్తర క్రియలు చేయాలి అని అల్లునితో ఒప్పందం చేసుకుని ఆ కన్యను పుత్రికనుగా చేసుకోవాలి. ఇలాంటి ఆమెను 'పుత్రిక' అంటారు. దక్షప్రజాపతి కూడా ఈ విధంగానే తన వంశాభివృద్ధి కోసం తన దుహితలనందరినీ పుత్రికలుగా చేసి పదిమందిని యమునికి, పదముగ్గురిని కశ్యపునకు, 27గురిని చంద్రునికి ఇచ్చాడు. కొడుకు తండ్రితో సమానం. కూతురు కొడుకుతో సమానం. కనుక పుత్రులు లేని తండ్రి ధనం పుత్రికకే లభిస్తుంది. తల్లికున్న స్త్రీధనం తల్లి మరణించినట్లయితే పెండ్లికాని కూతుళ్ళకు వస్తుంది. కొడుకులకు భాగం లేదు. కొడుకులు లేని మాతామహుల ధనం పుత్రికా పుత్రునికి (మనుమనికి) చెందుతుంది. ఇతడు తండ్రికి, తాతకు ఇద్దరికీ పిండప్రదానం, శ్రాద్ధ కర్మలన్నీ చేస్తాడు. పౌత్రునికి, దౌహిత్రునికి తాతలకు ధర్మకార్యాలు చేయడంలో బేధం చూపలేదు. ఎందుకంటే వారి తల్లిదండ్రులు ఒకే తండ్రిబిడ్డలు గనుక. (కనుక ఇతనికి కూడా తాతగారి ఆస్తిని హరించే అవకాశముంది).

భర్త గొప్పదనం గూర్చి చెబుతూ -

**"భర్తుః పుత్రం విజనయంతి శ్రుతిద్వైధం తు భర్తరి**
**ఆహురుత్పాదకం కే చిదపరే క్షత్రిణం విదుః"**

భర్తకు పుత్రులు కలుగుతారని మునులు అభిప్రాయం చెప్పాడు ఈ భర్తల విషయంలో రెండురకాల అభిప్రాయాలున్నాయి. మొదటిది వివాహం చేసుకొనకపోయినా పుత్రులను పుట్టించిన వానిని భర్తయనీ, ఆ పుత్రుని వలన ఇతడు పుత్రవంతుడనీ కొందరి అభిప్రాయం. రెండవది వివాహం చేసుకుని తన ద్వారా తన భార్యకు పుత్రులు కలగకపోయినా వేరొకరి వలన కలిగిన పుత్రుని వలన తాను పుత్రవంతుడని చెప్పుకోవచ్చని కొందరి అభిప్రాయం. ఫలానా వారి కుమారుడని ఎవరిని పిలుస్తారో, ఎవరి పుత్రుడు ఆమెకు జన్మించినా, ఆమెతో సంబంధం చూపించకుండా పురుషుని పరంగా చెప్తూ భర్తకు పుత్రుడు కలుగుతాడని మునులన్నారని చెప్పాడు. ఎవరో పేర్కొనలేదు.

అలాగే భార్యాభర్తలు విషయంలో భిన్న ధోరణిని ప్రకటించాడు. ఎక్కడైతే భర్త వలన భార్య, భార్య వలన భర్త సంతోషంగా ఉంటారో ఆ కులంలో సంపద స్థిరంగా ఉంటుంది. ఏ స్త్రీ వస్త్రాభరణాలతో ప్రకాశింపదో అలాంటి స్త్రీ పురుషుని రమింపజేయదు. అలాంటి కోరిక కలుగనందున ఆ పురుషునికి సంతతి కలుగదు.

కాంత భర్త యందలి అనురాగంతో వస్త్రాలు, ఆభరణాలతో అలంకారం చేసుకొని కాంతితో మెరుస్తుంటే ఆ కులం వెలుగుతుంది. ఆ కాంత కాంతిహీనమైతే భర్తను రమింపజేయలేక కులమెల్ల చెరచినట్లవుతుంది. రజస్సుతో కూడిన స్త్రీని కలవకూడదనీ, ఆ సమయంలో ఒక పడక కూడా చేరకూడదనీ, ఆ స్త్రీని పొందిన వానికి బుద్ధి, వీర్యం, బలం, దృష్టి, ఆయుస్సు నశిస్తాయన్నాడు.

భార్యతో కలసి ఒకే పాత్రలో తినకూడదు. భోజనం చేస్తున్న దానిని, ఆవలిస్తున్న దానిని, తుమ్ముతున్న స్త్రీని, పైట లేకుండా ఉన్నదానిని, ప్రసవించుచున్న దానిని తేజస్సు కావాలనుకునే బ్రాహ్మణోత్తముడు చూడకూడదు.

అలాగే కొన్ని విషయాలలో స్త్రీలను నిర్లక్ష్యం చేశాడు. జడులు, మూగ, గ్రుడ్డి, చిలక, గోరువంక, ముదుసలి, మ్లేచ్ఛులు, రోలు, స్త్రీలు మొదలైన వారిని మంత్రాలోచన సమయంలో పారద్రోలాలట. ఎందుకంటే జడులు ఆధ్యాత్మికులు గనుక. పక్షులు, స్త్రీలు, ముదసలి చపలచిత్తులు గనుక ఆలోచనలను వెలిబుచ్చుతారట.

గూఢాచారుల వలన విషం పూసిన కత్తులు, ఆభరణాలు ఉన్నాయో లేదో చూసి, మరో మనసు లేకుండా చూచిన తర్వాతనే స్త్రీలకు చామరం మొదలైన సేవలు చేయడానికి నియమించాలి. భర్త దగ్గర జీవనాంశం గైకొన్న గౌడ్రాండ్రు, భర్త లేని స్త్రీలు, వంశహీనులైన స్త్రీలు, పతివ్రతలు, విధవలు, రోగిణులు మొదలైన వారి సొత్తును రాజు రక్షించాలన్నాడు.

అలాగే వర్ణవ్యత్యాసాన్ని గూర్చి చెబుతూ - బ్రాహ్మణునికి నాలుగు వర్ణాలకు చెందిన భార్యలున్నట్లయితే బ్రాహ్మణునికి పుట్టిన పుత్రునికి ప్రధాన భాగం చెందుతుంది. బ్రాహ్మణీపుత్రుడు 3 భాగాలు, క్షత్రియ సుతుడు 2 భాగాలు, వైశ్యసుతుడు 1 1/2, శూద్రపుత్రుడు 1 భాగాన్నీ తీసుకోవాలి. బ్రాహ్మణ, క్షత్రియ భార్యలు మాత్రమే ఉంటే దాయాభాగాన్ని 5 భాగాలు చేసి 3 బ్రాహ్మణి పుత్రునికి, 2 క్షత్రియ పుత్రునికి ఇవ్వాలన్నాడు. ఇలా కాదనుకుంటే దాయభాగాన్ని 10 భాగాలు చేసి 4,3,2,1, నిష్పత్తిలో నాలుగు వర్ణాల పుత్రులు తీసుకోవాలి. భార్యలు నలుగురిలో కూడా వర్ణ వ్యత్యాసం చూపిస్తూ బ్రాహ్మణికి విలువ నిచ్చాడు. అగ్రజాతుల వారు శూద్రస్త్రీని చేసుకోవచ్చు గాని శూద్రునికి సవర్ణ స్త్రీ మాత్రమే భార్యగా ఉండాలన్నాడు. హెచ్చు జాతికిగాని, తక్కువ జాతిది గాని ఉండకూడదన్నాడు.

ద్వాదశ పుత్రులను మనువు పేర్కొన్నాడు.

1) సవర్ణ స్త్రీ వలన పుట్టినవాడు ఔరసుడు
2) మృతుడు, నపుంసకుడు, సంతాన విరోధి, వ్యాధిగ్రస్తుడు మొదలైన వారి భార్య గురు నియుక్తమై నేతిపూతతో ఇతరుల వలన కలిగిన పుత్రుడు క్షేత్రజుడు.
3) పుత్రులు లేనందువల్ల ఆపద సమయంలో ప్రీతి పూర్వకంగా తల్లిదండ్రుల వలన ఇవ్వబడినవాడు దత్తుడు
4) సమాన జాతీయుడై తల్లిదండ్రుల శుశ్రూష చేసే వానిని పుత్రునిగా స్వీకరిస్తే అతడు కృత్రిముడు
5) తన భార్య ఎవరి ఇంట సజాతీయులైనా సరే , ఉండగా పుత్రుడు ఎవరికి పుట్టాడో తెలియనటువంటి వాడు గూఢోత్పన్నుడు
6) తల్లిదండ్రులను గాని వారిద్దరిలో ఒకరు చనిపోయిన తర్వాతగాని మరొకరిచేత వదలి పెట్టబడి, పిల్లలు లేని మరొకరిచేత పెంచబడితే అతడు అపవిద్ధుడు
7) తండ్రి ఇంట కన్యకు కలిగినవాడు కానీనుడు
8) గర్భవతి తెలిసో తెలియకో వివాహం చేసుకుంటే ఆమెకు పుట్టినవాడు సహోఢుడు.
9) తల్లిదండ్రుల దగ్గరినుండి ఎవరిని పుత్రునిగా కొంటాడో అతడు క్రీతుడు.
10) భర్త చేత వదిలిపెట్టబడిగానీ, అతను చనిపోయిన తర్వాత గానీ వేరొకరిని వివాహం చేసుకొని అతని వలన కుమారుని పొందితే అతడు పౌనర్భవుడు.
11) తల్లిదండ్రులు లేకనో లేక నిర్లక్ష్యం చేయబడటం వలనగానీ ఎవరు తనను తాను మరొకరికి అమ్ముకుంటాడో అతడు స్వయందత్తుడు

12) బ్రాహ్మణునికి శూద్రస్త్రీ యందు మోహంచేత పుట్టినవాడు శవంతో సమానం గనుక, 'పారశవుడు' అన్నారు. ఇతడే శూద్రాస్తుతుడు. ఇతనికి ఎలాంటి అధికారాలు, అర్హతలు లేవు. అందుకే శవంతో సమానం.

పై విధంగా వర్ణవ్యత్యాసాన్ని చూపించాడు.

భార్యాభర్తల విషయంలో, కుటుంబ విషయాల్లో చాలాచోట్ల ద్వంద్వనీతిని ప్రదర్శించాడు మనువు.

గురువాజ్ఞ చేతగాని, ధర్మకార్యాలను సాధించడానికిగాని దేశాంతరం వెళ్లినట్లయితే అతని కొరకు 8 సం॥లు, చదువు కోసమో, కీర్తి కోసమో వెళ్తే 6 సం॥లు, మరో భార్యమీద వలపు చేత వెళ్తే 3 సం॥లు నిరీక్షించి ఆ తర్వాత అతడున్న ప్రదేశానికి ఆమె వెళ్ళాలంట. ఇలా స్త్రీకి నియమం విధించిన మనువు అదే పురుషుడైతే దేశాంతరం వెళ్ళిన ఆమె కోసం ఒక్క సం॥కాలం మాత్రం ఎదురుచూస్తే సరిపోతుందన్నాడు.

**"అతిక్రామేత్ ప్రమత్తం యా మత్తం రోగార్త మేవవా**
**సాత్రీన్ మాసాన్ పరిత్యాజ్యా విభూషణ పరిచ్ఛదా"**

జూదం మొదలైన దుర్వ్యసనాలున్నవాడు, మద్యపానాదులచే కైపు గలవాడు, రోగియైన భర్తకు సేవ చేయకుండా అవమానపరచే స్త్రీని, సొమ్ములు, పాన్పు తీసుకొని 3 నెలలు ఆమెను కలువకూడదన్నాడు పతితుడు, నపుంసకుడు, కుష్ఠురోగి ఇలాంటి వాళ్ళకు పరిచర్యచేయని వారికి ఇది మినహాయింపు.

మద్యపానం చేసే స్త్రీ, చెడునడవడిక గలది, భర్తకు ప్రతికూలంగా నడుచుకునేది, కుష్ఠురోగి, సేవకులను హింసించేది, దూబరదిండి - యిలాంటి లక్షణాలున్న భార్య జీవించి ఉన్నా పురుషుడు మరో వివాహం చేసుకోవచ్చు అన్నాడు.

**"భార్యాయై పూర్వ మారిణ్యై దత్వాఽగ్నీ నం త్య కర్మణి**
**పునర్దార క్రియాం కుర్యా త్పునరాధానమే వచ"**

తన కంటే ముందు చనిపోయిన భార్య కోసం అంత్యక్రియల యందు అగ్నులనిచ్చి (దక్షిణాగ్ని, గార్హపత్య, అహవనీ నీయాగ్నులు) తనకు ఆమె వలన పుత్రుడు కలిగినా, లేకపోయినా, మరొక స్త్రీని వివాహం చేసుకొని స్మార్తాగ్నులను గాని, వైదికాగ్నులను కాని మరలా ఆధారంగా ఏర్పరచుకోవాలట.

అలాగే గౌరవం గూర్చి చెబుతూ, తల్లిని తోడబుట్టిన మేనమామ భార్యను, అత్తగారిని, మేనత్తను గురుపత్నితో సమానంగా భావించి ఎదురెళ్ళి అభివాదనం చేయాలట.

సజాతిలో వివాహం చేసుకున్న అన్న భార్యకు ప్రతిరోజూ పాదాభివందనం చేయాలి. పినతండ్రి, మేనమామ మొదలైన వారి భార్యలు ఊరి నుండి వచ్చినపుడు మాత్రం అభివాదం చేయాలి. పినతల్లి, పెద్దతల్లి, అక్క మొదలైన వాళ్ళ మీద తల్లిలాగే గౌరవం చూపాలి. గురుపత్ని జవరాలైతే ఇరవైయేళ్ళు మించిన శిష్యుడు ఆమె కాళ్ళు పట్టుకొని అభివాదం చేయకూడదు.

**"స్వభావ యేష నారీణాం నరాణామిహ దూషణాం**
**అంతోఽర్థాన్న ప్రమాద్యంతి ప్రమదాసు విపశ్చితః"**

ఈ ప్రపంచంలో ఉన్న పురుషులను మోహింపజేసి వారిని చెరచటం స్త్రీలకు స్వాభావికం. కాబట్టి విద్వాంసులు స్త్రీల విషయంలో ఏమరపాటు కూడదని హెచ్చరించాడు. పురుషులు విద్యాంసులైనా, అవిద్వాంసులైనా స్త్రీల వలలో తగులుకొనడం సహజం. ఎందుకంటే కామ క్రోధ వశులైన విద్వాంసులను, మూఢులను స్త్రీలు తమ వశం చేసుకొని చెడ్డదారికీడ్చగల సమర్థులన్నాడు. ఇంద్రియ బలం ఉన్నది గనుక వివేకియైనా చెడ్డదారి కీడ్చగలిగింది. కాబట్టి పురుషుడు తల్లితోగాని, తోబుట్టువులతోగాని, కుమార్తెలతో గాని ఒంటరిగా కూర్చుండగూడదు.

ప్రాయశ్చిత్తం గూర్చి చెబుతూ . . .

గురు భార్యను పొందినవాడు తాను చెప్పిన పాపాన్ని రాజుతో చెప్పి సలసల కాగిన ఇనుప మంచం మీద పడుకొని చక్కగా కాలిన ఇనుప స్త్రీ ప్రతిమను కౌగిలించుకొని మరణమొందుటచే పరిశుద్ధుడవుతాడు.

స్వభార్య అనే భ్రమతో గురుభార్యను పొందితే తలపుట్టైను చేతితో పట్టుకొని చింపి పేలకలు పట్టుకొని, తలవెంట్రుకలు, మీసాలు పెంచుకొని, గోళ్ళు తీయకుండా, మనస్సును అదుపులో పెట్టుకొని, నిర్జన వనంలో ఒక సంవత్సరం ప్రాజాపత్యవ్రతం ఆచరించాలట.

పతివ్రత కానిది, సవర్ణకానిది అయిన గురుభార్యను పొందితే ఆ గురుతల్ప గమన పాపపరిహారం కోసం ఇంద్రియాలను జయించి పండ్లు, దుంపలు, నివ్వరి ధాన్యంగాని, కడుగునీటిని గాని ఆహారంగా తీసుకొని చాంద్రాయణ వ్రతం 3 నెలలు చేయాలట.

బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య స్త్రీలను బుద్ధిపూర్వకంగా గాక తెలియక చంపినట్లయితే శూద్రుని హత్యకు ఏ ప్రాయశ్చిత్తం విధించబడిందో అదే పాటించాలంటూ స్త్రీని (హెచ్చు జాతియైనా) శూద్రుల క్రింద జమ కట్టాడు.

## స్త్రీ పురుషులకు వేర్వేరు ధర్మాలు :

మనువు తన ధర్మశాస్త్రంలో స్త్రీ, పురుషులకు వేర్వేరు ధర్మాలను క్రింది విధంగా చెప్పాడు.

భర్త మొదలైన పురుషులు స్త్రీలను తమ ఆధీనంలో ఉంచుకోవాలి.

**"పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే**
**రక్షంతి స్థావిరే పుత్రా న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" (9 - 3)**

బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వార్ధక్యంలో పుత్రులు రక్షించాలే తప్ప స్త్రీ స్వతంత్రురాలుగా ఉండకూడదు. భర్త, పుత్రులు లేకపోతే ఆమెను బంధువులు రక్షించాలి.

పెండ్లి చేయవలసిన కాలంలో వివాహం చేయని తండ్రిని లోకం నిందిస్తుంది. ఋతుకాలంలో పత్నిని సమీపించనిభర్త, భర్త చనిపోయిన తర్వాత తల్లిని కాపాడని కుమారుడు నిందుతులు. దుష్టసంపర్కం లేకుండా స్త్రీలను జాగ్రత్తగా కాపాడాలి. అలా కాపాడకపోతే వారు ఉభయ వంశాల వారికి దుఃఖాన్ని కలిగిస్తారు.

బ్రాహ్మణులు మొ॥న సకల వర్ణాల వారికి తమ తమ భార్యల శీలసంరక్షణ తక్కిన ధర్మాలుకన్నా ముఖ్యమని తెలుసుకొని పురుషులు గుడ్డి, కుంటి వారైనా తమ భార్యలను కాపాడుకోవాలి.

ఇలా కాపాడుకోనట్లయితే వ్యభిచారం మొదలైన సంకరదోషాలు లేకుండా పరిశుద్ధమైన సంతతి కలగదు. శిష్టాచారం, తన పెద్దల వంశం, పరిశుద్ధమైన సాంగత్యం వలన, పరలోక క్రియల వలన తనను, పతివ్రతయైన భార్య ఉన్నందువలన యాగాలు చేయడానికి అధికారముంటుంది గనుక స్వధర్మ రక్షణ చేసినవాడవుతాడు. కనుక భార్య రక్షణ ఎవరికైనా తప్పనిసరి అని మనువు పేర్కొన్నాడు.

సనాతన పద్ధతి గూర్చి చెబుతూ ఒకే తండ్రి అయి తల్లులు వేరైతే, రెండవ తల్లికి పుట్టినబిడ్డ తక్కువ జాతి స్త్రీగా గుర్తించబడి వీరికి వేర్వేరు వృత్తులు కేటాయించబడ్డాయి. ఇది బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీలను చేసుకునేవారికి నిర్ణయించినది. ఇది సనాతన పద్ధతి.

ఇక వర్ణక్రమాన్ని దూరంగా పాటించినవారు అంటే బ్రాహ్మణునికి శూద్రస్త్రీ లేక వైశ్యస్త్రీకి గాని, లేక క్షత్రియునికి శూద్రస్త్రీకి పిల్లలు పుడితే ? అన్న ప్రశ్నకు సమాధానం మనువు చెప్పాడు.

బ్రాహ్మణునికి క్షత్రియ, వైశ్య, శూద్ర స్త్రీలవలన, క్షత్రియునికి వైశ్య శూద్ర స్త్రీల వలన, వైశ్యునికి శూద్రస్త్రీ వలన పుట్టిన ఈ ఆరుగురు సవర్ణ స్త్రీలకు పుట్టిన సజాతీయ పుత్రుల కంటే నీచులు. ఇలా అనులోమజాతి విధానాన్ని పేర్కొన్నాడు.

అనులోమ వర్ణాలలోగాని విలోమ వర్ణాలలోగాని ఒకటి వదలి మరొక వర్ణం వలన పుట్టినవారు స్పర్శాదులకు అర్హులు. ప్రతిలోమ (విలోమ) జాతులలో చండాలుడు స్పర్శాదులకు అర్హుడుకాడు.

**"పుత్రాయేఽనంతర స్త్రీజాః క్రమేణోక్తా ద్విజన్మనాం,**
**తాననంతర నామ్నస్తు మాతృదోషాత్ప్రచక్షతే"**

ద్విజులకు తాము తర్వాత జాతులందు (స్త్రీలకు) పుట్టిన బిడ్డలుతల్లి యొక్క హీనజాతిని బట్టి హీనజాతులకు పుట్టిన వారుగా ఎంచబడతారన్నాడు. కాబట్టి మాతృజాతికి తగిన సంస్కారాలు చేయడానికి మాత్రమే అర్హులు.

ద్విజులకు సమాన జాతీయులందు పుట్టినవారు, అనులోమ వంశంలో పుట్టినవారు (బ్రాహ్మణ + క్షత్రియ; క్షత్రియ +వైశ్య; మొదలైన) ఈ ఆరుగురు ద్విజధర్మం కలవారుగనుక ఉపనయన సంస్కారాలు ఉన్నాయని మనువు చెప్పాడు.

మనువు అజ్ఞానుల గూర్చి చెబుతూ తోడబుట్టిన అక్కాచెల్లెళ్ళు, చెలికాళ్ళ భార్యలు, కోడండ్రు, కన్యకలు, చండాల స్త్రీల యందు సంగమం కూడదన్నాడు. గురుభార్యతో కలిస్తే ఎంత పాపమో అంత పాపం కలుగుతుంది. బుద్ధిపూర్వకంగా కలిస్తే ప్రాణత్యాగమే ప్రాయశ్చిత్తం.

**"పైతృష్వసేయీం భగినీం స్వస్త్రీయాం మాతురేవచ**
**మాతుశ్చ భ్రాతుః స్తనయాం గత్వాచాంద్రాయణంచరేత్" (11 - 171)**

మేనత్త కూతురు, పినతల్లి, పెత్తల్లి కూతుళ్ళు, మేనకూతుళ్ళు, మేనకోడలు, మేనమామ కూతురు తోడబుట్టిన దానివలె పొందదగినవారు కాదన్నాడు. వీరంతా దాయాదులు, బంధువులు గనుక బుద్ధిమంతుడు వీరిని పెండ్లి చేసుకోకూడదన్నాడు. అలా చేసుకుంటే నరకాన్ని పొందుతాడన్నాడు. తల్లి గోత్రానికి సపిండురాలుకాని దానినే వివాహం చేసుకోవాలన్నాడు. దక్షిణ దేశంలో ఆచారంలో ఉన్న (అతి ప్రాచీనకాలంలో రక్తసంబంధ జాతుల కన్నా రక్తసంబంధంలేని తెగలు త్వరగా అభివృద్ధి చెందాయి) మాతుల కన్యాపరిణయం నిషిద్ధమని నొక్కిచెప్పాడు. వ్యభిచారియైన స్త్రీని భర్త అడ్డగించాలనీ, సంకెళ్ళు వేసి గదిలో బంధించాలన్నాడు.

## 3.4. ముగింపు :

మనువు స్త్రీ ధర్మాలు, స్త్రీలపట్ల ఇతరులు ఆచరించవలసిన విధులు, బాధ్యతలు సమాజానికి తెలియజేశాడు. మనువు స్త్రీల విషయంలో చెప్పిన విరుద్ధ భావాలు పూర్తిగా అతనివేనని చెప్పలేం. ప్రక్షిప్తాలైనా కావచ్చు. మనువు స్త్రీ వ్యతిరేకిఅని, మనుధర్మ శాస్త్రం స్త్రీని అణచివేసిందని ఈనాడు వాదిస్తున్నారు. మనువు ఎప్పటివాడు ? ఆనాటి సామాజిక వ్యవస్థ ఎలా వుంది ? నాటి సామాజిక వ్యవస్థకు మనుస్మృతి అనుగుణంగా ఉందా ? లేదా ? అని ఆలోచించాలే తప్ప నేడు వేరే దృక్పథంతో ఆలోచించకూడదు. స్త్రీ సమస్యలు గురించి మొదట ఆలోచించినవారు స్వామినేని, కందుకూరి, గురజాడ వీరంతా పురుషులే. సమాజంలో కుటుంబ వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే కొన్ని నియమాలు తప్పవనే మను దృష్టితో రచించబడిందే ధర్మశాస్త్రం. ఆనాటి సమాజాన్ని, సామాజిక నియమాలను ప్రతిబింబిస్తున్న రచన ఇది.

## 3.5 ప్రశ్నలు :

1. మనువు కాలం నాటి సామాజిక వ్యవస్థను వివరించండి.
2. మనువు పేర్కొన్న స్త్రీ ధర్మాలను పరిశీలించండి.
3. మనుధర్మ శాస్త్రంలోని ద్వంద్వ నీతి ప్రమాణాలు పేర్కొనండి.
4. మనుస్మృతిలోని మహిళా సమస్యలను చిత్రించండి.

## 3.6 సంప్రదించవలసిన గ్రంథాలు :

1. మనుధర్మ శాస్త్రం
2. మనుధర్మ శాస్త్రం - సవ్యాఖ్యానాంధ్ర తాత్పర్యము.

**- ఆచార్య తేళ్ల సత్యవతి**

పాఠం - 4

# మహాభారతం - స్త్రీల సమస్యలు

**లక్ష్యం :**

మహాభారతంలోని స్త్రీల సమస్యలను తెలియజేయటం

**విషయసూచిక :**


**4.1** బాల్యవివాహాలు

**4.2** స్వయంవరం

**4.3** వివాహ వ్యవస్థ

**4.4** పతివ్రతా లక్షణాలు

**4.5** స్త్రీ పురుషుడి స్వంత ఆస్తి

**4.6** వైధవ్యం

**4.7** కన్యాశుల్కం - వరకట్నం


మహాభారతం ప్రాచీన కాలంలోని భారతీయ సమాజానికి దర్పణం వంటిది. ప్రాచీన భారతీయ సమాజంలో స్త్రీ పురుషులిద్దరికీ సమానమైన గౌరవం ఒక దశలో ఉండేది. గర్భధారణ, శిశుపోషణలు స్త్రీలు ప్రత్యేకంగా నిర్వహించగలిగిన విధులుగా ఉండేవి. పురుషుని కన్నా అధికంగా సంతానోత్పత్తి శక్తి కలిగిన స్త్రీని చూచి పురుషుడు ఎప్పుడూ ఆశ్చర్యపోతూనే ఉన్నాడు, భయభ్రాంతుడౌతున్నాడు, గౌరవాన్నిస్తున్నాడు, తన కంటే శక్తిహీనురాలిగా చేయాలని ప్రయత్నిస్తున్నాడు. ఈ అన్ని భావాలు కలగవలసిన ఒకానొక దశలో స్త్రీని గురించి రకరకాలుగా వ్యాఖ్యానించాడు. గర్భధారణ సమయంలో ఆహార సంపాదన చేయలేని స్త్రీ పురుషుని మీద ఆధారపడవలసి వచ్చేది. సంతానం విషయంలో కూడా ఆమెకు ఒక తోడు అవసరమయ్యేది. ఏ పురుషుని సంతానమో తెలియడం కోసం ఆమె సమర్థుడైన ఒక పురుషునితోనే జీవితం పంచుకోవడం మేలని తలపోసి ఉంటుంది. అదే విధంగా సంతానం మీద ప్రేమతో తనదే అయిన సంతానం కోసం పురుషుడు కూడా ఒక స్త్రీని వివాహమాడి ఆమెను తన అధీనంలో ఉంచుకొని ఆమెకు కలిగే సంతానం తనది అనే తృప్తిని పొందాలనుకున్నాడు. స్వేచ్ఛాప్రవృత్తి కలిగిన తొలి దశ స్త్రీ పురుషులు పై కారణాల చేత రానురాను కట్టుబాట్లను ఏర్పరచుకొని తమదైన సంతానాన్ని, సంపదను ఏర్పరచుకోవడం మొదలుపెట్టారు. మనిషికి బాధ్యత ఏర్పడింది. దాంతో స్వార్థం కూడా మొదలైంది. లైంగికమైన స్వేచ్ఛను వివాహం కోసం వదులుకొనడానికి సిద్ధమైన దశలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకోవడాన్ని మనం భారతంలో చూడవచ్చు.

ఒకే స్త్రీ, ఒకే పురుషుడు అనేది వివాహ వ్యవస్థకు ప్రాతిపదిక. అయితే ఈ కట్టుబాటును తొలి నుంచీ పురుషుడు ఉల్లంఘించాడు. స్త్రీకి మాత్రమే కట్టుబాట్లను అమలుపరిచే ప్రయత్నం చేశాడు. గృహనిర్మాణం జరిగిన దశలో జంటగా ఉన్న స్త్రీని గృహిణిని చేశాడు. అంటే ఆమెను గృహానికి పరిమితం చేశాడు. స్త్రీలు దీన్ని ఎందుకు అంగీకరించారు అనేది ప్రశ్న. సహజంగా స్త్రీలు సంతానానికి అధిక ప్రాధాన్యం ఇచ్చారు. తాము కన్న సంతానాన్ని కాపాడుకోవడం కోసం, భద్రంగా పెంచుకోవడం కోసం వారు గృహపరిమిత జీవనాన్ని కాదనకుండా ఉపేక్షించారు. రాను రాను అది నిర్బంధ రూపాన్ని ధరించింది.

మహాభారత రచనా కాలం నాటికి స్త్రీల సమస్యలు కొన్ని ఇప్పటి మాదిరిగానే కనిపిస్తాయి. కొన్ని అప్పటికి మాత్రమే ప్రత్యేకమైనవిగా ఉన్నాయి. మారుతున్న కాలానికి తగినట్లు సమాజం మారుతూ వచ్చింది. దానికి తగినట్లుగానే స్త్రీల సమస్యల స్వరూపం మారుతూ వచ్చింది. ఆయా పాత్రల ఆధారంగా స్త్రీల స్థితిగతులను మనం కొంతవరకు అర్థం చేసుకోవచ్చు.

అయితే ఈ సందర్భంలో తప్పకుండ గుర్తుంచుకోవలసిన రెండు విషయాలున్నాయి. ఒకటి మహాభారతం ప్రధానంగా రాజులకు సంబంధించిన కథ. కనుక రాజవంశ స్త్రీల ప్రసక్తి ఎక్కువ కనిపిస్తుంది. సామాన్య స్త్రీలను గురించి తెలుసుకోవడానికి ఇంత మాత్రమే సరిపోదు. రెండవది మహాభారతం ఒక ఇతిహాసం మాత్రమే కాదు. ఒక మహా కావ్యం. ఒక ధర్మశాస్త్రం కూడా. కల్పనకు, నీతి ప్రబోధానికి చాలా ప్రాధాన్యం కనిపిస్తుంది మహాభారతంలో. సత్యం కొంత మరుగున పడిపోతుంది. అయినా వాస్తవానికి వీలైనంత దగ్గరగా ఉన్న గ్రంథం కూడా మహాభారతమే కావడం చేత ఈ చర్చ ప్రయోజనకారి అవుతుంది. ఇక్కడ మరొక విషయం కూడా చెప్పుకోవాలి. వేదవ్యాసుడు నాటి సమాజానికి సమ్మతమైన ధర్మాలను సుస్థాపితం చేయడానికి మహాభారత రచనను ఉపయోగించుకొన్నాడే కాని స్త్రీ జనోద్ధరణకు కాదు. అలాగే కవిత్రయం వారు కూడా ఒక గొప్ప కావ్యనిర్మాణ దృష్టితో భారత రచనకు పూనుకొన్నవారే కాని స్త్రీ సమస్యా పరిష్కారానికి బద్ధులై కాదు. "యత్ర నార్యస్తు పూజ్యంతే తత్రరమంత దేవతాః" అన్న మనుస్మృతిలోనే "నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" అని కూడా చెప్పబడింది. అంటే పురుషుడు నిర్దేశించిన ఒకానొక పద్ధతికి కట్టుబడి జీవించిన స్త్రీ మాత్రమే పూజింపబడుతుంది. అప్పుడే దివిలో దేవతలకు, భువిలో మనుషులకు సంతోషం కలుగుతుంది. ఈ స్థితి భారతంలో కూడా కనిపిస్తుంది.

ఉదాహరణకు సత్యవతి పాత్ర విషయానికి వస్తే ఆమె మత్స్యగంధిగా జీవిస్తున్నప్పుడు, తండ్రి చాటు బిడ్డగా ఉన్నప్పుడు, పరాశరుడు ఆమెను వాంఛిస్తాడు. మహా మునియైన పరాశురుడు కన్యను తండ్రి అనుమతి లేకుండా పొందడం తప్పు అని భావించడు. పైగా ఆమె కన్యాత్వం చెడదని ఒప్పిస్తాడు. ఇది ఆధునిక సమాజం ఒప్పుకోని విషయం. శాస్త్ర సమ్మతం కాని సంగతి. సరే ఆమెను యోజన గంధిని చేసి మరీ ఆమె వలన సంతృప్తిని పొందుతాడు. వేద వ్యాసుడు పుడ్తాడు. మరి ఆతని బాధ్యతను ఎవరు స్వీకరించినట్లు. తప్పకుండ అది తల్లి బాధ్యతే అయి ఉంటుంది. మునులు సంసార బంధాలకు కట్టుబడి ఉండనక్కర లేదు ఆనాడు. అయితే ఇక్కడ ఒక్క విశేషమేమిటంటే అది ఆనడు గొప్ప అపరాధంగా భావించబడలేదు. ఈ విషయంలోకాని కంతటికీ తెలుసు. అయినా శంతనుని వంటి కురువంశ నృపతి ఆమెను తదనంతర కాలంలో వివాహం చేసుకొంటాడు. ఆ మాటకు వస్తే గంగ కూడా శంతనునికి షరతులు విధించింది. అంటే వివాహానికి షరతులు విధింపబడేవని తెలుస్తుంది.

స్త్రీకి ఒక చట్టబద్ధమైన రక్షణ ఉండాలి అని ఆకాలంలో కూడా భావింపబడింది అనే దానికి శకుంతల కథ కూడా తోడ్పడుతుంది. దుష్యంతుడు ఆమెను పెండ్లి చేసుకొంటానని అడిగినపుడు తన కుమారుడు యౌవరాజ్యపట్టాభిషిక్తుడు కావాలని కోరుతుంది. పురుషులు బహుభార్యావ్రతులైన ఆకాలంలో స్త్రీలకు ఈవిధమైన ఆలోచన రావడం సహజమే. వృద్ధుడైన దశరథుడు కైకను వివాహమాడినపుడు కేకయరాజు కూడా ఇలాంటి షరతును విధించినట్లు రామాయణంలో ఉంది. రామవనవాసానికి అదే ప్రధాన కారణం కూడా. అలాగే దాశరాజు శంతనుడికి విధించిన షరతు వలననే భీష్ముడు కురువంశానికి రాజు కాలేకపోయాడు. ఒక విధంగా భారతాన్ని మలుపు తిప్పిందీ, కురువంశ చరిత్రను మార్చిందీ, పాండు, ధృతరాష్ట్రుల జననానికీ, అటుపై పాండవ కౌరవ వైషమ్యానికీ, కురుక్షేత్ర యుద్ధానికీ దారితీసింది దాశరాజు సత్యవతి వివాహానికి విధించిన షరతే.

## 4.1 బాల్యవివాహాలు :

ఆకాలంలో ఈ దురాచారం లేదనే చెప్పాలి. సత్యవతి, గాంధారి, కుంతి, ద్రౌపది, భానుమతి, సుభద్ర, ఉత్తర మొదలైన ప్రధాన పాత్రలను పరికిస్తే వివాహం యుక్తవయస్సులోనున్న స్త్రీ పురుషులకే సంబంధించి ఉండేదని తెలుస్తుంది. విరాటపర్వంలో ఉత్తర బొమ్మలతో ఆడుకొనే వయస్సులో ఉన్నట్లుగా చెప్పబడినప్పటికీ మరీ పసి వయసు కాదని యౌవన ప్రాదుర్భావంలో ఉన్న

సౌందర్యవతి అనీ స్పష్టంగా వర్ణించబడింది. బహుశా బాల్యవివాహాలు రాచరికపు వ్యవస్థ మరీ దిగజారిన మధ్యయుగాలలో తల ఎత్తిన సమస్య అయి ఉంటుంది. భారతంలో ఎక్కడా అది కనిపించదు.

కుంతి దుర్వాసుని సేవించడానికి నియోగింపబడింది. అలాగే ద్రౌపది స్వయంవరంలో అర్జునునికి ఇవ్వబడింది. గాంధారి భర్త అంధుడని విని తన కళ్ళకు తానే గంతలు కట్టుకొన్నది. సుభద్ర అర్జునుని వలచి మాయయతి రూపంలో ఉన్నప్పుడు శుశ్రూషలు చేసింది. ప్రధాన పాత్రలే కాకుండా ఉపాఖ్యానాలను చూస్తే కూడా యుక్తవయస్కులైన తర్వాతే వివాహాలు జరిగేవని తెలుస్తుంది. శకుంతల, దమయంతి, సావిత్రి, చంద్రమతి, శర్మిష్ఠ, దేవయాని మొదలైన స్త్రీలు పరిణత వయస్కులు, పరిణత మనస్కులు కూడా అయి ఉండడం మనం గమనించవచ్చు.

## 4.2 స్వయంవరం :

భారతంలో స్వయంవరం ద్వారానే వివాహాలు జరిగేవన్న విషయం పలుమార్లు చెప్పబడింది. స్త్రీకి తాను వివాహమాడబోయే పురుషుడు ఎలా ఉండాలి అని నిర్ణయించుకొనే స్వేచ్ఛ కూడా ఉండేది. ఆమె కాని, ఆమెను కన్న తండ్రి కాని ఈ స్వయంవర విధులను నిర్ణయించేవారు. భారతంలో అత్యంత కీలకమైంది ద్రౌపదీ స్వయంవరం. అర్జునుడిని భర్తగా పొందగలిగిన కుమార్తె కోసం ద్రుపదుడు తపస్సు చేశాడని భారతం చెప్తుంది. సరే అయోనిజగా అగ్నిగుండంలో పుట్టింది ద్రౌపది. పుట్టిపుట్టగానే ఆమె అర్జునుడి భార్య అయిందన్న మాటే. అయితే స్వయంవరం ఎందుకు విధించబడిందీ అంటే పాండవులు మారువేషాలలో ఏకచక్రపురంలో ఉన్నారు కనుక. అంతవరకు బాగానే ఉన్నా ఇక్కడ ఒకటి రెండు విషయాలు మనల్ని ఆలోచింపజేస్తాయి. ఒకటి అర్జునుడితో సమానమైన ధనుర్విద్యాపారంగతుడైన కర్ణుడు మత్స్య యంత్రాన్ని భేదించి ఉంటే ఏమయ్యేది. మరొకటి అర్జునుడు మత్స్యయంత్రాన్ని కొట్టి ద్రౌపది చేత వరించబడితే మిగిలిన నలుగురు సోదరులు ఆమెను ఎలా వివాహమాడారు అనేది. ఇందుకు ద్రౌపది సమ్మతించిందా అసలు ఆమె సమ్మతి కోరబడిందా, పోనీ ఆమె తండ్రి ద్రుపదుని సంప్రదించారా అనేది భారతంలో తెలియరాని విషయం. ఇక్కడ స్త్రీ స్వేచ్ఛ ప్రశ్నార్థకమే !

ఒకసారి స్వయంవరం జరిగి ఆమె అర్జునునికి ఇవ్వబడిన తర్వాత అది ఆమెను గెలుచుకొన్న అర్జునుడి ఇష్టానుసారం వేదవ్యాసుని సమ్మతితో కుంతి ఆజ్ఞమేరకు జరిగిన వివాహమే కాని ద్రౌపది ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేదు. ద్రౌపది జీవితం ఆ తర్వాత తిరిగిన మలుపులన్నిటికీ ఈ వివాహమే మూలకారణం. పంచభర్తృక ఎప్పుడు అయిందో అప్పుడే ఆమె పదిమందికీ చర్చనీయాంశం అయింది. ద్రౌపదిది స్వయంవరం కాదు నిజానికి. ద్రుపదునికి అర్జునుడిని అల్లుడిగా పొందాలనే కోరిక ఎప్పుడు కలిగిందో అప్పుడే ఆమె ధారాదత్తం అయింది. మారువేషంలో ఉన్న అర్జునుడిని బయటికి రప్పించడానికే ఆ స్వయంవరం చాటబడింది. అయితే చిన్ననాటి నుంచీ తండ్రి ఆకాంక్ష విని ఉండడం చేత ద్రౌపది మానసికంగా అర్జునుడి భార్యగా పెరిగి ఉంటుంది. అర్జునుడి ఇష్టంతోనే ఆమె పాండవపత్ని అయి ఉంటుంది.

మహాప్రస్థానంలో ఆమె ఎందుకు పడిపోయింది అన్న ప్రశ్నకు ధర్మరాజు ఇచ్చిన సమాధానం - ఆమెకు అర్జునుడంటే కించిత్తు ఎక్కువ ఇష్టం కనుక ముందు పడిపోయింది - అని. ఆమెను ఆమె మనస్సును ముందే గెలుచుకొన్నవాడు అర్జునుడు. ఆమె పుట్టుకే అర్జునుడి భార్య కావడం కోసం. అయినప్పుడు ఆమెకు అర్జునుడి పట్ల అధిక ప్రేమ ఉండడం సహజం. దీన్ని తప్పుగా భావించడం విడ్డూరం.

స్వయంవరం అన్న పేరే కన్య వరుడిని ఎన్నుకోవడం అనే అర్థం వస్తుంది. అయితే కన్య ఇష్టంతో ప్రమేయం లేకుండా ఆమెను గెలుచుకోవడం అనేది కూడా ఆ కాలంలో సర్వ సామాన్యం.

కాశీరాజు తన కుమార్తెలయిన అంబ, అంబిక, అంబాలికలకు స్వయంవరం చాటిస్తే భీష్ముడు వచ్చి తక్కిన రాజులందరినీ ఓడించి ఆ ముగ్గురు రాకుమార్తెలను గెలుచుకొని తన తమ్ములకు ఇచ్చి వివాహం చేయడానికి తీసికొని వస్తాడు. ఇక్కడ భీష్ముడు తన పరాక్రమం చేత వారిని గెలుచుకొన్నట్లు కనిపిస్తుందేకాని వారు వరించడం అనే ప్రశ్నే తల ఎత్తదు. ఎందుచేతనంటే ఆజన్మాంతం బ్రహ్మచారిగా ఉంటానని భీషణ ప్రతిజ్ఞ చేసినవాడు భీష్ముడు. ఆతనికి స్వయంవరాలతో రాకుమార్తెలతో పని లేదు. కాని వచ్చాడు తమ్ముల కోసం. అంబ సాళ్వుడిని ప్రేమించానని చెప్తే విడిచిపెట్టాడు. కాని అంబను సాళ్వుడు నిరాకరించాడు. భీష్ముని కారణంగానే తన ప్రేమ, జీవితం నిష్ఫలమయ్యాయని తలచిన అంబ తపస్సు చేసి శిఖండిగా జన్మించి భీష్ముని మరణానికి కారణమయ్యింది. సత్యవతి తండ్రి కోరిక వలన వివాహానికి, రాజ్యానికి దూరమైన భీష్ముడు సత్యవతి కొడుకుల కోసం కాశీరాజు కుమార్తెలను తెచ్చి తత్కారణంగానే అంబ ఆగ్రహానికి గురిఅయినాడు, మరణానికి కారణం కొనితెచ్చుకొన్నవాడైనాడు.

భారతంలో ఉపాఖ్యానాల స్థానం చాలా ముఖ్యం. దమయంతీ స్వయంవరం ఒక విలక్షణమైనది. నిజంగా స్వయం వరానికి సరియైన ఉదాహరణ ఇదే. ఇందులో ధనుర్భంగం లాంటిది కాని, మత్స్య యంత్ర భేదనం కాని లేవు. దమయంతి నలుడిని ప్రేమించింది. నలుడు కూడా దమయంతిని ప్రేమించాడు. నలుడిని రావించడం స్వయంవరం ద్వారా వరించడం ఒక సంప్రదాయం కోసం సంకల్పించబడ్డాయి. అయితే దేవతలు కూడా దమయంతి సౌందర్యం చేత ఆకర్షితులై రావడం విశేషం. పైగా వచ్చిన ఇంద్ర, అగ్ని, మయ, వరుణులు నలుని రూపంలో వస్తారు. అయినా దమయంతి అసలు నలుడినే గుర్తించి వివాహమాడుతుంది.

అయితే తర్వాత జరిగిన పరిణామాలలో నలునికి దూరమౌతుంది. దమయంతి వ్యక్తిత్వం బయటపడేది ఇక్కడే. తండ్రితో చెప్పి పునఃస్వయంవరం చాటింపజేసి నలుడిని మళ్ళీ తన దగ్గరికి రప్పించుకొంటుంది. అది ఆమె ధీశక్తికి తార్కాణం. అయితే అర్థరాత్రి నట్టడవి నిద్రిస్తున్న దమయంతిని క్రూరమృగాల మధ్య, కిరాతకులైన మనుషుల మధ్య ఒంటరిగ విడిచిపెట్టడం నలుడు చేయదగిన పనికాదు. ఆమెకు తపశ్శక్తి తోడ్పడి బయటపడి తండ్రి గృహం చేరింది. కాని సామాన్యుల మాటేమిటి. నలుడిని ప్రశ్నించినట్లు భారతంలో ఎక్కడ లేదు. సమాజం ఎప్పుడూ పురుషుడిని వదిలేసి స్త్రీని మాత్రమే ప్రశ్నించేదని దమయంతి కథ మనకు చెప్తుంది.

## 4.3 వివాహ వ్యవస్థ :

భారతంలో అష్టవిధ వివాహాలు సూచింపబడ్డాయి. దుష్యంతుడు శకుంతలతో స్త్రీ పురుషులు భార్యాభర్తలు కావడానికి సమ్మతమైన అష్ట విధ వివాహాలను పేర్కొన్నాడు. అవి ఇవి.

**1. బ్రాహ్మ్యం :** తల్లిదండ్రులు యోగ్యుడైన వరుడిని నిర్ణయించి తమ కుమార్తెను అలంకరించి అతని చేతిలో పెట్టి పెండ్లి చేసేవారు. అందుకే అది పాణిగ్రహణం అయింది. ఇదే ఇప్పటి వివాహ వ్యవస్థకు మూలం అనదగినది.

**2. దైవం :** యజమాని యజ్ఞం చేసి చివరలో తన పుత్రికను ఋత్విజునికి దానం చేయడం దీని స్వరూపం. దీన్లో కన్య ఇష్టాఇష్టాలతో, వరుని వయో రూప గుణాలతో ప్రమేయం లేదు. ఒక వస్తువు లాగా ఇవ్వబడుతుంది.

**3. ప్రాజాపత్యం :** వధూవరులిద్దరూ కలిసి జీవించాలనే ఉద్దేశ్యంతో వరునికి కన్యాదానం చేసేవారు. దీనిలో శుల్క ప్రసక్తి లేదు. అయితే కన్యనే దానంగా ఇచ్చేవారు.

**4. ఆర్షం** : ఋషులకు సంబంధించినది ఈ పద్ధతి. వరుడు శుల్కరూపంలో ఆవును, ఎద్దును ఇచ్చి కన్యను గ్రహించేవాడు. అంటే వస్తుమార్పిడిలాగా. ఇది కన్యాశుల్కానికి మూలం అనదగిన పద్ధతి.

**5. అసురం** : ఇది కూడా వరుడి నుంచి అధిక సంపదను గ్రహించి దానికి బదులుగా కన్యను ఇచ్చి పెళ్ళిచేసేవారు. ఇంచుమించు అమ్మకం లాంటిది ఈ వివాహం.

**6. గాంధర్వం** : వధూవరులు స్వేచ్ఛగా తమ ఇష్టంతోటి పెండ్లాడేవారు. ప్రేమ వివాహం అన్నమాట.

**7. పైశాచం** : కన్యను అపహరించి పెండ్లాడేవారు. దొంగతనంగా ఎవరూ గమనించనప్పుడు ఎత్తుకుపోయి, ఆమె ఇష్టంతో నిమిత్తం లేకుండా పెండ్లాడడం జరిగేది.

**8. రాక్షసం** : వధువు ఇష్టంతో ఆమె బంధువులను ఎదిరించి తీసుకొనిపోయి వివాహమాడడం ఈ పద్ధతి క్రిందికి వస్తుంది.

ఇన్ని రకాల పెండ్లిండ్లలో కన్య ఇష్టంతో నిమిత్తం ఉన్నవి రెండే రెండు - ఒకటి గాంధర్వం, రెండు రాక్షసం. భారతంలో వివాహ వ్యవస్థ స్థిరపడినట్లు కనిపించినా దానిని అతిక్రమించిన సందర్భాలు కూడా అనేకం. ఏవిధమైన వివాహమైనా, వివాహేతర సంబంధమైనా దాని వలన కలిగే బరువు బాధ్యతలు, మానావమానాలు స్త్రీలు మాత్రమే ఎదుర్కొనేవారు అనేది నిశ్చయం. హిడింబి, ఉలూచి, చిత్రాంగద మొదలైనవారు భర్తలతో కలిసి జీవించాలనుకోలేదు. వారు పుత్రవతులయ్యేంతవరకే భర్తతో జీవనం. ఆపై ఒంటరిగానే జీవించారు. కుంతి వైధవ్యాన్ని అనుభవిస్తూనే కుమారుల బాధ్యతను నిర్వర్తించింది.

వివాహ పూర్వసంబంధాల వలన తల్లులైన సత్యవతి, కుంతి భారతంలో ప్రధాన భూమికను పోషించారు. సత్యవతి కుమారుడైన కృష్ణ ద్వైపాయనుడు ఋషీశ్వరుడై వేదవ్యాసునిగా ప్రసిద్ధుడై భారత రచనను చేపట్టాడు. ఆమె కీర్తి ప్రతిష్ఠలకు గాని, వ్యాసుని గౌరవానికి గాని ఏమాత్రం భంగం వాటిల్లలేదు. అయితే కుంతి విషయంలో అలా జరగలేదు. కర్ణుడు తన కుమారుడని తెలిసి కూడా ఆమె చెప్పుకోలేకపోయింది. కర్ణుడు కానీనుడిగా (కన్యకు పుట్టినవాడు కానీనుడు) ఎన్నో అవమానాలను ఎదుర్కొన్నాడు. కుంతి ఎంతో ఆవేదనను అనుభవించింది. అంటే స్త్రీలకు పెళ్ళికి ముందు సంతానవతులు కావడం సమర్ధనీయం కాదు అని తెలుస్తుంది. అయినా సత్యవతి కొడుకు న్యాయనిర్ణేత స్థానంలో నిలిచాడు కనుక అతనికి కర్ణుడి వలె అవమతి కలుగలేదు. లోక సామాన్యంగా మాత్రం పెళ్ళికాకుండానే తల్లి కావడం తప్పుగానే ఆనాటి సమాజం భావించి ఉంటుంది. అందుచేతనే కుంతి కర్ణుని జన్మవృత్తాంతాన్ని రహస్యంగానే ఉంచింది.

ఆనాటి స్త్రీలకు ఆర్థికపరమైన సమస్యలు లేవని కాదు గాని భారతంలో వాటి ఆధారాలు కనిపించవు. రాజరికం స్త్రీలకు కనీస అవసరాలకు లోటు లేకుండా బాధ్యత వహించేది. ఇక సామాన్య స్త్రీల స్థితి అంతగా తెలియరావడం లేదు. ఒకటి మాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు. స్త్రీ ఎప్పుడూ స్వతంత్రంగా ఉండడానికి వీలులేదు. బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో కుమారుడు ఆమెను రక్షించుకోవాలి అని భావింపబడింది. ఈ భావం స్థిరంగా నాటుకోవడం వలన స్త్రీ స్వతంత్ర జీవనాన్ని కోల్పోయింది. బావ పంచన 'అదయమైన కూడు' తినవలసి వచ్చిందని కుంతి వాపోవడాన్ని గమనిస్తే స్త్రీలు ఎంత అస్వతంత్ర జీవితాలను గడిపారో అర్థమౌతుంది. గాంధారి స్థితి ఇంతకంటె ఉన్నతంగా ఉందని భావించలేం. ఎందుకంటే కళ్ళుండీ గ్రుడ్డితనాన్ని ఎందుకు వరించింది అని ప్రశ్నించుకొంటే ఆమె జీవితంలోని విషాదం అర్థమౌతుంది. ఆమె అభీష్టాన్ని అడగకుండానే ధృతరాష్ట్రుని కిచ్చి వివాహం చేశారు. జీవితేచ్ఛ అప్పుడే నశించి ఉంటుంది. కోల్పోయిన దానికి ప్రత్యామ్నాయంగా పతివ్రత అనే కీర్తిని దక్కించుకొంది గాంధారి. అయితే ఆమెకు కుంతి కన్నా సంతోషకరమైన స్థితి ఏమీ లేదు. మాట వినని కొడుకులు, మూర్ఖుడైన భర్త, చేతకాని, ఏమీ చేయలేని స్థితి, చివరికి పుత్రశోకం మిగిలాయి గాంధారికి. తల్లి మాట జవదాటని కొడుకులు గలిగిన కుంతిని చూస్తూ గాంధారి ఎంత మానసిక వేదననతు అనుభవించిందో అనూహ్యం.

అసలు స్త్రీల సమస్యలు ఎక్కడ మొదలయ్యేవి అని ఆలోచిస్తే పుట్టుకతోనే అని అర్థం అవుతుంది. కొడుకులను కన్నతల్లికే ఆనాడు గౌరవం ఉండేది. కుమార్తెను కోరుకున్నవాడు ద్రుపదుడు ఒక్కడే మహాభారతంలో. అతడు కూడ ఆడపిల్ల అయితే ముద్దు మురిపెం చేయవచ్చు అనే ఉద్దేశ్యంతోకాక అర్జునుడి వంటి ధనుర్విద్యాపారంగతుడు తనకు అల్లుడైతే అంతకు మించి కోరుకోదగింది ఏమీ ఉండదు అని భావించి అతడిని పెళ్ళాడడానికి ఒక కూతురు కావాలి అనుకొన్నాడు. అంతే.

స్త్రీలను గురించి స్త్రీలే తక్కువ చేసి మాట్లాడడం భారత ఉపకథలలో మనం చూస్తాం. నారద మహర్షికి పంచచూడ అనే అప్సరస స్త్రీ స్వభావాన్ని గూర్చి చెప్తుంది. స్త్రీ స్వైర ప్రవృత్తి కలిగినది, చంచల, పురుషులను ఆకర్షించడమే స్వభావంగా కలిగినది, అన్య పురుష కామిని, కుత్సిత, దుశ్చేష్టిత అని చెప్పింది. దీనికి కారణం ఆనాటి సమాజం. స్త్రీ ఎప్పుడైతే స్వేచ్ఛాచారిణి అవుతుందో అప్పుడు కట్టుబాటు లేకుండా పోతుంది అనే భయంతో స్త్రీలను కట్టడి చేశారు. అది ఎంత దాకా పోయిందంటే ఆమె పురుషునికి ఒక ఉపకరణంగా మాత్రమే ఉండాలి అన్నంతవరకు. తండ్రి ఇంట ఉన్నప్పుడు కూడ ఆమెకు స్వేచ్ఛ ఉండేది కాదు. తండ్రి ఆజ్ఞమేరకు వృద్ధులైన ఋషులకు పరిచర్యలు చేసేది. వారికి పరిచర్యలు చేయడం అంటే వారిని అన్నివిధాలుగా తృప్తిపరచడం అన్నమాట. ఒక్కొక్కప్పుడు వారికి భార్యగా ధారాదత్తం అయ్యేది. చ్యవనుడికి భార్య అయిన సులోచన ఆతడికి అన్ని సపర్యలు రోత అనుకోకుండ చేసేది కనుకనే పతివ్రత అనిపించుకోగలిగింది. అర్థం లేని వరం పొందిన కుంతి పెళ్ళి కాకుండానే తల్లి అయింది. ఇష్టం లేకుండ అత్త అయిన సత్యవతి ఆజ్ఞానుసారం వేదవ్యాసుని వలన సంతానాన్ని పొందాల్సి వచ్చింది అంబిక, అంబాలికలు. రాజులు తమ కుమార్తెలను తమ ప్రయోజనాల కోసం వినియోగించుకొనేవారు. ఋషుల అనుగ్రహం కోసం వారికి దాసీలుగ నియమించేవారు. వారు కోరితే కుంతి, గ్రుడ్డి, శత వృద్ధు అయినా సరే ధారాదత్తం చేసేవారు. వర నిర్ణయం చేసేటప్పుడు కూడా తమ రాజ్యానికి రక్షణ కలుగుతుందనో, బలం కూడగట్టుకోవడం కోసమో ఆడపిల్లని, ఎరగా వాడుకునేవారు. అర్జునుడికి కోడలు కాదగిన ఉత్తరను భార్యగా ఇస్తానని విరటుడు పలకడానికి ఇదే కారణం. ఇది ఆనాడు సర్వసామాన్యం.

ఇంకొక విషయం ఏమిటంటే వివాహేతర సంబంధాల పట్ల తూష్ణీభావం వహించడం. స్త్రీలకు అన్ని కట్టుబాట్లు ఉన్న ఆనాటి సమాజంలో ఆమె తండ్రి కాని, అత్తకాని, భర్త కాని ఆమెను ఇతర సంబంధాల విషయంలో నియోగిస్తే తప్పుపట్టేవారు కారు. పాండురాజు కుంతితో మనుధర్మశాస్త్రాన్ని ఉద్ధరిస్తూ చెప్పిన మాటలు ఈ విషయాన్ని ధ్రువీకరిస్తాయి.

భర్తచేత నియోగింపబడక సతికి నెద్దియును జేయగాదగదెద్దియైన
భర్త చేత నియోగింపబడినదాని జేయకునికి దోషంబని చెప్పె మనువు".

భర్త చెప్పకుండా ఏదీ చేయకూడదు. భర్త చెప్తే ఏదైనా చేసి తీరాలి అనే నియమం చాలు స్త్రీ స్థితిని అంచనా వేసేందుకు. భర్త అనుమతితోనే కుంతి కొడుకులను కనడం, మాద్రికి కూడా సంతానాన్ని పొందే అవకాశాన్నివ్వడం జరిగింది. అందుచేతనే పాండవులు ధర్మవిరుద్ధ సంతానం అనే నింద పడకుండ తప్పించుకొన్నారు. దుర్యోధనుడు మాత్రం వారి జన్మ కారణంగానే వారికి పాలివ్వనని నిర్ణయించుకొన్నాడు.

స్త్రీ జీవితం పురుషాధీనం. పర పురుషులు ఆమెను కామించడం, అందుకు భర్తలు అంగీకరించడం దారుణం. ఉద్దాలకుని ఇంటికి అతిథిగా వచ్చిన ఒక వృద్ధ విప్రుడు అతని భార్యను కామించిన సందర్భంలో ఆమె కుమారుడు శ్వేత కేతుడు కోపంతో ఒక నిర్ణయాన్ని చేశాడు. - "ఇది యాదిగా సతులెన్నండు పర పురుషార్థినుల్ గాజనదు" అని. దాన్ని ఆచరించడం వలననే గృహిణులకు పరపురుషుల వలన ముప్పు తప్పింది. అయినా ఆ నియమాన్ని ఉల్లంఘించి పర సతులను పొందగోరిన పురుషులకు లెక్కలేదు. ద్రౌపది విషయంలోనే ఆమెను దుస్సల భర్త సైంధవుడు, అజ్ఞాతవాస సమయంలో కీచకుడు పొందగోరడం చూస్తే దానిని వాళ్ళు తప్పుగా భావించేవారు కారని తెలుస్తుంది. నిండు సభలో ద్రౌపదిని దుర్యోధనుడు

తొడగొట్టి రమ్మనడం ఆ సమాజంలో స్త్రీ స్థితిని సూచిస్తుంది. వివాహ వ్యవస్థ ఏర్పడిన తర్వాత కూడా పురుషుడు విశృంఖలంగానే సంచరించేవాడు. స్త్రీకి మాత్రమే కట్టడి ఉండేది. ఈ విషయం సైరంధ్రిని కీచకుడు కామించిన సందర్భంలో స్పష్టంగా బోధపడుతుంది. కీచకుడు ద్రౌపదిని పొందడం కోసం స్వయంగా అక్క సహాయాన్నే అర్థిస్తాడు. ఆమె సైరంధ్రికి ఆశ్రయమిచ్చేటప్పుడే ఆమె సౌందర్యానికి పురుషులు ఆకర్షితులౌతారని భయపడుతుంది. తన భర్త కూడా ఆమె సౌందర్యానికి ఆకర్షితుడయ్యాడని గంధర్వుల భయం చేతనే ఆమెకు దూరంగా ఉన్నాడని చెబుతుంది. కీచకుడు పట్టుబట్టడంతో అతనికి సహకరించి తనంతట తానే ఒక పన్నాగం పన్నుతుంది. ఇది ఆకాలంలో సర్వసాధారణం అనుకోకతప్పదు.

పురుషుని విశృంఖలత్వం వలన స్త్రీ అభద్రతా భావానికి గురయ్యేది. అందుచేతనే ద్రౌపదిని సత్యభామ అడుగుతుంది - నీవు ఎలా అయిదుగురు భర్తలను నీ కనుసన్నలలో ఉంచుకోగలుగుతున్నావు. మందులు, మంత్రాలు వేశావా అని. ద్రౌపది సమాధానం నాటి స్త్రీల ఆలోచనలకు అద్దం పడుతుంది. స్త్రీలు ఇల్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. భర్తకు అన్నివేళలా సపర్యలు చేయాలి. అతిథులను ఆదరించాలి. అదే ఆమె జీవిత పరమావధి కావాలి. ఇంతవరకూ బాగానే ఉంది. మరి ఆమె పట్ల భర్త బాధ్యతలు ఏమిటి అని ఎక్కడ చెప్పలేదు. అయిదుగురు భర్తలుండి కూడా పడరానిపాట్లు పడింది ద్రౌపది. దానికి సమాజం కాని, భర్తలు కాని పెద్దగా వాపోయినట్లు కనిపించదు. శ్రీ కృష్ణుడు మాత్రమే ఆమె పరాభవాన్ని మాటిమాటికీ గుర్తు చేసి పాండవులను యుద్ధోన్ముఖులను చేశాడు. రాయబారానికి శ్రీకృష్ణుడు వెళ్ళేటప్పుడు భీముడు సైతం ఆమెకు జరిగిన అవమానాన్ని పక్కకు పెట్టి మాట్లాడాడు. బహుశా ఇది ఆమెను మరీ బాధించి ఉంటుంది. అందుకే అంత ఉద్వేగం చెంది ఉంటుంది.

## 4.4. పతివ్రతా లక్షణాలు :

భారతంలో పతివ్రత లక్షణాలు చెప్పని పాత్ర లేదు. చెప్పని సన్నివేశం లేదు. స్త్రీని గురించి ఉన్నతంగా మాట్లాడిన వ్యక్తి లేడు ఆకాలంలో. భీష్ముడు ధర్మరాజుకు రాజధర్మాలను చెప్తూ ఎవరెవరు ఎలాంటివారో వివరిస్తాడు. స్త్రీలను చంచల స్వభావులుగా, కుత్సితులుగా పేర్కొంటాడు. ధర్మరాజుకి కూడా స్త్రీల పట్ల గౌరవం తక్కువ. అటు అష్టకష్టాలు పడి తమతో అరణ్యవాసం చేసి, అవమానాలు (తన వ్యసనం కారణంగా) పొందిన ద్రౌపది పట్ల గాని, తండ్రి లేని తమను పెంచి పెద్ద చేసి శ్రీకృష్ణుని దిక్కుగా చూపిన తల్లి కుంతి పట్ల గాని అతడు గౌరవాన్ని ప్రదర్శించిన సన్నివేశం ఒక్కటి కూడా లేదు. "ఎవ్వాని వాకిట నిభమదపంకంబు రాజభూషణ రజోరాశి నడగు" అంటూ ద్రౌపది అతడిని కీర్తించిందే కాని అతనికి ఆమెను గురించి చెప్పడానికి ఒక్కమంచి మాట దొరకలేదు పాపం!

సరే పతివ్రత అనిపించుకోవడానికి స్త్రీ ఏం చేయాలి? భర్తకు అనుగుణంగా నడచుకొంటే చాలా అంటే అంతమాత్రమే కాదు. అతడు నియోగించినపుడు పరపురుషులను కూడా సేవించాలి. ఆమె స్వతంత్రించి ఏపనీ చేయకూడదు కాని భర్త చేయమంటే ఏ పనైనా చేయాలన్నమాట. ఇది ఎంత దారుణం! కాని నాటి వాస్తవస్థితి అదే.

పతివ్రతా లక్షణాలను శాండిలీ సుమనల సంవాదంలో చూడవచ్చు. సుమన దివ్యలోకంలో ఉన్న శాండిలిని అడుగుతుంది - ఈ దివ్యపదవి నీకెలా వచ్చిందో చెప్పమని. అందుకు శాండిలి సమాధానం ఆనునాసనిక పర్వంలో ఉంది. అది జనసామాన్యమైనదే !

సీ. మామకు నత్తకుమార్వల్క దేవపిత్రతిథి పూజనములయందు సొలయ
నిలువడి దలవాకిలెప్పుడు నెరుగక పెలుచనవ్వక శుద్ధి వెలయ విప్ర
భిక్ష యోపిక గల్గి వెట్టుచువర్తింతువలయు కార్యములకు వెలది మగుడ
బతివచ్చునప్పుడు భక్తియువేడ్కయుబొదల నాసన పాద్యములను సుముఖ

ఆ.వె. భావమునను సేవవాటింతుబిడ్డల శిక్ష వదల దిట్టజెట్టగనియు
నాకు వేరప్రియమనగలేదు పతిమెచ్చు వంటకములు చవిగ వండి యిడుదు.

ఆమెకు అంటూ ఒక కోరిక గాని, ఆలోచన గాని లేకుండ భర్తకు, ఇంటిల్లిపాదికీ వండివార్చుతూ, అతిథి అభ్యాగతులకు ఓపిగ్గా సేవలు చేస్తూ బిడ్డలను పెంచుతూ, భర్త మాటకు మారు పలకకుండ తలవాకిటనిలవక, పెద్దగా నవ్వక ఉంటే చాలు. ఇంకా భర్త ప్రవాసం వెళ్తే తిరిగి వచ్చే దాకా పువ్వులు పెట్టుకోకూడదు, మంచి గంధం వ్రాసుకోకూడదు, ఆభరణాలు ధరించరాదు, రుచిగా భోజనం కూడా చేయకూడదు. గర్భం దాల్చినా మంచి భోజనం చేయకూడదు. ఇవన్నీ చేస్తే దివ్యపదం లభిస్తుంది తనకులాగే అని చెప్పింది శాండిలిని.

ఇది కేవలం ఒక పాత్ర మనోగతం కాదు. ఒక పాత్ర చేత చెప్పించబడిన, స్త్రీ పాటించి తీరవలసిన నియమావళి. భార్య చనిపోయినా, పిల్లలు లేకపోయినా భర్త మళ్ళీ పెళ్ళి చేసుకోవచ్చు. పిల్లలున్నా చేసుకోవచ్చు - ఎంత మందినైనా సరే. భార్య కాదనరాదు. కాని భర్త విడిచిపెట్టినా, చనిపోయినా స్త్రీ మాత్రం మళ్ళీ పెళ్ళి చేసుకోకూడదు. ఈ ద్వంద్వ నీతి భారతకాలంలోనే స్థిరపడింది. (ఆది పర్వం - 6వ ఆశ్వాసం - 258) అందుకే స్త్రీ జీవితం ఆమె ఇష్టానిష్టాలను బట్టి గాక పుట్టినింట తండ్రి ఇష్టానుసారంగా, అత్తింట భర్త ఇష్టానుసారంగా గడిచిపోయేది. ఈ విషయంలో రాచకన్యలకు, సామాన్యులకు తారతమ్యం లేదు. ఇది అందరికీ సామాన్య ధర్మమే.

అయితే సమాజం తరతరాలుగా ఈ ధర్మాలను నూరిపోయడం వలన స్త్రీలు దీన్ని ప్రశ్నించడం కూడా మానుకొన్నారు. స్వతంత్ర ప్రతిపత్తి ఏ స్త్రీకి ఉండేది కాదు. తనకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం చేసితీరాలి అని పట్టుబట్టిన ద్రౌపది కూడా పతివ్రతా ధర్మాలను సత్యభామకు నూరిపోసింది. పాండవుల చర్యలను ఖండించినట్లు కూడా పెద్దగా కనబడదు. తన్ను సభకు రమ్మని పిల్చిన ప్రాతిగామితో మాత్రం 'నన్నోడి తన్నోడెనా, తన్నోడి నన్నోడెనా' అని ప్రశ్నించింది. అంతవరకే.

ఎన్ని పాట్లు పడినా అత్తింటి నుండి పుట్టింటికి రాకూడదు. మహాభారతంలో ఒక్క దమయంతి మాత్రం నలుడు విడిచిపెట్టి వెళ్ళిన తర్వాత తండ్రి రాజ్యానికి తిరిగి వెళ్ళింది గత్యంతరంలేక. ఇచ్చిన వస్తువును తిరిగి తీసుకోని విధంగా కన్యను కూడా తిరిగి తీసుకొనేవారు కాదు ఎన్ని కష్టాలు ఎదురైనా.

## 4.5 స్త్రీ పురుషుడి స్వంత ఆస్తి :

స్త్రీ పురుషునికి సహధర్మచారిణిగా కాక ఆస్తిలాగా భావింపబడేది. దీనికి అనేక నిదర్శనాలు కనిపిస్తాయి భారతంలో. హరిశ్చంద్రుడు విశ్వామిత్రుడికి ఇవ్వవలసిన ధనం కోసం పడరాని పాట్లు పడ్డాడు. అయినా భార్యను అమ్మడం అన్యాయం. ఆమె కూడా ప్రతిఘటించలేదు. సమాజం సత్యహరిశ్చంద్రుడికి బ్రహ్మరధం పట్టింది. దేవతలు పుష్పవర్షం కురిపించారు. మరి చంద్రమతికి దక్కిందేమిటి? పుత్రశోకం, అవమానం తప్ప.

నలుడు సుఖాలలో తోడున్న దమయంతిని కష్టాలు వచ్చేటప్పటికి వదిలేశాడు పనికిరాని వస్తువును పారేసినట్లు. ప్రేమించి పెళ్ళిచేసుకొన్న వైనాన్ని, చేసిన బాసలను మరచి చెప్పాపెట్టకుండ నట్టడవిలో వదిలి నగుపాట్ల పాలు చేశాడు. ఎవరూ ప్రశ్నించనే లేరు అనే ధైర్యంతోనే కదా. అది ఆనాటి స్త్రీ దయనీయ స్థితి. ఎంత సౌందర్యవతి, సుగుణవతి అయినా సరే.

శకుంతల పరిస్థితి మరీ దారుణం. ప్రేమించి, వివాహానికి ఒప్పించి, కుమారుడిని యువరాజు చేస్తానని మాట ఇచ్చి మనువాడి వెళ్ళిపోయాడు దుష్యంతుడు. ఎదురుచూచి, వేసారి, తన కడుపున పుట్టిన కొడుకు కోసం అభిమానాన్ని అవతలబెట్టి దుష్యంతుడి సభకు వెళ్ళి స్వీకరించమని కోరింది శకుంతల. నీవెవరో నాకు తెలియదు పొమ్మన్నాడు. ఆ పిల్లవాడికి నేను తండ్రిని కాదన్నాడు. ఎంత అవమానం ! శకుంతల ధర్మచ్యుతిని సహించలేక సత్యం యొక్క గొప్పదనాన్ని గూర్చి అపూర్వకంగా వాక్రుచ్చింది. సతియు, గుణవతియు, ప్రజావతియు, అనువ్రతియు అయినవనితను అవజ్ఞాన్విత దృష్టిజూచు అతిదుర్మతికి ఇహము, పరము ఉండవని హెచ్చరించింది. అవసరానికి వాడుకొని ఆ తర్వాత ఆ వస్తువును వదిలివేసినట్లు ప్రవర్తించాడు దుష్యంతుడు. పైగా ఆమె శీలానికి కూడా భంగం వాటిల్లేటట్లు మాట్లాడాడు. అశరీరవాణి పలికితే సత్యం వెల్లడైంది. లేకపోతే ఆమె పరిస్థితి ఏమయ్యేదో అనూహ్యం !

స్త్రీని ఒక భోగ్యవస్తువుగా, స్వంత ఆస్తిగా భావించేవారు పురుషులు. తండ్రి కూతురుని అలా ఇవ్వడం మరీ దారుణం. గాలవుడు గురువుకివ్వాల్సిన దక్షిణ 800 గుఱ్ఱాలు ఒక చెవు మాత్రమే తెల్లగా ఉండాలి. ఆ గుఱ్ఱాలకు వాటికోసం వెళ్ళిన గాలవునికి గుఱ్ఱాలకు బదులు కూతురైన మాధవినిస్తాడు తండ్రి. ఆమెను ఆయా రాజులకిచ్చి 600 గుఱ్ఱాలకు పొందుతాడు గాలవుడు. మిగిలిన 200 గుఱ్ఱాలకు బదులు విశ్వామిత్రునికి ఆమెను ఇచ్చివేస్తాడు. అందరు అనుభవించి అవసరం తీరాక వదిలేసిన మాధవిని తిరిగి తండ్రికి అప్పగిస్తాడు గాలవుడు. వెగటు పుట్టించే ఈ వృత్తాంతం ఆ కాలంలో ఎవరికీ బాధాకరం అనిపించలేదు. మాధవి మనోగతం తెలియరాదు. ఆడవాళ్ళకు అవయవాలే తప్ప అభిప్రాయాలు అంతరంగాలు ఉండవు. ఉండకూడదు అనేది నాటి సర్వజనాభిప్రాయం. ఈ కథలో మాధవి 800 గుఱ్ఱాలకు సమానం అన్న మాట. ఒక వస్తుమార్పిడి విధానంలో గాలవుడికి గుఱ్ఱాలను సంపాదించి పెట్టింది. గాలవుడు సరే తండ్రి ఆమెను ఎలా ఇచ్చాడు అనేది మనల్ని వేధించే ప్రశ్న. రాజుల స్వీకరించడం సరే ఆ కాలంలో సర్వసాధారణం.

ద్రౌపదిని పందెంగా ఒడ్డి ఓడి ఆమెకు ఘోర అవమానం జరుగుతుంటే చూస్తూ ఊరుకున్నవాడు 'ధర్మరాజు' అయ్యాడు. ఆమె పంచభర్తృక, బంధకి అనిపించుకొన్నది. రాజ్యాన్ని ఓడినంత సులభంగా ద్రౌపదిని పందెంలో ఆస్తిలాగాపెట్టి ఓడటం అమానుషం !

## 4.6 వైధవ్యం :

స్త్రీకి వైధవ్యం ఒక శాపం ఆరోజుల్లో. అందుచేత చిన్నచూపు చూడబడేది. ప్రతి మగవాడు ఆమెను ఆశించేవాడు అనడానికి భారతమే ఆధారం.

"పడిన యామిషంబు పక్షులపేక్షించు

నట్లు పురుష హీనయైన యువతి

జూచి యెల్లవారు జులుకనపేక్షింతు

రిదియు బాపమనక హీనమతులు"

స్త్రీకి భర్తతోడిదే లోకం. అతనికంటే ముందు చనిపోతే పునిస్త్రీ అవుతుంది. అతడు చనిపోతే విధవగా మిగిలిపోతుంది. దుర్భరమైన జీవితాన్ని గడపాల్సి వస్తుంది. అందుకే చాలామంది స్త్రీలు సహగమనం చేసేవారు. జీవచ్ఛవంలాగా బ్రతకడం కంటే భర్తతో సహగమనం చేయడమే మంచిదని భావించేవారు ఆనాటి స్త్రీలు. అలా అని అది బలవంతంగా చేసిన నిదర్శనాలు లేవు.

పాండురాజు చనిపోయినపుడు మాద్రి సహగమనం చేస్తుంది. కుంతికి నకుల సహదేవులను అప్పగించి వారందరినీ పెంచగలిగే శక్తి తనకు లేదనీ, తన కారణంగానే పాండురాజు చనిపోవడంచేత తానే సహగమనం చేస్తానని చెప్పి ఒప్పిస్తుంది. కుంతి పంచపాండవుల బాధ్యత వహిస్తుంది. మౌసల పర్వంలో వసుదేవుని మరణానంతరం దేవకీ, రోహిణీ, భద్ర, మదిర అనే నలుగురు భార్యలు సహగమనాన్ని కాంక్షించినట్లు తెలుస్తుంది. సత్యభామ మొదలైనవారు తపోవనాలకు వెళ్ళిపోయారు. కురుక్షేత్ర యుద్ధానంతరం ఆంబికేయుని కోడండ్రు, ఉత్తర పాపటలు లేక ధౌతసిత వస్త్రపరిధానలై ఉన్నట్లు తెలుస్తుంది. సహగమనం చేయని స్త్రీలు అలంకారాలకు, రంగు చీరలకు, సుఖప్రద జీవితాలకు దూరంగా భారంగా కాలం గడిపేవారని చెప్పవచ్చు. చావు కోసం ఎదురుచూస్తూ భర్తృగమనాసక్తలై జీవించేవారు.

## 4.7 కన్యాశుల్కం - వరకట్నం :

కన్య తండ్రికి ధనకనక వస్తువాహనాలు ఇచ్చి కన్యను తెచ్చుకొని వివాహం చేసుకోవడం భారతంలో కనిపిస్తుంది. భీష్ముడు పాండురాజు కోసం మాద్రిని అడిగినపుడు ఆమె సోదరుడైన శల్యుడు శుల్కాన్ని ఆశిస్తాడు. భీష్ముడు అఖండమైన ధనరాశిని, అశ్వగజాదులను, ఆభరణాలను, వస్త్రాలను బహూకరించి పుత్రవధువుగా మాద్రిని గ్రహిస్తాడు.

దాశరాజు సత్యవతి వివాహ సమయంలో రాజ్యాన్నే శుల్కంగా కోరాడు. అయితే ఈ ఆచారం భారతకాలంలో కన్యను అలంకరించే నిమిత్తం అడిగేవారని తెలుస్తుంది. సోదరులు సంకటస్థితిలో ఉన్నప్పుడు కూడా శుల్కాన్ని గ్రహించేవారు. ఇది ఒక విధంగా కన్యను అమ్ముకోవడం క్రిందకే వస్తుంది. శుల్కం ఇచ్చి పెండ్లి చేసుకోవడం క్రిందికే వస్తుంది. శుల్కం ఇచ్చి పెండ్లి చేసుకోవడం తప్పని కూడా ఆరోజులలోనే భావింపబడింది. ముక్కుపచ్చలారని బిడ్డలను శుల్కం కోసం అమ్ముకోవడం మాత్రం ఆ కాలంలో లేదు.

వరకట్నం కానుకల రూపంలో ఉండేవి. ద్రుపదుడు ద్రౌపది వివాహ సందర్భంలో పాండవులకు అశ్వగజాదులను, దాసదాసీ జనాలను ఇచ్చినట్లు తెలుస్తుంది. ఉత్తర వివాహ సమయంలో విరటుడు కూడా ఈ పద్ధతిని పాటించినట్లుంది. ఏది ఏమైనా ఇప్పటిలాగా వరకట్నం ఇస్తేగాని పెళ్ళిజరగని దారుణమైన పరిస్థితి మాత్రం అప్పుడు లేదనిపిస్తుంది. వివాహం సంతానం కోసమే అయిన ఆ కాలంలో సంతానవతి కాగలస్త్రీని పలువురు కోరుకునే వారని మాత్రం చెప్పవచ్చు. సంతానం కలుగగానే స్త్రీ పురుషులు విడివిడిగా జీవించడం కూడా ఉంది. హిడింబి, ఉలూచి, చిత్రాంగద, జరత్కారు ఇలాంటివారే. సంతానాన్ని స్త్రీలే పెంచేవారు. ఈ విషయంలో మాత్రం భారతకాలంలో స్త్రీల స్థితి మెరుగైనదని చెప్పవచ్చు. సంతానం మీద హక్కు స్త్రీలకే ఉండేది అలాంటి సందర్భాలలో సమస్యల స్వరూపం ఏమైనప్పటికీ స్త్రీలు తమతమ పరిధిలో స్వతంత్రంగా జీవించాలని ప్రయత్నించినట్లు మనకు స్పష్టంగా తెలుస్తుంది. సమాజం మాతృస్వామ్యం నుంచి పితృస్వామ్యం దిశగా మారుతున్న కాలమది. అందువలననే ధర్మనిర్దేశం పేరుతో స్త్రీల ప్రవర్తనకు గిరులు గీయడం ప్రారంభించారు పురుషులు. అయినా స్త్రీలు తమ ఉనికిని నిలబెట్టుకోవడానికి ప్రయత్నించారు. పాతివ్రత్యం పేరుతో ఆమెకు అడుగడుగునా ఆంక్షలు విధిస్తే ఆ పరిధిలో నిలబడే ఆమె పురుషుడిని నిలదీయడం ప్రారంభించింది. అంబ, సత్యవతి, కుంతి, గాంధారి, ద్రౌపది ఎప్పటికప్పుడు సమాజాన్ని ప్రశ్నించారు. అవసరమైన నిర్ణయాలను స్వతంత్రంగా తీసుకొన్నారు. కురుక్షేత్ర యుద్ధానికి ఏది అసలైన కారణం అంటే ద్రౌపదికి జరిగిన అవమానం అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

శకుంతల దుష్యంతుని నిండుకొలువులో అతనికే బుద్ధి చెప్తుంది. దమయంతి నిర్దయుడై నిగూఢంగా బ్రతుకు వెళ్ళదీస్తున్న నలుడిని స్వయంవర పాశంతో తన దగ్గరకు లాక్కొంటుంది. అంబ భీష్ముడి మరణాన్ని చూచినదాకా ఊరుకోలేదు. స్త్రీ పర్వంలో భర్తలను కోల్పోయిన భార్యలను, కొడుకులను పోగొట్టుకున్న తల్లులను చూచినప్పుడు మాత్రం మనసు విలవిలలాడుతుంది. ఉత్తర గర్భస్థ శిశువు పరీక్షిత్తు రాజైనప్పుడు ఒక్కటి అర్థం అవుతుంది. ఒక మాతృమూర్తి పునఃసృష్టికి కారణమైంది. స్త్రీలు సమస్యల నెదుర్కొనే క్రమంలో భారతంలో కనిపించే సమస్యలన్నీ ఇప్పటికీ ఉన్నాయనిపిస్తుంది. మొక్కవోని వారి ధైర్యం అడుగడుగునా దర్శనమిస్తుంది.

సృష్టి ఎంత ప్రాచీనమో స్త్రీ అంత ప్రాచీనం. స్త్రీల సమస్యలూ అంత పురాతనం అయినవే. పరిష్కారాలు మాత్రం మారుస్తూ వస్తున్నాయి. కాలానుగుణంగా సమాజం, సామాజిక ధర్మం మారడం సహజమేగదా !

**మాదిరి ప్రశ్నలు :**

1. భారతకాలంనాటి స్త్రీ సమస్యను తెలియజేయండి.
2. మహాభారత కాలం నాటి స్త్రీ స్థితిగతులను వివరించండి.

**ఆచార్య పి. సుమతీనరేంద్ర**

పాఠం - 5

# ఆంధ్ర మహాభారతంలో స్త్రీ పాత్రల పరిచయం

**ఉద్దేశ్యం :**

మహాభారతంలో స్త్రీ పాత్రల పరిచయం.

**పాఠ్య నిర్మాణక్రమం :**


**5.1.** ప్రధానకథలో కనిపించే పాత్రలు

**5.1.1** సత్యవతి

**5.1.2** అంబ

**5.1.3** గాంధారి

**5.1.4** కుంతి

**5.1.5** మాద్రి

**5.1.6** ద్రౌపది

**5.1.7** ఉత్తర

**5.1.8** సుధేష్ణ

**5.2.** ఉపాఖ్యానాలలో కనిపించే పాత్రలు

**5.2.1** కద్రువ, వినతలు

**5.2.2.** శకుంతల

**5.2.3** దమయంతి

**5.2.4** సావిత్రి

**5.2.5** చంద్రమతి

**5.2.6** శర్మిష్ట, దేవయాని

**5.2.7** మాధవి

**5.2.8** సుకన్య

**5.3.** ముగింపు

**5.4** మాదిరి ప్రశ్నలు

**5.5** ఉపయుక్త గ్రంథాలు


## 5.1. మహాభారతంలోని స్త్రీ పాత్రలు :

మహాభారతం భారతీయ సంస్కృతికి మూలకందంగా రూపుదిద్దుకొన్నది. వ్యాసకృత మహాభారతాన్ని తెలుగులోకి తీసికొని వచ్చిన కవిత్రయ కవులు - నన్నయ, తిక్కన, ఎఱ్ఱన, తమ కాలాలకు అనుగుణంగా కథను తీర్చిదిద్దినారు. అయితే వీరిది పూర్తిగా స్వతంత్ర రచన కాదు. చాలావరకు మూలానుసారంగానే రచన సాగించారు. ముఖ్యంగా పాత్రల విషయంలో

వీరు వ్యాసకృత మహాభారతంలో ఉన్నట్లుగానే పోషించారు. అక్కడక్కడ ఆ పాత్రల స్వభావాలను మరికొంచెం స్పష్టంగా బోధపడేటట్లు చేశారే కాని పూర్తిగా మార్చే ప్రయత్నం చేయలేదు.

మహాభారతాన్ని జాగ్రత్తగా అధ్యయనం చేస్తే నాటి భారతీయ సమాజం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయా పాత్రలు వ్యవహరించిన తీరు నాటి సామాజిక వాతావరణాన్ని ప్రతిఫలిస్తుంది. జ్ఞాతివైరమే మహాభారతం అయింది. బహుశా 'జ్ఞాతిశ్చేత్ అనలేక కిం?' అనే మాట అప్పటినుండే రూఢికెక్కి ఉంటుంది. మహాభారత కథ ఇప్పుడు మనకు లభిస్తున్న గ్రంథంలో జరిగినట్లుగానే జరిగి ఉంటుందని ఘంటాపథంగా చెప్పలేం కాని అలా జరిగిఉండడానికి చాలా అవకాశాలు ఉన్నాయి. పాత్ర చిత్రణలో కూడా వ్యాసుడు వాస్తవాలకు మరీదూరంగా వెళ్ళలేదని చెప్పవచ్చు. అందుకే మహాభారత పాత్రలు మనకు మన మధ్య తిరుగుతున్న మనుషులలాగా సహజంగా సంభావ్యంగా కనిపిస్తాయి. ఏ ఒక్క పాత్ర కూడా అస్వాభావికంగా కనిపించదు. ప్రధాన కథతోబాటు మహాభారతంలో ఉపాఖ్యానాల పాత్ర కూడా చెప్పుకోదగ్గదే. అసలు అవిలేకపోతే అది మహాభారతమే కాకుండ పోతుంది. ఇక ధర్మోపదేశాల సంగతి సరేసరి. అవి మహాభారతానికి విశిష్ఠతను సంపాదించిపెట్టాయి. అందువలన మహాభారత పాత్రలను మనం మూడు రకాలుగా విభజించుకొని చూడాలి. ప్రధాన కథలో కనిపించే పాత్రలు ఒకరకం అయితే ఉపాఖ్యానాలలో కనిపించే పాత్రలు మరొకరకం. ఇక ధర్మోపదేశాలు చేసే సందర్భంలో చెప్పబడే నీత్యుపదేశ బోధకాలైన చిన్న కథలలో కనిపించే పాత్రలు ఇంకొకరకం.

ప్రాధాన్య వివక్షను బట్టి ఆయా పాత్రలు పోషింపబడ్డాయి. ఆ దృష్టితోనే మహాభారతంలోని స్త్రీ పాత్రలను మనం విశ్లేషించి చూడవలసి ఉంటుంది.

ప్రధాన కథలో కనిపించే పాత్రలు :

కథతో ప్రత్యక్షసంబంధం కలిగిన పాత్రలు ఈ కోవలోకి వస్తాయి. మహాభారత కథ ఎప్పటికప్పుడు ముందుకు సాగడానికి ఈ పాత్రలే కారణం. శంతనుడి భార్య సత్యవతి మొదలుకొని అభిమన్యుడి భార్య ఉత్తర వరకు కురువంశరాజుల భార్యలు ప్రధాన కథాగత స్త్రీ పాత్రలు.

## 5.1.1. సత్యవతి :

కురువంశకథ మహాభారతంలో ప్రధానేతివృత్తం. శంతనుడితో ఇది ప్రారంభమౌతుంది. శంతనుడు మొదట గంగను వివాహం చేసుకుంటాడు. అయితే ఆమె ఒక షరతును పెడుతుంది. తనకు పుట్టే సంతతిని గంగపాలు చేస్తుంది. అష్టమ సంతానం విషయంలో అడ్డుపడ్డాడు శంతనుడు. అప్పుడు గంగ శంతనుడిని వీడి వెళ్ళిపోతుంది. పోయేటప్పుడు ఎనిమిదవ కొడుకైన దేవవ్రతుడిని తన వెంట తీసుకొనిపోయి విద్యాబుద్ధులు నేర్పించి తిరిగి శంతనుడికి అప్పగిస్తుంది. శంతనుడి తర్వాత కురువంశాన్ని కొనసాగించాల్సిన వాడు ఇతడే. ఇతడు పూర్వజన్మలో అష్టవసువులలో ఒకడు. భావిసామ్రాజ్యాధినేత. సకల విద్యాపారంగతుడు. అయితే కథను ఇక్కడ అనుకోని మలుపు తిరిగేటట్లు చేసింది సత్యవతి పాత్ర. ఈమె దాశరాజు కూతురు. ఈమెకు కన్యగా ఉన్నప్పుడు పరాశరుని వలన కలిగిన పుత్రుడే కృష్ణద్వైపాయనుడు ఇతడే మహాభారత కథా రచయిత వేదవ్యాసుడు. శంతనుడికి గంగ వలన పుట్టిన దేవపుత్రుడే భీష్ముడు. సత్యవతికి పుట్టినవాడు వ్యాసుడు. వీరిరువురు కథలో ఆద్యంతం కనిపిస్తారు. కీలకమైన పాత్రను పోషిస్తారు. వీరిరువురికి తల్లి స్థానంలో ఉన్నది సత్యవతి.

సత్యవతి జీవతం చిత్రవిచిత్రమైన మలుపులు తిరిగింది. పెళ్ళికాకముందే వ్యాసునికి తల్లి అయింది. పరాశరుని ప్రభావం వలన మత్స్యగంధి కాస్తా యోజనగంధి అయింది. శంతనుడు ఆమెను వరిస్తాడు. కాని దాశరాజు ఆమె సంతానానికే రాజ్యార్హత ఉండాలని షరతు విధిస్తాడు. శంతనుడి మనసు తెలుసుకున్న భీష్ముడు తండ్రి కోసం దాశరాజు షరతును అంగీకరిస్తాడు.

తన రాజ్యాధికారాన్ని పుట్టబోయే సత్యవతి సంతానం కోసం వదులుకున్నాడు. తనకు సంతానం కలిగితే ముందు ముందు అనర్థం ఏర్పడుతుందని వివాహాన్నే త్యజించి భీషణ ప్రతిజ్ఞ చేసి భీష్ముడయ్యాడు. ఏ జ్ఞాతివైరం రాకూడదని భీష్ముడు వివాహమే ఆడనని భీషణమైన ప్రతిజ్ఞ చేసాడో ఆజ్ఞాతివైరం రానే వచ్చింది తదనంతర కాలంలో. అది విధివిలాసం. ఇక్కడ సత్యవతి పాత్రను కొంచెం గమనించి చూడాలి. ఆమె ఇష్టానిష్ఠలతో సంబంధం లేకుండానే ఆమె జీవితంలో అనేక సంఘటనలు జరిగిపోయాయి. పడవ నడుపుతూ కాలం గడిపే ముగ్ధకన్యగా ఉన్న సత్యవతి పరాశరుని వలన పెళ్ళికాకుండానే తల్లి అయింది. తరువాత కురువంశాధిపతి శంతనునికి భార్య అయింది. దాశరాజు షరతులతో ఆమెకు ప్రమేయం ఉన్నట్లు లేదు. ఇరువురు కుమారులను కన్నది కాని ఇద్దరు చరిత్ర హీనులే. ఒకడు చిత్రాంగదుడు. మరొకుడు విచిత్రవీర్యుడు. భీష్ముడికి సోదరులే వరసకు కాని భీష్మునితో ఏవిధంగానూ పోల్చతగినవారు కారు. వీరిలో చిత్రాంగదుడు వివాహం కాకుండానే వేటకు వెళ్ళిచనిపోయాడు. ఇక విచిత్రవీర్యుడు అర్భకుడు. ఇతడికి పెళ్ళిచేయాలని సత్యవతి అనుకొన్నప్పుడు భీష్ముడు వెళ్ళికాశీరాజు కూతుళ్ళను స్వయంవరంలో మిగతా రాజులను ఓడించి తీసుకొని వస్తాడు. అయితే వీరిలో పెద్దదైన అంబ సాళ్వరాజును వరించానని చెప్తే భీష్ముడు వదిలేశాడు. ఆమె ఆ తర్వాత శిఖండియై, భీష్ముడి మరణానికి కారణమౌతుంది. అది వేరే సంగతి సరే అంబిక, అంబాలికలను తెచ్చి విచిత్రవీర్యునికి కట్టబెడ్తాడు. అయినా వారికి సంతానం కలుగదు. అది వారి దోషం కాదు. అప్పుడు సత్యవతి భీష్ముడిని వివాహం చేసుకొమ్మని లేదా దేవర న్యాయంతో సంతానాన్ని పొందమని కోరుతుంది. అందుకు భీష్ముడు అంగీకరించడు. అప్పుడు సత్యవతి తన మొదటి కొడుకైన వ్యాసుడిని పిలిచి తన కోడళ్ళకు సంతానప్రాప్తిని కలిగించమని ఆదేశిస్తుంది. అలాగే ధృతరాష్ట్రుడు, పాండురాజు, దాసి వలన విదురుడు పుడ్తారు. అంటే కురువంశ వారసుడైన భీష్ముని భీషణ ప్రతిజ్ఞ వలన కురువంశం అంతరించిందనే చెప్పుకోవాలి. కాని ఆ రోజులలో ఉన్న పద్ధతులననుసరించి సత్యవతి వంశాన్ని కొనసాగించే ప్రయత్నం చేస్తుంది. ఇంతచేసినా, పుట్టిన వారిమధ్య సయోధ్య సాధించినా, ఆ తరువాత కాలంలో పుట్టిన ధృతరాష్ట్ర సంతతి, పాండురాజు సంతతి అయిన కురుపాండవుల మధ్య మాత్రం సయోధ్య ఏర్పడలేదు. ఇది సత్యవతి జీవితంలో విషాదం. అంటే ఆ కాలంలో పురుష ప్రయత్నమే దేన్నైనా నిర్ణయించేది. స్త్రీ ఇష్టానిష్టలతో అభిప్రాయాలతో ఏదీ సామాన్యంగా జరిగేది కాదు. అయితే వ్యాసుడు మాత్రం తల్లి మాటను శిరసావహిస్తాడు. అతడు ఆ కాలంలో ధర్మాధర్మ విచక్షణ చేసేవాడని భారతంలో అనేక సందర్భాలలో అతడి నిర్ణయాలు అందరికీ ఆమోద యోగ్యంగా, శిరోధార్యంగా ఉండేవని తెలస్తుంది. అలాంటి మహర్షిని కన్నతల్లి సత్యవతి. శంతనుడు కోరి వివాహమాడిన పత్ని. తన కొడుకుల ద్వారా కురువంశం కొనసాగదని తెలిసినప్పుడు తన కోడళ్ళకు దేవర న్యాయం ద్వారా సంతానప్రాప్తి కలిగించిన స్త్రీమూర్తి. కురువంశాన్ని నిలబెట్టడానికే ఆమె ఆ ప్రయత్నాన్ని చేసిఉండవచ్చు. అయినా ఆమె వ్యక్తిత్వాన్ని మనం గుర్తించవచ్చు. ఆమె పూనుకోకపోయి ఉన్నట్లయితే కురువంశం ఆమె సంతానంతోనే అంతరించి ఉండేది. అలాకాక ధృతరాష్ట్ర, పాండు, విదురుల జననానికి మూల కారణంగా అయింది సత్యవతి పూనిక.

## 5.1.2 అంబ :

మహాభారత కథ ముందుకు సాగింది. ఇక్కడొక పాత్రను గురించి తప్పక చెప్పుకోవాలి. అది కాశీరాజు కుమార్తెలలో పెద్దదైన అంబపాత్ర. ఆమె శాపగ్రస్త. భీష్ముడు తన తమ్ముల కోసం కాశీరాజు కుమార్తెలను స్వయంవరంలో తక్కిన రాజులనుఓడించి తీసుకొని వస్తాడు. అంబతాను సాళ్వుడిని అదివరకే ప్రేమించిన విషయం చెబుతుంది. భీష్ముడు ఆమెను సాళ్వుని కొరకు వదలిపెడ్తాడు. ఆమెను సాళ్వుడు నిరాకరిస్తాడు. భీష్ముని చేతిలో ఓడిన సాళ్వుడు ఆమెను స్వీకరించడానికి ఇష్టపడడు. ఆమె భీష్ముని సొత్తుగా భావిస్తాడు. భీష్ముని వద్దకు వెళ్తుంది అంబ. సాళ్వుని వరించిన అంబను తన కుల వధువుగా స్వీకరించడానికి భీష్ముడు ఒప్పుకోడు. తమ్ముని భార్యగాకాక భీష్ముడే వివాహమాడమని కోరుతుంది అంబ. వంశం అంతరిచి పోతుందన్న సందర్భంలోనే తన ప్రతిజ్ఞను వీడని భీష్ముడు అంబ ప్రతిపాదనను తిరస్కరిస్తాడు. అంబ విధి వంచిత ! కాని ఆమె తన జీవితం

భగ్నం కావడానికి భీష్ముడు కారణమని భావించి అతడిని సాధించడానికి పూనుకుంటుంది. భీష్ముడి గురువైన పరశురాముడిని ఆశ్రయిస్తుంది. భీష్మునితో జరిగిన యుద్ధంలో పరశురాముడు ఓడిపోతాడు. మానవ మాత్రుల వలన సాధ్యంకాని తన పంతాన్ని దైవం ద్వారా సాధించదలచి తపస్సుకు పూనుకొంటుంది. శివుని ప్రసన్నుడిని చేసుకొని మరుజన్మలోనైనా భీష్ముడిని చంపగలిగే వరాన్నిమ్మని కోరుతుంది.

ద్రుపదునికి శిఖండిగా జన్మిస్తుంది. కూతురుగా జన్మించికొడుకుగా మారుతుంది. భీష్ముని చంపాలనే కోరికతో ఒక జన్మనుకాక మరొక జన్మను కూడా పగ సాధించడం కోసమే వెచ్చిస్తుంది అంబ. ఇదొక విషాదపాత్ర. స్త్రీ క్రోధానికి ప్రతీకగా నిలచిన పాత్ర అంబ.

అంబ తోడపుట్టిన అంబిక అంబాలికలు కురువంశ వధువులైనారు. వారు పొందిన సుఖసంతోషాలు ఏమీలేవు. విచిత్రవీర్యుని భార్యలయినా సంతానవతులు కాలేకపోయారు. ఆకాలంలో పుత్రులను గన్న తల్లికే గౌరవం సమాజంలోగాని అంతఃపురంలోగాని. పైగా కురువంశం అంతరించి పోయే ప్రమాదం పొంచివుంది. సత్యవతి ఆజ్ఞమేరకు వ్యాసుని వలన సంతానం పొందవలసిన పరిస్థితి ఏర్పడింది. భయంతో ఒకరు కళ్ళుమూసుకుంటే, ఒకరు వెఱపు చెందారు. వారికి పుట్టినవారే ధృతరాష్ట్ర పాండునృపులు. ఒకరు అంధులు, ఇంకొకరు పాండువర్ణులు. ఒక్కదాసికి మాత్రమే సర్వలక్షణుడైన విదురుడు కలిగాడు. కాని ఏం లాభం ? ఆ రోజులలో దాసీపుత్రుడు దాసుడుగానే ఉండవలసి వచ్చింది. అంటే స్త్రీల ఇష్టాఇష్టాలతో ప్రమేయం లేకుండానే వివాహాలు, సంతానప్రాప్తి జరుగుతుండేవన్నమాట. వ్యాసుడి ద్వారా సంతానాన్ని పొందడం అంబిక అంబాలిక లకు సుతరాము ఇష్టం లేదన్న విషయం స్పష్టం అయినా రాజమాత అయిన సత్యవతి ఆజ్ఞను శిరసావహించవలసి వచ్చింది. అసలు అంతకుముందే భీష్మునిచే తీసుకొని రాబడి విచిత్ర వీర్యుని వివాహమాడవలసి వచ్చింది. ఇది నాటి స్త్రీ దుస్థితి.

### 5.1.3 గాంధారి :

ధృతరాష్ట్రుని పట్ట మనిషి. కురుసామ్రాజ్యాన్ని సుదీర్ఘకాలం ఏలిన దుర్యోధనుని కన్నతల్లి. ఒక విపత్కర పరిస్థితిని జీవితాంతం విధించుకొన్న స్త్రీమూర్తి. గ్రుడ్డివాడైన ధృతరాష్ట్రుని వివాహమాడవలసి వచ్చినపుడు ఆమె దానికి మనసా అంగీకరించి ఉంటుందా అనేది సందేహం. రాచరికపు వ్యవస్థలో స్త్రీలు పావులుగా వాడబడేవారు. అలా ఒక అవసరం కోసం లేదా కురువంశ ప్రాపకం కోసం వాడబడిన పావు గాంధారి. తన దుస్థితికి వగచికాని, తన వారి మీద నిరసన ప్రకటించి కాని ఒక కఠోర నియమాన్ని ఏర్పరచుకొన్నది గాంధారి. అంధత్వాన్ని ఎవరూ కోరి వరించరు. కానీమె ఆ తనకు తాను విధించుకొన్నది ఎందుచేతనో విస్పష్టంగా మాత్రం తెలియదు. సరే ఆ తరువాత ఆమె ఎదుర్కొన్న సమస్యలు తక్కువేమీకాదు. తనకంటే తరువాత వధువుగా వచ్చిన కుంతి తల్లి అయింది. తనకు సంతానం కలగనందుకు వగచి పిండాన్ని బ్రద్దలు చేసింది. వ్యాసుని అనుగ్రహం వలన నూర్గురు కొడుకులకు తల్లి అయింది. అయినా కుంతి కొడుకే జ్యేష్ఠుడు. దుర్యోధనుడు జ్యేష్ఠుని పుత్రుడు మాత్రమే. ఆమె గర్భవతిగా ఉన్నప్పుడు అనుభవించిన మాత్సర్య భావమే ఆమె కొడుకుకీ సంక్రమించింది. పాండవులు బలోపేతులు అయ్యేకొద్దీ ఆమెకు భయం ఎక్కువౌతూ వచ్చింది. తన కొడుకులు వీరులైనా పాండవుల కంటే తక్కువ వారనే భావం ఆమెను భాదపెడుతూనే వచ్చింది. ఇది లోకంలో సహజం. దాయాదుల మధ్య పోరుకు ఈ మాత్సర్యమే ప్రధాన కారణం. జీవితాన్ని తన ఇష్టం వచ్చినట్లు దిద్దుకోలేని అసహాయత గాంధారిది. ఆ నిస్సహాయత నుంచే ఆమెలో అభద్రతాభావం పుట్టి పెరిగింది. కొడుకులు ఎదిగిన తర్వాత వారిని ప్రాణాలతోనైనా మిగుల్చుకోవాలని తల్లిగా తాపత్రయపడింది. పాండువులతో వైర్యం విడనాడి సంధి చేసుకొమ్మని కొడుకుని కోరింది. న్యాయం కోసం ధర్మం కోసం ఆమె నిలబడలేదు. మాతృస్థానంలో ఉండి కొడుకుల ప్రాణరక్షణ కోసం ప్రాకులాడింది. ధుర్యోధనుడు ఆమె మాటలను లక్ష్యపెట్టలేదు. ధృతరాష్ట్రుని కంటె గాంధారి మెరుగైన వ్యక్తిత్వం కలిగినది. పాండవుల పట్ల మాత్సర్యం పెంచుకోలేదు. తన కొడుకుల కంటే వారు బలవంతులు

అని తెలుసుకున్నది మొదలు తన వారి రక్షణ కోసం ప్రయత్నించింది. ధృతరాష్ట్రుని వలె పాండవుల పట్ల కపటప్రేమను ప్రకటించలేదు. గ్రుడ్డిగ కొడుకును సమర్థించలేదు. ధృతరాష్ట్రునిది పుత్రవ్యామోహం అయితే గాంధారిది మాతృవాత్సల్యం. పుత్రుల మరణానంతరం మాత్రం ఆమె శోకం క్రోధంగామారి కృష్ణుని శపించే వరకు వెళ్ళింది. పుత్రశోకం చేత దగ్ధమైన తల్లీ గాంధారి.

### 5.1.4 కుంతి :

భారతంలో కనిపించే స్త్రీ పాత్రలలో విచిత్రమైన మలుపులు తిరిగిన పాత్ర కుంతిది. ఆమె కుంతి భోజుని కుమార్తె. దుర్వాసమహర్షి వర ప్రభావం చేత పెళ్ళికాకుండానే తల్లిఅయింది. సూర్యభగవానుడిని ప్రార్థించేటప్పుడు కుతూహలం తప్ప ఆలోచన లేని వ్యక్తిత్వం కలది. కుమారుడు సహజకవచకుండల శోభితుడు. సూర్యుని ఆంశ కలిగినవాడు తప్పకుండ ప్రచండవీరుడే అవుతాడు. అయినా లోకాపవాదభీతి చేత నీటిపాలు చేస్తుంది. అతడే కర్ణుడు. కన్యకు పుట్టినవాడు కాబట్టి కానీనుడు. ఆ కాలంలో అంతఃపుర కాంతలకు సైతం లోకాపవాదభీతి ఉండేదని అర్థం అవుతుంది. కుంతి చేసిన పనివలన, కనక ముందే ఆలోచించి ఉండాల్సింది, కన్న తరువాత సమాజాన్ని ఎదిరించి అయినా పెంచిఉండాల్సింది అని ఇప్పుడు అనవచ్చు కాని ఆ లోకంలో అది సాధ్యం కాలేదు కుంతికి. ఆ కాలంలో అని ఏమిటి ఈ కాలంలో కూడా పెళ్ళికాని తల్లుల పరిస్థితి అదే. సరే, తరువాత ఆమె పాండురాజును పెండ్లాడింది. సంతానం కలగలేదు. పాండురాజు మాద్రిని పెండ్లి చేసుకున్నాడు. అయినా సంతానం కలగలేదు. అంతదాకా తనకు దుర్వాసుడిచ్చిన వరాన్ని గూర్చి ప్రస్తావించని కుంతి అప్పుడు మాత్రమే ఆ విషయం బయటపెట్టింది. ఎంతో సంయమనం ఏర్పరచుకొన్నది కుంతి. పాండురాజు అనుమతితోనే యమవాయు ఇంద్రనందనులను పొందింది. ఏమాత్రం స్వార్థం లేకుండా మాద్రికి కూడా ఆ మంత్రాన్ని ఉపదేశించింది. అశ్వినీ దేవతల వరప్రభావంచేత మాద్రికి నకుల సహదేవులు జన్మించారు. అందరూ ఒక్కతల్లి బిడ్డలుగా పెరిగి పంచపాండవులయ్యారు. ఇక్కడ కుంతి జీవితంలో మరొక విషాదం చిలికింది. శాపగ్రస్తుడైన పాండురాజు మాద్రితో కలిసి ఉండడం వలన మరణించాడు. సహగమనం చేసిన మాద్రి తన కొడుకుల భారం కూడా కుంతి మీదనే వేసింది. బహుశా కుంతి మొదటినుండీ కూడా ఆ ఇరువురినీ తన కుమారులవలెనే పెంచి ఉంటుంది. అందుకే మాద్రి వారిని గురించి విచారించలేదు. పంచపాండవులు కుంతీ సుతులయ్యారు. అందుచేతనే అర్జునుడు కుంతీసుధ మధ్యముడు అయ్యాడు. భీముడు ఆ పేరుతో పిలువబడలేదు.

కుంతి భర్తను పోగొట్టుకొని పసిపిల్లలతో హస్తినాపురం చేరింది. భర్తృవిహీనయై బావ ఇంట 'అదయమైన కూడు' తింటూ కాలం గడిపింది. పాండవులు పెరిగి పెద్దవారైనప్పుడు తన కష్టాలను మరచిపోయి జీవించాలని ఆశించింది. పాండవులు పెరిగేకొద్దీ కురుపాండవుల మధ్య వైషమ్యాలూ పెరిగి సమస్య మరింత జటిలమైంది. పాండవులుపడే కష్టాలన్నింటినీ చూస్తూ ఏమీ చేయలేక బ్రతుకు దుర్భరమై ఉంటుంది. గాంధారి కుంతి మధ్య ఆ విషమ కాలంలో తప్పకుండ అంతరం అధికమై ఉంటుంది. గాంధారికి భర్త, సోదరుడు శకుని, కుమారులు అన్నింటికీ మించి అధికారం కొంత మనోనిబ్బరాన్నిచ్చి ఉంటాయి. కాని కుంతికి దినదినగండం నూరేళ్ళ ఆయుస్సు అన్నపద్ధతిలో జీవితం గడిచింది. దుర్యోధనుని వలన కొడుకులకు ముఖ్యంగా భీమునికి ఎప్పుడు ఏ ప్రమాదం వచ్చి పడుతుందో అని వ్యాకుల చిత్తంతో కాలం గడిపి ఉంటుంది. కుమారాస్త్ర విద్యాప్రదర్శన వేళ కర్ణుడిని మొట్టమొదట చూడగానే గుర్తుపట్టిన కుంతి అతడిని సూతపుత్రుడని భీముడు హేళనచేస్తే ఆతేజోమూర్తి తన కుమారుడని పైకి ప్రకటించలేక మానని గాయం సెలవేసినట్లు బాధపడి ఉంటుంది.

లాక్షాగృహ దహనం, ఏకచక్రపుర నివాసం కుంతిని కష్టాల కొలిమిలో కాల్చిఉంటాయి. ద్రౌపదీ స్వయంవరంలో అర్జునుడుగెలిచి ఆమెను వెంటబెట్టుకొని ద్రుపదుని అండ తన కుమారులకు దక్కిందని సంతోషించింది. ద్రౌపది కారణంగా వారిలో మాత్సర్యం ఏర్పడ కూడదని వారందరికీ ద్రౌపది భార్య కావడానికి అంగీకరించింది. అప్పట్లో ఒక స్త్రీని పలువురు

వివాహమాడే పద్ధతి తప్పకుండ ఉండిఉంటుంది. అక్కడక్కడ కొంత తిరస్కారం కనిపించినా అది అశాస్త్రీయమని భావింపబడినట్లు తోచదు. పైగా ధర్మసూక్ష్మాలను ఎఱిగిన వేదవ్యాసుడి అంగీకారంతోనే ఆ వివాహం జరిగింది. ఆ పైన కృష్ణుడి అండదండలు చేకూరాయి. ఇంద్రప్రస్థంలో ఉన్న కొద్దికాలం కుంతి రాజమాతగా పూర్తిస్థాయిలలో వ్యవహరించి గౌరవమర్యాదలు అనుభవించింది. ఆ తర్వాత పాండవులు మాయాజూదంలో ఓడిపోవడం, రాజ్యాన్ని పోగొట్టుకోవడం, అన్నింటినీ మించి తన అనుంగు కోడలిపై వస్త్రాపహరణయత్నం జరగడం మిక్కిలి బాధను కలిగించి ఉంటాయి. పాండురాజు లేనిలోటు ఎప్పటికన్నా అప్పుడు ఆమెను ఎక్కువ బాధించి ఉంటుంది. అరణ్యవాసం, అజ్ఞాతవాసం పాండవుల కన్నా ఎక్కువ కుంతిని, ద్రౌపదిని క్షోభపెట్టి ఉంటాయి అనడంలో సందేహం లేదు. కడగొట్టు బిడ్డయైన సహదేవుడిని అరణ్యాలకు పంపేటప్పుడు 'కడుపసిబిడ్డవీడు' తన ఆకటిపొద్దు ఎరగడు' అని బాధపడుతూ కోడలికి అప్పగించింది. కడుముద్దరాలు అని ద్రౌపదిని గౌరవించింది. క్షణమొకయుగంగ గడుపుతూ పాండవుల క్షేమం కోసం అహరహం తపించి ఉంటుంది ఆతల్లి. కళ్ళ ముందు కనిపించే కర్ణుడిని అక్కున చేర్చుకోలేని అశక్తత మరింత క్షోభపెట్టి ఉంటుంది. దుర్యోధనుని ఆప్తమిత్రుడై పాండవులను మట్టుపెట్టేందుకు వ్యూహాలు పన్నే కర్ణుడిని వారించాలని అసలు విషయం చెప్పాలని ఆ తల్లి మనసు ఎన్నిసార్లు కొట్టుకుపోయిందో. నిజం బయటపడితే తన కొడుకులు తనని ఏమనుకుంటారో నలుగురిలో నవ్వులపాలు అవుతామేమోనని భయపడి మౌనం వహించి ఉంటుంది. కాని మనసులో చెలరేగే వ్యథను ఎలా అరికట్టగలదు.

పాండవులు తిరిగి వచ్చి సంధి జరిగి ఎవరి రాజ్యంలోవాళ్లు సుఖంగా ఉంటేచాలని ఆశించిన కుంతికి భంగపాటే ఎదురైంది. ఎందరు ఎన్నివిధాలుగా ప్రయత్నించినా యుద్ధం అనివార్యమైంది. అప్పుడిక ఊరుకోవడం సాధ్యంకాలేదు. కర్ణుడితో అసలు విషయం చెప్పేసింది. కర్ణుడు పాండవులను క్షమించి వదిలేస్తానన్నాడే కాని అర్జునుడిని మాత్రం వదలనన్నాడు. అంత గొప్ప కొడుకుని గన్నతల్లి ఆ సమయంలో ఎన్నిరకాల భావాలను పొందిఉంటుందో అనూహ్యం. అప్పుడు కూడ ధర్మజాదులతో కర్ణుడి విషయం చెప్పలేదు. చెప్పి ఉంటే కురుక్షేత్ర యుద్ధమే ఉండేదికాదు. యుద్ధం జరిగినన్ని రోజులు పాండవుల క్షేమం కోసం తపించి ఉంటుంది. కాని కర్ణుడి మరణం ఆమెను విచలితం చేసింది. అదిగో అప్పుడు ఆమె మనసు పొరలలో దాగిన ప్రథమపుత్ర వాత్సల్యం అన్ని అనుమానాలను చెల్లాచెదరు చేసి ముందుకు వచ్చింది. ఏం లాభం ? పోయిన కర్ణుడు తిరిగిరాలేదు. ఉన్న ధర్మజుడు అర్థం చేసుకోలేకపోయాడు. ఆస్త్రీ పరిమితులను నిందించాడు నిజాన్ని దాచినందుకు. తక్కిన సోదరులు అప్పుడు కూడ అన్నమాటనే ఔదాలదాల్చి ఉంటారు. అందుకే ఆమె జీవితం కన్నీటిపాటగనే మిగిలిపోయింది. కృష్ణుడు ఒక్కడే ఆమె అసహాయతను అర్థం చేసుకొన్నవాడు. కుంతి భోజుని ఇంటపుట్టి పాండురాజును వివాహమాడి అసహాయ శూరులైన కుమారులకు తల్లియైన కుంతి జీవితంలో సుఖశాంతులు లేవు. అందుకు ఆనాటి సమాజం ఒక కారణం, రాచరికపు వ్యవస్థ మరొక కారణం. అందుకే ధర్మరాజు రాజ్యంలో ఉండనిచ్చగించలేదు. నిందించే ఆ సమాజానికి దూరంగా వెళ్ళిపోదలచుకున్నది. తనలాగే పుత్రశోకంతో బాధపడుతున్న గాంధారి ధృతరాష్ట్రులననుసరించి అడవులకు వెళ్ళిపోయింది. వారి శుశ్రూషలో చిత్తశాంతిని వెతుక్కొన్నది.

కుంతి కన్యగా ఉండి కర్ణుడిని కనడం పెద్ద అపరాధం అయింది. అది చెప్పలేకపోవడం మరిన్ని మలుపులకు దారితీసింది. తనపెద్ద కొడుకు ఒక పక్షంలో, చిన్న కొడుకులు మరొక పక్షంలో ప్రాణాలు ఒడ్డియుద్ధం చేస్తుంటే కుంతి మాతృహృదయం విలవిల్లాడి ఉంటుంది.

### 5.1.5 మాద్రి :

మాద్రి పాండురాజు రెండోభార్య. మద్రదేశ రాజకుమారి. శల్యుడు ఆమె సోదరుడు. ఆమెకు కుంతి మంత్రోపదేశం చేయగా అశ్వనీదేవతల వరబలంతో నకుల సహదేవులను పొందింది. పాండురాజు ప్రేమను పూర్తిగా పొందిన మాద్రి ఒకవిధంగా

అదృష్టవంతురాలు. అయితే ఆమె కారణంగా మోహావేశపరుడైన పాండురాజు ప్రాణాలు కోల్పోయాడని భావించి అతడితో సహగమనం చేసింది. కుంతికి తన కుమారుల బాధ్యత కూడ అప్పగించింది. పంచపాండవులను పెంచి పెద్దజేసే బృహత్తర బాధ్యతను భరించే ఆత్మస్థైర్యం కుంతికే ఉందని నిజాయితీతో ఒప్పుకొని ఆమెను వారించి తాను సహగమనం చేసింది. ఇది ఆనాటి ఆచారం. అయితే తప్పనిసరిగా చేయవలసిన ఆచారంగ కనిపించదు. బలవంతం మీద చేసేదిగ అసలు అనిపించదు. అయితే అమానుషమైన ఈ ఆచారం ఆనాటి నుంచి ఉండేది అనడానికి మాత్రం ఆధారం మాద్రి ఉదంతం. కురుక్షేత్రంలో కుంతి కొడుకైన కర్ణుడికి సారథ్యం వహించింది మాద్రి సోదరుడైన శల్యుడు. ఇంకా విచిత్రమేమిటంటే వీరిరువురు కుంతి, మాద్రి సంబంధీకులు. యుద్ధం చేసింది మాత్రం దుర్యోధనుడి పక్షాన. వావి వరుసలను కూడ కాలరాచేది యుద్ధం. ఆ యుద్ధంలో ఆ ఇరువురు మరణించడం అనివార్యం.

## 5.1.6 ద్రౌపది :

ఒక్క భారతంలోనే కాదు ప్రపంచ సాహిత్యంలో చెప్పుకోదగిన పాత్ర ద్రౌపదిది. ద్రౌపది పుట్టుక ఒక విశేషం. ఒక మహావీరుడిని అల్లుడిగా పొందాలనే మరొక మహారాజు కోరిక ద్రౌపది జన్మకు కారణమైంది. ఆమె అగ్నిలో పుట్టింది. భూమిలోపుట్టిన సీతకు సహనం ఎక్కువ ఉన్నట్లు అగ్ని సంభూత అయిన ద్రౌపదికి తీక్షణత్వం ఎక్కువ. ద్రుపదుని గురుదక్షిణగ బంధించి తెచ్చిన అర్జునుని పరిక్రమం అతడిని ముగ్ధుడ్ని చేసింది. అలాంటి వాడిని భర్తగ పొందగలిగే కుమార్తె కావాలని తపస్సు చేసి ఆమెను కూతురిగా పొందాడు ద్రుపదుడు. మత్స్యయంత్రాన్ని కొట్టగలిగినవాడు అర్జునుడొక్కడే అని భావించి స్వయంవరం చాటాడు. మత్స్యయంత్రాన్ని కొట్టింది అర్జునుడే. అయితే ద్రౌపది పంచభర్తృక అయింది. వ్యాసుని తీర్పు, కుంతి సమ్మతి, పాండవుల కోరిక అవసరమయ్యాయి కాని ద్రౌపది అంగీకారాన్ని ఎవరూ కోరలేదు. స్త్రీ అస్వతంత్రతకు ఇది పరాకాష్ఠ. ఆమె ప్రతిఘటించలేదు. ద్రుపదుడు అభ్యంతరం చెప్పలేదు. ఎందుచేత ? ఆనాటి రాచరికపు వ్యవస్థలో స్త్రీ ఒకపావు మాత్రమే. ఆమె ఇష్టానిష్టాలతో ప్రమేయం లేకుండానే అయిదుగురికి భార్య అయింది. ఆ రోజులలో ఆ ఆచారం ఉంటే ఉండవచ్చు. దాని వలన అవమానాలకు గురిఅయింది మాత్రం ద్రౌపది మాత్రమే. ప్రతి ఒక్కరూ ఆమెను ఆశించారు. భంగపడిన వారందరూ ఆమెను పరాభవించారు. పంచభర్తృక అని నిందించారు. ఆరవభర్తగ కర్ణుడిని కోరిందని ఆడిపోసుకున్నారు. నిజానికి ఆమె కర్ణుడిని స్వయంవర సందర్భంలోనే తిరస్కరించింది. రాయబారం నెరిపిన శ్రీకృష్ణుడు కర్ణుడికి ఆశచూపాడు. ద్రౌపదిని పొందవచ్చని తిరస్కరించాడు కర్ణుడు. రాజకీయపుటెత్తుగడలో ద్రౌపది పాత్ర నలిగిపోయింది. అయినా చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో నిలిచింది ఆమె.

వరమున బుట్టి, భరతవంశం జొచ్చి, పాండుభూవరుని కోడలై, జనవంద్యులను భర్తలుగ బొంది నీతి విక్రమస్థిరులైన పుత్రులను బడసిన ద్రౌపది పొందని అవమానం లేదు. నీవు సుభద్ర కంటె నన్ను ఎక్కువ గౌరవించి సంభావన చేస్తావు అట్టి నన్ను ఈ ఏవురు చూస్తుండగానే జుట్టుపట్టుకొని సభలోకి ఏకవస్త్రనై యుండగ ఈడ్చి తెచ్చాడు కులాంగనను ఇలాగే చేస్తారా అని కృష్ణుడిని ప్రశ్నిస్తుంది ద్రౌపది. సమాధానం రాని, లేని ప్రశ్న.

ద్రౌపది అసమాన సౌందర్యవతి. అదే ఆమెకు శాపమైంది. ఆమె కారణంగా పాండవులలో అనైక్యత చోటుచేసుకొంటుందని భయపడిన కుంతి వ్యాసుని అనుజ్ఞతో ఆమెను ఐదుగురికి ఇచ్చి వివాహం చేసింది. తనదికాని ఆ నిర్ణయానికి తాను జవాబుదారీ అయింది. వలువలూడ్చడానికి పూనుకొన్నారు వావివరసలు పాటించని బావ, మఱుదులు బంధకి అన్నారు. తొడమీద కూర్చుండరమ్మని పిల్చాడు. అన్నవరసైన సైంధవుడు ఆశపడ్డాడు. అపహరించబోయాడు. అజ్ఞాతవాసంలో కీచకుడు దౌష్ట్యం చూపాడు. సాటి స్త్రీ సుధేష్ణ తూష్ణీభావం వహించింది. శ్రీకృష్ణుడంతటివాడు కర్ణుడినిప్రలోభపెట్టడానికి ద్రౌపదిని ఎఱగా చూపాడు. ఇవన్నీ ఒకఎత్తు మహాప్రస్థానం చేసేటప్పుడు ద్రౌపది ఎందుకు పడిపోయింది అంటే ఆమెకు అర్జునుడి పట్ల ప్రేమ

అధికం కనుక అంటాడు. ఈ విషయం ధర్మరాజు మనసులో ఎప్పుడూ ఉందన్నమాట. తమను విడదీసే వ్యక్తిగా కాక కలిపి ఉంచే శక్తిగా ద్రౌపదిని గుర్తించాడేకాని ఆమె ప్రేమపట్ల పూర్తి విశ్వాసం లేదన్నమాట. ఏమి విషాదం ! విరాట పర్వంలో భీముడు ధర్మజుని తమ ఇక్కట్లకు కారణంగ దూషిస్తే, ఎవ్వాని వాకిట ఇభమద పంకంబు రాజభూషణరజోరాజినడగు'' అని ప్రారంభించి "కేవలమర్త్యుడె ధర్మసుతుడు' అని ధర్మరాజును అద్భుతంగా కీర్తిస్తుంది ద్రౌపది. ఒకవేళ ద్రౌపది మనసులో ఒక కొంత అర్జునుడి పట్ల ప్రేమ అధికం అయితే కావచ్చుకాక. పుట్టినదాదిగ అర్జునుడిని భర్తగ గావించి ఉంటుంది. తనను తాను తండ్రి ద్రుపదుడు అతని కోసమే పొందినట్లు చెప్పిఉండడం అందుకు కారణం. మత్స్యయంత్రాన్ని కొట్టినవీరుడు అర్జునుడే. ఆమె అర్జునుడు స్వయంవరంలో గెల్చుకున్న బహుమతి. పంచుకోవలసి రావడం పాండవుల రాజకీయ అవసరం. ఆమె దురదృష్టం. ఆ మాటకువస్తే కీచక వధానంతరం ఆమె భీముడిని ఉత్తమనాయకుడవని కీర్తిస్తుంది. కారణం ఆ సమయంలో ఆదుకున్నవాడు అతడొక్కడే. ధర్మజుడామెను జూదంలో ఓడాడు. భీమార్జునులు ఆమె మనసు గెల్చుకున్నారు. సౌగంధి కాపహరణం దీనికి మరొక ఉదాహరణ.

ద్రౌపది ఒక విలక్షణమైన వ్యక్తిత్వం కలస్త్రీ. అయోనిజ, అభిమానవతి, ధీరగంభీర స్వభావి. కోపాయత చిత్త, పరేంగితబుద్ధి కలది, సమయోచిత కార్యవర్తిని, స్వాతిశయశీల, వాగ్వచో నైపుణ్యా. ఇన్ని ప్రశస్త గుణాలు రాశీభూతమై రూపుకట్టిన వ్యక్తి మరొకరు లేరు. పంచపాండవుల భార్యయై లోకంలో ఎప్పుడు ఎవరికీ ఎదురుకాని పరాభవపరంపరను ఎదుర్కొని పౌరుషం చావకుండ కృష్ణుడినే ప్రశ్నించేస్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తిత్వం కలిగిన మానిని. అయినా ఆమెను అడుగడుగునా అవమానించారు. శ్రీ కృష్ణుని భార్య అయిన సత్యభామ సైతం ఇంతమంది భర్తలను నీకనుసన్నలలో మెలిగేటట్లు చేసుకోవడానికి ఏవశీకరణ విద్యను ఆశ్రయించావని అడుగుతుంది. ఆమె అసమాన వ్యక్తిత్వమే అందుకు కారణమని గుర్తించలేదు సత్యభామ కూడ.

అత్త అయిన కుంతి, ఆపైన శ్రీకృష్ణుడు మాత్రమే ఆమె వ్యక్తిత్వపు ఔన్నత్యాన్ని గుర్తించిన వారనిపిస్తుంది. కురుక్షేత్ర యుద్ధం కావాలని పట్టుబట్టింది ద్రౌపది. సంధికి అంగీకరించలేదు. పాండవులు పూనుకోకపోతే తన పుత్రుల, సోదరుల సహాయంతో తానే యుద్ధం చేస్తానన్నది. సరే యుద్ధం జరిగింది. ఇక్కడ కూడా నష్టపోయింది ద్రౌపదే. అశ్వత్థామ చేతిలో ఉపపాండవులు మరణించారు. పాండవులందరికీ వేరు వేరుగా వివాహాలు అయ్యాయి. భార్యాపుత్రులున్నారు. అంతమంది యుద్ధంలో మరణించారు. ఒంటరిగ మిగిలిపోయింది ద్రౌపది. పుత్రవిహీనయైన తల్లిగ ఆమె జీవితంలో చిలికిన విషాదం ఎవరి కారణంగ అనేది అత్యంత కీలకమైన ప్రశ్న మహాభారతంలో. పంచభర్తృక కావడం వలననా, భర్త జూదరి కావడం వలననా. మొదటిదానికంటె రెండవదే ఆమెను బాధించిఉంటుంది. అందుకే నన్నోడి తన్నోడినా, తన్నోడి నన్నోడినా అని ప్రాతిగామిని ప్రశ్నిస్తుంది. 'జూదరి ఆలికి గరువతనం బెక్కడిది?' అని ప్రశ్నిస్తుంది నిండు సభలో. అంతమంది నీతికోవిదులున్న ఆకాలంలో ఏ ఒక్కరు నోరెత్తలేదు.

## సుభద్ర,ఉలూపి, చిత్రాంగద :

వీరు ముచ్చురు అర్జునుడి భార్యలే. సుభద్ర అర్జునుడిని వలచి వలపించుకొన్న వరసైన వధువు. శ్రీకృష్ణుడి చెల్లెలు. అతని అభిమతంతోనే వివాహమాడింది. ఆమెను వెంటబెట్టుకొని వచ్చిన అర్జునుడికి మంగళహారతి ఇచ్చి స్వాగతం పలికిన విశాల గంభీర హృదయద్రౌపది. సుభద్ర కొడుకైన అభిమన్యుడు పాండవ సంతానంలో ప్రత్యేకతను సంతరించుకోవడానికి రెండు కారణాలు ప్రధానం కావచ్చు. శ్రీకృష్ణుని మేనల్లుడు, అసమాన అస్త్రవిద్యాకోవిదుడు. అంతేకాకుండా ఉత్తరను వివాహమాడిన విరాటుని అండదండలు (ముందు తరంలో తండ్రిలాగా) సంపాదించిపెట్టాడు. సుభద్ర తనయుడే భావివారసుడని అనుకొని ఉంటారు. కాని విధి విలాసం చేత ఉత్తర గర్భస్థ శిశువైన పరీక్షిత్తు ఒక్కడే మిగిలాడు శ్రీకృష్ణుని అనుగ్రహం వలన.

నరనారాయణ సంబంధం అలా రూపుదిద్దుకొంది. ఇక ఉలూపి, చిత్రాంగదలు విషయానికి వస్తే ఆకాలంలో స్త్రీలు తమకు నచ్చిన వాడిని వివాహం ఆడేపద్ధతి ఒకటి ఉండేదని తెలుస్తుంది. వీరిద్దరూ అర్జునుడిని పెండ్లిచేసుకున్నారు. కాని అర్జునుని వెంట వెళ్ళలేదు. తమ తమ రాజ్యాలలోనే ఉండిపోయారు. అర్జునుని వలన సంతానవతులు కావడం పరమావధిగ కనిపిస్తుంది వీరికి. ఇలా వలచిన వ్యక్తి వలన సంతానాన్ని పొందడం కోసం వివాహమాడే వారా అని సందేహం కలుగుతుంది. వారి జీవనం వారి ఉనికి అన్నీ సర్వస్వతంత్రమే.

**హిడింబి :**

పాండవులు అరణ్యంలో ఉన్నప్పుడు హిడింబుడనే రాక్షసుడిని భీముడు చంపుతాడు అతడి సోదరి భీముడిని వలచి వివాహమాడుతుంది. భీముడు మొదట విముఖత చూపించినప్పుడు 'నీ వలన సంతానాన్ని పొందాలనుకుంటున్నాను. అంతదాకా మాత్రమే నాతో కలసి వుండు. ఆ పైన నా బాధ్యత నీకు లేదు' అంటుంది హిడింబి. అన్న అనుమతితో వివాహమాడతాడు. వారికి పుట్టిన ఘటోత్కచుడే కౌరవసేనను బీభత్సం చేస్తాడు. వానిని చంపకపోతే తాము నిలవలేమని దుర్యోధనుడు తొందరపడితే కర్ణుడు ఇంద్రుడు ఇచ్చిన 'శక్తి'ని వానిమీద ప్రయోగిస్తాడు. అర్జునుడికి ప్రాణాపాయం తప్పుతుంది.

కురుక్షేత్ర యుద్ధంలో అసమాన వీరులుగ కనిపించిన ఘటోత్కచ, అభిమన్యులు హిడింబా, సుభద్రా తనయులు కావడం గమనించదగ్గ విషయం.

### 5.1.7 ఉత్తర :

భావికురు సామ్రాజ్యాధినేత అయిన పరీక్షిత్తును కన్నతల్లి ఉత్తర. అభిమన్యుడి భార్య; విరాటరాజు కుమార్తె, అర్జునుడు బృహన్నలగా ఉన్నప్పుడు నాట్యం నేర్చుకొన్న శిష్యురాలు. అర్జునుడి కోడలైనా, అభిమన్యుడి భార్యఅయినా ఆమెకు వైధవ్యం తప్పలేదు. కురుక్షేత్ర యుద్ధంలో అత్యంత బాధాకరమైనది పద్మవ్యూహం. అందులో అభిమన్యుడు ప్రవేశించడం, కౌరవులందరు చుట్టుముట్టి చంపడం అది దారుణమైన సన్నివేశం. ఉత్తర ముగ్ధ. ఎంతటి అమాయకురాలు అంటే ఉత్తర గోగ్రహణం జరిగినపుడు ఉత్తరుడు బృహన్నలలు యుద్ధానికి వెళ్ళేటప్పుడు ఏమి కావాలని అడిగితే కురువీరుల తలపాగాలను బొమ్మపొత్తిళ్ళ కోసం తెమ్మని అడిగిన బాల ఉత్తర. ఆ తర్వాత వెంటనే వివాహం, అభిమన్యుడి భార్యగా కురువంశంలో అడుగుపెట్టడం, యుద్ధం, అభిమన్యుడి మరణం ఒకటి వెంట ఒకటి వేగంగా జరిగిపోయాయి.

శ్రీ కృష్ణార్జునుల శక్తి ఆమె గర్భస్థ శిశువును రక్షించగలిగిందేకాని ఆమె సౌభాగ్యాన్ని కాపాడలేకపోయింది. అది ఆమె జీవితంలోని విషాదం. కష్టాల కొలిమిలో కాలిన ద్రౌపది ధీరమనస్తత్వం ఉత్తరకు ఉండడానికి అవకాశమేలేదు. సుభద్రలాగా భర్త అండ ఆమెకు మిగలలేదు. ఉత్తర కురుక్షేత్ర యుద్ధానంతరం మిగిలిపోయిన విషాదానికి, స్త్రీల వైధవ్యానికి ప్రతీక. ఒక శేష ప్రశ్న !

### 5.1.8 సుదేష్ణ :

విరాటుని భార్య, కీచకుని సోదరి, ఉత్తర తల్లి. బలవంతుడైన సోదరుడుండడం స్త్రీకి ఎంతో ధైర్యాన్నిస్తుంది. కాని ఆ ఉద్దండుడైనవాడు దుర్మార్గుడైతే ఆమెకు కలిగేది నష్టమే. కీచకుడు సింహబలుడు కావడంచేత, విరాటుడు అతనిని వారించే శక్తి లేనివాడు కావడంచేత సుధేష్ణ మరబొమ్మలాగా మారిపోయింది. ఎంత వ్యక్తిత్వంలేని పాత్ర అంటే తానే తమ్ముని పరస్త్రీ వ్యామోహాన్ని పరోక్షంగ ప్రోత్సహించినదైంది. కీచకుడు ద్రౌపదిని తన మందిరానికి పంపమని ధైర్యంగ అక్కనే అడిగాడంటే ఆమె ఎంత చేతకానిదో అవగతం అవుతుంది. అప్పుడైనా తన సమస్యను ఎవరితోను చెప్పుకోకుండ ద్రౌపదిని మాయమాటలతో వాని

మందిరానికి పంపాలని పూనుకొంటుంది. 'వాచవియైన వారుణి' తెమ్మని అడుగుతూ 'చూతుముగా నీ గమన వేగమ్మున్' అని మభ్యపెడుతుంది. ఇంత వంచన ఒకస్త్రీ మరొక స్త్రీ విషయంలో కనబరచడం ఆశ్చర్యం ! అది సుదేష్ణలోని బలహీనత. తమ్ముడి శౌర్యం మీద ఆధారపడిన తమ రాజ్యపరిస్థితి. అదే దౌరత్బల్యం విరాటుడిలో కూడ కనిపిస్తుంది. తమ్ముడిని వారించలేని సుదేష్ణ సైరంధ్రిని బలిపశువును చేయడానికి సిద్ధపడింది. ఆ పొరపాటు చేయడంవలననే కీచకుడిని, ఉపకీచకులను పోగొట్టుకుంది. దుర్బలత్వానికి మారుపేరు సుదేష్ణ.

## 5.2 ఉపాఖ్యానాలతో కనిపించే పాత్రలు :

మహాభారతంలో ప్రధాన కథకు ఏమాత్రం తీసిపోని ఉపాఖ్యానాలు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. ఆ ఉపాఖ్యానాలలో స్త్రీ పాత్రలు చాల ప్రత్యేకమైనవి. ఏ పాత్రకు ఆ పాత్రే చెప్పుకోదగింది.

### 5.2.1 కద్రువ, వినతలు :

కశ్యప ప్రజాపతి భార్యలు. సపత్నీ మాత్సర్యం తీవ్రస్థాయిలో కనిపిస్తుంది. కద్రువ నాగమాత. వినత గరుత్మంతుని తల్లి. తల్లుల మధ్య వైరం పుత్రులకు సంక్రమించింది. కద్రువ మాత్సర్యం మూర్తీభవించిన స్త్రీ. వినతను చూచి ఓర్వలేని తనంతో పందెం కడుతుంది. వస్తురూపంలో గాక ఓడిపోయినవారు రెండవవారికి బానిస కావాలని అదికూడ సపుత్రకంగ అని షరతు విధిస్తుంది. అంత మాయమర్మం లేని వినత ఒప్పుకొంటుంది. ఉచ్ఛైశ్రవం ఇంద్రుని గుఱ్ఱం. శ్వేతవర్ణం కలిగినది. దానితోకలో నలుపు ఉందని కద్రువ లేదని వినత వాదించుకుంటారు. కద్రువకు తెలుసు నలుపులేదని, కాని ఎలాగైనా వినతను అతి బలవంతుడైన ఆమె కొడుక గరుత్మంతుడిని తనకు, తన కుమారులకు లొంగి ఉండేటట్లు చేసుకోవాలనే పన్నాగంతో పంతానికి దిగుతుంది. కద్రువ కుమారులైన నాగులు ఒప్పుకోకపోతే జనమేజయుడు చేయబోయే సర్పయాగంలో చనిపోవాలని శపిస్తుంది. అంత తీవ్రమాత్సర్యం ఆ తల్లిది. ఒక్క కర్కోటకుడు తల్లిమాట విని అశ్వవాలాన్ని చుట్టుకుంటాడు. వినత బానిస అవుతుంది. ఎంతోకాలం గడిచాక గరుత్మంతుడు పెరిగి పెద్దవాడై నాగుల కోరిక ప్రకారం అమృతం తెచ్చి యిచ్చి తమతల్లి దాస్యవిమోచనం చేస్తాడు. సపత్నీ మాత్సర్యం ఎంతదాకా తీసుకొని వెళ్తుందో కద్రువ పాత్ర ద్వారా అర్థమౌతుంది. అంత కుత్సితానికి ఒడిగట్టిన సవతిని వినత ఏమీ అన్నట్లు కనబడదు. అది ఆమె పాత్రలోని వైశిష్ట్యం. వినతలో కూడ ఒక అసహనం ఉన్నట్లు తెలుస్తుంది. అందుచేతనే పూర్తిగ ఎదగక ముందే అండ విచ్ఛేదం చేసి అంగవైకల్యం గల అనూరుడిని మొదటి కొడుకుగ పొందింది. ఇది ఆ కాలంలో జరిగే పనికాని ఆ భావాలు మాత్రం ఇప్పటికీ కనిపించేవే. కద్రువ తన పంతం కోసం సవతిని సాధించడం కోసం కొడుకులనే శపించింది. పక్షులు పాములు ఇక్కడ ప్రతీకలు మాత్రమే.

### 5.2.2 శకుంతల :

ఇంక ప్రధానమైన ఉతపాఖ్యానాల విషయానికి వస్తే శకుంతల విశిష్ట వ్యక్తిత్వం కలిగిన స్త్రీగా కనిపిస్తుంది. ఆశ్రమంలో కణ్వుడి చేత పెంచబడిన శకుంతల కోమలమైన స్వభావం కలిగినదే కాని దుష్యంతుడిని వివాహమాడినపుడు ఆమెలో స్వతంత్రవర్తనం కనిపిస్తుంది. అది తప్పుగ భావించదు. ప్రేమించినవాడిని పెళ్ళాడడానికి వెనుకాడదు. అలాగే నిండుపేరోలగంలో తనను గుర్తించనట్లు ప్రవర్తించిన దుష్యంతుడిని మందలించడానికి కూడ వెనుకాడదు. సత్యం యొక్క గొప్పదనాన్ని భారతంలో చాలాసార్లు చెప్పించినా శకుంతల చెప్పినంత సూటిగ, విస్పష్టంగ మరెవరూ చెప్పలేదు. అదే సందర్భంలో పుత్రగాత్ర పరిష్వంగ సుఖాన్ని గూర్చి స్త్రీ యొక్క ఔన్నత్యాన్ని గూర్చి గొప్పగ చెప్పింది. స్త్రీని ఏమాత్రం తక్కువగ చూడరాదని బోధించింది. అశరీరవాణి అప్పుడు నిజం చెప్పిందని భారతంలో ఉంది. అశరీరవాణి పలికిందో ఆత్మప్రబోధం పని చేసిందో కాని దుష్యంతుడు శకుంతలను

భార్యగ స్వీకరించి మంచివాడుగ మిగిలిపోయాడు. కాని అలాకాని పరిస్థితులలో తిరస్కరింపబడిన స్త్రీల విషయం ఏమిటి అనిపిస్తుంది. శకుంతల మాటలలో నిర్భీతి, స్థిరత్వం, స్పష్టత, వాక్పటిమగోచరిస్తాయి. శకుంతలది ఒక అద్భుత వ్యక్తిత్వం.

### 5.2.3 దయమంతి :

దిక్పాలకులను కూడ కాదని నలుడిని ప్రేమించి వివాహమాడిన అసమాన సౌందర్యవతి దమయంతి. పరిస్థితులు ప్రతికూలంగ మారినపుడు నలునివెంట అరణ్యావాసానికి సిద్ధపడుతుంది. కాని పుట్టింటికి వెళ్ళదు. అయినా నలుడు ఆమెను నట్టడివిలో ఒంటరిగ విడిచిపెట్టి వెళ్ళాడు. కారడవిలో కిరాతకునిచే బలాత్కరింపబడబోయినపుడు పాతివ్రత్యశక్తిచే బయటపడి తండ్రి ఇంటికి చేరింది. నలుడిని ఎలాగైనా రప్పించుకోదలచి పునఃస్వయంవరాన్ని చాటింపజేసింది తండ్రిని ఒప్పించి, అనుకొన్నట్లుగానే నలుడు వచ్చాడు. ఆ కాలంలో పాతివ్రత్య మహిమ, తండ్రి తోడ్పాటు ఉన్న దమయంతి తన భర్తను తాను తిరిగి పొందగలిగింది. పునఃస్వయంవరం ఆలోచన చేసిన దమయంతి మేధోసంపత్తి ఆమె సౌందర్యాన్ని మించిపోయింది. నలుడు అర్ధాంతరంగ అడవి మధ్యలో నిద్రపోతున్న భార్యను వదలిపోవడమే శోచనీయం ! స్త్రీ శక్తికి, మేధోసంపత్తికి గొప్ప ప్రతీక దమయంతి.

### 5.2.4 సావిత్రి :

యముడినే మెప్పించి భర్త ప్రాణాలను వెనక్కి తెచ్చుకొన్న పతివ్రతా శిరోమణిగ సావిత్రి సుపరిచితమైన భారతపాత్ర. సత్యవంతుడిని అనుసరించి అడవులకేగింది సావిత్రి. బలహీనమైన మనస్తత్వం ఎంత మాత్రం లేనిస్త్రీ సావిత్రి. ఆమె మనోబలం ముందు దైవం కూడ తలవంచింది అనే సారాంశం సావిత్రి కథ ద్వారా మనకందుతుంది. భర్త ప్రాణాలు కోల్పోతే జీవితాలను అంతం చేసుకొనే ఆడవాళ్ళే అధికం అయిన భారతదేశంలో ఆ కాలంలో ఆ పాత్ర సృష్టి అపూర్వం. యముని పేరు వింటేనే వణికిపోయే మనుషులున్న సమాజంలో సావిత్రి ఒకశక్తి స్వరూపిణి అనిపిస్తుంది. యముని వరాలు కోరేటప్పుడు ఆమె తన అత్తమామల కంటిచూపును, తల్లిదండ్రులకు పుత్రసంతానాన్ని, ప్రసాదించమని ముందుగ అడుగుతుంది. తనవారిపట్ల ఆమెకున్న బాధ్యతాయుతమైన దృష్టికి ఇది తార్కాణం. స్త్రీ మనోబలానికి మేరలేదు, స్త్రీ అబలకానేకాదు సబల అని నిరూపిస్తుంది సావిత్రి. ధైర్యం మూర్తీభవించిన వ్యక్తి సావిత్రి.

### 5.2.5 చంద్రమతి :

సత్యహరిశ్చంద్రుడి కీర్తిసౌధానికి మూలస్తంభం చంద్రమతి. కష్టాలు వచ్చినపుడు క్రుంగిపోయి సుఖాలు వచ్చినపుడు పొంగిపోయే స్త్రీలు అసంఖ్యాకంగ ఉంటారు ఏకకాలంలోనైనా. అలాకాక ఎప్పుడూ ఒకేలాగ ఉండేవారిని ధీరచిత్తులు అంటాం. అలాంటి సహనం కొండంత గలిగిన స్త్రీ చంద్రమతి. సంపదపోయినా సహనం చూపిస్తుంది. కొడుకును కోల్పోయినా పల్లెత్తదు. అమ్ముడుపోయినా అడ్డుకోదు. భర్తను అనుసరించడమే ధ్యేయంగ బ్రతికిన ఆకాలపు స్త్రీలకు అచ్చమయిన ప్రతినిధి చంద్రమతి. అయినా హరిశ్చంద్రుడికి వచ్చిన కీర్తిలో భాగస్వామి కాలేదు. ఇది ఆకాలంలోలోనే కాదు ఏకాలంలోను స్త్రీ ప్రశ్నించడం అపరాధంగ భావింపబడింది. అలా ప్రశ్నించిన స్త్రీలు ఏ ఇద్దరో ముగ్గురో మాత్రమే మనకు కనిపిస్తారు. ఆడినమాట తప్పలేదు కాని హరిశ్చంద్రుడు ఆలిని మాత్రం అమ్ముకొన్నాడు. ఇంత క్షమ, సహనం, ఆమెకెలా సాధ్యమైంది అనిపింపజేసే స్త్రీ చంద్రమతి.

### 5.2.6 శర్మిష్ఠ, దేవయాని :

అహంకారం హద్దులు మీరితే ఏమౌతుందో దేవయాని జీవితం చెప్తుంది. దురదృష్టం వెన్నాడినా ఓరిమి వహించగలిగితే జీవితం సంతోషమయమౌతుందని శర్మిష్ఠ కథ చెప్తుంది. శర్మిష్ఠ వృషపర్వుడనే రాక్షస రాజుకుమార్తె. దేవయాని రాక్షసులకు గురువైన శుక్రాచార్యుని కుమార్తె.

శుక్రాచార్యుడు మృతసంజీవని ద్వారా మృతులైన రాక్షసులను బ్రతికిస్తుంటాడు. అతని దగ్గర నుంచి ఆ విద్య నేర్చుకోవడానికి బృహస్పతి కుమారుడైన కచుడు వస్తాడు. శుక్రాచార్యునికి శుశ్రూషలు చేస్తుంటాడు. దేవయాని కచుడిని ప్రేమిస్తుంది. దేవకార్యం మీద వచ్చిన కచుడు మాత్రం తాను వచ్చినపని పూర్తికాగానే వెళ్ళిపోదామనుకుని సమయం కోసం ఎదురుచూస్తుంటాడు. దేవయానిది ఏ ద్రైవానురాగం. అంటే ఒకరివైపునుండి మాత్రమే అనురాగభావం ఉండడం. పరస్పరం కాదన్నమాట. ఎన్నోవిధాలుగా కచుడిని అంతమొందించడానికి ప్రయత్నించారు రాక్షసులు. ప్రతిసారి తండ్రిని కోరి అతడిని బ్రతికించింది దేవయాని. ఆమెది అంత గాఢమైన అనురాగం. అయితే శుక్రాచార్యుడు ఆమె మాటను ఎందుకువినేవాడు అంటే అందుకు సంతానం విషయంలో తల్లిదండ్రులకు సహజంగ వ్యామోహం కారణం. సరే, దేవయాని అంటే శుక్రాచార్యునికి ఎంత ప్రేమో కచుని బ్రతికించడంలోనే తెలుస్తుంది. ఈ ప్రేమ వలన దేవయాని పంతానికి, పౌరుషానికి ప్రతీకగ ఎదుగుతుంది. అందుచేతనే శర్మిష్ఠతోకయ్యానికి కాలు దువ్వుతుంది. శర్మిష్ఠరాజు కూతురిననే భావంతో పంతానికి పోతుంది. మొత్తానికి రాజు కూతురు, రాజు గురువు కూతురు గాలికి చీరలు మారిపోయాయనే చిన్న కారణంగ ఒకరినొకరు దూషించుకొని బద్ధశత్రువులౌతారు. శర్మిష్ఠ నా తండ్రిని ఆశ్రయించి బ్రతికేవాడు నీ తండ్రి అనడంలో ఆమె అంతరంగం బయటపడుతుంది. అహంకారం ఎవరికైనా ఆపదలనుకొని తెస్తుంది.

శర్మిష్ఠ దేవయానిని నూతిలోకి తీసి వెళ్తుంది. ఇది మరో మలుపుకు దారితీస్తుంది. ఆ త్రోవన వెళ్తున్న యయాతి దేవయానిని బయటికి లాగడానికి చేయూతనిస్తాడు. దీనినే ఆమె ప్రాణగ్రహణంగ భావిస్తుంది. ప్రతి విషయంలో ఆమె అనుకున్నట్లుగానే జరగాలని పట్టుబడ్తుంది దేవయాని. అందుకు పూనుకొంటాడు శుక్రాచార్యుడు. దేవయాని, శర్మిష్ఠ ఆమె వెయ్యిమంది చెలికత్తెలతో తనకు దాసికావాలని పట్టుబడుతుంది. శుక్రాచార్యుడు ఆమె పంతానికి వంతపాడతాడు. విధిలేక వృషపర్వుడు రాక్షస రాజ్యక్షేమం కోసం శర్మిష్ఠను దేవయానికి దాసిని చేస్తాడు. పౌరుషానికి మారుపేరు అనిపించిన శర్మిష్ఠ పల్లెత్తుమాట అనదు. ఇది ఆమె సౌజన్యం అనుకోవాలో, త్యాగం అనుకోవాలో, చేతగానితనం అనుకోవాలో అర్థంకాదు. ఆలోచించి చూస్తే కథ మళ్ళీ మొదటికి వస్తుంది. అదే, ఆ కాలంలో స్త్రీ రాజకీయపుటెత్తు గడలలో అవసరానికి పనికివచ్చే ఒకపావు మాత్రమే.

ఆ తర్వాత యయాతి దేవయానితో కాపురం చేస్తూనే ఆమెను మభ్యపెట్టి శర్మిష్ఠతో కూడ కాలం గడుపుతాడు. ఇద్దరు పుత్రవతులౌతారు. విషయం చాల ఆలస్యంగానైనా దేవయానికి తెలిసిపోతుంది. ఆ కాలంలోని కొందరు స్త్రీలలాగ మౌనం వహించే వ్యక్తికాదు దేవయాని. తండ్రికి ఫిర్యాదు చేస్తుంది. శుక్రాచార్యుడు యయాతిని శపిస్తాడు, వృద్ధుడివికమ్మని. యౌవనం మీద భ్రమలు తొలగని యయాతి కుమారులను వృద్ధాప్యం తీసుకొమ్మని అర్థిస్తాడు. దేవయాని కొడుకులందుకు ఒప్పుకోరు సహజంగానే. శర్మిష్ఠ కొతడుకైన పురుడు ఒప్పుకొని తండ్రికి యౌవన్నానిచ్చి వృద్ధాప్యాన్ని స్వీకరించి తండ్రి అనుగ్రహానికి పాత్రడౌతాడు. దేవయాని జీవితంలో ఓడిపోతుంది. శర్మిష్ఠ ఓరిమితో గెలుస్తుంది. బ్రతకడం చేతకాని దేవయాని శప్తురాలు. శర్మిష్ఠ ఓడిగెలిచిన స్త్రీమూర్తి. మహాభారతంలో ఉపదేశ ప్రాధాన్యం ఇంతింత అని చెప్పలేనంత ఉంది. ప్రధాన కథకు సంబంధించినవి కొన్ని ఉపాఖ్యానాలకు సంబంధించినవి మరికొన్ని, కేవలం ధర్మప్రబోధం కావించడానికి చెప్పినవి కొన్ని ఉపదేశ కథలు మనకు కనిపిస్తాయి. అన్ని కథలలోని స్త్రీపాత్రలను గూర్చి కూలంకషంగ చర్చించడానికి ప్రస్తుతం అవకాశం లేదు. అయినప్పటికీ చాలా ప్రధానమైన పాత్రలున్న కొన్ని కథలను ప్రస్తావించక తప్పదు.

### 5.2.7. మాధవి :

గాలవ్యోపాఖ్యానంలో ఈ రాకుమార్తె ఒకేరకమైన అశ్వాలు 800 కావల్సి వచ్చిన గాలవుడికి కానుకగ ఇవ్వబడుతుంది తండ్రిచేత. ఈ సందర్భంలో తండ్రిని కూడ తప్పుబట్టక తప్పదు. ఆ ఋషి ఆయా రాజులకు ఆమెను ఒక్కొక్క ఏడు

అర్పించి తనకు కావలసిన 800 గుఱ్ఱాలను సేకరించి గురువుకు దక్షిణగ సమర్పిస్తాడు. మాధవి మనోభావాలు ప్రత్యేకంగ చెప్పబడకపోయినప్పటికీ దౌర్భాగ్యకరమైన ఆ పద్ధతి దారుణంగ కనిపిస్తుంది. స్త్రీ శీలానికి తండ్రి, ఋషి, ఆమెతో కలిసిఉన్న ఆయా రాజులు కట్టిన విలువ కొన్ని గుఱ్ఱాలతో సమానం అన్నమాట. ఆమె ఆంతర్యం అర్థం చేసుకోవడానికి కూడ ఎవరు ప్రయత్నించలేదు. కనీసం రచయిత కూడ ఈ అమానుష కార్యాన్ని ఖండించలేదు. స్త్రీ పెంచుకున్న పాడిపశువు కంటే నీచాతి నీచంగ చూడబడడం హేయం. స్త్రీ పురుషుడి పురుషార్థ సాధనలో సహాయపడే వ్యక్తిగాకాక ప్రాణంలేని ఒక పరికరంలాగ చూడబడినదీ వృత్తాంతంలో. భారతంలో ప్రస్తావించబడిన స్త్రీ పాత్రలలో దయనీయమైనది మాధవి పాత్ర. ధిక్కరించడం చేతకాని అబల.

## 5.2.8 సుకన్య :

బాల్యచేష్టలలో భాగంగా చ్యవనుడిని బాధించి అతని ఆగ్రహానికి గురి అవుతుంది. తండ్రి ముని కోపానికి భయపడి ఆమెను అతనికిచ్చి వివాహం చేస్తాడు. వస్తు మార్పిడికి మాధవి ఉపయోగపడితే లంచంగ ప్రలోభపెట్టడానికి పనికి వచ్చింది సుకన్య. ఆమె శీలానికి మెచ్చిచ్యవనుడు యౌవనాన్ని తిరిగిపొంది సుఖించాలనడం ఆ కాలంలో నమ్మశక్యమైందేమో కాని ఇప్పుడు మాత్రం కాదు. జీవితం ఆటపాటల కోలాహలం నుండి జారిపోయి కొలిమిలోపడి కాలిపోయింది. పతివ్రత అయితేనే స్త్రీ అన్ని భోగభాగ్యాలను, గౌరవాన్ని పొందగలుగుతుంది అని ప్రత్యక్షంగా, అన్యాపదేశంగ అనేక సందర్భాలలో చెప్పబడింది. మహాభారతంలో స్త్రీ చపలప్రవృత్తి కలిగింది అని 'పంచచూడ' అనే అప్సరస చెప్తుంది నారదునితో. దీన్నిబట్టి స్త్రీని నియంత్రించడానికి ఎంత గట్టిగ ప్రయత్నించారో అర్థమౌతుంది. స్త్రీకి స్వేచ్ఛ ఉండకూడదని, ఉంటే స్వైరిణి అని నిందించారు. పురుషుని విషయంలో ఏకట్టుబాటు లేకపోవడం ఇక్కడ గమనించదగ్గ విషయం.

శాండిలీ సుమనల సంవాదంలో సుమన శాండిలిని అడుగుతుంది ఆమె దివ్యపదవి ఎలా వచ్చిందని. భర్తకు ఇష్టమైన వంటకాలు చేసిపెట్టి, అత్తమామలకు మారుపలుకకుండ అతిథి అభ్యాగతులకు, విప్రులకు సంతర్పణ చేస్తూ, గృహపారిశుధ్యం, పిల్లల పెంపకం బాధ్యతగ స్వీకరించడం వలననే తనకీ దివ్యత్వం వచ్చిందని చెప్తుంది. పార్వతి, పౌష్యమహాదేవి ఈ పాత్రల ద్వారా కూడ పతివ్రతాలక్షణాలు, స్వభావం వివరించబడ్డాయి. జ్ఞానదీప్తులుగ కనిపించే పాత్రలు కొన్ని భారతంలో కనిపిస్తాయి. జనకపత్ని, సులభ, వృద్ధకన్య మొదలైనవారు సామాన్య స్త్రీలకు మించిన ఆలోచనారీతి గలవారు.

నిస్సహాయమైన స్థితిలో భర్తచేతనే అతిథికి అర్పించబడిన స్త్రీ ఓఘవతి. ఇంద్రునిచే కాంక్షింపబడి భర్త యోగబలంతో రక్షింపబడిన స్త్రీ రుచి. స్త్రీ స్వేచ్ఛాప్రవృత్తికి ప్రతీకగ చెప్పదగిన స్త్రీ 'ప్రద్వేషిణి'. జాత్యంధుడైన దీర్ఘతముని భార్య ఈమె. పుత్రవతి అయిన తర్వాత కూడ దీర్ఘతముడిని ప్రేమించినొల్లదు సరికదా ఇంటి నుండి వెళ్ళగొడుతుంది.

గంగాదేవి శంతనుని వివాహం చేసుకున్నా తనమార్గానికి అడ్డువస్తే వెళ్ళిపోతానని ముందే చెప్పి భీష్ముడిని గంగపాలు చేయబోతే అడ్డుకున్న శంతనుడిని వదిలి వెళ్ళిపోయింది.

లోపాముద్ర విదర్భరాజు కూతురు. అగస్త్యుని తపశ్శక్తి చేత జన్మించింది. అగస్త్యుడు ఆమెను వివాహమాడ కోరితే తండ్రి సంకోచిస్తూ ఉంటే తానే తండ్రిని ఒప్పించి ఈ మునిని వివాహమాడింది. అయితే అతనిని తనకు ఇష్టమైన రీతిలో వర్తింపజేసుకొన్నది. జరత్కారు అనే నాగకన్య కద్రువ కుమార్తె. ఈమె జరత్కారుడు అనే పేరుగల మునికి భిక్షా రూపంలో భార్యగా ఇవ్వబడింది. ఆ ముని నాకునీ వలన ఎప్పుడైనా అవమానం జరిగితే అప్పుడే వెళ్ళి పోతానని కట్టడి విధించాడు. ప్రథమ సమాగమం నాడే ఆమె భయభ్రాంతయై భీతితో జీవించింది. అతడు నిద్రిస్తున్న సమయంలో సంధ్యా సమయంలో చేయవలసిన విధులకు కాలం దాటి పోతుందని భయపడి నిద్రాభంగం చేసింది. ఆ మిషతో ఆమెను వదలివెళ్ళిపోయాడు ఆ ముని. ఈమె వాసుకి సోదరి. మూర్తీభవించిన త్యాగం.

ఇంద్రుడిని భర్తగ కోరి తపస్సుచేసి తన కాళ్ళనే కట్టెలుగ చేసి అతని పరీక్షలో కృతార్థులైన స్త్రీ ప్రభావతి. ఈమె భరద్వాజ పుత్రిక. పట్టుదలకు మారుపేరు.

అగ్ని భార్య స్వాహాదేవి భర్త కోరికను తీర్చడం కోసం మునిపత్నుల రూపంలో భర్తను సంతృప్తిపరుస్తుంది. పురుషుని కోర్కెలు తీర్చడమే స్త్రీ పరమధర్మం ఆనాడు.

తపతి ఆదిత్యుని కూతురు. సావిత్రికి చెల్లెలు. ఈమెను చూచి వరిస్తాడు సంవరణుడు. అసమాన సౌందర్యవతి అయిన తపతి కూడ అతడిని ఇష్టపడుతుంది. కాని పెద్దల అనుమతిని కావాలనుకొంది. ఇంతులకు స్వాతంత్ర్యం లేదని నీకుతెలియదా అని ప్రశ్నించింది. వశిష్టుడు మధ్యవర్తిత్వంతో వివాహం జరిగింది. కన్యాలక్షణాలను కంఠోక్తిగ చెప్పిన స్త్రీ తపతి. 'బాల్యంలో తండ్రి, యౌవనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకు స్త్రీకి రక్షకులని 'ఉత్తరదిశ' చేత చెప్పబడింది భారతంలో. స్త్రీల చేతనే పతివ్రతా ధర్మాలను చెప్పించడం, స్త్రీల స్వేచ్ఛా ప్రవృత్తిని నిందింపజేయడం భారతంలో అనేక విధాలుగా జరిగింది. స్త్రీలకు ఇన్నికట్టుబాట్లు ఇన్నిసార్లు చెప్పిన భారతంలో పురుషులకు ఎటువంటి కట్టడిని నిర్ణయించలేదు. రాజధర్మాలను ప్రజలపట్ల బాధ్యతను మాత్రమే స్పష్టం చేసింది. అది ఆనాటి సమాజలక్షణం. అయితే స్త్రీ పాత్రలలో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఏ పాత్ర మరొక పాత్రను పోలి ఉండకపోవడం విశేషం. ఈ విషయాన్ని గుర్తించకుండ పురాణేతి హాసాలలోని పాత్రలన్నింటినీ ఒకే మూసలో పోసిన పాత్రలనుకోవడం అధ్యయన రహితమైన తీర్పు.

## 5.3 ముగింపు :

భారతంలోని స్త్రీ పాత్రలను వాటి స్వభావాదులను, ఆ పాత్రల నేపధ్యాన్ని ఇంకా కూలంకషంగ విచారించి చూస్తే అనేక విషయాలు బోధపడతాయి. మొట్టమొదటిసారిగ స్త్రీల పట్ల జరిగిన అన్యాయాలను అమానుష చర్యలను ఏ దాపరికం లేకుండా చూపిన ఏకైక గ్రంథం మహాభారతం. మానవ నాగరికతలో ఎన్నెన్ని రకాల స్వభావాలు ఉండడానికి వీలుందో అన్ని పాత్రలు మహాభారతంలో చిత్రించబడ్డాయి. స్త్రీలు తమపట్ల జరుగుతున్న దౌర్జన్యాన్ని గుర్తించి ప్రశ్నించడం ధిక్కరించడం అవసరమైతే పోరాడడం చేశారనేది ఈ అధ్యయనంలో తేలిన సారాంశం ! స్త్రీ చైతన్యమూలకమైనది మహాభారతం !

## 5.4 మాదిరి ప్రశ్నలు :

1. మహాభారతంలోని ప్రధాన స్త్రీ పాత్రలను పరిశీలించండి.
2. భారతంలో అద్వితీయపాత్ర 'ద్రౌపది' స్పష్టం చేయండి ?
3. భారతంలో శకుంతల పాత్ర విశిష్ఠతను వివరించండి.
4. గాంధారీ - కుంతీల పాత్రల తీరుతెన్నులను పరిశీలించండి.
5 మహాభారతంలోని ఉపాఖ్యానాలలోని స్త్రీ పాత్రల వైశిష్ట్యం తెలపండి.

## 5.5 ఉపయుక్త గ్రంథాలు :


1. వ్యాస భారతం
2. కవిత్రయ భారతం


**- ఆచార్య పి. సుమతీ నరేంద్ర**

పాఠం - 6

# రామాయణము - స్త్రీ సమస్యలు

**పాఠ్యభాగ నిర్మాణ క్రమం :**


6.0 ఉద్దేశ్యం

6.1. ఉపోద్ఘాతము

6.2. వివాహ నిశ్చయాధికారం

6.3. కన్యావరణము

6.4. వృద్ధ వివాహాలు

6.5. బహుభార్యాత్వం

6.6. స్త్రీ ధనము

6.7. బాల్య వివాహాలు - యుక్త వయస్సు

6.8. సహగమనం

6.9. పాతివ్రత్యం

6.10. ముగింపు

6.11 మాదిరి ప్రశ్నలు

6.12 ఉపయుక్త గ్రంథాలు


## 6.0 ఉద్దేశం :

రామాయణ కాలంనాటి స్త్రీ సమస్యలైన బాల్యవివాహములు, కన్యాశుల్కము, వరశుల్కము, స్త్రీ విద్య, వైధవ్యము, సహగమనము మొదలైన వాటిని విశ్లేషించి చూపడం.

## 6.1. ఉపోద్ఘాతము :

రామాయణము ఆదికావ్యము. వాల్మీకి కృతము. వాల్మీకి రామాయణమును 'సీతాయాః చరితమ్ మహత్' అని కూడా పేర్కొన్నాడు. ఇది సీత యొక్క మహత్తర చరితము. మహాకావ్యము - పాశ్చాత్యుల 'epic' లేదా Classic అను వానికి సమమైనది. క్లాసిక్ అనే పదానికి W.H. Hudson అనే విమర్శకుడు ఇచ్చిన నిర్వచనము -

"A Classic may be simply defined as a book which has stood the test of time, and by its stability and permanence and the universality and persistency of its apple, has given unmistakable assurance of immortal life" :

"కాలము యొక్క పరీక్షకు తట్టుకొన్న గ్రంథము తన స్థిర ప్రకృతి, సార్వకాలికత, సార్వజనీనత, నిలకడ గల రక్తిజనకత అను లక్షణముల ద్వారా అమరత్వమును సాధించినట్టిది క్లాసిక్" అన్నాడు.

లాంగ్‌సన్ - అనే విమర్శకుడు కూడా ఈ విషయాన్నే మరింత విపుల మనోహరంగా చెప్పాడు.

"ఎల్లరను సంతృప్తిపరచునట్టి, ఎల్లప్పుడును సంతృప్తిపరచునట్టి వాక్కులే సిసలైన సముదాత్తవాక్కులు. అట్టి వాక్యములతో ఒప్పిన గ్రంథము - పాఠకులందరిలో ఒకేవిధమైన అనుభూతిని కలిగించగలదు. అనగా - వ్యక్తుల వ్యావృత్తులలో, జీవన విధానములో, ఆశయాలలో, వయస్సులలో, వ్యవహార ఫక్కికలలో పలు విలక్షణతలుండు గాక; అందరికినీ ఒకవిధమైన అనుభూతిని అందించగలిగినట్లయిన - అది నిజముగా మహాగ్రంథము. అదే మహాకావ్యము - అదే క్లాసిక్".

కొంతమంది పాఠకులకు మాత్రమే అనుభూతిని కలిగించి, కొందరి మధ్య మాత్రమే ప్రాచుర్యము పొందే సాహిత్యము యొక్క విలువ తక్కువ స్థాయిలో ఉన్నట్లే. క్లాసిక్సులో నాటి నుండి నేటి దాక ఒకే అనుస్యూతమైన ప్రాణకళ ప్రతిష్ఠితమైయున్నది. దాని జీవశక్తి పుట్టినంతనే చప్పట్లు చరిపించుకోగల సాహిత్య గ్రంథముల లక్షణముల కంటె భిన్నములైన వానిపై ఆధారపడియున్నది. తాత్కాలిక ప్రయోజనాన్ని ఆశించి ప్రభవించిన ఏ కళాఖండమైనను కాస్త వెనుకముందులుగా ఆ కాలముతో పాటు కాలధర్మము చేయవలసినదే. ఒక అనుకూల కాలములో అందలమెక్కి తరువాతి తరము వారికి కనుమరుగైపోవు గ్రంథముల స్థితి ఇది.

పద్ధతులలో అభిరుచులలో తీవ్రపరిణామమే ఏర్పడినా, నాగరికతలే మారినా అన్నిటిని అధిగమించి తమ జీవశక్తిని నిలుపుకోగలిగిన గ్రంథములే క్లాసిక్సు. మానవుల నైతిక బౌద్ధిక జీవిత వైఖరులలో నిత్య పరిణామశీలములైన పరిస్థితులలో ఎప్పటికప్పుడొక పొత్తుకుదుర్చుకోగల శక్తి వానికున్నది. అవి తమ యుగములకొక సందేశమును పరమార్థములను అందించినవి.

మానవ స్వభావములో, అనుభవములో గల ప్రాథమికము, మౌలికము, సార్వజనీనములైన ప్రకృతులను, దేశ కాలాతీతములైన పరిస్థితులను ఆ గ్రంథములు తమ అంతరంగముతో ఆలింగనము చేసికొనియుండుట వాని జీవరహస్యము".

అట్టి పరమ రమ్యగుణోపేతమైన రామాయణములో వాల్మీకి మానవజాతికి అందించిన ఆదర్శపథ నిర్దేశములో స్త్రీల సమస్యలకు సంబంధించిన విషయ విశ్లేషణమే ఈ వ్యాసోద్దేశము.

రామాయణము అనగా వాల్మీకి రామాయణమే. ఆ తరువాతి కాలమున వచ్చిన రామాయణములలో వివిధాంశములు వాల్మీకి రామాయణమునకు భిన్నముగ నడిచినవి. జానపద సాహిత్యములో కథాఘట్టములు, పాత్ర చిత్రణము ఒక ప్రత్యేకత సంతరించుకొన్నవి. వానినెల్ల పరామర్శించుట ఈ వ్యాసపరిధి కాదు. కేవలము వాల్మీకి రామాయణమును ఆధారముగా గ్రహించి - ఆ కావ్యమున బాల్యవివాహములు, కన్యాశుల్కము, వరశుల్కం, స్త్రీ విద్య, స్త్రీ వైధవ్యము, స్త్రీ సహగమనము, బహు భార్యాత్వము, పాతివ్రత్యము, వేశ్యా సమస్య, అస్తిత్వ రాహిత్యము అనే అంశములను విశ్లేషించుట వ్యాస పరమార్థము.

**ఇందు మొదటిది బాల్యవివాహము :**

బాల్యవివాహమనగా - బాల్యము వీడకమునుపే, వివాహము పట్ల ఎట్టి అవగాహన లేని ఆడపిల్లకు పెళ్లిచేయుట. వరుని స్థితిగతులు, వయస్సు, అంద.చందముల విషయములలో వధువుకు ఏ రకమయిన ప్రమేయము ఉండదు. తల్లిదండ్రులే నిర్ణయించి వివాహము చేయుదురు.

రామాయణములో ఇట్టి బాల్యవివాహములు జరిగిన సంఘటనలు కానరావు.

అసలు రామాయణములలోని బాల్యవివాహముల విషయమే కాదు స్త్రీల సమస్యలను అధ్యయనము చేయు సందర్భమున మూడు రాజ్యములలోని స్థితిగతులు అవలోడింపవలసి ఉన్నది.

ఒకటి అయోధ్య. కథానాయకుడైన శ్రీరాముని పట్టణము. రెండవది లంకా నగరము. ప్రతినాయకుడైన రావణుని పట్టణము. మూడు కిష్కింధాపురము. రాముని మిత్రులగు సుగ్రీవుని, రామ కార్యదురంధరులగు హనుమదాదుల పట్టణము. మూడు రాజ్యములందలి స్త్రీల సమస్యల పరిశీలనము ప్రస్తుత వ్యాస విషయము. ఇందు రామాదులు మానవులు, రావణాదులు

రాక్షసులు, సుగ్రీవాదులు వానరులు. మూడు మూడు భిన్న సంస్కృతికి, నాగరికతకు చెందినవి. మూడు విభిన్న సంస్కృతులలో వికసించిన స్త్రీ జీవన విధానము రామాయణమున ప్రస్ఫుటమగును.

కిష్కింధలోని వివాహ వివరములు వాల్మీకి వర్ణింపలేదు. లంకారాజ్యము నందలి వివాహపురీతులు కూడా ప్రత్యేకముగ పేర్కొన్న సందర్భములు లేవు.

సీతాకల్యాణ సందర్భమున సీతవీర్యశుల్క. సీతాదేవికి ఊర్మిళ, మండవి, శ్రుతకీర్తి అని ముప్పురు చెల్లెండ్రు. ఊర్మిళ జనకుని ఔరసపుత్రిక. మాండవి శ్రుతకీర్తులు జనకుని సోదరుడగు కుశధ్వజుని కూతుళ్ళు. ఈ ముప్పురి వివాహముల నిర్ణయము - మహర్షులదే.

వీర్యశుల్కమంటే కన్యాశుల్కమే. కన్యకు తన వీర్యాన్ని బహుమానంగా చేసి కన్యను వరించడం. జనకుడు విశ్వామిత్రునితో చెప్పే సీతాకల్యాణ సందర్భంలో - సీతా స్వయంవరం. జనకుడు పరాక్రమమే కన్యాశుల్కం అన్నాడు. రాజులందరూ మిథిలకు వచ్చారు. 'పరాక్రమమే శుల్కం అంటే ఎలాంటి పరాక్రమం కావాలి అని అడిగారు. శివధనస్సును ఎక్కుపెట్టుట్టటే అన్నాడు. ఎవరూ దాన్ని ఎత్తలేకపోయారు. రాముణ్ణి ప్రయత్నించమన్నారు. విల్లు విరిచి సీతను గ్రహించాడు. వశిష్ఠుడు, విశ్వామిత్రులు ఆలోచించుకొని - భరత శత్రుఘ్నులకు ఊర్మిళాశ్రుతకీర్తులను వధువులుగా నిర్ణయించిరి. జనక మహారాజు దశరథుడు - సంతోషముతో అంగీకారము తెల్పిరి. కుశధ్వజుడు అన్నగారి నిర్ణయమును ఆనందముతో శిరసావహించెను. వరులు భరత శత్రుఘ్నులను గాని - వధువులు మాండవీ, శ్రుతకీర్తులను గాని సంప్రదించిన దాఖలాలు ఎక్కడా కనిపించవు. కేవలం కన్యల అభిప్రాయం తెలుసుకోలేదు - వారి ఇష్టాయిష్టాలు సంప్రదించలేదు అనుకోవడానికి యిక్కడ వీలు లేదు. పెండ్లి కుమారులైన భరత శత్రుఘ్నులను కూడా మాట మాత్రంగానయినా వారి అభిప్రాయం అడగలేదు. ఆ రోజుల్లో వధూవరులు ఆనురూప్యత, ఉభయ కుటుంబాల ఆనుకూల్యత - సంఘంలో వారికి గల పేరుప్రతిష్ఠలు సరిపోతే ఆత్మీయులు, శ్రేయోభిలాషులు, పెద్దలు వివాహాలు నిర్ణయించేవారనే స్పష్టము.

## 6. బహుభార్యాత్వం :

రాజులను బహుభార్యాత్వం తరతరాలుగా వస్తున్న సాంఘిక ఆచారం. రాజకీయపు అవసరాలకు, సంధి సమకూర్చుకునే సందర్భాలకు రాజులు ఆయా శత్రురాజుల తనయులను వివాహమాడే సందర్భాలు చరిత్రలో అధికంగా కనిపిస్తాయి.

అయోధ్యాధిపతి అయిన దశరథ మహారాజులకు మూడు వందల యాభై మంది భార్యలున్నారు. వారు కాక పట్టపు రాణులు ముగ్గురు. కోసలాధీశుని పుత్రి - కౌసల్య పెద్దరాణి - సుమిత్ర రెండో రాణి, కేకయ రాజపుత్రి కైకేయి ముద్దుల భార్య మూడోరాణి.

కైకేయి వివాహ సందర్భంలో కేకయరాజు దశరథునికి తన కన్యను ఇవ్వడానికి ఒక ఒప్పందం చేసుకున్నాడు. కైకకు పుట్టిన పుత్రునికే అయోధ్య రాజ్యానికి పట్టం కడతాను అనేది. కైకను వివాహమాడేనాటికి దశరధుడికి కొంత వయస్సు మీద పడింది. అప్పటికి ఇంకా సంతానం కలగలేదు రాజుకు. కైక సౌందర్యానికి ఇష్టపడి దశరథుడు ఆమెను వివాహమాడ ప్రయత్నించాడు

## 6.2 కన్యలకు స్వయంగా వివాహం నిశ్చయించుకునే అధికారం లేదు

శ్రీ మద్రామాయణ కాలంలో ఉత్తమ సంప్రదాయం గల వంశంలో పుట్టిన కన్యలకు తండ్రి అనుమతి లేకుండా వివాహం నిశ్చయించుకునే అధికారం లేదు.

కుశనాభుని వృత్తాంతం ఈ విషయాన్ని స్పష్టం చేస్తూ ఉంది. కుశనాభుడికి నూరుగురు కుమార్తెలు. వారు ఉద్యానవనంలో విహరిస్తూ ఉండగా వాయుదేవుడు చూసి వారి సౌందర్యాన్ని మెచ్చి, వారిని కామించాడు. తనను వివాహం చేసుకోమనీ, అలా వివాహానికి అంగీకరించినట్లయితే మానుషభావాన్ని వదలి దీర్ఘాయువు పొందేటట్లు చేయగలనని ఆశపెట్టాడు.

**'అహం వః కామయే సర్వాభార్యా మమ భవిష్యథ**
**మానుషస్త్యజ్యతాం భావో దీర్ఘమాయురవాప్స్యథ!** **(బాల - 15-32)**

ఆ కన్యలు మాత్రం ఎంతో ధైర్యంతో వాయుదేవుని కోరికను తిరస్కరించారు.

'ఓ దుష్టబుద్ధి గల వాయుదేవా ! మేము సత్యవాది అయిన మా తండ్రిని కాదని స్వయంగా వరించే దుష్కాలము రాకుండుగాక ! తండ్రియే మాకు ప్రభువు, పరమదైవము, మా తండ్రి మమ్ము ఎవరికిచ్చునో అతడే మా భర్త'' అన్నారు.

**"మా భూత్సకాలో దుర్మేధః పితరం సత్యవాదినమ్।**
**అవమాన్య స్వధర్మేణ స్వయం వరముపాస్మహే!"**
**పితాహి ప్రభురస్మాకం, దైవతం పరమం చనః**
**యస్యనోదాస్యతి పితాసనో భర్తా భవిష్యతి** **(బాల - 20-21-32)**

కన్యకు ఆనాడు స్వయంగా వరుణ్ణి నిర్ణయించుకునే అధికారం లేదనీ - తండ్రి ఎవరిని నిర్ణయిస్తే వారినే భర్తగా స్వీకరించేవారనీ స్పష్టమౌతోంది. ఉత్తరకాండలో కూడా దండుడు అనే రాజు శుక్రుని కూతురు అరజను చూసి మోహిస్తాడు. తనను వివాహం చేసుకోమని బలాత్కరిస్తాడు. ఆ సందర్భంలో అరజ ఇచ్చిన సమాధానం పై విషయాన్ని సమర్థిస్తోంది.

"నన్ను బలాత్కారముగ స్పృశింపకు. నేను కన్యను. స్వతంత్రను కాను. తండ్రి అధీనంలో ఉన్నాను. ఆయన నాకు తండ్రి, గురువు కూడా. ఓ రాజేంద్రా! నువ్వు కూడా అతడికి శిష్యుడవు. కామభోగానుకూలత కావాలనుకుంటే ధర్మపథాన్ని ఆశ్రయించి మహాద్యుతి సంపన్నుడైన నా తండ్రిని అడుగు'' అని చెప్పింది.

'కన్యా పితృవశాహ్యాహమ్' - తండ్రి ఒద్దికలోని కన్యలకు స్వయం నిర్ణయాధికారం లేకపోవడం ఆనాటి కట్టుబాటు.

వివాహ సందర్భాల్లో తల్లిదండ్రులు వధూవరుల తుల్యరూప వయోవృత్త వంశముల గురించి ఆలోచించేవారు. 'విద్య, రూపము, బలము, ఐశ్వర్యము తపము' మున్నగునవి కూడా తీవ్రముగా చర్చించేవారు. సీతాదేవికి - సదృశుడు, రూపవంతుడు అయిన వరుడు దొరకడం లేదని జనకుడు ఎంతగానో విచారిస్తాడు.

**"అయోనిజాంహి మాంజ్ఞాత్వా**
**నాధ్యగచ్ఛత్సచింతయన్**
**సదృశం చాభిరూపంచ**
**మహీపాలః పతింమమ"॥** **(అయోధ్య - 37-118)**

వివాహ సమయంలో వధూవరుల తుల్యవయోవృత్తాదులు తప్పకుండా పరిగణలోకి తీసుకునే వారన్నది సత్యం. సీతారాములు, ఊర్మిలా లక్ష్మణులు - ఒకరికి తగినట్లుగ ఒకరు ఉన్నారని రామాయణంలో వాల్మీకి స్పష్టంగా చెప్పాడు.

**సదృశో ధర్మ సంబంధః**
**సదృశో రూపసంపదా**
**రామలక్ష్మణయోరాజన్**
**సీతయోర్మిలయాసహ ॥** **(బాల - 3 - 72)**

## 6.3 కన్యావరణము :

రామాయణ కాలంలో వరుని పక్షమువారు కన్య తండ్రి దగ్గరకు వెళ్లి వరుని కోసం కన్యను కోరేవారు. ఆడపిల్ల తండ్రి పెళ్లికొడుకుని వెదికే పద్ధతి ఆ రోజుల్లో లేదు.

"వశిష్ఠుడు రామలక్ష్మణులకు సీత, ఊర్మిళలను, విశ్వామిత్రుడు భరత శత్రుఘ్నులకు మాండవీ శ్రుతకీర్తులను స్వయంగా యాచించుట లేదా అర్థించడం ఇందుకు నిదర్శనం.

వరుడు వధువును కోరుకోవడం స్త్రీకి గౌరవం ఇస్తున్న విషయం. ఈ స్థితి నెమ్మదిగా మారి వధువు తండ్రే వరుణ్ణి వెదుక్కునే పరిస్థితి ఏర్పడింది.

## 6.4 వృద్ధ వివాహాలు :

సకృత్తుగా వృద్ధులైన రాజులు పడుచు కన్యలను వివాహమాడిన సందర్భాలు లేకపోలేదు.

కైక దశరధుల వివాహం దీనికి ఉదాహరణ. వరుని కంటె వయస్సులో ఎంతో చిన్నదైన కైకను ఇచ్చి వివాహం చేయడానికి కైక తండ్రి ఒక షరతు కూడా పెట్టాడు. కైకకు పుట్టిన కుమారునికే రాజ్యాధికారం ఇచ్చేటట్లయితే ఈ వివాహం అంగీకారమని మిథిలాపతి జనకుని విషయంలో కూడా మనకు కనిపిస్తుంది. భూమి దున్నుతూ ఉండగా కనిపించిన సీతను పెంచమని పెద్దరాణికి ఇచ్చాడు జనకుడు. 'దత్తాచాస్మిష్టవద్దేవ్యై జ్యేష్ఠాయై పుణ్యకర్మణా'

ఇక కిష్కిందలో - వాలి సుగ్రీవుల అంతఃపురంలో ఎందరో రూపయౌవన్న సంపన్నలైన స్త్రీలు వారి భోగాల కోసం ఉన్నారు.

**"బహ్వీశ్చ వివిధాకారా రూపయౌవనగర్వితాః**
**స్త్రియ స్సుగ్రీవ భవనే దదర్శ సమహాబలః"** **(కిష్కింధ - 22-33)**

లంకాధిపతి అయిన రావణుని అంతఃపురంలోని స్త్రీలకు లెక్కేలేదని, అది మహిళారణ్యంలా ఉందని వాల్మీకి వర్ణన.
'ఆసీద్వన మివోద్ధూతం స్త్రీవనమ్ రావణస్యతత్' (సుందర - 66-9)

ధన వైభవ సంపన్నులైన రాజుల్లోనే కాక, బ్రాహ్మణులలో కూడా బహుపత్నీత్వం ఉన్నట్లు దాఖలాలు కనిపిస్తున్నాయి. కౌశ్యప మహర్షికి ఎనిమిది మంది భార్యలున్నట్లు అరణ్యకాండలోను, విశ్రవసుడు మొదట భరద్వాజుని కూతురు దేవవర్ణినిని, ఆ తరువాత సుమాలి కూతురు కైకసిని వివాహమాడినట్లు ఉత్తరకాండలోను వివరింపబడిఉంది.

## 6.6 స్త్రీధనము :

వివాహ సమయంలో తండ్రులు తమ కూతుళ్ళకు తన తాహతును బట్టి ఆనందంతో కొంత ధనాన్ని ఇచ్చేవారు. దాన్ని స్త్రీధనంగా పరిగణించేవారు. ఆ ధనంపై భర్తకు ఏవిధమైన అధికారమూ ఉండదు.

ఈ విషయాన్ని వివరించే సన్నివేశం అయోధ్యకాండలో ఒకటి ఉంది.

అది అరణ్యవాసానికి సిద్ధపడుతున్న రామునితో లక్ష్మణుడు తానూ వస్తాననే సందర్భం. రాముడు లక్ష్మణుడితో - లక్ష్మణా ! నీవు కూడా నాతో అరణ్యాలకు వస్తే - నా తల్లి కౌసల్యను, నీ తల్లి సుమిత్రను ఎవరు చూస్తారు? కాబట్టి నువ్వు నగరంలోనే ఉండి వారిని కనిపెట్టుకుని ఉండమంటాడు. ఆ మాటలకు సమాధానంగా - లక్ష్మణుడు

'కౌసల్యను నేను పోషించవలసిన అవసరమే లేదు. నా వంటి వారిని వేయి మందిని ఆమే పోషించగలదు. ఆమె పేర వెయ్యి గ్రామాలు ఆమె పోషణ కోసం ఉన్నాయి. కాబట్టి అవి ఆవిడ పోషణకే కాదు నాతల్లి సుమిత్ర పోషణకు కూడా సరిపోతాయి. అంతేకాదు నావంటివాళ్ళను వెయ్యిమందిని పోషించగలిగే శక్తి ఆమెకే ఉన్నది'' అంటాడు.

**'కౌసల్యాబిభృయాదార్యా సహస్రమపి మద్విధాన్**
**యస్యాః సహస్రం గ్రామాణాం సంప్రాప్తముప జీవినామ్'**

## 6.7 బాల్యవివాహాలు : యుక్తవయస్సు :

రామాయణంలో బాల్యవివాహాలు జరిగిన సందర్భాలు కానరావు. యుక్తవయసు వచ్చిన తరువాతనే వివాహ ప్రయత్నాలు చేయడం అప్పటి పద్ధతి. కుశనాభుని కుమార్తెలు నూరుగురు యుక్త వయసు వచ్చి వనవిహారానికి వెళ్ళినప్పుడే వాయుదేవుడు వారిని రూపయౌవనశాలురను కామించాడు.

**'తాన్తుయౌవనశాలిన్యః రూపవత్యస్స్వలంకృతా**
**తాస్సర్వా గుణసంపన్నా రూపయౌవన సంయుతా - (బాల - 11-32)**

రాజకుటుంబాలలోనే కాక బ్రాహ్మణ కుటుంబాలలో కూడా యుక్తవయస్క కానిదే వివాహ ప్రయత్నాలు చేసేవారు కారు. బ్రహ్మదేవుడు యౌవనవతి అయిన తన కుమార్తె అహల్యను - బ్రహ్మచర్య వ్రతనిష్ఠుడయిన గౌతముని వద్ద ఉంచి - అతని మనోస్థైర్యమునకు పరీక్ష పెట్టాడు. ఈ సుందరి సన్నిహితగా ఉన్నా ఈషణ్మాత్రమైనా చలించని గౌతముని నిష్ఠకు మెచ్చి అహల్యను ఆయనకే ఇచ్చి వివాహం చేసాడు. (ఉత్తరకాండ 30వ సర్గ)

బ్రహ్మర్షి కుశధ్వజుని కూతురు వేదవతి వృత్తాంతం కూడా ఈ విషయాన్ని చెప్తున్నది. వేదవతికి యుక్తవయస్సు వచ్చింది. ఆ సర్వాంగసుందరిని భార్యగా పొందాలని - దేవతలు, గంధర్వులు, పన్నగులు, రాక్షసులు, యక్షులు - అదే పనిగా వేదవతి తండ్రిని యాచించడం ఆరంభించారు. కానీ కుశధ్వజునికి విష్ణువునే తనకు అల్లునిగా చేసుకోవాలి అనే సంకల్పంతో ఆమెను ఎవ్వరికి ఇవ్వలేదు. శంభువు అనే రాజు కోపంతో కుశధ్వజుని నిద్రించుచుండగా సంహరించాడు. వేదవతి కన్యగానే మిగిలిపోయింది. తపస్సు చేసుకుంటూ శేషజీవితం గడపసాగింది. తపస్విని అయిన వేదవతిని రావణుడు చూడడం ఆమెను అవమానించడంతో - ఆమె అగ్నిలో పడి శరీరత్యాగం చేసింది. (ఉత్తరకాండ - 17 వ సర్గ)

స్త్రీలు కూడా వివాహం చేసుకోకుండా బ్రహ్మచర్యాన్ని అవలంబించి, తమకు నచ్చిన రీతిలో తపస్సు చేసుకునే స్వాతంత్ర్యాన్ని కలిగి ఉండేవారని ఈ ఘట్టాన్ని బట్టి గ్రహించవచ్చు.

## 6.8 సహగమనం :

దశరథ మరణానంతరం అతని భార్యలు సహగమనం చేయలేదు. కానీ ఉత్తరకాండలో వేదవతి తల్లి తన భర్త కుశధ్వజునితో సహగమనము చేసినట్లు వర్ణించబడినది. కౌసల్య సహగమం చేయాలనుకుంటుంది. కిష్కింధలో వాలి మరణానంతరం తార, ఇతర భార్యలు సహగమనం చేసినట్లు లేదు. తార సహగమన ప్రయత్నం శ్రీరాముని సమాశ్వాసంతో విరమించుకుంటుంది.

రావణ మరణానంతరం అతని పట్టపురాణి మండోదరి గాని యితర భార్యలుగాని సహగమనం చేయలేదు. రామాయణ కాలం నాటికి సహగమనం అంతగా వ్యాప్తిలో లేదు అన్నది స్పష్టమైన విషయం. ఆలోచనలు ఉన్నా సహగమనం ఆనాడు నిర్బంధం కాదు.

## 6.9 పాతివ్రత్యము :

పతిని అనుసరించి జీవించడం, పతియే వ్రతముగా కలిగి ఉండడం పాతివ్రత్యం. పతివ్రతాశిరోమణిగా సీత భారతీయులందరికీ ఆరాధ్య. సీతాదేవిని శ్రీరామచంద్రుని చేతిలో పెట్టే సందర్భంలో జనకుడు -

**ఇయంసీతామమసుతా సహధర్మచరీతవః**
**ప్రతీచ్ఛచైనాం భద్రంతే పాణిం గృహ్ణీష్వపాణినా!**
**పతివ్రతా మహాభాగఛాయేవానుగతాసదా** (బాల - 26-27-73 సర్గ)

"నీకు ఎదురుగా ఉన్న ఈ కన్య నా కూతురు సీత. నీకు సహధర్మచారిణిగా ఈమెను అర్పిస్తున్నాను. ఈమెను పాణిగ్రహణం చేసి స్వీకరించు. నీకు శుభమగుగాక! ఈమె పతివ్రతగా నీడవలె ఎల్లప్పుడూ నిన్ను వెన్నంటి ఉండుగాక! నీవంటి భర్త లభించడం వల్ల ఈమె గొప్ప అదృష్టవంతురాలు అంటూ - జనకుడు సీతను రామునికి భార్యగా సమర్పిస్తూనే ఆమె పతివ్రత అని పేర్కొంటాడు.

వాల్మీకి - సీతాదేవిని - పతిదేవతా, భర్తృభక్తివ్రతా, సాధ్వీ అని పేర్కొనడం ఆమె పాతివ్రత్యనిష్ఠను వ్యక్తీకరించడమే. సంబోధనల కంటే స్పష్టంగా బోధపడే రీతిలో సూర్యుని యందు సువర్చల వలె ఆమె భర్తయందే నిత్యానురక్త అంటాడు - (తంనిత్యమనురక్తాస్మియధా సూర్యం సువర్చలా (సుందరకాండ - 24 సర్గ - 9వ శ్లోకం). అంతటితో తృప్తిపడక - శచీదేవి, అరుంధతీ, అనసూయ, రోహిణి, లోపాముద్ర, సుకన్య, సావిత్రి, శ్రీమతీ, మదయంతీ,కేశినీ, దమయంతులతో పోల్చాడు. (సుందరకాండ 24వ సర్గలో శ్లోకాలు 9 నుండి 12 వరకు)

సీతాదేవిని వనవాసానికి తనతోపాటుగా తీసుకువెళ్ళడానికి అంగీకరించని శ్రీరామునితో సీత చెప్పిన మాటలు పాతివ్రత్య ధర్మ వివరణలు.

"ఈ లోకంలో తల్లిదండ్రులచే ఎవరికి దానం చేయబడుతుందో ఆమె పాతివ్రత్య ధర్మాన్ని అనుసరించి పరలోకంలో కూడా అతనికీ భార్యగా ఉంటుంది.

భక్తురాల్ని, పతివ్రతని, దీనురాల్ని, సుఖదుఃఖాల్లో సమాన భాగస్వామిని అయిన నన్ను నీతో కూడా అరణ్యాలకు వెళ్ళలమే ఉచితమైన పని అంటుంది సీత ధీరగా. 'భక్తాం పతివ్రతాం దీనాం'.

సీత పతివ్రతా శిరోమణి అని చెప్పడానికి మండోదరి మాట ఒక్కటే చాలు. రావణ మరణానంతరం రావణుడు మరణించింది శ్రీరాముని కోపం వలన కాదనీ, సీతాదేవి యొక్క తపస్సు చేతనే అని అంటూ - సీతను ప్రత్యక్షంగా పతివ్రతగా సంభవించడం గమనించదగ్గ విషయం.

'పతివ్రతాయాస్తపసానూనం దగ్ధోఽసిమే ప్రభో - యుద్ధ - 23-111 శ్లో

అంతేకాదు పతివ్రతల కన్నీటి బిందువులు నేల మీద పడిన అరిష్టమే లంకారాజ్య పతనమమంటుంది మండోదరి.

**సీతానిమిత్తజో మృత్యుస్త్వయా దూరాదుపాహృతః**
**'దగ్ధోఽ సిమే ప్రభో'।** **(యుద్ధ - 30 శ్లో - 111 సర్గ)**

పతివ్రత అయిన సీత మూలముగా దూరాన ఉన్న మృత్యువు దగ్గరగా వచ్చింది. అందువల్లనే భస్మమైపోయావు.

**'పతివ్రతానాం నాకస్మాత్పతంత్యశ్రూవాశి భూతలే'** **(యుద్ధ - 14 సర్గ - 67 శ్లో)**

పతివ్రతల కన్నీటి బిందువులు హఠాత్తుగా క్రిందపడరాదు.

"అరుంధత్యా విశిష్టాం తాం రోహిణ్యాశ్చాపిదుర్మతే
సీతాం దర్షయతామాన్యాం త్వయాహ్యస దృశంకృతమ్" **(యుద్ధ - 111 - 21)**

అరుంధతీ రోహిణుల కంటె కూడ విశిష్టురాలును మాన్యురాలు అయిన సీతమాటను తిరస్కరించి చాలా దుర్మార్గంగా ప్రవర్తించావు అంటూ సీతామాత సతీత్వాన్ని ఎంతో గౌరవభావంతో ప్రశంసిస్తుంది. పగవాని భార్య ఇలా ప్రస్తుతించడం ఆమె పాతివ్రత్య ప్రభావ వైభవానికి గీటురాయి.

ఒక్క సీతే కాదు రామాయణంలోని రమణులందరూ పాతివ్రత్యం ఎడల పవిత్రభావం కలవారే. భారతీయ సంస్కృతిలో పాతివ్రత్యం అనేది ఒక పరమ పవిత్రమైన భావన. స్త్రీలంతా ఆ పాతివ్రత్య ప్రభావాన్వితులైతే భారతదేశంలో కుటుంబ వ్యవస్థ పరమ పవిత్రంగా ఉంటుందని భారతీయుల భావన. బీజక్షేత్రములలో క్షేత్రము పవిత్రంగా ఉండాలన్నది భారతీయుల ఆలోచన. ఆ ఆలోచన ప్రవర్తింపచేయాలంటే స్త్రీలు పాతివ్రత్యాన్ని పాటించాలి. అది భారతీయ సంస్కృతిలో గల ఆలోచన. దానిని అమలుజరపడానికి భారత స్త్రీలందరూ బాధ్యత వహించారు తరతరాలుగా.

సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు భారతీయ స్త్రీలు నిరంతరం తరం తరం కృషిచేస్తూనే ఉన్నారు. రామాయణంలో పాతివ్రత్యాన్ని గురించి కౌసల్యాది క్షత్రియాంగనలు, అనసూయాది ఋషిపత్నులు మాత్రమే కాదు మండోదరి వంటి రాక్షససతులు కూడా పదే పదే ప్రస్తావించడం పుట పుటలో కనిపించి పాఠకులను ఉత్తేజితులను చేస్తుంది.

## 6.10 ముగింపు :

పాతివ్రత్యం స్త్రీకి సమస్యగా లేక బాధ్యతగా నిర్ణయించింది రామాయణం.

## 6.11 మాదిరి ప్రశ్నలు :

1. రామాయణంలోని స్త్రీ సమస్యలను వివరించండి.
2. రామాయణ కాలంనాటి స్త్రీ స్థితిగతులను పరిశీలించండి.

## 6.12 ఉపయుక్త గ్రంథాలు :


1. సాహిత్య శిల్పసమీక్ష : ఆచార్య పింగళి లక్ష్మీకాంతం
2. రామాయణము : వాల్మీకి


**- ఆచార్య కె. మలయవాసిని**

పాఠం - 7

# రామాయణము - స్త్రీ పాత్రలు

## పాఠ్య నిర్మాణక్రమం :

7.1. ఉపోద్ఘాతం
7.2 రాజరమణులు
7.2.1 కౌసల్య
7.2.2 సుమిత్ర
7.2.3 కైక
7.2.4 మంధర
7.2.5 తార
7.2.6 శూర్పణక
7.2.7 మండోదరి
7.2.8 సీత
7.2.9 సకర్తవ్య నిశ్చయం
7.3 మాదిరి ప్రశ్నలు
7.4 ఉపయుక్త గ్రంథాలు

## 7. 1. ఉద్దేశ్యం :

రామాయణంలోని స్త్రీ పాత్రలను పరిచయం చేయటం.

## రామాయణములో స్త్రీ పాత్రలు :

రామాయణంలో మూడు రాజ్యాలున్నాయి. ఒకటి కథానాయకుడైన శ్రీరాముడిది. రెండోది రాముడు సఖ్యంతో మమతను పెంచుకున్న సుగ్రీవుని రాజ్యం కిష్కింధ. మూడోది ప్రతినాయకుడయిన రావణుని రాజ్యం లంక. మూడు రాజ్యాల్లోనూ రమణులున్నారు. ఆయా రాజ్యాల ఆచార సంప్రదాయాలకు తగినట్లు నడుచుకుంటూనే ఆయా స్త్రీ పాత్రలు తమదైన ఉన్నతిని, సంస్కృతిని, సంస్కారాన్ని వ్యక్తం చేసాయి.

లోకంలో ఏ రాజ్యంలో ఉన్నా స్త్రీల సమస్యలు కొన్ని సాధరణంగా ఏకవాక్యత కలిగి ఉంటాయి. స్త్రీ జీవితం భర్తతో ముడిపడి ఉండటం అన్ని రాజ్యాల్లోనూ ఉన్నదే. ఒక్కొక్క స్త్రీ జీవితం ఒక్కొక్క కోణంలో ఒక్కొక్క రీతిలో సాగుతుంది. ఆయా స్త్రీల మనస్తత్వం మీద ఆయా పాత్రల స్పందన ఆధారపడి ఉంటుంది. ఒకే సమస్యకు అందరు మహిళలు ఒక తీరుగా స్పందించరు. ఆ సమస్యను అవగాహన చేసుకొని పరిష్కారాన్ని ఇవ్వడంలో కూడా ఎవరి తీరు వారిదే. ఈ నేపథ్యంలో వాల్మీకి మహర్షి రామాయణంలో స్త్రీ పాత్రలను ఉదాత్త రసాన్వితంగా తీర్చిదిద్దాడు. మహిళల మానసిక ఆవేదనను గుండె కదిలించి కుప్పపోసే సందర్భాలలో స్త్రీల ఎడల, స్త్రీల సమస్యల ఎడల ఆ మహర్షికి గల సానుభూతి సాధికారత నేటికి, ఏ నాటికి ఆశ్చర్యాన్ని కలిగించేదిగా ఉంది.

అసలు వాల్మీకి రామాయణాన్ని 'సీతాయాః చరితమ్‌మహత్' అని సంభాషించడంలోనే స్త్రీల యెడల ఆ మహర్షికి గల ఆదరగౌరవాలు ఆవిష్కరింపబడ్డాయి. ఇది సీతచరిత్ర, సీతకథ. ఒకానొక ఇల్లాలికథ. రాజకుమారి చరిత్ర. ఒక చక్రవర్తి కూతురై మరో చక్రవర్తికి కోడలైన ఆ సీతాసాధ్వి భర్తతో గడిపిన జీవితం ఎంతటి అసాధారణ సాధారణమైందో స్త్రీశక్తి ఎంతటి దృఢమైందో వివరించి వాల్మీకి ఆమెకు సాటి ఆమే అనే రీతిలో నిర్మించాడు కావ్యంలో. అయోధ్య రాజ్యంలో స్త్రీపాత్రలను గురించి వివరించుకునే ముందు రాజరమణులు మునికాంతలు, దాసీజనులుగా విభజించుకోవలసి వుంది.

## 7.2. రాజరమణులు :

### 7.2.1 కౌసల్య :

అయోధ్యాధిపతి అయిన దశరథునికి ప్రధాన రాణులు ముగ్గురు. కౌసల్య, కైక, సుమిత్ర. ముగ్గురి ప్రత్యేకతలు ముగ్గురివే. ఎవరి వ్యక్తిత్వం వారిదే.

కావ్య నాయకుడై శ్రీరామచంద్రుని కన్నతల్లి కౌసల్య. పుట్టపుదేవి, పెద్దరాణి.

పతిభక్తి పరాయణత ఆనాటి ప్రధాన లక్షణం కావడంతో కౌసల్య పతిభక్తి పరాయణగా తన జీవనాన్ని నడిపింది. ఉత్తమ ఇల్లాలుగా పేరొందింది. దయ, మమత, కరుణ వంటి స్త్రీ సహజమైన గుణాలు ఆమెలో పుష్కలంగా ఉన్నాయి. వాత్సల్య పూరితమైన మాతృహృదయం ఆమెకు పెట్టినసొమ్ము.

కౌసల్య కోసలరాజ పుత్రిక. ఆ రాజు తన కుమార్తెకు ఎంతో ఆదరాభిమానాలతో వెయ్యి గ్రామాలతోపాటు, ఎంతో మందిని దాసదాసీ జనుల్ని కూడా అరణంగా ఇచ్చాడు.

**"కౌసల్యా బిభృయాదార్యా సహస్రం మద్విదానసి**
**యస్యా సహస్రం గ్రామాణాం సంప్రాప్తముప జీవినామ్. (2-22-31)**

ఈ ఆర్థిక స్తోమతతో ఆమె ఎందరినో పోషించగలిగే స్థితిలోనే ఉంది.

దశరథ మహారాజుకు సహధర్మచారిణిగా ఆమె ఎన్నో యజ్ఞాలలో సోమపీఠిగా పరమభక్తి శ్రద్ధలతో పాల్గొంది. భార్యగా తన బాధ్యతను నిర్వహించింది. మాతృదేవి కావాలనే కోరికతో కౌసల్య ఎన్నో వ్రతాలు, దానాలు, ఉపవాసాలు, యోగాది నియమాలు అవలంబించి శారీరక శ్రమను పొందింది.

**ఇదంతు దుఃఖం యదనర్థకానిమే వ్రతాని దానాని ద సంయమాశ్చహి**
**తపశ్చతప్తం యదవత్యకామయా సునిష్ఫలం బీజమవోప్త మూషరే (2-20-52)**

పట్టమహిషి అయినా కౌసల్య పత్యుపేక్షిత. ఆమెను చేపట్టాక దశరథుడు ఎందరో రూపవతులను పెండ్లాడాడు, ఆమెను ఉపేక్షించాడు. పతి - ప్రేమాదరణలు ఆమెకు లభించనేలేదు. పేరుకు పెద్దభార్య ప్రేమకు చిన్నచూపు ఆమెకు దక్కినవి. అయినా ఆమె మనస్విని కావడంతో బాధనంతా ఓరిమితో భరించి మహారాణి ఉదాత్తతకు భంగం కలిగించకుండా గాంభీర్యముద్రతో రోజులు గడిపింది భర్తను పల్లెత్తుమాట అనకుండా.

పతి ఆదరణ లేనివారికి తక్కినవారి ఆదరణ లభించడం కలలో మాట. సవతుల సంగతి చెప్పవలసిన పనేలేదు. అయినా ఆమె సహనంతో శ్రీరామచంద్రుణ్ణి పెంచుకుంటూ అతనిపై తన ఆశలు పెంచుకుంటూ జీవించసాగింది. శ్రీరాముడు అయోధ్యాపతి అయిన నాడు తన జన్మధన్యమవుతుందనీ, పట్టపురాణి తల్లిగా తకనొక గౌరవం తప్పక లభిస్తుందనీ ఆశించింది.

ఎన్ని అవమానలనైనా దిగమింగి ఆ శుభఘడియలకై నిత్యం భగవంతుణ్ణి భక్తితో కొలుస్తూ, ఉపవాసాలు వ్రతాలు నిష్ఠాగరిష్ఠయై సలుపుతూ, భర్త అనాదరణను గుండెనిండా భరిస్తూ జీవిస్తున్న మహానుభావురాలు.

చిన్న భార్య కైక దశరథుని కన్నులవెన్నెల. ఆమె అనన్య సామాన్యమైన అనురాగాన్ని భర్త నుండి పొందిన భాగ్యశాలి. ఆమె కౌసల్యను లెక్క చేయకపోవటలో వింతలేదు. ఆమె పరిజనము కూడా కౌసల్యను లెక్కజేయక మెలగెడివారు.

శ్రీరామ పట్టాభిషేక భంగవార్త కౌసల్యకు పిడుగుపాటయినది. ఆమెకు భవిష్యత్తు సర్వమూ అంధకార బంధురమైంది. ఎవరిని ఏమని నిందింపక ఆమె ఆ సందర్భంలో తనను, తన అదృష్టమును నిందించుకున్న మానవతి. శ్రీరామునికి అరణ్యావాశ క్లేశం ప్రాప్తించడానికి అతడు తన గర్భమున పుట్టటమే కారణమని హృదయ విదారకంగా విలపించింది. కైక వరములకు ప్రతిఫలమని తెలిసినా - తన దురదృష్టమే కారణమనుకొని తనను తాను ఓదార్చుకుంది.

కౌసల్య మాతృహృదయం వేదనకు ఈ ఘట్టం ప్రధానమైన ఉదాహరణం. ఆమె ఋజు స్వభావానికి, ఔదార్యానికి, ఓర్పుకు ఎల్లలు లేవనిపించే సన్నివేశం ఇది. ఈ సందర్భంలో ఆమె దుఃఖ భావన ఒక్కటే. 'నాయనా నాకు నువ్వు పుట్టకపోయినా బాగుండేది' అని.

**'యదిపుత్ర న జాయేథా మమశోకాయరాఘవః**
**నస్మదుఃఖమతోభూయః పశ్యేయ మహ మప్రజాః**
**ఏకఏవహి వంధ్యాయాః శోకోభవతిమానసః**
**అప్రజాస్మీతి సంతాపోనహ్యనః పుత్రవిద్యతే. అయోద్య - 20-36, 37.**

"పుత్రకా ! నీవు నాకు పుట్టకుండా ఉంటే నాకింత దుఃఖం కలిగి ఉండేది కాదు. వంధ్య అయిన స్త్రీకి సంతానం లేదనే చింత తప్ప వేరే చింత ఉండదు కదా ! నాయనా ! అంటూ ఆక్రోశించింది. పిల్లలు పుట్టి ఇలా దూరమయ్యే కంటే పుట్టకపోవడమే మేలు అనుకునే స్థితి ఆమెది. ఒకవైపు భర్త నిరాదరణతో వేగిపోతున్నది. మరోవైపు ఏకైకపుత్రుడు తనను విడిచి ఒకటికాదు, రెండుకాదు పదునాల్గు సంవత్సరాలు అరణ్యావాసానికి పోతున్నాడు. తానా వృద్ధురాలు. దానికి తోడు సవతి అదుపు - ఆజ్ఞలలో పట్ట మనిషి అయినా బ్రతకపవలసి వచ్చింది. అన్యాయాన్ని ఎదిరించే శక్తిలేదు. ఆ ఇల్లాలి వ్యధాభరిత హృదయాన్ని దైన్యభావాన్ని వాల్మీకి సహజభావ గాంభీర్యంగా అక్షరబద్ధం చేసాడు.

**తదక్షయం మహద్దుఃఖం నోత్సహే సహితుంచిరాత్**
**విప్రకారం సపత్నీనామేవం జీర్ణాసి రాఘవ ॥**
**అపశ్యంతీ తవముఖం పరిపూర్ణ శశిప్రభమ్**
**కృపణానర్తయిష్యామి కథం కృపణ జీవికామ్ 2-20- 46, 47**

నాయనా ! నీ దుఃఖం మామూలు దుఃఖం కాదు. ఇది మహద్దుఖం. దీనికి అంతమెక్కడో తెలియడం లేదు. ఇలంటి దుఃఖాన్ని చిరకాలం భరించడం ఎలా ? ఈ ముసలితనంలో సవతుల ప్రతీకారాన్ని ఎలా సహించగలను. పూర్ణచంద్రుని వంటి నీ ముఖాన్ని చూస్తూ బ్రతుకు వెళ్ళదీద్దామంటే ఆ అదృష్టం కూడా లేకుండా పోయింది. ఇట్టి దైన్యజీవితాన్ని, దీనస్థితిలో ఉన్న నన్ను నేనుఎన్నాళ్ళు సహించగలను ? అని ప్రశ్నిస్తుంది.

భర్త నిరాదరణనైనా ఓరిమితో భరించగలిగింది కానీ - ఆసాధ్వి పుత్రుడు అరణ్యవాసియై పోవడాన్ని తట్టుకోలేకపోయింది. ఎంతగా ఆర్థికబలం ఉన్నా, భర్త వాత్సల్యానికి నోచుకోని స్త్రీ జీవితంలో ఆశాకిరణం పిల్లల వల్ల పొందే ఆనందమే. కౌసల్య ఆ

ఆనందాన్ని కూడా పొందలేకపోయింది. చిరకాలంగా ఏ ఆశాకిరణం వెలుగులో జీవితంలోని చీకట్లనన్నీ పోగొట్టుకోగలననుకుందో ఆ పుత్రుడు పట్టాభిషిక్తుడు కాకుండా పోవడంతోపాటు రాజ్యంలో ఉండే పరిస్థితి కూడా లేకుండా పోయింది. కౌ సల్య మాతృ హృదయం ఈ స్థితిని భరించలేకపోయింది. కౌసల్యే కాదు ఏ స్త్రీ అయినా భరించలేని ఘట్టమిది. ఏ కాలంలో అయినా స్త్రీల సమస్యల తీవ్రతకు ఉదాహరణగా నిలచే సన్నివేశమిది.

తాను కూడా అరణ్యానికి వెళ్ళడానికి రాముడే అంగీకరించలేదు. తండ్రితోపాటు ఉండడమే ధర్మమని ఆమెకు కర్తవ్యాన్ని బోధించాడు. ఆ కట్టుబాటుకు లోనై ఆమె పుత్రుని దీవించి పంపి వీరమాతగా ప్రకాశించిందఇ.

శ్రీరామా ! నువ్వు అడవులకు వెళ్ళి శీఘ్రంగా తిరిగిరా ! సత్పురుషుల మార్గాన్ని అనుగమింపు''. 'వర్తస్వచ సతాంక్రమే' అని దీవించి పంపింది. దీవనలిచ్చి వెళ్ళిరమ్మన్నదే గానీ సీతారామలక్ష్మణులు ఆయోధ్య వదలి వెళ్ళగానే ఆమె దుఃఖ తీవ్రతతో దశరధుని నిందించింది.

**"హతం త్వయా రాజ్యమిదం సరాష్ట్రంహతస్తథా ఉ త్మాసహమంత్రిభిశ్చః**
**హతాసపుత్రాస్మి హతాశ్చపౌరాః సుతశ్చ భార్యా చతవప్రహృష్టా" (2-61-26)**

"నేనే కాదు - ఈ కోసలరాజ్యం, ఇతర మిత్రరాష్ట్రాలు కూడనీవల్ల నిహతదములయ్యాయి. అంతేకాదు మంత్రులతో సహా నిన్ను నీవు నాశనం చేసుకున్నావు. పౌరులందరూ నిహతులయ్యారు. సంతోషంగా ఉన్నవారు నీ ముద్దుల ఇల్లాలు కైక ఆమె పుత్రుడు తప్ప మరెవ్వరూ లేరు'' అంటూ నిజాన్ని నిర్భయంగా వ్యక్తపరిచింది.

తన పుత్రుని కష్టానికే కాదు లక్ష్మణుడు, భరతుడు అనుభవించే కష్టాలకు కూడా ఒకేవిధంగా స్పందించే మాతృహృదయం గలది కౌసల్య. రామ వనవాస పథకంలో భరతుడు నిర్దోషి. అతని ప్రమేయమే లేదని తెలిసిన మరుక్షణమే ఆమె -నాయనా ! నీవు సత్యప్రతిజ్ఞుడవు. సత్పురుష లోకాన్ని పొందగలవు అంటూ అతణ్ణి ఒడిలోనికి తీసుకొని కౌగిలించుకొని విపరీతంగా దుఃఖించింది.

**వత్ససత్య ప్రతిజ్ఞోహిసతాం లోకేవాప్స్యసి ॥ 2-61-75**
**పరిష్వజ్య మహాబాహు రురోద భృశదుఃఖితా ॥ 2-62-75**

చిత్రకూటములో లక్ష్మణుడు నదీజలాలు తెచ్చే సమయంలో ఓ సుమిత్రా ! నీ పుత్రుడు లక్ష్మణుడు నా రాముని కొరకు స్వయంగా నీరు మోసుకొని వచ్చి ఎంతగా శ్రమపడుతున్నాడో !' అంటూ ఆర్ద్రీభూత చేతస్కురాలు కావడం ఆమె మాతృభావనకు పరమ ఉదాహరణం.

దశరథుడు తన ఎడల ఎంతగా అన్యాయంగా ప్రవర్తించినా, అనాదరించినా కౌసల్య ఆయనను గౌరవిస్తూనే ఉన్నది. శ్రీరామచంద్రుడు గారపిండితో పిండములు పెట్టు సన్నివేశంలో - ఈ మహారాజుకు గారపిండితో పిండాలా ? అది చూసి నా హృదయం వేయిముక్కలుగా ప్రిదిలి పోకుందేమీ అనుకుంటుంది భరించరాని ఆవేదనతో . . .

'కథం దుఃఖేన హృదయంనస్ఫోటతి సహస్రథా' కొడుకులనేకాదు కోడలు సీతమ్మను కూడా ఆమె అంతగా ప్రేమించింది. అంతటి వాత్సల్య సుధను కురిపించింది.

సీతారామలక్ష్మణులు అరణ్యావాసముల నుండి తిరిగి వచ్చేవరకు ఆమె శోకకర్శితగా, వివర్ణయై ఎదురు చూసింది.

పట్టమనిషి స్థానం, తండ్రి ఇచ్చిన ధనం ఉన్నా కౌసల్య ఏవిధమైన ఆధిక్యతను పొందలేకపోయింది. సమాజంలో, గృహంలో వ్యక్తుల ఆదరాభిమానాలతో పొందగలిగేస్థాయి గొప్పది అనే విషయానికి కౌసల్య పాత్రను ఉదాహరణగా చెప్పుకోవచ్చు.

మొత్తంమీద కౌసల్య పతిభక్తి పరాయణగ, ధర్మాత్మురాలిగ, పరదుఃఖకాతరగ, మాతృహృదయ తత్పరగ, సహనశీలిగా దైవభక్తి పరాయణగా చిత్రింపబడింది.

ఉత్తమ మానవుడయిన శ్రీరామచంద్రుని కౌసల్యాసుప్రజునిగా - కౌసల్యానంద వర్ధనునిగా అభివర్ణించింది వాల్మీకి రామాయణం.

### 7.2.2 సుమిత్ర :

సుమిత్ర రెండవభార్య. లక్ష్మణ శత్రుఘ్నులకు తల్లి. భాతృసేవా పరాయణుడయిన లక్ష్మణుడు తల్లి పేర 'సౌమిత్రి'గా వర్ధిల్లాడు. పుత్రుణ్ణి ఎలా పెంచాలి ? అతని నిర్ణయాలు ఉత్తమమైనవి అయినప్పుడు తల్లి ప్రోత్సాహం ఎలా ఉండాలి ? అనే విషయాలకు సమాధానం సుమిత్ర. ఒట్టిమాటలు గాక గట్టిమాటలు గట్టిమేలు తలపెట్టిన తల్లి ఆమె.

శ్రీరామునితో పాటుగా తనూ అరణ్యావాసానికి వెళ్ళడానికి నిశ్చయించుకొన్నాడు లక్ష్మణుడు. ఆ మాతృమూర్తి ఆ సంకల్పానికి ఎంతో సంతోషించింది. అరణ్యావాసక్లేశం నీకు ఎందుకు అనలేదామె.

"నాయనా ! నువ్వు వనవాసం చేయడానికే పుట్టావు. రాముని మీద నీకు గల ప్రేమ సంపద నాకు తెలుసు. అతనితో కూడా వెళుతున్నందుకు ఆనందంగా ఉంది. అప్రమత్తుడవై అతన్ని సేవించు. జ్యేష్ఠుని అనుసరించి ఉండడం సత్పురుషధర్మం. మనరాజ వంశానికి ఈ ప్రవర్తనం ఎంతో తగి ఉంది. ఈ రఘు వంశంలో దానం,యజ్ఞదీక్ష, యుద్ధంలో శరీరత్యాగం మొదలైనవి సనాతనంగా వచ్చే ధర్మాలు.

**"ఇదం హి వృత్తముచితమ్ కులస్యాస్య సనాతనమ్ ।**
**దానం దీక్షాచయజ్ఞేషు తనుత్యాగో మృధేషుచ ॥ అయో - 7-40** అంటూ ధీరురాలై వివరిస్తుంది.

ఆ తనయుణ్ణి ఆ తల్లి దీవించిన దీవెన - ఉదాత్త భావార్థ సంభరితమై, కర్తవ్యోపదేష్టమై, ధైర్య భావనా సముపేతమై, ఉత్సాహపురస్కృతమై లక్ష్మణుణ్ణి ముందుకు నడిపిస్తుంది. రామాయణంలోని ప్రసిద్ధ శ్లోకాలలో ఈ సుమిత్ర వాక్యాలు గల శ్లోక మొకటి.

**'రామం దశరథం విద్ధి**
**మాం విద్ధి జనకాత్మజామ్**
**అయోధ్యా మటవీంవిద్ధి**
**గచ్ఛతాత యథాసుఖమ్ । 9-40 అయోధ్య.**

"నాయనా ! నీకు రాముడే దశరథుడు. జానకియే నేను. అరణ్యమే అయోధ్య. సుఖంగా వెళ్ళు నాయనా !" అంటుంది. అరణ్యాన్ని అయోధ్యగా, రాముని తండ్రిగా, సీతను తల్లిగా భావించుకోగలిగితే నీకు అన్నీ ఉన్నట్లే కదా ! దేనికీ దూరమయినాననే భావమే నీకు కలుగదు నాయనా అంటూ ఉదాత్త భావాన్విత బోధ చేసిన మహనీయురాలు సుమిత్రా మాత.

వాల్మీకి చిత్రణలో సుమిత్ర ధీరహృదయ. జ్ఞాన సంపన్నురాలు. అంతర్దృష్టి సంభావ్య. రాముడు అరణ్యావాసానికే వెళ్ళే సందర్భంలో అతి దీనంగా విలపిస్తున్న కౌసల్యను సుమిత్ర ఓదార్చిన ఘట్టంలో సుమిత్ర వ్యక్తిత్వాన్ని స్పష్టముగా చూపాడు వాల్మీకి. దశరథుని భార్యల్లో సుమిత్ర ఆత్మజ్ఞాన సంపన్న కౌసల్యతో ఆమె పలికిన ప్రతిమాటలో కౌసల్య ధైర్యాన్ని పొందగలిగే విషయాలు ఎంతో సోపపత్తికంగా, విశ్లేషణాత్మకంగా ధర్మసమ్మతంగా వివరింపబడ్డాయి. ఆమె పలుకుల పొందు చూద్దాం. ఆ పలుకుల్లో రామతత్త్వాన్ని సుమిత్ర అందుకున్న స్థాయిని గమనించవచ్చు.

"ఆర్యే ! నీ పుత్రుడు ఎవరనుకుంటున్నాము. సాక్షాత్తు పురుషోత్తముడు, సద్గుణ సంపన్నుడు. నువ్వెందుకు అతని కోసం ఇంత దీనంగా విలపిస్తున్నావు ? నీ కుమారుడు మహాబల సంపన్నుడై ఉండి కూడా రాజ్యాన్ని విడిచివెళ్ళడానికి సంసిద్ధుడైన ధర్మమూర్తి. పితృవాక్యాన్ని చక్కగా ఆదరించాడు. తండ్రిని సత్యవాదిగా చేయడానికి అతడు మహత్తరమైన ధర్మాన్ని పాలించాడు. ఇహలోక పరలోక అభ్యుదయకారకమైన ధర్మమార్గంలో ఉన్నాడు. అతణ్ణి గురించి నీవు శోకింపవలసిన పనిలేదు. సర్వభూతాల యందు దయగలవాడు, పవిత్రమైన హృదయం కలవాడు అయిన లక్ష్మణుడు అతని వెంటనే ఉన్నాడు. అది అతనికి లాభదాయకమూ, క్షేమదాయకమూ కూడా. అంతేకాదు అతని వెంట పరమసాధ్వి అయిన సీతాదేవి వుంది. సత్యవ్రతపరుడు, ధార్మికుడు అయిన నీ పుత్రుని మాహాత్మ్యాన్ని తెలిసిన సూర్యుడు అతడిని తపింప చేయడు. బ్రహ్మప్రియమారదివ్యాస్త్రాలను ప్రసాదించాడు. మహాస్త్రసంపన్నుడును, శూరుడు అయిన నీ కొడుకు గృహంలో ఉన్నట్లే అరణ్యంలో కూడా సుఖంగా కాలక్షేపం చేస్తాడు. అతడితో యుద్ధం చేసి ఎవ్వరూ గెలవలేరు. శ్రీ, శౌర్యము కల్యాణకరమయిన వీర్యము గల నీపుత్రుడు వనవాసం ముగించుకొని వచ్చి తప్పకుండా ఈ రాజ్యాన్ని పరిపాలిస్తాడు" అని ఎంతో ధృఢంగా కౌసల్యకు మానసిక ధైర్యాన్ని కలగజేయగలమాట నేర్పుగలది సుమిత్ర.

అసలు రామాయణంలో రామతత్త్వాన్ని గ్రహించిన రమణీమణుల్లో సుమిత్ర ప్రథమగణ్య. అందువల్లనే శ్రీరామ విభూతిని పరమ పవిత్రంగా దర్శించి వర్ణిస్తుందామె మహోదార శైలీవిన్యాసంతో -

**సూర్యస్యాపి భవేత్సూర్యో హ్యగ్నేరగ్నిః ప్రభోః ప్రభుః**
**శ్రియశ్శ్రీశ్చ భవేదగ్ర్యా కీర్త్యాకీర్తిః క్షమాక్షమా ॥**
**దైవతం దేవతానాంచ భూతానాంభూతసత్తమః**
**తస్య కేహ్యగుణాదేవి వనేవా ప్యథవాపురే**
**పృథివ్యా సహవైదేహ్యా శ్రియాచ పురుషర్షభః**
**క్షిప్రంతిస్సృభిరేతాభిః సంగరామోభిషేక్ష్యతి ॥**
**నార్హాత్వం శోచితుందేవి యస్యాస్తే రాఘవస్సుత ః**
**నహి రామాత్పరో లోకే విద్యతే సత్పథాస్థితః**
**పుత్రస్తేవరద క్షిప్రమయోధ్యాం పునరాగతః**
**కరాభ్యాం మృదుపీనాభ్యాం చరణౌపీడయిష్యతి ॥** అయోధ్య - 44, సర్గ 15, 16, 17, 26, 28

శ్రీరామచంద్రుడు సూర్యునికి సూర్యుడు, అగ్నికి అగ్ని, ప్రభువులకు ప్రభువు. శోభకు శోభ. కీర్తికి కీర్తి. ఓర్పుకు ఓర్పు. దేవతలకు దైవము. భూతాలకు భూతము. అతడెక్కడనున్న ఏమి అతనిలో ఎట్టి అవగుణాలు లేవు. అతి త్వరలో వనవాసము పూర్తి చేసికొని, భూమి, వైదేహి, లక్ష్మీ సమేతుడై ఆ పురుషోత్తముడు అభిషిక్తుడౌతాడు. రాముని వంటి పురుషోత్తముణ్ణి పుత్రునిగ పొందిన నువ్వు ఈ విధంగా శోకింప తగదు. అతని కంటే సన్మార్గస్థితుడు మరొకడు కానరాడు. నీ పుత్రుడు త్వరలోనే అయోధ్యకు తిరిగివచ్చి మృదువైన పీనములైన తన హస్తాలతో నీ పాదాలు ఒత్తి సంతోషం చేకూర్చగలడు" అంటుంది.

స్త్రీలకు ఇంతటి జ్ఞానము, విశ్లేషణాశక్తి, తత్త్వజ్ఞానము కలిగి ఉండడం అరుదైన విషయం. మహిళలకు కూడా ఈ విషయాల్లో విశేషమైన పరిజ్ఞానం ఉంటుంది - ఉంది - అనటానికి సుమిత్ర పరమోదాహరణం. 'జ్ఞాని'గా స్త్రీని గుర్తించి,తీర్చిన వాల్మీకి అభినందనీయుడు.

తన పుత్రులనిద్దరినీ సద్వృత్త సంపన్నులయిన రామ భరతుల సేవలో నియోగించి ఆనందించిన సుజ్ఞాని సుమిత్ర.

### 7.2.3 కైక :

భగవంతుని సంకల్పాలు నెరవేరటానికి ఒకొక్కప్పుడు కొన్ని పాత్రల నిర్వహణ విచిత్రంగా ఉంటుంది. దుష్టుడైన రావణ సంహారం కావటానికి రాముడు అరణ్యాలకు వెళ్ళితీరాలి. సర్వసద్గుణ శోభితుడైన రాముణ్ణి అడవికి పంపడానికి రామకథలో సాధనం కైక అయింది. ఎన్నో నిందలు పడి, మరెన్నో భాగ్యాలు పోగొట్టుకొని, ఇంతటి క్రూరురాలు లేదు భూమిమీద అనిపించుకొని ఒక సత్కార్యాచరణకు బీజమై దుష్టపాత్రగా నిలచిపోయిన పాత్ర కైక.

ఇక స్వరూపంలో కైక అపురూప సౌందర్యవతి. దశరథ మహారాజుకు భార్యలందరూ ఒక ఎత్తు అయితే కైకమ్మ ఒక ఎత్తు. రూపంలోనేకాదు - యుద్ధ విద్యలో కూడా ప్రత్యేక నైపుణ్యం గల మహిళ ఆమె. దశరథుడు శంబరునితో యుద్ధం చేసినప్పుడు క్షతగాత్రుడైన అతనిని కైక కాపాడింది. అతనికి విజయాన్ని చేకూర్చింది. ఆనాటి ఆమేలు కారణంగా దశరథుడు ఆమెకు పూర్తిగా వశవర్తి అయ్యాడు. సౌభాగ్యమదగర్విత. ఆ సౌభాగ్య గర్వంతోనే ఆమె తన సవతులను పరుషంగా మాట్లాడటం, అవమానపరచడం స్త్రీ సహజమైన గుణాలకు కైక కూడా అతీతురాలేం కాదు. ఆమె నిత్యక్రోధ స్వభావము కలదిగాను, దశరథుడు ఆమెను సదా ప్రసన్నురాలిగా చేసికోవటానికీ యత్నించేవాడు. దాని కోసం తన ప్రాణాలయినా ఇవ్వడానికి సిద్ధమై యుండేవాడు.

**'నత్వాం క్రోధయితుంశక్తో నక్రుద్ధాం ప్రత్యుదీక్షితుమ్**
**తన ప్రియార్థం రాజాతుప్రాణానపిపరిత్యజేత్ ॥** అయోధ్య - 25 - 9.

భర్త విషయంలో భార్యగా తన ఆధిక్యతను నిలుపుకోవడానికి ప్రయత్నించిన కైక మాతృమూర్తిగా విశిష్ట స్వభావం కలది. తన పుత్రుడైన భరతుని కంటే అధికంగా విశేషంగా ఆమె రాముణ్ణి ప్రేమించింది. రామ పట్టాభిషేక విషయం మంధర చెప్పగావిని అమితానంద భరితురాలయింది. కానీ అంతలోనే మానవునిలో ఉండే బలహీనతలకు ఆమె కూడా లొంగిపోయింది.

తన భరతుడు యౌవ రాజ్యాభిషేకము పొందాలి, తాను రాజమాత కావాలి అనే కోరిక మనస్సులోకి రాగానే ఆమెలోని సహజమైన మంచి గుణాలన్నీ పక్కకి పోయాయి. మంధర బోధతో ఆమె హృదయంలో ఒక సంకల్పం ధృఢంగా నాటుకుపోయింది. తిరుగులేని ఆనిశ్చయం రాముడు అరణ్యానికి వెళ్ళేదాకానేకాదు. దశరథ మరణాంతం వరకు స్థిరంగా ఉండిపోయింది. రాముడు లేనిదే బ్రతకలేను - రామవనవాసం అనే కోరికను తప్పించమని ప్రాధేయపడిన దశరధుని కోరికను కూడా ఆమె అంగీకరించలేదు. తన కోరికలు చెల్లించకుండ అతడు చనిపోవడానికి కూడా వీలు లేదన్నంత తీవ్రవాదిని ఆమె.

**భవత్వధర్మో ధర్మోవాసత్యం వాయదివాఽనృతమ్ ।**
**యత్త్వయా సంశ్రుతంమహ్యం తస్యనాస్తివ్యతిక్రమః** అయోధ్య 46-12

ధర్మంకాని, అధర్మంకాని సత్యం కాని అసత్యంగాని నాకు నీవు ఇచ్చిన వాగ్దానం చెల్లించి తీరవలిసిందేగాని, దానికి తిరుగులేదు అంటూ నిర్మొహమాటంగా చెప్పగలిగింది.

ఈ వాంఛా తీవ్రతలో ఆమె దశరధుని కోల్పోయిన విషయాన్ని కూడా అతి సామాన్యంగా తీసుకోగలిగింది. భరతుడు మేనమామ గారి యింటి నుండి వచ్చి తండ్రిగారు ఎక్కడ అని అడిగినప్పుడు ఆమె - అతి సామాన్య విషయం చెప్పినట్లుగా

**యా గతిస్సర్వభూతానాం తాంగతిం తేపితాగతః ।**
**రాజా మహాత్మా తేజస్వీ యాయజూకస్సతాంగతిః** అయోధ్య 15 - 12

ప్రాణులందరూ పోయేగతికి నీ తండ్రి మహారాజు కూడా పోయాడు అంటుంది.

భరతుడు దుఃఖతీవ్రతతో తల్లి చేసిన కృత్యానికి విలవిలలాడిపోయాడు. తనకు రాజ్యం వద్దన్నాడు. స్వయంగా వెళ్ళి రాము ణ్ణి తీసుకొస్తానని తల్లిని అనేకవిధాల నిందించాడు. రాజ్యకాంక్ష తనకు లేనే లేదన్నాడు. తల్లి చేసిన పనిని బహుధా నిందించాడు.

కోరికలు మురిసినప్పుడు మానవుడు ప్రవర్తించే తీరులో తగునిది తగదిది అనే ఆలోచనే ఉండదు. రాముడు అరణ్యవాసానికి వెళ్ళాలి. కాని సీత కూడా వెళ్ళాలని తాను కోరలేదు. అయినా ఆమె కూడా నారవస్త్రాలు కట్టుకోవాలని కైకకి నారచీరలు ఇచ్చిన సందర్భంలో వసిష్ఠాది ఋషులు కూడా ఆర్ద్రీభూత చేతస్కులయ్యారు. అంతఃపుర స్త్రీలు అశ్రువులు కార్చిన సందర్భమిది. కైక కాఠిన్య మనస్కతకు ఇది పరాకాష్ఠ.

భరతుని స్థిరనిశ్చయం విన్న తరువాత ఆమెలో మార్పువచ్చి భరతునితోపాటు చిత్రకూటానికి వచ్చిందామె. రామకథలో ఇంతగా నిందలు పొందిన స్త్రీ పాత్ర మరొకటి లేదు.

మంథర మాటలు ఆ స్త్రీ హృదయం మీద ఎంతగా ప్రభావితం చేసాయో గమనిస్తే ఎంతటి వాళ్ళకైనా 'ఆశ' పుడితే వాళ్ళ ప్రవర్తన ఎంత అసహ్యంగా ఉంటుందో కైక ప్రవర్తనే సాక్ష్యంగా నిలుస్తుంది. కైక రామకథను నడిపిన మహావ్యక్తి. కర్తవ్యోన్ముఖంగా నడిపిన మహానుభావురాలు.

రామకథలో పెద్దకార్యాలు చేసిన చిన్నపాత్రలు రెండు. రామకథా గతిని మలుపు తిప్పిన పాత్రలు అయోధ్యలో మంథర. అరణ్యంలో శూర్పణఖ. రాజ్యాన్ని పోగొట్టి అరణ్యమార్గం పట్టించింది మంథర. సీతనే దూరం చేయడానికి బీజం వేసింది శూర్పణఖ.

### 7.2.4 మంథర :

కైకతో ఆమె పుట్టింటి నుండి నమ్మినదాసిగా అయోధ్యకు వచ్చింది మంథర. కైకకు అత్యంత ఆప్తురాలు. పుట్టుకతో గూని నడ్డిగలది. మంథర తల్లిదండ్రులెవరో, ఏ ఊరిదో, ఎట్లా చేరిందో మొదలయిన వివరాలేమీ తెలియవు ఆమె విషయంలో. శ్రీరామపట్టాభిషేక వార్తతో ఊరంతా సందడిగా ఉండడం గమనించిన మంథర విషయం తెలుసుకొని పరుగు పరుగున కైక దగ్గరకు వచ్చింది. వస్తూనే 'ఉత్తిష్ఠమూఢే కింశేషే భయంత్వామభివర్తితే' తెలివిలేనిదానా ఏమిటి ఈ పడకలే. నీకిప్పుడు గొప్ప ఆపద తపముకు వస్తోంది. శ్రీరాముడికి పట్టాభిషేకం జరగబోతుంది అంటూ హెచ్చరించింది. కైక ఆ వార్తవిని శుభవార్తగా స్వీకరించి నా రాముడు రాజుకాబోతున్నాడా అంటూ ఎంత శుభవార్త చెప్పావు మంథరా ! అని విలువైన ఆభరణాన్ని విసిరి కొట్టింది. "పిచ్చిదానా ! ముసలిరాజు అభిమానమంతా నీదగ్గరే ఉందనుకొని మురిసిపోతున్నావు. వెర్రిదానా - మాటలిక్కడ, మూటలక్కడ. తెల్లవారితే నీ సవతి కౌసల్య రాజమాత కాబోతుంది. దానితో నీవు ఆమెకు దాసివి. వాళ్ళు నీకొడుకుని కూడా బ్రతకనిస్తారని అనుకోను. ఎప్పటికయినా రామునికి భరతుని వల్లనే ప్రమాదం. నీకొడుకు లేని సమయంలో రామునికి రాజ్యాన్ని అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయంటే దీనిని మించిన ప్రమాదం ఇంకేముంటుంది తల్లీ "అని ఏడుస్తూ కైక మనస్సు మీద విషయం గాఢంగా నాటుకునే విధంగా మాట్లాడిన మహావక్త మంథర. మంథర మాటల పందిరిలో కైక బిగుసుకుపోయింది. భయం, కోపం, పగ, ప్రతీకారం అన్నీ ఆమెను ఆవేశపరచాయి. ఈ ప్రమాదం నుండి బయట పడే మార్గం చెప్పమని మంథరనే అర్థించింది కైక. అంతఃపుర కార్యక్రమాలలో దాసీలు ఎంతటి కార్యక్రమాలు చెయ్యగలరో, చక్రమెలా తిప్పగలరో వాల్మీకి ఈ ఘట్టంలో స్పష్టం చేసాడు. కర్తవ్యోపదేశం చేసిన ఆ మంథర కైకకు మార్గనిర్దేశం చేసింది. ఏనాడో దశరథుడు ఇచ్చిన వరాల విషయం గుర్తు చేసింది.

ఆ వరాలు అడగడంలో ఎలా వ్యవహరించాలో కూడా బోధించింది. మొదటివరం - భరతునికి ఈ పట్టాభిషేకం జరగాలి. రెండోది రాముడు పదునాలుగేళ్ళు అరణ్యాలకు వెళ్ళాలి అని చెప్పింది.

మంథర మాటల తీరుకు ఆ ప్రణాళికకకు దాసోహం అందికైక. మానవులలో అందులో స్త్రీల మానసిక దౌర్బల్యం తన సంతానానికి కీడు జరుగబోతుంది అంటే ఏవిధంగా స్పందిస్తుందో తెలిసిన మహిళ మంథర. రాజు వస్తే ఎలా నడుచుకోవాలో సోదాహరణంగా వివరిస్తుందామె.

అమ్మా ! రాజు నీ వేషము, రూపము మార్చుకో. కోరిక కనుగుణంగా వేషబాషలుండాలి. వెలగల దుస్తులు వేసుకొని బిచ్చానికి వస్తే వానికెవ్వరూ పిడికెడు ముష్టివెయ్యరు. కనుక మాసిన చీర కట్టుకో, ఆభరణాలు పీకిపారేయ్, చింపిరి తలతో ఉండి నీ కోప గృహంలోకి పోయిపడుక్కొనినట్లు నటించి ఈ మహానాటకమాడి కార్యాన్ని సాధించు. నేను నీ ప్రక్కప్రక్కనే ఉండి చూస్తూ ఉంటాను" అని చివరి ఉపదేశ వాక్యాలు బోధించి రామాయణ కార్యక్రమాన్ని నిర్వహించింది మంథర.

## 7.2.5 తార :

కిష్కింద రాజ్యంలో తన ప్రతిభతో ప్రకాశించిన తార తార. స్త్రీలలో రాజ్యవ్యవహార కోవిదులు ఉండడం అరుదు. తార రాజనీతి చతుర, ఉచితజ్ఞురాలు. జ్ఞాన సంపన్నురాలు. దీర్ఘదర్శి. వివేకవతి. అంతేకాదు ఆమె గుణగ్రాహిణి. సహృదయ కూడా.

సుగ్రీవునితో రెండోసారి తలపడడానికి సిద్ధపడుతున్న వాలితో తార వివరించిన విషయాలు ఆమె శీలానికి అద్దంపడుతున్నాయి. సుగ్రీవుడు ఇంతకు ముందే వాలిచేత చావుదెబ్బలు తిని ప్రాణమాత్రావశిష్టుడై పారిపోయి, తిరిగి అప్పుడే వచ్చాడు అంటే ఏదో విశేషమైన కారణం ఉండే ఉంటుంది అని ఊహించింది తారాదేవి. అంతేకాదు అంతకు పూర్వమే తన పుత్రుడైన అంగదుని ద్వారా శ్రీరామచంద్రుని బలపరాక్రమాలు విని ఉంది. అతడు అసాధారణ పురుషునిగా గుర్తించింది. తన భర్తను ఈ సందర్భంలో హెచ్చరించాలి. తన భర్తను రక్షించుకోవాలని ఆమె ఎంతో సోపపత్తికంగా వాలితో మాట్లాడిన మాటలు తారపాత్రను తారాపథంలో నిలబెడతాయి.

**"రామఃపరబలామర్దీ యుగాంతాగ్ని రిపోత్థితః**
**నివాసవృక్షసాధూనాం ఆపన్నానాం పరాగతిః ॥**
**ఆర్తానాం సంశ్రయశ్చైవ యశసశ్చైవ కభాజనమ్**
**తత్క్షమో నవిరోధస్తే సహతేన, మహాత్మనా**
**దుర్జయేనాఽప్రమేయేణ రామేణ రణకర్మసు ॥** కిష్కింద - 15 ।- 18,19, 21.

"రాముడు శత్రుబలాన్ని దగ్ధమొనరించడానికి యుగాంతాగ్నిలా ఉదయించాడు. అతడు సాధువులకు, ఆపన్నులకు ఆప్తులకు శరణ్యభూతుడు. పరమ యశస్సంపన్నుడు. అట్టి వానితో నీకు విరోధం తగదు. అతడు మహాత్ముడు. రణకర్మలలో అజేయుడు. అప్రమేయబల సంపన్నుడు. ఇక సుగ్రీవుని విషయానికివస్తే అతడు నీకు అనుంగు సోదరుడు. నీవు లాలించదగినవాడు. పాలించదగినవాడు కూడా. అతడు ఎక్కడవున్నా నీకు సోదరుడే గదా ! నీకు అలాంటి బంధువు ఈ లోకంలో మఱొకడు లేడు. అతడికి యౌవరాజ్యాభిషేకం చెయ్యి. దాన, మానాది సత్కారాలతో అతణ్ణి సన్నిహితుణ్ణిగా చేసుకో. అతనితో వైరాన్ని ఒదిలిపెట్టు" అంటూ చక్కని హితవు చెప్పింది. తార హితవు వాలి పాటించి ఉంటే రామ కథా స్వరూపం వేరుగా ఉండేది.

తార పరేంగితజ్ఞాన చతుర అని వాలికి తెలుసు. భార్యలోని ఈ సామర్థ్యాన్ని గమనించి గౌరవించిన వాడుకోవాలి. మరణాసన్నుడై సుగ్రీవునితో సంభాషించే తరుణంలో వాలి తార ఔన్నత్యం గురించి ప్రత్యేకంగా వివరిస్తాడు. ఆమె చెప్పినట్లు నడుచుకుంటే మేలు జరుగుతుందంటాడు.

**సుషేణ దుహితా చేయమర్థసూక్ష్మవినిశ్చయే**
**ఔత్పాతికే చవివిధే సర్వతః పరినిష్ఠితా।**
**యదేషా సాధ్వితి బ్రూయాత్ కార్యంతన్ముక్త సంశయం**
**నహితారామతం కించి దన్యథా ప్రవర్తతే ॥ 4 కా. 22సం. 13, 14 శ్లోకం.**

"తార సుషేణుని పుత్రిక. సూక్ష్మార్థాలను నిశ్చయించి ఇది ఇట్లు అని నిశ్చయంగా చెప్పగలది. రాబోవు అనర్థాలను ముందే పసికట్టి చెప్పగలదు. ఉత్పాతాలను ముందుగా గుర్తించే నేర్పుగలది. సర్వసమర్థురాలు. ఈమె ఏది మంచిది అని చెప్పునో ఆ పనిని సంశయింపక చేయుము. తార మంచిది అని చెప్పి నిర్ధారించిన పని ఎన్నడూ అనర్థము కల్గించదు అంటూ నేటి తన స్థితికి తారహితవు వినకపోవడమే కారణం అనే విషయాన్ని ధ్వని పూర్వకంగా అందిస్తాడు.

## 7.2.6 శూర్పణఖ :

శూర్పణఖ రావణుని చెల్లెలు. రామాయణంలో పెద్దకార్యాలు నిర్వర్తించిన చిన్న పాత్రలలో ఈమె ఒకతె.

పంచవటిలో సీతారామలక్ష్మణులు పర్ణశాల నిర్మించుకొని నివసిస్తూ ఉండగా యాదృచ్ఛికంగా శూర్పణఖ అటుగా రావడం-సీతారామ లక్ష్మణులను చూడడం - రామదర్శనంతో కామమోహితం కావడం క్షణంలో జరిగిపోయింది. రాముణ్ణి వివాహం చేసుకోమనడం - రాముడు కాదనడం, లక్ష్మణుడు కూడా తిరస్కరించడంతో. సీతే అడ్డుగా వుంది అనే ఉద్దేశ్యంతో ఆమెను మ్రింగబోయిన శూర్పణఖ ముక్కూచెవులూ కోసాడు లక్ష్మణుడు. దానితో తీవ్రపరాభవంతో అన్న రావణుని చేరి సీతాపహరణానికి దోహదం చేసింది. స్త్రీకి పరాభవం కలగడంతో మరో స్త్రీ పైన ఆ కోపానికి పగతీర్చుకోవడంగా మారింది. స్త్రీ తల్చుకుంటే సాధించలేదనే రీతిగా రావణుణ్ని పురికొల్పింది ఆమె ఎంతో నేర్పుతో.

ఈ సందర్భంలో విశ్లేషించుకోవలసిన విషయం వలచివచ్చిన కాంతను తిరస్కరించడంలో తప్పులేదు. కానీ ఆమె ముక్కు చెవులు కోయడంలో ఆ అన్నదమ్ముల దృష్టి సమర్థనీయమా ? స్త్రీని ఇంత తీవ్రంగా దండించడం పురుషాధిక్య ప్రపంచానికే చెల్లుతుంది అనేది సత్యం.

## 7.2.7 మండోదరి :

ప్రతి నాయకుడైన రావణుని పట్టమహిషి మండోదరి. తారవలె ఈమె కూడా జ్ఞానసంపన్న, గుణగ్రాహిణి. తన భర్తలోని లోపాలను గమనించి హెచ్చరించింది. అతని ప్రవర్తన ధర్మబద్ధమూ కాదని స్పష్టం చేసిన ఇల్లాలు. అతని అధర్మము వల్లనే అతడు నశించాడని నమ్మినది. శ్రీరామచంద్రునితో వైరమువలదని భర్తను పదేపదే హెచ్చరించినది. అతడు మరణించినప్పుడు

**క్రియతా మవిరోధశ్చ రాఘవేణేతి యన్మయా**
**ఉద్యమానో నగృహ్ణాపి తస్యేయం వ్యుష్టిరాగతా !** యుధ - 111 స - 16

"రాఘవునితో విరోధము మానుము అని ఎంతగా చెప్పినా వినిపించుకొనకపోతివి. దానికి ఫలమిపుడు సంప్రాప్తిమైనది" అనుకుంటుంది.

రాముని దివ్యత్వాన్నేకాక, సీతాపతి వ్రతాన్ని కూడా పరమ గౌరవభావంతో అభివర్ణించిన మానిని మండోదరి. సీత పాతివ్రత్యము వలననే రావణుడు సపరివారముగ దగ్ధమైనాడని ఆమె విశ్వాసము. రాముని కోపము కంటే సీత పాతివ్రత్యమే ప్రకృష్టమైనదని ఆమె తలంపు. సీతాసాధ్విని మండోదరి దర్శించిన విధానం పరమ పవిత్రమైనది.

**"పతివ్రతాయాస్తపసానూనం దగ్ధోఽపిమేప్రభో**
**సీతా నిమిత్తడో మృత్యు స్త్వయాదూరా దుపాహృతా ॥**
**పతివ్రతానాం నాక స్మాత్పతంత్య శ్రూణి భూతలే।**
**అరుంధత్యా విశిష్టాం తాం రోహిణ్యా శ్చాపి దుర్మతే**
**సీతాందర్షయతా మాన్యాం త్వయా హ్యసదృశుకృతమ్** యుద్ధ - 11.1. సర్గ

"పతివ్రత యొక్క తపముచే హే ప్రభో నీవు భస్మమై పోతివి. సీతమూల ముగదూరముగనున్న మృత్యువు దగ్గఱకు వచ్చినది.

పతివ్రతల యొక్క కన్నీటి బిందువులు హఠాత్తుగా క్రిందపడరాదు.

అరుంధతీ - రోహిణుల కంటే కూడా విశిష్ఠురాలును మాన్యయును అగు ఆమెను ధర్షణము చేసి చాలా దుర్మార్గముగ ప్రవర్తించితివి'.

భర్త తప్పును నిర్భయంగా వెల్లడించిన భార్య మండోదరి. తోటి స్త్రీ శక్తిని ఇంతగా అభినందించగలిగిన స్త్రీ మండోదరి. మండోదరి ఒక విశిష్టమైన వ్యక్తిత్వము గల మహారాణి మండోదరి.

### 7.2.8 సీత :

వాల్మీకి మహర్షి తన కావ్యానికి రామాయణము అనే పేరుతోపాటు 'సీతాయాశ్చరితం మహత్' అని కూడా సంభావించి కావ్యనాయకుడైన రామచంద్రుని చరిత్రతో సమానమైన ప్రాధాన్యాన్ని కావ్యనాయిక అయిన సీతాదేవికి కూడా ఇచ్చి గౌరవించాడు.

దేవదుర్లభమైన శీలవృత్తాలతో సీత రామాయణంలో ప్రకాశిస్తుంది. అందుకే ఆమెను వాల్మీకి 'స్త్రీ రత్నం రత్నభూషితా' అనీ, 'వరిష్ఠా సర్వనారీణా మేషా చదివిదేవతా' అని వర్ణించాడు.

రామాయణాన్ని అధ్యయనం చేసిన పెద్దలందరూ సీతాదేవి భారత నారీలోకానికి గర్వకారణమన్నారు.

అసాధారణ ప్రాతివ్రత్యం, త్యాగనిరతి, నిర్భయత్వం, శాంతి, క్షమ, సౌహార్ద, సహన శీలత్వ, ధర్మపరాయణత్వ, నమ్రత, సంయమ, సేవ, సదాచార, వ్యవహారపటుత్వ, సాహస శౌర్యాది గుణాలన్నీ ఏకస్థానంలో విశ్వమహేతిహాసాల్లో ఏ స్త్రీలోనూ లభించకపోవచ్చు. సీతాదతేవిలో ఈ ఉత్తమ గుణాలన్నీ రాశీభూతమై ప్రకాశిస్తున్నాయి.

ఈ సందర్భంలో స్వామి వివేకానందుని వాక్యాలు తప్పక అనుసంధించుకోవలసి ఉంది.

"ఏ దేశపు వాఙ్మయము నైనను శ్రీరామచంద్రుని వంటి పురుషోత్తములు లభించిన లభింపవచ్చునేమో గాని, సీత వంటి ఆదర్శ చరిత్ర యగు పతివ్రతా తిలకము లభించుట దుర్లభమనిన అతిశయోక్తి కానేరదు'.

వాల్మీకి మహర్షి సీతాదేవి శారీరక మానసిక సౌందర్యాలను అన్యూనాతిరిక్తంగా చిత్రించి తన పాత్రనిర్మాణ దక్షతను నిరూపించుకున్నాడు.

సీతారాములు జీవించిన త్రేతాయుగము నాటికి ఉత్తమ ధర్మాలుగా భావింపబడిన వాటిని ఆచరించడంలో ఆ భార్యాభర్తలు కృతకృత్యులయ్యారు. ఆనాటి ధర్మాలను ఈనాటి భావజాలంతో పోల్చిచూసి విలువ కట్టడం విమర్శన పద్ధతి కాదు. కాబట్టి ఆనాటికి ఏనాటికీ ఆచరించుకోవలిసినవి, ఆదర్శప్రాయమైనవి అయిన ధర్మాలను సీత ఆచరించింది. అను సందించుకోవలసి వుంది పాఠకులు. సార్వకాలికము సార్వజనీనము అయిన ధర్మాల్లో భార్యాభర్తలు కష్టసుఖాల్లో ఏకమై ఉండి జీవయాత్ర సాగించడం

భారతదేశమే కాదు ఏదేశంలోనైన దాంపత్యధర్మం అదే. దంపతులు పరస్పరం ఒకరినొకరు గౌరవించుకుంటూ, ప్రేమించుకుంటూ అన్యోన్యంగా ఉంటే ఆ దేశం సౌభాగ్యవంతమై శాంతి సౌఖ్యాలతో నిండి ఉంటుంది.

సీతాదేవి జ్ఞానసంపన్న. జరుగుతున్న విషయాలను ఆమె నిశితంగా పరిశీలించగల శక్తియుక్త. ఆమె విచక్షణా బుద్ధి అడుగడుగునా వ్యక్తమవుతూనే ఉంటుంది. అయితే కొన్ని సందర్భాల్లో ముఖ్యంగా భర్త క్షేమానికి సంబంధించిన, ఆపదల్లో ఉన్నాడేమో అనిపించినప్పుడు ఆమెలోని ఆందోళన ఔచిత్య భావాన్ని దూరం చేయడం కూడా సహజమే అనిపిస్తుంది.

## 7.2.9 సకర్తవ్య నిశ్చయం :

భారతదేశంలో స్త్రీకి భర్తే సర్వస్వమనే భావనతో నిండి ఉంది. సీత కూడా ఆ భావాన్ని గుండె నిండా నింపుకుంది. అందుకే పట్టాభిషేకం కాబోతున్న తరుణంలో అకస్మాత్తుగా వనగమనం ప్రాప్తించినప్పుడు ఆ విషయాన్ని రాముడు సీతతో చెప్పగానే సీత స్వకర్తవ్యాన్ని క్షణంలో నిశ్చయించుకుంది ధీరయై.

**సపితినాత్మజోవాత్మా నమాతా నసఖీజనః**
**ఇహప్రేత్యచనారీణాం పతిరేకో గతిఃసదా ॥**
**యదిత్వం ప్రస్థితోదుర్గం వనమద్యైవ రాఘవ**
**అగ్రతస్తే గమష్యామి మృద్గన్తీ కుశకంటకాన్ ॥** అయోధ్య - 27/6-7

ఇహంలోనూ, పరంలోనూ కూడ స్త్రీకి ఆశ్రయం ఇచ్చేవాడు భర్తే. తండ్రి, పుత్రుడు, తల్లి, సఖులు చివరకు స్వశరీరం కూడా ఆమెకు యదార్థమైన సహకారాన్ని అందించలేదు. నేను మీతో కూడా దుర్గామారణ్యాల వైపు ప్రస్థానించి మీ దారిలో ఉండే ముళ్ళను రాళ్ళను ఏరివేసి మీ ముందు పురోగమిస్తాను. మీ మార్గాన్ని నేను సుగమం చేస్తానంది".

అరణ్యావాసం అంటే భయపడలేదు సరికదా, ఆ కుశకంటకా వృతమైన మార్గంలో తాను ముందు నడిచి ఆ బాటను శుభ్రంచేసి సుఖప్రదం చేస్తానంటుంది సీత. స్త్రీ జాతికి గల ధైర్యసాహసాలకు సీతమ్మ ఈ నిర్ణయం చక్కని ఉదాహరణం.

అయితే అదే సందర్భంలో సీతను అరణ్యాలకు తీసుకువెళ్ళడానికి రాముడు సుముఖంగా లేడు. ఎన్నో కారణాలు చెప్పి ఆమె రాకను నివారించడానికి విశేషప్రయత్నం చేసాడు. ఆ సందర్భంలో సీత ఎన్నో విధాల నచ్చచెప్ప ప్రయత్నించింది. రాముడు ఎప్పటికీ అంగీకరించ లేదు. అప్పుడామె ఏ మాటవల్ల పురుషునిలో పౌరుషం ప్రజ్వరిల్లుతుందో ఆ మాటను సమయానుకూలంగా ప్రయోగించింది.

**"కింత్వాఽమన్యన వైదేహః పితామే మిథిలాధిపః**
**రామంజామాతరం ప్రాప్యస్త్రియం పురుష విగ్రహమ్ ॥**
**అనృతంబత లోకాఽయమ జ్ఞానాద్యద్ది వక్ష్యతి**
**తేజోనాస్తిపరం రామేతపతీతదివాకరే ॥** అయోధ్య - 30 - 3,4

"మిథిలాధిపతి అయిన నా తండ్రి పురుషాకృతిలో ఉన్న స్త్రీ స్వరూపుడయిన నిన్ను అల్లుడుగా పొంది నిన్ను గూర్చి ఏమి అనుకొనునో తెలియదు, కానీ పాపమీలోకము మధ్యందిన మార్తాండుని యందల తేజము వలె శ్రీరామచంద్రునిలో కూడా పౌరుషం ఉందని అజ్ఞాతము వల్ల చెప్పుకొంటున్నది".

ఇంత తీవ్రముగా పలికినగాని పని జరగదు అని గ్రహించిన ఇల్లాలు సీత. ఈ మాటలో భర్త మనస్సు నొప్పించానేమో అనే ఆవేదనతో "నీతో కూడా ఉండడమే నాకు స్వర్గము. నిన్ను విడిచి ఉండడం నాకు నరకం. కాబట్టి నా ప్రేమను గమనించి నన్ను కూడా నీతో తీసుకువెళ్ళు" అని అభ్యర్థించింది.

సమయోచిత సంభాషణా చతురసీత. అరణ్యవాస కాలంలో రాముడు దండకారణ్యంలో అకారణహింసకు పూనుకొన్న రాక్షసులను సంహరిస్తానని అక్కడి మహర్షులకు మాట ఇస్తాడు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని సీత కొన్ని హితవచనాలు పలుకుతుంది. రామా ! క్షాత్రవృత్తిని త్యజించి మౌనవృత్తిని అవలంబించి అరణ్యానికి వచ్చాము మనం. ఇప్పుడు మళ్ళీ క్షాత్రవృత్తిని స్వీకరించడం సబబుకాదు. శస్త్ర సంయోగం అగ్ని సంయోగంవలె నాశనం చేయవచ్చు. శస్త్రసన్యాసం చేయడం మంచిది. శాంతజీవనం చేయడం ఉత్తమం అంటూ ఒక కథ చెప్పిసోదహరణనిరూపణం చేస్తూ ప్రసంగిస్తుందామె. ఆ ప్రసంగములో ఆమె సూక్ష్మబుద్ధి, వాక్పటుత్వము, అనితర సాధ్యమైనది. ఆ విషయ ప్రతిపాదన కూడా -

**'స్నేహాచ్చ బహుమానాచ్చ స్మాత యేత్వాంన శిక్షయే"**

"నేను నీ యందలి స్నేహము వలన ఆదరము వలన నీకీ విషయాన్ని గుఱుతు చేసానుకానీ, నీకు తెలియని విషయము తెలియచెప్పటం లేదు'' అంటుంది వినయంగా.

సీతాదేవి ఉత్తమ గృహిణి. సహిష్ణుత్వం ఆమెకు పెట్టని సొమ్ము. అత్తమామల యెడ ఆమె భక్తి కలగిఉండడం ఒక ఎత్తు. మఱుదులందరు ఆమెను దేవత వలె గౌరవించడం మరొక ఎత్తు.

**"త్రయాణాం భరతాదీనాం భాతౄణం దేవతాచయా"**

అతిధి సేవలో ఆమె నిమగ్నమై ఉండేది. అరణ్యవాస కాలంలో కూడా అతిధి సేవలోనే ఆమె రావణుని మోసానికి గురిఅయినది.

రావణుడు రావణుడుగా దర్శించినప్పుడు ఆమె అతనితో సంభాషించిన సందర్భాలలో సీత ఎంతటి ధీరురాలో స్పష్టమవుతుంది. నిర్భయత్వం ఆమెకు నిసర్గ భూషణం.

అసామాన్య పరాక్రముడైన రావణుని పరాక్రమాన్ని విని దేవతలు కూడా భయపడిపోతూ ఉండగా, అతనిచేత బంధింపబడిన సీత మాత్రం అతణ్ణి తిరస్కరించే విధానం విశేషమైనట్టిది.

**"త్వంపునర్జమ్బుకః సింహీ మామహేచ్ఛసి దుర్లభమ్ ।**
**నాహం శక్యాత్వయా స్పష్టుమాదిత్యస్య ప్రభాయథా ।"**

"నీవు నక్కవు, నేను ఆడ సింహాన్ని. సర్వథానీకు నేను దుర్లభినే. అయినా నువ్వు నన్ను పొందాలనుకొంటున్నావా ? సూర్యప్రభను ఎవడూ స్పృశింపజాలనట్లే నువ్వు నన్ను స్పృశించలేవు అంటుంది నిర్భయంగా అరణ్యకాండలో. సుందరకాండలో రావణునకు ఆమె శ్రీరామశౌర్య పరాక్రమాలను వివరించిన తీరు, రావణునకు చేసిన హితబోధ ఆమె వాక్చాతుర్యానికి నిలువుటద్దాలు. రాముని ఆదేశము లేదు కనుక నిన్ను ఉపేక్షిస్తున్నాను. లేకపోతే నిన్ను భస్మచేయగలిగేదాన్నే.

**'అసంతేశాత్తు రామస్య తపసశ్యాను పాలనాత్**
**వత్వాంకార్మి దశగ్రీవ భస్మభస్మార్హ తేజసా ॥** (5 - 22) అంటుంది ధృఢంగా. ఆమెలోని ఈ దృఢత్వం ఏ ప్రలోభానికి లొంగనట్టిది. స్వధర్మం ప్రకారం నిలువగల మానిని ఆమె.

రావణుడు అనేక పర్యాయములు శ్రీరాముని గురించి కఠోరంగా భాషించినా, శ్రీరాముని మాయా శిరస్సును చూపెట్టినా ఆమె ధర్మాచ్యుతికి అంగీకరించలేదు. లంకా నగరంలో నిరంతరం సీతకు భయప్రలోభాలు చూపెట్టి అనేక విధాల వేధించారు రాక్షసాంగనులు. అయినా ఆమెతొణక లేదు బెదరలేదు. ఆధీరోదాత్తత సీతామహా సాధ్వి సొత్తు.

సీతలో గల మరో మహత్తమ గుణం క్షమ. ఆమె క్షమాశీలి. ఇంతగా వేధించిన రాక్షసాంగనల మీద ఆమె చూపిన వాత్సల్యం తులలేనిది. రావణ వధానంతరం శ్రీరామ విజయ వార్తను సీతకు వివరించాడు హనుమ. ఆ సందర్భంలో హనుమ

రామ సందేశాన్ని రామపత్నికి వినిపించి మాతా ! నిన్ను గద్దించి భయపెట్టి కష్టపెట్టిన దుష్టరాక్షస స్త్రీలను నేనిప్పుడు అంతం చేయాలనుకొంటున్నాను. నాకు అనుమతి ప్రసాదించు తల్లీ ! అంటాడు. నిజానికి అప్పుడు సీత సరే అంటే రాక్షసాంగనలందరూ హతులై పోయేవారు. కానీ సీత అపార కరుణాధురీణ కావడంతో ఆ పనికి అంగీకారం తెల్పకపోగా వారి స్థితి ఎట్టిదో వివరిస్తుంది వివేక సౌరభంతో. ఆ మాటలు విందాం.

**'విధేయానాంచ సీనాంకః కుప్యేద్వానరోత్తమ**
**భాగ్యవైషమ్యదోషేణ పురస్తాద్దుష్కృతే నచ ॥**
**మయ్యైతత్ప్రాప్యతే సర్వం స్వకృతం హ్యుపభుజ్యతే ।**
**నైంవం వద మహాబాహు దైవీహ్యేషా పరాగతిః ।**
**పాపానాంవా శుభానాంవా వధార్హాణామథాపితా**
**కార్యం కారుణ్య మార్యేణ న కశ్చిన్నాపరాధ్యతి ॥ (యుద్ధ 113 - 39, 43, 45**

వానరోత్తమా ! అన్యుల ఆజ్ఞలను పాలించేదాసీలపై కోపగించే మూర్ఖులెవరుంటారు ? మానవమాత్రుడు కర్మఫలాన్నే అనుభవిస్తాడు. ఈ స్థితి నాకు పూర్వజన్మ కర్మఫలం వల్లనే సంభవించింది. ఇదంతా విధి లీలయే. ఇందులో పరుల దోషమెంత మాత్రం లేదు. కనుక నీవు రాక్షసాంగనలను అంతం చేసే ప్రసక్తి తీసుకురాకు, పాపి అయినా, ధర్మాత్ముడైనా, వధింపతగిన అపరాధియే అగుగాక! మానవుడు అందరి యందూ దయ చూపవలసినదే' ఎందుకంటే అపరాధాలు చేయని వాడంటూ ఎవరూ ఉండరు'' అంటూ లోకవృత్తాన్ని విశ్లేషిస్తుంది సీత.

ఇంత ఉదాత్తర సాన్వితంగా వ్యవహరించిన సీతలో కూడా స్త్రీ స్వభావ సహజమైన కొన్ని బలహీనతలు లేకపోలేదు.

బంగారు లేడి వెంట వెళ్ళిన రాముడు ఆ మాయలేడిని సంహరించగా అది ప్రాణాలు వదులుతూ 'హా సీతా ! లక్ష్మణా! అంటూ రాముని కంఠధ్వనిని అనుసరించి పెద్దగా అరిచాడు. ఆ కేకలకు సీత భయపడి ఆందోళనతో లక్ష్మణుని రామసహాయార్థం వెళ్ళమంటుంది. జరిగిందంతా రాక్షసమాయ అని లక్ష్మణుడు చెప్పినా ఆమె నమ్మదు. సీతను ఒంటరిగా వదలవద్దు అన్న ఆజ్ఞకు బద్ధుడై లక్ష్మణుడు కదలడు. ఆ సందర్భంలో సీత మానసిక సంతులనాన్ని కోల్పోతుంది. అతని శీలవృత్తాలను శంకిస్తూ నిందిస్తుంది. భర్త ఎడల గల అనురాగం - తమ్ముడు సకాలంలో తాను ఆశించినట్లు స్పందించకపోవడంతో ఆమె లక్ష్మణుని తీవ్రంగా నిందిస్తుంది. లోక సాధారణమైన పురుష ప్రవృత్తి లక్ష్మణునిలోకూడా ఉందేమో అనే భావన ఆవేశించడంతో సీత ఆలోచనాలోచనలు మూసుకుపోయాయా అనిపించే ఘట్టమిది.

ఓ లక్ష్మణా ! నీవు నీ అన్నకు మిత్రుని రూపంలో ఉన్న శత్రువులా కనబడుతున్నావు. కాకపోతే ఇంతటి కష్టదశలో ఉన్న అన్నను రక్షించాలనే ఆత్రమే నీలో కనబడటం లేదు. నువ్వు కదలవేమి. నీ అన్న చనిపోయిన తరువాత నన్ను వశపరచుకొనవలెనని కదలడం లేదులా ఉంది . . .'' అంటుంది. ఆ తీవ్రత ఓ అనార్యుడా ! అ కరుణారంభా, వృశంసా, కుల పాంశనా ! నీవు రామునికి కష్టాలు రావడం చూచి మనస్సులో సంతోషిస్తూ ఉండవచ్చు. అందులో ఆశ్చర్యమేముంది. జ్ఞాతివికదా ! నా కోసమే దుష్టబుద్ధితో రాముని వెంటబడి ఉంటావు. లేదా ! భరతుడే నా కోసం నిన్ను పంపి ఉండవచ్చు. కాని శ్రీరామచంద్రుని వంటి మహాపురుషుని భర్తగా బడసిన నేను మీలో ఎవ్వరినీ కామించనని స్పష్టముగా చెప్తున్నాను. నీ ఎదుటనే నేను ప్రాణాలు తీసుకొందును'' అంటుంది.

ఒక స్త్రీ పురుషుని చర్యలను, మనస్సును ఏవిధంగా విశ్లేషించుకోవలసిఉందో, పురుష స్వభావం సాధారణంగా ఏవిధంగా ప్రవర్తిస్తుందో ఎదిగిన మహిళామణి సీత. ఉత్తముడైన లక్ష్మణుడు విషయంలో సీత ఇలా నిందించడం తప్పుగా కనిపించవచ్చుగానీ, పురుష స్వభావ విశ్లేషణలో సీత ఎంతో లోతుగా ఆలోచించి ఆ మాటలు అందో, కుటుంబాల్లో సంబంధ బాంధవ్యాలు ఎలా వక్రబుద్ధి మార్గం పడుతుంటాయో సీత చాలా సునిశితంగా ఆలోచించింది అనడంలో అతిశయోక్తి లేదు.

పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీ తన జీవితాన్ని తాను ఎన్ని కోణాల నుండి ఆలోచించుకొని జాగ్రత్తపడాలో సీతాదేవి ఈ మాటల వల్ల స్పష్టపడుతుంది. స్త్రీల కోణం నుండి ఆలోచించినప్పుడు ఈ సందర్భంలో సీత కొంత మానసిక ఆందోళనకు గురియైనా పరిశీలించడంలో జాగ్రత్త వహించింది అని చెప్పుకోవలసి ఉంది. సీతాదేవికి తన అత్తగారైన కౌసల్య ఎడలగల గౌరవాదరాలు విశేషమైనవి. తనకు వచ్చిన ఆపద కంటే కౌసల్య పొందిన ఆపదే తీవ్రమైనది అనుకునే సహృదయురాలు ఆమె. శ్రీరాముని మాయశిరస్సును విద్యుజ్జిహ్వుని ద్వారా సీత ఎదుట ప్రదర్శింపచేసాడు రావణుడు. ఆ శిరస్సును చూడగానే సీతకు కైక గుర్తుకువచ్చింది. వెంటనే 'న కామాభవ' అనుకుంది. 'నీ కోరిక తీరినదానవయ్యావు' అని మాత్రమే అంది. అంతకు మించి తీరినదానవయ్యావు అని మాత్రమే అంది. అంతకు మించి నిందించలేదామె. కానీ కౌసల్య ఆవేదనను తలచుకొని 'తపస్విని, దీనురాలు అయిన అత్తగారు కౌసల్యను గురించి ఆలోచించినప్పుడు కలిగిన దుఃఖం - శ్రీరామచంద్రుని గూర్చిగాని, మహారథుడైన లక్ష్మణుని గూర్చిగాని, నన్ను గూర్చిగాని నా తల్లిని గూర్చిగాని దుఃఖించను' . . . 'ఆమె కెంతటి విపత్తు వాటిల్లినది'' అంటూ ఆవేదన పడుతుందామె.

ఇంతటి ఉత్తమ గుణశోభిత అయిన సీత కోసం రాముడు ఎంతగానో విలపించాడు. లోకంలో ఏ భర్తా ఏ భార్య కోసమూ ఆక్రోశించనంతగా ఆక్రోశించాడు. తన భార్యను అపహరించిన రావణున్ని అతి ప్రయత్నపూర్వకంగా సంహరించాడు. అంతా సక్రమంగా సాగుతున్నదనుకుంటున్న సమయంలో సీతాదేవిని స్వీకరించడానికి సందేహించాడు. రాముని మనసులో మాటను విన్న సీతమ్మ ముందు విలవిల్లాడింది. అంతలోనే తనను తాను సంబాళించుకుని లక్ష్మణునితో చితిపేర్చమంది అతిధైర్యంగా. తన శీలంపై అసాధ్వీమణికున్న నమ్మకం అంత ధృఢమైంది. చితి ముందు నిలచింది గంభీరంగా.

**'యథామే హృదయం నిత్యం నా పసర్పతి రాఘవాత్**
**తథాలోకస్య సాక్షేమాం సర్వతః పాతుపావకః**
**యథామే శుద్ధ చారిత్రాం దుష్టాంజానాతిరాఘవః**
**తథా లోకస్యసాక్షీమాం సర్వతః పాతుపావకః 6 - 116, 25 - 26**

హే లోకసాక్షీ అగ్నిదేవా ! నా మనస్సు ఎన్నడైనా రామచంద్రుని నుండి మరలకుంటే నీవు సర్వవిధాల నన్ను రక్షించు. వాస్తవానికి నేను విశుద్ధ చరిత్రనే అయితే భ్రమవశుడై రామచంద్రుడు నన్ను దుష్టశీలగా భావిస్తే నీవు సర్వవిధాల నన్ను రక్షించు'' అంటూ అగ్నిప్రవేశం చేసింది. ఆ పతివ్రతా శిరోమణిని విశుద్ధ చరిత్రను అగ్ని కూడా తాకలేకపోయాడు. ఆమెను వెంటబెట్టుకు వచ్చి

**"ఏషా రామవైదేహీ పాపమస్యాంన విద్యతే**
**నైవ వాచానమనసానైవ బుద్ధ్యాన చక్షుషా . . ." 6 - 118- 5**

రామా ! ఇదిగో నీ సీత, ఈమెలో ఎట్టిపాపం లేదు. ఈ సతీమ తల్లి - మనసా, బుద్ధ్యా, వాచా, దృష్ట్యా ఎన్నడూ నీకు విపరీతంగా సంచరించలేదు.

**విశుద్ధభావాం నిష్పాపాం ప్రతి గృహ్ణీష్వ మైదిలీమ్**
**నకించి దభిధాతవ్యా అహమాజ్ఞాపయామతే - 6-118-10**

"ఈమె భావన విశుద్ధమైంది. సర్వదా ఈమె నిర్దోషురాలు. నీవు ఈమెను స్వీకరించు. ఈ విషయమై మరేమీ మాట్లాడవద్దు ఇదే నా ఆజ్ఞ అంటాడు తీక్ష్ణంగా.

రాముడు కూడా సీత పతివ్రతను నమ్మినవాడేకానీ లోకం కోసం ఈ పని చేయవలసి వచ్చిందన్నాడు. కాంతికి సూర్యునికి భేదం లేనట్లే నాకూ ఈమెకు అభేదం అన్నాడు. 'అనన్యాహి మయా సీతాభాస్కరస్య ప్రభాయథా' అంతటి నమ్మకం

గుండె నిండా కలిగినరాముడే లోకుల మాటలు విని సీతను త్యజించాడు. గర్భవతి అని కూడా ఆలోచించకుండా ! అయినా సీత కోపగించుకోలేదు. అపయశస్సుకు భయపడి త్యజించాడులే అనుకుంది. కానీ కుశలవులు జన్మించి వాల్మీకి నేర్పిన రామాయణం నేర్చుకొని ఆ సీతాతనయులు రాముని అశ్వమేథ యాగ సందర్భంలో రామకథాగానం చేస్తారు. ఆ బాల గాయకులు తన తనయులే అని తెలిసి - వాల్మీకిని సీతను కొలువుకు పిలిపించాడు రాముడు. వాల్మీకి మహర్షి వెంట సీత రాముని పిలుపును మన్నించి వచ్చింది వాల్మీకి మాటల్లో.

నేను వేలాది సంవత్సరాలు తపస్సు చేశాను. ఆ శక్తి శతోపథం చేసి చెబుతున్నాను. సీత దుష్టాచరణ కలదియే అయితే నాదీర్ఘకాల తపఃఫలం నాకు లభించకుండునుగాక. పాపరహిత, పవిత్రురాలు, ధర్మాచరణ యుక్తురాలు. లోకాపవాదానికి నువ్వు భయపడుతున్నావు కనుక ఈమె నీకు విశ్వాసాన్ని కలిగిస్తుంది'' అంటాడు. వాల్మీకి కూడా రాముని కోర్కె తీర్చడానికి సీత విశ్వాసాన్ని కలిగిస్తుందనే చెప్తాడు. అదే సమయానికి బ్రహ్మాది దేవతలందరూ వచ్చి నిలచారు. అప్పుడు రాముడు - "జానకి పవిత్రురాలని నాకుతెలుసు. కానీ అందరి సమక్షంలో సీత పవిత్రురాలిగా సువ్యక్తమైతేనే నేను ఆనందిస్తాను'' అన్నాడు.

ఆ మాటలు వింటూనే సీతాదేవిలో ఆత్మగౌరవం తలెత్తింది. మాట మాటకు మగవాని అనుమానానికి నమ్మకం కలిగించే అగ్నిపరీక్షలు చెయ&యడం వివేకం లేని పని అనిపించింది. అందుకే ఆ అభిమానవతి ఈసారి రాముని కోరికకు సమాధానం వేరుగా ఇచ్చింది. రాముని గౌరవానికి పట్టంకడుతూనే తన నిజాయితీని, పవిత్రతను నిలుపుకుంది.

'మనసా నేను రాముని వినామరెవరినీ తలచకుంటే భూదేవి నాకు తనలో స్థానమిచ్చును గాక. నేను మనసా, వాచా, కర్మణా రామునే పూజించియున్నచో పృథ్వీమాత నాకు దారిచూపును గాక ! రాముని మించినదేదీ లేదని పలికే పలుకు సత్యమే అయితే మాధవీదేవి తనలో నాకు స్థానమిచ్చునుగాక !'' **(7-97-14-16)**

భూమి జాత సీత భూదేవి తెచ్చిన సింహాసనం మీద ఎక్కి ఆమెతోబాటుగా భూమిలోనే కలిసిపోయింది. తన వ్యక్తిత్వాన్ని తాను నిలుపుకుంటూ అడుగడుక్కి అగ్నిపరీక్షలు కోరే పురుష ప్రపంచానికి చక్కని సమాధానం చెప్పిన మహిళామణి సీత.

**"స్వచారితాభి గుప్తాం తాంస్ప్రష్టు మర్హతి పావకః" - 5.55-26**

స్వచారిత్రాభి గుప్తయగు సీతాదేవిని అగ్ని దహించుట మాట అలా ఉంచి - స్పృశింపనైన స్పృశింపజాలడు.

## 7.3 మాదిరి ప్రశ్నలు :

1. రామాయణములోని స్త్రీ పాత్రలను పరిచేయం చేయండి.
2. సీతాయాశ్చరితమ్' అనే పేరు రామాయణమునకు తగియున్నదని నిరూపించండి.

## 7.4 ఉపయుక్త గ్రంథాలు :

| | | |
|---|---|---|
| 1. రామాయణం | - | వాల్మీకి |
| 2. శ్రీమత్ రామాయణ వైభవము | - | డా॥ మల్లాది గోపాలకృష్ణశర్మ |
| 3. అనుదిన రామాయణం | - | డా॥ పావులూరి పాండురంగారావు |

**- ఆచార్య కె. మలయవాసిని**

పాఠం - 8

# ఆధునిక సాహిత్యం - సామాజిక నేపథ్యం


8.1. ఉద్దేశం

8.2. పాఠం

8.2.1 స్త్రీల ఉద్యమం - అంతర్జాతీయ నేపథ్యం

8.2.2 స్త్రీల ఉద్యమం - జాతీయ నేపథ్యం

8.2.3 స్త్రీల ఉద్యమం - ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధిచెందిన జ్ఞానచైతన్యాలు

8.2.4 స్త్రీల ఉద్యమ చైతన్యం - తెలుగుసాహిత్యం

8.3. సారాంశం

8.4. నమూనా ప్రశ్నలు

8.5. సంప్రదించిన గ్రంథాలు.


## 8.1. ఉద్దేశం :

మహిళ జీవన సంస్కృతి అధ్యయనంలో భాగంగా ఆధునిక సాహిత్యాన్ని అవగాహన చేసుకొనటానికి సామాజిక పరిణామ క్రమంలో మారుతూ వచ్చిన స్త్రీ పురుష సంబంధ వ్యవస్థ గురించిన జ్ఞానం, పితృస్వామ్యం గురించిన సైద్ధాంతిక పరిజ్ఞానం మాత్రమే సరిపోవు. ఆధునిక సాహిత్యావిర్భావానికి కారణమైన ఆధునిక సమాజపరిణామాల గురించి తెలియాలి. ఆధునిక సమాజం కరుడుగట్టిన వ్యవస్థలను, విశ్వాసాలను ప్రశ్నిస్తూ లౌకిక హేతువాద దృష్టిని అభివృద్ధి పరుస్తూ సమాజంలోని భిన్న వర్గాల, మానవ సమూహాల ప్రయోజనాలను, సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ అభివృద్ధి చెందింది. ఆ క్రమం కొంత తెలిస్తే కానీ ఆధునిక సాహిత్య స్వభావం అర్థం కాదు. అదీ కాక ఆధునిక యుగ పరిణామాలు ఒక దేశానికి, ప్రాంతానికీ పరిమితమైనవి కావు. పారిశ్రామిక విప్లవం, వలస ఆర్థిక విధానం,సంస్కృతి ప్రపంచ దేశాలకు మధ్య ద్వారాలను తెరిచి భావ ప్రసారానికి కారణమైంది. తత్ఫలితంగా ఇక్కడ నుండి ఒక ఏ దేశ చరిత్ర అయినా ప్రపంచ పరిణామాలలో భాగంగా రూపొందటం అనివార్యం అయింది. స్త్రీ సమస్య గురించిన అవగాహనా పరిణామాలు కూడా ఇందులో భాగమే. మహిళల సమస్యలను భిన్న కోణాల నుండి భిన్న దృక్పథం నుండి వస్తువుగా చేసుకొని వచ్చిన ఆధునిక సాహిత్య అధ్యయనానికి ఈ అంతర్జాతీయ పరిణామాల గురించిన జ్ఞానం అవసరం కనుక స్త్రీల అభ్యుదయం కోసమైన ఉద్యమాలు అంతర్జాతీయ, జాతీయ, ప్రాంతీయ స్థాయిలలో ఏ స్వరూపస్వభావాలతో వికసించి, ఏ జ్ఞాన చైతన్యాలకు, భావప్రసారానికి దోహదం చేసిందో వివరించటం ఈ పాఠం ఉద్దేశం.

## 8.2. పాఠం :

స్త్రీల ఉద్యమం - అంతర్జాతీయ నేపథ్యం - పారిశ్రామిక విప్లవం ఆర్థికంగా ప్రపంచాన్ని ఏకం చేయటానికి నాందీ పలికితే ఫ్రెంచి విప్లవం అంతర్జాతీయ హక్కుల చైతన్యానికి, ప్రజాస్వామిక దృక్పధానికి నాందీ అయింది. అంతర్జాతీయంగా ఆధునిక యుగానికి తెరతీసిన ఈ ఫ్రెంచి విప్లవం 1789 లో వచ్చింది. ఫ్రెంచి సమాజంలో ఆర్థిక వనరుల మీద పెత్తనం విశేషాధికారాలు కల మతాచార్యుల భూస్వాములతో కూడిన శిష్టవర్గానికి, ఆర్థిక పరాధీనులైన సేద్యబానిసలతోపన్నుల భారంతో కృంగిపోయే రైతులతో ఆర్థికంగా కొంత బాగున్నా విశేషాధికారాలు లేని వ్యాపార ఉద్యోగ వర్గాలతో కూడుకొన్న సామాన్యులకు

మధ్య పెరుగుతున్న ఆర్థిక రాజకీయ వ్యత్యాసాలు , నిరంకుశ రాచరికం పట్ల వ్యతిరేకత, అస్తవ్యస్తమైన పాలనా వ్యవస్థపట్ల ఆగ్రహం ఫ్రెంచి విప్లవానికి దారితీసిన కారణాలు.

సంప్రదాయ సామాజిక రాజకీయ వ్యవస్థలపై విమర్శ, పూరాతన సంప్రదాయాలు ఆచారాలు , భావాలపై తిరుగుబాటు, హేతువుకు నిలవని మత విశ్వాసాల పట్ల వ్యతిరేకత, మానవహక్కుల చైతన్యం, స్వేచ్ఛా, సమానత్వం సౌభ్రాతృత్వ భావనల వ్యాప్తి ఈ ఫ్రెంచి విప్లవంలో కీలకాంశాలు.

రాజ్యపాలనలో మతాచార్యుల, భూస్వాముల ప్రమేయాన్ని తగ్గిస్తూ సామాన్యులు చొరవచేసి అధిక సంఖ్యాకుల అభిప్రాయం ప్రకారం చట్ట నిర్మాణం జరగాలని ప్రకటించటంతో **1789** జూన్ **17**వ తేదీన ఫ్రెంచి విప్లవానికి ప్రారంభం జరిగింది. దేశానికి రాజ్యాంగం తయారు చేయాలన్న అభిప్రాయం రాజును రాజ్యాంగానికి లోబరిచి పనిచేసేట్లు చేయాలన్న ఆలోచన బలంగా ముందుకు వచ్చింది. రాజ్యాంగ నిర్మాణం కోసం రాజ్యాంగ పరిషత్ కూడా ఏర్పడింది. దీనిని నిరోధించటానికి రాజు ఎంత బలప్రయోగం చేసినా ప్రజలు ఉమ్మడిగా దానిని వ్యతిరేకించారు. భూస్వామ్య వ్యవస్థను, బానిసవ్యవస్థను, వర్గ ఆధిక్యతను రద్దుచేస్తూ, రాజుకు, భూస్వామ్య మతాధికారులకు వున్న విశేష హక్కులను రద్దుపరస్తూ చర్యలు తీసుకోబడినాయి. స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వం అనే ఉన్నత ప్రజాస్వామిక విలువల ప్రాతిపదికపై **1789** ఆగస్టు **12** న మానవహక్కుల ప్రకటన జరిగింది. లిఖితరాజ్యాంగ నిర్మాణానికి ఇది పీఠిక అయింది. మానవులంతా పుట్టుకలతో సర్వస్వతంత్రులు, సమాన హక్కులున్న వారు. స్వేచ్ఛగా భావాలను, ఆలోచనలను, అభిప్రాయాలను వెల్లడించటం మానవహక్కులలో అత్యంత విలువైనది అని మానవహక్కుల ప్రకటన స్పష్టం చేసింది.

ఈ హక్కుల ప్రకటనకు **27** సంవత్సరాలకు పూర్వమే ప్రపంచంలో హక్కుల చైతన్యం, చర్చ ప్రారంభమాయ్యాయి. బ్రిటిషు వలస పాలన నుండి విముక్తి కోసం అమెరికను ప్రజలు ఆరాటపడుతున్న క్రమంలో సమానహక్కుల స్పృహ కలిగింది, పెరిగింది. అమెరికా స్వాతంత్ర సమరం సందర్భంగా జేమ్స్ఓటిస్ **1762** లో విండికేషన్ అనే పేరుతో ఒక కరపత్రం **1764** లో రైట్స్ అనే పేరుతో మరొక కరపత్రం ప్రచురించాడు. **1766** తరువాత థామస్‌పైన్ 'ది రైట్స్ ఆఫ్ మాన్' అనే కరపత్రాన్ని ప్రకటించాడు. ఈ క్రమంలోనే ఫ్రాన్స్ నిరంకుశమత రాచరిక వ్యవస్థలకు వ్యతిరేకంగా జరిగిన అంతర్యుద్ధాల ఫలితంగా ప్రజాస్వామిక విలువలకు గొప్ప గుర్తింపు లభించింది. తత్ఫలితంగానే మానవహక్కుల ప్రకటన వెలువడింది. ఈ అంతర్జాతీయ రాజకీయార్థిక సందర్భమే స్త్రీల హక్కుల చర్చను అనివార్యంగా ముందుకు తెచ్చింది.

**1762** నుండి **1789** వరకు దాదాపు ముప్ఫయి సంవత్సరాల కాలం మీద పరిణామం చెందుతూ వచ్చిన హక్కుల ఉద్యమం జనాభాలో సగమైన స్త్రీల హక్కుల గురించి పట్టించుకోలేదన్న విషయాన్ని స్త్రీలే గ్రహించటంతో ప్రపంచంలో స్త్రీల ఉద్యమానికి బీజాలు పడ్డాయి. మానవహక్కులు, మగవాడి హక్కులు అన్న భావనలకు సమాంతరంగా సర్వమానవహక్కులు అనే ప్రాతిపదికమీద స్త్రీల సాంఘిక రాజకీయ సమానత్వాన్ని గుర్తిస్తూ పురుషులకు వున్న ప్రత్యేక హక్కులను రద్దుచేయాలని కోరుతూ ఓలంపిడిగొగస్ అనే ఆవిడ **1789** లో 'ది డిక్లరేషన్ ఆఫ్‌ది విమెన్ అండ్‌ది ఫిమేల్ సిటిజన్' ను ప్రకటించటం ఈ క్రమంలో తొలిచర్య. **1791** లో ఫ్రాన్స్‌లోని నేషనల్ అసెంబ్లీకి కూడా దీనిని సమర్పించటం జరిగింది. దీనికి కొనసాగింపుగా మలిచర్యకు ఇంగ్లాండు వేదిక అయింది. ఇంగ్లాండుకు చెందిన మేరి వులస్టన్ క్రాఫ్ట్ **1792**లో 'ఏ విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్' అనే గ్రంథాన్ని వ్రాసింది. రాజకీయార్థిక అధికార శక్తులను పురుషులతో పాటు సమానంగా స్త్రీలకు కూడా పంచాలని అందుకోసం సంస్కరణలు చేపట్టాలని ప్రకటించింది.

ఇక అప్పటి నుండి ప్రపంచమంతటా అభివృద్ధి చెందిన ప్రజాస్వామిక ఉద్యమాల్లో భాగంగానూ ప్రత్యేకంగానూ స్త్రీల సమాన హక్కుల ఉద్యమాలు కొనసాగాయి. సోషలిస్టు ఉద్యమాలలోకి **1864** లో కారల్‌మార్క్స్ ప్రవేశం తరువాత స్త్రీల హక్కుల

సమస్య చర్చలోకి వచ్చింది. మహిళా కార్మికుల ప్రయోజనాల కోసం ప్రత్యేక చట్టాలను ఆయన ఆశించాడు. ట్రేడ్ యూనియన్లలో పురుష కార్మికులకు , మహిళా కార్మికులకు సమాన హక్కులుండాలని ప్రకటించాడు. అమెరికాలో అభివృద్ధి చెందిన నీగ్రోబానిస వ్యతిరేక ఉద్యమంలోని జాతివివక్షా చైతన్యం అతి కొద్దికాలంలోనే లింగ వివక్షా చైతన్యవికాసానికి తోడ్పడింది. **1867** లో మొట్టమొదటి సారిగా ఇంగ్లీష్ పార్లమెంట్ ముందు స్త్రీల ఓటు హక్కు సమస్యను పెట్టేడు జాన్ స్టూవర్ట్‌మిల్. కుటుంబంలోనూ, సమాజంలోనూ పురుషులతో స్త్రీలకు సమాన ప్రతిపత్తిని ఆయన ఆశించాడు. క్రమంగా చదువుకొనేహక్కు, ఆస్తిహక్కు, విడాకుల హక్కు కూడా స్త్రీల హక్కుల కార్యక్రమంలోకి చేరాయి. ఇంగ్లండ్ , అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, న్యూజిలాండ్ మొదలైన అనేక దేశాలలో ఓటు హక్కు, విద్యావృత్తి హక్కు, విడాకుల హక్కు మొదలైనవాటి కోసం వివిధ స్థాయిలలో స్త్రీలు ఉద్యమాలు నిర్వహించారు. సుదీర్ఘ పోరాటాల తరువాత ముందు వెనుకలుగా వాటిని సాధించుకొంటూ వచ్చారు. **1800** సంవత్సరం నుండి **1930** ల వరకు ఒక శతాబ్దికి పైగా నడిచిన ఈ విధమైన స్త్రీసమాన హక్కుల ఉద్యమంలో ప్రధానంగా రెండు ధోరణులు కనబడతాయి. ఉదార మహిళా ఉద్యమం ధోరణి ఒకటయితే సోషలిస్టు మహిళా ఉద్యమ ధోరణి మరొకటి.

వివాహం చేసుకొనటంలో, వైవాహిక సంబంధాన్ని రద్దుచేసుకొనటంలో, చదువుకోనటంలో, ఇష్టమైన వృత్తిని చేపట్టటంలో, ఆస్తులను సంపాదించుకొనటంలో, ఆదాయాలను ఏర్పరచకోనటంలో సామాజిక జీవితంలోని అన్ని రంగాలలోకార్యక్రమాలలో పురుషులతోపాటు భాగస్వామ్యాన్ని పొందటంలో సంపూర్ణ సమానత్వాన్ని కాంక్షించటం, రాజకీయ హక్కులను ఆశించటం ఉదార మహిళా ఉద్యమలక్షణం. దీనినే ఉదారవాద భూర్జువా మహిళా ఉద్యమం అని కూడా అంటారు. సంస్కరణ వాద పరిధిలోనిది ఈ ఉద్యమం కుటుంబంలో, రాజ్యాంగంలో, సమాజంలో పురుషుల ప్రత్యేక హక్కులకు, అధికారానికి వ్యతిరేకంగా చేసే పోరాటానికి పరిమిత మైనది. ఒక రకంగా ఉన్నత వర్గ స్త్రీల ప్రయోజనాలు దీని లక్ష్యం.

సోషలిస్టు మహిళా ఉద్యమం శ్రామిక వర్గ మహిళా చైతన్యం నుండి పరిణమించింది. తమ దుర్భర జీవన పరిస్థితులకు వ్యతిరేకంగా మహిళా కార్మికులు సంఘటితమవుతూ పనిగంటలు, వేతన సమానత్వం, వేతనం పై ప్రసూతి సెలవు, పనిచేసే చోట పిల్లల సంరక్షణా కేంద్రాలు మొదలైన వాటిని సాధించుకొన్నారు. అయితే శ్రామిక వర్గ మహిళలు విడిగా సంఘటితమై చేసే పోరాటాలు సరిపోవని, వాళ్ళు తమ తమ వృత్తి కార్మిక సంఘాలలో చేసి పురుష కార్మికులతో కలిసి సంఘటితంగా పెట్టుబడిదారీ వ్యవస్థపై చేసే పోరాటంలోనే స్త్రీలు నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందగలుగుతారన్న అవగాహన పెరిగింది. కార్మిక వర్గ అంతర్జాతీయతలోనే భాగంగా శ్రామిక మహిళా అంతర్జాతీయతా భావన కూడా బలపడింది. **1910** లో కోపెన్‌హాగ్ లో జరిగిన సోషలిస్టు మహిళల రెండవ అంతర్జాతీయ మహిళల సభ మార్చి 8 న శ్రామిక మహిళల దినోత్సవంగా తీర్మానించంది. అప్పటి నుండి మార్చి **8** స్త్రీల హక్కుల చైతన్యానికి, అంతర్జాతీయ ఏకతకు మార్చి **8** ఒక సంకేతంగా చరిత్రలో నిలిచింది.

సోషలిస్టు విప్లవానికి సైద్ధాంతిక తాత్త్విక బలాన్ని సమకూర్చిన మార్క్స్ ఏంగెల్స్ రచనలు స్త్రీ సమస్యను వ్యక్తిగత ఆస్తి సంబంధంలో కుటుంబం, రాజ్యం ఏర్పడ్డాయని ఫ్రెడరిక్ ఏంగెల్స్ **1884** లో నిరూపించాడు. ఆక్రమంలో నే స్త్రీ తల్లిహక్కును కోల్పోయిందని అది స్త్రీల జీవితంలో పెద్ద పరాజయమని అన్నాడు. స్త్రీల అణిచివేతకు లైంగిక పనివిభజనకు వున్న సంబంధాన్ని 'ఇంటిచాకిరీ' స్వరూపస్వభావాల చర్చలో తేల్చి చెప్పాడు లెనిన్. మొత్తం మీద **19**వ శతాబ్దమంతా ప్రపంచ చరిత్రలో స్త్రీల సాంఘిక హక్కుల కోసం, జరిగిన పౌర ఉద్యమాలతోనూ స్త్రీల ఆర్థిక హక్కుల కోసం జరిగిన శ్రామిక మహిళా ఉద్యమాలతోనూ తత్సంబంధమైన సైద్ధాంతిక భావజాల అభివృద్ధితోనూ ముడిపడివుంది.

బానిస విముక్తి ఉద్యమాలు, శ్రామిక ఉద్యమాలు స్త్రీలను సామాజిక రంగాలలోకి తీసుకొని వచ్చాయి. ఓటుహక్కు ఆస్తిహక్కు వంటి పౌరహక్కులతో సంతృప్తి చెందక తమ వర్గ ప్రజల కష్టసుఖాలతో మమేకమై వాళ్ళ విముక్తితోనే తమ విముక్తి అని స్త్రీలు పనిచేశారు. అయితే ఇవేవి స్త్రీలుగా స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్ష గురించిన స్పృహను పూర్తిగా స్త్రీలలో కలిగించలేక

పోయాయి. జాతులు, దేశాలు విముక్తమవుతున్న క్రమంలో స్త్రీల పరిస్థితులు కొంత మెరుగు పడ్డాయే కానీ స్త్రీలుగా వాళ్ళు ఎదుర్కోంటున్న వివక్షను అని రూపుమాపలేకపోయాయి. 1917లో రష్యన్ విప్లవం విజయవంతమైంది. 1945 లో చైనా విముక్తమైంది. స్త్రీలకు ఓటుహక్కు, ఆస్తి హక్కు, పనిచేసే హక్కు అన్నీ లభించాయి. అయినా స్త్రీకి తన జీవితం మీద తనకు సంపూర్ణాధికారం మాత్రం లభించలేదు. ఈ పరిస్థితులలో ఆధునిక స్త్రీవాదు రూపుదిద్దుకొన్నది.

1792 లో విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ విమెన్' పుస్తకం వ్రాసిన మేరీ వొలస్టన్ క్రాఫ్ట్ స్త్రీవాదానికి తొలి బీజాలు వేసింది భగవంతుడు స్త్రీని పురుషుడి కంటే తక్కువ స్థాయి వ్యక్తిగా సృష్టించాడన్న సంప్రదాయభావాన్ని ఆమె వ్యతిరేకించింది. తల్లిదండ్రులు, ఆధ్యాపకులు,నిత్యనైమిత్తిక వ్యవహారాలు, ఇంటి నాలుగు గోడల మధ్య జీవితం అన్నీ కలిసి ఆదర్శస్త్రీమూర్తిని తమారుచేస్తాయని ఆమె అభిప్రాయపడింది. ఆ రకంగా పుట్టుక కన్నా పెంపకపు సంస్కృతి స్త్రీ పురుషుల మధ్య తేడాలను సృష్టిస్తుందన్న అవగాహన ఆమెది. ఏదైన ఒకధర్మం, నీతి స్త్రీకి ఒక రకంగా పురుషులకు ఒకరకంగా వుండటాన్ని 'లైంగికధర్మం' అని ప్రస్తావించిందామె. ఆ ద్వంద్వనీతిని వ్యతిరేకించింది. ఈ పునాది మీద ఓటుహక్కు మొదలైన సాంఘిక రాజకీయ ఉద్యమాల అనుభవాన్ని , సోషలిస్టు ఉద్యమాల అనుభవాన్ని పరిగణనలోకి తీసుకొంటూ 1949 లో సైమన్‌డిబావురే 'ది సెకండ్ సెక్స్' అనే పుస్తకం వ్రాసి ఆధునిక స్త్రీవాదానికి స్పష్టమైన రూపం ఇచ్చింది. జీవశాస్త్ర మనస్తత్వ శాస్త్ర పరిశోధనల వల్ల అంది వచ్చిన విజ్ఞానాన్ని, సామాజిక పరిణామ క్రమాన్ని అర్థం చేసుకొనటానికి అభివృద్ధి చేయబడిన గతితార్కిక చారిత్రక భౌతిక వాదాన్ని అందుకు ఆమె ఉపయెగించుకొన్నది.

స్త్రీ సమస్య అంతా లైంగికమే అనే ఫ్రాయిడ్ వాదాన్ని కానీ, స్త్రీ సమస్య అంతా ఆర్థికమే అనే ఏంగిల్స్ వాదాన్ని కానీ పరగణనలోకి తీసుకొనరాదని అవి స్త్రీల అణిచివేతను సరిగా వ్యాఖ్యానించగలిగిన సర్వశక్తి సమన్వితమైన వాదాలు అనుకొనరాదని ఆమె అభిప్రాయపడింది. కండరాల శక్తికి, మగవాడి శక్తికి, యంత్రశక్తికి వుండే విలువ ప్రాపంచిక విలువల సంబంధంలో ఏర్పడుతుంది కనుక ప్రపంచంతో సంబంధం ఏర్పరచే శరీరాన్ని దాని అనుభవాన్ని ప్రధానం చేయాలని సైమన్ స్త్రీవాద సిద్ధాంతానికి అస్తిత్వవాద తాత్విక పునాదిని సమకూర్చింది. జీవితం ప్రపంచానికి సంబంధించింది. కనుక ప్రతివ్యక్తీ తన గురించి ప్రపంచం భావించే అంశాల ద్వారానే తనను నిర్వచించుకొనే అవకాశం వుంటుందని, స్త్రీల సమస్యను కూడా ప్రపంచ సంబంధాల ద్వారానే అర్థం చేసుకొన వలసి వుంటుందని స్త్రీ జీవిస్తున్న స్థితిగతులను మెత్తంగా స్వీకరించి అస్తిత్వకోణం నుండి అధ్యయనం చేయాలని ఆమె అన్నది.

తమనుతాము వెతుక్కొంటూ తమను తాము తెలుసుకొంటూ తమను తాము నిర్వయచించుకొంటూ సంప్రదాయ నమూనాలను ధిక్కరించే చైతన్యం పెరిగిన గుర్తింపుదశకం (1960) లో స్త్రీవాదానికి మరింత స్పష్టంగా నిరూపించే రచనలు వచ్చాయి. ఈ దశకంలోనే స్త్రీల కొరకు అమెరికాలో ఏర్పడిన నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ విమెన్ (Now) ఏర్పడింది. (1966) నూతన స్త్రీవాద ఉద్యమానికి ఇది నాందీ అయింది. సామాజిక సంబంధాలలో మార్పుకోసం పునాది నుంచి ప్రారంభించి ఉపరితలాంశాల వరకు ఎన్నో ఉద్యమాలు నిర్మించబడుతున్నా స్త్రీల పరిస్థితి మెరుగు పడకపోగా రోజు రోజుకీ క్షీణించి పోవటం వెనక వున్న రాజకీయాలేమిటో తెలుసుకొనాలన్న తపన 1960 లలో ఎక్కువైంది. 1963 లో బెట్టీఫ్రైడెన్ 'ది ఫెమినైన్ మిస్టిక్' అనే పుస్తకాన్ని ప్రచురించింది. అనేక మంది స్త్రీల అంతరంగాలలో కుతకుతా ఉడుకుతున్న అసంతృప్తులకు వ్యక్తీకరణ అయింది ఆ పుస్తకం. ఎంతో మంది స్త్రీలు తమకు నిర్దేశించబడిన సామాజికామోదిత పాత్రలను, విలువలను ప్రశ్నించేట్లు చేసింది. 'మగవాడి ప్రపంచం' స్త్రీల అభివృద్ధికి అవకాశం ఇయ్యటంలేదని స్పష్టం చేసింది. మాతృత్వమనేది సంతోషకరమైన మానవీయ బాధ్యతతో కూడిన చర్యకావాలంటే పునరుత్పత్తిహక్కు తల్లిదే అయివుండాలని ప్రకటించింది బెట్టీఫ్రైడన్. స్త్రీలు సంపూర్ణవ్యక్తులుగా ఎదగటానికే స్త్రీ విముక్తి అని , ఈ క్రమంలో పురుషులు స్త్రీలకు శత్రువులు ఎంతమాత్రమూ కారని అయితే పురుషులు కూడా తమను తాము, తాము స్త్రీలను ప్రేమించే సమగ్ర మానవులుగా వికసించటానికి పాత సంప్రదాయ పురుష నమూనా నుండి విముక్తులు కావలసివుంటుందని ఆమె స్పష్టం చేసింది.

1970 లలో కేట్ మిల్లెట్, షులామిత్ ఫైర్ స్టోన్ సెక్స్యువల్ పాలటిక్స్', 'ది డైలక్టిక్స్ ఆఫ్ సెక్స్' అనే రచనల ద్వారా 'పితృస్వామ్యం' అనే భావనను బలంగా ముందుకు తెచ్చారు. పురుషాధిక్యత, తండ్రి అధికారం అనేవి సాంఘిక ఆర్థిక అణచివేత రూపాల కంటే భిన్నమైన స్వతంత్ర ప్రతిపత్తి గలవి అని ప్రతిపాదించారు. స్త్రీ సహజగుణాలుగా చెప్పబడుతున్న వినయం, విధేయత పితృస్వామ్య కుటుంబ భావజాల సంస్కృతిలో పెంచిపోషింపబడినవేనని లైంగిక వివక్ష పరాధీనత ఆధిక్యతలతో కూడిన అసమసంబంధాలను స్త్రీ పురుషుల మధ్య అభివృద్ధి చేసిందనీ భావించారు. ఈ సందర్భంలోనే సెక్స్‌కు జండర్‌కు మధ్య వున్న భేదం నిరూపించబడింది. సెక్స్ శరీర నిర్మాణానికి సంబంధించనదయితే జండర్ మనస్తత్వం సంబంధమైనది, సామాజిక సంస్కృతి నుండి రూపొందేది. సైమన్ డి బావురే' చెప్పిన 'ఆడ మగ పుడతారు; స్త్రీ పురుషులుగా తయారు చేయబడతారు' అన్న ఏక వాక్య తాత్పర్యం ఇదే. ఇక్కడి నుండి లైంగిక ప్రాతిపదిక మీద జరిగే పనివిభజన, పనికి విలువ కట్టే పద్ధతి, సామాజిక శ్రమకు భిన్నంగా స్త్రీల ఇంటిపని విలువ లేనిదిగా చేయబడిన విధానం - ప్రముఖంగా చర్చలోకి వచ్చాయి. ఇంతవరకు స్త్రీల వ్యక్తిగతాంశాలుగా వున్న విషయాలు వెనక వున్న అధికార రాజకీయాల గుట్టు తెలియవచ్చింది. క్రమంగా స్త్రీల సమస్యలనేవి ప్రత్యేకంగా లేవని, స్త్రీలు ప్రపంచంలో ఒక భాగం కనుక, ప్రపంచంలోని సమస్తాంశాలు స్త్రీల ప్రయోజనాలకు ఏమేరకు అనుకూలంగా వున్నాయో ప్రతికూలంగా వున్నాయో పరిశీలించటం, చర్చించటం అభివృద్ధి చెందింది. ఆ రకంగా స్త్రీవాదం స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి వ్యక్తుల దగ్గరనుండి ప్రారంభించి కుటుంబం నుండి ప్రపంచంలోని రాజకీయార్థిక పరిణామాల వరకు అన్నిటినీ తన పరిధిలోకి తీసుకొనగలిగిన విధంగా విస్తృతి చెందింది.

ఈ ప్రాపంచిక పరిణామాల నేపథ్యంలో భారతదేశంలో స్త్రీల ఉద్యమం ఎలా వికసిస్తూ విస్తరిస్తూ వచ్చిందో తెలుసుకోవటం అవసరం.

## 8.2.2 స్త్రీల ఉద్యమం - జాతీయ నేపథ్యం :

భారతదేశంలో స్త్రీపురుష అసమానత క్రీస్తుపూర్వానికే వ్యవస్థీకృతం అయిందినటానికి కౌటిల్యుని అర్థశాస్త్రం, మనుస్మృతి నిదర్శనంగా వున్నాయి. జైన, బౌద్ధ, శైవమతోద్యమాల సందర్భంగా ఈ అసమానతలను ప్రశ్నించిన చరిత్రకూడా భారతదేశానికి వున్నది. అయితే మత ప్రయోజనాల మేరకు స్త్రీ స్వేచ్ఛా సమానత్వాలు అంగీకరించబడినాయి తప్ప అసమానతల మూలకారణాల విశ్లేషణ కానీ ప్రత్యేకించి స్త్రీల సమస్యలపై చర్చ కానీ అప్పుడు జరగలేదు. బ్రిటిషు వలసపాలన వలన 19వ శతాబ్ది ప్రారంభానికి భారతదేశంలో ప్రారంభమైన ఆధునికీకరణ స్త్రీల సమస్యపై చర్చను అనివార్యం చేసింది. మిషనరీల స్థాపన , మత ప్రచారం, పాశ్చాత్య విద్య, ఉద్యోగవిధానం, నూతన రవాణాసౌకర్యాలు, రైల్వేల నిర్మాణం, వార్తా పత్రికలు, పట్టణాభివృద్ధి, సంఘటిత జాతీయ మార్కెట్ వ్యవస్థ, ఆధునిక వ్యవసాయం, కొత్త భారీ చిన్న తరహా పరిశ్రమలు భారతదేశ ఆధునికీకరణకు దారితీశాయి. ఈ నేపథ్యంలో విద్యావంతులతో కూడిన సంపన్న మధ్యతరగతి వర్గం ఏర్పడింది. పాశ్చాత్య నాగరికత, చరిత్ర, విజ్ఞానం , సంస్కృతి వీళ్ళ ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేశాయి. హేతుదృష్టిని పెంపొందించాయి. వ్యక్తి వికాసానికి అవరోధంగా వున్న సాంఘిక మత దురాచారాలను, మూఢ నమ్మకాలను, కులవ్యవస్థను నిరసిస్తూ నూతన సామాజిక రాజకీయ చైతన్యాభివృద్ధికి దోహదం చేసే శక్తిగా ఈ మధ్యతరగతి వర్గం రూపొందింది. ఈ క్రమంలోనే స్త్రీల వెనుక బాటు తనాన్ని గుర్తించి స్త్రీల అభ్యుదయానికి ప్రాధాన్యతనిస్తూ సంస్కరణోద్యమాన్ని నిర్మించింది మధ్యతరగతి వర్గం.

సంస్కరణోద్యమంలో మొట్టమొదట ముందుకు వచ్చిన అంశం సతీసహగమన దురాచారం. బెంగాల్‌లో కలకత్తా చుట్టు ప్రక్కల ముమ్మరంగా జరుగుతున్న సహగమనాలకు ప్రతిస్పదించి రాజారామమోహనరాయ్ 1818లో దురాచారానికి వ్యతిరేకంగా ప్రజాభిప్రాయసేకరణ ప్రారంభించాడు సతి ప్రాచీన హిందుధర్మానికి వ్యతిరేకమైనదిని ప్రమాణాలతో నిరూపించి వాదించాడు. ఉపన్యాసాల ద్వారా, కరపత్రాల ద్వారా, చిన్నచిన్న పుస్తకాల ద్వారా ప్రచారం చేశాడు. తన భావాలతో ఏకీభవించే

యువకులను కూడగట్టి ఈ దురాచారాన్ని నిరోధించటానికి పురికొల్పాడు. ప్రభుత్వానికి వినతి పత్రాలు సమర్పించాడు. ఆయన కృషి ఫలించి **1829** డిసెంబరు **4** న విలియం బెంటింగ్ సతీసహగమన నిషేధ చట్టాన్ని ప్రవేశపెట్టాడు. చనిపోయిన భర్తతో పాటు ఆయన భార్యను చితిమీదికి ఎక్కించటం నేరమని శాసనం చేశాడు. సంప్రదాయవాదుల వ్యతిరేకతను ఎదుర్కొని రాజారామమోహన్‌రాయ్ ఇంగ్లాండుకు కూడా వెళ్ళి ప్రివీకౌన్సిలు ముందు తన వాదాన్ని వినిపించి సతీ సహగమన నిషేధ చట్టానికి ఆమోదముద్ర వేయించాడు.

ఈ విధంగా సతీసహగమనానికి వ్యతిరేకంగా బెంగాల్‌లో ప్రారంభమైన సంఘసంస్కరణ కార్యక్రమం మరింత బలబడి బాల్యవివాహాల నిషేధం, వితంతువివాహాలకు అవకాశం అనే అంశాలతో విస్తరించింది. బ్రహ్మ సమాజం వంటి సంస్థలు బాల్యవివాహాలను వ్యతిరేకించాయి. బహుభార్యాత్వాన్ని ఖండించాయి. వితంతు సమస్యపట్ల సమాజ దృష్టిని మళ్ళించే ప్రయత్నం చేశాయి. ఈ సమయంలో కేశవచంద్రసేన్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వంటి బ్రాహ్మ సామాజికులు స్త్రీజనోద్ధరణకు ముందుకు వచ్చారు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్ వితంతుస్త్రీల స్థితిగతులలో మార్పుకోసం, పునర్వివాహ చట్టంకోసం కృషి చేశాడు. వారసత్వహక్కులు, ఇతర హక్కులూ కూడా కల్పించాలని చెప్పాడు. వితంతు పునర్వివాహం మతపరంగా కూడా తప్పుకాదని ధర్మ శాస్త్రాల ఆధారంగా వాదించాడు. స్త్రీ పునర్వివాహాన్ని చట్ట బద్ధం చేయాలని **1855** లో బెంగాల్, మద్రాస్, బాంబే, నాగపూర్ వంటి నగరాల నుండి అసంఖ్యాకంగా ప్రభుత్వానికి మహాజర్లు సమర్పించబడ్డాయి. వితంతు వివాహ అనుకూల ఆందోళన ఉధృతమైంది. **1856** లో లెజిస్లేటివ్ కౌన్సిల్ హిందూ పునర్వివాహ చట్టాన్ని చేసింది.

బొంబాయి నుండి జస్టిస్ మహాదేవగోవిందరనడే **1869**లో స్త్రీ పునర్వివాహ సమాజంలో చేరి పనిచేశాడు. బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ వితంతు వివాహాలను స్త్రీవిద్యను ప్రోత్సహించాడు. **1887** నాటికి సంస్కరణోద్యమానికి ప్రముఖమైన సంస్థగా నేషనల్ సోషల్ కాన్ఫరెన్స్‌ను ఏర్పరచాడు. సామాజిక మార్పుకోసం ఆయన నాలుగు రకాల పద్ధతులను అవలంబించాడు. గత సంప్రదాయాలను ఉదాహరిస్తూ చాలా ఆచారాలు నిజమైన భారతీయ సంస్కృతిలోనివి కావని ప్రతిపక్షం వారితో వాదించటం ఒక పద్ధతి. ఆయా ఆచారాల వెనక వున్న నైతికత గురించి చర్చించటం రెండవ పద్ధతి. దురాచారాలను రూపుమాపటానికి చట్టాల వైపుకు దృష్టి సారించటం మూడవపద్ధతి. ఇక చివరిది సామాజిక తిరుగుబాటు.

సంస్కరణోద్యమంలో స్త్రీల కోసం పనిచేసిన మరొక వ్యక్తి మహాత్మా జోతీరావు పూలే. హిందుకులాల దృక్పథం నుండి సంస్కరణోద్యమానికి కొత్త కోణాన్నిచ్చాడు. స్త్రీలకు విద్య లేక పోవటమే హిందుదేశ క్షీణస్థితికి కారణమని భావించాడు. అవిద్యావంతురాలైన తన భార్య సావిత్రీబాయికి విద్యనేర్పటం ద్వారా స్త్రీవిద్యాభివృద్ధికి కృషి ప్రారంభించాడు. **1848** లో పూణెలో బాలికల కోసం పాఠశాలను స్థాపించాడు. భారతదేశం మొత్తంలోనే ఇది మొదటి బాలికా పాఠశాల.అందులోనూ నిమ్నజాతుల బాలికల కోసం ఉద్దేశించబడిన పాఠశాల కావటం గమనించదగింది. ప్రభుత్వం నిమ్నజాతుల విద్య గురించి పట్టించుకోని కాలంలో అగ్రవర్ణాల ద్వేషం, ప్రతిఘటన బలంగా వున్న సమయంలో సహకారం సానుభూతిలేని సామాజిక పరిస్థితులలో పూలే బాలికల విద్యకోసం అందునా నిమ్నజాతి బాలికల విద్యకోసం చేసిన కృషి విశేషమైనది. అలాగే పూలే ఉన్నతవర్గాలదే అయిన వితంతు సమస్యపట్ల స్పందించిన తీరు కూడా విశిష్టమైనది. చిన్న వయసులో వితంతువులై శారీరక వాంఛలకు, ప్రలోభాలకు లొంగిపోయి గర్భవతులై సామాజిక ఆమోదంలేని ఆ గర్భాలను దిగదీయించుకొనే స్త్రీలకు , శిశు హత్యలకు పాల్పడే స్త్రీలకు చేయూతనియ్యటానికి **1863** లో వితంతు శరణాలయాన్ని స్థాపించాడు. బ్రాహ్మణ వితంతువుల కోసం బ్రాహ్మణేతురులు మానవతా భావంతో నడిపిన సంస్థ ఇది. వితంతువులను అప్రతిష్ట నుంచి తప్పించటానికి వారి మనోవేదనను తగ్గించటానికి, వారిని ఆత్మహత్యాప్రయత్నం నుంచీ, నేర ప్రవృత్తి నుంచి తప్పించటానికి తెరిచిన శరణాలయమని ప్రకటించి ఈ శరణాలయం గురించి పూలే విస్తృత ప్రచారం చేశాడు.

పూలే స్త్రీలను సహజ అహింసావాదులని అన్నాడు. ఉన్నత స్వభావులుగా పేర్కొన్నాడు. స్త్రీసమానత్వాన్ని సమానహక్కులను సంస్కరణోద్యమ కార్యక్రమంలోకి తెచ్చినవాడు, స్త్రీలను నిమ్నకులాలను దళితులను పట్టించుకోకుండా దేశంలో ఎటువంటి సంస్కరణ గానీ, విప్లవం కానీ అర్థవంతం కాదని నిర్ద్వంద్వంగా చెప్పినవాడు పూలే.

అంబేద్కర్ సంస్కరణ ఉద్యమం లో వలె ప్రాచీన స్మృతి సూత్ర గ్రంధాలను ఆధారంగా చేసుకొని స్త్రీలకు విధించిన విధుల విషయంలో వున్న వైరుధ్యాలను బయటపెట్టే స్త్రీలకు పునర్వివాహం, విడాకులు, ఆర్థిక హక్కులు అన్నీ ఆది నుండి వున్నవేనని స్పష్టం చేసాడు. ప్రధానంగా వాటికి చట్ట సంబంద్ధత సమకూర్చటంపై దృష్టిపెట్టాడు. స్త్రీల అభివృద్ధి లేకుండా జాతి అభివృద్ధి లేదన్నాడు. స్వతంత్ర భారతదేశ ప్రథమ న్యాయశాఖా మంత్రిగా **1851** లో హిందుకోడ్ బిల్లును ప్రవేశపెట్టినప్పుడు స్త్రీల విషయంలో కామన్‌కోడ్ బిల్లును కోరటం వరకు ఆయన స్త్రీల ప్రయోజనాలకోసం నిరంతరం ప్రతయత్నిస్తూనే వచ్చాడు.

రాజరామమోహనరాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్ మొదలైన వాళ్ళు హిందూమతాన్ని ధిక్కరించ కుండానే దానిని ప్రక్షళనం చేయటం ద్వారా స్త్రీల సమస్యను పరిష్కరించవచ్చుననుకొన్నారు. జోతిరావ్‌పూలే, అంబేద్కర్ మొదలైన వాళ్ళు వర్ణవ్యవస్థ కులం మొదలైన వాటిని చర్చలోకి తీసుకోకుండా స్త్రీసమస్యను పరిష్కరించటం సాధ్యం కాదని భావించారు. ఆరకంగా సామాజిక నిర్మాణంలో మార్పుకు స్త్రీసమస్యపరిష్కారానికి వున్న సంబంధాన్ని తొలిసారిగా ఈ సంస్కర్తలు ముందుకు తెచ్చారు.

సంస్కరణోద్యమం ప్రధానంగా పురుషులు స్త్రీల కోసం నడిపిన ఉద్యమం. అయితే అదే సమయంలో స్త్రీల చైతన్యం కూడా మారుతూ వచ్చింది. స్వీయ జీవితానుభవాల నుండి సమకాలీన సంస్కరణోద్యమ గమనం పట్ల కలుగుతున్న అభిప్రాయాలతో, సంస్కరణోద్యమ కారణంగా కొత్తగా కలిసి వచ్చిన విద్యావకాశాల వల్ల చెదురు మదురుగానైనా స్త్రీలు మాట్లాడం ప్రారంభిచారు. స్వయంగా సంస్కరణోద్యమ కార్యరంగంలోకి ప్రవేశించారు. వీళ్ళలో మొదట చెప్పుకోవలసిన వ్యక్తి తారాబాయి షిండే. **1881** లో విజయలక్ష్మి కేసు సందర్భంగా ప్రతిస్పందించి పురుషాహంకారాన్ని సవాల్ చేస్తూ ఆమె వ్రాసిన చిన్న పుస్తకం స్త్రీలకోసం స్త్రీలు ప్రారంభించిన స్త్రీల ఉద్యమానికి ఒక ప్రతీక.

**1856** లో స్త్రీ పునర్వివాహ చట్టం వచ్చినా పునర్వివాహం సామాజిక సంస్కారంలో భాగం కాలేదు. వితంతు స్త్రీలు రహస్యసంబంధాల వలన ఏర్పడిన గర్భాలను తొలగించుకోవటానికి భ్రూణహత్యలకు అక్రమ సంతానాన్ని వదిలించుకొనటానికి శిశు హత్యలకు పాల్పడే పరిస్థితి కొనసాగుతూనే వుంది. భ్రూణహత్య, శిశు హత్య చట్టప్రకారం నేరం కనుక వాళ్ళమీద కేసులు పెట్టబడుతుండేవి. కేసులు పెట్టకుండా వుండటం కోసం పోలీసులతో లాలూచీ పడవలసి వచ్చేది. ఇటువంటి సామాజిక పరిస్థితులలో గుజరాత్‌లోని సూరత్‌కు దగ్గర వున్న ఓలవాడ్ అనే గ్రామంలో విజయలక్ష్మి అనే బ్రాహ్మణ వితంతువు ఒక బిడ్డకు జన్మనిచ్చి సంఘంలో తలవంపులు రాకుండా వుండేందుకు ఆ బిడ్డను చంపి పెంటకుప్పపై వేసిన సంఘటన జరిగింది. దానిపై కోర్టుకేసు నడిచింది. **1881** లో సూరత్ సెషన్స్‌కోర్టులో ఆమెకు ఉరిశిక్ష పడింది. ఆ తరువాత బొంబాయి కోర్టులో అది దేశ బహిష్కార శిక్షగా మార్చబడింది. ఈ కేసు విషయంలో విజయలక్ష్మి గురించి ప్రత్యేకంగానూ, స్త్రీల స్వభావం గురించి మొత్తంగానూ విస్తృతంగా వ్యక్తమైన భావాలకు అభిప్రాయాలకు ప్రతిస్పందించి తారాబాయి షిండే ఈ పుస్తకం వ్రాసింది.

విజలయక్ష్మి శిశువును చంపిందని ఆమె దుర్మార్గ కఠిన స్వభావాన్ని నిందిస్తూ వచ్చిన సామాజిక సంస్కృతిలోని ద్వంద్వస్వభావాన్ని ఆమె ఎండగట్టింది. విజయలక్ష్మి దురవస్థకు కారణం విజయలక్ష్మి మాత్రమే కాదని పురుషాహంకారంతో నిండిన దుష్టసమాజమని ఆమె స్పష్టంచేసింది. స్త్రీల హక్కులన్నింటినీ తమ చేతిలో పెట్టుకొని స్త్రీలను ప్రపంచానికి దూరంగా చీకటి మూలల్లోకి నెట్టిన సామాజిక దురన్యాయాన్ని గుర్తించి చెప్పింది. స్త్రీలు పురుషుల వలెనే పుట్టారు కదా వాళ్లకూ జీవితం విలువైనదే కదా మరి అటువంటప్పుడు స్త్రీల జీవితం హీనం ఎందుకు చేస్తున్నారని పురుష సమాజాన్ని ఆమె ప్రశ్నించింది. ధర్మశాస్త్రాలన్నీ పురుషులకు అనుకూలంగా పురుషులు వ్రాసుకొన్నవని తేల్చిచెప్పింది. మితిమీరిన వాంఛలు, ఐశ్వర్యాన్ని , స్త్రీని

స్వంతం చేసుకొనాలనే బుద్ధి పురుషులవే నని , ఈ స్వార్థం, సుఖాపేక్ష ఇళ్ళనూ కుటుంబాలకు నాశనం చేసే ఆలోచనలకు ఆచరణలకు దారితీస్తున్నాయని తమలోని ఈ దుర్మార్గాన్ని వాళ్ళు ఆడవాళ్లపై తోసి ధర్మానికి తామ ధర్మాకర్తలుగా నిలబడుతున్నారని ఆమె నిర్మోహమాలంగా చెప్పింది. ఇంత తీవ్రమైన , తార్కికమైన భావాలు 1882 నాటవి అంటే ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. అయితే తరువాత దేశంలో స్త్రీల ఉద్యమం ఈ భావాల వారసత్వంగా కాక ఉదారవాద సంస్కరణ దృష్టితోనే సాగింది.

1885 లో జాతీయ కాంగ్రెసు ఏర్పడితే సంపన్న విద్యా వర్గాల నుండి స్త్రీలు కూడా వచ్చి అందులోచేరారు. రవీంద్రనాథఠాగోర్ సోదరి స్వర్ణ కుమారి దెబె ఆరకంగా సామాజిక రాజకీయ రంగాలలోకి వచ్చి స్త్రీ విద్యకోసం పనిచేసింది. పండిత రమాబాయి స్త్రీవిద్యకోసం పనిచేసింది. బొంబాయిలో 1889 లో శారదాసదన్ అనే వితంతు శరణాలయాన్ని నెలకొల్పింది. స్త్రీల అభివృద్ధి కోసం వికాసం కోసం ఆమె ఆర్యమహిళా సమాజాన్ని ప్రారంభించి నిర్వహించింది. కొత్తగా విద్యావంతులవుతున్న స్త్రీల కోసం ప్రతి వారం ఉపన్యాసాలు, గృహసమావేశాలు నిర్వహించింది. క్రమంగా చైతన్యవంతులైన స్త్రీలు సామాజిక రాజకీయ కార్యక్రమలలో భాగస్వాములు కావటం జరిగింది. తమకోసం తామే సంఘాలు పెట్టుకొని తమ అవసరాలు హక్కుల కోసం స్త్రీలు ఉద్యమించటం ప్రారంభించారు.

మొదట్లో కాంగ్రెసుకు అనుబంధంగా వున్న నేషనల్ సోషల్ కాన్ఫరెన్స్‌లో భాగంగా మహిళా పరిషత్ ప్రత్యేకంగా 1905 లో ఏర్పాటయింది. సంస్కరణోద్యమం వల్ల స్త్రీవిద్యకు మద్దతు, విస్తృతి లభించిన మాట వాస్తవమే అయినా స్త్రీల స్వతంత్ర ప్రతిపత్తి భావన మాత్రం ఇంకా ఆమోదయోగ్యం కాలేదు. స్త్రీకి వ్యక్తిత్వం వుటుందని, ఆమెకు ప్రత్యేకమైన ఇష్టాలు వుంటాయని గుర్తించలేని పితృస్వామిక సంస్కృతి మీద విమర్శప్రారంభమైంది సరళాదేవి చౌదురాణి నామకత్వాన భారతస్త్రీ మహామండలి 1910 లో మొదటి సమావేశం జరుపుకొంది. క్రమంగా స్త్రీవిద్య, బాల్యవివాహాలు, పరదాపద్ధతి, కుటుంబంలో స్త్రీ హోదా అనే అంశాల స్త్రీలు కొత్తగా నిర్వచించటం ప్రారంభించారు. 1917 నాటికి మహిళలు ఓటు హక్కు గురించి ఉద్యమించారు. సరోజినీ నాయుడు, సరళాదేవి చౌదూరాణి ఈ విషయంలో చొరవతో మాట్లాడారు. మార్గరేట్ కజిన్స్, అనిబిసెంట్ మొదలైన విదేశీ వనితల మద్దతు కూడా వారికి లభించింది. 1921 లో మద్రాసు శాసనమండలి తో ప్రారంభించి ఒక్కొక రాష్ట్రం మహిళలకు ఓటుహక్కును కలిగించాయి. జాతీయోద్యమంలో పాల్గొంటూ రాజకీయ చైతన్యం పెంచుకోంటూ భారతస్త్రీలు స్వీయ స్వేచ్ఛా సమాన స్వాతంత్ర్యాల కోసం అవసరమైన చట్టాల కోసం పనిచేశారు. చట్టసభలలో సభ్యులై స్త్రీల కోణం నుండి రాజకీయాలను ప్రభావితం చేశారు. ముత్తులక్ష్మి రెడ్డి అలాంటి వారి కోవలోకి వస్తారు. ఓటుహక్కు దేశమంతటా అమలు కావాలని స్త్రీలు ఉద్యమాన్ని నడిపారు. 1930 లలో ఆస్తిహక్కు, విడాకుల హక్కు, వారసత్వహక్కు మొదలైన వాటికోసం చట్టపరమైన ప్రయత్నాలు జరిగాయి. అయితే వీటికి చాలానే ప్రతిఘటన వచ్చింది. స్త్రీల స్థితిగతుల అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టబడిన అన్ని బిల్లులు ఒక్కోటొక్కటిగా వీగిపోయాయి ఇది చాలా అమానుషమని, మగవాళ్ళు తమ భూమిని, సంపదను, అధికారాన్ని సగం కోల్పోవలసి వస్తుందన్న భయంతో వీటిని ఆమోదించ లేక పోయారని బేగం హమీద్ ఆలీ వంటి వారు విమర్శించారు. స్త్రీలు మానవులుగా తమను చూడమని కోరుతున్నారని తమ అసమానతలు, అసహాయతల నుండి విముక్తిని కోరుకొంటున్నారని ఆమె అన్నారు. ఈ బిల్లులు వీగి పోవటం పట్ల స్త్రీల అసంతృప్తిని పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం ప్రముఖ న్యాయవాదులతో ఒక కమిటీని కూడా వేసింది. అది రావు కమిటీగా ప్రసిద్ధమైంది. అయితే దేశ స్వాతంత్ర్య సముపార్జన కోసం కాంగ్రెసు ఇచ్చిన కార్యక్రమానికి ప్రాధ్యానత నిచ్చే క్రమంలో రావు కమిటీతో సహకరించవద్దన్న ఒత్తిడి స్త్రీల మీద వచ్చింది. రావు కమిటీ 8 రాష్ట్రాలలలో తిరిగి 102 సంస్థలకు సంబంధించిన 121 మంది వ్యక్తులను కలిసి మాట్లాడి ఒక నివేదికను సమర్పించింది. హిందూ సమాజాన్ని ఆధునికీకరించే పని పెట్టుకోకుండానే హిందూ చట్టాన్ని మార్చాలని సూచించింది. 1944 లో హిందూ కోడ్ బిల్లు తయారీకి కమిటీ ఏర్పడింది.

1947 లో భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అంబేద్కర్ నాయకత్వంలో రాజ్యాంగం రూపొందింది. పురుషులతో పాటు స్వేచ్ఛా సమానత్వాలు స్త్రీకి సూత్రబద్ధంగా ఆమోదించబడ్డాయి. అంబేద్కర్ న్యాయాశాఖామంత్రిగా 1951 ఫిబ్రవరి 5న హిందూకోడ్ బిల్లును ప్రవేశపెట్టాడు. ఈ బిల్లు వీగి పోవటంతో 1951 సెప్టెంబరు 27న అంబేద్కర్ మంత్రి పదివికి రాజీనామా చేశాడు. స్త్రీల హక్కుల ఉద్యమం భారతదేశంలో ఆవిధంగా అర్థాంతరంగా ఆగిపోయినట్లయింది. స్వాంత్రంత్ర్యనంతరం స్త్రీపురుష సమానతా సాధన. ప్రధానమైన అంశంగా ఏ కార్యక్రమమూ రూపొందలేదనటానికి 1974లో వచ్చిన నివేదిక సాక్ష్యంగా కనిపిస్తుంది. అంతర్జాతీయ ఒత్తిడుల మేరకు విద్యాసాంఘిక సంక్షేమ మంత్రిత్వశాఖ నియమించిన తొమ్మిది మంది సభ్యులతో కూడిన వీణా మజుందార్ కమిటీ ఈ నివేదికను తయారు చేసింది. ఈ నివేదిక ప్రచురించబడటంతో దేశంలో స్త్రీల సమస్యల మీద స్త్రీలు తీవ్రంగా ఆలోచించటానికి, స్త్రీల స్థితిగతుల గురించి భిన్న కోణాల నుండి పరిశోధనలు చేయటానికి ఆవేదనను కలిగించాయి. నూతన మహిళా ఉద్యమ నిర్మాణానికి దారి తీశాయి.

ఏ రాజకీయ తదితర సంఘాలతో సంబంధం లేకుండా స్వతంత్ర ప్రతిపత్తి సంఘాలను ఏర్పరచుకొని స్త్రీలు పనిచేయటం ప్రారంభించారు. అణచివేతకు కారణమైన సంప్రదాయ విశ్వాసాలను ఆచారాలను ప్రశ్నించటం, విమర్శించటం, స్త్రీలపై హింసకు వ్యతిరేకంగా పనిచేయటం మొదలైంది. తరతరాల నిశ్శబ్దాన్ని బద్దలుకొడుతూ నూతన చైతన్యంతో స్త్రీలు అణచివేతపై ధిక్కారాన్ని ప్రకటించారు. పితృస్వామ్య అధికారంపైన. సంస్కృతిపైన, కుటుంబంలో స్త్రీల హింసపైన వరకట్న హత్యలపైన, అత్యాచారాల పైన తక్షణ ప్రతస్పందన ఈ కాలంలో అధికమైంది. స్త్రీలపై పోలీసు రాజ్యహింసలు కూడా ఈ కాలంలో చర్చకు వచ్చాయి. స్త్రీల హక్కులను రాజ్యం ఎంత నిర్దాక్షిణ్యంగా తన ప్రయోజనాలకోసం పక్కకు నెట్టేస్తుందో షాబానో కేసు సందర్భంగా స్త్రీలకు అర్థమైంది. స్త్రీల అభివృద్ధికి, అభ్యుదయానికి, ప్రయోజనాలకు భిన్నంగా ప్రవర్తించే వ్యవస్థల స్వభావాన్ని గుర్తించి ప్రకటించి పనిచేస్తున్న క్రమంలోనే స్త్రీలు స్త్రీవాదులుగా పురుష ద్వేషులన్న ఆరోపణను, కుటుంబాన్ని విచ్ఛిన్నం చేసే శక్తులన్న నిందను కూడా ఎదుర్కొన వలసి రావటం జరిగింది. లింగ పరంగా సమన్యాయసాధనకు తాము చేయవలసిన ప్రయాణం ఇంకా ఎంతో వుందని ఈ రోజు భారత స్త్రీలు అభిప్రాయపడుతున్నారు.

## 8.2.3. స్త్రీల ఉద్యమం - ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి చెందిన జ్ఞాన చైతన్యాలు :

స్త్రీల జీవితంలో అభివృద్ధి గురించిన ఆలోచనలు, హక్కుల గురించిన చైతన్యం అంతర్జాతీయ స్థాయిలో 1790 ల నాటికి ప్రారంభమైతే 1820 ల నాటికి జాతీయ స్థాయిలో సహగమన వ్యతిరేక ఉద్యమంగా ప్రారంభమై 1880 నాటికి స్త్రీల చైతన్య వికాసంగా పరిణామం చెందింది. దాదాపు 1850లు నాటికి ఆంధ్రదేశంలో కూడా స్త్రీల అభివృద్ధి విషయంలో కదలికలు ప్రారంభమైనాయి. మద్రాసులో శ్రీనివాసపిళ్ళై, గాజుల లక్ష్మీనరసు చెట్టి స్త్రీవిద్యాభివృద్ధికోసం పనిచేశారు. 1862 లో సామినేని ముద్దు నరసింహం 'హితసూచని' అనే గ్రంథాన్ని ప్రచురించి "స్త్రీలకు విద్యలు సాధకములగుచున్నవి' అని చెప్పాడు. బాల్యవివాహం, కన్యాశుల్కం, వితంతు సమస్య ఇవన్నీ స్త్రీజాతికి సంబంధించిన ఒక వస్తువుగా చులకనగా చూడటమే అసలు సమస్య అన్నాడు. స్త్రీలని ఒక వస్తువుగా చూడటం మాని, ఒక వ్యక్తిగా అంగీకరించటమే స్త్రీ సమస్యకు అసలైన పరిష్కారం అని అభిప్రాయపడ్డాడు. 1867 లో జానకమ్మ విశాఖపట్నంలోనూ 1868 లో మహారాజా విజయరామగజపతి విజయనగరంలో ఒక బాలికా పాఠశాలను ఏర్పరచారు. 1870 లో మద్రాసులో మేరీ కార్పెంటర్ చొరవతో ఉపాధ్యాయినుల శిక్షణ కళాశాల ఏర్పడింది. 1876 లో జయ్యరు సూరి 'స్త్రీకళాకల్లోలిని' అనే గ్రంథాన్ని ప్రచురించి స్త్రీవిద్యా ప్రాముఖ్యతను చాటి చెప్పాడు. రాజమండ్రిలో ఒక బాలిక పాఠశాలను 1883 లో సతీహిత బోధిని పత్రికను ప్రారంభించి ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ ఉద్యమానికి ముందు భాగాన నిలిచాడు.

1850 నాటికి బాల్య వివాహదురాచారానికి వ్యతిరేకంగా భావ ప్రచారం ప్రారంభమైంది. మద్రాసులోని పచ్చయ్యప్ప హైస్కూలులో అసిస్టెంటు టీచరు అయిన దంపూరు నరసయ్య మద్రాస్ టైమ్స్ అనే పత్రికలో ఈ సమస్యమీద లేఖలు వ్రాశాడు.

బాల్యవివాహాలు శాస్త్ర విరుద్ధమని ప్రకటించాడు. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా వీరేశలింగం పంతులు ఆంధ్రదేశంలో పెద్ద ఉద్యమాన్నే నిర్మించాడు. బాల్యవివాహాలను నివారించటానికి ఆయన రెండు ఆచరణాత్మక చర్యలను ప్రతిపాదించాడు. 1. వివాహానికి నిర్థిష్టమైన వయోపరిమితిని నిర్ణయించి, ఆపరిధిలోకి రాని పురుషులను విద్యావ్యవస్థల్లో లభించే అవకాశాల నుండి, సౌకర్యాల నుండి మినహాయించాలి. 2. పెండ్లి కాని వాళ్ళకే ప్రభుత్వం ఉద్యోగాలు యివ్వాలి. రాజమండ్రి సంఘ సంస్కరణ సమాజం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాన్ని బలపరిచి, పదేళ్ళలోపు ఆడపిల్లలకు, పద్నాలుగేండ్ల లోపు మగపిల్లలకు పెళ్ళిళ్ళు చేయరాదని శాసనం చేయించటానికి కృషి చేసింది.

1874 నాటికి మద్రాసు నగరంలో ఆర్. రఘునాధరావు, చంచలరావూ కలిసి వితంతువివాహసంఘం ఏర్పరచి భావప్రచారాన్ని ప్రారంభించారు. 1875 లో విశాఖ పట్నానికి చెందిన పరవస్తు వెంకటరంగాచార్యులు 'స్త్రీ పునర్వివాహ సంగ్రహం ' అనే పుస్తకం ప్రచురించి ఆంధ్రదేశంలో పునర్వివాహోద్యమానికి వేగుచుక్క అయినారు. రాజమండ్రిలో చల్లపల్లి బాపయ్య ప్రోత్సహంతో రాజమండ్రిలో స్త్రీపునర్వివాహోద్యమం ప్రారంభమైంది. 1879 లో వితంతు వివాహ సంఘాన్ని ఏర్పరచారు. ఈ సంఘం పక్షాన వీరేశలింగం పంతులు వితంతు పునర్వివాహానికై ప్రచారం చేస్తూ ఊరూరా తిరిగాడు. ప్రజాభిప్రాయిన్ని సమీకరించటానికి కృషి చేశాడు. సంప్రదాయ వర్గాల ప్రతికూలతను, భౌతిక దాడులను ఎదుర్కొంటూనే వీరేశలింగం పైడా రామకృష్ణయ్య తదితరుల సహకారంతో స్త్రీపునర్వివాహోద్యమాన్ని నడిపాడు. స్త్రీల విద్యకు శారదానికేతన్ స్థాపించి నిర్వహించాడు.

స్త్రీవిద్యా ఉద్యమం వ్యాప్తి చెందే కొద్దీ స్త్రీలు సామాజిక రంగాలలోకి రావటానికి, తమ గురించి తామే మనుకొంటున్నారో, తమకు ఏది కావాలనుకొంటున్నారో చెప్పటానికి అవకాశం కలిసివచ్చింది. వీరేశలింగం శిక్షణలో కొటికలపూడి సీతమ్మ సంఘసంస్కరణోద్యమ భావాలతో పదునెక్కింది. 20వ శతాబ్ది ప్రారంభానికి స్త్రీల సంఘాలను పెట్టుకొనటం ప్రారంభమైంది. బండారు అచ్చమాంబ, ఓరుగంటి సుందరి రత్నమాంబల నాయత్వంలో 1902 లో బృందావన పుర స్త్రీ సమాజం మచిలీపట్నంలో స్థాపించబడింది. స్త్రీ విద్యావ్యాప్తికి ఈ సంఘం కృషి చేసింది. 1905లో గుంటూరులో జరిగిన స్త్రీల మహాసభ విద్యకూ వివాహానికి సంబంధించిన మహిళా సమస్యల మీద తీర్మానాలు చేసింది. కృష్ణా గోదావరి జిల్లాల్లో ఏర్పడిన స్త్రీ విద్యాభివృద్ధినీ సమాజం (1907), అనంతపురంలో హట్టిపిల్లమ్మ నాయకత్వంలో ఏర్పడిన శారదామందిరం స్త్రీ విద్యావ్యాప్తికి తోడ్పడ్డాయి. స్త్రీల విద్య గురించి స్త్రీలే మాట్లాడటం ప్రారంభించిన సందర్భం ఇది.

ఉద్యమ చైతన్యంలో గుంటూరు మొట్టమొదటిసారిగా 1910 లో అఖిలాంధ్ర మహిళా సంభ ఏర్పాటైంది. 1913లో బాపట్లలో ప్రథమాంధ్ర మహాసభ జరిగినప్పుడు కొటికలపూడి సీతమ్మ అధ్యక్షతన ప్రత్యేక మహిళా సమావేశాలు జరిగాయి. స్త్రీవిద్య గురించి, స్త్రీల అవసరాల గురించి స్త్రీలు మాట్లాడటం ఈ సమావేశం ప్రత్యేకత. 1914 ఏప్రిల్‌లో అయిదవ ఆంధ్రమహిళ సభ విజయవాడలో జరిగినప్పుడు సూరిభ్రమరాంబ, మోటుపల్లి రాజబాయమ్మ, కొటికలపూడి సీతమ్మ, చట్టాతి లక్ష్మి నరసమ్మ ఆదుర్తి భాస్కరమ్మ మొదలైన వారు పాల్గొని స్త్రీవిద్య స్వాతంత్ర్యాల భాగస్వామ్యం గురించి ఆర్థిక స్వాతంత్ర్యద్యమ రాజకీయాలలో స్త్రీల భాగస్వామ్యం గురించి ఆర్థిక స్వాతంత్ర్యం గురించి కూడా చర్చించారు. అయితే ఇవన్నీ వాళ్ళ భర్తలు చేస్తున్న పనులకు సహాయకారిగా, వాళ్ళ భర్తల ఆదర్శాలను లక్ష్యాలను పరిపూర్ణం చేసేవిగా వుండాలన్న దృక్పథమే వాళ్ళ అభిప్రాయాలలో ప్రధానంగా వ్యక్తమైంది. అంతే కాదు ఆ సభలో స్త్రీ అభివృద్ధికి, అభ్యుదయానికి సంబంధించి చేసిన 25 తీర్మానాలలో వితంతు విద్యాలయాలు, శరణాలయాలు నెలకొల్పాలని ఉపకార వేతనం వృద్ధి చేయాలని కోరారే కానీ స్త్రీ పునర్వివాహ విషయాన్నే ప్రస్తావించలేదు. స్త్రీల చైతన్యం పితృస్వామిక పరిధిలో ప్రవర్తించిందనటినికి ఇది నిదర్శనం.

20 వ శతాబ్ది ప్రారంభానికి ఆంధ్రదేశంలో మహిళలు సంఘాలు పెట్టుకొనటం, స్త్రీల ప్రయోజనాల కోసం బండారు అచ్చమాంబ లాంటి వారు ఊరూరా తిరిగి ఉపన్యాసలియ్యటం మొదలైతే అదే సమయంలో స్త్రీలు తమ ప్రయోజనాల పరిరక్షణకు

, స్త్రీల అభ్యుదయానికి సంబంధించిన భావ ప్రచారానికి పత్రికా రంగాన్ని వేదికగా చేసుకొని పని చేయటం కూడా ప్రారంభించారు. స్త్రీలు స్త్రీల కోసం ఆంధ్రదేశంలో నిర్వహించిన తొలి పత్రిక హిందూ సుందరి **(1902)** ఈ పత్రిక స్త్రీలను విద్యావంతలను చేయటమే కాక స్త్రీల హక్కుల గురించి ప్రశ్నించటం నేర్పించింది. పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ సంపాదకత్వంలో సావిత్రి వింజమూరి వెంకటరత్నమ్మ సంపాదకత్వంలో 'అనసూయ' మొదలైన పత్రికలు వచ్చాయి. స్త్రీ విద్యను ప్రోత్సహించాయి కానీ ఈ పత్రికలు పాతివ్రత్యానికి ప్రాధాన్యతనిచ్చి పునర్వివాహాన్ని వ్యతిరేకించాయి. కొటికలపూడి సీతమ్మగారి ప్రేరణతో హనుమర్తివరలక్ష్మమ్మ విద్యావంతురాలై స్త్రీల అభివృద్ధికి వ్యతిరేకంగావున్న సనాతన మూఢాచారాలను విమర్శిస్తూ అనసూయ, గృహలక్ష్మి వంటి పత్రికలకు వ్రాసింది. శారదలేఖలు, శీర్షిక క్రింద అనేక సమకాలీన అంశాల మీద ఆమె చర్చించింది. జాతీయాద్యమ రాజకీయాల పట్ల ఆమె సానుకూల వైఖరి ఆమె వ్రాతలలో ప్రతిపలించి ఎంతో మంది స్త్రీలు జాతీయోద్యమ రాజకీయాలలోకి ప్రవేశించటానికి ప్రేరణ అయింది. **1931** లో ఆమె స్వయంగా బాపట్లలో 'స్త్రీ హితైషిణీ మండలి ' ఏర్పాటు చేసింది. ఈ రకంగా స్త్రీల అభివృద్ధి కోసం వికాసం కోసం స్త్రీలు ఒక వైపు కృషి చేస్తుండగా దుర్గాబాయిదేశ్‌ముఖ్ దువ్వూరి సుబ్బమ్మ, ఉన్నవలక్ష్మీ బాయమ్మ, మాంగటి అన్నపూర్ణ మొదలైన అనేకమంది స్త్రీలు జాతీయోద్యమ రాజకీయాలలో క్రియాశీల పాత్ర వహించారు. కొమర్రాజు అచ్చమాంబ, కొండపల్లి కోటేశ్వరమ్మ , మల్లుస్వరాజ్యం, ఆమట్ల కమల, కమలమ్మ, జమాలున్నీసాబాజీ మొదలైన స్త్రీలు ఎందరో కమ్యూనిస్టు ఉద్యమంలో చేరి పనిచేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి స్త్రీ పురుష సమానత రాజ్యాంగం ఆమోదించిన విలువ అయినప్పటికి సమాజంలో స్త్రీ పురుష అసమానత కొనసాగుతునే వున్నది. చట్టాలు స్త్రీల జీవితంలో తెచ్చిన అభివృద్ధి పెద్దగా లేదు. సాంఘిక ఆర్థిక రాజకీయ రంగాలలో స్వాతంత్ర్యం వచ్చాక కూడా వివక్షకు గురి అవుతున్న పరిస్థితుల పట్ల స్త్రీలలో అసంతృప్తి పెరిగింది. ప్రపంచ దేశాల స్త్రీల అసంతృప్తిలో భాగంగానే దీనిని చూడాలి. గుర్తింపు ఉద్యమాల వంటివి ఇతర దేశాలలో వలె భారతదేశంలో ముమ్మరంగా జరగకపోయినా తెలుగులో స్త్రీల రచనలలో ఆ సంతృప్తి తాలూకూ ప్రతిధ్వనులు వినబడతాయి. తెలుగులో పందొమ్మిది వందల అరవైయ్యవ దశకంలో స్త్రీలు విస్తృతంగా రచనారంగంలోకి ప్రవేశించారు. తాము మనుషులమని, తమకూ కొన్ని కోరికలు, సృజనశక్తులు వున్నాయని వాటికి జీవితంలో సంతృప్తికరమైన స్థానం గుర్తింపూ అభించాలని స్త్రీలు ఆకాంక్షించారు. ఆ ఆకాంక్షలు పందొమ్మిది వందల అరయ్యవదశకపు స్త్రీల రచనలలో ముఖ్యంగా నవలల్లో కనిపిస్తాయి.

అటు జాతీయోద్యమ సాఫల్యం కానీ, ఇటు వామపక్ష ఉద్యమాలు కానీ స్త్రీల జీవితంలో గుణాత్మక అభివృద్ధిని తీసుకురాలేదన్న అవగాహన పెరిగి పందొమ్మిది వందల డెభ్భైలలో స్త్రీలు ఏదో ఒక రాజకీయ పక్షానికి అనుబంధంగా వుండటం ఇక ఎంత మాత్రం ప్రయోజన కారి కాదని గ్రహించారు. అభ్యుదయభావాలు కలిగిన స్త్రీలు కొందరు ప్రోగ్రసివ్ ఆర్గనైజేషన్ ఫర్ విమెన్' అనే సంస్థగా ఏర్పడి విద్యార్థినులను స్త్రీల సమస్యల మీద కదిలించటానికి, సమీకరించటానికి ప్రయత్నించారు. నిత్యజీవిత వస్తువుల ధరల పెరుగుదలకు, వరకట్నం లైంగిక హింస, అశ్లీలత మొదలైన వాటికి వ్యతిరేకంగా స్త్రీలు పనిచేశారు. స్వతంత్ర్య ప్రతిపత్తి మహిళా సంఘాలు స్త్రీలకు సంబంధించిన అనేక సమస్యల మీద చర్చను నూతన స్త్రీవాద ఉద్యమం ఆంధ్రదేశంలో వేరునుకొన్నది. స్త్రీ శక్తి సంఘటన, ఫెమినిస్టుస్టడీ సర్కిల్, (హైదరాబాదు) స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ (వరంగల్లు) వంటి చిన్నచిన్న సంఘాలు ఏర్పడి పితృస్వామ్యం, శరీరరాజకీయాలు, పునరుత్పత్తి హక్కులు, స్త్రీల పని, కుటుంబ హింస, లైంగిక వివక్ష, వేధింపులు, వంటి విషయాలమీద కేంద్రీకరించి పనిచేశాయి. విస్తృతంగా సాహిత్యాన్ని సృష్టించాయి. రమీజాబి, షకీలాబాలపై అత్యాచారాలు జరిగిన సందర్భంగా ఆంధ్రదేశంలో వివిధ స్త్రీల సంఘాలు. రేప్ కేసులకు సంబంధించిన చట్టాల సవరణను ఆశిస్తూ ఆందోళన సాగించాయి. స్త్రీ సమస్య కేవలం సంస్కరణకు లొంగేది కాదన్న గ్రహంపు ఈ కాలపు ఉద్యమంలో కనిపిస్తుంది. అధికార రాజకీయాలతో దానికి వున్న సంబంధం స్పష్టంగా గుర్తించబడింది. అధికార వ్యవస్థలను బద్దలు కొట్టటం లక్ష్యంగా స్త్రీవాద ఉద్యమం సాంస్కృతిక ఉద్యమంగా రూపుతీసుకొన్నది. ఇది ఆంధ్రదేశంలో భావవిప్లవానికి కారణమైంది. స్త్రీపురుషులను శత్రు కూటముగా నిలబెడుతున్నదన్న వాదను, కుటుంబాల విచ్చినతకు, విశృంఖలతకు దారి తీస్తుందన్న ఆరోపణను

ఎదుర్కొన్నప్పటికీ 80 వ దశకంలో అభివృద్ధి చెందిన స్త్రీవాద ఉద్యమం ఆంధ్రదేశంలో జనజీవితాన్ని విశేషంగా ప్రభావితం చేసిదని మాత్రం చెప్పక తప్పదు.

కుటుంబ హింసను వ్యక్తిగతమైందిగానో, కుటుంబ సభ్యులకు సంబధించిన గానో చూచే దృష్టిని మార్చి అదొక సామాజిక నేరం అన్న అవగాహనను అభివృద్ధి చేయటమే కాక ఆంధ్రదేశంలో మహిళా ఉద్యమం కుటుంబహింసకు రాజకీయార్థిక విధానాలకు మధ్యవున్న సంబంధాన్ని కూడా 'సారాఉద్యమం' ద్వాఆ చర్చలోకి తెచ్చింది. పూలే, అంబేద్కర్ తదితరుల భావధారను అందిపుచ్చుకొని స్త్రీల సమస్యను దళితదృక్పథం నుండి చూచి వ్యాఖ్యానించటం నూతన స్త్రీవాద ఉద్యమంలో ఒక భాగమైంది. ఆ విధంగా ఆంధ్రదేశంలో మహిళా ఉద్యమం పితృస్వామిక సంస్కృతీ పరిధిలో పుట్టిపెరిగి, విమర్శనాత్మకంగా వికసించి పితృస్వామ్య వ్యవస్థల, చట్టాల, అధికార స్వభావాన్ని గుర్తించి వాటిని ప్రజాస్వామికీకరించుకొనే దిశగా ఎదుగుతూ వచ్చింది. స్థానిక స్త్రీల సమస్యలు, జీవితం, అనుభవాలు ప్రాతిపదికగా ప్రపంచమంతటా స్త్రీల జీవితంలో అభివృద్ధికరమైన ఉద్యమాలు అభివృద్ధి చేసిన భావజాల సిద్ధాంతాలు కలిగించిన అవగాహన తో ఆంధ్రదేశంలో స్త్రీల ఉద్యమం కొనసాగుతున్నది.

### 8.2.4. స్త్రీల ఉద్యమ చైతన్యం - తెలుగు సాహిత్యం :

స్త్రీల ఉద్యమం ఒక సామాజిక సంఘర్షణను ముందుకు తీసుకొని వచ్చింది. స్త్రీల స్థితిగతుల గురించి, కుటుంబంలో స్త్రీ పాత్ర గురించి స్థిరపడివున్న సనాతన సంప్రదాయ భావాలతో, విశ్వాసాలతో సంఘర్షణ 'ఆధునికి మహిళ' ఆవిర్భావానికి అత్యవసరమూ, అనివార్యమూ అయింది. ఈ సంఘర్షణను ప్రతిఫలించటంలో తెలుగు సాహిత్యం తెలుగునాట వున్న మహిళా ఉద్యమ చైతన్యస్థాయిని మించి చాలా ముందుకు వెళ్ళింది. ఆధునిక భావజాల నిర్మాణంలో చురుకైన పాత్రపోషించింది.

స్త్రీవిద్యా ప్రచారం కోసం వీరేశలింగం పంతులు వంటివారు వ్రాసిన వ్యాసాలు, అంతకుముందే సామినేని ముద్దునరసింహం, జయ్యరు సూరి వంటివారు చేసిన హితసూచని, స్త్రీకళాకల్లోలిని వంటి రచనలు, స్త్రీపునర్వివాహాన్ని సమర్థిస్తూ, వ్యతిరేకిస్తూ కూడా వచ్చిన రచనలు ఇవన్నీ ఒక ఎత్తు. సిద్ధాంత ప్రతిపాదన, వాద వివాదాలు వీటిలో సారం. ఈ సారాన్ని జీవిత సారాంశంగా మానవ జీవిత సంబంధాలలో భాగం చేసి నిరూపించటం సృజన సాహిత్యం చేసిన పని, వీరేశలింగం పంతులు దగ్గర నుండి ప్రారంభించి గురజాడ, చలం, శ్రీపాదసుబ్రహ్మణ్యశాస్త్రి, కొడవటి గంటి కుటుంబరావు మొదలైన వాళ్ళు ఈ రకమైన సాహిత్య సృజన చేసి 'ఆధునిక మహిళ' కు రూపురేఖలను స్వభావాన్ని ఇచ్చారు.

వీరేశలింగం 'బ్రాహ్మవివాహం' అను పెద్దయ్యగారి పెండ్లి ప్రహసనం వ్రాసి బాల్యవివాహాలు వల్ల వచ్చే దుష్పరిణామాలను, చిత్రించాడు. బాలవితంతువులు శీలరమితులై పతనం చెందటినికి అనుకూలంగా వున్న భౌతిక సామాజిక ధర్మాలను, నిర్మాణాలను చూపించి ఈ దుర్మార్గాన్ని సవరించటానికి పునర్వివాహం అవసరం అన్న ఆలోచనకు ప్రేరణ ఇచ్చాడు. అట్లాగే తన సమకాలంలో నడుస్తున్న వేశ్యావ్యతిరేక ఉద్యమానికి కూడా ఆయన తన ప్రహసన రచనల ద్వారా మద్దతు నిచ్చాడు. వేశ్యావ్యామోహం తగదని, అందువల్ల డబ్బు, నీతి , ఆరోగ్యం కోల్పోవటం తప్పమరేమీలేవని వేశ్యాప్రియ సాహిత్యయుగకర్తగా ఏ నవలల ద్వారా వీరేశలింగం ప్రసిద్ధుడైనాడో ఆ నవలల్లో స్త్రీవిద్య ఒక్కటే ప్రధాన వస్తువైంది. రాజశేఖర చరిత్రలో అది పాక్షికాంశం. సత్యవతీ చరిత్ర నవల వస్తువు సమస్తం అదే. వీరేశలింగం పంతులు 'ఆడచెత్త మగమాణిక్యం' అన్న సంప్రదాయ భావనను నిరసిస్తూ స్త్రీ జీవితానికి విద్య వెలుగు నిస్తుంది, స్త్రీల జీవితంలోని సమస్యలకు పరిష్కారాన్ని వ్యగల చైతన్య శక్తిగా దోహదపడుతుందని ఈ నవలలో ఆయన నిరూపించాడు.

అయితే స్త్రీ విద్యవల్ల వీరేశలింగం పంతులు ఆశించిన ప్రయోజనాలు పితృస్వామిక కుటుంబ సంస్కృతీ పరిధిలోనివే. స్త్రీలు పూర్వపుణ్యసతుల చరిత్రలు చదివి వారివలె పతివ్రతలుగా జీవించ వుత్సాహపడతారని, విద్యవల్ల వివేక వతులై కుటుంబంలో

తోటి స్త్రీలతో వ్యర్థకలహం మానుతారని, చదువుకొని దేశవిదేశాలలో ఉద్యోగస్థులవుతున్న భర్తలకు కుటుంబ వ్యవహారాలలో చేదోడు వాదోడు అవుతారని, పిల్లలను వివేక వంతులుగా తీర్చిదిద్దగలుగుతారని ఆయన స్త్రీవిద్య గురించి వివేకవర్ధినిలో **1875 -1880** మధ్య కాలంలో వ్రాసిన వ్యాసాలలో పేర్కొన్నాడు. సత్యవతీ చరిత్రలో సరిగ్గా ఆ అంశాలనే కథావస్తువుగా చేసుకొన్నాడు. 'సత్యవతి' ని విద్యావంతురాలైన ఆదర్శ స్త్రీ నమూనాగా తీర్చిదిద్దాడు.

స్త్రీ విద్య గురించి, స్త్రీల శరీర ఆరోగ్య విషయాల గురించి, నిర్బంధ వైధవ్యాల గురించి తాను సామాజిక సంస్కర్తగా చెప్పుతున్న విషయాలు, చేస్తున్న ప్రచారం సంప్రదాయ ధర్మాలలో మొద్దుబారిన మనశ్శరీరాలు కలిగిన మనుషులలో ఏ కదలికనూ కలిగించకపోవటం గమనించి, షాక్ ట్రీట్మెంట్‌గా సాహిత్యరచన చేశాడు కందుకూరి. 'ఆడమళంగూళము' పూర్తిగా ఆ ప్రయోజనం కోసం వ్రాసిందే. సమకాలీన సమాజాన్ని తలకిందులు చేసి నిలబెట్ట ఈ సమాజంలో పురుషులకున్న అవకాశాలు సదుపాయాలు స్త్రీలకు వుండి, స్త్రీలకు వున్న రెండవస్థానం పురుషులకు వుంటే ఎలా వుంటుందో హాస్యాస్పదంగా చూపించి, ప్రస్తుతం సమాజంలో స్త్రీకి వున్న స్థానం ఎంత అన్యాయమైందో గ్రహించటానికి ప్రేరణ నిచ్చారు. స్త్రీ జాతిపట్ల చేస్తున్న ద్రోహం గురించిన చింతన పురుషులలో ప్రారంభంకావాలన్న బలీయమైన కోరిక ఇందులో కనబడుతుంది.

స్త్రీపురుషుల మధ్య వున్న సామాజిక అసమానతలను గుర్తించి వాటిని వ్యంగ్య విమర్శకు లోను చేయటం వరకు వీరేశలింగం సాహిత్యం ఒక అభివృద్ధికరమైన పాత్రను నిర్వహించింది. అయితే వీరేశలింగం సంస్కరణోద్యమ దృక్పథంలో నైతికతకు వున్నంత ప్రాధన్యత వ్యక్తి స్వేచ్ఛకు, వికాసానికి లేదు. సమాజంలో సంస్కరణను ఆశించాడే కానీ మానవసంస్కారం లో రావలసిన మార్పు గురించిన లో చూపులేదు. అందువల్ల వీరేశలింగం పంతులు చేయించిన వితంతువివాహాలు సమాజంలో స్త్రీపురుష సంబంధాలలో మౌలికమైన మార్పును తేలేకపోయాయి. సమకాలంలో సంస్కరణోద్యమ పరిణామాలను గమనిస్తూ వున్న గురజాడ అప్పారావు విమర్శనాత్మక దృక్పథంతో దానిని సాహిత్యవస్తువుగా చేసుకొన్నాడు.

మగవాళ్ళ అధికారం కింద పెత్తనం కింద బానిసలుగా ఆడవాళ్ళు మ్రగ్గిపోతున్నారని గుర్తించటమే గురజాడ దృష్టికోణంలోని నూతనత్వం. వీరేశలింగం సంస్కరణోద్యమలలోని వితంతు పునర్వివామం, స్త్రీవిద్య, వేశ్యావ్యతిరేకత అనే అంశాలను స్త్రీల అనుభవకోణం నుండి చర్చకు పెడుతూ 'కన్యాశుల్కం' నాటకాన్ని గొప్ప సాహిత్య కళాఖండంగా మలిచాడు. కన్యాశుల్కానికి ఆశపడి ఆడపిల్లల బ్రతుకు పట్ల నిర్లక్ష్యంతో ముసలివాళ్ళకిచ్చి పెళ్ళిచేసే పురుష దురహంకారానికి ఫలితం బాలవితంతువులు. ఆజన్మాంతం సహజ శారీరక వాంఛలకు చాటుమాటుగా బలి అయ్యేవాళ్ళు. మోసపొయ్యేవాళ్ళు. మీనాక్షి, బుచ్చమ్మ, మొదలైనవాళ్ళందరూ ఈ వ్యవస్థలో భాగమే. వితంతు స్త్రీకి పునర్వివాహమనేది లేకపోతే ఆమెకు ఎంత మంది పురుషులతోనైనా చాటుమాటు సంబంధాలు ఏర్పడుతూ సమాజంలో అనైతికత ప్రబలిపోతుందని వీరేశలింగం భావిస్తే ఈ అనైతికతకు వితంతువులు కాదు కారణం, వాళ్ళను తమ పశువాంఛలకు, ప్రయోజనాలకు అనుకూలంగా కల్లబొల్లిమాటలు చెప్పి ఉపయోగించుకొనే పురుషసమాజమేనన్నది గురజాడ దృష్టి. మీనాక్షి దురవస్థకు కారణంగా ఆమె తండ్రిని, ఆమెను అశలు పెట్టి చాటుమాటు సంబంధాలు కొనసాగించిన రామప్ప పంతులును, బుచ్చమ్మ ఇల్లు దాటటానికి కారణంగా గిరీశం అవకాశవాద అవసర లక్షణాన్ని చూపించాడు గురజాడ ఈ నాటకంలో. అలాగే వితంతు వివాహాల విషయాలలో కూడా వీరేశలింగం అనుసరించిన పద్ధతి ఆనాటికి ఒక అభివృద్ధి కరమైన ముందడుగే అయినా అందులో వధూవరుల వ్యక్తి వికాస చైతన్యాలకు ప్రాధాన్యత లేదు. ముఖ్యంగా స్త్రీల వైపు నుండి ఎంపికకు అసలు అవకాశంలేదు. వీరేశలింగం పండితులు ఒక ఉదార దృక్పథంగల తండ్రి పాత్రను పోషించాడీ సందర్భంలో వితంతువు అయిన స్త్రీకి గౌరవకరమైన కుటుంబ జీవితాన్ని ఇయ్యటం కొరకు వరులను వెతికి వివాహాలు జరిపించాడు. అయితే ఆ వరులు నిజమైన సంస్కారంతో ఈ వివాహాలకు సిద్ధపడ్డారా అని తరచి చూడలేదు. గురజాడ ఈ కోణం నుండి పునర్వివాహ సమస్యను నాటకంలో భాగం చేశాడు. బుచ్చమ్మ లాంటి వితంతువులను వివాహమాడటానికి ముందుకు వచ్చే గిరీశాల స్వభావాన్ని

బట్టబయలు చేశాడు. కీర్తికాంక్ష, వితంతువును పెళ్ళాడటం వలన వచ్చే ఆర్థిక ప్రయోజనం తప్ప ప్రేమ అనేది ఆ వివాహాలకు ప్రాతిపదిక కావటం లేదనేది గురజాడ ఆరోపణ. స్త్రీలు చదువుకొని వివేకవంతులై పెళ్ళి చేసుకొనటానికయినా మానటానికైనా ఎవరిని చేసుకొనాలో ఎంచుకొనటానికైనా నిర్ణయాధికారం కలిగి వుండాలనేది గురజాడ ఆకాంక్ష. దీనిని సౌజన్యారావు పంతులు ద్వారా బుచ్చమ్మ విషయంలో చెప్పించాడు గురజాడ. గురజాడ దర్శించిన 'ఆధునిక మహిళ' రూపొందేది ఈ ప్రాతిపదిక మీదనే ఆధునిక మహిళలు మానవ చరిత్రను తిరిగి రచిస్తారన్న విశ్వాసం గురజాడది. దాంపత్య సంబంధాన్ని యావజ్జీవ స్నేహసంబంధాన్ని నెలకొల్పుకొనవలసిన వ్యవస్థగా మార్చుకొనటం దగ్గర నుండి ప్రారంభించి, క్రూరుడైన మగవాడి నుండి రక్షణ కోసం పశుబలాన్ని తిప్పికొట్టేందుకు కత్తిసాము నేర్వటం వరకు స్త్రీల చైతన్యవంతమైన పాత్రను గురించి గురజాడ కలలు కన్నాడు.

సంస్కరణోద్యమంలో స్వచ్ఛతా ఉద్యమం ఒక భాగం. నైతికత ఇందులో ప్రధానాంశం. తాగుడుకు వ్యభిచారాన్నికి వ్యతిరేకంగా ప్రచారం దీని లక్ష్యం. వేశ్యా వ్యతిరేక ఉద్యమం ఆక్రమంలో రూపొందిందే. వీరేశలింగం పంతులు మొదలైన వాళ్ళు ఈ ఉద్యమంలో సామాజిక కార్యకర్తలే కాదు. సాహిత్య భావ ప్రచారకులు కూడా. రాజశేఖర చరిత్రలో ఆయన భోగం మేళాలను పెళ్ళిళ్ళను పిలవకపోవటాన్ని కుటుంబ సంక్షేమంలో భాగంగా చూపించాడు. వేశ్యాప్రియ ప్రహసనం వంటి రచనలు చేశాడు. అయితే ఈ అన్నింటిలో వేశ్యల పట్ల వ్యతిరేకత హేళన అనేవి ప్రధానాంశాలు. ఈ ధోరణిని సవరించటం కూడా గురజాడ సాహిత్య ఆదర్శం అయింది. వేశ్యావ్యతిరేక ఉద్యమం వేశ్యలు సమాజాన్ని కలుషితం చేసే వారని చెప్పి వాళ్ళకు దూరంగా వుండమని ప్రభోదించిందే కానీ వేశ్యను సుఖదుఃఖాలతో కూడిన జీవితం అనుభవిస్తున్న మనిషిగా చూడలేకపోయింది సంస్కరణోద్యమం. ఆలోటును పూరిస్తూ గురజాడ కన్యాశుల్కం నాటకంలో మధురవాణి పాత్రను సృష్టించాడు. వేశ్య అని సంఘం తిరస్కరించే వ్యక్తిలో మానవత ఎంత నిండుగా తొణికిసలాడుతుంటుందో చూపించాడు. సభ్యసమాజంలో జీవిస్తున్న అనేక మంది గౌరవనీయులైన మగవాళ్ళకంటే విలువల రీత్యా ఆమె ఎంత ఉన్నత స్థానంలో వున్నదో సూచించాడు. దిద్దుబాటు, సంస్కర్తహృదయం వంటి కథలు వ్రాసి వేశ్యావ్యవస్థ ఏర్పడటానికి, దాని ఉనికికి , భవిష్యత్తుకు కూడా కారకులవుతున్న పురుషుల ప్రవృత్తిపై విమర్శను ఎక్కుపెట్టాడు గురజాడ. అలాగే సంస్కరణోద్యమం వల్ల స్త్రీల జీవితంలో కొంత వెసులబాట ఏర్పడవచ్చు కానీ అది పురుషదత్తమైనది కావటం వల్ల పరిమిత స్థాయిలో వుంటుందని, పురుష నియంత్రణలోనే వుంటుందని గుర్తించి చెప్పాడు. మెటిల్డా వంటి కథలలో. సంస్కరణోద్యమాలు నిజమైన అర్థంలో స్త్రీకి విముక్తిని ప్రసాదించలేకపోతున్నాయని స్త్రీల అనుభవకోణం, దృష్టికోణం ప్రత్యేకంగా వుండటానికి వీలుందని గుర్తించి చెప్పటం గురజాడ సాహిత్యగుణం.

వీరేశలింగం పంతులును తన ఆధ్యాత్మిక గురువుగా చెప్పుకొన్న చలం సాహిత్యరచనలో గురజాడ వారసత్వాన్ని అంది పుచ్చుకొన్నాడు. మాన్ అండ్ విమెన్, స్త్రీ ఆయన రచించిన సైద్ధాంతిక రచనలు. స్త్రీ పురుష సంబంధాలలో వుండవలసిన సహజత, స్వచ్ఛతలను, స్త్రీల అనుభవ కోణం నుండి వస్తువుగా చేసి శశిరేఖ, దైవమిచ్చిన భార్యవంటి నవలలు వ్రాశాడు. స్త్రీ పురుష సంబంధాలను చలం సామాజిక కౌటుంబిక లైంగిక స్థాయీ భేదాలతో అర్థంచేసుకొన్నాడు. సమాజం స్త్రీపురుషుల మధ్య అసమసంబంధాన్ని నిర్దేశిస్తున్నదని మగపిల్లలకీ ఆడపిల్లలకీ సృష్టిభేదం కంటే సంఘం కల్పించే భేదమే ఎక్కువని 'నేనేంచేశాను' కథలో అమ్మాయి ముఖతా చెప్పించాడు. స్త్రీ పురుషుల మధ్య వున్న ఈ అసమ సామాజిక సంబంధమే పురుషులను సామాజిక జీవితాన్నిచ్చి స్త్రీలకు లైంగిక జీవితాన్ని మాత్రమే మిగిల్చింది. దానితో స్త్రీలకు పెళ్ళిచేసుకొని పిల్లల్ని కనటమే, పెంచటమే బతుకు తెరువు మార్గమైంది. ఆమార్గంలో స్త్రీలు ఎంత పరాధీనులై హింసకు లోనవుతున్నారో చలం 'నేనేంచేశాను' 'నాయుడుపిల్ల' , మొదలైన కథలలో చూపించాడు. స్త్రీమీద పురుషుడి హక్కును స్థిరీకరించే సామాజికార్థిక రాజకీయ వ్యవస్థల స్వభావాన్ని అందులో స్త్రీ తానుతానుగా మిగలటానికి పడే ఘర్షణను, చేసే పోరాటాన్ని చలం సరిగా గుర్తించగలిగాడు. స్త్రీలు, స్త్రీల సమస్త శక్తులు మగవాళ్ళ ప్రయోజనాలకే వినియోగపడాలని నిర్దేశించిన సామాజిక సంస్కృతిలో స్త్రీలకు వాళ్ళ శరీరం మీద, బ్రతుకు మీద హక్కులేమీ మిగలకపోవటాన్ని కూడా చలం గుర్తించి తన సాహిత్యంలో నమోదు చేశాడు. ముఖ్యంగా స్త్రీల శారీరక ఆర్థిక

సాంఘిక జీవితావసరాలు ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా పునరుత్పత్తి హక్కును స్త్రీల కోణం నుండి ఆర్యుమెంటు, నాఖర్మమిట్లా కాలింది వంటి కథలలో చలం చర్చకు పెట్టాడు. స్త్రీల జీవితాన్ని నియంత్రించటంలో కుటుంబం నిర్వహించే పాత్రను సమగ్రంగా అనేక కోణాల నుండి తన సాహిత్యంలో చూపాడు. మాన్ అండ్ విమెన్ వ్యాసంలో భార్యమీద భర్త నియంత్రణ స్వభావాన్ని విప్పిచెప్పి తీవ్రంగా గర్హించాడు. భార్యాభర్తలుగా స్త్రీపురుషుల మధ్య వుండే సంబంధాలు పూర్తిగా బానిస యజమాని సంబంధాలుగానే వున్నాయిని చలం అభిప్రాయపడ్డాడు. భార్య మెదడు మీద కోరికలమీద పెత్తనం చేసే భర్త ఆమె భావాలను అభిరుచులను తనకను కూలంగా తిప్పుకొని ఆమెను తన నీడలా మార్చుకొంటాడని శరీరాన్ని ఒక్కసారి నాశనం చేసే హంతకుడి కంటే స్త్రీ ఆత్మను కొంచెంకొంచెంగా కొరుక్కుతినే భర్త మరింత ప్రమాదకారుడని చలం నిర్ద్వంద్వంగా ప్రకటించాడు. భర్తచేత హీనంగా చూడబడే స్త్రీ తల్లిగా పిల్లల గౌరవాన్ని కూడా పొందలేదని అంటాడు. కేవలం మరొక బ్రతుకు తెరువు లేక భర్త అధికార తిరస్కారాలను భరిస్తూ జీవించాల్సివస్తున్న స్త్రీల దౌర్భాగ్యాన్ని గురించి చలంవేదన పడ్డాడు.

జీవితంలో ముఖ్యాంశమైన లైంగిక సంబంధాన్ని తుచ్ఛ శారీరకవాంఛగా తక్కువచేసి చెప్పటమో, కాకపోతే పితృ పితామహులను సద్గతులకు పంపించే సంతానాన్ని పొందటం కోసం నిర్వహించవలసిన ఆధ్యాత్మిక కర్మకాండగా ఎక్కువచేసి చెప్పటమో స్త్రీపురుష సంబంధాలను అసహజ సంబంధాలుగా మారుస్తున్నాయని చలం ఆరోపణ. దాంపత్య సంబంధాలు మర్యాదా సంబందాలుగా కాక మానవీయ సంస్పందనా సంబంధాలుగా వుండాలనేది చలం ఆకాంక్ష. లైంగిక సంబంధాల గురించి మాట్లాడటమే పాపమన్నట్లుగా ప్రవర్తిస్తూ సరిఅయిన జ్ఞానాన్ని సరిఅయిన పద్ధతిలో అందించలేని కుటుంబ సంస్కృతి ఆడపిల్లలకు అపాయకరంగా వుంటున్నదని చలం గుర్తించాడు. అది ఆడపిల్లలు మోసపోవటానికి చివరికి తమ శరీరాన్ని తాము ద్వేషించుకొనటానికి, ఆత్మన్యూనతా భావంలో పడి పోవటానికి, అపరాధభావంతో కృంగి పోవటానికి కారణం అవుతున్నదని వేదన పడ్డాడు. బ్రాహ్మణీకం వంటి నవలలను ఈ కోణం నుండి అద్యయనం చేయటం ద్వారా చలాన్ని బాగా అర్థం చేసుకొవచ్చు.

చలం లైంగిక సంబంధాలలో కామం, మోహం, ప్రేమ అనే మూడు స్థితులు వుంటాయంటాడు. కామం శారీరక వాంఛా సంబంధమైన తాత్కాలిక ఉద్రేకాలకు సంబంధించినది కాగా, మోహం, ఆమెట్టుమీది నుంచి ఎదుటి వాళ్ళతో అనుభవాన్ని పంచుకొటూ కలిసి జీవించాలనే తపనకు ఎదిగిన అంశం. ప్రేమ స్వార్థాన్ని బదులుకొన్న సర్వసమర్పణ స్థాయిలో అంశం. ప్రేమస్వార్థాన్ని ఒదులుకొన్న సర్వసమర్పణ స్థాయిలో అంతకంటే ఉదాత్తమైంది. కామం నడిపిస్తే నడిచే మనుషులను చలం అక్కడక్కడా తన సాహిత్యంలో సృష్టించినా ప్రధానంగా మోహానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చాడు. మోహం పరస్పర ఆకర్షణ , ఆరాధనల ప్రాతిపాదికమీద రూపొంది ఒకళ్ళనొకళ్ళు గాఢంగా వాఛించుకొనటంగా వుంటుంది. భార్యాభర్తల అధీన అధికార సంబంధాలలో మోహానికి తావులేదు. కనుకనే స్త్రీ పురుషుల అధీన అధికార సంబంధాల మీద ఆధారపడ్డ కుటుంబ చట్టాన్ని బద్దలు కొట్టడం అనివార్యం అవుతుందని తన రచనల ద్వారా చలం స్పష్టం చేశాడు. ఆ రకంగా చలం సాహిత్యం 'మోహం' మొదలైన లైంగికాంశాలను స్త్రీల కోణం నుండి చర్చలోకి తెచ్చింది.

"స్త్రీకి శరీరం వుంది దానికి వ్యాయామం ఇవ్వాలి. స్త్రీకి హృదయం వుంది. దానికి అనుభవమియ్యాలి. స్త్రీకి మెదడు వుంది. దానిని ఆలోచించనియ్యాలి" అని స్త్రీలను ఇన్నాళ్ళు , సాటి మనిషిగా కాక ఒక సాధనంగా వాడుకొంటున్న సమాజానికి తెలియ చెప్పిన వాడు చలం దానిని సాహిత్యంద్వారా చెప్పటానికి ప్రయత్నించిన క్రమంలోనే చలం తెలుగు సాహిత్యప్రపంచంలో సంచలనం సృష్టించాడు.

చలానికి సమకాలికుడిగా వీరేశలింగం సంస్కరణ భావాలతో గురజాడ దృక్పథానికి దగ్గరగా శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి స్త్రీవిద్యకు, పునర్వివాహానికి అనుకూలంగా తల్లిప్రాణం వంటి కథలు వ్రాశాడు. పురుషాహంకారాన్ని, అధికార స్వభావాన్ని గుర్తించటం స్త్రీల సమస్యల పరిష్కారానికి అవసరమైన చైతన్యం చొరవ స్త్రీల యందే చూపించటం శ్రీపాద కథల ప్రత్యేకత. తల్లిప్రాణం

కథలో భద్రమ్మ ఈ రకమైన చైతన్యమేకనబరచింది. స్త్రీలు తమ జీవితం మీద అధికారం తమదే నన్న సంపూర్ణ అవగాహనతో ఆధునిక స్త్రీలుగా ఎదగటాన్ని శ్రీపాద సాహిత్యం నమోదు చేసింది. కొత్తచూపు, కీలెరిగిన వాత వంటి కథలల్లో అన్నపూర్ణ, కృష్ణవేణి శరీరానికి వ్యాయామమిచ్చి, మెదడును ఉపయోగించే చైతన్యశీల స్వభావంతో తమ జీవితాల మీద ఎవరికీ పెత్తనమీయని స్వాభిమాన ప్రవృత్తిని అభివృద్ధి పరచుకొన్నవాళ్ళు పెళ్ళాడటానికైనా, విడిపోవటానికైనా తమ 'ఆత్మగౌరవం' ఒక్కటే ప్రాతిపదికగా ప్రవర్తించటం వాళ్ళ ప్రత్యేకత.

స్త్రీల జీవితాన్ని, సమస్యలను సాహిత్యవస్తువుగా చేసుకొన్న మరొక రచయిత కొడవటిగంటి కుటుంబరావు. "ఆచారంరీత్యాఅయితేనేం, చట్టం రీత్యానయితేనేం ఒకరి కన్న తక్కువగా పుట్టటం చాలా శోచనీయం. అయినా మన సమాజంలో కొందరు తక్కువ కులాల్లో పుడతారు. అనేకమంది బీదల కడుపున పుడతారు. మరికొందరు ఆడవాళ్ళుగా పుడతారు'' అని ఆడజన్మ నవలలో **(1948)** చెప్పి కుటుంబరావు కుల అసమానతలు, ఆర్థిక అసమానతలలో భాగంగా స్త్రీపురుషుల మధ్య అసమానతను అర్థం చేసుకొనాలనే కొత్త చూపునిచ్చాడు. ఆడజన్మ నవలకు ప్రారంభంలో ఉపోద్ఘాత ప్రాయం వంటి మాటలున్నాయి. నువు మాతల్లివి, అక్కవు, చెల్లివి, భార్యవు అని ప్రారంభించి నువు మాజీతంలేని నౌఖరువు, నీది ఇరవైనాలుగు గంటలనౌకరీ, శలవుల్లేవు నీకు, డాక్టరు సర్టిఫికెట్లులేవు, పించను లేదు, నువు చేతులు మారినా నీనౌకరి మారదు -'' అని కుటుంబరావు చెప్పిన మాటలు స్త్రీల శ్రమ ఆర్థిక విలువలేనిది గాను , తత్ఫలితంగా పనిగంటలకు కానీ, పనివిదానానికి కానీ ఎటువంటి హక్కులు లేనిదిగాను చేయబడిన స్థితిని గురించి ఆలోచింపచేస్తాయి. దీనికి కొనసాగింపుగానే "నీ పట్ల మేమంతా మతానుశాసకులమే, అందరమూ గట్టి సామ్రాజ్యవాదులమే, అందరమూ పెట్టుబడి దార్లమే, అందరమూ గూండాలమే, అందరు సాధువుల్లాగే, అమాయకుల్లాగే, అశక్తుల్లాగే నేను కూడా జీవితం ప్రశాతంగా వెళ్ళాలని ఉంటుంది. ఘర్షణ నీకిష్టం ఉండదు. మంచిది. అట్లా అయితే మాకు తలవంచి ఉండు....'' అంటూ స్త్రీల నుద్దేశించినట్లుగా కొకు వ్రాసిన మాటలు స్త్రీల మీద అధికారం కుటుంబానికి మాత్రమే పరిమితమైనది కాదని మతం, రాజ్యం కూడా ఆమె మీద పెత్తనం చేసే శక్తులేనని సూచిస్తున్నాయి. తన కంటే ముందు వ్రాసిన వీరేశలింగం, గురజాడ, చలం, శ్రీపాద మొదలైన చయితలకంటే విశిష్టంగా స్త్రీ సమస్యను రాజకీయార్థశాస్త్ర కోణం నుండి మొత్తం ప్రపంచంలోని పితృస్వామిక రాజకీయాధికార వ్యవస్థల సంబంధంలో చర్చింవలసిన అంశంగా ప్రతిపాదించాడు కొకు. ఆరకంగా సోషలిస్టు స్త్రీవాద ధోరణికి అతని రచనలు వేగుచుక్కలైనాయి.

మొత్తం మీద కొడవటి గంటి కుటుంబరావు లైంగిక వివక్ష, లైంగికత, స్త్రీల మనోభావాలు, స్త్రీలు చైతన్యం అనే నాలుగు ముఖాలుగా స్త్రీల జీవితాన్ని వస్తువుగా చేసుకొని విస్తృతంగా కథలు, నవలలు వ్రాశాడు. పీడితులైన స్త్రీల పక్షాన, అందులోనూ పీడితులలోకెల్ల పీడుతలయిన శ్రామిక స్త్రీల పక్షాన నిల్చున్నాడు. ఉత్పత్తి సంబంధాలు మారుతూ సామాజిక నిర్మాణాలలో మార్పులు వస్తున్నా స్త్రీల పట్ల శత్రువైఖరి మాత్రం మారలేదని అంటే సామ్యవాద దశలో దానికి ఉద్వాసన జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశాడు.

**1950** వ దశకంలో ప్రారంభించి స్త్రీలు కథలు, నవలలు వ్రాయటం ఎక్కువైంది. రంగనాయకమ్మ, ఇల్లిందిల సరస్వతీదేవి, వట్టికొండ విశాలాక్షి మొదలైన వాళ్ళు రచనారంగంలోకి ప్రవేశించటంతో స్త్రీల జీవితానుభవాలు అసంతృప్తులు, ఆకాంక్షలు తెలుగు సాహిత్య వస్తుసంపదలో భాగం కాగలిగాయి. వ్యక్తులుగా ఉనికి కోసం, గుర్తింపు కోసం స్త్రీలు పడే ఆరాటాన్ని పరిమితులోనైనా నమోదు చేయగలిగింది. యద్దనపూడి సులోచనారాణి మొదలైన వాళ్ళసాహిత్యం. వంటింటి సాహిత్యంగా, కాలక్షేపపు సాహిత్యంగా స్త్రీల సాహిత్యం చవక చేయబడి, చిన్నచూపుకు గురి అయినప్పటికీ విద్యావంతులవుతున్న మధ్యతరగతి మహిళల మనోభావాలను నమోదు చేయటంలో అరవైయ్యవ దశకంలోనూ ఆ తరువాత స్త్రీలు వ్రాసిన సాహిత్యం ప్రముఖపాత్ర వహించిందన్నది వాస్తవం. **1980** లలో స్త్రీలకు సామాజిక రాజకీయార్థిక ఉద్యమాలలో భాగస్వాములై పొందిన అనుభవానికి తోడు కొత్తగా అందివచ్చిన స్త్రీ

వాద సైద్ధాంతిక భావజాలం స్త్రీల సాహిత్యానికి కొత్త రాజకీయ పదునును సమకూర్చింది. పితృస్వామ్య అధికారం స్త్రీల జీవితాన్ని ఎన్ని పార్శ్వాల నుండి ఎన్నిరకాలుగా నియంత్రిస్తున్నదో గుర్తించి దానిని సాహిత్యవస్తువుగా మలుచుకొన్నారు స్త్రీలు అస్తిత్వేషణలో తమను తాము తెలుసుకొనటం, తాము తాముగా నిలబడటం, తమను తాము రక్షించు కొనటం, లక్ష్యంగా స్త్రీవాద సాహిత్యాన్ని అభివృద్ధిపరిచారు. వర్తమాన తెలుగు సాహిత్యచరిత్రలో దీనిది ప్రముఖస్థానం బలమైన ముద్ర.

## 8.3. సారాంశం :

ఫ్రెంచి విప్లవ నేపథ్యంలో అభివృద్ధిచెందిన హక్కుల ఉద్యమంలో భాగంగా అంతర్జాతీయంగా స్త్రీల హక్కుల ఉద్యమం ప్రారంభమైంది. చదువుకొనటానికి, ఆస్తిలో భాగం పొందటానికి, ఓటు వేయటానికి, పనిచేయటానికి పనిలో సమానవేతనాలు పొందటానికి స్త్రీలకు పురుషులతో పాటు సమాన హక్కులు కావాలన్న చైతన్యం, ఉద్యమాలు ఫ్రాన్స్, ఇంగ్లండ్, అమెరికా, జర్మనీ మొదలైన దేశాలలో అభివృద్ధి చెందాయి. వివాహం, విడాకులు మొదలైన హక్కుల గురించి కూడా ఆందోళనలు జరిగాయి. ఇలాంటి ఉద్యమాలను ఉదార మహిళా ఉద్యమం అంటారు. శ్రామిక వర్గమహిళలు పనిగంటలకోసం, వేతన సమానత్వం కోసం , ప్రసూతి శలవుకోసం - ఇలా రకరకాల తమ దైనందిన సమస్యల మీద చేసిన పోరాటాలను సోషలిస్టు మహిళా ఉద్యమం అనే పేరుతో ప్రస్తావిస్తారు. 20 వ శతాబ్దిలో జాతులు విముక్తమై దేశాలు స్వతంత్రమైన తరువాత కూడా స్త్రీల జీవితాలలో అభివృద్ధికరమైన మార్పు రాకపోవటాన్ని గుర్తించిన మహిళల ఆవేదన ఆందోళన 1960 వ దశకానికి కొత్త స్త్రీవాద ఉద్యమంగా రూపొందింది. 1792 లో ఇంగ్లండులో మీదీరోలస్టన్ క్రాఫ్ట్‌తో ప్రారంభించి, 1970 లలో కేట్‌మిల్లెట్ లాంటి అనేక మంది స్త్రీలు స్త్రీ సమస్యపై విస్తృత అధ్యయానాలు చేసే రచనలు చేసారు. స్త్రీ సమస్యను అర్థం చేసుకొనటానికి కావలసిన జ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చారు.

అంతర్జాతీయ స్థాయిలో స్త్రీల గురించి స్త్రీలు మాట్లాడటం 1790 నాటికే ప్రారంభమైంది. భారతదేశంలో మరొక 28 ఏళ్ళకు కానీ స్త్రీల సమస్యమీద చర్చ ప్రారంభం కాలేదు. ఆచర్చను కూడా ప్రారంభించింది పురుషులు. సతీసహగమనానికి వ్యతిరేకంగా 1818లో ప్రజాభిప్రాయసేకరణకై రామమోహన రాయ్ పూనుకొన్నప్పటి నుండి స్త్రీ సమస్య భారతదేశంలో చర్చకు వచ్చింది. పునర్వివాహం, వారసత్వహక్కులు మొదలైన వాటితో పాటు స్త్రీ విద్యకోసం ఉద్యమం నడవటం ఈ శతాబ్దిలో జరిగింది. 1792 లో స్త్రీ సమస్యగురించి మేరీ ఓలస్టన్ క్రాఫ్ట్ వ్రాస్తే ఆ తరువాత తొంభయ్యేళ్ళకు కానీ భారతదేశంలో స్త్రీలు స్త్రీపురుష అసమానత గురించి మాట్లాడటం ప్రారంభం కాలేదు. 1881 లో తారాబాయిషిండే మరాఠీ భాషలో పురుషాహంకారానికి సవాల్' అనే పుస్తకం వ్రాయటం గమనించదగింది. 20వ శతాబ్ది ప్రారంభానికి స్త్రీలు సంఘాలు పెట్టుకొని సమీకృతులు కావటం పౌరహక్కులకోసం ఉద్యమించటం జరిగింది. స్వాతంత్ర్యానంతరం స్త్రీలకు రాజ్యాంగం ప్రసాదించిన హక్కులు ఆచరణలోకి రాకపోవటం, స్త్రీల సమస్య ఎప్పుడూ జాతీయ దీర్ఘకాలిక ప్రయోజనాల నెపంతో నిర్లక్ష్యం చేయబడటం కారణంగా 1970 లలో స్వతంత్ర ప్రతిపత్తిమహిళా ఉద్యమానికి అంకుర్పారణ జరిగింది అంతర్జాతీయ స్థాయిలో విస్తృతమవుతున్న నూతన స్త్రీవాద ఉద్యమంలో ప్రభావితమవుతూ దేశంలో స్త్రీల ఉద్యమం కొత్త పదునును సంపాదించుకొన్నది.

జాతీయ స్థాయిలో 1818 నాటికి స్త్రీల సమస్య పై చర్చప్రారంభమైతే ఆంధ్రదేశంలో 1850 ల నాటికి స్త్రీల సమస్యపై దృష్టి మళ్ళింది. బాల్యవివాహాలకు వ్యతిరేకంగా, స్త్రీ విద్యకు అనుకూలంగా భావజాలాన్ని అభివృద్ధి పరచటం, ప్రచారం చేయటం తొలిదశలలో జరిగింది. 1900 నాటికి స్త్రీలు సంఘాలు పెట్టుకొని తమ సమస్యల గురించి తామే మాట్లాడు కొనటం ప్రారంభించారు. స్త్రీవిద్య రాజకీయాలలో స్త్రీల భాగస్వామ్యం, స్త్రీల ఆర్థిక స్వాతంత్ర్యం మొదలైనవి చర్చలోకి వచ్చాయి. స్త్రీలు స్వయంగా పత్రికలు కూడా పెట్టి నిర్వహించారు. అయితే స్త్రీల సంఘాలైనా, స్త్రీల పత్రికలైనా ఆనాడు పితృస్వామిక కుటుంబాధికార పరిధిలోనే పనిచేశాయి తప్ప స్త్రీల స్వయం ప్రతిపత్తిని , స్త్రీల స్వతంత్ర ప్రవృత్తిని విలువలుగా ప్రతిపాదించి ప్రచారం చేయలేకపోయాయి.

అందువల్లనే 1970 ఆంధ్రదేశంలో కూడా స్వతంత్ర ప్రతిపత్తి మహిళా సంఘాల ఏర్పాటు, నూతన స్త్రీవాద ఉద్యమనిర్మాణం అనివార్యంగా జరిగాయి. చట్లాలలో స్త్రీల ప్రయోజనాలకు అనుకూలమైన మార్పులను డిమాండు చేయటం దగ్గర నుండి స్త్రీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వున్న ప్రభుత్వ సారా విధానాన్ని ప్రశ్నించటం వరకు ఆంధ్రదేశంలో మహిళా ఉద్యమం పురోగమించింది.

స్త్రీల సమస్యమీద అంతర్జాతీయ , జాతీయ ప్రాంతీయ స్థాయిలలో ఈ విధంగా ప్రారంభమై కొనసగిన చర్చలు, అభివృద్ధి చెందిన భావజాలం సాహిత్యాన్ని గుణాత్మకంగా ప్రభావితం చేసింది. సాహిత్యం అంటే మానవ సంబంధాల సంపుట. మానవులంటే స్త్రీలు, పురుషులు అందువల్ల తెలుగులో వీరేశలింగం పంతులు నుండి ఈనాటి యువరచయితల వరకు స్త్రీ పురుష సంబంధాలలో రావలసిన మార్పుల గురించిన తపనే సాహిత్యరచనకు చోదక శక్తి అయింది. స్త్రీ సమస్య సామాజిక రాజకీయార్థిక మానవీయ విలువల కోణం నుడి వేరువేరు రచయితలకు సాహిత్యవస్తువు అవుతూ వస్తున్నది. గురజాడ, చలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, కొడవటిగంటి కుటుంబరావు, రంగనాయకమ్మ, వట్టికొండ విశాలక్ష మొదలైనా వాళ్ళు ఎందరో స్త్రీ సమస్యపై ఆంధ్రదేశంలో ఆరోగ్యకరమైన , శాస్త్రీయమైన ఆలోచనల అభివృద్ధిని తమ సాహిత్యరచనలద్వారా దోహదం చేశారు. అంతర్జాతీయ జాతీయ నేపధ్యాలను పరిశీలించినప్పుడు స్త్రీల సమస్యను అర్థం చేసుకొటంలో ప్రపంచం మొత్తం మీదా ఒక భావ సారూప్యత, సమానధర్మం కనిపిస్తాయి. స్త్రీల సమస్య ఎక్కడైనా ఒకటేనని, దానిమూలాలు సర్వేసర్వత్రా వ్యాపించి వున్న పితృస్వామ్యంలో వున్నాయని, దానిపై పోరాటం ప్రపంచపీడిత స్త్రీల లక్షణమూ లక్ష్యమూ అయిందని అర్థం అవుతుంది.

## 8.4 నమూనా ప్రశ్నలు :

1) ఆధునిక తెలుగు సాహిత్యంలో స్త్రీ సమస్య ప్రధానం కావటానికి అంతర్జాతీయ నేపధ్యం ఏమిటో వివరించండి.
2) భారతదేశంలో స్త్రీల ఉద్యమ పరిణామ చరిత్ర తెలుగు సాహిత్యంలో స్త్రీల సమస్యల జీవితాల అధ్యయానానికి ఏవిధంగా ఉపకరిస్తుందో వ్రాయండి.
3) ఆంధ్రదేశంలోని సామాజిక సంస్కరణోద్యమం స్త్రీల సమస్య ఆధునిక తెలుగు సాహిత్యంలో ప్రతిఫలించిన తీరు వ్రాయండి.
4) తెలుగు సాహిత్యానికి స్త్రీ సమస్యను వస్తువుగా చేయటంలో గురజాడ, చలం, కుటుంబరావు అనుసరించిన దృక్పధాల గురించి వ్రాయిండి.

## 8.5. సంప్రదించవలసిన గ్రంధాలు :


1) పురుషాహంకారానికి సవాల్ - తారాబాయిషిండే, అను : C.L.L. జయప్రద , హైదరాబాదు బుక్‌ట్రస్టు ప్రచురణ 1999.
2) మనకు తెలియని మనచరిత్ర - స్త్రీశక్తి సంఘటన 1986 (మొ.ప్ర.)
3) మహిళాజనజీవన సమస్యలు - మూలాల అన్వేషణ - కాత్యాయనీ విద్మహే, జ్యోతిరాణి, శోభ, స్త్రీ జనాభ్యుదయ అధ్యయన సంస్థ ప్రచురణ, 1994.
4) మహిళావరణం - ఓల్గా, వసంతా కన్నాబిరాన్, కల్పనాకన్నాబిరాన్, అస్మితరిసోర్స్ సెంటర్ ఫర్ విమెన్ ప్రచురణ, 2001.
5) Daughters of Independence - Gendre, caste and class in India ^ Jonna Liddle and RamaJoshi Kalifor women, 1986.

పాఠం - 9

# హితసూచని

ప్రణాళిక :


9.0 ఉద్దేశ్యం
9.1. విస్మృత వైతాళికుడు
9.2. హిత సూచని గ్రంథ సమీక్ష
9.2.1 విద్యా ప్రమేయము
9.2.2 వైద్య ప్రమేయము
9.2.3 సువర్ణ ప్రమేయము
9.2.4 మనుష్యేతర జంతు సంజ్ఞా ప్రమేయము
9.2.5 రక్షః ప్రభృతి ప్రమేయము
9.2.6 మంత్ర ప్రమేయము
9.2.7 పరోక్షాది జ్ఞాన ప్రమేయము
9.2.8 వివాహ ప్రమేయము (లేక) హిత సూచనిలో ప్రస్తావించిన స్త్రీ సమస్యలు
9.3. ముగింపు
9.4. ప్రశ్నలు
9.5. ఉపయుక్త గ్రంథాలు


## 9.0 ఉద్దేశ్యం :

కందుకూరి, గురజాడ మొదలైన సంఘ సంస్కర్తలందరి కన్నాముందు స్వామినీన ముద్దునరసింహం సామాజిక దురాచారాల మీద, మూఢ నమ్మకాల మీద ధ్వజమెత్తి స్త్రీ విద్యకోసం కృషిచేసాడని తెలియజేయడం.

## 9.1. విస్మృత వైతాళికుడు :

'వ్యావహారిక భాషకుగాని, సంస్కరణకు గాని తావులేని కాలంలో, మూఢత్వంలో జాతి నిద్రాణమైన సమయంలో సంఘ దురాచారాలను, దుర్మార్గాలను, మూఢ నమ్మకాలను, పారద్రోలడానికి ఎందరో మహనీయులు జన్మించి ప్రజా చైతన్యానికి కృషి చేసిన కాలం పందొమ్మిదవ శతాబ్దం. మతం సృష్టించిన సమస్యలను సమాజానికి తెలియజేయడానికి ఎందరో సంస్కర్తలు పూనుకున్నారు. వారిలో స్వామినీన ముద్దు నరసింహంనాయుడు ఒకరు. వీరు భారతదేశంలోని సామాజిక సమస్యలను స్పృశిస్తూ 'హితసూచని' గ్రంథం రచించారు. ఇది 1862లో తొలిసారిగా అచ్చయింది.

'వైతాళికులు' అనే భావకవితా గ్రంథానికి సంకలన కర్తయిన సామినేని ముద్దుకృష్ణ ముత్తాత స్వామినేని ముద్దు నరసింహం. వీరి జీవితకాలం 1792 - 1856 అని రావిపూడి వెంకటాద్రి, 1810 - 1855 అని ఆరుద్ర పేర్కొన్నారు.

వ్యావహారిక భాషా ప్రయోజనాన్ని గుర్తించి ఆ వాదాన్ని ప్రారంభించాడు. సంఘ సంస్కారం, వితంతు వివాహాలు, బ్రహ్మసమాజం ద్వారా బెంగాల్ నుండి ఆంధ్రదేశంలోనికి దిగుమతయ్యాయని కొందరి అభిప్రాయం. కాని అంతకు పూర్వమే ఈ ప్రయత్నాలకు తెలుగువారు నాంది పలికారనే విషయం చాలామందికి గుర్తులేదు. అసలు గుర్తించనే లేదు.

స్వామినేన వంశీయులు తరతరాలుగా రాజమండ్రి వాస్తవ్యులే. వీరు ఈస్టిండియా వారికి దుబాసీలుగా పని చేశారు. నరసింహం గారు తన పదమూడో సంవత్సరంలో వీధిబడి చదువులు ముగించి ఈస్టిండియా వారి కచ్చేరిలో గుమాస్తాగా చేరాడు. ఆ రోజుల్లో దొరల దగ్గర పనిచేసే గుమస్తాలందరూ బదిలీల వలన దొరలు ఏ ఊరులు వెళితే వెంట ఆ వూరు వెళ్ళేవారు. నరసింహం గారి దొరకు కోయంబత్తూరుకు బదిలీ అయినందున నరసింహం గారు కూడా కోయంబత్తూరు వెళ్ళారు. అక్కడి నుండి అనేక ప్రయాసలతో కుంభకోణం చేరి అక్కడ ఆంగ్లవిద్యను బాగా అభ్యసించాడు. ఎవరిదగ్గర ఎన్నాళ్ళు పనిచేశాడో తెలియకపోయినా 1813 నుండి 1817 వరకు గుంటూరు జిల్లాలో 'సాయర్ మోతర్పా సూపరింటెండెంట్'' గా ఉద్యోగం చేశారు. 1816లో గుంటూరులో పిండారీల దోపిడీని ఎంతో తెలివితో, ధైర్యంతో తిప్పికొట్టాడు. అనంతరం 1848 నాటికి రాజమండ్రిలో పెద్ద హోదాలో ఉన్నాడు. కంపెనీ న్యాయశాఖలో ఫస్టుగ్రేడు మున్సిఫ్‌గా కొంతకాలం ఉన్నాడు. న్యాయశాఖలో ఇరవై సంవత్సరాలు పనిచేశాడు. హితసూచని ముఖపత్రం మీద "మహోపకారులగు రాజమహేంద్రవరపు జిల్లా ఫస్టుక్లాసు డిస్ట్రిక్ మునసవుగా నుండిన స్వామినీన ముద్దునరసింహం నాయనివారు'' రచించినట్లున్నందువల్ల, ఆయన ఆ హోదాలో ఉండగానే రచించినా ఆయన జీవితకాలంలో హితసూచని అచ్చువేయలేదు.

ఆంధ్ర కోస్తా ప్రాంతాలలో ఎంతోమంది యువకులు యూరోపియన్లతో సంబంధాలు పెట్టుకొని తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించి వారి కొలువులో ఉన్నత పదవులను అలంకరించారు. సంస్కర్తలు, మానవ శ్రేయోభిలాషులయిన కొంతమంది యూరోపియనుల సహచర్యం వలన, భారతదేశంలోని సాంఘిక దురాచాలను, మూఢ నమ్మకాలను యూరప్ దేశపు ఆచారాలతో పోల్చి చూశాడు స్వామినీన. యూరపులోని హేతువాద వైతాళికుడు వాల్తేరు మరణించిన 14 సంవత్సరాలకు జన్మించిన స్వామినేని అక్కడి సంస్కర్తల కృషిని విదేశీ మిత్రుల ద్వారా తెలుసుకున్నాడు. "మానవ శ్రేయోభిలాషిగా, ఆయన తనలో - తన వారిలో గల వెనుకబాటుతనానికి, అశాస్త్రీయతకు కారణాలను వెదకి తరుణోపాయానికి చేసిన ప్రయత్నంలో హితసూచని రూపొందింది'' అంటారు కోటపాటి మురహరిరావు. రెండు శతాబ్దాల నాడే స్త్రీ పురుషుల మధ్యనున్న అసమానతలను లోకానికి చాటిచెప్పినా, నేటికీ ఈ సమస్య అపరిష్కృతంగానే మిగిలిపోయింది. స్త్రీ పురుష సమతావాదాన్ని, వితంతు పునర్వివాహాల్ని సమర్థిస్తూ వ్యావహారిక భాషలో గ్రంథం రచించిన బ్రాహ్మణేతరుడు స్వామినీన ముద్దునరసింహం అంటారు ప్రముఖ హేతువాది రావిపూడి వెంకటాద్రి. ఈశ్వరచంద్ర విద్యాసాగర్ కన్నాముందు వితంతు వివాహోద్యమాన్ని ప్రారంభించాడు. స్వామినీన వ్యావహారిక బాషావాదాన్ని ప్రారంభించే నాటికి గిడుగు, గురజాడలు పుట్టలేదు. వితంతు వివాహాలను సమర్థించే నాటికి కందుకూరి వయసు ఐదు సంవత్సరాలు. బెంగాల్‌లోని రాజారామమోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్‌ల పేర్లు, ఆంధ్రులైన కందుకూరి, గురజాడల పేర్లు సంస్కర్తలుగా మారుమ్రోగుతున్నాయి. కాని, భావ వికాసంలోగాని, పోరాట పటిమలోగాని వీరికెవ్వరికీ తీసిపోని మామిడి వెంకయ్య, ముద్దు నరసింహాల పేర్లు పరిశోధకుల దృష్టికి కూడా రాకుండా చాలాకాలం మరుగున పడిపోయాయి. అందుకే ముద్దునరసింహం విస్మృత వైతాళికుడు.

ఆయన మనకు తొలి వ్యావహారిక భాషావాది. పద్యరచనను వెనుకబెట్టి వచనాన్ని విజ్ఞాన వాహికగా ప్రాచుర్యంలోకి తేవాలని చెప్పిన ఉపదేష్ట. రాగల పరిణామాన్ని ఊహించిన ద్రష్ట. ప్రకృతి శాస్త్రాల విజ్ఞానం మొత్తాన్ని తెనిగించి గ్రామ్యమైన సులభ వచనంలో మన యువతీ యువకులందరికీ అందించాలన్నవాడు. అతడే తెలుగులో తొలి వ్యాస రచయిత. హిత సూచనే ఆ వ్యాస సంపుటి. మూఢ విశ్వాస ఖండనానికి ఉపక్రమించిన తొలి హేతువాది. దయ్యాలు, మంత్రాలు, బ్రహ్మరాక్షసులు ఆవేశించడాలు, బాణామతి, భూతవైద్యం, ఋషుల దివ్యదృష్టులు, స్వర్ణయోగం వంటివన్నీ బూటకమని చెప్పిన తొలి ఆస్తిక హేతువాది. వైద్యవిజ్ఞానం తెలుగులో అత్యవసరంగా వెలువరించాలని, నాటి అంటురోగాల ప్రాబల్యం దృష్ట్యా గట్టిగా ప్రబోధించారు. నాటి హిందూ వ్యవస్థను సమగ్రంగా పరిశీలించి అందులోని సంస్కరణలకు సర్వతోముఖ పరిష్కారాన్ని ప్రథమతః ప్రతిపాదించిన భారతీయుడు. బాలవృద్ధ వివాహాలు, కన్యాశుల్కాలు, పంచరాత్ర వివాహవ్యయాలు తగవని సూచిస్తూ స్త్రీ విద్య, రజస్వలానంతర

వివాహాలు, వధూవరులిద్దరి ఇష్టంతోనే వివాహాలు జరగాలని, వితంతు పునర్వివాహాలు మన కర్తవ్యమని సూచించారు. మహాత్మ పూలే విజృంభించకముందే హిందూ సంఘం కులవ్యవస్థ నుండి బైటపడాలని, కుల విభాగ రాహిత్యం కావాలంటూ వర్ణాంతర వివాహ ప్రతిపాదన చేశాడు. వృత్తిలో, సంస్కారంలో, నాగరికతలో అలవాట్లలో సమీపంగా ఉండే కులాల మధ్య ముందుగా పెళ్ళిళ్ళకు పూనుకోవాలని, చివరికి విద్య, నాగరికత పెరిగే కొలది సర్వ వర్ణాంతర వివాహాలు అనులోమ, విలోమ వివాహాలు జరిగేటట్లు చూడాలనేది ముద్దునరసింహం ప్రణాళికగా త్రిపురనేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

"ముద్దు నరసింహం గారు రచించిన గ్రంథంలో వెలిబుచ్చిన అభ్యుదయ భావాలు గొప్పవి. ఆయన వేగుచుక్క. మూఢాచారాలు, అంధ విశ్వాసాలు చిమ్మచీకట్లలాగ ఆవరించిన నిశాంత సమయంలో ఇంక అరుణోదయం కాబోతున్నదని చాటే వెలుగుచుక్క. ఇహలోక విరుద్ధాలయిన వాటిని ఆయనతోసిపుచ్చిన హేతువాది. ఆడపిల్లలకు రజస్వలానంతరమేకాక పూర్ణవయస్సు వచ్చాక వాళ్ళ ఇష్టంతోనే పెళ్ళిచేయాలని సప్రమాణంగా వాదించిన దిట్ట. దెయ్యాలు, భూతాలూ, దివ్యదృష్టి వగైరాలను తూర్పారపట్టిన గట్టివాడు. ఇతర లోహాలను బంగారం చేయడం అసంభవమని రుజువుచేసిన వేత్త. వాడుక భాషలో వాక్యగ్రంథాలకు బహుశా ఆద్యుడు.

పండిత పామర సాధారణంగా వుండే వాక్యగ్రంథం లేకపోవడంచేత హిందూ దేశము వారికి విద్యలు రావడం కఠినమైనదని ఈయన గుర్తించారు. తెలుగుతో శాస్త్రగ్రంథాలు ఏర్పాటు చేయాలంటే సంస్కృతం మొదలైన భాషలను ఆశ్రయించాలి. ఇద్దరు, ముగ్గురు పండితులనుగూర్చి వారికి కావలసిన గ్రంథాలను తెప్పించి యిస్తే కావలసిన పుస్తకాలు త్వరగా ఏర్పాటు కావచ్చునని ఆనాడే చెప్పాడు. 'ఇంగ్లీషు బాగా తెలిసిన అసలు గ్రంథము యొక్క ముఖ్యాభిప్రాయములు సులభముగా బోధపడి తగినట్టు దేశ భాషకు సంగ్రహము చెయ్యడమునకు లాయఖైన వారు పూనుకొన్న పక్షములో తెలుగువాళ్ళు విజ్ఞానవంతులవుతారని ముద్దు నరసింహం గారి నమ్మకం. ఆయన 1853లో సూచించిన పద్ధతిని తెలుగు అకాడమీ చేపట్టడానికి నూటరవై సంవత్సరాలు పట్టింది" అని ఆరుద్రగారు తమ సమగ్రాంధ్ర సాహిత్యంలో పేర్కొన్నారు.

సాహసవంతుడు - సామినేని :

సామినేని ముద్దు నరసింహంగారి మునిమనవడైన సామినేని ముద్దుకృష్ణగారు రికార్డు చేసిన కథనం వలన నరసింహం గారి సాహసం తెలుస్తుంది.

ముద్దు నరసింహం గారు ఆనాటి స్థానిక తెల్లదొరలతో ఎంతో సన్నిహితంగా ఉండేవాడు. ఒకరోజు రాజమండ్రిలోని స్థానిక జిల్లా కలెక్టర్‌తో కలిసి నరసింహం గారు ఆర్యాపురం అవతల ఉన్న సీతమ్మ చెరువు ప్రాంతాలకు షికారుకు వెళ్ళాడు. ఆ ప్రాంతం అడవిగా ఉండి చిరుతపులులు తిరుగుతూ ఉండేవి. వీరిద్దరూ వెళుతూ ఉండగానే ఒక పొదచాటు నుంచి యెలుగుబంటి వచ్చి వారిని ఎదుర్కొంది. కలెక్టరు దగ్గర పిస్తోలున్నప్పటికీ యెలుగుబంటిని చూచిన కంగారులో పారిపోయాడు. నరసింహం గారి పక్కన ఎప్పుడూ ఖడ్గం ఉండేది. వెంటనే నరసింహం గారు కత్తిదూసి ఎడమచేత్తో ఎలుగుముట్టె పట్టుకొని దానిని నరికివేసి కత్తికి ఉన్న రక్తాన్ని ఆకులతో తుడుస్తూ ఉండగా కలెక్టర్ జనాన్ని పోగుచేసుకొని అక్కడకు వచ్చాడు.

మరోకథ - ఒంగోలు దగ్గర కొత్తపట్నంలో జరిగే తమ బంధువుల వివాహానికి నరసింహం వెళ్లాడు. రాత్రి పెళ్ళి జరుగుతూ ఉండగా మరాఠీదండు దోచుకోవడానికి వస్తూ వుందని వార్త తెలిసింది. అప్పుడు నరసింహం ఆడవాళ్ళని, పిల్లల్ని అటకమీదకు ఎక్కించి, తలుపులన్నీ బార్లా తీయించి, గుమ్మం ప్రక్కన ఒక తలుపుచాటున తను, మరొక తలుపుచాటున తన నౌకరు నక్కి ఉన్నారు. ఒక్కొక్క దోపిడీవాడు లోపల కాలుపెట్టగానే నరసింహం వాడి తల నరకడమూ, నౌకరు ఆ తలనీ, మొండాన్నీ పక్కకు లాగేయడమూ పద్దతిలో ఏడుగురు దోపిడీ దార్లను చంపి ఆ శవాలను వీధిలో పారవేయించి, కత్తులు పట్టుకొని తను, నౌకరు వీధిలోకి వచ్చేసరికి మిగిలిన ఇరుగుపొరుగు వారు ధైర్యం తెచ్చుకొని కత్తులూ, కర్రలతో మరాఠీ దండును తరిమివేశారు.

ఇలా అవసరమున్నచోట తన ధైర్యసాహసాలను ప్రదర్శించేవాడు ముద్దు నరసింహం.

ఈ విధంగా తెలివితేటలలోనూ, ధైర్యసాహసాలలోనూ, ప్రజ్ఞాపాండిత్యాలలోనూ, అభ్యుదయ భావాలలోనూ, హేతువాద దృ ష్టిలోనూ భారతదేశంలోనే మొదటివాడుగా గణించవలసినవాడు, తెలుగువాడని మనం గర్వించి, గౌరవించవలసినవాడూ అయిన సామినేని ముద్దు నరసింహంనాయనిని చరిత్ర నిజంగా విస్మరించిందో ! లేక చారిత్రకారులు కావాలనే విస్మరించారో ! కారణాలెన్నున్నా, అవి ఏమైనా ఉస్మానియా విశ్వవిద్యాలయం వారి నోట్సు మాత్రం ఇలా అంటున్నది. ఇలా "ముద్దు నరసింహం హేతువాది అయినందు వల్లే సాంఘిక పరంగా, భాషాపరంగా సంస్కరణలు తేవాలనుకొన్నాడు. తెల్లదొరల అండదండలుండడమే గాకుండా, జిల్లా కోర్టు మునసబు అవడం కూడా ఆయన మార్గానికి సులువైంది. హేతువాద ప్రచారం గిట్టని వాదులంతా నరసింహం మీద కన్నెర్రజేశారు. అణువణువునా అడ్డు తగిలి సంస్కరణ రచనలను వెలుగులోకి రాకుండా జేశారు. తమ తమ పరపతిని ఉపయోగించి దించడం వల్ల రెండో (ఒకటో) తరగతి మునసబు పదవి నుంచి ఆయన మూడో తరగతి మునసబుగా పదవీ నిమ్నతుడయ్యాడు.

## 9.2. హిత సూచని గ్రంథ సమీక్ష :

కందుకూరి, గిడుగు, గురజాడల కన్నా ముందు ముగ్గురి వాదాలను త్రివేణీ సంగమంలా కలిపి రచనలు చేసినవాడు స్వామినేని, నిద్రిస్తున్న సమాజాన్ని మేల్కొలిపిన వైతాళికుడు. హితసూచని పీఠిక ప్రారంభ వాక్యంలో "స్త్రీలకు విద్యలు సాధకములౌచున్నవి" అంటూ విద్యాసక్తిని వెల్లడించారు. అశ్లీల సాహిత్యాన్ని వ్యతిరేకిస్తూ "సాధ్యమైనంత మట్టుకు గ్రంథములు స్త్రీలున్ను చదవడమునకు లాయఖుగా నుండేలాగు రచించవలసినది" అన్నాడు.

ఈ 'హితసూచని' లో ఎనిమిది ప్రమేయాలున్నాయి. ప్రమేయమునకు That of which a corrrect notion should be formed" అని మోనియర్ విలియమ్స్ నిర్వచనం. హితసూచని అనే వాక్య గ్రంథాన్ని 'మోరల్ ఇన్స్ట్రక్టర్'గా పేర్కొన్నాడు. మనం వచన గ్రంథం అన్న దానిని వాక్యగ్రంథమనీ, వ్యాసము అనే పదానికి ప్రమేయము అని పేరు పెట్టాడు. హితసూచని ఎనిమిది ప్రమేయాలుగా ఉంది.

1. విద్యా ప్రమేయము
2. వైద్య ప్రమేయము
3. సువర్ణ ప్రమేయము
4. మనుష్యేతర జంతు సంజ్ఞా ప్రమేయం
5. రక్షః ప్రభృతి ప్రమేయము
6. మంత్ర ప్రమేయము
7. పరోక్షాది జ్ఞాన ప్రమేయము
8. వివాహ ప్రమేయము

నరసింహం తన 'హితసూచని' గ్రంథ పీఠికలో రాసిన వాక్యం అతని అభ్యుదయాసక్తిని, స్త్రీ ప్రాధాన్యాన్ని తెలియజేస్తుంది. "స్త్రీలకు విద్యలు సాధకములౌచున్నవి" అన్న వాక్యంలో ఆయన హృదయానందం కనిపిస్తుంది. పురుషులకు సైతం విద్య అందుబాటులో లేనిరోజుల్లో, విద్య నేర్చుకునే అర్హత కులాలననుసరించి ఉన్న రోజుల్లో 150 సంత్సరాల నాడే స్త్రీ విద్యపట్ల ఎంతో ఆసక్తిని కనబరచిన స్వామినేని కీర్తింపదగినవాడు. ఆయన తాను 'హితసూచని' ని రాయడానికి గల కారణాలను చాలా స్పష్టంగా చెప్పాడు. చదువులు అందరికీ అందుబాటులో లేవనీ, విద్యావిధానం సరిగా లేదనీ, శరీరారోగ్యాలకు సంబంధించిన వైద్యాంశాలను

నేర్చుకోవటంలో ఉపేక్ష జరుగుతుందనీ, న్యాయవిరుద్ధమైన వాటిని న్యాయాలుగా నమ్మటం వలన ప్రజలకు హాని కలుగుతుందని తెలియజేస్తూ పురాణాలలో ఉన్న నిజానిజాలను తెలుసుకోలేకపోవటంవల్ల, ధర్మశాస్త్ర గ్రంథాలు ఒకదానితో మరొకటి విభేదించడం వల్ల, పురాణాలు ధర్మశాస్త్ర గ్రంథాలలోని విషయాలను మరింత చికాకుపరిచే ఉద్దేశ్యంగల రచయితల రచనల వల్ల వాస్తవాలు అవాస్తవాలుగాను, అవాస్తవాలు వాస్తవాలుగానూ కనిపించి ప్రజలు నమ్మడం వల్ల సమాజానికి ప్రమాదం కలుగుతుందని భావించి ఈ అంశాల మీద తనకు గల ఖచ్చితమైన అభిప్రాయాలను తెలియజేయడానికి స్వామినేని రచించిన గ్రంథం 'హితసూచని'.

## 9.2.1 విద్యా ప్రమేయము :

విద్యలనేవి సమస్త ప్రయోజనాలను కలిగిస్తాయి. ఆ విద్యలు గ్రంథరూపంలో ఉంటాయి. కనుక ఏ గ్రంథమైనా చదువుకొనే వారికి సందేహాలు కలిగించకుండా సులభశైలిలో అర్థమయ్యేటట్లు ఉండాలని స్వామినేని అభిప్రాయం. గ్రంథాన్ని రచించే రచయిత లక్ష్యాన్ని గురించి చెబుతూ ముద్దు నరసింహం గారు రచయితలకు సమాజ శ్రేయస్సు ముఖ్యమనీ, అందుకు అనుగుణముగా చిత్తశుద్ధితో నిజాయితీతో రచనలు చేయాలి కాని అవాస్తవిక విషయాలను రాయకూడదని రచయిత బాధ్యతను గుర్తుచేస్తూ "ఏ గ్రంథమైనా రచించే మనిషి అందలి వాస్తవము తనకు తెలిసియుండి అందువల్ల లోకులకు శ్రేయస్సు కలుగుతుందని తనకు రూఢిగా తోచిన పక్షమందు అది వాస్తవికమైనదిగా కనుపడేలాగు రచించవచ్చును. ఒకవేళ వాస్తవము కాని సంగతియైనా, నీతిని-యుక్తిని కనపరచే కొరకు కల్పించి రచించి పక్షమందు అది అటువంటిదిగానే కనపడేలాగు రచించవచ్చును గాని, తనకు తెలియనటువంటిన్ని, వాస్తవము కానటువంటిన్ని, అసందర్భమైనటువంటిన్ని వచనమునైనా వాస్తవములైనవిగాన్ను కిఫాయతు గలవిగా నున్ను కనుపడేలాగ రచించగూడదు" అన్నాడు.

శాస్త్రీయ విషయాలు, ఇతర విషయాలు సులభంగా అర్థమయ్యేటట్లుగా గ్రంథాలు వ్రాయించాలని, అటువంటి ఇతర భాషా గ్రంథాలను తెలుగులోకి అనువాదం చేయించి, అచ్చు వేయించి, అన్ని శాస్త్రాల విజ్ఞానాన్ని బాలబాలికలకు అందుబాటులోకి తేవాలని, సంస్కృతంలోనూ, ఇతర దేశభాషల్లో ఉన్న అంశాలను సామాన్యులకు కూడా అర్థమయ్యేటట్లు పండితుల చేత తిరిగి రాయించాలని అన్నాడు.

"సాధ్యమైనంతమట్టుకు గ్రంథములు స్త్రీలున్ను చదవడమునకు లాయఖుగా నుండేలాగు రచించబలవలసినదిగా" అని చెప్పడంలో గ్రంథాల్లో అశ్లీలతను వ్యతిరేకించడం, స్త్రీ విద్యావికాసాన్ని ఆకర్షించటం కనిపిస్తుంది.

## 9.2.2 వైద్య ప్రమేయము :

మానవునికి రోగాలు రావడం సహజమే. అయితే సాధ్యమైనంతవరకు రోగాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడానికి, వచ్చిన తర్వాత నివారించుకోవడానికి వైద్యశాస్త్రాభ్యాసం తప్పనిసరి. శాస్త్రవిహీనుడైన వైద్యుడు రోగిపాలిట యమదూతతో సమానమని స్వామినేని భావన. ఇది వాస్తవం కూడా. రసవిషాదుల వైద్యం కంటే మూలికావైద్యమే శ్రేష్ఠమని, రోగి చేత లంఖనం చేయించడం రోగికి ప్రమాదం కలుగుతుందని చెప్పారు. సంస్కృత భాషలోనూ, ఇంగ్లీషు భాషలోనూ వున్న వైద్య గ్రంథాలలోని విషయాలను తెలుగు భాషలోనికి అనువదించాలని కోరారు.

దయ్యాలు, భూతాలు, చేతబడులు అబద్ధాలని, మంత్రాల వల్ల, పూజల వల్ల రోగాలు నయంకావని, రోగమేంటో కనుక్కొని తగిన మందు వేస్తేనే రోగం నయమవుతుందని హేతువాద దృష్టిని తెలిపారు. పేదలు మూలికలతో అతి తక్కువ ఖర్చుతో తమకు తామే మందులు తయారుచేసుకోవచ్చునని కొన్నిటిని తెలిపారు. పొట్టుతీసిన శొంఠికొమ్ము చితక్కొట్టి దానికి చారెడు బియ్యాన్నీ, రెండు శేర్ల నీటిని కలిపి కాచిన తర్వాత రెండు మూడు పర్యాయాలు తీసుకుంటే విరేచనాలు అవుతున్నప్పుడుగాని,

అయిన తర్వాత గాని కలిగే దాహం తీరి నీరసాన్ని దూరం చేస్తుంది. కడుపు బిగబట్టినా, మలవిరేచనం కాకపోయినా పొట్టుతీసిన శొంఠి చూర్ణాన్ని వస్త్రగావితం చేసి కొంచెం ఉప్పు కలిపి నూరి భోజనానికి ముందు కొంచెం అన్నంతో కలిపి భోంచేస్తే సర్దుకుంటుంది. కొన్ని గుణాలకు గసగసాలు కొద్దిగా వెచ్చచేసి, కొంచెం ఉప్పు వేసి నూరి భోజనానికి ముందు తీసుకోవాలి. రక్తవిరేచనాలకు గసగసాలు, పాలు, తేనె సమంగా కలిపి అందులో కొద్దిగా తవుడు గింజల చూర్ణం కలిపి ఉదయం, సాయంకాలం వ్యాధి తగ్గేంతవరకు తీసుకోవాలంటూ ఎన్నో వ్యాధులకు నివారణోపాయాన్ని సూచించారు.

### 9.2.3 సువర్ణ ప్రమేయము :

మనుషులకు ధనంమీద, బంగారం మీద విపరీతమైన ఆశ, ఆసక్తి ఉండటం సహజం. ఆ అత్యాశతో సువర్ణాన్ని తయారుచేసే విద్య ఒకటి ఉందని నమ్మి, ఆ విద్యనుసాధించటం కోసం ఎంతో విలువైన కాలన్నీ, ధనాన్ని ఖర్చు చేస్తున్నారు. నిజంగా ఆ విద్యలేదు. 'స్పర్శవేది' అనే వస్తువుతో ఇనుమును బంగారం చేయడం అసాధ్యం. సహజమైన ఒక వస్తువును మరొక వస్తువుకు తాకిస్తే ఆ తాకించిన వస్తువు కూడా సహజమైన మరొక వస్తువుగా మారటం అబద్ధం, అలా మారుతుందని అనుకోవడం మూర్ఖత్వం. ఎందుకంటే సహజమైన వస్తువులు దైవ నిర్మితాలు. మరలా అటువంటి వాటిని మానవుడు సృష్టి చేయలేడు. అలా సాధ్యమైనట్లయితే మానవుడు ఒక ధాన్యాన్ని మరొక ధాన్యంగా, ఒక జంతువును మరొక జంతువుగా చేయవచ్చు. కాని మానవుడు ఇలా చేయగలుగుతున్నాడా ? లేదు. కనుక 'స్పర్శవేది' అనే వస్తువు ఈ భూమ్మీద లేదు. అలాగే మంత్రాల వలన బంగారం తయారవదని, సువర్ణముఖి అనే విద్య కూడా లేదని నరసింహం తెలిపారు.

### 9.2.4 మనుష్యేతర సంజ్ఞా ప్రమేయము :

జంతువులకు, పక్షులకు ప్రత్యేకమైన భాషలులేవు. అవి ఒకదానితో ఒకటి భాషారూపంలో మాట్లాడుకోలేవు. కారణం "భాష యుక్తియుక్తములైన సంగతులచేత నేర్పరచబడవలసినదై యున్నది. గనుక న్యాయగ్రాహకమైన బుద్ధి కలిగియుంటే గాని భాషను గ్రహించడమునకున్న, రచించడమునకున్ను వల్ల లేదు. అటువంటి బుద్ధి గలిగి పలుకులు పలుకడమునకు తగిన వాగేంద్రియ సామర్థ్యము కూడా కలిగియుంటేగాని యొక జంతువు దాని అభిప్రాయమును మరియొక జంతువుకు భాషాపూర్వకముగా తెలియజేసే సదుపాయము ఉండదు" అని స్పష్టముగా జంతువులు మనుషుల వలె భాషారూపంలో మాట్లాడలేవని స్వామినేని చెప్పారు.

జంతువుల్లో, పక్షుల్లో, వాటి అభిప్రాయాలను, భావాలను అవి నోటి శబ్దాల చేత, స్పర్శచేత తెలియజేస్తాయి.

జంతువులు, పక్షులు ఎలాగైతే మనుష్యభాషను నేర్చుకోలేవో అదే విధంగా మానవుడు కూడా వాటి భాషలను నేర్చుకోలేడు. ఎవరైనా, నేర్చారని చెప్పినా అది అబద్ధం. పురాణాలలోని 'బంగారు ముంగిలి' కథలో కేకయరాజు చీమల భాషను, మేకపోతు భాషను అర్థంచేసుకోవటం లాంటివి వాస్తవాలు కాదని వీరు తెలియజేశారు.

### 9.2.5 రక్షః ప్రభృతి ప్రమేయము :

చనిపోయిన మనుష్యుల్లో కొందరు రాక్షసులుగానూ, కొందరు పిశాచాలుగానూ, మరికొందరు భూతాలు, దెయ్యాలుగానూ మారిపోయి పూర్వరూపాలలోనే కొందరికి కనబడి మాట్లాడతారని చాలామంది నమ్ముతుంటారు. ఇది నిజంకాదని, దెయ్యాలు, భూతాలు లేవని హేతువాద దృక్పథంతో, కార్యకారణ సంబంధమైన ప్రశ్నలతో తేల్చి చెప్పారు స్వామినేని.

మరణశిక్ష విధించబడ్డ బ్రాహ్మణుడు పెళ్ళి చేసుకోవాలనే కోరికతో తన దగ్గర నున్న డబ్బంతా ఇచ్చి మరొక బ్రాహ్మణుని కూతురుని వివాహం చేసుకొని ఆ వెంటనే మరణించాడు. తండ్రి కూతురి మెడలోని మంగళసూత్రాన్ని తెంచి ఆమెకు మరొక

వివాహం చేశాడు. ఆమెకు ఒక కుమారుడు కలిగిన కొంతకాలానికి భర్త చనిపోయాడు. పుట్టిన కుమారుడు గయకు వెళ్ళి తండ్రికి పిండప్రదానం చేస్తే ఆ పిండాన్ని అందుకోవడానికి మరణశిక్ష విధించబడి చనిపోయిన బ్రాహ్మణుడు ముందు అతని వెనుక కుమారుడి తండ్రి వచ్చారు. ఇలా ఇద్దరు రావడానికిగల కారణాన్ని తల్లి ద్వారా తెలుసుకున్నాడు కుమారుడు. పిండాలను గ్రహించే వారు తమస్వరూపాన్ని కనిపించనీయ కూడదనే శాపం అప్పుడు కలిగిందట.

ఈ కథపై స్వామినేని లేవనెత్తిన ప్రశ్నలు

ప్రాణం వదలిన మనిషి ఇంతకాలం ఎలా జీవించి ఉన్నాడు ? చావబోతూ వివాహం చేసుకోవడమేమిటి ? మరొక పురుషుని వల్ల కలిగిన సంతానానికి అతడు తండ్రి ఎలా అయ్యాడు ? పిండాన్ని కోరే హక్కు అతనికెలా ఉంటుంది ? దహనం ద్వారా ధ్వంసమైన దేహం తిరిగి ఎలా లభించింది ? చచ్చినవాడు పిండానికి ఎలా హాజరవుతాడు ? మొదలైన ప్రశ్నలు వారి హేతువాద దృష్టిని సూచిస్తున్నాయి.

ఇంకా జగదీశ భట్టాచార్యుల కథలో మొదట అంతగా జ్ఞానం లేని భట్టాచార్యులు బ్రహ్మరాక్షసి ఆవహించాక 18 ఏండ్లకే ఎన్నో విద్యలు నేర్చి విశేష గ్రంథాలు రచించాడు. బ్రహ్మరాక్షసి వదలిపోయిన తర్వాత అతను పాండిత్యమంతా కోల్పోయాడు. ఇది కూడా వాస్తవికమైనది కాదు అన్నారు స్వామినేని.

### 9.2.6 మంత్ర ప్రమేయము :

మంత్ర తంత్రాలు గూర్చి, మహాత్మ్యాలు గూర్చి స్వామినేని వారు చెప్పిన వివరణలు, కథలు ఎంతో ఆలోచనాత్మకమైనవి. "మంత్రముల యందు ప్రత్యక్ష ఫలము కలుగుచున్నట్లు, హిందూ జనులు చాలామంది నమ్ముతున్నారు. కాని అట్లా ప్రత్యక్షమైన ఫలము ఒకటిన్ని వాటి వల్ల కనపడడము లేదు" అని హిందూ సమాజంలోని మూఢత్వాన్ని బయలుపరచారు.

ఉదర పోషణార్థం, డబ్బు కోసం కొంతమంది మంత్రాల ద్వారా శక్తులు తమ వశమై ఉంటాయని నమ్మించి తమ పబ్బం గడుపుకుంటారు. పాము కాటు వేసినప్పుడు, తేలు కుట్టినప్పుడు మంత్రం వేస్తే ఆ విషం విరుగడవుతుందని చెప్పడం అబద్ధమని ఆ అంశాలను ఇలా వివరించారు.

"పాములు మొదలైన వాటి యొక్క విషము దిగిపోయ్యేలాగు చేస్తామని కొందరు మంత్రించడము కలదు. పాము కాట్లను గురించి మంత్రిస్తామనే వారు చాలామంది ఔషధములున్న సంగ్రహించి యుంచి, వాటిన్ని ప్రయోగించి, మంత్రమున్ను మంత్రించేది కద్దు. కాని యావత్తు ఔషధముల యందే యున్నదనిన్ని మంత్రమందు సత్తయేమిన్ని లేదనిన్ని ఆ మంత్రించే వారు బాగా గుర్తెరిగే యుంటారు. ఐనప్పటికిన్ని లోకులను భ్రమపరచే ఇచ్ఛచేత మంత్రించడమును వదిలిపెట్టరు. మంత్రము దేవతా సంబంధమైనదియై యుండగా మంత్రసిద్ధి వారికి కలిగియున్న పక్షమందు వారు ఔషధముల సహాయమునుకోరడమునకు ఏమి నిమిత్తము ఉంటుంది. కొందరు మంత్రముల వల్ల క్రియగలదని నమ్మి వాటిని నేర్చుకుని మంత్రిస్తారు. కొన్ని పాముల విషము మిక్కిలి పలుచగా నుండడము చేతనున్ను, ఆయా శరీరతత్వముల చేతనున్ను ఔషధము అక్కరలేకుండానే విషము దిగిపోయ్యేది కద్దు. గనుక, అందువల్ల విషము దిగిపోతేనే తప్ప మంత్రము వల్ల నయము కావడములేదు. నయముగాని యెడల పాము కాటు బాగా తగిలినది, మూడుగంట్లు ఏర్పడ్డవి అనిన్ని, ఆ పాము విషము మిక్కిలి చిక్కనైనదని అందువల్ల కుదిరినది కాదని మంత్రించిన వారు చెప్పడముకలదు. మంత్రమందు సామర్థ్యము ఉన్నట్టయితే, గంట్లు ఎన్ని దిగినా, విషము ఎలాంటిదైనా, తప్పకుండా కుదరవలసినదే న్యాయమైయుంటుంది" అని సమాజాన్ని ఆలోచింపజేశారు.

ఇలాగే తేళ్ళు కుట్టిన విషయంలోనూ చెప్పారు. తేలు కుడితే కొందరికి విషం ఎక్కి త్వరగా దిగిపోతుంది. కొందరికి విషం ఎక్కకుండా కుట్టిన చోట మంట పుడుతుంది. కొద్ది సేపటికి ఆ మంట తగ్గుతుంది. కొన్ని కుడితే రొమ్ము బరువెక్కి

చాలా ఇబ్బంది పెడుతుంది. ఒక రకమైన తేలు కుడితే ప్రాణహాని కలుగుతుంది. తేలు కుట్టినప్పుడు ఔషధాలు ఉపయోగపడతాయి గాని మంత్రముల వల్ల గుణం కనిపించదని తేల్చి చెప్పారు.

"మంత్రముల చేత పరకాయ ప్రవేశమయ్యే సామర్థ్యము కలుగడము కలదని కొందరు నమ్ముతున్నారు.'' ఇది అబద్ధమని కొన్ని కథల ద్వారా నరసింహం చెప్పారు.

## పకీరు కథ:

పరకాయ ప్రవేశ విద్య తెలిసిన ఒక పకీరు ఒక రాజు దగ్గర ఎంతో నమ్మకంగా ఉంటూ రాజుతోపాటు షికారుకు కూడా వెళుతుండేవాడు. ఒకనాడు రాజు, పకీరు వేటకు వెళ్ళారు. ఆ వేటలో రాజు బాణం తగిలి ఒక లేడి మరణించింది. దానిలో ప్రవేశించి తన విద్యను ప్రదర్శించమని ఫకీరుని రాజు అడిగితే పకీరు లేడిలో ప్రవేశించి రాజు దగ్గరకు వచ్చాడు. పకీరు శవం నిర్జీవమైంది. తిరిగి పకీరు తన శరీరంలో ప్రవేశించి పునరుజ్జీవించాడు. ఇది చూచిన రాజు ఎంతో ఆశ్చర్యపోయి తనకావిద్య నేర్పమని పకీరుని కోరి నేర్చుకున్నాడు. ఆ విద్య మహిమను పరీక్షించాలనుకొని రాజు తన దేహం విడిచి లేడి శరీరంలోకి ప్రవేశించాడు. వెంటనే పకీరు తన దేహాన్ని విడిచి రాజు దేహంలో ప్రవేశించి లేడిరూపంలో ఉన్న రాజును వధించటానికి బాణం ఎక్కుపెట్టాడు. లేడి తప్పించుకొని పారిపోయింది. రాజురూపంలోనున్న పకీరు రాజ్యానికి వెళ్ళి సంహాసనమెక్కి పాలిస్తూ రాణుల్ని అనుభవించసాగాడు. లేడిరూపంలో ఉన్న రాజు పీడ వదలించుకోవాలని అరణ్యంలో ఉన్న లేళ్ళనన్నింటినీ చంపనారింభించగానే రాజు లేడి దేహాన్ని వదిలి ఒక పికిలి పిట్టలో ప్రవేశించి రాణివాసం చేరి రాణికి ప్రియమైనదిగా అయింది. ఆ పిట్టను బంగారు పంజరంలో ఉంచి ఎంతో ప్రేమగా రాణి చూసుకోసాగింది. కొంతకాలం తర్వాత రాణికి ప్రియమైన ఆడకుక్క చనిపోయింది. పికిలి పిట్టలో ఉన్న రాజుకు ఆ కుక్కలో ప్రవేశించాలనే కోరిక కలిగి అందులో ప్రవేశించాడు. పంజరంలోని పిట్ట చనిపోయిందని గుర్తించిన రాణి శోకానికి అంతులేదు. ఆమెను ఎంతో మోహించిన రాజు వేషంలోనున్న పకీరు వచ్చి ఆమెను ఓదార్చటం కోసం తను ఉన్న రాజు దేహాన్ని వదలి పికిలి పిట్టలో ప్రవేశించాడు. ఇదే అదునుగా భావించిన రాజు కుక్కలో నుండి తన నిజశరీరంలోకి ప్రవేశించి పంజరంలో పికిలి పిట్టలో ఉన్న పకీరును గొంతునులిమి చంపాడు. విషయం తెలుసుకున్న రాణి తను మలిన దేహినయ్యానని భావించి శుష్కించి మరణించగా రాజు ప్రవాసంలోకి వెళ్ళాడు.

ఈ కథలోని సంఘటనలన్నీ అబద్ధాలేనని, అయితే యిలాంటి కథలతో ప్రజల్ని మోసగించే దొంగ సన్యాసులు, పకీర్లు ఉన్నారని స్వామినీని చెప్పారు.

## శంకరాస్వాముల కథ :

శంకరాచార్యుడు మండన మిశ్రుడనే పండితుణ్ణి వాదంలో గెలవడానికి అతని గ్రామానికి వెళ్ళాడు. అతని ఇంటి తలుపులు మూసి ఉన్నాయి. ప్రహరీలు దాటడానికి వీలు లేకపోయింది. అప్పుడక్కడ ఒక శాణారవాడు తాటిచెట్లు ఎక్కకుండా మంత్రశక్తితో తాటిచెట్లను వంచికల్లుగీయడం చూశాడు శంకరాచార్యులు. తన దగ్గర ఉన్న సువర్ణముఖి అనే విద్యను అతనికి నేర్పి అతని వద్ద నుండి తాటిచెట్లు వంచే విద్యను తెలుసుకొన్నాడు శంకారాచార్యులు. ఆ విద్యతో శంకరుడు తాటిచెట్లు వంచి మండన మిశ్రుడి ఇంటిలోకి ప్రవేశించి అతనితో వాదించి జయించాడు. అంతట మండన మిశ్రుడు తన భార్యను శంకరాచార్యుని పైకి ఉసిగొల్పాడు. ఆమె శంకరాచార్యుడిని కళాశాస్త్రం పై ప్రశ్నించగా ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి శంకరాచార్యుడు ఆరు నెలల గడువడిగాడు. ప్రక్కరాజ్యంలో రాజు మరణించాడని తెలుసుకున్న శంకరుడు పరకాయ ప్రవేశ విద్య ద్వారా రాజు శరీరంలో ప్రవేశించి అతని వందమంది రాణులతో రోజుకొకరిశయ్యపై కులికి, కళాశాస్త్ర, రహస్యాలు తెలుసుకొని తిరిగివచ్చి మండనుడి భార్యను ఓడించాడని శంకరాచార్యుల జీవిత కథలో ఉన్నది. అతను రాణులతో కూడి ఉండగా అతని చర్యల్ని అనుమానించిన పట్టపురాణి అచేతనంగా

దొరికిన సన్యాసుల దేహాలన్నిటిని కాల్చివేయమన్న ఆజ్ఞతో సైనికులు సత్రంలో పడిఉన్న శంకరుడి దేహానికి నిప్పంటించారు. మధ్యలో శంకరుడు రాజుదేహం వదలి తన సొంత శరీరంలోకి దూరి ఇష్టదైవాన్ని ప్రార్థించగా కాలిపోయిన అవయవాలు తిరిగి మొలిచాయి.

ఈ కథలో అనేక అసంబద్ధులున్నాయి. అసలు కథే అబద్ధమని తోస్తుంది. పరకాయ ప్రవేశం, దైవ ప్రార్థనతో కాలిపోయిన శరీరకావయవాలు తిరిగి రావడం కల్పించినవిగా కనిపిస్తుంది.

### బాగ్దాద్ పట్టణ వాసి కథ :

బాగ్దాద్ సంపన్నుడొకడు ఒక సౌందర్యవతిని పెళ్ళిచేసుకున్నాడు. వారు భోజనం చేసేటప్పుడు అతను మామూలుగా చంచాలతో భోజనం చేస్తుంటే భార్యమాత్రం గుబిలి తెడ్డుతో ఒక్కొక్క మెతుకు చొప్పున స్వల్పంగా తింటుంది. భర్త కారణం అడిగితే ఆమె ఏమీ చెప్పలేదు. భర్తకూడా ఒత్తిడి చేయకుండా ఒకరోజు రాత్రి నిద్రపోతున్నట్లుగా నటించాడు. భార్య భర్త నిద్రపోతున్నాడనుకొని బయలుదేరి స్మశానానికి వెళ్ళి అక్కడ ఒక దయ్యంతో కలిసి శవాన్ని భక్షించింది. ఆమెను అనుసరిస్తూ వెళ్ళి ఆ దృశ్యాన్ని చూచిన భర్త ఆమెను ప్రశ్నించగా ఆమె కోపించి అతనిపై మంత్రజలం చల్లి కుక్కగా మార్చి బైటకు తరిమి కొట్టింది. బైటకొచ్చిన ఆ కుక్కను వీధికుక్కలు వెంబడించగా అదిపోయి పోయి ఒక రొట్టెల అంగడి వానిని చేరింది. రొట్టెల అంగడివాడు దాన్ని చేరదీసి తన కొట్టులోనే ఉంచుకొన్నాడు. ఒకరోజు రొట్టెలు కొన్న ఒక స్త్రీ అంగడివానికిచెల్లని నాణెం ఇచ్చి అది మంచిదేనని వాదించగా అంగడివాడు అది చెల్లని నాణెమని, అది చెల్లదని తన కుక్కకు కూడా తెలుసుకుని కుక్కముందు నాణేలన్నిటినీ కుమ్మరించి చెల్లని నాణేన్ని కనుక్కోమని ఆదేశించాడు. కుక్క చెల్లని నాణాన్ని కనుగొంది. ఈ వార్త పట్టణమంతా పాకింది. ఒకరోజు మరొక స్త్రీ అంగడికి వచ్చి కుక్కను తనతో రమ్మని సైగ చేసింది. కుక్క ఆమెననుసరించి ఆమె ఇంటికి వెళ్ళగా ఆమె మంత్రగత్తె అయిన తన కుమార్తెకు విషయం చెప్పింది. కుమార్తె కుక్కపై మంత్రజలం చల్లగా ఆ కుక్క మనిషిగా మారిపోయాడు. అతని ద్వారా జరిగిన సంగతంతా తెలుసుకున్న మంత్రగత్తె మంత్రజలాన్ని అతనికిచ్చి భార్యపై చల్లమంది. అతడు అలాగే చేయగా భార్య ఆడ గుర్రంగా మారింది. అతడు చంద్రకొలతో ఆ గుర్రాన్ని బాది అనంతరం మనిషిగా మార్చి వదిలివేశాడు.

ఈ కథలో ఉన్నవికూడా అవాస్తవిక సంఘటనలే ? అభూతకల్పనలే నని వివరించాడు.

భారతంలోని తక్షకుని కథను కూడా ఉదహరించి శాపాలు పెడితే పాములు కరవడం, పాములు కరిస్తే వృక్షం భస్మం కావడం, పేడ తింటే కండ్లు కనబడకుండా పోవడం, మనుషులు ప్రత్యక్షం కావడం, అదృశ్యం అవడం - ఇలాంటివన్నీ పచ్చి అబద్ధాలని, అవి విశ్వసించతగినవి కావని, మంత్రాలకు చింతకాయలు రాలవని స్వామినేని విస్పష్టంగా తెలియజెప్పారు.

### 9.2.7 పరోక్షాధి జ్ఞాన ప్రమేయము :

పరోక్షాధి జ్ఞాన ప్రమేయంలో దివ్యదృష్టి, అతీంద్రియజ్ఞానం గూర్చి స్వామినేని వారు తీవ్ర విమర్శ చేశారు.

"మనుష్యులలో కొందరు దివ్యదృష్టిచేత సదరు సంగతున్ను, అభిప్రాయములన్ను కనిపెడుతున్నట్టు కొందరు నమ్ముతున్నారు. దివ్యదృష్టి అనగా దైవ సంబంధమైన దృష్టి అనిపించుకొనుచున్నది. ఈ దృష్టిచేత సదా సమస్త సంగతులను కనిపెట్టడం సర్వజ్ఞుడైన ఏలినవానిచేత ఏయే నిమిత్తముల గురించి యేర్పరచబడ్డ దేవతలకు ఆయా నిమిత్తములకు తగుమాత్రము దివ్య సామర్థ్యము ఆయన కలుగచేసి యుండునని నమ్మవచ్చునుగాని దివ్యదృష్టిచేత కనిపెట్టవలసిన నిమిత్తము గల అధికారమేదిన్ని మనుష్యునకు ఇవ్వబడి యుండలేదు. కనుక మనుష్యులలో ఒక కొందరికి ఏలినవాడు దివ్యదృష్టి కలుగజేస్తారని నమ్మడమునకు

తగిన సబబులు ఏమీ కనపడలేదు. దివ్య దృష్టిగల మనుష్యులు పూర్వ యుగములందు తరచుగా నుండే వారినిన్ని ఇప్పుడు అరుదుగా నున్నారనిన్ని కొందరు చెప్పుతున్నారు. అట్లా దివ్యదృష్టి కొందరికి కలిగి యుండినట్లు కొన్ని గ్రంథములయందు చెప్పబడి యుండడమేగాని అటువంటి దృష్టిగల మనుష్యులు ఎక్కడా ఉన్నట్లు కనపడడము లేదు. అటువంటి వారిని కనపరుస్తామనే వారును ఎక్కడా లేకుండానున్నారు. గనుక మనుష్య త బుద్ధిచేత తెలియతగని కార్యములను దానిచేత తెలియబడినట్టుగాని తెలియబడుతున్నట్టుగాని నమ్మవలసిన పనిలేదు'' అని దివ్యదృష్టి, అతీంద్రియ శక్తులు లేవని, ఉన్నాయని నమ్మినా అవి దేవతలకు వర్తిస్తాయని నమ్మవచ్చును గాని మానవులకు అసాధ్యమని నిర్ద్వంద్వంగా చెప్పారు.

ఒకానొక దేవతను ఉపాసించడం ద్వారా ఆమె అనుగ్రహంతో అతీంద్రియ శక్తులను పొందవచ్చునని మనవారు భావిస్తూ ఉంటారు. కాని ఏ దేవతోపాసన వల్ల కూడా మానవులకు ఎటువంటి అతీంద్రియ శక్తులు రావని, అదంతా అబద్ధమని, చేతబడులు మొదలైనటువంటివి ద్వారా శత్రువులకు అపకారం చేయవచ్చునని, నమ్మడం కూడా అబద్ధమేనని నర్సింహం చెప్పారు.

కొందరు సోదె చెబుతామని తిరుగుతుంటారు. చనిపోయిన వారి కోర్కెలు ఏమిటో చెబుతామని, వారు పూజలు కోరుతున్నారని, వారి కోర్కెలు అయినవారు తీర్చాలని చెప్పి ప్రజల్ని భయపెడుతుంటారు. కొంతమంది ప్రశ్నలు చెబుతామంటూ ప్రచారంచేసుకుంటారు. పోయిన వస్తువులు గురించికాని మనుషుల గురించిగాని అంజనం వేసి చూస్తాం, మరలా మీ దగ్గరికి తెప్పిస్తామని చెప్పే విషయాలన్నీ అబద్ధాలేనని వీరు వివరించారు.

సమాజంలో ఎక్కువమంది విశ్వసించే జ్యోతిశ్శాస్త్రాన్ని కూడా వీరు నిరాకరించారు. "జ్యోతిశ్శాస్త్రము యొక్క జాతక ముహూర్త భాగమువల్లనున్ను, సాముద్రిక శాస్త్రము మొదలైన వాటివల్లను'' తెలయబడ్డ విషయాలు జరుగుతాయనేది వాస్తవంకాదు. ఎందుకంటే "జాతక భాగమందు చాలా తరహాలుగా గ్రంథములు పుట్టి యున్నవి. యొక గ్రంథమును బట్టి యేర్పరచిన ఫలములు మరియొక గ్రంథమును పట్టి యేర్పరచే ఫలములకు భేదించి యుండడము గలదు ...... కనుక సదరు గ్రంథముల మీద నేర్పరచబడే సంగతులు ఖరాగా సంభవిస్తాయని నమ్మతగ్గవి కావు'' అని విమర్శించారు స్వామినేని.

దైవ విషయంలో తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా తెలియజేశారు స్వామినేని. "ఈశ్వరుడు అగుణుడని కొందరు అంచున్నారు. అగుణుడనగా గుణమేలేనివాడని కొందరు ఆ పదమునకు అర్థము చెప్పుచున్నారు................ ఈశ్వరుడు గుణమే లేని వాడని చెప్పే పక్షమందు ఈశ్వరుడనే స్థితి లేదనే యొప్పవలసి వస్తుంది. ఈ పక్షమందు నిరీశ్వర వాదమునుఒప్పుకున్నట్టు అవుతుంది. గనుక ఈశ్వరుడు గుణరహితుడని చెప్పడమునకు హేతువు కనబడలేదు'' అని ఈశ్వరుడు నిర్గుణుడు కాదని అన్నారు.

ఇలా అశాస్త్రీయుతను, అవివేకాన్ని, మూఢ నమ్మకాలను అడుగడుగునా ఖండించారు స్వామినేని ముద్దునరసింహం.

### 9.2.8 హిత సూచనిలో ప్రస్తావించిన స్త్రీ సమస్యలు (వివాహ ప్రమేయము) :

సమాజంలోని సంస్కృతి, సంప్రదాయాలు, ఆర్థిక స్థితిగతులు ఆయా సమాజాలలోని స్త్రీల స్థితిని నిర్ణయిస్తాయి. స్త్రీని ప్రత్యక్షంగా అణచిపెట్టడం, ఆమె నరనరాల్లో సంస్కృతీ సంప్రదాయాల మత్తును ఎక్కించి ఆమె తనంతతానుగా అణగిమణగిపడి ఉండేటట్లు చేయడం పితృస్వామిక వ్యవస్థ స్త్రీకి ఇచ్చిన బహుమతులు.

మాతృస్వామిక వ్యవస్థలో తల్లికి ప్రాధాన్యమున్నా తండ్రిని తక్కువగా భావించలేదు. పితృస్వామిక వ్యవస్థలో తండ్రికి ప్రాధాన్యమున్నది కాని తల్లికి విలువలేకుండా పోయింది. శృతి, స్మృతి, పురాణాల్లోకూడ స్త్రీని కించపరచే వర్ణనలున్నాయి.

"ఉపాధ్యాయాన్దశాచార్య ఆచార్యాణాంశతం పితా
సహస్రంతు పితృన్మాతా గౌరవేణాతి రిచ్యతే '' (మను. 2-145)

వేయిమంది తండ్రులకన్నా ఒక తల్లి గౌరవించిదగినదన్న మనువే 'నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి' అన్నాడు. మనుధర్మశాస్త్రం స్త్రీ ధర్మాలను బోధించింది. స్త్రీ పురుషులకు వేర్వేరు న్యాయాలు ప్రకటించింది. స్త్రీలు ఎలా ప్రవర్తించాలనే విషయాన్ని మనువునుండి శతకకర్తల వరకు తమకు తోచిన విధంగా ఎంతోమంది బోధించారు. స్త్రీని కించపరచే రచనలు తెలుగు సాహిత్యంలో వెలువడ్డాయి.

ఋగ్వేదంలో మొట్టమొదటగా కన్పించిన అబలా శబ్దం నేటికీ బిరుదువాచకంగానే ఉంది. ఈ పురుషాధిక్య సమాజంలో స్త్రీలు శారీరకంగా మానసికంగా బలహీనులనే భావం ఏర్పడింది. హిందూ, క్రైస్తవ, మహమ్మదీయ మతగ్రంథాలు కూడ స్త్రీకన్నా పురుషునికే ఎక్కువ ఆధికత్యను ప్రకటించాయి. అరిస్టాటిల్, సోక్రటీస్ లాంటి తత్త్వవేత్తలు పురుషునికిచ్చిన గౌరవం స్త్రీకి ఇవ్వలేదు. పితృస్వామిక వ్యవస్థలో స్త్రీ స్థానం గృహానికే ఎక్కువగా పరిమితమయింది. ఆమె వంటింటి కుందేలుగా మారింది. స్త్రీ ధర్మాలు తెలపడానికి సతీహితచర్యలు, కుమారీ హిత చర్యలు, కుమారి శతకాలు బయలుదేరాయి. భర్తకు అణకువగా ఉండాలంటూ పాతివ్రత్యాన్ని బోధించాయి. చిన్నతనంనుండి స్త్రీ ఎలా మెలగాలో నూరిపోసిన నీతి బోధలన్నీ ఆకళింపు చేసుకున్న స్త్రీలు తాము ఊబిలో కూరుకుపోతున్నామని గ్రహించలేకపోయారు. ఫ్యూడల్ సంస్కృతి, పెట్టుబడి దారి సంస్కృతులు కూడ స్త్రీ అధోగతి పాలవడానికి కారణాలయ్యాయి. పుత్రుడు పున్నామనరకం నుండి రక్షిస్తాడనీ, పౌత్రుడు పుడితే పుణ్యలోకాలలో చాలాకాలం నివసిస్తారనీ, మునిమనవడు కలిగితే సూర్యలోకాన్ని పొందుతారనే నమ్మకంతో స్త్రీ సంతానాన్ని నిర్లక్ష్యం చేశారు. బాల్యవివాహాలు, పునర్వివాహ నిషేధం, సతీసహగమనం, దేవదాసి పద్ధతులు, బహుబార్యాత్వం మొదలైన సమస్యలతో స్త్రీలు తల్లడిల్లిపోయారు. అన్ని విషయాలలోను స్త్రీ పురుషులమధ్య అసమానతలు పెరిగిపోయాయి.

సమాజభివృద్ధికి ఆటంకాన్ని కలిగించే ఈ అసమానతలను రూపుమాపవలసిన అవసరాన్ని గుర్తించి తెలుగు సాహిత్యంలో మొట్టమొదటగా గ్రంథం రచించిన వ్యక్తి స్వామినీన ముద్దునరసింహం **(1792-1856)**. వ్యావహారిక భాషావాదాన్ని ప్రారంభించి మంత్ర తంత్రాలను, మూఢనమ్మకాలను, స్త్రీ పురుష అసమానతలను ఖండిస్తూ, స్త్రీ పునర్వివాహాలను సమర్థిస్తూ హితసూచని రచించాడు.

వివాహ ప్రమేయంలో వధూవరుల పరస్పరేచ్ఛను గురించి, పాణిగ్రహణానికి ముందు వారిచేత చెప్పించే మంత్రాన్ని గురించి, కన్యాదానం మొదలైన ఆనాటి వివాహ వ్యవస్థలోని లోపాలను చర్చించారు. వివాహానికి మూడు సంగతులు ఆవశ్యకాలని, అందులోనూ మొట్టమొదటగా యువతీ యువకుల పరస్పర అంగీకారం అవసరం అన్నారు. ఇందుకు ఉదాహరణ కాన్యావరణములు. పాణిగ్రహణం చేయబోయేముందు వధూవరుల మధ్య సంధికి తిరిగిన వారికి ఇచ్చే దక్షిణలు కన్యావరణాలు. దక్షిణ ఇస్తూ "మదర్థం వరం వృణీధ్వం" - నా కొరకు వరుణ్ణి కోరవలసినది అనే మంత్రం కన్యచేత, 'మదర్ధం కన్యావృణీధ్వం' - నా కొరకు కన్యను కోరవలసినది అని వరునిచేత పలికించడం ఇద్దరి అభీష్టాలను వ్యక్తపరచడమే అన్నారు. వీరి అభిప్రాయాలను తల్లి దండ్రులు అంగీకరించడం రెండో విషయం. పెద్దలు వధూవరుల అభీష్టానికి అంగీకార సూచకంగా పాణిగ్రహణం చేయడం మూడవది. ఈ మూడు తప్ప వివాహానికి ముఖ్యకార్యాలు లేవు. ఘటం తయారుచేయడానికి మట్టి ప్రధాన కారణం, కుమ్మరి, కుమ్మరిసారె ఇతర కారణాలయినట్లు చిన్నదాని చిన్నవాని పరస్పరేచ్ఛ ప్రధానకారణం, తతిమ్మావి అనంతర కారణాలన్నారు. మదర్థం - అనే మంత్రాలు చెప్పించడం ఆచారం కనుక అలా మంత్రాలు చెప్పిస్తూ దానికి విరుద్ధంగా మంత్రమొకదారి, నడవడి మరొకదారిగా బాలికల అంగీకారం లేకుండానే వివాహాలు చేస్తున్నారని విమర్శించారు. భాగ్యవంతులు కొంతమంది వేడుకకోసం వివాహ సందర్భంలో ధనవ్యయం చేస్తున్నారు. వీరిని చూసి మిగిలినవారు వివాహ వ్యయాన్ని పెంచారు. ఇది భరించలేని కొంతమంది కన్యలకు వివాహ వయసుదాటినా వివాహం కావడంలేదు కనుక ఈ విధానం మార్చాలన్నారు.

వివాహ సమయంలో చెప్పే మంత్రాలనుబట్టి పూర్వం కన్యకు పూర్ణవయసు వచ్చిన తరువాతనే వివాహం జరిగేది. కొంతకాలానికి బ్రహ్మణులు కోమట్లలో కన్యకు సంపూర్ణవయసు రాకుండానేవివాహం చేయడం మర్యాదగా ఏర్పడింది. అది క్రమేణా పాలుతాగే ఆడశిశువుకు కూడ వివాహం చేసే ఆచారం ఏర్పడిందన్నారు. "పూర్ణవయస్సు వచ్చిన చిన్నదాన్ని దానమిస్తే పూర్ణకన్యాదానమని పించుకుంటుంది. బాలికను దానమిస్తే అది అపూర్వ కాన్యదానమనిపించుకుంటుంది గనుక నున్ను చిన్నదానికి బాలారిష్టములు మొదలైన వికారములు సంభవించతగియుంటవి గనుక నున్ను చిన్నది వ్యక్తురాలైన మీదట వివాహము చెయ్యడమే మిక్కిలి నాయమైయున్నది" (పు.165) అంటూ కాన్యాదానాన్ని వివరిస్తూ కన్య వ్యక్తురాలైన పిదప వివాహం చేస్తే వివాహంలో ఉద్దేశించబడిన సుఖాన్ని పొందుతారన్నారు. బ్రాహ్మణులు, కోమట్లుకాక మిగిలిన వారిలో పూర్ణకన్యాదానం చేసే ఆచారమున్నా కన్యాదాన ఫలితంలోనున్న న్యూనత్వ ఆధిక్యతలను గుర్తించలేక, బ్రాహ్మణుల చేత వివాహం చేయించడం మర్యాదగా భావించి, వివాహ వేడుకలకయ్యే ఖర్చు పదే పదే భరించలేక పూర్ణవయసు వచ్చిన కన్యల వివాహాలతోపాటు బాలికలకు కూడ వివాహం జరిపిస్తే బాగుటుందని భావించడం, పూర్ణవయసు రాకముందే వివాహం జరిపించడం వల్ల చాలా వేడుకలకు అనుకూలంగా ఉంటుందనీ, వధూవరుల తరపువారిలో ఎవరో ఒకరు వార్థక్యం చేతగాని మరే హేతువు చేతగాని ఎక్కువకాలం జీవించలేననే భయంతో వివాహోత్సవం చూడాలనే కాంక్షతోనో యుక్తవయసు రాని బాలికలకు కూడ వివాహాలు చేస్తున్నారంటూ బాల్య వివాహాలకు ఐదు కారణాలు చూపించారు. తమ వేడుకల కోసం తమ పిల్లలను బద్ధులను చేయడం తమ పిల్లలను బలి ఇవ్వడంగా భావించమన్నారు. ఇది వ్యాపించడాన్ని 'విషూచి' మొదలైన వ్యాధుల వ్యాపకంతో పోల్చారు. భాగ్యవంతులు బొమ్మల పెండ్లిండ్లు చేసి వివాహోత్సవములు జరిపించవచ్చు. లేదా ఆ ఉత్సవాలలో బొమ్మలకు బదులు తమ పిల్లలనే కూర్చుండబెట్టి వేడుకతీర్చుకోవచ్చు. కానీ ఆ వేడుక బాలిక భవిష్యత్తుకు హాని కలిగించకూడదు. వధూవరులిద్దరూ వరించిన ఫలాన్ని పొందే స్థితి వివాహస్థితి. ఇదే మనుష్యజన్మకు ప్రధానమైనది. కన్యకు సంపూర్ణ వయసు వచ్చిన తరువాత వారి అంగీకారంతోనే వివాహం చేయాలే తప్ప యుక్తవయసురాని బాలికలకు వివాహం చేసినప్పుడు బాలారిష్టాల వలనగానీ మరే ఇతర రోగాల వలన గాని భర్త మరణిస్తే పునర్వివాహం లేకుండా ఆ బాలికలు జీవితాంతం దుఃఖమనుభవిస్తూ జీవించడం న్యాయమా ? అని ప్రశ్నించారు.

స్వయంవరంలో కూడ కన్య అభీష్టానుసారం జరగడంలేదు. పూర్వం కొందరు రాజులు స్వయంవరం చాటించి పుష్పమాలికను చిన్నదాని చేతికిచ్చి స్వయంవరానికి వచ్చిన వారిలో పసందుగా కనపడే పురుషుని కంఠమందు అలంకరించమని నియమించారు. కాని అందుకు భిన్నంగా మత్స్యయంత్రాన్ని కొట్టినవానికి కుమార్తెనిస్తానని, శివుని విల్లు ఎక్కుపెట్టిన వానికి పిల్లను ఇస్తానని కొంతమంది రాజులు ప్రకటిస్తూ చిన్నదాని ఇచ్ఛకు విలువనివ్వలేదని సూచించారు. సీతాదేవి, ద్రౌపది యొక్క వివాహాలే ఇందుకు సాక్ష్యాలుగా పేర్కొన్నారు.

స్త్రీకి స్వాతంత్ర్యం లేదనే విషయాన్ని ప్రస్తావిస్తూ - "పితారక్షతి కౌమారే..." శ్లోకాన్ని ఉదహరించి బాల్యంలో తండ్రిచేత, యౌవనంలో భర్తచేత, వార్థక్యంలో కుమారుని చేత రక్షింపబడాలే తప్ప ఏ స్త్రీ స్వతంత్రించి ప్రవర్తించకూడదనడం న్యాయంకాదు. "మహిష్యాంగవి, కన్యాయాం, ఆదానం, నస్వతంత్రతా / తతోగ్రహీతుస్తాః ప్రాహు స్స్వాతంత్ర్యంనకదాచన". దానం చేయకముందుగాని, చేసిన తరువాతగాని గేదెకు, ఆవుకు, కన్యకు స్వాతంత్ర్యం లేదంటూ కన్యను గేదెతోను, ఆవుతోను కలిపి చెప్పడాన్ని స్వామినీన విమర్శించాడు.

బోధాయన స్మృతిలో "త్రీణివర్షాణ్యృతుమతీ కాంక్షేత పితృశాసనం కితతశ్చతుర్థే వర్షేతు విందేత సదృశం పతిం". అనే వచనాన్ననుసరించి ఋతుకాలం పొందిన స్త్రీ మూడు సంవత్సరాలు తండ్రి ఆజ్ఞను కోరాలి. తరువాత నాలుగో సంవత్సరమయితే సమానకుల సంజాతుడైన భర్తను పొందవలెనని అర్థం. మరోగ్రంథంలో ...

"కన్యా ద్వాదశ కేవర్షేయాత్వదత్తా గృహేవసేత్
భ్రూణహత్యా పితుస్తస్యాస్సా కన్యావరయేత్స్వయం"

పన్నెండు సంవత్సరాలకే కన్య స్వయంవర వివాహ పద్ధతిలో భర్తను ఎన్నుకోవచ్చని, అలా వివాహం చేయని తండ్రికి భ్రూణహత్యదోషం సంభవిస్తుందన్న ఒక గ్రంథంలోని విషయాలు పూర్వం రాజులు జరిపిన స్వయంవర వివాహాలు గుర్తుచేస్తున్నాయని భావించారు.

అష్టవర్షాభవేత్ కన్య - ఎనిమిదేళ్ళ వయసుగలది కన్య. ఈమెను కన్యాదానం చేసినవాడు బ్రహ్మలోకాన్ని పొందుతాడు. నవ వర్షాతు రోహిణీ - తొమ్మిది సంవత్సరాల బాలికను రోహిణి అంటారనీ, ఈమెను కన్యాదానం చేస్తే వైకుంఠం పొందుతారనీ, దశవర్షాభవేత్గౌరి - పది సంవత్సరాల వయసుగలది గౌరి - ఈమెను కాన్యాదానం చేస్తే, వారికి స్వర్గలోకం లభిస్తుంది. రజస్వల యైన స్త్రీని ఇచ్చినట్టయితే రౌరవమనే నరకం పొందుతారని ధర్మశాస్త్రాలు చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. గౌరిని దానం చేస్తే స్వర్గం, రోహిణిని దానం చేస్తే వైకుంఠం, కన్యనుదానంచేస్తే చతుర్ముఖలోకం వస్తుందన్న విషయాన్ని ప్రచార చేస్తున్నారు. మరి విష్ణుభక్తుడికి వైకుంఠం ప్రాప్తిస్తే యుక్తియుక్తమేగాని శైవునకు వైకుంఠప్రాప్తి చెప్పడం న్యాయంగా లేదని విమర్శించాడు. ఎలాంటి దానానికి ఏ లోకాలు వస్తాయో ఈ శ్లోకాలు రచించినవానికి ఎలా తెలుసని ప్రశ్నించారు.

'కన్యావరయతే రూపం' అంటూనే అష్టవర్షాభవేత్ కన్య అంటున్నారు. ఎనిమిది సంవత్సరాల బాలిక వరుని అందచందాలను అంచనా వేయగలదా ? పురాణాలలో కూడ సీత, ద్రౌపది, రుక్మిణి, దమయంతి మొదలైన వారి పెళ్ళిళ్ళు ఎనిమిదేళ్లకే జరిగాయా అని ప్రశ్నించారు. ఎనిమిదేళ్ల పిల్లకు సిగ్గే తెలియదు కదా ! దానిని కన్యాదానం చేయడం ఏమిటి ? పెనిమిటికి స్వాధీనం చెయ్యడమేమిటి ? అంత చిన్నవయసులో ఏ వ్యక్తినయినా ఎలా వరిస్తుంది ? ఎనిమిదేళ్ల వయసులో కన్యాదానం స్వీకరించిన భర్త ఏం చేసుకుంటాడు ? వివాహ యోగ్యతా, యుక్తవయసురాని బాలికలకు వివాహాలు చేయడం న్యాయంకాదన్నాడు. ఇలా కన్యాదానం చేయడానికి అలా స్వర్గమో బ్రహ్మలోకమో పొందడానికి హేతువేమిటి ? అని ప్రశ్నించారు. మహర్షులు, మహాపురుషులు, యుక్తవయసు వచ్చిన కన్యలకే వివాహాలు జరిపించారు. రజస్వల అయిన కన్యను ఇచ్చిన వాడికి రౌరవాది నరకాలు వస్తాయని వారికి తెలియదా ? వారికి తెలియని అంశం మధ్యలో వీరికి ఎలా తెలిసిందని ప్రశ్నించారు. కన్యాదానఫలం వల్లనే ఉత్తమ లోకాలు కలుగుతాయని పూర్వం ప్రచారంలో ఉన్నట్లయితే ఋషులు ఉత్తమ లోకాలకోసం కఠిన తపస్సులు, యజ్ఞయాగాలు చేసి కష్టపడనవసరంలేదు. ఋషులకు, తపోధనులకు కన్యాధాన శ్లోకాలమీద నమ్మకం లేదు కనుకనే స్వర్గప్రాప్తికోసం వారు తమ తమ మార్గాలను ఎన్నుకున్నారు.

రజస్వలానంతర పాణిగ్రహణమే న్యాయమని, సంపార సుఖాలనుభవించి సంసార ఫలాన్ని పొందటమే కన్యాదానం ఉద్దేశం. పూర్ణ వయసులోనే ఇది సంభవిస్తుంది. కనుక బాలికను దానమిస్తే పూర్ణ కన్యాదానమనిపించుకోదు. బాలికకు వివాహం చేసి కన్యాధానం చేసినట్లే చేసి ఆమెను వారికి ఆధీనం చెయ్యకుండా దాత తన ఆధీనంలోనే ఉంచుకోవడం దానమనిపించుకోదు. పిందెను చెట్టుమీదుండగా కనపరచి ఫలదానమిచ్చినామన్నట్లు ఉంటుందన్నారు. కన్యాశుల్క వివాహానికి గురయిన చాలామంది బాలికలు యౌవనం వచ్చిన తరువాత చాలా దైన్యాలను, దుఃఖాలను, అపకీర్తులను పొందడానికి హేతువులు కలుగుతున్నాయన్నారు. యుక్తవయసు తరువాత వివాహమైతే తల్లిదండ్రులను ఎదిరించే ధైర్యం వస్తుందన్నారు.

యుక్తవయసు రాని బాలికలకు వివాహం చేసే ఆచారం ద్రవ్యం పుచ్చుకొని బాలికలను వివాహానికిచ్చే పద్ధతికి అంటే కన్యాశుల్కానికి దారితీసింది. పురుషుని యొగ్యతలు, శారీరక స్థితిగతులు చూడకుండ ద్రవ్యాన్నపేక్షించి బాలికలకు వివాహం చేయడం న్యాయ విరుద్ధము, ప్రతిష్టకు హానికరమనీ కన్యాశుల్కం పుచ్చుకొనేవాణ్ణి మాంస విక్రేతగాను ఇచ్చేవాణ్ణి మాంసం కొనుగోలు దారుగాను పేర్కొన్నారు.

స్త్రీకి భర్తృవియోగం సంభవించిన పక్షంలో యౌవనమున్నంతవరకు పునర్వివాహయోగ్యత పూర్వం కలిగి ఉన్నదనడానికి మహాభారతంలో ఆధారాలున్నాయి. వేదవ్యాసుని తల్లి సత్యవతి శంతనుణ్ణి వివాహం చేసుకొన్నది. భర్తలు మరణించిన తరువాత

అంబిక అంబాలికలు వ్యాసుని వలన సంతానాన్ని పొందారు. కుంతికి కర్ణుడు పుట్టిన తరువాత పాండురాజుతో వివాహం జరిగింది. అతనితో సంసారసుఖం లేనందువల్ల యముడు, వాయువు, ఇంద్రుల ద్వారా సంతానాన్ని పొందింది. వీరి చరిత్రల ద్వారా యౌవనం ఉన్నంతవరకు స్త్రీకి పునర్వివాహ యోగ్యత ఉన్నదంటాడు ముద్దునరసింహం. తరువాతి కాలంలో పునర్వివాహాలు రద్దుపరచినందువల్ల నిర్బంధం మూలంగా అనేకమంది అకృత్యాలకు పాల్పడి దురాచార సంబంధాలను, దుర్దోషాలను ఆయా కుటుంబాలవారు ఉపద్రవంగా తెచ్చుకున్నారు. బాల్యవివాహం, ఆ తరువాత పునర్వివాహాలు రద్దు మూలంగా అనేకమంది స్త్రీల యొక్క యౌవనం దుఃఖంతోనే గడుస్తుంది. బాల్యవివాహం జరిగాక గర్భాదానం కాకముందే భర్త చనిపోతే ఆమె యౌవనాన్ని దుఃఖానికి గురిచేస్తున్న బాధ్యతగల తల్లిదండ్రులు ఎంత పాపాన్ని, ఎంత దుఃఖాన్ని పొందవలసివస్తుందో వివేకశీలురయినవారు ఆలోచించాలన్నారు.

పాణిగ్రహణమైన వెంటనే భార్యను భర్త తన ఇంటికి తీసుకువెళ్ళాలని, ఆనాటినుండే వారు ఏకశయ్యాగతులు కావాలని, యుక్త వయస్సులో నున్న కన్యలకే వివాహం చేయాలని కోరారు. వివాహం తరువాత దంపతులు వేర్వేరుగా నున్న సందర్భంలో ఏర్పడే సమస్యలను నివారించవచ్చని ముద్దునరసింహం భావించారు. స్త్రీకి తండ్రో, భర్తో, కుమారుడో రక్షకుడుగా ఉండాలంటే అర్థమేమిటి ? ఈ ముగ్గురు లేని స్త్రీ - అంటే భర్త కూడలేని స్త్రీ పునర్వివాహం చేసుకోవచ్చని అర్థం కాదా ? అని ప్రశ్నించారు.

సుఖసంతోషాలు, వివాహస్థితి పొందేహక్కు భగవంతుడు స్త్రీ పురుషులిద్దరికి సమానంగానే కలుగజేశాడు. వివాహంకాక మునుపు కన్య రజస్వలయైనట్లయితే తల్లిదండ్రులు తోడబుట్టినవారు ఆ కన్యతో బాటు నదీగర్భంలో ప్రవేశించాలనే విధి, భర్త చనిపోయిన యౌవనవతికి పునర్వివాహం నిషేధమనే అభిప్రాయాలు నిరర్ధకాలు. వితంతు యౌవన స్త్రీలలో పునర్వివాహం ఇష్టమైన వారికి సజాతీయులలో తమను అంగీకరించిన పురుషునకిచ్చి బంధువులు పాణిగ్రహణం చేయించాలని, కన్యా దానం పేరుతో మరలా వధువును దానం చేయకూడదు కనుక ఈ పాణిగ్రహణాన్ని కన్యాదానం అనవలసిన పనిలేదన్నాడు. ఈ పాణిగ్రహణమే వివాహానికి ముగింపు కావాలన్నాడు. వీరికి, ప్రథమ వివాహమైన వారికి జరిపే గౌరవమే జరపాలనీ, ఆస్తిహక్కుల విషయంలో ధర్మశాస్త్రాలు ప్రథమ వివాహస్త్రీకి, ఆమె సంతానానికి ఇచ్చిన హక్కులు పునర్వివాహ స్త్రీకి కూడా ఉండాలన్నాడు. వీరిపట్ల వివక్ష చూపకుండ జాగ్రత్తలు తీసుకొనవలసిన బాధ్యతను నీతికోవిదుల మీద పెట్టాడు.

హిందూ సమాజంలో స్త్రీల దుస్థితిని చూసి చలించిపోయి వారి విద్యావశ్యకతను, బాల్యవివాహాల వలన కలిగే దుష్ఫలితాలను గూర్చి హితసూచని రచించి మొట్టమొదటి సారిగా సాహితీ ప్రచారానికి నాంది పలికారు. నేటి స్త్రీ పునర్వివాహాలకు, స్త్రీవాదానికి బీజాలు హితసూచనిలోనే ఉన్నాయి. గ్రంథం మరుగున పడిన కారణంగా స్వామినీన ముద్దునరసింహంకు రావలసిన గుర్తింపు రాలేదు. "వీరిలో హితసూచనే కాదు, హితాచరణ కూడా ఉంది". ఒక బాల వితంతువును వివాహానికి సిద్ధపరచి, ఆమెను పెండ్లాడితే జీవయాత్రకు కావలసినంత ఆస్తి, ధనం, ఇస్తానని ప్రకటించి ప్రయత్నించారు. అయినా, ఎవరూ ముందుకు రాలేదు. అందుకని ఆయన తొలి వితంతు వివాహకర్త కాలేకపోయారు' అని వీరేశలింగం వెలుగునీడల గ్రంథంలోని హితసూచని నుండి హితకారిణికి అన్న శీర్షికలో త్రిపురనేని వెంకటేశ్వరరావు పేర్కొన్నారు.

ముద్దు నరసింహం నాటికి సతీసహగమనాన్ని బ్రిటిష్ ప్రభుత్వం నిషేదించింది. కాని బాల్యవివాహాలు కన్యాశుల్కాలున్నాయి. వితంతు పునర్వివాహం లేదు. స్త్రీ విద్యలేదు. స్వేచ్ఛ లేదు. స్త్రీ పురుషులకు సమాన ప్రతిపత్తి లేదు. వీటన్నింటిని విమర్శిస్తూ తన అభిప్రాయాలను వివాహ ప్రమేయంలో పొందుపరిచారు. "సమగ్ర స్వేచ్ఛావాదాన్ని ఆయన ప్రచారం చేశాడు. స్త్రీలకు పురుషులతో సమాన స్వేచ్ఛ కావాలన్నాడు స్వామినేని. అది అప్పటి సామాజికుల ఊహల్లోకి రాని విషయం" అంటారు రావిపూడి వెంకటాద్రి.

### 9.3 ముగింపు :

ఈ విధంగా సమాజంలో ఏది సమస్య ? ఆ సమస్యకు పరిష్కారం ఏమిటి ? ఎందువలన సమాజం అభివృద్ధి చెందడం లేదు ? అని ఆలోచించి వాస్తవమైన అంశాలను గ్రహించి వివరించారు స్వామినీన. విద్యను, వైద్యాన్ని అందరికీ అందుబాటులో ఉండే విధంగా ఆధునీకరించి అందజేయాలనే వీరి అభిప్రాయం సర్వత్రా ఆమోదయోగ్యం. స్వర్ణముఖి విద్యలేదని, స్పర్శవేది అనేది కూడా అవాస్తవికమేనని తెలియజేస్తూ పశు పక్ష్యాదులకు ప్రత్యేక భాషలుండటం, అవి మానవులు నేర్చుకోవడం, పక్షులు, జంతువులు మాట్లాడేటప్పుడు వినడం ఇవన్నీ అసంబద్ధమైనవి అన్నారు. దయ్యాలు, భూతాలు, పిశాచాలు లేవని, బ్రతికి వున్న మనుషులను దయ్యాలు ఆవహిస్తాయనేది అబద్ధమని, చచ్చినవాళ్ళు దయ్యాలు, భూతాలు కారని, దయ్యాలుకనబడటం మానసిక భ్రమ అని తేల్చి చెప్పారు. మంత్రాలు, మహత్మ్యాలు కూడా లేవని, పరకాయ ప్రవేశ విద్య శుద్ధ అబద్ధమని, మంత్రాలు, మంత్రజలాలతో మనుషుల్ని జంతువులుగా మార్చటం మొదలైనవన్నీ అభూత కల్పనలని కొట్టి పారేశారు. దివ్యదృష్టి, అతీంద్రియజ్ఞానం, జ్యోతిషం కూడా వాస్తవాలు కావని వివరించారు. అబ్బాయి, అమ్మాయిల యిష్టాయిష్టాలే పెళ్ళికి ముఖ్యమనే నేటి మాటలను 150 ఏళ్ళనాడే చెప్పి స్త్రీ వివాహ విషయంలో ఎన్నో అసమానతలను పాటిస్తున్నారని, అవి కూడదని తెలియజేశారు.

ఇలా సమాజ సమస్యల్ని వేలెత్తి చూపి వాటి పరిష్కార మార్గాలను కూడా చూపించిన గొప్ప సంఘ సంస్కర్త, హేతువాది స్వామినీన ముద్దు నరసింహం.

### 9.4. ప్రశ్నలు :

1. 'సంఘ సంస్కర్త - స్వామినేని ముద్దు నరసింహం' వివరించండి.
2. 'హిత సూచని' నామసార్థక్యాన్ని తెలియజేయండి.
3. 'హిత సూచని'లో ముద్దునరసింహం పేర్కొన్న స్త్రీ సమస్యలను వివరించండి.
4. 'హితసూచని - స్త్రీ హితకారిణి' సమర్థించండి.

### 9.5. ఉపయుక్త గ్రంథాలు :

1. హితసూచని - సామినేని ముద్దునరసింహం
2. స్వామినేని హితసూచని పర్యావలోకనం - రావిపూడి వెంకటాద్రి.
3. వీరేశలింగం వెలుగునీడలు - దిగవల్లి వెంకటశివరావు
4. సమగ్రాంధ్ర సాహిత్యం - ఆరుద్ర.

**- ఆచార్య టి. సత్యవతి**

పాఠం - 10

# కన్యా శుల్కం

ప్రణాళిక :


10.0 ఉద్దేశ్యం

10.1. కన్యాశుల్క వివరణ

10.2. కన్యాశుల్కం - ఇతి వృత్తం

10.3. కన్యాశుల్కం - స్త్రీ పాత్రలు

10.3.1 మధురవాణి

10.3.2 వెంకమ్మ

10.3.3 బుచ్చమ్మ

10.3.4 మీనాక్షి

10.3.5 పూటకూళ్ళమ్మ

10.3.6 సుబ్బమ్మ (సుబ్బి)

10.4. కన్యాశుల్కం - స్త్రీ సమస్యలు

10.4.1 బాల్యవివాహాలు

10.4.2 వైధవ్యం

10.4.3 కన్యాశుల్కం

10.4.4 వేశ్యా వ్యవస్థ

10.5. కన్యాశుల్కం - ముగింపు

10.6. ప్రశ్నలు

10.7. ఉపయుక్త గ్రంథాలు


## 10.0 ఉద్దేశ్యం :

కన్యాశుల్కం నాటి సామాజిక స్థితిగతులను చర్చిస్తూ నాటి స్త్రీ సమస్యలను వివరించటం.

## 10.1. కన్యాశుల్కం :

'శుల్కమ్' అన్న సంస్కృత శబ్దానికి మార్గాది గృహ్యమాణ శుల్కమ్, కన్యార్థ దత్తధనమ్' అనే అర్థాలున్నాయని సర్వశబ్ద సంబోధిని వ్యాఖ్యానం తెలియజేస్తుంది.

యాసాం నాదదతే శుల్కం జ్ఞాతయో నసవిక్రయః

అర్హణం తత్కుమారీణా మా నృశం స్యంచకేవలమ్" (మను స్మృతి 3:54)

దీన్నిబట్టి మనువు 'శుల్కం' శబ్దాన్ని కన్య కొరకు ఇచ్చే ధనం అనే అర్థంలోనే ప్రయోగించాడు.

అతి ప్రాచీన సమాజంలో స్త్రీ యొక్క విలువను తెలియజేసే కన్యాశుల్క పద్ధతి తరువాతి కాలంలో సూత్రకారులచే విక్రయంగా భావించపడి, సంఘ దురాచారంగా ఖండించబడింది.

కందుకూరి ఈ శుల్క వ్యాపారం యొక్క హేయమైన స్వభావాన్ని గురించి "కసాయి వాడు మేక మాంసమమ్ముతాడు. నీవు నరమాంసమమ్ముతూ ఉన్నావు. వాడు జంతువు చచ్చిన తరువాత మాంసము తీసి అమ్ముతాడు. నీవు మనిషి బ్రతికి ఉండగానే మాంసమమ్ముతూ ఉన్నావు. వాడు యొక్కడనో పుట్టిన పశుమాంసము విక్రయిస్తాడు. నీవు కడుపున పుట్టిన శిశుమాంసమును విక్రయిస్తూ ఉన్నావు" అని దుయ్యబట్టారు.

ఇలా డబ్బు మీద ఆశతో కన్నబిడ్డల్ని పశువుల్లాగా అమ్ముకుంటున్న సమాజ స్థితిని చూచి చలించిపోయాడు గురజాడ. అతనిలోని కవి హృదయం మేల్కొంది. సంఘ సంస్కారం చేయమంది. సమాజ చైతన్యం తీసుకురమ్మంది. ఆ ఆత్మబలంతో కలాన్నే కత్తిగా పైకెత్తిన గురజాడ సమాజంలో ఉన్న 'కన్యాశుల్కం' కోరలు పెరికి వేయ్యాలనుకున్నాడు. బిగుస్తున్న బాల్యవివాహాల బాహువులను ఖండించాలనుకున్నాడు. అసమ వివాహాల వలన కలిగే అశాంతిని అణచివేయాలనుకున్నాడు. వేశ్యావృత్తిని రూపుమాపాలనుకున్నాడు. ఈ సమాజ సంస్కరణాభిలాష ఫలితమే అపూర్వ 'కన్యాశుల్కం' నాటక రచన. ఈ నాటక రచనతో తెలుగు సాహిత్యంలో 'ఆధునిక యుగకర్త' గా అజరామరమైన కీర్తిని పొందాడు గురజాడ.

## 10.2 కన్యాశుల్కం - ఇతివృత్తం :

కృష్ణరాయపురం అనే అగ్రహారంలోని అగ్నిహోత్రావధాని వేదాలు బాగా చదువుకున్నవాడు. అయినప్పటికీ ఆ జ్ఞానం ద్వారా తగినంత ధనార్జన లేదు. అతనికి ఇద్దరు కూతుళ్ళు. బుచ్చమ్మ, సుబ్బమ్మలు. ఒక కొడుకు. పేరు వెంకటేశం. అగ్నిహోత్రావధాన్లు డబ్బు మీద ఆశతో కన్యాశుల్కంగా రూ. 1,600-00 లు తీసుకొని బుచ్చమ్మను ఒక వృద్ధుడికిచ్చి పెళ్ళి చేశాడు. అతడు కొద్ది రోజులకే మరణించాడు. బుచ్చమ్మ బాలవితంతువు అయింది. ఈ నాటక కథా కాలం నాటికి బుచ్చమ్మ యౌవనంలో ఉంది.

అగ్ని హోత్రావధాని కొడుకు వెంకటేశం. విజయనగరంలో ఇంగ్లీషు చదవులు చదువుకొంటూ ఉన్నాడు. అది అగ్నిహోత్రునికి ఇష్టంలేకపోయినా భార్య వెంకమ్మ బలవంతం వలన, కొడుకు గొప్ప ఉద్యోగాలు చేసి ధనం సంపాదిస్తాడనే ఆశ వలన కొడుకు ఇంగ్లీషు చదువుకి అంగీకరించాడు. కానీ వెంకటేశం విద్య మాత్రం అనుకున్నంతగా ముందుకు సాగలేదు. ఒక సంవత్సరం పరీక్ష పోయింది. గిరీశం చేత ఇంటి దగ్గర ట్యూషన్ చెప్పించుకున్నాడు. అయినా మళ్ళీ పరీక్ష పోయింది. ఇంతలో క్రిస్మస్ సెలవులు వచ్చాయి. ఇంటికి వెళితే పరీక్ష పోయినందుకు తండ్రి చావగొడతాడనే భయంతో వెంకటేశం తెల్లబోయిన ముఖంతో ఉన్నాడు.

విజయనగరంలో తనకు పరిస్థితులు అనుకూలించకపోవడం చేత అక్కడినుండి వేరే ఎక్కడికైనా పారిపోవాలని గిరీశం నిశ్చయించుకొని దిగాలుగా ఉన్న వెంకటేశాన్ని చూచి తన ఆలోచనను అమలు చేద్దామనుకొన్నాడు. వెంకటేశంతో "నేనో ఉపాయం చెపుతాను విను. నే కూడా నీతో మీ వూరోచ్చి పరీక్ష పాసయినావని మీ వాళ్ళతో చెబుతాను. అక్కడ నీకు చదువు చెప్పడానికి వచ్చానని మీ వాళ్ళతో చెప్పు, శెలవులాఖర్ని నిన్ను టవును స్కూల్లో పై క్లాసులో ప్రవేశపెడతాను" అని చెప్పి గిరీశం వెంకటేశంతో కలిసి కృష్ణారాయపురం చేరుకున్నాడు

కృష్ణారాయపురం అగ్రహారంలో అగ్నిహోత్రుని ఇంట్లో అతని బావమరిది కరటక శాస్త్రి, కరటకశాస్త్రి శిష్యుడు మహేశం సమక్షంలో అగ్నిహోత్రునికి, భార్య వెంకమ్మకి కొడుకు చదువు విషయంలో వాదులాట జరిగింది. "మనకీ ఇంగ్లీషు చదువు అచ్చిరాదని, చాలా డబ్బు ఖర్చవుతుందని అవధాన్ల బాధ. తన కొడుకు ఇంగ్లీషు చదువు కోసం ఎంత డబ్బు ఖర్చయినా

ఫర్వాలేదు. బాధ పడకూడదని వెంకమ్మ అభిప్రాయం. కరటకశాస్త్రి వెంకమ్మతో "నీ భూమెందుకమ్మాలమ్మా ? మన సొమ్ము చెడతిని కొవ్వున్నాడు. అతడే పెట్టుకుంటాడు'' అని అంటున్న సమయంలోనే గిరీశం, వెంకటేశం ప్రవేశించారు.

గిరీశం "వెంకటేశం ఫస్టుగా పాసయినాడు. నేను చాలా శ్రమపడి చదువు చెప్పానండి'' అంటూ అందర్నీ తన మాటల వలలో పడేటట్లు చేశాడు. ఆ మాటల సందర్భంలో అగ్నిహోత్రావధాన్లు "మా వాడికి డబ్బు ఖర్చు లేకుండా పెళ్ళియే సాధనం కూడా తటస్థించిందండి'' అని గిరీశానికి చెబుతూ తాను రెండో కూతురు సుబ్బిని రామచంద్రపురం అగ్రహారంలోని లుబ్ధావధాన్లకు రూ. 1800 లకు ఇచ్చి పెళ్ళి చెయ్యడానికి నిశ్చయించినట్టు చెబుతాడు. వెంకమ్మ, కరటక శాస్త్రి ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. గిరీశం లుబ్ధావధాన్లు తన పెత్తల్లి కొడుకునీ, అరవై యేళ్ళ దాటాయని, ఆయన ఈ సంబంధాన్ని వదలడని చెప్పాడు. ఆ సమయంలో అక్కడ బుచ్చమ్మను మొదటిసారిగా చూచిన గిరీశం ఆమెపై మనసుపడి, ఎలాగైనా ఆమెకు బోధించి పునర్వివాహానికి ఒప్పించి పెళ్ళి చేసుకుందామనుకున్నాడు. అందుకోసమై వీలున్నప్పుడల్లా గిరీశీ ఆమెను పెళ్ళి చేసుకొమ్మని ప్రోత్సహిస్తూ ఉండేవాడు.

కరటక శాస్త్రి తన మేనకోడలు సుబ్బికి జరిగే ఈ పెళ్ళిని ఎలాగైనా ఆపాలనుకొని తన శిష్యుడు మహేశంతో "ఒపదిరోజులు నువ్వు ఆడపిల్లవయిపోవాలి'' అని సుబ్బి పెళ్ళి తప్పించడానికి తను తలపెట్టిన ఉపాయం చెప్పి "నువ్వు నెగ్గుకొస్తే మా పిల్లన్నీకిచ్చి యిల్లరికం వుంచుకుంటాను'' అని మాట కూడా ఇచ్చాడు.

రామచంద్రాపురం అగ్రహారంలో ఉండే లుబ్ధావధాన్లు వయస్సు అరవయ్యేళ్లు. ఆ ఊరిలోనే రామప్పంతులు అనే కరణం ఉన్నాడు. అతను లోక వ్యవహారాల్లో బాగా ఆరితేరినవాడు. సుబ్బిని పెళ్ళాడమని లుబ్ధావధాన్లను పురికొల్పింది ఇతనే. మధురవాణి అనే వేశ్య గిరీశంతో ఉంటుంటే ఆమెను గిరీశం నుండి తప్పించి తానుంచుకొన్నాడు. లుబ్ధావధాన్ల కూతురు మీనాక్షితోనూ అక్రమసంబంధం పెట్టుకున్నాడు. మధురవాణి, రామప్పంతులు మాటల సందర్భంలో లుబ్ధావదాన్ల పెళ్ళి విషయం వచ్చింది. " ఆ ముసలాడికి పెళ్ళెందుకు ? మీ కోసమే యీ యెత్తంతాను'' అని మధురవాణి రామప్పంతుల్ని దెప్పిపొడుస్తూ, ఏమైనా కాటికి కాళ్ళు చాచుకున్నవాడు చిన్నపిల్లను పెళ్ళి చేసుకోవటం అన్యాయం. ఈ పెళ్ళిని ఎలాగైనా తప్పించమని నిర్బంధ పెట్టింది. ఇంతలో కానిస్టేబుల్ వస్తే అతనితో బైటకు వెళ్ళిపోయాడు రామప్పంతులు.

సుబ్బి తల్లి వెంకమ్మ ఈ సంబంధం చేయవద్దని ఎంత మొత్తుకున్నా అగ్నిహోత్రుడు ఆమె మాట వినలేదు. పెళ్ళి తప్పించకపోతే నూతిలోపడి చచ్చిపోతానని వెంకమ్మ భీష్మించుకుంది. అయినా ఫలితం లేకపోయింది.

గిరీశం బుచ్చమ్మను ఎలా లైన్లో పెట్టాలా అని ఎప్పుడూ ఆమె గురించే ఆలోచిస్తూ వచ్చి బుచ్చమ్మ వదిన గారు తలుపు తీయండని తలుపు తీయించి వెంకటేశాన్ని పిలిపించి ఇంగ్లీషు పాఠం చెప్పే వంక మీద వితంతువుల ప్రస్తావన తెచ్చి వాళ్ళు మళ్ళీ పెళ్ళి చేసుకోవడం మంచిదని బుచ్చమ్మకు చెప్పాడు ఆ సమయంలోనే అక్కడకు వచ్చిన అగ్నిహోత్రావధాన్లను చూచి విషయం మార్చి అతని చేత కూడా "మొత్తము మీద మీ ఇంగ్లీషు చదువు మంచిదిలాగే కనపడుచున్నది'' అని అనిపించి దావాల మీదకు ఆయన దృష్టి మళ్ళించాడు.

గిరీశం మాయమాటల్లో పడిపోయిన బుచ్చమ్మ గిరీశం చాలా గొప్పవాడని భావించి తన చెల్లెలు సుబ్బి పెళ్ళి తప్పించమని అడిగింది. ఈ పెళ్ళి గిరీశానికి కూడా ఇష్టం ఉండదు. ఇలా సుబ్బి పెళ్ళి తప్పించాలని తల్లి వెంకమ్మ, అక్క బుచ్చమ్మ, మేనమామ కరటక శాస్త్రి వారికి చేతనైన ప్రయత్నాలు చేయసాగారు. ఈ ప్రయత్నాల్లో ముందున్నవాడు కరటకశాస్త్రి. ఇతడు తన శిష్యుడికి ఆడవేషం వేసి లుబ్ధావధానికిచ్చి పెళ్ళి చేయాలని నిశ్చయించుకున్నాడు. అయితే ఈ పని తన ఒక్కడివల్ల అయ్యేదికాదు. ఇంతవరకు వచ్చిన తర్వాత లుబ్ధావధాన్లు పెళ్ళి మానుకుంటాడా ? ఏదో గొప్ప ఎత్తు వేయాలి. ఆ ఊరిలోని

రామప్పంతుల్ని పట్టుకుంటే పని జరగవచ్చు అనుకొని అతని ఇంటికి స్త్రీ వేషంలో వున్న తన శిష్యుణ్ణి తీసుకొని వెళ్ళాడు కరటకశాస్త్రి. అక్కడ రామప్పంతులు ఇంట్లో ఉన్న మధురవాణిని చూసి ఆశ్చర్యపోయాడు కరటకశాస్త్రి. పాత స్నేహాన్ని ఇద్దరూ గుర్తు చేసుకున్నారు. గిరీశం ప్రస్తావన వచ్చేసరికి ఆ గిరీశం కృష్ణారాయపురంలో ఉన్నాడనే సంగతి మధురవాణికి చెప్పాడు. ఇక్కడకు తాను వచ్చిన కారణాన్ని వివరిస్తూ లుబ్ధావధాన్లకు నిశ్చయించినపిల్ల తన మేనకోడలని, ఈ పెళ్ళి సమస్య తప్పించి తనకు సాయం చెయ్యమని మధురవాణిని వేడుకున్నాడు కరటకశాస్త్రి వెంట ఆడపిల్ల వేషంలో ఉన్నది అతని శిష్యుడేనని గుర్తించిన మధురవాణి తానూ సాయం చేస్తానని మాటఇచ్చి రామప్పంతులుతో మాట్లాడిన తర్వాత మీనాక్షికి, సిద్ధాంతికి ఆశపెట్టి మంచి చేసుకోమని సలహా ఇస్తుంది. ఇంతలో రామప్పంతులు తిరిగి వచ్చాడు. కరటక శాస్త్రులు తనను గుంటూరు శాస్త్రులుగా పరిచయం చేసుకొని తమ దగ్గరకు పెద్దపని ఉండి వచ్చానని ఇన్‌స్పెక్టర్ జవాను ద్వారా రామప్పంతులు పంపవలసిన పాతిక రూపాయలూ తానే ఇచ్చాడు. ఆ తర్వాత అసలు విషయం చెప్పాడు. ఈ 'పిల్ల'ను తక్కువ రేటుకు లుబ్ధావధాన్లకు కుదురుస్తానని, అయితే వచ్చే డబ్బులో ఐదో వంతు తనకు ఇచ్చినట్లయితేనే వ్యవహారం నడిపిస్తానని రామప్పంతులు అంటే సరేనని ఒప్పుకున్నాడు కరటకశాస్త్రి.

ఇచ్చిన మాట ప్రకారం రామప్పంతులు లుబ్ధావధానికి అగ్నిహోత్రావధాన్లు రాసినట్లుగా "మీరు పిసినిగొట్లు, ముసలివారు, క్షయరోగ పీడితులనీ, మీ కూతురి వర్తనము బాగోలేనందున మిమ్ము వెలివేసినారు అనిన్నీ తెలిసినందున మీకు మా పిల్లనివ్వదల్చుకోలేదు" అని ఉత్తరం రాశాడు. అదే సమయంలో కృష్ణాయపురం నుండి గిరీశం లుబ్ధావధాని పేర "సుబ్బికి వైధవ్య లక్షణములున్నవి. మీరు పెళ్ళి మహావైభవంతో చేసుకుంటారని తెలిసి పెద్ద పటాటోపంతో అగ్నిపుత్రుడు ఏనుగులూ, గుఱ్ఱాలూ, లొట్టిపిట్టలూ, పల్లకీలూ కాక యాభై బళ్ళలో పెళ్ళికి తరలి వస్తున్నాడు. ఇందువల్ల మీకు చాలా ధనవ్యయమవును. కావున ఈ సంబంధం మానుకోవలెను" అని ఉత్తరం రాశాడు. ఈ రెండు ఉత్తరాలు ఒకేరోజు అందాయి లుబ్ధావదాన్లకి ఉత్తరాలు చూసుకున్న లుబ్ధావధాని గుండె జారిపోయింది. ఆ ఉత్తరం చేతబట్టుకొని లుబ్ధావధాన్లు ధుమధుమలాడుతూ రామప్పంతులు ఇంటికి వచ్చి "నాకు పెళ్లీవొద్దు, పెటాకులూ వొద్దు" అన్నాడు. వారి మాటల మధ్యలో అదను చూసి గుంటూరు శాస్త్రుల సంబంధాల గురించి చెప్పి పిల్ల ఐశ్వర్య లక్షణాలు వర్ణించి, పిల్లను చూపించి పెళ్ళికి అవధాన్లను ఒప్పించాడు రామప్పంతులు. కొద్దిసేపటికే సిద్ధాంతి వచ్చి పిల్ల రూపాన్ని వర్ణించి, చెయ్యిచూసి గొప్ప జాతకమని చెప్పి పెళ్ళికి మంచిరోజు కూడా చెప్పి వెళ్ళిపోయాడు. తర్వాత కరాటక శాస్త్రి వచ్చి లుబ్ధావధాన్లతో పెళ్ళి నిశ్చయం చేసుకొని వివాహ సమయంలో పెళ్ళి కూతురికి నగ పెట్టించమని లుబ్ధావధానిని అడిగాడు. దానికి లుబ్ధావధాని ఒప్పుకోకపోయేసరికి రామప్పంతులు మధురవాణి కంటె ఎరువు తెచ్చి పెళ్ళికూతురుకిచ్చి లౌక్యులను పిలవడానికి పొరుగూరికి వెళ్ళాడు. కరటకశాస్త్రి మీనాక్షిని కలుసుకొని ఒక 'పులిమొహరు' ఆశపెట్టి మంచి చేసుకున్నాడు.

కరటకశాస్త్రి రామప్పంతులు తిరిగి రాకముందే లుబ్ధావధానిని ఏకరాత్రి వివాహానికి ఒప్పించి తన శిష్యుడికి, లుబ్దావధానికి పెళ్ళి చేయించి తన దారిన తాను వెళ్ళిపోయాడు. రామప్పంతులు తిరిగివచ్చి పెళ్ళి జరిగిపోయిందని తెలుసుకొని తనకు రావలసిన శుల్కభాగం గుంటూరుశాస్త్రి ఎగవేశాడని గ్రహించి కోపగించి కంటె ఇవ్వమని లుబ్ధావధానిని అడిగితే, అవధాని అసలావిషయమే తెలియదన్నాడు.

లుబ్ధావధానికి ఒక పీడకల వచ్చింది. ఆ కలలో తాను చేసుకొన్నపిల్ల మొదటి మొగుడు వచ్చి తనను చంపబోవడం తనకు భయంతో గుండె దడదడలాడటం, కేకలు వేయటం జరిగింది. నిజంగా తాను వేసిన కేకలు విని కూతురు మీనాక్షి వచ్చి కల సంగతి తెలుసుకొని అసలు నిజం తెలుసుకుంటానని పెళ్ళికూతురు దగ్గరకెళ్ళి విషయం తెలుసుకొని తిరిగివచ్చి తండ్రితో "నిజమేనాన్న" అని చెప్పింది. లుబ్ధావధాన్లు ఇంకా భయపడిపోయాడు. మీనాక్షి మళ్ళీ పెళ్ళికూతురు దగ్గరకెళ్ళి తన మొహరం

విషయంలో చీపురుకట్టతో పెళ్ళికూతురిని కొట్టగా ఆమె మీనాక్షి చేయి కొరికి పారిపోయింది. పెళ్ళికూతురు వేషంలో పారిపోయిన శిష్యుడు మధురవాణి ఇంటికి చేరి ఆమె కంటె ఆమెకు యిచ్చి, దాసరి వేషంలోకి మారిపోయాడు. అప్పుడే అక్కడకు వచ్చిన రామప్పంతులితో మధురవాణి "లుబ్ధావధాన్ల మాయ పెళ్ళాన్ని వాళ్ళ యింట్లోరాని లేవదీసుకుపోయి ఎక్కడ పెట్టారు'' అని ఎదురు దాడికి దిగడమే కాకుండా ఆ కంటె తీసుకురానిదే గడపలో కాలు పెట్టనివ్వనంటుంది.

ఎలాగైనా కంటెను సంపాదించాలని, అది మీనాక్షి ద్వారా సాధ్యమవుతుందని తలచి రామప్పంతులు లుబ్ధావధాని ఇల్లు చేరి ఆ రాత్రి మీనాక్షితో సరసాలాడుతూ ఆమెను పెళ్ళి చేసుకుంటానని మాట ఇచ్చి పెట్టెలో మధురవాణి కంటే ఉందేమో చూడమని చెప్పి తాను పెళ్ళాడతానన్న దానికి ప్రమాణంగా దీపాన్ని ఆర్పేసి మీనాక్షిని కౌగిలించుకున్నాడు. వీరిద్దరూ సరసల్లాపాలు గమనించిన లుబ్ధావధాన్లు ఇద్దరినీ కొట్టి ఇంటి నుండి బైటకు గెంటివేశాడు. ఇద్దరూ రామప్పంతులింటికి వెళ్ళి తలుపు తీయమంటే కంటె తెస్తేనేగని తలుపు తీయనని మధురవాణి పట్టుబట్టటంతో పంతులు ఊరి బయటకు, మీనాక్షి తండ్రి దగ్గరకు వెళ్ళిపోయారు.

గిరీశం బుచ్చమ్మకు ఎన్నో మాటలు చెప్పి చెప్పి చివరకు తను ఏం చెబితే అది చేసే స్థాయికి తీసుకొచ్చాడు. పెళ్ళివారితో రామచంద్రపురం తరలివచ్చిన అగ్నిహోత్రావధాన్లుకి రామప్పంతులు తారసపడి పది రోజుల క్రిందటే లుబ్ధావధాన్లకు వేరే అమ్మాయితో పెళ్ళి అయిపోయిందని చెప్పాడు. దానితో అగ్నిహోత్రావధాని మండిపడి లుబ్ధావధానితో గొడవపడి వచ్చి అతనిమీద దావా వేయడానికి రామప్పంతులు సాయం కోరాడు. ఖర్చులకు కావలసిన సొమ్ము కోసం బుచ్చమ్మ నగ తాకట్టు పెడదామనుకొని ఆమెను పిలిస్తే బుచ్చమ్మ, గిరీశం ఇద్దరూ కనిపించలేదు. దానికి ఎంతో చింతించిన అగ్నిహోత్రుడు తాతలనాటి తనచేతి కడియాన్ని తాకట్టు పెట్టి దావా నడిపినా ఫలితం లేకపోయింది. రామప్పంతులేమో కడియం చేతబుచ్చుకొని ఉడాయించాడు.

రామప్పంతులు లుబ్ధావధాని మీద కసితో మాయాసుబ్బిని అతడు చంపాడని పోలీసోళ్ళ సాయంతో ఖూనీ కేసు పెట్టాడు. లుబ్ధావధాని దిక్కుతోచని పరిస్థితుల్లో సౌజన్యారావు పంతులు అనే ప్లీడరు శరణుకోరాడు. ఈ విషయం తెలిసిన గిరీశం లుబ్ధావధానితో అన్ని విషయాలు చక్కబెట్టుకు రావడానికి వీలుండేటట్లుగా తనను పెంచుకోవడంగాని లేదా పవర్ ఆఫ్ అటార్నీ ఇవ్వడం గాని చేయమంటే లుబ్ధావధాని "అన్నిటికీ నాకు సౌజన్యరావు గారే దిక్కు' అని చెప్పాడు. గిరీశం సౌజన్యారావు వద్దకు చేరి తాను గొప్ప సంఘసంస్కారాభిలాషినని, సార్థ్యత్యాగినని, నచ్చజెప్పి ఆయన మెప్పు పొంది, గుంటూరు శాస్త్రి సంగతి బయటకు తీస్తానని నమ్మకంగా చెప్పాడు.

మధురవాణి లుబ్ధావధాన్లపై కేసును, అతని కష్టాలను తొలగించదలచి మగవేషం వేసుకొని అర్థరాత్రి వేళ సౌజన్యరావు పంతులు ఇంటికి వెళ్ళింది. వేశ్యలను అసలు చూడకూడదు అనే సౌజన్యారావు పంతులుచ అభిప్రాయం సరైనది కాదని, వేశ్యలలో కూడా గుణవంతులు ఉండవచ్చుననడానికి నిదర్శనంగా గుంటూరుశాస్త్రి జరిపిన సంగతంతా చెప్పి, గిరీశం కూడా కోతల రాయుడే గాని చేతల రాయుడు కాదని బుచ్చమ్మను పెళ్ళాడటానికి అనర్హుడని చెప్పింది. ఈ విధంగా సుబ్బి పెళ్ళితప్పిపోయి లుబ్ధావధానిపై ఖూనీ కేసు కూడా తొలగిపోయింది. సౌజన్యారావు గిరీశంతో యికనైనా జాగ్రత్తగా మసలుతూ బుద్ధిగా బ్రతుకమని హెచ్చరించడంతో "డామిట్ ! కథ అడ్డంగా తిరిగింది'' అనుకుంటూ గిరీశం బైటకు వెళ్ళడంతో నాటకం ముగుస్తుంది.

## 10.3 కన్యాశుల్కం - స్త్రీ పాత్రలు :

అప్పారావు గారు అద్భుత రచనా శిల్పచాతుర్యంతో ప్రతి సంఘటనను సూక్ష్మమైన వ్యంగ్యపద్ధతితో కూడిన సున్నితమైన హాస్యంతో రూపుదిద్దిన దృశ్యకావ్యం కన్యాశుల్క నాటకం. ఈ నాటకంలోని స్త్రీ పాత్రలు చాలావరకు స్వచ్ఛశీలము, అమాయకత్వం కలిగిన యేలిపాత్రలు. ఎంత అమాయక పాత్రలో అంత ఉదారస్వభావం గల పాత్రలు. మధురవాణికి కొద్దిగా మినహాయింపు.

ఈ నాటకంలో ప్రత్యక్షంగా కనిపించే స్త్రీ పాత్రలు మధురవాణి, బుచ్చమ్మ, మీనాక్షి, వెంకమ్మ, పూటకూళ్ళమ్మ. కనిపించని పరోక్ష స్త్రీ పాత్ర - సుబ్బమ్మ (సుబ్బి). గురజాడ ఏదో ఒక సాంఘిక సంస్కారాన్ని ఆశించే ఈ స్త్రీ పాత్రలన్నింటినీ తీర్చిదిద్దారు.

### 10.3.1 మధురవాణి :

మానవత్వం మూర్తీభవించిన మంచి మనిషి మధురవాణి. నవ్వినా, కోపగించినా, మాట్లాడినా, మన్నన చేసినా, మంత్రాంగం చెప్పినా, ఏమి చేసినా చెయ్యకపోయినా నిండైన మాధుర్యం, ఒయ్యారం, రసజ్ఞతా ఒలికించి ఎదుటి వాళ్ళను అట్టే కట్టిపడేసే అమృతఖని మధురవాణి. వేశ్యాకులంలో పుట్టినా మంచితనం కొంచెం కూడా ఎక్కడా కుంటుపడని, పడనివ్వలేని స్త్రీ. మచ్చలేని వ్యక్తిత్వం గల సౌజన్యరావు పంతులుగారు "నువ్వు మంచిదానివి. ఎవరో కాలుజారిన సత్పురుషుడి పిల్లవై వుంటావు" అని మధురవాణితో అన్న మాటలు చాలు మధురవాణి మంచితనాన్ని, మానవత్వాన్ని అంచనా వేయడానికి.

మధురవాణి సహజసుందరి. బ్యూటిఫుల్ నాచ్ డెవిల్. ఆమె వలలో చిక్కిన ప్రాణి సాధారణంగా తప్పించుకోలేడు. డిప్టీకలెక్టరు నుండి కొండిభట్లు దాకా ఆమె పరిచయం కోసం తహతహలాడిన వాళ్ళే. అయినా ఆమె నైతిక విలువలు కలిగిన వ్యక్తి. మధురవాణి తల్లినుండి సత్ప్రవర్తనను అలవర్చుకుంది. అందుకే ప్రతి సంఘటనలో ఆమె నీతి, నిజాయితీతో ప్రవర్తిస్తుంది. అమె నాటకంలోకి ప్రవేశిస్తూనే రామప్పంతులులో "మొగవాడికయినా, ఆడదానికయినా నీతి ఉండాలి . . . సాని దానికి మాత్రం నీతి ఉండొద్దా . . . ఆయన వైదీకయితేనేమి, కిరస్తానం మనిషైతేనేమి, పూటకూళ్ళమ్మని ఉంచుకుంటేనేమి నన్ను యిన్నాళ్ళు ఆ మహారాజు పోషించాడు కాడా ? అని గిరీశం మీద తనకు విశ్వాసం ఉండాలని పలికింది. ఈ సంభాషణ ఆమె నైతికవర్తనను ఋజువు చేస్తుంది.

మధురవాణి చాలా తెలివైన మనిషి. సరసులందరికీ అంతరాంతరాల్లో సానిదాని నీతి మీద నమ్మకం ఉంటుందని ఆమెకు తెలుసు. అందుకే తనతో కలిసి ఉండటానికి వచ్చిన రామప్పంతులు నుంచి డబ్బు పుచ్చుకున్న మరుక్షణం గిరీశాన్ని ముట్టుకోనివ్వకుండా జాగ్రత్తపడింది. ఆ దృశ్యాన్ని చూచిన రామప్పంతులు "శభాష్ ఏమి నీతయిన మనిషి ఇది. వెధవది ముట్టుకోనివ్వకుండా యెత్తు యెత్తింది" అని ఆమె నిజాయితీని ప్రశంసించాడు.

మధురవాణి సౌందర్యరాశి. సంస్కృతం చదువుకుంది. వీణావాదం నేర్చుకుంది. కాని డబ్బు లేని విద్య దారిద్ర్య హేతువని దాన్ని వదిలిపెట్టింది. సంస్కృత నాటకం 'మృచ్ఛకటికం'లో వసంతసేన అనే వేశ్యలాగ 'కన్యాశుల్కం' లో మధురవాణి కూడా వేశ్యాజాతిలో తలమానికమైన స్త్రీగా పేరుపొందింది.

మధురవాణి మనుషులను తక్కువ చేసి మాట్లాడగలదు. లేకుంటే వాళ్ళను సముదాయించి గౌరవించనూగలదు. గిరీశం తనను కొట్టినప్పుడు రామప్పంతులు "కనిస్టేబుకు కబురంపించు" అంటే మధురవాణి "యెందుకు పబ్లికున అల్లరీ, అవమానమున్నూ, రేపో, యెల్లుండో వాడికి దెబ్బకు దెబ్బతీసి పగతీర్చుకుందువుగాని" అని ఓదారుస్తుంది.

మధురవాణి ఆత్మవిశ్వాసము, ఆత్మగౌరవము కలిగిన స్త్రీ మూర్తి. ఆమె ఎప్పుడూ తలవంచవలసిన పని చెయ్యదు, తలవంచనూ లేదు. పూటకూళ్ళమ్మ గిరీశం కోసం వచ్చి 'యెక్కడ దాచావేమిటి ?' అంటే మధురవాణి "నాకు దాచడం ఖర్మవేం వి ? నా యింటి కొచ్చేవాడు మహారాజులాగా పబ్లిగ్గా వస్తాడు" అంటుంది. కరటక శాస్త్రితో "నా దగ్గరకు వచ్చినవాడల్లా చెడిపోయినాడో ?" అని సవాల్ చేస్తుంది. రామప్పంతుల్ని వేలిమీద ఆడిస్తుంది గాని లొంగి చాకిరీ చెయ్యదు. అతడిని 'మాటలు నేర్చిన శునకం' అంటుంది" వేశ్య కాగానే దయాదాక్షిణ్యాలు వుండవో" అని లెంపలు వాయిస్తుంది.

మధురవాణి చాలా ప్రజ్ఞావంతురాలు నెఱజాణ. ఎవరితో ఏ విధంగా మెలాగాలో బాగా నేర్చిన వ్యక్తి. మనుషుల స్వభావాలను వెంటనే కనిపెట్టగలిగిన చాతుర్యం కలది. రామప్పంతులు ప్రవర్తన మోసపూరితమైనదని వెంటనే గ్రహిస్తుంది.

లుబ్ధావధాన్ల వివాహ విషయంలో ఎన్నో పథకాలు వేసింది. కరటక శాస్త్రి ఆడదలచిన నాటకం గురించి తెలుసుకొని అందులో తనవంతు సాయం తాను చేస్తానని మాట ఇచ్చి నేపథ్యపాత్ర పోషించి తన చెయ్యి ఏ మాత్రం బయటపడకుండా ఎంతో నేర్పుగా నాటకాన్ని విజయవంతం చేసింది. ఆడపిల్ల వేషంలో వచ్చిన శిష్యుణ్ణి చూడగానే ఆడపిల్ల కాదని గుర్తిస్తుంది. ఈ వివాహ నాటకంలో హెడ్‌కానిస్టేబుల్ అవసరం ఉండవచ్చునని గ్రహించి అతడికి మాత్రం కొంత నిజం తెలియజేస్తుంది. శిష్యుడితో లుబ్ధావధాన్లకు జరిగిన కుహనా వివాహాన్ని ఆనందంగా జరిపి వేడుక చూస్తూ వినోదించింది. అపారమైన తన మేథతో ఆ సన్నివేశాన్ని అంతటినీ రక్తి కట్టించి విజయవంతంగా ముగించి శిష్యుణ్ణి మళ్ళీ వెనక్కు పంపించివేసింది. కరటకశాస్త్రి ఈ సందర్భంగా మధురవాణితో "నిన్ను సంతోషపెట్టడం నా విధి" అంటే ఆ మాటలకు బాధపడి "ఆ మాట మీరు శెలవివ్వడం నాకు విచారంగా ఉంది. వృత్తి చేత వేశ్యను గనుక చెయ్యవలసినచోట ద్రవ్యాకర్షణ చేస్తానుగాని మధురవాణికి దయాదాక్షిణ్యాలు సున్న అని తలంచారా ? మీ తోడబుట్టుకు ప్రమాదం వచ్చినపుడు నేను డబ్బు ఆశిస్తానా ?" అంటుంది.

మధురవాణి ఒక సన్నివేశంలో తన అద్భుత ప్రజ్ఞాపాటవాన్నీ, మానసిక శక్తిని ఆవిష్కరింపజేస్తుంది. కరటకశాస్త్రి కన్యావేషం వేసి తీసుకువచ్చిన శిష్యుడికి తన 'కంటె' ను అలంకారంగా పెట్టి పెళ్లి జరిపించింది. అర్థరాత్రి వేళ శిష్యుడు లుబ్ధావధాని ఇంటి నుండి పారిపోయి వస్తే తన 'కంటె' తాను తీసుకొని శిష్యుణ్ణి, కరటక శాస్త్రిని మూడోకంటికి తెలియకుండా పంపించి వేసింది. రామప్పంతులు వస్తే తన 'కంటె' తెచ్చివ్వమని, అంతవరకు లోనికి ప్రవేశం లేదని నిక్కచ్చిగా చెప్పింది.

లుబ్ధావధాన్లపై హత్యానేరం మోపినపుడు కరటక శాస్త్రితో "లుబ్ధావధాన్లను కేసు నుండి తప్పించామనీ నిజమేదో సౌజన్యరావు పంతులుగారితో చెప్పి మీరు కూడా కొంచెం లోకోపకారం చెయ్యరాదా ?" అంటుంది.

మధురవాణి చక్కని సమయస్ఫూర్తి, సాధువర్తనం కలిగిన వనిత. సౌజన్యారావు పంతులుతో సంభాషించిన సన్నివేశం అంతా మధురవాణి సత్ప్రవర్తనకు నిదర్శనం. లుబ్ధావధాన్లను కాపాడి అతడి నేరం లేదని ఋజువు చెయ్యడానికి తానే సమర్థురాలనని భావించి సౌజన్యారావు పంతులు దగ్గరకు వెళ్లింది. తాను ఎవరో సౌజన్యారావుకు తెలియకూడదని పురుషవేషంలో వెళ్ళి "తమ శిష్యరికం లభించడం నాకు పెన్నిధి" అని అతడితో అంటుంది. వేశ్యల్లో కూడా మంచి వారుంటారని పంతులు వద్ద నిరూపించింది. తన ఆలోచన, ఆదరణతో లుబ్ధావధాన్లను రక్షించింది. సౌజన్యారావు పంతులు ఇంతకాలం రక్షించుకుంటూ వచ్చిన యాంటీ నాచ్ లక్షణాన్ని కూడా కాపాడింది. పంతులుగారు ఆమె ప్రవర్తనను మెచ్చుకొని "నువ్వు చాలా మంచిదానివి. ఎవరో కాలు జారిన సత్పురుషుడి పిల్లవై వుంటావు. వృత్తి మానలేవో" అంటాడు. గిరీశం ప్రవర్తన బైటపడిన తర్వాత ఆమె గొప్పదనాన్ని మనస్ఫూర్తిగా అంగీకరించి గిరీశంతో "మధురవాణి డెవిల్ అంటివే. నీవే డెవిల్. ఆమె నీ అయోగ్యత అయినా నొక్కి అడిగితే గాని చెప్పింది కాదు. ఒక సత్యకాలపు బ్రాహ్మడిని కాపాడటమే గాక దుర్మార్గుడైన నీ చేతిలో పడకుండా బుచ్చమ్మను కాపాడింది. నాకు ఒక మహోపకారం కూడ చేసింది. గనుక నా సంతోషమును తెలియజేయుటకు ఇదిగో ఆమెతో షేక్‌హాండ్ చేస్తున్నాను" అన్నాడు.

ఈ విధంగా "కన్యాశుల్కం" నాటకంలో మధురవాణి ఒక కీలకమైన పాత్ర పోషించింది. కథా కథనానికి ఆమె ఆధారం. సుబ్బి వివాహాన్ని తప్పించటంలో, బుచ్చమ్మ గిరీశం పాలిట పడకుండా రక్షించడంలో అమాయకుడైన లుబ్ధావధానిని రక్షించడంలో ఆమె లేనిదే కథ నడవదు, నడవలేదు.

"గిరీశం లేకపోయినా నాటకాన్ని ఏదో విధంగా నడిపించవచ్చునేమోకాని మధురవాణి లేని కన్యాశుల్కం సీత లేని రామాయణమవుతుంది" అని అబ్బూరి రామకృష్ణారావు చేసిన ప్రశంకా అక్షర సత్యం. గురజాడ వారి అద్భుతమైన, అపూర్వమైన సృష్టి మధురవాణి.

### 10.3.2 వెంకమ్మ :

అగ్నిహోత్రావధాన్ల భార్య వెంకమ్మ. వెంకమ్మ కుమార్తె బుచ్చమ్మ. అమాయకత్వానికి ఎంతగా గురైన పాత్రలో అంతగా సమాజంలోని ఆచారాలకు, కఠోరతకు లొంగిపోయిన బలహీన పాత్రలు.

వెంకమ్మ పాపం, పుణ్యం ఎఱుగని అమాయకురాలు, నిస్సహాయురాలు. సాధారణ హిందూ గృహిణికి ప్రతిబింబం. భర్త అగ్నిహోత్రుడు పేరుకే కాదు ప్రవర్తనలో కూడా అగ్నిహోత్రుడే అతని భయంకర, నిరంకుశ స్వభావానికి లోబడి నుసి అయిపోయిన సామాన్య గృహిణి వెంకమ్మ.

బాలవితంతువై అఘోరిస్తూ ఉన్నపెద్ద కుమార్తె బుచ్చమ్మ అవస్థకు ఆమె తల్లి హృదయం తల్లడిల్లిపోయింది. రెండో కుమార్తెను కూడా ధనలాభంతో భర్త మళ్ళీ శుల్కం తీసుకొని చావుకు సిద్ధంగా ఉన్న లుబ్ధావధాన్లకిచ్చి పెళ్ళి నిశ్చయించుకున్నాడని తెలిసి విలవిలలాడిపోయింది. అయినా చండ శాసనుడైన భర్త ఇష్టానికి వ్యతిరేకంగా ఆమె ఏమీ చెయ్యలేకపోయింది.

అన్యాయాన్ని సహించలేనప్పుడు, ప్రతిఘటించలేనప్పుడు అమాయకురాలైన స్త్రీకి ఒక్కటే సాధనం. ఏనుయ్యో, గొయ్యో చూసుకుంటాననడం. వెంకమ్మ తన సోదరుడు కరటక శాస్త్రితో “అన్నయ్యా ! యీ సమ్మంధం చేస్తే నేన్నుయ్యో గొయ్యో చూసుకుంటాను. ఆయనికి యెంత యీడొచ్చినా కష్టసుఖం వొళ్ళు నాటక యీ దౌర్భాగ్యపు సమ్మంధం కల్పించుకొచ్చారు. నే బతికే బాగుండాలంటే యీ సమ్మంధం తప్పించు” అని బ్రతిమిలాడుకుంటుంది. పసిపిల్లలను వయసు మీరిన వాడికిచ్చి వివాహం చేయటం సముచితం కాదని వ్యతిరేకించే చైతన్యాన్ని గురజాడ ఈ పాత్రలో చూపించారు.

### 10.3.3 బుచ్చమ్మ :

ఈమె వెంకమ్మ, అగ్నిహోత్రావధాన్ల పెద్ద కుమార్తె. తల్లిదండ్రుల చాటుబిడ్డ. బాల వితంతువు. సత్సంప్రదాయం గల కుటుంబంలో జన్మించటం చేత వైధవ్యాన్ని ప్రారబ్ధంగా భావించి అనుభవిస్తూ నాలుగు గోడల మధ్య జీవించింది.

బుచ్చమ్మ చాలా అమాయకురాలు. తనస్థితి ఎంత శోచనీయమో కూడా తెలుసుకోలేనంత అమాయకురాలు. ఆమెను గురించి గిరీశం వెలిబుచ్చిన అభిప్రాయాలు అక్షరసత్యాలు. “ఇంత సింప్లిసిటీ ఎక్కడా కానలేదు. దీనికి లవ్ సిగ్నల్స్ రామరామా ఏమీ తెలియవు. చమత్కారం మాటలు ఆడితే ఏమిన్నీ అర్థం చేసుకోలేక ఆ లేడికళ్ళతో తెల్లబోయి చూస్తుంది” అంటాడు గిరీశం. మౌనంగా ఇంటెడు చాకిరీ చేయటం బుచ్చమ్మ వంతు. తన చెల్లెలు సుబ్బమ్మను 1800 లు రూపాయలకు లుబ్ధావధాన్లకు ఇచ్చి తండ్రి పెళ్ళి చేయబోతున్నాడని తెలిసి చాలా బాధపడుతుంది. అగ్నిహోత్రం లాంటి తండ్రి దగ్గరకు వెళ్ళి ధైర్యంగా దీన్ని వ్యతిరేకిస్తుంది. “నాన్నా ! తమ్ముడికి పెళ్ళి చేయాలంటే నా సొమ్ము పెట్టి చెయ్యండి కాని దీని కొంపముంచి లుబ్ధావధాన్లకు ఇవ్వవద్ద”ని చెప్పింది.

మొదట్లో అమాయకంగా ఉన్న బుచ్చమ్మ క్రమక్రమంగా గిరీశం మాటల వలన ఆలోచించడం మొదలుపెట్టింది. “ఏవండీ గిరీశం గారూ ! విధవలు పెళ్లాడటం పాపం కాదూ” అని అతణ్ణి ప్రశ్నించింది. క్రమేపీ గిరీశం మాటలు విని అతడు ఒక సంఘ సంస్కర్త అని భావించింది. అయినా గిరీశం మాటలకు చాలాసేపటివరకు లొంగదు. చివరకు తన స్వార్థం కోసం కాకుండా చెల్లెలు పెళ్లి ఎలాగైనా తప్పితేచాలు అనే ఉద్దేశ్యంతో గిరీశంతో వెళ్ళిపోవడానికి అంగీకరిస్తుంది.

బుచ్చమ్మ పాత్రలో క్రమోన్మీలనం ఉంది. మొదటి నుంచి అతి అమాయకమైన పాత్రగా గోచరించిన బుచ్చమ్మ క్రమంగా వికాసాన్ని పొందింది. చెల్లెలు పెళ్లి తప్పించటమే ఆమె ప్రధాన లక్ష్యం. ఆ లక్ష్యం దిశగా ఆమె పయనించటంలో గిరీశంతో వెళ్ళిపోవటానికి అంగీకరించింది. ఆమె పాత్ర పాడైపోయినట్లుగా గురజాడ ఎక్కడా చెప్పలేదు. ఆమెను విధవాశ్రమంలో

ఉంచి గిరీశం సౌజన్యారావు పంతులును కలుసుకుంటాడు. మధురవాణి మూలంగా గిరీశం బండారం బైటపడి బుచ్చమ్మ రక్షింపబడింది.

తనవారి కోసం ఏవిధమైన త్యాగమూ చేయడానికైనా సిద్ధమైన యువతి బుచ్చమ్మ. అంతా స్వార్థమయమైన వాతావరణంలో బుచ్చమ్మ నిస్వార్థమైన, స్వచ్ఛమైన త్యాగమయిగా తీర్చిదిద్దబడింది.

### 10.3.4 మీనాక్షి :

ఈమె లుబ్ధావధాన్ల ఏకైక కుమార్తె. బాల వితంతువు. యుక్తవయసు వచ్చిన తర్వాత బాలవితంతువులు అపసవ్య మార్గంలో పయనించే ప్రమాదం ఉందని చెప్పటానికి మీనాక్షి పాత్ర నిదర్శనం. ఇంటిని చక్కదిద్దగల నేర్పూ, చాకచక్యమూ ఉన్న స్త్రీ.

కవికి సంఘ దురాచారాల మీద ఉన్న కక్షా, దానికి బలైపోయిన స్త్రీల మీద జాలీ కలిసి మీనాక్షిగా రూపొందినట్లు అనిపిస్తుంది. మీనాక్షి అపసవ్య మార్గంలో పయనించటానికి తాను బాధ్యురాలు కాదు. సంఘంలో ఉన్న కఠోరమైన ఆచారాలు, ఆ ఆచారాలను తమకు అవకాశాలుగా మార్చుకునే రామప్పంతులు లాంటి నరరూప రాక్షసులూ దానికి బాధ్యులు.

ఆనాటి సమాజంలో తన దుస్థితి ఏమిటో మీనాక్షికి బాగా తెలుసు. తన స్థితి బాగుండటం కోసం పునర్వివాహం చేసుకోవడానికి సిద్ధపడుతుంది. అందుకు రామప్పంతుల్ని వివాహం ఆడవలసిందిగా అభ్యర్థించి భంగపడుతుంది. ఆమె తండ్రి లుబ్ధావధాన్లకు కూడా కూతురి ప్రవర్తన తెలుసు. "నా జీవానికి ఉసూరుమంటూ అది కాని తిరుగుడులు తిరిగిందంటే దాని తప్పా" అని వాపోతాడు. మధురవాణి ఆమె మీద సానుభూతితో "ఏం కులం తక్కువా రూపం తక్కువా, ఈమె బ్రతుకు భ్రష్టు చెయ్యనే చేశారు. పెళ్ళాడి తప్పు దిద్దుకోండి" అని రామప్పంతులుకి సలహా యిస్తుంది.

నాటకం చివరి అంకంలో సౌజన్యారావు పంతులు "వితంతువులు మఠానికి మీ పిల్లని పంపడం నా సలహా" అని చెప్తాడు. అతడు చెప్పినట్లుగా కాశీవాసమో, మఠప్రవేశమో ఆమెకు తటస్థించి ఉండవచ్చు.

### 10.3.5 పూటకూళ్ళమ్మ :

పూటకూళ్ళమ్మ పాత్ర కన్యాశుల్కం ప్రథమాంకంలోనే కనిపిస్తుంది. గిరీశం కొంతకాలం ఈమె వద్ద ఉన్నాడు. ఈమె గిరీశానికి అవసరమైన భోజనాది సౌకర్యాలను ఇచ్చి పోషిస్తూ ఉండేది. గిరీశం ఈమెను కూడా మోసం చేశాడు. పూటకూళ్ళమ్మని పెళ్లి చేసుకున్నవాడు పెళ్ళిపీటల మీదనే హరీ అన్నాడు. ఆమె తప్పులడుగులు వేసే రోజుల్లోనే ఒక కునుష్టీ ముసలాడికి కట్ట నిశ్చయించారు. పుస్తె కట్టబోతుంటేనో కట్టిన ఉత్తర క్షణంలో ఆ ముసలాడు గుటుక్కుమన్నాడు. అప్పుడు పెళ్ళి అయినట్టా కానట్టా అని మీ మాంస జరిగింది. ఈమె తండ్రి పెళ్ళి కొడుకు వారసుల మీద దావా తెచ్చాడు. పురోహితుడు వాళ్ళ దగ్గర లంచం పుచ్చుకొని పుస్తె కట్టలేదని సాక్ష్యం ఇచ్చాడు. దాంతో కేసు వీగిపోయింది. ఇక ఆమెను ఎవ్వరూ పెళ్ళాడలేదు.

నాటి సమాజంలో మరో రకం అన్యాయానికి బలైపోయిన స్త్రీ పూటకూళ్ళమ్మ. ఏ విధమైన సంస్కరణకు నోచుకోని అభాగ్యురాలు.

ఈ పాత్ర వలన గిరీశం ఎటువంటి ప్రవర్తన కలవాడో తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుంది. గిరీశం తన వద్ద డబ్బు తీసుకొనిపోయి మధురవాణికి ఇచ్చాడని కోపంతో ఆమె ఇంటికి వచ్చి గిరీశాన్ని చీపురుతో కొట్టటానికి ప్రయత్నిస్తుంది.

## 10.3.6 సుబ్బమ్మ (సుబ్బి) :

'కన్యాశుల్కం' నాటకానికి మూలమూ, నాటకాన్ని నడపటానికి అంతస్సూత్రమూ, అసలు నాటక రచనా ప్రదర్శనావసరానికి కేంద్ర బిందువు సుబ్బి. కానీ ఈ సుబ్బి నాటకంలో ఎక్కడా ప్రత్యక్షం కాదు, ఎవరిని పలకరించదు, విమర్శించదు, ఉత్సాహపరచదు, ఉద్రేకపరచదు. అయినా సుబ్బి ప్రస్తావన రాకుండా నాటకం ముందుకు కొనసాగదు. సుబ్బి కళ్ళకు కనిపించని విలక్షణ పాత్ర.

ఈ విధంగా కన్యాశుల్కంలోని స్త్రీ పాత్రలు వేరు వేరు తరగతుల నుంచి ఏరి తీసినవి. అన్ని పాత్రలు సామాజిక చైతన్యం కలిగిన పాత్రలు.

కొడవటిగంటి కుటుంబరావు చేసిన వాస్తవిక ప్రకటన "కన్యాశుల్కంలోని పాత్రలలాగ సజీవంగా ఉండే పాత్రలు ప్రపంచ నాటక సాహిత్యంలోనే అరుదు".

## 10.4. కన్యాశుల్కం - సామాజిక సమస్యలు :

'కన్యాశుల్కం' నాటకం ఎందుకు రాయబడింది ? అని ప్రశ్నించుకుంటే గురజాడ ఒక ఉత్తమమైన, ఉన్నతమైన సామాజిక ప్రయోజనాన్ని సాధించటానికే ఈ రచన చేసినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. కవి సమాజానికి ఉపయోగపడే సమాజంలో చైతన్యం తీసుకునివచ్చే రచనలు చేసి సాంఘిక సంస్కారానికి, సమాజ శ్రేయస్సుకి పాటుపడాలి. సంఘ సంస్కరణ ప్రియత్వం అధికంగా కలిగిన గురజాడ ఆనాటి సమకాలీన సమాజాన్ని తన నాటకంలో ప్రతిబింబింపజేశారు. ముఖ్యంగా ఆనాటి సాంఘిక దురాచారాలను, వాటి ద్వారా స్త్రీలు అనుభవిస్తున్న మానసిక వేదనలను తన నాటకం ద్వారా పాఠకులకు, ప్రేక్షకులకు ప్రత్యక్షం చేశారు. ఆనాటి సమాజంలో ఉన్న స్త్రీ సమస్యలలో బాల్యవివాహం, వితంతు సమస్య, కన్యాశుల్కం, వేశ్యా సమస్య ముఖ్యమైనవి.

## 10.4.1 బాల్యవివాహాలు :

బాల్యవివాహాలు పసిపిల్లల బ్రతుకును బండబారుస్తున్నా, అసమ వివాహాలు ఆందోళన కలిగిస్తున్నా అది ఒక పెద్ద సమస్యగా పరిగణించకుండా 'లోకం పోకడ ఇంతే'నని ఆనాటి సమాజం వ్యవహరించింది. డబ్బున్న బుద్ధిలేని వృద్ధులకు అండగా నిలచింది, ప్రోత్సహపరచింది. ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆశలు రేకెత్తించింది, డబ్బు రుచి తెలిపింది. 'కన్యాశుల్కం' నాటకంలో అసమవివాహాలు చేసుకోవడం వలన అంటే చిన్నవయసులో ఉన్న ఆడపిల్లలు, ముసలివాళ్ళని పెళ్ళి చేసుకోవడం వలన ఎంతో దుర్భరజీవితాన్ని అనుభవించారు. అలా దుర్భరజీవితాన్ని అనుభవించినవారు బుచ్చమ్మ, మీనాక్షి, పూటకూళ్ళమ్మ.

బాల్యవివాహం స్త్రీకి పెద్ద శాపం. ఏమీ తెలియని చిన్నతనంలో తన తండ్రి వయసో, తాత వయసో ఉన్నవాణ్ణి పెళ్ళిచేసుకోవటం. అతడు పుస్తె కట్టేటప్పుడో, కట్టిన తర్వాత కొద్ది కాలానికో మరణించడం, పసివయసులోనే ఆడపిల్ల విధవవడం, చాలా దారుణమైన విషయం. భర్త చనిపోయిన తర్వాత విధవరాలైన తాను తన భర్త ఆస్తి మొత్తం తీసుకొని పుట్టింటికి వచ్చి తన సుఖ సంతోషాల గురించి ఆలోచించక పుట్టింటివారికి గొడ్డుకు మల్లే చాకిరీ చేయడం మరీ దారుణం. బాల్యవివాహ సమస్యల్లో ఇవి ఒక పార్శ్వమైతే, మరొక పార్శ్వం - ఆడపిల్ల తనకు యుక్తవయస్సు వచ్చేనాటికి ముసలిభర్త చనిపోవటం, తనలో ప్రకృతి సిద్ధమైన వయసుకోర్కెలు విజృంభించటం, ఆ తీవ్రమైన కోర్కెల ఒత్తిడికి తట్టుకోలేక అడ్డదారులు తొక్కి శీలం పోగొట్టుకోవడం, కట్టుబాట్లు, నియంత్రణ అధికంగా ఉన్న కుటుంబమైతే తన కోర్కెలను తనలోనే అణచుకొని తన హీన,దీన పరిస్థితికి తనలో తానే కుమిలిపోవడం జరిగింది. కన్యాశుల్కం నాటకంలో ఈ పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు సజీవంగా చూపించాడు గురజాడ.

అగ్నిహోత్రావధానికి తన పెద్దకూతురు బుచ్చమ్మను కన్యాశుల్కంగా రూ. 1600 లు తీసుకొని ఒక ముసలాడికిచ్చి పెళ్ళి చేశాడు. కొద్ది రోజులకే ఆ ముసలివాడు మరణించాడు. బుచ్చమ్మ విధవరాలై పుట్టింటికొచ్చి బండెడు చాకిరి చేస్తుంది. ఆ వైధ్యం తన ప్రారబ్దమని అనుకుంటుందే గాని తనకు బాల్యంలోనే పెళ్ళిచేశారు. దాని ఫలితమే ఇది అని ఆలోచించే తెలివిలేనిది. ఆనాటి సమాజంలో ఎక్కువ మంది స్త్రీల పరిస్థితి ఇదే.

పూటకూళ్ళమ్మ పరిస్థితి ఇంతే. చిన్నవయసులో పెళ్ళి చేశారు. భర్త చనిపోయాడు. ఏ ఆధారమూ లేదు. పూటకూళ్ళమ్మగా జీవితాన్ని ప్రారంభించింది. సహజ కోర్కెల ప్రభావం వల్లనో, అండగా ఉంటాడనే భ్రమ వల్లనో గిరీశాన్ని నమ్మి కొంతకాలం అతనితో కలిసి ఉంది. అతడు మోసగాడని తెలిసిన తర్వాత అతణ్ణి వదిలివేసింది.

ఈ నాటకంలో మీనాక్షి పాత్ర కూడా జాలి కలిగించే పాత్రే. తండ్రి డబ్బుకి ఆశపడి మీనాక్షికి బాల్యవివాహం చేశాడు. వయసులో అసమానతల వలన పెళ్ళి చేసుకొన్న ముసలాడు కొద్దికాలానికే మరణించాడు. ఆమె బాలవితంతువు అయింది. పుట్టింటికి వచ్చి తండ్రి పంచన చేరింది. సక్రమ పద్ధతిలో కొనసాగించాల్సిన జీవితం వక్రమార్గంలో పయనించింది. దీనికి కారణం అసమవివాహమే.

విశాఖ మండలంలోని సాధారణ ప్రాంతాల్లో బ్రాహ్మణుల్లో కన్యాశుల్కం పెళ్ళిళ్ళు జరుగుతున్నాయని గ్రహించిన గురజాడ నాటి సమాజంలో మూర్ఖత్వానికీ, మూఢాచారాలకీ నిరసనగా, సంఘ సంస్కరణకు తనకు తగిన ఆయుధంగా సాహిత్యాన్ని ఎంచుకొని, ధనం మీది వ్యామోహంతో ఆడపిల్లలకు అసమ వివాహాలు చేయటం శాస్త్రవిరుద్ధమనీ, సమాజానికి ముప్పు కలుగుతుందనీ తెలియజేస్తూ సమాజం కనువిప్పు కొరకు ఈ నాటక రచన చేశాడు.

## 10.4.2 వైధవ్యం :

ఈ నాటకంలో వితంతు సమస్య అనేది మరొక సమస్య. ఆనాటి సమాజంలో అవకాశవాదులకు, మాయగాళ్ళకు, మోసగాళ్ళకు, అయాచిత వరమైంది ఈ వితంతు సమస్య. దీనిని ఒక సమస్యగా గుర్తించకుండా సమాజరీతి ఆ విధంగా ఉన్నదని సర్దుకొనిపోయేవాళ్ళే ఎక్కువ. అలాకాక వితంతు సమస్య సమాజంపై పరోక్ష ప్రభావాన్ని చూపిస్తుందని, కాలక్రమంలో అది మరింత విస్తృతమై సమాజ సహజ జీవన గమనం అస్తవ్యస్తమైపోతుందని గుర్తించి దార్శనికుడైన గురజాడ ఈ సమస్యను రూపుమాపాలని నిర్ణయించుకొని ఈ వితంతు సమస్యను తన 'కన్యాశుల్కం' నాటకంలో స్పర్శించాడు. సాధారణ జీవిత గమనానికి ఆటంకం కలిగించే ఏదో ఒక దానికి సంబంధించిన విషయం సమస్య అవుతుంది. ఆనాడు వితంతువులైన వారి జీవితాలు సాఫీగా సాగక ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. ఆ సన్నివేశాలను, సంఘటనలను, విషయాలను కొన్ని పాత్రల ద్వారా ఆనాటి సమాజం యొక్క తీరుతెన్నులను సహజంగా చిత్రించాడు గురజాడ.

ఆనాటి సమాజంలో వితంతు సమస్య ఏర్పడటానికి ప్రధానకారణం బాల్యవివాహాలు. చిన్న బాలికను పెద్దవయస్సున్న వాడికిచ్చి పెళ్ళిచేయటం, ఆ పెద్ద వయసువాడు వెంటనే చనిపోవటం, అసలు పెళ్ళంటే ఏమిటో, భర్త అంటే ఎవరోకూడా తెలియని ఆ చిన్నారి బాలికలు వైధవ్యం పొందటం చాలా బాధాకరం. వైధవ్యం అంటే ఏమిటో తెలియని ఆటలాడుకునే ముద్దులొలికే పసిపాపలకు బొట్టు, గాజులు, పూలు తీసివేస్తుంటే తెల్లబోయి చూసే ఆ అమాయకపు చూపులు, మరలా వాటిని ధరిస్తే చంపుతామంటూ శాసిస్తుంటే చూసే బాధాకరమైన చూపులు తలచుకుంటేనే హృదయాలు ద్రవించిపోతాయి. ఆటపాటలతో ఉల్లాసంగా పొద్దుగడిపే చిన్న బాలికలు వైధవ్యంతో పుట్టింటికి వచ్చి తన ఈడుపిల్లలతో కలిసిమెలసి ఆడుకోలేక తన బతుకు ఎందుకిలా అయిందో తెలుసుకోలేక లోపల్లోపల కుమిలిపోయే ఆ మానసిక రోదన ఎంతో దారుణం. వయసు వచ్చిన తర్వాత మనిషి సహజమైన కామవాంఛలను అదిమిపెట్టలేక బైటపడలేక వారు పొందే మానసిక సంఘర్షణ ఊహాతీతం. బైటపడలేక

కోర్కెలను అణచివేసి కుమిలిపోయేవాళ్ళ ఒక ప్రక్క, కోర్కెల తీవ్రతకు తట్టుకోలేక తప్పుదారులు తొక్కి ప్రాణాలమీదికి తెచ్చుకొనే వాళ్ళు మరొకప్రక్క ఆనాటి సమాజంలో కనిపించేవారు. అటువంటి స్త్రీల వేదనలను, మోసకారుల మాటల వలలో చిక్కిమోసపోయిన వాళ్ళను, కొన్ని సందర్భాలలో తమ ప్రాణాలనే పోగొట్టుకొనే స్థితికి వచ్చిన వాళ్ళను కొన్ని పాత్రలుగా సృష్టించి వితంతు సమస్యను చర్చించారు గురజాడ.

ఈ నాటకంలోని పూటకూళ్ళమ్మకు బాల్యంలోనే పెళ్ళైంది. వెంటనే భర్త చనిపోయాడు. బాలవితంతువైంది. పూటకూళ్ళమ్మగా స్థిరపడింది. గిరీశం లాంటి మహాటక్కరివాడి మాయమాటల్లో పడి తన సంపాదనతో అతణ్ణి బతికిస్తూ అతడితో ఉండసాగింది. తన దగ్గర డబ్బులు తీసుకొనిపోయి 'డాన్సింగర్ల్' కిచ్చి ఆమెతో కులుకుతున్నాడని తెలుసుకున్న పూటకూళ్ళమ్మ ఆవేశంతో ఆగ్రహిస్తుంది. మధురవాణి ఇంటికెళ్ళి ఆమెతో "ఆ వెధవ వుంటే నాకేం కావాలి. ఉండకుంటే నాకేం కావాలి. వాడు నీకిచ్చిన యిరవయి రూపాయలూ యిచ్చెయ్" "వెధవ కనపడితే సిగపాయిదీసి చీపురుగట్టతో మొత్తుదును. యెక్కడ దాచావేమిటి ?" అని మంచం క్రింద దాక్కొన్న గిరీశాన్ని ఆటాడిస్తుంది. ఇక్కడ పూటకూళ్ళమ్మ ఆవేశం కన్నా ఆ వితంతువుని తన సుఖసంతోషాలకు అవకాశంగా ఉపయోగించుకొన్న స్వార్థపరుల అవకాశవాదం కనిపిస్తుంది.

ఈ నాటకంలో నాటక కథా ప్రారంభం నాటికే బాల్యవివాహమై, బాలవితంతువుగా మారి తిరిగి పుట్టింటికొచ్చి చాకిరీ చేస్తూ జీవితాన్ని వెళ్ళదీస్తున్నది బుచ్చమ్మ. ఈమె తన రాతకు ఎవరినీ నిందించదు. తనను తాను నిందించుకోదు. కానీ అవకాశం కోసం గుంటనక్కల్లా కాపుకాసి, ఎదురుచూసే స్వార్థపరుడైన గిరీశం మాటల గారడీలో చిక్కుకుంది. తనలాంటి వితంతువుల పట్ల గిరీశం చూపే సానుభూతి చూసి, మళ్ళీ పెళ్ళిచేసుకొమ్మని ప్రోత్సహించే తీరునుబట్టి, అతని వాక్చాతుర్యాన్ని చూసి గిరీశం చాలా గొప్పవాడనే భ్రమలో పడిపోయి తన తమ్ముడు వెంకటేశ్‌తో "తమ్ముడూ, గిరీశం గారు గొప్ప వారన్నా్టే" విధవలు పెళ్ళాడ్డం మంచిదంటారు గదా, ఆయనెందుకు పెళ్ళాడారు కార్రా"? అని అడుగుతుంది.

వితంతువులకు మన సమాజం అంతగా గౌరవం ఇవ్వదు. ఈ పరిస్థితి ఇప్పటికీ ఉన్నా, ఆనాడున్నంత కఠినంగా, దారుణంగా లేదు. అసలు అసమవివాహాలు చేయడం తప్పు. బాల వితంతువులను పుట్టింటికి తెచ్చుకొని బండెడు చాకిరీ చేయించటం తప్పు. అంతేగాక వారిని అగౌరవంగా, హీనంగా, వైధవ్యం తనకైతను తెచ్చుకొని ఏదో తప్పు చేసిన దానిలాగా అవమానకరంగా మాట్లాడుకోవడం మరీ దారుణం. కానీ ఆనాటి సమాజంలో ఇది సర్వసాధరణంగా జరుగుతుండేవి. అగ్నిహోత్రావధాన్లు, గిరీశం మాట్లాడుకుంటున్న సమయంలో బుచ్చమ్మ వచ్చి తండ్రితో "నాన్నా ! అమ్మ స్నానం చెయ్యమంచూంది" అని రెండుసార్లు పిలిచేసరికి కోపగించుకున్న అగ్నిహోత్రుడు వెధవ ముండా సొద ! పెద్ద మనుష్యుల్తో వ్యవహారం మాట్లాడుతూంటే రామాయణంలో పిడకల వేటల్లాగ అదే పిలవడవాః!" అని గర్జించాడు. కన్న తండ్రే ఇలా తక్కువచేసి చూస్తే మిగిలినవారు గౌరవించరుగదా !

బాల్యవివాహపు ఊబిలో చిక్కుకొని, బాలవితంతువుగా బైటకొచ్చి ఆగని కోర్కెలతో అపసవ్యమార్గాన పయనించిన యువతి మీనాక్షి. తను బాల్యంలోనే వైధవ్యాన్ని పొందింది. వయసు వచ్చింది. తండ్రి లుబ్ధావధాన్లకు కూతురి విషయం పట్టదు. ఎప్పుడూ డబ్బుపిచ్చి, పెళ్ళిమోజు, కోర్కెల గుఱ్ఱాలకు కళ్ళెం వేసి ఆపలేకపోయింది మీనాక్షి. ఆ వితంతువును తనకు అనుకూలంగా, అవకాశంగా మార్చుకున్నాడు. ఆ వూరిలోనే ఉంటున్న రామప్పంతులు. రామప్పంతులు మాటల మత్తులో ఆమె కోర్కెల గుఱ్ఱం నిద్దురపోయింది. ఫలితం రామప్పంతులకేమీ కాలేదు మీనాక్షికే సమస్య. గర్భవతయింది. అక్రమంగా కలిగిన ఆ గర్భాన్ని ఉంచుకుంటే ఊరిగోల తట్టుకోలేక ఉరేసుకోవాలి, తెంచుకుంటే ప్రాణాపాయం కలగవచ్చు. ఈ విషయాన్నే రామప్పంతులు మధురవాణితో "మరేంలేదు లుబ్ధావధాన్లు విధవ కూతురు మీనాక్షి ప్రవర్తన మంచిది కాదు,

నాల్రోజుల కొహమారు అది పీకల మీదికి తెస్తూంటుంది. పోలీసువాళ్ళు బెదిరించి పది డబ్బుల సొమ్ము లాగేస్తుంటారు'' అని చెప్పడంలో తన పాపపు పాత్ర ఏమీలేదని, అంతా మీనాక్షి తప్పేనని చెప్పినట్లుగా కనిపిస్తుంది.

ఇదే విషయాన్ని బుచ్చమ్మతో గిరీశం "యేవని చెప్పను. కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుంది. అయినా నీ దగ్గర నాకు దాపరికం యేమిటి ? దాని మొగుడు పోయిన తరువాత యేటేటా కడుపు అవుతూ వుండడం, అయినప్పుడల్లా వొల్లమాలిన అల్లరిన్నీ, ఒకప్పుడు అది ప్రాణభయం కూడా చేస్తుంది'' అని చెప్పటంలో ఆనాడు కాలుజారిన వితంతువుల దుస్థితి అర్థమవుతుంది.

మీనాక్షి ఇలా చెడు ప్రవర్తనను అలవాటు పడటానికి ప్రధానకారణం బాల్యవివాహం, తద్వారా సంప్రాప్తించిన వైధవ్యం.

వితంతువైన తనను తన స్వార్థం కోసమే రామప్పంతులు లోబరుచుకున్నాడని తెలియని మీనాక్షి అతణ్ణి నమ్మి తనను పెళ్ళి చేసుకుంటాడనుకొంది. అందుకోసం తండ్రిని వదిలిపెట్టి అతనితో వెళ్ళిపోవడానికి సిద్ధపడుతుంది. ఆనాటి సమాజంలో వితంతువుల పరిస్థితిని గమనించిన మీనాక్షి తన పరిస్థితిని కూడా గుర్తించి పునర్వివాహానికి సిద్ధపడింది.

ఇలా వితంతువులుగా మారిన స్త్రీలు శారీరకంగా, మానసికంగా ఎంత వత్తిళ్ళకు, ఆందోళనకు గురై ఎటువంటి స్థితుల్లో ఏయే విధంగా ప్రవర్తిస్తారో, మోసగింపబడుతారో, జీవితాన్ని వ్యర్థంగా, నిరాశగా గడుపుతారో ఈ నాటకం ద్వారా ప్రత్యక్షం చేశారు గురజాడ.

## 10.4.3 కన్యాశుల్కం :

ఆనాటి సమాజంలో బాల్యవివాహాలు జరగడానికి, వాటి ద్వారా బాలవితంతువులుగా మారడానికి ప్రధానకారణం "కన్యాశుల్కం''. డబ్బుమీద ఆశతో వెనుక, ముందు చూడకుండా, వయసు తేడాలు గమనించకుండా ఆడపిల్లల్ని కన్నతల్లిదండ్రులు అమ్ముకోవటం ఆనాటి ఆచారంగా చాలా మంది భావించారు. ఆడపిల్లల్ని డబ్బిచ్చి కొనుక్కోవటం తమ గొప్పదనంగా, కొనుక్కొనే వ్యక్తులూ భావించారు. తల్లిదండ్రుల ఆశలకి, వయసు వచ్చినవాళ్ళ పెళ్ళి మోజులకీ మధ్య ఏమీ తెలియని చిన్నారి బాలికల బ్రతుకుల దుర్భరావస్థలకు గురవుతున్నాయి. చిన్నారి బాలికలకే కాదు ఒక్కొక్కసారి కడుపులో శిశువుకే బేరాలుసాగేవి అని తెలిస్తే ఈ కన్యాశుల్కం ఎంతటి దారుణమైన దురాచారమో ఊహించడానికి కూడా వీలులేని ఆలోచనలను కలిగిస్తుందో అర్థమవుతుంది. ఇదే విషయాన్ని కందుకూరి తన 'బ్రహ్మవివాహం' మొదటి ముద్రణ పీఠికలో "సొమ్ము పుచ్చుకొని తమ కన్యలను వృద్ధులకును, అంగవిహీనులకును, దరిద్రులకును విక్రయించి లాభము పొందెడి వారిని నిందార్హులుగాను, పాపకర్ములుగాను గణించి యగౌరవముతో జూడక వారిని గూడ నందరితో సమానములుగనే జూచుచుండుట వలన బెరుగుచున్న యనర్థమింతయంతయని చెప్పనలవిగాక యున్నది'' అని రాశాడు.

గురజాడ కూడా "పసితనంలో ఉన్న కూతుళ్ళను కాటికి కాళ్ళు చాచుకొని ఉన్న ముసలివాళ్ళతో పెళ్లి అమ్మకాలకు బేరసారాలు సాగించడమొక్కటేగాదు, పుట్టబోయేది ఆడపిల్లఅవునో కాదో తెలియకపోయినా, ప్రసవానికి ముందర్నే ఒప్పందాలు జరిగిపోయేవి' అని కన్యాశుల్కం మొదటి కూర్పు పీఠికలో వ్రాయడాన్ని బట్టి ఈ కన్యాశుల్కం ఆనాటి ప్రజల్లో ఎలా చలామణి అయిందో తెలుస్తుంది.

గురజాడ కన్యాశుల్కం రచన చేయడానికి కారణమూ, ఉద్బోధనమూ రెండు ఆనందగజపతి మహారాజా వారే. సహజంగానే సంఘసంస్కర్తభిలాషి అయిన ఆనందగజపతివారు కన్యాశుల్కం పేరుతో ఆనాటి సమాజంలో జరుగుతున్న అసమ వివాహాలు చూసి ఆవేదన చెంది బాల్యవివాహాలకు సంబంధించి ఒక పట్టిక తయారుచేశారు. విశాఖ మండలంలోని సాధారణ ప్రాంతాల్లో

బ్రాహ్మణుల్లో 1884 - 87 మధ్యకాలంలో కన్యాశుల్కపు పెళ్ళిళ్ళు 1034 జరిగినట్లు లెక్కించారు. వీరిలో 5 సంవత్సరాల బాలికలు 99 మంది, నాలుగు సంవత్సరాల బాలికలు 44 మంది, మూడు సంవత్సరాల బాలికలు 30 మంది, 2 సంవత్సరాల బాలికలు ముగ్గురూ, ఇంకా సంవత్సరం పసికందులు కూడా ఉన్నారు. వీరిలో ఒక్కొక్కరికి 350 - 400 వరకు 'కన్యాశుల్కం' ఇచ్చారు. ఈ పరిస్థితుల వలన ప్రభావితమై గురజాడ ఈ నాటిక రచనను చేపట్టారు.

ఈ నాటకం ప్రారంభంలోనే కన్యాశుల్క వివాహానికి బలైపోయిన పూటకూళ్ళమ్మ కనిపిస్తుంది. గిరీశం మధురవాణికి పూటకూళ్ళమ్మ గురించి చెబుతూ "పూటకూళ్ళమ్మ ముచ్చటగా తప్పటడుగు వేసే రోజుల్లో ఒక కునుష్టి ముసలాడికి కట్ట నిశ్చయించినారు. . . . . దాన్నెవరూ పెళ్ళాడారు కారు'' అంటాడు. అంటే ఇక్కడ పూటకూళ్ళమ్మ బాలవితంతువుగా మారడం, అటువంటి విధవలను తిరిగి పెళ్ళిచేసుకునే ధైర్యం ఆనాటి సమాజానికి లేకపోవటం వలన పూటకూళ్ళమ్మ విధవగానే జీవితం గడుపుతూ అపసవ్య మార్గంలో పయనించింది.

పూటకూళ్ళమ్మ తర్వాత కన్యాశుల్క వివాహానికి బలైపోయి పుట్టింట్లో చాకిరీ చేస్తున్న బుచ్చమ్మ కనిపిస్తుంది. అగ్నిహోత్రావధాన్లు కన్యాశుల్కానికి ఆశపడి బుచ్చమ్మకు అసమవివాహం చేయటం, బాల వితంతువటం, పుట్టింట్లోనే ఉండడం, బుచ్చమ్మ తల్లి వెంకమ్మ మాటల్లోనే తెలుస్తుంది. డబ్బు మీద ఆశతో సుబ్బిని కూడా అగ్నిహోత్రుడు రూ. 1800 లకు లుబ్ధావధాన్లకిచ్చి పెళ్ళి చేయబోతున్నాడని తెలుసుకున్న తల్లి వెంకమ్మ తన అన్నయ్య కరటకశాస్త్రితో "అన్నయ్య ! ఈ సమ్మంధం చేస్తే నేన్నుయ్యో గొయ్యో చూసుకుంటాను. పెద్దదాన్ని రొమ్ము మీద కుంపట్లాగ భరిస్తూనే ఉన్నాం'' అంటుంది. కరటకశాస్త్రి కూడా అగ్నిహోత్రావధానితో "బుచ్చమ్మ నమ్మిన పదిహేనువందల రూపాయలేంజేశావ్'' అని అడుగుతాడు.

కన్యాశుల్కం అంటే ఆ రోజుల్లో ఎంత ఆశపడేవారో అగ్నిహోత్రావధాన్ల మాటల్లో తెలుస్తుంది. ముందు బుచ్చమ్మకు అలాంటి పెళ్ళిచేసి బాలవితంతువైన తర్వాత తనింటికి తెచ్చుకొనికూడా మరలా రెండో కూతురు సుబ్బికి అలాంటి పెళ్ళే చేయదలచుకొని బావమరిది కరటక శాస్త్రితో "రామచంద్రపురం అగ్రహారంలో లుబ్ధావధాన్లు గార్ని యెరుగుదువా ? ఆయన లక్షాధికారి. పద్దెనిమిది వందులకి సుబ్బిని అడగొచ్చారు. ఉభయ ఖర్చులూ పెడతారు. పెళ్ళి మా వైభవంగా చేస్తారుట,మనం పిల్లని తీసికెళ్ళి వాళ్ళింటే పెళ్ళిచేయడం, మనకి తట్టుబడి అట్టే ఉండదు'' అంటాడు.

ఈ కన్యాశుల్కానికి బలైపోయిన మీనాక్షి డబ్బు మీద ఎంతో ఆశ ఉన్న లుబ్ధావధాని కూతురు. సహజ దురాచారాల యినుప పిడికిళ్ళలో నలిగిపోయిన దుర్బలురాలు. శుల్కం తీసుకొని తండ్రి చేసిన తప్పుకు జీవితాంతం శిక్ష అనుభవించిన అమాయకురాలు. వయసులోని కోర్కెలతో రామప్పంతుల్ని నమ్మి మోసపోయింది. కూతురి చెడు ప్రవర్తనకు తను అత్యాశ వలన చేసిన పొరబాటే కారణమని తెలుసుకొని చింతిస్తాడు లుబ్ధావధాని.

ఇలా కన్యాశుల్క వివాహాల వలన మొగ్గల వంటి చిన్నారుల జీవితాలు పూర్తిగా విచ్చుకోక ముందే వాడిపోతున్నాయి.

### 10.4.4. వేశ్యా వ్యవస్థ :

సమాజంలో నాడు - నేడు అని తేడాలేకుండా ఎల్లప్పుడూ ఉండే సమస్య వేశ్యాసమస్య. పితృస్వామ్య వ్యవస్థలో ఎక్కువమంది మగవాళ్ళు తమ సుఖభోగాలకు అవకాశమైన అంశంగా దీన్ని భావించినా ఇది ఎప్పటికీ సమాజానికి సమస్యే. దీనివలన సమాజానికి దీర్ఘకాలికమైన నష్టం సంభవిస్తుంది.

'కన్యాశుల్కం' నాటకంలో ప్రధాన సమస్యలైన బాల్యవివాహం, వితంతు సమస్య, కన్యాశుల్కం సమస్యలతో పాటుగా ఈ వేశ్యా సమస్యను కూడా అంతర్లీనంగా చూపించాడు గురజాడ. గురజాడ వేశ్యావృత్తిని ఒక సమస్యగా చూపడానికి కారణం

ఆనాటి సమాజంలోని పరిస్థితులే. వేశ్యను వుంచుకోవడం విలువైన పనిగానూ, సానిదాన్ని సాకటం సంఘంలో గౌరవప్రదమైనది గానూ, వేశ్యల కొంపల చుట్టూ తిరగడం సుఖవంతమైన, భోగవంతమైన జీవితంగానూ ఆనాటి సమాజం భావించినందువల్లనే వేశ్యలను పెంచి పోషించటం ఒక ఆచారంగా మారిపోయింది. ఎవరు ఎంతమంది వేశ్యలను ఉంచుకుంటే అంత సంపన్నులు అనే భావన ఆనాటి ప్రజల్లో చాలామందికి ఉన్నది. భుక్తి కోసం కావచ్చు మరేదైనా కారణం కావచ్చు వేశ్యలు కూడా తమ అందచందాలతో విటుల్ని ఆకర్షించి ఆనందింపజేసేవారు. దీనివలన సమాజానికి హాని అని ఎవరూ ఊహించలేదు, ఊహించినా అంతగా పట్టించుకోలేదు.

అప్పారావు గారికున్న గొప్ప సంఘ సంస్కరణాభిలాష వలనగాని, లేక మానవతా దృష్టివలన గాని ఈ నాటకంలో అద్భుతమైన వేశ్యపాత్రగా అమృతవాణి మధురవాణిని సృష్టించాడు. వేశ్యల అందచందాలకు గ్రామాలు, పట్టణాలు, రాజ్యాలే గులాములై సలాములు చేస్తాయి. ఈ విషయాన్నే కరటకశాస్త్రి "మధురవాణి అంటూ ఒక వేశ్య శిఖామణి యీ కళింగరాజ్యంలో పుట్టి వుండకపోతే భగవంతుడి సృష్టికి యంతో లోపం వచ్చి ఉండును" అని "నీ వలలో పడ్డప్రాణి మరి తప్పించుకోవడం యెలాగ? వానికి ఉన్న పటుత్వం యేఉక్కు గొలుసులకూ వుండదు" అని అంటాడు. ఇలా వేశ్యల సొగసులను, సోయగాలను గూర్చి వర్ణిస్తూ ఆనందించటమే తప్ప ఆ వేశ్యల మనసుల్లోని ఆవేదనను అర్థం చేసుకునే వార్కెడా కనిపించరు. వేశ్యల జీవితాలను, వారి సమస్యలను అర్థం చేసుకున్నాడు గనుకనే గురజాడ మధురవాణి చేత ఒకచోట ఆ వృత్తిపై నిరసనను వ్యక్తం చేయిస్తాడు. కరటకశాస్త్రితో మధురవాణి ఈ వృత్తిలో ఉండటం కంటే "కాపు మనిషినై పుట్టి, మొగుడి పొలంలో వంగ మొక్కలకూ, మిరప మొక్కలకూ దోహదం చేస్తే, యావజ్జీవం కాపాడే తన వాళ్ళన్నవారు వుందురేమో?" నని తన బ్రతుకుపై అశాంతిని బైటపెడుతుంది.

ఆనాటిసమాజంలో వేశ్యావృత్తిని పెంచిపోషించినది కొందరైతే, మరికొందరు అసహ్యించుకొన్నారు. రూపుమాపటానికి మాత్రం ప్రయత్నించినవారు బహు అరుదు. కన్యాశుల్కం నాటకంలో వేశ్యావృత్తిని పోషించినవారు రామప్పంతులు, గిరీశం, కరటకశాస్త్రి ఇంకా తెరమీద కనిపించని కొందరు వ్యక్తులు. వేశ్యావృత్తినే పూర్తిగా అసహ్యించుకున్నది సౌజన్యారావు పంతులు.

గురజాడ ఉద్దేశ్యం, నాటక ప్రయోజనం వేశ్యావృత్తిని పెంచటంగాదు, అసహ్యించుకోవటం కాదు. రూపుమాపటం. అందుకే నాటకం మొత్తానికి సూత్రధారిగా మధురవాణిని సృష్టించి చివరకు ఆమెచేత, సౌజన్యారావు పంతులు చేత వేశ్యావృత్తిపై విముఖత కలిగింపజేసి సక్రమ మార్గంలో జీవించమనే హితబోధ చేయించాడు.

## 10.5 కన్యాశుల్కం - ముగింపు :

ప్రపంచ నాటిక సాహిత్యంలో అగ్రశ్రేణిలో నిలచే నాటకాల్లో 'కన్యాశుల్కం' ఒకటి. నాటక వాఙ్మయంలో 'కన్యాశుల్కం' తర్వాత అటువంటి సాంఘిక నాటకం ఇంతవరకు రచింపబడలేదన్న సంగతి నిర్వివాదం. రాబోయే కొన్ని తరాల్లోనన్నా ఇటువంటి నాటకం సృష్టించబడుతుందన్న సూచనల్లో ఆశన్ని నిరాశే ముందుంటుంది. కారణం 'కన్యాశుల్కం' ఒక కుటుంబం, ఒక సమాజం, ఒక ప్రపంచం. దాని రచనావశ్యకత - సంఘ సంస్కారం, లక్ష్యం - సమాజోద్ధరణ.

తను నాటక రచనకు పూనుకోవడానికి గల కారణాన్ని గూర్చి గురజాడ "మన స్త్రీ జాతిలోని నిస్సహాయమైన విభాగాన్నీ సమాజ అవినీతి క్రిములతో నిండియున్న బాధాకరమైన దాస్యం నుండి రక్షించే సమస్య ఘనత వహించిన మీ దృష్టిని పదేళ్ళ క్రితం (1887 - 88) ఆకర్షించినపుడు ఈ చెడుగును ఒక జనరంజకమైన నాటకంలో వెల్లడి చేసి ఈ విషయం పై ప్రజాభిప్రాయాన్ని ఉద్దీపం చేసేందుకు మీ భృత్యుడొకడు ఒక దుర్బల ప్రయత్నం చేశాడు" అని అంకితంలో రాసుకున్నాడు.

అప్పారావు గారు అవతరించేనాటికి తెలుగుదేశంలోని సామాజిక పరిస్థితి అధఃపతనానికి దిగే స్థితిలో ఉంది. సమాజంలో సానిమేళాలు సరదాగానూ, వేశ్యను ఉంచకోవడం గొప్పగానూ, కన్యాశుల్కాలూ, బాల్యవివాహాలు ఆచారాలు గానూ, జాతివిభేదాలు, పచ్చి శృంగార ప్రబంధాలు, కృత్రిమ గ్రాంధిక భాషారచనలు, పండిత భిషక్కుల భాషాభేషజాలు అలంకారాలుగానూ ఉన్న ఒకానొక దుర్భర వ్యవస్థ. అటువంటి వ్యవస్థలో తను జీవించిన సమాజానికి దర్పణంగా గురజాడ 'కన్యాశుల్కం' రచన చేశాడు.

అప్పారావు గారు నాటక రచనలో ఒకచోట గిరీశంచేత చెప్పించినమాటలు అతని రచనా ఉద్దేశ్యాన్ని స్పష్టంగా చూపుతాయి. "లోకం తప్పు తోవలో వెళ్ళుతుంటే ఆ తోవలో నుంచి మళ్ళించి మంచి తోవలో పెట్టడమనేది సోషల్ రిఫార్మ్. జారూ, బురదా, గట్లూ, గతుకులూ వున్న తోవ యలా వుంటుందో యిప్పుడు మనవాళ్ళ ఆచారాలు అలా ఉన్నాయి. ఆ తోవలో నుంచి బండీ తప్పించి దిమ్మసా కొట్టిన హైరోడ్డులోకి మళ్ళించాలి. ఆ బండికి రెండుచక్రాలు ఒకటి విధవా వివాహం, రెండు నాచికొశ్చిన్ అనగా సానివాళ్ళను హతమార్చడవున్నూ. ఈ రెండే రాజమార్గాలు'' అని చెప్పడంలో గురజాడ భావం స్పష్టమవుతుంది.

'కన్యాశుల్కం' నాటకం ఒక అపూర్వసృష్టి. ఇటువంటి అద్భుతమైన వాస్తవిక రచన చేసిన కవిశేఖరులు, కవిబ్రహ్మలు గురజాడవారు. అస్తమించినా 'కన్యాశుల్కం'తో కలకాలం గుర్తుండిపోతారు. "గురజాడ 1915లో చనిపోయినా 1915 తరువాతే జీవించడం ప్రారంభించారు'' అన్నారు దేవులపల్లి కృష్ణశాస్త్రి.

"సుకవికి మరణం ఉండదు - కవిత్వానికి అప్రయోజకత్వం ఉండదు. అటువంటి సుకవి 'మన గురజాడ' - కవితాప్రక్రియ - కన్యాశుల్కం నాటకం.

## 10.6 ప్రశ్నలు :

1. 'కన్యాశుల్కం' లోని స్త్రీ పాత్రలను గూర్చి చర్చించండి ?
2. 'కన్యాశుల్కం' లోని స్త్రీ సమస్యలను విశ్లేషించండి ?
3. 'కన్యాశుల్కం' నాటక రచనోద్దేశాలను స్పష్టం చేయండి ?
4. ఆనాటి సమాజానికి అద్దం 'కన్యాశుల్కం' - వివరించండి

## 10.7 ఆచూకీ గ్రంథాలు :


1. 'కన్యాశుల్కం' - నూరేళ్ళ సమాలోచనం
2. 'కన్యాశుల్కం' - గురజాడ అప్పారావు
3. 'కన్యాశుల్కం' శతజయంతి ఉత్సవం - ప్రత్యేక సంచిక
4. 'కన్యాశుల్కం' నాటకకళ - సర్దేశాయి తిరుమలరావు.


**- ఆచార్య టి. సత్యవతి**

పాఠం - 11

# కందుకూరి వీరేశలింగం - బ్రాహ్మవివాహము ప్రహసనం

ప్రణాళిక :

11.0. ఉద్దేశ్యం
11.1. పాత్రల పరిచయం
11.2. బ్రాహ్మ వివాహము - అంకాలవారిగ కథా వస్తువు పరిచయం
11.3. బ్రాహ్మ వివాహము - ప్రథమాంకంలోని మాండలిక భాషాస్వరూపం, జాతీయాలూ, సామెతల పరిచయం
11.4. వీరేశలింగం ప్రహసనాలు - బ్రాహ్మవివాహము
11.5. బ్రాహ్మ వివాహ ప్రహసనము - కందుకూరి వీరేశలింగం గారి సంఘ సంస్కరణ పరాయణత్వము
11.6. ముగింపు - సంఘ సంస్కర్త, యుగపురుషుడుగా కందుకూరి వీరేశలింగం
11.7. మాదిరి ప్రశ్నలు / ఆకళింపు ప్రశ్నలు
11.8. సంప్రదించవలసిన రచనలు

## 11.0 ఉద్దేశం :

కందుకూరి వీరేశలింగం గారి బ్రాహ్మవివాహం ప్రహసనంలోని కథావస్తువును పరిచయం చేసి, ఆ ప్రహసనం ఆధారంగా వీరేశలింగం సంఘ సంస్కరణ పరాయణత్వాన్ని విద్యార్థులకు వివరించడం

## 11.1. పాత్రల పరిచయం :

**ఈ నాటకలోని పాత్రలు - పురుషులు**

| | | |
|---|---|---|
| ధనాల కామయ్య | : | పెండ్లి కుమార్తె తండ్రి |
| పుల్లయ్య, పిచ్చయ్య | : | పెండ్లి కుమార్తె యొక్క బంధువులు |
| పేరిశాస్త్రులు, వట్టి సోమయాజులు | : | పెండ్లి బేరమునకు పంపబడిన వైదికస్వాములు |
| పెద్దయ్య | : | పెండ్లి కుమారుడు |
| పరమేశ్వరావధానులు, నీలకంఠ సోమయాజులు | : | పెండ్లి కుమారుని బంధువులు |
| బొజ్జయ్య | : | సిద్ధాంతి |
| రామయ్య | : | పెద్దయ్య గారి పరిచారకుడు |
| భోగరాజు సుబ్బారావు, భీమరాజు, సోమరాజు, రామస్వామి, వెంకప్ప, చెవిటి చయనులు గారు, గుడ్డి గున్నయ్యగారు | : | తాంబూలమునకు వచ్చిన పెద్ద మనుషులు |
| భాగవతుల పాపయ్య, సోమయాజులు, సాగి సర్వావధానులు, వేదుల వెంకయ్య, ముడంబి నరసింహాచార్యులు, సుబ్బావధానులు, లక్ష్మావధానులు సూరావధానులు | : | సదస్యులు |

| | | |
|---|---|---|
| వెంకటరెడ్డి | : | మాన్యము సాగుబడి చేయు కాపు |
| నీళ్ళ కావళ్ళ కొండయ్య, పీనుగుల పేరయ్య | : | వడ్డన బ్రాహ్మణులు |
| రాజన్నగారు, పాపయ్య పంతులు గారు | : | పెండ్లి విందునకు వచ్చినవారు |
| పైరిపాటి పాపావధానులు, బంధకవి భానుమూర్తి | : | పూటకూటింటికి భోజనములకు వచ్చినవారు. |

## స్త్రీలు

| | | |
|---|---|---|
| అజ్ఞానమ్మ | : | పెండ్లి కుమార్తె తల్లి |
| చిన్నమ్మ | : | పెండ్లి కూతురు |
| కన్నమ్మ | : | కామయ్య గారి పనికత్తె |
| బట్టతల అలివేణి, సొట్టకాలి హంసయాన, చికిలికన్నుల చకోరాక్షి, నత్తినోటి మంజువాణి | : | వేశ్యలు |
| బాపనమ్మ | : | ముత్తైదువ |

## బ్రాహ్మ వివాహము - ప్రథమాంకము : పాత్రలు

కమ్మయ్య, అజ్ఞానమ్మ, పుల్లయ్య, పిచ్చయ్య, వైదిక స్వాములు
ప్రదేశము : పెండ్లికూతురు గృహములోని చావిడి.

## ప్రథమాంక కథా సారాంశం :

ప్రథమాంకంలో పెండ్లికుమార్తె తల్లిదండ్రులైన కామయ్య, అజ్ఞానమ్మ కుమార్తె వివాహం గురించిన చర్చ సాగిస్తారు. తమ ప్రాణాలు బాగా వుండగానే పెందలకాడే వకసమ్మంధం విచారించి ముడిపెట్టివేస్తే, పెళ్ళిచెయ్యక పోయినామని అవతల మా జీవాలకుపడి యేడువకుండా మొగుడూ పెళ్ళాలూ తమ పొట్ట తాము పోసుకుంటూ సుఖంగా వుంచారు" అంటాడు కామయ్య పుల్లయ్యతో. ఈ అంకంలో డబ్బు పుచ్చుకొని పిల్ల దాన్ని యివ్వవచ్చునా ? అన్న ప్రశ్నకు సమాధానంగా కన్యాశుల్కానికి సంబంధించిన చర్చ జరుగుతుంది. కన్యాశుల్కాన్ని శాస్త్రం కూడా ఆమోదించిందని సాక్ష్యాధారాలతో నిరూపించడానికి వైదిక స్వాములైన పేరిశాస్త్రులు, వట్టి సోమయాజులు ప్రయత్నించడం ఈ అంకంలోని ముఖ్యాంశం.

## ముఖ్యాంశ వివరణ :

**3.1 భాషాంశాలు :** మాండలిక ప్రయోగం బాగా కనబడుతుంది. ముఖ్యంగా కమ్మయ్య, అజ్ఞానమ్మల సంభాషణల్లోని

మాట్లాడుకుంచూవుంటే
వచ్చి పోచారు
వచ్చేదానవు
వుండిపోచుందని
చచ్చిపోచూ వున్నాను
నా ఖర్మమే కాలిపోతుంది
తప్పుచుందా యేమిషి ?

ఆడుకుంచూ వుంటే
వూగులాడ బోచామా ?
సుఖంగా వుంచారు
యిఖ, యిఖను
యేమిషో
బ్రతుకుచానోలేదో
బ్రతుకుచావు (బ్రతుకుతావు)
ఆలోచన చెపుచారు (చెపుతారు)
చెవిని యిల్లు కట్టుకొని పోరుచాను
తంబూలాలు తీసుకు రమ్మంచూ వున్నాను.
మొదలైన రూపాలు ఆనాటి బ్రాహ్మణ మాండలిక స్వరూపాన్ని స్పష్టం చేస్తున్నాయి.

### జాతీయాలూ, సామెతలూ :

ముక్కుపచ్చలారని బిడ్డ, బ్రతికి బట్టకడితే, రుణంలేకపోవు, పుట్టికట్టుకొని వూగులాడు, మూడుకాళ్ళ ముసలివారు, యే అయ్య వొళ్ళోనో పెట్టు, తలవెంట్రుకలన్ని, ఇల్లు కట్టుకునిపోరు, చెవినిపెట్టు, బలుసు కూర యేరుకుని బ్రతుకు, ఇంటివాణ్నిచేయు, కడుపున నాలుగు కాయలుకాయు. మొదలైన జాతీయాలు రచనాశైలికి ఒక సహజత్వాన్ని సమకూర్చినాయి.

ఇదేవిధంగా మొత్తం నాటకంలోని మాండలిక భాషా వ్యవహారాల్ని జాతీయాలు, సామెతలనూ గుర్తించడానికి ప్రయత్నించండి.

### ద్వితీయాంకము :

| | | |
|---|---|---|
| పాత్రలు | : | పెండ్లి కుమారుడు పెద్దయ్య, పెండ్లికుమారుని బంధువులు పరమేశ్వరావధానులు, నీలకంఠ సోమయాజులు, పేరిశాస్త్రి, రామయ్య, బొజ్జయ్య వట్టి సోమయాజులు. |
| ప్రదేశము | : | పెండ్లి కొడుకు గృహములోని గది. |
| కథాంశము | : | పెండ్లి కుమారుడు పెద్దయ్య వివాహానికి సంబంధించిన చర్చ ఇందులో ముఖ్య కథాంశం. భూమి మీద పేరు నిలపడానికి సంసారధర్మంలో భార్య అని వకతె అవశ్యముండాలని నీలకంఠ సోమయాజులు, పరమేశ్వరావధానులు పెద్దయ్యను వివాహం చేసుకొమ్మని ప్రోత్సహిస్తారు. పెళ్ళిళ్ళ పేరయ్యలు పేరిశాస్త్రి, వట్టి సోమయాజులు కామయ్యా సంబంధాన్ని నిశ్చయం చేస్తున్నామని పెద్దయ్యకు తెలియజేస్తారు. అందుకు తన జాతకాన్ని మార్చడం, తన వయస్సు, బట్టతల, నెరసిన జుట్టు కనపడకుండ పెద్దయ్య తీసుకోవాల్సిన జాగ్రత్తల ప్రస్తావన ఈ అంకంలో వుంది. రాత్రిపూట ముహూర్తం మంచిదనీ అన్నీ అవలక్షణాలూ కనపడకుండా పోతాయనీ సిద్ధాంతిగారిచేత చెప్పించాలని నిర్ణయిస్తారు. |

### తృతీయాంకము :

| | | |
|---|---|---|
| ప్రదేశము | : | పెండ్లి కుమార్తె; పెండ్లి కుమారుని ఇల్లు |
| పాత్రలు | : | ధనాలకామయ్య, వట్టి సోమయాజులు, అజ్ఞానమ్మ, పేరిశాస్త్రి, కన్నమ్మ మొదలైనవారు. |

**కథాంశము :**

రాత్రిపూట లగ్నం ఏర్పాటుచేయడం వల్ల పెళ్ళి జరిపించడంలో ఎదురైన ఇబ్బందులు; ముసలితనం వల్ల పెళ్ళికొడుకైన పెద్దయ్య వివాహతంతులో భాగమైన మంగళస్నాన సమయంలో ఎదుర్కొన్న శరీర సంబంధమైన ఇబ్బందులు, వేశ్యలు వివాహ సందర్భంగా ఆటపాటలు ప్రదర్శించడం; డాంబికంగా వివాహానికి వచ్చినవారు వేశ్యలకు తాంబూలములో ధనాన్నివ్వడం - అన్నవి ఈ అంకంలోని కథాంశాలు.

**చతుర్థాంకము :**

ప్రదేశము : పెండ్లికూతురు గృహములోని చావిడి.
పాత్రలు : భాగవతుల పాపయ్య, వేదుల వెంకయ్య, సోమయాజులు, సాగిసర్వావధానులు, పెద్దయ్య, నీలకంఠ సోమయాజులు, పరమేశ్వరరావు మొదలైనవారు.

**కథా సారాంశము :**

సభాపతులని పిలవబడే బ్రాహ్మణులకు సభాతాంబూలములివ్వడం, వీటికోసం వాళ్ళుపడే ఆరాటం, తమలోతాము వాదులాడుకోవడం, దొమ్మీ చేయ్యడం, సభా తాంబూలాలివ్వడం కోసం పెళ్ళికుమారుడు పెద్దయ్య అప్పులు చేయడం వర్ణింపబడ్డాయి.

**పంచమాంకము :**

ప్రదేశము : పెండ్లి కూతురి వారి యిల్లు
పాత్రలు : ధనాలకామయ్య, నీలకంఠ సోమ యాజులు, నీళ్ళకావళ్ళ కొండయ్య, భీమరాజు మొదలైనవారు.
కథా సారాంశము : పెద్దయ్య పెండ్లి సందర్భంగా ఏర్పాటుచేసిన భోజనాలకు వచ్చే పెద్దమనుషులు వ్యర్థ దంభాలకోసం లాతముల కోసం శ్రమపడటం, భోజనానికి సమయానికి రాకుండా పెద్దమనుషులు పలుమార్లు పిలిపించుకోవడం మొదలైన అంశాల ప్రస్తావన ఈ అంకంలో వుంది.

ఇదే విధంగా ఆరవ, ఏడవ అలాగే పుష్పాంకము, సప్తమాంకములలోని కథా సారాలన్నీ రాయడానికి ప్రయత్నించండి.

## 4) వీరేశలింగం ప్రహసనాలు - బ్రాహ్మ వివాహము :

కందుకూరి వీరేశలింగం పంతులు గొప్ప సంఘ సంస్కర్త. అవినీతికి, అజ్ఞానానికి, మూఢ విశ్వాసాలకూ, ఆలవాలమై పతనోన్ముఖమైన జాతిని సముద్ధరించేందుకు జన్మించిన మహాపురుషుడు వీరేశలింగం. ఆయన **1848**వ సంవత్సరంలో జన్మించారు. **1919** వ సంవత్సరలో మరణించారు. **19**వ శతాబ్ది ఉత్తరార్థమంతా ఆంధ్ర దేశసామాజిక, సాహిత్య పునరుజ్జీవనానికి తన జీవితాన్ని ధారపోసిన యుగవైతాళికుడు కందుకూరి. ఆయన అద్వితీయ ప్రతిభాసంపన్నులు. సాహిత్యంలో అంతకు పూర్వంలేని ఎన్నో కొత్త ప్రక్రియలను వీరేశలింగం పంతులుగారు తెలుగులో వ్యాప్తిలోకి తెచ్చారు. ఆ కోవలో చూస్తే ప్రహసన రచనా ప్రక్రియ తెలుగు సాహిత్యంలో ఆధునికం. ఆ ప్రక్రియ పంతులుగారితోనే ప్రారంభమయ్యింది.

ప్రహసన ప్రక్రియ తెలుగు సాహిత్యానికి నవీనమైనా సంస్కృతంలో ప్రాచీనమైనదే. దశరూపకాల్లో ప్రహసనాన్ని ఒకటిగా పేర్కొన్నారు. భరతుడు దశరూపకాల్లో ప్రహసన లక్షణాలు చెప్పారు. ప్రహసన రచనలో "కందుకూరి వైశిష్ట్యాన్ని గురజాడ "K. Viresalingam Pantulu garu rendered great service to Telugu by issuing as the first volume

of his collected works adaptations of English acting plays and faces of Indian Life written in vernceular . . . the first volume contains his very best work in fact his only work that took the public by storm"అని ప్రశంసించారు. (కన్యాశుల్కం పీఠిక) మొదటినుంచి చివరిదాక నవ్వించడం దీనిలక్షణం. అందువల్లనే ఈ ప్రక్రియకు ప్రహసనమనే పేరు వచ్చింది.

సంస్కృత సాహిత్యంలో ఇప్పటివరకూ లభించిన తొలిప్రహసనం 'భగవదజ్జుకం' దీని ఇతివృత్తం బౌద్ధులను పరిహసించడం. బ్రహ్మసూత్రాలకు విశిష్టా ద్వైతపరంగా భాష్యం రచించిన బోధయనుడు ఈ ప్రహసనాన్ని రచించాడు. తర్వాతది 'దామక ప్రహసనం' మారువేషంలో కర్ణుడు పరశురాముడి దగ్గర విద్యాభ్యాసం చేయడం ఈ ప్రహసనం ఇతివృత్తం. తర్వాతది పల్లవ రాజైన మహేంద్ర విక్రమవర్మ రచించిన 'మత్తవిలాస - ప్రహసనం'. ఇందులో ఆనాటి కాంచీనగర ప్రజల జీవితం చిత్రింపబడింది. భోజరాజుకాలం నాడు వెలువడిన 'లంబోదర ప్రహసనం' మరొకటి. దీనిని ఆయన ఆ స్థానంలోని కాళిదాసు బిరుదాంచితుడు రచించాడు. 12వ శతాబ్దంలో శంకధరుడనే కవి రచించిన 'లటకమేళనం' మరొక ప్రహసనం. 18వ శతాబ్దంలో తంజావూరును పాలించిన తుక్కోజి మహారాజుమంత్రి ఘనశ్యామ పండితుడు రచించిన 'దమరుకం' అనే ప్రహసనంలో వివిధ దేశాల, వివిధ మతాల వారి అసభ్య ప్రవర్తన చిత్రితమయ్యింది. తొలినాళ్ళ సంస్కృత ప్రహసనాలు కేవలం, బూతుస్థాయికి దిగజారినాయి. సంస్కృత సాహిత్య విస్తృతినిబట్టి చూస్తే ప్రవాసనాలు అధికసంఖ్యలో వెలువడి వుండవలసిందేకాని ఎందుకో వాటిసంఖ్య పరిమితంగానే కనిపిస్తుంది. నాటకాలలో విధూషికుడి పాత్ర హాస్యరసోత్పాదనకు మూలంకావడమూ, ప్రహసనాల్లో, అశ్లీలభావ, భాషాస్ఫూర్తి ప్రాబల్యమౌఢము ప్రహసన రచనపట్ల ఆసక్తి తగ్గడానికి కారణాలై ఉండవచ్చునని అక్కిరాజు రఘుపతిరావు అభిప్రాయపడ్డారు.

తొలినాళ్ళలో వెలువడిన ప్రహసనాల్లో జుగుప్సాకరమైన అశ్లీలమైన ప్రస్తావనలుండేవని వీరేశలింగం గారు కూడా అన్నారు. ఆయన ఆనాటి మతాధిపతులను గూర్చి చెపుతూ గోదావరీ మండల సాంఘిక సభా ప్రసంగంలో వీరేశలింగంగారు "పూర్వకాలము నందు 'సంస్కృత భాషలో రచింపబడిన ప్రహసనములలో సన్యాసుల వ్యభిచారాదులు బహువిధముల వర్ణింపబడి పరిహసించబడినవి" అన్నారు. వీరేశలింగం ప్రహసనాల్లో అక్కడక్కడా మోటుహాస్యం, తామసం, క్రోధం, ఆనాటిసమాజం పట్ల తీవ్రమైన అసహనం, నిరసన కనపడతాయి. ఆయన సహజ నైతికంగా పతనమై పోవడం చూశారు. బాల్యవివాహాలు, వృద్ధవివాహాలు, కన్యాశుల్కాలు, జాతకాలు, ముహూర్తాలు, శకునాలు సమాజాన్ని చీడపురుగుల్లా పట్టి పీడించడం గమనించారు. వాటిని ఖండించడానికి, ఎగతాళి చెయ్యడానికి ప్రహసన ప్రక్రియను వీరేశలింగం ఉపయోగించుకున్నారు. ఆయన ఆశించిన ప్రయోజనం అదే.

వీరేశలింగం గారి ప్రహసనాలకు సంపుటీకరించిన, సంపాదకత్వం వహించిన అక్కిరాజు రమాపతి గారు 'వీరేశలింగం రచనలో నాలుగవ సంపుటం ప్రహసనములు'లో మొత్తం 8 పెద్ద ప్రహసనాలు, 9 చిన్న ప్రహసనాలున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ఇంగ్లీషు నుంచి వీరేశలింగం అనువదించిన ప్రహసనాలు చేర్చలేదన్నారు. ఇంగ్లీషు నుంచి ఆయన అనువాదం చేసిన ప్రహసనాలలో కొన్ని సన్నివేశాలలో కృతకృత్యం చోటుచేసుకున్నది. ఆ ఆచార వ్యవహారాలు తెలుగువాళ్ళకు విరుద్ధంగా కన్పిస్తాయి. అందువల్ల ఆ ప్రహసనాలను ఇందులో చేర్చలేదు" అని అక్కిరాజు పేర్కొన్నారు.

వీరేశలింగం ప్రహసనాల్లో బ్రాహ్మవివాహం, వ్యవహార ధర్మబోధిని, వేశ్యాప్రియ ప్రహసనము, కౌతుకవర్థిని, జమాబందీ, మునిపల్ నాటకం, కలిపురుష శనైశ్చర విలాసం పరిమాణంలో పెద్దవి. తక్కిన తొమ్మిది చిన్న ప్రహసనాలు. ఇంగ్లీషు నుండి అనువాదం చేసినవీ, స్వతంత్ర రచనలుగా చేసినవీ అయిన చిన్న, పెద్ద ప్రహసనాలు దాదాపు ఢభై ఎనభై పైగా వీరేశలింగం పంతులుగారు రచించారు. వివేకవర్ధని, సత్యసంవర్ధని, సతీహితబోధిని, సత్యవాదిని, జనానా, చింతామణి మొదలైన పత్రికలలో ఆయన ప్రహసనాలు ప్రచురించారు. వీరేశలింగం చిన్న చిన్న హాస్య సంభాషణలను కూడా ప్రహసనాలనే పేర్కొన్నారు.

వీరేశలింగం తన ప్రహసనాలన్నింటిలోని పాత్రలన్నిటిని ఆనాటి సజీవ సమాజం నుంచి స్వీకరించారు. ఆనాటి దుష్కులాచార రక్షణోద్యోగులను ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఆ కారణంగా ఆయన న్యాయస్థానాల్లో మానవష్టపు అభియోగాలు, వ్యాజ్యాలు ఎదుర్కొన్నారు. సాంఘిక దురాచార నిర్మూలనకు, స్వార్థపరుల బండారాన్ని బయటపెట్టటానికీ పంతులుగారు తన ప్రహసనాలను సాధనాలుగా చేసుకున్నారు. ప్రజల్ని పీల్చి పిప్పి చేస్తున్న ఆనాటి సమాజంలోని ఉద్యోగుల లంచగొండితనం, పురోహితుల దంభ ప్రవర్తన, వేశ్యాలంపటత్వం, మతాచార పరిరక్షకుల అవినీతి, ఆత్మవంచనలు వీరేశలింగం ప్రహసనాలకు ఇతి వృత్తమైనాయి. ఆనాటి సంఘంలో తనకు కనిపించిన సమస్త హేయప్రవృత్తులను, దురాచారాలను, మోసాలను, అవినీతిని, అక్రమాలను వీరేశలింగం తన ప్రహసనాల ద్వారా ఎండగట్టాడు. తీవ్రంగా ఖండించాడు. కటువుగా విమర్శించాడు. తలవాచేట్లు చివాట్లు కూడా పెట్టాడు.

బ్రాహ్మ వివాహం, వ్యవహార ధర్మబోధిని అనే ప్రహసనాలు 'పెద్దయ్యగారి పెండ్లి పుస్తకం' ప్లీడరు నాటకమనే పేర్లతో ప్రాచుర్యం పొందాయి. వీధి అరుగుల మీద జనులు గుంపులు గుంపులుగా చేరి ఎవరైనా ఈ గ్రంథాలు చదువుతుంటే విని ఆనందించే వారట. పడవనడిపే వాడొకడు - ఈ గ్రంథాన్ని పడవలో వాళ్ళకు చదివి వినిపిస్తుంటే తాము కూడా ఆ పడవలో ప్రయాణాలు చేస్తూ చూశామని పంతులుగారు వ్రాశారు. ఒకసారి తాము బందరు వెళ్ళినపుడు అక్కడ తొమ్మిదేళ్ళ బాలిక ఒకరు బ్రాహ్మవివాహమంతా కంఠోపాఠంగా తనకు వినిపించడం ఆశ్చర్యం కలిగించిందని వీరేశలింగంగారు స్వీయచరిత్రలో చెప్పారు. ఇవన్నీ ఈ ప్రహసనాల ప్రాచుర్యానికీ, ప్రాశస్త్యానికీ తార్కాణాలు. ఈ ప్రహసనాల్లో ఆనాటిసంఘంలో ప్రాచుర్యం పొందిన దౌష్ట్యమంతా కళ్ళకు కనిపిస్తుంది. హృదయాన్ని కదిలింపజేస్తుంది.

వీరేశలింగం ప్రహసనాలు ఆనాటి సాంఘిక పరిస్థితికి ప్రాతినిధ్యం వహిస్తాయి. 'మున్సిపల్ నాటకం' అన్న ప్రహసనంలో ఆనాటి పురపాలక సంఘాల కార్యనిర్వహణ తీరుతెన్నులను పంతులుగారు చిత్రించారు. వేశ్యాప్రియ ప్రహసనం, కౌతుకవర్థిని నాటి సంఘంలో ప్రధానమైన వీర్య సమస్యను చిత్రీకరించిన రచనలు. అనాటి జమిందారులు, సంస్థానాధిపతుల ఆడంబర, అపహాస్య జీవిత వ్యవస్థను, జమిందారీ ధర్మఖర్చు, బహుభర్యత్వము వంటి ప్రహసనల ద్వారా విమర్శించారు. 'కలిపురుష శనైశ్చర విలాసం' వంటి రచనల ద్వారా వీరేశలింగం పంతులు తెలుగులో అధిక్షేపానికీ, వ్యంగ్య విమర్శనాత్మక హేళన రచనలకు ఒరవడిపెట్టాడు.

సాహిత్యపరంగా చూస్తే కన్యాశుల్కాన్ని, అతి బాల్యవిహాలను నిరసిస్తూ కందుకూరికి పూర్వమే కొన్ని రచనలు వచ్చాయి. అయితే అవి మేధావులకే పరిమితమయ్యాయి. ఈ ఆచారాలలోని దౌష్ట్యాన్ని సామాన్య ప్రజలకర్థమయ్యేలా చెప్పడానికి సాహిత్యపరంగా తొలి ప్రయత్నం చేసినవారు కందుకూరి. ఆయన కన్యాశుల్క దురాచారాన్ని, బాల్యవృద్ధ వివాహాలను అవహేళన చేస్తూ **1876**లో బ్రాహ్మ వివాహం అనే ప్రహసనం రాశారు. అది పూర్తిగా సంభాషణ రూపంలో ఉండడం వల్ల ఆకాలపు ప్రజలు ఈ ప్రహసనాన్ని బాగా చదవేవారట.

"బ్రాహ్మవివాహం'' లో మూడేళ్ళ పిల్లకు పెళ్ళి చెయ్యాలని తల్లీ తండ్రీ ఉబలాటపడతారు. ఒక సంబంధంలో వరునికి అన్నీ ఉన్నాయట. కానీ అన్నదమ్ములు ఎక్కువమంది అని నచ్చలేదట. మరో సంబంధంలో కుర్రాడికి చదువు, మంచితనం వున్నాయి, కాని తండ్రికి మడిమాన్యాలు లేవుట. గ్రహచారం బాగోలేక వరుడు చచ్చిపోతే పిల్లయావజ్జీవం తిండానికి లేకుండా ఏడుస్తుందట. ఇలా అన్నింటికీ వంకలుపెట్టే పిల్ల తండ్రికి నచ్చినవరుడు నాలుగో పెళ్ళివాడైన **70** ఏళ్ళ పెద్దయ్య. నిండా నలభై ఏళ్ళయినా లేని తన మేనల్లు డికి కూతుర్నిచ్చి పెళ్ళి చేయాలని తల్లి అజ్ఞానమ్మ ఆశ. పెద్దయ్య వయస్సును గురించి సణుగుతున్న భార్యతో 'దీనికి వప్పుకుంటావా నీకు అసవులూ, తగువులూ బాగా జరుగుతవి . . .' ఇంతే కాకుండా శుల్కపణంలోంచి నాలుగు వందల రూపాయలు పెట్టి నీకు నగలుకొని పెడతాను'' అని భర్త అనగానే ఆమె అయిష్టతంతా ఎగిరిపోతుంది. తన కడుపున పుట్టిన బిడ్డను అమ్ముకోవడంలో స్త్రీ నిర్వహించిన పాత్రను, దానికి కారణమైన ఆమె అజ్ఞానాన్ని, మూర్ఖత్వాన్ని విరేశలింగం

కళ్ళకు కట్టించారు. ముసలి అల్లుడైతే త్వరగా చస్తాడు. అతగాడు చచ్చాక ఆస్తి చేతికి వస్తుందని తల్లిదండ్రుల ఆలోచన. పిల్లది డెబ్బయ్యేళ్ళ ముండాకొడుకుతో కాపురంచేసి ఏడుస్తుందా ఏమిటి ? అని ఆ తల్లిదండ్రులే అనుకుంటారు. ఈరకమైన తంతుల వల్ల ప్రయోజనమేమిటి ? పిల్ల పెరిగి నీతి తప్పి ప్రవర్తిస్తే అందుకు ఎవరు బాధ్యులు ? కన్యాశుల్క దురాచారాన్నీ, బాలవృద్ధ వివాహాలను ఆమోదిస్తున్న సమాజం కాదా ? అన్న ప్రశ్నలు సమాజంలో చర్చకు పెట్టడానికి వీరేశలింగం 'బ్రహ్మవివాహం' ప్రహసనం ద్వారా ప్రయత్నించారు. ప్రహసనం చివర "కన్యాశుల్కం పుచ్చుకొనే వార్ని పదిమంది చేరి వెలివేస్తే బహునష్టాలు మానిపోతాయి" అన్న పరిష్కారాన్ని సూచించారు. సమాజం కన్యాశుల్క దురాచారం పట్ల నిరసన ప్రకటిస్తే అతి బాల్యవివాహాలూ, వయోభేదంతో వివాహాలు జరుగవు. బాలవితంతు సమస్య సమాజంలోతలఎత్తదు అంటూ తన 'బ్రహ్మ వివాహం' ప్రహసనం ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేసినవారు కందుకూరి. ఆయన కన్యాశుల్క సమస్యను వివాహ వృక్షానికి పుట్టిన వేరు పురుగుగా గుర్తించారు. కన్యాశుల్క ఆచారం సమాజ ఆమోదముద్ర లేకపోతే నిలవలేదని సూచించి అందుకు అటువంటి వ్యక్తులను సమాజం నుండి వెలివేయడమే పరిష్కార మార్గంగా బ్రహ్మవివాహం ప్రహసనం ద్వారా ప్రకటించారు.

తమ ప్రహసనాల ద్వారా వీరేశలింగంయ గారు సమాజంలో, ప్రజలలో కలిగించిన సంచలనాన్ని ఆయన అనుయాయులీ విధంగా పేర్కొన్నారు.

"ప్రవాసనముల మూలమున ప్రజాసామాన్యములో జ్ఞాన ప్రబోధమునకు యత్నము విరివిగ జేసిన మొదటి ఆంధ్ర భాషావేత్త వీరేశలింగమే. సంఘ సంస్కరణోద్యమాలు ఉపన్యాసాల వేదికల మీదను, పండితుల వాద ప్రతివాదముల తెలుపు గ్రంథములను మాత్రమేగాక, ఈ ప్రహసనముల మూలమున సామాన్య జనుల గృహములోనికి జొచ్చుకొని పోయినది. ఈ ప్రహసములలో చిత్రింపబడినవారు చాలావరకు నాటి ప్రముఖులే" - అడవి శంకరావు.

'ఆయన ప్రహసనము కటువుగ నుండునట్లే వారి వ్యాసము గాంభీర్యము వహించియుండెను. సంఘ సంస్కరణలు తీక్షత దాల్చియుండెడి యా పూర్వదినములలో వీరేశలింగం సంస్కర్తకు చెడుగనిన బొత్తిగ నోరిమి లేకుండెను. యుద్ధ రంగమున మృదువగు సాధనములు ప్రయోగింపనాయనకిచ్చలేదు. దౌష్ట్యము నొక్కపెట్టున దుడ్డుకర్రతో మోదుటకే యాతడభ్యాసపడియుం . . . ఆయన ప్రహసనములందలి ముఖ్యపాత్రలు సజీవులగు మనుజులె. ప్రకృతాంధ్ర వచనము వలెనే ప్రహసన రచనయినకును వీరేశలింగ కలియే సృష్టికర్త. ఇందలి హాస్య సంభాషణముల రీతిన యిన్చి, "హాస్యసంజీవని' యను పేరే. తెలుగు ప్రహసనములకు బర్యాయపదమయ్యెను. బాలవృద్ధులకు, పండిత పామరలకును ఎల్లరికి నీ రచనలు 'కరకరమని' రచికరముగ నున్నయవి. ఈ ప్రహసనము లన్నియు గత **25** సంవత్సరములో వ్రాయబడినవి. ఇవి బాలురు చదివి వినోదింతురు. పెద్దవారు చదివి మెచ్చుకొందురు. సంఘ సంస్కరణ విషయములను గూర్చి యిందు చర్చలు గలవు" అంటూ రాయసం వెంకట శివుడు గారు **1898** నాటి జీవితోదంతం గూర్చి ప్రస్తావిస్తూ పరాతులు గారి ప్రహసనాలకు యోగ్యత పత్రం ఇచ్చారు.

వీరేశలింగం ప్రహసనాలు సమకాలీన సమాజానికి ప్రతిబింబాలు. ఆయన తన లేఖినికి పదునుపెట్టి ప్రహసనాల ద్వారా సాంఘిక రుగ్మతలకు శస్త్రచికిత్స చేసి సహజ సంస్కరణకు పూనుకున్నాడు.

## 5. బ్రాహ్మ వివాహ ప్రహసనము - వీరేశలింగం సంఘ సంస్కార పరాయణత్వము :

వీరేశలింగం సునిశిత ప్రజ్ఞాశాలి. దార్శనికులు. అభ్యుదయ దృక్పథం గల మహనీయులు. ఈ మానవ మనోసాగర మధ్యన నవయుగారంభవేళ నిలబడిన నవమానవుడు. తొలి యూనివర్సల్ మాన్ కందుకూరి' అని కృష్ణశాస్త్రి ఆయనను కీర్తించారు. సంఘ సంస్కర్త. సంఘ సేవాపరాయణులు, పత్రికా సంపాదకుడు. వ్యవస్థాపకుడు, స్త్రీ జనోద్ధరణకు కంకణం కట్టుకున్నవాడు, బహుముఖమైన ప్రజ్ఞాశాలి కందుకూరి. అద్వితీయ ప్రతిభా సంపన్నుడు.

కందుకూరి రచనల్లో ఆయన ప్రహసనాలకొక ప్రత్యేకత ఉంది. సామాజిక రుగ్మతలను ఒక పెద్ద దుడ్డుకర్రతో మోదినట్లు మోదడానికి ఆయన ఉపయోగించిన ప్రక్రియ ప్రహసనాలు. ఆయనిది కరుకైన హాస్యం. సమాజాన్ని ఒకపెట్టున ఝుళిపించే ఆ ధోరణి హాస్యం ఆయన ప్రవసనాల్లో ప్రతిఫలించింది. తన ప్రహసనాలను గూర్చి స్వీయచరిత్రను కందుకూరి ఇలా ప్రస్తావించారు.

"ఏ విషయమునైన నేనితరులు చూపిన దారినే పోవువాడను గాక మనసు తిరిగినప్పుడు నా దారినే నేను నడుచువాడను నగుట చేత సులభవచన రచనా విషయములు యితరుల మాటలను పాటి చేయక నా నూతన మార్గానుసారముగా సంభాషణ రూపమున బ్రాహ్మవివాహమును వ్రాసి హాస్య సంజీవని మొదటి పత్రికలో కొంతభాగము ప్రకటించితిని. ఆ వరకు సంభాషణ రూపమున పుస్తకములు లేకపోవుట చేతనో పురుషులను స్త్రీలును పండితులును పామరులును బాలురును వృద్ధులును సూత దానినత్య జదువజొచ్చిరి. పుస్తకము వెలువడిన కొన్నిదినముల వరకు జనులు గుంపులు గుంపులుగా గూడి వీధియరుగుల మీద గూర్చుండి పకపక నవ్వుచుండిరి. మొదటి సంచిక ప్రకటింపబడిన తర్వాత రెండవ సంచిక వెలువడు లోపల వచ్చిన చందాదారుల సంఖ్య పేరులన్నిటిని బ్రకటించినచోనితర విషయముల కవకాశము లేక పత్రికయంతయు పేరులతోనే నిండునంత యధికమయి నందున పత్రికాను బంధముగా పౌరులను వేరొక కాగితము మీద ముద్రింపవలసిన వాడనైతిని. ఆ కాలమున బ్రాహ్మ వివాహమును సాధారణముగా జనులు పెద్దయ్య గారి పెండ్లి పుస్తకమని వాడుతూ వచ్చిరి. ఈ గ్రంథమును నేను కేవల వినోదము కొరకు మాత్రమే కాక అతి బాల్యవివాహము, వృద్ధ వివాహము, కన్యాశుల్కము మొదలైన దురాచారముల వలన యనర్థకములను జూచి జనులను వాని నుండి విముఖులనుజేయు తలంపుతో గూడ వ్రాసితిని" చాలా స్పష్టముగా 'బ్రాహ్మ వివాహము' రచనా ప్రయోజనాన్ని వీరేశలింగం ఇక్కడ స్పష్టం చేశాడు.

బ్రాహ్మవివాహము మొదటి కూర్పులోని పీఠికలో వీరేశలింగం ఈ ప్రహసనం కథావస్తువునూ, రచనా లక్ష్యాన్ని ఇలా పేర్కొన్నారు" మన దేశములలో నిప్పుడు జరుగుచుండెడు. దురాచారములలో వివాహ సమయమున నడిచెడియక్రమములు మిక్కిలి హేయములుగా గనబడుచున్నవి. సంబంధము లేశముగాని లేని యొక పురుషునకును కన్యకును బ్రతికి యున్నంత కాలమునన్యోన్య సుఖదుఃఖముల యందు వీడని సంబంధమును దెచ్చిపెట్టిడి వివాహమును మహాకార్యమును ఒక యల్పకార్యముగా నెంచి మన వారు పెక్కండ్రు దానిని బొమ్మల పెండ్లితో సమానమైన దానిగా జూజుచున్నారు. అందుచేత బెక్కుచోట్ల వివాహములు కన్యకల సౌఖ్యముకొఱకు చేయబడక తల్లిదండ్రుల వేడుక కొఱకును లాభముకొఱకును, మాత్రము చేయబడుచున్నవి. కొన్ని స్థలముల యందు వృద్ధులయిన దంపతులు తాము బ్రతికి యుండగానే బిడ్డల యొక్క పెండ్లి వేడుకను జూడవలెనని, తరువాత వారి గతి యేమగునో యను చింత యావగింజతయైన హృదయమున బెట్టుకోక అయిదారు సంవత్సరముల వయస్సు గల పుత్రునకుగాని మూడునాలుగేండ్ల ప్రాయము గల పుత్రికకుగాని వివాహమనగా నేమో యెఱుగని దశయందే వివాహ మహోత్సవములను జరిపించుచున్నారు. సొమ్ము పుచ్చుకుని తమ కన్యలను వృద్ధులకును అంగహీనుకలకును దరిద్రులకును విక్రయించి లాభము పొందెడివారిని నిందార్హులనుగాను పాపకర్ములనుగాను గణించి యగౌరవముతో జూడక వారినిగూడ నందఱితో సమానులుగానే చూచుచుండుట వలన బెరుగుచున్న యనర్థమింత యంతయని చెప్పనలవికాక యున్నది. మన శాస్త్రములు కన్యాశుల్కము దుష్యమయిన దనియు దానిని గ్రహించువారు పంక్తి భోజనమునకు గూడ నర్హులు కారనియు వేవిధముల ఘోషించి చెప్పుచున్నను, ఏమి కాలకర్మఘోషముననోకాని మనవారు శాస్త్రముల యందు బ్రమాణ బుద్ధిని విడిచి యాస్మృతి వచనములను పాటికిదేకున్నారు. ఈ బ్రాహ్మ వివాహము శుల్కము గైకొని కన్యను విక్రయించుటకు గూర్చియే వ్రాయబడి, అట్టి వివాహము వలన గలుగు నష్టములను కడపట నట్టి కన్యలను సంభవించు గతిని సూచనగా జెప్పుచున్నది. కాని నడుమ నడుమ సంబంధమునుబట్టి మన వివాహములలో సాధారణముగా జరిగెడి శాస్త్రసంబంధములేని దురాచారాలను జ్యోతిష్కులు మొదలగువారు చేయు మోసములును మఱికొన్ని యితర విషయములను గూడ తెలుపబడియున్నవి. ఇందు వ్రాయబడిన ప్రతి వాక్యమును నేదోయొక దురాచారమును వెల్లడి చేయుకొఱకు యుద్దేశింపబడియున్నది గాన దీనింజదువువారు వట్టి వేడుకకొఱకు మాత్రమే చదువక దాని యుద్దేశమును గూడ శ్రద్ధతో విచారింప గోరబడుచున్నారు. ఈ పుస్తకము యొక్క ప్రథమాంకమున సాధారణముగా (గొందఱు దంపతులకు గల యైకమత్యా భావమును చిన్నతనములో వివాహము చేయుటకును పెద్దవారికిచ్చుటకును చెప్పు కుత్సిల హేతువులను పెండ్లి బేరమును కుదిర్చెడివారు జేయు కుతంత్రములను శాస్త్రమిషమున స్వకపోల కల్పింతములయిన శ్లోకములను చదవి చేసెడి మోసమును గొంత సంగ్రహముగా (జెప్పబడినవి. ద్వితీయాంకమున

ముసలివాండ్రు తాము చిన్నపిల్లలను వివాహమగుటకు (జెప్పెడు కారణాభాసమును వివాహకార్యములలో జ్యోతిష్కులు చేయు మాయలను రాయబారులుగా నుండువారు ధనార్జనమునకయి చేయు కపట కృత్యములను కొంతవఱకు వివరింపబడియున్నవి. తృతీయాంకమున నిశాలగ్నము పెట్టుటవలన సంభవించెడి యిబ్బందులను పాతివ్రత్యము నేర్పదగిన యాకాలములో లంజలచేత సొమ్ము వ్యయపెట్టి బూతుపాటలు పాడించు దురాచారమును ఆపడుపు కన్నెల నుంచుకొన్నవారు పిలువనిదే వచ్చి దంభమునకయి వసువుగొనగుటము తదితరులు కూడ నొసగులిచ్చుటచేత గలిగెడి నష్టములను తెలుపబడినవి. చతుర్థాంకమున సభా తాంబూలములు సభాపతులని పిలువబడెడి నిరక్షరక్షుక్షులయిన బ్రాహ్మణనామధారులకులకు ముట్టుటయు అపాత్ర సంభావనక్రింద విశేషధనము వ్యర్థపఱచియు తిట్లుతిని యప్పులపాలయి పాడగుటయు వర్ణింపబడినవి; పంచమాంకమున భోజనమునకు వచ్చువారు వ్యర్థదంభమునకయి లాంతరులు మొదలగు వానికోసం ప్రయాస పడుటయు వేళకు రాక పలుమారు పిలిపించుకొనుటయు ఎంతసేపునకు రాని తప్పిదమును తమ యొద్దనుంచుకొని మీదు మిక్కిలి కొందరు పనియున్నను భోజనమునకు (గూరుచున్నవో కోపబడిలేచి పోవుటయు (బేర్కొనబడినవి. షష్ఠాంకమున రాత్రికాలమున నూరేగుట వలన పెండ్లి వారికిని పరులకును గూడ నిద్రాభంగము మొదలైనవి సంభవించికలిగెడి చెడుగులును, వసంతోత్సవ సమయమున ( బెండ్లి వారిలోనే కాకితరులలో (గూడ జరిగెడి యనాగరికములైన మోటు పనులును, మానవ ప్రకృతికనర్హములైన పరియాచకములను, సంతోష సమయమైన అప్పగింతవేళ నేడుపు మొదలుపెట్టు బుద్ధి హీనతయు, ముత్తదువు వలను వారి స్థితియు వాకొనబడినవి. సప్తమాంకమున ముసలివాండ్రకు పిల్లల నిచ్చెడి వారికి పుట్టు తలపులను, వారి చేష్టలను, ముసలివాండ్రను జేనికొన్నవారికి ( గడపట లభించు గతియును, జీవిత కాలములో వారి చర్యలును తేటపరుచబడినవి. దేశాభిమానులైన వారు ఇందలి భాగములను కొందరికి నేర్పించికాని, పుస్తకమును జూచియైన (జదివించిగాని జనసమూహము ముందఱ నాడించినచో, ఇందులో వివరించిన రీతిగల యక్రమములకు లోనగువారు కొంతవఱకు సిగ్గుపడి ముందు తమ ప్రవర్తనమును(జక్కచేసి కొందురనుటకు సంశయముండదు'' వీరేశలింగం. బ్రాహ్మవివాహ ప్రవాహనం లోని ముఖ్యకథాంశాలను అంకెల వారీగా ఈ విధంగా స్పష్టం చేశారు.

బ్రహ్మవివాహం ఏడంకాల ప్రహహనం. ప్రతి అంకంలోనూ సమాజాన్ని పట్టి పీడించే అనేక రుగ్మతలను వీరేశలింగం ప్రస్తావించారు. ఆనాటి కుహనా సంప్రదాయాలను గర్హించారు. మొదటి అంకంలో కామయ్య అజ్ఞానమ్మలు పిల్ల పెళ్ళి ప్రస్తావన తెస్తారు. వీరేశలింగం పంతులుగారు కామయ్య, అజ్ఞానమ్మ సేవల్లోనే ఆ పాత్ర స్వభావాన్ని ధ్వనింపజేశారు. డబ్బుకాశపడి కూతురుని ముసలివానికిచ్చే ధనాశాపరుడుకామయ్య. అతని ప్రయత్నానికి వంత పాడిన స్త్రీ లోకజ్ఞానం లేని అజ్ఞానమ్మ. తమ ప్రాణాలు బొందెలో వుండగానే పిల్లదాన్నియే అయ్యవొళ్ళోనో పెట్టేస్తే అవతల ఉభయుల అదృష్టం యెల్లావుంటే అల్లా జరుగుతుందని వాళ్ళ భావన. అందుకు పుల్లయ్య సహకారం కోరతారు. అన్నదమ్ములున్నారని, డబ్బులేదనీ వచ్చిన మంచి సంబంధాలనొదులుకొని నాల్గవ పెళ్ళికి సిద్ధమైన పెద్దయ్యకు కన్యాశుల్కానికాశించి పిల్లనియ్యడానికి కామయ్య సంసిద్ధుడవుతాడు. ''పెద్దయ్యగారికి వివాహ మహోత్సవం కంటే ద్విజార మహోత్సవం చేస్తే బాగా వుంచుంది' పెద్దయ్య పెళ్ళి పాలకీ యెక్కడం కంటే యేడుకట్ల పాలకి యెక్కి వూరేగితే దివ్యంగా వుంటుంది'' అనుకుంటారు తమలో తాము పెండ్లి కుమార్తె బంధువులైన పిచ్చయ్య, పుల్లయ్య. అజ్ఞానమ్మ మొదట తన అన్న కొడుకు నలభైయేళ్ళ వాడికి పిల్లనివ్వమని పోరుపెట్టినా భర్త కామయ్య నగలుకొని పెడతాడనీ, పడుకోవడానికి పరుపూ, మంచమూ చేయిస్తాననీ అని ప్రలోభపెట్టడంలో పెనిమిటి అజ్ఞ మీరినానని వట్టి రవ్వ నాకెందుకు ! వేగిరం ఆయన యిష్టం వచ్చినవారికి పిల్లదాన్ని యిచ్చి వివాహం చెయ్యమనండి. ఆయనకేది సమాధానమో నాకు అదే సమాధానము'' అంటూ అంగీకారాన్ని తెలియజేస్తుంది.

కన్యాశుల్కాన్ని సమర్థించే ప్రయత్నం కూడా ఈ అంకంలో కనబడుతుంది. డబ్బుకాశపడి కొందరు బ్రాహ్మణ నామధారులు చేసే దుష్టపన్నాగాలను వీరేశలింగం ఈ అంకంలో ప్రస్తావించారు. ''డబ్బు పుచ్చుకుని పిల్లదాన్ని యివ్వవచ్చునా ? పెద్దలందరూ కన్యాశుల్కం కూడదంటారు. యెందుచేత అన్న కామయ్య ప్రశ్నలకు ''ముసలివాడికి బిడ్డను యిచ్చినందువల్ల

లేశమూ దోషమూలేదు. దానివల్ల విశేషించి ఫలం కూడా వున్నది. పడుచువారికి లోకంలో అందరూ కన్యను యిస్తారు. అదివొక ఫలం లోదికాదు. ముసలివారికి పిల్లను యివ్వడమే యివ్వడము. పదివేలు పుచ్చుకొని అయినా వక్కపెద్ద బ్రాహ్మడి యిల్లు నిలబెడితే దానివల్ల కోటికన్యాప్రదానాలు చేసిన ఫలం చులాగ్గా లభిస్తుంది అంటూ శాస్త్రప్రమాణం పేరిశాస్త్రులు ఉటంకిస్తాడు. తాము చేసే దుష్టప్రయత్నాలకూ, స్వార్థపూరిత చర్యలకు శాస్త్ర ప్రమాణాన్ని అంటగట్టటాన్ని వీరేశలింగం ఈ ప్రహసనంలో విమర్శించారు. తాము చేసే అవినీతి పూరితమైన కార్యాలకు పేరిశాస్త్రుల వంటి వారు ఆశించేది 'చెవులకు కుండలాలజోడు'. పేరుకు వైదికస్వాములు, చేసేవన్నీ పనికిమాలిన పనులే. ఆ రోజుల్లో డబ్బుకాశించి దొంగ సాక్ష్యం చెప్పడాన్ని కూడా బ్రాహ్మవివాహం ప్రథమాంకంలో పంతులుగారు పేర్కొన్నారు. "ఈ రోజున మాకు కోర్టులో సాక్ష్యం తొందరవకటి వున్నది. ఆలస్యంగా వెళితే నాలుగు రూపాయలు దొరికే సొమ్ముపోతుంది. వచ్చే లాభం పోగా మీది మిక్కిలి మునసపు గారు వేళకు వెళ్ళనందుకు జునుమానా కూడా వేస్తారు. యింకా ప్లీడరు వద్దకుపోయి యేమి సాక్ష్యం చెప్పవలెనో నేర్చుకోలేదు" అంటాడు వైదికస్వాములవారు. వీరేశలింగం గారి ప్రహసనాలు నాటి సమాజ పరిస్థితులకు అడుగడుగునా అద్దంపడతాయి.

డబ్బు కోసం వృద్ధ వివాహాలను ప్రోత్సహించే వారు ఆనాటి సమాజంలో అడుగడుగునా తారసపడతారు. అటువంటి వ్యక్తులకు ప్రతిరూపాలు పరమేశ్వరావధానులు, నీలకంఠ సోమయాజులు స్వార్థంతో ముసలి పెండ్లి కొడుకుల జాతకాలను తిరిగిరాయించడం బ్రహ్మవివాహ ప్రహసనంలో ఒక ముఖ్యాంశంగా వీరేశలింగం ప్రస్తావించారు. పెండ్లికొడుకు పెద్దయ్య చూపిన ధనాశతో బొజ్జయ్య సిద్ధాంతి పాతతీటాకు ముక్కను సంపాదించి, తనవ్రాత తెలియకుండా యెడంచేత్తో పట్టివ్రాసి, పొగచూరబెట్టి సంపూర్ణాయుర్దాయం వేసి పెద్దయ్య జాతకాన్ని తయారుచేస్తాడు. 'వివాహ విషయంలో ఎన్ని అబద్ధాలాడినా దోషం లేదు. వృద్ధ బ్రాహ్మడికి కన్యాదానం చేయించడం గొప్ప పుణ్యం" అంటూ 'మార్గదర్శి శుద్ధ చవితి గురువారం రాత్రి మాత్రమే ముహూర్తం' అని నిర్ణయించడం కూడా ధనాశతోనే. అటువంటి వ్యక్తులకు ప్రతినిధి బొజ్జయ్య సిద్ధాంతి.

ప్రహసనానికి హాస్య స్ఫోరకత్వం ముఖ్యలక్షణం. ముసలి పెళ్ళికొడుకు పెద్దయ్యపడే అవస్థలు పాఠకులకు నవ్వుతెప్పిస్తాయి. శరీరం మీది ముడుతలు కనబడకుండా దేహం నిండా బట్ట కప్పుకోవడం, శాలువు చుట్టుకోవడం, పెండ్లి సమయంలో చన్నీళ్ళ స్నానంవల్ల మాట లేకుండా పడిపోవడం, శరీరం కొయ్యబారిపోవడం నవ్వు తెప్పిస్తాయి. ఇక ఊరేగింపు సమయంలో పెళ్ళికూతురు చిన్నపిల్ల కాబట్టి నిద్రపోవటం, నిద్రలేపినందువల్ల ఏడవడం, పెళ్ళికూతుర్ని ఎత్తుకొని వచ్చి పల్లకీలో కూర్చుండబెట్టడం, రాత్రి సమయం కాబట్టి అజ్ఞానమ్మకు తేలుకుట్టడం, వర్షం కారణంగా పెళ్ళి కొడుకునూ, పెండ్లి కూతురునూ పీనుగుల పేరయ్య, కొండయ్య ఎత్తుకోవడం, పెళ్ళికూతురు బుక్కాపొయ్యలేదు కాబట్టి కొండయ్య బుక్కాపొయ్యడం, వసంతంలో మునిగి పెద్దయ్య ఉక్కిరి బిక్కిరి అవ్వడం, పెద్దయ్య మోకాలు కొట్టుకపోవడం మొదలైన అంశాలన్నీ నవ్వుతెప్పించేవే. అడుగడుగునా పాఠకుణ్ణి నవ్వించడం తద్వారా సాంఘిక దురాచారాల పట్ల ఎగతాళినీ, నిరసననీ ప్రకటించడం, 'బ్రాహ్మవివాహం' ప్రహసనం ద్వారా వీరేశలింగం ఆశించిన ప్రయోజనం.

వీరేశలింగం తన కాలంనాటి సంఘంలోని కుటిలత్వం, దౌర్జన్యాలు, అవినీతి, దుర్మార్గాలను తన ప్రహసనాల ద్వారా బట్టబయలు చేశారు. బాహాటంగా వేళాకోళం చేశారు. ఆనాటి సామాజిక వ్యవస్థను ఏమాత్రమూ సమర్థించలేదు. సమాజస్థితిగతులు పట్ల తీవ్ర అసహనం, నిరసన వ్యక్తం చేశారు. తనకాలంనాడు ప్రబలంగా ఉన్న పడుపువృత్తిని తన ప్రహసనాల్లో ప్రస్తావించారు. ఆ రోజుల్లో పుడపువృత్తి అంత బలంగా వుండటానికి ఆనాటి బాల్యవివాహాలు కారణం. దంపతుల మధ్య చాలా ఏళ్ళ వ్యత్యాసం ఉండటం, స్త్రీలలో చదువు సంధ్యలు, లోకజ్ఞానం లేకపోవడం, పురుషుడికి సమఉజ్జీగా జీవిత కార్యకలాపాల్లో పాల్గొనే అవకాశం లేకపోవడం వంటి ఇతర కారణాల వల్ల కూడా భార్యాభర్తల మధ్య ఉండాల్సిన సంస్కారపూరితమైన, స్నేహపూర్వకమైన వాతావరణం ఉండేదికాదు. అంతేకాకుండా పురుషుణ్ణి స్నేహంతోనూ,సంస్కారంతోనూ ఆకట్టుకోగల గృహసామాజిక వాతావరణం కూడ ఆనాటి సంఘంలో మృగ్యం కావడంవల్ల కూడా పురుషులు వెలయాలి సంపర్కాన్ని ఆశించేవారు.

అది ఆ రోజుల్లో సులభంగా ప్రాప్తించింది. సమాజం కూడ గర్హించేది కాదు. సంఘంలో డబ్బు, పలుకుబడి వున్నవారి ప్రాపకం వల్ల వేశ్యావృత్తి బాగా విస్తరించి వుండేది.

వేశ్యావృత్తిని వీరేశలింగం బాగా వ్యతిరేకించారు. ఈ వేశ్యావృత్తి ప్రాబల్యం వల్లనే బాల్యవివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం, వరశుల్కం వంటి దురాచారాలు సంఘంలో వ్యాపిస్తున్నాయనీ, అందువల్ల సంఘం కుదురు చెడిపోతున్నాదనీ, సర్వనర్థాలకు యీ వేశ్యావృత్తి కూకటివేరు అనీ వీరేశలింగం కలంచెంది పడుపువృత్తి నిర్మూలన కోసం తన ప్రహసనల ద్వారా ప్రయత్నించారు. అనేక ప్రహసనాల్లో, వ్యాసాల్లో ఈ విషయాన్ని చర్చించాడు. సమాజంలో సంపన్నతకు, ఉన్నత స్థాయికి రసికతకు గౌరవానికి వేశ్య నుంచుకోవడం చిహ్నం కావడం, అందుకు సాంఘికామోదం లభించడం వీరేశలింగం సహించలేకపోయాడు.

బ్రాహ్మ వివాహంలో కూడా వేశ్యల చేత సొమ్ము యరపెట్టి బూతుపాటలు పాడించు దురాచారమును, ఆ వేశ్యల నుంచుకున్నవారు పిలువనిదే వచ్చి ఆడంబరం కోసం వేశ్యలకు రూపాయలు తాంబూలంలో పెట్టడం వర్ణించాడు. బట్టతల - అలివేణి, సొట్టకాలి - హంసాయన, చికిలికన్నుల - చకోరాక్షి, నత్తినోటి - మంజువాణి ఆ వేశ్యల పేర్లలోనే హాస్యం పుట్టించారు వీరేశలింగం పంతులు' వేశ్యలకు తాంబూలంలో వసూళ్ళు చదివించడానికి ఆ కాలంనాటి పెద్ద మనుషుడు పడేపాట్లను 'కంచుచెంబు తాకట్టు పెట్టి తెచ్చే రుణాలనూ' బ్రాహ్మవివాహం తృతీయాంకంలో ప్రస్తావించారు. అలా డబ్బులు ముట్టజెప్పని కారణంగా 'కోమటి సబ్బిశెట్టి తహశ్శీలుదారుగారి యింట్లో వసూలుచెయ్యక పోవడంచేత, ఆమర్నాడు గుమ్మంలో వెంట వున్నదన్న వంకపెట్టి నాల్గురూపాయలు జరుమానా వేశారు. ఆనాటి సమాజాన్ని పట్టి పీడించిన భోగం మేళాలపట్ల నిరసన బ్రాహ్మవివాహంలో కనపడుతుంది.

సమజంలో వేశ్యావృత్తి పట్ల వీరేశలింగం తన అభిప్రాయాలను స్పష్టంగా తెలియజేశారు. "దేశమజ్ఞాన దశయందుడిన కాలములో సాధారణముగా జనుల మౌఢ్య మహిమ చేత నిట్టియాచారములు మొట్టమొదట నుద్భవమొందును; పిత్రాచారమన్న గౌరవమునుబట్టి యాలోచన మాని తెలివిగలవారు సహితమాచరించుచు రాగా కొంతకాలమునకా మూఢాచారములు శిష్టాచారములగును; అటువంటి స్థితిలో బుద్ధిమంతులైన యార్యపురుషులు బయలుదేరి యంధపరం పరగా జనులాచరంచెడి యాచారములనే తాము నవిచార పూర్వకముగా ననుసరించుచువానిని దమకు జీవనాధారములుగా మార్చుకొని లాభకరములయిన యట్టి యత్తమాచారములను గల్పించిన పూర్వుల బుద్ధిసంపదను శ్లాఘించుచూ స్వార్థపరత్వముతో వానికి హేతుకల్పనము చేసి పుస్తకములను రచించి పామరులను మోహింపజేయుదురు. దురాచారము లెప్పుడును బ్రవేశించినంత సులభముగా వదిలిపోవు" అని జ్యోతిశ్శాస్త్ర గ్రంథానికి పీఠిక వ్రాస్తూ పంతులుగారు అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు.

వేశ్యలనే పేరుపెట్టి కొంతమంది స్త్రీలను భోగ వస్తువులుగా ఉపయోగించుకోవడాన్ని కందుకూరి తీవ్రంగా ఖండించారు. వేశ్యలను పెళ్ళిళ్ళకుపిలవడం, భోగం మేళం పెట్టడాన్ని వ్యతిరేకించాలని ప్రచారం చేశారు. వేశ్యల వల్ల డబ్బు, ఆరోగ్యం గౌరవం పోయి కుటుంబాలుపాడవుతాయి. కాబట్టి వేశ్యావృత్తిని ఆయన తమ ప్రహసనాల ద్వారా అధిక్షేపించారు. ఎగతాళి చేశారు. తీవ్రంగా వ్యతిరేకించారు.

బ్రహ్మణుల సంభావనం పేరుతో ఆనాటి సమాజంలో జరిగే ఆచార వ్యవహారాలను కూడ బ్రాహ్మ వివాహంలో కందుకూరి వ్యతిరేకించారు. సంభావన సరిగా యివ్వలేదని పేరూరునుంచి వచ్చిన బ్రహ్మణులు తోరణాలు తెంపివేసి కన్నయ్య సెట్టిని మీద పడి కొట్టడానికి సిద్ధమయినారు. "అంటూ వేదుల వెంకయ్య "నేను వాళ్ళను బతిమాలుకొని నాలుగు రూపాయలు కన్నయ్య సెట్టి చేత ఇప్పించి కలహం నివారించి వచ్చేటప్పటికి యింతసేపయినది. అందులోన కూడా రెండు రూపాయల సొమ్ము లభించింది." అంటారు చతుర్థాంకంలో.

సంభావన పుచ్చుకున్న వాళ్ళే కొందరు మళ్ళీ మళ్ళీ వచ్చి రెండు మూడు త పర్యాయాలు పుచ్చుకోవడం, శంకర శాస్త్రి వేశ్య యింటికి పోయి సంభావన వేళకు రాలేకపోవడం, ఆ సంభావనలు పుచ్చుకోవడానికి విశిష్టాద్వైత, అద్వైత, ద్వైత మతావలంబులు

పోటీ పడటం, బ్రాహ్మణుల సంభావన కవసరమైన ధనం కోసం పెండ్లి కుమారుడు పెద్దయ్య భూమి తాకట్టు పెట్టి బదులు తెప్పించడం, ఆ సంభావన కోసం బ్రాహ్మణులు లోపల దూరి దొమ్మినెయ్యడం మొదలైన ఆనాటి సమాజ స్థితిగతులను వీరేశలింగం బ్రాహ్మణ వివాహ ప్రహసనంలో చిత్రించాడు. ఈ సందర్భంలోనే ఆయన ప్రజలను అజ్ఞానంలోను అమాయకత్వంలోను ఉంచడానికి శిష్టాచారం పేరుతో, శాస్త్రాన్ని ఉటంకిస్తూ మత సంప్రదాయాల మహాత్మ్యం చూపి తమపబ్బం గడుపుకునే స్వార్థపరులను కూడా ఈ ప్రహసనంలో తీవ్రంగా వీరేశలింగం గర్హించారు. చతురార్థకంలో భాగవతుల, పాపయ్య శంకర శాస్త్రుల సంభాషణలో ఈ విషయం ప్రస్తావించడం జరిగింది.

భాగవతుల పాపయ్య శాస్త్రితో "ఈ నడుమ నీవేమో కామయ్యగారి దగ్గర ముసలి వాడికి కన్యను యిచ్చి చిన్నదాని బరువు కంటె రెండు రెట్లుగా ధనం పుచ్చుకోవచ్చుననీ, ముసలి బాహ్మణుడికి కన్యనిచ్చి ధనం పుచ్చుకున్న వారికి కోటి కన్యా ప్రదానాల ఫలం కలుగుతుందని, రెండు స్మృతి వచనాలు చదివినావట ! వక ముసలి బ్రాహ్మణుడికి కన్యను మాట్లాడవలసి వున్నది. ఆ శ్లోకాలు యేస్మృతిలోవో చెప్పినాకు వ్రాసియిస్తావా ?" అంటాడు. అందుకు సమాధానంగా శాస్త్రి "కామయ్యగారిని వొప్పించడానికి వేయిదినాలు కష్టపడి నేనే ఆ శ్లోకాలను కల్పించినాను". అంటాడు. (చతుర్థంకము) శాస్త్రం పేరుచెప్పి బ్రాహ్మణవర్గం స్వార్థ ప్రయోజనాలతో పన్నిన కపటోపాయాలను వీరేశలింగం గారి ప్రహసనంలో బట్టబయలు చేశారు. పెండ్లి భోజనాలకు వచ్చేవారు డాంబికంగా లాంతర్లకోసం ప్రయాస పడటాన్ని "లాంతరు పరువుకోసం గాని వెల్తురు కోసం కాదు" (పంచమాంకం) అనడం ద్వారా రచయిత నాటకంలో వ్యక్తం చేశారు. పలుమార్లు భోజనానికి పిలవవలసిన అవసరాన్ని కామావ ధానులు" మూడు నాలుగు సార్లు కాదు. వందసార్లు పిలవాలెను. మొన్న బుచ్చయ్య పంతులుగారింట్లో పదిసార్లు పిలిపించుకొని మరీ భోజనానికి వెళ్ళినాను. వెనక సోమనాధ శాస్త్రి గారి లోపల నేను వచ్చేవరకూ కనిపెట్టుకుని వుంటారో లేదో చూతామని వడ్డనయిం తరువాత కూడా మూడు ఘంటలు ఆలస్యం చేశాను" (పంచమాంకం) అని గుర్తుచేస్తాడు. ఇదంత ఆనాటి అర్థంలేని వేషాలకు ప్రతిబింబంగా తమ ప్రహసనంలో రూపకల్పన చేశాడు.

బ్రాహ్మ వివాహ ప్రహసనంలో వీరేశలింగంపంతులు గారు ముఖ్యంగా చర్చించిన విషయం కన్యాశుల్కం, అతిబాల్యవివాహాల పర్యవసానం. బాల వితంతువు సమస్యను గుర్తించి విధవా వివాహాలను ప్రోత్సహించారు. కన్యాశుల్క దురాచారాన్ని, బాల - వృద్ధ వివాహాలనూ సమర్థించిన సమాజాన్ని జాగృతం చేశారు. అతి బాల్య వివాహాలవల్ల, వయోభేదాలతో వివాహాల వల్ల స్త్రీలలో వ్యభిచారం అధికమవడం ఆయన సమాజంలో గమనించారు. ఆయన స్త్రీల నైతిక పతనాన్ని ఆపడానికి 'వితంతు వివాహాలు' పరిష్కారమని వాదించారు. "స్త్రీలలో లోపమేదియు లేదు. మూడేండ్ల ముండలు మగడుపోయిన తరువాత ఏదో యొక విధమున కోరిక తీర్చుకోక ఉప్పును, పులుసును తిను దేహముతో ఎంత కాలము తిన్నగా ఉండగలదు" అని ప్రశ్నించారు. "వయసులోనున్నప్పుడు సహితము పెండ్లి చేసికొన కుండుటకు స్త్రీ గ్రహచారమేమికలిగినది" అని సమూహాన్ని ఆయన నిలదీశాడు. "భార్యలు చచ్చిన తరువాతనే కాక వారు జీవించి యున్న కాలంలో సహితము తాము మనసుకు నచ్చినంతమంది స్త్రీలను వివాహము చేసికోవచ్చునట. అట్లు చేయుట భార్యలకవమానము కాదట." అంటూ సనాతనుల ప్రవర్తనను గర్హించారు. స్త్రీల పట్ల సమాజం ప్రదర్శిస్తున్న ద్వంద్వ వైఖరిని దుయ్యబట్టారు.

స్త్రీల నైతికత పతనం కావడానికి తల్లిదండ్రులూ సమాజం కారణం అన్న అంశాన్ని బ్రాహ్మవివాహంలో స్పష్టంగా వీరేశలింగం ప్రకటించారు. ముసలి పెళ్ళికొడుకు పెద్దయ్య అల్లుడైతే తల్లిదండ్రులైన కామయ్య, అజ్ఞానమ్మ ఆ డబ్బుకు 'అఱ్ఱులు సాచి' ఇకనయినా పెద్దయ్య వేగిరం చస్తే బాగుండును. పాపిష్టి దేముడు ముసలి వాళ్ళకు ఆయువు విశేషంగా పోస్తాడు. మొన్న సీతారామస్వామి వారి కోవిలకు వెళ్ళినప్పుడు పెద్దయ్య వేగిరం పోతే గరుడవాహనం చేయిస్తానని మ్రొక్కుకున్నాను." అంటారు. కన్న కూతురు త్వరలో విధవ కావాలని కోరుకున్న తల్లిదండ్రులు కామయ్య, అజ్ఞానమ్మ.

మూడేళ్ళ వయస్సులో ముసలి పెద్దయ్యను వివాహం చేసుకున్న కామయ్య కుమార్తె చరిత్ర ప్రహసనం సప్తమాంకంలో స్పష్టం చేశారు రచయిత. పెళ్ళినాటికి ఆమెకు మూడేళ్ళు. భర్త పెద్దయ్యకు అరవై సంవత్సరాలు. పెళ్ళి అయిన తర్వాత కూడా

పది సంవత్సరములు పెద్దయ్య బ్రతికినాడు. పెద్దయ్యకు భార్యకు వయసు వచ్చిన కొద్దీ విచారం ఎక్కువ కావడం మొదలు పెట్టింది.

ఆమె సమర్తాడిన మర్నాటినుంచీ భార్యయొక్క నవ్వుమొగం చూచినప్పుడెల్లా తెల్ల తెల్ల బోతూ, ఆవిడ యవ్వనం తలచుకుని దిగులు పడుతూ, బెంగపెట్టుకుని, క్షీణించి పెద్దయ్య లోకాన్ని వీడినాడు. పెనిమిటి మరణానంతరం ప్లీడరుతో శారీరక సంబంధం పెట్టుకుని కొడుకుని కంటుంది. చెరువుగట్టుమీద చంపబడ్డ అప్పుడే పుట్టిన పురుష శిశువు దానికి సాక్ష్యం. పెద్దయ్య ఆస్తి రొక్కం చేసుకుని చిన్నమ్మ తల్లిదండ్రుల మరణం తర్వాత సర్వస్వతంత్రురాలై విచ్చలవిడితో ప్రవర్తిస్తూ, తనతోపాటు ఎందరో స్త్రీలను వేశ్యావృత్తిలో దింపుతుంది. వైద్యులు కూడ ఆమెకు మిత్రులు కావడంతో వీరు తమ శక్తి యుక్తులతో ఆమెకు శిశు హత్యాదోషం అంటకుండా గర్భంలోనే పిండాల్ని తొలగించే ప్రయత్నాలు చేస్తారు. ఇంత చరిత్ర వున్న ఆమె ఆమె సమాజంలో మహా పతివ్రతగా ఎంచబడుతుంది. ఊర్లో ఆమె లేకుండా వ్రతం జరగదు. ఆమెకు వచ్చిన నీతులు లోకంలో యెవ్వరికీ రావు. పదిమంది చేరినప్పుడు తన పతివ్రతాధర్మం తానే వేయినోళ్ళ మెచ్చుకుంటూ లోకంలోని సంసార స్త్రీలందరూ వ్యభిచారం చేత పాడవుతూ వున్నారనీ తన మాటలు విని వారిని శిక్షించే నాధుడు లేక లోకం చెడిపోతూవున్నదనీ చెప్తుతూ వుంటుంది.'' (సప్తమాంకం) సమాజంలోని ఈ పరిస్థితికి చక్కని పరిష్కారాన్ని కూడ వీరేశలింగం పంతులు గారు ప్రహసనం చివర బంధకవి భానుమూర్తి ద్వారా "ఇటువంటి నష్టాలన్నీ తల్లిదండ్రులు డబ్బుకాశపడి కడుపున పుట్టిన బిడ్డలను ముసలివాళ్ళకు కట్టబెట్టడం వల్ల కలుగుతూ ఉన్నవి. కన్యా శుల్కం పుచ్చుకునేవార్ని పదిమందీ చేరి వెలివేస్తే బహునష్టాలు మానిపోతాయి.'' అని సూచించారు. వీరేశలింగం బాల్యవృద్ధ వివాహాలనూ, కన్యాశుల్క దురచారాన్ని అవహేళన చేస్తూ 1876 లో రచించిన బ్రాహ్మ వివాహం ఆ కాలపు సమాజంలో అత్యంత ప్రాచుర్యం పొందిన ప్రహసనం. అది అంతగా ఆదరణ పొందటానికి కారణం రచన సంభాషణ రూపంలో వుండడం ఒక కారణం.

### బ్రాహ్మ వివాహ ప్రహసనంలో వీరేశలింగం ప్రస్తావించిన ముఖ్యాంశాల క్రోడీకరణ :

1. కన్యాశుల్క నిరసన అతి బాల్య వివాహాల పర్యవసానాన్ని అవహేళన చెయ్యడం - తద్వారా సంఘ సంస్కరణ.
2. ఆనాటి బ్రాహ్మణుల స్వార్థ పూరిత ప్రవర్తనను గర్హించడం.
3. శాస్త్రం పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేయ్యడాన్ని గర్హించడం.
4. వేశ్యావృత్తిని వ్యతిరేకించడం.
5. సమాజంలోని డాంబికాచారాలను అవహేళన చేయ్యడం.
6. అతి బాల వృద్ధ వివాహాల ఫలితంగా సమాజంలో వితంతువులు నైతికంగా పతనం కావడాన్ని ప్రస్తావించడం.
7. కన్యాశుల్కం పుచ్చుకునేవారిని పదిమందిని వెలివేస్తే బహునష్టాలు మాసిపోతాయన్న పరిష్కారాన్ని సూచించడం.

### 6. ముగింపు : సంఘ సంస్కర్త - యుగ పురుషుడుగా వీరేశలింగం :

వీరేశలింగం పంతులుగారు తెలుగు జాతినుద్ధరించడానికి జన్మించిన కారణజన్ముడు. సంఘ సంస్కర్త. ఆయన ఆశయాలు ఆదర్శాలూ తెలుగు వారి జీవితాల్లో వికాసం నింపాయి. "అజ్ఞానంతో, అమాయకత్వంతో జీవిత సంస్కారం లేని ప్రజాసామ్యానికి విద్య, విజ్ఞానం, సమానత్వం, సంస్కారం కలిగించడానికి కృషివేయాలన్నది'' ఆయన ఆశయం, ఆదేశం.

అందుకే ఆయనను

"తన దేహము తనగేహము
తన కాలము తన ధనమ్ము తన విద్య జగ
జ్జనులకు వినియోగించిన
ఘనుడీ వీరేశలింగకవి జనులారా '' అని చిలకమర్తి కీర్తించాడు.

"తెలుగు జాతిని తెరలు తెరలుగ
కారుచీకటి కమ్మినప్పుడు
మూఢ ఛాందస గాఢ రుగ్మత
మూలుగుల్లో చొచ్చినప్పుడు
కాంతి భరం, కరుణ వైద్యం
కావ్యవాదిగ కావ్యశీలిగ
జాతి జనుల సముద్ధరించగ
జననమొందెను తెనుగు గడ్డను"-

అని ఆరుద్ర కందుకూరిని నుతించారు. నవ్యాంధ్ర నిర్మాతలనే నిర్మించిన వాడిగా కందుకూరి వీరేశలింగం పంతులుగారిని సంభావించారు ఆరుద్ర. ఆయన 'మానవ మహాసాగర మధ్యన నవయుగారాంబ వేళ నిలబడిన నవ మానవుడు, తొలి యూనివర్సల్ మ్యాన్' (కృష్ణశాస్త్రి)

## 7. మాదిరి ప్రశ్నలు / ఆకళింపు ప్రశ్నలు

1. 'బ్రాహ్మ వివాహం' ప్రహసనం కథావస్తువును వివరించండి.
2. 'బ్రాహ్మ వివాహం' రచన ద్వారా వీరేశలింగం ప్రబోధించిన సంఘ సంస్కరణ భావాలను సమీక్షించండి.
3. అతి బాల్య - వృద్ధ వివాహాలను, కన్యాశుల్కాన్ని అవహేళన చెయ్యడమే బ్రాహ్మ వివాహ ప్రహసనం లక్ష్యం - నిరూపిండం.
4. కామయ్య, అజ్ఞానమ్మల కుమార్తె చిన్నమ్మ జీవిత పరిణామాన్ని 'బ్రాహ్మవివాహం' చిత్రించిన తీరును వివరించండి.
5. బ్రాహ్మ వివాహం ప్రహసనం ఆధారంగా వీరేశలింగం సంఘ సంస్కరణ పరాయణాత్వాన్ని పరిచయం చెయ్యండి.
6. బ్రాహ్మ వివాహంలో నాటి సామాజిక దౌష్ట్యాలను వీరేశలింగం అవహేళన చేసిన తీరును వివరించండి.
7. బ్రాహ్మ వివాహ ప్రహసనంలో కామయ్య, అజ్ఞానమ్మల పాత్రల స్వభావాలను పరిచయాలనెయ్యండి.
8. పెద్దయ్య పాత్రను వీరేశలింగం బ్రాహ్మవివాహంలో రచయిత చిత్రించిన తీరును పరిశీలించండి.
9. సంఘసంస్కర్తగా వీరేశలింగం వ్యక్తిత్వాన్ని సమీక్షించండి.

## 8. సంప్రదించవలసిన రచనలు


1. వీరేశలింగం రచనలు - నాలుగవ సంపుటం. ప్రహసనములు - బ్రాహ్మ వివాహము - సంపాదకుడు. అక్కిరాజు రమాపతిరావు (సం॥) 1986 - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్. హైదరాబాద్.
2. వీరేశలింగం - డైరీలు, లేఖలు, జీవిత చరిత్ర - అక్కిరాజు రమాపతి రావు (సం॥)
3. వికాసలహరి - యువభారతి ప్రచురణలు
4. స్వీయచరిత్ర సంగ్రహము - కందుకూరి వీరేశలింగము - నేషనల్ బుక్ ట్రస్ట్, ఇండియా 1990 - అంతర భారతీయ పుస్తకమాల


**డా॥ పి. కుసుమకుమారి.**

పాఠం - 12

# వర విక్రయం

**పాఠ్య ప్రణాళిక :**

**12.0** ఉద్దేశ్యం

**12.1.** కవి పరిచయం

**12.2.** వరవిక్రయ నామౌచిత్యం

**12.3.** వర విక్రయం - ఇతివృత్తం

**12.4.** వర విక్రయం - స్త్రీ పాత్రలు

- **12.4.1** భ్రమరాంబ
- **12.4.2** సుభద్ర
- **12.4.3** కాళింది
- **12.4.4** కమల

**12.5.** వరవిక్రయం - సామాజిక సమస్య

**12.6.** వరవిక్రయం - దుష్ఫలితాలు

**12.7.** ముగింపు

## 12.0 ఉద్దేశం :

వరవిక్రయ నాటకాన్ని పరిచయం చేసి వరవిక్రయం అంటే ఏమిటో తెలియజేయడం, ఆధునిక సమాజంలో వరకట్న దురాచారం ఎంతగా పాతుకుపోయిందో తెలియజేయడం, కమల ఎలాంటి పరిష్కారమార్గాన్ని ఎంచుకుందో, వరకట్న నిర్మూలనకు ఆత్మహత్యలు పరిష్కారమార్గంకాదని, ధైర్యంగా నిలబడి పరిస్థితుల్ని ఎదిరించగలగాలని తెలియజేయడం.

## 12.1 కవి పరిచయం :

సమాజం సమస్యల వలయం. ఆ సమస్యలను అధిగమించి ముందుకుసాగటం మనిషి జీవితలక్ష్యం. అలా మనుషులను ముందుకు సాగిపోవటానికి వారు ఆలోచించి చైతన్యవంతులవటం ప్రధానాంశం. ప్రజలు చైతన్యవంతులై, తమ బాధ్యతలను గుర్తించి సక్రమ మార్గంలో పయనించటానికి ప్రతికాలంలోనూ కొందరు సంఘ సంస్కర్తలు, దార్శనికులు ప్రజలకు ప్రబోధం చేస్తూనే ఉన్నారు. అలా ప్రజలకు ఉద్బోధం చేసి వారిని చైతన్యవంతులను చేసిన సంఘ సంస్కర్తలు కందుకూరి, గురజాడ మొదలైన వారు. వారి బాటనే అనుసరిస్తూ సమాజ సంక్షేమానికి పాటుపడిన మహావ్యక్తి, మహాకవి శ్రీ కాళ్ళకూరి నారాయణరావు. ఆనాటి సమాజంలో అనేక దురాచారాలున్నాయి. కాళ్ళకూరి కాలం నాటికి మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న సమస్యలు వేశ్యావృత్తి, వరకట్నం, మద్యపానం. వీటన్నిటిని ఇతివృత్తాలుగా స్వీకరించి రచనకు పూనుకున్నారు. బ్రహ్మర్షి రఘుపతి వేంకటరత్నం గారి శిష్యుడై, బ్రహ్మ సమాజంలో చేరి సర్వ మానవ సమానత్వాన్ని ప్రచారం చేశారు. వితంతు పునర్వివాహం చేయాలని సంకల్పించి బాల వితంతువైన తన సోదరికి పునర్వివాహం చేయదలచి తండ్రితో గొడవపడి ఇల్లు విడిచి వెళ్ళిపోయాడు. 'పట్టి మాటలు కట్టి

పెట్టవోయ్! గట్టి మేల్ తలపెట్టవోయ్!' అన్న గురజాడ మహాకవి వాక్యాన్ని అనుసరించి కట్నం లేకుండా వర్ణాంతర వివాహం చేసుకుని సంఘ సంస్కర్తలకు ఆదర్శప్రాయుడయ్యాడు. వ్యక్తులు ఆలోచించి ఆచరించడానికి, వారి మనస్తత్వాలను మార్చటానికి నాటక సాహిత్యం ఎంతో ఉపకరిస్తుందని భావించి సాంఘిక దురాచారాలలో ముఖ్యమైన వేశ్యావృత్తి, వరకట్నం, మధుపానం అనే మూడు దురాచారాలను నిర్మూలించడానికి కలాన్ని ఆయుధంగా చేసుకొని రచనలు సాగించారు శ్రీ కాళ్ళకూరి.

కాళ్లకూరి నారాయణరావు పశ్చిమ గోదావరిజిల్లా మత్స్యపురిలో క్రీ.శ. **1871** ఏప్రిల్ **28** వ తేదీన కాకినాడ లో ప్రసిద్ధమైన పండిత వంశంలో పుట్టారు. వీరి తల్లిదండ్రులు పూర్ణమాంబ, బంగారు రాజు. బాల్యం నుంచే విద్యార్జనలో చురుకుగా ఉండి కావ్య శాస్త్ర నాటకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. మేథా దక్షిణామూర్తి భక్తులైన నారాయణ రావు ప్రాచీన సాహిత్యంపై గల అభిమానంతో పౌరాణిక నాటక రచనను ప్రారంభించారు. వీరు కొన్ని అష్టావధాన శతావధానాలు కూడా చేశారు. "మనోరంజని" అనే పత్రికను స్థాపించి సంపాదకత్వం నిర్వహించారు. వర విక్రయంలో వరకట్న సమస్యను, చింతామణిలో వేశ్యా సమస్యను, మధుసేవలో మద్యపాన సమస్యను నాటకీకరించారు. **1909** లో రచించిన చిత్రాభ్యుదయం వీరి మొదటి నాటకం. ఈయన గ్రంథాలన్నీ బుద్ధిరాజు వీరభద్రరావు గారికి అంకితం ఇచ్చినట్లు ఉన్నాయి. వీరు తన పౌరాణిక రూపకాలను, నాటకాలను, సాంఘిక రూపకాలను ప్రకరణాలు అని పేర్కొన్నారు. వీరి రచనలన్నీ సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి చేసినవే.

సమకాలీన సమస్యలపై ఎప్పటికప్పుడు పాత్రలచేత విమర్శలు చేయించడం వీరి రచనలలోని ప్రత్యేకత. భాష సమకాలీన వ్యవహారిక భాషకు దగ్గరగా ఉంది. జగద్గురు శంకరాచార్యులు వీరిని మహాకవి బిరుదంతో సత్కరించారు. ఫొటోగ్రఫీ, ఆయుర్వేదం, యోగాభ్యాసం, నటన మొదలైన రంగాలలో ప్రతిభ కనబరచారు. ఉపాధ్యాయవృత్తిని అవలంబించారు.

సమాజంలోని సమస్యలన్నింటినీ గమనించి సమస్యల తీవ్రతను గుర్తించి తన రచనల ద్వారా సమాజాన్ని మార్చటానికి కాళ్ళకూరి నారాయణరావు గారు చేసిన కృషి అభినందించదగ్గది. సామాజిక దురన్యాయాలపై రణభేరి మ్రోగించి సమరం చేసిన కాళ్లకూరి రచయిత, మంచి నటుడు.

## 12.2. వరవిక్రయం - నామౌచిత్యం :

వరుడు అంటే పెళ్లికొడుకు, మగడు, ఊడు అని అర్థం. విక్రయం అంటే అమ్మకం లేదా విపణం అని అర్థం. వర విక్రయం అంటే పెండ్లికొడుకుని అమ్మడం. ఇది వరకట్నం అనే పేరుతో నేడు లోకంలో వ్యవహరించబడుతోంది. పెండ్లికొడుకు కోసం ఇచ్చే కానుక అని దీనికి అర్థం. దీన్నే అరణం అని కూడా అంటారు. అష్ట విధ వివాహాల్లో బ్రాహ్మము అనే వివాహాన్ని గురించి

**'ఆచ్ఛాద్యచార్చయిత్వాచ శ్రుతిశీలవతేస్వయమ్।**
**ఆహూయ దానం కన్యాయా బ్రాహ్మోధర్మః ప్రకీర్తితః**

అని మనుధర్మశాస్త్రం పేర్కొంది. అంటే వేదాన్ని పఠించినవాడు, సదాచారం గల బ్రహ్మచారిని స్వయంగా రప్పించి అతడిని నూతన వస్త్రాలచే అలంకరించి, వస్త్రాభరణాది కానుకలిచ్చి అలంకరించిన కన్యను దానం చేయడం బ్రాహ్మవివాహం గా పేర్కొన్నాడు మనువు. ఆనాటి వివాహ వ్యవస్థలో 'కట్నం' అనేది కానుకల రూపంలో మొదలై నేడు అది వరుని అమ్మేవరకు వ్యాపించింది.

వివాహ సమంలో అల్లుడికి, ఆడబిడ్డలకు ఇచ్చే ధనాన్ని 'అరణం' అంటారని శబ్దరత్నాకరం తెల్పుతోంది. దీన్ని బట్టి అల్లుడు గౌరవింపబడటమే కాక అత్త మామల నుండి కొంత ధనాన్ని కూడా బహుమతుల రూపంలో పొందేవాడని తెలుస్తోంది.

'కానుక' గా మొదలైన ఈ వరకట్నం అనేది కన్యలకు వారిని కన్నవారికి భారమై వారి జీవితాల పాలిట 'గానుగ' గా మారిందనడం సముచితం. 19 వ శతాబ్దంలో తెలుగునాట అనేక సాంఘిక దురాచారాలు ప్రబలిపోయాయి. ప్రపంచంలో అనేక నూతన ఆవిష్కారాలు, పరిశోధనల ఫలితాలు, పారిశ్రామిక విప్లవాల వల్ల ఎన్నో మార్పులూ వచ్చాయి. ఈ మార్పుల గాలి తెలుగువారి వీధుల్లో కూడా వీచింది. తెలుగువారి మనసులలోను మార్పును కలిగించింది. ఆనాటికి సంఘంలో బాల్యవివాహాలు, విధవా వివాహాలు, కన్యాశుల్కాలు అధికంగా ఉన్నాయి. వీరేశలింగం, గురజాడ మొదలైన వారు వాటిపై తిరుగుబాటు చేశారు. దాని ఫలితంగా కన్యాశుల్కం, బాల్యవివాహం, వితంతు వివాహ నిషేధాలు తొలగిపోయి వరకట్నం విజృంభించింది. దాని ప్రతిఫలమే వర విక్రయం నాటకం.

'వర విక్రయం' అనేది ఇతివృత్తంలోని ముఖ్య అంశాన్ని దృష్టిలో ఉంచుకొని పెట్టిన పేరు. వరకట్నం ప్రస్తుత సమాజాన్ని పట్టి పీడిస్తుంది. సంఘ వృక్షానికి పట్టిన వేరు పురుగు వంటి సమస్య ఇది. ఈ సమస్యను పరిష్కరించడానికి సంఘ సంస్కర్తలు ఎంతో కృషి చేశారు. ప్రభుత్వం చట్టాలు చేసినా ప్రజల మనసుల్లో మార్పు రానంతవరకు చట్టాలు ఏమీ చేయలేవు. కట్నం ఇవ్వమన్నారని గాని, కట్నం పుచ్చుకున్నాడని గాని, కట్నం ఇస్తున్నారని గాని ఇంతవరకు ఏ పోలీస్ స్టేషన్‌లోను ఒక్క కేసు కూడా నమోదు కాలేదంటే వరకట్నం సమాజంలో ఎంతగా పాతుకుపోయిందో అర్థమవుతుంది.

ఈ నాటకానికి 'వరకట్నం' అనే పేరు పెట్టవచ్చు. 'వరశుల్కం' అనీ పేరు పెట్టవచ్చు. ఆ రెండు పేర్లూ కాదనుకొని కాళ్ళకూరి వారు 'వర విక్రయం' అని పేరు ఎన్నుకున్నారు. కారణం వరుణ్ణి అమ్ముకోవటం అనేది స్పష్టం చేయడానికే.

వేలం వేయడమనేది వ్యాపారానికి సంబంధించిన అంశం. ఈ విషయంలో వ్యాపార కూడలిలో వస్తువులను వేలం వేసినా, సంతలో పశువులను వేలం వేసినా వేలంలో అమ్మకం జరిగాక రసీదులు పుచ్చుకుంటారు. వివాహం వ్యాపారం కాదు, వేలం వేయబడేది కాదు. ఇద్దరి మనసులు కలసి మనుగడ సాగించే బాధ్యతాయుత జీవన సాంగత్యం. కానీ ఈ నాటకంలో వివాహం వ్యాపారమై వేలం వేయబడింది. పెండ్లిండ్ల పేరయ్య, వివాహాల వీరయ్య ఈ వేలంలో ప్రధాన పాత్రలు వహించారు. వేలం పాటలో పురుషోత్తమరావుకు అల్లుడుగా అమ్ముడుపోయిన వ్యక్తి బసవరాజు. బసవరాజు పెంపుడు తండ్రి ఈ వేలం పాటకు అంగీకరించి పదిరూపాయలు బయానాగా తీసుకొని రసీదు రాసిచ్చాడు. పెళ్ళికి ముందే ఆ డబ్బును రాబట్టుకున్నాడు. ఈ విధంగా బేరమాడి వరుని ఒక వస్తువులాగా, పశువులాగా విక్రయించారు. కనుకనే 'వర విక్రయం' అనే పేరు ఈ నాటకానికి సమంజసంగా ఉంది.

## 12.3. 3వర విక్రయం - ఇతివృత్తం :

1923 లో కాళ్లకూరి నారాయణరావుచే రచించబడిన నాటకం ఈ వర విక్రయం. వరశుల్క, వరకట్న సమస్యలను చిత్రించిన రూపకం. అందుకే ఇది ఆయన రచనలు అన్నింటిలోను ఉత్తమ రచనగా పేరొందింది. వరశుల్కం కూడా కన్యాశుల్కంలాగానే సాంఘిక దురాచారం. ఈ రెండు శుల్కాలు ఒకదానికొకటి పరస్పరం విరుద్ధాలుగా కనిపించినా రెండింటిలోనూ బాధలు పొందింది స్త్రీ మాత్రమే. ఈ సత్యాన్ని ఈ నాటకంలో ప్రతిభావంతంగా చిత్రించారు నారాయణరావు.

వరకట్న వివాహాన్ని వ్యతిరేకించి ఆత్మత్యాగం చేసుకొంది కాళింది. తన అక్క ఆత్మ త్యాగం వృధాకారాదన్న కోరికతో కాళింది చెల్లెలయిన కమల అదే ఇంటికి కోడలుగా వెళ్ళి పిసినిగొట్టు మామతో మార్పును తీసుకురావటం ఈ నాటకంలోని ప్రధానేతి వృత్తం. కట్నపు పెళ్లి అంటే ఇష్టం లేని బాలిక కాళింది. ఆమెకు బసవరాజుతో వివాహం నిశ్చయమౌతుంది. సింగరాజు లింగరాజు పరమలోభి. కట్నకానుకలు, లాంఛనాలు ముందే వసూలు చేస్తాడు. అయితే కట్నం తీసుకొని పెళ్లికి సిద్ధమైన వరుని చేత మంగళ సూత్రం కట్టించుకోవటాన్ని గౌరవ హీనమైన పనిగా భావించి ఉత్తరం రాసి పెట్టి కాళింది బావిలో దూకి ఆత్మహత్య

చేసుకుంటుంది. కట్నంగా ఇచ్చిన సొమ్ము రాబట్టుకోవాలంటే రెండవ అమ్మాయిని బసవరాజుకిచ్చి వివాహం చేయాలని పెళ్లిళ్ల పేరయ్య సలహా చెప్తాడు. తల్లిదండ్రులైన పురుషోత్తమరావు భ్రమరాంబలకు ఇది ఇష్టం ఉండదు. అయినా చిన్న కూతురు కమల మాత్రం అందుకు అంగీకరిస్తుంది. కాళింది మరణ వార్త వార్తాపత్రికలలో రావడం, తోటి విద్యార్థులు హేళనచేయడం వంటి సంఘటనలు బసవరాజులో మార్పును తెస్తాయి. కమల తన యింటికి కాపురానికి రాలేదని, వివాహాన్ని రద్దుచేయవలసిందిగా బసవరాజు తండ్రి సింగరాజు లింగరాజు కోర్టులో వ్యాజ్యం తెస్తాడు. ఈ వ్యాజ్యం విచారణకు వచ్చిన సమయంలో కమల తన భర్తను తాను కొనుక్కున్నానని అందుచేత భర్త అయిన బసవరాజే తన యింటికి వచ్చి తన ఆజ్ఞానుసారంగా మెలగాలని కోర్టులో వాదిస్తుంది. న్యాయాధికారి ఆమె పక్షంగా తీర్పునిస్తాడు. కోడలు భర్తచేత పుస్తకాలు, సంచులు మోయించడం చూసిన సింగరాజు లింగరాజు బుద్ధితెచ్చుకొని తన అనుభవాన్ని ఇతరులకు చెప్పి వారికి కూడా హితబోధ చేయడంతో ఈ వర విక్రయ నాటకం ముగుస్తుంది. తెలుగువారి నాటి జీవన విధానాలు, ఆచార వ్యవహారాలు ముఖ్యంగా పెళ్లిళ్లలోని లాంఛనాలు మొదలైన అనేక విషయాలు ఈ నాటకం నుండి సమగ్రంగా తెలుసుకోవచ్చు. సమాజంలోని స్త్రీల దుస్థితిని, దానికి కారణభూతులైన పురుషుల మనస్తత్వాన్ని దర్పణంలో చూపిస్తూ పాఠకులకు ఆనందాన్ని, ప్రబోధాన్ని కలిగిస్తుంది 'వర విక్రయం' నాటకం.

## 12.4 వరవిక్రయం - స్త్రీ పాత్రలు :

పాత్రలు సమాజంలోని వ్యక్తులకు ప్రతిబింబాలు. ప్రతి పాత్ర చిత్రణలో వాస్తవిక జీవితాన్ని చూపించాలి. వర విక్రయం నాటకంలోని ప్రతి పాత్ర ఆనాటి సమాజాన్ని, సమాజంలోని వ్యక్తుల జీవిత సమస్యలను ఆధారం చేసుకొని సృష్టించిన పాత్రలే. భ్రమరాంబ, సుభద్ర, కాళింది, కమలలు ఆనాటి సమాజంలోని స్త్రీలకు సజీవ రూపాలు. వీరి పాత్ర చిత్రణతో నాటి సమాజంలోని స్త్రీల స్థితిగతులను చక్కగా వివరించారు నారాయణరావు.

### 12.4.1. భ్రమరాంబ :

కాళింది, కమలలకు తల్లి భ్రమరాంబ. పురుషోత్తమరావుకు భార్య. సంఘంలోని సగటు స్త్రీకి ఉదాహరణ వర విక్రయ రూపకంలోని భ్రమరాంబ. "ఈ పూట నా దృష్టి యీపనిలేదే - మీ నాయనగారు మిల్లెగరిటెడు కాఫీ నీళ్లు గొంతులో పోసుకొని పొద్దున బోయిన పోక, ఇంతవరకు ఇంటికి రాలేదు. పండ్రెండు కొట్టి పావుగంటయ్యింది. ఎక్కడికి వెళ్లారో, ఏ పని మీదనున్నారో తెలియదు'' అనే మాటలను బట్టి భర్తయెడల భక్తి, జాలి, ఆప్యాయత, గౌరవం గలిగిన స్త్రీ భ్రమరాంబ. ప్రేమ, ఆప్యాయతలు గలది. సమాజంలో కట్నం కోరుకునే తల్లిదండ్రులపై కొంచెం కోపం, సమాజాన్ని మార్చలేని తమ నిస్సహాయతపై జాలి ఉన్నాయి. ఈమెకు కుమార్తెల పై ప్రేమ ఉంది. తామంతా సుఖంగా జీవించాలనే ఆశ ఉంది. కుమార్తెలు కలిగిన ఇంటి కోడళ్లై సుఖ సంతోషాలతో ఉండాలనే కోరిక ఉంది. అయితే తన జీవిత అనుభవం వలన భర్తపై ఎంత గౌరవం ఉన్నా ఆయన ఆదర్శాల వలన ఉపయోగం లేదని తెలుసుకుంటుంది.

"వారన్నదియు వాస్తవమే. కట్నం లేదన్న ఆడుది కంఠమునకు ఉరిపెట్టుకొను దినములు వచ్చి మాటదక్కుట కవకాశంబ లేనపుడు మాబాగని తలయూపవలసినవారేగాని మగవారు మాత్రం ఏమి చేయగలరు'' అనే మాటలను బట్టి మగవారిపై కొంత జాలి, ఎదిరించిన స్త్రీలపై అసహనము ప్రదర్శించబడ్డాయి. కాలానుగుణంగా వ్యవహరించడమే సమంజసమని భావించింది. భర్తను తన మార్గానికి అనుగుణంగా మార్చుకోవటానికి తన వంతు కృషిని తాను సాగించింది. కుమార్తెలను తనకు అనుకూలంగా మార్చుకోవటానికి ప్రయత్నించింది. చివరకు ఆదర్శ జీవితమే ఉత్తమమని నిశ్చయించుకొని సంఘ సంస్కరణ మార్గాన్ని అనుసరించింది.

"చదువులు మాని స్వేచ్ఛగ దేశభక్తులై
నట్టి వారికి లేరె యాడువారు
రాజకీవుల నెట్టి రాట్నముల్ చేపట్టి
నట్టివారికి లేరె యాడువారు
వృత్తులు రోసి సంపత్తులర్పణ చేసి
నట్టి వారికి లేరె యాడువారు
భోగముల్ వీడి కారాగారములమాడి
నట్టి వారికి లేరె యాడువారు
కొందరీరీతి పందలై గోడుమాలి
మగదనము చంపుకొని తమమగువలకెదు
రాడనేరక వారలేమనిన శిరము
లూచుచుం గుక్కలై పడియండ్రుగాని"

పురుషులు సమాజంలో అసమర్థులౌతున్నారని, సమర్థత ఉన్నవారు స్త్రీలన్న మాటలకు సమాధానమివ్వాలని భావించింది. భర్త అభిప్రాయాలను ఏ మాత్రమూ విభేదింపదు కానీ పిల్లల పెళ్లి విషయంలో భర్తకు సలహాలివ్వడంలో గృహిణిగా చక్కని ఆలోచన కనబరుస్తుంది.

నేటి సమాజంలో మధ్యతరగతి కుటుంబాలలో ఇలాంటివారు అనేకులున్నారు. స్త్రీ సహజమైన ఆలోచనలు భ్రమరాంబలో ఎక్కువ. తన కుమార్తెకు వరుని నిర్ణయించటంలో అందం, ఆస్తికి ఎక్కువ ప్రాధాన్యమిచ్చింది. చదువు సంప్రదాయాల కంటే అందం ఆస్తులే ముఖ్యమని చెప్పటానికి సామాజిక జీవనం ఆధారంగా కొందరి జీవితాలను ఉదాహరణగా చూపడంలో ఈమె లోకజ్ఞానం వెల్లడవుతుంది.

'బి.ఎ. పాసయినవారు ఉద్యోగాలు లేక ప్లీడరుగుమాస్తా పని కోసం పిచ్చెత్తినట్లు తిరుగుతున్నారు. ప్లీడర్లు బోణీలేక వీసెడు వంకాయల ఫీజునకు విలేజి కోర్టునకు సిద్ధపడుచున్నారు. ఇక సంప్రదాయం చూస్తే అయిన కుటుంబాలు అడుగునబడినవి. కానీ కుటుంబములు గణనకు వచ్చాయి. ఏమీ సంపత్తులేనివాడు స్మశానంలోని తులసి మొక్కలాంటివాడు" వంటి మాటలు ఆమె అనుభవానికి తార్కాణాలు. "రాతిలో కప్పను, బొరియలో చీమను, గంగలోని చేపను, మట్టిలోని వానపామును, పుట్టలోని చెదులును, కలుగులోని ఎలుకను, నాభిలోని క్రిములను, పేడలోని పురుగులను కాపాడి, చెట్లు చేమలకెల్లను తిండి నీరిచ్చెడి దేవుడు, శిశువుతోపాటు తల్లికి స్తన్యము దయసేయు తండ్రి దయతో మనలను పోషించడా" అనుకొనుట ఆమె చక్కని చిత్తవృత్తిని, సహజసిద్ధమైన స్వభావాన్ని తెలియజేస్తాయి.

కాళింది కట్నమిచ్చిన వరుని పెండ్లాడనని చెప్పినపుడు, ఆమె బావిలో పడి మరణించినపుడు, రెండవ కుమార్తె పెండ్లి విషయమప్పుడు ఆమె భావాలు, సంభాషణలు వాస్తవికాలై ప్రతి ఇంటిలోనూ వినబడేవే. భ్రమరాంబకు భర్తపై గౌరవాభిమానాలు అధికం. పురుషోత్తమరావు పది సంవత్సరాలు రెవెన్యూ ఇన్స్పెక్టరు ఉద్యోగం చేశాడు. రెవెన్యూ శాఖలో ఉద్యోగం ఉంటే పెరట్లో వరహాల చెట్టున్నట్లే". కానీ పురుషోత్తమరావుపైఆదాయం పైసా కూడా ఎరుగడు. పైగా గాంధీ మహాత్ముడు సహాయనిరాకరణోద్యమం ప్రారంభించగానే ప్రభుత్వ ఉద్యోగం కనుక దానిని వదిలేశాడు. స్వదేశీ ఉద్యమానికి అనుకూలుడయ్యాడు. ఆయా సందర్భాలలో భ్రమరాంబ అనుకూలంగానే ప్రవర్తించింది. చరఖా వడుకుతూ ఖాదీ ఉద్యమాన్ని హృదయపూర్వకంగా సమర్థించింది.

సంపదల వల్ల సౌఖ్యాలుంటాయనే భావన భ్రమరాంబలో స్పష్టంగా కనిపిస్తుంది. తన కుమార్తెలైనా తనలాగా కాకుండా సుఖపడాలనుకుంది. కట్నాల కోసం ఆశపడే వాళ్ల వలన ఆడపిల్లలను కన్నవాళ్లు వ్యథపడుతున్నారంటుంది. అయినా ఇవ్వక తప్పేదేముందంటుంది. పెళ్లిళ్ల పేరయ్య చెప్పిన సంబంధాలన్నింటికీ ఏదో ఒక వంక పెట్టింది. ఒకరికి బట్టతల, మరొకడు రంగు తక్కువ అన్నది. ఇంకొకడిని మా అమ్మాయి కన్నా పొట్టి అన్నది. అందంగా ఉన్నవాడికి ఆదాయం తక్కువన్నది. వంకలు పెడుతున్న భ్రమరాంబను చూస్తే పురుషోత్తమరావుకు విసుగు కలుగుతుంది. ఆ విసుగును ఆమె ఏమాత్రం లెక్కపెట్టదు. "లోపం లేనివాడు ఈ లోకంలో ఉండునా" అని పురుషోత్తమరావు ఆమెను విమర్శించినపుడు "ఆడపిల్లలకు కావలసిన హంగులు మగవారికి ఏమి తెలియును" అని తన చర్యను తాను సమర్థించుకున్నది. చెప్పిన సంబంధాలన్నింటికి వంకలు పెట్టి కట్నం ఎక్కువయినా, సంపదలు, అందం ఉన్న బసవరాజు సంబంధం ఖాయం చేసుకురమ్మని పేరయ్యతో చెప్పి పంపిన భ్రమరాంబ పెళ్లి కుదిరిన తరువాత కొంత సందేహించింది. ఉన్న పది ఎకరాల భూమి అమ్మితేగాని అనుకున్న సంబంధం చేయటానికి అవకాశం లేదు. ఆ తరువాత తమ జీవనం ఎలా? ఆ విషయాన్నే భర్తను అడిగింది. భర్త ఈ దేశంలో తమ కంటే హీన స్థితిలో ఎందరో ఉన్నారని, వాళ్లంతా జీవించగలుగుతుండగా తాము జీవించడం ఎలా? అని ఆలోచించడమెందుకని సమాధాన పరుస్తాడు. అప్పుడామె "నారు పోసినవాడు నీరు పోయకపోతాడా" అని సంతృప్తి చెందింది. కానీ ఈ రకమైన స్వభావాన్ని అల్లుడి ఎన్నిక విషయంలో చూపలేకపోయింది.

కట్నపు పెళ్లి ఇష్టంలేని కాళిందితో కట్నం తీసుకొనే వాళ్లది తప్పుగానీ మనదేముంది అని సమాధానపరచిందే తప్ప ఆమె మనస్సును తెలుసుకోలేదు. పెళ్లికాకుండా ఆడపిల్ల ఇంట్లో ఉండటం గౌరవం కాదన్నది. కుమార్తె ఇష్టం తెలుసుకోకపోవడం వల్ల కాళింది ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయంలో భ్రమరాంబ ఎంతో క్రుంగిపోయింది. కమలను బసవరాజుకిచ్చేటపుడు తను మొదటిసారి చేసిన తప్పును సరిదిద్దటానికి ప్రయత్నించింది.

ఈ రూపకం మధ్యలో భ్రమరాంబ సగటు స్త్రీ అనిపించినా ఆద్యంతాలలో మాత్రం ఆదర్శంగానే ప్రవర్తించింది. చివరకు వరకట్న నిషేధ ప్రచారంలో భర్తతోపాటు రాజవీధులలో సైతం తిరుగుచూ ప్రచారం చేసిన సహధర్మచారిణి భ్రమరాంబ. సహజ రామణీయకమైన జీవనం గడిపిన బిడ్డల తల్లిగా, సహధర్మచారిణిగా, ఆడపిల్లల పెండ్లిలో కష్టాలనుభవించిన వియ్యపురాలిగా, చైతన్యవంతమైన ప్రబోధకురాలిగా చిత్రించబడింది భ్రమరాంబ.

## 12.4.2. సుభద్ర :

సుభద్ర వరవిక్రయంలో లింగరాజుకు మూడవ భార్యగా కన్పిస్తుంది. సుభద్రను పెళ్లి చేసుకున్నాడు లింగరాజు. వర విక్రయ రూపకంలోని స్త్రీ పాత్రలలో కథా విషయికంగా స్వల్ప ప్రాధాన్యం గల పాత్ర సుభద్ర. ఈమె అన్ని విధాలా దురదృష్టవంతురాలు. సమాజంలోని దురాచారాలకు, దౌష్ట్యానికి బలైన జీవి. వృద్ధుడు, పిసినారి లింగరాజు భార్య. ఈ కాపురం సుభద్రకు నరకం. నాటి సమాజం ధనమే ప్రధానమని దంతాలు ఊడినవాడికైనా కుమార్తెలనిచ్చి పెళ్లి చేసే పాడుకాలం. అటువంటి కఠినురాలైన ఒక తల్లి కూతురు సుభద్ర. ఆ కారణంగా ఈమెకు తల్లిపై కోపం ఎక్కువ. ఈమె తల్లి చదువు, వయసు, పరువు ఏమీ పట్టించుకోకుండా ఆస్థి ఒక్కటే చూసి ప్రాయం తగ్గిన పిసినిగొట్టుకు పిల్లనీయవద్దని భర్త ఎంత మొత్తుకున్నా వినక లింగరాజు కిచ్చి సుభద్ర గొంతు కోసిన రాకాసి. ఈ మాట సుభద్ర లింగరాజుతోనే ధైర్యంగా చెప్పగలదు. పరిస్థితుల వలన ఎదిరించలేక, రాజీపడి బ్రతకలేక అసంతృప్తితో జీవితం సాగించే ఈ లోకంలోని స్త్రీలకు ప్రతినిధి సుభద్ర.

లింగరాజు మొగుడనిపించుకున్నాడేగాని ఆమెను సుఖపెట్టినవాడు కాదు. లింగరాజుకు ఎన్నో మార్గాలలో డబ్బు సంపాదించడమే గానీ మరే విషయంలో పనిలేదు. నగల పేరు చెపితే నవ్వుతోను, కోకలు కొనమంటే ఖర్చవుతుందని, చదువుకోడానికి

పుస్తకాలడిగితే డబ్బులేదని, తాంబూలం వేసుకుంటే విసవిసలాడి, పూలుకొనకముందే కస్సుమని, వ్రతాలు పూజలు చేస్తానంటే వలవలా ఏడవడంతోను, ముష్టివేస్తే నెత్తి బాదుకొంటూ, పండుగలలోనైనా పిండి వంటలు చేయనివ్వక సరిపెట్టు పిసినిగొట్టు భర్తతో ఈమె పడిన కష్టాలకు అవధి లేదు. లింగరాజుకు అనుమానం మెండు. ఆమె జడ దువ్వితే సానెదని, చీర గట్టిన షోకులాడివని, వంటవాడితో మాట్లాడితే పొంచి వినడం, గడపదాటితే పెంపుడు కొడుకును తోడిచ్చి పంపడం ఇవన్నీ అందుకు నిదర్శనాలు. తనకు రాబోయే కోడలు కూడా ఇంతటి కష్టాలుపడవలసినదేనా అని జాలితో బాధపడ్డ ఇల్లాలు. సుభద్రకు లోకజ్ఞానం ఉంది. జీవితంలో ధనం ఎంత ప్రాధాన్యమైనదైనా అనుభవించని ధన సంపాదన వ్యర్థం అనుకుంది. ఆ భగవంతుడు ఇట్టి పిసినారిని ఎలా సృష్టించాడా అనుకొన్న నిస్సహాయురాలు సుభద్ర.

సుభద్ర పాత్ర ఈ నాటకంలో ఒకటి రెండు అంకాలలో మాత్రమే ఉన్నా నాటి సమాజంలో స్త్రీ ఎంతటి బానిసగా జీవిస్తుందో అన్నదానికి ఉదాహరణగా నిలుస్తుంది. సుభద్ర విద్యావతి. తన తల్లిదండ్రుల వారి కడుపున పుట్టడం కంటే అరణ్యంలో కొండచిలువ పుట్టడం మేలనుకున్నది.

వర విక్రయంలోని సుభద్ర తల్లిదండ్రుల అకృత్యానికి బలియైన రూపవతి, విద్యావతి. సుభద్రలో న్యాయగుణం ఉంది కానీ తనకు జరిగిన అన్యాయానికి ఉక్రోషం పట్టలేక తన కోపాన్ని భర్తపైనా, వియ్యాలవారిపైనా ప్రదర్శించి కొంత సానుభూతిని కోల్పోయింది. అన్యాయాలకు బలై, అసంతృప్తికి లోనైన వారికందరికీ ఈ పాత్ర ప్రతిబింబం.

### 12.4.3. కాళింది :

వరశుల్క దురాచారాన్ని నిరసిస్తూ బలైపోతున్న యువతులకు ప్రతినిధి కాళింది. భ్రమరాంబ, పురుషోత్తమరావుల పెద్దకుమార్తె, సద్గుణ రాశి. ఆదర్శ యువతి. పెద్దలను, సమాజాన్ని ఎదిరించలేక, మనసును, వ్యక్తిత్వాన్ని చంపుకోలేక, పరిస్థితులతో రాజీపడి జీవించలేక ఆత్మహత్య చేసుకున్న అబల.

కాళింది తండ్రి అడుగుజాడలను అనుసరించే అభ్యుదయ భావాలు కలిగిన యువతి. సంఘసంస్కరణాభిలాషి. కన్యాశుల్క, వరశుల్కానికి వ్యతిరేకి. తండ్రి ఆలోచనను చక్కగా అవగాహన చేసుకున్న ఆదర్శప్రాయురాలు. కాలమాన పరిస్థితులను బట్టి కట్నం ఇవ్వకపోతే పిల్లల పెండ్లి అవ్వటం కష్టం కనుక ఎంతో కొంత కట్నం ఇచ్చి పెళ్లి చేయాలని భావించిన తండ్రిని గురించి బాధపడిన కుమార్తె కాళింది. నిష్కళంకమైన, నిర్మలమైన స్వతంత్ర భావాలు కలిగిన యువతి కనుక కట్నం ఇచ్చి భర్తను కొనుక్కోవటం ఇష్టం లేదీమెకు. నిరుపమానమైన వ్యక్తిత్వం కలిగిన స్త్రీ కాళింది. కట్నం కోసం ఉన్న ఇంటిని కూడా అమ్ముకొనవలసిన ఈ పాపిష్టి లోకంలో పుట్టకుండా ఏ పుట్టగానో, చెట్టుగానో పుట్టడం మంచిది. కట్నం ఇవ్వనిదే దేశంలో పెళ్లిళ్లు కాని పక్షంలో రాజకుమార్తెగా కూడా జన్మించకూడదని, ఒకవేళ పుట్టినా, వెంటనే మరణించాలని భావించింది కాళింది.

కాళిందికి ఓర్పు అధికం. తనకిష్టం లేని పని ఎంతమాత్రం చేయడానికి ఇష్టపడదు. అందుకే చెల్లెలితో ఇలా అన్నది.

"నాదు ప్రతినంబు వినుము ప్రాణములనైన
విడిచెదంగాని యడిగిన విత్తమిచ్చి
వరుని గొని తెచ్చినట్టి వివాహమునకు
సమ్మతింపనారాట్నము సాక్షిగాను"

ఇంతటి దృఢమైన నిశ్చయం గల వ్యక్తి కాళింది. తాను నమ్మిన దానికి ఏమాత్రం వెనుకాడని ధైర్యశాలి. ఇలాంటి స్వేచ్ఛ గల ఆలోచనలున్నప్పటికీ తల్లిదండ్రులపై మిక్కిలి గౌరవము, ప్రేమ కలిగిన ప్రేమమూర్తి. ఈమె హృదయం సుకుమారమైంది. తండ్రి తన పెళ్లి కోసం పది ఎకరాల భూమిని అమ్మటంతో తన తరువాత ఆ కుటుంబానికి ఆధారం లేదని

బాధపడింది. తన పెళ్లి వల్ల కదా ఇన్ని కష్టాలు అనుకొంది. తల్లితో "మీకు కులము లేదా! మాకు రూపములు లేవా! యింతగా దైన్యం పడనేమి! కట్నము ఇచ్చి వరుని సంపాదించడం కంటె చిన్నతనము ఇంకేమికలదమ్మా!" అంటూ తన అయిష్టతను స్పష్టంగా చెప్పి లోకమే గొడ్డుపోయిందా అని ప్రశ్నించింది. 'కట్నమే కోరి వచ్చిన ఖరము తోడ తగునని కాపురం చేయుట కంటె పెండ్లియే మానుకొని మగబిడ్డవలె తల్లిదండ్రుల వద్ద ఉండకూడదా అని ప్రశ్నించింది. తాను కట్నం పుచ్చుకొన్న వాడిని పెళ్లి చేసుకోనని ఖచ్చితంగా చెప్పింది.

> **"కట్నమర్పించి వరునిచే గంతమునకు**
> బుస్తె కట్టించుకొని తృప్తి పొందుకంటె
> తనకుదానుగా ముప్పేట త్రాటితోడ
> గంతమునకురి యిడుకొంటె గౌరవంబు"

అనడం వల్ల కాళిందిలోని నారీ ఆత్మగౌరవం ప్రకటితమవుతుంది. తనను అర్థం చేసుకొనేవారు లేకపోవడంతో ఆమె ఒక మానసిక స్థితికి చేరుకుంది. తాను మరణించినచో తన వల్ల కుటుంబానికి జరుగనున్న ప్రమాదం తొలగిపోతుందని భావించి బావిలో పడి ఆత్మత్యాగం చేసుకొంది. కాళిందిలో సంప్రదాయ భావాల ఛాయ తొంగిచూస్తుంది.

తండ్రి ఆదర్శాలను పుణికిపుచ్చుకున్న కాళింది జాతీయ భావాలతో రాట్నం వడికింది. కరువు రక్కసిని పారద్రోలటానికి చరఖా తిప్పటమే మార్గమని నమ్మింది. "త్రాగుబోతు లేనిదే కల్లుండునా! విటుడు లేనిదే వేశ్యావృత్తి ఉండునా! అని కట్నం కోరేవాళ్లు, కట్నం ఇచ్చేవాళ్లు ఇద్దరూ దోషులేనని" తేల్చిచెప్పిన నిస్సందేహమనస్వి కాళింది. ఎంత చెప్పినా వినని తల్లిదండ్రుల ధోరణికి బాధపడి తనకిష్టం లేని పనిచేయలేక జీవితంతో రాజీపడి ఉండలేక తల్లిదండ్రులను దుఃఖ సాగరంలో ముంచుతూ తాను ఆత్మత్యాగం చేసింది. ఆత్మహత్య చేసుకొనే ముందు కాళింది పంచమాంకంలో వ్యక్తీకరించిన భావాలన్నీ మన సమాజానికి దర్పణం పడుతున్నాయి.

నేటి సమాజంలో వరకట్న దాహానికి బలయిపోతున్న అనేకమంది అబలలకు ప్రతీక కాళింది.

### 12.4.4 కమల :

సంఘ సంస్కరణేచ్ఛతో రచింపబడిన వర విక్రయం నాటకంలో నాయిక కమల. ఈ నాటకంలో సమున్నతంగా తీర్చిదిద్దబడిన పాత్ర కమల. సార్థక నామధేయుడైన పుణ్యామూర్తుల పురుషోత్తమరావు ఆదర్శాలను పుణికి పుచ్చుకున్న అతని చిన్నకూతురు కమల. పురుషోత్తమరావు, కాళిందిల కన్నా కమల సమర్థురాలు. పురుషోత్తమరావు కొంతకాలం ఆదర్శాలను పాటించి ఇంట్లోను, బయట వచ్చిన వ్యతిరేకతను తట్టుకోలేక, పరిస్థితులకు రాజీపడి అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

వరకట్నం ఇవ్వనని కొంతకాలం భీష్మించుకొని కూర్చున్నా పెళ్లి కొడుకుల కోసం వెదికి వేసారి చివరకు పెళ్లిళ్ల పేరయ్యను ఆశ్రయించాడు. పెళ్లికుమారుడి కోసం వేలంపాటలో పాల్గొని, ఆ కట్నం డబ్బుకోసం ఉన్న ఆస్తిని అమ్ముకోవడానికి వెనుకాడలేదు.

కట్నానికి ఆశపడే అల్లుడిని పెళ్లిచేసుకోకూడదని నిర్ణయించుకున్నా, తల్లిదండ్రులు ఆమె మాటలు లెక్కచేయనందువల్ల ఆత్మహత్య చేసుకుంది కాళింది. కమల మాత్రం పరిస్థితులతో రాజీపడకుండా, తల్లిదండ్రులను ఒప్పించి, మామను వ్యతిరేకించి చిట్టచివరకు విజయం సాధించింది. కాళింది మరణం కమలకు పట్టుదలను, ఓర్పును, నేర్పును కలిగించింది. తండ్రులకు కట్న బాధ, తల్లులకు వియోగబాధ, తమకు దాస్య బాధ" కలిగించే దరిద్రపు ఆడపుట్టుకే పుట్టరాదని భావించిన భావుకత కమలది. డబ్బు తీసుకునే వేశ్యలను వెలయాలు అన్నట్లే కట్నం తీసుకునే పురుషులను "వెలమగలు" అనాలని తీర్మానించింది. కట్నమిచ్చి

పెళ్లి చేసుకుని భర్తను పొంది వారికి దాస్యం చేయటం కంటే నూలు వడుకుతూ తల్లిదండ్రులను పోషించి బ్రతకటం మేలని భావించింది కమల.

కాళింది వివాహం కోసం వరుడి చిత్రపటాన్ని తెచ్చినపుడు కాళింది చిత్రపటం చూసినందుకు కూడా సుంకం ఇవ్వాలేమో అనగా కమల "సుంకమిచ్చి అయినా చూడదగిన అందమే అక్కా" అని అనటంలో ఆమె చతురత, వాక్చాతుర్యం వ్యక్తమవుతుంది. కమల నిజస్వరూపం, కమల పట్టుదల, కమల తెలివితేటలు, కమల వాదనాపటిమ, కమల తార్కికశక్తి అన్నీ కాళింది మరణం తరువాతనే బయటపడ్డాయి. కాళింది మరణం పురుషోత్తమరావు కుటుంబాన్ని కుంగదీసింది. కుమార్తెతో పాటు కట్నం సొమ్ము కూడా పోగొట్టుకోవలసిన స్థితి ఏర్పడింది. కమల బసవరాజును పెళ్లాడతానని నిర్ణయం తీసుకొని కాళింది మరణానికి కారకులైన వారిపై పగ తీర్చుకోవటం ప్రధాన లక్ష్యంగా భావించింది.

కమల ధైర్యంతోను, పట్టుదలతోను తాను సాధించదలచుకొన్న గమ్యం కోసం ఎదురుచూసిందే తప్ప అత్తగారింటికి కాపురానికి వెళ్లలేదు. పెళ్లినాడు పిసినారి లింగరాజు ఇచ్చిన ఆభరణాలు కమల దగ్గరే ఉన్నందువల్ల లింగరాజు పురుషోత్తమరావుకు కోర్టు నోటీసు ఇచ్చాడు. కమల తండ్రికి కూడా ధైర్యం చెప్పి లింగరాజు చేసిన మోసాలను బయటపెట్టి, తాను కట్నం ఇచ్చి కొన్నది కనుక భర్తను కొనుక్కున్నట్లేనని, అతడే తన ఇంటికి రావాలని వాదించి తాననుకున్నది సాధించింది. ఎంత తెలివితేటలు కలిగిందో తల్లిదండ్రులంటే అంత గౌరవాభిమానాలున్నాయి. వినయ విధేయతలు కలిగిన స్త్రీ కమల. వినయపూర్వకంగానే కోర్టులో తన వాదనను సాగించి అందరినీ మెప్పించిన మేటి కమల. ఆమె ఆ పట్టుదలతోనే భర్తను, మామను కూడా మార్చగలిగింది. దీనికంతటికీ ఆమెలోని సద్గుణాలే కారణాలు. కమల తాను బాలనని, బేలనని తనను రక్షించమనీ కోర్టుకు వెళ్లే ముందు దేవుణ్ణి ప్రార్థించడంలో అచ్చమైన స్త్రీ సహజమైన మనసు మనకు కన్పిస్తుంది. కానీ వర విక్రయంలోని కమల ఎంతో ధీరురాలుగా, తార్కిక బుద్ధికలదిగా కనిపిస్తుంది.

కమల నేటి యువతరపు విప్లవ జ్యోతి. సమాజానికి పట్టిన వరకట్న పిశాచాన్ని నాశనం చేయాలని విప్లవ శంఖాన్ని పూరించింది. దృఢమైన మనస్సు కలిగిన స్త్రీ కమల. బసవరాజును పెళ్లిచేసుకుని కూడా మూడేళ్లు కాపురానికి వెళ్లకుండా సమయం కోసం వేచిచూచిన నేర్పుగల కార్యదక్షురాలు కమల. న్యాయాధిపతితో ఆమె విన్నవించిన విషయాలు వినయసుందరాలు, సత్య భాషితాలు, వాదనా పటుత్వాలు, ధర్మం తప్పని ఋజువర్తన కల స్త్రీ కమల. అన్నింటినీ మించి సంఘ సంస్కరణాభిలాష, దురాచార నిర్మూలనపై ఆశ గల ఒక దీక్ష కలది. గొప్ప ఆత్మవిశ్వాసం కలిగిన స్త్రీ. కార్యాచరణ సామర్థ్యం కలిగిన కమలకు భర్త పట్ల గౌరవం, ప్రేమ కలిగినట్లు చివరకు కన్పిస్తుంది. ఆమె లక్ష్యం వరకట్న నిర్మూలనం కనుక కటువుగా ప్రవర్తిస్తుంది. భర్త తన తప్పు తెలుసుకున్న పిమ్మట ఆతనిని చేరదీసి తనతోపాటుగా సంస్కరణలో పాల్గొనేటట్లు చేయటంలో కమల ఔన్నత్యం ఎన్నదగింది. యావద్భారత నారీమణులకందరికీ ఆదర్శప్రాయురాలైన కమల పాత్ర నాటకానికి మకుటాయమానం. కమల నేటి వనితాయువతరపు ప్రతినిధి.

## 12.5 వరవిక్రయం - సామాజిక సమస్య :

సమాజంలో ఆచారాలు, సాంప్రదాయాలు, మూఢ నమ్మకాలు మొదలైనవెన్నో ఉంటాయి. ఇవన్నీ సమాజాభ్యుదయానికి ఏ మాత్రం ఉపయోగపడక సమాజాభివృద్ధికి ఆటంకాలు కల్పిస్తాయి. వీటిననుసరించి కొన్ని సమస్యలు సమాజంలో తిష్టవేసుకొని కూర్చుంటాయి. ముందు వెనుకలు ఆలోచించకుండా ఈ సమస్యలను సంప్రదాయాలతో ముడిపెట్టి చూసే ప్రజలు ఆనాటి సమాజంలో చాలా ఎక్కువ. అందువల్లనే వారు సమాజ బాగోగులను గురించిన ఆలోచనలు చెయ్యలేదు. అభ్యుదయ దృష్టితో సాగిపోయేవారిని అర్థం చేసుకోలేదు. అటువంటి సమయంలో వేలెత్తి చూపిస్తూ సమాజ సంక్షేమానికి పాటుపడిన మహానుభావుడు కాళ్ళకూరి నారాయణరావు.

ముఖ్యంగా ఈ నాటకంలో సమాజంలో వేళ్ళూనుకుపోయిన వరకట్న పిశాచాన్ని పారద్రోలాలని కంకణం కట్టుకున్నారు. ఈ భూమ్మీద ఆడదానిగా పుట్టడమే పాపమేమోననుకొని ఆక్రోశించే స్త్రీ హృదయవేదనను, ఆడపిల్ల పెళ్లి విషయంలో మగపెళ్లివారి మితిమీరిన కోరికలను, వాటిని తీర్చలేక ఆడపెళ్లివారు పడే అవస్థలను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ఇది ఒక భయంకరమైన సామాజిక సమస్యగా చిత్రించారు కాళ్ళకూరి.

ఆనాటి సమాజంలో రజస్వల అయిన తరువాత ఆడపిల్లలకు పెళ్లికావటం దుర్లభం. కారణం సంఘం - ఆ కుటుంబాన్ని వెలివేస్తుంది. యుక్తవయస్సు రాకుండానే పెళ్లిచేయాలి. పది సంవత్సరాలు నిండగానే పెళ్లి, పెళ్లి అంటూ తల్లిదండ్రులు తపనపడటం అనేది దురదృష్టం. పెళ్లికోసం కాళ్ళు అరిగేటట్లు తిరగటం, సంతలో సరుకులా పెళ్లికొడుకుల తండ్రులు వారి కొడుకులను వేలంపెట్టగా ఆడపిల్లలను కన్నవారు ఉన్న ఆస్తులన్నీ తెగనమ్మి వారి ముఖాన కొట్టడం, ఆ పైన తిండికి కూడా గతిలేక "ఎందుకు కన్నామా ఆడపిల్లలనని" తల్లిదండ్రులు ఆవేదన చెందటం ఇవన్నీ నాటి సమాజంలోని సమస్యలకు ప్రతిరూపాలుగా కాళ్లకూరి వరవిక్రయ రూపక దర్పణంలో చూపించారు.

ఈ సమస్య ఏ ఒక్క ఆడపిల్లకో, వారిని కన్న తల్లిదండ్రులకో కాదు సమాజంలో ఉన్న ప్రతి ఆడపిల్లకీ వారి తల్లిదండ్రులకీ కలుగుతున్న, భయపడుతున్న పెనుభూతం. కనుకనే ఇదొక సాంఘిక సమస్య. వైయక్తికంగా కాక లోకాన్నే బాధించే లౌకిక సమస్య ఈ వరకట్న సమస్య. ఆడపిల్లల కన్న తల్లిదండ్రులు

"కన్యనొక్కరి కొసగి సద్గతులు గాంతు
మనుచు సంతోషపడుకాలమంతరించి
కట్నములు పోయజాలక కన్య నేల
కంటిమాయని వ్యథపడు కాలమొదవె"

అని అనుకొనే కాలమది. పెళ్ళి అయ్యేవరకు అయ్యయ్యో పెళ్లి కాలేదే అనే బాధ. ఆ తరువాత పిల్లలను విడిచి ఉండలేక మరొకబాధ. ఈ విధంగా దిగులు చెందే ప్రజలే ఆనాటి సమాజంలో ఎక్కువగా ఉన్నారు. పూర్వపు ధర్మములు చెడిపోయాయి. మర్యాదలు అంతరించిపోయాయి. కొట్లల్లో కూరగాయల మాదిరిగా, గృహోపకరణాల మాదిరిగా, సంతలో పశువుల మాదిరిగా పెళ్లికొడుకులను వ్యాపార మార్గంలో కొనుక్కోవలసివచ్చింది. దేవుడైనా ఇలాంటి స్థితిలోనే ఉండాల్సిందేనన్నంత విషమస్థితి.

సమాజంలో పెళ్లి కొడుకుల కులంతో పనిలేదు, వయసుతో పని లేదు, అందమా అసలే లేదు, పేరు ప్రతిష్టలక్కరలేదు, బంధువులతో పని లేదు, కానీ బంగారం, పట్టు పీతాంబరాలు, డబ్బు, లాంఛనాలు, దండిగా ఇస్తే చాలు అన్న నానుడి ఏర్పడింది. ఆడపిల్లల తల్లిదండ్రులకిది శాపమైంది. "కంటిలోపడ్డ దోమ, ఇంటిలో ఉన్న పెళ్లికాని భామ" ఇద్దరూ బాధలను పెట్టే ప్రతిరూపాలైపోయారు. నరాలపై లేచిన కురుపులా పరువం నిండిన వనితల తల్లిదండ్రులను వరకట్న సమస్య బాధిస్తుంది.

మార్వాడీ అప్పులాగ, పండ్లల్లో ఇరుక్కున్న పీచులాగ, గొంతునపడ్డ ఆకుపుల్లలాగా, ప్రతి నిమిషం ఆడపిల్లలను కన్న తల్లిదండ్రులకు వారి పెళ్లి బాధ విపరీతంగా గుబులు పుట్టిస్తూ, బాధిస్తూ ఉందంటే సందేహం లేదు. ఈడు వచ్చిన పిల్లలు ఇంట్లో ఉన్న తండ్రి దురవస్థలు దేవుడికే తెలుసు.

పెళ్లికొడుకుల కోరికలు చూస్తే నీటుగా ఉండే ఇంగ్లీషు మోటారు సైకిలు కొని పెట్టమనేవాడొకడు, రిస్టువాచి, ఉంగరం, బూట్లు, సూట్లు కావాలనేవాడు ఇంకొకడు, తన చదువు పూర్తి అయ్యేవరకు అయిన ఖర్చులను పెట్టమనేవాడు మరొకడు, భార్యతో సహా పెద్ద పట్టణాల్లో ఉంచి చదివించమని కోరిక కోరేవాడొకడు, విదేశాలకు పంపమనేవాడొకడుగా నాటి, నేటి సమాజంలో

మనకు కన్పడతారు. వాళ్ళేమైనా సరైన పద్ధతి గలవారా అంటే జుట్టు సరిగా దువ్వుకోలేనివాడు, కాఫీ హోటళ్లలో అప్పులున్నవాడు, సిగరెట్లు, బీడీలు తాగేవాడు, కిళ్లీలు నమిలేవాడు, కళ్లజోడు లేనిదే కళ్లు పనిచేయనివాడు, అనవసరమైన ఖర్చులు ఎక్కువగా పెట్టేవాడు, ఇలా ఒక్కడూ సరైన లక్షణాలున్నవాడు లేడని కాళ్లకూరి నారాయణరావు వరవిక్రయ రూపకంలో వరుల రూపాన్ని చక్కగా వివరించారు. ఆడపిల్లను కనడం ఒక సమస్య. ఆమెకి పెళ్లి చెయ్యడం ఒక సమస్య మరలా పెళ్లికొడుకు సరైనవాడు కాకపోయాడే అనే సమస్య తల్లిదండ్రులను పీడించాయి.

సంఘ సంస్కర్తలమంటూ తిరిగేవారు కూడా తమ భార్యల మాట వినేవారే గానీ ధైర్యంగా వాళ్లు ఏ పనులు చేయరు. స్టేజీల పైన ఉపన్యాసాలిస్తారే గానీ చెప్పిన అంశాలు వాళ్లు పాటించరు. ఆడపిల్లలను కనటం అపరాధం. కనుక సంచులతో జరిమానాలు వసూలు చేస్తున్నారు అధికారులైన అల్లుడు గార్లు'' అనడంలో దైన్యస్థితిలో ఉన్న ఆడపిల్లల తల్లిదండ్రులు కనపడుతున్నారు.

**"అప్పొసగినవాడును, అల్లుడద్దె**
**యింటి యజమానుడును, జీతమిచ్చువాడు**
**కులవినోదియు, పన్నులు కూర్చువాడు**
**బుస్తె కట్టని మగలె పో పూరుషులకు"**

అని వ్యధ చెందే పురుషులు నాటి సమాజంలో అధికం. ఏదో ఒక తిప్పలు పడి పెళ్లిచేస్తే మళ్లా మళ్లా అల్లుడు అలకపానుపు లెక్కి జిలుగుకోరికలు కోరేవాళ్లు, గర్భాదానమనగానే లంచమడిగేవాళ్లు, పండుగలు వస్తే తండ్రి తద్దినాల వలె చక్కగా వచ్చేవాళ్లు, ఇన్నీ తీసుకుని పిల్లనెప్పుడైనా పుట్టింటికి పంపమని అడిగితే మూతిముడుచుకునేవాళ్లు, సమాజంలోని అల్లుళ్లు అనుకునేలాగ కుర్రవాళ్లు తయారయ్యారని బాధపడ్డారు కాళ్లకూరి. ఈ బాధలన్నీ చూచి హరిహరులంతటివారే ఆడపిల్లలను కనలేరేమో అని ఆయన ఆవేదనకు ఆలోచనా రూపమిచ్చారు.

ఆడపిల్లలు తమ తల్లిదండ్రులకు కట్న బాధ, తమకు ఇంకొకరి ఇంటి దాస్య బాధలను ఇచ్చే ఈ దరిద్రపు ఆడబతుకు వ్యర్థము అనుకునే స్థితిలో ఉన్నారు. ఉన్న ఇల్లు అమ్ముకుని, కట్నాలు లేకపోతే పెళ్లి కాని స్థితిలో ఉన్న సమాజంలో పుట్టటం కంటే అడవుల్లో చెట్లుగానో, పుట్టలు గానో, పుట్టడం మంచిదనుకొన్నారు. ఒకవేళ ఆడపుటక పుడితే వెంటనే చచ్చిపోవటం మంచిదనుకున్నారు. అంతటి మానసిక రుగ్మత స్త్రీలకు ఏర్పడింది.

వేశ్యలకు వెండినాణేలే మొగుళ్లు. పెళ్లి కొడుకులకు కట్నాలే పెళ్లాలు. డబ్బు తీసుకున్న వేశ్యలు వెలయాలు అయితే డబ్బు తీసుకుంటున్న వరుళ్లు 'వెలమగలే' కదా అని ఆలోచించారు. క్షణికమైన శరీర ఆనందం కోసం పెళ్లిచేసుకొని కష్టపడే కంటే రాట్నం తిప్పుకుంటూ యోగినిలాగా జీవించడం గొప్ప అనుకున్నారు. చివరకు ప్రాణాలైనా విడువవచ్చు. కానీ కట్నమిచ్చి పెళ్లి చేసుకోకూడదనుకునే పట్టుదల వచ్చేవరకు ఈ వరకట్న సమస్య వారిని బాధించింది.

పెళ్లిళ్ల పేరయ్యలు వారి కమీషను కోసం ఆడపెళ్లి వారికి ఎన్నో విధాల నచ్చచెప్పి వాళ్ల బాధలకి కారణభూతులయ్యారు. అందుకు వరవిక్రయ రూపకంలోని పేరయ్య పాత్ర సాక్షి. వరకట్నం అనేది బ్రాహ్మణ కుటుంబాల్లో పుట్టి, వైశ్యుల ఇంటిలో చక్కగా పెరిగి, కమ్మవారిండ్లలో అధికమై అందాలద్దుకొని వర్థిల్లుచున్న పిశాచి. కానీ మిగిలిన జాతులు మొత్తం దీనివలన బాధలు పడుతున్నారు.

"వయసుతోడనే పనిలేదు వానితోడ
నంతకన్నను బనిగల్గదరయనొల్ల

రింటిపేరును; గోత్ర; మింకేదిగూడ
ఆస్తి యొక్కటియే యిపుడన్నిటికిని"

ఆస్తి ఉంటే పుస్తె కట్టే మగవారు సమాజంలో ఉన్నారనటానికి సాక్ష్యం పై పద్యం. సమకాలీన సమాజాన్ని పట్టిపీడిస్తున్న వరకట్న దురాచారాన్ని ప్రధాన సమస్యగా తీసుకుని వరవిక్రయ నాటకాన్ని రచించారు కాళ్లకూరి. పెళ్లీడు వచ్చిన కన్నెలు, వరకట్నం ఇవ్వలేని అవివాహిత స్త్రీలు, మొరడుల్లాగా జీవితాలు గడపటం, వరకట్నం అడిగినంత ఇవ్వలేదనో, ఆశకి తగినట్లు మసలుకోలేదనో, పెళ్లి అయిన పిమ్మట అత్తమామల ఆగడాలకు బలిఅయిపోయిన, అవుతున్న స్త్రీ మూర్తులు ఎందరో!

ఇలాంటి కారణాల వల్ల అనేకమంది స్త్రీలు హత్యలు కావడం, అత్యాచారాలు, ఆత్మహత్యలు, చిత్రహింసలు సమాజ దినచర్యలైపోయి స్త్రీకి అసలు స్వతంత్రత అనేదే దెబ్బ తినే ప్రమాదం ఏర్పడుతుంది. ఈ వరకట్న సమస్య ఇంత తీవ్రమై ఉండటంవల్లనే కవి ఈ రూపకానికి వరకట్నమనో వరశుల్కమనో కాక వర విక్రయం అని నామకరణం చేశాడు.

నాటి సమాజంలోని దురాచార నిర్మూలనకై చేయబడిన అనేక ఉద్యమాలు కూడా ఈ వర విక్రయ రూపకంలో పొందుపరచారు. చరఖా ఉద్యమం, ఖద్దరు ధారణ, సహాయ నిరాకరణానికి నిర్మాణాత్మక విషయాలు నేపథ్యంగా స్వీకరించారు కాళ్లకూరి. ఆంగ్ల సంస్కృతీ వ్యామోహంలో పీడింపబడుతున్న విద్యార్థి లోకం ఎంత విజాతీయ భావదాస్యంలో కూరుకుపోయిందో, సొమ్ము కోసం కొడుకులను అమ్ముకోవడం ఈ రూపకంలోని వరకట్న సమస్యకు నేపథ్యంగా చూపించారు కాళ్లకూరి. నాటి సమాజంలో ప్రాణం కన్నా ధనం విలువ ఎక్కువ. అందుకే యాభై మూడో యేట పెళ్లిచేసుకున్న లింగరాజు లాంటి పాత్రలను సృజించి బాల్య వివాహాల సమస్యను చక్కగా నిరూపించాడు. యువకులైనా, చదువుకున్నవారు అయి ఉండి కూడా స్వయంగా ఆలోచించలేని అసమర్థత వారిలో స్పష్టంగా కన్పిస్తుంది. వారి తల్లిదండ్రులు కూడా ధనానికే ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చారు.

పరువు; బ్రతిష్ఠయు బాటింపగారాదు
పొట్టకేమియుగర్చు పెట్టరాదు,
బంధువులేతేర బల్కరింపరాదు,
వేఱు విస్తరి యింటవేయరాదు,
కష్టజీవుల జూచి కటకటపడరాదు,
త్రిప్పక తనయప్పు తీర్చరాదు,
దారకేనియుపెట్టె తాళమీయగరాదు,
వేయి కల్లలకేని వెఱవరాదు,
ఇన్ని విధముల గాపాడకున్న ధనము
దక్కనేరదు; ధనము చేదక్కనింట
బెత్తనము లేదు; బయటను బేరులేదు
పలుకుబడి లేదు; బ్రతికిన ఫలము లేదు".

అని చెప్పటంలో ధనం విలువ నాడు సమాజంలో ఎలా ఉన్నదో తెలుస్తుంది. ఆ ధన సంపాదనకై ఎంత పనిచేయడానికైనా వెనుకాడకపోవడం, తద్వారా అనేక సమస్యలు కలుగడం సదామామూలే.

కొడుకులున్న తల్లిదండ్రులకు ఊరికే కష్టపడకుండా వచ్చే కట్నపు డబ్బు మీద ఆశ మిక్కిలి ఎక్కువ. వచ్చిన కోడలు తిండి ఒకప్రక్క వెలితిగా తినాలనీ, ఏమన్నా మాట్లాడకుండా పడి ఉండాలనీ, చెప్పకుండానే అన్ని పనులు చేయాలనే కోరికలు

కలిగిన మగపెళ్లివారు సమాజంలో అనేకమంది ఉన్నారు. "ఇచ్చేవాడొస్తే చచ్చేవాడు కూడా లేస్తాడన్న" సామెతలు ఇట్టి సమాజంలో లింగరాజు లాంటి వాళ్లని చూస్తే నిజమేనేమోననిపిస్తాయి.

ధనలోటు కారణంగా దంతాలు ఊడినవానికైనా సరే కుమార్తెలనిచ్చి పెళ్లి చేస్తున్న తల్లిదండ్రులు నాటి సమాజంలో అధికం. కట్నాలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్న వరకట్న సమాజమది.

'అప్పు కన్న (నలగయావళీ దక్షిణ
కన్న బస్సు కన్న గన్న తండ్రి
తద్దినంబుకన్న తప్పని సరియయి
యున్నదిపుడు కట్నమన్నియెడల'
అనటంలో కట్న ప్రభావం స్పష్టమౌతుంది.

"ఇళ్ల దగ్గరనే దేవతా మందిరములుండగా మొక్కుబడి పేరుతో తిరుపతికి వెళ్లినట్లు కట్నాన్నే పరువుగా భావించే వారికోసం పరిగెత్తడమెందుకు. దారిద్ర్యంతో బాధపడే వారైనప్పటికీ వంశ ప్రతిష్ఠ గలవారు మన దగ్గరలో ఎంతోమంది ఉన్నారు కదా!" అన్న కాళింది మాటలను బట్టి నాటి సమాజంలోని తల్లిదండ్రులు కుమార్తెల సుఖం కోసం ఎంత కష్టపడ్డారో తెలుస్తుంది. నాటి సమాజంలో పిండిబొమ్మ అయినా పిల్లనిస్తామనగానే కట్నానికి చేయిచాస్తుంది. పెళ్లి కాని ఆడపిల్లలు ఇంట్లో ఉంటే వచ్చే అపనిందలు ఎక్కువగా ఉండేవి. సూటిపోటి మాటలతో ఇరుగు పొరుగువారు ఎంతో కష్టపెట్టేవారు.

కాళింది తన అభిప్రాయాలన్నీ స్పష్టంగా చెప్పినప్పటికీ ఆమె తల్లిదండ్రులకు కట్నమివ్వకపోతే పెళ్లి కాదేమోనన్న భయం ఎక్కువగా ఉంది. ఎంతో ఉన్నతభావాలున్న వ్యక్తి, సంస్కార హృదయుడు అయిన పురుషోత్తమరావు కూడా క్రమక్రమంగా దిగజారిపోవడం అందుకు సాక్ష్యం. వివాహ విషయంలో కట్నానికే ప్రాముఖ్యం ఎక్కువ. ఆస్తులను అమ్ముకొని అయినా కట్నం ఇవ్వకపోతే పెళ్లి జరగదు. ఆడపుట్టుకే అవమానకరంగా మారిన కాలమిది. పుట్టిన జీవి గిట్టక మానదు కనుక అంతరాత్మకు ఇష్టంలేని ఈ పెళ్లిళ్లు ఎందుకు చేసుకోవాలని ఆత్మహత్యలకు పాల్పడుతున్న పడతులను వర విక్రయ రూపకంలోని కాళిందిను పాత్ర ఆలోచింపజేస్తుంది.

ఎన్నో తిప్పలు పడి పెళ్లి చేసినా లాంఛనాలు తీసుకునే ఆచారం మెండు. లింగరాజు తన భార్య సుభద్రతో నీకు రావలసిన లాంఛనములెన్నో ఉన్నాయి. అయిదురోజులు అయిదు మొహిరీలు, అయిదు కాసులు, అయిదు వెండి పలుదోముపుల్లలు, అయిదు బంగారు తాటి ఆకులు, అయిదు వెండి పలుగుట్ల పుల్లలు, అయిదు వెండి కాఫీ కప్పులు, అయిదు వెండి ఉప్మా ప్లేట్లు, అయిదు కుర్చీలు, అయిదు కాలిపీటలు, అయిదు మెత్తలు, బొట్టు పెట్టెలు, అద్దాలు, దువ్వెనలు, కుంకుమ భరిణలు, కాటుక్కాయలు, గంధపు గిన్నెలు, తలనూనె బుడ్లు, సెంటు బుడ్లు, సబ్బు పెట్టెలు, పౌడరు డబ్బీలు, చేతి రుమాళ్లు, గంధపు చెక్కలు, విసన కర్రలు, వెండి చేటలు, పసిడిపీతలు, ఈ లాంటివింకెన్నియో వచ్చును. అవన్నీ జాబితా రాసి ఉంచాను" అనడంలో కొండవీటి చేంతాడులా ఉన్న కోర్కెల జాబితాతో ఆడపిల్లల తల్లిదండ్రులను పీల్చిపిప్పి చేసే విధానం వ్యక్తమౌతుంది. కట్న కానుకలు కుదిరి పెళ్లికి సిద్ధమైన తరువాత కూడా ఆడపెళ్లివారి అగచాట్లు ఇంతింత అనరానివి.

"తెల్లవారగనె బిందెలతోడ నీళ్లను
పలుదోము పుల్లలబంపవలయు,
కావిళ్లతో వెన్క కాఫీయు, దోసె, లి
డ్డెనలు, నుస్మాయు పంపించవలయు,
తరువాత భోజనార్థము రండురండని

పిలిచిన వారినే పిలువవలయు,
కుడుచునప్పుడు పంక్తినడుమనాడుచుబెండ్లి
వారి వాంఛలు కనిపెట్టవలయు,
నిన్నిటికి సైచి వేలువ్యయించి గౌర
వించినను నిష్టురములె ప్రాప్తించుతుదకు''

మర్యాదలు ఎక్కడ లోపిస్తాయోనని ఆడపెళ్లివారు భయపడేవారు. భోజనాల వద్ద కూడా అతిథులను పదేపదే పిలవాలి. పిలిస్తే పలకకుండా నిద్రపోయేవాడొకడు. ఇదిగో వస్తున్నానని సిగరెట్టు చుట్టలు తాగేవాడొకడు, నా కోసం వేచి చూస్తారో లేదోనని ఎదురుచూచేవాడు ఒకడు, కోప్పడేవాడొకడు, ఈ విధంగా ఆడ పెళ్లివారి ఇంట కష్టాలు అనేకం. నాడు సమాజంలో కట్నాలు తీసుకోవడమే ఒక గౌరవం. బేరాలాడటం, వచ్చిన డబ్బుతో అప్పులు తీర్చేవారు అధికంగా ఉన్నారు. ఇలాంటి ధనలోభంతో పాటు సమాజంలో ధనమదం కలవారికి పనిచేయకుండా, కష్టపడకుండా ఉండాలన్న ఆలోచనలు ఎక్కువ. దీనితో కోర్టుల చుట్టూ తిరిగి అయినా ధన సంపాదన చేయాలనుకునేవారు ఎందరో ఉన్నారు. ధన లోభంతోనో, పట్టుదలతోనో, దురాశతోనో, వెర్రిపుట్టి దొంగ సాక్ష్యాలు కూడా పుట్టించి ప్లీడర్లకు ఫీజులిచ్చి ఎక్కడపడితే అక్కడ పడుకుని, తిన్నా తినకపోయినా సరే ధన సంపాదనే ధ్యేయంగా కలవారు సమాజంలో ఉన్నారని కాళ్ళకూరి పేర్కొన్నారు.

కట్నం కోసం చదువు చెప్పించటం, వారికి ఎంత ధనం ఎక్కువ వస్తే ఆ సంబంధం ఖాయం చెయ్యటం, పెళ్లి కాగానే చదువు మాన్పించడం లాంటి ఎన్నో పద్ధతులు వరకట్నం కోసం తంటాలుపడే ఆనాటి సమాజంలో కనిపిస్తాయి. డబ్బులు ఎక్కువగా రావటం కోసం రెండు మూడు సంబంధాల మధ్య పోటీలు పెట్టడంతో వేలంపాటలో ఎక్కువ ధరకు అమ్మిన వస్తువుల్లాగా పెళ్లికొడుకులను అమ్మే గొప్ప తల్లిదండ్రులు సమాజంలో ఉన్నారు. అందుకే ఈ వరవిక్రయం రూపకంలో వరకట్న సమస్యను సామాజిక సమస్యగా నిరూపించారు కాళ్లకూరి నారాయణరావు. ఏ ఒక్క ఆడకూతురుకో, ఆమె తల్లిదండ్రులకో కాకుండా నాటి సమాజంలోని ప్రతి ఆడపిల్లా, ఆమె తల్లిదండ్రులు ఈ వరకట్న పిశాచం పెట్టే బాధలకు గురయ్యారు. అందుకే ఇది సామాజిక, ఆర్థిక, సాంఘిక సమస్య.

## 12.6 వరవిక్రయం - దుష్ఫలితాలు :

వర విక్రయం వలన సమాజానికి ఎంతో ప్రమాదం కలుగుతుంది. వరకట్నం కోసమే బ్రతుకు గడవటం అలవాటు చేసుకుంటారు కొంతమంది. తమ స్వీయ సామర్థ్యాన్ని ఉపయోగించుకోకుండా వరకట్నం మీద ఆశపడి దానితోనే బ్రతకాలనుకొనే నిస్తేజపరులను తయారుచేస్తుందీ వరకట్నం.

డబ్బుకోసం పెళ్లికొడుకుల్ని వేలం వేసే స్థితికి దిగజారిపోవటం, ధనం కోసమే పిల్లలను బడికి పంపటం, అందువల్ల వాళ్లకి జ్ఞానం రాకపోగా వాళ్లు మూర్ఖులుగా తయారవటం దుష్పరిణామం! అర్థాంతరంగా చదువు మాన్పించడంతో మిడిమిడి జ్ఞానం కూడా వాళ్లల్లో నిండుకుంటోంది. ఆడపిల్లలను కన్నవారు వాళ్ల వివాహాల కోసం ఉన్న ఇల్లు, వాకిలి అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఉన్నవన్నీ అమ్ముకొన్న ఆడపిల్లల తల్లిదండ్రులను అల్లుడేమైనా చేరదీస్తాడా అంటే అదీ లేక రోడ్డున పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. దీంతో ఎన్నో కుటుంబాలు దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నాయి.

ఊరికే కట్నాలు, లాంఛనాల రూపంలో డబ్బు వస్తుంటే ఇది సమస్యగా గుర్తింపు పొందదు. వరకట్నాన్ని నిర్మూలించాలన్న ఆలోచన కూడా రాదు. బాధపడుతున్న ఆడపిల్లల తల్లిదండ్రులు అసలు ఆడపిల్లలను కనడమే మహాప్రమాదంగా భావించడం ప్రారంభమైంది. అంతటితో ఆగకుండా ఆడపిల్లలని తెలుసుకుని భ్రూణహత్యలకు పాల్పడటం ప్రారంభమయింది. ఒకవేళ

ఆడపిల్ల పుట్టినా ఏదో ఒక రకంగా వదిలించుకునే స్వభావం సమాజంలో చోటుచేసుకొంది. మూడు నాలుగు పెళ్లిళ్లు చేసుకునే ప్రబుద్ధులు సైతం వరకట్నం కోసం మళ్లీ వివాహానికి కూడా సిద్ధపడటం జరిగింది.

ఆడపిల్లలు అత్తవారింట్లో అనుభవించే కష్టాలు, అడిగిన కట్నం ఇవ్వలేని తల్లిదండ్రుల బాధలు వర్ణనాతీతం. ధనం కోసం కోడళ్ల చేత వెట్టిచాకిరి చేయించటం, చెయ్యకపోతే ఇంటి నుండి వెళ్లగొట్టడం లేకపోతే పనిమనిషి స్థానంలో కోడలిని ఊహించడం ఇలాంటి అనేక దుష్పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఆత్మగౌరవం కలిగిన ఆడపిల్లలు అనేక మంది ప్రాణాలు తీసుకొని తల్లిదండ్రులకు భారం తగ్గించాలనుకోవటం కూడా వరకట్న ప్రభావమే. ఇందుకు వరవిక్రయంలోని కాళింది ప్రత్యక్ష సాక్ష్యం.

కట్నం డబ్బులు ఇవ్వలేక కులలోప, గుణలోపాలను సైతం లెక్కచేయకపోవటం, పరువు ప్రతిష్ఠలను గమనించకపోవటం, మంచి చెడులను పట్టించుకోకపోవటం, చదువు సంస్కారాలకు గుర్తింపులేకపోవటం, పెళ్లి కొడుకుల రూపురేఖలు, అలవాట్లు కూడా గణించకపోవటం వరకట్న తీవ్రతను సూచిస్తున్నాయి. ఆడపిల్లలు ఇష్టం లేని భర్తతో కాపురం చేయలేక, అత్తవారింట్లో ఇమడలేకపోవటం, కాపురం విడిపోవడం, వాళ్ల పిల్లలు అనాథలు కావటం లాంటి అనేక దుష్ఫలితాలు వరకట్నం వల్ల కలగడం విచారకమైన విషయం. డబ్బు లేక బాలికలను వృద్ధులకిచ్చి పెళ్లి చెయ్యడంవలన చిన్న వయసులోనే వితంతువులైన స్త్రీలున్నారు. వారికి సమాజంలో గుర్తింపు, గౌరవం లేకపోవడం, దానివల్ల అనేక కష్టాల పాలవటం కూడా వరకట్న ప్రభావమే.

## 12.7 ముగింపు :

"కావ్యేషు నాటకంరమ్యమ్" అని లోకంలో ప్రసిద్ధి. పలురకాలైన కావ్య ప్రక్రియల్లో నాటకం మనోహరమైంది. కావ్యరచన వలన సాధించదగిన ప్రయోజనాలను నాటక రచన వల్ల ఇంకా అధికంగా సాధించవచ్చు.

**"కావ్యం యశసేఽర్థ కృతే వ్యవహారవిదేర్ధశివేతరక్షతయే**
**సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మిత తయోపదేశయుజే"**

కావ్యం వల్ల యశస్సు లభిస్తుంది. అర్థం (ధనం) లభిస్తుంది. వ్యవహారనేతృత్వం కలుగుతుంది. అశుభాలు నశిస్తాయి. రసిక జనానందం కలుగుతుంది. ఉపదేశం చేకూరుతుంది. వీటిలో చివరి రెండూ పాఠకులకు ముఖ్యమైనవి. ఆనందంతోపాటు కావ్యం వల్ల ఉపదేశం కూడా లభిస్తుంది. నాటకం కావ్యాల్లో ఉత్తమమైంది కనుక నాటకం ద్వారా లభించే ఉపదేశం పాఠకులను, ప్రేక్షకులను అమితంగా ప్రభావితం చేస్తుంది. ఈ ప్రభావాన్ని గుర్తించిన రచయిత ఉత్తమమైన ఉపదేశాన్ని అందించడానికే ప్రయత్నిస్తాడు.

లోకంలో ఇతరులకుపదేశించేవాళ్లు ఎందరో ఉంటారు. ఆ ఉపదేశాల్ని ఆచరించేవాళ్లు మాత్రం కొందరే. అయితే తాను ఆచరించిన ధర్మాలనే ఉపదేశించేవాళ్లు నూటికో కోటికో ఒక్కరుంటారు. అటువంటి వారిలో కాళ్లకూరి వారు ప్రముఖులు. విధవా పునర్వివాహాలకు, వర్ణాంతర వివాహాలకు కాళ్లకూరి వారు ఎప్పుడూ సానుకూలంగా స్పందిస్తారు. వరకట్నం కన్యాశుల్కాలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. తాను నమ్మిన సిద్ధాంతాల కోసం పోరాడి కష్టనష్టాలు అనుభవించిన వ్యక్తి. అందువల్లనే కాళ్లకూరి వరవిక్రయంలో ఇచ్చిన సందేశాలు ఎంతో విలువైనవి.

వర విక్రయ నాటకం వరశుల్కానికి వ్యతిరేకంగా రచింపబడ్డ గ్రంథం. వరశుల్కం, వరకట్నం అనే పేర్లు ఉండగా రచయిత వర విక్రయం అనే పేరును ఎందుకు ఎన్నుకున్నాడు. అంటే వాటికంటే వర విక్రయం అనే పదం కట్నాభిమానులకు అవమానం కలిగించే పదం. వరుడి తల్లిదండ్రులు గాని, వరుడు తనంతట తానుగాని కట్నాన్ని ఆశించడం తననుతాను

అమ్ముకోవటమే అని కాళ్లకూరి వారి ఉద్దేశ్యం. ఆ దృష్టితోనే ఈ రూపకంలోని కథను రచయిత తీర్చిదిద్దాడు. బసవరాజు పెంపుడు తండ్రి లింగరాజు బసవరాజును సంతలో వస్త్రంలాగా, పశువులాగా వేలం వేశాడు. పెచ్చు పాటపాడిన పురుషోత్తమరావు వరుణ్ణి దక్కించుకున్నాడు. కట్నాన్ని ఆశించే పురుషుడి చేత పుస్తెతాడు కట్టించుకోవటం కంటే మెడకు ఉరితాడు బిగించుకోవటం మేలని భావించి కాళింది ఆత్మహత్య చేసుకుంది. ఈ దురాచారాన్ని ప్రోత్సహించి తన అక్క మరణానికి కారకులైన తండ్రీకొడుకులకు బుద్ధి చెప్పాలనుకుంది కాళింది చెల్లెలు కమల. అందుకు అనుగుణంగానే పెళ్లి పత్రికలను అచ్చు వేయించింది. తనపై బసవరాజుకు ఏ మాత్రం అధికారం లేదని, డబ్బుకు అమ్ముడుపోయిన బసవరాజుపైన అధికారం తనకే ఉందని, న్యాయస్థానంలో వాదించింది కమల. న్యాయమూర్తి చేత, బసవరాజు చేత కూడా ఔననిపించుకుంది. "విక్రయం అనే పదాన్ని ఈ రూపకంలో ఉపయోగించటంలో ఇంత ప్రత్యేకత ఉంది. గ్రంథ ప్రారంభం నుండి ముగింపు వరకు సందర్భం వచ్చినప్పుడల్లా వరకట్నానికి వ్యతిరేకమైన అభిప్రాయాలనే ఈ రచయిత వ్యక్తీకరించాడు. ఆంధ్రదేశంలో వ్యాపించిన కన్యాశుల్కం, వరశుల్క దురాచారాల వల్ల నష్టపోయింది స్త్రీలే అనటం వారి పట్ల న్యాయంగా ప్రవర్తించమని సూచించటానికే.

ఈ నాటకం చివరలో రచయిత పాత్రల చేత చేయించిన ప్రబోధం వరవిక్రయాన్ని గురించి అందరినీ ఆలోచింపచేస్తుంది.

కట్నం తీసుకోవటమే ఘనంగా భావించే అజ్ఞానులారా! అబ్బాయి పెళ్లితో అప్పులు తీర్చి డబ్బు నిలవచేయదలచు నీచులారా! వరకట్నాలు కూడవని తెలుసుకోండి. పూజ్యతరమైన భారతపుణ్య భూమిలో ఇంత నీచమైన విక్రయం తగదు.

కట్నాలకై పుస్తకాలను చేతబట్టి పాఠశాలలకు వెళ్లే చవటలారా! కాళ్లు కడిగి కన్యనిచ్చినవారి కొంపలమ్మించెడు కుమతులారా! అల్కపానుపు లెక్కి అవి ఇవి కావలెననెడి అధములారా! కట్నం అనే పేరుతో చిల్లిగవ్వ తీసికొన్నను భార్యకు అమ్ముడై పోయినట్లేనని తెలిసికొనుము. అత్తవారింట బానిసగా మారటమని యెరుగండి.

మగబిడ్డ పుట్టిన నాడే రాబోయే కట్నం లెక్కించు రాక్షసులారా! లాంఛనాల పేరుతో లక్ష చెబుతూ ఇల్లు గుల్ల చేసే దరిద్రులారా! డబ్బుకై ఇంత గడ్డి కరవకండిరా!

వెలపుచ్చుకొనివచ్చే వెలమగలచేత పుస్తె కట్టించుకొనే కన్యలారా! కట్నాల మగలతో పల్లకీలలో ఊరేగే పడతులారా! స్త్రీ జాతికి అంత కంటే అగౌరవమున్నదా! ఇకనైనా పౌరుషంతో బతకండి! అని కాళ్లకూరి నారాయణరావు వరవిక్రయ నాటకంలోని పాత్రల ద్వారా ఉపదేశాన్ని అందించారు. నాటి వరవిక్రయం 'రావణకాష్టంలా' పెరుగుతూనే ఉందిగానీ తగ్గటం లేదని గమనించాలి. ఈ వర విక్రయం వల్ల కలిగే దారుణ ఫలితాలను గురించి ఒక్కసారైనా ఆలోచించాలనే కనీస స్పృహ సమాజానికి కలిగించాలనే ఉద్దేశ్యంతో ఈ రూపకాన్ని కాళ్లకూరి నారాయణరావు రచించారు.

**- ఆచార్య తేళ్ళ సత్యవతి**

పాఠం - 13

# గురజాడ కథానికలు - స్త్రీలు

## ఉద్దేశ్యం :

"మహిళాధ్యయనం" అనే పేపర్లో సాహిత్యం ఆధారంగా స్త్రీ జీవితాన్ని అధ్యయనం చేసే క్రమంలో గురజాడ వెంకట అప్పారావు కథానికల్లో ఉన్న స్త్రీ పాత్రలను పరిచయం చెయ్యడం, వాళ్ళ చైతన్యాన్ని విశ్లేషించి చూపడం ఈ పాఠం లక్ష్యం. ఈ పాఠం చదివిన తర్వాత ఆధునిక సమాజం తొలిదశలో మన రచయితలు స్త్రీల పట్ల ఎలాంటి దృక్పథం కలిగున్నారో అర్థమౌతుంది.

## పాఠ్య స్వరూపం :

ఈపాఠంలో క్రింది అంశాలను మీరు తెలుసుకుంటారు.

**13.1.** గురజాడ - పరిచయం

**13.2.** గురజాడ - స్త్రీ దృక్పథం

**13.3.** గురజాడ కథానికలు - పరిచయం

**13.4.** గురజాడ స్త్రీ పాత్రలు - విశ్లేషణ

- ఎ) కమలిని (దిద్దుబాటు)
- బి) మెటిల్డా (మెటిల్డా)
- సి) సరళ (సంస్కర్త హృదయం)
- డి) నాంచారమ్మ (మీ పేరేమిటి ?)

**13.5** సారాంశం

**13.6** మాదిరి ప్రశ్నలు

**13.7** ఉపయుక్త గ్రంథాలు

తెలుగు సాహిత్యంలో ఆధునిక మహిళల్ని సృష్టించే ప్రయత్నం చేసిన రచయితల్లో అగ్రగామి. ఆయన సాహిత్యంలో మనం అంతకుముందు సాహిత్యంలో చూడని పాత్రలను చూస్తాం. అంతకుముందు సాహిత్యంలోని స్త్రీ పాత్రలలో లేని చైతన్యాన్ని చూస్తాం. గురజాడ కథానికల్ని స్త్రీ జీవితం దృష్ట్యా చదవడం గొప్ప అనుభూతి.

## 13.1. గురజాడ పరిచయం :

గురజాడ పూర్తి పేరు గురజాడ వెంకట అప్పారావు. ఈయన 1862 సెప్టెంబర్ 21న విశాఖ జిల్లా యలమంచిలి తాలూకా రాయవరం గ్రామంలో మాతామహుల ఇంట్లో జన్మించారు. 1915 నవంబర్ 30న తన 53వ ఏట మరణించారు. కౌశల్యమ్మ, వెంకటరామదాసు ఈయన తల్లిదండ్రులు. అప్పలనరసమ్మ ఈయన భార్య. లక్ష్మీనరసమ్మ, వెంకట రామదాసు, కొండయ్యమ్మ ఈయన సంతానం. గురజాడ తత్వశాస్త్రం అభిమాన విషయంగా సంస్కృతం రెండోభాషగా బి.ఏ., చదివారు. 1884 నుండి విజయనగరం మహారాజ కళాశాల హైస్కూలులో 25 రూపాయల జీతంతో ఉపాధ్యాయుడుగా చేరి ఆ కళాశాలలోనే నాలుగో లెక్చరర్గాను, మూడో లెక్చరర్గాను పనిచేశారు. ఈ మద్యకాలంలోనే డిప్యూటీ కలెక్టర్ ఆఫీసులో హెడ్క్లర్క్గా

కొన్నాళ్ళు పనిచేశారు. 1891లో విజయనగరం సంస్థాన శాసన పరిశోధక పదవిని చేపట్టారు. 1898లో ఆనందగజపతి అక్కగారైన అప్పల కొండమాంబ ఆంతరంగిక కార్యదర్శి అయ్యారు. 1911లో మద్రాసు విశ్వవిద్యాలయం బోర్డ్ ఆఫ్ స్టడీస్‌లో సభ్యులయ్యారు. 1913లో మద్రాసు విశ్వవిద్యాలయం 'ఫెలో' అయ్యారు.

1882లో మెట్రిక్యులేషన్ చదువుతున్న కాలంలో 'కుక్కు' అనే ఆంగ్ల కవితతో గురజాడ రచనాజీవితం మొదలైంది. 1883లో 'సారంగధర' కావ్యాన్ని ఆంగ్లంలో రాశారు. ఇది అప్పట్లో కలకత్తా నుంచి వస్తూ వుండిన 'రీస్ అంతోరయ్యత్' అనే పత్రికా సంపాదకుడు అయిన శంభు చంద్రముఖర్జీ ప్రశంస పొందింది. 1892లో కన్యాశుల్కం నాటకం ఆగస్టు 13న ప్రదర్శింపబడింది. అది 1897లో అచ్చయింది. 1906లో 'కొండుభట్టీయం' నాటకాన్ని రాశారు. 1907లో 'నీలగిరిపాటలు' రాశారు. 1909లో కన్యాశుల్క నాటకాన్ని పునర్మించి ప్రచురించారు. 1910లో గురజాడ అనేక గొప్ప రచనలు చేశారు. 'ముత్యాల సరాలు' కాసులు వంటి కవితలు, 'దిద్దుబాటు', 'మీ పేరేమిటి ?' వంటి కథలు రాశారు. 1911లో 'లవణరాజుకల' 1912లో 'కన్యక' వంటి కవితలు రాశారు. 1910లో బిల్హణీయం అనే శృంగార నాటక రచనా ప్రయత్నం చేశారు.

గురజాడ కవి, కధకులు, నాటక రచయిత. నవలా రచనా ప్రయత్నం చేశారు. చరిత్ర పరిశోధకులు, గొప్ప ఉపాధ్యాయులు. తెలుగు సాహిత్యాన్ని వస్తువులో రూపంలో ప్రజాస్వామీకరించారు. గిడుగు రామమూర్తితో కలిసి వ్యావహారికభాషకు అగ్రస్థానమిచ్చారు. నాటకంలో, కథలలో వ్యావహారిక భాషను ఉపయోగించారు. కవిత్వంలో గేయఛందస్సును ఉపయోగించారు. ఆధునిక తెలుగు సాహిత్యానికి దిశానిర్దేశనం చేసిన దీపధారి గురజాడ. మద్రాసు విశ్వవిద్యాలయం పాఠ్యప్రణాళికలో వాడుక భాషకు స్థానం కల్పించని ఛాందసుల మీద తిరుగుబాటు చేసి 'అసమ్మతి వ్రతం' సమర్పించారు. సాహిత్యంలో వర్తమాన జీవిత వాస్తవికానికి పట్టం కట్టారు. అందుకే నవయుగ వైతాళికుడని పేరుపొందారు.

## 132. గురజాడ స్త్రీ దృక్పథం :

ఆధునిక భారతీయ సాహిత్యం అన్ని భాషలలోనూ స్త్రీ ప్రాధాన్యంగానే ప్రారంభమైంది. స్త్రీ వ్యక్తిత్వాన్ని గుర్తించడం, బాల్య, అసమ, కన్యాశుల్క వివాహాల నిరసనం, వితంతు వివాహాల సమర్థనం. స్త్రీ విద్యా ప్రచారం వంటి అంశాలు అప్పటి సాహిత్యవస్తువులు. గురజాడ అప్పారావు సాహిత్యం నిండా స్త్రీప్రాధాన్యమే కనిపిస్తుంది. గురజాడ స్త్రీలపట్ల శాస్త్రీయమైన దృక్పథం గల రచయిత". ఆధునిక మహిళలు మానవచరిత్రను తిరిగి రచిస్తారు" "ఈ సమాజంలో స్త్రీల కన్నీటి గాధలకు కారణం నాకు తెలుసును. తిరిగి వివాహమాడకూడదనే నియమం, విడాకుల హక్కులేని కారణం, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం స్త్రీల కన్నీటిగాధలకు హేతువులు". 'సామాజిక పరిణామ చరిత్రలో వివాహ సంస్థకున్న ప్రాధాన్యాన్ని నేను తక్కువ చేస్తున్నాననుకోకు . . . వివాహ సంస్థ పురోగతికి దోహదం చేసినదన్న మాట నిజమే. అయితే వివాహబంధాన్ని తెంచుకోరాదన్న నియమం చెప్పనలవికాని కన్నీటిగాథలకు కారణం. ఈ సత్యాన్ని మన మెవ్వరమూ విస్మరింపలేము" సానిపిల్లలో వుండే మానవత్వాన్ని నువ్వు మరచిపోకు. అమ సైతం వొక మానవవ్యక్తి అనే మాటను విస్మరించకు" ఇలాంటి అభిప్రాయాలను పరిశీలించినప్పుడు గురజాడ స్త్రీ జీవితాన్ని ఒక సామాజిక మానవీయ దృష్టికోణంనుంచి చూశారనిపిస్తుంది. స్త్రీ సమస్యను గురజాడ వాస్తవిక దృక్పథంతో విశ్లేషించారు. సామాజిక కట్టుబాట్లలో, కట్టుబాట్ల పేర సంకెళ్లలో ఇరుకున్న భారతీయ స్త్రీని, గురజాడ తన ఆధునిక దృక్పధంతో దర్శించి సంకెళ్ళు తెంచుకోవలసిన అవసరాన్ని గుర్తుచేశారు. గురజాడ దృష్టిలో స్త్రీ పురుషుడికన్నా ఏవిధంగానూ తక్కువది కాదు. ఆమెలో వ్యక్తిత్వం ఉంది. అది హరింపబడింది. పోగొట్టుకొన్న వ్యక్తిత్వాన్ని స్త్రీ ఆధునిక విద్య ప్రసాదించే చైతన్యం ద్వారా సంపాదించాలని గురజాడ కోరుకున్నారు. గురజాడ పరిపూర్ణమైన స్త్రీమూర్తిని కలగన్నారు. అందుకు అవరోధంగా ఉన్న సర్వాంశాలను గురజాడ అధిక్షేపించారు. ఎగతాళి చేశారు. గురజాడ స్త్రీ పట్ల వాస్తవిక, శాస్త్రీయ దృష్టి ఏర్పరచుకోమని పురుష జాతికి ప్రబోధించారు. ఆయన ఆధునిక భారతీయ మహిళను తన సాహిత్యం ద్వారా రూపొందించే

ప్రయత్నం చేశారు. ఆయన కథానికల్ని పరిశీలిస్తే ఈ వాస్తవం రుజువౌతుంది. గురజాడ కథానికల్లోని స్త్రీలను అర్థం చేసుకునేముందు, ఆయన కథల్ని పరిచయం చేసుకుందాం.

## 13.3. గురజాడ కథానికా సాహిత్యం : పరిచయం :

గురజాడ కథానికా రచనను చేపట్టింది ఆయన జీవిత అవసాన దశలో కావడంవల్ల ఎక్కువ కథలు రాయలేకపోయారు. ఆయన డైరీలలో ఆయన రాయాలనుకున్న కథలకు ఎంతో సామాగ్రిని రాసిపెట్టుకున్నారు. 1895నాటి గురజాడ డైరీలలో క్రింది సమాచారం లభిస్తున్నది.

ఫిబ్రవరి - 13 : దూడగడ్డి, వూకతినుట, పరమానందయ్య గారి శిష్యులు, ఏనుగు, కాకి, రెండు పావురములు, తోవ, వంటపాత్ర, చీమ నెమలి నేస్తం, రాజూ ఆడమనిషి, తన భార్యను రోసినరాజు.

ఫిబ్రవరి - 27 : వైద్యుడు గుర్రం, వైద్యుడు కరక్కాయ, రాజు మంగలిని మంత్రిని చేయుట, మిడితంభట్లు, సవారి, ముందూవెనకా, జ్యోతిష్కుడు, మంచి గంథపు చెట్లు అమ్మకం, ససేమిరా, ఏకపధాను కర్తవ్యం, రాజుభార్యను రాజు చంపుట, మంత్రి భార్యను బతికించుట, పక్షులు మాట్లాడుకోవడం, రాచకన్యల తాలుకు బట్టలు నిమిత్తం కుమారుడు.

మార్చి - 10 : గారడీవిద్య, విక్రమార్కుడు దొంగతనం, అతనుసాని యింటికి వెళ్ళుట, రాజు దొంగతనం నేర్చుట, నక్కులు, రాజు, రాజకుమారుడువుండు ఇల్లు, పురోహితుడు, బాబిగాడు నెల్లూరు ప్రయాణం, మంత్రి బంగారు గిన్నె ఎత్తుకుపోవడం, గొడ్డుకోతబడ్డది.

ఈ సమాచారాన్నిబట్టి గురజాడ కన్యాశుల్క నాటక రచనాకాలం నుండి కధానికల్ని రాయాలని భావించినట్లు తెలుస్తుంది. ఆయన ఎన్నో కథలు రాయాలని పేర్లు, పథకాలు రాసిపెట్టుకున్నా రాయగలిగింది మాత్రం అయిదు కధానికలే. In Gurajada's diaries and note books their is enough raw material for atleast one hunderd stories" అంటారు వి.ఆర్.నార్ల (Gurajada p. 60). వైవిధ్యభరితమైన బాధ్యతలు, అనుకూలించని ఆరోగ్యం, జమిలిగా ఈ గురజాడ పంధానికి రచనా ప్రయత్నాన్ని గ ండికొట్టాయి. పైగా గురజాడ తన కథల్ని పందొమ్మిదో శతాబ్దంలోనే రాశారని, ప్రచురణ ఆలస్యంగా చేశారని వాదం ఉంది.

గురజాడ రాసిన కథలు అయిదు మాత్రమే. అవి

1. దిద్దుబాటు (1910, ఫిబ్రవరి, ఆంధ్రభారతి)
2. మీ పేరేమిటి ? (1910, ఏప్రిల్, మే, జూన్, ఆంధ్రభారతి)
3. మెటిల్డా
4. పెద్ద మసీదు (మతము - విమతము)
5. సంస్కర్త హృదయం.

ఈ కథను 1904లో ఇంగ్లాండులోని హాంప్‌స్టెడ్ నుంచి మాక్స్ పెంబర్టన్ భారతీయ జీవితాన్ని ప్రతిబింబించే కథలు అయిదువేల మాటలకు ఎక్కువ కాకుండా రాసిపంపమని చేసిన అభ్యర్థన మేరకు గురజాడ "Stooping to raise" అనే పేరుతో ఆంగ్లంలో రాశారు. దానికి అవసరాల సూర్యారావు చేసిన అనువాదం 'సంస్కర్త హృదయం'.

ఈ అయిదు కథలూ సమాజంలోని విభిన్నరంగాలకు చెందినవి. ఒక్క 'పెద్ద మసీదు' తప్ప తక్కిన వానిలో వస్తువు సమకాలీనమే దిద్దుబాటు 'మెటిల్కా' కుటుంబంలో స్త్రీ పురుష సంబంధాలకు చెందిన కథానికలు. సంస్కర్త హృదయం' వేశ్యా

సమస్య, దాని పరిష్కారం, పరిణామాలను చిత్రించింది. పెద్ద మసీదు, మీ పేరేమిటి ? ఈ రెండూ మతానికి సంబంధించినవి. మొదటిది హిందూ మహమ్మదీయ మతసంబంధికాగా, రెండవది హిందూమతంలోని శైవ వైష్ణవశాఖల కుమ్ములాటలకు సంబంధించినది. 'పెద్దమసీదు'లో మతాభిమానానికి హేతువాదానికి మధ్య సంఘర్షణ ఉంటే 'మీ పేరేమిటి' లో మతంలోంచి ఆధ్యాత్మికత లోపించి, కొందరి పొట్టకూటికోసం పనికొచ్చి ఒక పరికరంగా మిగిలిపోయిన తీరు ప్రతిబింబించింది. ఈ కథలన్నీ జీవితవాస్తవాన్ని ఆశ్రయించుకున్న సామాజిక చిత్రణలే (కె.వి. రమణ, రెడ్డి మహోదయం. పు. 250).

ఈ అయిదు కథలలో 'పెద్దమసీదు'లో స్త్రీ పాత్రలు లేరు గనుక తక్కిన నాల్గింటిని అధ్యయనం చేద్దాం.

**కథానికలు :**

## 1. దిద్దుబాటు :

కమలినీ గోపాల్రావులు భార్యాభర్తలు. ఇద్దరు చదువుకున్న వారే. రాముడు వాళ్ళ నౌకరు. గోపాల్రావు సంస్కరణోద్యమంలో వేశ్యా వ్యతిరేకోద్యమంలో పాల్గొంటున్నట్లు భార్యకుచెప్పి, రోజూ సాని దగ్గర కాలం గడిపి ఆలస్యంగా ఇంటికి వస్తూ వుంటాడు. ఈ సంగతి కమలినికి తెలుస్తుంది. భర్తను మార్చడానికి పథకం వేస్తుంది. "అయ్యా ! పది దినములాయె. రాత్రుల నింటికి మీ రాకను నేనెరుగను. మీటింగులకు బోవుచుంటిమంటిరి. లోకోపకారమునకై ఉద్యమముల నిదురమాని చేయుచుంట మంటిరి. మా చెలుల వలన నిజము నేర్చితిని. నేనింటనుండుటను గదా మీరు కల్లలు పలుకవలసివచ్చెను. నేను పుట్టింటనున్న మీ స్వేచ్ఛకు నిర్బంధమును, అసత్యమునకు అవకాశమును కలుగకుండును. మీచే దినదినమును అసత్యమాడించుట కన్న మీ త్రోవకు అడ్డుగ నుండకుంటయే పతిమేలుకోరిన సతికి కర్తవ్యము కాదా ! నేనీ రేయికన్నవారింటికి చనియెద ! అని ఒక ఉత్తరం రాసి టేబుల్ మీద పెట్టి, దీపాలు ఆర్పేసి, తలుపు తెరచిపెట్టి, మంచం కింద దాక్కుంటుంది. గోపాలరావు రాత్రి ఒంటి గంటకు వస్తాడు. పిలిస్తే భార్య పలుకదు. తలుపు తెరచి పెట్టిఉంది. ఇల్లంతా చీకటి. ఇంట్లోకి వెళ్తాడు. అగ్గిపుల్లగీసి చూస్తాడు. కమలిని కనిపించదు. నిశ్చేష్టుడౌతాడు. బయటకు వచ్చి వీధి నడుమచుట్ట కాలుస్తున్న నౌఖరు రామును పిలుస్తాడు. అతడునిజం చెప్పకపోగా పరిహాసమాడతాడు. తిరిగి ఇంట్లోకి వచ్చి టేబుల్ దగ్గర కూర్చుంటాడు. అప్పుడు ఉత్తరం కనిపిస్తుంది. తాను తన భార్యకు అపచారం చేశానని తిరిగి ఎప్పుడూ తప్పు చేయనని చెప్పి భార్యను తీసుకురమ్మంటాడు రామునితో. అతన్ని మామగారి ఊరికి ప్రయాణం కమ్మని పదిరూపాయలిస్తాడు. కమలినిని తీసుకొస్తే మరో పదిరూపాపయలిస్తానంటాడు. కమలినితో చెప్పవలసిన మాటలు చెప్పి, వాటిని ఏం చెబుతావో చెప్పు అంటాడు. రాముడు ఆ మాటల్ని తలక్రిందులు చేసి చెబితే గోపాల్రావు తరుంతుంటాడు. అప్పుడు మంచం కింది నుంచి గాజుల చప్పుడు, స్త్రీ నవ్వు వినిపిస్తాయి.

## 2. మెటిల్డా :

మెటిల్డా యవ్వనవతి, సౌందర్యవతి. ఆమె భర్త వయసులో ఆమెకన్నా చాలాపెద్దవాడు. అతడు మెటిల్డాను ఎప్పుడూ అవమానించేవాడు, హింసించేవాడు. 55 లేక 56 సంవత్సరాల వయసుగల ఈభర్త చదువుకున్నవాడే. ఆంగ్లపద్ధతిలో బతుకుతున్నవాడే. కాని భార్యను బాగా పీడించేవాడు. ఆమెను హింసించడమేగాని ఆమె ముఖంలోని విషాదరేఖల్ని గురించి పట్టించుకోడు. చుట్టుప్రక్కల వాళ్ళకు అతనిపేరు తెలియదు. పోస్ట్‌మాన్‌కు మాత్రమే అతని పేరు తెలుసు. అందుకే భార్యను నిరంతరం పీడించే అతనికి ఇరుగుపొరుగువారు 'ముసలిపులి' అని పేరుపెట్టారు. ఆయనకు ఒక అక్క ఉంది. ఆమె మెటల్డాను నిరంతరం జగడాలకు పిలుస్తూ ఉండేది. ఆ యింటికి ఇతరులెవ్వరూ రారు. మెటిలా గుమ్మం దాటకూడదని శాసనం. ఆమె ముఖంలో ఎప్పుడూ విచారం కనబడుతూ ఉండేది.

ఒకరోజు ఒక వృక్షశాస్త్ర విద్యార్థి దారినబోతూ గుమ్మం దగ్గర నిలబడి మెటిల్డాను చూస్తాడు. ముసలిపులి భర్త అతనిని ఇంట్లోకి పిలచి "ఈ ముండను తీసుకుపో, నీకు దానము చేశాను. తీసుకుపో, నాకు శనివిరగడైపోతుంది" అని అంటాడు. మర్నాడు మెటిల్డా ఆ విద్యార్థిని ప్రాధేయపడుతూ "మీరు మీ నాకాపరం మన్ననివ్వరా ? మీకు నేనేం అపకారం చేశాను ? తలవంచుకు మీతోవను మీరుపోతే నే బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్దం" అని ఉత్తరం రాసి వంటబ్రాహ్మణునితో పంపించింది. తర్వాత కొన్నాళ్లకు ఆముసలి పులి ఆ విద్యార్థిని పిలచి, తనలో చాలా మార్పు వచ్చిందని, తనకు చాలా తెలిసి వచ్చిందని తాను మారానని చెబుతాడు.

## 3. సంస్కర్త హృదయం :

సీతాపూర్ కాలేజీలో రంగనాథయ్యరు కెమిస్ట్రీ ప్రొఫెసర్. సంఘ సంస్కరణతో త్సాహి, ఉన్నత భావోద్రేకి. మానవునిలో శారీరక మానసిక దైర్భల్యాలు ఉన్నాయని వింటేనే అతనికి జుగుప్స. అన్యాయాన్ని అవినీతిని ఏ రూపంలో ఉన్నా సరే ఏరిపారేయాలనే పట్టుదల గలవాడు. ఆయన వేశ్యావ్యతిరేకోద్యమంలో అలజడిని సృష్టిస్తున్నాడూ వేశ్యాప్రియులైన వాళ్ళమీద విరుచుకుపడ్డాడు. వాళ్ళని దేశద్రోహులుగా చిత్రిస్తూ వ్యాసం ప్రచురించాడు. జిల్లా మున్సబు కోపానికి గురయ్యాడు. రంగనాథయ్యరు ఉద్యమంతో మున్సిఫల్ కౌన్సిల్‌లో, దేవస్థానం బోర్డులో చీలికలు వచ్చి రెండు వర్గాలు కొట్టుకోవడం దాకా వచ్చింది. ఊళ్ళో క్లబ్బు కూడా వేశ్యఅనుకూల వ్యతిరేక (ప్రోనాచీయాంటానాచీ) వర్గాలుగా చీలిపోయింది. ప్రోనాచీయులు తన దుష్ప్రచారం చేసినా, వేశ్యలు తననుఎగతాళి చేసినా రాంగనాథయ్యరు లెక్కచేయలేదు. తరువాతి గదిలో తన విద్యార్థులకు సైన్సు పాఠం చెబుతూ, ఏదో అవకాశం కల్పించుకొని పడుపు వృత్తిని దుయ్యబట్టేవాడు.

అలాంటి రంగనాథయ్యారు ప్రకృతి సౌందర్యోపాసి. గ్రీకుల వంటి సౌందర్యారాధకుడు. ప్రతిరోజూ స్వర్ణరేఖా నదీ తీరానికి షికారు పోయేవాడు. స్నేహితులతో కవిత్వం, విజ్ఞానం మొదలైన విషయాలను చర్చించేవాడు. ఆయన భార్య మాత్రం అతని సంస్కరణోద్యమం నచ్చక రోజూ గొడవ చేసేది.

ఒకరోజు రంగనాథయ్యరు చీకటిపడేదాకా కొండమీద ఉండిపోయాడు. అప్పుడు సరళ అనే వేశ్య కూతురు అక్కడి దేవాలయానికి వెళ్ళింది. ఆమెను చూడగానే అయ్యరులో అలజడి మొదలయ్యింది. "ఓహో ! ఏమా సౌందర్యరాశి" అని ఆశ్చర్యపోయాడు. ఆమెను గురించి తెలుసుకోవాలని ఆరాటపడ్డాడు. తన హృదయం హెచ్చరించింది. దానిని దబాయించి అదిమి పెట్టాడు. మళ్ళీ సోమవారం సరళ గుడికి వచ్చింది. తన స్నేహితుల నడిగి అయ్యరు ఆమె వివరాలు తెలుసుకున్నాడు. ఆమె వేశ్య కూతురని తెలిసి ప్రకృతిలోని అసంబద్ధతని విచారించాడు. కాని వెంటనే అతనిలోని మనిషి మేల్కొని 'సరళ సునాయాసంగాలభిస్తే' అనే కోరిక పొటమరించింది.

మర్నాడు గుడిలో సరళ పక్కనే నిలుచున్నాడు. ఆమె సాహచర్యం లభించాలని తపించాడు. ఆ తర్వాత రోజు ఉదయం ప్రిన్సిపాల్ గారితో తన వేశ్యా సంస్కరణాభిలాషను ప్రస్తావించాడు. ఆయన హెచ్చరించాడు. సరళను సంస్కరించే పథకంలో భాగంగా ఆమెకు పురాణపాఠాలు చేప్పడానికి విశ్వనాథ శాస్త్రిని యాభై రూపాయలిచ్చి నియమించాడు. అతని బోధలు ఆమె దగ్గర పనిచెయ్యలేదు. అయ్యరుకు మనశ్శాంతి లేదు. ఇంతలో క్రిస్‌మస్ శెలవులు వచ్చాయి. ఒకరోజు సాయంకాలం ఏదో ప్రయోగం చేసి ఆనందంలో మునిగిపోయి ఉంటే సరళ చెల్లెలు తరళ ఒక ఉత్తరం తీసుకొచ్చి అయ్యరుకు ఇచ్చింది. అది సరళ ఆ ప్రొఫెసరును తన ఇంటికి ఆహ్వానిస్తూ పంపిన లేఖ. ఆ రోజు రాత్రి చీకటిలో ఒంటరిగా సరళ ఇంటికి వెళ్ళాడు. ఇంటి దాకా పోయి, భయపడి తిరిగి ఇంటిదారి పడుతుంటే తరళ పిలుపు వినిపిస్తుంది. మళ్ళీ వెనక్కివచ్చాడు. సరళ గదిలోకి వెళ్లాడు. సరళను అందాన్ని తాగేస్తున్నట్టుగా చూశాడు. ఆమె కనిపించగానే అంతకుముందు తయారు చేసుకున్న ఉపన్యాసం మరచిపోయాడు.

అమె పెదవుల్ని ముద్దుపెట్టుకోవాలన్న కోరిక ఒక్కటే మిగిలింది. ఆమెతో మాట్లాడుతున్న సందర్భంలో ఆమె లేవనెత్తిన సామాజిక ప్రశ్నలకు సమాధానాలు చెప్పలేకపోయాడు. సరళ వీణమిటుతూ జావళీ పాడుతున్నది. ప్రొఫెసర్ గబుక్కున పోయి సరళ పెదవుల్ని ముద్దుపెట్టుకొన్నాడు. సరళ వీణ జారిపడిపోయింది. అయ్యరు 'దగాలో పడ్డాడు. మోసం మోసం' అని అరిచాడు. ఆ మాటలు విని సరళ సిగ్గుపడిపోయింది. ఆశ్చర్యపడింది. ప్రొఫెసర్ పరుగెత్తి వెళ్ళిపోయాడు. మార్నాడు ఉద్యోగానికి రాజీనామా చేసేశాడు. ఒకరిని లేవనెత్తబోయి కిందపడే అశాస్త్రీయ ఉద్యమ ధోరణికి సరళ బలైపోయింది.

## 4. మీ పేరేమిటి ?

రామగిరి అనే ఊరు విష్ణుక్షేత్రం. అక్కడ శైవం కూడా బలంగా ఉంది. బౌద్ధకడ్డాలు చాలా ఉన్నాయి. ఆ ఊళ్ళో శైవ వైష్ణవాలకు ఎప్పుడూ వైరమే, శైవ మతానికి మొనగాడు శరభయ్య, వైష్ణవ పక్షానికి కెప్తాను మనవాళ్ళయ్య. వీళ్ళిద్దరి స్వార్థ ప్రయోజనాలకోసం మత కార్యక్రమాలు, మార్పిడులు జరుగుతుంటాయి. ఆ ఊరి లక్ష్మాధికారి సారధినాయుడు. అతని బావమరిది, గ్రామ మునుసుబు రామినాయుడు. ఈ యిద్దరూ ఏ మతంవైపు ఉంటే ఆ మతం వెలిగిపోతుంది. శరభయ్య, మనవాళ్ళయ్య వీళ్ళను తమవైపు తిప్పుకోవడానికి నిరంతరం ప్రయత్నిస్తుంటారు. ఆ ఊళ్ళో రంగాచార్యులు వైష్ణవానికి ధర్మకర్త. ఆయన కొడుకు కృష్ణమాచార్యులు అంత ప్రయోజకుడు కాడు. కోడలు నాంచారమ్మ. ఆ ఊళ్ళో దేనికైనా శైవులు ఏకమౌతారు. వైష్ణవులు కారు. ఒక సందర్భంలో వీళ్లందరనీ నిలదీసి, వీళ్ళ గుట్టురట్టు చేసి బుద్ధి చెబుతుంది నాంచారమ్మ.

ఒకసారి దక్షిణ దేశం నుంచి ఒక అయ్యావార్లంగారు వచ్చి సారధినాయుడికి, మరికొందరు నాయళ్ళకి వైష్ణవం ఇప్పించి పోయాడు. అప్పట్నుంచీ వాళ్ళు శివాలయం వైపు చూడలేదు. ఇది శరభయ్యను కంట్లోకారం కొట్టినట్లై ఒక ఎత్తు ఎత్తాడు. హైదరాబాదు రాజ్యం నుంచి శివాచార్లు వచ్చి ఆ ఊళ్ళో అర్థరాత్రివేళ శివార్చన చేస్తూ అట్టహాసం చేస్తున్నాడు. దానిని చూచి ఆ ఊరి నాయళ్ళు మెల్లగా శైవంలోనికి జారుకున్నారు. ప్రధాన వ్యక్తి సారధి నాయుణ్ణి మార్చడానికి శైవులంతా ఇంటికి వెళ్ళారు. ఇది తెలిసి సాతానులు రంగాచార్యులుకు చెప్పాడు. ఆయన ఏ మతమైనా ప్రపత్తి వున్నవారికి తోవవుంది." అని చెప్పాడు. మనవాళ్ళయ్య రంగాచార్యులుతో లాభం లేదనుకొని, రాత్రి రెండు ఝాములప్పుడు మీటింగు పెట్టి సారథి నాయుణ్ణి శివాచార్ల గుండం దగ్గరికి పోకుండా ఆపాలన్నాడు. అందుకు రామానుజయ్య మనావాళ్ళయ్యను రాగిధ్వజం చేత బట్టుకొని నాలాయిరం పఠిస్తూ గుండం తొక్కమన్నాడు. మన వాళ్ళయ్య అతన్నే తొక్కమన్నాడు. రామినాయుడు మనవాళ్ళయ్య మహిమను నిలదీసి ఎద్దేవా చేశాడు. మనవాళ్ళయ్య తప్పించుకోడానికి చాలా ప్రయత్నించాడు. రామినాయుడు ఒప్పుకోలేదు. మనవాళ్ళయ్య ఆలోచించి "గరుడాళ్వారు అయినా యెప్పుడూ పెరుమాళ్ళారిని వీపున మోసుకునే బయల్దేరుతారు గాని ఒట్టినే రెక్క కదపరు". అన్నాడు. అది విని నలుగురు నాయళ్ళు పోయి పై మీద గుడ్డయినా లేని అయ్యావార్లను మోసుకొచ్చారు. రంగాచార్లు మనవాళ్ళయ్య నాయళ్ళతో వాదిస్తున్నాడు.

ఇంతలో ఒక చేతిలో కరదీపం, మరొక చేతిలో సూరకత్తి పట్టుకుని రౌద్రాకారంతో నాంచారమ్మ వచ్చింది. ఆమెను చూచి అందరూ భయపడి దూరంగాపోయారు. ఆమె మనవాళ్ళయ్యను, రామినాయుడిని ఏమికావాలని అడిగింది. వాళ్ళ తమకేమీ వద్దన్నారు. వాళ్ళను గుండం తొక్కమంది. ఇద్దరూ ఏదోసాకు చెప్పి తప్పించుకున్నారు. ఆమె వైష్ణవ పూజారుల స్వార్థాన్ని బయటపెట్టి "ఏ దేవుడి మీదనైనా నిజమైన నమ్మకమన్నది యేడిస్తే ఒక్క గుండవే కాదు అన్ని కష్టాలూ తరించవచ్చును." అని ప్రబోధించి, పీరూసాయెబును పిలిచి గుండంతొక్కమన్నది. శివుని శూలం, విష్ణువామం, పీరూ అంతా ఒక్కటేనంది. పారిపోయిన మనవాళ్ళయ్య తిరిగొచ్చి ఆమెకు నమస్కరించి పీరూసాయెబు గుండం తొక్కే కార్యక్రమాన్ని నిర్వహించాడు.

ఇవీ గురజాడ కథానికల పరిచయం.

## 12.4 గురజాడ స్త్రీ పాత్రల అధ్యయనం :

గురజాడ కథానికల్లో స్త్రీ పాత్రలున్న నాలుగు కథానికల్ని పరిచయం చేసుకున్నాం కదా ! ఇక ఆ కథానికల్లోని స్త్రీ పాత్రలను అధ్యయనం చేద్దాం. ఒక్కో పాత్రను విడివిడిగా అర్థం చేసుకొని, తర్వాత అందరినీ కలిపి సమన్వయ దృష్టితో సమీక్షించుకుందాం.

### ఎ) కమలిని :

ఈమె 'దిద్దుబాటు'లో ప్రధానపాత్ర. కథలో ఎక్కడా రంగస్థలం మీదికి రాకుండానే కథంతా నడిపించింది. "మంచంకిందనుంచి అమృతం వొలికే కలకల నవ్వు మనోహరమైననూ పురముల రొద విననయ్యెను" అని కథ చివర్లో చదివేదాకా ఆమె ఇంట్లోనే ఉందని పాఠకులు గ్రహించలేరు.

ఆధునిక మధ్య తరగతి స్త్రీ చైతన్యానికి తొలి రూపం కమలిని. గత నూరేళ్ళ తెలుగు కథానికా సాహిత్యంలో మనకు కనిపించే కొన్ని వేల మంది మధ్య తరగతి స్త్రీల చైతన్యానికి కమలిని మార్గదర్శి. "ఆధునిక మహిళ మానవచరిత్రను తిరగరాస్తుంది" అనే గురజాడ విశ్వాసానికి తొలి నిదర్శనం కమలిని.

'కమలం' అంటే తామర పువ్వు. సూర్యుడు ఉదయిస్తే కమలం వికసిస్తుంది. కమలం చైతన్యానికి సూర్యకిరణం అవసరం. దానిని నిరోధిస్తే కమలం వికసించదు. అలాగే మహిళలు అభివృద్ధిలోకి రావాలంటే అందు కనుకూల పరిస్థితులుండాలి. సూర్యోదయం వంటి అనుకూల పరిస్థితులు లేకపోతే కమలిని వంటి స్త్రీల అభివృద్ధి సాధ్యం కాదు. స్త్రీ వ్యక్తిత్వం నిలబడాలంటే 19 వ శతాబ్ద చివర్లో 20 వ శతాబ్ది ప్రారంభంలో స్త్రీవిద్య సాధనంగా గుర్తింపబడింది. విద్య స్త్రీ సమస్యలకు పరిష్కారంగా భావింపబడింది. కందుకూరి వీరేశలింగం పంతులు వంటి సంఘసంస్కర్తలు స్త్రీ విద్యకోసం నడిపిన ఉద్యమాలలోంచి 'కమలిని' పాత్ర పుట్టుకొచ్చింది.

"ఓ స్త్రీకి చదువు చెప్పించడం మెదడు సక్రమంగా వున్న ఏ పురుషుడూ చేయరాని దుస్సాహసం. ఎందువల్ల - చదువుకున్న భార్య ప్రియుల్ని ఆకర్షించడానికి వుత్తరాలు రాయదటో ! అని నార్లవెంకటేశ్వరరావు 19 వ శతాబ్దం నాటి భారతీయ స్త్రీల పట్ల పురుషుల దృష్టి ఆలోచనలు ఎలా ఉండేవో చెప్పాడు. (యుగపురుషుడు వీరేశలింగం. గురజాడ అప్పారావు 'దిద్దుబాటు' లో స్త్రీలు చదువుకుంటే చెడిపోరు, చెడిపోయిన చెడిపోతున్న పురుషుల్ని సంస్కరిస్తారు అని నిరూపిస్తూ కమలిని వంటి స్త్రీ పాత్రలను చిత్రించారు. చదువుకున్న స్త్రీలు ప్రియులకు కాదు. ప్రియమైన భర్తలకు ఉత్తరాలు రాసి, సంసారాన్ని చక్కదిద్దుకుంటారని చెప్పడానికి కమలిని పాత్రను సృష్టించారు. ఇవాళ మనం గోడల మీద, కర పత్రాలలోరాస్తూ, ఉపన్యాసాలలో నొక్కి చెబుతున్న అంశం "ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు" అన్నది. ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు ఎలా అవుతుందో గురజాడ కమలిని పాత్రద్వారా రుజువు చేశారు. నిలవనీటి మడుగుగా చెయ్యబడ్డ స్త్రీ జీవితానికి ప్రవహించే అవకాశం కల్పిస్తే సమాజానికి ఎంత ఉపయోగం కలుగుతుందో కమలిని పాత్ర నిరూపించింది. "ఆడవాళ్ళకు చదువెందుకు ? ఉద్యోగాలు చేస్తారా ? ఊళ్ళేలుతారా ?" అని అజ్ఞానంతో ప్రశ్నించే అప్పటి పురుష ప్రపంచానికి తొలి జ్ఞాన విత్తనం ప్రసాదించిన మహిళ దిద్దుబాటు.

కమలిని భర్త గోపాలరావు. చదువుకున్నాడు. చాలా సంస్కారం కలిగిన వాడుగా, ఆధునిక స్వభావం కలిగిన వాడుగా కనిపిస్తాడు. అయినా సంఘసంస్కరణ కార్యకలాపాలలో పాల్గొంటున్నానని భార్యకు చెప్పి, సంస్కరణ వ్యతిరేక కార్యకాలాపాలలో పాల్గొంటున్నాడు. "లోకోపకారమునకై యుద్యమముల నిదురమాని చేయుచుంటి" మని భార్యకు చెప్పిపోతున్నాడు. వేశ్యా వ్యతిరేక ఉద్యమంలో పాల్గొంటున్నానని చెప్పిపోయి వేశ్యలతో కాలక్షేపం చేసివస్తున్నాడు. గోపాలరావు మాటల్లోనే" యాంటినా

చల్లాపోయి సానిదాని పాట సరదాలో మనసు లగ్నమైపోయనది. ఒక్కపాట సరదా తోటి కుదరలేదు. పాడే మనిషి మీదిక్కూడా మనసు పరుగెత్తుతూంది. లేకుంటే నేను పోకిరీ మనిషిలాగ పాట ముగిసిందాకా కూచోవడమేమిటి ? యేదోవొక అవకాశం కలగజేసుకుని దానితో నాలుగు మాటలు ఆడడపు ఆసక్తి యేమిటి ? "గోపాలరావు ఒకేసారి రెండు తప్పులు చేస్తున్నాడు. ఒకటి, భార్యతో అబద్ధాలు చెప్పుతూ విశ్వసనీయత లేని భర్తగా తయారుకావడం, రెండు, సంఘసంస్కర్తగా చెలామణి అవుతూ కుహనా సంస్కర్తగా తయారుకావడం. ఇటు ఇంటికి అటు సమాజానికి చీడపురుగు అయ్యాడు గోపాలరావు ఇలాంటి చీడపురుగుల్ని ఏరెయ్యాలంటే స్త్రీలకు చదువు అవసరం. "విద్య విలువ నీకేం తెలుసురా ?" అంటాడు. గోపాలరావు తన నౌఖరు రామునితో, ఆ విలువైన విద్యను అభ్యసించింది కమలిని. కుటుంబానికి, సంఘానికి సమస్యగా పరిణమించిన గోపాలరావువంటి భర్తలను సంస్కరించటానికి స్త్రీకి విద్య కావాలి. విద్య జ్ఞాన సముద్రం. విద్య సర్వరోగ నివారిణిగా అప్పట్లో భావించారు. కమలిని చదువుకొంది. అపమార్గం పడుతున్న భర్తను సంస్కరించుకొంది. స్త్రీ చదువుకుంటే ఇంటికే కాదు, మొత్తం సమాజానికే వెలుగు అని నిరూపించింది కమలిని. "అడదయి సెప్పకుండా పుట్టినోరింటికి యెల్లానంటే లెపలోయించి కూకోబెట్టాలి గాని మొగోర్లాగా రాతలూ కోతలూ మప్పితే ఉడ్డోరం పుట్టదాబాబూ ?" అని రాముడంటే" ఓరి ! మూర్ఖుడా ! భగవంతుడి సృష్టిలో కెల్లా ఉత్కృష్టమయిన వస్తువు విద్యనేర్చిన స్త్రీ రత్నమే. శివుడు పార్వతికి సగం దేహం పంచి యిచ్చాడు కదా. ఇంగ్లీషువాడు భార్యను "బెటర్ హాఫ్" అంటాడు. అనగా పెళ్ళాం మొగుడి కన్న దొడ్డది అన్నమాట. బోధపడ్డది ?" అని గోపాల్రావు తన ప్రాచ్యపాశ్చాత్యతత్య జ్ఞానాన్నంతా సమన్వయం చేసి స్త్రీ గొప్పతనాన్ని నిర్వచించాడు. కమలిని గోపాల్రావుడన్నా దొడ్డది. విద్య ద్వారా సంపాదించిన వివేకంతో సంఘానికి కుటుంబానికి హానికరంగా మారిన భర్తను సంస్కరించగలిగింది. కమలిని. భర్త తనను మోసం చేస్తున్నాడని తెలిసి కూడా 'నా ఖర్మ ఇంత' అని మౌనంగా ఉండిపోలేదు. రచ్చజేసి రభసచేసి ఇంటి సమస్యను వీధి కెక్కించలేదు. ఇక నీకూ నాకూ సంబంధం లేదు." అని తెగే దాకా లాగలేదు. ఒక ఉత్తరం ముక్క రాసి పెట్టింది, ఇంట్లోనే మంచం కింద ఉండి పోయింది. ఇది ఒక చిలిపి చేష్టగా కనిపించే తిరుగుబాటు. నిశ్శబ్దం విప్లవం. ఇది ఆమె నేర్చిన విద్య ద్వారా సాధ్యమైంది కమలిని గోపాల్రావును సామాజిక ఉద్యమాలలోనికి వెళ్ళడానికి సమ్మతించింది. ఆమెలో ఆధునిక చైతన్య ముందనడానికి ఇదే నిదర్శనం. అక్కడ పురుషులు చేసే తప్పులను సరిదిద్దాలనీ ఎత్తి చూపించి సంస్కరించే స్ఫూర్తి ఉంది. ఇంట్లో ఉంటూ ఇల్లాలుగానే ఈ బాధ్యతను నిర్వహించింది కమలిని. కమలిని ఉండే ఆధునిక చైతన్యానికి మరో తార్కాణం ఆమెకు రాముడంటే ఇష్టముందట. రాముడు ఆ యింటి నౌఖరు. అతనూ మనిషే అని అభిమానించడం ఆమె గొప్పతనం. ఆ రోజు రాత్రి చీకటిలో ఒంటరిగా సరళ యింటికి వెళ్లాడు అయ్యారు. అక్కడి దాకాపోయి, భయపడి, తిరిగి ఇంటిదారి పడుతుంటే తరళ పిలిచింది. మళ్ళీపోతాడు. సరళ గదిలోకి వెళ్ళాడు సరళను అదేపనిగా చూస్తూ తన అనాగరికతను బయట పెట్టాడు. సరళను చూడగానే అతను పడుపు వృత్తికి వ్యతిరేకంగా రాసిన ఉపన్యాసాన్ని మరచిపోయాడు. ఆమె పెదవులమీద ముద్దు పెట్టుకోవాలన్న కోరిక కలిగింది. ఆమె ప్రశ్నలకు జవాబివ్వలేకపోయాడు. ఆమె వీణ మీటుతూ జావళి పాడుతూ ఉన్నది. ఆయ్యరు హఠాత్తుగా లేచిపోయి ఆమె పెదవులను ముద్దుపెట్టుకొని 'దగాలో పడ్డాను' అని అరుస్తూ పోయి మర్నాడు ఉద్యోగానికి రాజీనామా చేస్తాడు. సరళ సిగ్గు పడిపోయింది. ఆశ్చర్యపడింది. అమాయకంగా నవ్వింది. తెల్లబోయిచూసింది.

### బి) మెటిల్డా :

వలసపాలన భారత దేశంలో స్థిరపడుతున్న కాలంలో మన సమాజవ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కుటుంబ వ్యవస్థ అందులో భాగమైన వివాహ వ్యవస్థ బాగా శిథిలమైపోయి ఉంది. సమవయస్కులు లేదా సమీప వయస్కులు అయినవాళ్ళ మధ్య వివాహాలతోపాటు అసమవయస్కుల మధ్య వివాహం అప్పట్లో సాధారణ విషయంగా ఉండేది. దీనిని అసమవివాహం అంటారు. అమ్మాయికి అబ్బాయికి మధ్య చాలా ఎక్కువ తేడా ఉండటం దీని లక్షణం. అసమవివాహంలో అబ్బాయి అంటే

వృద్ధాప్యంలోకి ప్రవేశిస్తున్నవారు లేదా ప్రవేశించినవారు అని అర్థం. అమ్మాయి యవ్వనంలోకి ప్రవేశించేది లేదా ప్రవేశించనిది అయి ఉంటుంది. అసమ వివాహం వివాహవ్యవస్థ ప్రయోజనాన్ని దెబ్బతీసి, స్త్రీలకు నరకాన్ని చూపించేది. స్త్రీ పురుషుల సంబంధాలు అనాగరికంగా మారిపోటానికి అసమ వివాహం దోహదం చేస్తుంది. సమాన వయస్కులు గాని సమీప వయస్కులు గాని అయితే స్త్రీ పురుషులు దాంపత్య జీవితంలోను, సంసారంలోను, పరస్పరం సహకరించుకుంటూ అన్యోన్యంగా జీవించడానికి వీలవుతుంది. అసమవివాహంలో పురుషుడు స్త్రీని అనుమానించడం, అవమానించడం, హింసించడం నిరంతర కార్యక్రమంగా ఉంటుంది. ఈ అశాస్త్రీయ వివాహ వ్యవస్థ అనే "శనిదేవత రథ చక్రపుటిరుసు'' లలో పడి నలిగిపోయిన స్త్రీ మెటల్డా. ఒక వృక్షశాస్త్రం చదివేవిద్యార్థి దృష్టికోణం రచయిత చెప్పించిన స్త్రీ విషాదగాథే మెటిల్డా స్త్రీకి పురుషాధిక్యత క్రింద ఎన్ని కష్టాలున్నవో నేను ఊహించుకోగలను'' అన్న ఆత్మవిశ్వాసం గల గురజాడ చెప్పిన స్త్రీ కష్టాలున్నవో నేను ఊహించుకోగలను'' అన్న ఆత్మవిశ్వాసంగల గురజాడ చెప్పిన స్త్రీ కష్టాలకు ఉదాహరణే 'మెటిల్డా'.

**1895** ఆగస్టు **28**న గురజాడ తన డైరీలో తన వంటలక్క ను గురించి, ఆమె చెప్పిన ఒక స్త్రీ విషాద జీవితాన్ని గురించి రాసుకున్నారు. "మావంట మనిషి చెప్పుకోదగ్గ స్త్రీ . . . ఈవిడకి కబుర్లు చెప్పడం మహాయిష్టం అంటూ వి.ఎస్.ఆర్. అనీ అతడు 'శ్రీర' అనే జమిందారు కూతురుల జీవితాన్ని ఆమె చెప్పినట్లు గురజాడ డైరీలో రాసుకున్నాడు. అతను తనను ప్రభావితుణ్ణి చేసినట్లు చెప్పుకున్నాడు. దీనిని ఆధారం చేసుకొనే గురజాడ 'మెటిల్డా' కథను రాసి ఉండవచ్చునని పండితుల అభిప్రాయం. శిధిల వివాహ వ్యవస్థలో అణచివేతకు గురౌతున్న స్త్రీ దైన్యాన్ని చిత్రించే లక్ష్యంతో గురజాడ రాసిన కథ 'మెటిల్డా'.

"మనోహరమైన భగవంతుడి సృష్టిలో కల్లామనోహరమైనది సొగసైన స్త్రీ'' అనిపించేంత సౌందర్యవతి మెటిల్డా చదువుకున్నది, ఆమె అక్షరాలు కుదురుగా ఉంటాయి. మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే రూపం. ఆమె **55, 56** ఏళ్ళ మగాడికి ఏకారణం చేతనో భార్య కావలసి వచ్చింది. ఆమె భర్త పేరు పోస్ట్‌మాన్‌కు తప్ప చుట్టుప్రక్కల ఎవరికీ తెలియదు. బయటవాళ్ళు ముసలిపులి అని పేరుపెట్టుకున్నారు. ఆయన మెటిల్డాను దాదాపు గృహనిర్బంధంలో ఉంచాడు. ఈ దంపతులు ఎక్కడి నుండి వచ్చారో చుట్టుప్రక్కల వాళ్ళకి ఎంతకాలమైనా తెలియలేదు. మెటిల్డా కదలికలు పరిమితమై పోతాయి. రోజుకు రెండుసార్లు పనిమీద పెరట్లోకి వచ్చి వెంటనే ఇంట్లోకి వెళ్ళిపోయేది. భర్త ఉదయం సాయంకాలం మొక్కలకి గొప్పుత్వేవాడు. అది అతని వ్యాయామం. అప్పుడు మెటిల్డా నీరు పోసేది. అంతకుముందు ఆమెకు బయటి ప్రపంచంతో సంబంధం లేదు. ఆ యింటికి చుట్టాలు కూడా ఎప్పుడూ రారు. ఇంటిగుమ్మం దాకకూడా రాకూడదని మెటిల్డా మీద ఆంక్షలు విధించాడు భర్త.

ఈ గృహ నిర్బంధపూరితమైన బతుకులో ఆమె ముఖంలో ఎప్పుడూ ఒక మోస్తరు విచారం కనిపిస్తూ ఉండేది. ఎందుకంటే ఆమెకు భర్త ద్వారా దక్కవలసిన సుఖసంతోషాలు గగనకుసుమాలయ్యాయి. ఆలోచనలూ అనుభుతులూ అరికట్టబడిన స్త్రీ జీవితం ఎలా ఉంటుందో మెటల్డా జీవితం అలా ఉంది. గోరుచుట్టూ మీద రోకటి పోటన్నట్లు భర్త పీడనకుతోడు భర్త అక్క చిలిపి జగడాలు తోడయ్యాయి. నిలువుగా ఉండవలసిన వ్యవస్థ తలక్రిందులుగా ఉంటే జీవితం మెటిల్డా జీవితంలాగే ఉంటుంది. వయస్సు, ఇష్టాఇష్టాలు కలవకుండా జరిగే వివాహాల దుష్ఫలితాన్ని మెటిల్డా అనుభవించింది.

వృక్షశాస్త్రవిద్యార్థి ఒకరోజు దారిలోపోతూ మెటిల్డా ఇంటిముందు నిలబడగానే, మసలిపులి అతన్ని లోపలికి పిలిచాడు. అప్పుడు అక్కడ వాళ్ళ మధ్య జరిగిన సంభాషణలు ఇవి :

లైబ్రరీ గదిలోకి తీసికెళ్ళాడు (ఆ విద్యార్థిని) కుర్చీ మీద కూలబడి రౌద్రాకారమైన చూపుతో యింగ్లీషునడిగాడు.

"నా పెళ్ళాం వైపు చూస్తున్నావా ''

"కిటికీలోంచి కనపడుతుండే మీ లైబ్రరీచూస్తూ, మీరు యెటువంటి మనుష్యులు, యేమి చేస్తుంటారు అని ఆలోచిస్తున్నాను.

"నా పెళ్ళాన్ని చూడలేదా"

"చూశాను, యెదుట నిలుచుంటే కనపడరా, అంతే" పిడుగులాగా "ఔనే, ఔనే" అని పిలిచాడు. మెటల్డా రాలేదు.

"వొస్తావా రావాలంటే" అన్నాడు. ఒణుకుతూ మెల్లగా వచ్చి తలవొంచుకొని నిలబడ్డది.

ఇంగ్లీషున మళ్ళీ నాతో అన్నాడు. ఓ తెలివి తక్కువ పెద్దమ్మా ! చూడు, యెంతసేపు చూస్తావో, యీ ముండమోహం వేపు ! ఏం నావేపు చూస్తావేం దాని వేపు చూడక ? నా మొహం దాని మొహం కన్నా బాగుందనా !

ఇలా వాళ్ళ మధ్య సాగిన సంభాషణ "అయితే ఈ ముండని తీసుకుపో; నీకు దానం చేశాను తీసుకుపో" అని ముసలి పులి అనడంతో ముగిసింది.

తన భర్త అయ్యుండి తన భార్యను పరాయివ్యక్తి ముందు 'లంజ' 'ముండ' అని తిట్టే సంస్కారం గల ముసలిపులి పీడనలో నలిగిపోయిన భార్య మెటిల్డా. మెటిల్డా చదువుకున్నది, ఆమె భర్త కూడా చదువుకున్నవాడే "ఆమెషా రాస్తూనే చదువుతూనో కనపడేవాడు" అయినా భార్యను గౌరవంగా చూచుకునే సంస్కారం లేదు. ఇందుకు కారణం అసమవివాహం. సమవయస్కులో సమీప వయస్కులో అయిన కమిలినీ గోపాలరావులు. అక్కడ విద్య వాళ్ళ సమస్యను పరిష్కరించింది. మెటిల్డా విషయంలో చదువు వాళ్ళ సమస్యను పరిష్కరింపలేకపోయింది. అందుకే మెటల్డాను ఎంత హింసించినా అవమానించినా భర్తను పల్లెత్తు మాట అనలేదు. ప్రశ్నించలేదు. గొడవపడలేదు. తిరుగుబాటు చేయలేదు. ఆ విద్యార్థికి "మీరు, మీ నేస్తులూ నాకాపకారం మన్ననివ్వరా ? మీకు నేనేం అపకారం చేశాను. తలవంచుకు మీ తోవను మీరుపోతే నే బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్దం" అని ఉత్తరం రాసి తన వంట బ్రాహ్మణునితో పంపించింది.

## సి) సరళ :

ఈమె సంస్కర్త హృదయంలోని పాత్ర. ఒకరిని లేవనెత్తబోయి మనమే క్రిందబడే తత్వంగల రంగనాథయ్యరు అనే ఆచార్య సంస్కర్త దౌష్ట్యానికి బలైపోయిన మహిళ సరళ. సైన్సు ఉపాధ్యాయుడైన రంగనాథయ్యరు, తరగతి గదిలో వీలుచేసుకొని వేశ్యావ్యతిరేక ఉపన్యాసం చేసి, విద్యార్థుల్ని వేశ్యావృత్తిరేకోద్యమానికి సుముఖులుగా చేస్తున్నారని తెలిసి సరళ ఆయనపట్ల ఆరాధనా భావం పెంచుకుంది. ఆఖరికి ఆయన చేతిలోనే దగాపడింది.

సరళ అందాలరాశి. సైద్ధాంతికంగా వేశ్యావ్యతిరేకి అయిన రంగనాథయ్యరు వంటి ప్రొఫెసర్ని తొలిచూపులోనే మతి పోగొట్టగలిగినంత సౌందర్యం ఆమెది. ఆమె వేశ్య కూతురు. ఆమెది సూర్యతేజస్సు. అయ్యరు దృష్టిలో ఆమె దేవతాస్త్రీల అందాన్ని పుణకి పుచ్చుకొన్నది. ఆమె మనోవిగ్రహంలో ఏ క్రూరత్వమూ ఇమిడి ఉండలేదు. ఉదారతా జనకమైన ఆమె సౌందర్యం నిర్మలానందమయం. ఆమెలో దుష్టస్వభావం ఉంటే ఆకాశంలో మెరిసే నక్షత్రాలలో కూడా స్వచ్ఛత లేదన్నమాట. ఆమె దస్తూరి ముత్యాలసరాలులాగా ఉంటుంది.

డబ్బు పుచ్చుకొని తనను మార్చడానికి వచ్చిన విశ్వనాథశాస్త్రిని, తన ప్రశ్నలతో బుర్ర పగుటగొట్టగల చాతుర్యం సరళ కుంది. ఆమె ఆయనతో భగవద్గీత వ్యాఖ్యానం చెప్పించుకుంది. స్త్రీల పాతివ్రత్యాలను చాటే పురాణాలను చదివించుకొంది. అంతా అయిన తర్వాత "చంద్ర వంశపురాజు నెత్తురు సానివాళ్ళదే కాదుటండీ" అని అడిగి శాస్త్రి నోరు మూతపడేట్లు చేసింది. విశ్వనాథ శాస్త్రినేకాదు, ప్రొఫెసర్ని సైతం సందేహాలతో ప్రశ్నలతో స్తంభింపజేసింది. ఆమె బహుకళాసంపన్నురాలు. జావళీలు సంస్కృతశ్లోకాలు చాలావచ్చు. ఆమె వీణావాదన మనోహరం. అన్ని విద్యలుండి కూడా సరళ రంగనాథయ్యరు వంటి పురుషస్వామిని ఆరాధించి దెబ్బతినింది.

సరళ తన చెల్లెలు తరళ ద్వారా పంపిన లేఖను అందుకొని రంగనాథయ్యరు ఆమె ఇంటికి వెళ్తాడు అప్పుడు ఆ యిద్దరి సరళ ఉదాత్తతను, అయ్యరు అనుదాత్తతను చాటుతుంది.

రంగనాథయ్యారు : నీ మనో నిశ్చయం గొప్పది. ఈ జీవితం నుంచి (వేశ్యాజీవితం) నీ ఉదారస్వభావానికి సరిపడని యీ మలిన జీవితం నుంచి బయటపడు. అందుకు నాచేతనైన సహాయం చేస్తాను.

సరళ : నాది అపవిత్రమైన జీవితమని మీ వల్లయిప్పుడిప్పుడే తెలుసుకుంటున్నాను. నా జీవితం మీద నాకే అసహ్యంగా ఉంది. ఛీ ! ఛీ ! నన్ను మురికి కూపం నుంచి బయటికి తీసుకుపోరూ ! నన్ను కనికరించి ప్రబోధించండి. మీతో ప్రపంచపు చివరికైనా ప్రయనించివస్తాను, రక్షించండి.

రంగ : నా ఉద్దేశ్యం అది కాదు సరళా ! నువ్వీ జీవిత పరిస్థితిని విడిచి పెట్టాలని నా కోరిక. విడిచిపెట్టి . . .

సరళ : ఏం చేయమంటారు ?

రంగ : నిన్నెవరు ప్రేమించడంలేదూ ?

సరళ : నన్నా ? ప్రేమించడమా ? ప్రేమించడం ! ఎంత వింతమాటలండీమీవి ! . . . మా అమ్మ వుందా అంటే అది నాకు అమ్మే కాదు. పోనీ . . మా యింటి కొచ్చే మనుష్యులతో అంటే వాళ్ళు ప్రేమ నేది ఒకటుందనే మాటేవిని వుండరు.

రంగ : ఎవరినైనా వివాహం చేసుకుంటే బాగుంటాడు సరళా

సరళ : అంటే ఎవడో ఒక ఛండాలుడికి నేను కలకాలం పూర్తిగా బానిసనై పడివుండాలని మీ తాత్పర్యం ! . . . మాబోటి భోగం పిల్లను ఏ మర్యాదస్థుడు పెళ్ళాడతాడో చెప్పండి మీరే !

సరళ వేసిన ప్రశ్న రంగనాథయ్యారుకు ఇంతకు ముందెన్నడూ తట్టివుండలేదు అని రచయిత ఇక్కడ వ్యాఖ్యానించారు

ఈ సంభాషణ ద్వారా సరళ ప్రాపంచిక జ్ఞానం తెలుస్తున్నది. సంస్కర్తల అజ్ఞానం బయటపడుతున్నది. స్త్రీకి అందునా భోగంస్త్రీకి వివాహమే విముక్తి అన్నది రంగనాథయ్యరు వంటి సంస్కర్తల ఆలోచన. కుటుంబ జీవితమే గిడసబారిపోయిన, స్త్రీ పురుషాధిపత్యంలో నలిగిపోతూ ఉంటే, కుటుంబ జీవితానికి దూరంగా ఉండిపోయిన స్త్రీకి పెళ్ళిని పరిష్కారంగా ప్రతిపాదించడంలోని అనౌచిత్యాన్ని సరళ ప్రశ్నించింది. ఆమెకు కావలసింది ప్రేమ పూరితమైన స్త్రీ పురుష సంబంధాలు. తన దగ్గరికి వచ్చేవాళ్ళకు ప్రేమ అంటే ఏమిటో తెలియదు. వివాహ వ్యవస్థలో కూడా అవి లుప్తమై పోయాయని సరళ ఫిర్యాదు. ఈ ప్రశ్నలతో వ్యాఖ్యలతో సరళ విద్యాధిక మేధావివర్గాన్ని నిలదీసింది. ఈ కథలో సరళ కన్యాశుల్క నాటకంలో మధురవాణి వంటిదే (విద్యార్థులు కన్యాశుల్క నాటకాన్ని చదివితే మంచిది. నాటకం చివర్లో మధురవాణి సౌజన్యారావుల సంభాషణ తప్పకుండా చదవాలి)

సమస్యకూ పరిష్కారాలకూ పొంతన లేకుండా నడిచే ఉద్యమాల పొట్లు గురజాడ సరళ పాత్ర ద్వారా విమర్శపెట్టారు. వేశ్యా సమస్యను కేవలం నీతి సమస్యగా చూస్తూ దానికున్న సామాజిక మానవీయ పార్శ్వాలను విస్మరించిన నాటి సంస్కర్తల వైఖరి ఖండనే సరళ సంభాషణ.

## డి) నాంచారమ్మ :

"మీ పేరేమిటి ?" కథానికలో నాంచారమ్మ రంగాచార్లు అనే వైష్ణవ మతానికి చెందిన వృద్ధుని కోడలు. ఆమె భర్త కృష్ణమాచార్యులు. ఆయన అంత ప్రయోజకుడు కాడు. నాంచారమ్మ తల్లిదండ్రులు పండితులు కావడంవల్ల ఆంధ్రగీర్వాణాల్లో మంచి జ్ఞానం సంపాదించింది. పురాణాన్ని శ్రావ్యంగా రసవంతంగా చదవగలదు. రూపంలో గుణంలో మిన్న. ఆమెకు కొడుకు, కూతురు ఉన్నారు. ఇంటినీ దేవాలయాన్ని చక్కబెట్టుకుంటున్నది.

కె.వి. రమణారెడ్డిగారి మాటల్లో నాంచారమ్మ "కథాస్థలంలో ఒక మెరుపు మెరిసినంతసేపే నిలచి, ఉన్న ప్రతిక్షణమూ హృదయ స్పందనానికి శ్రుతి కలిగించినా కార్యశూరురాలు (మహోదయం - పుట. 355) మతం స్వార్థపరుల వల్ల సమస్యగా పరిణమించిన దశలో నాంచారమ్మ కథలో ప్రవేశించింది. ఆమె ప్రవేశమే వీరోచితంగా జరిగింది. "మానువెనుకనుంచి ఒకచేత కరదీపము రెండవచేత సూరకత్తి పట్టుకొని వుంగరాల జుత్తు గాలిలో తూగులాడుతుండగా, నిబ్బరంగా అడుగువేసుకుంటూ వచ్చిన నాంచారమ్మ మామగారి పక్కన నిలచి ఆయన రెక్కలు కట్టుకుని వున్న నాయలవంక బాకుమొనజూపి "దుష్టులారా ! యీ పరమ పవిత్రమైన బ్రహ్మణ్ణి వొదుల్తారా బాకుకు బలియిచ్చేదా ? అని అడిగింది. ఇదీ నాంచారమ్మ ప్రవేశించిన తీరు.

మన వాళ్ళను, రామినాయిణ్ణి నీకేం కావాలి ? అని విడివిడిగా అడిగింది. వాళ్ళ దగ్గరనుంచి సరైన సమాధానం రాలేదు. వాళ్ళే గుండం ఎందుకు తొక్కరాదో అడిగింది. ఆ యిద్దరూ బెంబేలు పడ్డారు. "రాముడే కాదు, యేదేవుడి మీదనయినా నమ్మకమన్నది యేడిస్తే ఒక్కగుండమేకాదు అన్ని తకష్టాలూ తరించవచ్చును" అంటూ తానే గుండం తొక్కుతానని, అందరూ తన వెంట రావచ్చునని పిలిచింది. ఎవరూ పలకలేదు. అప్పుడామె శైవవైష్ణవ శాఖల తీరును బట్టబయలు చేసి సాయెబుతో గుండం తొక్కించడానికి సిద్ధం చేస్తుంది. ఈ సందర్భంగా నాంచారమ్మ చేసిన ప్రసంగంలో హిందూ ముస్లిం సమైక్యవాదం వినిపిస్తుంది. "పీరు అనేది యేమిటనుకున్నారు ? శ్రీ స్వామివారి తిరునామమే. పట్టణంలో మా యింటి పక్కనే బాగాలేని పీర్లని నిలపి గుండం తొక్కేవారు. పట్టణంలో యెంతో మంది హిందువులే పీర్లపంజాలు వుంచి గుండాలు తొక్కుతారు గనుక శ్రీరామస్వామి వారి నామం తెచ్చి పీరు కట్టియిస్తాను. ఆ పేరు పట్టుకు పీరు సాయీబు గుండం తొక్కుతాడు. అతగాడు కబీరుదాసంత భక్తుడు.

తండ్రిని దిసమొలతో మనవాళ్ళయ్య ఎత్తించుకు పోతుంటే కొడుకు కృష్ణమాచార్యులు అటకెక్కి దాక్కుంటే కోడలు నాంచారమ్మ ధైర్యంగాపోయి మతం మీద పెత్తనం చెలాయిస్తున్న పురుష పూజారులను నిలదీసి ప్రతిఘటించి వాళ్ళకు జ్ఞాన బోధ చేసివచ్చింది నాంచారమ్మ.

## 13.5 సారాంశము :

గురజాడ కథానికల్లోని స్త్రీ పాత్రలు మధ్యతరగతి వాళ్ళు. అందరూ చదువుకున్న వాళ్ళు. సంస్కారవంతులు. చైతన్యం గల వాళ్ళు. మెటల్డా చదువుకున్నస్త్రీ అయినా, తన భర్త హింసను ఆమె ప్రతిఘటించలేకపోయింది. కమలిని, నాంచారమ్మ సరళ - ఈ ముగ్గురూ తమదైన తీరులో పురుషస్వామ్య వ్యవస్థను ప్రశ్నించారు, నిలదీశారు. ఇటు కుటుంబమూ, అటు మతమూ పురుషుల పెత్తనంలోపడి ఆధిపత్య సంస్థలుగా మారిపోయిన దశలో కమలిని భర్తనూ, నాంచారమ్మ మతపెద్దలనూ సాత్వికంగాని లేదా వీరోచితంగా గాని ఎదిరించారు. సరళ అసభ్యంగా తయారైన పురుషసభ్య ప్రపంచాన్ని తెలివిగా ప్రశ్నించి నోరు మూయించింది. ప్రశ్నించే మహిళలే ఆధునిక మహిళలు. వ్రతాలూ, నోములు, పూజలు చేసుకుంటూ భర్తను దైవంగా పూజించేర సంప్రదాయానికి భిన్నమైన స్త్రీని గురజాడ సృష్టించారు. గురజాడ కథానికల్లో స్త్రీ పాత్రలు పురాణ ప్రబంధ పాత్రలు కావు. అచ్చమైన సాంఘిక పాత్రలు. ఈ మధ్యతరగతి స్త్రీ పాత్రలే గురజాడ తర్వాత చలం, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి మొదలైన వారి కథానికల్లో అనేక రూపాల్లో కనిపిస్తారు.

**1902**లో బండారు అచ్చమాంబ హిందూ సుందరి పత్రికాలో "స్త్రీవిద్య", కథను ప్రచురించారు. అందులో స్త్రీ చదువుకోవలసిన అవసరం గుర్తింపబడింది. గురజాడ తన కథల్లో స్త్రీ చదువుకుంటే ఎలా చైతన్యమవుతుందో నిరూపించారు. భర్త నిరంకుశత్వంలో నలిగిపోయే మెటిల్డా లాంటి స్త్రీలకు చలంతన కథల్లో విముక్తి చూపించారు. ఆ తర్వాత చదువుకున్న స్త్రీలు ఉద్యోగత, రాజకీయ రంగాల్లో ప్రవేశిస్తే వచ్చే సమస్యల్ని తెలుగు కథకులు చిత్రించారు. ఇవాళ ప్రపంచీకరణ స్త్రీల మీద చూపే ప్రభావాన్ని తెలుగు

కథకులు చిత్రిస్తున్నారు. గురజాడ చిత్రించిన సంస్కరణ వాద మహిళ తర్వాత జాతీయోద్యమం, తెలంగాణా పోరాటాలు, దళిత, మహోళోద్యమాలలో పాల్గొంటూ నిరంతరం సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ వస్తున్నది.

నూరేళ్ళకు మించిన చరిత్రగల తెలుగు కథానికల్లో కొన్నివేల కథలు స్త్రీపాత్ర ప్రాధాన్యంతో వచ్చాయి. తెలుగు సమాజంలో స్త్రీ పాల్గొంటున్న ప్రతిరంగమూ తెలుగు కథానికల్లో ప్రతిబింబిస్తున్నది. ఇందుకు గురజాడ అందించిన కరదీపం ఉపకరిస్తున్నది.

జీవిత వాస్తవికతను సాహిత్యవాస్తవికంగా మార్చడం పెద్ద రసాయనికచర్య. చలనంతో లేని జీవితాన్ని చిత్రించడం చాలా సులభం. చలనంలో ఉన్న జీవితాన్ని చిత్రించడం చాలా కష్టం. గురజాడ ఈ రెండో జీవితాన్ని చిత్రించారు. పురుషుడైన రచయిత స్త్రీ పక్షపాతిగా మారడం పెద్ద విప్లవం. గురజాడ అలాంటి విప్లవకారుడు. మారుతున్న సామాజిక వ్యవస్థలో రచయిత ఎక్కడ ఆగిపోకుండా సమాజంతోపాటు మారడం, ఒక్కోసారి సమాజం కన్నాముందుండడం గురజాడ లక్షణం. అందుకే ఆయన చలనం శీలంగల స్త్రీ పాత్రలును సృష్టించగలిగారు.

గురజాడ స్త్రీ పాత్రలు కర్మకు విధికి తలవంచే వాళ్ళు కారు. వాటిని ధిక్కరిస్తారు. నూతన సమాజ ఆవిర్భావానికి పునాదులు వేస్తారు. మొలక దశలో ఉన్న నూతన సమాజ ప్రతినిధులు గురజాడ స్త్రీ పాత్రలు. వేగుచుక్కల్లాంటి ఈ పాత్రలు తెలుగు సాహిత్యంలో మరువరానివి. మరువలేనివి. ఈ పాత్రలు భారతీయ సమాజంలో స్త్రీ పురుష సంబంధాలు ప్రజాస్వామికం కావలసిన అవసరాన్ని నొక్కిచెబుతున్నాయి.

## విద్యార్థులకు సూచనలు :

1. గురజాడ సాహిత్యాన్నంతా చదవండి.
2. ప్రత్యేకించి గురజాడ కథానికల్ని చదవండి
3. గురజాడ సాహిత్యం మీద వచ్చిన విమర్శల్ని చదవండి.

## 13.6 ప్రశ్నలు :

1. గురజాడ జీవిత సాహిత్యాలను సమీక్షించండి.
2. గురజాడ కథానికల్ని పరిచయం చెయ్యండి.
3. గురజాడ కథానికల్లోని స్త్రీ పాత్రలను పరిచయం చెయ్యండి.
4. గురజాడ స్త్రీ దృక్పథాన్ని పేర్కొని ఆయన కథనికల్లో స్త్రీ పాత్రలను ఆ దృష్టితో పరిశీలించండి.
5. "ఆధునిక మహిళ చరిత్రను తిరగరచిస్తుంది" అన్న గురజాడ విశ్వాసం - ఆయన స్త్రీ పాత్రల్లో ఎంతవరకు నెరవేరిందో పరిశోధించండి.

## 13.7 సంప్రదించవలసిన గ్రంథాలు :


1. అప్పారావు, గురజాడ వరినీటి : గురజాడ రచనలు, కథానికలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు
2. రమణారెడ్డి, కె.వి. : మహోదయం, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు
3. చంద్రశేఖరరెడ్డి, రాచపాళెం : గురజాడ - తొలికొత్తతెలుగు కథలు
శిల్ప ప్రచురణలు, 28-3'169, తారణనాధకాలు, అనంతపురం - 515 001.


**- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి**

పాఠం - 14

# రంగనాయకమ్మ కథలు

**విషయసూచిక**


**14.1.** ఉద్దేశ్యం

**14.2.** పాఠం

- **14.2.1** తెలుగులో స్త్రీల కథలు - నేపథ్యం - పరిచయం
- **14.2.2** రంగనాయకమ్మ కథలు - పరిచయం
- **14.2.3** రంగనాయకమ్మ కథలు - ఆధునిక స్త్రీ నిర్మాణం
- **14.2.4** రంగనాయకమ్మ కథలు - మహిళాజీవన దృక్పథం

**14.3.** సారాంశము

**14.4.** నమూనా ప్రశ్నలు


## 14.1. ఉద్దేశ్యం :

మహిళాజీవన అధ్యయనం అంటే సాహిత్యంలో మహిళల గురించిన అధ్యయనంకావచ్చు. లేదా మహిళలు సృష్టించిన సాహిత్యమూ కావచ్చు. సాహిత్యంలో మహిళల గురించిన అధ్యయనంలా భిన్న సామాజికార్థిక రాజకీయ చారిత్రక సందర్భాలు స్త్రీ జీవితాన్ని నిర్ణయించటంలో, నిర్దేశించటంలో నిర్వహించిన పాత్ర ప్రధానంగా చర్చించబడుతుంది. మహిళలు సృష్టించిన సాహిత్య అధ్యయనంలో మహిళలు తమ గురించి తాము ఏమనుకుంటున్నారో, ఈ ప్రపంచం గురించి తాము ఏమనుకుంటున్నారో కుటుంబంలో సమాజంలో తమ పాత్రను పునర్నిర్వచించి, పునర్నిర్మించుకొనే ఆలోచనలు ఎలా చేస్తున్నారో పరిశీలించడం ప్రధానంగా వుంటుంది. తెలుగులో కథ ఒక సాహిత్య ప్రక్రియగా స్థిరపడి - 1902లో బండారు అచ్చమాంబ వ్రాసిన ధనత్రయోదశిని మొదటి కథగా ఆమోదిస్తే ఇప్పటికి వంద సంవత్సరాలు దాటింది. ఆంధ్రప్రదేశంలో మహిళలు సంఘాలు పెట్టుకొని తమ సమస్యలు మీద తామే మాట్లాడటం ప్రారంభించింది కూడా స్త్రీలు కథా రచనకు పూనుకొన్న సమయమే కావటం గమనించదగింది. అటువంటప్పుడు స్త్రీల మనోభావాలు తెలుసుకొనటానికి స్త్రీల కథలు సరియైన సాధనాలవుతాయి. కథలు వ్రాసిన ప్రతినిధిగా రంగనాయకమ్మను స్వీకరించి ఆమె వ్రాసిన స్త్రీలకు కథలు ఆధారంగా స్త్రీల చైతన్యవికాసాలను దృక్పథ నైశిత్యాన్ని పరిశీలించడం ఈ పాఠం ఉద్దేశ్యం. మొత్తంగా కథలను ప్రత్యేకించి స్త్రీల కథలను మహిళాజీవన ప్రయోజనాల దృక్కోణం నుండి అధ్యయనం చేసే పద్ధతిని పరిచయం చేయటం ఈ పాఠం ఉద్దేశ్యం.

## 14.2.1 తెలుగులో స్త్రీల కథలు - నేపథ్యం - పరిచయం :

ప్రాచీన సాహిత్యంలో స్త్రీలు పురుషులు చెప్పినట్లు నడుచుకొన్నవారు, పురుషుల ప్రయోజనాల కోసమే తమ ప్రవృత్తులను మలచుకొని ప్రవర్తించిన వాళ్ళు. ఆధునిక యుగంలో విద్యావకాశాలు, సామాజిక అంశాలలో భాగస్వామ్యం మొదలైన కారణాలరీత్యా ఆడవాళ్ళు స్వంతంగా ఆలోచించటం, తాము మంచి అనుకున్నదానిని నలుగురికీ చెప్పి ఆ మార్గంలో వాళ్ళను నడిపించే ప్రయత్నం చేయటం ప్రారంభమైంది. సరిగ్గా ఈ సందర్భం నుండే స్త్రీలు కథలు వ్రాయటం మొదలుపెట్టారు. కనుక ఆ కథల ద్వారా తాము మంచి అనుకున్నదానిని చెప్పటానికి చొరవచూపారు. తొలి తెలుగు కథారచయిత్రి అయిన బండారు అచ్చమాంబ

1902లో వ్రాసిన ధనత్రయోదశి కథను చూస్తే ఈ విషయం స్పష్టమవుతుంది. భర్త అవినీతి మార్గం పట్టకుండా హెచ్చరించటం, అతని ప్రవర్తనను సరిదిద్దటం ఈ కథలో నాయకి విజయలక్ష్మి చేస్తుంది. ఆదుర్తి భాస్కరమ్మ 1926లో వ్రాసిన 'ప్రభావతి' అనేకథ స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించిన ఆకాంక్షను వ్యక్తం చేయటం, సమకాలీన జాతీయోద్యమం పట్ల విమర్శనాత్మక దృక్పథాన్ని అవలంబించటం గమనించదగినవి. పదేళ్ళకే పెళ్ళయి ఏడాది తిరగకుండానే భర్తను కోల్పోయిన ప్రభావతి పత్రికలు, పుస్తకాలు చదువుకొంటూ స్త్రీ స్వాతంత్ర్యం కోసం, దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేయాలన్న చైతన్యాన్ని పొందుతుంది. అయితే రజస్వల అయిన తరువాత వితంతువును చేయటానికి తండ్రి లోకాచారం ప్రకారం ఏర్పాట్లు చేస్తాడు. దానిని భరించలేక ప్రభావతి ఆత్మహత్య చేసుకుంటుంది. ఈ కథలో దురాచారాలకు నెలవైన సంఘాన్ని ఉద్దేశించి 'ఓ సంఘమా ! . . . పరోపకార పారీణులు, దేశసేవాపరాయణులు కావలయునని యొక్కడాశతో నున్న మానవతుల నెందరి నింతవరకు నీ పొట్టన బెట్టికొంటివో' అని ప్రభావతి అన్న చివరి మాటలు సామాజిక రాజకీయ ఉద్యమాలలో వినియోగానికి రాకుండా వృధా అవుతున్న స్త్రీజన శక్తిని గురించిన ఆలోచన కలిగిస్తాయి. అంటే స్త్రీలు కుటుంబంలో కూడా సంసిద్ధులవుతున్న ఒక చారిత్రక సందర్భాన్ని స్త్రీల కథలు వ్యక్తీకరించాయన్నమాట. ఆధునికులవుతున్న స్త్రీల చైతన్యాన్ని భరించలేని భర్తలు చేసే ఆలోచనలు, చర్యలు ఇక నెగ్గవని కనుపర్తి వరలక్ష్మమ్మ కథ 'మీ ఆలోచన నెగ్గేదికాదు' ఒక హెచ్చరిక చేసింది. స్త్రీల వ్యక్తిత్వాన్ని గుర్తించని, బలపరచని, స్త్రీల ప్రయోజనాలకు అనుకూలంగా పనిచేయని పురుషుల మనస్తత్వాన్ని విమర్శకు పెడుతూ కనపర్తి వరలక్ష్మమ్మ వ్రాసిన చట్టసభలో మెజారిటీ మీదెగా కథ ఆధునిక స్త్రీల మనోభావాలకు ప్రాతినిధ్యం వహించింది. తమ ప్రయోజనాలకనుకూలమైన చట్టాలు రాకపోవటానికి శాసనసభల్లో స్త్రీలు చెప్పుకోదగినంత మంది లేకపోవటమే కారణంగా వరలక్ష్మమ్మ స్వాతంత్ర్యానికి పూర్వమే గుర్తించి కథ రూపంలో వ్యాఖ్యానించటం విశేషం.

స్వాతంత్ర్యానంతరం కథారంగంలో స్త్రీల చైతన్యవంతమైన మేధో అంతరంగాల ఆవిష్కరణ సూటిగా కాకపోయినా పరోక్షంగా పదునుగానే జరిగింది. పందొమ్మిది వందల యాభైయ్యవ దశకంలోని డా.పి. శ్రీదేవి, కె.రామలక్ష్మి, రంగనాయకమ్మ, అబ్బూరి ఛాయాదేవి మొదలైనవాళ్ళు కథలు వ్రాశారు. 1957లో శ్రీదేవి కథా సంపుటి 'ఉరుములు - మెరుపులు' వచ్చింది. ఆధునిక యువతి జీవిత సంఘర్షణల చిత్రణ ఆ కథలలో ప్రధానం. ఈ కథల సంపుటికి ముందుమాట వ్రాసిన గోరాశాస్త్రి శ్రీదేవిని "స్వయం వ్యక్తిత్వంగల ఆత్మవంతురాలు" అని ప్రశంసించారు. ఈ స్వభావం ప్రత్యక్షంగానో, పరోక్షంగానో సంప్రదాయ మార్గంలోనో పదునుగానో ఇక్కడి నుండి కథలు వ్రాసిన స్త్రీలలో పార్వతి తన వ్యక్తిత్వానికి గుర్తింపును కోరుకునే స్త్రీగానే చిత్రించబడింది. వ్యకిత్వం కోసం దీర్ఘకాలం పోరాటం కూడా ఆమె లక్ష్యంగా చూపారు రామలక్ష్మి. శివరాజు, సుబ్బలక్ష్మి, ఆచంట శారదాదేవి వంటి సంప్రదాయ దృక్పథం కలిగిన స్త్రీల కథలలో కూడా స్త్రీల అస్తిత్వాన్వేషణ స్పష్టంగానే కనబడుతుంది.

ఆడవాళ్ళ జీవితంలోని ఒంటరితనం శివరాజు సుబ్బలక్ష్మి కథావస్తువు. తమకంటూ ప్రత్యేకమైన సామాజిక అస్తిత్వం లేక, స్నేహపూరితమైన సమస్థాయి సహజీవన సౌభాగ్యం దాంపత్యంలో లభించక ఆడొల్లను చీరెలతో, నగలతో పూడ్చుకునే ప్రయత్నం చేసే స్త్రీల జీవిత విషాదం 'ముక్తి - విముక్తి' వంటి కథలలో ఆమె చూపించారు. తమను మనుషులుగా గుర్తించి ఆపేక్షగా చూచుకొనటమే తెలియని భర్తల పట్ల సొంత సుఖాలేకానీ తమ కష్టసుఖాలు, ఇంటి విషయాలు పట్టించుకోని భర్తల పట్ల స్త్రీల అసంతృప్తిని పరిణామంలో కొత్త స్నేహ సంబంధాల కోసం లైంగిక సంబంధాల కోసం వాళ్ళు చేసే అన్వేషణను స్త్రీలలోలోపల కలిగే అలాంటి లైంగిక ఆకాంక్షలకు సామాజిక ఆమోదం వుండదు కనుక స్త్రీలు వాటిని మనసు మారుమూలలకు నెట్టివేసుకొని ఏమి ఎరగనట్లు లోకమర్యాదల పరిధిలో బ్రతికెయ్యటానికి సిద్ధపడటాన్ని ప్రయాణం తిరుగుతోంది కథలో సహజ సుందరంగా చూపించారు సుబ్బలక్ష్మి. అలాగే ఆచంట శారదాదేవి కథలల్లో కూడా అసంతృప్తులు, అశాంతులు అయిన స్త్రీలు ముఖ్యంగా తమకు ఇష్టంలేని సంసారాలు చేస్తూ నిరంతరం భర్తల నియంత్రణలో జీవిస్తూ తమ అభిరుచులు అనేవి అన్నీ నశించి నిర్జీవమూ, నిర్లిప్తమూ, నిరాశాజనకమూ అయిన జీవితాన్ని జీవిస్తున్న స్త్రీలు కనబడతారు. పెళ్ళి స్త్రీని సహజమైన, స్వచ్ఛమైన నవ్వుకు

జీవితానికి, దూరం చేస్తుందని అలివికాని భయాలకులోను చేస్తుందని 'తెల్లార్తే ముహూర్తం' కథలో కాబోయే పెళ్ళి గురించి అప్పటికే పెళ్ళయి స్త్రీల జీవితాల అనుభవాల జ్ఞాపకాలను బేరీజు వేసుకుంటూ అంతరంగ మథనానికి గురయిన ఒక స్త్రీ ఆలోచనగా అభిప్రాయంగా చెప్పించారు ఆచంట శారదాదేవి. కుటుంబంలో తనది కాని జీవితం జీవించే స్త్రీల ఒంటరి వేదనలు శారదాదేవి వ్రాసిన పునరాగమనం, బ్రతుకు తీపి వంటి కథలలో కనబడతాయి.

అబ్బూరి చాయాదేవి ఉపగ్రహం 1 (1969) శ్రీమతి ఉద్యోగిని లాంటి కథలు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా భర్తలకు అనుగుణంగా భర్తల చుట్టూ జీవితాన్ని పరిభ్రమింప చేసుకుంటూ బ్రతికెయ్యాల్సి వస్తున్న స్త్రీల ఆరోపణలను వినిపించాయి. తన అందాన్ని, ప్రేమను, శృంగారానుభూతిని, పని నేర్పును దేనినీ గుర్తించని, పంచుకోని భర్తతో జీవితం స్త్రీకి ఎంత అసంతృప్తిని మిగులుస్తుందో ఛాయాదేవి కథలు సూచించాయి. 1973లోనే బహిష్టును వస్తువుగా చేసుకొని మూడునాళ్ళముచ్చట అనే కథ వ్రాసి ఛాయాదేవి స్త్రీలకే ప్రత్యేకమైన అనుభవాలకు సాహిత్యగౌరవం కల్పించారు. దీనినే ఈ డెబ్బయ్యవ దశకంలోనే అందిపుచ్చుకున్న రచయిత్రి పి. సత్యవతి. కుటుంబంలో పురుషాధికారం కింద కనబడకుండానే అనుభవంలోకి వచ్చే నిత్య నిఘాల మధ్య స్త్రీలు భయంభయంగా బ్రతికే పరిస్థితిని, ఆ పరిస్థితి గురించిన చైతన్యం కలుగుతున్న స్థితి నుండి స్త్రీల జీవితాన్ని చిత్రిస్తూ సత్యవతి మాఘసూర్యకాంతి కథ వ్రాశారు. గౌరవకరమైన జీవితాన్ని నిర్మించుకొనటం పట్ల సహజవాంఛతో మనుషులుగా స్త్రీలు ఇక స్వతంత్రించక తప్పదన్న సూచనతో ముగియటం ఈ కథ ప్రత్యేకత. 50వ దశకం నుండి ప్రారంభించి 60 దశకంలో కథారచనను ఉధృతం చేశారు స్త్రీలు. ఇల్లిందల సరస్వతిదేవి, కోడూరి కౌసల్యాదేవి, ఐవియస్ అచ్యుతవల్లి, పొల్కంపల్లి శాంతాదేవి, డి. కామేశ్వరి, వాసిరెడ్డి సీతాదేవి, పి. సరళాదేవి, మొదలైన వాళ్ళెందరో తెలుగుకథకు కొత్త వస్తువును, స్త్రీలదే అయిన ప్రత్యేక అనుభవాన్ని, అభివ్యక్తిని ఇచ్చి సుసంపన్నం చేశారు. అటువంటి రచయితలలో రంగనాయకమ్మకు ప్రముఖ స్థానం ఉంది. ఆమె కథలను గురించి మీరీ పాఠంలో చదువుతారు.

### 14.4.2 రంగనాయకమ్మ కథలు - పరిచయం :

రంగనాయకమ్మ 1939 సెప్టెంబరు 21న తాడేపల్లిగూడెం తాలూకా 'బొమ్మిడి'లో పుట్టిపెరిగారు. స్కూలుఫైనలు వరకు చదివారు. 1955 ఏప్రిల్‌లో 'తెలుగు స్వతంత్ర' పత్రికలో పార్వతమ్మ కథ ప్రచురించటంతో రంగనాయకమ్మ కథాసాహిత్య జీవితం ప్రారంభమైంది. 1966 వరకు ఆమె కథలు వ్రాస్తూనే వున్నారు పదహారేళ్ళ వయసులో కథలు వ్రాయటం ప్రారంభించి యాభై ఏళ్ళ వరకు నలభై ఏళ్ళకాలం మీద దాదాపు యాభై వరకు కథలు వ్రాశారు. స్త్రీల సమస్యను అర్థం చేసుకొనటంలో దానికున్న భిన్న కోణాలను ప్రదర్శించుటలో రంగనాయకమ్మ కాలక్రమంలో పొందిన చైతన్యవంతమైన పరిణితి ఈ కథలలో కనబడుతుంది.

రంగనాయకమ్మ ప్రారంభ కథలు ప్రధానంగా మానవ మనస్తత్వంలోని వైచిత్రిని చిత్రించాయి. కుటుంబం సంబంధాలలో ఆడవాళ్ళ ప్రవర్తనా రీతులలోని ప్రత్యేకతలను చిత్రించాయి ఈ కథలు. పార్వతమ్మ కథలో పార్వతమ్మ స్వీయసౌందర్య స్పృహ కలిగిన స్త్రీ. అది మోతాదు మించి ఈడొచ్చిన కూతరు తన వయసు గుర్తు చేస్తుందని ఆందోళకు లోనవుతుంది. సహజ సాంఘిక సంబంధాలకు, సహజ జీవిత పరిణామాలకు ఈ మనస్తత్వం అవరోధం అవుతుంది. కూతురికి పెళ్ళయి మనుమడుపుట్టిన తరువాత శరీరం కంటే అతీతమైన నిత్యమైన సహజ సౌందర్యాన్ని మానవ సంబంధాలలో చూడగలిగిన స్థాయికి చేరుకొనటంతో ఆందోళన నుండి విముక్తురాలవుతుంది. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్ళు, అత్తాకోడళ్ళు, తోడికోడళ్ళు అందరూ ఒక కుటుంబంలో సభ్యులే అయినా చిన్న చిన్న ప్రయోజనాల కోసం ఒకరితో ఒకరు సంఘర్షించటం, ఎవరికివారే తమలో తాము వైరుధ్యాలు వచ్చినప్పుడు మరొకరితో ఏకం కావటం ఎలా జరుగుతుందో భిన్నత్వంలో ఏకత్వం, తోడికోడళ్ళు వంటి కథలలో చిత్రించారు. ఈ కోవలోని కథే 'పాపం రాధ' అనే కథ కూడా. ఈ కథలో భర్తకేశవరావు జబ్బుపడతాడు. జబ్బుపడ్డ భర్తకు సేవలు చేస్తూ,

అతను కోలుకొనటం లేదని దిగులుపడుతుంది రాధ. తననే నమ్ముకొని వున్న రాధ తన తదనంతరం, ఒంటరిది, దిక్కులేనిదీ కాకూడదని పునర్వివాహానికి ఆమెను ఒప్పిస్తాడు. ఆ తరువాత అతను కోలుకుంటాడు. కానీ ప్రసవించి జబ్బుపడుతుంది రాధ. తననే రెండవవివాహం చేసుకోమని ఒత్తిడిపెట్టినభర్త తాను మరణిస్తే మళ్ళీ పెళ్ళిచేసుకోకుండా వుంటాడా అన్నఅనుమానంతో, చేసుకుంటాడేమోనన్న దిగులుతో చివరికి రాధ మరణిస్తుంది. భర్త, అతని తోటి జీవితం తప్ప మరొక ఆలోచన, జీవితంలేని స్త్రీల అతిచిన్న ఆంతరంగిక ప్రపంచంలో అలజడి సాంద్రతను తీవ్రతనూ కూడా ఈ కథలో వ్యక్తీకరించారు రంగనాయకమ్మ.

'విధవల పట్ల మన కనీసధర్మం' ఉత్తరం రూపంలో వున్న కథ వంటి రచన. భర్త చనిపోయిన స్త్రీల పట్ల తోటిస్త్రీలకు వుండవలసిన దృష్టిని గురించి ఒక స్త్రీ తన మనోభావాలను స్నేహితురాలితో పంచుకొనటం ఇందులోని విషయం. స్త్రీల సమస్యల విషయంలో స్త్రీలలో పెరగాల్సిన చైతన్యం తాలూకా ప్రాథమిక భావనలు ఇందులో వున్నాయి. ఇక అరవయ్యవ దశకం నుండి రంగనాయకమ్మ కథలు ఆధునిక స్త్రీలలో పెరుగుతున్న అస్తిత్వ చైతన్యాన్ని వ్యక్తిగా వ్యక్తిత్వంతో జీవితంపై సాధికారత సాధించటానికి స్త్రీ ప్రయత్నపరురాలు కావటాన్ని రకరకాల కోణాల నుండి చిత్రిస్తూ వచ్చాయి. స్త్రీల మనోభావాలను, ప్రవృత్తి విచిత్రిని చిత్రించటం దగ్గరనుంచి ప్రారంభించి స్వీయస్పృహగల స్త్రీ రూపొందుతున్న క్రమాన్ని చిత్రించటంతోపాటు స్త్రీల జీవిత సమస్యలకు వ్యక్తిగత చైతన్యంతోటి పరిష్కారాలు మాత్రమే సరిపోవన్న అవగాహనకు ఎదగటం రంగనాయకమ్మ కథలలో కనబడుతుంది. స్త్రీల జీవిత సమస్యలు ఆర్థిక ఆధికారిక రాజ్యవ్యవస్థలతో సంబంధించి చర్చించవలసినవన్న చైతన్యాన్ని కనబరచటం వరకు రంగనాయకమ్మ కథల జీవిత సిద్ధాంతసారం విస్తరించింది. ఈ విషయాల వివరణ, విశ్లేషణ, నిరూపణ తరువాతి శీర్షికలలో జరుగుతుంది.

### 14.2.3 రంగనాయకమ్మ కథలు - ఆధునిక స్త్రీ నిర్మాణం :

రంగనాయకమ్మ కథలు ప్రధానంగా దాంపత్యజీవితంలోని అసమాన సంబంధాలను విమర్శకు పెట్టాయి. ఈ రకమైన అసమ సంబంధాల పట్ల అసంతృప్తులవుతూ లోలోపల దిగులుపడుతూ, కుమిలిపోతూ కాలంగడిపే స్త్రీల దగ్గర నుండి దాంపత్య సంబంధాలలో తమకు ఆమోదయోగ్యంగాని, ఆనందం కలిగించని సందర్భాలను సంస్కరించుకోటానకి, మార్చటానికి ప్రయత్నించిన స్త్రీలవరకు అనేకరకాల చైతన్యస్థాయి కలిగిన స్త్రీలను రంగనాయకమ్మ కథలలో చూడవచ్చు.

**1964** ఏప్రిల్‌లో వచ్చిన 'నన్ను అర్థం చేసుకోరూ' కథలో రాజేశ్వరి స్వీయజీవితానుభవం నుండి 'ఆడదాని ఆత్మాభిమానాన్ని అడుగడుగునా అపహసించే నికృష్టలోకంలో ఆడపిల్ల పుట్టకూడదనుకోనంతగా తనకు ఆడపిల్ల పుట్టిందని బాధపడేంతగా విసిగి వేసారింది. 'తాళికట్టిన భర్త దగ్గర తలదించి బ్రతికే భార్యలాగా కాకుండా తనకొక అమూల్యమైన స్థానం కావాలి' అని ఆకాంక్షించే రాజేశ్వరి అది దక్కకపోవటం వలన పొందిన ఆశాభంగంతో తనకు ఆడపిల్ల పుట్టటాన్ని ఆనందించలేకపోయింది. ఆడదిగా తాను ఎప్పుడెప్పుడు ఎలా మనసు చంపుకొని బ్రతకాల్సి వచ్చిందో, ఎన్నిసార్లు అవమానింపబడిందో, ఏ రకంగా హింసకు గురయిందో అవన్నీ ఆమెకు ఆ పురిటి మంచం మీద గుర్తుకు వచ్చాయి.

హింస అంటే కొట్టటం మాత్రమే గాదు. నిత్య నియంత్రణ కూడా స్త్రీకి పెద్దహింసే అవుతుంది. అభిప్రాయాలు ఏర్పరచుకొనే హక్కు, ప్రకటించే హక్కు మనిషిగా తనకున్న భార్యగా ఆ హక్కులు వినియోగించుకునే అవకాశంలేక, వినియోగించుకొన్నప్పుడు భర్తగారి హేళనకు తిరస్కారానికి గురవుతూ రాజేశ్వరి పెద్దహింసను అనుభవించింది కనుకనే ఆడపిల్లను కనటం, కొంత దౌర్భాగ్యాన్ని,కొంత విషాదాన్ని సృష్టించటం'గా భావించి బాధపడింది.

జీవితమంటే చీరెలు, నగలు, మంచి సౌకర్యాలు మాత్రమే గాదు. ఇష్టమైన పని చేసుకోగలిగిన ప్రజాస్వామిక వాతావరణం వుండటం. డైరీ రాసుకోవాలన్న కోరిక కలిగితే అది కూడా నెరవేర్చుకొనటానికి స్వేచ్ఛలేని కుటుంబ వాతావరణం స్త్రీకి నిత్య

నిర్బంధమే అవుతుంది. రాజేశ్వరి అనుభవం ఇది. ఇప్పుడు తనని సన్నిహితంగా రానివ్వని భర్త - తన మనస్సు విప్పి చెప్పనివ్వని భర్త - తన వేదన వెళ్ళబోసి ఏడ్వనివ్వని భర్త - ఏం చెయ్యటానికీ తనకి స్వాతంత్ర్యం యివ్వని భర్త' అభిరుచులకు, అభిప్రాయాలకు,కోపాలకు, తాపాలకు అనుగుణంగా తన ఆశలను ఉద్దేశ్యాలను, ఉనికిని అభావం చేసుకుంటూ బ్రతకాల్సి వచ్చిన భార్య అంతరంగిక సంక్షోభం రాజేశ్వరిలో చూపించారు రంగనాయకమ్మ. భర్తనుండి కోరేది సహజమైన సాన్నిహిత్యం సహజీవనం, ప్రేమ, కానీ అతను ఆమె మీద చెలాయించేది అధికారం. ప్రదర్శించేది తిరస్కారం. తన వైపు బంధువును ఒక్క పూట ఇంట్లో వుండమని చెప్పే స్వతంత్రమే తనకు లేనప్పుడు ఆ ఇల్లు తనది అనే భావనే స్త్రీకి నశిస్తుంది. తన బ్రతుకు తనది కాని స్థితి తన ఇల్లు తనది కాని స్థితి గురించిన స్పృహ మేల్కొంటున్న స్త్రీగా రాజేశ్వరి పడిన వేదన ఈ కథలో ప్రధానం. సజీవమైన స్వతంత్రం ఆమె ఆకాంక్ష తనలోని ఈ ఆకాంక్షను గుర్తించి, అర్థం చేసుకొని భర్త తనను ఆనందపెట్టాలనుకొంటుంది రాజేశ్వరి. కానీ ఆ మాట బైటకు చెప్పలేక స్వతంత్రం లేక నన్ను . . . నా మనస్సు . . . ఒక్కసారి అర్థం చేసుకోరూ ! అని లోలోపలే ఆక్రోశిస్తూ భర్తను అభ్యర్థిస్తుంటుంది రాజేశ్వరి. ఆడదై పుట్టినందుకు తనమీద తాను జాలిపడుతూ తను మళ్ళీ తనవంటి ఆడదానికే జన్మనిచ్చాను కదా అని బాధపడుతోంది. స్త్రీల సమస్యను,స్వీయ సమస్యను గుర్తించగలిగినా దాని మూలాన్ని అర్థం చేసుకొనే జ్ఞానావకాశాలు కానీ, పరిష్కరించుకునే మార్గాల గురించిన చైతన్యం కానీ రాజేశ్వరిలో లేవు. అంతరంగ వేదనతో ప్రారంభమైన ఆధునిక స్త్రీ నిర్మాణంలో ఆచరణ శీలిగా మారే వరకు దశలదశలుగా పొందిన పరిణామం రంగనాయకమ్మ తరువాతి కథలలో కనబడుతుంది.

భార్యల శీలాన్ని అనుక్షణం అనుమానిస్తూనో లేక పరిరక్షించుకొనాలని తగు జాగ్రత్తలు చెప్తూనో హెచ్చరికలు చేస్తూనో పురుషులు వుండటం లోకసహజం. భర్తల శీలాన్ని లేకుండా వుండాలనే ప్రబోధం పురాణకాలం నుండి 'సతీసుమతి' ని నమూనాగా చూపించి చేయబడుతూనే వుంది. అయితే ఆధునిక స్త్రీ ఆ నమూనాను ధిక్కరించి ఎదుగుతున్నది. అలాంటి స్త్రీని భిన్నచైతన్యస్థాయిల నుండి స్త్రీ కథాజీవితం, ఆర్తనాదం కథలలో చూపించారు రంగనాయకమ్మ. భర్త కోరే స్త్రీలతో అతనికి సమాగమాన్ని ఏర్పరచే అపరసుమతి లాంటి అత్త రుక్మిణి జీవితాన్ని దగ్గరగా చూస్తూ పెరిగిన విజయ ఆమె మూర్ఖత్వాన్ని సహించలేకపోయింది. తనకు తప్ప భర్త మరొక స్త్రీని కాంక్షించటాన్నే తాను సహించనని ఖచ్చితంగా చెప్పగలిగిన కొత్తతరం స్త్రీగా విజయ తనను తాను నిలబెట్టుకున్నది. మరోస్త్రీని గురించి తలపెడితే కాళ్ళు విరగ్గొట్టి మూలకూర్చోబెడతాను అని భర్తను హెచ్చరించగలిగింది. పతివ్రతలు భర్తల కాళ్ళు విరగ్గొడతారా అని భర్త ప్రశ్నిస్తే అవసరమైతే విరగొట్టే, భర్తగారికి బుద్ధివచ్చాక బాగుచేయించుకుంటారు అదే యీ కాలం పాతివ్రత్యం అని పాతివ్రత్యాన్ని నిర్వచించింది. ఈ విషయంలో నిజమైన సమస్య సంఘర్షణ ఎదుర్కొనవలసి వచ్చిన స్త్రీ కథాజీవితంలోని ఇందిర. ఇందిర జబ్బుపడినప్పుడు పనికి సహాయంగా వుంటుందని చెల్లిలిని పిలిపించుకొన్నది. ఆమెతో భర్త ప్రేమలో పడ్డప్పుడు, కొన్నేళ్ళ దాంపత్యజీవితాన్ని, బంధాన్ని మరచి ప్రవర్తించినపుడు ఇందిర ఆత్మగౌరవం గల స్త్రీగా ప్రవర్తించింది. ఏడ్చీమొత్తుకొని, ప్రాధేయపడి అనురాగాలు సంపాదించలేం అని తెలిసి అతని జీవితం నుండి తప్పుకొనటానికి సిద్ధపడుతుంది. త్యాగం చేస్తున్నానన్న అర్థంలేని భ్రమతోకాక నీనింకా నామీద అనురాగం మిగిలివున్నదా చూచుకొమ్మని భర్తను హెచ్చరిస్తున్నట్లుగా ఆమె ఈ నిర్ణయాన్ని ప్రకటించింది. తమ ఆలోచనలు, మోహాలు ఎంత తప్పో తెలుసుకోవటానికి ఈ కథలో ఇందిర భర్త ప్రకాశానికి, చెల్లెలు లలితకు పూర్తి అవకాశం వుంది. కానీ ఆర్తనాదం కథలో రాధ మాత్రం భర్త ఇంట్లో పనిమనిషితో సంబంధం ఏర్పరచుకోవటానికి ప్రయత్నించిన భర్త తనపట్ల జీవితకాలపు ప్రేమను విశ్వాసాన్ని కనపరచలేదని అతనితో లైంగిక జీవితం అవమానకరంగా భావించి తిరస్కరించింది.

పురుషుల వైపు నుండి స్త్రీల పట్ల స్త్రీల గురించిన భావనల పట్ల రావలసిన మార్పును గురించిన ఆకాంక్షను గూడా రంగనాయకమ్మ గారి అరవయ్యవ దశకపు కథలలోనే కనబడటం ప్రారంభమైంది. 'అమ్మ' ఆ కోవలో కథే. తాను ఒక పిల్లవాడికి తండ్రి అయినాక కూడా తన తల్లి మళ్ళీ గర్భవతి అయితే దిగ్భ్రాంతికి, విచారానికి, ఆందోళనకు లోనయిన కొడుకు కథ ఇది. తల్లీ తండ్రీ ఇంకా శారీరక వాంఛలతో సంబంధాలలో వున్నారన్న వాస్తవాన్ని జీర్ణం చేసుకొనటం అతనికి ఇబ్బందిగా

అనిపిస్తుంది. ఆమె మొహం చూడటానికే ఇష్టపడడు. అతని చెల్లెలు భార్య మాత్రం అది చాలా సహజాంశంగా తీసుకొని ఆనందిస్తారు. ఆవిడ ఆరోగ్యం గురించి ఆలోచిస్తారు. స్త్రీలను లైంగిక ఆసక్తులు, అభిరుచులు వున్న మానవ వ్యక్తులుగా గాక, 'తల్లులు'గా ఒక నమూనాలో చూడటానికి అలవాటుపడిన పురుష ప్రపంచానికి ప్రతినిధిగా కొడుకు అంత ఆందోళనకు లోనవుతాడు. అయితే అమ్మ ఎప్పటికైనా అమ్మేనని తనను ఒడిలో లాలించి పాలిచ్చి పెంచినట్లు మరొక శిశువును పెంచగలిగిన శక్తి సామర్థ్యం ఆమె సహజ లక్షణాలని అర్థం చేసుకొని ఆ కొడుకు సమాధానపడతాడు. స్త్రీల పునరుత్పత్తి శక్తిని కేంద్రీకాంశంగా చేసిన దాని ముందు ఎవరికైనా మోకరిల్లాల్సిందేనని స్పష్టం చేసింది ఈ కథ.

ఆత్మగౌరవం, నిర్ణయాధికారం కలిగిన ఆధునిక మహిళను గురించి రంగనాయకమ్మ భావనలు డెబ్బయ్యవ దశకంలో బాగా స్థిరపడ్డాయి. ఆడపిల్ల అంతరాత్మ, అన్నలు, పిల్లచూపులు, ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది. పెళ్ళానికి ప్రేమలేఖ వంటి కథలు ఇందుకు మంచి నిదర్శనాలు. ఆడపిల్ల అంతరాత్మ, అన్నలు రెండు కథలూ ఇద్దరు మగస్నేహితుల మధ్య సంభాషణగా రచించబడినాయి. భార్యాభర్తలిద్దరిలో ఎవరూ కూడా ఏమూలా మనసులు చంపుకోకుండా ఆనందంగా కలిసి జీవించగలిగిన దాంపత్య సంబంధాల గురించి ఆశపడే యువకుడు 'అంతరాత్మ' కలిగిన ఆడపిల్లను జీవనసహచారిగా పొందాలని ఎదురుచూడటం 'ఆడపిల్ల అంతరాత్మ' కథలో విషయం. అలాంటి ఆడపిల్ల దొరకటం లేదన్నది అతని ఆరోపణ. అంతరాత్మ వుండటమంటే అణుకువగా ముడుచుకొని పెంపుడు కుక్కలాగా ఎదురు తిరక్కుండా, ఘర్షణ పడకుండా అనుక్షణం అన్నిటికీ రాజీపడుతూ, స్వేచ్ఛ స్వాతంత్ర్యం అనే విలువలను పణంగా పెట్టి బ్రతకటం కాదు. స్వతంత్రంగా గాలిపీలుస్తూ స్వతంత్రంగా వ్యవహరించాలనే తపన, వ్యక్తిత్వం వుండటం. దానిని గాయపరిచే విషయాలను ధిక్కరించటం - "ఇదీ అంతరాత్మ వుండటమంటే. అలాంటి ఆడపిల్లకోసం అతని ఎదురుచూపులు. ఈ కథలో వెన్నుముక, గుండెకాయ, రక్తనాళాలు, అంతరాత్మ లాంటివి లేకుండా పరాధీన, అగౌరవ అవమాన జీవితాలను అవే జీవిస్తున్నట్లు జీవించే ఆడపిల్లల పట్ల యువకుడు చూపిన నిరసన కాఠిన్యం రంగనాయకమ్మవే. తమ మీద పెత్తనం చేసే వ్యక్తులను వాళ్ళు తల్లిదండ్రులు కావచ్చు, అన్నదమ్ములు, బంధువులు కావచ్చు, భర్త కావచ్చు. ఎవ్వరైనా వాళ్ళ పెత్తనాల నుండి తమను తాము విముక్తం చేసుకోవాలన్న ఆలోచన లేని ఆడపిల్లల పట్ల రంగనాయకమ్మ కోపం ఇందులో వ్యక్తమైంది.

'అన్నలు' కథ కూడా ఇలాంటిదే. వాత్సల్యం, ప్రేమ, బాధ్యత అనే వాటి పేరిట ఆడవాళ్ళ జీవితాన్ని కులగౌరవాల, వంశ ప్రతిష్ఠల, పెద్దల అభీష్టాల పరిధిలో కుదించి నిర్దేశించటంలో అన్నలు నిర్వహిస్తున్న పాత్ర స్త్రీలకు ఎంత హానికరమైందో వాళ్ళ సహజమైన,గౌరవప్రదమైన స్వేచ్ఛాయుత జీవనానికి ఎంత అవరోధంగా వుంటుందో అన్నలు కథ ఇద్దరు మిత్రుల సంభాషణగా నడిపించి నిరూపించారు రంగనాయకమ్మ. ప్రకాశం, శేషగిరి, స్నేహితులు. శేషగిరి చెల్లెలు రాధకోసం సంబంధాలు వెతుకుతుంటాడు. రాధకు వరుడుగా రామారావు గురించి అనుకొని, అతని ప్రవర్తన ఎలాంటిదని ప్రకాశాన్ని అడిగే సందర్భంలో ఈ కథ మొదలవుతుంది. రాధకు ఇంకా చదువుంది కదా అప్పుడే పెళ్ళేందుకని ప్రకాశం అంటే పెళ్ళయితే మానేస్తుందంటాడు శేషగిరి. తానే మానేస్తానంటున్నదా అంటే పెద్దవాళ్ళందరూ అలా చెయ్యమనే చెప్తున్నారంటాడు. ఆడపిల్ల తన జీవితాన్ని గురించి తాను ఆలోచించుకోలేదా ప్రకాశం శేషగిరిని నిలదీస్తాడు. ఎవరో రామారావు మంచివాడో చెడ్డవాడోనని విచారణ చేయకపోతే తన గురించి చిన్నప్పటి నుండి స్నేహితుడిగా పూర్తిగా తెలుసు కనుక తాను రాధకు వరుడిగా పనికిరానా అని కూడా అడుగుతాడు ప్రకాశం. ప్రకాశం గురించి తనకు పూర్తిగా తెలిసినా కులం కానందున అందుకు ఒప్పుకోలేనంటాడు శేషగిరి. పెళ్ళి విషయంలో కానీ, ఆ పెళ్ళి వల్ల నిత్య నరకాన్ని అనుభవిస్తున్న సమయంలో కానీ రాధ స్వతంత్రంగా ఆలోచించి ప్రవర్తిస్తుందేమోనని ప్రకాశం స్వయంగా ఆమెతో మాట్లాడి చూస్తాడు. కుటుంబ కుల గౌరవాలకు లోబడి రెండు సందర్భాలలోనూ రాధ ప్రకాశం చేతిని అందుకొని స్వేచ్ఛాయుత స్వతంత్ర జీవితాన్ని నిర్మించుకోవటానికి నిరాకరిస్తుంది. తన మీద పెత్తనం చేసే వ్యక్తులను, వ్యవస్థలను, పరిస్థితులను ధిక్కరించి జీవితాన్ని నిర్మించుకొనే బాధ్యత తీసుకోలేని రాధ వంటి స్త్రీలపట్ల రంగనాయకమ్మది కటువైఖరియే.

ఆడవాళ్ళ జీవితం మీద తమ పెత్తనాన్ని స్వచ్ఛందంగా వదులుకోవటాన్ని గురించిన రంగనాయకమ్మ కలలకు ఆడపిల్ల అంతరాత్మ కథలోని యువకుడి అన్నలు కథలోని ప్రకాశం, సుశీల అన్న సాకారరూపాలు. స్వతంత్రంగా ఎదుగుతున్న స్త్రీలకు ప్రతినిధి అన్నలు కథలోని సుశీల.

పిల్లచూపులు కథలో సూరమ్మ కానీ ప్రేమప్రేమను ప్రేమిస్తుంది కథలో సుధ కానీ సుశీలకు విస్తరణ రూపాలే. తన పెళ్ళి తన ఎంపిక ప్రకారం, ఇష్టంప్రకారం జరగాలనే చైతన్యం కలిగిన స్త్రీ ఫలానా అమ్మాయిని ఫలానా అబ్బాయికి ఇచ్చి చేసే వివాహ పద్ధతిలోని బానిసత్వాన్ని గుర్తించటం సహజం. సూరమ్మ అలా గుర్తించిన స్త్రీ. అలాగే ఆమె కట్నం కూడా వ్యతిరేకిస్తుంది. తల్లిదండ్రులు ఆడపిల్లకు ఇచ్చేది ఆమె పేరునే వుండాలని, దానిని ఖర్చుపెట్టే విషయంలో కూడా నిర్ణయం ఆమెదిగానే వుండాలి అని అభిప్రాయపడుతుంది. ఇవన్నీ పెళ్ళి చూపులకు వచ్చిన వ్యక్తితో స్పష్టంగా చెప్తుంది. పెళ్ళిలో ఆడదాని అభిప్రాయాన్ని తెలుసుకొనాలన్న ఇంగితంలేని నాన్నగారి తాతగారి భావాలకు బానిసలైన యువకుల ప్రవర్తనను నిరసిస్తుంది. 'మీరు నాకు నచ్చలేదు' అని నిర్మొహమాటంగా ఆ వ్యక్తితో చెప్తుంది. ఆడపిల్లలు ఇలా స్వంత అభిప్రాయాలతో స్వతంత్ర వ్యక్తిత్వంతో ఆత్మగౌరవాన్ని కాపాడుకొనే వాళ్ళలాగా ఎదగాలన్నది రంగనాయకమ్మ ఆకాంక్ష.

చదువుకొంటున్నందుకు వివేకాన్ని పెంచుకొనటం, తన చుట్టు ప్రక్కల వారి జీవితాలను పరిశీలిస్తూ భార్యాభర్తల సంబంధాలు ఎలా వుండకూడదో తెలుసుకొనటం, ఉండవలసిన రీతిలో వాటిని మలుచుకొనటం కోసం స్వతంత్రంగా ప్రవర్తించటం ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది కథలోని 'సుధ' ప్రవృత్తిలో ప్రవర్తనలో నిరూపించారు రంగనాయకమ్మ.

పెళ్ళి కోసం చదువులనైనా అర్థాంతరంగా వదిలెయ్యటం, అక్కడి నుండి ఘర్షణ లేని దాంపత్య జీవితం కోసం తమ స్నేహాలను, ఇష్టాలను పణంగా పెట్టేసి బ్రతికెయ్యటం, తమ బ్రతుకు మీద, సంపాదన మీద స్వతంత్రతే లేని ఒక అధీన జీవితానికి అలవాటు పడిపోవటం స్త్రీల జీవితంలో మామూలై పోయింది. ఈ మామూలు తనాన్ని బద్దలు కొట్టిన ఇల్లాలు 'విమల' ను సృష్టించారు రంగనాయకమ్మ. 1967లో వ్రాసిన స్వీట్ హోమ్ నవల నాయిక విమల. వ్యక్తిత్వం స్వంత ఆలోచన. నిర్మొహమాటం, నిర్భయత్వం, ఉత్సాహం, జీవచైతన్యం విమల స్వభావంలో సహజాంశాలు. పురుషాహంకారంతో సంసారాలను నరకకూపాలుగా చేసే భర్తల మీద ఏహ్యాభావంతో పురుషుడు తన పురుషాహంకారాన్ని పోగొట్టుకొని నిర్మలుడై సంసారాన్ని స్వర్గతుల్యం చేసుకొంటే బాగుండునన్న ఆర్తితో రంగనాయకమ్మ తన 'ఆశలన్నీ ఏకంచేసి', 'కోరికలన్నీ కలగలిపి' బుచ్చిబాబు పాత్రను సృష్టించి విమలకు జంటగా నిలబెట్టారు. ఈ రెండు పాత్రలతో 1971లో ఆమె వ్రాసిన కథ. 'పెళ్ళానికి ప్రేమలేఖ' ఈ కథ ఉత్తరాల రూపంలో వుంది. వాళ్ళిద్దరూ రాసుకొన్న ఏడు ఉత్తరాలు, ఒక ఎక్స్‌ప్రెస్ టెలిగ్రాములో ఈ కథ ఇతివృత్తం వ్యాపించింది.

పుట్టింటికి వెళ్ళిన విమలకు బుచ్చిబాబు ఆమె లేకపోవటం వలన తనకు వంటకూ, ఇంటి పనికీ ఇబ్బంది అవుతున్నదనీ కనుక వెంటనే రమ్మని ఉత్తరం వ్రాయటం - ఇంటి పనికీ, వంటకూ అయితే తాను రానవలసరం లేదని వాటి కోసం తగిన సూచనలు పరిష్కారాలు ఉత్తరాల ద్వారా ఇస్తే సరిపోతుందని విమల వ్రాయటం, విమలను పుట్టింటికి పంపటమే పొరపాటయిందని బుచ్చిబాబు వ్రాయటం, భార్యను పుట్టింటికి పంపటానికి మానటానికి భర్తకు ఎలాంటి హక్కు లేదని విమల జవాబు వ్రాయటం, ఇలా నడుస్తుంది కథ. భర్త రాసిన మొదటి ఉత్తరం ధోరణిలోనే మళ్ళీ మళ్ళీ అతని దగ్గర నుండి ఉత్తరాలు వస్తుంటే విమలకు ఎప్పటికీ అతని దగ్గరకు పోవాలనిపించనంతగా విరక్తి కలుగుతుంది. అటువంటి భర్తకు తాను ఎప్పటికీ ఏమీకాలేదని గ్రహించి ఇంటి కోసం, వంట కోసం, భార్యలను కోరుకునే పురుషులకు, చీరెలతో, నగలతో వాళ్ళను ప్రలోభపెట్టి అదుపులో వుంచుకొనవచ్చుననుకొనే భర్తలకు విడాకులిచ్చినా తప్పులేదని, ఇక తనను ఎప్పటికీ రమ్మని వ్రాయవద్దని విమల ఉత్తరం వ్రాస్తుంది. ఆ ఉత్తరం చదివాక బుచ్చిబాబుకు భార్య తన నుండి ప్రేమను కోరుతున్నదని తెలిసిన తరువాత తాను చేసిన తప్పు ఒప్పుకొనడానికి సిగ్గుపడకపోవటం బుచ్చిబాబు లక్షణం. తనకు తెలియకుండానే పురుషాహంకారాన్ని ప్రదర్శిస్తే, సంప్రదాయ భర్త నమూనాలోనే

ప్రవర్తిస్తే తెలిసి వాటిని చక్కదిద్దుకొనటానికి ప్రయత్నించే సంస్కారం అతనిది. అందుకనే వంటకూ ఇల్లు చక్కపెట్టటానికి అయితే తాను రానని విమల జవాబు వ్రాస్తే ఎగిరిపడలేదు. ఎట్లారావో చూస్తాననలేదు. వెంటనే రాకపోతే నీకు నాకూ చెల్లు అని అనలేదు. విడాకుల ప్రస్తావన తెచ్చేంతగా విమల మనసు కష్టపెట్టుకొన్నదంటే తనలో లోపమేమిటా అని లోపలికి చూచి తెలుసుకొంటాడు. ప్రేమను, సహజీవనాన్ని కోరే ఆమె హృదయాన్ని అర్థం చేసుకొని తనను తాను సరిదిద్దుకొని విమల కోసమే విమలను కోరుకుంటాడు. ఆహ్వానిస్తాడు.

భార్యాభర్తలుగా స్త్రీ పురుషుల మధ్య వుండవలసినవి గాఢమైన ప్రేమానురాగాలు. బుద్ధిలోనూ, హృదయంతోనూ కూడా ఎదుటివాళ్ళను కాంక్షించే మోహావేశం. ఆమోహావేశం తన పట్ల కనబరుస్తూ బుచ్చిబాబు ఉత్తరం వ్రాస్తే కానీ విమల పుట్టింటి నుండి కదలలేదు. ఒక స్త్రీ భర్త తనను తననుగా కోరకోవాలని తనని అతని జీవితంలో సగభాగంగా గుర్తించాలని తపిస్తుంది. నన్ను అర్థం చేసుకోరూ ! కథలు రాజేశ్వరిది ఇదే తపన. అయితే తన ఆ తపన అంతరంగ సంఘర్షణగా వుంటే తాను కోరుకొనే జీవితం నిర్మించుకొనటం సాధ్యపడదు. దానిని సాధికారంగా వ్యక్తీకరించగలగాలి. అందుకు వ్యక్తిత్వం, ఆత్మాభిమానం, ఆత్మ గౌరవం అభివృద్ధి చేసుకొనవలసిన జీవిత విలువలు అవుతాయి. విమల వాటిని అభివృద్ధి చేసుకోగలిగింది. కనుకనే భర్తతో నిత్య సంఘర్షణకు సంసిద్ధంగా వుంటుంది. సంఘర్షణ అశాంతికి మూలమనుకోదు. సంఘర్షణ నుండి సంవాదానికి, సంవాదం నుండి ఆమోదయోగ్యమైన, ఆరోగ్యకరమైన మానవజీవన సంబంధాలను నిర్మించుకొనటానికి నిరంతరం ప్రయత్నిస్తుంటుంది. జీవనలాలస వున్న మనిషి చేసే పని అది. ఆరకంగా రంగనాయకమ్మ ఆధునిక ఇల్లాలి గుణ స్వభావాలకు విమలను ఒక నమూనాగా రూపొందించారు.

చలం వ్రాసిన 'ఆశాశకురుపు' కథలో ఒక భార్య తన భర్త గురించి ఆడబిడ్డతో "నేను యాడాది పుట్టింట్లో వుంటే, హోటలు భోజనం వొంటికి పడటం లేదు, వెంటనే రమ్మని వ్రాశారు గాని నా పెదిమల అందం కనపట్టంలేదని కాని, నా చెంపల నునుపు ఆయన్ని విరహంలో ముంచిందని గాని వ్రాశారా?" అని అంటుంది. ఈ మాటలే పెళ్ళానికి ప్రేమలేఖ కథేతివృత్తానికి కారణమూ, ప్రేరణ అయ్యాయి.

అయితే స్త్రీ సమస్య పూర్తిగా వ్యక్తిగత సమస్య కాదు, స్త్రీ చైతన్యవంతురాలయ్యేకొద్దీ ఒక మేరకు, పురుషుడు సంస్కారవంతుడయ్యే కొద్దీ మరొక మేరకు ఆ సమస్యకు పరిష్కారం దొరకవచ్చు. 'పెళ్ళానికి ప్రేమలేఖ' వంటి కథలల్లో రంగనాయకమ్మ స్త్రీలు ఇంటి పనికి వంట పనికి నిర్దేశించబడిన మనుషులం కాదన్న స్పృహను పొందుతూ, స్నేహాన్ని, ప్రేమను హక్కుగా సాధించుకోవటానికి ప్రయత్న పరులు అవుతుండటాన్ని చిత్రించారు. ఈ ప్రయత్నాలు ఫలించినంతమేరకు వాళ్ళ జీవితాలు సౌఖ్యప్రదమవుతాయి. అలాగే పురుషులు సంస్కారవంతులయ్యే కొద్దీ స్త్రీని గురించి, స్త్రీ శీలాన్ని గురించి సమాజంలో స్థిరపడి వున్న, సంప్రదాయభావాల జడత్వం నుండి బయటపడి స్త్రీలకు స్నేహపూర్వక హస్తం అందించే సరికొత్త మనుషులుగా ఎదగవచ్చు. సరి కొత్త మనుషులు కథ ఆ స్థితినే చిత్రించింది. కానీ స్త్రీ సమస్య ఇంతకంటే జటిలమైన సామాజిక సమస్య. స్త్రీలు స్త్రీలుగా తయారుచేయబడటం, స్త్రీ పురుష వివక్ష సహజమైనదిగా నిరూపించబడటం, స్త్రీ పురుష సంబంధాలలో డబ్బు ప్రధాన పాత్ర వహించటం. వీటన్నింటికి లోతైన సామాజిక పునాదులున్నాయి. వాటిని సంబోధించకుండా, వాటిని చర్చలోకి తేకుండా, స్త్రీ పురుషులను వాటి గురించిన అవగాహన కలిగించకుండా నిజమైన అర్థంలో స్త్రీ విముక్తి సాధ్యం కాదు. రంగనాయకమ్మ ఎనభయ్యవ దశకంలో వ్రాసిన కథలు ఈ రకమైన అవగాహనను ఇచ్చేవే. మహిళల జీవితం ఎలా వున్నదో, అలా వుండటానికి కారణాలేమిటో, ఏవిధంగా అవి మారాలో, అలా మారటానికి సమాజంలో, రాజకీయార్థిక రంగాలలో, మానవ దృక్పథంలో రావలసిన మార్పు స్వభావం ఏమిటో గుర్తించి వ్రాసిన కథలు అమ్మ, బూడిదలో పోసిన పన్నీరు, అనితర సాధ్యుడు, డబ్బు, అమ్మకి ఆదివారం లేదా మొదలైన కథలు. రంగనాయకమ్మ మహిళా జీవన దృక్పథానికి అద్దం పట్టే కథలివి.

## 14.2.4. రంగనాయకమ్మ కథలు :

'ఆడపిల్లలు పుడతారు. స్త్రీలుగా తయారు చేయబడతారు' అంటుంది ప్రఖ్యాత ఫ్రెంచి స్త్రీవాద సిద్ధాంతవేత్త సైమన్ డిబావురే - తన 'సెకండ్ సెక్స్' అనే గ్రంథంలో. ఆడపిల్లలు స్త్రీలుగా తయారు చేయబడటమంటే ఒదిగి వుండేట్లు, ఇంటికే పరిమితమయ్యేట్లు, పురుషాధికారానికి తల వొగ్గి బ్రతికేటట్లు శిక్షణకు గురిచేయబడటం. ఆడపిల్లలకు ఈ శిక్షణ ఇంట్లో తల్లి దగ్గరే మొదలవుతుంది. తండ్రి, అన్నలు, మేనత్తలు, బామ్మలు, అమ్మమ్మలు, మేనమామలు, తాతలు ఇలా అందరూ విధి నిషేధాల చట్రంలో స్త్రీగా ఆడపిల్ల జీవితాన్ని కుదించి వేస్తారు. సమాజం, సమాజంలోని ఇతర సంస్థలు దానిని కొనసాగిస్తున్నాయి. బలోపేతం చేస్తాయి. ఇదంతా పైకి కనబడకుండా అతి సాధారణంగా చాప కింద నీరులాగా జరిగిపోయే ప్రక్రియ. అమ్మ కథ ఈ ప్రక్రియను, ఈ ప్రక్రియలోని అధికార స్వభావాన్ని పన్నెండేళ్ళ అక్క, ఏడేళ్ళ చెల్లి - వీళ్ళిద్దరి సంభాషణ ద్వారా నిరూపిస్తుంది. పన్నెండేళ్ళ అక్క తల్లి శిక్షణలో అచ్చమైన ఆడపిల్లగా, పితృస్వామిక సమాజం ఆశించే నమూనా ఆడపిల్లగా తయారైంది. ఏడేళ్ళ చెల్లి ఇంకా ఆ మూసలో స్థిరపడలేదు. బజారులో స్వేచ్ఛగా తిరగటం, సినిమాలు చూడాలనుకొనటం, నాటకాలలో వేషాలు వెయ్యాలనుకొనటం, హోటల్లో తినాలనుకోవడం, ఉద్యోగం చేసి స్వతంత్రంగా బ్రతకాలనుకోవటం, ఇవి చెల్లి లక్షణాలు. చెల్లి వ్యక్తం చేసిన ప్రతి అభిప్రాయాన్ని 'అమ్మతో చెబుతానుండు' అని అణచివేయ చూడటం అక్క చేసిన పని. అమ్మ క్షణలో అక్క అమ్మ నిర్వహించే అధికార పాత్రను తానూ అనుకరించగల స్థాయికి చేరిందన్నమాట. చెల్లి కూడా అలాంటి అక్కగా అమ్మగా తయారుకావటానికి ఇక ఎక్కువకాలం పట్టదు. స్త్రీల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఈ వ్యవస్థ స్త్రీలనెలా తయారు చేస్తున్నదో ఒకరి మీద ఒకరు 'పోలిసింగ్' నిర్వహించుకొనే ఏజెంట్లుగా ఎంత విజయవంతంగా వారిని తయారు చేయగలిగిందో ఈ కథలో రంగనాయకమ్మ చూపించారు. ఆ రకంగా కుటుంబం యొక్క పితృస్వామిక అధికారిక లక్షణాన్ని గుర్తించి చూపారు.

స్త్రీ పురుషులను పెళ్ళి ద్వారా కుటుంబంలో స్థిరీకరించటం పితృస్వామిక సమాజలక్షణం. ఆ పెళ్ళిపెద్దలు కుదిర్చేదే అయివుంటుంది. అందులో స్త్రీ పురుషుల అభిప్రాయానికే అవకాశం లేదు కనుక ప్రేమ గురించిన ప్రశ్నే ఉదయించదు. అయితే ఆధునిక యుగం కుటుంబంలో స్త్రీ పురుష సంబంధాలలో వ్యక్తి ఇచ్ఛకు ప్రాధాన్యత కల్పించింది. చదువుల వల్లనో, ఉద్యోగాల కారణంగానో సామాజిక జీవితంలోకి వచ్చే స్త్రీ పురుషులు ఒకరినొకరు చూచుకొనటం, అభిమానించటం, దానిని జీవితకాలపు సంబంధంగా మార్చుకొనాలని ఆశపడటం జరుగుతున్నది. పెద్దలు కుదిర్చి చేసే పెళ్ళిళ్ళకన్నా స్త్రీ పురుషులు స్వతంత్రంగా తమ జీవన సహచరులను ఎన్నుకొని పెళ్ళిళ్ళు చేసుకొనటం రంగనాయకమ్మ గారికి ఇష్టం. అవి ప్రజాస్వామికమైనవి అభ్యుదయకరమైనవి. పెద్దలు కుదిర్చి చేసే పెళ్ళిళ్ళు కులానికి, కులానికి, వంశానికి వంశానికీ, డబ్బుకు డబ్బుకు, హోదాకు హోదాకు జరిగే పెళ్ళిళ్ళు కావు అని రంగనాయకమ్మ అభిప్రాయం. అవి స్త్రీ పురుషులను బానిసత్వంలోనే నెడతాయి. ఆడపిల్ల అంతరాత్మ, అన్నలు వంటి కథలల్లో ఆమె ఆ విషయాన్నే చెప్పారు. అయితే స్త్రీ పురుషులు తమంతట తామే ఒకరినొకరు ఎంచుకొని చేసే పెళ్ళిళ్ళలో ఇద్దరూ ఎంత బాధ్యతగా పనిచేయవలసి వుంటుందో రంగనాయకమ్మకు తెలుసు. అందుకనే 'ప్రేమను' చర్చనీయాంశంగా చేసి ఆమె కథలు వ్రాశారు.

ప్రేమకు ప్రాతిపదిక స్త్రీ పురుషులు ఒకరిముందు ఒకరు తమ ఆలోచనలను, అభిప్రాయాలను, మనసులను ఎటువంటి ఒత్తిడులకు, మొహమాటాలకు లోనుకాకుండా వ్యక్తీకరించుకోగలగటం. సహజంగా ఒకరి ముందు ఒకరు ప్రవర్తించగలగటం. ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది. కథలో సుధ చంద్రశేఖరుల మధ్య అటువంటి సహజ సందర్భాల నుండే ఏర్పడుతుంది. ఇద్దరూ కలిసి సాంఘిక సాహిత్య, సాంస్కృతిక విషయాలు అనేకం చర్చించుకుంటారు. ఒకరి నుండి ఒకరు నేర్చుకోనటానికి, ఒకరినొకరు సరిచేసుకొనటానికి వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొంటారు. ఆక్రమంలో తాము ఒకరి సహచర్యాన్ని మరొకరు గాఢంగా కోరుకుంటున్నామని తెలుసుకుంటారు. ప్రేమను నిలుపుకొనటానికి ఆర్థిక స్వాతంత్ర్యం అవసరం ఉన్న గుర్తింపు సుధలో వున్నట్లు చూపారు. ఈ కథలో రంగనాయకమ్మ.

మనిషి చూచి మొదటి చూపుతోనో, పలకరింపుతోనో, పరిచయంతోనో ప్రేమించటంగానీ ఏ ప్రత్యేకరంగంలోనో ఆయా వ్యక్తులు కనబరిచే ప్రతిభా విశేషాలను చూచి ఆరాధనను పెంచుకొనటం సరిఅయింది కాదని, వ్యక్తిగత పరిచయం స్నేహం లేకుండా ప్రేమించాలనుకొనటం భ్రమ అని బూడిదలో పోసిన పన్నీరు కథ ద్వారా చెప్పారు రంగనాయకమ్మ. పురుషుడిలో అపరిణత, ధూర్తత్వం కలిసి స్త్రీ ప్రేమను నీచం చేస్తాయి అని హెచ్చరిక చేశారు రంగనాయకమ్మ ఈ కథలో. సుధాకర్ కవిత్వం చదివి అతని బావుకత్వం, సున్నితత్వం తనను ఆకర్షించగా అతనిపట్ల తన ఆరాధనను ప్రేమను వ్యక్తం చేస్తూ సుశీల వ్రాసిన ఉత్తరం యూనివర్సిటీ కాంపస్‌లో చర్చనీయాంశంగా మారింది. ఆడవాళ్ళ వైపు నుండి ప్రేమ అభివ్యక్తిని అర్థం చేసుకోలేని, ఆమోదించలేని, హర్షించలేని పితృస్వామిక సామాజిక దుర్లక్షణం, ప్రేమను కామంగా తప్ప అర్థం చేసుకొనలేని పురుష సంస్కారం, స్త్రీ పురుష సంబంధాలను డబ్బు సంబంధాల ప్రాతిపదిక మీద లాభనష్టాల బేరీజుతో తప్ప చూడలేని అనివార్యమైన స్వంత వ్యవస్థా స్వభావం - ఇవన్నీ ఇందుకు కారణం. ప్రేమ కావాలి. ప్రేమ ఫలించకపోవటానికున్న సామాజిక సాంస్కృతిక మూలాల అవగాహన వుంటే తప్ప ఆ సమాజాన్ని సమూలంగా మార్చుకొని ప్రేమ సంబంధాల నిలుపుకొనటం సాధ్యంకాదు. రంగనాయకమ్మ కథలు ఆ అవగాహన నియ్యటానికే వ్రాయబడినాయి.

అనితరసాధ్యుడు కథలో విమలను చెల్లెలి వరస అయిన నిర్మల తాను వసంత అనే కుర్రవాడిని ప్రేమించానని తమ పెళ్ళికి సాయం చేయమని అక్కకు ప్రేమించానని తమ పెళ్ళికి సాయం చేయమని అక్కను అడిగినపుడు విమల చెప్పినట్లుగా రంగనాయకమ్మ ప్రేమ గురించి కొన్ని సూత్రీకరణాలు చేసి చెప్పారు. ప్రేమ కలగటానికి, అభివృద్ధి చెందటానికి స్త్రీ పురుషులిద్దరికి ఒకరి గురించి ఒకరికి అభిప్రాయాలు, అభిరుచులు తెలిసేంత ఒకరి ప్రవర్తనను ఒకరు చూచి అర్థం చేసుకొనేంత పరిచయం, స్నేహం, సాన్నిహిత్యం వుండాలి. ప్రేమించటానికైనా ప్రేమను నిలబెట్టుకొనటానికైనా స్వతంత్రమైన వ్యక్తిత్వం వుండాలి. ఆర్థిక స్వాతంత్ర్యం వుండాలి. ప్రపంచజ్ఞానం వుండాలి. ఇవన్నీ చెప్పి విమల ప్రేమ నిజమైందో కాదో, బలమైందో కాదో వేచి చూచి తేల్చుకొని అప్పుడు పెళ్ళాడమని నిర్మలకు చెప్తుంది.

పెళ్ళికి ప్రేమ ఎంత అవసరమైన అంశమైనా అది కాక అనవసరమూ అమానవీయమూ అయిన డబ్బు పెళ్ళిలో ప్రధాన పాత్ర వహించటం ఒక వైరుధ్యం. పిల్లచూపులు, ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది మొదలైన కథలలో కట్నం ఇవ్వటాన్ని ఆడపిల్ల నిరసించటం, కట్నం కోసం పెళ్ళి చేసుకొనటాన్ని మగపిల్లలు వ్యతిరేకించటం - ప్రస్తావనకు వచ్చాయి. కట్నం స్థానంలో ఆడపిల్లకు ఆస్తిలో వాటా లభిస్తే ఎలా వుంటుందన్న ప్రశ్న కూడా ఈ కథలలో వచ్చింది. అది ఆడపిల్లహక్కు, ఆడపిల్లకు గౌరవకరమైంది అన్న దృక్పథం కూడా ఆ కథలలో కనబడుతుంది. పెళ్ళిలో డబ్బుకు పెరిగిపోయిన ప్రాధాన్యత మీద ఏవగింపుతో వ్యంగ్య ధోరణిలో 'డబ్బు' కథ వ్రాశారు రంగనాయకమ్మ. మిగిలిన కథలలో కాకుండా ఈ కథలో అదొక్కటే ప్రధాన సమస్య. ఎంత పెద్ద చదువులు చదివినా కట్నం తీసుకునే పురుషులను పెళ్ళాడటానికి సిద్ధమవుతున్న స్త్రీలపైన కోపంతో, విమర్శతో ప్రారంభమైంది ఈ కథ.

డబ్బు కథలను ఒక అభూత కల్పనా పద్ధతిలో వ్రాశారు రంగనాయకమ్మ. పెళ్ళంటే జీవితంలోకి వచ్చే ఆడపిల్ల గురించి ఆలోచించాల్సింది పోయి మగవాడు ఆమె వెంట కట్నంగా వచ్చే డబ్బు గురించి ఆలోచిస్తుంటే అమ్మాయి, చివరికి అతని జీవితమే మాయం అయిపోతుంది. కట్నం అంటే డబ్బు వ్యామోహం. పిల్లనిచ్చే మామగారికి డబ్బంటే వ్యామోహమే. అల్లుడికి కట్నంగా ఇవ్వటం కోసం రొఖ్ఖంగా సిద్ధం చేసిపెట్టాడు. కోటి రూపాయల కట్నం పదిపైసల బిళ్ళల రూపంలో బస్తాల కెత్తించి పెట్టించి వుంచాడు. అన్నీ ఒక షెడ్డులో పెట్టి తాళం వేశాడు. పెళ్ళికి ముందే ఆ తాళం చెవి తీసుకొన్నాడు పెళ్ళి కొడుకు. ఆ డబ్బంతా లెక్కపెట్టి లెక్కసరిగా ఉందాలేదా చూచుకొనాలని ఉత్సాహంగా ఉన్నాడు. పెళ్ళి కాగానే షెడ్డులోకి వెళ్ళి డబ్బు లెక్కల్లో పడ్డాడు. అదంతా లెక్కపెట్టి 40 పైసలు తక్కువున్నాయని మామగారి మీద కోపానికి వస్తూ వెనుదిరిగేసరికి అక్కడ

నలభై ఐదేళ్ళ స్త్రీ, ఆమె ప్రక్కన మరొక యువతి నించుని వున్నారు. తాను పెళ్ళాడిన స్త్రీని గురించి ఏడీ మానాన్న పిలువు కట్నం డబ్బు తక్కువ వుందని అన్నాడు. ఆయన పోయి అయిదేళ్ళయింది అని చెప్పింది నాకు తెలియకుండానే, చెప్పకుండానే అని అతను ఆశ్చర్యపడితే నీకు చెప్పకుండా చాలా విషయాలు జరిగిపోయాయి అని ఆమె అతను డబ్బులెక్కల్లో కూరుకుపోతే అతనిని రావి నుండి బయటకు తేవటానికి ప్రయత్నించి విఫలురాలైంది. డబ్బు లెక్కల మనిషిని చూచి చూచి విరక్తి కలిగింది. రెండేళ్ళ తరువాత ఆమెకు మరొకవ్యక్తితో పరిచయం అయింది. అతనితో పెళ్ళికి తండ్రి మొదట్లో అంగీకరించకపోయినా ఒప్పుకోక తప్పలేదు. డబ్బు ప్రమేయంలేని పెళ్ళి చేసుకొని వాళ్ళిద్దరూ ఒకమ్మాయికి జన్మనిచ్చారు. ఈ విషయాలు ఏవి ఎప్పడు చెప్పాలని వచ్చినా అతను డబ్బులెక్కల్లోనే మునిగిపోయి వున్నాడు. **24** ఏళ్ళకు ఈ నాటికి అతని లెక్కపూర్తయింది. డబ్బు లెక్కల్లో సుదీర్ఘ జీవితకాలం గడిపిన వ్యక్తిని చూడాలని వుందంటే కూతురుని తీసుకొని అక్కడకు వచ్చానని ఆమె అంటుంది. డబ్బు లెక్కల్లో పడి జీవితమార్గంలో తప్పిపోయిన ఆమగమనిషికి ఈ విషయం చెప్పి ఆమె కూతురితో వెనుదిరిగింది.

కట్నానికి ఆస్తికి వున్న సంబంధాన్ని గుర్తించిన అమ్మాయి మాటలు ఆ కథకు ముగింపుమాటలు. ఆస్తులు కూడబెట్టుకొనే వాళ్ళజీవితాల్లో ఆస్తి లెక్కలు గాక మరేమీ వుండవు అంటుంది అమ్మాయి. కట్నం తీసుకొనే మనిషినే కాదు, ఆస్తి వున్న మనిషిని కూడా తాను ప్రేమించలేనంటుంది. ఆస్తి సకల మానవ సంబంధాలను ఆర్థిక సంబంధాలుగా మారుస్తుంది. స్వంత ఆస్థి లేని నూతన సమాజం ఏర్పడే క్రమంలో కట్నాలు, ఆస్తులు ప్రాతిపదికలుగాని అచ్చమైన అనురాగపూరితమైన స్త్రీపురుష సంబంధాలు గొప్ప మానవీయ విలువలతో రూపొందుతాయని రంగనాయకమ్మ అభిప్రాయం. స్త్రీ పురుషుల మధ్య వివక్ష కట్నం తీసుకొను అన్న ఆదర్శంతో పోయేది కాదు దానికి ఆస్తి సంబంధాల వ్యవస్థలో మూలాలు వున్నాయన్న గ్రహింపు రంగనాయకమ్మకు వుంది. అందువల్ల ఆస్తి సంబంధాల వ్యవస్థనే మార్చటం అత్యవసరం.

అట్లాగే ఈ సమాజంలో స్త్రీలపట్ల జరిగే అన్యాయాలను వ్యక్తిగత స్థాయిలో ఎదుర్కొనటం, పరిష్కరింటం సాధ్యం కాదన్న అవగాహన కూడా రంగనాయకమ్మకు వుంది. సంస్కరణ కథను ఆ అవగాహన నుండే వ్రాశారు. వృద్ధుడితో జరగనున్న ఒక పెళ్ళి బారి నుండి ఆడపిల్లను రక్షించాలని ఒక జంట పడిన తాపత్రయం, తీసుకున్న కార్యక్రమం ఆ అమ్మాయి స్థానంలో అంతకంటే మరొక చిన్నపిల్లను పెళ్ళిపీటల మీద కూర్చోబెట్టకుండా పర్యవసించినప్పుడు అందులోని సామాజికార్థిక విషాదాన్ని వ్యక్తీకరించటంగా సంస్కరణ కథను వ్రాశారు రంగనాయకమ్మ. పేదరికం, ఆడపిల్ల గుండెల మీద కుంపటి అనుకునే సంస్కృతి. కట్నం లేనిదే తగిన వరుడిని తేలేని సామాజిక దౌర్భాగ్యం - ఇవన్నీ మళ్ళీ వ్యక్తిగత ఆస్థి వ్యవస్థతో ముడిపడివున్నవే. ఆ మూలాన్ని కదల్చకుండా స్త్రీలను, రక్షిద్దామనుకొనే ప్రయత్నం మొత్తం స్త్రీజాతి సముద్ధరణకు వుపయోగపడేదిగా వుండదు. సంస్కరణ కథ ద్వారా ఆ అవగాహనను ఇచ్చారు రంగనాయకమ్మ.

స్త్రీల జీవితంలో అణచివేతకు ఇంటి పనికి వున్న సంబంధాన్ని గురించి రంగనాయకమ్మ **1972** నుండి చుట్టాలు నవల దగ్గర నుండి ప్రారంభిస్తే జానకి విముక్తి నవల వరకు చర్చిస్తూనే వున్నారు. స్త్రీలకు విశ్రాంతిని, వికాసాన్ని ఇవ్వని ఇంటిపని భారాన్ని మగవాళ్ళు పంచుకొని వాళ్ళకు మంచి విషయాలు నేర్చుకొనటానికి సమయాన్ని కల్పించాలని రంగనాయకమ్మ ఆయా నవలల్లో ఇతివృత్తంలో పాత్రల ప్రవృత్తులలో భాగంగాచేసి చెప్తూ వచ్చారు. **1996**లో గృహిణుల విశ్రాంతి గురించి రాజ్యసభలో ఒక బిల్లు ప్రతిపాదించింది. ఆ బిల్లు లేవనెత్తిన ప్రశ్నలకు, సందేహాలకు, ఆందోళనలకు, అభిప్రాయాలకు ఒక సమాధానంగా రంగనాయకమ్మ 'అమ్మ'కి ఆదివారం లేదా ? అనే కథ వ్రాశారు.

ఇంటి పని నుండి ఆడవాళ్ళకు ఒకరోజు విశ్రాంతిని రాజ్యసభ బిల్లు ప్రతిపాదించింది. దీనిని హక్కుగా వినియోగించుకొనటానికి స్త్రీలు సిద్ధపడితే ఏమవుతుంది ? ఆదివారం సెలవును ఉపయోగించుకొంటామని ఆడవాళ్ళు పన్లు మానేస్తే ఆడమగా సమానమేనంటే ఏమవుతుంది ? ఇన్నాళ్ళు విశ్రాంతిగా వుంటూ ఆడవాళ్ళూ అన్నిపనులూ చేసి పోతుంటే

సుఖంగా రోజులు గడిపేస్తున్న వాళ్ళకి ఇది ఇబ్బందికరమైందే. దానితో వాళ్ళు మేము ఉద్యోగాలు చేసి సంపాదించుకొస్తున్నాం కదా! ఆదివారం మాకు మాత్రం విశ్రాంతి కావద్దా అని అడగటం మరి ఉద్యోగాలు చేస్తున్న ఆడవాళ్ళకు ఇంటి పని అదనపు భారం కాదా ! ఆదివారం విశ్రాంతి ఉద్యోగస్తుడైన మగవాడిలాగా హక్కులతాగా పొందలేదు కదా ! ఇలాంటి ప్రశ్నలు ఎన్నో ముందుకు వచ్చాయి. ఇంటి పని బయటి పని కలిసిందే జీవితం అన్న అవగాహనకు వేణు ద్వారా అందరిలో కలిగించటం, ఆడవాళ్ళు బయటి పనులు వెతుక్కోనటానికి, మగవాళ్ళు ఇంటి పనులలో పాలుపంచుకోవటానికి సిద్ధం కావాలన్న స్పృహకు కలిగించటం ఈ కథ ద్వారా రంగనాయకమ్మ చేశారు. అంతేకాదు, ఆడవాళ్ళకు ఆదివారం విశ్రాంతి అనేది చట్టబద్ధమైన హక్కుగా వచ్చినప్పటికి పితృస్వామిక సమాజం ఆ సమాజ ప్రయోజనాలను ఈడేర్చటానికే రూపొందిన ప్రభుత్వ వ్యవస్థలు, కుటుంబం మొదలైనవి అది ఆచరణ వాస్తవం కావటానికి అవరోధం అవుతాయని కూడా ఈ కథ ద్వారా రంగనాయకమ్మ సూచించారు. హెచ్చరించారు. స్త్రీల ప్రయోజనాల కోసం చట్టాలు చేయటమూ ఒక సంస్కరణే. అసమ సంబంధాల వర్గ సమాజపు పునాదులు కదలకుండా, పితృస్వామిక సామాజిక సంస్కృతిని మార్చకుండా స్త్రీల కోసం ఎన్ని చట్టాలు చేసిన స్త్రీల జీవితంలో అభివృద్ధికి అవి ఇసుమంతయినా తోడ్పడవు.

స్త్రీ పురుషులు న్యూనతా ఆధిక్యతలు లేని సమస్థాయి సంబంధాలలో సహజీవన సౌందర్యాన్ని అనుభవించటం రంగనాయకమ్మ ఆకాంక్ష. వ్యక్తిగత ఆస్తివ్యవస్థ, పితృస్వామ్యం కలిసి అందుకు అవరోధమైన భ్రష్ట సంస్కృతిని సృష్టించాయి. స్త్రీని అందమైన శరీరంగా తప్ప మానవ వ్యక్తిగా చూడలేని సమాజం, స్త్రీ కూడా తనను గురించి అట్లా తప్ప ఊహించుకోలేని ఉనికిలో వుండలేని దుఃస్థితిలో అధీనజీవితానికి అలవాటుపడటం, పురుషాధిక్యతకు తలవొగ్గటం కట్నాల పెళ్లిళ్ళ మీద నిర్మించబడే కుటుంబాలు, స్త్రీల అస్వతంత్ర మీద, తనను తాను అభావం చేసుకోవటం మీద నిలబడ్డ కుటుంబాలు - ఇవన్నీ ఆ భ్రష్ట సంస్కృతిలో భాగమే. దీనిని వ్యక్తిసంస్కారంతో మార్చవచ్చునేమో అన్న ఆలోచనలతో ప్రారంభమై అలాంటి మార్పు సంపూర్ణం కాదు, సమగ్రం కాదు, శాశ్వతం కాదు అని తెలుసుకొని స్త్రీల ఆధిక్యతకు, అణచివేతకు కారణమైన వ్యక్తిగత ఆస్తిసంబంధాల వర్గ సమాజాన్ని దానిని నిలబెట్టటానికి పనిచేసే రాజ్యాన్ని ప్రశ్నిస్తూ, విమర్శకు పెడుతూ, వాటిని మార్చుకోనటాన్ని గురించిన ఆలోచనలను ప్రేరేపిస్తూ కథా సాహిత్యసృజన చేస్తూ వచ్చారు రంగనాయకమ్మ.

## 14.3. సారాంశము :

తెలుగు కథాచరిత్ర ప్రారంభమైనప్పటి నుండి స్త్రీలు కథలు వ్రాశారు. తొలినాళ్ళనుండి స్త్రీల కథలలో స్త్రీల అనుభవకోణాలు ఆకాంక్షలు వ్యక్తమవుతూ వచ్చాయి. స్త్రీల స్వతంత్రకు అవరోధంగా వున్న కుటుంబాధికార నిర్మాణం మీద, స్త్రీల శక్తిని వినియోగంలోనికి తీసుకొని సామాజిక ఉద్యమాల మీద, స్త్రీల అభివృద్ధి అభ్యుదయానికి అనుకూలంగా పనిచేయని చట్టసభల మీద కథకులుగా స్త్రీలు విమర్శనాస్త్రాన్ని సంధించారు. ఆ క్రమంలో వచ్చిన రచయిత్రి రంగనాయకమ్మ. గుర్తింపు దశకంలో స్త్రీ తనను తాను గుర్తించుకుంటూ, తనను ఈ కుటుంబం, సమాజం గుర్తించాలన్న ఒక తహతహకు లోనవుతున్న వర్తమానాన్ని కథాంశంగా చేసుకున్నారు రంగనాయకమ్మ. వితంత్రుస్త్రీల పట్ల దృష్టి ఎలా వుండాలన్న అంశాన్నికతగా వ్రాయటం దగ్గర, ఆమె కథాసాహిత్య ప్రస్థానం ప్రారంభమైంది. దాంపత్య జీవిత సంబంధాలకు పరిమితమై కూడా వాటిని భిన్నకోణాల నుండి సూక్ష్మవిశ్లేషణతో చిత్రించి రంగనాయకమ్మ వైవిధ్యభరితమైన కథలు వ్రాశారు. స్త్రీల సమస్య స్త్రీ పురుషులిద్దరి చైతన్యంవల్ల, చొరవ వల్ల పరిష్కారమవుతుందే కానీ స్త్రీలు ఒక్కరే చైతన్యవంతులైతే సరిపోదని రంగనాయకమ్మకు తెలుసు. అందువల్లనే 70వ దశకం వచ్చేసరికి ఆమె కథలలో స్త్రీల గురించి, అభివృద్ధికరమైన ఆరోగ్యకరమైన జీవితం గురించి ఆలోచించగలిగిన ఆచరణలో ఆ రకంగా నిలబడటానికి ప్రయత్నించిన మగవాళ్ళు పాత్రలుగా కనబడతారు. అలాగే స్త్రీ సమస్య, స్త్రీల అణచివేత సర్వతంత్ర స్వతంత్రమైన నిరపేక్ష అంశం కాదని కూడా రంగనాయకమ్మకు తెలుసు. సామాజికార్థిక వ్యవస్థలలో, రాజకీయాలతో

ముడిపడిన అంశం అని ఆమె గుర్తించారు కనుకనే ప్రేమ ప్రేమను ప్రేమిస్తుంది వంటి కథలలో స్త్రీ శీలాన్ని రాజ్యసంబంధంలో చర్చించగలిగారు. శత్రువొచ్చి మీద పడి పెడరెక్కలు విరిచికట్టి బూలుకాలితో తన్ని తుపాకులతో పొడిస్తే ఏ మొగాడు చెడిపోడుకానీ, సరిగా అలాగే అంత నిస్సహాయంగానే ఆక్రోశిస్తూ, అంత నిస్సహాయంగానే శత్రువు చేతుల్లో పడే ఆడవాళ్ళు చెడిపోతారనటంలోని ద్వంద్వ విలువల గురించి సుధ ఆందోళన పడుతుంది. శీలానికి అధికతర ప్రాధాన్యతను, పవిత్రతను స్త్రీ విషయంలో ఆపాదించటంచేత ఆమె ఎంత తిరస్కారానికి, ఎంత హింసకు గురికావాల్సి వస్తున్నదో సుధ ఆలోచనల ద్వారా ఈ కథలో సూచించిరు రంగనాయకమ్మ. అంతిమంగా స్త్రీకి సంబంధించిన అన్ని అంశాలు స్త్రీని హీనంచేసేవి, బాధించేవి, అణగద్రొక్కేవి అన్నీకూడా. స్వంత ఆస్తి వ్యవస్థతో సంబంధం వున్నవిగా 'డబ్బు' కథ ద్వారా తేల్చి చెప్పారు రంగనాయకమ్మ.

ప్రారంభంలో స్త్రీ గురించి ఆవేదనపడి స్త్రీకి శరీరం వుంది. హృదయం వుంది, మెదడు వుంది అని ఆమెను ఒక మానవ వ్యక్తిగా గుర్తించి స్త్రీల అనుభవకోణం నుండి రచనలు చేసిన చలం ప్రభావంతో కథలు వ్రాసిన రంగనాయకమ్మ క్రమంగా సామాజిక ఉద్యమాలతో, మార్క్సిజమ్ వంటి రాజకీయార్థిక సిద్ధాంతాలతో ఏర్పడిన పరిచయం వల్ల పెంపొందిన పరిజ్ఞానంవల్ల రూపొందిన జీవిత దృక్పథం వలన స్త్రీ సమస్యకు సామాజికార్థిక మూలాలను గుర్తించి చెప్పగలిగిన స్థితికి ఎదిగారు. ఆస్తి వున్న మనిషిని ప్రేమించలేననే ఉన్నత మానవీయ చైతన్యాన్ని సంపాదించుకొంటున్న కొత్తతరం స్త్రీలని 'డబ్బు' కథలో చూపించగలిగారు. మొత్తం మీద రంగనాయకమ్మ ఆత్మగౌరవంతో జీవించగలిగిన మహిళ గురించి కన్న కలలకు అక్షర చిత్రాలు ఆమె కథలు అని చెప్పవచ్చు.

## 14.4. నమూనా ప్రశ్నలు :

1. రంగనాయకమ్మ వ్రాసిన తొలికథలో ఆడవాళ్ళ ఆంతరంగ వేదన ఏ జీవితాంశాలకు సంబంధించినదో వ్రాయండి.
2. రంగనాయకమ్మ కథలలో కనబడే ఆధునిక మహిళ స్వభావాన్ని వివరించండి
3. రంగనాయకమ్మ కథల ఆధారంగా ఆమె మహిళాజీవన దృక్పథాన్ని అంచనా వేయండి.

**- కాత్యాయనీ విద్మహే**

పాఠం - 15

# విశ్వనాథ సత్యనారాయణ - చెలియకట్ట నవల

**ఉద్దేశ్యం :**

విశ్వనాథ సత్యనారాయణ గారిని నవలా రచయితగా పరిచయం చెయ్యడం; చెలియలికట్ట నవల ఇతివృత్త వివరణ; ముఖ్యపాత్రల పరిచయం చెయ్యడం; చెలియలికట్ట నవలలో విశ్వనాథ దృక్పథాన్ని విశదం చెయ్యడం; చెలియలికట్ట నవల నామౌచిత్యాన్ని విద్యార్థులకు పరిచయం చెయ్యడం.

**ప్రణాళిక :**


**15.1.** విశ్వనాథ సత్యనారాయణ వ్యక్తిత్వ స్థూల పరిచయం - నవలా రచయితగా విశ్వనాథ

**15.2.** చెలియలికట్ట నవల - విశ్వనాథ దృక్పథం - ఇతివృత్త పరిచయం

**15.3.** చెలియలికట్ట నవల - విశ్లేషణ

**15.4.** చెలియలికట్ట నవల - రత్నావళి, రంగడు పాత్ర చిత్రణ

**15.5.** చెలియలికట్ట నవల - నామౌచిత్యం

**15.6.** ఆకళింపు ప్రశ్నలు

**15.7.** సంప్రదించవలసిన గ్రంథాలు


## 15.1. విశ్వనాథ సత్యనారాయణ వ్యక్తిత్వ స్థూల పరిచయం - నవలా రచయితగా విశ్వనాథ :

తెలుగు సాహిత్యంలో విశ్వనాథ సత్యనారాయణ గారికొక ప్రత్యేకమైన విశిష్ఠ స్థానముంది. సనాతన సంప్రదాయాల్లో వైశిష్ట్యాన్ని పునరుజ్జీవింప చేయడమే విశ్వనాథ తన సాహిత్యం ద్వారా ఆశించిన ప్రయోజనం. ఆంగ్ల సంపర్కం కారణంగా సమాజంలో ప్రవేశించిన కొత్త ఆలోచనలను వ్యతిరేకించడం, సంఘర్షించడం లక్ష్యంగా రచన చేసిన తీవ్ర సంప్రదాయవాది విశ్వనాథ

విశ్వనాథ బహుముఖ ప్రజ్ఞాశాలి. కథలు, కవితలు, విమర్శలు, నవలలు మొదలైన ప్రక్రియలన్నింటినీ చేపట్టి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాడు. ముఖ్యంగా ఆయన నవలల్లో ప్రాచీన, ఆధునిక భావసంఘర్షణ ప్రధాన కథావస్తువు. భారతీయ సంస్కృతినీ, నాగరికతను విశిష్టంగా వర్ణించడమే ఆయన నవలల ముఖ్యలక్షణం.

విశ్వనాథ నవలల్లో కథాకథనం, పాత్ర చిత్రణ, సన్నివేశ కల్పన, వర్ణనలు పాఠకుణ్ణి ఆకట్టుకుంటాయి. ముఖ్యంగా ఆయన రచనాశైలికున్న ప్రత్యేకత తెలుగు సాహిత్యంలో విశ్వనాథకొక ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చింది. "నా నవలలు ప్రజలు విరగబడి చదవడం నా తెలుగు భాష కోసం, పలుకుబడికోసమే. ఎక్కడపడితే అక్కడ తెలుగు జాతీయత ఒలికిస్తాను. ఈ పలుకుబడి సొగసు అనేక తీరుల్లో ఉంటుంది. పల్లెటూరి జీవితంలో శోభ తెలియనివానికి నా కావ్యసంపద తెలియదు" అంటారాయన.

ఆయన నవలలకు కథా ప్రాధాన్యమెక్కువ. అందుకే ఆయన 'కథనెన్నుకొనుటలో నిజముగానున్నది ఒక మహాకవి యొక్క ప్రతిభ' అన్నారు. నవలా రచయితగా తన సామర్థ్యాన్ని విశ్వనాథ ఇలా చాటుకున్నారు" నేను మానవ ప్రవృత్తి

నామూలాగ్రముగా పరిశీలించి తెలిసికొని స్టడీ చేశాను. నాకు గ్రంథరచన అంటే ఏమిటో తెలుసు. సగం నిద్రలో లేపి ఒక నవల డిక్టేటు చేయమంటే చేయగలను. నేనేది వ్రాసినా తెలిసి వ్రాస్తాను. నేను Conscious Artist ను కాబట్టి.

"అసలు నవల అంటే ఏమిటి ? దీనిని నిర్వహించడం కష్టం. గొప్ప నవలలెప్పుడూ ఒక దానిని పోలి ఇంకొకటి ఉండవు. ఒక విలక్షణమైన శక్తికలవాడు వ్రాసిన నవల, అంతకుముందున్న నవల ఉన్నట్లు ఉండదు అన్ని గొప్ప నవలలూ ఒక్కలాగు ఎప్పుడూ ఉండవు. పుస్తకంలో అచ్చంగా మనం చూసే వాస్తవికతా వుండదు. నేను ఎన్నో రకరకాల శిల్పమార్గాలలో వ్రాశాను. ఒకటి వ్రాసినట్లు ఇంకొకటి వ్రాయలేదు'' అని తన నవలల్లోని వస్తు వైవిధ్యాన్ని విశ్వనాథ ప్రస్తావించారు. ఆయన నవలల్లో కథాచిత్రణలో, కల్పనల్లో ఎంతో వైవిధ్యం స్పష్టంగా కనిపిస్తుంది.

తన నవలల ప్రయోజనాన్ని ప్రస్తావిస్తూ విశ్వనాథ "ఇన్ని నవలల్లో చరిత్రాంశములను తీసివేయ, కథలన్నియు నేను కల్పించినవే, వందలాది విలక్షణమైన పాత్రలు నేను సృష్టించినవే . . . ఒక నవలవలె ఇంకొక నవల యుండదు. అనంతమైన కల్పనా వైవిధ్యమున కంతు లేదు, భాషయా ఎక్కడ ఏ భాష ఉచితమో ఆ భాషయే వ్రాయబడెను. నా పద్య ప్రపంచక మెటువంటిదో నేను నిర్మించిన గద్యప్రపంచకము నట్టిదే. ఎంగిలి కూడు లేదు. శ్రమ లేకుండా నా నవలలు చదివి మనోజ్ఞానమును సంపాదించవచ్చు. నేను వ్రాసిన సుమారు అరువది నవలల్లో ఏ విషయాన్ని గూర్చి వ్రాయలేదు ? పాశ్చాత్యుల యొక్క, సైన్సు యొక్క, చరిత్రలో విషయాలు ఉంటవి. వాళ్ళ ఫిలాసఫీ యొక్క విషయాలు ఉంటవి. వాళ్ళ సాహిత్యములోని రహస్యాలు ఉంటవి. వాళ్ళ శాస్త్రాలలోని మహావిషయాలన్నీ ఉంటవి. వృక్షశాస్త్రము, పశుశాస్త్రము, చివరకు మనీమారకం, అవసరమయితే ఇదీ ఉంటుంది. అది ఉండదని ఉండదు. ఇటు చూస్తే వేదాలు, ఉపనిషత్తులు, భాష్యాలు, తర్కాలు, వ్యాకరణాలు అటుచూస్తే పాశ్చాత్య విజ్ఞానములో నేను నిద్రాహారాలు లేకుండా సంపాదించిన విజ్ఞానమంతా నా నవలలో, నా పుస్తకములలో ఉంటుంది'' అన్నారు. విశ్వనాథ నవలల్లో ప్రస్తావించని అంశం లేదు అన్నది ఆయన మాటల్లోనే స్పష్టమవుతున్నది.

నవలకు కావ్యానికి విశ్వనాథ దృష్టిలో బేధం లేదు'' కావ్యము - నవల కూడా కావ్యమే. విజ్ఞానదాయిగా నుండవలయును. రససంధాయిగా నుండవలయిను. కల్పనాచాతుర్యము కలదిగా నుండవలయును. ఒక్క స్త్రీ పురుష సంబంధము మాత్రమే సంఘముకాదు. సంఘము యొక్క స్వరూపము వేయివిధముల నుండును. అందుచేత కావ్యము కవి యొక్క ప్రతిభాధీనము'' అంటారు విశ్వనాథ.

విశ్వనాథ నవలల్లో సజీవపాత్ర చిత్రణ కనబడుతుంది. పాత్రలో మానసిక సంఘర్షణ ప్రధాన విషయంగా కనిపిస్తుంది. కొన్ని నవలలు స్త్రీ పాత్ర ప్రధానంగా చిత్రించబడ్డాయి. భారతీయ సంస్కృతీ వైభవం, నాగరికత, స్త్రీ పురుషుల శీలం, నీతి, ధర్మ ప్రస్తావన, భారతీయ ఆచార వ్యవహారాలు ఆయన నవలలో ముఖ్యంగా చోటుచేసుకున్నాయి. నవలలలోని ప్రతి అంశాన్ని కూలంకంగా వివరించడం విశ్వనాథ ప్రత్యేకత. అందుకే "సంఘం, తత్త్వం, కవిత్వం, ఈ త్రివేణీ సంగమం వారి కవిత. ఇతరులు కథా రచయితలు మాత్రమే. విశ్వనాథకవి ఇక్కడినుండి నవల వ్రాస్తారు'' అని విమర్శకులు అభిప్రాయపడ్డారు.

విశ్వనాథ నవలలను నాలుగు విభాగాలుగా వర్గీకరించవచ్చు. అవి

**1) సాంస్కృతికాలు :** అంతరాత్మ, మూడుతరాలు, హాహాహూహులు.

**2) సాంఘిక నవలలు :**

వేయి పడగలు, నీలపెండ్లి, చెలియలి కట్ట, స్వర్గానికి నిచ్చెనలు, పునర్జన్మ, తెఱచిరాజు, గంగూలీ ప్రేమకథ, బాణామతి, జేబుదొంగలు, కుణాలుని శాపము, పరీక్ష, శార్వరినుండి శార్వరి దాక, మాబాబు, వీరవలడు, ఆఱునదులు, దేవతల యుద్ధ నీలపెండ్లి, విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు, మ్రోయుతుమ్మెద.

**చారిత్రక నవలలు :**

వీరపూజ, చందవోలురాణి, ధర్మచక్రము, కదిమిచెట్టు, బద్దన్న సేనాని, ఏకవీర, ప్రళయనాయుతు, స్నేహఫలము, యశోవితి, మిహిరకులుడు, కవలలు, పాతిపెట్టిన నాణెములు, భ్రమరవాసిని, సంజీవకరణి, దిండు కింద పోకచెక్క, దూతమేఘము, లలితాపట్టపురాణి, దంతపు దువ్వెన, పులుల సత్యాగ్రహము, దమయంతీ స్వయంవరము, ఆరు నదులు.

**పౌరాణిక నవలలు :**

తెలుగు నవలా ప్రపంచంలో అపూర్వ సృష్టిగా విశ్వనాథ రచించిన 'పురాణవైర గ్రంథమాల' ను పేర్కొన్నవచ్చును. ఇందులో వెలువడిన 12 నవలలు.

1. భగవంతుని మీద పగ
2. నాస్తిక ధూమము
3. ధూమ రేఖ
4. నందోరాజా భవిష్యతి
5. చంద్రగుప్తుని స్వప్నము
6. అశ్వమేధము
7. అమృతవల్లి
8. నాగసేనుడు
9. పులిముగ్గు
10. హెలీనా
11. వేదవతి
12. నివేదిత

## 15.2 చెలియకట్టనవల - విశ్వనాథ దృక్పథం :

వివాహ వ్యవస్థ నతిక్రమించి స్వేచ్ఛాప్రవృత్తి నవలంబించడం వల్ల మనకు జీవితంలో ఎదురయ్యే సమస్యలనూ దుష్పరిణామాలను సమాజానికి తెలియజేయడమే 'చెలియలికట్ట' నవలా రచనలో విశ్వనాథ ఆశించిన ప్రయోజనం. సంఘం, కుటుంబం నిర్దేశించిన కట్టుబాట్లనతిక్రమించిన స్త్రీ ఎదుర్కొనే పరిణామాలను నవలలోని ముఖ్య పాత్రల ద్వారా ఆయన వ్యక్తం చేశారు. వివాహ వ్యవస్థనూ, వైయక్తిక ప్రేమనూ సాంప్రదాయ దృష్టితో విశ్వనాథ ఈ నవలలో విశ్లేషించారు.

**స్థూలంగా నవల ఇతివృత్తం ఇది :**

ప్రతిష్ఠాపురమనే గ్రామంలో సీతారామయ్య అనే బ్రాహ్మణుడు తన తమ్ముడైన రంగారావు ఉన్నత విద్యావంతుడు కావాలన్న ఉద్దేశ్యంతో ఎంతో కష్టపడి, ఇల్లు పొలం తాకట్టుపెట్టి చదివిస్తాయి. సీతారామయ్య తన మొదటిభార్య, రత్నమ్మ ఇద్దరు పిల్లల్ని కని చనిపోగా, 'రత్నావళి' ని రెండవ వివాహం చేసుకుంటాడు. రంగడు సెలవల్లో ఇంటికి వచ్చినపుడు రత్నావళి అందాన్ని చూచి, ఆమె తన అన్న గారికి రెండవ భార్యగా రావడం అన్యాయమనీ, ఈడుజోడు లేని వివాహం వ్యర్థమని, యువతీ యువకులు యవ్వనంలో ప్రేమించి పెళ్ళిచేసుకోవాలని, స్త్రీలు తమకున్న వయసు మీరిన భర్తలతో సంపూర్ణ సౌఖ్యమనుభించలేరని

తన ఆధునిక భావాలన్నీ ఆమెకు నూరిపోస్తాడు. ఆమె పట్ల సానుభూతి చూపుతాడు. రత్నావళి అమాయకురాలు. లోకజ్ఞానం లేనిది. రంగడి మాటలు తలకెక్కి ఆమె భర్త అయిన సీతారామయ్యకు ఎదురుచెప్పడంతోపాటు అతనిపైన చెయ్యిచేసుకుంటుంది కూడా.

అన్నగారైన సీతారామయ్య డబ్బు పంపకపోవడంతో తన చదువును కొనసాగించలేక రంగడు ప్రతిష్ఠాపురానికి వస్తాడు. ఆ సందర్భంలో రంగడి ఆధునిక సిద్ధాంత ప్రవచనాలతో రత్నావళి పూర్తిగా మారిపోతుంది. సీతారామయ్య రత్నావళి, రంగారావుల సహచర్యం హద్దుమీరడం గమనించి ఇద్దరినీ ఇంటినుండి వెళ్ళగొడ్తాడు. ఇద్దరూ కొత్తమోజులో దగ్గరున్న డబ్బుతో స్వేచ్ఛగా చెన్నపట్టణంలో తిరుగుతారు. క్రమంగా రత్నావళి నగలన్ని తాకట్టులోకిపోగా, ఆమె తన పూర్వపు జీవితానికీ, పట్నంలోని కొత్త జీవితానికి మధ్య వున్న వ్యత్యాసాన్ని స్మరిస్తుంది.

రత్నావళి క్రమంగా మనోవికాసం పొంది తన మనస్సును చదువు పైకి మళ్ళించి విద్వాన్ పరీక్ష పాసవుతుంది. అధ్యాపకురాలుగా ఉద్యోగ జీవితం ప్రారంభించింది రత్నావళి. జీవితంలో ఎంతో ఆనందాన్ని అనుభవించాలనీ ఎన్నో ఆశలతో రంగడితో లేచివచ్చిన ఫలితంగా ఎదురైన పరిణామాలను స్వానుభవంతో గ్రహించి రత్నావళి ఎంతో బాధపడుతుంది. తను చేసిన పనికి పశ్చాత్తాపపడి మానసికంగా కృంగిపోయి యాంత్రికంగా జీవనం సాగిస్తూ ఉంటుంది. ఆ సందర్భంలో ఆమె ఒకసారి పరీక్షాధికారిగా రాజమహేంద్రవరం వెళ్ళడం తటస్థిస్తుంది. అప్పుడు సీతారామయ్య మూడవభార్యను రాజ్యలక్ష్మిని, ఆమె కొడుకుని రైల్లో చూస్తుంది. ఈ సంఘటన రత్నావళిని మరింత క్రుంగదీస్తుంది. రత్నావళి మనోవేదన తీవ్రమవుతుంది.

మనోవేదన తనను నిరంతరం కలిచివేస్తుంటే చివరకు రత్నావళి రంగడికి చెప్పకుండా ప్రతిష్ఠాపురానికి బయలుదేరి పోతుంది. అప్పటికి తుఫాను విజృంభించడం కారణంగా ప్రయాణోన్ముఖుడైన సీతారామయ్య కుటుంబాన్ని రత్నావళి కలుసుకొని తన జీవిత సంపాదనంతా రాజ్యలక్ష్మి కుమారుడి పేర వ్రాశాననీ సీతారామయ్యకు చెప్పి, ఆ పిల్లవాడితో తనకు ఆబ్దికం పెట్టించాల్సిందిగా రత్నావళి భర్త పాదాలపైన పడి వేడుకుంటుంది. సముద్రం వైపు వెళుతున్న రత్నావళిని సీతారామయ్య వెనక్కు రమ్మంటాడు. కాని రత్నావళి తన పాపానికి పరిష్కారంగా సముద్రంలోకి వెళ్ళిపోతుంది. ఆమెను వెతుక్కుంటూ రంగడు ప్రతిష్ఠాపురం వచ్చి ఆమెతోపాటు సముద్రంలో కలిసిపోతాడు.

చలం విశ్వనాథ సమకాలికురు. ఆయన వెలువరించిన నవలల్లో స్త్రీస్వేచ్ఛ, సంప్రదాయంపై తిరుగుబాటు ముఖ్యాంశాలు. ఈ నవలల ప్రభావాన్ని విశ్వనాథ గుర్తించారు. అందుకే ఆధునిక భావాలకు, సంప్రదాయానికీ సంఘర్షణను చిత్రించి 'చెలియలికట్ట'లో ప్రాచీన సంప్రదాయ వ్యవస్థకూ వైవాహిక సంబంధాలకూ పట్టంకట్టించారు. స్త్రీలు, మోహం, కామం మొదలైన భావాలకు ప్రాధాన్యమిచ్చి జీవితంలో అవి లేకపోతే యాంత్రికమవుతుందన్న చలం దృక్పథానికి వ్యతిరేకంగా విశ్వనాథ దాంపత్య జీవితాన్ని, స్త్రీ పురుష సంబంధాలను సంఘం, సాంప్రదాయాల పరిమితుల్లో ఇమిడ్చి ధర్మం, మతం, నీతి కట్టుబాట్లకు మానవ జీవితంలో వున్న ప్రాధాన్యాన్ని సంప్రదాయబద్ధంగా 'చెలియలికట్ట' నవలలో స్థాపించారు విశ్వనాథ సత్యనారాయణగారు.

## 15.3 చెలియకట్ట నవల - ఒక విశ్లేషణ :

వ్యవస్థా ధర్మానికీ, వ్యక్తిగతమైన సౌఖ్యాలకూ కలిగే సంఘర్షణ విశ్వనాథ 'చెలియకట్ట' నవల ఇతివృత్తం. రత్నావళిని ఆమె మేనమామ నలభై యేళ్ళ రెండో పెళ్ళివాడు సీతారామయ్యకిచ్చి వివాహం జరిపించారు. బంధువులు ఆక్షేపిస్తే ఆర్షేయ పౌరుషేయములలో నున్నదిగాని, వయస్సులో నేమున్నదని సమాధానం చెప్తాడు. రత్నావళి చిన్నపిల్ల, ఏమి తెలియనిది. ఆమె తెలియని తనం ఉన్నంతవరకూ సుఖంగానే కాపురం చేసింది. ఇక్కడ రస్సెల్ ప్రస్తావించిన, ప్రాచీన ధర్మాలు సురక్షితంగా ఉండాలంటే స్త్రీలను సాధ్యమైనంత అజ్ఞానం ఉంచాలన్న వ్యంగ్య ప్రతిపాదనను రత్నావళి పాత్రకు అన్వయించుకుంటే సరిపోతుంది.

విశ్వనాథ దృష్టిలో భార్యా భర్తల సంబంధం ఏర్పడటం దైవికంగా జరిగే క్రియ. కాబట్టి ఎవరూ ఏమి చేయగలిగింది లేదు. భరించవలసిందే జీవితమంతా. మొదట మంచివాడిని చేసుకున్న వారు జీవిత క్రమంలో ఏ పక్షవాతానికో గురికావచ్చు. కాబట్టి విధివశాన జరిగింది. అంతా విధి లిఖితం అనుకోవాలి. "సీతా రామయ్యకు అలా వ్రాసిపెట్టి ఉంది. కాబట్టే రత్నావళికలాంటి బుద్ధి పుట్టింది. అంతా విధివిలాసం.'' తల్లిదండ్రుల్ని ఎలా ఎంచుకోలేమో, సంతనాన్ని ఎలా కోరి పొందలేమో, భర్త విషయం కూడా అటువంటిదే అన్న వాదన ఈ నవలలో కనపడుతుంది.

వివాహ బంధానికున్నంత సామాజిక భద్రత ప్రణయ బంధానికి లేదంటారు విశ్వనాథ ఈ నవలలో, రంగతు, రత్నావళి లేచిపోయారు. కొత్తమోజు తగ్గడం, ధనహీనత, దురదృష్టం మొదలైనవి వారి ప్రణయ వైఫల్యానికి దారి తీస్తాయి. అయితే ఈ అంశాల ప్రభావం వివాహ సంబంధాలపై కూడా పడవచ్చు. అయితే అవి ప్రణయ జీవితాన్ని భగ్నం చేసినంతగా వివాహ బంధాన్ని తెంపలేవు. అందుకు కారణం వివాహానికి సంఘం అండదండలే. సంఘ ఆమోద ముద్ర వివాహానికుంది. అందువల్ల భద్రత స్త్రీ పురుష సంబంధాల కివ్వబడుతుందని ఈ నవలలో విశ్వనాథ నిరూపించారు.

చెలియలికట్ట నవలను విమర్శిస్తూ ఆర్.ఎస్. సుదర్శనంగారు ' సాహిత్యంలో దృక్పథాలు' "ఉద్వేగ రహితమైన మనసుతో చూస్తే, ఆయన ప్రేమను పరాస్తం చెయ్యడానికి వాడిన యుక్తులన్నీ వివాహాన్ని విమర్శించటానికి కావచ్చు (2పుట79) అంటారు.

'ఇట్లు తాత్త్వికంగా పెండ్లి ప్రేమకంటే ఉత్కృష్టమైనదని కాని, అది ఆధ్యాత్మిక సాధనలో భాగమని కాని నిరూపించలేక పోయిన రచయిత నవల ముగింపులో రత్నావళి రంగణ్ణీ, రాజ్యలక్ష్మి, సీతారామయ్యల కంటె నికృష్టులుగా విలువ కట్టడం, వాళ్ళని మృత్యు ముఖానికి పంపించటం ఏమి సబబు ? ఇది నవలలో గొప్ప లోపమే కాదు. రచయిత ఆధ్యాత్మిక వాదాన్నే వదిలి పెట్టినంత పనైంది. (పైదే. పుట. 81)

చెలియలి కట్టలో "విశ్వనాథ'' ఉద్దేశించిన అర్థం ఒకటీ, గ్రంథంయొక్క వ్యంగ్యార్థం మరొకటీ అయింది''. (పైదే పుట 83)

'చెలియలికట్ట' వ్యవస్థా ధర్మానికి ప్రతీక. విశ్వనాథ ప్రణయానికి వ్యతిరేకికారు. ప్రత్యణువులోనూ పారవస్యాన్ని అనుభవించే ప్రగాఢ ప్రణయాన్ని ఆయన తన ఏకవీర పాత్రద్వారా చాటిచెప్పారు. ఆయన ప్రణయంలో దివ్యత్వాన్ని గుర్తించారు. ఆయన దృష్టిలో ప్రణయం ఉత్తభావ ప్రేరితం. అంతేకాని శరీర సౌఖ్యమే ప్రధానంగా భావించి, విలువలను త్రోసి పుచ్చడాన్ని విశ్వనాథ తిరస్కరించారు. బాహ్య సౌందర్యానికి భ్రమపడి, అంతరంగాన్ని విస్మరించటంలోని అల్పత్వాన్ని చెలియలి కట్టలో విమర్శించారు. శరీరావధిని అతిక్రమించని పాశవిక కామానికి ప్రాధాన్యమిస్తే పతనం తప్పదని చెలియకట్ట నవలలో విశ్వనాథ 'రత్నావళి' పాత్రద్వారా నిరూపించారు. 'తల్లీ ! నీకు తెలియదు నీవు శరీరాన్ని చూస్తున్నావు. ఆత్మను చూడు. మనస్సును చూడు, ప్రేమను చూడకు, సుఖాన్ని చూడకు, సంప్రదాయాన్ని చూడు, బయట చూడకు తల్లీ ! లోపలికి చూడు'' (చెలియలికట్ట. పుట్ట 309). చెలియలికట్ట నవల విశ్వనాథ చెప్పదలచుకున్న సారాంశమిదే. సందేశమిదే.

సంప్రదాయవాదుల, సంస్కరణ వాదుల ప్రవర్తనలోని వ్యత్యాసం విశ్వనాథ నవలలో కనపడుతుంది. ఒక సందర్భంలో రత్నావళి సీతారామయ్యను ధిక్కరించి మాట్లాడింది. సీతరామయ్య రత్నావళి మీద చెయ్యి వేసుకున్నాడు. . విశ్వనాథ ఇక్కడ సీతారామయ్య రత్నావళిని కొట్టడంలో తప్పేమీ లేదనిపించేటట్లు సన్నివేశ కల్పన చేశారు. తిరిగి రత్నావళి ఉద్రేకంతో భర్త సీతారామయ్యను కొడుతుంది. సరికి సరి. ఇక రంగడు రత్నావళుల మధ్య వంటగదిలోజరిగిన ప్రణయ సన్నివేశ సందర్భంలో రంగతో గరిటెతో రత్నావళిని కాలిపై కొడతారు. ఇక్కడ సీతారామయ్య సంప్రదాయవాది. అందువల్ల రత్నావళిని కొట్టినప్పుడు అది ఒక తప్పుగా భావించలేదు. తన పనికి బాధపడలేదు. ఇక రంగడు సంస్కరణవాది తాను రత్నావళిని కొట్టినందుకు

సిగ్గుపడ్డాడు. పాశవికమని అంగీకరించి పశ్చాత్తాపంతో రత్నావళిని క్షమాపణ కోరుకున్నాడు. ఇదే సంప్రదాయవాదులకు సంస్కరణ వాదులకున్న భేదం.

"మానవుని మూలతత్త్వానికీ, అతని అంతరాత్మకూ ఉండే వైరుధ్యమే విషాదలకూ, వినోదలకూ మూలము. ఇలాంటి వైరుధ్యంతో నిండిన పాత్ర సృష్టి జీవ చైతన్యంతో సాహితీ లోకంలో చిరంజీవిగా ఉంటుంది. రత్నావళి అలాంటిపాత్ర. ఆమె అంతరాత్మ ధర్మబద్ధమైన దాంపత్య జీవితాన్నే ఆదరిస్తోంది. ఆమె తత్త్వము మాత్రం పై పై ఆకర్షణకు లొంగిపోయింది. ఈ సంఘర్షణే రత్నావళిని సానపట్టింది. విజ్ఞాన ఖనిని చేసింది" అంటారు రత్నావళి పాత్రను గురించి డా॥సి. ఆనందలక్ష్మి (ఆనందారామం) "తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రనోము"లో (పుట 53-54).

పైలోకాలున్నాయి. పుత్రుల ధర్మం తల్లి దండ్రులను పుంనామ నరకంనుండి రక్షించటానికే అయితే ధర్మబద్ధంకాని దాంపత్యంవల్ల కలిగిన సంతానానికి పితృకర్మలు నిర్వర్తించే అధికారం లేదు. అటువంటి దాంపత్యానికి అర్థంలేదన్నది విశ్వనాథ విశ్వాసం. తన విశ్వాసాలకు వేదాంత ధోరణిలో సమర్థన చెయ్యటం తప్ప తర్కబద్ధమైన వివరణ విశ్వనాథలో కనిపించదు. విశ్వనాథ వ్యవస్థకు ప్రాథన్యమిచ్చినవాడు. వ్యవస్థకతీతమైన ప్రణయం ఎంత ఉదాత్తమైనదైనా ఆయన ఆమోదించలేదు. వ్యవస్థా బద్ధమైన పాతివ్రత్యం, వంశం, సంతానం, పరలోకాలు, పితృకర్మలను విశ్వనాథ సమర్థించారు.

విశ్వనాథ స్త్రీ విద్యను ఆమోదించినా వెట్టితలలువేసే ఆధునిక విద్యావంతులలోని అతి నాగరికతను నిరసించారు వ్యతిరేకించారు. స్త్రీల చదువు ప్రస్తావన 'చెలియలికట్టలో' విశ్వనాథం చేశారు. ఈ నవలలో నీలాంబరం సరస్వతికొడుకు, రత్నావళి బలవంతం మీద ఆమె ఇంటికి వెళ్లాడు. నీలాంబరానికి ప్రారంభంలో రత్నావళి మీద 'ఒక చనిపోయిన స్త్రీ' పట్ల కలిగే తేలికభావమే ఉండేది. క్రమంగా ఆమెతో సాన్నిహిత్యం పెరిగేకొద్దీ రత్నావళి విద్యా సంస్కారాలు అర్థం కావడం చేత నీలాంబరానికి ఆమె గౌరవాదరాలు పెరుగుతాయి. ఆ సందర్భంలో "స్త్రీలు చదువు కొనవలయును. పాఠశాలలో చెప్పు చదువులతో పిల్లలకెంతో చదువురాదు. తల్లి పండితురాలైనచో, ననేక దోషములు చేయదు. ఆమెకు (రత్నావళికి) పూర్వమే యీ చదువు వచ్చినచో నట్టి పాపకృత్యములు చేసెడిది కాదు 'అని తల్లికి ఉత్తరం వ్రాస్తాడు.' స్త్రీకి చదువుకావాలి, స్వాతంత్ర్యం కూడా కావాలి. అయితే అది సంప్రదాయబద్ధమై ఉండాలన్నది విశ్వనాథ సత్య నారాయణగారి దృక్పథం.

## 15.4 చెలియలి కట్టనవల - రత్నావళి, రంగడు పాత్రలు :

'చెలియలికట్ట' నవలలో రత్నావళి, రంగడు ముఖ్యపాత్రలు. ఆధునిక విద్యావిధానం కేవలం బాహ్యజీవిత ప్రవృత్తినే గుర్తించింది. తప్ప ఆధ్యాత్మిక భావదృష్ట్యా ఏర్పరచిన నీతినియమాలు, కట్టుబాట్లు, సంఘంలో ఎలాంటి స్థానాన్ని పొంది మానవాభ్యున్నతికెలా దోహదకారిగా ప్రవర్తిల్లిందో మరచిపోయిన స్థితిని రంగడిపాత్ర ద్వారా రత్నావళిపై ప్రభావం చూపినట్టు చిత్రించి, ఆ పాత్రలు పొందిన మానసిక సంఘర్షణ ఫలితంగా ప్రేమ, వివాహ వ్యవస్థ, వాంఛ, కామప్రవృత్తి మొదలైన భావాలెలా పరిణమించాయో చర్చాపూర్వకంగా నవలలో చిత్రించారు.

ఆధునిక నాగరికత సాంఘిక జీవితాన్నెలా దెబ్బతీస్తుందో చూపించే ప్రయత్నమిందులో చెప్పబడ్డా, రచయిత అభీష్టం ప్రకారమే ఆ పాత్ర మానసికంగా ఎదిగి, లోకజ్ఞానాన్ని సంతరించుకొని న్యాయాన్యాయ విచక్షణతో తన తప్పును తెలుసుకొని, తనకుతానే శిక్ష విధించుకోవటం ద్వారా వైదిక సంఘ ఔన్నత్యం, ఆధునిక ప్రభావ ఫలితంగా జీవన గృహంలో సంభవించిన దుష్పరిణామాలు స్వరూపం సంపూర్ణంగా వివరింపబడింది.

రత్నావళి, రంగడి పాత్రలు బాహ్యంగా పాశ్చాత్యా ప్రభావానికి లోనైన పాత్రలుగా సృష్టింపబడినా వారి అంతరాంతరాల్లో వైదిక ధర్మభావనా ఛాయలున్నట్లు రంగడు, రత్నావళి, ఆయా సంధర్భాల్లో బాధపడిన సన్నివేశాల్లో సూచింపబడింది. రత్నావళి

ప్రతిసారి ప్రతిష్ఠాపురంలో గడిపిన జీవితాన్ని రంగడితోడి జీవితంతో పోల్చుకోవటం, తనకు ప్రతిష్ఠాపురంలో పని ఉన్నదనటం **(171)** నీ సిద్ధాంతములు నా మీద వృథాయైనవి నీవు దండయాత్ర యెత్తితివి మొదటియుద్ధంలోనే ఓడిపోయితివి. మీ యన్న నోడించితివి. నీవు గెలువలేదు గెలువలేదు'. అన్న మాటల్లో 'కలలో తాను చనిపోగా అత్తగారు, ఆడపడుచు తనను సముద్రంలో పడవేయబోగా **(70)**' నన్ను చెలియలికట్టలోపల పెట్టకుడు, సముద్రడు నన్ను తనలోపలికి లాగుకొనిపోవును. చెలియలికట్ట వెలుపల పెట్టుడు, సముద్రడచ్చటికి రాలేదు''. అని ఏడుస్తూ అరచిన మాటల్లో **(11)** ''రంగడు చాలా దుర్మార్గుడు. తనకు వెఱ్ఱిలెత్తించెను. సుఖముగా నీటిపాయవెంట నీదుచుపోవుచున్న రాజహంసకి సుడిగుండము నడుమనున్న తామర పువ్వు చూపించి యాశపెట్టెను.'' అన్న మాటలు ఆమెలోని సంప్రదాయ బుద్ధిని, ధర్మగుణాన్ని సూచిస్తున్నందువల్ల కేవల బాహ్యమైన ఉద్రేకం, యౌవనోన్మాద కారణంగా రంగడితో లేచిపోవడం సంభవించిందన్న విషయం ఆమెలోని అసలుతత్త్వం బయటపడ్డాక కాని తెలియజేయబడలేదు. ఈ విషయమే నవలాంతంలో రాజేశ్వరితో **(309)**'' తల్లీ ! నీకు తెలియదు. నీవు శరీరాన్ని చూస్తున్నావు. ఆత్మను చూడు మనస్సును చూడు. ప్రేమను చూడకు, ధర్మాన్ని చూడు, సుఖాన్నిచూడకు, సంప్రదాయాన్ని చూడు, బయటపడకు తల్లీ ! లోపలచూడు నిన్నూ, నీ భర్తనూ చూచుకోవద్దు నీ కొడుకును చూచుకో ! సంతానాన్ని చూచుకో నెత్తురు చెడిపోకుండా చూచుకో, అదేవర్ణం దానిలో గుణాలు ఉంటవి. గుణాలలో కల్తీవస్తే వర్ణంపోతుంది. ధర్మం నశిస్తుంది.'' అన్న మాటల్లో ఆమె భ్రష్టయై, సంప్రదాయ మార్గాన్ననుసరించింది. అందులోని ఔన్నత్యాన్ని గుర్తించింది. రచయిత ప్రతిపాదింపదలచుకున్న విషయం కూడ ఇదే కాబట్టి ఆ పాత్ర చెడిపోయినా సంప్రదాయంలోని గొప్పతనాన్ని గుర్తించిన పాత్రగా తీర్చారు. ఆమె ద్వారానే భారతీయ సంఘపటిష్టతను, వైశిష్ట్యాన్ని చెప్పించారు.

రత్నావళి శారీరకంగా భ్రష్టత్వాన్ని పొందినా మానసికంగా పరిపక్వతను సాధించి నవలాంతంలో తనతోపాటు రంగణ్ణి అంటే ఆధునిక నాగరికత లాక్కొని వెళ్ళటం ఒక విధంగా అతన్ని కూడా సంప్రదాయాన్ని గుర్తించేటట్టుచేసినా వైదిక నాగరికత ముందు ఆధునిక నాగరికత నిలబడలేక నశించిపోయిందన్న సూచనగా నవలాంతంలో ఇద్దరు సముద్రంలోపడి మరణించినట్లుగా చిత్రించబడింది.

రత్నావళి పుట్టింటివారు చితికిపోగా, తండ్రిలేని ఆమెను మేనమామ సీతారామయ్యకిచ్చి రెండో వివాహం జరిపిస్తాడు **(27)**'' రత్నావళి సహజముగా అందగత్తె, చక్కని నుదురు, విరిసిన కనుబొమ్మలు, చెంపకు చేరవేసికన్నులు, కొసదేరి యందము పుణికి పుచ్చుకున్న చిన్నగడ్డము, ఉబ్బి మిసమిసలాడుతున్న బుగ్గలు, ముడతలు పడుతున్న మెడ, మెడలో నానుపేటలు, గొలుసు, చెవులకు దుద్దులు, మెడ వైపునకు వంపుదేరి తన ప్రాయపు మిసిమి వెలార్చుతున్న వక్షస్థలము. ఇదీ ఆమె సౌందర్యం.

వివాహమై రెండేళ్ళు భర్తతో సుఖంగా కాపురం చేసిన రత్నావళి సంసారపక్షంగా జీవితం సాగిస్తుంది. మరిది రంగారావు పట్నం చదువులు చదివి ఆధునిక భావాలు కలిగినవాడైన కారణంగా తన ఇంట్లో వయసు మీరిన అన్నగారు రెండోవివాహం చేసేకొని యుక్తవయస్సులో ఉన్న రత్నావళికి ద్రోహం చేశాడని వయసుమీరిన వాడితోటి సంసారంలో సుఖం లేదని, తన అన్నవల్ల ఆమెకు అన్యాయం జరిగిందని చెప్తాడు. అమాయకురాలు రంగనితో సమానమైన వయసుగల రత్నావళికి అతడు చెప్పిన విషయాలు సబబుగా తోస్తాయి. దాంతో తన కన్యాయం జరిగిందన్న భావన ఆమెలో దృఢంగా నాటుకొంటుంది. తన అందానికి తగిన ఈడుజోడు లేదని బాధపడుతుంది. ఆమెలో కలిగిన మానసికమైన ఈ మార్పు భర్తను, ఆడపడచును లెఖ్ఖచెయ్యక రంగడితో చనువుగా ప్రవర్తించేట్టు చేస్తుంది **(37)** ''లోకము నందలి సౌఖ్యము యొక్క పరమావధి యావె మనోవధిగానుండకపోయినను, శరీరావధిగా నుండెను. ఆమె యొక క్రొత్త వికారము పొందెను''. ఇలా ఆమె యౌవనవతియైన కారణంచేత, భర్తకన్న రంగారావందంగా, నాగరికంగా ఉన్న కారణంచేత, అతని ఆధునికమైన పోకడల కాకర్షించపబడి, సీతారామయ్య ననాగరికుడిగా, పల్లెటూరి బైతుగా భావిస్తుంది. ఆమెలో కలిగిన భావసంచలనం శరీరావధిగా ఉన్నదన్నమాట. బాహ్యావాంఛ

ప్రవృత్తిని ఆధునిక నాగరికత ఎలా రెచ్చగొడుతుందో, సాఫీగా సాగిపోతున్న దాంపత్య జీవితాన్నాధునిక ఆలోచనారీతి ఎలా ప్రభావితం చేసి లొంగదీసుకుందో పై సంఘటన వివరిస్తుంది. ఇలాంటి స్థితిలో రంగడామెను దొరల పద్ధతిని చెప్పి కౌగిలించుకోవటం, చుంబించుకోవటం చేయటంవల్ల, అతడు లక్నో నుండి పంపిన పుస్తకాలు చదివిన కారణంచేత రత్నావళి అతని సిద్ధాంతాలపట్ల సంపూర్ణంగా ఆకర్షింపబడుతుంది. సీతారామయ్య వారి ప్రవర్తనను సహించక ముభావంగా ఉండటం ఆమెలో రంగడిపట్ల మరింత ఎక్కువ మోజును పెంచుతుంది **(64)** రంగని తలంచుకొనినపుడెల్ల, నానాటిరాత్రి స్మృతికి తగినపుడెల్ల, రంగని సౌష్ఠవము తలంచినపుడెల్ల, నామె మనసులో నొకయున్మాదచ్ఛాయ కలుగుచుండెను". ఈ విధంగా ఆమె పరిస్థితి హద్దులు మీరి మరిదితో శారీరక సుఖాన్ననుభవించే దశకురాగా సీతారామయ్య వాళ్ళిద్దర్ని ఇంటి నుండి వెళ్ళగొడ్తాడు. ఏవిధమైన సంకోచం, ధర్మభీతిలేని వాళ్ళిద్దరూ చెన్నపట్నం వెళ్తారు **(120)**. "Western theory seeks to establish marriage on a basis of romantic love and free choice, marriage thus depends on the accident of 'falling in love' Those who are 'crossed in love' or do not love are not required to marry" అన్నట్లు ప్రేమించిన వారినే పెళ్ళిచేసుకోవాలని రంగడి సిద్ధాంతం. తానామె ప్రేమించటంలేదు. కాబట్టి ఆమెను చెన్నపట్నం తీసుకువెళ్ళి తన స్నేహితులతో పరిచయం చేస్తాననీ, వారిలో ఎవరి నెక్కువ ప్రేమిస్తే వారిని వివాహమాడవచ్చునని చెప్పిన రంగడి మాటలు, స్త్రీ పురుషుల పరస్పర కరచాలనము, చుంబన పరిష్వంగదులు స్నేహభావంతో, విలాసంగా చేసే అలవాట్లని, అది ఆధునిక సంఘలక్షణమనీ స్వేచ్ఛా విహారంలో తప్పులేదని అన్న మాటలు రత్నావళికి సమంజసంగా అనిపించదు. వారి ప్రవర్తన హద్దులు మీరిన కారణంచేత అతనిపై ఆమెకు ప్రేమ ఉండటంవల్ల తాము భార్యాభర్తలమేనంటుంది. అందుకే ప్రతిష్ఠాపురం సముద్రతీరంలో ఒకసారి **(97)** "నీవు నా భర్తవుకానిచో నేనాయింటికి రాను. నిన్ను చూచి మీ అన్నయ్యను వదిలిపెట్టితిని. నీవు భర్తవు కానిచో నేనా ఇంటికి వచ్చుటకు వీలులేదు" అంటుంది. కాని రంగడు తామిద్దరు స్నేహితుల్లా, అతిధుల్లా, మెలగవచ్చునన్న మాటకు **(97)** అతిథులను ముద్దు పెట్టుకొనవచ్చును. అతిథులను షికార్లు తీసుకొనిపోవచ్చును. అతిథులతో సంసారము చేయవచ్చును. అది పెండ్లికాదు. అది ప్రేమ కాదు. పెండ్లియు ప్రేమియు వీనిని దాటి ఏ రీతిగా నుండును ? ఆ ప్రేమ ఎటువంటిది ? దానికి గుర్తేమిటి ? అని ప్రశ్నిస్తుంది. రంగని సిద్ధాంతము స్త్రీపురుష సంబంధం మాత్రం కావటంచేత రత్నావళికే సమాధానం చెప్పలేకపోతాడు. కాని ఆమె తన గత జీవితానికన్న భిన్నమైనదేదో ఆధునిక జీవితంలో ఉన్నదని భావించి అతని వెంటపడివచ్చాక అతని సిద్ధాంతంలో ఏమీ లేదన్న విషయాన్ని ఛాయామాత్రంగా ఊహిస్తుంది. ఈ ఊహే ఆమెలో క్రమవికాసంపొంది సర్వవిషయ పరిజ్ఞానశీలను చేస్తుంది.

చెన్నపట్నంలో విలాసాలకు డబ్బుఖర్చైపోగా రత్నావళి నగలొక్కటొక్కటే తాకట్టుకు పోతాయి. సరదాల షికార్లు కొన్నాళ్ళ విలాసజీవితానంతరం, డబ్బులేని స్థితిలో పడ్డబాధలు, ఆమెలో కొంతలోకజ్ఞానాన్ని కలిగిస్తాయి. దాంతో రత్నావళికి రంగడి తోటి కాపురంలో క్రొత్తదనపుమోజు తగ్గి **(120)** "ఆహా ! శరీరము చెడ్డదిగదా ! దీనికిని వాంఛతీరిన తరువాత మఱల వాంఛ ఏర్పడు వరకు దానిని మోహము సంరక్షింపవలయును. ఆ మోహమును బహిఃపరిస్థితులు పోషింపవలయును. అనగా అనగా బహిఃపరిస్థితుల కొలది మోహాధిక్య యేర్పడునన్న మాట" అని తెలుసుకుంటుంది. ఆమెలో మోజు తగ్గడానికి ధనాభావం ప్రధానకారణం, ధనం లేకుంటే జీవితం సమస్యగా మారుతుందని ప్రథమంగా అనుభవపూర్వకంగా తెలుసుకుంటుంది.

ఈ సందర్భంగా రచయిత **(123)** "స్త్రీ పురుష వాంఛ సర్వత్రయొక్కటియే. కాని దాంపత్యము నందు విశేషము తల్లిదండ్రులు కుదిర్చినదని, ఒక కులమువారని, ఒక గోత్రమువారని, ఒక పాయవారని అది సంఘ మర్యాదయని, అది మన పూర్వులు పుణ్యలోక హేతువని చెప్పిరని ఈ కారణములచేత దంపతుల మధ్య వాంఛ యెడబాయరానిది" అని పేర్కొన్నారు. వివాహ వ్యవస్థలో కూడ ధనాభావం వల్ల కష్టసుఖాలు కలిగినప్పటికీ, ఒక కట్టుబాటుకు లోబడి ప్రవర్తించటం ఉంటుంది. కాబట్టి, భార్యాభర్తలు కష్టసుఖాల్ని సమంగా పంచుకోవటం, సంతాన క్షేమాన్ని కాంక్షించటం వల్ల అక్కడ వాంఛ తాత్కాలికంగా

జారిపోయినా భార్యాభర్తల అనుబంధంచేత ఆ భావన వ్యగ్రత పొందుతుందని, ఇక్కడ రత్నావళి రంగారావుల పరిస్థితి తద్భిన్నమైంది. కాబట్టి జరుగుబాటున్నప్పుడొకలాగ, లేనప్పుడు నిరుత్సాహంగా సాగుతుందని సూచిస్తున్నారు.

రంగడు ఉద్యోగార్థమై వెళ్ళటం, తన ఏకాకితనం, రత్నావళి మనసులో గమ్యంలేని నౌకా ప్రయాణం లాంటి తమ యాంత్రిక జీవితంపట్ల విసుగును కల్గిస్తుంది. దాంతో ఆమె (127) "ప్రతిష్ఠాపురము నందు కన్ననిక్కడ నెక్కువేమి ? మన మిరువురును ప్రత్యేకముగా నుండుటయే ఎక్కువ యందువా ? అయినచో నక్కడ మీయక్కగారు వంటచేసి పెట్టితిరి. నా నగలు ! నాయొంటిమీది నేయుండెడివి. ఒక్కడ కలిసియుండటయే ఎక్కువయినచో నక్కడనవి రెండు నెక్కువకాదా ! అన్న ప్రశ్నించటమేగాక ప్రతిష్ఠాపురంలో గడిపిన జీవితంలో ప్రశాంతత, ఆనందం ఆమెకు చెన్నపట్టణ జీవితంలో లోపించినట్లు తెలియటంవల్ల అక్కడలేని సరదాలిక్కడ ఉంటాయన్న తన భావం నిజం కాదని తెలుసుకోవటంచేత (130) "నీవు నాకొక్కటే యపకారం చేసితివి. భార్యాభర్తలు కాని స్త్రీ పురుషులు కౌగిలించుకొనవచ్చునని చెప్పితివి. నేను నిజమనుకుంటిని. దాని మూలముగా నేను చెడిపోతిని" అని అంటుంది. ఈ మాటల్లో ఆమె సుఖంగా సాగిపోయే దాంపత్య జీవితాన్ని, ఆలోచనారహితంగా చేజేతులా పాడుచేసుకున్నానని గుర్తించిన తీరు స్పష్టముగా తెలియజేయబడ్డది. అందుకే మిల్టను పారడైజులాస్ట్ అన్న పుస్తకంలో (31) "మనసు దానిలో యిమిడి యున్నది. అది స్వర్గమును నరకముగా చేయును. నరకమును స్వర్గముగా చేయును" అని చెప్పబడినదన్న రంగడితో అవి పరమసత్యములైన మాటలనీ తాను ప్రతిష్ఠాపురం బాగలేదనుకొన్నందు వలన, చెన్నపట్నం బాగుంటుందనుకోవటం వల్ల పరిస్థితి ఇలా విషమించిందని చెబుతూ (130) ఆయన చాలా గొప్పకవి. ఆ యొక్క మాటకు ఆయన కేమియిచ్చినను యివ్వవచ్చును" అంటుంది రత్నావళి. మానసికమైన ఎదుగులను సూచించే మాట ఇది. రంగడిలో ఎలాంటి పరిణామమూ కనిపించదు. కారణం ? అతనికి సిద్ధాంతంపట్ల మాత్రమే ఆలోచన తప్ప, ఫలితాన్ని గురించిన పట్టింపేమీ లేకపోవటమే. కాని రత్నావళి స్త్రీ కాబట్టి, పైగా గృహస్థ జీవితం గడిపిన యువతి కాబట్టి మానసికమైన సంఘర్షణకు గురైన వ్యక్తి కాబట్టి తాను చేసిన పనివల్ల సాధించింది పొందింది ఏమిటన్న భావనతో నిత్యం మధనపడటంచేత రంగడితోటి ఆమె సంభాషణలన్నీ కటువుగా, పుల్లవిరుపు మాటలుగా పరిణమించడం ప్రారంభించింది.

ఈ సంఘటన తర్వాత రత్నావళి సంపూర్ణ జీవితాను భవాన్ని పొందే మార్గాలేర్పరచుకుంటుంది. తద్వారా తాను చేసిన పొరపాటుకు విముక్తిని సాధించాలని నిత్యం ప్రయాసపడుతుంది.

నీలమోహనుడు, హరికిశోరరావు, సీతారామశాస్త్రి అనే రంగడి స్నేహితులు రత్నావళి లేచివచ్చిన సంగతి తెలిసినవాళ్ళు కావటంచేత ఆమెతో గూడ సంభాషణలు సాగించటం, ఆమెను వశం చేసుకోవాలన్న కాంక్షతో ప్రవర్తించటం చేస్తారు. కాని ఆమె వాళ్ళను తన వాక్చాతుర్యంతో, వాదనా నైపుణ్యంతో హద్దులు మీరకుండ చేస్తుంది. చదువు మీద ఆసక్తి వున్న రత్నావళికి శాస్త్రి మనుచరిత్ర పాఠం చెబుతాడు. అందులో శృంగారఘట్టాల్ని వివరించేటప్పుడు ఇబ్బందిపడుతున్నట్లు నటించటం చూచిన ఆమె (167) ఇందులో తప్పేమున్నది ? ముఖమున కొక పేరుండవలయును గదా ? అన్నింటికి పేరులుండును, సర్వజంతువుల యవయవములకు పేళ్ళుండును, అవసరమున్నచో వానిని వాడరా ? వాడనిచో పేర్లే యక్కరలేదు ? అని చురక పెడుతుంది.

ఈ సందర్భంలో రచయిత (167) "శాస్త్రికి రత్నావళి యనే మాటల యర్థనైశిత్యము తెలియనంత సంస్కారము లేదు. భాషాజ్ఞానము వేఱు. సంస్కారము వేఱు కదా ! సంస్కారము జనులకు పూర్వజన్మముల నుండి ప్రాప్తించునది ఒక్కొక్కరి యందిది కాలతః ప్రాప్తించునది చదువుకొనునప్పుడు మందబుద్ధి యగువాడు స్వతంత్ర జీవన మారంభించినంతనే నిశిత వివేకుడై ప్రకాశించును. ఇది వసంతముల మామిడి పూచినట్లు రత్నావళి మనస్సు మన్మథుని గొడుగునకు ముత్యాలు గ్రుచ్చినట్లు పూచెను" అని పేర్కొన్నారు. మనుచరిత్ర పాఠం చెబుతూ రతి, వక్షోజములు, ఊరువులు అన్నమాటల్ని శాస్త్రపాఠం చెప్పే దృష్టితోకాక, రత్నావళికి శరీరసౌందర్యపరంగా ఆలోచించటం, ఇబ్బందిపడటం జరగ్గా, దాన్ని సునాయాసంతో చాకచక్యంగా

వ్యాఖ్యానించింది. అతడి నీచ స్వభావాన్ని ఎత్తిచూపుతుంది. అంతేకాకుండ రంగడితో తాను లేచివచ్చినంత మాత్రాన తాను రంగడి భార్యనని ఎవరూ అనరని, లేచిపోయిన సీతారామయ్య భార్యననే అంటారంటూ (166) "ఒక చెట్టునకు ఒక తీగెకు నున్నంత సంబంధము రెండవ చెట్టుకుండదు" అని వివరిస్తుంది. ఈ విధంగా ఆమెలో దేశకాలోచితంగా వెలువడ్డ మేథాలక్షణాన్ని, సంస్కారబుద్ధిని రచయిత వివరిస్తూ వచ్చారు.

రత్నావళిలోని మార్పు రంగడ్ని ప్రభావితం చేస్తుంది. తన అన్నగారికి చేసిన ద్రోహమతనికి గుర్తుకు వచ్చి, మానసికంగా కృంగిపోతాడు. తన సిద్ధాంతాలు అయదార్థాలని, భ్రాంతి కారణంగా తాను తప్పటడుగు వేశానని తెలుసుకొని ఆమెను వివాహం చేసుకుందామని అర్థిస్తాడు కాని (170) ప్రేమయే పెండ్లి యంటివికాదా ! మన యిరువురి మధ్య ప్రేమ లేనప్పుడు పెండ్లిలేదు. పెండ్లి లేనప్పుడాడుట యెందులకు ? ఇంకను నీకెందరో స్నేహితులుండవలయును. వారి నందఱన నన్ను చూడనిమ్ము నా మనస్సొక నిశ్చయమునకు వచ్చునేమో" అని అతని సిద్ధాంతంలోని అల్పత్వాన్ని వ్యగ్యంగా విమర్శిస్తూ (179) "నీ సిద్ధాంతము మారినంతనే నేను నీయన్న భార్య నగుచున్నాను. అప్పుడు నేను నిన్ను ప్రేమించను" అనటం రంగడు పూర్వం ప్రతిష్ఠాపురంలో కారణం లేకుండా ప్రేమ పుడుతుందని, ఎక్కడ ప్రేమ కలిగినే అక్కడ వివాహమని చెప్పిన అతని సిద్ధాంతాన్నతనికే గుర్తు చేయటంతో అదంతా తన భ్రాంతి అని, ఆమె మాటలతని కళ్ళు తెరిపించాయని ఒప్పుకుంటాడు. "ఈ సంఘటన తర్వాత రత్నావళి సంస్కారంలో సంప్రదాయంలో నున్న భద్రత లేదు. నాకేమియు తెలియుటలేదు. నేనీనాటి నుండి భగవంతుని చేతిలో బిడ్డను వాని యిష్టము వచ్చినట్లు నడిచెదను" అని అనుకోవటం స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్య దృష్టితో రంగడి వెంట వచ్చాక కాని అతనిది అనుభవపూర్వకమైన సిద్ధాంతం కాదని, కొత్తలో తామిద్దరూ కొంత సంతోషాన్ననుభవించినా, అది స్థిరమైన భావనగా మిగలకపోగా, సంఘ వ్యతిరేక కార్యం చేశానన్న బాధ ఆమెలో నిత్యం కలచివేస్తున్న కారణంగా ఆ తాకిడికి తట్టుకోలేక సంప్రదాయపరంగా తన భర్తతోడి సంసారం జీవితంలో వున్న భద్రత దూరమై కష్టాలుకొని తెచ్చుకున్నానని గ్రహించి ఇకముందు గడపబోయే జీవితాన్ని భగవధీనం చేసి, కేవలం నిమిత్త మాత్రంగా ఉండాలనుకోవటం ఆమెలో అన్నాళ్ళు మరుగుపడ్డ పరలోక విషయ సంబంధమైన జ్ఞానోదయం కలిగిందన్న విషయాన్ని సూచిస్తోంది. కేవల బాహిరసుఖ జీవన లక్ష్యమైన జీవితాన్ని గడిపిన రత్నావళిలోని చైతన్యం క్రమవికాసం పొందటం వల్ల భగవత్పరంగా జీవితాన్ని ఆలోచించటం ప్రారంభించింది. ఆధునిక సంఘం మరచిపోయిన విషయమిదే. కేవల భౌతిక సుఖలాలసత్వం, పరలోకాలు లేవన్న భావన, యాంత్రికమై జాంతవిక జీవనం, లోతులు తెలియని, నిర్దిష్టమైన ఊహలులేని, సంఘ సంస్కరణాశక్తి మొదలైన ఆధునిక సిద్ధాంతాలపట్ల ఆమెలో కలిగిన విరక్తి భావమే సంప్రదాయపరమైన ఆలోచనల్ని రేకెత్తించింది. ఫలితంగా (137) "మన సంఘములో వివాహములు పెట్టి దానికి పునాదిగా కామముండుట వలన, మతము, సంఘము, గృహమర్యాదలు, నాచారములు నివన్నియు, కామము పునాదిగాగల వివాహమునుబట్టి, వచ్చిన భర్త ననుసరించి యుండకతప్పని యట్లేర్పాటు చేసిరి" అన్న అంతరార్థాన్ని ఆమె గ్రహించుట వల్లే దానికి దూరమైన ఫలితంగా అనుభవించిన మానసిక క్షోభవల్ల రంగడితో (192) "భ్రష్టుల మధ్య ప్రేమ యుండదు అది వట్టిమచ్చ. ఈ యిచ్చ ధర్మబుద్ధితో కలిసి స్త్రీ పురుషుల సంసారమునకు హేతువైనపుడు దానిని ప్రేమ యానవచ్చునేమో" అని అనగల్గుతుంది. అంతేగాక ఆమె సూటిపోటి మాటలకు తట్టుకోలేక దుఃఖిస్తున్న రంగడితో (206) "నీవు కన్నీళ్ళు కార్చినచో నాకు జాలి లేదు. నీవు నన్ను గాఢముగా వాంచించుము. నీయందు నాకు జాలి పుట్టును. ఆ వాంఛ పూర్తిగా కామేచ్ఛ చేయుము. అప్పుడు నీ యందు నాకు జాలి పుట్టును. ఆ వాంఛను మృదువును చేసి దాని యందింకొక సుకుమార భావమును వ్యాపింప చేయుకుము. నీయందలి జాలి నాకు కోపముగా మారును" అనటంలో ఆమె తన జీవితాన్ని నాశనం చేసింది చాలక దుఃఖపడుతున్న రంగడిపట్ల జాలిచూపలేక తన దౌర్భాగ్యోన్నతని ఏడుపు గుర్తు చేస్తోందన్న భావం కలగడంచేత తనతో మునుపటి లాగే గాఢవాంఛాయుతంగా ప్రవర్తించమని, ఆ భావంలో ఏ మాత్రం సుకుమారత్వం కనిపించినా అది తనకు భాధాహేతువౌతుంది. కాబట్టి అతని వాంఛను పూర్తిగా కామేచ్ఛను చేయమని శాసించినట్టు మాట్లాడుతుంది. ఈ మాటలామె అనుభవించిన మానసిక క్షోభను సూచిస్తున్నాయి.

రత్నావళి ముకుందరావు వద్ద మళ్ళీ చదువుకోవటం ప్రారంభించి తెలుగు వ్యాకరణం, పంచవాక్యాలు చదువుకొంటుంది. ఆమె వివేకం అతడు చెప్పే సాహిత్య విషయాలను గ్రహించి మంచినీటికెక్కిన చేపలా అల్పకాలంలోనే అన్నీ నేర్చుకోవటం. ఆమె సూక్ష్మ గ్రహణశక్తి వల్ల విద్వాన్ పరీక్ష కూడా పాసవటం జరుగుతుంది. తన కళ్ళ ముందే ఎదిగిపోతున్న రత్నావళి నొక్క నిమిష వదిలి ఉండలేక రంగడామెనర్థించి నెలరోజులు సెలవుపెట్టి ఇంట్లోనే వుంటాడు. ఆ సమయంలో అతని విపరీత చర్యలకు తట్టుకోలేక దూరంగా నెట్టిన రత్నావళిని రంగడు గరిటెతో చిలమండ మీద కొట్టటం జరుగుతుంది. ఈ సంఘటనతో పూర్వం ప్రతిష్ఠాపురంలో రంగడి ప్రభావంవల్ల భర్తమాటల్ని లెక్కచెయ్యక నిర్లక్ష్యంగా ప్రవర్తించిన సందర్భంలో కోపంతో సీతారామయ్య అమెపైన చెంబెడు నీళ్ళు కుమ్మరించిన సంఘటన భర్త కెదురు తిరగమన్న రంగని సలహా గుర్తుకువచ్చి **(131)** "రంగా మీయన్న నన్ను కొట్టినప్పుడు మరల కొట్టమంటివి. నేను కొట్టితిని. మీయక్క సరస్వతమ్మ వచ్చి నన్ను చావమోదెను. నీవు నన్ను కొట్టగా నేను తిరిగి కొట్టవలెనా ? మీ యన్న బలహీనుడని నీవు నన్ను తిరిగికొట్టమంటివి" అంటుంది. అది కామోద్రేకంలో చేసిన పని అనీ, క్షమించమన్న రంగడితో **(214)** కోపము వచ్చుట ప్రతివారికి కలదు. అది కొందఱిలో హద్దు మీరిపోవును. కొందఱిలో నియమింపబడియుండును. వారే నాగరికులు. నియమం నాగరికత. నియమమును దాటిపోవుట పశువృత్తి. ఈ నీ సంస్కార భావములన్నియు నియమదూరము లగుటచేత నొకరీతిగా పశువృత్తి. పశువృత్తి కూడ కాదు. రాక్షసవృత్తి, పశువృత్తి జంతు సహజమైన వృత్తి. అది యెప్పుడును శరీరమున కపకారమునే చేయుట భావించుచుండును. రాక్షసవృత్తి శరీరమున కపకారము చేయుట మాని యొకని జీవితమున కపకారము చేయుట కొరకు చూచుచుండును. స్త్రీలను సముద్ధరించుటకు నీవు ప్రయత్నించునపుడు నీ యందే కామ వ్యాపారము లేకపోలేదు. నన్ను నీవు పెడమార్గము త్రొక్కించినపుడు నా జీవితమున కంతకును భంగము కలిగించితివి. ఇది రాక్షసత్వము. అది నీవూహించుకొని చేయనక్కరలేదు. నీయూహతేన్మఖముగా కలుగును. కోప విషయకమైన రాక్షసత్వము దీనికన్న మంచిది" అని చెప్పటంలో ఆమెకు కలిగిన యదార్థ జ్ఞానోదయంవల్ల, రంగడి సిద్ధాంతాలు తన జీవితాన్ని నాశనం చేసిందన్న బాధ తన భర్తపట్ల అహంకారంతో ప్రవర్తించిన ఫలితంగా తనకు ప్రాప్తించిన దుఃఖం ఆమెలో తీవ్రవేదన కలిగించి, రంగడికి, తన భర్తకున్న వ్యత్యాసాన్ని గుర్తించటంచేత ఆమె వారిద్దరికున్న బేధాన్ని స్పష్టంగా చెప్పగలుగుతుంది. అంతేగాక ఆముక్తమాల్యాద్రి గ్రంథాలు చదివి శాస్త్ర విషయాలు, ధర్మాధర్మ సూక్ష్మవివరాలు గూర్చి సంపూర్ణంగా తెలుసుకొని ప్రేమంటే ఏమిటో తెలియని రంగడితో **(223)** "ప్రేమ యనగా సంతోషించుట. తృప్తికనుట, ఇష్టపడుట, ప్రకాశించుట అని యర్థము. ఒక పురుషుడుగాని, స్త్రీ గాని తాను మరియొక వ్యక్తి యందిష్టపడుట ప్రేమ. వారిరువురు కలిసిపోరును, పొక్కును లేకయుండుట. అప్పుడొకరి యందొకరు స్నిగ్ధులగుదురు. వారు చేసిన పనులు వీరికిష్టము. వీరు చేసిన పనులు వారికిష్టము. కామ విషయకమైన తృప్తి యొకరియందొకరికి కలుగును. కనుక అట్టి తృప్తి మోక్షము కాదు. అది వైరాగ్యము కాదు. జీవితములో నొక సుఖ సాధనము" అని చెబుతుంది. కాని ఆమె మాటల్లోని లోతును గ్రహించలేక వైరాగ్యం మోక్షం అన్నవి క్రియాశక్తి రహితులనే మాటలని, వేదాంతాలు దొంగవని అన్న రంగడితో రత్నావళి **(233)** "నీకు నీ జన్మకుయదార్థవస్తు పరిజ్ఞానము కలుగదు. నేను నీతో నింక వాదించను. పోట్లాడను" అని చెప్పటం ఆమె ఎంత ఉన్నతస్థాయికెదిగి మాట్లాడుతుందో అంత అధఃస్థితిలో రంగడున్నాడన్న విషయం స్పష్టమౌతున్నది.

ముకుందరావు చదువుతోపాటు చెప్పిన కర్మానుభూతి, వైరాగ్యం మొదలైన అంశాలమె ప్రశాంత జీవన మార్గానికి తోడ్పడగా హరికిశోరరావామెకు బాధపడక, ఆ విషయ సంబంధంగా ముకుందరావు ఆంధ్రపత్రికలో ప్రచురించిన కథను చదివి గొప్ప మార్పును పొందుతుంది. కాషాయ వస్త్రాలు ధరించి బైరాగి జీవితాన్ని గడుపుతుంది. ఈ భావాల్లో ఆమెకు ప్రతిష్ఠాపురం నుండి వచ్చేముందు భర్త 'అనుభవింతురు' 'అనుభవింతురు' అని రోదించిన తీరు జ్ఞాపకం రాగా **(233)**" ఆహా ! యేమి అనుభవము ! శాపమువలె తగిలి వచ్చెను. ఈ యనుభవములో నొకవాడివి యేర్పడెను. ఒక వ్యాధియో, ఒక శరీర కష్టమో, ఒక దారిద్ర్యమో మయినచో నీ యనుభవము కీసరముండదు" అనుకోవటం ఆమె జీవితంలో గడించిన అనుభవం ద్వారా అనేక

విషయాలు తెలుసుకున్నా భర్త శాపం కారణంగా ఆనందమయ జీవితానికి దూరమై, తన జీవితం విషయమయయిందన్న సత్యాన్ని గ్రహించిన తీరు తెలుస్తోంది. ఈ సందర్భంగా రంగడితో (247) 'నేనొకనితో లేచి పోదును, నీవేమగుదువు ?' అంటుంది. దానికతడు వాని ప్రాణాలు తీస్తానంటాడు. రత్నావళి ఎవడు పూర్వము నీ వలన నెట్టియుపకారము పొందునో వాడు యిట్టి యపకారము నీకు చేయుననుకొనుము. నీవేమి చేసెదవు ? అని సీతారామయ్య తనను స్వీకరించకపోయినా ఆయన కొరకే వెళ్తానని అనటం ఆమె దాంపత్య జీవితం పట్ల గల భక్తి గౌరవభావాలు నమ్మకం వెల్లడౌతున్నాయి. నీలాంబరుడి ద్వారా సీతారామయ్య వివాహం చేసుకున్నాడని తెలిసి ఆమె (237) "మీ మామగారు సుఖముగా నున్నారని చెప్పితివి. మరల వివాహము చేసుకొని రంటివి. నాకంతియేచాలును'' అన్న మాటలు కూడా తనవల్ల భర్త నిరంతర దుఃఖమయ జీవితం గడపకుండ సుఖంగా బ్రతుకుతున్నాడన్న సంతోషంలో వ్యక్తం చేసిందే. ఈ విషయం రంగడితో చెప్పినప్పుడు (239) మంచి పని చేసినాడు. ఆమె గొంతును కూడా కోయును కాబోలు'' అన్న మాటకు "ఆ యింటిలో నింకొక రంగడు లేడుకదా'' అన్న జవాబులో అతడు తన జీవితాన్ని పాడుచేసినట్లు ఆమె జీవితానికెవరు అడ్డంలేరన్న వ్యంగ్యం, తద్వారా అతని నీచబుద్ధిని బయటపెట్టటం, సూచింపబడ్డవి.

ఈ సంఘటన తర్వాత రంగడు పక్షవాతం వచ్చి మంచం పడతాడు. మానసికంగా తీవ్రబాధకులోనైన కారణంగా అలాంటి జబ్బువచ్చిందన్న వైద్యుని మాటల్లో ఆమెరంగడితో ఏ విధమైన తర్కంగాని, వాదోపవాదంగాని పెంచుకోక, సాధ్యమైనంతవరకు, మౌనంగా వుంటుంది. ముకుందరావు సహాయంతో సౌజన్యరావనే హోమియో వైద్యునిచేత రంగడికి మందులిప్పిస్తుంది. కొన్నాళ్ళకతనికి జబ్బు నయమౌతుంది. ఒకరోజు రంగడు (270) "మనకొక పిల్లవాడైన లేకపోయెను'' అనగా రత్నావళి మొగము క్రమముగా నెఱుపెక్కెను. ఆమె కన్నులలో కోపము వచ్చెను. ఆమె యొడలంతయు కదిలిపోయెను. ఆమె గుండెలో మానిన పుండు గెలవేసెను'' అని చెప్పబడ్డ మాటల్లో అప్పటికే తాను ఘోరపాపం చేశానని బాధపడుతున్న రత్నావళికి, ఆ చింత ఏ మాత్రంలేని రంగడి మాట. ఆరోగ్య దృష్ట్యా అతన్నేమీ అనలేని స్థితిలోని ఆ బాధలే ఆమె శరీర కదలికల్లో బహిర్గతమై, అతనిపట్ల గల అసహ్య భావాన్ని వెలిబుచ్చింది. దాంతో ఆమె తాను వుద్యోగం మానివేసి ప్రతిష్ఠాపురం వెళ్తానంటుంది (272) "ఆత్మహత్య ఇదివఱకే చేసికొంటిని'' ఇప్పుడు శరీరహత్య మాత్రమే చేయవలయును'' అని అనుకోవటం ద్వారా ఆమెకు లభించిన జీవితానుభవం క్రియోన్ముఖంగా ఉన్నది కాబట్టి ప్రతిష్ఠాపురం వెళ్తానని అనటంలో తన జీవితాన్నెలా ముగించబోతుందో సూచిస్తుంది.

చివరగా పరీక్షాధికారిణిగా రాజమహేంద్రవరం వెళ్తూ రైల్లో సీతారామయ్య మూడవ భార్య రాజ్యలక్ష్మిని, ఆమె కొడుకును కాకతాళీయంగా కలుసుకోవటం జరుగుతుంది. ఆ సంఘటన రత్నావళిని కలచివేస్తుంది. దాంతో తన జీవితానికి తుది సమయమాసన్నమైందని ఆమె కనిపించటంతో (289) వ్యాధిబాధ ఈ శరీరములో ననుభవించినది. పాపఫలము ఈ శరీరమును దాటి కూడా ననుభవించినది'' అన్న అభిప్రాయంతో పశ్చాత్తాపపడి ఆత్మహత్య చేసుకుంటానని ఒక కాగితం పైన వ్రాసిపెట్టి ఇంటి నుండి వెళ్ళిపోతుంది. ఇక్కడ రంగారావుతో ఆమె మాట్లాడే సందర్భంలో రచయిత "నీ వేదో యొక యూహపుట్టి నీవు తాత్కాలికముగా బలవంతులగుట చేత నీ యూహలే సర్వజాతులకును, ధర్మములనలేవు. నాధర్మము నాది, నా జాతి కొరకు, నా సంప్రదాయము కొరకు నేనాహుతియైపోదును'' అని ఊరు విడిచివెళ్తున్న సీతారామయ్య పాదాలుమీదపడి (304) 'నా ఆబ్దికాలు మీ పిల్లవాడిచేత పెట్టించండి'' అని అనిపించటం ఆమె శారీరకంగా చెడిపోయినదైనా మానసికంగా సంప్రదాయ జీవితం పట్ల అభిముఖ్యం ఉన్న వ్యక్తిగా చెప్పటానికే. అందుకే నవలాంతంలో వెనక్కిరమ్మని సీతారామయ్య, అతని భార్య పిలిచినా (307) "ఏ శరీరంతో ఆ పాపాలు చేశానో ఆ శరీరం మాత్రమే పోవాలి. ఉప్పెన తప్పకుండా వస్తుంది. సముద్రుడు చెలియలి కట్టను దాటి వస్తాడు. నన్ను తనలో ముంచివేసుకుంటాడు. నాలో వున్న ప్రకృతికి సముద్రుడిలో నున్న ప్రకృతికి బేధం లేదు. నేను చెలియలి కట్టదాటాను. ఆయన దాటుతాడు అంటూ సముద్రం వైపు వెళ్ళిపోతుంది. తాను సంసార ధర్మమనే హద్దును దాటి విచ్చలవిడిగా ప్రవర్తించినందువల్ల చెలియలికట్టను దాటి వచ్చే సముద్రుడాయెను. శిక్షిస్తానని చెప్పటం ఆమెలో కలిగిన పశ్చాత్తాపం.

తాను చేసిన భర్తృద్రోహం, అహంకారయుతమైన ప్రవర్తనకు తగిన శిక్ష అన్న భావాన్ని వ్యక్తం చేస్తోంది. ఈ విధంగా తన తప్పును గుర్తించి పశ్చాత్తాపంతో వెనక్కిరావటం పాత్ర ఔచిత్యాన్ని సంప్రదాయంలోని భద్రతను, గొప్పదనాన్ని గుర్తించిన లక్షణాన్ని తెలుపుతోంది. రచయిత ప్రతిపాదింపదలచుకొన్నది కూడా ఈ విషయమే. కాబట్టి రత్నావళి ఆ విషయం గుర్తించిన వెంటనే మరణించటం జరిగింది.

## 15.5. చెలియలికట్ట నవల - నామౌచిత్యం :

చెలియలికట్ట సముద్రపు హద్దు. సంసారంలో కష్టసుఖాలు కడలిలో కెరటాల్లా వస్తూపోతూ ఉంటాయన్న పోలికతో ఎంత బాధైనా, సుఖమైనా జీవిత పరిమితికిలోనై, లోకపు హద్దుల్లో ఉంటుంది. కనుక సముద్రానికి చెలియలికట్ట ఎలాగో, సంఘ భద్రతకు గృహస్థాశ్రమమన్న హద్దు అలాంటిదేనని, ఆ హద్దు దాటితే జీవితం నాశనానికి గురౌతుందన్న సూచనగా జీవితాన్ని సముద్రంతో పోలిక చెప్పి ఈ నవలకు చెలియలికట్ట అన్న నామకరణం చేశారు రచయిత.

ఇందులో పల్లెటూరి నాగరికతకు చిహ్నంగా ప్రతిష్ఠాపురానికి, ఆధునిక నాగరికతకు చిహ్నంగా చెన్నపట్టణాన్ని తీసుకోవటం జరిగింది. నాగరికత, సంస్కృతి, అమాయకత్వం, హృదయపూర్వకత, ధర్మదృష్టి కలిగిన పల్లీయ వాతావరణం, పట్టణ నాగరికత, విలాస వినోద ప్రభావాలకు లోనై తన వైభవాన్ని మరచి జీవితాన్ని దుఃఖమయం చేసుకున్నదన్న విషయ నిరూపణగా రత్నావళిని ప్రతిష్ఠాపురం నుండి చెన్ననగరానికి తీసుకువెళ్ళడం జరిగింది. తద్వారా ప్రతిష్ఠ నాశనమైందన్న విషయం ఆ గ్రామ నామం ద్వారా సూచింపబడ్డది. ఈ విపరీత ప్రవృత్తికి ప్రధానకారణం వివాహ వ్యవస్థలోని పారమార్థిక దృష్టిలోపించి వైయక్తిక స్వేచ్ఛా ప్రణయం విజృంభించటమేనని కవి అభిప్రాయం.

నవలా ప్రారంభం సముద్రవర్ణనతో చేయబడ్డది. ఈ సముద్రవర్ణన బైరాగిపాట. నవలలో ఒక నిర్దిష్టమైన ప్రయోజనం కలిగినవి. ఏకవీరలో అమృతం వంటిది బైరాగి పాత్ర.

### 3) "కడలిలో కొండయంతటి కరడులేచి నది

సముద్రము హోరునఁ గదలిపెల్ల గిల్లినదీ . . . అనీ
ఇది విచిత్రమే ! ఒడ్డున నిట్టవిరిగి పోవుచున్నది . . .
ఈ సంతసము తోడి కదలి యిది కట్టుబాటుకు కలిగిన కదలికయిది . . .

అన్న వర్ణనలో కథాక్రమంలో రాబోయే అంశాలు సూక్ష్మంగా చెప్పబడ్డాయి. సీతారామయ్య సంసారం రత్నావళితో అప్పటికే రెండేళ్ళు సుఖంగా సాగిన విషయం కడలిలో సంతోషపు కదలిక అన్న మాటలో, మున్ముందు రంగడి ప్రభావంతో జరగబోయే పరిణామాన్ని వివరిస్తున్నదన్నట్టు "కడలిలో కొండయంతటి కరడులేచి" అన్న మాటల్లో ధ్వని పూర్వకంగా సూచింపబడ్డది.

అందుకే (41) "కడలిరాజ ! నీకొక నమస్కారమయ్య
అంబుధీ ! నీకువేయి జోహారులయ్య
పొంగియూరక కోపాన పొంగిరాకు" అని సముద్రుణ్ని చెలియలికట్ట దాటి రావద్దనటం పాత్రగతంగా సాంఘిక హద్దు మీరకూడదన్న సూచనగా కూడా అన్వయిస్తున్నది.

కాని తర్వాత కథలో రంగడు జగద్రహస్య సిద్ధాంతాల్ని గూర్చి ఆలోచిస్తూ రత్నావళికి సీతారామయ్య వల్ల అధర్మం జరిగిందా ! ఆమెకు న్యాయం చేకూర్చాలన్న ప్రయత్నం చేసే ఉద్దేశ్యంతో ఉన్న సందర్భంలో

"మనసు గుఱ్ఱమురోరి మనిసీ !
మనసు కళ్ళెములాగు మనిసే !
కళ్ళెమును వదిలితే కంచెలోబడ ద్రోయు
కళ్ళు తేలేస్తావు జనుడా ! ఆ పైని
కార్యమే మున్నదిరా జనుడా !

అన్న బైరాగిపాట జరగబోయే విపరీత కార్యదృష్ట్యా, మనసును అధీనంలో ఉంచుకోమన్న సూచనగా చెప్పబడ్డవి. నవలలో బైరాగిపాట రంగడు వివరీతంగా ఊహించే అన్ని సమయాల్లోను కన్పిస్తుంది. ఈ బైరాగి రంగడిలో ఏమూలనో ఉన్న ధర్మగుణానికి సంకేతం. పాశ్చాత్య విద్యాప్రభావం వల్ల బాహ్యమైన ఊహలు, ఆలోచనలు, పరిణామాన్నూహించని ఆవేశంతో కూడిన ప్రయత్నాలు చేసే రంగడి ఆంతర్యం వైదిక ధర్మాన్ని ఛాయాచిత్రంగా కలిగి ఉన్నట్లు నవలలోని కొన్ని సంఘటనల్లో తెలుపబడ్డది (171) "రత్నా ! నన్ను చంపకుము. నేను నీయందు తప్పు చేసితిని" అన్న మాటల్లో (173) "ఇప్పటి రంగారావు వేరు. వీడు చదువు మానినవాడు అన్నగారి సంసారమును పాడుచేసినవాడు. తాను ప్రేమింపని స్త్రీని వయోవశుడై తాను నమ్మిన సిద్ధాంతమును వదిలి స్వీకరించినవాడు. ఈ రంగడు దుఃఖమెఱిగినవాడు. కష్టములు పడినవాడు" అన్నమాటల్లోను రంగడు మానసిక పరివర్తన పొందిన సూచన ఉంది. సముద్ర తీరంలో బైరాగినిమరి కొంతసేపు పాడమని కోరటం రంగడి స్వభావ విరుద్ధమైన విషయం. కాని అతనికి తెలియకుండానే అతనిలోని ధర్మభావమాపాటల కాకర్షింపబడటం అతనిలో మున్ముందు కలుగబోయే పరివర్తనకు సూచన.

నవలలో రంగడి మనసులో బయలుదేరినప్పుడల్లా బైరాగిపాట చెప్పబడ్డదన్న ప్రకారం మొదటి అధ్యాయంలో రత్నావళికి ఆధునిక సంఘరీతుల్ని బోధించేముందు కడలితీరంలో ఒకసారి ఐదవ అధ్యాయంలో సరస్వతి రత్నావళి రంగారావుల విపరీత ప్రవర్తనను ఖండించినప్పుడు, పదకొండవ అధ్యాయంలో తాను ప్రేమ అనుకొన్నది కేవలం కామభావం తప్ప మరేమీకాదని రంగడాలోచించే సమయంలో, పన్నెండవ అధ్యాయంలో వేదాంత విషయాలబద్ధాలని రత్నావళితో వాదించిన సమయంలో నవలాంతంలో వాళ్ళిద్దరూ సముద్రాభిముఖులై వెళ్లే సమయంలో మొత్తం ఏడుసార్లు బైరాగిపాత్ర కన్పిస్తుంది. బైరాగి రంగడి ఆత్మ ప్రబోధశక్తి అనడానికి నవలలో దాఖలాలున్నాయి. చెన్నపట్నం వచ్చిన రంగడింటి ముందు బైరాగిపాట విన్పించటం "బైరాగి నీవీ వూరెప్పుడూ వచ్చావు" అన్న మాటకు (190) మాకొక ఊరేమిటి, ఎక్కడికి పడితే అక్కడికి పోతాము. మేమనేక చోట్ల తిరుగుతాం. బాబు ! నువ్వు చాల మాఱిపోయావు" అన్న బైరాగి మాటలు, ప్రతిష్ఠాపురం నుండి సరిగ్గా చెన్నపట్నంలో రంగడింటికే ఆ బైరాగి రావటం, అతని మాటల్లో రంగడిలో మార్పు కన్పిస్తుందనటాన్నిబట్టి రంగడిలో ఆంతరంగిక పరిణామమే బైరాగి మాటల్లో వ్యక్తమైందని చెప్పవచ్చు. నవలాంతంలోని పాటలు (324) "అది ఎట్టిదో . . . కడలి తరగలలోన కలిసిపోవుటయున్న రెట్టిదో ? అది యెట్టిదో" అన్న మాటలు వా ళ్ళిద్దరూ సముద్రంలో కలిసిపోతారన్న విషయం సూచకం. ఇది బైరాగికెలా తెలుసు ? అసలా సందర్భంలో తన ప్రాణాల్ని కాపాడుకోకుండ బైరాగి అక్కడుండుట యెందుకు ? దీన్నిబట్టి బైరాగి ధర్మభావ ప్రతీకగా చిత్రించబడ్డాడని, రత్నావళి రంగారావులా ధర్మాన్నతిక్రమించి నడిచారు కాబట్టి వాళ్ళ మరణాంతం వరకు ఆ రూపం వెన్నంటే వచ్చినట్టుగా వారిలోని మానసిక ధర్మభావన నవలలో బైరాగి రూపంగా చిత్రించబడిందని చెప్పవచ్చు. నవలా ప్రారంభంలో బైరాగి కలవరం చెందిన సముద్రాన్ని గూర్చి పాట పాడటం, సీతారామయ్య గృహజీవితంలో ప్రాప్తించిన కష్టాలనే కలవరాన్ని చెప్పే సూచన. కుటుంబం కోసం తన సర్వస్వాన్ని ధారపోసిన సీతారామయ్యకు రంగడివల్ల కలిగిన అన్యాయం సహించరానిదైన సందర్భంలో (67) "నేను చేసిన ప్రయత్న మంతయు నిట్లు విపరీత ఫలమిచ్చునది. ఈ చదువులో తల్లియు తోడునని లేదు కాబోలు' ఎందరింగ్లీషు చదివి మంచి మార్గమున లేరు ? ఈ సిద్ధాంతములేమిటి ? వదినగారు తల్లివంటిది

గదా ? ఛీ ఛీ! సముద్రములో నొక పెద్ద కెరటము లేచి గుట్టపై దభేలున మోదినది. అదివరకొక్క స్వరముగా వినవచ్చుచున్న సముద్రపు మ్రోతలో ఛీఛీ యనినట్లు పెద్ద మ్రోత వినవచ్చెను" అన్నమాటల్లో సీతారామయ్య మనసులోని విచారం, సంసార సంబంధమైన బాధ, ఆవేశం, సముద్ర కెరటాలెగిరిపడటంలో ప్రతిఫలింపచేయబడింది. అంటే ధర్మం జరుగుతుండగా సహించనితనం, వ్యక్తిగా ఏమీ చేయలేకపోగా, ప్రకృతి విజృంభించి, దాన్నణచుతుందన్న సూచనపై వర్ణనలో సూచింపబడుతున్నది.

రత్నావళి సంసారపు హద్దుదాటినా జ్ఞానోదయమైయ్యాక కుటుంబ జీవితానికి దూరమై తాను పోగొట్టుకున్న సౌభాగ్యాన్ని, తెలుసుకోవటం, ప్రాయశ్చిత్తం చేసుకోవాలనుకొని ఎక్కడి నుండి తన జీవితంలో మార్పు సంభవించిందో అక్కడికే వెళ్ళి జీవితాన్నంతం చేసుకోవటం ఆమెలో కలిగిన మానసిక పరివర్తనను, నిశ్చయ భావాన్ని సూచిస్తున్నా, ప్రకృతి ధర్మాన్ని సహించదన్న సూచన నవలాంతంలో సముద్రం తాడి ఎత్తున కెరటాలతో విజృంభించి వాళ్ళిద్దర్ని శిక్షించటం అధర్మాన్ని శిక్షించటంగా చిత్రించారు కవి. సముద్రానికి చెలియలికట్టలాగ మనసుకు లోకపు హద్దును, కట్టుబాటు విషయంగా రచయిత ప్రతిపాదించట మీ దృష్టితో చేసినట్టిదే. లోకపుహద్దు లేక వ్యవస్థను వాంఛ ప్రవృత్తి అధిగమించినప్పుడు ప్రళయం సంభవిస్తుందన్న సూచన సముద్ర ఉప్పెన. ఈ విషయమే ఒకసారి ప్రతిష్ఠాపురంలో రత్నావళి **(69)** "సముద్రునకు కూడా వయసులో నున్న భార్యలుండిరో ! నిజంగా నతనికి భార్యలుండి వారతనిని నిరాకరించినచో, నంతటి సముద్రుడూరకుండునా ? వారిని ముంచి వేయడో ! జల ప్రళయం చేయడో ! తన యుప్పునీళ్ళలో వారిని ముంచెత్తి వారి శరీరములు జగజ్జనుల కనుపభోగ్యము చేయడో ? ఎవరి మాటలు విని వాని భార్యలు వానిని నిరాదరింతురో వారి నోళ్ళయందుప్పు కొట్టడో ? రత్నావళి మనస్సంతయూ సీతారామయ్య పక్షము నుండి వాదింపనారంభించెను ? అని అనుకున్నట్లు చెప్పబడింది. సీతారామయ్యలోని ధర్మభావం ఆవలి ఉప్పెన రూపంగా అతన్ని నిరాదరించిన కారణంగా తనను,రంగణ్ణి శిక్షిస్తుందని రత్నావళి భావిస్తుంది. ఈ ధర్మభావమే మరొక రకంగా వారి అంతరచైతన్య ప్రబోధంగా బైరాగి రూపంలో

"ఓపాడు మనసా
నీవుబలాట పడియేవు
పాపపుణ్యము పాలించబోయేవు
పాంగిపోకే పగలబడిపోకే" అనీ

ఎన్నాళ్ళీ సుఖమూ ! జనుడా ! ఎన్నాళ్ళీ సుఖమూ క్షయవ్యాధి పుట్టవచ్చు. జ్వరకఫములు కలుగవచ్చు. కాలుసేయుపడవచ్చును, కనులు గ్రుడ్డికావచ్చును" అనీ చెప్పబడటం భవిష్యత్తులో రాబోయే రంగడి పక్షపాతం జబ్బును, పాపపుణ్యాలెంచని ఫలితంగా శిక్షార్హులౌతారన్న విషయాన్ని తెలియజేయటమే. ఈవిధంగా నవలంతా బైరాగి, రత్నావళి, రంగణ్ణి, వెంటాడుతూనే ఉన్నట్టు చెప్పబడటం. వారిద్దరూ వ్యవస్థాధర్మాన్ని మరచి హద్దు మీరారన్న విషయాన్ని ప్రతిసంఘటనలోను గుర్తుచేయటం కోసమే.

ఈ సూచనే వ్యవస్థాపరంగా 'చెలియలికట్ట' అన్న నామంలో ప్రతిఫలించింది. తదనుగుణంగా ప్రారంభాంతంల్లో సముద్రవర్ణన చేయబడింది. చెలియలికట్టను దాటిన సముద్రం సాంఘిక కట్టుబాటు నతిక్రమించిన రత్నావళిని ముంచి వేసింది. ఆ కట్టుబాటే గృహస్థాశ్రమం.

## 15.6. నమూనా ప్రశ్నలు :

1. తెలుగు సాహిత్యంలో నవలా రచయితగా విశ్వనాథ ప్రత్యేకతను వివరించండి.
2. విశ్వనాథ నవలా రచనా ప్రత్యేకతను పరిచయం చెయ్యండి.

3. చెలియలికట్ట నవలలో విశ్వనాథ దృక్పథాన్ని వివరించండి.
4. చెలియలికట్ట నవలలో రంగడు పాత్ర ప్రాధాన్యాన్ని వివరించండి.
5. చెలియలికట్ట నవలలో రత్నావళి పాత్రను పరిచయం చెయ్యండి.
6. రత్నావళి పాత్ర ద్వారా విశ్వనాథ చెలియలికట్ట నవలలో ఇచ్చిన సందేశాన్ని సమీక్షించండి.
7. రంగడు, రత్నావళి పాత్రల ప్రాధాన్యాన్ని వివరించండి.
8. విశ్వనాథ నవలలో చెలియలికట్ట నవలకున్న ప్రత్యేకతను విశ్లేషించండి.
9. పాశ్చాత్య భావాలతో సంఘర్షించడమే చెలియలికట్ట నవల ద్వారా విశ్వనాథ ఆశించిన ప్రయోజనం - నవల ఆధారంగా చర్చించండి.
10. చెలియలికట్ట నవల నామౌచిత్యాన్ని పరిచయం చెయ్యండి.

## 15.7. సంప్రదించవలసిన రచనలు :


1. విశ్వనాథ నవలలు - స్త్రీ మనోవై చిత్ర డా॥ పి. శరపతి, 1988
2. Women Characters in the Novels of Vishwanadha - Dr. P. Kusuma Kumaris
3. చెలియలికట్ట నవల - విశ్వనాథ సత్యనారాయణ
4. తెలుగు నవలల్లో సామాజిక చైతన్యం - డా॥ పి. సంజీవమ్మ, 1985.
5. బ్రాహ్మమయమూర్తి విశ్వనాథ సాహితీ దర్శనం - విద్వాన్ తోపికొండ వేంకట కృష్ణయ్య, ముదివేతు ప్రభాకరరావు.
6. తెలుగు నవలల్లో కుటుంబ జీవన చిత్రనొము - ఆనందలక్ష్మి, 1979
7. విశ్వనాథ అసంకలిత సాహిత్యం - 3 వార్తాంశాలు. విశ్వనాథ శతజయంతి ప్రచురణ 1995. సంపాదకులు : ఆచార్య కోవెల సుప్రసన్నాచార్య - ప్రచురణ - విశ్వనాథభారతి, వరంగల్లు.


**- ఆచార్య పి. కుసుమ కుమారి**

**పాఠం - 16**

# విశ్వనాధ సత్యనారాయణ - వేయిపడగల నవల

**ఉద్దేశ్యం :**

వేయిపడగలు నవలలో విశ్వనాథ వైఖరిని పరిచయం చెయ్యడం. వేయిపడగలు నవలలో విశ్వనాథ ప్రతిపాదించిన వివిధాంశాలను విశ్లేషించడం.

**ప్రణాళిక :**


**16.0.** బహుముఖ ప్రజ్ఞాశాలి విశ్వనాథ

**16.1.** వేయిపడగలు - విశ్వనాథ దృష్టి

**16.2.** వేయిపడగలు - పునరుద్ధరణ దృష్టి

**16.3.** వేయిపడగలు - సంప్రదాయ దృష్టి

**16.4.** వేయిపడగలు - సనాతనదృష్టి

**16.5.** వేయిపడగలు - స్త్రీ విషయిక దృష్టి

**16.6.** వేయిపడగలు - నామౌచిత్యము

**16.7.** ఆకళింపు ప్రశ్నలు

**16.8.** సంప్రదించవలసిన ప్రశ్నలు


**గమనిక :**

నవలా రచయితగా విశ్వనాథ అన్న అంశాన్ని చెలియకట్ట పాఠం నుండి విద్యార్థులు చదువుకోవాలి. పునరుక్తి కారణంగా ఈ పాఠంలో మళ్ళీ ఆ అంశాన్ని ప్రస్తావించలేదు.

## 16.0. బహుముఖ ప్రజ్ఞాశాలి విశ్వనాథ :

విశ్వనాథ సత్యనారాయణ గారు బ్రాహ్మీమయమూర్తి. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం అన్న మూడు కావ్యహేతువులు ఒకచోట మూర్తీభవించిన సాహిత్య స్వరూపం ఆయనిది. శ్రీ సత్యనారాయణ గారి జన్మస్థలం కృష్ణాజిల్లాలో గుడివాడకు సమీపంలోని నందమూరు. కళాప్రపూర్ణ, కవిసామ్రాట్, పద్మభూషణ బిరుదాంకితులు విశ్వనాథ సత్యనారాయణగారు. వారు రచించిన శ్రీమద్రామాయణం కల్పవృక్షానికి అత్యంత ప్రతిష్ఠాకరమైన కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతిని అందుకున్నారు. విశ్వనాథ వారు చేపట్టని సాహిత్య ప్రక్రియ లేదు. మహాకావ్యాలు, ప్రబంధాలు, ఖండకావ్యాలు, గేయకావ్యాలు, నాటకాలు, నవలలు, కథానికలు, విమర్శలు, ఉపన్యాసాలు మొదలైన ప్రక్రియలన్నింటినీ చేపట్టి ఆంధ్ర సాహిత్యంలో తనదైన ఒక ప్రత్యేక స్థానాన్ని సుస్థిరంగా ఏర్పరచుకొన్న ప్రతిభాశాలి విశ్వనాధవారు. దేశము నలుమూలలా అనేక సాహిత్యోపన్యాసములతో గొప్ప విమర్శకుడిగా పేరొందినవారు విశ్వనాథ.

విశ్వనాథ గ్రంథములు రచించిన పద్ధతి ప్రత్యేకంగా ప్రస్తావించదగ్గది. "వారే పుస్తకము" వ్రాయిటకైనను వారము పదిరోజుల కంటే నెక్కువ పట్టదు. ఆలోచన, పథకము,రచన అన్నియు నొక్కమారే జరుగును. సోదరులు వేంకటేశ్వరులు

గారు వ్రాయిచుండ వారొకటేపనిగా చెప్పుచు వేయిపడగలను నెలనాళ్ళలో ముగించిరి. నవలలన్నియు వారు చెప్పుచుండగా నితరులు వ్రాసినవే. దినమునకు రెండు మూడు గంటల చొప్పున చెప్పుచూ వారే నవలనైనను పదిరోజులలో పూర్తిచేయుదురు. పద్యములను వారు సాధారణముగా దారివెంట నడుచుచున్నప్పుడును, రైలులో పయనించునప్పుడును కూర్చుని యింటికి వచ్చిన పిమ్మట గ్రంథస్థములు కావింతురు. వారు తఱచుగా 'నేను చాలా సోమరి' నని చెప్పుచుందురు. ఆ సోమరితనముతోనే వారు సుమారు నూఱుగ్రంథములను ఆంధ్ర సంస్కృతములందు వ్రాయగలిగిరి" అని దివాకర్ల విశ్వనాథ రచనలు చేసేవాదనని తమ ఉపన్యాసంలో ప్రస్తావించారు (ప్రతిభాలహరి - పుట 84)

## 16.1. వేయిపడగలు - విశ్వనాథ దృష్టి :

వివాహం జన్మజన్మల అనుబంధం. అది ఆత్మానుబంధం అన్న దృష్టితో వివాహవ్యవస్థను ప్రాచీనుల పారలౌకిక దృక్పథంతో పరిశీలించిన వారు విశ్వనాథ. వేయిపడగల కథారంగం "ధర్మమోక్షముల మధ్య నూగులాడుతున్న యర్థకామములనుయ్యేల" (1) చాలా వరకు ఈ నవలలోని పాత్రలన్నీ ప్రతీకాత్మకంగానే నడుస్తాయి. విశ్వనాథ ఈ నవలలో వివాహ వ్యవస్థను వివిధ కోణాలలో ప్రదర్శించారు.

రామేశ్వర శాస్త్రి నాలుగు వర్ణాల వారితో చేసుకున్న వివాహాలూ
అరుంధతీ ధర్మారావుల ధార్మిక దాంపత్యం
శశిరేఖా కిరీటుల ప్రణయ వివాహం
శ్యామలాకుమార స్వాముల వర్ణాంతర వివాహం.

రామేశ్వర శాస్త్రి పాత్ర కునవలలో ఒక ప్రత్యేకత ఉంది. "వర్ణాశ్రమ ధర్మములన్నియు ముద్దకట్టిన మూర్తిగ భారతదేశము యొక్క యాత్మగత్రయీ విద్యకొక వ్యాఖ్యానముగ (2) రామేశ్వరశాస్త్రిని విశ్వనాథ 'వేయిపడగలు' నవలలో సృష్టించారు.

బ్రాహ్మణులు నాలుగువర్ణాల వాళ్ళనూ వివాహం చేసుకోవచ్చన్న, వేదాంతాంతర్గతమైన ధర్మాన్ని పునరుద్ధరించడానికే విశ్వనాథ రామేశ్వరశాస్త్రికి నాలుగు వర్ణాల వారితో వివాహం జరిపించారు. ఇక వ్యవస్థా ధర్మానికి ప్రతీకగా సృష్టిలోబడ్డ ధర్మారావు మాత్రం అన్ని వర్ణాల వారినీ వివాహం చేసుకోలేదు.

విశ్వనాథ దృష్టిలో మనసు వేరు, బుద్ధి వేరు. మనసుకు చాంచల్యం సహజలక్షణం. దానిని బుద్ధిబలంతో నియమించుకోవాలి అనేది నాగరికత అన్నది విశ్వనాథ అభిప్రాయం. అందువల్లనే విశ్వనాథపాత్రలు ఆత్మౌన్నత్యంతో వ్యవస్థను ధిక్కరించలేక తమను తాము సంఘానికి బలిచేసుకోవడం ఆయన నవలల్లో కనిపిస్తుంది. అయినప్పటికీ రచనా శిల్పంతో తనదైన ముద్రను ప్రదర్శిస్తూ సంప్రదాయానికి పట్టుకొమ్మగా నిలవడంవల్ల విశ్వనాథ రచనలు జనామోదాన్ని కూడా పొందగలిగాయి.

విశ్వనాథ ఏకవీర వంటి నవల్లో నియమనిబంధనలకతీతమైన నిర్మల ప్రణయాన్ని కాదనలేదు. అయితే మహోత్కృష్టమైన ప్రణయ భావంతో కాకుండా కేవలం చాంచల్యంతో, ఏవో సిద్ధాంతాలను అనుసరిస్తున్నామనే భ్రమతో సంప్రదాయాన్ని తిరస్కరిస్తే సామాన్యులు అందుకోగలిగేది అధోగతి అన్న సత్యాన్ని మంగమ్మ, రత్నావళి వంటి స్త్రీ పాత్రల ద్వారా నిరూపించారు.

విశ్వనాథ దృష్టిలో వ్యవస్థాబద్ధమైన పాతివ్రత్యం వాంఛనీయం. అయితే అది కేవలం విధిలేక కట్టుబడి ఉండే పాతివ్రత్యం కాదు. అది ప్రణయభావ ప్రేరితం. ఇందుకు నిదర్శనం 'వేయిపడగలు' నవలలో కథానాయకుడైన ధర్మారావు తల్లికివ్వని ప్రాధాన్యాన్ని రామేశ్వర శాస్త్రిని స్వయంగా వరించివచ్చిన క్షత్రియకాంత రంగాజమ్మ గారి కివ్వటమే.

విశ్వనాథ తన నవల 'చెలియలికట్ట' లో వివాహాన్ని స్పష్టంగా నిర్వచించారు. విశేషముగా వహించునది అని యర్థము. పరలోకమునందు చనిపోయిన తర్వాత మనము కాబోవు మార్పులకు సానుకూలపడుటకు నీ జన్మలో కొన్ని కార్యములు చేయవలసియుండును. అట్టి కార్యములు స్త్రీ పురుషులు కలిసి దంపతులుగా నేర్పడి ఇచ్చట చేయుదురు. అప్పుడది వివాహమగును''. (3) ఈ రకంగా విశ్వనాథ వివాహం ఐహికాముష్మికాలు రెంటికీ సాధనం కావలంటారు. అన్ని ధర్మాలూ నశించినా, దాంపత్యధర్మం మాత్రం సుస్థిరంగా నిలుస్తుందంటారు. ఆయన ఏకపత్నీ వ్రతాన్నీ, పాతివ్రత్యాన్నీ ఈ వ్యవస్థకు పట్టుకొమ్మలుగా పేర్కొన్నారు.

విశ్వనాథ అరుంధతీ ధర్మారావులను ప్రకృతి పురుషులకు ప్రతీకలుగా సృష్టించి నవలలో పోషించారు. వేయిపడగలు నవలలో అరుంధతీ ధర్మారావుల ప్రణయం ధర్మబద్ధమైనది. మానవ సంబంధాలలో మధురమైనది. స్త్రీ పురుష సంబంధం ప్రణయం. ఆ సంబంధాన్ని పాశవిక స్థాయి నుండి తప్పిస్తుంది. దర్మం దానికి దివ్యత్వాన్ని ఆపాదిస్తుంది. "ప్రతి నిమిషము వారి ఆత్మలో దేవతలు తాండవించిరి. వేదఋషులు వారి క్రీడలలో అర్థవంతములయ్యెను. కులదేవతలు వారి లీలాపాంగముల యందు భావ్యాశలు త్రవ్వుకొనిరి. పితృదేవతలకు వారి శృంగారముల యందు దర్పణములందినవి. (4) 'అరుంధతీ ధర్మారావుల ప్రణయంలో ఇలాంటి ధర్మబద్ధమైన ప్రణయాన్ని వేయిపడగలు నవలలో విశ్వనాథ నిరూపించారు. విశ్వనాథ తన నవలలో ప్రాచీన సాంప్రదాయ వ్యవస్థను సమర్థించారు.

విశ్వనాథ దృష్టిలో ప్రణయారాధనకు, భగవంతునికి బేధం లేదు. అరుంధతీ నవలలో "సతికి పతి దైవము. వేణుగోపాల స్వామికిని, నా భర్తకును బేధములేదు' అనడంలో స్పష్టమవుతుంది. సార్వజనీనమైన సహజభావాలను కూడ విశ్వనాధ సంప్రదాయంతో ముడివేశారు. అరుంధతీ మరిణించినాక ధర్మారావు రెండవ వివాహానికి అంగీకరించలేదు. ఆమె మరణంతో తనకు "ఇహ లోకము మహాంధ్యమై పోయిందని'' ధర్మారావు పరితపించాడు. అటువంటి ధర్మారావు చిన్న అరుంధతిని పెళ్ళిచేసుకున్నాడు. అంత పెద్దవాడు ఇంత చిన్నపిల్లను పెళ్ళి చేసుకోవడం ? అన్న ప్రశ్నకు విశ్వనాథ పెద్ద అరుంధతి ఆత్మ చిన్న అరుంధతిలో ఒదిగిపోయిందంటారు. ఇందులోని సాధ్యాసాధ్యాలను ప్రక్కన పెట్టిచూస్తే విశ్వనాథ అరుంధతీ ధర్మారావుల అప్రతిహతమైన దాంపత్యధర్మాన్ని సూచించడమే దీని ఉద్దేశ్యం. విశ్వనాధ అరుంధతీ ధర్మారావులను దాంపత్య ధర్మానికి ప్రతీకలుగా సృష్టించారు. ఆ దంపతులకు ఎడబాటన్నది లేదని చెప్పటానికి చిన్న అరుంధతిని సృష్టించారు.

విశ్వనాథ వివాహవ్యవస్థను ప్రదర్శించిన మరొకతీరు శశిరేఖా కిరీటుల ప్రగాఢ ప్రణయ వివాహం. వాళ్ళిద్దరూ బావామరదళ్ళే అయినా పెద్దలు ఒప్పుకోకపోవడంవల్ల వివాహానికి ఆటంకం కలిగింది. విశ్వనాథ 'వేయిపడగలు' నవలలో శశిరేఖను ప్రణయ తపస్విని' గా చిత్రించారు. ఆ మధుర ప్రణయంలోని దివ్యత్వాన్ని వ్యాఖ్యానిస్తూ విశ్వనాథ "తన రక్తము కల్మషరహితమై ధర్మగుణ భూయిష్టమైనచో, శీలమునందంత గాఢత్వముండును . . . పంచీకరణము వలననైన భూతసృష్టికి వారలంకార భూతులు. వర్ణసంకరములేని రక్తము, స్వభావమయినది, వారి నాడులలో ప్రవహించుచుండును. ఏ వర్ణము వారైననేమి ? తదృశ మహాప్రకృతులకు నమస్కారము' అని ఏవర్ణమయినా వర్ణ సంకరములేని వారి యోగ్యులుంటారు విశ్వనాథ. ప్రణయ చిత్రణలో కూడ విశ్వనాథ వర్ణాశ్రమ ధర్మాలు మరిచిపోలేదు.

వేయిపడగలు నవలలో వర్ణాంతర వివాహాల ప్రస్తావన ఉంది. రామేశ్వరశాస్త్రి నాలు వర్ణాల వారినీ వివాహం చేసుకున్నాడు. అయినా 'మడి'గా తన వంట తానే వండుకున్నాడు. రంగాజమ్మ తనంతతానుగా రామేశ్వర శాస్త్రి గారిని ప్రేమించి తల్లిదండ్రుల అభీష్టానికి వ్యతిరేకంగా ఆయనతో వచ్చేసింది. ఆ కారణంచేతనే జీవితంలో కూడా ఆయన హృదయానికి సన్నిహితురాలు కాగలిగింది. ఆమె భర్త మరణించిన తర్వాత కూడ భర్తతో కలిసి తాను జీవించిన ప్రదేశాన్ని వదలలేకపోయింది. మరణశయ్య మీద సహితం, ఏ చీరలో తాను శాస్త్రిగారి కంటికి అందంగా కనిపించేదో, దేనిని ఆనాటివరకూ అపురూపంగా దాచుకునేదో ఆ

చీరనే కట్టుకునింది. సువాసన ద్రవ్యాలతో అలంకరించుకొని నిత్యవధువులా భర్తను చేరుకుంది. మరణ సమయంలో ఆమెకు భర్త యజ్ఞోపవీతంతో 'ధనుష్పాణియై' మనసులో సాక్షాత్కరించారు. విశ్వనాథ రంగాజమ్మ పాత్రకింత ప్రాధాన్యమిచ్చినా బ్రాహ్మణ ధర్మపత్ని కలిగిన దర్మారావుకే పితృకర్మలు చేసే అధికారము అప్పగించారు. వర్ణసాంకర్యం కూడదంటూనే సావిత్రమ్మ కివ్వని ప్రాధాన్యం విశ్వనాథ రంగాజమ్మకిచ్చారు. రంగాజమ్మ మరణించింది. ఆమె కుమారుడు రామచంద్రరాజు దుఃఖిస్తూ ఉంటే ధర్మారావు ఓదార్చాడు. ఆ సందర్భంలో రామచంద్రరాజు అన్నదమ్ములైన తాము భిన్నవర్ణాలకు చెందినవారమైనా తమ వర్ణం చెడిపోలేదంటారు. వేయిపడగలు నవలలో రామేశ్వరశాస్త్రి నాలుగువర్ణాల వారిని వివాహమాడినా ఎవరూ వర్ణభ్రష్టులు కాలేదు. మంగకు పాముపిల్ల వంటి పసిరిక పుట్టాడు. కాపు పడుచులు కులం చెడినందుకు జరిగిన పరాభవం అనుకుంటే రామేశ్వర శాస్త్రి మాత్రం అది సుబ్రహ్మణ్యస్వామి ఆశీర్వాదంగా వ్యాఖ్యానించారు.

వివాహ వ్యవస్థలోని మరొకకోణం శ్యామలాకుమారస్వామిల వర్ణాంతర వివాహం ద్వారా 'వేయిపడగలు' నవలలో విశ్వనాథ ప్రస్తావించారు. కుమారస్వామి బ్రాహ్మణుడే కాని బీదవాడు. అతనికి ఎవరు పిల్లనివ్వలేదు. అందువల్ల శ్యామలను పెళ్ళి చేసుకున్నాడు. శ్యామల ధనికురాలు కాకపోయినా బీదరాలు కాదు. అది ఒకవాంఛగా సర్దుబాటు వివాహం. ఇది విశ్వనాథ దృష్టిలో ధర్మబాహ్యం. కుమారస్వామి ఇంటికి ధర్మారావు వెళితే 'పోరాని కొంపలకు పోవడంవల్ల పిల్లవాడు పోరుపెట్టాడని అరుంధతి అంటుంది. ధర్మారావు వెంటనే పశ్చాత్తపుడయ్యాడు. ఆలయానికి వెళ్ళి తాను కాలానుగుణంగా కొంత అనిష్టమైనది చేసినా బుద్ధిపూర్వకంగా చేయలేదని చెంపలేసుకున్నారు.

విశ్వనాథ రామేశ్వరశాస్త్రి వివాహాలు ధర్మబద్ధమనడానికీ, కుమారస్వామి వివాహం ధర్మబాహ్యమనడానికీ కారణముంది. రామేశ్వరశాస్త్రి వివాహాలు వర్ణాంతమైనా అందులో ఛాందసధోరణి ఉంది. రామేశ్వరశాస్త్రి 'మడి' కట్టుకొని వేరుగా వండుకోవడం, సాయమ్మ మనుమణ్ణి ముద్దాడి, ఇంటికిపోయి స్నానం చేయటం మొదలైనవి. కుమారస్వామి వివాహం పూర్తిగా ఆధునిక ధోరణిలో జరిగింది. విశ్వనాథకు ఆధునికం అంటేనే విరక్తి. ఆయనకు సంఘంలో వర్ణభేదాలు సమసిపోవడం సమ్మతం కాదు.

సరోజినీ, రంగారావుల దాంపత్యంలో వివాహ వ్యవస్థలోని మరొక కోణాన్ని రచయిత ప్రదర్శించారు. రంగారావు ఆధునిక భావాలు జీర్ణించుకున్న వ్యక్తి. సరోజినీదేవి ప్రణయారాధన రంగారావుకు చాంధస ప్రవృత్తిగా తోచింది. ఆమె ఆరాధనను తిరస్కరించాడు. సరోజినీదేవి భర్తను ప్రాణప్రదంగా ప్రేమించినా భర్త పాదాలచోటు కోసం ప్రాధేయపడని అభిమానవతి. భర్త ప్రేమను పొందలేని సరోజిని భగవంతుడే తన సర్వస్వమని భావించింది. ప్రాణావసాన సమయంలో సరోజినీదేవి ముఖంలో ప్రతిఫలించిన దివ్యసౌందర్యాన్ని చూసి రంగారావు ముగ్దుడయ్యాడు. ఆ సౌందర్యం ఆమె మనసులో ఉన్న నిర్మల ప్రణయమే. ఆ దంపతులిద్దరూ తమ మార్గాలు కలుసుకోవని విడిపోతారు. సరోజినీదేవి భగవంతుణ్నే ధ్యానిస్తూ ప్రాణాలు వదులుతుంది.

రంగారావుకు సరోజినీదేవి తననే దైవంగా ఆరాధించటం రంగారావుకు ఇష్టంలేదు. దాంపత్యం స్వతంత్రభావ రహితమై ఉండకూడదన్నది రంగారావు అభిప్రాయం. విశ్వనాథ రంగారావు భావాలను హేళనచేస్తూ, రంగారావు నాదర్శములన్నియు సుపానీయందు ఫలించెను అంటారు (32) విశ్వనాథ. ఆమె పాశ్చాత్య యువతి. ఆమె పాత్రను విశ్వనాథ ఉదాత్తంగా చిత్రించారు. స్త్రీ పురుష సమానత్వము, దాంపత్య జీవితంలోని ప్రేమానురాగాల ప్రస్తావన రంగారావు, సుపానీల సంబంధంలో విశ్వనాథ ప్రస్తావనకు తెస్తారు.

## 16.2. వేయిపడగలు - పునరుద్ధరణ దృష్టి :

విశ్వనాథ పునరుద్ధరణవాది. ఫ్యూడల్ సమాజ సంస్కృతికి, ఆనాటి పరిస్థితులు ఈనాడు పునరుద్ధరింపబడటం అవసరం అన్నది ఆయన వాదం. ఆనాటి వర్ణవ్యవస్థ మతాల సంప్రదాయాలు ఆచారాలు ఇవే విశిష్టమైనవి అన్నది ఆయన గాఢ

విశ్వాసం. అందువల్ల ఆయన సాహిత్యం సర్వసాధారణంగా ఆధునిక సంస్కృతిని పాశ్చాత్య సంస్కృతి అంటూ నిరసించటంతోటి ఫ్యూడల్ సంస్కృతిని మహోన్నతంగా దర్శింపచేయటం తోటి నిండి వుంటుంది. ఇందులో గతాన్ని ఆదర్శించటం ప్రధానమైంది. అది కాల్పనిక ధోరణి. ఫ్యూడల్ వ్యవస్థ సంస్కృతిని వాస్తవికతా దృక్పథంతో విమర్శించివుంటే రచయితకు అందులోని లోపాలు దోషాలు వ్యక్తం అయివుండేవి. ఆధునిక విజ్ఞానం నాగరికత ఈనాటి వ్యవస్థలన్నీ పాశ్చాత్యం. మన సమాజానికి పనికిరావు. పాతవ్యవస్థ పునరుద్ధరింపబడితేనే మన సమాజానికి, ముక్తి సాధ్యం అన్నది ఆయన వాదం యొక్క తత్వం. పారిశ్రామిక నాగరికతకు ఆయన పూర్తిగా వ్యతిరేకి. ఆధునిక విజ్ఞానం మనకు చేటునే కొని తెచ్చిందన్నది ఆయన అభిప్రాయం. పరిశ్రమలు, ప్రాజెక్టులు, రైలుమార్గాలు, విద్యుత్తు, ఆధునిక వైద్యవిధానం మొదలైనవన్నీ ఆయన ఎగతాళికి గురిఅయ్యాయి. నవలలో, ఆధునిక వైద్యవిజ్ఞానం విద్యావిధానం నాగరికతలు అన్నీ విజాతీయం అంటూ వాటిని నిరసించటంలో ఆయనకు వాటిలోని గుణాలు మేళ్ళు ఏవీ కనిపించలేదు. జమిందారీ సంస్కృతి పట్ల వున్న మమకారం వల్ల ఆ సంస్కృతిలో కాలదోషానికి గురియైన విషయాలు కూడ ఏవీ కనిపించలేదు.

దాదాపు ప్రపంచమంతటా గొప్ప ఆర్థిక సాంఘిక విప్లవం తెచ్చిన ఆధునిక యంత్రవిజ్ఞానాన్ని ఏ దేశము తిరస్కరించదు. మొదట పాశ్చాత్య దేశాల్లో ప్రారంభమైన పారిశ్రామిక విప్లవం మెల్లగ చాలా దేశాలకు వ్యాపించింది. దాంతో నూతన సామాజిక వ్యవస్థ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ ఒకటి ఆయాదేశాల్లో ఏర్పడింది. మానవజాతి ముందడుగు వేయడానికి ఎన్నో విధాల కారణమైన ఆధునిక విజ్ఞానం ఎన్నో సుఖాల్ని, సౌకర్యాల్ని ప్రసాదించినట్టి విజ్ఞానం ఒకవైపు ఉండగా, మరోవైపు పెట్టుబడిదారీ ఆర్థిక విధానం మానవజాతికి నూతన సమస్యల్ని కొనితెచ్చింది. ధనదాహం అవినీతి పెరిగి మానవ విలువల్ని నాశనం చేసే స్థితికి చేరుకుంది. అయితే ఈ సమస్యల్ని సరిగా అర్థం చేసుకోకుండా వాటికి భయపడి బాధ చెంది మొత్తం ఆధునిక విజ్ఞానాన్నీ నాగరికతనీ తిరస్కరించటం విజ్ఞత కాదు. ఆ సమస్యల్ని పరిష్కరించుకోవటానికి మార్గాలు అన్వేషించటం సరియైన పద్ధతి. ఆ వ్యవస్థ కంటే ఉన్నతమైన, అభ్యుదయకరమైన వ్యవస్థను నిర్మించుకోవలసిందన్న చైతన్యం పొందాలి. అలా కాకుండ సమాజం మరలా గతించిన కాలంనాటి దశను చేరుకోవాలని వాంఛించటం. అదే పరిష్కార మార్గమని భావించడము సబబుకాదు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ తెచ్చిన సనాతనమైన ఎన్నో సమస్యలు మన సమాజానికే పరిమితమైనట్టివి కాదు. ఈ వ్యవస్థ పాదుకున్న దేశాలన్నింటిలోనూ ఈ సమస్యలున్నాయి. అయితే ఆ దేశాలు గతించిన వ్యవస్థే శ్రేష్ఠమైనదని, తిరిగి అందులోనికి వెళ్ళటమే పరిష్కారం అన్న భ్రమల్లో లేవు. నిరంతర పరిణామశీలమైన సమాజాన్ని, చరిత్ర గమనాన్ని ఎవరూ అడ్డుకోలేరు. వెనక్కు మళ్ళించలేరు. అది ముందుకు సాగుతూనే ఉంటుంది. ఇది చారిత్రక సత్యం. చారిత్రక దృక్పథం లేనితత్వం పునరుద్ధరణ వాదులది.

ఆధునిక విద్యా విజ్ఞానాల్ని నిరసించటమే కాదు. అగ్రవర్ణేతరులకు స్త్రీలకు విద్య అవసరం లేదు అనటమేకాదు, కులవిద్యలే కూడు పెట్టేవి అని కూడా అంటాడు విశ్వనాథ. సంస్కరణోద్యమాన్ని ఎంతకాలం సాగించి ఎన్నో కష్టాల్ని ఎదుర్కొని సంస్కర్తలు సాధించిన సాంఘిక సంస్కరణలు కూడ ఆయన మనసుకు ఎక్కలేదు. బాల్య వివాహాల్లో తప్పేమిటి అంటాడు. వితంతు వివాహాలు అవసరం లేదంటాడు. శారదా చట్టానికి అర్థం లేదంటాడు.

విశ్వనాథ భావాలు, అభిప్రాయాలు, ఆలోచనలు, అన్నీ చాలభాగం ఆయన వ్యక్తిగతం, అవే ఆయన సాహిత్యంలో ప్రతిబింబించాయి. అవి ఈనాటి సమాజానికి అన్వయించతగినవే, వుపయోగించేవికావు. ఆధునిక సామాజిక చైతన్యానికి దోహదం చేసే రచన కాదు. "వేయిపడగలు" గతించిన కాలంనాటి సామాజిక దృక్పథం అందులో వ్యక్తమయింది. సమాజంలో వస్తూన్న ప్రగతిశీలమైన మార్పుల్ని గుర్తించలేదు. ఆయన కాబట్టి "వేయిపడగలు" సమాజానికి చైతన్యం ఇచ్చే రచన కాదు.

ఒక సామాన్య వ్యక్తి యొక్క భావాలు ఆలోచనలు సమాజంలో పెద్ద పాత్ర వహించే అవకాశం లేదు కాని, ఒక గొప్ప రచయిత విషయంలో పరిస్థితి వేరుగా ఉంటుంది. రచయిత భావాలు అతని వరకే పరిమితం కావు. అది అతని రచనల్లో కూడ ప్రతిఫలించడములా సమాజాన్ని ప్రభావితంచేసేందుకు అవకాశం ఉంటుంది. సాధారణంగా సాహిత్యం సమాజ చైతన్యానికి దోహదం చేసేదిగా ఉంటుంది. దానికి అది ధర్మం. అయితే ప్రగతిశీలమైన సామాజిక మార్పుల్ని అడ్డుకోవడానికి పనికివచ్చే రచనలూ వుంటాయి. కాని అలాంటి రచనలు ఎంతోకాలం ఆపని చేయలేవు. ఈ విషయంగా ఓటమిపాలు కాక తప్పదు. సంప్రదాయవాదులైన రచయితలు ఎవరు ఎంతగా ఆరాటపడినా సమాజంలో పూర్వపు పరిస్థితులు నెలకొల్పటం సాధ్యంకాదు. ఒకప్పటి సామాజిక విలువలు ఈనాటి సమాజానికి పొసగవు. ఆ విలువలతోనే ఈ సమాజం పునరుద్ధరింపబడాలనుకోవటం వెఱ్ఱితనం అవుతుంది.

భౌతికవాదాన్ని, హేతువాదాన్ని పూర్తిగా తిరస్కరించే మూఢవిశ్వాసాలు ఈ నవల అంతటా వ్యాపించి వుండటం శోచనీయం. సంప్రదాయాన్ని సమర్థించటానికి ఉపయోగపడింది ఈ మూఢవిశ్వాసాలే. ఈ నవలకు పూర్వపు నవలలెన్నో సమకాలీన సామాజిక చైతన్యాన్ని, అది పొందుతున్న క్రమవికాసాన్ని ప్రతిబింబించినవి. అందుకు దోహదం చేసేందుకు ప్రయత్నించినవి కాగా "వేయిపడగలు" వ్యతిరేకమైన పని చేసింది. కాని రచయిత చూస్తూ ఉండగానే ఆయన జీవిత కాలంలోనే సమాజంలో ఆధునికమైన మార్పులు ఎన్నో తరుముకుంటూ వచ్చాయి. ఆ వాస్తవం ఆయనకు మరింత బాధా కారకమైనట్లుంది. అందువల్ల మన జాతే నాశనం అయిపోతూంది. ఇక దానికి ముక్తి లేదు అంటూ ఆవేదన చెందాడు. కాని వ్యవస్థలు సంప్రదాయాలు మారినంత మాత్రాన (సమాజ పరిణామంలో అవి సమాజం) ఏ జాతి కూడా నశించిపోదు. పైగా సమాజం అడుగు ముందుకు వేస్తూ వుంటుంది.

అసలు ఈ పునరుద్ధరణ వాదానికి ఒక చరిత్ర ఉంది. అది గమనిస్తే సాహిత్యంలో ఈ వాదం ప్రతిబింబించటం అర్థం చేసుకోవచ్చు.

జాతీయోద్యమకాలంలో జాతీయతా భావం, ఆ చైతన్యం ప్రజల్లో మేల్కొంటూ వున్న పరిస్థితుల్లో బ్రిటిషు పాలకుల పట్ల వున్న ద్వేష భావాలతో, వారి పాలనను, నిరసించుటంతోపాటు వారి నాగరికతను సంస్కృతిని కూడా నిరసించే వాతావరణం ఏర్పడింది. ఆ పరిస్థితుల్లో సహజంగా మన గతవ్యవస్థ, సంస్కృతి విశిష్టమైనదంటూ మరోవైపు ప్రశంసించటం, ప్రచారం చేయటం జరిగింది. అయితే ఈ విషయంలో జాతీయవాదుల్లో వారి దృక్పధంతో రెండు బేధాలు గమనించవచ్చు.

జాతీయ వాతావరణాన్ని అవకాశంగా పురస్కరించుకొని సంప్రదాయవాదుల (సంస్కరణోద్యమాన్ని వ్యతిరేకించినవారు) ఫ్యూడల్ వ్యవస్థను ఆ సంస్కృతిని అతిశయించి చేసి ప్రచారం కావించారు. 'దేశభక్తి' 'జాతీయత' పేరుతో 'విజాతీయం' అన్న దాన్నంతా తిరస్కరించారు. వీరి దృక్పధానికి బలం చేకూర్చినట్టిది. ఆనాడు పెట్టుబడిదారీ వ్యవస్థ వాతావరణం కూడ, బ్రిటిష్ దోపిడీ పాలనలో మన సమాజంలో చోటుచేసుకున్న పెట్టుబడిదారీ ఆర్థికవ్యవస్థ దుర్లక్షణాలు, ధనదాహం, అవినీతి మొదలైన సమస్యలు, పాశ్చాత్య నాగరికతా వ్యామోహంలోపడి భారతీయ సంస్కృతిని తూలనాడేవారి ప్రవర్తన ఇవన్నీ Tos ల సాంప్రదాయవాదుల ప్రజల్లో గత వ్యవస్థ మహోన్నతమైనదన్న భావం వ్యాపింపచేయడానికి అవకాశం లభించింది. ప్రజలు కూడ పాత వ్యవస్థకు ఆ ఆచారాలకు అలవాటు పడినవారు కనుక పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క నూతన వాతావరణంలో దాని సాంఘిక ఆర్థికపరమైన మార్పులలో సులభంగా సర్దిపెట్టుకోలేకపోవటం, పైగా ఆ వ్యవస్థ ఆ నాగరికత పాలకులది. వారు బలవంతంగ మన నెత్తిన రుద్దిన సంస్కృతిఅని, మన సంస్కృతి అన్న దానిపట్ల తిరస్కృతి, మనజాతి, మన మతం, మన సంస్కృతి అన్నవానిపట్ల ప్రశంసాభావం వ్యాపించింది. దీంతో మన గత వ్యవస్థ - వర్గ వ్యవస్థలోని దోషాలు. మన ఆచార సంప్రదాయాల్లోని లోటుపాట్ల గురించి ఆలోచించకుండా వాటిని గుర్తించకుండక గతమంతా విశిష్టమైందన్న ఆదర్శవాదం వ్యాపింపచేశారు. గతమంతా ఆదర్శీకరింపబడి కీర్తింపబడటం ఆరంభమైంది.

ఈ వాదంలో మరో విశేషం - విదేశీ పాలనను, వారి సంస్కృతిని నిరసించుటతోపాటు ఆధునిక విద్య విజ్ఞానం పారిశ్రామిక పాలకులవే అన్న ద్వేష భావంతో వాటిని కూడా తిరస్కరించటం. కాబట్టి మన సమాజం బాగుపడాలంటే గత వ్యవస్థ, ఆ సంప్రదాయాలు పునరుద్ధరింపబడాలన్న దృష్టి ఏర్పడింది. ఈ పునరుద్ధరణవాదుల సంప్రదాయ ఆవేశంలో వారికి పాశ్చాత్య విజ్ఞానం యొక్క గొప్పతనం కాని వారి సంస్కృతిలోని అభ్యుదయాంశాలు కానీ ఏవీ కనిపించలేదు. మన వర్ణవ్యవస్థ, ధర్మాలు, సంప్రదాయాల్లోని దోషాలు కనిపించుటలేదు. రెంటింటిలోని గుణదోషాలను ఏర్పరచి చూచే విచక్షణా జ్ఞానం ఈ పునరుద్ధరణ వాదంలో లోపించింది.

ఇక రెండవరకం జాతీయవాదుల దృక్పథం సంస్కరణాత్మకమైన పురోగమన దృక్పథం. వీరు ఒకవైపు పరాయిపాలనను అసహ్యించుకుంటూ వారి సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ, స్వాతంత్ర్య లక్ష్యం కలవారై, మరోవైపు పాలన సంస్కృతిలోని అభ్యుదయాల్ని గమనించినట్టివారు. వారి విజ్ఞానాన్ని స్వీకరించటం అవసరం అని భావించినారు. సమాజంలో వస్తున్న మార్పుల్ని గుర్తించారు. పాశ్చాత్య (బూర్జువా) నాగరికత నుండి హేతువాదాన్ని గ్రహించి దాని వెలుగులో ఫ్యూడల్ వ్యవస్థా విశ్వాసాల్ని (ఆచారాల్ని) గురించి ఆలోచనలు ప్రారంభించారు. కులవ్యవస్థ మతం సాంప్రదాయం మొదలైన వాటిలోనున్న దోషాల్ని గమనించారు. మన జాతీయ ఐక్యతకు కులవ్యవస్థ అడ్డుగోడగ వుందన్న వాస్తవాన్ని అర్థంచేసుకున్నారు. అందువల్ల ఇవన్నీ సంస్కరణలకు గురికాకపోతే ప్రయోజనం లేదని భావించారు. అసలు ఈనాడు మన మతం సాంప్రదాయం ఆచారం సంస్కరించబడకపోయినట్లయితే మనలేని పరిస్థితికి చేరుకున్నాయి. అంతగా కాలదోషం పట్టిన విషయాలు వాటిలో తిష్ఠవేసుకున్నాయి. అందులోని పాలకుల మతంలో సంస్కృతిలో వున్న ఉదారత - (అంటే క్రింది కులాలపట్ల వాటి వైఖరి మొ॥నవి) కారకంగా కూడా మన మతంలో సంప్రదాయంలో సంస్కరణ తప్పనిసరి అన్న అభిప్రాయం ఏర్పడింది.

హిందూ మతంలో సంస్కరణల ఫలితంగా ఉద్భవించిందే బ్రహ్మసమాజం. ఇది విజాతీయమైన పద్ధతులకు లోనయి భావింపబడిన కారణంగా ఆర్యసమాజం వంటివి ఉద్భవించి ఆర్యసమాజీయులు సంస్కరణలకు వ్యతిరేకత చూపకుండానే కొంతవరకూ అనుసరిస్తూ హిందూతత్వాన్ని పునరుద్ధరించటానికి ప్రయత్నించారు.

మత సాంప్రదాయాన్ని సంస్కరించుకొని వ్యవస్థను పునర్నిర్మించుకొని ముందుకు సాగాలన్నది పురోగామి వాదుల దృక్పథం. గతాన్ని యథాతథంగా పునరుద్ధరించడం అనేది అసంభవం. అవాంఛనీయం. జాతి నిర్మాణానికి దేశాభివృద్ధికి పరాయిపాలన ఆటంకంగా వున్నదన్న విషయం గ్రహించారు. అంటే దేశానికి రాజకీయంగా స్వాతంత్ర్యాన్ని, సామాజికంగా సంస్కరణల్ని కోరుతున్న వర్గం వీరు జాతీయవాదుల్లో.

ఈ రెండురకాల జాతీయ వాదులకూ. 'జాతీయత' బ్రిటిష్ పాలనపట్ల వ్యతిరేకత సామాన్యంగా వున్న భావాలే అయినా వారి దృక్పథాల్లో బేధం వుంది. పునరుద్ధరణవాదుల జాతీయ దృక్పథంలో పట్టిన గతమంతా విశిష్టమైందనే భావం పరాయిపాలనతోపాటు వాళ్ళ సంస్కృతిని విజ్ఞానాన్ని పూర్తిగా తిరస్కరించటం వున్నాయి. పురోగమనవాదుల జాతీయ దృక్పథం మన మతం సంప్రదాయం సంస్కరింపబడాలంటుంది; పరాయిపాలనను తిరస్కరించినా వారి సంస్కృతులలోని అభ్యుదయ అంశాల్ని, వారి విజ్ఞానాన్ని స్వీకరిస్తుంది. ఈ రెండు రకాల దృక్పథాలు దేశంలో జాతీయోద్యమ చారిత్రక సందర్భంలో నుండి ఉద్భవించినవే అయినప్పటికీ రెండు విభిన్నమైనవిగ తేలాయి.

ఈ విధంగా ఆనాడు జాతీయవాదుల్లో ఇరువర్గాలకు ఆసక్తికరమైన పోటీవంటిది ఏర్పడింది. Revival versus Reform చారిత్రకంగా ఇది ఒక క్లిష్ట పరిస్థితి. అయితే మన రాజకీయ నాయకులు జాతిఐక్యత దెబ్బతినకుండా ఈ యిరువర్గాల వారిని తెలివిగా జాతీయోద్యమంలో కలుపుకొని ముందుకు సాగినారు. జాతీయతా, బ్రిటిష్ వ్యతిరేకత అన్న భావాలు ఆనాడు అన్ని రకాల వాళ్ళనూ ఒక్కతాటి మీద నడిపించాయి.

ఈ విభిన్నమైన దృక్పథాలు, జాతీయోద్యమ వాతావరణం అన్నీ ఆనాటి సాహిత్యంలో ప్రతిఫలించాయి. రచయితల్లో కూడ ఇరువర్గాల వారూ ఉన్నారు. ఆ రెండు దృక్పథాల్ని పురస్కరించుకొని సాహిత్యం సృష్టించారు. గత వ్యవస్థను ఆధారం చేసుకొని పెట్టుబడిదారీ వ్యవస్థను తీవ్రంగా విమర్శిస్తూ గతమే విశిష్టమైంది అదే పునరుద్ధరింపబడాలన్న దృక్పథం ప్రదర్శించిన భావవాద రచయితలు పునరుద్ధరణ వాదులు. గత వ్యవస్థతోపాటు పెట్టుబడిదారీ వ్యవస్థను కూడ విమర్శిస్తూ వాటిని నిరసించి అంతకంటే అభ్యుదయకరమైన వ్యవస్థా నిర్మాణం కోసం భవిష్యత్తులోనికి పయనించే దృక్పథం వ్యక్తం చేసినవారు పురోగమన వాద రచయితలు. (వీరిని విప్లవాత్మక కాల్పనిక వాద రచయితలు అనవచ్చు) ఈ రెండు రకాల రచయితలూ పెట్టుబడిదారీ వ్యవస్థను విమర్శించే వారే అయినప్పటికీ ఆ విమర్శకు లక్ష్యం వేరు. మొదటిరకం వాళ్ళు ఈ పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా పాత వ్యవస్థ పునరుద్ధరింపబడాలంటారు. రెండవరకం వారు ఈ ప్రస్తుత వ్యవస్థల కంటే అభ్యుదయకరమైన వ్యవస్థా నిర్మాణం వైపు దృష్టి సారిస్తారు.

జాతీయావాద బలంతో స్వాతంత్రోద్యమం ముందుకు సాగుతూ వున్న కాలంలో సహజంగానే దేశవ్యాప్తంగా అన్ని భాషల్లో మన జాతి పూర్వ వైభవాన్ని సంస్కృతిని స్మరిస్తూ, కీర్తిస్తూ సాహిత్యం దండిగా వెలువడింది. ఈ సాహిత్యం ప్రజల్ని జాతీయోద్యమంలోనికి ఆకర్షించడానికి, బ్రిటిష్ పాలనపట్ల వ్యతిరేకతను పురికొల్పటానికి దోహదము చేసింది. జాతీయతను ఉద్బోదించింది. "గతాన్ని ఆదర్శంగా చిత్రీకరించడం పునరుద్దరణవాదుల్లో ప్రస్తుత భంగపాటుకు పరిహారంగ ఉపకరించింది. జాతీయవాదానికి ఆదేశము ఆత్మవిశ్వాసమూ కలిగించింది అంటారు డా॥ రోమిలాథాపర్. కాని గతాన్ని ఆదర్శీకరించటంతోనూ ఆధునికాన్ని నిరసించటంలోనూ ఆగలేదు పునరుద్దరణవాదులు. ఆ గత సంస్కృతి, ఆ వ్యవస్థ పునరుద్దరింబడుటయే నేటి పరిస్థితికి పరిష్కార మార్గం అన్న ధోరణి ప్రదర్శించారు. ఈ దృక్పథం సరియైంది కాదు. ఎందుకంటే గత వ్యవస్థ ఎంత గొప్పదని భావించినా అది వర్తమాన భవిష్యత్ సమాజాలకు పనికివచ్చేదికాదు. అందులో భౌతిక ఐహిక అభ్యుదయానికి పనికివచ్చే అంశాలు చాలా తక్కువ.

తెలుగులో పునరుద్దరణ వాద రచయితల్లో విశ్వనాథ ప్రసిద్దుడు. "వేయిపడగలు" నవలలో 1900 - 1930 ప్రాంతపు తెలుగు దేశంలోని సామాజిక పరిస్థితులు - కూలిపోతున్న జమిందారీ వ్యవస్థను దాని జీవన సరళిని, సంప్రదాయాల్ని, నూతనంగ చోటుచేసుకుంటున్న పరిణామాల్ని చిత్రించాడు. గతించిపోయిన ఆ వ్యవస్థపట్ల ఆయనకున్న మమకారంచేత దాని పతనానికి చాలా ఆవేదన వ్యక్తం చేశాడు. ఫ్యూడల్ వ్యవస్థ నాటి కళలు, సంగీతం, సాహిత్యం, నృత్యం గురించిన వర్ణనలు నవలలో చాల కమనీయంగా వున్నాయి. కళ్యాణోత్సవం దినాల్లో దేవదాసి చేసిన దశావతార నృత్యాలు విపులంగ వర్ణించబడ్డాయి. ఆనాటి కళల్ని వారి విశిష్టతను ప్రశంసించటం పాఠకులకు ఆనందాన్ని కలిగించే విషయం. అయితే ఆయన వాటిని మెచ్చుకొనటంతో ఆగకుండ, ఆధునికమైనదంతా పనికి రానిదంటూ నిరసించటం పాఠకులకు కొరకుడు పడని విషయం.

## 16.3. వేయిపడగలు - సంప్రదాయ దృష్టి :

సుబ్బన్న పేట ఎలా ఏర్పడిందన్న విషయం వివరించటంలో నవలా కథా ఎత్తుగడలోనే మూఢవిశ్వాసాలు ఎన్నో వ్యక్తమైనాయి. కథకు పునాది నిర్మాణమే మూఢ విశ్వాసాలతో జరిగింది. వేయి శిరసులనాగు (సుబ్రహ్మణ్యస్వామి) ఒకటి సుబ్బన్న పేట నిర్మాణంలో దాని భవిష్యత్తులో, ఆ వూరి ప్రజలు జీవితాల్లో కీలకమైన పాత్ర వహిస్తుంది నవలలో.

గొప్పగొప్ప క్షేత్రాలు అనబడే వాటికి సంబంధించి స్థల పురాణాల స్థల మహాత్మ్యం కథలు కల్పింపబడినట్లే ఈ నవలలో ఓ సుబ్బన్న పేట ఏర్పడిన స్థలానికి సంబంధించి కూడ ఒక కథ చెప్పబడింది. అక్కడ మూడు వందల యేండ్ల క్రిందట ఒక చిన్న పల్లె వుండేది. అందులో ఒక పెద్దకాపుకు ఒక పాడియావు వుండేది. అది ఒకసారి కొన్నాళ్ళు వరుసగా పాలులేని పొదుగులో యింటికి వస్తూ వుంటుంది. కారణం తెలియక ఆశ్చర్యపోయిన రైతు మరునాడు ఆవును వెంటాడి ఒక విచిత్రం

చూస్తాడు. "పుట్టలో నుండి యొక దివ్యసర్పము వెలికివచ్చి నోరు తెఱచి పొదుగువద్ద పడగవిప్పి నిలచియుండెను. కాపునకు కనులు బైరులు క్రమ్మెను. కాపు కొంతసేపటికి తమాయించుకొని తలగుడ్డ తీసి నేలపైపెట్టి మ్రొక్కియట్లే చూచుచుండెను. ఆవు పొదుగు నుండి పాలు ధారగా జాఱుచుండెను. పాము త్రాగుచున్నది కాబోలు : (పుటక) ఆ పాముకు రెండు శిరసులు, మరల చూచుసరికి నాలుగు శిరసులూ కన్పిస్తాయి కాపుకు. అతడు ఆశ్చర్యంతో విషయం భార్యకు (వూరివారికి తెలియజేస్తాడు. ఏం చేయాలో ఎవరికీ తోచదు. ఆ రాత్రికి కాపుకలలో వేయి శిరసులతో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కనబడి తనకు గుడి కట్టించవలసినదనీ, అది కూడా తాను ఆవుపాలు త్రాగిన చోటనే కట్టించవలసినదనే చెబుతాడు. కాని పేదకాపు స్వామికి గుడి ఎలా కట్టించగలడు ? అప్పటి నుండి స్వామి మహత్తు నానాటికి వ్యాపించింది. ఊరిలో పెద్దకాపు కొడుకు బడలంతా పళ్ళికలు లేస్తే స్వామికి మొక్కకునేటప్పటికి అది శాంతించింది. అలాగే ఒక స్త్రీకి పది సంవత్సరాల నుండి వున్న చెవిపోటు స్వామికి దీపారాధన చేయించగానే నయమైపోయింది. ఆ పల్లెకు ఆమడదూరంలో వున్న మరో బ్రాహ్మణునికి సంతానం లేకపోతే స్వామికి మొక్కుకునేటప్పటికి మరుసటి సంవత్సరం కుమారుడు పుట్టాడు. దాంతో బ్రాహ్మణుడు ఆ పల్లెకు వచ్చి నివాసం వుండి స్వామి ఆలయ నిర్మాణానికి ప్రయత్నాలు చేస్తాడు.

వీరన్న అనే ఒక ధనవంతుడు ఈ ప్రశస్తి విని ఆ బ్రాహ్మణుణ్ణి దర్శిస్తాడు. ఒకకోట నిర్మించి జమిందారు కావాలని అతని వూహ. వెదకబోయిన తీగకాలికి తగినట్లు బ్రాహ్మణుడు చాల సంతోషించి ఆ స్థలము దివ్యస్థలము కాబోతుందనీ . అక్కడ నిర్మించే పట్టణము మూడు నాలుగు వందల యేండ్లు మహర్దశ అనుభవిస్తుందనీ చెబుతాడు. ఆ ధనవంతుడు కోట నిర్మాణాలతోపాటు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కూడ కావిస్తాడు.

ఆ పల్లె కాపులు గణాచారి పూర్వీకులు. ఆ బ్రాహ్మణులు ధర్మారావుకు పూర్వీకులు. కోట నిర్మాణం కావించిన ధనవంతుడు జమిందార్లకు పూర్వీకుడు. ఆ కాపుకు కూతురు ఒక్కటే. తరువాత మూడువందల యేండ్ల వరకు ఆ కుటుంబంలో ప్రతి తరంలో ఒక్కతే ఆడకూతురు. ఆమె గణాచారి అవుతుంది. నాగేంద్రుడు ఆమెకు కలలో కనిపిస్తూ ఆ ఊరిలో జరగబోయే శుభాశుభాల్ని ముందుగానే సూచిస్తూ ఉంటాడు.

ఆ విధంగా ఆ కాపు వంశపుటాడపడుచులు స్వామికి, వ్యాఖ్యాతలు, ఆ బ్రాహ్మణులు స్వామికి ప్రచారకులు, వీరన్న నాయని వంశం జమిందారులు స్వామికి ప్రతినిధులు అయ్యారు. "ఈ రీతిగా భూమ్యాకాశముల మధ్య స్వర్గ మర్త్యలోకముల మధ్య ప్రత్యక్షా ప్రత్యక్షముల మధ్య నొక స్థిరమయిన సంబంధం యేర్పడెను. పైని భగవంతుడు క్రింద రాజును బ్రాహ్మణుడును. ఈ రెండు మహాసంస్థలకు మధ్య గణాచారి తెంచరాని లంకె' స్వామి, జమిందారు, బ్రాహ్మణుడు, గణాచారి. వీరి నల్గురు స్తంభములు (పుట **91** ఈ నాల్గు స్తంభములత ధర్మమంటములో సుబ్బన్న పేట ప్రజలు పచ్చగా స్వర్గసౌఖ్యాలు చవిచూస్తూ వుండేవారట.

ఈ విధంగా ఫ్యూడల్ వ్యవస్థ స్వరూపాన్ని దాని సంస్కృతిని వ్యక్తం చేస్తున్నాడు రచయిత. ఆ వ్యవస్థలో ప్రజలంతా సుఖపడ్డారని విశ్వాసం.

కాని ధర్మారావు తరం నాటికి సుబ్బన్నపేట పరిస్థితులన్ని మారిపోయినాయి. పరధర్మం ప్రవేశించింది. స్వధర్మం చ్యుతమయిపోయే పరిస్థితికి చేరుకుందని రచయిత ఆవేదన పడతాడు. ధర్మారావు సమకాలికుడైన జమిందారు రంగారావు ఇంగ్లీషు విద్య అభ్యసించినవాడు. పాశ్చాత్య నాగరికతా వ్యామోహి. ఆయన కాలంలో పురపాలక సంఘం ఏర్పడింది. ఎన్నికలు జరిగాయి. పంచాయితీ పాలన వచ్చింది. ఇంగ్లీషు చదువుల స్కూలు, కాలేజి, ఆస్పత్రి వచ్చాయి. క్రైస్తవ మిషనరీలు ప్రవేశించాయి. సుబ్బన్నపేటలో రోడ్డు రైలు మార్గం వేయించాడు రంగారావు. విద్యుద్దీపాలు, కుళాయిలు వేయించింది పురపాలక సంఘం. గుండేరుకు ఆనకట్ట తయారయింది. ఊరి చుట్టూ మెట్టభూముల్ని మాగాణి భూములుగా మారినాయి.

వరిసాగు విస్తీర్ణం పెరిగింది. పంట దండిగా పండుతూంది. బయట నుండి రకరకాల జనము, ఉద్యోగులు వచ్చిచేరారు. సుబ్బన్నపేటలో జనసంఖ్య పెరిగింది. ఊరికి పట్టణ వాతావరణం సమకూరింది. ఇవన్నీ సుబ్బన్న పేట వినాశనానికి తయారయినాయని రచయిత అభిప్రాయం. ఇందుకు ఆయన ఎంతో ఆవేదన వ్యక్తం చేస్తాడు.

జమిందారు రంగారావుకు మన మతధర్మం సంప్రదాయం అంటే గౌరవం లేదు మన విద్యలు వైద్యం మూలపడ్డాయి. ఆయన పాలనలో సుబ్రహ్మణ్య స్వామికి జమిందారు చేయించవలసిన ఉత్సవాలు సేవలు ఆగిపోయినాయి. స్వామికి రంగారావు మీద కోపం వచ్చింది. అతని కలలో వేయి శిరసులతో కనిపించి వేయిచోట్ల అతని శరీరాన్ని కాటువేశాడు. (పుట 68) పట్టాభిషేకోత్సవ సమయంలో రంగారావు తమ ఏనుగు మీద కాకుండా కారు మీద ఊరేగినారు. అందువల్ల ఆ ముసలి ఏనుగు, 'లక్ష్మణస్వామి'కి చాలా కోపం వచ్చింది. ఎంతోకాలం నుండి కోటలో వుంటూ ప్రభువులను సేవిస్తూ స్వామిభక్తి కలిగిన ఆ ఏనుగు రంగారావు చేసిన పనికి బాధపడి అక్కడిక్కడే తల నేలకు బాదుకొని చనిపోయింది. ఇది జమిందారుకు అమంగళ సూచకమయింది.

ఇక ఊరిలో జరుగుతున్న సంప్రదాయ విరుద్ధములైన ఒక్కొక్క పనికి కారకులైన వాళ్ళ చేటును సూచిస్తూ ఎప్పటికప్పుడు నాగేంద్రుడు గణాచారికి కలలో కనిపించి పోతూ ఉంటాడు. "ఆమె స్వప్నములు గనుచుండును. స్వప్నములలో నామెను రాబోవు వర్తమానములు తెలియును'' (పుట. 236) మరుసటి ఉదయమే గణాచారి వేపమండలు రావిమండలు చేతబూని ఊరిలో తిరుగుతుంది. ఎవరికి చేటు కలగబోతుందో వారి ఇంటి దగ్గర అవి వుంచి వస్తూ వుంటుంది. ఆమె ఈ పనుల్ని ఎగతాళి చేసి నమ్మని వాళ్ళకు కూడ చేటు మూడుతూ వుంటుంది. "వేయిపడగల పాము విప్పారుకొని వచ్చి కాటందుకొన్నది కలలోన రాజును'' అంటూ ఆమె వేపమండ చేతబుచ్చుకొని వూరిలో తిరుగుతూ రంగారావు కారణంగా ఊరికి కూడ చేటుకాలం దాపురించిందని సూచిస్తుంది. దేవుని గుడిలో స్వామి యంత్రమున్న ముక్కాలిపీట కాలు ఒకటి విరిగింది. గణాచారి ధర్మారావుతో "సరిపోయినదా ! ఒక కోడూడినది నీవును నేనును మిగిలియున్నాము'' అంటుంది (పుట 42) ప్రభువు రంగారావు నాశనమయ్యాడని, ధర్మాల్ని కాపాడటానికి బ్రాహ్మణుడు, గణాచారి మిగిలారని అభిప్రాయం.

ధర్మారావు భార్య అరుంధతి అతని చనిపోయిన తండ్రిని గురించి కాస్త ఎగతాళిగా మాట్లాడినందుకు కూడ పాము కనిపించింది. ఆమెకు అక్కడికక్కడే వెంటనే ధర్మారావు భక్తితో ప్రార్థించగా అది వేయిశిరసులతో అతనికి దర్శనమిచ్చి మాయమయింది. రంగారావు భార్య సరోజినీదేవి మరణాన్ని గురించి, వూరిలో మరెందరివో మరణాల్ని గురించి, చేటును గురించి నవల అంతమయే లోపల ఈ పాము గణాచారి కలలో ఎన్నోసార్లు కనిపించి ముందుగానే సూచనలు చేస్తూ వుంటుంది. అంతేకాదు ఈ గణాచారిని గురించి ఎవరైనా ఎగతాళిగా మాట్లాడినా భావించినా కూడా వెంటనే ఆ పాము వాళ్ళకి తగిన శిక్ష వేస్తూ వుంటుంది. ఈ గణాచారి అన్నభార్య రంగమణి తనకు చదువు చెప్పే ఒక క్రైస్తవ స్త్రీతో కలిసి గణాచారిని గురించి ఏదో ఎగతాళిగా మాట్లాడినందుకు రంగమ్మ కొడుకు వేపచెట్టుమీద నుండి క్రింద పడతాడు. కాలు విరుగుతుంది. "ఆధునిక నాగరికతా చిహ్నములైన వస్తువు లెచటనున్నను నాగమ్మ (గణాచారి పేరు యిది ! దూర దూరముగా బోవును'' (పుట. 6 44 - 45). ఆ క్రైస్తవ స్త్రీ తమ యింటికి వస్తూనే గణాచారి దొడ్డిలోనికి పోయి కూర్చుంటుంది. అందుకు ఎగతాళి చేస్తారు. క్రైస్తవ స్త్రీ రంగమ్మ మరొకనాడు ఆ టీచరు గణాచారిని ఎందుకో పిలిచేటప్పటికి ఆమె కనులెఱ్ఱచేసింది. ఆ స్త్రీవైపు వెంటనే ఆ క్రైస్తవ టీచరుకు భయంతో ముందుకువచ్చి మఖూచిలోనికి దింపింది. మరొకనాటి రోజు రంగమ్మ గణాచారిని వంటచేయనందుకు తిట్టి తానే ఆ ప్రయత్నంలో దొడ్డిలో పిడకలు తేవటానికి వెళ్తే పాము ఆమెను వెంటాడి భయపెడుతుంది. ఆమె ఇంటిలోనికి పరిగెత్తి వచ్చే లోపల రెండు కాళ్ళూ వాచిపోతాయి. భర్త దొడ్డిలోనికి వెళ్ళి చూస్తే "రెండు వత్తులకల దీపపు బ్రమిదవలె మాణిక్య కాంతులు వెలుగు రెండు తలలతోడి మహాఫణము విప్పి యొకపాము తోకపై నిలుచుండెను . . . (పుట 149). అతడు భార్యకు నయంకావాలని స్వామిని తలచుకొనకుండ మరచిపోయి పాము మంత్రగాడిని పిలువబోతే పాము అడ్డం వస్తుంది. తరువాత వారం దినాలకు ఆమెకు నయమౌతుంది ఆ వాపు.

రంగారావు కొడుకు హరప్పనాయుడు ధర్మారావు దగ్గర సంప్రదాయ విద్యలు నేర్చి మన మతం ధర్మం మీద భక్తిగౌరవాలు కలవాడౌతాడు. తండ్రి చేయకుండ ఆపివేసిన పనులన్ని మరల ప్రారంభిస్తాడు. స్వామి కళ్యాణోత్సవాలూ జరిపిస్తాడు. ఆ ఉత్సవాల్లో ఒకనాడు ఏనుగు ఎక్కి పరివారంతో మరికొన్ని ఏనుగులు గుఱ్ఱాలు వెంటరాగా బయటకు వెళ్ళి తిరిగి వస్తూవుంటాడు. ప్రక్కనున్న వ్యక్తితో ప్రసంగంలో "ఒక మహాకవి, ఒక మహారాజు, ఒక మహావృక్షము, ఒకమహాజంతువు చనిపోవుట మంచి శకునము కాదు. లోకమునకేదో దుర్దశయున్నగాని యిట్టిది జరగదు. సామాన్యముగా లోకోక్తి యున్నది. పెద్దవారు చనిపోయిన యేట నన్నియు గష్టము లేనని" (పుట 798) అంటాడు హరప్ప. ఆ సందర్భంలో తమ చనిపోయిన ఏనుగు 'లక్ష్మణస్వామి' ప్రసక్తి కూడా వస్తుంది. ఇంతలో వెంటనే ఆ లక్ష్మణస్వామి తమ పరివారానికి ఎదురుగ దూరంగ తిరుగుతూ హరప్పకు మాత్రం దర్శనమిస్తుంది. ముందుకు సాగుతున్న ఏనుగులకు గుఱ్ఱాలకు అడ్డువస్తుంది. అంటే వాటికి కూడ కనిపించిదన్న మాట. అవి బెదిరి ముందుకు అడుగువేయలేకపోతాయి. అవి ఎందుకు అలా బెదిరిపోతూ వున్నాయో మిగతా పరివారానికి తెలియదు. అర్థంకాదు. హరప్ప వెంటనే ధర్మారావును పిలిపించి విషయం వివరిస్తాడు. ఆయనకు కూడా కనిపిస్తుంది ఆ ఏనుగు. అది హరప్ప కూర్చున్న ఏనుగు 'శత్రుఘ్నుని' మీదకు దూకబోతుంది. వెంటనే ధర్మారావు ఆలోచనచేసి హరప్పాతో కూడా కొంచెం ముందుకు వెళ్ళి ఒకచోట ఆగుతాడు. ఆచోటు పూర్వం చనిపోయిన ఆ లక్ష్మణ స్వామిని పూడ్చిన ప్రదేశం. అక్కడ ధర్మారావు నీళ్ళు చల్లించి శుద్ధిచేసి ఏనుగు మేతవుంచి, ఏనుగు 'శత్రుఘ్నుని' పేరు తీసివేసిదానికి 'లక్ష్మణస్వామి' అన్న పేరు పెడతామని మ్రొక్కుకొని హరప్పాలతోపాటు తిరిగి వస్తాడు. దాంతో వెంటనే ఆ లక్ష్మణస్వామి మాయమైపోయి పరివారానికి దారి ఇస్తుంది.

ఈ విధంగా నవలలో మరెన్నో విషయాలకు మూఢవిశ్వాసాలకు ముడిపెట్టి చిత్రించడం జరిగింది. సుబ్బన్నపేటలో అధర్మం బలిసినందున గుండేటికి వరదలు వచ్చి ఆనకట్టతెగి క్రొత్తగా తయారైన వూరంతా కొట్టుకుపోయి పాతవూరు మాత్రం మిగిలిందట.

ధర్మారావు రెండవభార్య చిన్న అరుంధతి అతని చనిపోయిన మొదటి భార్య పెద్దఅరుంధతి అంశమే. ఆమె ఈమెలో అవతరించిందని చిత్రించబడింది. 'ఆ అరుంధతియే ఈ అరుంధతియా !" (పుట 1915) అని గుర్తిస్తాడు ధర్మారావు. ఆమె "నేను మఱల నెట్లు వచ్చితిని నన్ను గుర్తుపట్టలేరా ? (పుట 1022) అంటుంది". ఆ దివ్యజ్యోతి వచ్చి ఈ పసిమేనులో నాదిగెను . . . అనుకుంటాడు. అరుంధతి "ఇప్పటికి దెలిసినదా ?" ధర్మారావు "ఇదియేమి పని? " అరుంధతి "నేను నిన్ను వదిలి యుండలేను. ఈ దేశములో బతివ్రత చావదు . . ." (పుట 1022) నలభై సంవత్సరాల వయసుగల ధర్మారావును వరించి పెండ్లి చేసుకున్న పండ్రెండేండ్ల పిల్ల ఈ అరుంధతి.

## 16.4. వేయిపడగలు - సనాతన దృష్టి :

పూర్వము సుబ్బన్న పేటలో జనమంతా దారిద్ర్యం అనేది లేకుండ సుఖపడేవారట. ఆనాడు జమిందారు దగ్గర పదిరూపాయలు జీతగాడు సుఖంగతా బ్రతికేవాడు. ఇప్పుడు పురపాలక సంఘం ఏర్పడి ముప్పై రూపాయల జీతగాడు కూడా రకరకాల పన్నులు కట్టవలసివచ్చి బాధపడుతున్నాడట. పూర్వము గ్రామములో ప్రతి చీమయు జమిందారు నాశ్రయించియుండెనట. అయితే ఇప్పుడు కలిగిన మేలొకటేనట. అది ప్రతి చీమయు స్వతంత్రమగుట, వ్యక్తి వికాసం జాతి వికాసానికి హేతువగుట నిర్వివాదం కదా!; అంటూ హేళన చేస్తున్నాడు (పుట 265) పురపాలక సంఘం ఏర్పడి ఓటుహక్కు కలిగి ప్రజలు స్వతంత్రంగా వ్యవహరించుటం మొదలయింది. జమిందారును ఆశ్రయించటంలేదు ఎవరూ. అదే సుఖమని భావించటం లేదు కూడ. ఆయన ఆశ్రమాన్ని వదిలి జనమంతా స్వతంత్రులై దారిద్ర్యం అనుభవిస్తున్నారని బాధపడుతున్నాడు. రచయిత వినిమయం తుడిచిపెట్టుకు పోయిందట. గతించిపోతున్న విలువలపట్ల వ్యామోహం ఇది.

సుబ్బన్నపేటలోని జాతీయ కళాశాల వారు కళాశాలోత్సవాలు చేస్తూ సంప్రదాయ విద్యలు కళల మీద గౌరవాభిమానాలతో ఎక్కడికెక్కడి నుండి ఎందరో కళాకారుల్ని రప్పించారు. కూచిపూడి నాటకాలవారు, పగటి వేషాలవారు, గొబ్బెపొట్టెళ్ళవారు, ఎలుగుగొడ్ల నాడించేవారు, దొమ్మరవాళ్ళు, గారడీవాళ్ళు, పాములవాళ్ళు మొదలైన వారంతా వచ్చారు. నేల యీనినట్లు ఇంతమంది బిచ్చగాండ్రు ఎక్కడి నుండి వచ్చారో ఆశ్రయం లభిస్తుందనేగానే, పాపం ఆశ్రయం యిచ్చే ప్రభువులేక వాళ్ళంతా ఎంత బాధపడుతున్నారో కదా, ఈ వృత్తులు ఈ విద్యలు అన్నీ నశించిపోతున్నాయే అని బాధవ్యక్తం చేశాడు రచయిత (పుట **294**) మరి ఈ 'బిచ్చగాళ్ళంతా' రాచరిక వ్యవస్థ ఆశ్రయధర్మం పుణ్యాన తయారయిన వాళ్ళు కాదా ? వీళ్ళంతా ఈ వృత్తులు విద్యలు ప్రదర్శిస్తూ, ప్రభువుల్ని ఆశ్రయించి 'బిచ్చం' పొందడమే వాళ్ళకు సుఖదాయకమైన జీవితాన్ని యిచ్చేదా ? వీళ్ళలో విద్య ఏదైనా వుంటే దాన్ని ఆదరించటానికి అభ్యంతరం వుండనవసరం లేదు కాని అవే విద్యలుగ పొట్టకూటికి మరో మార్గం లేక ఆ వృత్తులు ఆధారంగా బిచ్చగాళ్ళు జీవితం గడుపుతూ వున్న వాళ్ళు సుఖపడిపోయారా ? ఇంతమంది బిచ్చగాళ్ళను తయారుచేసి పోషిస్తున్న ఆ వ్యవస్థ స్వరూపం ఒకవైపు అవగతమవుతూవున్న ఆ వ్యవస్థలోనే జనమంతా సుఖపడిపోయారని అందరి తరఫున తీర్మానం చేయటమా ? కులముల యందు ద్వేషము పుట్టించుకొని కులవృత్తులు మానివేయుట వలన నీ సంకటము ప్రాప్తించింది. సర్వజనులు నొక్కటియే కులవృత్తి వదులుకొనుట యెందులకు . . ." అంటాడు ధర్మారావు (**543** పుట) చదువుకొని ఉద్యోగాలు చేయాలని అందరు ఎగబ్రాకుతున్నారు. అది సాధ్యం కాదు, కులవిద్యలే కూడు పెట్టేవి అవి మానివేయకూడదు అని ఆయన బోధ, కులవృత్తుల్ని కాపాడుకుంటే కులవ్యవస్థ చెక్కు చెదరకుండా వుంటంది.

కులవృత్తులు తమకెంతమాత్రం కూడు పెడుతున్నాయో, వాటితో వాళ్ళెంత సుఖపడిపోతున్నారో చెప్పవలసింది క్రింది కులాలవాళ్ళేకాని, వాళ్ళ తరఫున వకాల్తా పుచ్చుకొని అగ్రవర్ణాల వారు కాదు. వ్యవస్థ మూలంగ సుఖాలు, గౌరవాలు పొందుతున్న వాళ్ళు ఈ తీర్మానాలు చేయటం స్వార్థాన్నే తెలుపుతుంది కాని మరొకటి లేదు.

ఇప్పటి వ్యవస్థ - పారిశ్రామికీకరణ చెందిన వ్యవస్థతో పోల్చుకుంటే ఆ వర్ణవ్యవస్థతో సమస్యలు లేనట్లు. అంతా ప్రశాంతంగా సుఖంగా వున్నట్లు అనిపించవచ్చును కాని అదంతా సమాజంలో అందరికీ లభిస్తున్న సుఖమూ శాంతి అని భ్రమపడలేము. చలనం లేనిది, మార్పులకు అవకాశం లేనిది, నిలువనీటి వంటిది అయిన వ్యవస్థయొక్క ప్రశాంతి అది. పాచిపట్టి కంపుకొట్టే పరిస్థితికి చేరుకున్నప్పటికీ అదే శాంతి. అదే సుఖము అనుకోవటం వాస్తవాన్ని గుర్తించకపోవటం అవుతుంది.

వర్ణవ్యవస్థ - కులవిద్యలు సమర్థింపబడినప్పుడు నవలలో ఆధునిక విద్య విజ్ఞానం పనికి రానివంటూ తిరస్కరింపబడటంలో ఆశ్చర్యంలేదు. కులవిద్యలే విద్యలు. తత కూడుపెట్టేవి అవే : పౌరాణిక కథలు తెలుసుకోవటమే సంప్రదాయ ఎటిగి వుండటమే విద్య ప్రభుత్వం వాళ్ళు పెట్టిన పాఠశాలల్లో కళాశాలల్లో ఇంగ్లీషు చదువులు చదవటం ఉద్యోగాలు చేయటానికి తప్ప మరెందుకూ కొరగాదు. పైగా అవి మన సంస్కృతిని సంప్రదాయాన్ని నాశనం చేస్తున్నాయి. ప్రాథమిక నిర్బంధ విద్యవల్ల అసలు ప్రయోజనం లేదు. డబ్బు దండగ తప్ప అనేవి ఈ నవలలో వ్యక్తమైన అభిప్రాయాలు.

సుబ్బన్నపేటలో కృష్ణమనాయని గారి హయాంలోనే సెకండరీ స్కూలు పెట్టాలని ప్రయత్నించారట ప్రభుత్వంవారు. కాని ఆయన "ఈ ఇంగ్లీషు చదువు నా యూరిలో నెందుకయ్యా ! ఇంక బిలిచిన పలుకు దిక్కయినలేకుండా జేయుటకా" (పుట **215**) అని స్కూలు పెట్టనీయలేదట కాని ఆ పని ఇంగ్లీషు విద్య చదువుకున్న రంగారావు హయాంలో నెరవేరింది. స్కూలు పెట్టకుండ అడ్డుకోవడంలో అర్థం ఏమిటి ? స్కూళ్ళు పెడితే అందరికీ చదువుకొనే అవకాశం కలుగుతుంది. అంతో ఇంతో తెలివి తెచ్చుకుంటారు. అగ్రవర్ణాల వారు బోధించేవీ విశ్వసించివారు చెప్పినట్లు వూకొడుతూ వారు నియమించిన పనులు చేస్తూ జనం వినయంగా పడివుంటే పరిస్థితులు దాటిపోతాయి. ప్రభువుల ప్రాధాన్యం సన్నగిల్లుతుంది. ఇవి అన్నీ గమనించవలసిన కృష్ణమనాయుడు స్కూలు పెట్టనివ్వక పోవటంలో ఆశ్చర్యం లేదు.

సుబ్బన్నపేటలో పురపాలక సంఘం పాలన ఏర్పడ్డాక నిర్బంద ప్రాథమిక విద్యావిధానం ప్రవేశపెట్టాలని ప్రయత్నిస్తారు. ఈ విద్యా విధానాన్ని ఎగతాళి చేస్తూ ధర్మారావు మన పురాణ విద్యలే విద్యలని నిరూపించటానికి చాలా ప్రయత్నిస్తారు. "విద్య యనగానేమి ? అక్షరములు నేర్చుటయు, వంకర దస్తూరి వ్రాయించటమునా ? ప్రతివారికిని సంగీతజ్ఞానము, లయజ్ఞానము కూడ సునిశితమై యుండుట. విద్యా విధానములో ప్రదానమైన విషయము . . . !" (పుట 538) పూర్వం మనదేశంలో వీధి నాటకాలు భజనలు మొదలైనవి విరివిగా సాగేవి కాబట్టి అందరికీ ఆ సంగీత లయజ్ఞానం అబ్బేదట. పూర్వులు కేవలం చదవటం రాయటం చదువు అనుకోలేదట. హృదయ పరిపాకాన్ని కలిగించేదే విద్య అనుకున్నారట. ఈ విషయాన్ని కాదని ఎవరూ అనరు, కాని చదవటం రాయటం నేర్చుకోనవసరం లేదా ? అవి నేర్చుకోకుండానే విద్యా విజ్ఞానాలు అబ్బుతాయా ? చదవటం రాయటం నేర్చుకోవటంతో విద్య ప్రారంభమౌతుంది కాని అక్కడితో అంతమయ్యేది విద్య అని ఎవరంటారు ? పురాణ కథలు వింటేనే హృదయ పరిపాకం కలిగిపోతుందా ? మానవుని బుద్ధికివిజ్ఞానం అవసరం లేదా ? జీవితంలో ఆధునిక విజ్ఞానం యొక్క ప్రాధాన్యం ఎవరైనా తిరస్కరించగలరా ? "పూర్వము విద్యయే యున్నది లేనిదిప్పుడు విద్య మోక్ష పర్యవసాయని" (పుట 540) అంటారు. ధర్మారావు ఈనాటి విద్య విజ్ఞానాలు కొరగానివి అయన దృష్టిలో "హృదయ భావములకు బదును తెచ్చుటకు గాక వానిని నడవిగా జేయుటకు సానుకూలపడుతున్న విద్యాపద్ధతిని వినష్టమైనదిపో !" దానివెంట నాదేశమును వినష్టమైనదిపో "ఇదీ వరుస ! ఆధునిక విద్యా విధానం ప్రవేశపెడుతున్న కారకంగా ఇంకా ఏ దేశమూ పాడైపోయిన దాఖలాలు కనిపించటం లేదు ప్రపంచంలో.

నిర్బంధ ప్రాథమిక విద్య వలన మనకు ప్రయోజనమేమిటి ? ఈ విద్యమనకవసరమా ? కూడికలు, తీసివేతలు చదవటం రాయటం అందరికీ వచ్చినందున ప్రయోజనమేమి ? అని అడుగుతాడు కబీరు. అప్పు పత్రం మీద తస్కతు చేయవచ్చును. రైలుటిక్కెట్టు మనం అడిగిన ఊరికి స్టేషన్ మాస్టరు ఇచ్చాడా లేదా అని కనుక్కోవచ్చును అంటూ ఎగతాళి చేస్తాడు ధర్మారావు. "ఈ విద్యావిధానం వలన లాభమనునది మనకు లేదు. దేశములో వృత్తులు చెడిపోయినవి. గనుక నీవిద్య వలననేమో సంపాదించవచ్చునని లోకమున కాశకలుగ వచ్చును. వృత్తి విద్యలో చదువుకొనకుండానే సంప్రదాయం వలన బ్రతివాడును తన యింటిలోనే నేర్చుకొనును. పది పదునారేండ్ల వయస్సు వచ్చువఱకు గులవిద్యయం దారితేరును. కులవిద్యయే కూడు పెట్టును . . ." (పుట 542 - 43) కాబట్టి మనకు ఈ విద్య వలన ప్రయోజనం లేదని తీర్మానిస్తాడు ధర్మారావు. కులవృత్తులు చేసుకుంటూ కూడుతిని బ్రతికితే చాలు. ఇంక వేరే విద్య విజ్ఞానాలు ఈ మనుషుల కెందుకు ? అంతగా కావాలంటే పురాణ కథలు మొదలైనవి వినవచ్చును. సంఘంలో ఒక భాగము ఇంకొక భాగానికి భోధకము భోధకమైన భాగమునకది వృత్తి ఇంత విచిత్రమైన సంఘసృష్టి యెక్కడ వుంటుంది" (పుట 543 - 44) అని కూడ అంటారు. కాబట్టి భోధకమైన భాగమునకే విద్య. ఇతరులు చదుకోవనవసరం లేదు. వాళ్ళ వృత్తులు వాళ్ళు చేసుకోవచ్చును. ఇది ఉద్దేశ్యం ఆ మాటలకు, ఇప్పుడు ఆ వృత్తులన్ని మూలచ్ఛేదం చేసి నిర్బంధ ప్రాథమిక విద్య అంటే ఏం ప్రయోజనం ? అని ప్రశ్నిస్తాడు. వీధి నాటకాలు, తోలుబొమ్మలు, హరికథలు, యక్షగానాలు, జంగముల కథలు ఇవన్నీ విద్యాబోధ కొరకే ఏర్పడినవట. పుస్తకములకు నోటుబుక్కులకు డబ్బు ఖర్చుపెట్టనవసరం లేకుండా వాటి వలన తేలికగా సంస్కారాన్ని పొందవచ్చునంటాడు.

ఈ ధర్మారావు భార్య అరుంధతి కూడా ఆడపిల్లలు నేర్చుకొనవలసిన విద్య గురించి ఒక ఉపన్యాసం ఇస్తుంది. "సంప్రదాయం తెలిసికొనుటకున్న నెక్కువ చదువుండదు. సంప్రదాయము చదువే. దానిని మరిచిపోరాదు. వేరే చదువనక్కరలేదు. మన యిండ్లలో పెద్దవారందఱు నిత్యము గొప్ప సంగతులను గూర్చియే మాటలాడుకొనుచుంటిరేని పిల్లలకవి వానియంతటనవియే వచ్చును. అందుకనియే మన దేశములో నోములు, వ్రతములు, పండుగలు నిన్నియున్నవి. ఇవియన్నియు నాడు పిల్లలకు విద్యవచ్చు మార్గములే. ఇంటిలో నా సంప్రదాయము చెడకుండా జూచుకొనవలయును" (పుట 581) ఆడపిల్లలు క్రైస్తవుల బడులకు పోయి మన ఆచారాల్ని తిరస్కరిస్తున్నారు కాబట్టి వాళ్ళను ఆ బడులకు పంపకూడదు. అసలు పాఠశాలలకు పంపనవసరంలేదు. పిల్లల్ని, ఇంటిలోనే మనము మన పురాణ కథలను చెప్పుట ద్వారా వారికి విద్యాబోధన చేయవచ్చునంటాడు

ధర్మారావు. ముసలమ్మల మూలాన ఇంకా మన సంప్రదాయం నిలిచివుంది ఏదో ఒక విధంగా "సాంప్రదాయమునకు వెలగట్టు ముసలమ్మలు లేనిచో హిందువుల గృహము లీపాటికే తక్కిన వానివలె నశించి పోయెడివి. ఇంగ్లీషు చదివి స్త్రీలు ఉద్యోగము చేయనక్కరలేదు కదా . . . ! (పుట 582)అంటాడు ధర్మారావు. చదువుల మర్మమెల్ల ప్రహ్లాదుడన్నట్లు దైవభక్తియట. మనం ఆ దైవాన్ని నశింప చేసుకున్నామని బాధపడుతాడు. "పిల్లలకు బాడుపుస్తకములు మానిపించి, త్రిపురాసుర సంహారమిట్లు జరిగిందని, గజేంద్ర మోక్షమిట్లు జరిగినది, పరశురాముడు రాజుల నిరువదియొక్కసారి వధించెను, రావణాసురుని గర్భమునం దమృత కుంభమున్నది . . . యిట్టి కథలన్నియు జెప్పుము" అంటున్నాడు (పుట 583) ఇదీ విద్య.

ఇంతగా ఇన్ని విధాల నిర్బంధ ప్రాథమిక విద్యను వ్యతిరేకించటం, పనికిరాదని తీర్మానించటం, అక్షరజ్ఞానం గొప్ప చదువుకాదు మన పురాణ విద్యలే గొప్ప చదువులు, కులవృత్తులు చేసుకోవటమే ఉత్తమం. ఆడపిల్లలకు పాఠశాలలు చదువు అక్కరలేదు. సాంప్రదాయం తెలుసుకోవటమే గొప్ప విద్య అంటూ బోధించటం ఎందుకు ? సమాజంలో ఎవరికి ఈ బోధ ఉపయోగించేది ? అగ్రవర్ణేతరులంతా విద్యా గంధం అంటకుండా ఇంకా తరతరాలుగ వృత్తుల పేర అగ్రవర్ణాల సేవలో నిమగ్నమై వుండాలనే ఉద్దేశ్యం ? చదువుకొనే అవకాశాలు అందరికీ లభిస్తే కులవ్యవస్థ పునాదులు కదిలిపోతాయయనా బాధ ?

ముక్కామల నాగభూషణం 'వెర్రిపడగలు' అన్న పుస్తకంలో ఈ విషయాలన్నింటిని విమర్శిస్తూ విపులంగా రాశాడంటే ప్రపంచమంతటా అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ ప్రజలందరికీ కనీసం ప్రాథమిక విద్య అయినా అబ్బజేయాలని ఎన్నో ప్రణాళికలతో కోట్లు ఖర్చుపెట్టటం వ్యర్థమైన పని అవుతుందా ? బహుశః ఇదంతా వ్యర్థమని ఆలోచించే విపరీతబుద్ధి వారెవరికీ వున్నట్లు లేదు.

"పురాణాలు విని, తోలుబొమ్మలాటలు చూచి ఈనాటి రచయితలు కవులు, ఎందరో మేధావులు దేశనాయకులు విజ్ఞాన శాస్త్రవేత్తలు తయారయినారా ? చదవడం రాయడం తెలియకుండానే వీళ్ళంతా గొప్పవాళ్ళయ్యారా ? ఆయా విద్యల్లో ఆరితేరిన వారయ్యారా ? ఈనాడు మనదేశంలో ఎందరో చదువురానివారు సినిమాలు, నాటకాలు చూస్తున్నా, హరికథలు, బుర్రకథలు వింటున్నా రేడియో ద్వారా భక్తిగీతాలు పురాణాలు వింటున్నా, ఆడవాళ్ళెందరో నోములు చేస్తూ వ్రతాలు చేస్తూవున్నా, వీళ్ళంతా పాఠశాలలో చదవందే అభివృద్ధిలోనికి రాగలరని చెప్పగలరా ? అంటూ ప్రశ్నిస్తున్నాడు నాగభూషణం. ఇంకా ఈనాడు తప్పనిసరి పరిస్థితుల్లో సంప్రదాయ విద్యలతో జీవిస్తూ గంగిరెద్దుల వాళ్ళు బుడబుక్కలవాళ్ళు చెంచులు దొమ్మరులు, పాములవాళ్లు, పగటివేషగాండ్రు . . . వీళ్ళంతా ఎంత సుఖంగా జీవిస్తున్నారో కళ్ళారా చూడటం లేదా ఎవరూ ? ఇలాంటి వృత్తులు విద్యలు ఎన్ని వుంటే మాత్రం అవన్నీ మన పరిశ్రమల్ని విజ్ఞాన శాస్త్రాన్ని సాంకేతిక శాస్త్రాన్ని పెంచుకోవడానికి పనికి వచ్చాయా ?

చదువులు కేవలం బ్రతుకుతెరువు ఉద్యోగాల కోసమేనా వుద్దేశింపబడింది ? విజ్ఞానాన్ని పెంచటానికి మూఢ విశ్వాసాల్ని తొలగించటానికి, పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు పెంచడానికి సాంఘిక ఆర్థిక చైతన్యం కలిగించడానికి అవసరమవుతున్నాయి. చదువులు కాబట్టి అందరూ చదువుకోవాలి, కాబట్టే ప్రాథమిక మాధ్యమిక ఉన్నత విద్యలతోపాటు మెడికల్, ఇంజనీరింగ్, టెక్నికల్ కోర్సులు ట్రైనింగులు మొదలైనవి ఎన్నో పెడుతున్నారు. మానసిక జీవితాన్ని సుఖమయం చేయడానికి ఈ విజ్ఞానమంతా వుపయోగపడుతూంది. విశ్వనాథ మెచ్చుకునే కావాలనుకునే వర్ణవ్యవస్థ - కులవృత్తులు విచ్ఛిన్నమైపోయినాయి. ఉత్పత్తి సాధనాలతోనూ ఉత్పత్తి విధానంలోనూ కలుగుతున్న మార్పులు ఉత్పత్తి శక్తుల మధ్య గల సంబంధాలు సామాజిక వ్యవస్థను సమూలంగ మార్చివేస్తున్నాయి. ఈ విషయాలు ఏవీ గమనించకుండా ఆలోచించకుండా రచయిత ప్రాథమిక విద్య అవసరం లేదు. ఆధునిక విద్యావిధానంతో పనిలేదు. కులవృత్తులే కూడు పెడతాయి అంటూ రాయటం తగదు అంటాడు నాగభూషణం.

ఆధునిక విజ్ఞానం వల్ల మానవుడు సాధించుకున్న నిత్యజీవితంలోని ఎన్నో సౌకర్యాలు, నీటికుళాయిలు, విద్యుద్దీపాలు మొదలైనవి కూడ రచయిత తిరస్కారానికి ఎగతాళికి గురి అయ్యాయి. నదుల మీద ఆనకట్టలుకట్టి అధికోత్పత్తి సాధించటం,

కరువు కాటకాల్ని తట్టుకోగలగటం. ఇదంతా ఆలోచించడం ఆయన వరిపైరు ఎక్కువగ పండించటం రైతుల దురాశ అంటాడు రంగారావు. గుండేరు ఆనకట్ట కట్టించాడు. ఊరిచుట్టూ వున్న మెట్టపొలాలన్నీ మాగాణి భూములు అయ్యాయి. మెట్టపొలాలు లేనందున పక్షులకు పాములకు తలదాచుకొనటానికి తావులేక పోయిందని బాధపడతాడు. పురపాలక సంఘం ఏర్పడి కుళాయిలు విద్యుద్దీపాలు పెట్టించారు. ఊరిలో నీటికోసం ప్రజలు పన్నులు కట్టటం తప్పించి ప్రయోజనం అంత లేదంటాడు. పైగా కుళాయినీళ్ళు తాగి మర బియ్యపు అన్నం తినటంవల్ల సుబ్బన్న పేటలో అందరికి జబ్బులు వచ్చాయట. అసలు వరిపైరు అనేది రోగాలు తెచ్చిందంటాడు. "మొత్తానికి వరిపైరు నందు ధనదేవత తాండవించు చుండెను. దురాశ దాని యందు ప్రబలియుండెను. వ్యాధులన్నియు దానియందు సాన్నిహిత్యము ఉండును. నా చిన్ననాడు క్షయయన్న వ్యాధిని నేను వినియెఱుగను. ఇప్పుడెచ్చట జూచినను నా వ్యాదియే ప్రబలియుండెను. ఈ డాక్టరులకు క్షయవ్యాధికి బ్రతిచికిత్స తెలియదు. మర బియ్యముతో బ్రాణము బోవుచున్నది. తినుచున్నవారికి నాయుర్దాయము క్షీణించుచున్నది . . . " అని ధర్మారావు ఆలోచనలు సాగుతాయి (పుట 442)

వైద్యవిజ్ఞానం విషయంలోనూ మన సంప్రదాయం గొప్పది అంటాడు. సుబ్బన్నపేటలో మంగ మెలుకువలు తెలిసిన ప్రసవ వైద్యురాలట. ఆమె మరొక చాకలి మంత్రసాని దగ్గర ఆ సంప్రదాయ విద్య అభ్యసించినదట. ఆమె ఎంత కష్టమైన ప్రసవమైనా 'ఫోర్సెప్స్' మొదలైన సాధనాలు సాయం లేకుండానే ఉపాయంతోనే పనిచేసేదట. గర్భకోశము యొక్క సర్వంకషమైన జ్ఞానం ఆమెకు వుండేదట. అది ఒక విద్య ఆవిద్య చదువుకొనునది కాదు సంప్రదాయము చేత వచ్చునది. సాంప్రదాయమునకు చదువుకొనుటకు దేశములో మహాయుద్ధము ప్రబలి ధనదేవత, అధికారదేవత చదువుకొనుట యొక్క పక్షమున జేరి సంప్రదాయము నోడించెను" (పుట 499) అని రచయిత బాధపడతాడు. సంప్రదాయం ఎంత గొప్ప విద్య అని మొక్కుకున్నప్పటికి దానిముందు ఆధునిక వైద్య విజ్ఞానం కూడ పనికిరాదన్నట్లు చిత్రించడం హాస్యాస్పదమైన విషయం. పూర్వం ఆస్పత్రులు లేనపుడు పల్లెటూళ్ళలో స్త్రీకి ప్రసవం అంటే పునర్జన్మ వంటిది అని భయపడేవారు. ప్రసవ సమయాల్లో మరణాలెక్కువగా ఉండేవి. పల్లెటూళ్ళలో మంత్రసానుల సంప్రదాయ విద్య ప్రసవ సమయంలో ఎందరి స్త్రీల ప్రాణాల్ని కాపాడగలిగేది ? ఒకప్పుడు ఏమాత్రం ఊహించి వుండజాలనంతగ ఈనాడు వైద్యవిజ్ఞానం అభివృద్ధిచెంది వుండటాన్ని ఎవరు కాదనగలరు ? అరుంధతి ప్రసవ సమయంలో ఆ మంగ అంటుందట "నాయనా ! పిల్లయింత బాధపడుచున్నది, గురులింగశాస్త్రిగారు లేకపోయె. ఆయన మంత్రించి పంచపాత్రతో జలమిచ్చినచో వీసమెత్తు బాధలేకుండా బ్రసవించి యుండును. ఆయన చనిపోయిన తరువాత గ్రామములో దిక్కుపోయినది. కొంచెము విభూతి మంత్రించి యిచ్చువాడు లేడు. గాలికి ధూళికి గాపైన వాడు లేడు. ప్రతిదానికి నింగ్లీష్ వేదమైన (పుట 499) మరి సంప్రదాయ పునరుద్ధరణం అంటే మూఢ విశ్వాసాలు పునరుద్ధరణం అని కూడ పాఠకులు గ్రహించకపోతే పొరపడినవారవుతారు.

## 16.5. వేయిపడగలు - స్త్రీ విషయిక దృష్టి :

వితంతు వివాహాలు మొదలైన విషయాల గురించి నవలలోని చర్చలు అభిప్రాయాలు గమనిస్తే ఆ విషయంగా సమకాలీన సామాజిక నైతిక చైతన్యాన్ని పూర్తిగా అడ్డుకట్టి అచైతన్యం వ్యక్తమయి వుండటం స్పష్టమౌతుంది. సంప్రదాయం పేర ఆ విషయాల్లో సంస్కరణల్ని అడ్డుకొంటూవున్న భావాలకే ఇరవై ఒకటవ అధ్యాయంలో సగభాగం అంతా ఉపయోగించబడ్డది. ఆడపిల్లలు, పాఠశాలలకు వెళ్ళి చదువుకోనవసరం లేదు. నోములు వ్రతాలు పండుగలు ఇవీన్నీ ఆడపిల్లలకు విద్య వచ్చు మార్గములే అంటుంది. "శారదా చట్టము వచ్చిన తరువాత నింకను బాతివ్రత్యమేమిటి ? " అని కూడా ఈమె వ్యాఖ్యానిస్తుంది (పుట 5891) ఇంతకంటే ఘోరముగా ఆడవాళ్ళను అవమానించే వ్యాఖ్యానం మరొకటి వుండదేమో ! ఈమె మాటల్ని సమర్థిస్తాడు భర్త. శారదాచట్టం రాకపూర్వం బాల్యవివాహాలు మరి ఎంతమంది పతివ్రతల్ని లేక బాలవిధవల్ని తయారుచేశామో ఈ పండితులే చెప్పాలి. ఇలాంటి వీళ్ళు బాల్య వివాహాల్ని సమర్థించటమే కాదు వితంతు వివాహాలను నిరసించటంలో ఆశ్చర్యం ఏముంది ?

ఆడవాళ్ళను చదువుకోనివ్వకుండ చాదస్తపు మనుషులుగా తయారు చేస్తున్నామేమో మనం అని పశుపతి అంటే, ధర్మారావు "చదువుకొనిన వారికన్న చాకలిమేలట. ఆమె యనిన దానిలోనే యెక్కువ యదార్థమున్నదేమో" అంటాడు (పుట 589) ఇంతకంటే బాధ్యతారహితమైన మాటలుంటాయో పల్లెటూళ్లలో సాధారణంగా ముసలివాళ్ళు, చదువుకోవటం వల్ల కలిగే విజ్ఞానాన్ని ప్రయోజనాన్ని గ్రహించలేనివాళ్ళు. స్త్రీలు చదువుకుంటూ వుంటే ఓర్వలేని వాళ్ళు యధాలాపంగ అనేలాంటి మాటల్ని ధర్మారావు వంటి పండితుడు మాట్లాడుతున్నాడంటే ఇతన్ని కూడ వారి కోవలో చేర్చవలసిందేనా ?

ఇక ఇంగ్లీషు చదువుకున్న స్త్రీలు, వారి ఆధునిక వేషభాషలు అలవాట్లు మహిళా సమాజాలు మొదలయిన వాటిపట్ల రచయితకున్న అభిప్రాయాలన్నీ స్పష్టంగా వ్యక్తమైనాయి. ఈ అన్నింటినీ ఎగతాళి చేయటమే ఆయన పుచ్చుకున్న బాధ్యత. స్త్రీలకు స్వాతంత్ర్యం పనిలేదు. బయటికి వెళ్ళి వాళ్ళు చేసేదేముంది, రాజకీయాలెందుకు, విడాకుల చట్టం ఎందుకు ? స్త్రీకి ఏం కావలయునో పురుషునికి తెలిసినంతగ స్త్రీకి తెలియదు . . . అంటూ చాల చర్చలు చేశాడు.

మహిళా సమాజంలో సంభాషణల్లో ఒకసారి ఒకావిడ అంటుంది. ఇతర దేశాల్లో స్త్రీలు శాసన సభలలో కూడా వున్నారట. ఈ స్త్రీ జన ప్రతినిధులు స్త్రీలకు కావలసిన సౌకర్యాలు చూడగలరు అని . . ." పురుషులకు స్త్రీలు ప్రేమాస్పదురాండ్రు. వీరికి గావలసిన సౌకర్యములన్నియు బురుషులు చేయరా ?" అంటూ మంగమ్మ అన్న ఆవిడ ఆమెను ఎదుర్కొంటుంది. (పుట 654) మంగమ్మ పాత్ర ద్వారా రచయిత తమ అభిప్రాయాలు వ్యక్తం చేశాడు ఇక్కడ. రంగమ్మ అంటుంది విడాకుల చట్టం తీసుకురావలసిన అవసరం వుంది. మహిళామండలి వారు ఈ విషయంగ ఒక తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపాలనుకుంటున్నారని దాన్ని వ్యతిరేకిస్తూ మంగమ్మ స్త్రీ పురుషులిరువురులోను చెడ్డవాళ్ళుంటారు. ఒకరినొకరు బాధించుకొనే వారుంటారు. కాని లోకములో చాలామంది పురుషులు భార్యలను ప్రేమతోనే చూస్తూవున్నారు. 'స్త్రీయందు బురుషునకున్నంత ప్రేమగౌరవాలు పురుషునందు స్త్రీకి లేవు" (పుట 654) అని వాదిస్తుంది. లోకములో ఇంతవరకు జరుగుతూవున్న మార్గమే చాలా బాగుంది. ఎక్కడైనా దోషాలుంటే పరిహరించుకోవచ్చును. కాని మూలచ్ఛేదము చేయరాదు అని కూడా అంటుంది అమె. చాలా బాగున్న మార్గంలో ఇక పరిహరించుకొనవలసినవి ఏముంటాయి ? అయినా ఏదో సంస్కరణలకు దగ్గరగానైనా మాట్లాడుతుంది. మంగమ్మ అనుకుంటే వెంటనే అందుకుంది "నేను విధవా విహములకు విడాకుల చట్టమునకు జివరకు స్త్రీ సమాజములకు గూడ వ్యతిరేకురాలను" అని (పుట 654), స్త్రీ సమాజాలకు కూడానా అని రంగమ్మ ఆశ్చర్యపోతుంది. ఈ సమాజములు ఎవరికి, ధనవంతురాండ్రైన స్త్రీలకే, వారి సుఖాలకు సంతోషాలకు, మరి పేదవారైన స్త్రీల సంగతేమిటి ? అని ఈ మంగమ్మ ప్రశ్నిస్తుంది. చదువు విజ్ఞానం లేని పేద స్త్రీలు తమకు ఏం కావాలో మనం తెలుసుకోగలిగినంతగ వాళ్ళు తెలుసుకోలేరు కాబట్టి, వాళ్ళ మేలును గురించికూడా మనం ఆలోచించవచ్చును అన్న అభిప్రాయం వ్యక్తం చేస్తుంది రంగమ్మ "మనకేమి కావలయునో పురుషునకు తెలిసినంత మనకు తెలియదు, మనకిప్పుడు స్వతంత్రత యెందులకు ? అని వెంటనే మంగమ్మ ప్రతి వ్యాఖ్యానం చేస్తుంది. విద్యావంతులు కానప్పుడు స్త్రీ పురుషుల విజ్ఞానంలో భేదముంటుంది. కాని చదువుకున్న స్త్రీలకు పురుషులకులాగ ఆలోచించే జ్ఞానముంటుంది కదా అని రంగమ్మ అంటే మంగమ్మ చదువుకుంటే మాత్రం జ్ఞానం అందరికీ సమానంగా ఉంటుందని ఎలా అనగలం ? అన్ని ప్రశ్న వేస్తుంది. అయితే పురుషుల కంటే స్త్రీలకు వివేకం తక్కువ అనియా మీ అభిప్రాయమూ ? అని రంగమ్మ మంగమ్మ "మొన్న బెర్నార్డుషా వ్రాసినాడు. స్త్రీలకు స్వాతంత్ర్యము వచ్చి వందయేండ్లయినది. ఒక్క రాజకీయ వేత్రిగాని యొక మత విషయక పరిజ్ఞాత్రి కాని పుట్టలేదు అని (పుట 655) రంగమ్మ - లక్షలాది సంవత్సరాల నుండి పురుషుడు రాజ్యం చేస్తున్నాడు కాబట్టి అనుభవంవల్ల వాళ్ళలో గొప్ప వాళ్ళు పుట్టవచ్చును. కాబట్టి స్త్రీలు కూడ అంతకాలం స్వాతంత్ర్యం అనుభవిస్తే వాళ్ళలో కూడా గొప్పవాళ్ళు పుట్టవచ్చునేమో. మంగమ్మ పుట్టవచ్చును, సరేకాని, స్త్రీలలో కూడా గొప్పవారు పుట్టవలయునని వేయేండ్లు రెండు వేలేండ్లు ప్రయత్నముచేసి స్త్రీలలో మహా వ్యక్తులను బుట్టించవలయునా ? పుట్టి వారేమి చేయుదురు ? గొప్ప రాజకీయవేత్తలైన పురుషులు చేసిన పనియేనా ? కాక లోకమును దలక్రిందులు చేయుదురా ? అంతియేమైనచో నది పురుషులు చేయనే చేయుచున్నారు కదా . . . ! (పుట 655) రచయిత మంగమ్మ చేత

వాదింపచేస్తున్న ఈ తీరు ఈ విషయమూ ప్రత్యేకవ్యాఖ్యానం చేయగలిగినంత యోగ్యత కలివికాదుగాని, స్త్రీ స్వాతంత్ర్యం అన్న విషయం ఈ నవలలో ఇంత దౌర్భాగ్యపు వ్యాఖ్యానానికి" నోచుకున్నదే అని సిగ్గుపడక తప్పదు. ఈ మంగమ్మ ఇంతటితో కూడ ఆగదు. ఆమె పాండిత్య ప్రదర్శనం ఇంకా ఇలా ముందుకు దూసుకుపోతూనే వున్నది - "ఒక మహాకార్యం జరుగుట ప్రధానమా ? అది స్త్రీ చేసెనా యన్న విచారణ ప్రధానమా ? అది స్త్రీ చేసెనా, పురుషుడు చేసెనా యన్న విచారణ ప్రధానమా? స్త్రీలకు స్వాతంత్ర్యమిచ్చిన వేయేండ్లలో నెన్ని దుష్టలము ఉత్పన్నమలగునో పూర్వమున్నట్లుండుట వలన గొన్ని సుగుణములున్నవి. అవి అన్నియు నశించిపోవును గదా ! (పుట 656) స్త్రీకి స్వాతంత్ర్యం యిస్తే ఎన్ని దుష్ఫలితాలో ? కాబట్టి స్త్రీలకు స్వాతంత్ర్యం అవసరం లేదు. పూర్వము వున్నట్లే వుండాలి. అదే సుఖం. ఈ వుపన్యాస తీర్మానం యిది. ఇక రంగమ్మ వుండలేక మరో మాట అంటుంది. స్త్రీ స్వాతంత్ర్యం లేకపోతే సగము జాతి వికాసశూన్యం అవుతూ వున్నట్లే గదా ! సగముజాతి నిర్జీవంగా వున్నది ఈనాడు అని వెంటనే మంగమ్మ "జాతి వికాసమనగానేమి ? అవి మొదట చెప్పుడు. ఎవరో మొన్న పత్రికలో ఈ మాటలు అన్నారు. వాటిని ముక్కున బెట్టుకొని చెప్పుట వలన వచ్చిన నష్టమిది. ఎవరో ఏదో, మాట అనగానే దాని అర్థము ఆలోచన చేయక మాట్లాడుటయేనా (పుట 656) అని రంగమ్మ నోరు మూయించింది. ఇక్కడ మంగమ్మవాదం నెగ్గాలి గనుకు రంగమ్మ ఈ ప్రశ్నకు జవాబు చెప్పలేకపోయింది పాపం.

మరొకసారి వారిమధ్య విధవావివాహాల్ని గురించిన ప్రసక్తి వస్తుంది. భార్యలుపోయిన పురుషులు మరల వివాహం చేసుకుంటున్నారు కదా. స్త్రీలు మాత్రం ఎందుకు చేసుకోకూడదు అని రంగమ్మ అడుగుతుంది మంగమ్మ "పురుషులు చేసుకొనుచుండిరందురు పురుషులు ఎవరు చేసికొనిరి ? రెండవ పెండ్లిండ్లు కాక లక్షమంది యుండిరి. వివాహము లెవరికగుచున్నవి ? ధనవంతులకగును తండ్రి కుమార్తె నెవరికిచ్చుచున్నాడు. వాడు చచ్చినచో దనకూతున కన్నమునకు లోపము లేదని యెవని ననుకొనునో వానికిచ్చుచున్నాడు. బీదవానికిచ్చుచున్నాడా ? (పుట 657) ఇలా సాగిస్తుంది వుపన్యాసం. అడిగిన ప్రశ్న ఒకటి, జవాబు దారివేరు. రెండవపెళ్ళి వాడికి - ముసలి వాడికి పిల్లనివ్వవలసిన పరిస్థితిలో పిల్లమేలు కోరే తండ్రి కనీసం వాడుచస్తే ఆ పిల్ల తినటానికి అయినా లోటులేకుండ వుండాలని చూచుకోవటంలో తప్పేమిటి ? ఇంతకూ బీదవాళ్ళూ అయినా రెండవపెళ్ళి పెండ్లి కొడుకులకు పిల్లను ఎవ్వరూ ఇవ్వటం లేదన్న బాధ వ్యక్తం అవుతూంది కానీ, ఆడపిల్ల సంగతి మాత్రం లేదు. బీదవాళ్ళు కాని ధనవంతులు కాని ఎవరైనాకాని విధవలైన ఆడపిల్లలు కూడా పెళ్ళిళ్ళు చేసుకోవటానికి అనుమతి ఇస్తే వాళ్ళకు తగిన వాళ్ళనో దొరికిన వాళ్ళనో ఎవరినో చేసుకుంటారు కదా. ఇందుకు సూటిగా జవాబు మాత్రం లేదు. ఈ ప్రసక్తి నవలలో మరొకచోట వస్తుంది. విధవ వివాహాలు అవసరం లేదని స్పష్టంగా చెప్పబడింది. ఆ విషయాన్ని సమర్థించడానికి మరలా బోలెడంత తర్కం వుంది.

స్త్రీ పునర్వివాహ సంఘములున్నవి కదా. అందరినీ వుద్ధరించమనండి ఆ సంస్కర్తల్ని వచ్చి అంటూ మంగమ్మ "ప్రతి విషయములోను జగత్తు ధనము వెంట పరుగెత్తుచుండగా గుణము వెంట బరుగెత్తుచున్నదని ప్రతివాదము లెందుకు ? (పుట 658) అని రంగమ్మని ప్రశ్నిస్తుంది. ఇక్కడ రంగమ్మ ప్రతివాదం చేయలేదు. కాని ధనము కలిగిన పురుషులు పునర్వివాహములు చేసుకుంటున్నారు కదా. స్త్రీలు కూడా డబ్బున్నవారు పునర్వివాహాలు చేసుకోవచ్చును కదా అని అడుగుతుంది. జవాబు మార్గం లేదు. జగత్తు ధనము వెంట పోతూవున్న విషయాన్ని ఎవరూ కాదనరు. కాని ఆడపిల్లలు పునర్వివాహాన్ని అంగీకరించటంలతో ఈ విషయం అడ్డురాదుకదా, సమ్మతించటం కనీసపు గుణం కదా, సమ్మతించినపుడు బీదలు కాని ధనవంతులుకాని ఎవరికి తగిన వారివారు కట్టుకొని వాళ్ళ అవస్థలేవో వాళ్ళు పడతారు. అసలు సమ్మతించకపోవటంలో వుద్దేశ్యం ఏమిటి ?

శారదా చట్టమునకు కూడ మీరు వ్యతిరేకమేనా, అని ఒకావిడ ప్రశ్నిస్తుంది. మంగమ్మ "ఎనిమిది తొమ్మిదేండ్లకే తెలివిగల పిల్లకు భర్తయున్న యూహ కలుగుచున్నది. స్త్రీ పురుష సంయోగమును గురించిన భావములు లీలగా గోచరించుచున్నవి. . . (అప్పటికి పసిపిల్లకేమి తెలియును ? అని ఒకావిడ అడ్డుతగిలినప్పటికీ చాలా చిన్నప్పుడే యట్టియూహ కలుగును. ఆ యూహ కలిగినప్పటి నుండి తదూహ యేకపురుష విషయముగా జేయుటకు మన పూర్వులు "అష్టవర్షాద్భవేత్కన్యా" యని

వివాహమప్పుడే చేయమనిరి. పదమూడేండ్లు వచ్చి రజస్వలయైన గాని గార్యము చేయుట లేదు. బాల్య వివాహములలో దప్పేమి ? . . . (పుట 658 - 59) అంటుంది. లాలాలజపతిరాయ్ గారు ఒకచోట రాసినారట - మన దేశములో బాల్య వివాహాలంటే ఇంగ్లండు వారు ఎనిమిదేండ్ల పిల్లలకే గర్భదానం చేస్తామని అనుకుంటారని. వారి దేశంలో వివాహము కార్యము ఒకటి కాబట్టి. "బాల్య వివాహము దోషమన్న భావమచట నుండి పెరిగినది. పదమూడేండ్లకు గార్యము తప్పైనచో తరువాత పెండ్లి చేయుట తప్పగును".

ఎనిమిది తొమ్మిదేండ్ల పిల్లలకే కలిగే వూహలేమిటో విశ్వనాథ గారి మంగమ్మకే తెలియాలి, భారతనారి 'పాతివ్రత్యానికి భంగం కలుగకుండా పసిపిల్లగ వున్నప్పటి నుండి ఆమె వూహలు ఒకే పురుషుని యందు నియక్తం కావటానికట. మన పూర్వులు ఎనిమిదేళ్ళకే పెళ్ళి చేయనవటం. పూర్వులెవరు మన ఏకాలం వారు ? ఎప్పటినుండి 'ఈ మహత్తర ధర్మం" వుపదేశించారు" పాతివ్రత్యం కాపాడుకొనేందుకు ఈ బాల్యవివాహాలు మార్గంగా కనిపెట్టబడ్డాయా ? పురాణాల్లో కావ్యాల్లో కథల్లో వర్ణించిన స్వయం వరాలూ రజస్వలానంతర వివాహాలు గురించి ఈ పూర్వుల అభిప్రాయం ఏమిటి ? వాళ్ళిద్దరూ పతివ్రతలు కాదంటారా ? బాల్యవివాహాలు తప్పు అన్న భావం మనకు పాశ్చాత్యుల నుండి కలిగితే మాత్రం తప్పేమిటి ? ఒకవేళ వాళ్ళ వల్లనే మనం తెలుసుకో గలిగితే మాత్రం తప్పేమిటి ? ఒకవేళ వాళ్ళ వల్లనే మనం తెలుసుకోలేక పోయినప్పటికీ ఆ వివాహాల ఫలితంగా కలుగుతూ వుండిన కష్టనష్టాల పట్ల మన సమాజం ఎంతకాలం కళ్ళు మూసుకోకలిగి వుండేది ? బాల్యవివాహాలు అంత మంచి సంప్రదాయం అయివుంటే రాను రాను అవి సమాజంలో రూపుమాసిపోతూ వుండటం ఎందుకు జరుగుతుంది ? పదమూడేండ్లకు కార్యము చేయుట తప్పైనచో తరువాత పెండ్లి చేయుట తప్పగును. మంగమ్మ యొక్క ఈ తర్కం ఏమిటో దీనిఅర్థం ఏమిటో పాఠకులు అర్థం చేసుకోవటం కష్టం. ఇంకా చెబుతుంది. ఈమె స్త్రీ నిగ్రహం, స్త్రీకి కోరిక ఏం నిష్ఠం కావాలని చెప్పటలో పారమార్థిక దృష్టి ఎక్కువగా ఉన్నది. నిగ్రహం మోక్షానికి సాధనం . . .

ఇంతకాలం బాల్యవివాహాలు దండిగా జరిగినాయి. ఇప్పటికి ఏం నష్టం వచ్చింది ? ఇది ధర్మారావు ప్రశ్న. మరొకసారి బాల్యవివాహాల పట్ల వధూవరులకు వయసులో ఎక్కువ తేడాలు వచ్చి స్త్రీ యౌవనంలో వుండగానే పురుషుడు ముసలివాడై చనిపోవడం, జీవితంలో తరువాత ఆమె ప్రవర్తన బాగుండకపోవటం జరగవచ్చును కదా అని ఒకరు అడుగుతారు. ధర్మారావు పురుషులకు యౌవన మఱువది యేండ్లు వచ్చుదాక నుండును. స్త్రీలు నలుబది యేండ్లకు ముసలివాండ్రగుదురు. అయినా సమాన వయస్కులైన భార్యాభర్తల్లో భర్తలు చనిపోయిన వారెంతమందిలేరు ? . . ." "విధవలు పెండ్లియేల చేసికొనరాదు ? భార్య చనిపోయిన పురుషుడేల చేసికొనవచ్చును ? మరొకరు ప్రశ్నిస్తారు. ధర్మారావు అది చాలా పెద్ద విషయము స్త్రీ పురుషుల సృష్టిలో సంఘము నందలి వారిస్థితిలో వారి కామ ప్రవృత్తిలో భేదమున్నది. ఆ భేదము వలనట్లు జరుగుచున్నది". ఈ భేదాలు కల్పితాలు కావా ? అని ప్రశ్నిస్తారు మరొకరు. ధర్మారావు స్త్రీ పురుషుల ప్రకృతులలోనే చాల బేధం ఉంది. పురుషుడు తృప్తిపడే మార్గం వేరు. స్త్రీది వేరు. పురుషుడు గర్భం ధరించడు. స్త్రీ ధరిస్తుంది. పురుషుడు కామాన్ని చంపుకోలేడు స్త్రీ చంపుకుంటుంది . . . సమాధానం ఈ రీతిగా సాగుతుంది(పుట 979) సామాజిక నైతికతకు, విలువలకు జీవశాస్త్రాన్ని ఆధారంగా గ్రహించి వాదించడం అశాస్త్రీయం.

లోకంలో స్త్రీలందరూ, విధవా వివాహాలు చేసుకున్న స్త్రీలూ వయసు వున్నంతకాలమూ సంతానం కంటూ వుంటే జగత్తులో చోటు చాలదటః ధర్మారావు వాదం. అందువల్ల కనీసం బాల విధవలైనా వివాహాలు చేసుకొనకుండా వుంటే ప్రపంచాన్ని నిలబెట్టిన వారవుతారు. మరి ః (కుటుంబ సంక్షేమానికి జగత్ సంక్షేమానికి ఇదొక గొప్ప మార్గం కనిపెట్టబడింది. ధర్మారావుచేత మానవ సృష్టి అంతా ఒక మహా ఆర్థికశాస్త్రం అంటూ సప్లై అండ్ డిమాండ్ సూత్రానికి ఇది అతీతమైనదట) ఆర్థిక శాస్త్రంలోనికి కూడ లఘించి ఆ శాస్త్రమూ వల్లిస్తాడు ధర్మారావు. అయితే కామం చంపుకోలేరు కాబట్టి పురుషులు మాత్రం ఎన్ని వివాహాలు అయినా చేసికొని సంతానాన్ని వుత్పత్తి చేయవచ్చునంటాడు. అంతేకాదు దేశంలో మగపిల్లలకు కరువు వచ్చినదట.

విధవలకు కూడా పెళ్ళిళ్ళు కావాలంటే అసలు పురుషులు దొరకటమే కష్టమైపోతుందట. కాబట్టి విధవలు పెళ్ళి చేసుకొనరాదు . . ." ఇది లోకధర్మము కదా ! ఇది ఒక క్రీడా విశేషము. నీ వంతు వచ్చినది. గుటి తప్పినది. మరొకరి వంతు గమనించవలెను. ఇది ధర్మము కదా . . ." ధర్మారావుగారి ఈ సమాధానమంతా లౌకిక సమాధానమట. వేద శాస్త్రాల్ని అంగీకరించని వాళ్ళకు ఈ సమాధానం చెబుతున్నారట. వైదికమైన సమాధానం ఏమిటిని అడిగితే "స్మృతి నిషేధించుచున్నది గనుక" (పుట 980). స్మృతిని ఒప్పుకొనుము అంటే అదిగో పైన లౌకిక సమాధానమున్నది అంటాడు. ఇలాంటి పండితుల కళ్ళు తెరిపించడానికే వీరేశలింగం పంతులుగారు విధవా వివాహాలు స్మృతులు శాస్త్రాలు అంటూ వాటి ప్రసక్తే తెచ్చి సంప్రదాయవాదులు పాండిత్యాన్ని ప్రదర్శిస్తూ వుంటారు.

ఇతర దేశాలలో భర్తృహీనులైన స్త్రీలు చక్కగా వివాహాలు చేసుకుంటున్నారు కదా. అక్కడ నీ ధర్మశాస్త్రాలు ఎందుకులేవు? అని ఒకరు ప్రశ్నిస్తారు. "అక్కడ మహర్షులు లేరు గనుక, వారు చక్కగా సృష్టియొక్క శాంతిని, ప్రపంచము యొక్క సుస్థితిని గురించి యూహించలేదు గనుక . . . " ధర్మారావు (పుట 981) అసలు అక్కడ కూడ వివాహాలు కాని స్త్రీలు ఎంతోమంది వున్నారట. వాళ్ళు తండ్రుల్ని ఎదిరించి స్వతంత్రించి పెళ్ళిళ్ల చేసుకొని భర్తలచేత పరిత్యజింపబడుతున్నారట . . అయినా ఇదంతా ఎందుకు అంటూ. ఆయన పూర్వం ఇంత విచ్చలవిడిగ చనిపోలేదు. జనం, ఇప్పుడు చిన్న వయస్సులోనే చాలామంది చనిపోతూ వున్నారు. అందుకు కారణాలు అన్వేషించి ప్రతిక్రియలు చేస్తే బాల విధవల సంఖ్య తక్కువ అవుతుంది అంటూ తీర్మానిస్తాడు.

కాబట్టి బాల్య వివాహాల్లో తప్పులేదు. బాలవిధవల పెళ్ళి చేసుకోనవసరం లేదు. అసలు మగవాళ్ళు ఈనాడు అంత తొందరగా ఎందుకు చనిపోతున్నారో కనుక్కొని ఆ సంగతి చూడాలి. దాంతో ఈ సమస్యలు తీరిపోయి అంతా నవ్యమైపోతుంది. పాశ్చాత్యదేశాల వారికి మన మహర్షుల వంటివారు వారి ధర్మశాస్త్రాలు లేవు గనుక వాళ్ళు బాల్యవివాహాలు చేసుకొనక, విధవా వివాహాల్ని నిషేదించుకొనలేక ఎంత పతనమై ఎన్ని కష్టాలు పడుతున్నారో కదా !

ఈనాడు గుడ్డిగవ్వకు విలువచేయని ఈ అభిప్రాయాలన్నీ సమర్థించటంలో సంప్రదాయం పేరుతో వాటిని పునరుద్ధరించాలన్న రచయిత ప్రయత్నంలో ఆయన పాండిత్యం, కష్టం అన్నీ నష్టమైపోయాయి. ఇలాంటి దాతలు ఎందరు ఎన్ని రాసినప్పటికీ సమాజ పురోగమనాన్ని స్త్రీజాతి పురోగమనాన్ని అడ్డుకోలేకపోయారు.

ఇంతటితో కూడ ఆ విషయాల మీద ఈవాద ప్రహసనం ముగియదు. నవలలో మరల మరల ఆ వాదం రావటం, ప్రతిపక్షాన్ని ధర్మారావు తమ పాండిత్య బలంతో చిత్తుగ ఓడించటం జరుగుతూ వుంటుంది. అంతేకాదు, తాము సమర్థించే విషయాల్ని వాదరూపంలోనే కాక ఆచరణ రూపంలో కూడ నిరూపించడానికున్నట్లు నవలలో కథాంశం ఒకటి సృజించాడు రచయిత. ధర్మారావు భార్య అరుంధతి చనిపోతుంది. అతన్ని స్నేహితుడు పశుపతి కూతురు చిన్నఅరుంధతీ పన్నెండేళ్ళపిల్ల. ఆ అమ్మాయి నలభై ఏండ్ల ధర్మారావును ప్రేమించి అతన్ని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోనని భీష్మించుకుని కూర్చుంటుంది. ఉపవాసాలు చేస్తుంది. పశుపతి చాల బాధపడతాడు. కోపగించుకుంటాడు. ధర్మారావును అపార్థం చేసుకుంటాడు. కొంత ఏహ్యాభావం కూడ కలుగుతుంది. అతనికి పన్నెండేళ్ళ పిల్లనిచ్చి పెండ్లి చేయడానికి ససేమిరా ఒప్పుకోడు. కాని ఆఖరికి అలాంటి వాడు కూడ చాలా పశ్చాత్తాపపడిపోయి ధర్మారావుపట్ల ఆ అమ్మాయి ప్రేమను గుర్తించి అతనికిచ్చి వివాహం చేయటానికి చాల సంతోషంగా ముందుకు వస్తాడు. అతడు అంటాడు ధర్మారావుతో "మీ యిద్దరి మధ్యనున్న వయసు తారతమ్యము మాత్రమే చూచితినిగాని, తక్కిన మహావిషయములు చూడలేకపోతిని. అధునాతన ప్రపంచ భావములచేత మోసగించబడినాను. ప్రేమకు వయోభేదము ప్రదానమైనది కాదు. ధనము సద్గుణము సౌందర్యము కులము, విద్య, వయస్సు మొదలైన వెన్నియో దానికి హేతువులు. అందులో నొకటియైన వయస్సున కనవసరమైన ప్రాధాన్యమిచ్చి నేను లోకముతోబాటు వంచింపబడినాను ... (పుట 1010) నిజమే ప్రేమ తకలగడానికి హేతువులు చాల వుంటాయి. వయసు మాత్రమే కారణం కాదు. కాని వయసు

ప్రధానమైంది కాదంటూ పన్నెండేండ్ల పిల్లకు నలభై ఏళ్ళ పురుషునికి మధ్య వున్న వయోభేదం కూడ వాళ్ళ ప్రేమకు ప్రధానమైన ఆటంకం కాదంటూ చిత్రించటం సబబా ? లోకంలో ఇలాంటి ప్రేమలు సాధారణమా ?

వారి ప్రేమను సమర్థించడానికి మరొక అలౌకికతను చేర్చిపెట్టాడు. దానికి రచయిత ధర్మారావు మరణించిన భార్య అరుంధతి ఆత్మ వచ్చి ఈ చిన్న అరుంధతిలో ఒదిగినదట. ఆ పతివ్రత భర్తను వదలి వుండలేక ఈ అరుంధతి రూపంలో వచ్చిందట ! ఈ చిన్న అరుంధతి కూడ "నేనెవరిని ? మీరు నన్ను గుర్తించలేదా ?" అని అడుగుతుంది ధర్మారావును. అతడు ఆమెను గుర్తించి స్వీకరించాడు.

వేయిపడగలు - తిరోగమన దృష్టి :

రచయిత సమకాలీన సమాజంలోని అవినీతి, ధనదాహం పట్ల చాల సందర్భాల్లో బాధను వ్యక్తం చేశాడు. ఆ పరిస్థితుల్ని గర్హించాడు. అది సహజమే. ఫ్యూడల్ దశ నుండి పెట్టుబడిదారీ దశలో ప్రవేశించిన సమాజం యొక్క లక్షణాలు అవన్నీ దోపిడీకి అవినీతికి పట్టం కడుతూన్న వ్యవస్థయింది. అన్ని విధాల వ్యాపారమయమైపోయిన వ్యవస్థ. డబ్బు విలువ ముందు నైతిక విలువలన్ని కొరగానివి అయిపోయిన పరిస్థితి ఏర్పడింది. ఈ పరిస్థితుల్నీ పరిహరించుకొని ముందుకు సాగవలసివుందన్న చైతన్యాన్ని పాఠకులకు ఇవ్వాల్సివుంది రచయితలు.

తాలుకా బోర్డు ప్రెసిడెంటు రామేశ్వరము అవినీతికి పెట్టింది పేరు. ఉపాధ్యాయుల్ని గుమస్తాల్ని పీడించి డబ్బు గుంజటం, కాంట్రాక్టుల మీద డబ్బు తినటం అతనికి మామూలయిపోయింది. ఒక వర్గం తరపున దొంగనోట్ల ముద్రణకు కూడ వెనుదీయలేదు. పట్టుబడ్డారు. ఆఖరికి అందరూ రామేశ్వరముతో వున్న మంగమ్మ లౌక్యంలో అతన్ని మించిపోయిన మనిషి. డబ్బులు ఆస్తులు సంపాదించుకోవటంలో ఆమె అచ్చంగ ఈ వ్యవస్థ తాలూకు మనిషి అయిపోయింది.

ఈ పరిస్థితులకు కారణభూతమైన వ్యవస్థ విధానాన్ని గమనించకుండ, వ్యక్తులకు ధనదాహం ప్రబలిందని నిందించి ప్రయోజనం లేదు. అలాగే రైతులు డబ్బు మీద వ్యామోహంచేత ఇతర పంటలన్నీ మానవేసి వరిపైరును పండిస్తున్నారని బ్రాహ్మణులు ధనదేవతను అధికారదేవతను పూజిస్తున్నారు, బ్రాహ్మణ్యం నిలవటంలేదు. మతధర్మాలు నిలుపుకోవటం పట్ల శ్రద్ధలేదు. కట్నాలు పుచ్చుకోకుండ కొడుకులకు పెళ్ళిళ్ళు చేయుటలేదూ అంటూ వాళ్ళను నిందించటం వల్ల కాని ప్రయోజనం లేదని బ్రాహ్మణులు, రైతులు మాత్రమేకాదు, ధనానికి ప్రాముఖ్యం యిస్తూవున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ లక్షణాలే అవి. సమాజంలో ఒక భాగమైన వీళ్ళు అందరూ పయనించే మార్గంలోనే పయనిస్తున్నారు. మనం వ్యవస్థ విధానాన్ని సమూలంగ మార్చుకోగలిగినప్పుడు సమాజం ఈ పరిస్థితుల వూబిలో నుండి బయటపడే మార్గం లభ్యమవుతుంది.

అలాకాకుండా, సమాజం పాడైపోయిందన్న దానికి కారణాల్ని ఫ్యూడల్ దృక్పథం నుండి చూస్తూ ఆ వర్ణవ్యవస్థను నాశనం చేసుకుంటున్నాం కాబట్టి మన సమాజానికి ఈ తిప్పలొచ్చాయనీ. కాబట్టి ఆ వ్యవస్థను పునరుద్ధరించుకోవటమే కర్తవ్యం అనీ బోధించటం, అది జరగకపోతే ఈ సమాజం గతి ఇంతేనని అనిపించటం హాస్యాస్పదం.

ఈ వ్యవస్థ యొక్క అవినీతి గర్హింపబడటంతోపాటు పురపాలక సంఘం ఎన్నికలు, ప్రజాప్రతినిధులు ఏర్పడటం మొదలయిన ప్రజాస్వామ్య లక్షణాలు కూడ రచయిత విమర్శకు అయిష్టతకు గురిఅయినాయి. సమకాలీన సమాజంలో ఆర్థిక వ్యవస్థ యొక్క మార్పులతోపాటు రాజకీయంలో జీవిత విధానంలో అలవాట్లలో కూడ మార్పులు రావటం సహజమైన విషయం. వాటిని ఎవరూ తిరస్కరించలేరు. జమిందారీపాలన స్థానే మెల్లగ ప్రజాపాలనకు అవకాశాలు కలిగాయి. ఫ్యూడల్ దృక్పథం నుండి ఈ విషయాల్ని విమర్శిస్తూ "జమిందారు ప్రభువువలెగాక పెద్ద రచయితవలె భాసించెను. ప్రతి వ్యక్తియు స్వతంత్రుడును. హక్కుదారుడుగా గనబడెను. జనము సంతోషించిరి. తమకు తామే పాలకులమను కొనిరి. తమ మేలు కీళ్ళకు దామె కర్తలమనుకొనిరి . . . (పుట 263) అంటారు రచయిత. పూర్వం జమిందారును ఆశ్రయించి బ్రతుకుతూ వున్న జనం ఈనాడు

ఆయన సొమ్ము ఏమి ముట్టక దరిద్రులవలె వున్నారట ! అయితే వాళ్ళకు కలిగిన మేలొకటి అది వాళ్ళకు స్వాతంత్ర్యము రావటం అంటూ ఎగతాళి చేస్తాడు. పూర్వము గ్రామములోని ప్రతిచీమయు జమిందారును ఆశ్రయించి యుండెను. ఇప్పుడు ప్రతి చీమయు స్వతంత్రము, వ్యక్తి వికాసము, జాతి వికాసమునకు హేతువనుట నిర్వివాదాంశము గదా !" అని ప్రజలు ప్రభువుల్ని ఆశ్రయించి బ్రతుకుతూ వాళ్ళఅధికారాన్ని నిలుపుతూ వుండటమే వాళ్ళకు సుఖదాయమన్న ఫ్యూడల్ దృక్పథం యిది. ఆ పరిస్థితులు మారిపోయి, ప్రజలు కష్టంగాని నష్టం కాని స్వతంత్రంగా వ్యవహరించటం అన్న ది రచయిత పరిహాసానికి గురిఅవుతూ వుంది. రంగారావు జమిందారు అయ్యాక ఆయన సొమ్ము ప్రజలకు ముట్టటం లేదన్నది ఇక్కడ సందర్భం. కృష్ణమనాయిని పద్దతిలో దానధర్మాలు చేయకపోయినా, రంగారావు చదువుకున్నవాడు. సమాజంలో వస్తూన్న మార్పుల్ని గమనించినవాడు కాబట్టి జమిందారీ పాలన స్థానే పంచాయితీపాలన ప్రారంభం కావటాన్ని అడ్డుకోలేదు. సరికదా అందుకు దోహదం చేశాడు. అతని తండ్రి కృష్ణమనాయుడు అడ్డుపెట్టిన హైస్కూలు స్థాపన ఇతని హయాంలో నెరవేరింది. కాలేజీ కూడ పెట్టించాడు. పురపాలక సంఘం ఏర్పాటు కావించాడు. సుబ్బన్న పేటకు రైలుమార్గం వేయించాడు. గుండేరుకు ఆనకట్ట కట్టించాడు. ఇవన్నీ ప్రజలకు ఉపయోగించే పనులు కావా ? అతడు వ్యక్తిగతంగా ఎలాంటి వాడైనా ప్రజలకు మేలు కలిగే పనులే చేయించాడు. ప్రజలు తమ జమిందార్ల పాలనను చిరకాలం ఆమోదించి తమ చెప్పుచేతల్లో పడివుండాలని అతడు కోరుకోలేదు. ఈ విషయాలన్ని కూడ ప్రజలకు చేటుకొని తెచ్చినవన్నట్లుగ చిత్రించడం అవాస్తవిక దృక్పధాన్ని తెలుపుతుంది.

ఈ అభ్యుదయకరమైన పనులే సుబ్బన్నపేటకు అనుభవాల్ని కలుగజేశాయని చిత్రిస్తూ అవన్నీ రంగాచారి కలగని పురపాలక సంఘం భవనం ముందు ఒక వేపమండ, ఛైర్మన్ ఇంటిముందు ఒక వేపమండ, జమిందారీ కోటముందు ఒక వేపమండ వుంచి వారి వినాశాన్ని సూచించిందని రాయటం మరీ హస్యాస్పదమైన విషయం. అసలు సుబ్బన్న పేటకు పునాది వేసిన బ్రాహ్మణుడు ఆవూరు మూడు వందల సంవత్సరాల వరకు వుంటుందని నిర్ణయం చేశాడట. ఈ విషయం నవల ప్రారంభంలో చెప్పబడింది. అలాంటప్పుడు ఆవూరి వినాశానికి ప్రస్తుతం రచయిత పేర్కొన్న మార్పులన్నీ కేవలం నిమిత్త మాత్రాలే కదా ? కాబట్టి ఈ మార్పులే వూరికి చేటు తెచ్చాయని నిందించటం ఎందుకు ?

జమిందారీ పాలన - వర్ణవ్యవస్థ యొక్క ప్రాధాన్యం తగ్గిపోయి ప్రజాపాలనకు దారి ఏర్పడుతూ వుండటం సంప్రదాయాలను నచ్చలేదు. ఆ కారణంగా ఇలాంటి అవాస్తవిక చిత్రికలు చేస్తూ ఆ మార్పులు పనికిరానివి. చేటుతెచ్చేవి అంటూ వాటిని అడ్డుకోవటానికి ప్రయత్నించారు. సమాజంలో వచ్చే పరిణామాల్ని అడ్డుకోవటానికి ప్రయత్నించారు. సమాజంలో వచ్చే పరిణామాల్ని అడ్డుకోవటానికి స్వార్థపర వర్గాలు ప్రయత్నించటం అనేది చరిత్రలో చిరకాలంగా జరుగుతూ వస్తూన్న విషయమే. ఆనాడు సమాజం ఫ్యూడల్‌దశ నుండి బూర్జువా దశకు మారుతూ వుండటాన్ని ఫ్యూడల్ వర్గం అడ్డుకోవటానికి ప్రయత్నించగా ఈనాడుపెట్టుబడిదారీ వ్యవస్థ సోషలిస్టు వ్యవస్థవైపు పయనించటానికి పెట్టుబడిదారీవర్గం రకరకాలుగా అడ్డుకోవటానికి ప్రయత్నిస్తున్న వాస్తవాన్ని ఎవరు కాదనగలరు ? అయితే ఎవరుకాని ఎంతకాలం ఎంతగా ప్రయత్నించినప్పటికి సామాజిక పరిణామాల్ని అడ్డుకొట్టలేరన్నది చారిత్రక వాస్తవం.

ఈ సందర్భంలో డా॥ రోమిలా థాపర్ చెప్పిన విషయం గమనించవచ్చును. "పురోగతిని సాధించటానికి అనేక సమస్యలను పరిష్కరించాలి. పారిశ్రామిక సమాజంతో పోలిస్తే, తత్పూర్వ సమాజం స్వార్థరహితంగా, ప్రశాంతంగా, దాననశీలమైనదిగా కన్పిస్తుంది. అంటే ఆధ్యాత్మిక విలువలంటూ మనం ప్రశంసించే గుణాలన్నీ అందులో కనిపిస్తాయి. చరిత్రలో అనేక సాంకేతిక పరిణామాలు జరిగినాయి కాని పారిశ్రామీకరణకు మూలమైన సాంకేతిక విజ్ఞానం అపూర్వం, గుణంలో భిన్నమైనది. దీనితో సమాజంలో తీవ్రము విస్తృతము స్వయంబోధితమునైన నిరంతర పరివర్తన ప్రారంభమై మౌలికమైన విలువలతో సహా సాంఘిక పరివర్తనం జరుగుతూ వుంది. తత్సంబంధమైన సమస్యలను ఎదిరించక మనవి పారలౌకిక

విలువలంటూ చరిత్రలో తలదాచుకొనడం కేవలం ఆత్మవంచన. గతాన్నే వాస్తవిక దృష్టితో అర్థం చేసుకొని ప్రవర్తించడంవల్ల సాంఘిక పరివర్తనా క్రమాన్ని సులభం చేసిన వారమవుతాము.

చాతుర్వర్ణ వ్యవస్థ విశిష్టమైనదని నిరూపించటానికి రచయిత తమ పాండిత్యం, మహాబలం, ఉక్తిచాతుర్యం యుక్తి ప్రయుక్తులు రచనా నైపుణ్యం అన్నీ వినియోగించాడు. గతించిన ఆ వ్యవస్థ ఈ ఆధునిక యుగంలో పునఃప్రతిష్టింపబడాలనుకోవటం వ్యర్థమయింది. ఈ నవలలో ఆర్షధర్మం, ప్రాచీన సాంప్రదాయం అంటూ వర్ణవ్యవస్థను ఫ్యూడల్ సంస్కృతిని (ఆయన ప్రశంసించిన ఇవి కూడా జమిందారీ వ్యవస్థ నాటివి) బుద్ధిపూర్వకంగా అతిశయోక్తులతో సహా కొండెక్కించటంతో ఆయన పాతదంతా శ్రేష్టమైందంటూ ప్రశంసించటంలో ఆధునికమైందంతా పనికిరానిదంటూ నిరసించటంలో రచయిత సంయమనం కోల్పోయాడు అనిపిస్తుంది. ఆయన చేసిన ఈ పని ప్రగతిశీల దృక్పథం కలవారు మన సంప్రదాయంలో గుణాలు మంచి విలువలు ఏమైనా వుంటే వాటిని కూడా గుర్తించకుండ సాంప్రదాయం అంటే వెగటు చెందేందుకు మార్గం చూపించింది. పాత వ్యవస్థ యొక్క ఆచారాలు కొంత అయినా సంస్కరింపబడితేనే ఈనాడు పనికి రాగలవు అన్న కనీసపు సంస్కరణ దృష్టి కూడ లేకపోవటం దురదృష్టం. ఉన్నటువంటి రచయితలు విశ్వనాథ కంటె పూర్వులు అయినా మన ప్రాచీన వ్యవస్థ, మతం, ధర్మం మీద ఎంతో గౌరవం వున్న వారైనా వాటిని యథాతథంగా అంగీకరించలేదు. వాటితో కాలం జరిగే కొలది వచ్చిన మార్పుల్ని కాలదోషానికి గురియైన విషయాల్ని గురించి వాస్తవికతా దృష్టితో ఆలోచించారు, విమర్శించారు. విశ్లేషించి చర్చకు అవకాశం ఇచ్చారు. సంస్కరణల్ని అభిలషించారు. అంతేకాని చూడలేదు. మానవ జీవితాలకు మతాన్ని దేవుణ్ని కర్మసిద్ధాంతాల్ని జన్మ సిద్ధాంతాల్ని వర్ణ వ్యవస్థను ముడివేసి మానవ ప్రకృతిని చైతన్యాన్ని జడాత్మకం కావించేవి, అడుగు ముందుకు వేయనివ్వనివి విశ్వనాథ సాహిత్య భావాలు.

ఒక ప్రత్యేక సామాజిక దశలో సృజింపబడ్డ సాహిత్యం వెదజల్లే భావాలు, ఆలోచనలు ఆ సమాజం యొక్క మార్పులకు రావలసిన మార్పులకు అభ్యుదయకరమైన మార్పులకు దోహదం చేయజాలనివి అయితే లేదా ఆ మార్పుల్ని అడ్డుకునే స్వభావం కలిగిన భావాలు అయితే ఆ సాహిత్యపు విలువ ఏమిటో కాలమే నిర్ణయిస్తుంది. అభివృద్ధికరమైన దిశలో మారుతూన్న సమాజానికి అవసరమైన భావజాలాన్ని అందించలేని లేదా ఆ అభ్యుదయ భావాలకు ప్రోత్సాహం, ప్రేరణ ఇవ్వజాలని రచనలు సాహిత్యంలో ఉన్నతమైన స్థానం పొందలేవు. పాండిత్యము, శిల్పం సృజనాత్మకత మొదలైన గుణాలు ఎన్ని అయినా ఆ రచనల్లో గొప్పగా వుండవచ్చుగాక ! అవి సమాజాన్ని తిరోగమన పథం పట్టించాలని ప్రయత్నించేవి అయితే మాత్రం ఆ రచనల విలువ ఏమిటో నిర్ణయించటం కష్టమేమీ కాదు అవి వెనుకటి యుగాల్లో వుండవలసిన రచనలే అవుతాయి. సమాజానికి సరియైనదిశలో చైతన్యాన్ని ఇవ్వలేని సాహిత్యం కేవలం అలంకారప్రాయమైన సాహిత్యమే అవుతుంది. గొప్ప రచయితలందరూ సమాజ శ్రేయం సాహిత్యానికి లక్ష్యం అని చెప్పినప్పటికీ వారి సామాజిక దృక్పథం ఏమిటో గమనించాల్సి వుంటుంది విమర్శకులు.

## 1త6.6. వేయిపడగలు - నామౌచిత్యము :

వేయిపడగలన్నది బహుముఖాలుగా విస్తరించిన భారతీయ ధర్మాన్ని సూచించే ప్రతీకానామం. ఈ కావ్యంలో సుబ్బన్నపేట భారతదేశానికి లక్ష్యభూతమైన గ్రామం. వేయిముఖాలుగా ధర్మం పాటించబడే భారతదేశము సుబ్బన్నపేటగా ప్రస్తావించబడింది. రామేశ్వరశాస్త్రి బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కన్యల్ని వివాహం చేసుకోవడం చాతుర్వర్ణ విషయం. అరుంధతీ, ధర్మారావులు భారతీయ దాంపత్య ధర్మానికి ప్రతీకలు. గణాచారి కాలప్రతీక. గిరిక భక్తి ప్రతీక. వేయిపడగల సుబ్రహ్మణ్యస్వామి ధర్మప్రతీక. "సుబ్బన్నపేట యొక్క గ్రామాధికారి నాలుగు పడగల పామును చూస్తాడు. ఇది చతుర్వర్ణ ధర్మము, అరుంధతికి రెండు పడగలు కనిపిస్తాయి. అది దాంపత్య ధర్మము. చివరికి ఒకే పడగ కనిపిస్తుంది. అది అంతా కలిసి యేకరూపమైన ధర్మము. ఆ విషయం జాగ్రత్తగా చదివే పాఠకుడికి కావ్యం మొత్తం మీద తెలుస్తుంది" అన్న సూచనాప్రాయమైన కవిమాటలు ఆయా సందర్భాల్లో కనిపించిన పఠనం ప్రాముఖ్యాన్నీ చెపుతున్నాయి. అందుకే నవల "వేయిపడగల పామువిప్పారు కొని వచ్చి"

అని ప్రారంభించారు రచయిత. అలా వేయిపడగలతో ఉన్న స్వామి క్రమక్రమంగా రెండు పడగలతో నవలాంతంలో మిగిలిపోయాడని చిత్రితం. "స్వామి రెండు పడగలతో మాత్రమే దేవాలయమున నున్నట్లు తోచెను మిగిలిన తొమ్మిది వందల తొంబది యెనిమిది పడగలు గ్రామము మీదకి పోయెను కాబోలు" అన్నమాటలు ఆధునికత విజృంభించిన కారణంగా దేశంలో వైదిక సంస్కృతి వైశిష్ట్యం క్షీణించిన పరిస్థితిని సూచిస్తుండగా మిగిలిన రెండు పడగలు ఎన్ని ఆటంకాలెదురయినా నశించిపోని దాంపత్యధర్మాన్ని సూచిస్తున్నాయి. ఈ భావాన్నే నవలాంతంలో "ఇది నా జాతిశక్తి నాదృష్టము. నీవు మిగిలితివి అని ధర్మారావు మాటల్లో విశ్వనాథ సూచించారు.

ఈ విధంగా కథావస్తువుకు, కావ్యనామంతో అనుసంధానం కనిపిస్తుంది. నవలకు వేయిపడగలు అన్న నామం కవి ఔచితీవంతంగా పెట్టినట్టు నవలలో ప్రత్యంశాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది.

## 16.7. ఆకళింపు ప్రశ్నలు :

1. నవలా రచయిత విశ్వనాథ ప్రస్థానాన్ని వివరించండి
2. విశ్వనాథ వేయిపడగలు నవల వైశిష్ట్యాన్ని వివరించండి
3. విశ్వనాథ వేయిపడగల నవలలో వ్యక్తమైన సంప్రదాయ, సనాతన దృష్టులను వివేచించండి.
4. వేయిపడగలు నవలా ఆధారంగా విశ్వనాథ దృష్టిని వివరించండి.
5. విశ్వనాథ వేయిపడగల నవలలో చిత్రితమైన దాంపత్యధర్మ ప్రస్తావకును వివరించండి.
6. విశ్వనాథ వేయిపడగలు నవల నామౌచిత్యాన్ని విశదీకరించండి.
7. ప్రాచీన సంప్రదాయ పునరుద్ధరణే వేయిపడగల నవల లక్ష్యం - వివరించండి.
8. స్త్రీ విషయంగా వేయిపడగలు నవలలో విశ్వనాథ వ్యక్తం చేసిన భావాలను పరిచయం చెయ్యండి.

## 16.8. సంప్రదించవలసిన గ్రంథాలు :


1. విశ్వనాథ సత్యనారాయణ - వేయిపడగల నవల
2. విశ్వనాథ నవలలు - స్త్రీ మనోవైచిత్ర - డా॥ పి. శరపతి
3. వేయిపడగలు - విశ్వనాథ విశ్లేషణాత్మక విమర్శ - డా॥ గంగప్ప, 1987
4. ప్రతిభాలహరి - యువభారతి ప్రచురణలు, 1974
5. విశ్వనాథ నవలలో ముఖ్య స్త్రీపాత్ర చిత్ర - కె. శ్యామలాదేవి, 1985
6. తెలుగునవలల్లో సామాజిక చైతన్యం - డా॥ పి. సంజీవమ్మ
7. తెలుగు నవలల్లో కుటుంబ జీవిత చిత్రంబు - ఆనందలక్ష్మి, 1979.


**- డా॥ పి. కుసుమ కుమారి**

**పాఠం - 17.1**

# శశిరేఖ

**లక్ష్యం :**

చలం నవల శశిరేఖను పరిచేయడం. శశిరేఖ పాత్ర ద్వారా సమాజంలోని స్త్రీల సమస్యలను, తద్వారా ఆనాటి సామాజిక స్థితిగతులను తెలియజేయడం.

స్త్రీలు జనాభాలో సగభాగం. మాతృస్థానంలోనూ, కుటుంబాన్ని నిర్వహించే బాధ్యతాయుతమైన స్థానంలోనూ వారు ఉండటంవల్ల సంఘంలో వారి పాత్ర ఎంతో కీలకమయింది. వారి ప్రభావం సంఘం మీద ఎక్కువగానే గోచరిస్తుంది. స్త్రీల జీవితాలు ఏ ఒడిదుడుకులు లేకుండా సవ్యంగా సాగినపుడే సాంఘిక సమతౌల్యం సాంఘిక జీవన సమగ్ర వికాసం సుసాధ్యం. ఇందుకోసం స్త్రీలను వారి సమస్యలను సక్రమంగా అర్థం చేసుకోవడం అవసరం. చలం గారి నవలలు అందుకు బాగా తోడ్పడతాయి.

**పాఠ్య నిర్మాణక్రమం :**

- **17.1.1.** చలం సంగ్రహ పరిచయం
- **17.1.2.** శశిరేఖ
  - ఎ) శశిరేఖ ఇతివృత్తం
  - బి) పాత్ర పోషణ
- **17.1.3.** ముగింపు
- **17.1.4** ప్రశ్నలు
- **17.1.5** ఆధార గ్రంథాలు

## 17.1.1. చలం సంగ్రహ పరిచయం :

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మహావ్యక్తి గుడిపాటి వెంకటా చలం ప్రాచీన సాహిత్యాన్నే గాక ఆంగ్లసాహిత్యాన్ని కూడా బాగా అధ్యయనం చేసి దాని ప్రభావంతో ప్రత్యేక వ్యక్తిత్వాన్ని సంతరించుకున్నాడు. తన వ్యక్తిత్వాన్ని తన సాహిత్యంలో ముద్రించి, వస్తువులోనూ, అభివ్యక్తిలోనూ విప్లవాత్మకమైన మార్పులను తీసుకొచ్చాడు. సాహిత్యరంగం మీదే గాక సామాజిక రంగం మీద కూడా ఈయన ప్రభావం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. స్త్రీలపట్ల వారి సమస్యలపట్ల అపూర్వంగా స్పందించి అపురూపమైన ఎన్నోభావాలు వెలిబుచ్చాడు. తద్వారా అందర్నీ ఆకట్టుకున్నాడు.

ఒక నియోగి బ్రాహ్మణ కుటుంబంలో చలం జన్మించాడు. వీరిది లోహితాస్య గోత్రం. వీరి ఇంటిపేరు కొమ్మూరివారు. తాత గుడిపాటి వెంకట్రామయ్య చలాన్ని దత్తత తీసుకోవడంవల్ల చలం ఇంటిపేరు కొమ్మూరి గాక గుడిపాటిగా స్థిరపడింది. చలం పూర్తిపేరు గుడిపాటి వెంకటాచలం. ఈయన తల్లి వెంకటసుబ్బమ్మ, తండ్రి సాంబశివరావు.

చలం **1894** మే **18**వ తారీఖున మద్రాసులో జన్మించాడు. ఈయనకు నలుగురు తమ్ముళ్ళు, నలుగరు చెల్లెళ్ళు. బి.ఏ., యల్.టి. దాకా చదువుకొనసాగింది. చలంకు పదహారవయేటనే స్కూల్ ఫైనల్ చదువుతున్నప్పుడు రంగనాయకమ్మతో వివాహమైంది.

చలం అనేక ప్రదేశాల్లో ఉద్యోగం చేశాడు. ఈయన పది నవలల్ని, పదమూడు కథా సంపుటాల్ని, ఏడు నాటకాల్ని, ఇరవై ఆరు నాటికల్ని, ఇవేగాక మరోపది వివిధ రచనల్ని వెలయించాడు. **4-5-1979**లో చలం తమిళనాడులోని తిరువణ్ణామలైలో పరమపదించాడు.

## 2) శశిరేఖ :

శశిరేఖ చలంగారి మొట్టమొదటి నవల. దీని రచనాకాలం **1921.** అరుణా పబ్లిషింగ్ హౌస్ వారు దీన్ని మొదటి ముద్రణగా **1984** సెప్టెంబరులో ప్రచురించారు.

స్త్రీ పురుషుల మధ్య చోటుచేసుకునే అక్రమ సంబంధాలు జీవితాలను ఎలా మలుపులు తిప్పుతాయో వాటి పర్యావసానాలు ఎంత దారుణంగా వుంటాయో తెలియజేసే నవల శశిరేఖ. ఈ నవలలో కథాకథనం గ్రాంధికంలోను సంభాషణలు వ్యావహారికంలోనూ సాగాయి. డా॥ ఎన్. రామచంద్ర గారి అభిప్రాయానుసారం "చలం గ్రాంధికంలో రాసిన మొదటి, చివరి నవల ఇదే". వ్యక్తి స్వేచ్ఛకు, వ్యవస్థకు మధ్య చోటుచేసుకునే సంఘర్షణకు నిలువుటద్దంగా నిలిచిన నవల శశిరేఖ.

### ఎ) ఇతివృత్తం :

గోవిందపురానికి చెందిన బాలిక శశిరేఖ. శశిరేఖ, రామారావు ప్రేమించుకున్నారు. జీవితాంతం భార్యాభర్తలుగా జీవించాలని ఒట్టుపెట్టుకున్నారు. ఆమె తనకు పెళ్ళివద్దని తల్లిదండ్రులను ప్రాధేయపడింది. రామారావును చేసుకుంటానంది. అతడు సీమ వెళ్ళిపోయాడు. అతడు వచ్చేదాకా వేచివుంటానంది. వారు ఆమె మాటను పెడచెవిని పెట్టారు. పదవయేటే ఆమెకు పెళ్ళయింది. ఆరేళ్ళు కాపురానికి వెళ్ళలేదు. పుట్టింటిలోనే గడిపింది.

1920 ప్రాంతపు సమాజంలో అందునా బ్రాహ్మణ సమాజంలో బాల్యవివాహాలు విరివిగా సాగేవని తెలుస్తూవుంది. వధువు రజస్వల అయిన తర్వాత కార్యం చేసేవరకు పుట్టింటిలోనే ఉంచేసేవారని బోధపడుతూ వుంది. వివాహం చేసుకున్నప్పటికీ అనుభవయోగ్యమైన శారీరక పరిపక్వత వచ్చేవరకు వధువును పుట్టింటిలోనే వుంచేయటం ఆనాటి సమాజంలోనూ నెలకున్న వ్యాపారదృష్టికి తార్కాణం.

ఒకరోజు శశిరేఖ లాకులదగ్గర కొత్తపడవను చూసేందుకు వెళ్ళింది. అక్కడే కూర్చున్న కృష్ణ ఆమెను చూశాడు. వారిద్దరి చూపులు కలిశాయి. పరస్పరం ప్రేమ ఏర్పడింది. రోజూ సాయంకాలం వారిద్దరూ లాకుల దగ్గర కలుసుకునేవారు. వారిప్రేమ దినదినాభివృద్ధి చెందింది. కృష్ణ సూచన మేరకు శశిరేఖ తన తల్లితో మాట్లాడింది. తనకాభర్త ఇష్టం లేదంది. అతనితో కాపురం చెయ్యలేనంది. తల్లి ఆమెను గట్టిగా మందలించింది.

పిల్లలకు ఇష్టంలేని బలవంతపు పెళ్ళి చేయడంవల్ల తలెత్తే అనర్థాలను ఈ ఉదంతం వెల్లడి చేస్తుంది.

శశిరేఖ మరుసటిరోజు కూడా లాకుల దగ్గరకు వెళ్ళింది. కృష్ణతో తన ప్రేమ పటిష్టంగా వుంటుందని చెప్పింది. కృష్ణ కూడా తన ప్రేమను పునరుద్ఘాటించాడు.

ప్రేమికులు కలుసుకునేకొద్దీ వారి ప్రేమ ప్రవర్ధమానమవుతుందని ఈ అంశం తెలియజేస్తుంది.

కార్యానికి ఏర్పాట్లు చేశారు. వద్దని శశిరేఖ భీష్మించుకుంది. తండ్రి, ఆమెను చీకటి గదిలో బంధించాడు. కొరడాతో కొట్టాడు.

స్త్రీలను నిర్బంధించి ఒప్పించేందుక ఆనాడు అవలంభించబడే విధానాలనూహించేందుకు ఈ సంఘటన దోహదం చేస్తుంది.

శశిరేఖ రాత్రి ఇంటి నుండి తప్పించుకుని కృష్ణను కలుసుకుంది. తనకు వచ్చిన కష్టం చెప్పింది. రాత్రంతా అతని దగ్గరే గడిపి మరుసటిరోజు ఉదయం ఇంటికి వెడతానంది. కృష్ణ అది సరికాదన్నాడు. ఆమె అలిగి అక్కణ్ణుంచి వెళ్ళిపోయింది. కృష్ణ ఆమెను వెతికి కనిపించకపోయేసరికి నిరాశతో ఏడ్చాడు. ఆమె అతణ్ణి స్పృశించి ఓదార్చింది. వాళ్ళిద్దరూ కలిసి డింగీలో అక్కణ్ణుంచి తప్పించుకు వెళ్ళారు. ఆ కాలంలోనే చోటుచేసుకున్న సాహసప్రేమ యాత్రలను ఇది మన దృష్టికి తీసుక వస్తుంది.

శశిరేఖ, కృష్ణ గోవిందపురం నుంచి వాడవల్లికి వచ్చారు. కృష్ణ స్నేహితుడు సుందర్రావు అక్కడ డాక్టరుగా పనిచేసేవాడు. కృష్ణ అతని సహాయం కోరాడు. అతడు ఒక ఇల్లు, విశాలమైన దొడ్డి వీరు నివసించేందుకు ఏర్పాటు చేశాడు. ఆర్థికంగా కూడా తోడ్పడ్డారు.

శశిరేఖ, కృష్ణ గోవిందపురము తిరిగివచ్చారు. డా॥ సుందర్రావు కూడా అక్కడికే బదిలీ చేయించుకున్నాడు. ఒకనాటి వెన్నెల రాత్రి శశిరేఖ, కృష్ణ, సుందర్రావు డింగీమీద షికారు వెళ్ళారు. సుందర్రావు ఫిడేలు వాయిస్తూ ఉంటే కృష్ణ నిద్రపోయాడు. ఫిడేలు పట్టుకోవడం నేర్పే నెపంతో సుందర్రావు శశిరేఖను తాకాడు. ఆమె అటూ ఇటూ పరుగెత్తడంతో డింగీ వొరిగి కాలువలో పడిపోయింది. కృష్ణ, సుందర్రావు ఇద్దరూ ఆమెని గట్టుకు చేర్చారు. కృష్ణ తల్లికి విషజ్వరం తగలడంతో శశిరేఖకు ఆసుపత్రిలోనే చికిత్స చేయించసాగారు. సుందర్రావుకు, శశిరేఖకు పరస్పర ఆకర్షణ కలిగింది.

అవకాశమేర్పడ్డప్పుడు స్త్రీ పురుషుల హృదయాలు వశం తప్పుతాయని, అందునా పురుషుని హృదయం సులభంగా వశం తప్పుతుందని దీన్నిబట్టి తెలుస్తుంది.

శశిరేఖ ఆరోగ్యం కుదుటపడింది. మరుసటి ఉదయం ఇంటికి వెళ్లవలసి ఉంది. ఆమెకు సుందర్రావుతో మాట్లాడాలనిపించింది. తన తప్పిదాన్ని క్షమించమని సుందర్రావు శశిరేఖకు చీటి రాసి పంపాడు. ఆమెను తన ఇంటికి భోజనానికి రమ్మని అతడు కోరాడు. సుందర్రావు కోర్కె మేరకు శశిరేఖ భోజనానికి వెళ్లింది. అతడు మునుపటిలాగే తన కోరికను బయటపెట్టాడు. మొదట శశిరేఖ లోబడలేదు. సుందర్రావు క్రమంగా ఈమె మనుసునే గాక శరీరాన్ని గూడ ఆక్రమించుకున్నాడు.

శశిరేఖ తన తప్పిదానికి పశ్చాత్తాపపడింది. కృష్ణుడితో కలిసి జీవించలేననుకుంది. సుందర్రావుతోనే జీవితాన్ని పంచుకోవాలనుకుంది. సుందర్రావుతోనే జీవితాన్ని పంచుకోవాలనుకుంది. సుందర్రావు అడిగిన మీదట తన ఆలోచన తెలియజేసింది. సుందర్రావు అంగీకరించాడు. వారానాడే ఊరు విడిచి వెళ్లిపోవాలనుకున్నారు. తన ఉద్దేశ్యాన్ని సూచాయిగా తెలియజేస్తూ శశిరేఖ రాసి పంపిన ఉత్తరం చదివి కృష్ణ మొదలు నరికిన మానులా నేలమీద పడ్డాడు.

సుందర్రావు, శశిరేఖ దేశాల్లో పలుప్రాంతాలు తిరిగారు. సుందర్రావు బళ్లారి జిల్లాలో జిరగణహల్లీలో మళ్లీ ఉద్యోగంలో చేరాడు. సుందర్రావుకు శశిరేఖమీద మోజు తగ్గిపోయింది. ప్రేమ తరిగిపోయింది. ద్వేషం క్రమంగా పెరిగిపోయింది. ఆమె ఏమి చెప్పినా, ఏది చేసినా అతనికి ఏవగింపు, ఆమెకు జీవితం నరకమైంది. శశిరేఖ మీద ప్రేమ చెక్కుచెదరలేదని కృష్ణుని దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. శశిరేఖ సుందర్రావు ఘర్షణపడ్డారు.

సంవత్సరం గడించింది. శశిరేఖ సుందర్రావు భార్య కాదని గ్రామంలో తెలిసిపోయింది. ఎవరూ వారిని తమ ఇంట్లో ఉంచుకోవడానికి ఇష్టపడలేదు. ఒక ఇంటి నుంచి మరొక ఇంటికి మారడం తరచూ జరుగుతూ ఉండేది.

స్త్రీ, పురుషుల అక్రమ సంబంధం గ్రామీణులు హర్షించరని ఆ జంటను నానాఇబ్బందులకు త గురిచేస్తారని దీన్నిబట్టి తెలుస్తుంది.

శశిరేఖ వల్లనే తనకీ ఇబ్బందులు కలిగాయని భావించి సుందర్రావు ఆమె పట్ల అయిష్టతను మరీ పెంచుకున్నాడు. క్రౌర్యంతో వ్యవహరింపసాగాడు. శశిరేఖక్కూడా సుందర్రావు పట్ల ప్రేమ తగ్గిపోజొచ్చింది. అతని నుంచి ఎలాగో బయటపడి స్వతంత్రంగా జీవించాలనుకొంది. సమస్యలు ఎక్కువైనపుడు స్త్రీ, పురుషుల మధ్య పరస్పరం ఆకర్షణ తగ్గిపోయినప్పుడు, అయిష్టం అధికమైనప్పుడు సంసారంలో సరిగమలు పలుకవు. పైగా అపశ్రుతులే అనుక్షణము విలయ తాండవం చేస్తాయి అనేందుకు ఇదే నిదర్శనం. సుందర్రావు వైద్యం కోసం పక్క గ్రామానికి వెళ్లినప్పుడు పెట్టె సర్దుకొని శశిరేఖ బయలుదేరింది. కాంభొట్లు అడ్డుపడ్డాడు. సుందర్రావు రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. శశిరేఖ మళ్ళీ ఇంటికి వచ్చి అతన్ని చూచుకోసాగింది. జీవిత సంఘటనలు అనుకున్నట్లు జరగవని అప్పుడప్పుడూ అంచనాలు తారుమరయ్యే అవకాశాలు ఉన్నాయని దీన్నిబట్టి గ్రహించవచ్చు.

సుందర్రావు కోలుకున్నాడు. రామారావు తారసపడ్డాడు. తనకింకా శశిరేఖ మీద ప్రేమ పోలేదని చెప్పాడు. సుందర్రావులో మార్పు వచ్చింది. శశిరేఖ మనసు నొవ్వకుండా నడుచుకోసాగాడు.

రామారావు తనను వివాహం చేసుకొమ్మని శశిరేఖను కోరాడు. ఆమె సూటిగా సమాధానం చెప్పకపోగా ఎగతాళిగా మాట్లాడింది. రామారావు కోపంగా వెళ్లిపోయాడు. అభ్యర్థించే ఎదుటివారిని లోకువగా చూడటం సామాన్య మానవుని స్వభావమని దీన్నిబట్టి తెలుస్తుంది.

శశిరేఖ ధోరణి రామారావుకు నచ్చలేదు. ఆమెను మరచిపోవాలనుకున్నాడు. శశిరేఖ దగ్గర నుంచి రమ్మని ఉత్తరం వచ్చింది. రామారావు ఆమెను కలుసుకున్నాడు. రామారావు కోరినట్లే అతన్ని పెళ్లి చేసుకోవడానికి శశిరేఖ అంగీకరించింది. సుందర్రావుతో చెప్పి రామారావుతో వెళ్లిపోయింది.

వివాహమయ్యేవరకు శశిరేఖతో కలిసి వుండకూడదని అది ధర్మవిరుద్ధమని రామారావు భావించాడు. ఆమెకు విడిగా ఇల్లు చూసి అందులో ఉంచాడు. ఒకరోజు సుందర్రావు వచ్చి ఆమెను చంపడానికి ప్రయత్నించాడు. ప్రాధేయపడి ఆమెను తనతో తీసుకువెళ్లాడు. సుందర్రావు తన ఉద్యోగానికి రాజీనామా చేశాడు. రామారావూ రాజీనామా చేశాడు.

శశిరేఖ, సుందర్రావులు మదరాసులో కాలం గడపసాగారు. మొదట సుందర్రావు శశిరేఖను బాగానే చూచుకున్నాడు. క్రమేపి అతనిలో మునుపటి క్రూరత్వం విజృంభించింది. ఆమె దీనత్వాన్ని తనకనుకూలంగా మలచుకున్నాడు. శశిరేఖకు అతని మాటలు చేష్టలు దుర్భరమైపోయాయి. అతన్నుంచి తప్పించుకు వెళ్లాలనుకుంది. ఒకరోజు సుందర్రావు తప్పతాగి ఆమె మీద పడ్డాడు. ఆమె అతణ్ణి కిందికి తోసి వీధిలోపడింది. మరుసటిరోజు సాయంకాలం ఒక ఉదారస్వభావుని ఉపకారం వల్ల ఒక సురక్షిత స్థలానికి చేరుకుంది.

నవజీవనదాసు శశిరేఖను కూతురులా చూసుకున్నాడు. కుట్టుమిషన్ ఇప్పించాడు. ఆమె పవిత్ర జీవనం గడిపేందుకు దోహదం చేయాలని ఉవ్విళ్లూరాడు. శశిరేఖకు ఆయన గొప్పతనం మీద గురి ఏర్పడింది కాని వివాహవిషయంలో ఆయనతో ఏకీభవించలేకపోయింది. ధర్మారావును వివాహం చేసుకొమ్మన్న ఆయన సూచనను నిర్ద్వంద్వంగా తిరస్కరించింది. శశిరేఖలో మార్పురావాలని నవజీవనదాసు ఆమెను కలకత్తాలో జరిగే బ్రహ్మ సమాజోత్సవాలకు తీసుకువెళ్లాడు. అక్కడ శశిరేఖకు రామారావు కనిపించాడు.

ధర్మారావు తనను పెళ్లిచేసుకొమ్మని శశిరేఖను కోరాడు. శశిరేఖ తిరస్కారభావంతో లేచివెళ్లింది. ఆమె మౌనాన్ని అంగీకారంగా పరిగణించిన ధర్మారావు ఆమె తనను పెళ్లి చేసుకుంటుందని ప్రచారం చేశాడు. రామారావుకు శశిరేఖమీద కోపం

వచ్చింది. నవజీవనదాసు, మరికొందరు శశిరేఖ వద్దకు వచ్చి ధర్మారావును పెళ్లిచేసుకొమ్మని నిర్బంధించారు. శశిరేఖ తిరస్కరించింది. తనకు సంబంధించి జరుగుతున్న వివాహపు ప్రచారమే రామారావు కోపానికి కారణమై వుంటుందని వూహించగల్గింది.

శశిరేఖ మొదట తనతో వివాహానికి అంగీకరించి తర్వాత నిరాకరించడానికి కారణం రామారావే అయి వుంటాడని ధర్మారావు భావించాడు. రామారావు దగ్గరకు వెళ్ళి అతన్ని నిలదీశాడు. రామారావే కారణమని శశిరేఖ తనతో చెప్పిందన్నాడు. రామారావు ధర్మారావుతో కలిసి శశిరేఖ దగ్గరకు వచ్చాడు. సాధిక్షేపంగా ఆమెతో మాట్లాడాడు. శశిరేఖ తానెన్నడూ వివాహానికి ఒప్పుకోలేదంది. రామారావు తనను వివాహం చేసుకొమ్మని శశిరేఖను మళ్లీకోరాడు. శశిరేఖ అంగీకరించలేదు. వివాహంకాకపోతే తానామెను కలుసుకోవడానికి వీల్లేదని వెళ్లిపోబోయాడు. శశిరేఖ ఆలోచించుకోవడానికి తనకు వ్యవధి కావాలంది. రామారావు అక్కడికే రాకపోతే తానైనా రామారావు గదికి వస్తానని ఆమె చెప్పింది. రాత్రి రామారావు గదికి వెళ్లింది. వారిద్దరూ దగ్గరయ్యారు. శశిరేఖ పెళ్లిచేసుకోవడానికి మళ్లీ నిరాకరించడంతో ఆమె వద్దన్నా వినిపించుకోకుండా రామారావు వెళ్లిపోయాడు. పశ్చాత్తాపం కలిగింది. మరుసటిరోజు రాత్రి మళ్లీ తన గదికి వచ్చాడు. శశిరేఖ మంచం మీద అపస్మారకస్థితిలో ఉంది. రామారావు కౌగిలించుకోవడంతో ఆమె ప్రాణవాయువులు అనంతవాయువుల్లో కలిసిపోయాయి.

### బి) పాత్రపోషణ :

శశిరేఖ నవల్లో అనేక పాత్రలున్నప్పటికీ స్త్రీ పాత్ర మాత్రం ఒక్కటే. ఆ ఒక్కపాత్ర శశిరేఖే. రామారావు, కృష్ణ సుందర్రావు, కాంభొట్లు, నవజీవనదాసు, ధర్మారావు ఇతర పాత్రలు.

### 17.1..2 శశిరేఖ :

శశిరేఖ నవల్లో నాయిక శశిరేఖ. ఏమీ తెలియని ముగ్ధ. తన మనసుకు తట్టినదాన్ని బయటకు చెప్పే స్వభావం కలది. సాంప్రదాయాన్ని లక్ష్యపెట్టక విప్లవాత్మకంగా ఆలోచించే మనస్తత్వం కలది.

తల్లిదండ్రులు నిర్ణయించిన పెళ్లిని వద్దనటం, తానే వరుణ్ణి ఎంపిక చేసుకోవడం శశిరేఖ స్వేచ్ఛా ప్రవృత్తిని తెలియజేస్తున్నాయి. సాయంకాలలలో కృష్ణను కలుసుకోవడం, అతనితో ప్రేమానుబంధాన్ని పెంచుకోవడం ముందు వెనుకా ఆలోచించుకోలేని ఆమె బలహీనతను, తొందరపాటు స్వభావాన్ని తెలియజేస్తుంది. తనకాభర్త వద్దని తల్లితో వాదించడం ఆమె తీవ్ర స్వభావాన్ని తెలియజేస్తుంది. ఎవరు ఎలా ప్రయత్నించినా తన మనసు మారదని, కార్యం చేసుకొనేది లేదని, కృష్ణను వదలబోనని చెప్పడం శశిరేఖ దృఢసంకల్పాన్ని తెలయజేస్తుంది.

తండ్రి శిక్షించినా లోబడకపోవడం శశిరేఖ తిరుగుబాటు ధోరణికి సంకేతం. రాత్రి ఇంట్లో నుంచి వచ్చివేయడం ముందూవెనక ఆలోచించలేని ఆమె దుర్బల మనస్తత్వాన్ని, సాహసాన్ని సూచిస్తూ ఉంది. కృష్ణ సూచన మేరకు అతనితో వెళ్లిపోవడం ఆమె తెగింపును తెలియజేస్తుంది.

కృష్ణను చదువు పూర్తిచేసి ఉద్యోగంలో చేరమనడం బ్రతుకుపట్ల శశిరేఖకు గల అక్కరను తెలియజేస్తుంది. గోవిందపురము వచ్చాక ఇంటి పనంతా చేయడం శశిరేఖ బాధ్యతాయుత మనస్తత్వాన్ని బహిర్గతం చేస్తుంది. సుందర్రావు ప్రేమను మొదట అంగీకరించకపోవడం ఆమె సౌశీల్యాన్ని అభివ్యక్తం చేస్తుంది. సాంఘిక కట్టుబాట్లు తెలిసినప్పటికీ సుందర్రావు పట్ల మొగ్గు చూపడం శశిరేఖ బలహీనతకు నిదర్శనం.

"అందమయిన దాన్ని చూస్తే నాకింక ఏమీ అక్కర్లేదు. అందం కోసం యిచ్చేస్తాను. ఈలోకంలో వున్న అందమయిన కట్టడాలు, తోటలూ, పర్వతాలూ చూడాలని వుంటుంది . . . "

(శశిరేఖ. పుట. 53) అన్న శశిరేఖ మాటలనుబట్టి, అందంపట్ల ఆమెకున్న ఆకర్షణ అవగతమౌతుంది.

తన తప్పిదానికి పశ్చాత్తాప పడడం శశిరేఖ నిజాయితీకి నిదర్శనం. తన దేహం మలినపడిందని కృష్ణతో తానింక మునుపటిలాగా ఉండలేనని భావించడం ఆమె హృదయనైర్మల్యాన్ని అభివ్యక్తం చేస్తుంది. కృష్ణను, సుందర్రావును పోల్చి చూసుకోవడం తన బలహీనతను గుర్తించడం శశిరేఖ తెలివితేటలకు ఉదాహరణ.

సుందర్రావు తనను అసహ్యించుకున్నప్పటికీ అతని ప్రేమ చెక్కుచెదరకపోవడం ఆమె నిజాయితీని తెలియజేస్తుంది. హంపీలోని ప్రదేశాలను తిలకించి పులకించడం ఆమె ప్రకృతి సౌందర్య పిపాసకు ఉదాహరణ. తనకు నచ్చిన ఉత్తరాన్ని, సుందర్రావు చదవటం పట్ల ఆగ్రహాన్ని ప్రకటించడం ఆమె ఆత్మాభిమానాన్ని తెలియజేస్తుంది.

"శశిరేఖకు సౌందర్యమాహారము, ప్రేమప్రాణము. ప్రేమ లేనిది ఆమెకు సమస్తమును శూన్యమును అర్థవిహీనముగను కాన్పించును. ప్రేమ కొరకామె యేమైన సమర్పించును". (శశిరేఖ పుట. 77)

తనపట్ల సుందర్రావు తీరు మారకపోగా మరీదిగజారిపోవటం అతనిపట్ల ఉన్న ప్రేమను క్రమముగ నశింపజేసింది. ఇది ఆమెలో ఉన్న మానవసహజ స్వభావాన్ని వెల్లడి చేస్తుంది. సుందర్రావు నుంచి వెళ్లిపోయి స్వతంత్రంగా జీవించాలనుకోవడం ఆమె స్వేచ్ఛా ప్రవృత్తిని సూచిస్తుంది. సుందర్రావు అపస్మారక స్థితిలో ఉన్నాడని తెలిసినపుడు వెళ్లి అతనికి సేవ చేయాలనుకోవడం, శశిరేఖ మానవతాభిమానాన్ని తెలియజేస్తుంది.

రామారావు తారసపడినపుడు అతన్ని పలుకరించడం తన ఊరిని గురించి ప్రస్తావించడం శశిరేఖలోని ఉత్కంఠతను తెలియజేస్తుంది. అతనికి తనపట్ల ప్రేమ ఉందని తెలిసి అభిమానించడం, తన పూర్వ ప్రేమికుని పట్ల ఆమెకున్న శ్రద్ధాసక్తులను తెలియజేస్తుంది. తాను శశిరేఖనని తెలియజేయడం ఆమె తొందరపాటును సూచిస్తుంది. రామారావు పెళ్ళి ప్రతిపాదన తెచ్చినపుడు ఎగతాళిగా మాట్లాడటం, వివాహ వ్యవస్థ పట్ల ఆమెకు సదవగాహన లేదని సూచిస్తుంది. ఆమె అవివేకాన్ని అభివ్యక్తం చేస్తుంది. రామారావు మీది ప్రేమ తనలో నశించలేదని తెలియజేస్తూ అతన్ని రమ్మని రాయడం శశిరేఖ యధేచ్ఛా ప్రవృత్తికి నిదర్శనం. రామారావుతో వివాహానికి అంగీకరించడం, సుందర్రావుతో తన ఉద్దేశ్యాన్ని వెల్లడించడం రామారావుతో కలిసి వెళ్లిపోవడం భవిష్యత్తు పట్ల ఆమెకున్న ఉత్సుకతను అభివ్యక్తం చేస్తుంది.

రామారావుతో కలిసివుండక విడిగా ఉండలేననడం ఆమె మనోదౌర్బల్యాన్ని అభివ్యక్తం చేస్తుంది. సుందర్రావు తనను బలాత్కరించినప్పుడు కాని చంపేందుకు ప్రయత్నించేటప్పుడు కాని లోబడకపోవడం ఆమె మనోస్థైర్యానికి వుదాహరణ. కన్నీటితో ప్రాధేయపడి రమ్మని బలవంతం చేసినప్పుడు అతనితో వెళ్లిపోవడం శశిరేఖ చంచల స్వభావానికి నిదర్శనం. మదరాసులో సుందర్రావుతో సౌఖ్యం అనుభవిస్తున్నప్పటికి కూడా శశిరేఖకు అతనిమీద ప్రేమకలుగక పోవడం శశిరేఖ మనోనిశ్చయాన్ని తెలియజేస్తుంది. సుందర్రావు ఆమెను హింసిస్తున్నా ప్రతిఘటించకపోవడం ఆమె సహనానికి నిదర్శనం. రాత్రి ఇల్లువిడిచి వెళ్ళిపోవడం, అనేకచోట్ల తిరిగి అపరిచితుని ఇంట్లో తలదాచుకోవడం ఆమె నిర్భయతావన్ని తెలియజేస్తుంది.

ఇతరుల ఆనందాన్ని చూసి తన దుఃఖాన్ని మరచిపోయే స్వభావం గల సౌమ్యురాలు శశిరేఖ. చలంగారి మాటలు ఈ అభిప్రాయాన్ని బలపరుస్తున్నాయి. "ఇతరుల దుఃఖమును చూచి కన్నీళ్ళు కార్చుట ప్రతివారికిని చేతనగును కాని ఇతరుల సౌఖ్యమును చూచి తమ దుఃఖమును మరచుట, శశిరేఖ వంటి యున్నత హృదయములకు గాక ఎవరికినీ సహజము కాదు

(శశిరేఖ పుట. 122)

శశిరేఖ నవజీవనదాసుకు తన దుశ్చరిత్రను తెలియజేసి ఇలాంటి నన్ను కూడా మీ ఇంట్లో వుంచుకుంటారా ? అని ప్రశ్నించటం ఆమె దురుసు స్వభావాన్ని తెలియజేస్తుంది. తన జీవన విధానాన్ని మార్చుకోవాలని ప్రయత్నించడం ఆమె

ఉత్కంఠతను అభివ్యక్తం చేస్తుంది. సహజీవనదాసుకు తన ప్రేమవాదాన్ని వినిపించి వివాహ వ్యవస్థను దుయ్యబట్టడం ఆమె అజ్ఞానానికి నిదర్శనం. తన కోసం తపించి వచ్చిన ధర్మారావుతో వివాహాన్ని నిరాకరించడం అభిరుచికి ఆమె ఇచ్చే ప్రాధాన్యతకు అద్దం పడుతుంది.

రామారావు మళ్లీ కనిపించినపుడు అతనిపట్ల పూర్వపు ప్రేమను ప్రదర్శించడం ఆమె మనోనిశ్చయాన్ని తెలియజేస్తుంది. నవజీవనదాసు తదితరులు వచ్చి ధర్మారావును పెండ్లి చేసుకొమ్మని ప్రతిపాదించగా తీవ్రస్వరంతో నిరాకరించడం ఆమె కృతనిశ్చయాన్ని బోధపరుస్తుంది.

ధర్మారావును, నవజీవనదాసు ధిక్కరించి మాట్లాడటం శశిరేఖ కాఠిన్యానికి, స్వేచ్ఛా ప్రవృత్తికి నిదర్శనం. రామారావు వచ్చినపుడు అతనిపట్ల తన ప్రేమను ప్రకటించినప్పటికీ పెళ్లి నిరాకరించడం సిద్ధాంతపరమైన ఆమె మానసిక బలాన్ని బోధపరుస్తుంది. పెళ్లికి అంగీకరించలేక, రామారావును వదులుకోలేక నలిగిపోవడం ఆమె మానసిక సంఘర్షణను ఆవిష్కరిస్తుంది. ఆలోచించుకోవడానికి వ్యవధి కావాలని రాత్రికి రామారావు గదికి వస్తానని శశిరేఖ చెప్పడం అతన్ని వదులుకోలేని ఆమె బలహీనతను సూచిస్తుంది. రామారావు గదికి వెళ్లి అతన్ని లోబరుచుకోవడానికి ప్రయత్నించడం తన సౌందర్యం మీద తనకున్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తుంది. తనకు భయంగా వుందని విడిచివెళ్లవద్దని రామారావు బ్రతిమాలడం ఆమె అభద్రతాభావాన్ని తెలియజేస్తుంది. రామారావు వచ్చేదాకా కొనవూపిరితో కొట్టుమిట్టాడుతూ అతడు కోగిలించుకోగానే చివరిశ్వాస వదలడం ఆమె మనోదౌర్బల్యాన్ని తెలియజేస్తుంది.

ప్రేమైక జీవిగా, ప్రేమ ప్రధానజీవిగా శశిరేఖ పాత్రను చలంగారీ నవల్లో సూచించారు. వ్యవస్థతో రాజీపడలేని వ్యక్తిగా ఈ పాత్ర చిత్రీకరింపబడింది. స్త్రీకి స్వేచ్ఛ అవసరమనే అంశాన్ని చలంగారు శశిరేఖ పాత్ర ద్వారా తెలియజేశారు.

**రామారావు :**

రామారావు గోవిందపురానికి చెందినవాడు. ఇంగ్లాండుకు వెళ్లి వైద్యానికి సంబంధించిన పై చదువులు చదివి వచ్చినవాడు. ప్రేమార్థి. సరళ స్వభావుడు.

రామారావు చిన్నతనంలోనే శశిరేఖను ప్రేమించాడు. జీవితాంతము ఆమె తనభార్య అన్నాడు. తాను ఆమెకు భర్త అన్నాడు. "ప్రేమ పట్ల అతడేర్పరచుకున్న ప్రగాఢాభిప్రాయాన్ని ఇది ప్రస్ఫుటం చేస్తుంది".

ఇంగ్లాండుకు వెళ్ళి పై చదువులు చదివిరావడం, చదువుపట్ల అతనికున్న శ్రద్ధాసక్తులను తెలియజేస్తుంది. ఉన్నతోద్యోగంలో వున్నా, అధిక హోదాలో ఉన్నా మరొక స్త్రీని పెళ్లాడకుండా, శశిరేఖనే హృదయంలో నిలుపుకోవడం ప్రేమకు అతడిచ్చే ప్రాధాన్యాన్ని వ్యక్తపరుస్తుంది. శశిరేఖ దుస్థితికి తాను కూడా కారకుడేమో అని భావించడం అతని మంచితనానికి ఉదాహరణ.

శశిరేఖతో స్నేహంగా ఉన్నప్పటికీ హద్దుమీరి ప్రవర్తించకపోవటం అతని ఉన్నత సంస్కారాన్ని ఆవిష్కరిస్తుంది. తాను పెళ్లి ప్రతిపాదన తెచ్చినప్పుడు శశిరేఖ ప్రతికూలంగా స్పందించటంతో ఆమెను మరిచిపోవాలనుకోవడం అతని మంచి సంస్కారాన్ని సూచిస్తుంది. ధర్మబద్ధంగా వివాహం చేసుకునేదాకా శశిరేఖ తాను కలిసి వుండకూడదనుకోవడం, వివాహానంతరం పరపురుష సంపర్కం గురించి ఆలోచించకూడదనడం హైందవ వ్యవస్థపట్ల, వైవాహిక ధర్మంపట్ల అతనికున్న అచంచల విశ్వాసాన్ని ఆవిష్కరిస్తుంది. శశిరేఖను ఇబ్బందిపెడుతున్న కొంభొట్లును శిక్షించడం రామారావు ధార్మిక ఆగ్రహానికి నిదర్శనం.

శశిరేఖకు దూరంగా ఉంచటానికి ప్రయత్నించడం, వివాహం తర్వాతే కలిసివుండాలనుకోవడం రామారావు నిజాయితీకి నిదర్శనం. శశిరేఖ సౌందర్యం తన నిగ్రహాన్ని సడలింపజేయడం వల్ల ఆమెను తరచుగా చూడకూడదనుకోవడం అతని మంచి స్వభావాన్ని తెలియజేస్తుంది.

తన ఉద్యోగానికి రాజీనామా చేయడం ప్రేమ వైఫల్యంవల్ల అతనికి కల్గిన బాధను తెలియజేస్తుంది. కలకత్తాలో శశిరేఖ పలుకరించప్పుడు మళ్లీ ఆమెతో సంబంధం పెట్టుకోవడం శశిరేఖ మీద అతని ప్రేమ నశించలేదని తెలుస్తుంది. శశిరేఖ ధర్మారావును పెళ్లి చేసుకుంటుందని ప్రచారం చేసినవారిని ఎదుర్కొనడం శశిరేఖ మీద అతనికున్న విశ్వాసాన్ని ద్యోతకం చేస్తుంది. శశిరేఖ ధర్మారావును చేసుకుంటుందన్న విషయాన్ని జీర్ణించుకోలేకపోవడం, ఆమెను అసహ్యించుకోవడం ఆమెవల్ల అతనికి కల్గిన ఆవేదనను ఆవిష్కరిస్తుంది.

ధర్మారావు తనమీద ఆనవసరంగా నిందవేసి శశిరేఖే తనకు చెప్పిందన్నప్పుడు ఆమె దగ్గర వెళ్ళి కోపంగా మాట్లాడడం, అబద్దాన్ని అసహ్యించుకొనే రామారావు తీరును తెలియజేస్తుంది. శశిరేఖ ప్రేమాలాపాలతో కరిగిపోవడం అతని హృదయ మార్దవన్ని తేటపరుస్తుంది. శశిరేఖ వెళ్లిపొమ్మంటే నిరాకరించ అధికప్రసంగం చేసిన ధర్మారావును శిక్షించడం, రామారావు ధార్మిక ఆగ్రహాన్ని ఉదాహరణ. శశిరేఖ వివాహాన్ని తిరస్కరించినప్పుడు ఆమెను వదులుకోవడానికి నిశ్చయించుకోవడం సంఘంపట్ల, సంఘం కట్టుబాట్లపట్ల అతనికున్న గాఢాభిమానాన్ని తెలియజేస్తుంది. శశిరేఖ తన ఇంటికి వచ్చినపుడు ఆమెతో శృంగార చేష్టలు చేయడం, అతని మనోదౌర్భల్యానికి నిదర్శనం. అర్ధరాత్రి పూట ఆమెను ఒంటరిగా విడిచి వెళ్లిపోవడం అతని కఠినస్వభావాన్ని ద్యోతకం చేస్తుంది. పశ్చాత్తాపంతో మరుసటిరోజు తిరిగిరావడం, అతని ఆర్ద్ర హృదయానికి అద్దం పడుతుంది. శశిరేఖ కోసం ఆరాటపడి ఆమెను ఆలింగనం చేసుకోవడం ఆమె మీద అతని ప్రేమ తీవ్రతను తెలియజేస్తుంది.

మంచివాడుగా, సరళ స్వభావుడుగా, ధర్మంపట్ల ప్రగాఢాభిమానం కలవాడుగా, ప్రేమైక జీవిగా రామారావు శశిరేఖ నవల్లో కనిపిస్తాడు.

**కృష్ణ :**

కృష్ణ గోవిందపురము లాకు అధికారి. కుమారుడు విశాఖపట్టణం మెడికల్ కాలేజి విద్యార్థి. తొందరచేసే తొలకరి యవ్వనంలో వున్నవాడు ప్రేమపిపాసి.

కృష్ణ హఠాత్తుగా శశిరేఖను చూసి ఆమె అందానికి ముగ్దుడై ప్రేమించడం అతని తొందరపాటు స్వభావానికి అద్దం పడుతుంది. ఆమెను వదిలి తానుండలేననడం అతని బలహీనతను సూచిస్తుంది. భర్తను, కాపురాన్ని తిరస్కరించమనడం అతని స్వార్థానికి చిహ్నం.

శశిరేఖ దుస్థితికి ఆందోళన చెందడం కృష్ణ దయాస్వభావాన్ని తెలియజేస్తుంది. ఆమె అలా వచ్చినందుకు ఇతరులు ఏమనుకుంటారో అని బాధపడడం, తనకు చెడ్డపేరు వుండకూడదనుకోవడం అతని స్వార్థాన్ని, అవకాశవాదాన్ని ఆవిష్కరిస్తున్నాయి. శశిరేఖ కనిపించకపోవడంతో ఆమెను వెదికి దుఃఖించడం ఆమెపట్ల అతనికి గల ప్రగాఢ ప్రేమను ప్రస్ఫుటం చేస్తుంది. ఆమెను తీసుకువెళ్ళడం అతని తొందరపాటును, యుక్తాయుక్త విచక్షణా రాహిత్యాన్ని బోధపరుస్తుంది.

సంవత్సరంలో పూర్తి కావలసిన చదువు తిలోదకాలు ఇచ్చి శశిరేఖతోటిదే లోకమన్నట్లు మసలుకోవడం కృష్ణ క్రమశిక్షణా రాహిత్యాన్ని, బాధ్యతారాహిత్యాన్ని అభివ్యక్తం చేస్తూ వుంది. సుందర్రావుపైనే ఆధారపడి జీవించటం బాగుండదనుకోవడం అతని సంస్కారానికి అద్దం పడుతోంది. చికిత్స కోసం శశిరేఖను ఆసుపత్రిలో వుంచి సుందర్రావు ఆమెకు దగ్గరయ్యేందుకు దోహదం చెయ్యడం మిత్రునిపట్ల అతనికి గల నమ్మకాన్ని ఆవిష్కరిస్తుంది. లోకరీతి తెలియని అతని అమాయకతకు అద్దం పడుతుంది. శశిరేఖ ఇంటికి వస్తానని ఉత్తరం రాసినా వద్దని బదులు రాయటం శశిరేఖ ఆరోగ్యంపట్ల అతనికి గల శ్రద్ధను తెలియజేస్తుంది. తాజా పరిస్థితిని ఊహించలేని అతని అమాయకతను సూచిస్తుంది.

శశిరేఖ ఉత్తరం ద్వారా ఆమె తనకు లేదని తెలుసుకున్నప్పుడు నిశ్చేష్టుడై క్రిందపడడం ఆమెపట్ల అతడు ఏర్పరచుకొన్న గాఢ ప్రేమను తెలియజేస్తూ వుంది. శశిరేఖ కృష్ణుడ్ని తలపోసింది అని అతని వ్యక్తిత్వాన్ని ఉన్నతీకరిస్తూ వుంది.

". . . అట్టి సుగుణ నిధిని స్వార్థత్యాగిని, నిష్కపట వర్తనుని, ప్రేమానిధిని, అమాయకుని . . ." (శశిరేఖ. పుట. 64)

శశిరేఖ మీద మనసు మరల్చుకోలేక నిస్వార్థంగా ఉత్తరం రాయడం కృష్ణ మంచితనాన్ని వెల్లడిచేస్తుంది.

జీవితం మీద సరైన అవగాహన లేనివాడుగా, భవిష్యత్తును, బాధ్యతను పట్టించుకోలేని వ్యక్తిగా, తొందరపాటు స్వభావుడిగా, అమాయకుడుగా కృష్ణ పాత్రను చలం చిత్రీకరించారు.

**సుందర్రావు :**

కృష్ణకు ఆప్తమిత్రుడు సుందర్రావు. విశాఖపట్నం వైద్యకళాశాలలో డాక్టర్ కోర్సు పూర్తి చేశాడు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యుడుగా పనిచేశాడు. ఇతరులకుపకారం చేసే సాధుస్వభావం గలవాడు. అందమైన స్త్రీల విషయంలో అదుపుచేసుకోలేని మనసు కలవాడు.

అదను చిక్కినప్పుడల్లా శశిరేఖ అందాన్ని పొగడడం, మాటలతో ఆమెకు చేరువ కావడానికి ప్రయత్నించడం అతని కాపట్యాన్ని ఆవిష్కరిస్తుంది. శశిరేఖ, కృష్ణ స్వగ్రామం వెళ్లిపోయాక వారి ఊరికే బదిలీ చేయించుకోవడం, వారి సహచర్యాన్ని విడిచి వుండలేని అతని బలహీనతను తెలియజేస్తుంది. శశిరేఖకు ఫిడేలు నేర్పించే నెపంతో ఆమె చేతులను స్పృశించడం అతని తొందరపాటును బోధపరుస్తుంది. శశిరేఖను ఆసుపత్రిలో వుంచుకొని చికిత్స చెయ్యడం విద్యుక్త ధర్మంపట్ల అతనికిగల శ్రద్ధను అభివ్యక్తం చేస్తుంది. ఆసుపత్రిలో ఒంటరిగా చిక్కిన శశిరేఖతో ప్రేమకలాపాలకు పూనుకోవడం అతని అనైతిక ప్రవర్తనకు తార్కాణం. తన తప్పిదాన్ని క్షమించమని కోరుతూ ఉత్తరం రాయడం అతని పిరికితనానికి, ఇతరుల మనసు నొప్పించకూడదనే మనస్తత్వానికి ఉదాహరణ. తన ఇంటికి భోజనానికి పిలిచి అనేక విధాలుగా ఆమెను లోబరుచుకొనేందుకు ప్రయత్నించడం అతని నేర్పును సూచిస్తుంది. శశిరేఖ బలహీనతను పసిగట్టి బలవంతంగా అనుభవించడం అతని పాశవిక ప్రవృత్తి స్థాయిని తెలియజేస్తుంది. మిత్రుడి ప్రియురాలిని తనతో లేవదీసుకెళ్ళడం అతని మిత్రద్రోహ బుద్ధికి ఉదాహరణ. కృష్ణ గురించి చెప్పి శశిరేఖ బాధపడినప్పుడు ఆమెను అతని దగ్గరకు వెళ్లిపొమ్మనడం సుందర్రావు బాధ్యతారాహిత్యాన్ని సూచిస్తుంది.

శశిరేఖ నుంచి ఆనందాన్ని పొందడం మాత్రమే ధ్యేయంగా పెట్టుకోవడం సుందర్రావు మితిమీరిన స్వార్థాన్ని సూచిస్తుంది. మోజు తీరాక ఆమెను రాచిరంపాన పెట్టడం అతన క్రౌర్యానికి అద్దం పడుతుంది. ఆమెను అనుమానించి అపహసించడం అతని సంకుచిత స్వభావాన్ని బోధపరుస్తుంది. కృష్ణుడ్ని నిందించడం, శశిరేఖను దుయ్యబట్టడం మానవసహజమైన అతని అసూయను, పురుషాధిక్య ప్రవృత్తిని బోధపరుస్తుంది.

ఏ ఇబ్బంది ఎదురైనా శశిరేఖ మీద విరుచుకపడడం, సుందర్రావు దుస్స్వభావానికి నిదర్శనం. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ తనను బాగా చూసుకున్నందుకు శశిరేఖను మంచిగా చూడడం అతని కృతజ్ఞతా స్వభావాన్ని వెల్లడిచేస్తుంది. శశిరేఖ రామారావుతో తన వివాహాన్ని గురించి ప్రస్తావించినప్పుడు ప్రతిఘటించకపోవడం అతని ఔదార్యానికి ఉదాహరణ. శశిరేఖ వెళ్లిపోయినప్పుడు విషం తినడం, బాగైన తర్వాత శశిరేఖను కలుసుకొని ఆమెను చంపడానికి ప్రయత్నించడం, నయాన్నో భయాన్నో ఒప్పించి తనతో తీసుకెళ్లడం అతని బలహీనతను, పట్టుదలనూ తెలియజేస్తున్నాయి.

సుందర్రావు మదరాసుకు వచ్చిన కొత్తలో శశిరేఖకు అనుకూలంగా వ్యవహరించడం అతని కామతృష్ణను వ్యక్తపరుస్తుంది. మునుపటి క్రౌర్యంతో మళ్లీ ఆమెను బాధించడం అతని దుస్స్వభావానికి నిదర్శనం.

సుందర్రావు స్వభావాన్ని తెలియజేసే చలం గారి మాటలు ఇక్కడ గమనించదగ్గవి.

"ఆమె సౌందర్యమును చూచిన అతనికతి తృష్ణ. ఆమె మనసును స్వభావమును అర్థము చేసికొనలేక అతడు ఆమెను బాధించుటలో తన అసహాయత్వమును చూపుకొనుచుండెను" (శశిరేఖ. పుట. 77)

అవకాశవాదిగా, క్రూరుడుగా, దుస్స్వభావుడుగా, కేవల స్వార్థపరుడుగా, జీవితంపట్ల సరైన అవగాహన లేనివాడుగా సుందర్రావు పాత్ర ఈ నవల్లో సృజింపబడింది.

## నవజీవనదాసు :

నవజీవనదాసు బ్రహ్మసమాజ సభ్యుడు. ఇబ్బందుల్లో ఉన్న శశిరేఖను కాపాడి తన ఇంట్లో వుంచి పోషించడం నవజీవనదాసు ఉపకార స్వభావాన్ని తెలియజేస్తుంది. ఆమె దుశ్చరిత్ర గురించి తెలిసినప్పటికీ అసహ్యించుకోకపోవడం అతని ఉదాత్త మనస్తత్వాన్ని ఆవిష్కరిస్తుంది. స్వేచ్ఛా జీవనము నుంచి వైవాహిక జీవనం వైపుకు ఆమె మనస్సును మళ్లించేందుకు ప్రయత్నించడం, ధర్మారావుతో ఆమె పెళ్లి జరిపించాలనుకోవడం అతని మంచితనాన్ని తెలియజేస్తుంది.

శశిరేఖ, రామారావుల అవాంఛనీయ ప్రవర్తనను అధిక్షేపించడం నీతిపట్ల అతనికిగల అభిమానాన్ని సూచిస్తుంది. శశిరేఖ తనను వివాహం చేసుకుంటుందని రామారావు చెప్పగానే వెళ్లిపోవడం శశిరేఖకు మంచి జరగాలనే అతని ప్రగాఢకాంక్షను ఆవిష్కరిస్తుంది. మరుసటిరోజు రాత్రి రామారావు కనిపించగానే శశిరేఖ కోసం తీవ్రంగా వాకబు చేయడం ఆమెపట్ల అతనికున్న అభిమానాన్ని అభివ్యక్తం చేస్తుంది.

గౌరవభావాన్ని కలిగించే వ్యక్తిత్వం కలవాడుగా నవజీవనదాసు ఈ నవల్లో కనిపిస్తాడు.

## సి) భాష :

శశిరేఖ నవల్లో కథాకథనం గ్రాంధికంలోను సంభాషణలు వ్యావహారికంలోను సాగాయి చలంగారు కవిత్వాన్ని అభిమానించేవారు కాబట్టి కథాకథనంలో వారు ప్రయోగించిన భాషలో కవిత్వస్పర్శ స్పష్టంగ గోచరిస్తుంది.

"భూదేవత దాల్చిన నూత్న వస్త్రములవలె రెండు వేపులను పెద్దపచ్చిక బయళ్ళు ముడిలో లొంగక ముఖముపై, మెడపై, చెవులపై గుంపులుగ వేలాడు ఆ బాలిక జుట్టులో చిక్కుకొని ప్రకాశించుచున్నవి సూర్యకిరణములు".

"వింతయగు తెల్లనిరంగు ఆకసము నుండి భూమిపై ప్రవహించుచుండెను". (శశిరేఖ పుట. 16)

"ప్రేమించుట యవ్వనమునకు నైజము. ఆమెవలె స్వేచ్ఛతో సంపూర్ణమగు మనసుతో ప్రేమించిన ప్రేమయే ప్రేమ (శశిరేఖ. పుట. 22)

"ప్రేమ లేని యవ్వనము నూనె ఒలికిన దీపము" (పుట. 26)

"చూడు చంద్రుణ్ణి, అతన్నెవరు ముద్దుపెట్టుకున్నారో మొహమంతా తాంబూలం మచ్చలు" (పుట. 37)

"ఆమె డాబాపై నిలుచుండి అస్తమించు సూర్యుడు మేఘములకు వేయిరంగులను చూచుచుండెను" (పుట. 156)

శశిరేఖ నవల్లో నాయిక శశిరేఖ. ప్రేమతత్వాన్ని బాగా వంటపట్టించుకున్న వ్యక్తి. చలంగారి మనసులో వున్న ప్రేమతత్వాన్ని ఆవిష్కరించేందుకు ఆయనకు తోడ్పడిన వ్యక్తి.

**సమీక్ష :**

శశిరేఖ ప్రేమే జీవితమనుకున్నదేగాని, దానికీ వ్యవస్థకు సంబంధమున్నదని భావించలేదు. అందుకే కృష్ణుని వదలి సుందర్రావును, ఆ తరువాత రామారావు కోరుకొని అపనిందల పాలయింది. ఇలాంటి చంచల స్వభావిని నవజీవనదాసు దగ్గరకు చేర్చాడు చలం. ఆమె ప్రవర్తనలో మార్పురాకపోయినా, వ్యవస్థ మీద కొంత అభిమానం కలిగింది అక్కడే. తన దృక్పథంతో ఎక్కడో లోపం ఉందనీ, ఆ లోపాన్ని గ్రహించలేని అహంకారం ఉందనీ అందువల్లే తనకు అశాంతి అని గ్రహించింది శశిరేఖ. ఇతరులు తనలోని లోపాన్ని ఎత్తి చూపితే సహించరు. మానవ స్వభావం దుర్బలం కనుక పెళ్ళయితే పాపంలో పడకుంటా వుంటారు అన్న నవజీవన దాసుతో “ఇష్టంలేని పెళ్ళి చేసుకోవడమంత పాపం ఈ లోకంలో ఇంకేమీ లేదు” అంటుంది. భిన్నాభిప్రాయాలు గల వీళ్ళందరినీ సమన్వయపరుస్తూ ఇష్టమైనవాడిని పెళ్ళి చేసుకొని ప్రేమగా ఉంటూ లోకవ్యాపారానికి ఉపయోగపడడమే పురుషార్థమని చలం భావించాడు.

పెళ్లాడతానని రామారావు చెప్పినా, తన స్వేచ్ఛను పోగొట్టుకొని వివాహ వ్యవస్థలో జీవించడం నీచమనుకొంది. ఇష్టమున్నవాడితో ఇష్టమున్నన్నాళ్ళు స్వేచ్ఛగా జీవించడమే ప్రేమ అని భావించింది. ఇలా జీవించడం వైవాహిక జీవితంలో వీలుపడదు కనుక వివాహానికి అంగీకరించలేదు. ఇలాంటి నైజంతో ఈ లోకంలో జీవించడం అసాధ్యమని భావించి నైరాశ్యంతో ఆత్మహత్య చేసుకొంది. ఆత్మనిగ్రహమున్న రామారావు లాంటి వాడే శశిరేఖ సౌందర్యానికి చలించి లొంగిపోయాడు. శశిరేఖ లాంటి వారికి వివాహవ్యవస్థ మాత్రమే భద్రత చేకూరుస్తుందనీ, వివాహంలో ప్రేమ లభించినట్లయితే ఇలా తన జీవితాన్ని నాశనం చేసుకొనేది కాదేమోనని చలం అభిప్రాయంగా భావించవచ్చు. వివాహంలో ప్రేమ లభించినపుడు స్త్రీ స్వేచ్ఛగా ప్రవర్తిస్తూ తన వాంఛలను తీర్చుకుంటూ అదే ప్రేమ, ప్రణయం అని భావిస్తే సమాజంలో అలజడి సృష్టింపబడుతుంది గనుక పిల్లల పెళ్ళిళ్ళ విషయంలో జాగ్రత్తగా ఉండమని చలం తల్లిదండ్రులను హెచ్చరించారు.

మానసిక దౌర్బల్యం వలన శశిరేఖ "Neurotic heronic" అన్నారు కొందరు. చలం రొమాంటిక్ అంశాలను తీసుకొని సాంఘికాంశాలను వదలనడం వల్ల నీతి లోపించినట్లనిపిస్తుంది. సామాజికాంశాలను స్పృశించడంలో రొమాంటిక్ దృక్పథం విఫలమయిందని చెప్పదలచుకున్నాడు. శాస్త్రీయ దృక్పథం లోపించడం వల్ల శశిరేఖ లాంటి వాళ్ళు కష్టాలుపడి వ్యవస్థలో ఇమడలేకపోయారు. ఈ నవలలో శశిరేఖ ప్రవర్తనను కవి సమర్థించినట్లు కన్పించినా, నిజానికి ఇలాంటివారు వారి అనాలోచితమైన నిర్ణయాల వలన, ఆలోచనల వలన పొందిన బాధలను ఉపమశమింప చేయడానికి, వారిని సన్మార్గంలో పెట్టటానికి చేసిన ప్రయత్నంగా భావించాలి. తనకు ఈ పెళ్ళి వద్దని, రామారావునే పెళ్ళి చేసుకుంటానని శశిరేఖ ఎంత చెప్పినా తల్లిదండ్రులు ఆమె మాటకు విలువ ఇవ్వలేదు. ఫలితంగా కృష్ణునితో లేచిపోయింది. ఆడపిల్లలకు పెళ్ళి చేయాలని తల్లిదండ్రులు పడే ఆరాటం, నిరంకుశ ప్రవర్తన వల్ల వ్యక్తిత్వం వచ్చిన తరువాత పెద్దల ప్రవృత్తికి ఎదురు తిరిగి వచ్చిన వాళ్ళతో వెళ్ళిపోయినందు వల్ల సామాజిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని తెలుస్తుంది.

దాంపత్య వ్యవస్థలో సామాజిక దృక్పథంతో వ్యవహరించాలే తప్ప రొమాంటిక్ దృక్పథంతో ఆనందానికి, స్వేచ్ఛకు ఎక్కువ ప్రాధాన్యమిస్తే భంగపడతారు. వీరి ఊహలు నిజం కావనడానికి శశిరేఖ కృష్ణలను చూడవచ్చు. ప్రేమలో జీవిస్తున్నామని భావించారే తప్ప వివాహం ద్వారా పటిష్టమైన బంధాన్ని ఏర్పరచుకోలేదు. కృష్ణునితో శశిరేఖకు వివాహమైనట్లయితే సుందరరావు వైపు మొగ్గేది కాదేమో. వివాహం చేసుకోవాలనే సామాజిక పరిజ్ఞానం లేనందువల్లే ఆమె ఇలా పతనమయిందని భావించవచ్చు.

సుందరరావుతో కుహనా సంస్కార దృక్పథం ఉంది. పురుషులు స్త్రీలకు గౌరవం యివ్వకుండా బాధపెడుతున్నారని సానుభూతి చూపిస్తూ శశిరేఖను బాధించాడు. వివాహ బంధం లేకుండా స్త్రీ పురుషునికి తనను అప్పగించుకుంటే అతడు

హీనంగా చూసే అవకాశముందని చలం హెచ్చరించాడు. "స్త్రీ పురుషులు ప్రతి నిమిషమున సమానులైనగాని ప్రేమ యుండదు. ఒకరిపైనొకరు ఆధారపడిరా, ఆ ప్రేమ నశించిందే" అంటాడు. సుందరరావుకు భోగం ప్రధానం. అందులకు సౌందర్యంతోడు. శశిరేఖకు సౌందర్యం ప్రధానం అందులకు భోగం తోడు. అందులకే వీరి స్నేహం వికటించింది" అంటారు ఈదారెడ్డి. అతను చులకనగా చూసే సరికి తన చంచల ప్రవృత్తిని ప్రదర్శించి అతనిని విడిచి వెళ్ళాలనుకొంది. చంచలమైన మనసుతో సమాజానికి, వ్యవస్థకు ఎదురీదితే ఆ పరిణామాలు విషాదానికి దారితీస్తాయి. దీనివలన సమాజంలో పురుషునికన్నా స్త్రీయే ఎక్కువ కష్టాలు ఎదుర్కొనవలసి వస్తుందని చలం పేర్కొన్నారు. శశిరేఖ తల్లి బాల్యంలోని సంఘటనల వల్ల స్త్రీ పురుషులు సంయమనం పాటించనిచో సంతానం కూడా అలాంటి గుణాలే వస్తాయని సూచించాడు.

"పురుషునికి ప్రేమ ఆటగాని, స్త్రీకి ప్రేమయే జీవనము' ప్రేమించెనా స్త్రీ ప్రేమించువానికి, తనకును శాశ్వతమగు బంధనము కలదని తలచును. తన కిష్టములేని పురుషుని స్త్రీ తిరస్కరించుగాని, తనను ప్రేమించినందులకై అతనియెడ ప్రేమ చూపకమానదు. పురుషుని స్వభావమట్టిదిగాదు" అంటాడు చలం. త

### 17.1.3 ముగింపు :

తాను మెచ్చిన తనకు నచ్చిన స్వేచ్ఛా ప్రణయాన్ని చలం ఈ నవల్లో ప్రతిపాదించాడు. దానివల్ల కలిగే అనర్థాలను కూడా సూచించాడు. సంఘానికి తాను ప్రతిపాదించిన ఈ ప్రేమతత్త్వానికి మధ్యవున్న అగాధాన్ని కూడా పాఠకుల దృష్టికి తెచ్చాడు. ఆనాటి భావకవిత్వోద్యమ ప్రభావం శశిరేఖ నవల మీద బలంగా వుందని చెప్పవచ్చు.

### ప్రశ్నలు :

1. శశిరేఖ ప్రేమతత్త్వాన్ని పరిశీలించండి.
2. శశిరేఖ నవల ద్వారా చలం సమాజానికి చెప్పదలచుకొన్న సందేశాన్ని వివరించండి.

### 17.1.4 ఆధార గ్రంథాలు :

1. శశిరేఖ - చలం - అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ
2. చలం సాహిత్యం - సామాజిక దృక్పథం - యన్. రామచంద్ర
3. చలం నవలలు - సామాజిక చైతన్యం - కె. ఈదారెడ్డి

**- డా॥ యు. ప్రహ్లాద నాయుడు**

పాఠం - 17.2

# బ్రాహ్మణీకం

## లక్ష్యం :

ఆనాటి సమాజంలోని బ్రాహ్మణ కుటుంబాలలోని స్త్రీల స్థితిగతులు, ఆచారాలు, నమ్మకాల పేరుతో జీవితాన్ని ఎలా దుర్భరం చేసుకుంటున్నారో సుందరమ్మ పాత్ర ద్వారా చిత్రించారు. సమాజంలో స్త్రీ ఎలా జీవించకూడదో, అధైర్యంతో జీవించేవారు ఎదుర్కొనే సమస్యలు ఎలాంటివో తెలియజేయడం.

బ్రాహ్మణీకం చలం ఆరవ నవల. ఇది పరిపూర్ణ శిల్ప దృష్టితో సాగిన విషాదాంత నవల. బ్రాహ్మణీకం నవల రచనాకాలం 1937 అనీ, మొదటి ముద్రణ 1983 అనీ అరుణా పబ్లిషింగ్ హౌస్ వారు ప్రచురించిన బ్రాహ్మణీకం నవల్లో ఉంది. ఆనాటి సమాజానికి, అందునా బ్రాహ్మణ సమాజానికి అద్దంపట్టే నవల బ్రాహ్మణీకం.

## పాఠ్య నిర్మాణక్రమం :

17.2.1. బ్రాహ్మణీకం ఇతివృత్తం

17.2.2. పాత్ర పోషణ

- ఎ. సుందరమ్మ
- బి. చంద్రశేఖరం
- సి. వెంకట్రామయ్య
- డి. సమీక్ష

17.2.3. సమీక్ష

17.2.4 ముగింపు

17.2.5 ప్రశ్నలు

17.2.6 ఉపయుక్త గ్రంథాలు

ఈ నవలలో వితంతు పునర్వివాం ఎందుకు విఫలమయిందో చలం చిత్రించాడు. వితంతు పునర్వివాహం విఫలం కావడానికి ఒక్క పురుష దౌష్ట్యమేగాక తరతరాలుగా లోకంలో ప్రచారంలో వున్న సంప్రదాయవాదుల, స్త్రీల మూఢాచార పరాయణత్వం, అజ్ఞానం, మరెన్నో బలహీనతలు కూడా కారణమని దీనిలో నిరూపించడానికి ప్రయత్నించాడు.

వీరేశలింగం మొదలైన సంస్కర్తలు చేయించిన వితంతు పునర్వివాహాలు ఎన్నో విఫలం కావటం ప్రత్యక్షంగా దర్శించిన చలం లోకంలో తద్విషయకమైన సదవగాహనను ప్రచారం చెయ్యటానికే ఈ నవలలో పునర్వివాహాన్ని కల్పించాడు. కులవ్యవస్థలో వున్న అరాచకత్వాన్ని ఖండించడం, స్త్రీలలోని మూఢత్వాన్ని తొలగించడం బ్రాహ్మణీకం ప్రధాన ధ్యేయం.

## 17.2.1 ఇతివృత్తం :

సుందరమ్మ సనాతన ఆచారాలకు మూఢవిశ్వాసాలకు నెలవైన కుటుంబంలో జన్మించింది. ఎనిమిదవ యేటనే మేనత్త కొడుకుతో సుందరమ్మకు పెళ్లి చేసారు. పెళ్లి కాగానే అతడు సంస్కృత విద్యాభ్యాసానికై మైసూరు వెళ్లాడు. ఆరేళ్ళు అక్కడ గడిపి వచ్చాడు. అతను మైసూరు నుంచి సరాసరి మామగారి ఇంటికివచ్చి కార్యము చేసుకొని భార్యను తనతో తీసుకువెళ్లాడు.

ఆ కాలపు బ్రాహ్మణ కుటుంబాల్లో జరిగే బాల్యవివాహాలూ, యువకులు పెళ్లి చేసుకొని చదువు కొనసాగించటం వంటి విశేషాలతో కూడిన ఆనాటి వాతావరణం ఇక్కడ గోచరిస్తుంది.

సుందరమ్మ, ఆమె భర్త మేడమీది గదిలో రాత్రింబవళ్లు గడిపేవారు. క్రిందకి వచ్చేవారు కారు. రెండేళ్లు గడిచాయి. సుందరమ్మ భర్తకు సుస్తీ చేసింది. సుందరమ్మ అత్త కబురు పెడితే ఆమె తండ్రి వచ్చాడు. ఆయుర్వేద వైదుణ్ణి తీసుకొనివచ్చి చికిత్స చేయించాడు. పత్యం వుండాలని వైద్యుడు చెప్పాడు. హామీ ఇచ్చినప్పటికీ ఆ దంపతులు పత్యం వుండలేకపోయారు. సుందరమ్మ తండ్రి బలవంతంగా ఆమెను తనతో తీసుకువెళ్లాడు. నాలుగు రోజులకే ఆమెను విడిచివుండలేక సుందరమ్మ భర్త కూడా అత్తవారింటికి వెళ్లాడు. పెద్దలు ఎంత అడ్డుపెట్టినా ఆ దంపతులు ఒకరినొకరు విడిచి వుండలేకపోయారు. పర్యవసానంగా క్రమేపీ అతని ఆరోగ్యం చెడి మరణించాడు. భర్త మరణించాక సుందరమ్మ ఒంటరిగా నిర్లిప్తంగా మూడు సంవత్సరాలు వెళ్లదీసింది.

యువతీ యువకులు పెద్దల మాటలనెలా పెడచెవిని పెట్టేవారో, పర్యావసానంగా ఎలాంటి ఇబ్బందుల నెదుర్కొనేవారో దీన్నిబట్టి తెలుసుకోవచ్చు.

సుందరమ్మ తండ్రి కూడా మరణించాడు. ఆస్తి అప్పులవాళ్ల పాలైంది. ఇల్లు ఇతరుల స్వాధీనమైంది. సుందరమ్మకు ఆమె తల్లికి ఇల్లు విడిచి వెళ్ళక తప్పలేదు.

ముందుచూపు లేకుండా జీవించడంవల్ల కలిగే అనర్థాలు ఎంత ప్రమాదకరంగా వుంటాయో ఈ సంఘటన వల్ల తెలుస్తుంది.

సుందరమ్మ, ఆమె తల్లి సుందరమ్మ మేనమామ వెంకట్రామయ్య గారింట్లో నివసించడం మొదలుపెట్టారు. మొదట ఆ ఇంటి వాతావరణం వారికి సరిపడేది కాదు. సుందరమ్మ క్రమంగా ఆ వాతావరణంలోనే యిమిడిపోయింది. వెంకట్రామయ్య తన కుమార్తెకు ప్రైవేటు చెప్పించేందుకు చంద్రశేఖరమనే విద్యార్థిని కుదిర్చాడు. అతడు ఆ ఇంట్లోనే వుంటూ చదువూ సంగీతమూ కూడా చెప్పేవాడు. సుందరమ్మను కూడా ప్రైవేటు దగ్గర కూర్చోమని వెంకట్రామయ్య సూచించాడు. సుందరమ్మ అందం చంద్రశేఖరాన్ని బాగా ఆకర్షించింది. అతని లేత యవ్వనం కొత్త అనుభవం కోసం ఆమెను వాడుకొనేందుకు తహతహలాడింది. సందరమ్మ చేతనైనంతవరకు ప్రతిఘటించింది.

వయసులో వున్న యువతీయువకులను కలపడం వల్ల కలిగే ప్రమాదాన్ని ఇక్కడ గ్రహించవచ్చు.

వెంకట్రామయ్య ఇంట్లోవాళ్లు పెళ్లికి వెళ్లారు. చంద్రశేఖరం అదను కనిపెట్టి ఒంటరిగా పడుకొన్న సుందరమ్మను లోబరుచుకొని తనకోర్కె తీర్చమన్నాడు. మరుసటిరోజు కూడా అదేపని మళ్లీ చేశాడు. సుందరమ్మ చేసేది లేక భరించినప్పటికీ ఆమె మనసు ఎదరురు తిరిగింది. శరీరం ఆనుకూల్యత వహించింది. సుందరమ్మకు జ్వరం వచ్చింది. తన తప్పిదం బయటపడుతుందేమో అని చంద్రశేఖరం తప్పించుకు వెళ్లిపోయాడు.

తొందరపాటుతో చేసే అనాలోచిత కార్యాలు ఎలాంటి ప్రమాదాలకు దారితీస్తాయో తెలుసుకునేందుకు ఈ సంఘటనలు దోహదం చేస్తాయి.

సుందరమ్మ గర్భవతి అయింది. ఈ సంగతి మొదట తల్లికే తెలిసింది. ఇందుకు బాధ్యుడెవరని ఎంత ప్రశ్నించినా సుందరమ్మ జవాబు చెప్పలేదు. సుందరమ్మ గర్భం సంగతి వెంకట్రామయ్యకు తెలిసింది. అతడు సుందరమ్మ తల్లినీ, సుందరమ్మను విచారించాడు. ప్రయోజనం లేకపోయింది. తన కర్తవ్యం గుర్తించాడు. సుందరమ్మకు మళ్లీ పెళ్లి చేయాలనుకున్నాడు. చంద్రశేఖరాన్ని వెదికి పట్టుకున్నాడు. అతనినోట నిజం రాబట్టాడు. బెదిరించి పెళ్లికి ఒప్పించాడు.

సమస్య వచ్చినపుడు దాన్ని పరిష్కరించుకునే మార్గం ఆలోచించాలేగాని బాధపడుతూ కూర్చోకూడదని ఈ కథాంశం బోధపరుస్తుంది.

సుందరమ్మకు, చంద్రశేఖరానికి పెళ్లైంది. చంద్రశేఖరంలో మార్పు వచ్చింది. సుందరమ్మను తక్కువ చేసి చూడసాగాడు. సుందరమ్మ ఆడబిడ్డను ప్రసవించింది. ఆ బిడ్డ ఆలనాపాలన చూసేందుకు దిక్కు ఎవరూ లేరు. అంతా తన కర్మే అని సుందరమ్మ సరిపెట్టుకుంది. సుందరమ్మ మాతృప్రేమ ఎక్కువకావడంవల్ల బిడ్డకు సుస్తీ చేసే విధంగా గారాబం చూపింది. బిడ్డకు సుస్తీ చేసింది. బిడ్డకు స్వస్థత చిక్కితే పార్వతీదేవికి చీరపెడతానని మొక్కుకుంది. బిడ్డ ఆరోగ్యం కుదుటపడ్డాక చీరకోసం చంద్రశేఖరాన్నడిగింది. అతను నిరాకరించాడు. తన మేనమామ దగ్గర పదిరూపాయలు సంపాదించి ఐదురూపాయలకు తన చీర తాకట్టుపెట్టి మొత్తం పదిహేను రూపాయలతో సుందరమ్మ చీర కొన్నది.

వివాహానికి ముందు యువతీయువకుల మధ్య నెలకొనే సంబంధానికి వివాహమైన తర్వాత నెలకొనే సంబంధానికి మధ్యచోటు చేసుకునే అంతరాన్ని ఇక్కడ గమనించవచ్చు.

సుందరమ్మ చీర తీసుకొని ఆలయానికి వెళ్లింది. అక్కడ ఆమెకు అవమానమే ఎదురైంది. పూజారి తిరస్కరించాడు. అక్కడ గుమికూడినవారు తిరస్కార భావంతో చూశారు. సుందరమ్మ తీరని కోరికతో ఇంటికి వచ్చింది. చంద్రశేఖరం ఆ చీరను కాజేశాడు. సుందరమ్మ విధిలేక మరోచీర తాకట్టుపెట్టి వచ్చిన డబ్బుతో పార్వతీదేవి కోసం రవికెగుడ్డ కొంది. దూరంగా వున్న మరో ఆలయానికి వెళ్లి దీపమార్పి రవికగుడ్డను అమ్మవారి మెడకు చుట్టింది. తనబిడ్డను కాపాడమని ప్రాధేయపడింది. తిరిగి వస్తుండగా వెంటబడి వేధించిన కామాంధుని పట్టు తప్పించుకొని బయటపడింది.

భర్త ప్రాతికుల్యం వల్ల భార్యపడే ఇబ్బందుల్ని, దానిద్వారా కుటుంబం ఎదుర్కొనే అశాంతిని ఈ కథాంశం బోధపరుస్తుంది.

మూడు నెలలు గడిచాయి. మళ్లీ బిడ్డకు సుస్తీ చేసింది. బిడ్డ కోసం డాక్టర్ని తీసుకవస్తాడని రాత్రికి చంద్రశేఖరం కోరిక తీర్చింది. మర్నాడు చెబుతున్నా వినిపించుకోకుండా అతను వెళ్లిపోయాడు. బిడ్డకు జబ్బు ఎక్కువైంది. వీధిన వెళుతున్న పిల్లవాని ద్వారా డాక్టర్ని పిలిపించింది. అతడు మందులు తెచ్చుకొమ్మని చీటిరాసి ఇచ్చాడు. మందులు తెచ్చుకోవడానికి డబ్బులు లేవంది. ఆమె పిచ్చిదనుకొని అతడు వెళ్లిపోయాడు.

పనులు చక్కబెట్టుకోలేని ఇల్లాలి దైన్యస్థితి, ఇంటి దుస్థితి ఇక్కడ విదితమౌతుంది.

బిడ్డకు జబ్బు అధికం కావడంతో సుందరమ్మకు మనసు అదుపుతప్పింది. తాను ఎన్నడూ చూసి ఎరుగని, తనకు బొత్తిగా తెలియని ఇంగ్లీషు మందుల షాపును వెతుక్కుంటూ వెళ్లింది. షాపువానికి మందుల చీటీ ఇచ్చింది. అతడు డబ్బు అడిగితే లేదంది. డబ్బు తెచ్చుకోమని అతడు చెప్పగానే వేగంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెను వెంబడించి వచ్చిన గవల్ల రామయ్యనాయుడు సుందరమ్మను పలుకరించాడు. మీరెవరమ్మా ? అని గౌరవంగా ప్రశ్నించాడు. మేము బ్రాహ్మలం అని సుందరమ్మ చెప్పగానే అతని మనసు అట్టడుగు పొరలలో నిద్రాణమైయున్న బ్రాహ్మణద్వేషం మేలుకొంది. ఆమెను అనుభవించాలనే కోరిక బుసలుకొట్టింది. అతడు ఆమెను కోరాడు. ఆమె నిర్ఘాంతపోయింది. ఆమె మౌనం అంగీకార సూచకమని అతడు ఆమెను అనుభవించాడు. బిడ్డకు ఇంజక్షన్ ఇవ్వమని సుందరమ్మ కోరగా తాను డాక్టరు కాదని నిజం చెప్పాడు. సుందరమ్మ దహించే చూపులతో అతన్ని చూసింది. నాయుడు నాలుగడుగులు వెనక్కివేశాడు. అతని బట్టలకు దీపం అంటుకుంది. అతడు భస్మమయ్యాడు, తన నిస్సహాయస్థితిని భరించలేక సుందరమ్మ కూడా ప్రాణాలు విడిచింది. నిస్సహాయ స్థితిలో ఉన్నవారిని సమాజం ఎంత నిర్లక్ష్యం చేస్తుందో, వారిమీద ఎలాంటి అఘాయిత్యం చేయడానికైనా వెనుదీయదో దీనిద్వారా బోధపడుతుంది.

## 17.2. పాత్రపోషణ :

బ్రాహ్మణీకం నవల్లో అనేక పాత్రలున్నాయి. వాటిలో కొన్నిటికి పేర్లు లేవు. పేర్లున్న కొన్ని పాత్రలు చాలా చిన్నవి. ఈ నవల్లో ప్రధానంగా పేర్కొనదగ్గ పాత్రలు మూడు మాత్రమే. అవి 1) సుందరమ్మ, 2) చంద్రశేఖరం, 3) వెంకట్రామయ్య.

### 1) సుందరమ్మ :

సుందరమ్మ ఈ నవలలో నాయిక. స్త్రీలు జీవితంలో ఎలావుంటే ఎక్కువ ఇబ్బందుల్ని ఎదుర్కోవలసి వుంటుందో చక్కగా సున్నితంగా తెలియజేసే పాత్ర. అభ్యుదయ భావాలు, ఆధునిక నాగరికత వీటిగాలైనా సోకని పాత్ర. బ్రాహ్మణిక పావిత్ర్యానికి ప్రతిరూపంగా నిలవాలని తనకు తెలియకుండానే వ్యర్థప్రయత్నం చేసిన పాత్ర.

"బ్రాహ్మణ కడుపటి మహాత్మ్యం బ్రాహ్మణీకం. ఈ కలియుగానికి సుందరమ్మతో అంతమైంది" (బ్రాహ్మణీకం. పుట. 100) అన్న చలంగారి మాటలు సుందరమ్మ బ్రాహ్మణీకానికిచ్చే విలువను ఆవిష్కరిస్తాయి.

సుందరమ్మ ఇంటి వాతావరణం, పెద్దల ప్రవర్తన అన్నీ కూడా చరిత్రకందనంత సనాతనాలు. ఈ నేపథ్యంలో పెరిగిన సుందరమ్మ హేతువాద ఆలోచనలకు తావేలేని శుష్కకర్మవాదిగానే జీవించింది. భయమూ, భక్తి, దేవుళ్ళు, పూజలు ఆమె మనస్సులో ప్రధానపాత్ర వహించాయి. తనకు ఏ ఆపద వచ్చినా, అది తాను చేసిన తప్పిదంవల్లనే వచ్చిందనే ఆలోచన ఆమెను కింకర్తవ్యతా మూఢురాలిని చేసివేసింది.

చూసేవాళ్లని సులభంగా లాగిపడేసే అందం సుందరమ్మది. "ఆమెను చూడటమే ఆనందం" ఆమె నడకలే పువ్వులు ఆమె ముఖకాంతులే ముచ్చట్లు" (బ్రాహ్మణీకం. పుట. 7)

"ఎర్రకలువలు వలె వచ్చిన ఆమె అందాన్ని చూచి అతను సమ్మోహనుడైనాడు" (బ్రాహ్మణీకం పుట. 8)

చలంగారి ఈ వాక్యాలు సుందరమ్మ అందానికి అద్దం పడుతున్నాయి. ఆమె మొదటి భర్త, మేనమామ ఇంట్లో తారసపడ్డ చంద్రశేఖరం ఆమె అందంచేతనే బలంగా ఆకర్షింపబడ్డారు. ఆమె వీధిలోకి వెళ్ళినా, ఆలయంలోకి వెళ్లినా అందరూ ఆమె వంకే తదేకంగా చూసేవారు. ఒకరకంగా చెప్పాలంటే సుందరమ్మ అందమే ఆమె జీవితాన్ని పాడుచేసింది. "సుందరమ్మ ముఖ్యమైన సుగుణమూ, ఆమె లోపమూ కూడ భూతదయ. తాను యెంత స్వంత విచారాన్నైనా భరించగలదు. కానీ ఎవరిలోనైనా, చివరికి చీమ నీళ్లలో పడినా తాను సహాయం చెయ్యకుండా వుండలేదు". (బ్రాహ్మణీకం. పుట. 8) అన్న చలంగారి మాటలు సుందరమ్మ ఎంత దయగలదో తెలియజేస్తాయి. ఆమెలోని దయాగుణమే ఆమెను చంద్రశేఖరానికి దగ్గరయ్యేట్టు చేసింది. బిడ్డమీది ఆమె దయావాత్సల్యాలే ఆమెపడిన నానాఅగచాట్లకు కారణభూతాలయ్యాయి.

సుందరమ్మకు స్వతంత్రంగా ఆలోచించేశక్తి గాని ఆలోచించాలనే ఉద్దేశ్యంగాని ఉన్నట్టులేవు. భర్త మనస్సుకు నొప్పి కలక్కుండా అతను ఎలా చెబితే అలా నడుచుకోవడం, చివరికి అతని ప్రాణం మీదకి వస్తుందని తెలిసి కూడా అతని కోరిక ప్రకారమే మసలుకోవడం ఆమె మనోదౌర్బల్యాన్ని, సనాతన మూఢ విశ్వాసాలపట్ల ఆమెకుగల అచంచలానురక్తిని తెలియజేస్తున్నాయి. తండ్రి సూచనను కూడా పెడచెవినిపెట్టి నాకర్మ ఎలావుంటే అలా జరుగుతుందిలే నాన్నా అనడం ఆమె మౌఢ్యానికి నిదర్శనం. భర్త మరణించాక బాధతోనే మూడు సంవత్సరాలు గడపటం అతనిపట్ల ఆమెకుగల అత్యంత అనురాగానికి ఉదాహరణ. కాలక్రమంలో సుందరమ్మ తన మొదటి భర్తను మరచిపోవడాన్ని తలచుకొని ఇలా అనుకుంది. "ఆమరపు కృతఘ్నుత అనీ - నీచత్వం అనీ తనను తానే నిందించుకుంది" (బ్రాహ్మణీకం. పుట. 50)

ఇది మొదటి భర్తపట్ల సుందరమ్మ ఏర్పరచుకొన్న ప్రేమను ఆమె సంప్రదాయ విశ్వాసాన్ని బోధపరుస్తుంది. ట్రైన్‌లో తారసపడిన మరియమ్మను అసహ్యించుకోవడం తోటి ప్రయాణికులు సూచించిన పునర్వివాహ ప్రతిపాదనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చడం ఆమెలో కరుడుగట్టుకుపోయిన సనాతన బ్రాహ్మణ్యానికి సంకేతం.

తమ ఇంటి వాతావరణానికి విరుద్ధంగా వున్న మేనమామ ఇంటి వాతావరణంలో మొదట ఇమడలేకపోయినా తర్వాత ఇమిడిపోవడం పరిస్థితులతో రాజీపడే సుందరమ్మ స్వభావాన్ని ఆవిష్కరిస్తుంది. చంద్రశేఖరం మొదట తనను కోరినప్పుడు నిరాకరించడం, అతని చేష్టలకు ఆమో స్త్రీత్వం మేలుకొనైనా మేలుకోకపోవడం ఆమె ఉన్నత సౌశీల్యానికి చక్కని ఉదాహరణ. చంద్రశేఖరానికి జ్వరం వచ్చినప్పుడు సేవ చేయడం, అతని స్వభావం తెలిసినప్పటికీ అతని సూచన మేరకు దగ్గరకావడం ఆమె దయను, అమాయకతను తెలియజేస్తున్నాయి. సుందరమ్మ సద్గుణ పుంజాన్ని తెలియజేసిన చలం మాటలు ఇక్కడ గమనించదగి ఉన్నాయి.

“తాను చేసిన పని యెవరితోనూ చెప్పని ఉదారత్వమూ తనమీద జాలిపడి ఇష్టంలేకపోయినా ఆదరించిన ఆమె దయ తన నీచత్వాన్నీ, క్షుద్రత్వాన్నీ మరచిపోగలిగిన ఆమె సౌశీల్యమూ, పరపురుషుడంటే కన్నెత్తని ఆమె నిర్మలత్వము ఆమె సౌందర్యములోని శుభ తేజస్సూ ఏమీ అతని మనస్సును మార్చలేదు'' (బ్రాహ్మణీకం పుట. 39)

చంద్రశేఖరం వచ్చి తనను అనుభవించడానికి ప్రయత్నించినపుడు, రెండుసార్లు అనుభవించినప్పుడు తప్పించుకోలేకపోవడం సందరమ్మ అమాయకత్వానికి నిదర్శనం. చంద్రశేఖరంతో లైంగిక సంబంధం ఏర్పడ్డాక కూడా ఆమె మనస్సు అందుకు విముఖంగా ఉండడం ఎటూ తేల్చుకోలేని ఆమె ద్వంద్వ మనస్తత్వాన్ని తెలియజేస్తుంది.

తాను గర్భవతినని తెలిసినప్పటికీ సుందరమ్మ కంగారుపడకపోవటం ఆమె మనస్థైర్యాన్ని ఆవిష్కరిస్తుంది. ఎవరు ఎంతగా ప్రశ్నించినా తన గర్భానికి కారకుణ్ణి గురించి చెప్పకపోవటం ఆమె ఉన్నత హృదయానికి ఉదాహరణ. ద్వితీయ వివాహాన్ని మానసికంగా వ్యతిరేకించడం సంప్రదాయబద్ధమైన ఆమె సంస్కారాన్ని తెలియజేస్తుంది. తన రెండవ భర్తతో లైంగిక సంబంధము పెట్టుకోకూడదనుకోవడం ఆమె సర్దుకోలేనితనాన్ని సూచిస్తుంది. అన్నివిధాలా విరుద్ధ స్వభావంగల చంద్రశేఖరాన్ని ద్వేషించడం, సుందరమ్మ నిష్కాపట్యాన్ని తెలియజేస్తుంది. అవాంఛనీయమైన చంద్రశేఖరం ప్రవర్తనను సహించి వూరుకోవడం ఆమె నిస్సహాయతకు అద్దంపడుతుంది.

“లోకం ఉన్నది ఉన్నట్లు ఆమెకి నివాసయోగ్యంగానే వున్నది ప్రజలు మంచివారుగానే వున్నారు. వారిలో లోపాలు కంటే వారి సుహృద్భావమే గోచరిస్తుంది. ఆ సరళ హృదయురాలికి (బ్రహ్మణీకం పుట. 72) అన్న చలం మాటలు సుందరమ్మ నిష్కాపట్య స్వభావాన్ని వ్యక్తపరుస్తాయి.

అందరిలాగా తన బిడ్డకు ముద్దుముచ్చట్లేవీ తీరలేదనీ బాధపడటం సుందరమ్మ మాతృప్రేమకు నిదర్శనం. బిడ్డను ఎక్కువగా ముద్దుచేయడం, బిడ్డతోటిదే లోకమని మెలగడం, శిశువుపట్ల ఆమె ఏర్పరచుకొన్న మమతానురాగాలను తెలియజేస్తున్నాయి. బిడ్డకు జబ్బు చేసినప్పుడు డాక్టర్లమీద కంటే దేవతల మీదే ఎక్కువ విశ్వాసాన్ని ఉంచుకోవడం ఆమె సాంప్రదాయ వాసనకు ఉదాహరణ. అమ్మవారికి చీరకొనేందుకు చంద్రశేఖరాన్ని నానావిధాల ప్రాధేయపడటం, బిడ్డపట్ల ఆమెకుగల తల్లిప్రేమ మోతాదును తెలియజేస్తుంది. ఆలయంలో అవమానమెదురైనపుడు నిబ్బరంగా తిరిగి ఇంటికి రావడం ఆమె ఆత్మస్థైర్యాన్ని ఆవిష్కరిస్తుంది. తాను తెచ్చి వుంచిన చీరను చంద్రశేఖరం మాయంచేసినా, పట్టువదలకుండా మరోరవిక గుడ్డను సిద్ధం చేసుకోవడం ఆమె అచంచల దైవభక్తిని అభివ్యక్తం చేస్తుంది. రాత్రిలో ఒంటరిగా దూరంగావున్న అమ్మవారి ఆలయానికి వెళ్లడం, మొక్కుబడి తీర్చడంతో ఆమెకున్న పట్టుదలను తెలియజేస్తుంది.

మరోసారి బిడ్డకు జబ్బుచేసినప్పుడు చంద్రశేఖరం కోరిక తీర్చి డాక్టరును తీసుకురమ్మని మరుసటిరోజు ప్రాధేయపడడం బిడ్డ కోసం ఆమెపడే ఆరాటాన్ని ఆవిష్కరిస్తుంది. డాక్టరు వచ్చి మందుచీటి రాసి ఇచ్చినప్పుడు డబ్బులేదనటం, షాపువాడు ఎన్నిగొట్టాలు కావాలని అడిగినప్పుడు బిక్కమొహం వేయడం మాత్రలకు డబ్బు అడిగితే లేదని చెప్పడం సుందరమ్మ అమాయకత్వానికి నిదర్శనం. గవళ్ల రామానాయుడు వెన్నంటివచ్చి ఎవరిని ప్రశ్నించినపుడు సుందరమ్మ బ్రాహ్మలం అనడం ఆభిజాత్యం పట్ల ఆమెకున్న అభిమానాన్ని సూచిస్తుంది. బిడ్డ బాగుకోసం శరీరాన్ని అర్పించేందుకైనా వెనుకాడకపోవడం బిడ్డపట్ల ఆమెకున్న ఎనలేని ప్రేమను బోధపరుస్తుంది. తనకు జరిగిన అన్యాయానికి తట్టుకోలేక హఠాత్తుగా అశువులు వదలడం సుందరమ్మ ఆత్మాభిమానాన్ని సూచిస్తూ వుంది.

లౌక్యం తెలియని సాంప్రదాయవాదినిగా, దురదృష్టవంతురాలుగా, నిష్ప్రయోజకురాలిగా, సుగుణవంతురాలుగా సుందరమ్మ పాత్రను చలం సృజించాడు.

## చంద్రశేఖరం :

చంద్రశేఖరం ఒక పేద విద్యార్థి. స్టైఫండ్‌తోనే చదువుకునేవాడు. వెంకట్రామయ్య గారింట్లో భోజనం తిని అక్కడే నివసించడం అతని మరో మార్గంలేని దుస్థితిని తెలియజేస్తుంది.

సుందరమ్మ సౌందర్యానికి ఆకర్షితుడు కావడం అతని మనోదౌర్భల్యాన్ని సూచిస్తుంది. నీకు ఎవరూ లేరా ? అని సుందరమ్మ అడిగినప్పుడు "ఉన్నారు వాళ్లకి నేనక్కర్లేదు" అని చెప్పడం ద్వంద్వార్థాలతో మాట్లాడగలిగే అతని సామర్థ్యాన్ని బోధపరుస్తుంది. సుందరమ్మ ఎన్నిసార్లు నిరాకరించినా ఆమె పొందుకోసం పరితపించడం, ఆమెను లోబరుచుకోవడం కోసం అనేక పన్నాగాలు పన్నడం అతని కాపట్యాన్ని నీచస్వభావాన్ని సూచిస్తున్నాయి.

ఎవరూ లేనప్పుడు సుందరమ్మను బలవంతంగా లోబరుచుకొని అనుభవించడం చంద్రశేఖరం పైశాచిక ప్రవృత్తికి తార్కాణం. తన విషయం బయటపడి పోతుందనే భయంతో ఇంటినుంచి సరాసరి వెళ్లిపోవడం అతని పిరికితనాన్ని, కాపట్యాన్ని తెలియజేస్తుంది. వెంకట్రామయ్య తనను వెదికి పట్టుకున్నప్పుడు భయపడి తప్పు ఒప్పుకోవడమేకాక అతను చెప్పినట్టల్లా చేయడానికి సిద్ధపడడం చంద్రశేఖరం పిరికితనానికి పరాకాష్ట.

వివాహమైన తర్వాత సుందరమ్మమీద తన పూర్వభావాన్ని మార్చుకొని బానిసగా చూడడం అతని క్రౌర్యాన్ని సూచిస్తుంది. ఆమెను వీలైనంత తక్కువచేసి చూడటం అతని పురుషాధిక్య ప్రవృత్తిని, నీచస్వభావాల్ని తెలియజేస్తుంది. తనకు రావలసినందగా కట్నం రాలేదని, తనకు వెంకట్రామయ్య గారు కొంతైనా ఇవ్వలేదని, అది అతన్నించి రాబట్టాలని ఆలోచించడం, డబ్బుపట్ల, అందునా ఇతరుల డబ్బుపట్ల చంద్రశేఖరానికున్న వ్యామోహాన్ని బోధపరుస్తుంది. సుందరమ్మను ఒదులుకొంటే కట్నం తెచ్చే యువతిని పెళ్లి చేసుకోవచ్చనుకోవడం అతని దురాశకు తార్కాణం. భార్యను గాని బిడ్డనుగాని పట్టించుకోకుండా అన్నిటిని డబ్బుతోనే కొలత వేయడం చంద్రశేఖరం లోభత్వాన్ని తెలియజేస్తుంది.

సుందరమ్మ చీరకోసం డబ్బు అడిగినప్పుడు ఇవ్వకపోవడం, తెచ్చిపెట్టిన చీరకాజేయడం, ఆమెను, బిడ్డను తగినవిధంగా పట్టించుకోకపోవండం చంద్రశేఖరంలో కరుడుగట్టుకుపోయిన కాఠిన్యాన్ని తెలియజేస్తుంది. బిడ్డకు జబ్బు ముదిరినప్పుడు చప్పున వెళ్లి డాక్టర్‌ను తీసుకురావడం అతని పితృప్రేమను, మానవతాదృష్టిని ద్యోతకం చేస్తుంది. మరోసారి బిడ్డకు జబ్బు చేసినప్పుడు రాత్రి సుందరమ్మ ద్వారా తన కోరిక తీర్చుకొని మరుసటిరోజు ఉదయం సుందరమ్మ చెబుతున్నా వినిపించుకోకుండా వెళ్లడం చంద్రశేఖరం అమానుషత్వాన్ని ఆవిష్కరిస్తుంది.

మోసగాడుగా, స్వార్థం కోసం ఎంత నీచానికైనా ఒడిగట్టగల కపటస్వభావుడుగా, కఠినుడుగా, సగటు మనిషికన్నా తక్కువస్థాయి వ్యక్తిత్వం కలవాడుగా, చలం ఈ నవలలో చంద్రశేఖరం పాత్రను సృష్టించాడు. అయితే లేశమాత్ర దయాగుణాన్ని కూడా అందులో అతనిలో ప్రవేశపెట్టి మానవునిలో మంచీ, చెడూ రెండూ వుంటాయనీ, పూర్తిగా మంచివాడుగాని, పూర్తిగా చెడ్డవాడుగానీ ఎక్కడా వుండడని సూచించాడు.

## వెంకట్రామయ్య :

వెంకట్రామయ్య సుందరమ్మ మేనమామ. పట్టణ జీవితంతో తాదాత్మ్యం చెందినవాడు. ఆయన సుఖమనే సూత్రం మీదే కుటుంబమంతా నడుచుకోవాలనే అభిప్రాయం కలవాడు. బంధుప్రీతి, దయ కలవాడు.

తోబుట్టువును, మేనకోడల్ని తన ఇంట్లోనే వుంచుకొని పోషించేందుకు సిద్ధపడ్డాడు. ఒక పేదవిద్యార్థి చంద్రశేఖరానికి తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించి చదువుకొనేందుకు దోహదం చేయడం అతని ఔదార్యాన్ని తెలియజేస్తుంది. తన కుమార్తెకు చదువు, సంగీతం ప్రైవేటుగా చెప్పించడం అతని నాగరికతా దృష్టికి తార్కాణం. చంద్రశేఖరం ఇంటి నుంచి వెళ్లిపోయినప్పుడు పని చేయబడుతుందని వెళ్లిపోయాడనుకోవడం అతని తప్పుడు అంచనాను సూచిస్తుంది.

వెంకట్రామయ్యకు సుందరమ్మ గర్భవతి అని తెలిసినప్పుడు ఆగ్రహించి ఆగడం చేయకపోవడం అతని హుందాతనానికి అద్దం పుడుతుంది. తక్షణ కర్తవ్యాన్ని గుర్తించి తల్లీ కుతుళ్ళ ద్వారా విషయాన్ని రాబట్టడానికి ప్రయత్నించడం అతని వివేకాన్ని సూచిస్తుంది. వితంతు పునర్వివాహం చేసి సుందరమ్మ జీవితానికి భద్రత కల్పించాలనుకోవడం అతని ఔదార్యాన్ని కుదాహరణ. చంద్రశేఖరాన్ని వెదికిపట్టుకొని బెదిరించి అతని ద్వారా విషయాన్ని రాబట్టడం, వివాహానికి ఒప్పించడం అతని చాకచక్యాన్ని తెలియజేస్తుంది. చంద్రశేఖరానికి ఉద్యోగం వేయించడం, సుందరమ్మకు చంద్రశేఖరానికి వివాహంచేసి కాపురం పెట్టించడం అతని ముందు చూపుకు, దయాగుణానికి ఉదాహరణ.

సుందరమ్మ పార్వతీదేవికి పెట్టే చీరకు పదిరూపాయలడిగినపుడు నిరాకరించకుండా ఇవ్వడం అతని బంధుప్రీతిని ప్రస్ఫుటం చేస్తుంది.

బ్రాహ్మణీకం నవల్లో ఆధునిక నాగరికతకు ప్రతినిధిగా, ఉదారుడుగా, దూరదృష్టి కలవాడుగా, వివేకవంతుడుగా వెంకట్రామయ్య పాత్ర చిత్రింపబడింది.

## 17.2.3 సమీక్ష :

స్త్రీ విద్యాహీనురాలగుట వలన ఛాందస భావములను జీర్ణించుకొనుట సహజముగ ఉన్నతురాలయినను తన జీవితమునెట్లు నరకము చేసికొన్నదో నిరూపించు రచన'' అంటారు ఆనందరామం.

పూర్వాచార పరాయణులైన సుందరమ్మ కుటుంబానికి మూఢనమ్మకాలు ఎక్కువ. చనిపోయినవాళ్ళు దయ్యాలై కనబడతారని శాంతులు చేస్తారు. శాపం వల్ల స్త్రీలు వితుంతువులవుతారని నమ్ముతారు. భక్తి విశ్వాసాలతో కూడిన పురాణజ్ఞానం తప్ప ఆధునిక ఆలోచనా విజ్ఞానంలేని మనిషి సుందరమ్మ. ఆమెలోని భూతదయే ఆమెకు సుగుణం, లోపం. తానెంతైనా బాధపడుతుందిగాని ఇతరుల బాధను చూసి సహించలేదు. ఈ ఉన్నత గుణమే ఆమెకు అపకారం చేసింది. ఆమెకు సామాజిక చైతన్యం లేకపోవడం హేతుబద్ధంగా ఆలోచించకపోవడం వల్లనే ఆమె జీవితం నాశనమయిందని ఈ నవలలో చలం చూపించారు.

భర్తే దైవం అనుకున్న సుందరమ్మ అతని కోరిక తీర్చాలనుకుంటుందే తప్ప అతని విషయేచ్ఛను తీర్చడం ద్వారా అతని మరణానికి కారణమవుతున్నానన్న ఇంగిత జ్ఞానం లేదు. కర్మ సిద్ధాంతానికి లోబడి ఎలా జరగాలనుకుందో అలా జరుగుతుందని సర్దిచెప్పుకుంటుంది. అర్థంలేని ఆచారాలను పాటించి అజ్ఞానంతో స్త్రీ ఎలా పతనమౌతుందో చలం చూపించారు. దాంపత్య జీవితంలో స్త్రీ పురుషులకు నిగ్రహం చాలా అవసరమని వివరించాడు. తామర పువ్వును ముళ్లకంచెల మధ్య పెద్దగాలిలో పడేసినట్లు శిష్టాచారపరురాలైన సుందరమ్మ తన సనాతన సంప్రదాయ గృహం నుండి సమాజంలోకి నెట్టబడింది. ఆచారాన్ని గుడ్డిగా అనుసరించినట్లే వెంకట్రామయ్య గారింట్లోని ఆధునిక వాతావరణానికి కూడా తొందరగా అలవాటుపడింది. సుందరమ్మలోని ఆర్ద్రగుణం, జాలి స్వభావాన్ని తమ మీద ప్రేమగా భావించాడు చంద్రశేఖరం. స్త్రీ పురుష సంబంధాలలోని సామాజిక పరిణామం మీద ఆమెకు అవగాహన లేదు. తన భర్తకు ద్రోహం చేస్తున్నానన్న పాపం భావం తప్ప లోక జ్ఞానంలేదు. ఏ నింద వచ్చినా స్త్రీకదా మొదట భరించవలసింది ? ఆమె తన బాధ చెప్పుకున్నా తప్పు ఆమెదే అంటారు. పురుషుడు తప్పుచేసినా పవిత్రుడే. పతిత అయ్యేది స్త్రీయే కదా ? అందుకే పురుషుని కామాన్ని తెలుసుకోలేని దయామయి జీవితం ఎలా భగ్నమయిందో సుందరమ్మ పాత్ర నిరూపిస్తుంది.

వితంతు వివాహం చేసుకున్న దంపతుల మధ్య సదవగాహన లేకపోతే జీవితాలు ఎలా ఉంటాయో ఈ నవల నిరూపిస్తుంది. పెళ్ళికి ముందు ఆమెను ప్రేమతో సుందరీ అని పిలిచిన చంద్రశేఖర్ పెళ్ళాయ్యాక సుందరమ్మ మూలాన కట్నం తప్పిపోయిందని ఆమెను నీచంగా చూశాడు. అనుక్షణం ఆమెను అనుమానిస్తూ తాను బాధపడుతూ కాలం గడిపాడు. వితంతు వివాహాలలోని సంకుచిత ప్రవృత్తిల్ని చలం బయటపెట్టాడు. పరిస్థితుల ప్రభావానికిలోనై పెళ్ళి చేసుకున్న సందరమ్మ భర్త ఎలాంటివాడైనా భక్తితో సేవించాలనే భావంగల సుందరమ్మ విరక్తితోనే జీవితాన్ని గడిపింది. తాను వితంతువై కూడా మళ్లీ పెళ్ళి చేసుకొన్నందువల్లే ఈ కష్టాలన్నీ ఎదుర్కొనవలసిన పరిస్థితి ఏర్పడిందని నమ్మిన సుందరమ్మను ఆనాటి సమాజమంతా నీచంగానే చూసింది. చిత్త సంస్కారంలేని కారణంగా వితంతు వివాహాలు ఎలా తప్పుతున్నాయో తెలుస్తుంది. వీరి వివాహం ఫలించకపోవడానికి కారణం పరస్పర ప్రేమలేకపోవడమే.

తన బిడ్డకు జబ్బుచేస్తే చీరలు తాకట్టు పెట్టిన డబ్బుతో వైద్యం చేయించాలన్న ఆలోచన కూడా లేకుండా దేవతకు సమర్పించబోయి వితంతు వివాహం చేసుకున్నదన్న కారణంగా పూజారి చేత నిరాకరింపబడుతుంది. దేవత కోసం కొన్న చీర కనబడకపోయినా, పూజారి బలాత్కరించబోయినందుకూ కారణం తాను చేసిన పాపమేనని సరిపుచ్చుకుంది. బిడ్డను డాక్టరుకు చూపించడం కోసం తనను భర్తకు సమర్పించుకొని తరువాత తనను తానే అసహ్యించుకొంది. భార్యాబిడ్డల అవసరాలు చూడని భర్తతో చేసే కాపురం దాంపత్యం కాదు వ్యభిచారంగా భావిస్తారని చలం సూచించారు.

బ్రాహ్మణ ద్వేషం నరనరాన జీర్ణించుకున్న గవళ్ళరామయ్య చిన్నప్పుడు బ్రాహ్మణస్త్రీని ద్వేషించి దానిని తీర్చుకోవడం కోసం బ్రాహ్మణస్త్రీని అనుభవించాలనే కోరికతో సుందరమ్మను మోసంచేసి కామం తీర్చుకొని వర్గద్వేషాన్ని తీర్చుకున్నాడు. వర్గద్వేషాలు వ్యవస్థను ఛిన్నాభిన్నం చేస్తాయని, వారి కోరికలు ఎప్పుడు ఎలా పైకుబుకుతాయో ఈ నవలలో చలం చూపించారు. సుందరమ్మ రామయ్య మీదకు దూకడం, రామయ్య వెనకడుగు వేయడంలో దీపం అంటుకొని చనిపోవడం, సుందరమ్మ బిడ్డను హత్తుకొని ఆ పిల్లమీదపడి చనిపోవడం సంభవించింది.

సుందరమ్మ జీవితం విషాదమవడానికి ఆమె పూర్వాచార పరాయణత, సామాజిక దృక్పథం లేకపోవడం, లౌకికదృష్టిలేని ఆర్ద్రతా గుణం, పర్యవసానాన్ని ఊహించలేని కామభావం, చిత్తసంస్కారం లేని భర్తను కలిగి ఉండడం, అవగాహన లేనివర్గ ద్వేషం కారణం. స్త్రీని ఆధునిక సామాజిక దృక్పథం, ఆచారాలలోని శాస్త్రీయత దృష్టి తెలియడం అవసరం. ఇవి లేకుంటే స్త్రీ వివాహ వ్యవస్థలో భంగపడుతుందని సుందరమ్మ పాత్రద్వారా స్త్రీలోకాన్ని చలం హెచ్చరిస్తున్నాడు. వివాహ వ్యవస్థలో పురుషుని

బాధ్యతారాహిత్య ప్రవృత్తి స్త్రీని అధోగతి చేస్తున్నదని అది సమాజానికి భంగకరమని పురుష లోకాన్ని చలం ఈ నవల ద్వారా హెచ్చరిస్తున్నాడని ఈదారెడ్డి పేర్కొన్నారు.

## 17.2.4 ముగింపు :

శశిరేఖా బ్రాహ్మణీకం రెండు నవలలూ కూడా నాయికకు ప్రాధాన్యమిచ్చిన నవలలే. రెండు నవలల్లోను స్త్రీ పురుషుల అక్రమ సంబంధాలు చిత్రింపబడ్డాయి. శశిరేఖ వివాహేతర ప్రేమకు ప్రాధాన్యమిస్తే, బ్రాహ్మణీకం ప్రేమ వివాహంలో పర్యవసిస్తుందని వితంతు పునర్వివాహం విజయవంతం కాకపోవడానికి కారణాలను తెలియజేసింది. స్త్రీల సమస్యలకు ఇతరులది మాత్రమేకాక స్త్రీల బాధ్యత కూడా వుందని బోధపరిచాయి. ప్రణాళికాబద్ధ జీవితమే విజయవంతం కాగలదని సూచించాయి. ఆకర్షణలకు లొంగిపోకూడదని యువతను హెచ్చరించాయి. నవత, సమత ఉద్రిక్తతలో లేవని సుదీర్ఘమైన ఆలోచనలోనే అవి ఉన్నాయని తెలియజేశాయి. శశిరేఖలో భాష కథనం గ్రాంధికంకాగా, బ్రాహ్మణీకంలో అంతా వ్యావహారికమే. చలంగారి భాష చదివించే భాష. చలంగారి అన్ని నవలలూ స్త్రీని విభిన్న కోణాల నుండి చూసి స్త్రీ సమస్యలను చిత్రీకరించాయి. వీటిని అధ్యయనం చేయడంవల్ల స్త్రీల జీవితాల్లో వెలుగుచూడని అనేక కోణాల మీద అవగాహన ఏర్పడే అవకాశం ఉంది.

## 17.2.5 ప్రశ్నలు :

1. బ్రాహ్మణీకం నవల ద్వారా ఆనాటి సమాజాన్ని పరిశీలించండి.
2. సుందరమ్మ పాత్ర చిత్రణను చిత్రించండి.

## 17.2.6 ఉపయుక్త గ్రంథాలు :


1. బ్రాహ్మణీకం - చలం - అరుణా పబ్లిషింగ్ హౌస్, విజయవాడ
2. చలం సాహిత్యం - సామాజిక దృక్పథం - యన్. రామచంద్ర, పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం
3. చలం నవలలు - సామాజిక చైతన్యం - ఈదారెడ్డి కె.


**- డా॥ యు. ప్రహ్లాద నాయుడు**

పాఠం - 18.1

# చలం రచించిన "వివాహం" నవల - ఒక పరిశీలన

**విషయసూచిక**


**18.1.1.** కవి పరిచయం

**18.1.2.** వివాహం నవలలోని పాత్రలు

**18.1.3.** కథా సారాంశం

**18.1.4** నమూనా ప్రశ్నలు

**18.1.5** ఆధార గ్రంథం


## 18.1.1 కవి పరిచయం :

ఆధునిక తెలుగు సాహిత్య పరిణామ చరిత్రలో ఒక విలక్షణమైన అధ్యాయం గుడిపాటి వెంకట చలం. విభిన్న భావధారలు సాహిత్యజగత్తులో సమాంతరంగా ప్రవహిస్తున్న చారిత్రక సందర్భంలో స్త్రీ విముక్తి కోసం పరితపించిన మహారచయిత చలం. వ్యక్తుల ఆనందాలను కొల్లగొట్టే సమాజపు మూఢాచారాలనూ, కృత్రిమ విలువలనూ సూటిగా ప్రశ్నించాడు. స్వేచ్ఛకు విఘాతం కలిగించే ప్రతిబంధకాలన్నింటినీ ప్రతిఘటించాడు. మనిషి తన మీద తాను యుద్ధం చేసుకోకుండా సమాజంతో యుద్ధం చేయలేడని ప్రబోధించాడు. తనను తాను సంస్కరించుకోవడం కోసం సమాజంతో రచయిత చేసిన సమరమే చలం సాహిత్యం. తాను విశ్వసించిన విలువలను జీవితంలో పాటించడమే తన ప్రతిఘటనగా ప్రకటించిన సామాజిక యుద్ధయోధుడు చలం.

1894 మే 18న బుద్ధపూర్ణిమ నాడు మద్రాసులో చలం పుట్టాడు. క్రూరుడైన తండ్రి, అశక్తులైన అమ్మ, అమ్మమ్మల పెంపకంలో పెరిగాడు. దీంతో పురుషద్వేషం, స్త్రీ పట్ల సానుభూతి ఉగ్గుపాలతోబాటు అలవడినాయి. పరిసరాలను పట్టించుకోకుండా జేబులో ఆవకాయ ముక్కతో మంచం క్రింద ఆత్మానందం పొందేవాడు. పదిమందిలో ఉన్నా ఒంటరితనాన్ని అనుభవిస్తూ ఉండేవాడు. నలుగురిదీ ఒకదారయితే, తనది మరోదారిగా బాల్యాన్ని గడిపాడు. పాలు అందరికీ సులభంగా జీర్ణమయ్యే ఆహారం అని మాష్టారు పాఠం చెబుతుంటే, 'నాకు జీర్ణంకావు' అని వీధి బడిలోనే బయటపడ్డాడు. పురాణాలు వింటున్నప్పుడే వాటిలోని అన్యాయం, అణచివేత, ఆధిక్యత, మోసం మొదలైన దుర్మార్గాలను పసిగట్టాడు.

బాల్యంలో ఆడపిల్లలతోనే ఎక్కువగా స్నేహం చేశాడు. పెద్దనాన్న కూతురు 'రమణ'తో వివాహం అంగీకరించమని శృంగేరి పీఠానికి దరఖాస్తు పెట్టుకున్నాడు. ప్రేమకు రక్తసంబంధాలు ప్రతిబంధకం కాదని వాదించాడు. పిన్నవయస్సులో 'అమ్మణ్ణి'కి జరిగిన ఇష్టంలేని ఆమె పెళ్ళి చూసి అవాక్కయ్యాడు. ఆమె శోభనం ఆపుదామని తీవ్రప్రయత్నం చేశాడు. తన స్నేహితులను కలుపుకొని అలజడి సృష్టించాడు. అయినా ఆపలేకపోయాడు. సమాజాన్ని మార్చడానికి తన ప్రత్యక్ష కార్యాచరణ సరిపోదని గ్రహించి, సాహిత్యాన్ని తన ఆయుధంగా స్వీకరించాడు.

శశిరేఖ, మైదానం, వివాహం, దైవమిచ్చిన భార్య, బ్రాహ్మణీకం, అమీనా, అరుణ, జీవితాదర్శం, సీతతల్లి, బిడ్డ, ఆమె పెదవులు, వేదాంతం, జానకి, కళ్యాణి, పాపం, కొత్తచిగుళ్ళు, ఆరాత్రి, అనసూయ, ప్రేమ పర్యావసానం, యవనవ్వనం, శేషమ్మ,

జెలసీ, స్త్రీ, పరూరవ, సావిత్రి మొదలైన నవలలు రచించాడు. మ్యాజింగ్స్ పేరుతో తన జ్ఞాపకాలనూ, ఆలోచనలనూ చైతన్య స్రవంతి రచనా సంవిధానంలో ప్రకటించాడు. ఆత్మకథను రాయడం ద్వారా తన జీవిత, సాహిత్య, వ్యక్తిత్వ పరిణామాలను విశ్లేషించుకున్నాడు. స్త్రీ, పురుషుడి రుచికోసం రోజు ఆరు గంటలుపొయ్యి దగ్గర పడిఉండడమూ, ఆ ఒక్కడి శరీరం, నాలుకల సౌఖ్యానికి అతను చేసుకోగల పనులన్నీ తను చేసి పెట్టడమూ చాలా వ్యర్థంగా జీవించడమన్నమాట" అంటూ ఇంటి చాకిరీలో నలిగి నాశనమౌతున్న స్త్రీల శరీరాలను గురించి, మనసులను గురించి బాధ పడతాడు. పితృస్వామ్య భావజాలాన్ని, స్త్రీల అణచివేతనూ త్రికరణశుద్ధిగా వ్యతిరేకించిన చలం రచించిన నవల - "వివాహం"

## 18.1.2 'వివాహం' నవలలోని పాత్రలు :

1. డిప్టీ కలెక్టర్ వెంకన్న పంతులు
2. వెంకన్న భార్య (రామమ్మ)
3. వెంకన్న కొడుకులు - నారాయణా, నరసు
4. రామ్మూర్తి (వెంకన్న తమ్ముడు, స్వతంత్ర భావాలున్నవాడు)
5. రవణ (రామ్మూర్తి కూతురు)
6. వెంకట్రావు - జిల్లా జడ్జి (రామమ్మ మేనమామ)
7. మంగమ్మ (వెంకట్రావు భార్య)
8. గోపాలరావు (బీద కుర్రాడు, విద్యార్థి, రమణను పెళ్ళిచేసుకున్నాడు)
9. అప్పమ్మ (గోపాలరావు తల్లి)
10. అరవింద (వెంకట్రావు బిడ్డ)
11. వాగ్లీ (అరవిందకు అతిథి, గురువు, స్నేహితుడు, యోగవిద్యా నిపుణుడు)
12. సుబ్బారావు (కవి, రామమ్మ తమ్ముడు)
13. డాక్టరు గారూ, హెడ్మాష్టరూ. పది, పదిహేను మంది విద్యార్థుల గుంపు.

## 18.1.3 కథా సారాంశం :

'వివాహం' నవలా నాయిక, నవలకు కేంద్ర బిందువు రవణ. ఈమె రామ్మూర్తి కూతురు. రామ్మూర్తి స్వతంత్ర భావాలు కల వ్యక్తి. సంఘ సంస్కరణ అభిలాష కలవాడు. వితంతు వివాహం చేయాలంటే, తన ముసలితల్లి నెవరూ పెళ్ళి చేసుకునేట్టులేరు. తన బావలెవరూ చచ్చి, చెల్లెళ్ళు వితంతువులు కాలేదు. ఇక మిగిలింది రజస్వలానంతరవ వివాహమే. రామ్మూర్తి కూతురు రవణకి పదమూడేళ్ళు. రజస్వల అయ్యిందనే అందరి నమ్మకమూ, కాకపోయినా అయ్యిందనే నమ్మకం పుట్టించే వాడు తను. రవణకు పదేళ్ళు దాటగానే రామ్మూర్తితో, అతని అన్న డిప్టీ కలెక్టర్ వెంకన్న పంతులు భోజన సంబంధం మానేశాడు. మానేసినట్లు వీలైనంతవరకు తెలిసిన వాళ్ళందరికీ చాటించాడు. తెలియని వాళ్ళ ముందు తనకు తమ్ముడు లేనట్లు ప్రవర్తించాడు.

సంఘ సంస్కరణకు పూనుకున్న రామ్మూర్తి, తన సంస్కరణాభిలాష పూర్తి కాకుండానే చచ్చాడు. తన లక్ష్యాలను అచ్చుపోసిన కూతుర్నీ, తన భార్యనీ నిర్లక్ష్యంగా వదలిపెట్టి గతించాడు. రామ్మూర్తి తన మీద కసికొద్దీ చచ్చాడని వెంకన్న అభిప్రాయం. తమ్ముడి కర్మ చేయడానికి, వాళ్ళ ఊరెళ్ళాడు వెంకన్న పంతులు. వెంకన్న పంతులు వచ్చినప్పట్నించీ అతని మరదలూ, కూతురూ తమను తీసుకుపోవడానికి వచ్చినట్లే తలచుకొని, అట్లాగే మాట్లాడుతున్నారు. వాళ్ళని తీసుకుపోనని

చెప్పే సమయం అతనికి దొరకనే లేదు. పరామర్శించడానికి వచ్చిన వారందరితో 'మా పెద్దనాన్న వొచ్చారు, వాళ్ళ ఊరువెళుతున్నాం' అంటోంది రమణ. ఆ ఊరి పెద్దమనుషులు, సంస్కర్తలు, హెడ్మాష్టరు పూర్ణానందం గారూ, తాసిల్దారు రామకృష్ణయ్య అందరూ అతన్ని చూడవచ్చి, ఈ సంసార భారం వహిస్తున్నందుకు వెంకన్న పంతుల్ని అభినందిస్తూ మాట్లాడారు. స్కూలు పిల్లలు సామానంతా చిటికలో సర్దేశారు. బళ్ళు పిలుచువచ్చి ఎక్కించారు. వెంకన్న ప్రమేయం లేకుండానే. ఆ సాయంత్రం తల్లీ కూతుళ్ళతో సహా గంటకు ముప్పై మైళ్ళ వేగంతో రైలు అతని వూరి వైపు దూసుకుపోసాగింది. ప్రయాణంలో రమణ అందరితో చనువుగా మాట్లాడడం, స్నేహపూర్వకంగా మెసలడం వెంకన్న పంతులుకి ఇబ్బందిగా ఉంది. రమణ మాత్రం సొంతకూతురిలా చనువుగా అతనితో ప్రవర్తిస్తుంది.

దారి పొడుగునా తన భార్య ప్రతిచర్య ఎలా ఉంటుందోనని సందేహిస్తూనే ఉన్నాడు డిప్టీకలెక్టర్ వెంకన్న. ఆశ్చర్యకరంగా వెంకన్న భార్య రామమ్మ, కొత్త వారిని మర్యాద పూర్వకంగానే ఆదరించింది. ఆమె మేనమామ వెంకట్రావు (జిల్లా జడ్జి) అప్పుడు వాళ్ళ యింట్లో దిగి ఉండడం చేత అనుకున్నాడు వెంకన్న. వెంకట్రావుకి సంఘసంస్కరణాభిలాష హెచ్చు. వెంకన్నపంతులు, వెంకట్రావు సమయానుకూలమైన రాకకి ఎంతో సంతోషించాడు.

రవణకి సంబంధం ఒకటి ఉందని వెంకట్రావు చెప్పాడు. ఒక బీద కుర్రాడికి ఆయన చదువు చెప్పిస్తున్నాడు. అతని పేరు గోపాలరావు, కుర్రవాడు బుద్ధిమంతుడు, తెలివి కలవాడు. వాడితల్లి అప్పమ్మ వెంకట్రావు ఇంట్లో వంటపని చేస్తోంది. కట్నం లేకుండా రవణకు, గోపాలరావుతో పెళ్ళి జరిపిస్తాననీ, సదరు గోపాలరావు చదువు బాధ్యత వెంకన్న పంతులు భరించాలనీ అన్నాడు వెంకట్రావు.

అసలే ఈ రిఫారం పిల్లని ఎవరుపెళ్ళి చేసుకుంటారా ? అని భయపెడుతున్న వెంకన్న పంతులు, కట్నం లేకుండా జరిగే ఈ పెళ్ళికి అంగీకరించాడు. పెళ్ళి గుళ్ళో ఒకరోజులో జరిగిపోయింది. వెంకట్రావు వెళ్ళిపోయినాడు. గోపాలరావు, తల్లితో సహా వెంకన్న ఇంట్లో స్థిరపడ్డాడు.

రవణ, వెంకన్న పంతులు గృహ జీవిత బాధ్యత తనదిగా తీసుకుంది. ఆఫీసు కాయితాలు మొదలు పొడుంకాయ వరకూ రవణ స్వాధీనమే. ఇదివరకు వెంకన్న పంతుల్ని చూడ్డానికి వచ్చిన పెద్ద మనుషులు సరాసరి హాలులోకి వచ్చేవారు. ఆడవాళ్ళు తిరగడానికి కష్టంగా ఉండేది. ఇప్పుడు రరణ ఇల్లంతా పద్ధతి ప్రకారం సర్దిపెట్టింది. హాలులో పిల్లలు చదువుకోవడానికి స్థలమేర్పరిచింది. ఉత్తరపువైపు గదిలో వెంకన్న ఆఫీసు బట్టలు, పడకకుర్చీ, ఇనుపకడ్డీల కుర్చీలు నాలుగు ఏర్పాటు చేసింది. క్రమంగా రవణ లేకుండా ఆ ఇంటివాళ్ళుండలేనంత అభిమానాన్ని సంపాదించుకుంది. రవణ భర్త గోపాలరావు చదువుతోబాటు వెంకన్న పనులుచేసి పెట్టాలి. గోపాలరావు తల్లి అప్పమ్మ వంటపని. రవణ పైపని.

'కాని ఎన్నేళ్ళుంటుంది ? రెండేళ్ళలో వెళ్ళిపోతుంది. మళ్ళీ మన అవస్థ మనకే ఉంటుంది' అని రామమ్మ దిగులు.

కట్నం లేకుండా చవకగా దొరికిన గోపాలరావు వెంకన్న ఇంట్లో అందరికీ చవకైనాడు, ఊరికే వచ్చిన కూరగాయలులాగ. వెంకన్న పంతులు కొడుకులిద్దరూ నారాయణా, నరసూ. సాధారణగా పిల్లలు చేసే అల్లరికి ఏమాత్రమూ తక్కువ చేయరు. ముందు సలహాలడగడంతో మొదలుపెట్టి, చివరిరోజు గోపాలరావే పాఠాలు చెప్పేట్టుగా నిర్ణయమైంది. ఇంట్లో పెద్దవాళ్ల ప్రవర్తనను చూసి, పిల్లలు కూడా గోపాలరావును అల్లరిచేయడం మొదలుపెట్టారు. వాళ్ళు పరీక్ష పాసుకావడం అతని బాధ్యతగా పెద్దవాళ్ళు మాట్లాడేవారు. పిల్లలిద్దరూ మొదట్లో గోపాలరావు కాళ్ళమీద ఉయ్యాల లూగడం, భుజం మీద కూచోవటం, తరువాత జుట్టుపీకడం, ముక్కు లాగడం, అతను విసుక్కుంటే "గాడిదా, వెధవా" అనడంతోపాటు 'అమ్మతో చెపుతా'ననడం మొదలు తన్నడం దాకా వచ్చింది. "ఎందుకు ఆయన్నట్లా అల్లరి చేస్తారు ?" అని రవణ అడిగితే "నీకేం ? అని ఎదురు తిరుగుతారు.

గోపాలరావు స్కూల్ ఫైనల్ పాసయ్యాడు. అతనూ, అతని తల్లి ఇంటర్‌మీడియట్ చదవాలన్నారు. వెంకన్నపంతులు ఓవర్సీస్ పరీక్ష మంచిదన్నాడు. గోపాలరావు చదువుకోసం పట్నం వెళ్ళేటప్పుడు అతనికి రెండు పంచలూ, ఒక కోటూ, రెండు షర్టులూ కొన్నారు. జీతం ముందే ఇవ్వలేనని కఠోరంగా చెప్పాడు వెంకన్న పంతులు. చిన్నట్రంకు సర్దుకుని కూలివాడి నెత్తిమీద పెట్టి, తన తల్లితో అతను వెడుతున్నానని చెప్పడానికి వస్తే రవణకి కళ్ళంబడి నీళ్ళు తిరిగాయి. ఏదో తనకు తెలీని గొప్ప సంబంధాన్ని విడిచి, ఒంటరిగా వెళుతున్నట్లు గోపాలరావుకి తోచింది. ఆ అనుభవాన్ని కలుగజేసింది ఆ పన్నెండేళ్ళ చిన్న హృదయమని అతనికి తెలియదు.

గోపాలరావు వెళ్ళిపోగానే రవణకి ఇల్లంతా శూన్యమైనట్టుంది. తను అతనితో ఒక్కమాట మాట్లాడలేకపోయినా, అతని సంగతి తనకేమీ తెలియకపోయినా, ఆ ఒక్కరోజూ అతని పక్కన పీటల మీద కూచోవడమూ, అతని చిటికెన వేలు పట్టుకోవడమూ, తనని అతనిదానిగా చేసిన అభిప్రాయం తెచ్చాయి.

ఎండాకాలపు సెలవులకి గోపాలరావు వచ్చేలోపున రవణ పెద్దమనిషయ్యింది. వెంకన్న పంతులికి రవణ కన్న కూతురుకన్న ఆప్తురాలయింది. ఆఫీసు నుండి వచ్చింది మొదలు మళ్ళీపడుకోబోయే వరకూ రవణ ఒక్క నిమిషం కూడా ఎడంగా ఉండడానికి వీల్లేదు. ఆయన్ని క్లబ్బుకి పంపించేది, భోజనం చేసేటప్పుడు రవణ ఎదురుగా కూచోవాలి. భోజనం కాగానే ఆంధ్రపత్రికా, సాహితీ, కథా సరిత్సాగరం ఆయనకి రమణ చదివి వినిపించాలి. పొద్దున్నే రవణా అనే పిలుపుతో లేస్తాడు. రామమ్మకీ, అప్పమ్మకీ రవణ ప్రాణం.

గోపాలరావు మళ్ళీ పట్నం వెళ్ళకముందు అప్పమ్మ, కార్యం సంగతి ఎత్తింది. ఇంత చిన్నతనంలో కార్యం కూడదని వెంకన్న ఆ విషయాన్ని వాయిదా వేశాడు.

డిసెంబరు సెలవలకి రామమ్మ తమ్ముడు సుబ్బారావు తన అక్కను చూడ్డానికి వచ్చాడు. అతను కవి. అనేక పత్రికల్లో అచ్చుపడ్డ అతని పద్యాలను బావకీ, అక్కకే వినిపిస్తూ ఉంటాడు. రసవంతమైన చోట్ల తలెత్తి రవణ వంక చూస్తాడు. ఆమెకు అవేమీ అర్థం కాకపోయినా, కవిచేసే వ్యాఖ్యానాల వల్ల, అతని కంఠ స్వరం స్ఫురణవల్లా అర్థమైనట్టూ, ఆనందదాయకంగానూ తోచేవి. ఒకరోజు మధ్యాహ్నం తాసీల్దారు గారి వాళ్ళు వస్తే రావమ్మ వెళ్లింది. అదివరకే కుర్చీలో వెంకన్న పంతులు నిద్రపోయినాడు. కవి రవణకి చదువుతూనే ఉన్నాడు. రవణకి నిద్రవస్తోంది. చెప్పటానికి సిగ్గు. "నిద్ర పోతున్నావా ?" అన్నాడు కవి. రవణ కళ్ళు తెరవలేదు. ఆమె చెయ్యి పట్టుకొని ఊపాడు. ఆమె ఒళ్ళు ఝల్లుమంది. అతని చెయ్యి ఆమె మీదనే ఉంది. చెయ్యి దూరంగా లాక్కుని కూచుని "చదవండి" అంది. ఆ ఒక్క నిమిషపు స్పర్శతో ఆమెలో కొత్తలోకపు ద్వారాలు తెరుచుకున్నాయి. రవణకి ఆమెకి తెలీకనే ఆమె శరీరం అట్లాంటి అనుభవం కోసం వెతుకుతోంది. ఆ అనుభవానికీ, తన మోహపు జీవనానికీ సంబంధమున్నదని ఆమెకు తెలియదు. సుబ్బారావు ఆమె వైపు గాఢమైన అనురక్తిని కనబరిచాడు. రవణకవి అర్థం కాలేదు. ఒకరోజు బావిగట్టున సుబ్బారావు రవణనొక్కదాన్ని పట్టాడు. ఆమెను లోబరచుకునే ప్రయత్నం చేశాడు. రవణ మాత్రం లొంగలేదు. మర్నాడు సుబ్బారావు వెళ్ళిపోయాడు.

ఫిబ్రవరి నెలలో రావమ్మ మళ్ళీ కన్నది. సాయంత్రం ఆ రోజంతా వాన. అయిదున్నరకే చీకటి పడ్డది. రావమ్మ పగలంతా పెద్దగదిలో పడుకొనే కేకలేసి, చివరకి అలసిపోయి పడుకుంది. ప్రతి కానుపుకూ ఇట్లా ఆమె మూన్నాలుగు రోజులు బాధపడటం మామూలే. ఇంక కానుపులక్కరలేదనీ ప్రతీసారి ప్రతివారితోనూ అనడం, మళ్ళీ కనడం ఆమెకు మామూలయింది. ఆ రోజు రాత్రి డాక్టరు గారింటికి గృహప్రవేశ భోజనానికి వెళ్ళి, ఇంటికి రాత్రి పదిన్నరకు వచ్చాడు వెంకన్న. పట్టుబట్టలువిప్పి, పంచ కట్టుకోవడానికి వెళితే, దీపంలేని ఆఫీసు గదిలో కుర్చీ మీద కూచుని బల్లమీద చేతులు పెట్టుకుని రవణ నిద్రపోతుంది. ఆమె మెడ వరకు వెన్నెల పడుతుంది. తలంటి పోసుకొని బదులుగా జడ వేసుకొని జుట్టుగుబులుగా చేతులమీద వేళ్ళాడుతుంది.

పిరుదుల దగ్గరన్నుంచి మెడవరకు సాగే ఆ ఒంపుల్ని, ఆ అమాయకత్వాన్ని, నూతనత్వాన్ని, వెన్నెలలో ఆ చర్మంలో కనబడే కొత్తయవ్వనపు మెరుపునీ చూసి, వెంకన్న పంతులు మనసులో సంచలనం కలిగింది. బల్లకి ఒత్తుకోకుండా ఆమె రొమ్ముని తప్పించాలనిపించింది. ఇన్నాళ్ళు ఆమె మీద ఉండే పితృవాత్సల్యం, గృహప్రవేశ భోజనంతో అడుగునపడి, ఇంత అందమైన దాన్ని ఇన్నాళ్ళు ఎట్లా గుర్తించలేదా అనుకున్నాడు వెంకన్న పంతులు. ఆమె మెడ కింద చెయ్యేసి కదిలించాడు. రవణ లేచి కళ్ళు తెరచి నుంచోబోతుంది. పంతులు చేతులు ముందుకు వస్తున్నాయి. వెనక్కు తగ్గుతున్నాయి. ఆమె వీపు వెనుకనించి చేతులేసి పట్టుకొని దగ్గరికి లాక్కొంటున్నాడు. రవణకి అర్థం కాలేదు. 'ఎక్కడికి ?' అంది. ఆమె నోరు మీద నోరు పెట్టాడు యాలక్కాయల వాసన వేసింది. జుట్టు కొత్త శీకాయ వాసన వేసింది. రబ్బరు వంటి నడుము, వచ్చగా చెయ్యి కింద సాగుతోంది. ఏ అర్థరాత్రో ఎముకలకుప్ప రామమ్మని కావలించుకోవడానికి అలవాటుపడ్డ వెంకన్న పంతులుకది స్వర్గం లాగుంది. రవణ దూరంగా జరుగుతోంది. ఒదిలించుకుంటోంది. పట్టుకొని బలాత్కరించే ధైర్యం పంతులుకి లేదు. రవణ వెళ్ళిపోయింది.

తెల్లవారి, రాత్రి జరిగింది నిజమా ? కలా ? అని ఇద్దరికీ ఆశ్చర్యం వేసింది. యాభై ఏళ్ళ ముసలివాణ్ణి, నా కట్లాంటి బుద్ధి ఎట్లా కలిగిందని అతనికీ, అతనంతపని చేసి ఉంటాడా ?, తన దురూహనేమోనని రవణకే అనిపించింది.

- - -

వెంకట్రావు గారు వస్తున్నారని తెలిసి, ఆయన్ని చూడ్డానికి సెలవులకి ఇంటికి వచ్చాడు గోపాలరావు. ఒకరోజు వెంకట్రావుతో గోపాల్రావు తనకు తటస్థించిన కష్టాలూ, అవమానాలూ చెప్పుకున్నాడు. ఆ ఎండాకాలపు సెలవులంతా గోపాల్రావుని తనతో తీసుకెళతానన్నాడాయన. రవణ నాన్నగారు రామ్మూర్తి ఊరు కూడా అదే కావడంతో, ఆమెను కూడా బయలుదేరదీశాడు.

వెంకన్నపంతులు కారాగారం నుండి విముక్తమైన గోపాల్రావు దంపతులు, వెంకట్రావు దంపతులతో కలిసి రైలెక్కి వాళ్ళ ఊరు చేరారు. వెంకట్రావు గారిని చూడ్డానికొచ్చిన డాక్టర్ ద్వారా రవణ వచ్చిందని తెలిసిన హెడ్మాష్టరూ, పదిపదిహేను మంది పిల్లల గుంపూ వచ్చింది. వాళ్ళందరితోనూ చనువుగా మాట్లాడే రవణ తనతో మాట్లాడలేకపోవడం అన్యాయంగా కనబడుతోంది గోపాలరావుకి. ఆమె తన కాలమంతా వంటింట్లోనే గడుపుతోంది. రవణ గదిలో, తాను వాకిట్లో కూచోవలసి వచ్చింది. రవణకి అతను బాధపడుతున్నాడని తెలియదు. బాధ కనపడినా, హృదయంలో ఎంతటి నరకమో తెలియదు. ఆ బాధంతా తనమీద ప్రేమవల్ల కదా అని, పైగా ఆనందం.

వెంకట్రావు గారి కూతురు అరవింద వచ్చింది. ఆమె రావడంతో గోపాలరావుకి కొత్త సమస్యలు పట్టుకొన్నాయి. రవణ ఆమెతోనే రోజంతా గడుపుతోంది. అరవిందకు ఆ ఇంట్లో ఎంతో ప్రాముఖ్యత ఉండేది. ఆమె ఎట్లా చెబితే, అట్లా వింటాడు వెంకట్రావు గారు.

ఓరోజు ప్రొద్దున అరవిందకి టెలిగ్రాం వచ్చింది. అప్పట్నించి ఆమె చాలా హడావుడిగా ఉంది. ఏదో సర్దుతోంది. బజారు నుంచి తెప్పిస్తోంది. ఆమె ప్రయత్నాలు చూస్తే ఆ అతిథి చాలా గొప్పవాడై ఉండాలి అనిపించింది గోపాల్రావుకి. ఆయనకు ప్రత్యేక రొట్టెలు. స్వయంగా కూర వండింది. తింటాడో, తినడో అని సందేహిస్తుంది. అరవిందను ఈ విధంగా చూడ్డం గోపాలరావుకి కొత్తగా ఉంది. స్టేషనుకు మోటారు తీసుకువెళ్ళి, ఆయన్ని తీసుకొచ్చింది. ఆయన పేరు "వాగ్లే"గారు. సరాసరి ఇద్దరూ గదిలోకి వెళ్ళారు. భోజనానికి ముందు ఆమె బైటికొచ్చి అన్ని సన్నాహం చేసింది. ఆయన చాలా పొడుగ్గా ఉంటాడు. లాగులు వేస్తాడు. సగం మీసం, మొహం తళతళమెరుస్తూ ఉంటుంది. పెద్ద కళ్ళజోడు. పొడుగాటి చొక్కాయి. ప్రతిపనీ జాగ్రత్తగా ఆలోచించి చేస్తాడు. అన్నం కలపడం, తినడం, మాట మాట్లాడ్డం, కళ్ళెత్తడం అన్నీ.

వాగ్లీకి యోగశాస్త్రం తెలుసు. భోజనాల సమయాన తప్ప, తక్కినప్పుడు వాగ్లీ దర్శనం అరవిందకూ, రవణకూ మాత్రమే. రెండురోజుల్లో రవణ కూడా వాగ్లీ సేవలో ప్రవేశించింది. వాగ్లీ వాలకం గోపాలరావుకి నచ్చలేదు. వాగ్లీలో అరవింద ఏకాంత సేవ, ఏటి ఒడ్డుకి షికారుకెళ్ళడం, సముద్రపు షికార్లూ, చాలా సన్నిహితంగా ఉండటం అతనికి చికాకు కలిగించింది. అరవిందతో మాత్రమే కాదు, తన రవణతోనూ వాగ్లీ అతి సన్నిహితంగా ఉండటం గోపాలరావు భరించలేకపోయాడు. వాగ్లీతో గొడవపడ్డాడు. తనకోసం వాగ్లీ, గోపాలరావు కొట్టుకునే పరిస్థితి తటస్థించిన కథాంతంలో రవణ గోపాలరావునే ఆశ్రయించింది. "ఏం చేయమన్నా సరే. మీ పాద చేసుకుని బతుకుతాను. మీరే నా తండ్రీ, నా దైవం" అంటుంది. చంద్రుడస్తమించాడు.

## 18.1.4 నమూనా ప్రశ్నలు :

1. చలం జీవిత, వ్యక్తిత్వాలను విశ్లేషించండి
2. చలం సాహిత్యాన్ని పరామర్శించండి.
3. చలం సాహిత్యంలో "వివాహం" నవలకున్న ప్రాధాన్యతను చర్చించండి
4. "వివాహం" నవల నామౌచిత్యాన్ని వివరించండి
5. 'వివాహం' నవలలోని పాత్రల మనోభావాలను వివేచించండి
6. 'రవణ' పాత్ర స్వభావాన్ని విశ్లేషించండి
7. సమాజంలోని ద్వంద్వ విలువలను 'వివాహం' నవల ఆధారంగా చర్చించండి
8. వెంకన్న పంతులు పాత్ర స్వభావాన్ని వివరించండి
9. గోపాలరావు పాత్ర చిత్రీకరణమును వివేచించండి
10. ఆధునిక నవలా సాహిత్యంలో చలం రచనా ధోరణిని సమీక్షించండి.

## 18.1.5 ఆధార గ్రంథం :

వివాహం - చలం

**- ఆచార్య ఎస్వీ సత్యనారాయణ**

**పాఠం 18.2**

# పంచకళ్యాణి

**లక్ష్యం :**

విభిన్న మనస్తత్వాలకు సంబంధించిన ఐదుకురు స్త్రీలు వారి నిర్ణయాల వల్ల జీవితాన్ని ఎలా మలచుకున్నారో విశ్లేషించడం.

**పాఠ్యక్రమం :**

**18.2.1. పంచకళ్యాణి నవలసారాంశం**

**18.2.2. మనస్తత్వ చిత్రీకరణం**

**18.2.3. ప్రశ్నలు**

'ఈనాడు పురుషస్వామ్యం అమలులో ఉన్నది. ఈ సమాజంలో స్త్రీకి పురుషుడితో సమానత్వం అన్నది అసాధ్యం. అది గుర్తించని స్త్రీలు తప్పంతా పురుషుల దృక్పథంలో ఉన్నదనీ, దాన్ని హితోపదేశాల ద్వారా మార్చితే స్త్రీ జీవితంలో పరహితంగా ఉంటుందనీ భ్రమపడుతున్నారు. వివాహ వ్యవస్థ గొప్ప మార్పులకు గురి అయితే గానీ స్త్రీ పురుషుల సమానత్వం సాధ్యం కాదు. ఇప్పుడు వారి మధ్య ఉండే అసమానత కేవలం వ్యక్తిగతమైనది కాదు. సామాజికమైనది' అని ప్రకటించిన సృజనాత్మక రచయిత, సామాజిక దార్శనికుడు శ్రీ కొడవటిగంటి కుటుంబరావు.

20వ శతాబ్దం మధ్య దశకాలైన 1950-70ల నడుమ దాదాపు 20 నవలలు, 159 కథలు, 75 గల్పికలు, 12 నాటికలు, అనేక రాజకీయ, సాహిత్య వ్యాసాలు రచించిన మహా రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు. 1909 అక్టోబర్ 28 న పుట్టిన కుటుంబరావు కథా రచయితగా, నవలా రచయితగా, నాటకకర్తగా, విమర్శకుడిగా బహుముఖ ప్రతిభను ప్రదర్శించిన సాహిత్య సవ్యసాచి.

సమాజంలో, కుటుంబంలో, సంసారంలో స్త్రీల కన్న స్థానాన్ని కుటుంబరావు తమ రచనల్లో విస్తారంగా చిత్రించారు. బాల్యవివాహాలు, బాల్య వైధవా&యులు, వితంతు పునర్వివాహాలకు సంబంధించిన కథలు కొన్ని రాగా, ద్వి భారత్వం, వివాహ వైఫల్యాలు, పాతివ్రత్య సమస్యలు, వేశ్యావృత్తికి సంబంధించిన కథలు మరికొన్ని.

స్త్రీల సమస్యలను వాస్తవికతావాద దృష్టితో పరిశీలించి, సృజనాత్మక సాహిత్య ప్రక్రియలుగా రూపొందించిన గొప్ప రచయితలు కొందరున్నారు. పందొమ్మిదో శతాబ్దాంతంలో కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ అప్పారావు కాగా, ఇరవయ్యో శతాబ్దంలో గుడిపాటి వేంకట చలం మరియు కొడవటిగంటి కుటుంబరావు ప్రముఖులు.

ఆధునిక తెలుగు సాహిత్య పరిణామాలు విచిత్రమైనవి. కందుకూరి, గురజాడలతో ప్రారంభమైన వాస్తవికతావాదం, దాదాపు రెండు మూడు దశాబ్దాల పాటు నిర్లక్ష్యానికి గురయ్యింది. మరోవైపు కాల్పనికవాదం తలెత్తింది. యూరప్ దేశాలలో ముందు కాల్పనికవాదం పుట్టి, అంతరిస్తున్న దశలో వాస్తవికతావాదం వికసించింది. తెలుగు సాహిత్యలోకంలో ఇందుకు కొంత భిన్నంగా జరిగింది. చరిత్రగతిలో వక్రత సంగతి ఎలా ఉన్నా, కందుకూరి, గురజాడ, చలం, కుటుంబరావు తెలుగు సాహిత్యంలో వాస్తవికతావాదానికి బలమైన పునాదులు వేశారు.

కందుకూరి, గురజాడల రచనల్లో సంస్కరణవాద వాస్తవికత కనబడుతుంది. దీనినే ఇప్పుడు ఉదారవాద స్త్రీవాదంగా పరిగణిస్తున్నాం. చలం రచనల్లో సవిమర్శక వాస్తవికతావాదంతో పాటు మౌలిక స్త్రీవాద లక్షణాలు కనబడుతున్నాయి. కుటుంబరావు రచనల్లో సామ్యవాద లక్షణాలు కనబడుతున్నాయి. కుటుంబరావు రచనల్లో సామ్యవాద స్త్రీవాద భావనలు వ్యక్తమౌతున్నాయి. మార్క్సిజం అతని రచనలకు కావలసిన తాత్విక భూమికను ఏర్పరిచింది. గురజాడ ఆధునిక భావప్రియత్వం, భావైక్యతలకు శిఖరాగ్రం కుటుంబరావు. స్త్రీల సమస్యలకు పరిష్కారాన్ని సామ్యవాద భావజాలంలో సందర్శించాడు కుటుంబరావు.

"నేను ప్రచారకుణ్ణికాను. ప్రతి సమస్యనూ నేను రెండు వైపుల నించీ చూడగలను. నేను నీతులు కూడా బోధించను. అమలులో ఉన్న నీతి చట్టానికి విరుద్ధంగా ప్రవర్తించిన వారిని నేను సమర్థించుతూ రాసిన కథలు కూడా లేకపోలేదు. ఆ కథల్లో నీతి ఉన్నదని ఎవరైనా భావించినట్టయితే, వారందరూ ఆవిధంగా ప్రవర్తించటానికి నేను అనుమతించిన వాణ్ణవుతాను. నేను అలాంటి అనుమతిని ఎంతమాత్రమూ ఇవ్వటం లేదు. ప్రతి విషయాన్నీ నూతన దృష్టితో చూడడం నాకు చాలా ఇష్టం. అదే సరి అయిన దృష్టి అని నేను వాదించను. మరి కొంత కాలానికి మరొక దృష్టితో ఆ విషయాన్ని చూడగల సమర్థుడు రావచ్చును. సారస్వతం బోధ చేయకూడదని నా నమ్మకం సరి అయిన సారస్వతం మనలో ఆలోచనలు రేపి, వివేచనా శక్తి వృద్ధిపరచాలి.

నా పాత్రలలో నేను ఒకటయిపోవటం నా కిష్టం లేదు. అటువంటి రచనలను నేను ఉత్తమ తరగతిలో వేయలను. కథలలో పాత్రలను కథకుడు ఎందుకు నిర్బంధించాలో నాకు అర్థం కాకుండా ఉంది. నా విశ్వాసాలను నేను నా పాత్రలమీదగానీ, పాఠకుల మీద గానీ ఎందుకు రుద్దాలి?" అనే అభిప్రాయాలను ప్రకటించిన ప్రగతిశీల రచయిత శ్రీ కొడవటిగంటి కుటుంబరావు.

కులంలేని మనిషి, అరుణోదయం, చదువు, ప్రేమించిన మనిషి, పంచకళ్యాణి, చెదిరిన మనుషుల, గడ్డురోజులు, వారసత్వం, సరితాదేవి డైరి , జీవితం, ఎండమావులు, అనామిక, ఆడజన్మ, తార, కొత్తకోడలు, కొత్తఅల్లుడు, బ్రతుకు భయం, తిమింగలవేట, అయిశ్వర్యం, అనుభవం మొదలైన ఇరవైనవలలు, వందలాది కథలు ద్వారా ఆధునిక తెలుగు సాహిత్యంలో శ్రీ కుటుంబరావు విశిష్టమైన స్థానాన్ని సంపాధించాడు.

### 18.2.1 "పంచకళ్యాణి" నవల సారాంశం :

"పంచకళ్యాణి'' నవలలో వివాహ వయస్సుకు వచ్చిన అయిదుగురు ఆడపిల్లల ఆశలూ, ఆశయాలూ, స్వప్నాలకూ సామాజిక వాస్తవికతకూ మధ్యనున్న సంఘర్షణలో ప్రేమ ఒక అందని మావిపండుగా మారడం చిత్రింపబడింది. ఆ అయిదుగురూ అయిదు రకాల వాతావరణాలలో పెరిగి, భిన్నభిన్న మనస్తత్వాలను అలవరుచుకున్నారు. అయినా వారు ఎదుర్కొన్న సామాజిక సంబంధాల స్వరూపం ఒక్క మాదిరిగానే ఉంది.

1957 నాటికే బాల్యవివాహాలు పోయాయి. ఆడవాళ్ళు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం మొదలయింది. కాని ఆదే స్వాతంత్ర్య కాదు. స్త్రీ-పురుషుల మధ్య సమానత్వదృష్టి ఏర్పడలేదు. అది అవసరం అనే భావం మాత్రం ఏర్పడింది, అంతవరకే.

'తరతరాలుగా స్త్రీ బానిసలకు బానిసగా పెరిగింది. ఆడదాన్ని కాళ్ళూచేతులూ కట్టేసి, చావచితికగొట్టి, చీకటికొట్లో వేసి ఉంచారు. ఈ వేళ నువ్వు స్వతంత్రురాలివే. పరుగెత్తమంటే?సాధ్యమా??' అంటుంది లలిత. అందుచేతనే 'ప్రేమ ఒక ఉచ్చు, ఊబి' అనుకుంది ఆ దృష్టితోనే తనను ప్రేమించి , పెళ్ళిచేసుకున్న రామారావు ప్రేమాభిమానాలను అంచనావేసుకుంది. తన జీవితాన్నీ, అతని జీవితాన్నీ నరకం చేసుకుంది.

ఆ అయిదుగురమ్మాయిలలో సుశీల ఒకరు. ఆమె సవతితల్లి సుందరమ్మ జీవిస్తున్న బతుకును చూసి అదిరిపోయింది. చేతికీ, నోటికీ అందని ఆ దిగువ మధ్యతరగతి కుటుంబంలో సుందరమ్మకు "జీవితంలో ఒక్క ఆనందమూలేదు. మామూలు

ఆడది కోరే ప్రతి అల్పసుఖం మీద విముఖత్వం పెంచుకుని గానుగెద్దు జీవితం గడుపుతున్నది. ఆమెది ప్రాయోపవేశం'' అనుకున్నది సుశీల.

సుందరమ్మను గురించి ఆలోచిస్తే సుశీలకు ఒళ్లు గగిరిబోడిచేది. తన జీవితం కూడా అట్లా కావలసిందేనా? ఇంకోవిధంగా అవుతుందనుకోవటానికి ఆధారాలు లేవు. సుశీలకు సినిమాలూ, నాటకాలూ, పుస్తకాలూ, పాటకచ్చేరీలు ఇష్టం. మీటింగులకి వెళ్ళటం ఇష్టం. ఆడదాని జీవితమంతా ఇంట్లోనే వెళ్ళిపోవాలా? నాలుగుగోడల అవతల ఆడదానికి జీవితం లేదా? - అని ఆలోచించేది.

కాలానికీ, ధర్మానికీ, నీతికీ కట్టుబడి తనపిన్ని ఒకపక్క గొడ్డులాగా జీవిస్తుంటే; అన్నింటికీ తిరగబడిన దుర్గాంబ అందలాలెక్కి ఊరేగుతున్నది ఆవిణ్ణి ఇంజనీరుగారు ఉంచుకున్నారు. తమ ఇంటికి రెండిళ్ళ అవతలే ఇంజనీరు గారిల్లు. ఆయనకు వేరే పెళ్లాం పిల్లలూ ఉన్నారుట. వాళ్ళెక్కడో పల్లెటూళ్లో ఉంటున్నారు. దుర్గాంబను వెంటేసుకుని ఈయన ఊళ్ళూళ్ళూ తిరుగుతాడు. ఆయనకు రిటైరయ్యే వయసు. దుర్గాంబకు ముప్పై ఉండవచ్చు. దుర్గాంబకు ఏం లోపం వచ్చింది? ఆవిడ మర్యాదకేం జరిగింది? “నేను చాతనయితే దుర్గాంబలాగా బతకుతాను గానీ, చచ్చినా మా పిన్నిలాగా బతకను '' అని నిర్ణయించుకుంది సుశీల.

ప్రేమను గురించి సుశీలకు కొన్ని ధర్మసందేహాలున్నాయి. ప్రేమ అంటే భ్రమ. అన్ని భ్రమలలాగే అది కూడా ఎప్పటికైనా వదిలిపోకతప్పదు. అదీగాక, ఇంకొకళ్లు ప్రేమించాలంటే ఆడదానిలో ఎంతో ఆకర్షణ ఉండాలి. తనలో ఎక్కువ ఆకర్షణ లేదని ఆమెకు తెలుసు. మొహం కుదురుగానే ఉంటుంది, కానీ ఒళ్ళులేదు.

సుశీల పెళ్ళికోసం రెండేళ్ళుగా ప్రయత్నాలు సాగుతున్నై. నలుగురైదుగురు వచ్చి చూసి వెళ్ళారు కూడా. ఎవరికెవరు నచ్చకపోతేనేం, ఒక్కటీ ముడిపడలేదు. ఆడదానికి వరుడు దొరకాలంటే కట్నం ఉండాలి. పిల్లకు అట్టే చదువుండరాదు. డిగ్రీలు కల పిల్ల శీలం లేనిదానితో సమానం.

“చటికీ మాటికీ కర్మ అనుకోవలసివస్తే జీవితంలో ఏదో పెద్దలోపం ఉందనే అనుకోవాలి'' అని సుశీల వింటుండగానే ఎవరో అన్నారు. సుశీలకు జీవితం నిండా కర్మయొక్క ప్రవర్తనే కనిపిస్తుంది.

సుశీల తండ్రి సీతాపతిగారికి దూరపు బంధువు రామకృష్ణారావు. అతను తమ ఇంటికి వచ్చినప్పుడల్లా ఏదో కూరలూ, చీరలూ, దోవతులూ తెస్తూనే ఉంటాడు. సీతాపతి ప్రాణానికి అవి విలువైనవే అయినా, రామకృష్ణారావు కాల్చిపారేసే సిగరెట్ల ఖరీదు చెయ్యవు.

ఆవేళ రామకృష్ణారావును చూడగానే సుశీలకు దురాలోచన మెరుపులాగా మెరిసింది. అతనికి భార్యా, ముగ్గురు పిల్లలూ ఉన్నారు. భార్య అందంగానే వుంటుంది గాని విపరీతమైన లావెక్కిపోయింది కదలలేదు. రామకృష్ణారావుకు తనంటే ఇష్టంలేకపోలేదు. అవకాశం దొరికినప్పుడల్లా సుశీల బుగ్గలు నిమురుతాడు. “కొంచెం లావు కారాదూ? చూడలేకుండా ఉన్నాం'' - అంటాడు.

అతనీసారి బ్రహ్మాండమైన కొత్తకారులో వచ్చాడు. ఇంట్లో అడుగుపెడుతూనే - “ఏం పిల్లా ఎక్కడికో ప్రయాణమైనట్లున్నావే? '' అన్నాడు. “మా స్నేహితురాలింటికి'' అన్నది సుశీల, తనలో రేగిన దురాలోచనతో ఉక్కిరిబిక్కిరి అవుతూ.

“నేను డ్రాఫ్ చేస్తాలే '' అన్నాడు రామకృష్ణారావు. ఒక పావుగంటసేపు కూచుని, మర్నాడు ఉదయం వస్తానని బయలుదేరాడు. సుశీల అతనితో పాటు బయలుదేరి, కారు వెనుకసీటులో ఎక్కికూచుని “కొత్తకారా?'' అన్నది.

“వారం రోజులుయింది. మనం ఎటు వెళ్లాలి?'' అన్నాడు. రామకృష్ణారావు. “నాకు తెలీదు. నీ ఇష్టం. ఏదన్నా సినిమాకు పోదాం. సినిమా చూసి ఆరు నెల్లయింది''- అన్నది సుశీల. కనీసం మరో మూడు గంటలపాటు రామకృష్ణారావుతో గడపాలంటే అదే మంచి పద్ధతిగా భావించింది.

"అయిదు ఇరవై అయింది. మనం ఎటు వెళ్లాలి?" హోటలకు వెళ్ళి, సినిమాకు పోదాం" అన్నాడు రామకృష్ణారావు. ఆమె తన అంగీకారాన్ని తెలిపింది రామకృష్ణ సుశీల చెయ్యి తన చేతిలోకి తీసుకున్నాడు. రిస్టువాచీ చూసే మిష మీద ఆమె అతని చెయ్యిముందుకు లాక్కుని తనతొడమీద పెట్టుకున్నది.

రామకృష్ణారావు ఆడవాళ్ళను వేటాడే రకమూ కాదు. పర స్త్రీలను కన్నెత్తి చూడని రకమూకాదు. అతనికి ఆడవాళ్ళ విషయంలో అంతరాత్మఉన్నది. ఒకసారి ఒక స్త్రీ మీద ప్రేమ కలిగితే ఆ ప్రేమ అతని మనస్సులో ఏళ్ళతరబడి చెరిగిపోకుండా ఉంటుంది. వాళ్లు జ్ఞాపకంవస్తే అతనికి ఆనందం కలుగుతుంది. వాళ్ళు కూడా తనను అంత ఆర్తిగానే ప్రేమిస్తున్నారని అతను సంకోచం లేకుండా నమ్ముతాడు. అతనికి సుశీల అంటే మొదటినించి అభిమానం, జాలికూడా. ఏటా ఫస్టుక్లాసులో పాసయి, స్కాలర్‌షిప్పుతో చదువుకుంటున్నది. బీదరికం మూలంగా ఒక్కనగలేకుండా, తన కిష్టమైన సినిమాలూ, పాటకచ్చేరీలు ఏమీ చూడకుండా, ఆఖరికి పత్రికలు కూడా అరువు తెచ్చిచదువుతూ కాలం వెళ్ళబుచ్చుతున్నది.

కారుహోటల్ చేరింది. ఇద్దరూ లిఫ్ట్‌లో పైకి వెళ్ళి కారిడార్‌లో నడుస్తున్నారు. రామకృష్ణ సుశీల నడుమూ చుట్టూ చేయివేశాడు. ఆమె అతని చేతిని మెల్లగా విడిపించింది. గది తలుపు తెరిచేటప్పుడు అతని చెయ్యి వణికింది అతని మనస్సులో కోరికి తన్నుకు వస్తున్నది. సుశీల మీద ప్రేమ క్షణక్షణానికీ తీవ్రమవుతున్నది. వాడిపోతున్న మొక్కకు నీళ్లు పోయ్యటం ఎంత సహజమైన పనో, సుశీలకు ప్రేమ ఇవ్వటం అంత సహజమైన ధర్మంగా అతనికి కనబడింది. తన పరాయి వాడు కాదు. సుశీలకు తన కన్నా ఆప్తుడుండడు. తన కన్నా ఎక్కువ ఇష్టంగా చూసేవాడు కూడా ఉండబోడు.

"అలా మంచం మీద కూచో" అన్నాడు. సుశీల గుండె దడదడలాడుతున్నది. ఆమె మనస్సు మాత్రం రాయిలాగా ఉన్నది ఇంకొకడి మొదటి భార్యగా ఉండే కన్నా రామకృష్ణకు రెండోభార్యగా ఉండటం లక్షరెట్లు నయం. తన జీవిత సమస్యకు ఇదే పరిష్కార మార్గం.

రామకృష్ణ నవ్వుతూ మంచం మీద సుశీల పక్కన కూచుని, ఆమె చుట్టూ చేతులు వేసి దగ్గరికి లాక్కున్నాడు. సుశీల నిర్ఘాంతపోయిన దానల్లే అతనికేసి చూసింది. అతడు ఆమెను గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు. సుశీల మనస్సు ఒక్కనిట్టూర్పువిడిచింది. రామకృష్ణ తనకు సుశీల మీద ఉన్న ప్రేమను నోటి మాటలతో చెప్పలేదు. ఆమె కాప్రేమ అతని కళ్లలో కనిపించింది. అతని పెదవుల్లో కనిపించింది. క్షణికమో, తాత్కాలికమో, శాశ్వతమో -ఏమైనా నిజమైన ప్రేమను, గాఢమైన ప్రేమను ఏ ఆడదీ నిరాకరించలేదు.

సుశీల రామకృష్ణ గాఢ పరిశ్వంగంలో ఒదిగిపోయింది. అతను నిగ్రహించుకోలేనంద ఉద్రేకంతో ఆమెను అల్లుకుపోయాడు.

"నా పెళ్ళి ఇవాళ ఈ విధంగా రాసిపెట్టి ఉందన్న మాట" అన్నది సుశీల, తన చెంప రామకృష్ణ చెంపకు చేర్చి నిట్టూర్చుతూ. అలా సుశీల, రామకృష్ణారావుకు రెండవభార్యగా ఉండిపోయింది.

లలిత కోసం, వాళ్ళన్నయ్య నారాయణ జానకి వాళ్ళింటికి వెళ్లాడు. అక్కడ తాయారు నాన్న విశ్వనాథంగారు నారాయణను పట్టుకుని అరగంటసేపు ఇంటర్వ్యూ చేశాడు.

"ఉద్యోగం దొరికిందట కదా మరిపెళ్ళి చేసుకోవా? బ్రహ్మచారి ముదరటం, బెండకాయ ముదరటం అని సామెత" అన్నాడు. "కట్నం ఆశ ఉన్నదా?" అనడిగాడు. తయారు నారాయణను చూసి ఒకటే ముసిముసి నవ్వులు.

"విషయమేమిటో నువ్వుకూడా తయారును కదిటించి చూడు" అన్నాడు నారామణ, లలితతో.

"కదిలించేదేమిటి? నువు సరేనంటే ఎగిరి గంతేస్తుంది. పెళ్ళి చేసుకుంటే ఎరిగిన వాణ్ణి తప్ప చేసుకోనని ఇదివరకే అన్నది. ఎరిగిన వాళ్ళలో నాకు తెలిసిన వాళ్లు నువ్వూ, కమలాకరం. కమలాకరం నీకన్నా దగ్గరివాడే అనుకో. కానీ తాయారుకు అతనంటే చాలా వేళాకోళం."

నారాయణ సుద్ధంగా ఆలోచించాడు. తాయారును తన మనస్సులో కొలిచాడు. తూచాడు. ఖరీదు కట్టాడు. కెమికల్ ఎగ్జామినేషన్ చేశాడు. తాయారు తనభార్య కావటం వల్ల లాభమా, నష్టమా అని లెక్కలు వేసుకున్నాడు. తాయారు చూడటానికి బాగానే ఉంటుంది. రంభకాదు, అనాకారికాదు. తెలివితేటలు విశేషంగా లేవు, కానీ తెలివితక్కువ మనిషి మాత్రం కాదు. తెలివితేటలు విశేషంగా లేవు, కానీ తెలివితక్కువ మనిషి మాత్రం కాదు. అప్పుడప్పుడు మొండి పట్లు పడుతుందని లలిత చెప్పింది, అయినా మెతక మనిషే. అటువంటి భార్యతో తను సుఖపడగలడు. పైగా , విశ్వనాథం గారికి పొలాలూ, ఆస్తీ ఉన్నాయి. ఆయనకు ఈ ఒక్కటే సంతానం. కనుక తాయారుకు కొంత ఆస్తిరావచ్చు.

నారాయణ తాయారును కొత్తకళ్ళతో చూశాడు. వీధి దీపం వెలుతురులో ఆమె చెంప నున్నగా ఉన్నది. ఆమె కింది దవడ మీదా , మెడమీదా, చెవికి ఉన్న జూంకీ నీడపడుతున్నది.

నారాయణను గురించి తాయారుకు ప్రత్యేకించి ఏ అభిప్రాయమూలేదు. అతను తన చెల్లెలి స్నేహితురాళ్ళతో కమలాకరం లాగా, స్నేహం కలపడు. అసలు మాట్లాడడు. లలితకోసం తాయారు చాలాసార్లు వెళ్ళింది. లలిత ఇంట్లో లేకపోయినా, లోపల ఏదన్నా పనిమీద ఉన్నా, ఆ సంగతి చెప్పడానికి మాట్లాడతాడు తప్ప, పోచికోలు కబుర్లలోకి ఎన్నడూ దిగడు. అతన్ని పెళ్ళి చేసుకుంటే బాగానే ఉంటుందనిపించిందామెకు.

తాయారు, నారాయణతో కలిసి పార్కుకు వెళ్ళింది. ఇద్దరి అభిప్రాయాలూ కలిశాయి. మరో రెండు వారాల్లో వీళ్ళ పెళ్ళి కుటుంబ సభ్యులందరి ఆమోదంతో జరిగిపోయింది.

జానకి పెళ్ళి, ఇంగ్లీష్ లెక్చరర్ సుభాకరమూర్తితో చాలాబాగా జరిగింది. సుజాత ఒక పాటపాడింది. "పెళ్ళి చాలా చక్కగా జరిగింది." అని అందరూ అంటుంటే జానికి సంతోషించింది. కానీ, ఆమెకు తాను ఈ పెళ్ళిలో పాల్గొన్నట్టే లేదు. ఎక్కడో ఇంకో గ్రహం మీద ఉండి, జరిగేదంతా గమనించినట్టుతోచింది.

సుధాకరం మటుకు చాలా ఉత్సాహంగా ఉన్నాడు. అతనికి అంతులేని టెలిగ్రాములు వచ్చినై. తన మొగుడు అందరితోనూ బడిపంతుల్లాగే మాట్లాడటం జానకి గమనించింది. పెళ్ళిరోజు తనతో కూడా ఆ విధంగానే మాట్లాడాడు. కానీ తనతో ఒంటరిగా ఉన్నప్పుడు కూడా అలాగే మాట్లాడతాడని జానకి కలలో కూడా అనుకోలేదు. "వెల్" అన్నాడతను పడకగది చుట్టూ కలియ చూస్తూ." ఇది మన ఇద్దరి జీవితాలలోనూ ఒక ముఖ్యమైన ఘట్టం. ఒక కొత్త సముద్రంలోకి తెప్పవేసుకుని బయలుదేరుతున్నాం. ఇప్పుడిది ఒక చిన్న డింగీ. దీన్ని మనం బ్రహ్మాండమైన నావగా తయారు చేసుకునే భారం మన ఇద్దరి మీదా ఉన్నది. ఈ సముద్రంలో మనం ఎన్ని తుఫానులను ఎదుర్కోవాలో, చివరికి ఏ తీరానికి చేరుతామో " అంటూ చిన్నగొంతుతో, అతి గంభీరంగా, ఇంగ్లీషులో ఉపన్యసించాడు. జానకికి మతిపోయినట్టయింది. ఆమె బుర్ర పనిచేయలేదు. అంతావిని, "అవును" అన్నది.

ఆ రాత్రి ఆమె తన భర్తను గురించి అనేక విషయాలు తెలుసుకున్నది. అతను ఆడదాని మోహం ఎరుగడు. స్త్రీలమీద పురుషులకుండే వ్యామోహం అంత ఘనమైనది కాదని అతని ఉద్దేశం. వాళ్ళ మధ్య సంపర్కం అనారోగ్యకరమైనది. క్రూరమైనది. అసహ్యమైనది. కానీ, సృష్టి కొనసాగాలి గనక ప్రకృతి ఈ సంబంధం వెంట సుఖం కూడా ఏర్పాటు చేసింది. ఈ సుఖమే లేకపోతే సృష్టి ఏనాడో నిలిచిపోయేది.

ఏమైనా ఆ రాత్రి జానకికి ఆ సుఖం కూడా ఏమంత అనుభవం కాలేదు.

జానకి ఒక విచిత్రమైన ప్రపంచంలోకి అడుగు బెట్టింది. సుధాకరమూర్తి ఇంట బలగం జాస్తి. అతనికి బోలెడంతమంది అక్కలూ, చెల్లెళ్లూ ఉన్నారు. అయిదుగురు పినతల్లులున్నారు. వారిలో కడగోట్టుది జానకి కంటే రెండేళ్ళు మాత్రమే పెద్దది. ఆవిడా, ఆవిడభర్త చలపతి కూడా ఈ ఇంట్లోనే ఉంటున్నారు.

సుధాకరం, అతని తండ్రీ సుధాకరం పిన తల్లిగారి భర్త చలపతి - ఈ ముగ్గురు ఆ ఇంటికి మగవాళ్ళు అందులో కూడా సుధాకరం తండ్రి రోగిష్టి. ఆయనకు ఉబ్బసం ఉంది. ఎర్ర శాలువా ఒకటి చుట్టుకుని మంచం మీద కూచుని ఉంటాడు అస్తమానం. సుధాకరం పినతల్లులు మరి ఇద్దరు ఈ ఊళ్లోనే ఉంటున్నారు. అతనికి ముగ్గురు మేనమామలున్నారు. ఊళ్లో చాలామంది బంధువులున్నారు. అందరూ వస్తూపోతూఉంటారు.

ఈ బంధువర్గాన్ని జానకి కొంచెం కూడా భరించలేకపోయింది. ఆమె ప్రాణానికి వాళ్ళ తేళ్ళలాగా కనిపించారు. వాల్ళు అస్తమానం ఎవరినో ఒకరిని ఎద్దేవా చేస్తూనే ఉంటారు. దేశంలో ఇంతమంది నాయకులూ, గాయకులూ, నటులూ, రాతగాళ్లూ ఉన్నారు. అందరినీ వాళ్ళు వేళాకోళం చేస్తారు. ఇమిటేట్ చేస్తారు. వాళ్ళకి ఎవరి అందమూ నచ్చదు.

జానకి అత్తవారింట అడుగుపెడుతూనే తన పెళ్ళికి సంబంధించిన విమర్శ యావత్తూ విన్నది. తన పెళ్లిలో అన్ని అవకతవకలు జరిగినట్లు ఆమె కలలో కూడా అనుకోలేదు. తనవైపు వాళ్లను పిల్లలు ఇమిటేట్ చేయడం చూసింది.

"ఇంకొకళ్ళను హేళన చేయడం, నొప్పించడం వీళ్ళకు ఆనందంలో ఉంది'' అనుకున్నది జానకి. వీళ్ళ విచిత్రమైన మనస్తత్వం ఒక్కనాడుగా వచ్చినది కాదు. దీని వెనుక రెండు మూడు తరాల సంచితం ఉన్నది. వీళ్ళ దృష్టిలో తమకు అందరూ, అన్ని విషయాలలోనూ తీసికట్టే. తమతో ఏకీభవించనివారూ, తమకు విలక్షణంగా ఉండేవారూ మరింత తీసికట్టు. వాళ్ళ మధ్యకు కొత్త మనిషిరాగానే, తమకూ ఆ మనిషికీ మధ్యగల వ్యత్యాసాలన్నీ లెక్కగడతారు. వాళ్ళ జీవితాశయం ఏమిటో జానకికి చచ్చినా అంతుబట్టలేదు.

ఆ ఇంట్లో పరాయివాళ్ళు జానకీ, చలపతీను. ఈ ఇద్దరి మీదా వాళ్ల విసుగులేకుండా హాస్యం చేసేవాళ్లు. చూసిచూసి జానకి తన భర్తను అడిగింది- '"మీవాళ్ళ దృష్టిలో మెచ్చుకో దగిన వాళ్ళెవరు?'' అని. "అంటే?'' అన్నాడతను.

"మారేం లేదు. జవాహర్‌లాల్ నెహ్రూకు రాజకీయాలు తెలీవంటారు. సి.వి. రామన్‌కు సైన్స్ తెలీదంటారు. అందరినీ వెటకారం చేస్తారు. మీవాళ్ళకు నచ్చిన వాళ్ళెవరైనా ఉన్నారా?' అనడిగింది జానకి.

"అదా? ఆ మాత్రానికే అంతసీరియస్ అయిపోతున్నా వేమిటి? అదంగా హ్యూమర్. నీకు కాస్త సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఉండాలి మరి?'' అన్నాడతను. జానకికి మరింత కోపం వచ్చింది.

"మీ చెల్లెళ్ళెవరూ కాలేజీ చదువు చదవలేదని కాబోలు, కాలేజీలో చదివిన వాళ్ళని తెగతిడతారు. వాళ్ళకు నీతి ఉండదు, అతిశయం జాస్తి అంటారు. నా కోసమే ఇదంతా చెబుతున్నారనుకుంటాను. నాకు ఒకటే సందేహం. చదువుకున్న వాళ్లను ఇంత కాచివడబోసిన వాళ్ల మిమ్మల్ని ఈ పెళ్ళి ఎందుకు చేసుకోనిచ్చారో నాకర్థంకాదు.''

''నువ్వు అనవసరంగా ఆర్భాటం చేసి, లేనిపోనివన్న ఊహించుకుంటూన్నావు-'' అన్నాడు కార్మికుల ప్రశ్నలకు యజమానులిచ్చే సమాధానం ఇస్తూ.

జానకి సుఖం గురించి సుధాకరం ఏనాడూ ఆలోచించిన పాపాన పోలేదు - ఆమెను తానై సుఖపెట్టడం మాట దేవుడెరుగు.

ఆ ఇంట్లో జానకి పట్ల సానుభూతిగల ఏకైక జీవి చలపతి. ఒకసారి అతనికి ఒక పావునిమిషం పాటు జానకితో మాట్లాడే అవకాశం దొరికింది.

"వీళ్ళు పరమనీచులు. నిన్ను ఇంకా కాల్చుకు తింటారు. వీళ్ళు ఇప్పించిన ఉద్యోగం చేస్తున్న పాపాన నేనీ నరకకూపంలో ఇరుక్కున్నాను. బయటికి పోవటం నా తరం కాకుండా ఉంది. నిన్ను చూసి జాలి పడడం తప్ప ఏమీ చెయ్యలేకుండా ఉన్నాను. కాకి ముక్కుకు దొండపండును కట్టినట్లు నిన్ను ఈ వెధవకు కట్టారు. వాణ్ణి కాలేజీ కుర్రాళ్ళు టార్జాన్ అని పిలుస్తారు '' - అన్నాడు చలపతి, జానకితో.

అది జరిగింది మొదలు జానకి చలపతిని జాగ్రత్తగా గమనించింది. ఒక్కొక్కసారి అతను తనకేసి చాలా ప్రేమగా చూసేవాడు. ఆమె చూస్తున్నదని తెలిస్తే, చూపు మరల్చేసుకునే వాడు. ఒక్కసారి కూడా సుధాకరం జానకికేసి ఆ విధంగా చూడలేదు.

"చలపతి నన్ను ప్రేమిస్తున్నాడా? పిచ్చివాడు. ప్రేమ అంటే భ్రమ తప్ప ఇంకేమీ లేదు. సంసార సుఖమే చాలా అసహ్యమైనది" - అనుకున్నది జానకి. శరీర సుఖం గురించి తన భర్త కలిగించిన అభిప్రాయాలు తప్పవేరేలేవు. అదివరకు ఏమైనా అభిప్రాయాలుంటే అవన్నీ భ్రమలన్న భావం సుధాకరం ఆమెలో నాటాడు.

చలపతి, జానకిని గురించే ఆలోచిస్తూ ఒక రాత్రి బాగా చీకటిపడి ఇల్లు చేరాడు. హాలు తలుపు తోసేసరికి, తులుపు అవతల జానకి ప్రత్యక్షమయ్యింది.చలపతికి ఏదో పూనినట్టయింది. అతను జానకిని దగ్గరికి లాక్కుని, రొమ్ముకు గట్టిగా అదుముకొని, ముద్దు పెట్టేసుకున్నాడు. మరుక్షణం అతను కంగారుగా ఆమెను విడిచిపెట్టి, "మతిపోతున్నది" అని గొణుక్కుంటూ లోపలికి వెళ్ళాడు.

జానకి బుర్రలో విమాన యుద్ధం లాంటిది జరుగుతున్నది. కానీ, ఆమె ఏమీ జరగనట్టే తులుపు గడియాపెట్టి, దీపం ఆర్పి లోపలికి వెళ్ళింది. జానకికి అదొక అపూర్వమైన అనుభవం. ఆమెను ఎవరూ అంత అపేక్షగా ముద్దపెట్టుకుని ఉండలేదు. తనలో ఒక భాగం శాశ్వతంగా చలపతి కౌగిలింతలో చిక్కుకుపోయినట్టుంది. కదులుతున్నా, కూర్చున్నా, అన్నం తింటున్నా ఆ కౌగిలి తనను వదిలేట్టు లేదు.

ప్రేమను గురించి ఆలోచించినప్పుడల్లా జానకికి సుశీల జ్ఞాపకం వచ్చేది. సుశీల వివాహం ప్రేమ వివాహమనే ఆమె అనుకున్నది. సుశీలాగా పెళ్ళాం పిల్లల గలవాణ్ణి బలవంతాన పెళ్ళాడటంలో గౌరవమేమున్నది? పెళ్ళినాటికే సుశీల గర్భిణి. అతనికి సుశీల మీద ఆవగింజంతయినా ప్రేమ ఉండి ఉండదు సుశీల గర్భిణి కావడం చేతా, ఆమె తండ్రి ఒత్తిడి చేతా పెళ్ళాడి ఉంటాడని జానక ఊహ.

మగవాడి కంతగా ప్రేమోన్మాదం కలిగినా, ఆడదానికి కలగకుండా ఉంటే మంచిది. ఏ చిక్కూ ఉండదు. ఆడదానికి మతిపోతేనే కొంపటంటుకునేది. కనీసం ప్రస్తుత ప్రపంచ పరిస్థితీ అది. అందుకని జానకి చలపతి ప్రేమలో పడదలుచుకోలేదు. తన మొగుడే తనను ఇంకాస్త ప్రేమగా చూస్తే బాగుండనని పించింది జానకికి.

గుంటూరులో ఒక పొగాకు కంపెనీలో చలపతికి ఉద్యోగం దొరికింది. ఇప్పుడున్నంత జీతమే ఉంటుంది. కాకపోతే బోనసులు బాగా ఇస్తామన్నారు. "నేను వెళ్ళదలిచాను. వెళ్ళి తీరుతాను. శారదా। నువు ప్రయాణానికి రెడీగా ఉండు" అన్నాడు చలపతి.

"ఈ ఎండల్లోనా? గుంటూరా? నేను రాను" అన్నది శారద. శారద దగ్గర్నించి, అందరూ నోళ్ళు పారేసుకున్నారు. పిచ్చికుక్కలను రెచ్చగొట్టినట్లయింది. అందరూ ఒక్కసారిగా మొరిగారు. శారద అతని వెంట వెళ్ళడానికి ఒప్పుకోలేదు.

అతను వెళ్ళి పోయాక ఇల్లు శాంతపడింది. అమ్మయ్య ఒక బెడద వదిలింది అనుకున్నది జానకి. అది అంతటితో అయిపోలేదనీ, ఈ సారి అగ్నిపర్వతం తననెత్తిమీదనే పేలుతుందనీ ఆమె కలలోకూడా ఊహించలేదు.

ఒక రోజు సుధాకరమూర్తి కాలేజీకి బయలుదేరి పోతుండగా, పోస్టు జవాను కనిపించి, "లెటరండీ"। అని అతని చేతికొక కవరిచ్చాడు. కవరుపైన జానకి పేరున్నది. జానకికి ఎవరు రాస్తారు? ఎందుకు రాస్తారు? అందులో ఏమున్నదో తెలుసుకోవాలని ఆ అడవి మనిషి ప్రాణం కొట్టుకుపోయింది. అతను కవరు చించి , ఉత్తరం చదవడం ప్రారంభించాడు.చదువుతున్న కొద్దీ అతనికి పట్టరాని ఆవేశం వచ్చేసింది.

అది సుశీల జానకికి రాసిన ఉత్తరం.

"మీ పిన తల్లి గారి మొగుడు చలపతట. కొంతకాలం కిందటవచ్చి రామకృష్ణను ఉద్యోగం అడిగాడు. నేను నీ స్నేహితురాలినని నీ ద్వారానే తెలిసిందట. నువ్వు అక్కడ కొంచెం కూడా సుఖపడడం లేదన్నాడు. రామకృష్ణ చలపతికి ఉద్యోగం ఇప్పించాడు. ఒకటో తేదీన వచ్చి, ఆయన ఉద్యోగంలో ప్రవేశించినట్టు తెలిసింది." - ఇదీ ఉత్తరంలోని సారాంశం.

ఉత్తరం చదివేసరికి సుధాకరమూర్తికి శివమెత్తింది. "చలపతి ఇంతపని చెయ్యటానికి అసలు కారకురాలు తన పెళ్ళామే నన్నమాట. ఇంతమంది కళ్ళల్లోనూ కారం చల్లి, వీళ్ళిద్దరూ గూడుపుఠాణీ చేశారా? ఎంతఘోరం. ఎంత అప్రతిష్ఠ, వాళ్ళకుట్ర ఇంకా ఎంతదూరం వెళ్ళిందో ఛీ...ఛీ...."

ఆ సాయంకాలం ఇంట్లో పెద్ద గొడవే జరిగింది. జానకి చుట్టూ సుధాకరమూర్తి కుటుంబ సభ్యులు కాట్లకుక్కల్లా చుట్టూ మూగి మొరగ సాగారు. "నువ్వు కూడా వాడితోనే లేచి పోకపోయినావా? ఇక్కడెందుకు దిగబడ్డావు? ఇంకెవరి కాపురం చెడగొట్టాని? "అంటూ సుధాకరమూర్తి, చాచి జానకి మొహం మీద కొట్టాడు.

ఆ రాత్రి ఆమె భోజనం చెయ్యలేదు.

"నేను మా వాళ్ళింటికి వెళ్ళిపోతాను. పంపెయ్యండి" అన్నది జానకి. "పోదలిస్తే పో నా చేతిమాదుగా పంపటం దేనికి?" అన్నాడు.

మర్నాడే జానకి తండ్రికి ఉత్తరం రాపింది. వెంటనే సత్యనారాయణమూర్తిగారు వచ్చారు. ఆయనతో అందరూ అతి మర్యాదగా ప్రవర్తించారు. ఆయన కూతురు చెప్పిందంతా విని, "పిచ్చిదానా ఈ భాగ్యానికే చేసే కాపురం చెడగొట్టుకుంటావా? ఇంతకన్నా పెద్ద తగాదాలే వస్తవి. సంపెట్టుకోవాలి. నేను అల్లుడితో చెబుతానులే " అన్నాడు. ఆయన తిరుగుబండికి వెళ్ళిపోయినాడు. తండ్రి తనను తప్పకుండా తీసుకుపోతాడని నమ్మటం వల్ల ఆమెకు లలిత జ్ఞాపకం వచ్చింది. జరిగిందంతా లలితకు పూసగుచ్చినట్లు ఉత్తరం రాసింది. మూడో నాటికల్లా లలిత జవాబురాసింది. " నీ ఉత్తరం నామేమీ ఆశ్చర్య కలిగించలేదు.

ఇష్టంలేని కాపురం చేయకు. కావలిస్తే నాదగ్గరకు వచ్చి ఉండు. ఉద్యోగం చేసుకు బతుకుదువుగాని".

జానకికి పట్నం వెళ్ళి, తన తండ్రి ఇంటకాక, ఇంకొకరి ఇంట ఉండటం ఇష్టం లేదు.

తరువాత రెండు రోజులకు సుశీల నుండి ఉత్తరం వచ్చింది. ఆ ఉత్తరం చూస్తే, అంతకు మునుపు సుశీల ఒక ఉత్తరం రాసినట్లు స్పష్టమయింది. ఆ ఉత్తరం ఏమయింది? తన మొగుడు తీసుకుని చూశాడా? అంతపాడుపని చేస్తాడా? ఎందుకు చెయ్యడూ? అందులో సుశీల ఏం రాసింది?

సుశీలకు జానకి జవాబురాస్తూ, తనకు ఆమె రాసి, మొదటి ఉత్తరం అందలేదనీ, చలపతికి ఉద్యోగం ఇప్పించింది తనేనంటూ తనను తిట్టి పోస్తున్నారనీ, తనకు ఇక్కడ దుర్భరంగా ఉందని తెలిపింది.

తిరుగుటపాలో సుశీల, జానకిని గుంటూరు రమ్మని కోరుతూ ప్రత్యుత్తరంరాసింది. "నీకు నిజంగానే సంసారం మీద విరక్తి కలిగితే, వచ్చి నా దగ్గర ఉండు. నీకు ఏదో ఒక ఉద్యోగం కూడా దొరకవచ్చు. జీవితాన్ని చూసి భయపడి ఏమి సాధిస్తాం? నేను చూసినంతవరకూ, అన్నింటికీ అణిగిమణిగి పడి ఉన్న వాళ్ళకన్నా తిరగబడిన వాళ్ళు ఎక్కువ కష్టాలు పడుతున్నట్లు తోచదు. ఒకవేళ పడినా, అవి ఇతరులు తెచ్చి పెట్టిన కష్టాలంతగా బాధించవు" - అని సుశీల తన అభిప్రాయం తెలిపింది. జానకి దీర్ఘంగా ఆలోచించ సాగింది.

ఈ నరకంలో ఉండడం కన్నా, స్వేచ్ఛగా ఎగిరిపోవడమే మేలని జానకి భావించింది. తన పుట్టింటిలో దిగబెట్టమని భర్తను కోరింది. అతను వినలేదు. తన దగ్గరున్న కొద్దిపాటి డబ్బుతో జానకి, గుంటూరులో ఉన్న తన స్నేహితురాలు సుశీల వద్దకు వెళ్ళింది.

జానకి, చలపతితో లేచిపోయింది, ఆమె భర్తే ప్రచారం చేశాడు. నలుగురూ అలాగే అనుకున్నారు.

తన మీద పగలేకపోయినా, ఏ మాత్రమో అభిమానం ఉన్నవాళ్ళు సహితం తనను గురించి ఎట్లా చెప్పుకుంటున్నారో తెలిస్తే , జానకి నిర్ఘాంతపోయి ఉండును. కాని, మంచి చెడ్డలను గురించి మనుషుల కుండే విచక్షణ జీవితానికి ఉండదు.

ఆమె గుంటూరు చేరినాక చలపతిని చూసింది. అతని వెంట అతని గదికి వెళ్ళింది. చలపతి ఈ సారి ఏమాత్రమూ ఆత్మ నిగ్రహం కోసం యత్నంచలేదు. అంత కాలంగా అణచిపెట్టుకున్న ఆమె మీద ప్రేమ కట్టలు తెంచుకున్నది. ఆ రాత్రి జానకి అతని దగ్గరే ఉండిపోయింది. ఆ విధంగా లోకవాదు ఒక విధంగా నిజమే అయింది. కాని, ఆ లోకవాదును బట్టి జానకిని గురించి గానీ, చలపతిని గురించిగానీ, జానకి భర్తను గురించిగానీ, మిగిలిన వాళ్ళను గురించిగానీ, ఎవరూ ఏమీ తెలుసుకోవడం సాధ్యం కాదు. ఏ లోకవాదైనా అంతే.

ఈ లోపుగా జానకి పుట్టిల్లు చేరింది. సత్యనారాయణ మూర్తిగారు గుంటూరు వెళ్ళి , కూతురును వెంటబెట్టుకుని వచ్చారు. " ఈ పని ఆనాడే చేస్తే ఎంత బాగండేది? నాకు ఎంత అప్రతిష్ఠ తప్పేది'' అన్నది జానకి తండ్రితో.

జానకి ఊళ్లోకి వచ్చిందని తెలిసి, ఆమె స్నేహితురాళ్ళు ఒకొక్కరే వచ్చి చూశారు. ప్రతి ఒక్కరితోనూ జానకి అబద్ధం చెప్పింది. తనకూ, చలపతికీ ఏ సంబంధమూ లేదన్నది. ఆ అబద్ధం చెప్పకుండా తనను గురించి నిజం చెప్పడం ఆమెకు సాధ్యమయ్యేట్టు కనిపించలేదు. తానీ అబద్ధం ఆడకపోతే, తన భర్తలోకానికి చాటిన ఘోరమైన అబద్ధమే అందరికీ నిజంలాగా తోస్తుందని ఆమె భావించింది.

లక్ష్మీ పెళ్ళికోసం ఆమె అన్నలిద్దరూ మహాహైరానాపడ్డారు. "మీరు అనవసరంగా శ్రమ పడకండి. నాకు మంచి సంబంధాలు రావు. మంచి సంబంధం కాకపోతే, నేను ప్రాణం పోయినా చేసుకోను. డబ్బు తగలేసి పత్రికల్లో ప్రకటనలు కూడా ఏమిటి?'' అన్నది లక్ష్మి.

"పెళ్ళి చేసుకోక దీపపు శెమ్మలాగా ఎంతకాలం ఉంటావు? ప్రపంచమంటే కూరల అంగడి. మనకు శక్తి ఉన్నంతలో మంచి కూరలు చూసి కొనుక్కోవాలిగానీ, నీకు కావలసిన దేవతాకూరల కోసం ఏళ్ళ తరబడి వెతికి, అవి దొరక్క, ఇంటికొచ్చి పస్తుపడుకుంటామా? '' అన్నాడు శంకరం.

"ఎవరన్నా అన్నా చెల్లెల్లుంటే , మనిద్దరం ఎదురెదురు చేసుసుకోవచ్చు'' అన్నాడు సీతారాం.

"ఇదంతా జరిగేదికాదులే '' అన్నది లక్ష్మి.

"పెళ్ళి చేసుకోక ఏం చేద్దామని? '' అన్నడు శంకరం.

"ఏదన్నా ఉద్యోగం చేసుకుంటాను'' అన్నది.

"ఉద్యోగం ఉంటే మొగుడూ మొద్దులూ అక్కర్లేదనా?'' అన్నాడు శంకరం. అంతేకాదు పట్టువదలనివిక్రమార్కుడిలా పత్రికలకు ప్రకటనలిస్తూనే ఉన్నాడు. ఒకనాడు శంకరానికి ఒక మంచి ప్రకటన కనిపించింది. "రెండుణాలు దండగే, అయినా ఒకరాయి విసిరి చూద్దాం. "అంటూ శంకరం ఆ ప్రకటనకు జవాబురాశాడు. నాలుగో నాటికల్లా జవాబు వచ్చింది. శంకరం రాసిన వివరాలన్నీ, తనకు నచ్చాయనీ, పిల్ల తనకూ, తను పిల్లకూ నచ్చితే వీలయినంత త్వరగా పెళ్ళి జరుగవచ్చునీ, తనకు కట్నం మీద

కాంక్ష లేదనీ, పిల్ల తరపువాళ్ళు తమ ఇష్టానుసారంగా ఏవైనా లాంఛనాలు జరిపితే , జరుపవచ్చుననీ, నగలు పెట్టడం గురించి కూడా తనకు షరతులు పెట్టడానికి వీలులేదనీ రాశాడు.

"ఈ దెబ్బతో లక్ష్మీ పెళ్ళి చేసేస్తా. నా అంతరాత్మ ఆ మాట చెబుతున్నది. "అన్నడు శంకరం. అంతసుముఖంగా సమాధానం వచ్చిన సంబంధం అదొక్కటే.

తీరా అనుకున్న సమయం కన్నా చాలా ఆలస్యంగా వచ్చాడు ప్రకటన పెళ్ళి కొడుకు. బాగా చూసిన మొహం. లేక, ఎరిగున్న మనిషిపోలిక. లక్ష్మీ బుర్ర పనిచేసింది. ఆ మనిషి ఎవరో ఆమె పోల్చుకున్నది. ఆమె జానకి మొగుడు సుధాకరమూర్తి గౌరవంగా అతనితో మాట్లాడి, సాగనంపారు.

ఈ సంగతి జానకికి చెప్పందే లక్ష్మీకి నిద్రపట్టదు. మూడన్నరకే బస్సెక్కి, జానకి వాళ్ళ ఇంటి స్టాప్ దగ్గర దిగింది. లక్ష్మీ హాలులోకి ప్రవేశించేటప్పటికి కమలాకరం సోఫాలో పడుకుని అగాథాక్రిష్టి పుస్తకం ఒకటి చదువుతున్నాడు.

'హలో , హలో' అంటూ అతను లక్ష్మిని చూసి లేచి కూచున్నాడు. "జానకి ఏది?'' అనడిగింది లక్ష్మి.

"ఇంకా నిద్రలేచినట్టులేదు. క్రైస్తవదేవుడల్లే ఆరు రోజులు సృష్టిచేసి, ఆదివారంనాడు విశ్రాంతి తీసుకుని నిద్రపోతుంది జానకి. ఏమిటి విశేషం?'' అన్నాడు.

"ఒక అద్భుతమైన చిత్రం జరిగింది. అది చెప్పడానికే వచ్చాను.'' అంటే ఆమె సోఫామీద అతని ప్రక్కన కూచున్నది. అంతలోనే కమలాకరం వివశుడైపోతాడని లక్ష్మి అనుకోలేదు. కాని పాపం- కమలాకరందేమీ తప్పులేదు. జానకికి ఎంతమంది స్నేహితురాళ్ళుంటే అంతమందిని గురించీ అతను కలలుకన్నాడు. కానీ అతనికి రోమాన్సు కొంచెం కూడా లేదు. లక్ష్మీ తప్ప మిగతా వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు అయిపోయాయి. ఇటీవల లక్ష్మిని గురించి ఎక్కువగా కలలు కంటున్నాడు. పైగా, ఆమె చనువుగా తన ప్రక్కన కూచోవడం అతన్ని ప్రోత్సహించింది.

అతని చెయ్యి ఆమె భుజం మీద పడింది. మొదటి రియాక్షన్‌లో లక్ష్మీ బిగుసుకుపోయి, మొహం చిట్లించి లేవబోయింది. కానీ, ఆ రియాక్షన్ పూర్తయ్యేలోపల "ఈ ఆడంగి రేకులవాణ్ణి చేసుకుంటేనేం? సులువుగా బుట్టలో పడేట్టున్నాడు'' అనుకున్నది.

ఆమె లేవలేదు. అతని చేతిని తోసెయ్యలేదు. అతనికేసి చూసి, "ఇదెప్పట్నించి?'' అన్నది. కమలాకరం పిచ్చినవ్వొకటి నవ్వి, "చాలారోజులనించి నాకు నీమీద లవ్ '' అన్నాడు.

"మరి ఇంతకాలం చెప్పలేదేం '' అనడిగింది. లక్ష్మి గొంతు చూస్తే ఫ్రెండ్లీ గానే ఉన్నది. లవ్‌మేకింగ్ చెయ్యనిస్తుందేమో'' అనుకున్నాడు. తనకు గొప్ప అవకాశం దొరికినవాడల్లే కమలాకరం లక్ష్మి భుజం మీద మళ్లీ చెయ్యి వేశాడు. ఆమె తీవ్రంగా ఆలోచిస్తున్నది. ఈ కమలాకరం పాసుమార్కుల మగాడే. పెళ్లాన్ని కాల్చుకు తినడు. చెప్పినట్టు వింటాడు. ఇతను బి.ఎల్. ఇంతవరకు పాస్ కాలేదు. పాసయినా ప్లీడర్‌గా రాణించడు. కానీ, ఫరవాలేదు. డబ్బుబాగానే ఉంది. ఈ పాటి సంబంధం తనకు ఇంతవరకు రాలేదు. అతనే ఎరగని వాడైతే అతన్ని చేసుకోవడం చచ్చినా తన వల్లకాదు. లక్ష్మి వివాహ సమస్య ఇలా సుఖాంతమయింది.

## 18.2.2 మనస్తత్వ చిత్రీకరణం:

వివాహ వయస్సుకు వచ్చిన అయిదుగురు ఆడపిల్లలు -లలిత, సుశీల, జానకి, తాయారు, లక్ష్మి. అయిదుగురూ స్నేహితులు. "మగమహారాజులు'' నాటకంలో అయిదుగురూ విభిన్న పాత్రల్ని వేయడానికి రిహార్సల్స్‌తో ఈ నవల ప్రారంభమౌతుంది. రచయిత శ్రీకొడవటిగంటి కుటుంబరావు ఎంతో ప్రతిభావంతంగా ఒక్కొక్కపాత్రను కథలో ప్రవేశపెట్టారు. చక్కని కథాకథనంతో ఆయాపాత్రల మనస్తత్వాలనూ, వాటి చుట్టూ పరిభ్రమించే పురుషుల మనస్తత్వాలను చిత్రించారు.

ఇందులో లలిత దృష్టిలో 'ప్రేమ ఒక ఉచ్చు, ఊబి'. దాంతో తనను మనసారా ప్రేమించి , పెళ్ళి చేసుకున్న రామారావు ప్రేమాభిమానాలను ఆస్వాదించలేకపోయింది. తానూ అతనికి ప్రేమను ఇవ్వలేకపోయింది. ఇద్దరి జీవితాలనూ చేసేతులా దుర్భరం చేసింది.

ఇక సుశీల , సవతితల్లి పెంపకంలో పెరిగింది. సుందరమ్మ బతుకును చూసి అదిరిపోయింది. మరోవైపు ఇంజనీరుగారు ఉంచుకున్న దుర్గాంబ సుఖంగా బ్రతకడాన్ని గమనించింది. "నేను చాతనయితే దుర్గాంబలాగా బతుకుతాను గానీ చచ్చినా మా పిన్నిలాగా బతకను '' అని నిర్ణయించుకుంది. తమ దూరపుబంధువు రామకృష్ణారావుకు రెండవ భార్యగా ఉండిపోయింది.

మరో అమ్మాయి తాయారు. పెళ్లి విషయంలో ఒక అభిప్రాయమంటూ లేదు. ఎవరినీ ప్రేమించలేదు. ఎవరి ప్రేమను ఆశించలేదు. లలిత వాళ్ళ అన్నయ్య నారాయణతో, ఆమె తండ్రి పెళ్ళి కుదిరించాడు. ఆమె అతన్ని పెళ్ళి చేసుకుంది.

జానకి పెళ్ళి ఇంగ్లీష్ లెక్చరర్ సుధాకరమూర్తితో జరిగింది. ఆమె పట్ల అతను ఒక భర్తవలె కాక, అధ్యాపకుడిగానే ప్రవర్తించాడు. ఆమె భర్తనుండి సుఖాన్ని పొందలేకపోయింది. సుధాకరం పినతల్లి భర్త చలపతి కరస్పర్శతో పులకించింది. గుంటూరులో అతనితో ఒక రాత్రి గడిపింది. ఎలాంటి ఆనందాన్నీ ఇవ్వలేని భర్తను వదిలేసింది. అపవాదులను ఎదుర్కొన్నది.

నవలలో మరొక విలక్షణమైన పాత్ర లక్ష్మి. ఆమె పెళ్ళి కోసం అన్నలిద్దరూ హైరానాపడ్డారు. పత్రికల్లో పెళ్ళి ప్రకటనలిచ్చారు. ఒక వరుడిని మాత్రం సంపాదించి పెట్టలేకపోయారు. చివరికి తన స్నేహితురాలు జానకి సోదరుడు కమలాకరాన్ని కదిలించింది. ఆడంగి లక్షణాలున్న కమలాకరం పెళ్లాన్ని కాల్చుకు తినడు, చెప్పినట్లువింటాడు. ఈ పాటి సంబంధం కూడా తనకు ఇంతవరకు రాలేదు, కాబట్టి అతన్ని పెళ్ళి చేసుకుంటుంది.

ఇలా అయిదుగురమ్మాయిలూ అయిదు రకాల నిర్ణయాలు తీసుకోవడం సమాజంలోని విభిన్నమనస్తత్వాలకు నిదర్శనం. వీరి చుట్టూ తిరిగే పురుషుల స్వభావాలను కూడా రచయిత వాస్తవికతా వాద దృక్పథంతో చిత్రించారు.

### 18.2.3 మాదిరి ప్రశ్నలు

1. కొడవటి గంటి కుటుంబరావు గారి రచనా సంవిధానాన్ని విశ్లేషించండి.
2. 'పంచకళ్యాణి' నవలలో వ్యక్తమైన విభిన్న మనస్తత్వాలను వివరించండి.
3. 'పంచకళ్యాణి' నవలలో చిత్రింపబడిన 1950 దశకపు సామాజిక జీవితాన్ని విశ్లేషించండి.
4. 'కొడవటిగంటి కుటుంబరావు నవలలు - సామాజిక చైతన్యం'' అన్న ఆంశాన్ని చర్చించండి.
5. 'పంచకళ్యాణి' నవలలోని పాత్రలను సమీక్షించండి.
6. 'కొడవటిగంటి కుటుంబరావు ఒక వాస్తవికతావాద రచయిత' అన్న అంశాన్ని చర్చించండి.
7. కుటుంబరావు గారి రచనల్లోని ప్రగతిశీల దృక్పధాన్ని విశ్లేషించండి.
8. 1950 దశకపు నవలా సాహిత్యాన్ని సమీక్షించండి.

### 18.2.4 సంప్రదించిన గ్రంథాలు

పంచకళ్యాణి - కొడవటిగంటికుటుంబరావు

**- ఆచార్య యస్వీ సత్యనారాయణ**

పాఠం - 18

# నామవాచకం - నిర్మాణం, లింగం, వచనం, విభక్తి - పరప్రత్యయాల చరిత్ర - ఔపవిభక్తులు సంఖ్యావాచకాలు - సర్వనామాలు - విశేషణాలు

**నామవాచకం :**

**లక్ష్యం :**

ఈ పాఠంలో నామవాచకం - నిర్మాణం, లింగవచనం, విభక్తి - పరప్రత్యయాల చరిత్ర - ఔపవిభక్తులు - సంఖ్యావాచకాలు, సర్వనామాలు - విశేషణాల గురించి తెలుసుకుందాం.

## 18.0. నామవాచకం - నిర్మాణం :

సంపూర్ణ భావాన్ని తెలిపే పదసముదాయాన్ని వాక్యం అంటారు. పదాలు వాక్యానికి అంగాలు. సందర్భాన్నిబట్టి (రా, చెట్టు) ఏకపదం వాక్యంగా ఏర్పడినా, చాలా మాత్రం వాక్యంలో ఒకటి కంటే ఎక్కువ పదాలుంటాయి పై "రా" "చెట్టు" అనే ఉదాహరణాల్లో కూడా "నీవు ఇటురా" అనే వాక్య అంతర నిర్మాణానికి బాహిర నిర్మాణంగా "రా" అనే ఏకపదమే వచ్చింది. అలాగే అదేమి ? అన్న ప్రశ్నకు జవాబుగా "అదిచెట్టు" అనే రెండు పదాలు వాక్య అంతర నిర్మాణానికి చెట్టు అనే ఏకపద వాక్యం బాహిర నిర్మాణంలో ఏర్పడింది.

## 18.1.1 పదవర్గీకరణ

సంస్కృత భాషలో "యాస్కుడు" తన "నిరుక్తము"లో పదాల్ని నాలుగు విధాలుగా విభజించాడు. 1. నామము, 2. ఆఖ్యాతము (క్రియ), 3. ఉపసర్గలు, 4.నిపాతములు అనేవి.

భర్తృహరి "వాక్యపదీయము"లో అయిదవ విభాగంగా 'కర్మ ప్రవచనీయములు" చెప్పబడ్డాయి.

1. నామాలు (సుబంతాలు) : గోవు, అశ్వము పురుషుడు మొదలైనవి
2. ఆఖ్యాతాలు (తిజంతాలు) : పచతి, కరోతి మొదలైనవి
3. ఉపసర్గలు : ప్ర, పరా, అప మొదలైనవి
4. నిపాతాలు : ఓమ్, నమః మొదలైనవి

## 18.1.2 తమిళభాష :

"తొలాప్పియం"లో 1) పెయర్ (పేరు = నామం)

2) వినై (క్రియ = ఆఖ్యాతం)

3) ఇడైచ్చొల్

4) ఉరిచ్చొల్ అని నాలుగు విధాలుగా విభజింపబడ్డాయి.

'ఇడైచ్చొల్' విభాగంలోని శబ్దాలకు స్వతంత్ర ప్రయోగం లేదు. ఇది నామాల్తో, క్రియల్తో ముందు వెనుకల ప్రయోగింపబడతాయి. అంటే నామవిభక్తులు, క్రియా విభక్తులు, ధ్వన్యనుకరణ శబ్దాలు మొదలైనవి ఈ విభాగంలో చేరతాయి.

"ఉరిచ్చొల్" విభాగం ధాతుశబ్దంతో సమానం. వ్యుత్పత్తి తెలియని మూలరూపాలు ఇందులో చేర్చబడ్డాయి. నామవిశేషనాలని క్రియావిశేషణాలని వేర్వేరు అభిప్రాయాలున్నాయి.

### 18.1.3 కన్నడం :

నామం, సర్వనామం, ఆఖ్యాతం, అవ్యయం, నిపాత (నాగవర్మకృత, కర్ణాటక భాషాభూషణం)

నామం, ఆఖ్యాతం, అవ్యయం (శబ్దమణి దర్పణం)

### 18.1.4 తెలుగు :

'ఆంధ్ర శబ్ద చింతామణి'లో పదవిభాగం లేదు కానీ ప్రాతిపదికము (నామం), క్రియ (ధాతువు) ప్రత్యయం (వర్ణకం) అనే వాటిని గూర్చి తెలుపబడింది. బాలవ్యాకరణంలో పదవిభజన లేదు. ప్రౌఢవ్యాకర్త 'పదములని నామములు, క్రియలు, అవ్యయంబులని త్రివిధంబులు' అని పదాల్ని మూడు విధాలుగా విభజించాడు.

### 18.1.5 నామపద స్వభావం :

కేవలం "ప్రాతిపదికము" అనే అర్థంలో చింతామణి "నామ" శబ్దాన్ని ప్రయోగించింది. ఇంగ్లీషులో 'Noun' అనేది ఒక భాషా భాగం. దాని అర్థం "నామ" శబ్దానికి ఉంది. వీటినే "నామవాచకాలు" అంటారు. ఇవే పేర్లు (A Noun is the name of a person, place or thing) వస్తువు, ప్రదేశం, మనుష్యులు అనే వాటి పేర్లు నామవాచకాలు)

తెలుగులో అనేక శబ్దాలకు ప్రథమా విభక్తి ఏకవచన ప్రత్యయం అక్కర లేకుండానే ప్రాతిపదిక తుల్యాన్నే ప్రయోగిస్తారు. ఉదా ॥ అమ్మ, నాన్న, తాత, అన్న, రాయి, పులి మొదలైనవి. అందువల్లే ఆచ్ఛిక శబ్దాలన్నీ తరచుగా స్త్రీ సమాల్లో, క్లైబసమాలో అయి వుంటాయని చిన్నయసూరి అన్నాడు. ప్రథమైక వచన ప్రత్యయం లోపించినది స్త్రీ సమాలు.

తెలుగులో నామాలకు, క్రియలకు ఒకటే మూలరూపం అదే భిన్నంగా ప్రయోగింపబడుతుంది.

"పండు" నామం ప్రథమావిభక్త్యంతం

"పండుగాయ" దీనిలో "పండు" విశేషణం

"పండుతున్నది" పండు + తు + ఉన్నది. ఇందులో "పండు" క్రియ ఇలాంటి పదాలు చాలా ఉన్నాయి.

తెలుగు నామాలు సంస్కృత నామాల కంటే భిన్నాలు ఇవి అలావాక్యాలు, ఒకదానికొకటి చేరి అర్థవిశేషాల్ని తెలుపుతుంటాయి. నామానికి ఉండే లక్షణాల్లో లింగ, వచన, విభక్తులు ఒకటి.

| | | |
|---|---|---|
| ఉదా : రాముడు | : | పుంలింగ, ప్రథమా విభక్తి |
| సీత | : | స్త్రీ లింగం, ఏకవచనం, ప్రథమా విభక్తి |
| పులి | : | అమహత్తు, ఏకవచనం, ప్రథమావిభక్తి |

ఇలా నామం ఏ లింగంలోనైనా, ఏ వచనంలోనైనా, ఏ విభక్తిలోనైనా ప్రయోగింపబడవచ్చు.

నామవాచకాల్ని సంజ్ఞా నామాలుగా సామాన్య నామాలుగా విభజించవచ్చును.

సంజ్ఞానామం వ్యక్తుల్ని, స్థలాన్ని, కాలాన్ని తెలిపేరు.

ఉదా ॥ రాముడు, తిరుపతి, నిన్న

కొన్ని ప్రత్యేక సందర్భాల్లో తప్ప సంజ్ఞానామం బహువచన ప్రత్యయాన్ని చేర్చుకోదు.

ఉదా ॥ ఎంతమంది గాంధీలు జన్మించినా ఈ దేశం గతి ఇంతే.

పై వాక్యంలో "గాంధీ" అనే సంజ్ఞానామానికి బహువచన ప్రత్యయం చేరడానికి ఎలా వీలయిందంటే - సంజ్ఞానామాన్ని సామాన్య నామంగా మార్చటం వల్లనే.

సామాన్య నామాల్ని లెక్కింపదగిన సామాన్యనామాలు అని విభజింపవచ్చు.

వస్తు, జాతి, స్థల, కాల బోధక నామాల్ని లెక్కింపదగిన సామాన్య నామాల క్రింద చేర్చవచ్చును.

ఉదా : పేనా, పులి, దేశం, దినం.

లెక్కింపదగిన నామాలలో పరిమాణాత్మకంగా ఉండే నామాల్ని చేర్చవచ్చు. ఇవి అవిభాజ్యాలు. అమూర్తాలు అని మళ్ళీ విభజించవచ్చు.

ఉదా : ఉప్పు, ఇనుము, వెండి, వడ్లు, పెసలు, పాలు, ఆకాశం, తెలుపు, తెలివి, కోపం, బలం, నిద్ర.

ఈ వర్గంలో నిత్య ఏకవచన, నిత్యబహువచన బోధకాలైన శబ్దాలన్నింటినీ చేర్చుకోవచ్చు.

అలాగే సమూహ వాచక నామాలయిన మంద, గుంపు, సమితి, సంస్థ, సభ సంఘం మొదలైనవి కూడా చేర్చుకోవచ్చు.

**సాధ్యనామాలు :**

ఇతర భాషా భాగాల్ని నామవాచకాలుగా మార్చుకోగా ఏర్పడ్డవి సాధ్యనామాలు. వీటిని ఎనిమిది రకాలుగా చెప్పుకోవచ్చు.

**1) సంఖ్యానామాలు :**

ఒకటి, రెండు, మూడు, వంద, వేయి, లక్ష లాంటి సంఖ్యావాచకాలు అటు నామవాచకాలుగానూ, ఇటు విశేషణాలుగాను ఉపయోగపడతాయి. వీటిని వ్యక్తి బోధకాలుగా మార్చుకొన్నా ఈ రెండు విధాలుగా ప్రయోగించవచ్చు.

ఉదా : ఇద్దరు, ముగ్గురు, ఒకడు, ఒకతె, ఒకరు, వందమంది.

**2) విశేషణ నామాలు :**

విశేషణాన్ని నామవాచకంగా మార్చుకోవడం వల్ల ఏర్పడేవి.

ఉదా : తెల్ల - తెల్లన, ఎర్ర - ఎర్రన, మంచి - మంచితనం, వీటిని తద్ధిత నామాలలో కూడా చెప్పుకోవచ్చు.

**3) క్రియా విశేషణ నామాలు :**

క్రియా విశేషణాన్ని నామాలుగా మార్చుకోగా ఏర్పడేవి.

ఉదా : అప్పుడు, ఇప్పుడు, పై తర్వాత మొ॥నవి.

**4) భావార్థక నామాలు :**

క్రియా ధాతువు మీద అటం / అడం చేర్చగా ఏర్పడేవి

ఉదా : తిను - తినడం, వచ్చు - రావడం, కొట్టు - కొట్టడం, ఈ విభాగాన్ని కృదంతాల్లో చేర్చే వీలుంది.

**5) సార్వనామిక విశేష్యాలు :**

విశేషణం మీద సర్వనామం చేరి ఏర్పడేవి

ఉదా : కొత్త + అది > కొత్తది

మంచి + అది > మంచిది మొ॥నవి.

వీటిని సమాసాల్లో చేర్చు వీలుంది.

**6) కృదంత నామాలు :**

క్రియా ధాతువు మీద కృత ప్రత్యయం చేరి ఏర్పడేవి

ఉదా : చేయు + త > చేత

ఆడు + ట > ఆట మొదలగునవి

**7) తద్ధిత నామాలు :**

నామపదం మీద తద్ధిత ప్రత్యయం చేరి ఏర్పడ్డ నామవాచకాలు

ఉదా : ముక్కు + ఇడి > ముక్కిడి

ఆట + కాఁడు > ఆటకాడు

**8) సమస్త నామాలు :**

నామపదం మీద నామపదం చేరి ఏర్పడ్డ సమాసాలు. ఇవే సమాసాలు.

ఉదా : పిట్టగోడ, చెట్టుకొమ్మ మొదలగునవి

### 18.1.6 తెలుగు భాషలో నామనిర్మాణం :

తెలుగులో దేశ్యాలైన నామాలకు సాధారణంగా మూలద్రావిడ భాషలో పూర్వ రూపాలుంటాయి.

ఉదా : కణ్ (మూల ద్రావిడ భాష) తెలుగు. కన్ను

మలై (మూల ద్రావిడ భాష) తెలుగు . మల మొదలగునవి

**'ము' వర్ణం చేరే నామాలు :**

1. అమహత్తులు, అదంతాలు అయితే 'ము' వర్ణకం చేరుతుంది.

ఉదా : వృక్షము

2. 'మిత్ర' లాంటి కొన్ని శబ్దాలకు అటు 'ము' వర్ణకం, ఇటు 'డుజ్' చేరతాయి.

ఉదా : మిత్రము / మిత్రుడు; పాత్రము / పాత్రుడు

## 'వు' వర్ణకం చేరే తత్సమాలు :

1. ఉకారాంతాలు మహత్తులయినా, మహతీవాచకాలైనా, అమహత్తులైనా "వు" వర్ణకం చేరుతుంది.

విష్ణు - 'మహత్' పుంలింగం - విష్ణువు
జరత్కారు - మహతీ - స్త్రీలింగం - జరత్కారువు
తరు - అమహత్తు - న పుంసకలింగం - తరువు
ఉదా : పెర్షో - అరబిక్ : అమీర్ - అమీరు
గరీబ్ - గరీబు

ఇంగ్లీషు : స్కూల్ - స్కూలు
బ్రౌన్ - బ్రౌను

ఇలా నామాలు హలంతాలైతే చివర ఉకారం చేరి అజంతాలు కావడం తెలుగు భాషకు సహజమే.

## పెర్షో - అరబిక్ నామాలు కొన్ని :

| | |
|---|---|
| ఉర్దూ | తెలుగు |
| పర్హా | పారా |
| రోజ్ | రోజు |
| తమాషా | తమాషా |
| రోటీ | రొట్టె |

## పోర్చుగీసు నామవాచకాలు కొన్ని :

అనాస, గొయ్యా (జామ), గోబీ (క్యాబేజీ), బొప్పాయి, టమాటో తాళపుచెవి 'శావి' పోర్చుగీసు పదమే.
ఇంగ్లీషు పదాలు తెలుగులో వేలాది వున్నాయి. కొత్తకొత్తగా ఎన్నో చేరుతున్నాయి.
ఉదా : ఫ్యాన్, కంప్యూటర్ మొదలగునవి

## 2. లింగం

## 18.2.0 తెలుగులో లింగ నిర్మాణం :

తెలుగులో లింగ నిర్మాణాన్ని గురించి తెలుసుకుందాం

స్థూలంగా చెప్పాలంటే - సంస్కృత లింగ విధానానికి తెలుగు లింగ విధానానికి సాదృశ్యం లేదు. తెలుగుకు ఇతర ద్రావిడ భాషల్తో లింగ విధానంలో సాదృశ్యం ఉంది.

'లింగం' అంటే 'చిహ్నం' అని అర్థం. స్త్రీ పురుష చిహ్నాల్లోని భేదాల్ని బట్టి లౌకిక లింగం ఏర్పరచబడుతుంది.

శబ్దానికి చేరే ప్రత్యయాల్ని బట్టి ఏర్పరచుకునే లింగాన్ని 'శబ్ద లింగం' లేదా 'వ్యాకరణ లింగం' అంటారు.

### 18.2.1 సంస్కృత భాషలో లింగ నిర్మాణం :

సంస్కృతంలో లింగం మూడు విధాలు 1) పుంలింగం 2) స్త్రీ లింగం, 3) నపుంసక లింగం. సంస్కృతంలో లింగశబ్ద ధర్మమే గారి అర్థ ధర్మంకాదు.

ఉదా : కళాత్రమ్ (నపుంసక లింగం) దార (పుంసలిగం) భార్యా (స్త్రీ లింగం) ఇవన్నీ 'పెళ్ళాం' అనే అర్థాన్ని సూచిస్తున్నా వేర్వేరు లింగాల్లో ఉంటున్నాయి. అందువల్లనే సంస్కృత భాషలో లింగం శబ్దధర్మం అని చెప్పబడింది. ఒకవేళ అర్థధర్మం ప్రధానమయితే కళత్రమ్, దార, భార్య అనే మూడు పదాలు స్త్రీ లింగాలుగానే వుండాలి.

అలాగే శిలా, జటా, చమూ, వేణి, జడాచకాలైనా సంస్కృతంలో స్త్రీలింగ శబ్దాలు. "వృక్ష" జడవాచకం అయినా పుంలింగం.

### 18.2.2. తమిళభాషలో లింగ నిర్మాణం :

ద్రావిడ భాషా కుటుంబంలో ఒకటైన తమిళభాషలో లింగం అర్థాశ్రయం. తమిళంలో లింగం రెండు రకాలు. 1) ఉయర్‌తిణై, 2) అహ్ఱిణై. ఉయర్‌తిణై అంటే ఉన్నత జాతి. మనుష్యుల్ని దేవతల్ని నరలోక వాసుల్ని తెలిపేది.

అహ్ఱిణై (ఆల్ + తిణై) అంటే 'అది కాని జాతి' అని అర్థం. జీవమున్నా లేకున్నా తక్కినవన్నీ ఇందులోనే చేరతాయి.

'ఉయర్‌తిణై'లో 'అణ్‌పాల్' (మహత్), పెణ్‌పాత్ (మహతీ) అనే భేదం ఏకవచనంలో వుంటుంది. బహువచనంలో ఇలాంటి బేధం లేదు. బహువచనంలో 'పలర్‌పాల్' అని ఒకేవిధంగా 'తొల్కాపియం'లో చెప్పబడింది. 'అహ్ఱిణై'లో లింగ భేదం లేదు.

### 18.2.2 కన్నడ భాషలో లింగనిర్మాణం :

ద్రావిడా భాషా కుటుంబంలో ఒకటైన కన్నడ భాషలో లింగం అర్థాన్ని ఆశ్రయించి ఉంటుంది. కన్నడ భాషలో పురుషుల్ని తెలిపే శబ్దాలు పుంలింగాలు. స్త్రీలను తెలిపే శబ్దాలు స్త్రీ లింగాలు. మిగిలినవి నపుంసక లింగాలు. ఈ సందర్భంలో పుంలింగ, స్త్రీలింగ, నపుంసకలింగాలు అనే పారిభాషిక పదాలు సంస్కృతం నుండి తెచ్చుకున్నా సంస్కృతంలో వాటి (Concept) భావానికి కన్నడంలో వాటి భావానికి (Concept) భేదం ఉంది. ఈ విభజన కేశిరాజు "శబ్దమణి దర్పణం" లోనిది. క్రియా విభక్తి రూపాలు చివర్లో తమిళ, కన్నడ, మలయాళాల్లో మహతీవాచకాలను 'ళ్' అనే ప్రత్యయం నిరూపిస్తుంది.

### 18.2.3 తెలుగు భాషలో లింగ నిర్మాణం :

తెలుగు భాషలో లింగం అర్థాశ్రయం. లింగం రెండు రకాలుగా చెప్పబడింది.

1. **మహద్వాచకాలు** : పురుషుల్ని తెలిపే శబ్దాలు

2. **అమహద్వాచకాలు :** స్త్రీలను, తిర్యక్కుల్ని (పశుపక్ష్యాదుల్ని) జడవాచకాల్ని (అచేతనాల్ని) తెలిపే శబ్దాలు

స్త్రీలను తెలిపే శబ్దాలను 'మహతీ వాచకాలు' అని ప్రత్యేకంగా కూడా పిలుస్తారు.

ఉకారాంత శబ్దాల్లో కొన్నింటికి మాత్రమే 'వు' చేరుతుంది. ఈ డు, ము, వు ప్రత్యయాలు లేకుండానే ఆచ్ఛిక శబ్దాల్లో ఎక్కువభాగం ఉంటాయి.

### 18.2.4 తెలుగులో లింగబోధక ప్రత్యయం లేనివి :

మహత్ (పురుషుల్ని తెలిపేవి) : నాన్న, అన్న, అయ్య, తాత, పెనిమిటి మొదలగునవి.
అమహత్తు మహతీ (స్త్రీలను తెలిపేవి) : అక్క, అమ్మ, తల్లి మొదలగునవి.
అమహత్తు - జడ తిర్యక్కులు : కోడి, నక్క మొదలగునవి.
జడవాచకాలు : మొక్క, మాను మొదలైనవి.

లింగ భేదాల్ని తెలపటానికి తెలుగులో కొన్ని పద్ధతులు పాటించబడ్డాయి.

1 ఎ) కొన్ని పదాల్ని చేర్చి స్త్రీ, పుం బేధం చెప్పబడింది.

ఆడు, మగ : ఆడుమనిషి, మగమనిషి
ఆడు గుర్రం, మగ గుర్రం

బి) పురుష వాచకాలైన అన్న, అయ్య, పుంజు లాంటి శబ్దాల్ని చేర్చడం ద్వారా లింగభేదం కల్పించబడింది.
ఉదా : రామన్న, కృష్ణయ్య, కోడిపుంజు

సి) స్త్రీ వాచకాలైన అక్క, అమ్మ, పెట్ట లాంటి శబ్దాల్ని చేర్చి కొన్ని పదాల్లో లింగభేదం కల్పించబడింది.
ఉదా : రామక్క, సీతమ్మ, కోడిపెట్ట

డి) అమ్మ / అప్ప / అయ్య ఉభయ లింగాన్ని తెలుపుతాయి.

ఉదా : రామప్ప ఉభయ లింగాల్ని తెలపుతుంది.
నాయుడమ్మ (పురుషుల్ని)
తాతమ్మ (స్త్రీలను)
అత్తయ్య (స్త్రీని)
మామయ్య (పురుషుల్ని) తెలుపుతాయి.

### 18.2.5 ఆధునిక భాషలో లింగం :

1. మొదటి నుండీ మహత్ ఏకవచనంలో వుండే ప్రత్యయాల్లో ఇప్పుడు - 'డు' మాత్రమే ప్రచారంలో వుంది. నిండు సున్నాతోగానీ, అరసున్నాతోగాని రూపాలు ప్రయోగించడం లేదు.

ఉదా : రాముడు, మధ్యయుగాల్లో పేర్వోపదాల మీద 'డుజ్' చేర్చినట్లుగా ఇప్పుడు చేర్చడం లేదు. ఉదా : ఫిరోజ్‌ఖాన్.
2. ంబు / మ్ము / ము / ం అనే అమహత్ ఏకవచన ప్రత్యయాల్లో ఆధునిక వ్యవహారం భాషలో అనుస్వారమే విశేషంగా వాడబడుతోంది.

ఉదా : ధర్మం, కర్మం మొదలగునవి

పూర్వకాలం నుంచి బెంటు, అమ్ము, పాము మొదలైనచోట్ల అవే ప్రత్యయాల్తో వాడుతున్నాం. "ము" కూడా వాడుతున్నాం.

ఉదా : బియ్యము

3. వు తో పూర్వం నుండి వచ్చిన రూపాలు అలాగే వాడుతున్నాం.
విష్ణువు, పూవు, ఆవు మొదలైనవి

## 3. వచనం

### 18.3.0 తెలుగులో వచన నిర్మాణం :

తెలుగులో వచన నిర్మాణం గురించి తెలుసుకుందాం. ఒక్కమాటలో చెప్పాలంటే సంస్కృత వచన విధానంలో తెలుగు వచన విధానానికి పోలికలేదు. తెలుగుకు ఇతర ద్రావిడ భాషలతో వచన నిర్మాణంలో పోలిక ఉంది.

వచనం అనేది నామధర్మం. అంటే ప్రతి నామవాచకం ఏదీ ఒక లింగాన్ని, వచనాన్ని, విభక్తిని కలిగే వాక్యంలో ప్రయోగింపబడుతుంది.

ఉదా : రాముడు, ఇది పుంలింగం, ఏకవచనం, ప్రథమా విభక్తి

### 18.3.1 సంస్కృతంలో వచన నిర్మాణం :

వేదకాలం నుంచి సంస్కృతంలో మూడు వచనాలున్నాయి. ఏకవచనం, ద్వివచనం, బహువచనం.

ఉదా : రామః (ఏక), రామౌ (ద్వి) రామాః (బహు)

(ఒక రాముడు) (ఇద్దరు రాములు) (ఇద్దరుకన్నా ఎక్కువమంది రాములు)

ప్రాకృతాలు ఏర్పడే నాటికే సామాన్యులలో 'ద్వి' వచనం అంతరించింది. ప్రాకృతాల నుంచి ఏర్పడిన నేటి ఉత్తర దేశ భాషల్లోనూ ఏకవచనం, బహువచనం మాత్రమే మిగిలాయి.

### 18.3.2 తమిళంలో వచన నిర్మాణం :

తమిళంలో నామాల్ని ఐదు విధాలుగా విభజించారు. ఏకవచనంలో మూడు రకాలు బహువచనంలో రెండు రకాలు. తమిళంలో లింగ - వచన భిన్నత్వం నిరూపించబడలేదు. ఒకే ప్రత్యయం అటు లింగాన్ని, ఇటు వచనాన్ని తెలుపుతుంది.

తమిళం : ఏక : 1. పురుష వాచకాలు

2. స్త్రీ వాచకాలు

3. జడ వాచకాలు

తమిళం : బహు :

1. మహన్మహతీ బహువచనం (పలర్‌పాల్)
2. అమహత్ బహువచనం (పలవిన్‌పాల్)

స్త్రీ పురుష సామాన్యమైన బహువచనం తమిళంలో ఉంది.

తమి. పురుషర్ స్త్రీకళ్ వరుకిరార్ / మహన్మహలీ బహువచనం

తె. పురుషులు స్త్రీలు వస్తున్నారు (పలర్‌పాల్)

త. మాడుగళ్ యెయ్‌క్కిన్రవ / అమహత్ బహువచనం

తె. పశువులు మేస్తున్నవి / (పలవిన్ పాల్)

'కళ్' ప్రత్యయం తెలుగులో 'లు' ప్రత్యయంగా మారి తెలుగులో మహత్ అమహత్ బహువచన ప్రత్యయంగా వచ్చింది. 'రు' ప్రత్యయం మహద్బహువచన ప్రత్యయంగా తెలుగులో ఉంది.

తొల్కాప్పియం నాటికే జడవాచకాలకు బహువచన ప్రత్యయాలు - నామాల మీద అక్కరలేదని అంగీకరింపబడింది.

ఉదా : మాడు వందన (పశువు వచ్చినవి) ఈ ఉదాహరణలో ఏకవచన నామం (మాడు = పశువు) బహువచన క్రియలో అన్వయించింది. తెలుగులో ఇలాంటి నిర్మాణం లేకపోలేదు.

ఉదా : వంద విస్తవి వేశారు
నూరు ఆకు తెచ్చారు
ఏభై మేక కొన్నాడు
వంద కాయ ఊరుగాయ.

## 18.3.3. తెలుగులో వచన నిర్మాణం :

తెలుగులో వచనం మహత్, అమహత్ బేధాన్ని ఆశ్రయించింది.
తెలుగులో అమహత్ బహువచన కర్తతో ఏకవచన క్రియ సరిపడుతుంది.

ఉదా : చిలుకలు వచ్చెను.
చెట్లు పండెను
చిలుకలు (అమహత్ బహువచన కర్త) (తిర్యక్కు)
చెట్లు ( అమహత్ బహువచన కర్త) (జడవాచకం)

## 18.3.4 ఆధునిక భాషలో ఏకవచన నిర్మాణం :

తొలినుంచే మహత్ ఏకవచనంలో ఉండే ప్రత్యయాల్లో ఇప్పుడు - డు మాత్రమే ప్రచారంలో ఉంది. నిండుసున్నాతో గానీ, అరసున్నాతో గానీ (ండు / ఁడు) రూపాన్ని ప్రయోగించడం లేదు.

ఉదా : రాముడు
మధ్యయుగాల్లో పెర్షి - అరబిక్ పదాల మీద 'డుజ్' చేర్చినట్లుగా ఇప్పుడు చేర్చడం లేదు.
ఉదా : ఫిరోజ్‌ఖాన్

2) అమహత్ ఏకవచన ప్రత్యయాల్లో ంబు / మ్ము / ము / ం (అనుస్వారం)లలో అనుస్వారమ్ విశేషంగా వాడబడుతుంది.
ఉదా : ధర్మం, కర్మం మొదలైనవి

పూర్వకాలంలో నుంచి వచ్చిన చెంబు, అమ్ము, పాము మొదలైనచోట్ల అనే ప్రత్యయాల్లో వాడుతున్నాం. 'ము' కూడా వాడబడుతున్నది.
ఉదా : బియ్యము

3) 'వు' తో పూర్వం నుండి వచ్చిన రూపాలు అలాగే వాడుతున్నాం.
ఉదా : విష్ణువు, పూవు, ఆవు మొదలగునవి

## 18.3.5 ఆధునిక భాషలో బహువచన నిర్మాణం :

- లు బహువచన ప్రత్యయంగా ఏకవచన నామం మీద చేరి బహువచన నామం ఏర్పడుతుంది. కొన్ని నామాలు నిత్య ఏకవచనాలు

ఉదా : లోహాలు : ఇనుము, రాగి, బంగారం మొదలైనవి

పంటలు : వరి, రాగ, సజ్జ మొదలగునవి

పంటల పేర్లు ఏకవచనంలో ఉండగా ఆ నామాల మీద 'లు' చేరి ధాన్యాలు నిత్యబహువచనాలు అవుతున్నాయి.

ఉదా : వరి + లు > వరులు > వడ్లు

జొన్న + లు > జొన్నలు

రాగి + లు > రాగులు మొదలైనవి.

ప్రాతిపదికలో మార్పుల్లో బహువచన నిర్మాణం జరుగుతుంది

1) దీర్ఘ స్వరాంత నామాల్లో మార్పుల్లేవు

ఉదా : లుంగీలు, లంగాలు, పకోడీలు

ఇవి సాధారణంగా అన్యదేశ్యాలు ఉంటాయి.

2) కొన్ని శబ్దాల్లో తుది అక్షర లోపం

పేను + లు > పేలు

చేను + లు > చేలు

వేయి + లు > వేలు

పూవు + లు > పూలు

కొందరి వ్యవహారంలో పేన్లు / పేండ్లు, చేనులు / చేండ్లు. పువ్వులు / పూవులు రూపాలున్నాయి.

3) ఇదంత శబ్దాల్లో అకారేతర దీర్ఘస్వరం ముందుంటే తుది 'యి' కారానికి తకారం ఆదేశం అవుతుంది.

ఉదా : చేయి + లు > చేతులు

గోయి + లు > గోతులు

నూయి + లు > నూతులు

పొయ్యి, వాయి, రాయి శబ్దాల్లో ఈ మార్పు రాదు.

ఉదా : పొయ్యిలు, వాయలు, రాళ్ళు

4) 'ల్లు, న్ను' అంతంలో ఉండే ఔపవిభక్తిక నామాల్లో 'ండు' ఆదేశం అవుతున్నది.

ఉదా : కల్లు + లు = కండులు > కండ్లు

కన్ను + లు = కండులు > కండ్లు

పన్ను + లు = పండులు > పండ్లు

5) '-లి' అంతంలో ఉండే నాలుగు మాత్రల శబ్దాల్లో -ండి ఆదేశం

రోకలి + లు - రోకండి + లు = రోకలు = రోకండ్లు

తిరగలి + లు - తిరగండ్లు

కౌగిలి + లు - కౌగిండ్లు

## 4. విభక్తి - పరప్రత్యయాల చరిత్ర

### 18.4.0 విభక్తులు :

వాక్యంలో పదాల్ని కలిపే ప్రత్యయాల్ని పరప్రత్యయాలు (Post possitional soffixes) అంటారు. వీటినే విభక్తులు అని పిలుస్తాం.

విభక్తులు రెండు రకాలు. 1. నామవిభక్తులు, 2. క్రియా విభక్తులు

నామవాచకాలపై; సర్వనామాలపై; సంఖ్యావాచకాల పైన వివిధ అర్థాల్లో నామ విభక్తి ప్రత్యయాలు చేరుతుంటాయి. నామవిభక్తుల్ని సంస్కృతంలో 'సుప్పులు' అంటారు. అవి చేరిన ప్రాతిపదికల్ని 'సుబంతాలు' అంటారు. ఏదో ఒక విభక్తి చేరనిదే; లేదా లోపించనదే సుబంతాలకు వాక్యంలో ప్రయోగం లేదు.

ఉదా : రాముఁడు రావణుని కోల చేత
లంక యందుఁగూల వేసెను.

ఈ వాక్యంలో 'రామ' కర్త. కర్త్రర్థంలో 'డుజ్' అనే ప్రథమా ప్రత్యయం 'రామ' అనే ప్రాతిపదికకు చేరింది. కర్మార్థంలో 'రావణ' అనే ప్రాతిపదికకు 'ను' అనే ద్వితీయా విభక్తి ప్రత్యయం చేరింది. 'చేత' అనే తృతీయా విభక్తి ప్రత్యయం కరణార్థంలో 'కోల' అనే ప్రాతిపదికకు చేరింది. అలాగే 'లంక' అనే ప్రాతిపదికకు అధికారణార్థంలో 'అందు' అనే సప్తమీ విభక్తి ప్రత్యయం చేరింది.

ఇలాగ వేర్వేరు అర్థాల్లో; వచనాల్లో; వివిధ నామవిభక్తి ప్రత్యయాలు ప్రాతిపదిక మీద చేరుతుంటాయి. నామం మీద చేరేవి కాబట్టి వీటిని నామ విభక్తి ప్రత్యయాలు అని అంటారు.

### 18.4.1 ప్రథమా విభక్తి :

డు,ము, వు చేరి తత్సమ నామాలు. ఇవి చేరికొన్ని, చేరకుండానే కొన్ని ఆచ్ఛిక నామాలు ప్రథమా విభక్తి.

### 18.4.2 ద్వితీయా విభక్తి :

న్; ను; ని కూర్చి, గురించి, గుఱిచి; గుఱియించి ద్వితీయా విభక్తి ప్రత్యయాలు.

ఆధునిక భాష - ను,ని

ఉదా : చెట్టును, హరిని
ఉకారాంతాలపై కూడా 'ని' చేర్తుంది. అవుని.

### 18.4.3 తృతీయా విభక్తి :

న, ం, చేత, తో, తోడ, తోడ, తోటి ప్రత్యయాలు.

ఆధునిక :

ఎక్కువగా 'తొ' వాడబడుతోంది.
కరణార్థంలో : నోటితో మాట్లాడి

రేతి అర్థంలో : శ్రద్ధతో చదువుతాడు
సహార్థంలో : దొంగ సొమ్ముతో పారిపోయాడు
చేత / చాత : వానిచేత / వానిచేత

## 18.4.4. చతుర్థి :

సంప్రదాన, నిమిత్త అర్థాల్లో కిన్, నకు, కై, కాన్ అనేవి ప్రత్యయాలు.

**ఆధునిక భాష :**

కు, కి, కోసం, కోసరం

కు - నాకు
కి - వానికి
కోసం - నా కోసం
కోసరం - వాని కోసం

## 18.4.5 పంచమీ విభక్తి :

ప్రత్యయాలు : మిన్న, మీన్న, కడ,పై
ఉదా : మహిమిన్న
గుడిమిన్న
భాషాదిత్యులకడాన్
భూపతివై
గ్రహ్యార్థంలో చేతన్, చేన్; వలనన్; వల్లన్ ఉన్నాయి.

**ఆధునిక భాష :**

వల్ల, నుంచి, కంటె, కన్న, పట్టి ఎక్కువగా ప్రయోగంలో ఉన్నాయి.

## 18.4.6 షష్ఠీ :

ద్వితీయాది విభక్త్యంగమే షష్ఠీరూపంగా ప్రయోగింపబడుతోంది. సంబంధార్థకంలో 'యొక్క' అనే అర్థాన్ని సూచిస్తున్నది. షష్ఠీ ప్రత్యయంగా 'న'కారం.

ఉదా : మూల స్థానంబు నాది మూర్తికి
కున్, కిన్
ఉదా : కొడుకునకు, నన్నయ
కుంతికి, నన్నయ

ఔప విభక్తిక రూపమే షష్ఠీరూపం
యొక్క

నీ యొక్క చేతుల యందు (శహాజీ)

ఆధునికభాష - కు, కి

ఉదా : సామ్యఅర్థంలో - నాకు కళ్ళజోడు ఉంది.

బాంధవ్య అర్థంలో - మాకు ఇద్దరు పిల్లలు

సంబంధ అర్థంలో - ఆవుకు రెండు కొమ్ములు

హేతువు అర్థంలో - చలికి వణుకుతున్నాడు.

కాలార్థకంలో - రేపటికి వస్తాడు.

### 18.4.7 సప్తమీ విభక్తి :

అ(ం), అన్, న, అందు, ఒళన, లో(ం) లోన, ళోన, లోపల అనేవి ప్రత్యయాలు

**ఆధునిక భాషలో :**

లో, దగ్గర, పైన, కింద, మీద పక్క మొదలైనవి

ఔపశ్లేషికార్థం - గిన్నెలో పాలున్నాయి.

కాలార్థం : **1947**లో భారత్‌కు స్వాతంత్ర్యం వచ్చింది.

నిర్ధారణార్థంలో : వాళ్ళు ముగ్గురిలో ఇతడు మంచివాడు.

## 5. ఔప విభక్తికాలు

### 18.5.0 ఔప విభక్తులు :

"ఇ, టి, తి, వర్ణంబులు విభక్తి నిమిత్తంబులయి యాదేశాగమాత్మకంబుయినవి యౌపవిభక్తికము లనంబడును" అని చిన్నయసూరి సూత్రం. వీటినే అథర్వణుడు ఉపవిభక్తులని వ్యవహరించాడు. టి, ంటి మొదలయిన వర్ణాలు ఔపవిభక్తిక సంజ్ఞకలవిగా ఆంధ్రభాషలో ఉన్నాయని చింతామణి సూత్రించాడు.

విభక్తులయందు ప్రాతిపదికలకు ఆగమాలుగానో, ఆదేశాలు గానో చేరే ఇ. టి, ంటి, తి ల్ని ఔపవిభక్తికాలు అంటారు. వీటిని, ఇవి చేరిన ప్రాతిపదికల్ని కూడా 'ఔపవిభక్తికాలు' అనే అంటారు. ద్వితియా సప్తములకు 'అత్వం' ఆదేశం అవుతుంది. ఇది కూడా ఔపవిభక్తికమే. సాధారణంగా లు, లి, ల్లు; డు, డి, ను, యి అంతంలో ఉండే రూపాలు ఔపవిభక్తికాలు.

'ఇ' చేరే నామాలు : ఊరు - ఊరి; చేను - చేని

'అ' చేరే నామాలు : తాము, తమ, వారలు - వారల

టి / ంటి : త్రాడు - త్రాటిని (ఆదేశం)

అన్ని - అన్నింటిని (ఆగమం)

మన్ను - మంటిని (ఆదేశం)

అన్ని - అన్నింటిని (ఆగమం)

తి : నేయి - నేతిని (ఆదేశం)

అఱ్ఱు - అఱితిని (ఆగమం)

టి, తి వర్ణాల్లో 'ఇ' ఇంత ముందు చెప్పబడిన 'ఇ' వర్ణమే.

**18.5.1 ంటి వర్ణం :**

ప్రాచీన కాలంలో పదాంత ణ,ళ లు టకారంగా మారి వాటిపై 'ఇ' చేరి 'ంటి' తో కూడిన ఔపవిభక్తిక రూపాలేర్పడతాయి.

తమి. మణ్ + కుడమ్ > ముట్కుడమ్

తె. మను + కుండ > మట్టికుండ / మంటికుండ

తమి. ముళ్ + కుత్తై > ముట్కుత్తై

తె. ముల్లు + ముక్క > ముంటి ముక్క

**18.5.2 'తి' వర్ణం :**

తమిళంలో 'అత్తు' అనే ఆగమాన్ని తొల్కాప్పియం పేర్కొంది.

ఉదా : మరమ్ + అత్తు + ఇల్ > మరత్తిల్

కుళమ్ + అత్తు + ఇల్ > కుళత్తిల్

తమిళంలోని 'అత్తు' తెలుగులోని 'తి' కి మూలరూపంగా చెప్పవచ్చు.

కుఱ్ఱు > కుర్తి; పఱ్ఱు > పర్తి మొదలైన ద్వితీయాది విభక్త్యాంగాలు ఏర్పడి కాలక్రమేణ అనుచిత విభాగంతో అవే ప్రథమాంతాలుగా గ్రామనామాలయ్యాయి.

ఉదా : గంగలపఱ్ఱు - గంగలపర్తి; చింతలపఱ్ఱు - చింతపర్తి; రాయచోటు - రాయచోటి

ఇలాగే ఇ, టి/ంటి, తి అనే వర్ణాలు చేరి ఔపవిభక్త రూపాల ద్వితీయాది విభక్త్యంగాలు ఏర్పడ్డాయి.

బాలవ్యాకరణంలో చెప్పినట్లు కాకుండా ద్వితీయార్థంలో వచ్చే అన్ని విభక్తులు ద్వితీయావిభక్తి క్రింద అలాగే తక్కిన విభక్తుల్లో చెప్పబడతాయి. ఈ విభక్తుల పరిణామం ఇలా ఉంటుంది.

ఉదా : ప్రథమ ద్వితీయాది విభక్త్యంగంలో

ఇ

ఊరు - ఊరి - ని, ఊరి - చేత

చేను - చేని - ని, చేని - చేత

నోరు - నోరి - ని, నోరి - చేత

టి

నూరు - నూటి - ని, నూటి - చేత

అన్ని - అన్నిటి - ని, అన్నిటి - చేత

ంటి

మన్ను - మంటి -ని, మంటి - చేత

మిన్ను - మింటి - ని, మింటి - చేత

తి

నూయి - నూతి - ని, నూతి - చేత

నేయి - నేతి - ని, నేతి - చేత

## 6. సంఖ్యావాచకాలు

### 18.6.0 లక్ష్యం :

సంఖ్యావాచకాల చరిత్రను గురించి తెలుసుకుందాం.

### 18.6.1 పరిచయం :

తెలుగులోని సంఖ్యావాచకాలకు తక్కిన ద్రావిడ భాషలకు సారూప్యం ఉంది. సంస్కృతం - తజ్జన్య భాషల్తో సారూప్యం లేదు.

సంఖ్యావాచకాలు రెండు విధాలుగా ఉంటాయి. మొదటి రకం విశేష్యాలు. వీటినే ప్రాథమిక సంఖ్యావాచకాలు అంటారు. రెండో రకం విశేషణాలు. వీటిని సార్వనామిక విశేషణాలు అంటారు. ప్రాథమిక సంఖ్యావాచకాలకు 'అగు' ధాతురూపాల్ని చేర్చినప్పుడు ఏర్పడే సార్వనామిక విశేషణాలు ఒకరకం. అస్వతంత్రమైన సంఖ్యావాచక విశేషణానికి లింగవచన బోధక ప్రత్యయాల్ని చేర్చగా ఏర్పడేవి మరోరకం.

### 18.6.2 ఒకటి :

ఒకటి ప్రాథమిక సంఖ్యావాచకం. 'ఒక్క' 'ఒక' అనేవి విశేషణాలు ఒకటి అమహత్తులో ఇటు విశేష్యంగాను అటు విశేషణంగాను వాడబడుతున్నది.

ఒకటి, ఒక్కంటి, ఒక్కటి, ఒకడు, ఒకానొకడు, ఒక్కరుడు, ఒక్కొరుడు అమహద్విశేషణాలు.

ఒక్కర్తి, ఒక్కతె, ఒక్కొర్తి, స్త్రీ వాచక విశేషణ రూపాలు.

'ఒక్కడు' మహత్ అమహద్రూపం. పై రూపాలన్నీ 'ఒక్క (ఒక) అనే విశేషణం నుండి పుట్టినవే.

ఒండు, ఒరుఁడు, ఓర్తి అనే రూపాలకు 'ఒరు' అనే విశేషణం మూలరూపం.

**ఆధునిక భాష :**

ఒకటి, ఒకడు, ఒకరు, ఒకామె, ఒక, ఓ రూపాలు వాడుకలో వున్నాయి.

### 18.6.3 రెండు :

"రెండు" ప్రాథమిక సంఖ్యావాచకం. ఇది ద్రావిడ భాష నుండి వర్ణవ్యత్యం వల్ల ఏర్పడింది.

ఇరంటు - రంటు - రండు - రెండు

'ఇరు' సార్వనామిక విశేషణం.

**ఆధునిక భాష :**

రెండు విష్యం. ఇర - వై / ఇర - బై, ఇద్ -దరు

విశేషణంగా 'రెండు' ఎక్కువ వాడుకలో వుంది.

ఉదా : ఇరు - ప్రక్కల (కావ్యభాష)
రెండు పక్కల (ఆధునిక భాష)

### 18.6.4 మూఁడు :

'మూఁడు' శబ్దానికి పూర్వపదం "మూన్టు" పోల్చి చూడు.

తమిళం : మూన్టు
మూ - ము, అనేవి విశేషణాలు.

### 18.6.5 నాలుగు :

'నాలుగు' ప్రాచీనరూపం 'నాలువు' అర్వాచీన రూపం నాలు - నాలు - విశేషణ రూపాలు.
నాల్కు, నాలుగు, నాల్ - ఉను ప్రాథమిక సంఖ్యావాచకాలు.
'నల్ - తమ్ముడ్లు' లోని 'నల్' సార్వనామిక విశేషణం.
'నల్ -వురు' పురుషబోధక సంఖ్యావాచకం.
నాలుగు / నాలువు / నాలు ప్రాథమిక సంఖ్యా వాచకాలు
నలు - మూడ్లు, నాల్గు మూరలు వంటి రూపాలు అరుదు.
నాలు - విశాఖ - శ్రీకాకుళం ప్రాంతంలోనే ప్రయోగంలో ఉంది.

**ఆధునిక భాష :**

నాలుగు / నాల్గు వి. / విణ. నలు / నాల్ ఇప్పుడు కూడా వాడుకలో వున్నాయి.
ఉదా : నలు - గురు
నాల్ - నాళ్ళు

### 18.6.6. అయిదు :

అయిదు / ఏను ప్రాథమిక సంఖ్యావాచకాలు
ఏను / ఏన్ విశేషణాలు

ప్రాచీన "అయ్" రూపం నుండి అయిదు / ఏను రెండూ ఏర్పడి వుంటాయని సోమయాజి గారి సిద్ధాంతం.

### 18.6.7 ఆరు :

ఆఱు విశేష్యం / విశేషణం
అఱు - విశేషణం
'అఱు' ప్రాథమిక సంఖ్యావాచకం. అర , అఱు / ఆరు

**విశేషణం :**

ఉదా : అర - వాద్యది, అఱు - పది, సార్వనామిక విశేషణాలు.
'ఆరు - వ్వురు' పురుషబోధక సంఖ్యావాచకం. తర్వాత శతాబ్దాల్లో విశేషాలు లేవు.

**ఆధునిక భాష :**

'ఆరు' రూపం ఉంది. విశేష్యంగాను, విశేషణంగాను వుంది. ఆరు విశేషణంగా వుంది.
ఆరు - గురు / ఆర్ - గురు రూపాలున్నాయి.

### 18.6.8 ఏడు :

ఏడు విశేష్యం, విశేషణం.
డె - విశేషణం

ఏఁటు / ఏడు ప్రాథమిక సంఖ్యావాచకాలు. విశేషణ రూపాలు అలభ్యాలు.

ఆధునిక యుగభాషలో "ఏడు" వాడుతున్నాం. అయినా "ఏడు"కు బదులు ఆరునొక్కటిని కూడా వాడుతున్నాం.
ఉదా : వాడు ఆరునొక్కరాగం ఆలపిస్తున్నాడు. అంటే 'ఏడుపురాగం' అన్నమాట.

### 18.6.9 ఎనిమిది :

'ఎనిమిది' లోని 'మిది' పది శబ్దం రూపాంతరం. ముందున్న 'ఎను' రెండు అర్థాన్నిచ్చే 'ఇరు' శబ్దభావం లేదా 'ఎణ్' అనే ప్రాచీన ధాతువు. 'రెండు తక్కువ పది' లేక 'పదికి వెనుక రెండవది' అని భాషా శాస్త్రవేత్తల సిద్ధాంతం

'ఎణ్బొది, ఎణుంబది, ఎనుబొది, ఎణ్మ, ఎన్మిది' అనేది ప్రాథమిక సంఖ్యావాచకాలు. ఎనమ్, అణ్ణకును (ఎనిమిది మందికి) పురుషబోధక సంఖ్యావాచకం.

పై రూపాల్లో 'ణ' కారం తోడి రూపాలు ప్రాచీనాలు.
'న' కారం తోడిని ఆర్వాచీనాలు.

### 18.6.10 తొమ్మిది :

తొమ్మిది విశేష్యం / విశేషణం
తొల్ - పది అని విభాగం
పోల్చిచూడు, తొన్నూఱు (90) తొలినూరు
తొల్లాయిరమ్ (900)
(తొల్ + ఆయిరం) 'ఆయిరం' - వేయి
తొమ్మ - విశేషణం.

తొమ్భు, తొంభ ప్రాథమిక సంఖ్యావాచకం నేటి వ్యవహారంలో చాలామంది అనే అర్థంలో 'తొంబ తొంబగా' అని వాడుతున్నాం.

### 18.6.11 పది :

పది విశేష్యం / విశేషణం
పదు - పన్, -పం, పది, పయి, పై, భై, వై అనేవి 'పది'కి సమాసాల్లో కనిపించే రూపాలు.
'పది' ప్రాథమిక సంఖ్యావాచకం.

ఇర - వది, ఇరు-భది, ఎఱ్-బొది, ఎణ్-మ, ఎన్-మీది, ఏ-బది, ఏం-భంమ్, ఏ-నది, నల్-వొది, పన్నెండు, పణ్-రెణ్ణు, పద్-ఏను, పన్-దంబు, ము-ప్పది విశేషణాలు.

'పదున్గు' పురుష బోధక సంఖ్యావాచకం.

### 18.6.12 వంద :

వంద ప్రాకృతం నుంచి వచ్చింది. నూరు ద్రావిడ భాష నుండి వచ్చింది.

నూరు / నూఱు ప్రాథమిక సంఖ్యావాచకం

నూర్ - వ్వురు : పురుష బోధక సంఖ్యారూపం

నూఱు నన్నయ, శ్రీనాథ, దక్షిణాంధ్రయుగం

మున్నూరు, ఏనూరు

**ఆధునిక భాష :**

నూరు, వంద అనే రూపాలు వాడుతున్నాం.

### 18.6.13 వేయి :

వెయ్యి / వెయి / వేయు / వేయి శాసనభాషలో వున్నాయి.

వేయి పూర్వపదం

వే - ల్ పోల్చిచూడు వేనకు - వేలు.

వే - గవిలాలు (7శ) సార్వనామిక విశేషణం

వే - వురు, వే - గురు పురుషబోధక సంఖ్యావాచకం.

## 7. సర్వనామాలు

### 18.7.0 లక్ష్యం :

ఈ పాఠంలో సర్వనామాలు ఏమిటో, వాటిలోని రకాల్ని గురించి తెలుసుకుందాం.

### 18.1.0 పరిచయం :

'సర్వనామాలు' అనే తత్సమపదం సంస్కృతం నుండి తెలుగులోకి వచ్చిన పారిభాషిక పదం. సర్వనామాలు నామాల్లో ఒక అంతర్భాగం. 'సర్వాదేని సర్వనామాని' అనిపాణినీయంలో చెప్పబడింది. ఇందులో 35 శబ్దాలు చేర్చబడ్డాయి. 'సర్వ' ఆదిగా గల నామములు సర్వనామములు అని వివరణ.

### 18.7.2 సర్వనామాలు - విభజన :

సర్వనామాలను నేటి సంస్కృత, ఆంగ్లాది ప్రణాళికలను అనుసరించి విభజిస్తే ఏడు జాతులుగా విభజించవచ్చు.

1. యుష్మత్ - అస్మదర్థకాలు : నీవు, మీరు, నేను, మేము
2. ఆత్మార్థకాలు : తన, తమ అనే వాటిని సంబంధించనవే.

| | | | |
|---|---|---|---|
| 3. | నిర్దేశ సర్వనామాలు | : | ఆ, ఈ, ఏ అనే వాటివల్ల ఏర్పడేవి |
| 4. | సంబంధార్థకాలు | : | ఏ, ఆ అనే వాటితో ఏర్పడే జంట శబ్దాలు |
| 5. | ప్రశ్నార్థకాలు | : | ఏ శబ్దరూపాలు |
| 6. | సంఖ్యావాచకాలు | : | ఒకటి,రెండు మొదలైనవి |
| 7. | అనిర్దిష్టార్థకాలు | : | పలు, కొన్ని మొదలైనవి |

## 8. విశేషణాలు

### 18.8.0 లక్ష్యం :

ఈ పాఠంలోని విశేషణానికి నిర్వచనం, అవి ఏర్పడే విధానం అందులోని రకాల్ని గురించి తెలుసుకుందాం.

### 18.8.1 విశేషణం - నిర్వచనం :

"విశేష్యతే అనేన ఇతి విశేషణమ్"

విశ్వేష్యంలోని విశేషాన్ని తెలియజేసేది "విశేషణం". నామవాచకాల్ని, సర్వనామాల్ని కలిపి విశేషములని అంటారు. నామవాచకాల యొక్క సర్వనామాల యొక్క విశేషణాల్ని తెలిపే పదాలు విశేషణాలు. ఈ విశేషణం ఒక జాతినికానీ, గుణాల్ని కానీ సంఖ్యనుకానీ, సంజ్ఞనుకానీ ఆశ్రయించి వుంటుంది.

విశేషణం రెండు రకాలు. ఒకటి నామవిశేషణం. రెండు క్రియా విశేషణం. నామాల్ని గూర్చి విశేషించేది నామ విశేషణం. దీన్నే విశేషణం (Adjective) అని అంటున్నారు. క్రియల అర్థాన్ని విశేషించేది క్రియా విశేషణం (Adverb) విశేషణ భాగాలైన నామవిశేషణాలకూ, క్రియావిశేషణాలకూ గల రూపభేదం చాలా స్వల్పం.

### 18.8.2. విశేషణాలు - వర్గీకరణం :

ప్రధానంగా విశేషణాల్ని కొన్ని విధాలుగా వర్గీకరించవచ్చు.

1. గుణ విశేషణం
2. విధేయ విశేషణం
3. సార్వనామిక విశేషణం
4. హేతుగర్భ విశేషణం
5. క్రియా విశేషణం
6. క్రియా జన్య విశేషణం

### సమీక్ష :

ఇంతవరకు నామవాచకం - నిర్మాణం, లింగం, వచనం, విభక్తి - పరప్రత్యయాల చరిత్ర - ఔపవిభక్తులు. సంఖ్యావాచకాలు - సర్వనామాలు - విశేషణాల గురించి స్థూలంగా చర్చించడం జరిగింది.

**ప్రశ్నలు :**

1. నామవాచకం - నిర్మాణం గురించి వ్రాయండి.
2. తెలుగులో లింగ నిర్మాణం గురించి వివరించండి.
3. తెలుగులో వచన నిర్మాణం గురించి విశదీకరించండి.
4. విభక్తి - పరప్రత్యయాల చరిత్రను గూర్చి తెలపండి.
5. ఔపవిభక్తికాలను గురించి వ్రాయండి.
6. సంఖ్యావాచకాల చరిత్రను వివరించండి.
7. సర్వనామాన్ని నిర్వచించి, అందులో ఎన్నిరకాలు ఉన్నాయో వాటిని గూర్చి వివరించండి.
8. విశేషణాలను గురించి వివరించండి.

**సంప్రదించవలసిన గ్రంథాలు :**


1. ఆంధ్రభాషా వికాసము : ప్రొఫెసర్ గంటి జోగిసోమయాజి
2. తెలుగుభాషా చరిత్ర : ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి (సంపాదకుడు)
3. సంధి : ఆచార్య కోరాడ రామకృష్ణయ్య
4. ద్రావిడ భాషలు : ఆచార్య పి. యస్. సుబ్రహ్మణ్యం
5. ఆధునిక భాషాశాస్త్ర సిద్ధాంతాలు : ఆచార్య పి.యస్. సుబ్రహ్మణ్యం
6. ఆంధ్ర భాషా చరిత్ర : డాక్టర్ వి. సిమ్మన్న
7. హిస్టోరికల్ గ్రామర్ ఆఫ్ తెలుగు : ప్రొఫెసర్ కె. మహదేవ శాస్త్రి
8. Early Telugu Inscriptions : డా॥ బి. రాధాకృష్ణ
9. A discriptive Analysis of Nannaya Usage : డా॥ కె. నాగభూషణరావు


-

పాఠం -19

# "కాలాతీత వ్యక్తులు"

**ఉద్దేశ్యం :**

స్వాతంత్ర్యానంతర కాలంలోని సమాజ పరిణామాన్ని, స్త్రీ స్వేచ్ఛను పరిశీలించడం.

**విషయసూచిక :**


**19.1.** నవల పుట్టు పూర్వోత్తరాలు

**19.2.** రచయిత్రి పరిచయం

**19.3.** నవల నేపథ్యం

**19.4.** కథా ఇతివృత్తం

**19.5.** ముగింపు

**19.6.** నమూనా ప్రశ్నలు


## 19.1 నవల పుట్టుపూర్వోత్తరాలు :

తెలుగు సాహిత్యంలో 'నవల' ఒక వినూత్న ప్రక్రియ. పాశ్చాత్య సాహిత్య పరిచయంతో ఆధునిక యుగంలో ఆవిర్భవించిన విలక్షణమైన సాహిత్య ప్రక్రియ 'నవల'. ఇది 'నావెల్' (NOVEL) అన్న ఆంగ్లపదం నుండి ఉత్పన్నమైన తెలుగుపదం. ఆంగ్లపదంలో కల్పిత కథాత్మక సాహిత్య ప్రక్రియను 'నావెల్' అంటున్నారు. ఇది 'నోవెల్లా' అనే ఇటాలియన్ పదం నుండి ఆవిర్భవించింది. ఈ ఇటాలియన్ పదం 'నోవ' అనే లాటిన్ శబ్దం నుండి పుట్టింది. దానికి నూతనమైనదనే అర్థం ఉంది. సంస్కృత భాషలో 'నవ' శబ్దానికి ఇది సమానార్థకం.

1872 లో కర్నూలులో ప్రభుత్వ ఉన్నతోద్యోగిగా పనిచేసిన నరహరి గోపాలకృష్ణమ సెట్టి 'శ్రీరంగరాజచరిత్ర' మనే గద్య ప్రబంధాన్ని రచించినట్లు ప్రభుత్వ గెజిట్‌లో పేర్కొనబడింది. తరువాతి కాలంలో అది ప్రచురించబడింది. 'తెలుగు దేశము వారి ఆచారములు తెలుపునట్టి గ్రంథమొకటి రచిస్తే ఉపయుక్తముగా ఉంటుందనే ఉద్దేశ్యముతో' రచించిన తమ గ్రంథాన్ని సెట్టి గారు 'నవీన ప్రబంధము' గా పేర్కొన్నారు.

1878 లో నవ్యాంధ్ర వైతాళికులు కందుకూరి వీరేశలింగం పంతులు గారు 'రాజశేఖరచరిత్ర' మనే వచన ప్రబంధమును ప్రకటించారు. 'చింతామణి' పత్రిక సంపాదకులు న్యాపతి సుబ్బారావు గారు 1893 నుండి 'పాశ్చాత్య పద్ధతి ఆఖ్యాయిక' ల పోటీలు పెట్టారు. ఇతర భారతీయ భాషలలో ఈ సాహిత్య ప్రక్రియను ఉపన్యాస్, కాదంబరి మొదలైన పేర్లతో వ్యవహరించారు. 1896 లో 'రాజశేఖర చరిత్ర' నవలను సమీక్షిస్తూ కాశీభట్ల బ్రహ్మయ్య శాస్త్రి గారు వచన ప్రబంధాన్ని 'నవల' అనవచ్చునని నామకరణం చెప్పారు. ఈ విధంగా 1896 నుండి ఈ విశిష్ట సాహిత్య ప్రక్రియ పేరు 'నవల' గా స్థిరపడిపోయింది.

'జీవితాన్ని కథా వస్తువుగా స్వీకరించి రమ్యమైన కల్పనలతో, సంభాషణలతో, ఆసక్తికరమైన మలుపులతో రూపొందించే పెద్ద కథే నవల' అని నిర్వచింపవచ్చును. అది ఒక వ్యక్తి జీవితం కావచ్చు, ఒక సమాజ జీవితం కావచ్చు. ఏ కాలానికి

సంబంధించిన జీవితాన్నైనా నవలగా చిత్రించడానికి వీలున్నది. గడిచిపోయిన కాలాన్ని చిత్రించేవి చారిత్రక నవలలు, కాగా వర్తమాన జీవితాన్ని చిత్రించేవి సాంఘిక నవలలు.

నవలకు ఇతివృత్తం ప్రధానం. శిల్పం ప్రాణం. ఇందులో ఒకటి వస్తువు కాగా రెండవది రూపం. ఇతివృత్తమంటే కథావస్తువు. వస్తువును ఆవిష్కరించేది సహజ సుందరమైన భాష, సంభాషణలు. రచయిత ప్రతిభ శిల్పం ద్వారా వ్యక్తమౌతుంది. 'వస్తు, శిల్పముల సముచిత సమన్వయాన్ని సాధించగలిగినది గొప్ప నవల' అనుకుంటే డా॥ పి. శ్రీదేవి రచించిన 'కాలాతీత వ్యక్తులు' నిస్సందేహంగా గొప్ప నవల అవుతుంది.

స్వాతంత్ర్యానంతర కాలంలో పరిణామం చెందిన సమాజాన్నీ, జీవితాన్నీ ప్రతిభావంతంగా చిత్రించిన పంచమహాకావ్యాల వంటి నవలలు అయిదున్నాయి. అవి - చివరకు మిగిలేది, అసమర్థుని జీవయాత్ర, అల్పజీవి, అతడూ - ఆమె, కాలాతీత వ్యక్తులు.

## 19.2 రచయిత్రి పరిచయం :

'కాలాతీత వ్యక్తులు' నవలను రచించిన డా॥ పి. శ్రీదేవి ప్రఖ్యాత నాటకకర్త, రచయిత, జాతీయవాదియైన కీ.శే. డా॥ గుళ్ళపల్లి నారాయణమూర్తి గారి కుమార్తె. ఆమె **1929** సెప్టెంబర్ **21**న అనకాపల్లిలో జన్మించారు. కాకినాడ, విశాఖపట్నంలలో విద్యాభ్యాసం పూర్తిచేశారు. వైద్య విద్య (యం.బి.బి.యస్) లో డిగ్రీ పూర్తి చేసిన డా॥ శ్రీదేవి అతి చిన్న వయస్సులో **1961** జూలై **29** న తుది శ్వాస విడిచారు.

చక్కని శైలి, భాషపై అపారమైన అధికారం ఆమె సొత్తు. కవయిత్రిగా, కథా రచయిత్రిగా, చక్కని సాహిత్య విమర్శకురాలిగా అచిరకాలంలోనే ఆధునిక తెలుగు సాహిత్యంలో విశిష్టమైన స్థానం సంపాదించుకున్న శ్రీదేవి అపూర్వసృష్టి - "కాలాతీత వ్యక్తులు".

"మధుకలశం" (ఉమర్ ఖయూం) కవితాసుమం, 'ఉరుములు - మెరుపులు', (కల తెచ్చిన రూపాయిలు కథా సంపుటాలు, అనేక దీర్ఘ కవితలూ ఈమె ప్రకటించారు. వ్యక్తిగా డా॥ శ్రీదేవి యువతరంలో విశ్వాసం కనబరిచిన ప్రగతిశీలి. ఆత్మస్థైర్యం గల సాహితీవేత్త. స్వాతంత్ర్యానంతర స్త్రీజాతి చైతన్యానికి ఈమె వ్యక్తిత్వం ఒక ప్రతీక.

## 19.3 నవల నేపథ్యం :

బ్రిటీష్ పరిపాలన; విద్యాలయాలు, విశ్వవిద్యాలయాల స్థాపన; ఆంగ్ల విద్య; పాశ్చాత్య సాహిత్య పరిచయం; స్త్రీ - పురుషులు కలసి చదువుకునే అవకాశాలు; రవాణా సదుపాయాలు; కమ్యూనికేషన్ సాధనాలు; పత్రికలు; ప్రచురణ సంస్థలు; గ్రామపంచాయితీలు ఏర్పడడం; పరిశ్రమల స్థాపన, ప్రజాస్వామ్య వ్యవస్థ ఆవిర్భావం మొదలైన పరిణామాలతో భారతీయ సమాజంలో ఫ్యూడల్ మానవ సంబంధాలు విచ్ఛిన్నమౌతూ, పెట్టుబడిదారీ మానవ సంబంధాలు రూపొందుతున్న సామాజిక, ఆర్థిక నేపథ్యం. **1947** ఆగస్టు **15** న భారత స్వాతంత్ర్యోదయం. **1950** జనవరి నాటికి భారత రాజ్యాంగం కొన్ని నిర్దిష్టమైన ప్రాథమిక హక్కుల్నీ, ప్రాదేశిక సూత్రాల్నీ నిర్దేశించడం జరిగింది. **1956** నవంబర్ ఒకటిన తెలుగు ప్రజల చిరకాల వాంఛ నెరవేరింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించింది. తెలుగు ప్రజల జీవితాల్లో ఉద్యమాల ఉద్ధృతి తగ్గి, సాపేక్ష ప్రశాంతత నెలకొన్నది. ఆంగ్ల విద్యా విధానం వల్ల ఆడపిల్లలు ఉన్నత విద్యలు అభ్యసించడమే కాదు, ఉద్యోగాలు సంపాదించడం, ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పొందడం ప్రారంభమయింది. ఆడపిల్లలు కలలు కనడం మొదలుపెట్టారు. కలలకు కథా రూపాన్ని, నవలా రూపాన్ని కల్పించడం కూడా ప్రారంభించారు. తద్వారా తెలుగులో స్వాప్నిక సాహిత్యం మొదలయింది. జీవితంలో కదిలే కలలే కాదు, వాస్తవాలూ ఉంటాయి. వినోదాలు మాత్రమే కాదు విషాదాలూ ఉంటాయి. ఆడపిల్లలు ఆర్థిక స్వావలంబనం కోసం

ఉద్యోగాలు చేసే దశ నుండి, సోమరిపోతులైన తండ్రుల మూలంగా కుటుంబభారాన్ని మోసే బాధ్యతలు నెత్తిపై వేసుకునే దశకు సమాజం క్రమంగా పరిణమించసాగింది. ఆర్థిక సంక్షోభాలు, కుటుంబం బరువు బాధ్యతలు, విభిన్న మనస్తత్వాల మధ్య జీవించడం వంటి అనుభవాలు కొందరివి; కాగా తాత తండ్రులు సంపాదించిన డబ్బును యధేచ్ఛగా ఖర్చుపెడుతూ విలాసవంతమైన జీవితం గడుపుతున్న అనుభవాలు మరికొందరివి. ఈ నేపథ్యాన్ని ఆవిష్కరించిన అద్భుతసృష్టి - 'కాలాతీత వ్యక్తులు'.

## 19.4 కథా ఇతివృత్తం :

విశాఖపట్నంలోని రైల్వేశాఖకు చెందిన కార్యాలయంలో స్టెనోగా పనిచేస్తున్న 'ఇందిర' ఇరవై రెండేళ్ల యువతి. తండ్రి ఆనందరావుతో కలసి చెంగల్రావుపేటలో నాలుగు గదుల అద్దె ఇంట్లో నివాసం. ఆ ఇంటి మేడ మీదున్న ఒకే ఒక గదిలో 'ప్రకాశం' అనే వైద్య విద్యార్థి అద్దెకుంటున్నాడు. ఇక్కడే కథ మొదలయింది.

"గబగబా సగం మెట్లెక్కి 'ప్రకాశం' అని గట్టిగా కేకవేశాడు కృష్ణమూర్తి. డాబా మీది వరండాలో నుండి మెట్ల మీదకు తొంగిచూస్తూ ప్రకాశం, 'వస్తున్నానోయ్ - ఒక నిమిషం! నువ్వే పైకి రారాదూ పోనీ!' అన్నాడు. అంటున్న ప్రారంభంతో నవల మొదలవుతుంది. వీరిలో ప్రకాశం మెడికల్ కాలేజీ విద్యార్థి. ఫైనలియర్ ఎం.బి; బి.ఎస్ చదువుతున్నాడు. కాలేజీ కెదురుగా చెంగల్రావుపేట డౌన్‌లో మొదటిమేడ ఇంట్లో ఉంటున్నాడు. ఆ మేడ స్టూడెంట్స్ లాడ్జిగా ఉండేది. మెడికల్ కాలేజీలో చేరిన నాటి నుండి ప్రకాశం అందులోనే ఉంటున్నాడు. క్రింది నాలుగు గదుల్లో ఏ.వి.ఎన్. కాలేజీ విద్యార్థులుండేవారు. వేసవిలో వాళ్ళు ఖాళీ చేసిపోగానే ఆ వాటాలో ఇందిర, ఇందిర నాన్న ఆనందరావు ప్రవేశించారు. ఆనందరావు సోమరి. కూతురి సంపాదన మీద ఆధారపడి బ్రతికేస్తూ ఉంటాడు. వ్యసనపరుడు. ఇందిరకి ఇంటర్‌లో క్లాస్‌మేట్ 'కళ్యాణి'. బి.ఏ. ఆనర్సులో చేరింది. ప్రకాశం స్నేహితుడు కృష్ణమూర్తి. ఏ.వి.ఎన్. కాలేజీలో బి.ఏ. పరీక్ష రాశాడు. గ్రూపులో తప్పి సెప్టెంబర్‌లో మళ్లీ రాయబోతున్నాడు. అతనిది విశాఖ జిల్లా పాలకొండ ప్రాంతం. అతడు చదువు కోసం విశాఖపట్నం వచ్చిన తరువాత నేర్చుకున్న ముఖ్య విషయం జల్సాగా డబ్బు ఖర్చుపెట్టడంలో ఆనందాన్ని అనుభవించడం. అతని ధర్మమా అని అతని చుట్టూ చేరిన స్నేహితులకు డబ్బుకు ఇబ్బందిపడే అవసరం ఉండేది కాదు. అతను ఒక్క చదువు మినహా తక్కిన పనులన్నీ చేసేవాడు. కృష్ణమూర్తిని చదువుకోమని బాధపెట్టడం అతని స్నేహితులకిష్టం లేదు. అతన్ని చూసి బాధపడేది ప్రకాశం ఒక్కడే.

చాలామంది ప్రకాశాన్ని మెత్తని వాడంటారు. అసమర్థుడని కూడా కొందరనేవారు. సాటి విద్యార్థులతన్ని చూసి 'వట్టి చవటవురా!' అనేవారు. 'బొత్తిగా చేవలేనివాడివిరా ఎలా బతుకుతావో గానీ అని నిట్టూర్చేది వాళ్ళమ్మ. 'వీడిది వట్టి పిరికి గుండె' అంటాడు అతని మేనమామ. ఒక్క ఇందిర మాత్రం ప్రకాశాన్ని 'మీరు తమాషా మనిషండీ!' అంటుంది. తండ్రి మరణించగా మేనమామ సంరక్షణలో ఉంటూ మెడిసన్ చదువుకోసం పట్నమొచ్చాడు. ఆర్థిక పరాధీనత, పేదరికం అతని సమస్యలు.

బి.ఏ. ఫస్టియర్ చదువుతూ, చదువు మానేసిన ఇందిర టైపు, షార్ట్ హేండూ నేర్చుకొని రైల్వేశాఖలో చిన్న ఉద్యోగంలో చేరి, చాలీచాలని సంపాదనతో, ఎన్నో ఆశలతో, కోరికలతో జీవితాన్ని అర్థం చేసుకోవడానికీ, జయించడానికీ ప్రయత్నిస్తూ ఉంటుంది. ఇందిర తల్లి నిరంతరం రోగంతో మూలుగుతుండేది. తల్లిని హృదయపూర్వకంగా ప్రేమించలేకపోయింది ఇందిర. రాత్రి నిద్రపోయేటప్పుడు కూతుర్ని గుండెల మీద పడుకోబెట్టుకునేవాడు ఆనందరావు. అతని పెదవుల్లోంచి ఘాటైన ద్రావకాల వాసనలు వెదజిమ్మేవి. పెదవుల్లో విషాదాన్ని దాచుకొని ఇలాంటి దుర్భరమైన అనుభవాలతో ఇందిర రాటుదేలింది. ప్రకృతి ప్రసాదించిన గట్టి శరీరమూ, చురుకైన మెదడూ, అడ్డంకులను ఎదుర్కొంటూ చదువులో కాలేజీదాకా ఎగబ్రాకింది. కానీ డిగ్రీ పూర్తిచేయలేకపోయింది. కుటుంబ పోషణ బాధ్యత, పేదరికం ఈమె సమస్యలు.

కళ్యాణి తల్లి లేని పిల్ల. పల్లెలో ఉన్న తండ్రి కాయకష్టం చేస్తూ, బిడ్డను పట్నంలో బెట్టి చదివిస్తున్నాడు. హాస్టల్ ఖర్చులు భరించలేక ఇందిర వాళ్ళ ఇంటికి వచ్చేసింది. కళ్యాణి మృదు స్వభావం కలది. ఎవరితోనైనా వినయంగా మాట్లాడుతుంది. ఆమె వైఖరిలోనే ఒక ఆకర్షణీయమైన ముగ్ధత్వం ఉంది.

ఇందిర, కళ్యాణి, ప్రకాశం, కృష్ణమూర్తి - వీళ్లు నలుగురూ పల్లెటూళ్ళ నించి చదువుల కోసం, బ్రతుకు దెరువు కోసం పట్నానికొచ్చారు. నలుగురూ మధ్యతరగతి యువతరానికి ప్రతినిధులు. నాలుగు విభిన్నమైన మనస్తత్వాలు కలిగినవారు. వీరిని కేంద్రంగా తీసుకుని **1950** దశకపు తెలుగు ప్రాంత జీవితాన్ని డా॥ శ్రీదేవి నవలగా మలిచారు. హైదరాబాద్ నుండి ఆ రోజుల్లో గోరాశాస్త్రి గారి సంపాదకత్వంలో వెలువడిన "తెలుగు స్వతంత్ర" లో **1957** సెప్టెంబర్ **7** నుండి **1958** జనవరి **25** వరకు ఇరవై ఒక్క వారాల పాటు ధారావాహికగా వెలువడింది. **1958** లో అచ్చయిన మొదటి ముద్రణ కాపీలన్నీ మూడు నెలల్లోనే అయిపోవడాన్ని బట్టి ఈ నవలకు లభించిన జనాదరణ తెలుస్తున్నది. **1962** లో ద్వితీయ ముద్రణ, **1981** లో తృతీయ ముద్రణ, **2001** లో చతుర్థ ముద్రణ పొందిన "కాలాతీత వ్యక్తులు" పత్రికల ప్రశంసలనూ, పాఠకుల అభిమానాన్నీ సంపాదించుకున్నది.

భారత స్వాతంత్ర్యానంతరం పదేళ్ల తరువాత డా॥ శ్రీదేవి రచించిన ఈ నవల అనేక సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలను, పరిణామాలను, ప్రభావాలను, సంక్షోభాలను చిత్రించింది. తెలుగు ప్రజల జీవితాల్లో పాత, కొత్తల మధ్య జరిగిన సంఘర్షణ, పాతను వదులుకోలేకపోతున్న అనుబంధం, కొత్త జీవిత విధానాల వైపు ఆకర్షణ మధ్యతరగతి విద్యావంతుల జీవితాల్లో సృష్టించిన కల్లోలాలను యధాతథంగా ఈ నవల ఆవిష్కరించింది. ఒక వైపు కొనసాగుతున్న పాత నమ్మకాలు, మరోవైపు యువతరం వివిధ పద్ధతుల్లో సాగించిన తిరుగుబాటు ప్రతిఫలనం ఈ నవల.

ఆధునిక జీవన విధానం వల్ల ఆవిర్భవించిన మధ్యతరగతి ప్రజలు, వారి విలక్షణమైన సమస్యలు, కష్టాలు, ఆర్థిక ఇబ్బందులు, చితికిపోతున్న మానవ సంబంధాలు, కళ్ల ముందు నుండి క్రమంగా నిష్క్రమిస్తున్న పాత విలువలు, వాటి స్థానంలోనే అవతరిస్తున్న కొత్త విలువలు, కొత్త విశ్వాసాలు, కొత్త ఆశలు, ఆకాంక్షలు, వీటి పరిణామాలను చక్కని కథా కథనంతో "కాలాతీత వ్యక్తులు" నవల ఆవిష్కరించింది.

పాశ్చాత్య సంపర్కం వలన అలవడిన దుర్వ్యసనాలు, వాటికి బలయిపోయిన కుటుంబాలు ఈ నవలలో ఎలాంటి పూత మెరుగులు లేకుండా కనబడతాయి. పల్లెటూళ్లలో పుట్టి, పెరిగిన గ్రామీణ సంస్కారం ఒక వైపు; చదువుల కోసం, ఉద్యోగాల కోసం పట్టణాలలో నివసిస్తున్న నగర సంస్కారం మరో వైపు సృష్టించిన మానసిక సంక్షోభం చిత్రించడంలో డా॥ శ్రీదేవి కృతకృత్యులయ్యారు.

చదువుల కోసం, ఉద్యోగాల కోసం పట్టణాలకు వెళ్లిన ఆడపిల్లల పరిస్థితి, దిగువ మధ్యతరగతి ఆడపిల్లలు పట్టణాలలో నెగ్గుకు రావడానికి పడిన కష్ట నష్టాలు, చితికిపోతున్న మధ్యతరగతి కుటుంబాలు, కుటుంబ ఆంక్షలకు దూరంగా నగరంలో విద్యాభ్యాసం కొనసాగిస్తున్న యువకుల మానసిక పరిస్థితి, ప్రవర్తనలు, యువతరం దృక్పథంలో మొదలైన మార్పులను ఈ నవల చిత్రించింది.

కుటుంబ ఆర్థిక స్థితి అనుకూలించక పోవడంతో బి.ఏ. ఫస్టియర్‌లో చేరిన 'ఇందిర' చదువును అర్థాంతంగా ఆపేసింది. టైపూ, షార్ట్‌హేండూ నేర్చుకొని, విశాఖపట్నం లోని రైల్వే శాఖలో స్టెనోగా ఉద్యోగం సంపాదించింది. ఆమె తండ్రి ఆనందరావు వ్యసనపరుడు. కుటుంబ బాధ్యతలను విస్మరించిన సోమరి. కూతురి కష్టార్జితంపై ఆధారపడి బతుకుతున్న ప్యారసైట్ (పరాన్న జీవి). ఇందిర తల్లి దీర్ఘకాలిక అనారోగ్యంతో కనుమూసింది. తండ్రితో బాటు ఇరవై రెండేళ్ల అవివాహిత యువతి 'ఇందిర', చెంగల్రావుపేటలో నాలుగు గదుల అద్దె ఇంట్లో దిగింది. అప్పటికే గత నాలుగు సంవత్సరాలుగా ఆ ఇంటి మేడ మీద ఉన్న ఒకే

ఒక గదిలో మెడికల్ ఫైనలియర్ విద్యార్థి ప్రకాశం ఉంటున్నాడు. ప్రకాశం స్నేహితుడు కృష్ణమూర్తి అనే బి.ఏ. విద్యార్థి తరచుగా ఆ ఇంటికి వస్తూ పోతూ ఉంటాడు. అతి తక్కువ పరిచయంతోనే ఎవరితోనైనా కలసిపోగల స్వభావం గల ఇందిర వాళ్ళిద్దరితో స్నేహం చేస్తుంది.

యూనివర్సిటీలో ఆనర్సు చదువుతున్న కళ్యాణి అనే స్నేహితురాలు ఇందిరకు ఇంటర్‌లో క్లాస్‌మేట్. కళ్యాణికి హాస్టల్‌లో ఉండే ఆర్థిక స్తోమత లేనందువల్ల ఇందిర, కళ్యాణిని తన ఇంటికి తీసుకొచ్చి ఆశ్రయమిచ్చింది. ఆదరించింది.

ఒకే గూటిలో చేరిన పక్షుల్లాంటి ప్రకాశం, ఇందిర మొదట్లో స్నేహితులవుతారు. రిక్షాలో పక్కపక్కన కూచుని బీచీకి వెళతారు. సెకెండ్ షో సినిమా క్కూడా వెళతారు. కబుర్లు చెప్పుకుంటూ గంటలకొద్దీ కాలక్షేపం చేస్తారు. ఇందిరకు అతిథిగా వచ్చిన కళ్యాణి కష్ట సుఖాలు చెప్పుకోవడంతో ప్రకాశానికి దగ్గిరవుతుంది. సరిగ్గా అదే సమయంలో కళ్యాణి జబ్బుపడడంతో ప్రకాశం ఒక డాక్టర్‌గా ఆమె సేవచేయడం ద్వారా ఆమెకు దగ్గరవుతాడు. వారి అనుబంధం బలపడుతుంది. ఏకాకిగా ఉన్న తనకు చేయూతనిచ్చి 'నీకు నేనున్నాని' ధైర్యం చెపుతాడనుకున్న ప్రకాశం, తనను కాదని కళ్యాణికి సన్నిహితం కావడం ఇందిర భరించలేకపోతుంది. కళ్యాణిని వాళ్ల ఊరు వెళ్లనిచ్చి, ప్రకాశాన్ని ఇందిర తన వైపుకు ఆకర్షించుకుంటుంది.

ఇందిరకు జీవితం అన్యాయం చేసింది. చిన్నప్పట్నించీ మామూలు మనిషికి దొరుకుతున్నవేవీ ఆమెకు దొరకలేదు. తల్లి తనను కని వదిలేసింది. తనను రక్షించవలసిన తన తండ్రిని తనే రక్షింపవలసి వచ్చింది. దాంతో ఇందిరకు జీవితం మీద కసి పెరిగింది. తన స్నేహితురాలు, ఇంటర్‌లో క్లాస్‌మేట్, ఆరపదలో ఉన్న కళ్యాణిని మొదట సహృదయంతో చేరదీసింది. పిలిచి తన ఇంట్లోనే వసతి సౌకర్యాలు కల్పించింది. అలాంటి కళ్యాణికి ప్రకాశం అండదొరికితే ఇందిర భరించలేకపోయింది. తనూ కళ్యాణి లాంటి స్త్రీయే. తనకూ కళ్యాణిలాగే కష్టాలున్నాయి. తనకు దొరకని ప్రకాశం అండ కళ్యాణికి ఎందుకు దొరకాలి? తను కోరుకున్నదేదీ తనకు దొరకట్లేదన్న కసి ఇందిరలో ఆవరించింది. ఆ కసి కళ్యాణి మీద కలిగింది, ప్రకాశం మీదా కలిగింది. ఆ కసి తోనే ఇందిర ప్రకాశాన్ని తన వైపుకి ఆకర్షించుకుంది; స్వర్గ సౌఖ్యాలూ అందించింది.

'ఏమిటి ప్రకాశం! ఎందుకంత భయపడిపోతావు? దేనికి నీకు దిగులు? చూడు - ఇది కాదు బతికే విధానం, ఇంతకన్నా బాగా బతకాలి' అని ధైర్యం చెబుతుంది. ఆమె మాటల్లోనే బలమైన ఆమె వ్యక్తిత్వం ఆవిష్కరింపబడింది.

ఊళ్లో కన్న తండ్రిని పోగొట్టుకొని పుట్టెడు దుఃఖంతో పట్నం చేరిన కళ్యాణికి ప్రకాశం ప్రవర్తనలో వచ్చిన మార్పు, ఇందిర ప్రవర్తించే పద్ధతీ ఎంతో నిరాశనూ, నిర్వేదాన్నీ కలిగించాయి. ప్రకాశానికి తనతో మాట్లాడటానికి మాటలు వెతుక్కోవలసి రావలసిన దుస్థితిని కళ్యాణి పసిగట్టింది. మొన్నటి ప్రకాశమేనా? ఈ ప్రకాశం. 'నా సర్వస్వం నువ్వే - నీ జీవితమే నా జీవితం. నీ సుఖ దుఃఖాలన్నీ నావే సుమా! అని వల్లించిన ప్రకాశమేనా? ఒకనాడు - కన్నీరెందుకు కళ్యాణీ? నేనుండగా నీకు దుఃఖమా? అన్న ప్రకాశమేనా ఇతడు? కళ్యాణికి దుఃఖం ముంచుకొచ్చింది. కానీ తన కష్ట సుఖాల్లో భాగం పంచుకోవడం చేతకాని వాళ్లముందు తన దుఃఖాన్ని వెల్లడించడం ఆమె ఇష్టపడలేదు. కళ్యాణి హృదయంలో అభిమానం బుసలు కొట్టింది. విషాదం విస్తరిల్లింది. పెట్టే, బేడా సర్దుకొని తన క్లాస్‌మేట్ వసుంధర ఇంటికి మకాం మార్చేసింది. ఊర్నించి రైల్లో వస్తుంటే, వసుంధర కలిసింది. కలసి ప్రయాణం చేశారు. కళ్యాణి విషాదాన్ని గమనించిన వసుంధర ఆమెను ఓదార్చింది. ధైర్యం చెప్పింది. తమ ఇంటికి వచ్చేయాల్సిందిగా ఆహ్వానించింది. వసుంధర ఇంట్లో ఆమే, ఆమె పిన్నిగారు ఇద్దరే ఉంటారు. అక్కడ కళ్యాణికి ఎలాంటి అసౌకర్యం ఉండదని అనునయించింది. అంతే కాదు రైల్లో తోటి ప్రయాణీకుల పట్ల, ముఖ్యంగా వృద్ధులూ, గర్భిణీ స్త్రీ పట్ల వసుంధర ప్రదర్శించిన ఔదార్యం కళ్యాణిని ముగ్ధురాల్ని చేసింది. ఆమె కారుణ్యం పట్ల అభిమానం కలిగించింది. అందుకే ఇందిర వాళ్ల ఇల్లు ఖాళీ చేసిన కళ్యాణి ఎలాంటి సంకోచాలూ, సందేహాలూ లేకుండా వసుంధర ఇంటికి వెళ్లగలిగింది.

తండ్రి చనిపోవడం, ప్రకాశం నిరాదరణ, ఇందిర అన్యాయం వంటి దెబ్బల నుండి కళ్యాణి కోలుకోక ముందే, ఆమెను చూడడానికొచ్చిన మునసబు రామినాయుడు హఠాత్తుగా మంచమెక్కుతాడు. కళ్యాణిని కూతురిలా చూస్తూ, ఆవిడ తాలూకు ఇల్లు అమ్మి తన అప్పు కింద డబ్బు తీసుకోకుండా, వెయ్యి రూపాయలూ తెచ్చి కళ్యాణికిచ్చి, ఆమెను చదువు కొనసాగించమని చెప్పిన రామినాయుడుకి హార్ట్ ఎటాక్ వచ్చింది. కళ్యాణి గుండెల్లో ఒక్కసారి జలపాతం హోరుపెట్టింది. కీకారణ్యంలో జంతు ధ్వనుల లాంటివి ఏవో వినబడ్డాయి. కానీ తేరుకోవాలి. జారిపోకూడదు.

తన స్నేహితులు వసుంధర, కృష్ణమూర్తి సహాయంతో, డా॥ చక్రవర్తి సహకారంతో మునసబు రామినాయుడిని కింగ్ జార్జి ఆసుపత్రిలో చేర్పించింది కళ్యాణి. రామినాయుడు ఆరోగ్యం క్రమంగా క్షీణించసాగింది. డాక్టర్లు శక్తివంచన లేకుండా శ్రమించారు. అయినా లాభం లేకుండా పోయింది. అరవై ఏళ్లు నిండు జీవితం జీవించి అకస్మాత్తుగా, అర్థాంతరంగా ఆయువు పోగొట్టుకుంటున్న ఆ వృద్ధుని అంతిమ క్షణాలను అతి సమీపంగా చూసింది కళ్యాణి. డాక్టర్ అతని నాడి చూసి, స్టెతస్కోపుతో కూడా చూసేసి "వెరీ సారీ" అంటూ దుప్పటి కప్పేశాడు. కళ్యాణి చలనం లేకుండా అలా కొంతసేపు నిల్చుంది. ఆమె ఏడుస్తుందేమోనని భయపడ్డాడు డాక్టర్. కళ్యాణి కళ్ళలో నీళ్లు లేవు.

రామినాయుడు జబ్బు సమయంలో సహాయం చేసిన కృష్ణమూర్తి, వసుంధర, డాక్టర్ చక్రవర్తిలపై కళ్యాణికి కృతజ్ఞతా గౌరవాలేర్పడ్డాయి. జీవితంలోని అన్ని వికృత కోణాలనూ అనుభవించిన చక్రవర్తి తనలాగే జీవితంలో దగాపడి, జీవితాన్ని చూసి భయపడుతున్న కళ్యాణికి అండగా నిలవాలని ఆశపడి ఆమెకు దగ్గిరవుతాడు. జీవితంలో ఎన్నో దెబ్బలు తిని కోలుకున్న చక్రవర్తి, అటువంటి దెబ్బలే తిని రాటుదేలిన కళ్యాణికి సన్నిహితుడౌతాడు. కళ్యాణిని మొట్టమొదట చూసినప్పుడే 'ఈవిడనెక్కడో చూసినట్లుంది' అని అతనికి, 'ఇతనినెక్కడో చూసినట్లుంది' అని ఆమెకు అనిపించిందని రచయిత్రి రాయడంలోనే వారి అనుబంధాన్ని వ్యక్తం చేయడం జరిగింది. నవలాంతంలో డాక్టర్ చక్రవర్తి, కళ్యాణిలు దంపతులైపోతారు.

ఇందిర ఈ నవలా నాయిక. ఆదర్శాలు మాట్లాడకుండా, తనేదో గొప్ప వ్యక్తినని అనుకోకుండా, హాయిగా బతకాలనుకునే స్త్రీ. ఆవిడ జీవితానికి తప్పో, ఒప్పో ఒక లక్ష్యముంది. ఆ లక్ష్యం చేరుకోవడానికి ఏది అడ్డొచ్చినా, పక్కకు తోసేయడానికి సంకోచించదు. కళ్యాణిపై కసితో ఇందిర ప్రకాశానికి సన్నిహితమైంది. ప్రకాశం ఒక సగటు సామాన్య మానవుడు. అతనికీ ఇష్టాయిష్టాలూ, ప్రేమాభిమానాలూ ఉంటాయి. అయితే తన ఇష్టాన్ని వ్యక్తీకరించే ధైర్యం లేదు. చిన్నప్పటినుంచీ కొన్ని చట్రాల్లో పెరిగినవాడు. తండ్రి చనిపోయి, మేనమామ ప్రాపకంలో పెరిగినవాడు. డబ్బును ప్రేమించి, మనుషులతో వ్యాపారం చేసే మేనమామ శేషావతారం పడగనీడలో పెరిగిన ప్రకాశం చేవలేనివాడుగా కాలేజీలో పేరు పడ్డాడు. ఇందిర వ్యక్తిత్వం ఎంత బలమైనదో, ప్రకాశం వ్యక్తిత్వం అంత బలహీనమైనది. ఎవరు ఎటు తోస్తే, అటు వాలిపోయే మనస్తత్వం.

కళ్యాణికి సహాయం చేయలేకపోయిన తన అశక్తతతో దిగులుపడుతున్న సమయంలో ఇందిర అతని చేయి అందుకుంటుంది. ఇందిరతో స్వర్గ సుఖాలు అనుభవిస్తున్న తరుణంలో శేషావతారం వచ్చి 'ఎవర్రా అది?' అని హుంకరించేసరికి ప్రకాశం భయపడిపోతాడు. పిల్లిలా అతని వెనకవెళ్లిపోయి, పెద్దలు కుదిర్చిన సంబంధానికి తలూపి అంగీకరిస్తాడు. ఇందిరపై వ్యామోహాన్ని వదులుకోలేక, పారిపోయి వచ్చేస్తాడు.

'ఇంతకీ నువ్వు చేసొచ్చిన అడ్వెంచర్ ఏమిటో చెప్పు' అంది ఇందిర మంచం మీద కూర్చుని.

ప్రకాశం కుర్చీలో కూర్చుని 'ఆ అమ్మాయి నెవర్నో చూద్దాం రమ్మని రాజమండ్రి లాక్కెళ్లాడు మా మామయ్య. నా ఇష్టాఇష్టాలతో పనిలేకుండానే అన్ని మాటలూ జరిపించేశాడు ఇవ్వాళ ప్రొద్దుటే. అమలాపురంలో ఎవరితోనో కొంచెం పనుంది. సాయంత్రానికి వచ్చేస్తాను, అప్పుడిద్దరం కలిసి ఇంటికి వెళ్ళిపోవచ్చు అని వెళ్లాడు. ఇదే సమయమని మేం బసచేసిన బంధువులను పది రూపాయలడిగి పరిగెత్తుకు వచ్చేశాను' అన్నాడు.

'ఎందుకుకొచ్చినట్టో?' అంది ఇందిర చిత్రంగా మూతి తిప్పి. ప్రకాశం గతుక్కుమన్నాడు.

'అదేమిటిందిరా! అలా అంటావు? ఎందుకొస్తావు, నీ కోసమే' అన్నాడు.

'ఛీ! నీకు సిగ్గు లేకపోతే, నాకుంది. మామయ్య రమ్మంటే వెళ్ళిపోయి, అతనెలా చెబితే అలా ఆడి, అన్నిటికీ ఒప్పేసుకుని ఇప్పుడు నా కోసం వచ్చాడట, నా కోసం. దొంగతనంగా పారిపోయిరావడం ఒక ప్రతిభ అనుకున్నావు కాబోలు. ఇదిగో ప్రకాశం! ఇంక నీకూ, నాకూ సరి. నాతో బేరాలేం పెట్టుకోకు' అంది ఇందిర. గీత వేసి తుడిచేసినంత సుళువుగా అనేసింది ఆ మాటల్ని.

ప్రకాశం నిర్ఘాంతపోయాడు.

ఇందిరను ధూర్తురాలుగా, మోసగత్తెగా, నీతి నియమాలు లేని పిల్లగా భావించాడు. ఆత్మవంచన చేసుకుని, మామ చూపిన పిల్లను పెళ్లాడితేనే తనకు సుఖం అనుకుంటాడు. అంతటితో అతని కథ ముగుస్తుంది.

కృష్ణమూర్తికి పెద్దగా సుగుణాలు లేవు. అతనొక ఆదర్శపాత్ర అంతకన్నా కాడు. కాని ప్రకాశం వంటి చవట కాదు. చివరివరకూ కృష్ణమూర్తి వ్యక్తిత్వం అస్పష్టంగానే వ్యక్తమౌతూ ఉంటుంది.

ఏదో చదువు వెలగబెట్టేస్తున్నాడనే నమ్మకంతో తండ్రి పంపుతున్న సొమ్ము తింటూ జులాయిగా కాలం గడుపుతున్న కృష్ణమూర్తికి మొదటిసారిగా కనువిప్పు కలిగించింది కళ్యాణి. ఆ తరువాత వసుంధర అతనిలో కొంత సంచలనం కలిగించింది. అతనిలో నిద్రాణంగా ఉన్న బాధ్యతలనూ, విలువలనూ వసుంధర తట్టిలేపింది. తన కుటుంబ సభ్యుల మమతల ప్రభావం తన స్వేచ్ఛని హరించి వేస్తున్నాయన్న ఆక్రోశం వల్ల వసుంధర, కృష్ణమూర్తికి సన్నిహితమౌతుంది. తను స్వేచ్ఛ కోసం చేసే పోరాటానికి కృష్ణమూర్తి స్నేహాన్ని సాధనంగా మలుచుకుంటుంది. అది గ్రహించిన కృష్ణమూర్తి, వసుంధర సంస్కారపు స్థాయికి తను తగినవాడను కాననే భయంతో తనను తాను సంస్కరించుకునే ప్రయత్నం ప్రారంభిస్తాడు.

బీచీలో వసుంధరతో బాటు కృష్ణమూర్తిని చూసింది ఇందిర. మళ్లీ ఆమెలో కసి బుసకొట్టింది. తన సమ్మోహన శక్తితో కృష్ణమూర్తిని ఆకర్షించింది. ఇందిర స్వార్థ బుద్ధిని చూసి అసహ్యించుకున్న కృష్ణమూర్తి ముందు, ఆమె తన గురించీ, తన జీవిత విధానం గురించీ నిర్భయంగా వివరిస్తుంది. ఇందిర వ్యక్తిత్వంతో కృష్ణమూర్తి ప్రభావితుడైనాడు. ఇందిరకు దారిచూపడం ద్వారా ఆమెను ఒక గొప్ప వ్యక్తిగా జీవించగల అవకాశం కల్పించాలని భావిస్తాడు. ఆమెతో వివాహానికి సిద్ధపడతాడు.

నవలలో అన్యాయం జరిగిన పాత్ర వసుంధరది. కృష్ణమూర్తి, ఇందిరను పెళ్లిచేసుకుంటానని తీసుకున్న నిశ్చయం కంటే, కృష్ణమూర్తి తన నుండి పారిపోవడం, పిరికివాడిలా తప్పుకు పోవడం వసుంధరను ఎక్కువగా బాధపెట్టాయి. ఒక స్నేహితుడుగా అతను వచ్చి, 'ఇదీ నా నిశ్చయం' అని చెప్పి ఉంటే తానింత మధనపడేది కాదు. అలా అనుకున్నప్పుడు వసుంధరకొక చిత్రమైన ఆలోచన వచ్చింది. అతడలా చేయకపోవడమే మంచిదైందేమో. కృష్ణమూర్తిలో ఆ పిరికితనం కనబడబట్టే 'అతడిలో నేననుకున్నంత ఏమీ లేదు. అతనూ సామాన్యుడు, నేనంత కుంగిపోవలసినదేమీ లేదు. ఇదొక అనుభవం. మరి కొంచెం కళ్ళు పెద్దవి చేసి, లోకాన్ని చూడాలి. ముందుకు సాగాలి' అనుకోగలిగింది వసుంధర. ఆమెకొక ప్రశాంతత నిచ్చింది. తన కిప్పుడు ఎవ్వరి మీదా ద్వేషం లేదు.

డాక్టర్ చక్రవర్తీ, కళ్యాణీ, ఇందిరా, కృష్ణమూర్తిల వివాహాలతో నవల సుఖాంతమౌతుంది.

నవలకు కేంద్ర బిందువు ఇందిర.

"ఆశలూ, స్వప్నాలూ, అనురాగాలూ, అభిమానాలూ అన్నీ పెంచుకో. కానీ వాటికి శస్త్ర చికిత్స అవసరమయినప్పుడు సంకోచం లేకుండా కోసి అవతల పారేయ్. ఏనాడో పగిలిపోయిన కలలూ, విరిగిపోయిన అనురాగాలూ అటకలోంచి తీసి అవతల

పారేయ్. మనసు తేలిగ్గా ఉంటుంది. జీవితకాలం నిండుగా బతుకు. నిర్భయంగా బతుకు. మానవత్వంతో బతుకు." - ఇది ఇందిర జీవన సిద్ధాంతం, వ్యకిత్వం, తాత్వికత. ఏ మానవ జీవితానికైనా ఇంతకన్నా గొప్ప తాత్వికత ఏముంటుంది.

## 19.5 ముగింపు :

సగటు మానవులంతా కాలప్రవాహంలో కొట్టుకుపోతారు. కొందరు కాలానికి ఎదురీదుతారు. కాలాన్ని శాసిస్తారు. కాలాతీత వ్యక్తులుగా చరితార్థులౌతారు. వారు సాహసులు. చరిత్ర నిర్మాతలు. ఈ నవలలో ఒక ఇందిర, ఒక కళ్యాణి, ఒక కృష్ణమూర్తి కాలాతీత వ్యక్తులుగా రూపొందారు. 1960 దశకపు యువతరానికి ప్రతినిధులుగా మిగిలారు. ఒక తరం జీవన విధానానికి ప్రతీకలుగా నిలిచారు. డా॥ పి. శ్రీదేవి "కాలాతీత వ్యక్తులు" నవల కోసమే జన్మించిందా అనిపిస్తుంది. ఈ నవలలో సంప్రదాయ బంధాలను ఛేదించిన ఒక లోకం ఉంది. అందులో కోరిక, ప్రేమ, బాధ, సంతోషం, నిజం, అబద్ధం అన్నీ ఉన్నాయి. విభిన్న పార్శ్వాలున్నాయి. తెలుగు నవలా సాహిత్యంలో సుస్థిర స్థానం సంపాదించుకున్న విశిష్టమైన నవల - "కాలాతీత వ్యక్తులు".

## 19.6 మాదిరి ప్రశ్నలు :

1. 'కాలాతీత వ్యక్తులు' నవల నామౌచిత్యమును చర్చించండి.
2. డా॥ పి. శ్రీదేవి రచనా శిల్పాన్ని సమీక్షించండి.
3. 'కాలాతీత వ్యక్తులు' నవలలోని ప్రధానమైన పాత్రల మనస్తత్వాలను విశ్లేషించండి.
4. ఇందిర పాత్ర విశిష్టతను వివరించండి.
5. కళ్యాణి పాత్ర స్వభావాన్ని చర్చించండి.
6. 'కాలాతీత వ్యక్తులు' నవలా కాలంనాటి సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక స్థితిగతులను సమీక్షించండి.
7. ఆధునిక నవలా సాహిత్యంలో 'కాలాతీత వ్యక్తులు' నవల స్థానాన్ని అంచనా వేయండి.
8. తెలుగు నవలా పరిణామాన్ని వివరించండి.
9. ప్రకాశం పాత్ర చిత్రణను విశ్లేషించండి.
10. సాహిత్యం సమాజానికి దర్పణమన్న అంశాన్ని చర్చించండి.

**- ఆచార్య యస్వీ సత్యనారాయణ**

పాఠం - 19.2

# స్వేచ్ఛ

**లక్ష్యం :**

స్త్రీవాద నవలు సాహిత్యానికి లక్ష్య ప్రాయమైనది రచనగా వివరిస్తూ, స్త్రీవాదాన్ని , స్వేచ్ఛకు అర్థాన్ని తెలియజేయడం.

**పాఠ్యనిర్మాణక్రమం :**

- **19.2.1.** ఉపోద్ఘాతం.
- **19.2.2.** స్త్రీవాదం అంటే ఏమిటి
- **19.2.3.** విశిష్టమైన స్త్రీవాదనవల - స్వేచ్ఛ
- **19.2.4.** స్వేచ్ఛ నామౌచిత్యం
- **19.2.5.** ముగింపు.

## "స్త్రీవాద నవలా సాహిత్యానికి లక్ష్యప్రాయమైన రచన - స్వేచ్ఛ "

స్త్రీల అనుభవాలను, అనుభూతులను స్త్రీలదృక్కోణం నుండి స్త్రీలే వర్ణించాలన్న ఆలోచనావిధానంతో పురోగమిస్తున్న సాహిత్య ధోరణి - స్త్రీవాదసాహిత్యం' . సమాజాన్ని, చరిత్రను, సాహిత్యాన్ని, సంస్కృతిని స్త్రీలదృక్పథంతో పరిశీలించే 'లోచూపు' ను స్త్రీవాద సాహిత్యం కలిగిస్తున్నది. ఒక కొత్తతరం కవయిత్రులనూ, రచయిత్రులనూ ఈ ధోరణి తెలుగు సాహిత్యరంగంలో సృష్టించుకున్నది.

స్త్రీల కష్టనష్టాను వర్ణిస్తూ, స్త్రీల అభ్యున్నతిని కాంక్షిస్తూ కందుకూరి వీరేశలింగం పంతులు, గురజాడ, శ్రీపాద, చలం, రంగనాయకమ్మ మొదలు అనేకమంది రచయిత (త్రు) లు ఆధునిక యుగంలో రచనలు చేశారు. అయితే 1980 తరువాత ఇదొక ప్రత్యేకమైన సాహిత్యధోరణిగా ముందుకు వచ్చింది. 1990 నుండి తెలుగులో అన్ని దిన, వార, మాస పత్రికల్లోని సాహిత్యపేజీల్లో 'స్త్రీవాదసాహిత్యం' ప్రస్తావన అధికమయింది. ఈ ధోరణికి అనుకూలంగానూ, ప్రతికూలంగానూ చర్చలూ, వాదోపవాదాలూ జరుగుతున్నాయి.

తొలిదశలో స్త్రీవాద భావాలు కవితారూపంలోనే అధికంగా వ్యక్తమయ్యాయి. 'నీలిమేఘాలు' పేరిట ఒక కవితా సంకలనం వెలువడింది. తరువాత అనేక సంకలనాలు, సంపుటులు ప్రకటింపబడినాయి. క్రమంగా స్త్రీవాద కథలూ, నవలలూ వెలువడుతున్నాయి. స్ర్వీఆద నవలా సాహిత్యానికి లక్ష్యప్రాయంగా నిలిచిన రచన - ఓల్గా రచించిన "స్వేచ్ఛ"

## 19.2.2 'స్త్రీవాదం' అంటే ఏమిటి ?

తెలుగులో 'స్త్రీవాదం' అన్న పదాన్ని 'ఫెమినిజం' అనే ఆంగ్లపదానికి సమానార్థకంగా వాడుతున్నాం. 'మానవసమాజంలో సగభాగంగా ఉన్న స్త్రీలు లైంగిక వివక్షకారణంగా పురుషుల కంటే తక్కువ సాంఘిక స్థాయిలో ఉండడాన్ని ప్రశ్నిస్తూ వచ్చిన మానవీయ ఉద్యమం - ఫెమినిజం. అణచివేతకు గురవుతున్న స్త్రీలు విముక్తి కోసం తపన పడుతూ తమ స్వీయ చైతన్యాన్నీ, అభిమానాన్నీ పెంపొదింప జేసుకోవడంలో రూపొందిన ఆలోచనా విధానం - 'ఫెమినిజం' (స్త్రీవాదం)

ఆధునిక సమాజంలో స్వేచ్ఛనూ, సమానత్వాన్నీ ఉన్నత మానవ విలువలుగా ప్రచారంలోకి తెచ్చింది 'ఫ్రెంచి విప్లవం' దీనివల్ల కలిగిన చైతన్యం నుండి స్త్రీలు, ఈ స్వేచ్ఛా సమానత్వాలు తమకు కూడా వర్తించాలన్న డిమాండ్ నుండి 'ఫెమినిజం' ఆలోచనాధార ఆవిర్భవించింది. ఒలింపీ-డీ-గోన్స్ స్త్రీల హక్కుల ప్రకటనను ప్రతిపాదించారు. ఇంగ్లాండ్ రచయిత్రిమేరీ ఓల్‌స్టోన్ క్రాఫ్ 'విండికేషన్ ఆఫ్ ది రైట్స్ ఆఫ్ ది విమెన్ ' గ్రంథంలో 'పుట్టుకలతో స్త్రీపురుషులు సమానమే అయినప్పటికీ, పెంపకంలో అసమానతలున్నాయి. కుటుంబంలో ద్వంద్వ విలువలున్నాయి. స్త్రీకి పరాధీనత చాలా ఇబ్బంది కరమైన విషయం. భర్త పోషణపై ఆధారపడిన స్త్రీ అభద్రతాభావంతో సకల సౌభాగ్యాలనూ కోల్పోయింది' అనే అంశాలను ప్రస్తావించారు. వివాహ వ్యవస్థను ఆమె తీవ్రంగా వ్యతిరేకించారు.

పారిశ్రామిక విప్లవం తర్వాత అభివృద్ధి చెందుతున్న పెట్టుబడిదారీ దేశాలలో, అక్కడి సామాజిక అవసరాలకు అనుగుణంగా స్త్రీల సామాజిక జీవన విధానంలో అనివార్యమైన మార్పులొచ్చాయి. వీటి సర్వవసానంగా **1840** నుండి అమెరికాలోనూ, **1848** నుండి రష్యాలోనూ, **1878** నుండి ఇంగ్లాండులోనూ ఫెమినిస్టు ఉద్యమాలు మొదలయ్యాయి. ప్రారంభంలో ఈ ఉద్యమాల లక్ష్యం - స్త్రీలకు ఓటు హక్కును, పనిహక్కును చట్టబద్ధంగా కల్పించాలన్న పరిమితుల్లోనే ఉండేది.

స్త్రీలు చదువుకోడానికీ, ఉద్యోగాలు చేయడానికీ ప్రతిబంధకాలుగా ఉన్న సామాజిక అభ్యంతరాలను తొలగించాలన్న సంస్కరణవాద దృష్టితో స్త్రీవాద ఉద్యమాలు ప్రారంభమయ్యాయి.

ఆ తరువాత స్త్రీవాదభావనలో మరోమెట్టుగా స్త్రీ, పురుషుల అసమానతలను లైంగికత ప్రాతిపదికపై విశ్లేషించే ధోరణి ప్రారంభమయింది. స్త్రీల అణచివేతకు కేంద్రబిందువు భౌతిక లైంగికత. దీంతోబాటు పురుషాధిక్యత అన్న అంశాలపై చర్చమొదలయింది. స్త్రీల విముక్తికి అడ్డంకిగా ఉన్న పురుషాధిక్యతను ప్రశ్నించడం ప్రారంభమైంది. స్త్రీలు స్వతంత్రంగా, పురుషుల ప్రభావం పడని ఆలోచనావిధానాన్ని రూపొందించుకునే క్రమాన్ని స్త్రీవాదం పెంపొందించింది. 'తన శరీరం మీద తన హక్కు' కోసం స్త్రీ, అమలులో ఉన్న సకల సామాజిక , సాంస్కృతిక విలువలను ప్రశ్నించసాగింది. 'ఫ్రీడమ్ ఆఫ్ లవ్' అన్న భావనకు అంకురార్పణ జరిగింది. ప్రేమించడానికీ, ప్రేమను అభివ్యక్తం చేయడానికీ అవకాశాలు లేని నిర్బంధపూరితమైన వైవాహిక సంబందాలలో మగ్గుతున్న స్త్రీలకు 'ఫ్రీడమ్ ఆఫ్ లవ్ ' భావన ఒక ఆదర్శస్వప్నంగా సాక్ష్యత్కరించింది.

అస్తిత్వవాద సిద్ధాంతకర్త జ్యాపాల్ సార్ర్ట్ (Jean Panl Sartre) సన్నిహితురాలు సైమన్ దీబోవా 'సెకండ్ సెక్స్' గ్రంధాన్ని రచించారు. 'ఆడపిల్లలు పుట్టరు. తయారు చేయబడతారు. చిన్నప్పట్నించీ ఆడపిల్లలకూ, మగపిల్లలకూ వేర్వేరురుగా శిక్షణ ఇవ్వబడుతుంది' అనే ఆలోచనలను ఆమె ప్రకటించారు.

మార్క్సిస్టు సిద్ధాంతకర్తల్లో ఒకరయిన ఏంగెల్స్, కుటుంబ పుట్టుపూర్వోత్తరాలును గురించి రాసిన పుస్తకంలో - సామాజిక అభివృద్ధి క్రమంలో స్త్రీలు నిర్వహించిన పాత్రను, వారు పడిన అవస్థలను సహేతుకంగా పేర్కొన్నారు. స్త్రీవాద ఆలోచనాదృక్పథం మరింత బటపడడానికి ఏంగెల్స్ గ్రంథం తోడ్పడింది.

**1945** లో ఏర్పడిన 'ఐక్యరాజ్యసమితి' దేశదేశాల మధ్య స్నేహ, సుహృద్భావాలను పెంపొదింప జేయడానికి ఒక వైపు కృషి చేస్తూనే, మరోవైపు పీడితులైన స్త్రీలు, పిల్లలు , వృద్ధులు మొదలైన వారి సంక్షేమం కోసం కొన్ని మార్గదర్శక సూత్రాలను నిర్దేశించింది. **1970** లో ఈ కార్యక్రమాలను సమీక్షించినప్పుడు, స్త్రీల విషయంలో ఏమీ పురోగతి, మార్పు రాలేదన్న వాస్తవం వెలుగులోకి వచ్చింది. స్త్రీల విషయంలో ప్రత్యేకమైన కృషి జరగాలన్న లక్ష్యంతో **1975** సంవత్సరాన్ని 'యునెస్కో' అంతర్జాతీయ మహిళా సంవత్సరంగా ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా మహిళా జీవన అద్యయనం ప్రారంభమయింది. అధ్యయన కేంద్రాలు వెలిశాయి. అధ్యయన గ్రంథాలు వెలుగు చూడసాగాయి. కేవలం ఏడాది కాలంలో స్త్రీల జీవన స్థితిగతులు అధ్యయనం సాధ్యం

కాదని గ్రహించిన యునెస్కో 1976 - 85 దశకాన్ని 'అంతర్జాతీయ మహిళాదశాబ్దం' గా ప్రకటించింది. దేశదేశాల్లో మహిళల సమస్యలపై సదస్సులూ, సమాలోచనలూ, మహాసభలూ నిర్వహింప బడినాయి. స్త్రీలు దృక్కోణం నుండి సమాజాన్ని అధ్యయనం చేసే నూతన దృష్టి ఏర్పడింది. మన దేశంలోనూ, రాష్ట్రంలోనూ స్త్రీవాద ఆలోచనాధోరణి ఒక ప్రత్యేకమైన ఆలోచనాధారగా సామాజిక ఉద్యమాలలోనూ, సాహిత్యరంగంలోనూ బలమైన ప్రభావాన్ని వేస్తున్నది.

తెలుగు సాహిత్యంలో బలంగా దూసుకువచ్చిన స్త్రీవాద ధోరణిలో కొన్ని స్థానికాంశాలున్నాయి. 20 వ శతాబ్దారంభం నాటికే కందుకూరి, గురజాడ ఒరవడిదిద్దిన 'ఉదారవాద స్త్రీవాదం' (లిబరల్ ఫెమినిజం) ; చలం వికసింపజేసిన 'మౌలిక స్త్రీవాదం' (రాడికల్ ఫెమినిజం) ; చాసో, కొ.కు, మహీధర తదితర అభ్యుదయ, విప్లవ రచయితలు రగిలించిన 'సామ్యవాద స్త్రీవాదం' (సోషలిస్టుఫెమినిజం) - ఇక్కడి సాహిత్యంలో స్త్రీవాదధోరణికి కావలసిన పూర్వరంగాన్ని ఏర్పరిచాయి. అసమానతలను ప్రశ్నించే లక్షనం, సమానత్వాన్ని సాధించాలన్న మానవీయ ఆకాంక్ష, స్త్రీ పురుష వివక్షతలులేని కులాతీత, మతాతీత వర్గరహిత సమసమాజనిర్మాణం వంటి ఆదర్శాలను అభ్యుదయ, విప్లవ సాహిత్యాలు ప్రచారం చేశాయి.

తాము స్త్రీలమనీ, తమకూ ఒక హృదయం, ఒక అనుభూతి, అనుభవం, ఆలోచనా ఉంటాయనే గుర్తింపు చైతన్యం నేటి స్త్రీవాద సాహిత్యంలో స్పష్టంగా కనబడుతుంది. స్త్రీ అంటే కేవలం ఆమె శరీరమే అని భావించిన పురుషాధిక్యభావజాలాన్ని స్త్రీవాదం ప్రతిఘటిస్తున్నది. స్త్రీలకు చదువుకునే స్వేచ్ఛ, వైవాహిక స్వేచ్ఛ, కుటుంబ జీవితంలో స్వేచ్ఛ, తన అభీష్టం మేకు బ్రతికే స్వేచ్ఛలను స్త్రీవాద సాహిత్యం ఆకాంక్షిస్తున్నది.

## 19.2.3 విశిష్టమైన స్త్రీవాదనవల - "స్వేచ్ఛ"

సమాజంలో, కుటుంబ జీవితంలో కొనసాగుతున్న వివక్ష పట్ల ఒక స్త్రీమూర్తి స్పదించిన విధానం, ప్రదర్శించిన ప్రతిఘటన చైతన్యానికి నవలారూపం - "స్వేచ్ఛ".

"ఓల్గా" అన్న కలం పేరుతో ఈ నవలను రచించిన రచయిత్రి పూర్తిపేరు- "పోపూరి లలితకుమారి." పోపూరి వెంకటసుబ్బమ్మ, వెంకటసుబ్బారావు దంపతులకు 1950 లో లలిత కుమారి పుట్టారు. ఎం.ఏ. పూర్తిచేసి కొంతకాలం అధ్యాపక వృత్తిలో కొనసాగారు. 'పైగంబరకవుల్లో' ఒకరిగా 'ఓల్గా' అన్న సంకేతనామంతో సాహిత్యరంగంలోకి అడుగుబెట్టిన లలితకుమారి 'సహజ', 'స్వేచ్ఛ', 'మానవి', 'కన్నీటికెరటాల వెన్నెల', 'ఆకాశంలో సగం' మొదలైన నవలలు రచించారు. 'రాజకీయ కథలు', 'ప్రయోగం', 'భిన్నసందర్భాలు', 'గులాబీలు' మొదలైన కథా సంకలనాలు ప్రకటించారు. 'మాకు గోడలు లేవు', 'నీలిమేఘాలు', 'నూరేళ్ళచలం', 'సారాంశం', 'సరిహద్దులు లేని సంధ్యలు', 'మహిళావరణం', 'జీవితమే ఒక ప్రయోగం', 'అలజడి మా జీవితం' మొదలైన గ్రంధాలకు సంపాదకత్వం వహించారు.

'సామన్యుల సాహసం', 'భూమిపుత్రిక', 'మిస్సింగ్', 'మూడు తరాలు', 'పుట్టిన బిడ్డకు తల్లి ఉత్తరం', 'ఉరికొయ్య అంచున', నేనూ సావిత్రీ బాయిని' గ్రంధాలను అనువదించారు. 'అతడు-ఆమె-మనం' (సాహిత్యవిమర్శ), 'కుటుంబ వ్యవస్థమార్క్సిజం' (వ్యాసం), 'వాళ్ళు ఆరుగురు' (నాటిక), 'యుద్ధము-శాంతి' (నృత్యరూపకం), 'చరిత్రస్వరాలు' (రూపకం), 'పలికించకు మైనమృదంగాలను' (సాహిత్యవ్యాసాలు), 'తొలి వెలుగులు' (స్త్రీవాదవ్యాసాలు) వెలువరించారు.

1987 ఫిబ్రవరి మాసంలో 'చతుర' లో అత్యుత్తమ నవలగా 'స్వేచ్ఛ' ప్రచురింపబడింది. అచ్చయిన వెంటనే ఈ నవల ఎంతో చర్చనూ, వివాదాన్నీ రేకెత్తించింది. ఆంధ్ర దేశంలోని దాదాపు అన్ని పట్టణాల్లోనూ సాహిత్యభిమానులు, పాఠకులు ఈ నవలను గురించి విస్తృతంగా చర్చించారు. కొందరు అనుకూలంగానూ, మరెందరో ప్రతికూలంగానూ స్పందించారు. దాదాపు

ఏడేళ్ళపాటు వివాదానికి గురైన 'స్వేచ్ఛ' నవల **1994** మే మాసంలో మొదటి ప్రచురణగా పుస్తక రూపంలో వెలువడింది. క్రమంగా **1998 , 2003, 2004** సంవత్సరాల్లో మలిముద్రణలు పొందింది.

'ఆంధ్రదేశంలో ఏ ఆడపిల్లా పెరగనంత స్వేచ్ఛగా పెరగనిచ్చి, ఆ స్వేచ్ఛవల్ల ఎన్ని ఇబ్బందులొచ్చినా భరించి' తనను ప్రేమించిన అమ్మానాన్నలు పోపూరి వెంకట సుబ్బమ్మ-పోపూరి వెంకట సుబ్బారావులకు ప్రేమతో ఓల్గా తమ 'స్వేచ్ఛ' నవలను అంకితమిచ్చారు.

'మన జీవితాల్లో నయినా, వాటి చుట్టూ ఉండే సమాజంలో నయినా-వాటి చలన సూత్రాలను అన్వేషించడమే ఆవశ్యకత. ఆ ఆవశ్యకతను గుర్తించటమే స్వేచ్ఛ. ఆ అన్వేషణ దశలో స్వేచ్ఛ నవలలోని మీరోయిన్ జీవితంలోలా సంక్షోభమూ ఉంది సంఘర్షణా ఉంది. ఆవశ్యకత గుర్తించిన తర్వాత-స్వేచ్ఛానంతర జీవితంలో సంఘర్షణే గాని సంక్షోభం ఉండే అవకాశంలేదు' అని సి.వి. సుబ్బారావుగారు విశ్లేషించారు.

## 'స్వేచ్ఛ' ఇతివృత్తం :

ఒక సగటు సాధారణ మధ్యతరగతి తెలుగు కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల 'అరుణ'. 'చిన్నప్పట్నించీ అరుణకు పుట్టింట్లో స్వేచ్ఛ లభించలేదు. తండ్రి జానకి రామయ్య, తల్లి సీతమ్మ, అన్న గోపాల్రావు, వదిన సుశీల, మేనత్త కనకమ్మ - అందరూ అరుణను తమ అదుపాజ్ఞల్లో ఒదిగే యంత్రంగానే పరిగణించారు. అయిన దానికీ, కానిదానికీ ఆమెను సూటిపోటి మాటలతో గాయపరిచేవారు. ఫలానా పనిచేయదగినదనీ, ఫలానాది చేయకూడదనీ ఆంక్షలు విధించేవారు. ఒక సినిమా లేదు, ఒక షికారులేదు, ఒక సరదాలేదు. ఒంటరిగా బయటికి వెళ్ళలేని నిస్సహాయస్థితిలో అరుణ బాల్యం గడిపింది. అరుణ వేసే అడుగు, పోసుకునే నీళ్ళు , రాసుకునే పౌడరూ అన్నీ ఇంట్లో ఎవరికో ఒకరికి అభ్యంతరకరంగా ఉండేవి. ఇతర విషయాలలో భిన్నాభిప్రాయాలున్న తమ కుటుంబ సభ్యులందరికీ అరుణపై ఆంక్షలు విధించే విషయంలో మాత్రం ఏకాభిప్రాయముండేది. అరుణ మేనత్త కనకమ్మయితే అరుణను అవమానించడానికే పుట్టినట్లు ప్రవర్తించేది. ఎప్పుడు అరుణ స్కూల్ నించి వస్తుందా , ఏ తప్పు పట్టుకోగలనా అన్నట్లు ఎదురుచూసే కనకమ్మకళ్ళు ఒకనాడు అరుణ గుండెలమీదున్న పుస్తకాల మీద పడ్డాయి. "వయసొచ్చిన పిల్ల చదివింది చాల్లే అని ఆ మూడు ముళ్ళూ వెయ్యకపోతే ఇంతే. గుండెల మీద మగాడి బొమ్మ వేసుకుని ఆ తైతక్కలేంటీ-సిగ్గులేకపోతే సరి" అంటూ ప్రారంభించింది. అరుణ సిగ్గుతో చితికిపోయి పుస్తకాలు కిందపడేసింది.

ఇంట్లో ఉన్నంతసేపూ తన ప్రతికదలికనూ అత్త రికార్డు చేస్తోందన్న స్పృహ అరుణలో నిస్పృహను కలిగించేది. కనీసం అమ్మయినా తనను ఓదార్చుతుందని ఆశించే అరుణకు నిరాశే మిగిలేదు. ఆడపడుచు మాటలకు సీతమ్మకు కళ్ళనీళ్ళొచ్చేవి, తన దుఃఖాన్ని తానే దిగమింగుతూ, ఆమె కూడా తన కూతురు అరుణనే మందలించేది. నాన్న సరేసరి. వదిన సుశీల విసురుగా తన గదితలుపులు బిగించుకుని అరుణ పట్ల తన ఆధిక్యతనూ, అహంకారాన్నీ ప్రదర్శించేది. అరుణ, తన స్నేహితురాలు 'ఉమ' తో మాట్లాడుతూ॥" నీకేం మీ ఇంట్లో స్వేచ్ఛ ఉంది. మీవాళ్ళు నిన్ను హైదరాబాద్‌లో హాస్టల్లో ఉంచి చదివిస్తున్నారు. నా బాధ నీకేం అర్థం కాదు. నేను న్నది ఇంట్లోకాదు, జైల్లో" అనడాన్ని బట్టి అరుణ స్వేచ్ఛారాహిత్యం వ్యక్తమౌతున్నది. ఒకసారి ఉమతో పాటు అరుణ సినిమాకని బయలుదేరి, యూనివర్సిటీకి వెళ్ళొచ్చినందుకు ఇంట్లో పెద్ద రాద్ధాంతమే జరిగింది.

అరుణకు కారాగారం లాంటి తమ ఇంటి వాతావరణం విసుగుపుట్టించింది. వీలైనంత త్వరగా స్వేచ్ఛగా ఆ జైలు నుండి విముక్తం కావాలన్న కసిపెరిగింది. సరిగ్గా ఈ పూర్వరంగంలో ఎం.ఏ చదువుతున్న అరుణకు 'ప్రకాశం' అన్న వ్యక్తిఓ పరిచయమై, ప్రేమగా మారుతుంది. 'నీ అందం, తెలివీ, ప్రతివిషయాన్నీ సున్నితంగా ఆలోచించే నీ మనసూ -వీటిని ప్రేమిస్తున్నాను' అన్న ప్రకాశాన్ని ప్రేమించింది. విశ్వసించింది. ఒక ప్రైవేటు జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం లభించాక అరుణ ప్రకాశాన్ని

రిజిస్టర్ మ్యారేజీ చేసుకుంది. పెళ్ళయిన రెండు నెలలకే అరుణకు గర్భం రావంతో, అప్పుడే పిల్ల వద్దనుకున్న అరుణ అబార్షన్ చేయించుకుంటానంది. ప్రకాశం అంగీకరించలేదు. ఫలితంగా అరుణ ఒక పాపకు తల్లయ్యింది. పాప పుట్టిన మూడు నెలలూ అరుణకు పాపే ప్రపంచమయింది. ఆ పసికందుకి ఎక్కడ ఏ అసౌకర్య కలుగుతుందోనని రాత్రింబగళ్ళూ కనిపెట్టుకు కూచునేది.

మూడు నెలల పాపను అత్తగారికి అప్పగించి , మళ్ళీ కాలేజీకి వెళ్ళడం ప్రారంభించింది అరుణ. కాలేజీకి ప్రభుత్వ గ్రాంట్ లభించింది. యాజమాన్యం అధ్యాపకులకిచ్చిన మాటను నిలబెట్టుకోలేదు. పూర్తిజీతాలు ఇవ్వకుండా, లెక్చరర్ల కడుపులు కొట్టి కాలేజీని అభివృద్ధిచేస్తామన్నారు మేనేజిమెంట్ వాళ్ళు. అధ్యాపకులు అసోసియేషన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. తమ డిమాండ్ల సాధన కోసం స్టీరింగ్ కమిటీ వేశారు. అరుణ ఉద్యమస్వభావం కలది కాబట్టి కమిటీ సభ్యురాలైంది. హక్కులసాధన కోసం సమ్మెచేయ్యాలని అధ్యాపకులు నిర్ణయించడానికి సమావేశమయ్యారు. దాంతో అరుణ ఇంటికి రావడం ఆలస్యమైంది. ఆదే రోజు వాళ్ళ పాపకు జ్వరం రావడం, హడావిడిగా ప్రకాశం ఆఫీసు నుండి వచ్చి పాపను డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్ళడం, అరుణపై అతను అసహనాన్నీ , ఆగ్రహాన్నీ ప్రకటించడం వంటి పరిణామాలు చోటు చేసుకున్నాయి. నెల రోజుల తరువాత మళ్లీ అధ్యాపకుల మీటింగ్. ప్రతిశుక్రవారం అధ్యాపకుల అసోసియేషన్ మీటింగ్‌లకి అరుణ వెళ్ళడం ప్రకాశానికి ఇబ్బందికరంగా పరిణమించసాగింది.

అరుణ మీటింగులకి వెళ్ళిన రోజుల్లా ప్రకాశం విసుక్కుంటూ, ఎగతాళి చేయడం, అరుణ కోసం తెచ్చుకోవడం మొదలయ్యాయి. అధ్యాపకులు తమ ఆందోళనను తీవ్రం చేశారు. నిరాహారదీక్షలు చేయాలని తీర్మానించుకున్నారు. మర్నాడు పేపర్లో సమ్మెవార్తతో పాటు ఫోటో కూడా వేశారు. టెంట్‌లో అరుణ ఒక్కతే లేడీ లెక్చరర్ కావడంతో ప్రెస్ ఫోటోగ్రాఫర్లు అరుణమీదకు బాగా ఫోకస్ చేశారు. అరుణ ప్లేకార్డు పట్టుకుని అరుస్తున్న ఫోటో పేపర్లో వచ్చింది. ఇలా పేపర్లో ఫోటోలు రావడం అవమానకరంగా భావించిన ప్రకాశం విసురుగా బయటికి వెళ్ళిపోయాడు. తాను స్ట్రయిక్ చేస్తే , మీటింగ్‌లకి వెళ్తే ప్రకాశానికి ఇష్టమో, కాదో తెలియదు కానీ, తనకు సోషల్ లైఫ్ ఉంటే ప్రకాశానికి నచ్చదు, ఇష్టం ఉండదన్న విషయం అరుణకు అర్థమైపోయింది. ప్రకాశానికి ఇష్టంలేదని తాను తన కిష్టమైన పనులు మానెయ్యాలా?

'వాడికిష్టంలేనట్టుంది. మానెయ్యకూడదా?' అంది అరుణ అత్త కమలమ్మ. 'కుదరదత్తయ్యా! చాలా అవసరం. వెళ్ళాలి' అంటూ కమలమ్మ సమాధానం కోసం చూడకుండా బైటికి నడిచింది అరుణ.

సమాజంలోని సమస్యలను చిత్రిస్తూ , ప్రజలను చైతన్య పరచడానికి కాలేజీ అధ్యాపకులందరూ కలిసపి "వెలుగు" అనే పత్రికను స్థాపించుకున్నారు. ఆ పత్రిక నిర్వహణ కోసం తన సంపాదన నుండి నెలకు వందరూపాలయలు చందా ఇవ్వసాగింది అరుణ. అది కూడా ప్రకాశానికి నచ్చలేదు.

ఒకసారి ఎలక్ట్రానిక్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న స్త్రీల సమస్యలను తెలుసుకోవడానికి, వారిని ఇంటర్వ్యూ చేయడానికి యూనియన్ వారి కోరిక మేరకు వెళ్ళింది అరుణ. ఆ విషయం తెలిసిన ప్రకాశం తీవ్రంగా కోప్పడ్డాడు. ఆమె చేసిన పనని ఆక్షేపించాడు. నిరసించాడు. మరో సందర్భంలో దొర చేతిలో రేప్ అయిన సంగమ్మను ఇంటర్వ్యూ చేయడానికి వెళ్తూ , ప్రకాశంకు ఇవన్నీ ఇష్టముండదు కాబట్టి స్నేహితురాలి పెళ్ళికి వెళ్తున్నట్లు అబద్ధం చెప్పింది. తరువాత విషయం తెలుసుకున్న ప్రకాశం అరుణతో గొడవపడ్డాడు.

మెహందీ స్త్రీలను పోలీసులు కొడుతున్నారనీ, హింసలు పెడుతున్నారనీ మెహందీ వాళ్ళంతా పోలీస్ స్టేషన్ ముందు ధర్నా చేసిన వార్త పేపర్లో పడింది. తమ పత్రిక "వెలుగు" లో ప్రచురణార్థం మెహందీ స్త్రీలను ఇంటర్వ్యూ చేయడానికి వెళ్తునట్టు అరుణ, ప్రకాశంతో చెప్పింది. ప్రకాశం కోపం హద్దులు దాటింది. మెహందీ స్త్రీలున్న ప్రాంతానికి వెళ్తే, తిరిగి తమ ఇంటికి రావద్దని ప్రకాశం శాసించాడు.

ప్రకాశమూ తనూ కలిసి ఉండాలంటే తన కిష్టమైన పనులు చేయకూడదు. అది అరుణకు స్పష్టమయింది. తన కిష్టమైన పనులు చేయకూడదని శాసించే ప్రకశాంతో కలిసి ఉండడం దేనికోసం? ఎందుకోసం? రక్షణకోసమా? పాపకోసమా?

అరుణ జీవితంలో, ఆలోచన్లలో మళ్లీ సంక్షోభం మొదలయింది. తన స్వేచ్ఛను కంట్రోల్ చేయాలనీ, తనను శాసించాలనీ చూస్తున్న ప్రకాశం పట్ల అరుణలో అసహనం ప్రారంభమయింది. తాను అనుక్ను ప్రకారం మెహందీ స్త్రీల దగ్గరికి వెళ్ళి, వారితో మాట్లాడింది. అరుణ వాళ్లను ప్రశ్నలడిగే అవసరమే లేకపోయింది. వాళ్ళ జీవితాల్లోని విషాదాన్ని వినిపించడానికి సిద్ధంగా ఉన్న ఆ స్త్రీల ఆపకుండా మాట్టాడారు. 'సలామమ్మా ! మా కేదైనా సాయంచేసి పెట్టండమ్మా!' అని వాళ్ళు దండాలు పెట్టారు.

భారమైన హృదయంతో తిరిగొచ్చిన అరుణ, ఆత్మాభిమానం, వ్యక్తిత్వం గల అరుణ ఇక ప్రకాశంతో కలిసి జీవించడం సాధ్యం కాదని నిర్ణయించుకుంది. పాపను తీసుకుని, తన స్నేహితురాలు ఉమ వద్దకు వెళ్లామనుకుంది. పాపకోసం ఇంటికి వెళ్తే ప్రకాశం పాపను ఇవ్వమనన్నాడు. పాపే తన ప్రాణమని భావించిన అరుణ, పాపలేని బ్రతుకును ఊహించలేని అరుణ చివరికి పాపలేకుండానే ఉమ వద్దకు వెళ్ళింది. తన కోసం , తన స్వేచ్ఛా భరిత జీవితం కోసం మాత్రమే గాక, సమాజంలోని స్త్రీల కోసం ఏదైనా చేయాలన్న సంకల్పంతో, దృఢమైన దీక్షతో అరుణ తన కుటుంబాన్నీ, భర్తనూ వదిలి వచ్చేసింది. ఇదీ 'స్వేచ్ఛ ' నవల ఇతివృత్తం. ప్రధాన ఇతివృత్తంతో బాటు ఇతర అంశాలు :

అరుణ స్నేహితురాలు 'ఉమ' పెళ్ళయితే ఆడవాళ్ళకు స్వేచ్ఛ పోతుందని విశ్వసించే స్వభావం కలది. ఉమ ఉన్నతవిద్యకోసం ఢిల్లీ వెళ్ళింది. పిహెచ్. డి. పరిశోధన ప్రారంభించింది. అక్కడ ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో లెక్చరర్‌గా పనిచేస్తున్న సుధీర్‌తో ఆమెకు పరిచయం కలిగింది. వారి స్నేహం చాలా సహజంగా ప్రేమ సంబంధంలోకి దారి తీసింది. ఇద్దరూ ఒకటయ్యారు. ఆ విషయం అందరికీ చెప్పి, అది పెళ్ళిగా ప్రకటించి, అందరి ఆమెదం పొందడం వారికిష్టంలేదు. అరుణకూ, సుధీర్‌కూ ఎవరి ఇళ్ళువాళ్ళకున్నాయి. ఇద్దరికీ తీరిక దొరికినప్పుడూ, ఒకరి స్నేహం, ప్రేమా ఇంకొకరికి కావాలనిపించినప్పుడూ కలిసి ఒకింట్లో ఉంటారు. తర్వాత ఎవరిళ్ళల్లోకి వారు, ఎవరి పనుల్లోకి వాళ్లు. ఇలా ఎన్నాళ్లు బాగుంటే అన్నాళ్లు ఉంటారు. ఒకే ఇంట్లో ఉండాలనిపిస్తే ఉంటారు. ఇప్పుడైతే తీరికలేదు కాబట్టి తగ ఆరు నెలలుగా ఇలాగే ఉంటున్నారు. పనిగట్టుకుని ఈ సంగతి ఎవరితోనూ చెప్పలేదు. ఆడా, మగా కలిసి ఉండడానికి పెళ్ళి అన్న తంతు తప్పనిసరి కాదని విశ్వసించే 'ఉమ' , తన అభీష్టం ప్రకారమే జీవితాన్ని కొనసాగిస్తూన్నది.

నవలాంతంలో అరుణ, ఉమ వద్దకు వెళ్ళింది.

"మొత్తం సమాజాన్ని మార్చటం నాకు చేతకాదని,నాకు చేతనైంది కూడా నేను చెయ్యొద్దా? అలా చేయకుండా నేను బతకలేనని నాకు తెలిసిపోయింది. ఆ పనిలో నన్ను నునే నిరూపించుకుంటున్నాను. దాని వల్ల నాకెంతో తృప్తి- నాజీవితం సార్థకమవుతోందన్న భావం. ఆ భావం కలగడమే స్వేచ్ఛకు అర్థం కదూ! నా బ్రతుకు మాత్రమే నేను బతకడానికైతే ఈ స్వేచ్ఛ అక్కర్లేదు. నా స్వేచ్ఛకు ఒక అర్థముండాలి. ఆ అర్థం కోసం అన్వేషించడమే ఇప్పుడునా పని " అంటుంది అరుణ.

నవలలో మరో ఆసక్తికరమైన పాత్ర 'కేశవరావు'. కాలేజీ యూనియన్ స్థాపనలో ప్రధాన సూత్రధారి. అరుణతో మాట్లాడి, ఆమె యూనియన్ కార్యక్రమాల్లో క్రియాశీలంగా పాల్గోనడానికి కారకుడు. సంఘంలో ప్రగతిశీలవాదిగా కనబడతాడు, కానీ ఇంట్లో మాత్రం భార్య మురళిని కనీసం పేరుపెట్టి ప్రేమగా పిలువలేదు. తన కార్యకలాపాలను గురించి, తాము వెలువరిస్తున్న "వెలుగు" పత్రికను గురించి మురళికి ఏమీ తెలయదు. కేశవరావు స్వభావం, అతని భార్య మురళి మటల్లోనే విందాం - "ఆయన సంగతి మీకు తెలియదు. ఇటు పుల్లతీసి అటు పెట్టరు. ఈయనికి బ్రష్‌మీద పేస్టేయటం దగ్గర్నించీ నేను చేయాల్సిందే. కనీసం బజారు నుంచి సరుకులన్నా తెచ్చివ్వరు. సమస్తం నే తెచ్చుకోవాల్సిందే. మళ్ళీ దేనికీ లోటు ఉండకూడదు. ఇవ్వాళ పొద్దున సబ్బయిపోయింది. మధ్యాహ్నం తెస్తాను. సున్నిపిండితో చేసెయ్యండి అని కాస్త పళ్లెంలో వేసిచ్చాను. ఇక చూసుకోండి! ఆ సున్నిపిండి అంతా నేల మీద పోసి, నా నిర్లక్ష్యానికి నానా చివాట్లు పెట్టి వట్టి నీళ్ళు గుమ్మరించుకుని వెళ్ళారు. "

సమాజంలో జరిగే అన్యాయాలను గురించి ఆరాటపడే కేశవరావు, ఇంట్లో భార్యను గురించి ఆలోచించకపోవడం అరుణకు ఆశ్చర్య కలిగించింది.

అరుణ మీటింగ్‌లకు రావడం, పత్రికకోసం పని చేయడం వలన ఆమెకుటుంబంలో కలతలు ప్రారంభమయినాయని తెలిసిన యూనియన్ నాయకులు, ఆమెకు ధైర్యం చెప్పడానికి బదులు భర్తతో సర్దుకుపొమ్మని సలహా ఇస్తారు. " పత్రిక కోసం మీ వారితో తగాదా పడడం, మీ జీవితమంతా పాడవటం మాకు బాధగా ఉంటుంది" అని రమణారావు అంటే-- " పత్రిక ఒక సంసారాన్ని పాడుచేసిందనే చెడ్డపేరు రావడం కూడా మాకు బాగుండదు" అన్నాడు కేశవరావు. వీరి ద్వంద్వ విలువలను తెలుసుకున్న అరుణ పత్రిక పని మానేస్తుంది. ఒక సమస్య రాగానే భయపడేవారు సమాజాన్ని ఎలా ఉద్ధరించగలరని ప్రశ్నిస్తుంది.

"స్వేచ్ఛ" నామౌచిత్యం:

"Freedom is the recognition of necessity" అన్న ఏంగెల్స్ మాటల్తో రచయిత్రి ఈ నవలకు తన ముందు మాటను ప్రారంభించింది. "మన జీవితాల్లో నయినా, వాటి చుట్టూ ఉండే సమాజంలో నయినా - వాటి చలన సూత్రాలను అన్వేషించడమే ఆవశ్యకత. ఆ ఆవశ్యకతను గుర్తించడమే స్వేచ్ఛ" అన్నారు. శ్రీ సి.వి. సుబ్బారావు.

'నా బ్రతకు మాత్రమే నేను బతకటానికయితే నాకే స్వేచ్ఛ అక్కర్లేదు. నా స్వేచ్ఛకు ఒక అర్థం ఉండాలి. ఆ అర్థం కోసం అన్వేషించడము ఇప్పుడు నా పని' అంటుంది నవలముగింపులో అరుణ.

"మనలాంటి వాళ్ళ స్వేచ్ఛకోసం ఏమీ చెయ్యకపోతే మన స్వేచ్ఛకు అర్థమేముంది?" అన్న మౌలికమైన ప్రశ్నను ఈ నవల రేకెత్తిస్తుంది.

"నాకు ప్రపంచంతో సజీవ సంబంధం కావాలి. నా ఉనికి వల్ల సమాజానికేదో చలనం ఉండాలి" అని తపన పడే వేలాది స్త్రీ, పురుషుల మనోభావాలకు అద్దపడుతున్న నవల ఇది. వ్యక్తికి జీవించే స్వేచ్ఛ, ఆలోచించే స్వేచ్ఛ, క్రియాశీలంగా ఉండే స్వేచ్ఛ, తనకు నచ్చినట్లు, తనకు ఇష్టం వచ్చినట్లు ఉండగలిగే స్వేచ్ఛ కోసం పరితపించిన ఒక విద్యవంతురాలి ఆందోళనకు నవలా రూపమిది. బాల్యంలో పుట్టింటి నియంత్రణ , పెళ్ళయ్యాక మెట్టింటి నియంత్రణలనుండి విముక్తి కోసం ఒక స్త్రీ చేసిన సాహసోపేతమైన కార్యాచరణగల నవలకు "స్వేచ్ఛ" అన్న పేరు ఉచితంగానూ, సార్థకంగానూ ఉంది.

## స్వేచ్ఛ నవలలో పాత్రల విశ్లేషణ :

'స్వేచ్ఛ' నవలలో ప్రధానమైన పాత్ర 'అరుణ'. సాధారణ మధ్య తరగతి కుటుంబంలో పుట్టిన ఆడపిల్ల. చిన్నప్పట్నించీ కుటుంబసభ్యుల ఆంక్షల నడుమ స్వేచ్ఛారాహిత్యాన్ని అనుభవించింది. ఆమె తీసే ఊపిరి, వేసే అడుగు, పోసుకునే నీళ్ళు, రాసుకునే పౌడరూ అన్నీ కుటుంబ సభ్యుల్లో ఎవరికో ఒకరికి అభ్యంతరకరంగా ఉండేవి. తమలో తమకు ఎన్ని అభిప్రాయ భేదాలున్నా అరుణను కట్టడి చేయడంలో మాత్రం ఆమె కుటుంబ సభ్యులందరికీ ఏకాభిప్రాయముండేది. అరుణ మేనత్త కనకమ్మ అరుణను హింసించడానికే పుట్టిందన్నంత క్రూరంగా ప్రవర్తించేది.

వీలైనంత త్వరగా తన పుట్టిల్లు అనే జైలు గోడల నుండి 'స్వేచ్ఛ' కోసం పరితపిస్తున్న అరుణకు ఎం.ఏ. చదివే రోజుల్లో ప్రకాశంతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా పరిణమించింది. ప్రకాశం తనను పెళ్ళిచేసుకోమని ప్రతిపాదించాడు, పెళ్ళయితే ఆడవాళ్ళకు స్వేచ్ఛ పోతుందని అభిప్రాయపడుతుంది. అరుణ స్నేహితురాలు 'ఉమ'. 'నాకిప్పుడు ఎలాగూ స్వేచ్ఛలేదు గనుక పోయే సమస్యలేదు, నాసమస్యంతా పెళ్ళితో స్వేచ్ఛ పొందగలనా? ' అని అరుణ ప్రకాశాన్ని అడగడంలో ఆమె స్వేచ్ఛాకాంక్ష వ్యక్తమౌతుంది.

'నా అవసరాలకు నేనెవర్నీ డబ్బడక్కుండా బతకాలి'- అనుకున్న స్వతంత్ర భావాలు గల స్త్రీ అరుణ.

తాను పనిచేస్తున్న కాలేజీలో పూర్తిజీతం కోసం, న్యాయమైన హక్కులకోసం యూనియన్‌లో చేరింది. సమ్మెచేసింది. 'వెలుగు' పత్రిక నిర్వహణలో క్రియాశీలంగా పాల్గొన్నది. చివరకు మెహందీ స్త్రీలను ఇంటర్వ్యూ చేయడానికి బయలుదేరింది.

ఈ పనులన్నీ నచ్చని ప్రకాశం తనసోషల్‌లైఫ్‌ను అంగీకరించలేకపోతున్నాడన్న విషయాన్ని గ్రహించిన అరుణ తన స్వేచ్ఛ కోసమే కాదు, తనలాంటి ఎందరో అభాగ్యుల కోసం ఏదో ఒకటి చేయాలన్న సంకల్పంతో ఇంటినీ, భర్తనూ వదిలి బయటికొస్తుంది.

అరుణ స్నేహితురాలు ఉమ. 'పెళ్ళి' అన్న తంతు లేకుండానే స్త్రీ, పురుషులు కలిసి ఉండాలని భావించినంత కాలం కలిసి ఉండొచ్చు. అభిప్రాయాలు సరిపడనప్పుడు విడిపోవచ్చన్న అభిప్రాయం కలది. ఢిల్లీలో పిహెచ్.డి పరిశోధన చేస్తున్నప్పుడు , అక్కడ ఇంగ్లీష్ లెక్చరర్‌గా పనిచేస్తున్న సుధీర్‌తో ఆమెకు స్నేహం ఏర్పడింది. ఇద్దరూ ఒకటయ్యారు. ఆ విషయం అందరితో చెప్పి, అది పెళ్ళిగా ప్రకటించి, నలుగురి ఆమెదం పొందడం వారికి ఇష్టంలేదు. ఎవరి ఇంట్లో వాళ్ళుంటారు. కలుసుకోవాలనుకున్నప్పుడు కలుస్తారు. ఇదీ ఆమె జీవన విదానం.

ఇక నవలలో ఒక విలక్షణ మైన పాత్ర - కేశవరావు. కాలేజీ యూనియన్‌లో, సమ్మెచేయడంలో, 'వెలుగు' పత్రిక నిర్వహణలో , సామాజిక సమస్యలను పట్టించుకోవడంలో ప్రధాన పాత్రధారి. ఇంట్లో భార్యను మాత్రం పట్టించుకోవడం తెలీనిమగవాడు. భార్యపై ఆధిపత్యం చెలాయించే సగటు భర్త.

అలాగే రమణారావు వంటి ఉన్నతవిద్యావంతుడు "పత్రిక కోసం మీ వారితో తగాదా పడడం, మీ జీవితమంతా పాడవడం మాకు బాధగా ఉంటుంది" అని సర్దిచెప్పిన సంస్కారి.

కేశవరావు భార్య మురళి. భర్త ఆధిపత్యాన్నీ , అహంకారాన్నీ వినయంగా శిరసావహించే సగటు ఇల్లాలు. తను అణచివేతకు గురవుతున్నావనన్న స్పృహ కూడా లేకుండా జీవితాన్ని యాంత్రికంగా కొనసాగిస్తున్న మరబొమ్మ.

## 19.2.5 ముగింపు :

నవలలోని ప్రతిపాత్రా ఏదో ఒక జీవనవిధానానికి, ఆలోచనా ధోరణికి ప్రాతినిధ్యం వహిస్తూ కనవడతాయి. నిత్య జీవితంలో ఎక్కడో అక్కడ మనకు తటస్థపడుతున్న వ్యక్తుల నమూనాలుగా, రక్తమాంసాలున్న యదార్థ మనుషులుగా తీర్చిదిద్దిన రచయిత్రి సృజనాత్మక శక్తి అభినందనీయం.

## 19.2.6 మాదిరి ప్రశ్నలు :

1. తెలుగులో స్త్రీవాద సాహిత్యధోరణిని సమీక్షించండి.
2. 'స్వేచ్ఛ' నవల ప్రతిపాదిస్తున్న స్త్రీవాద దృక్పధాన్ని విశ్లేషించండి.
3. ఓల్గా రచనా విధానాన్ని వివరించండి.
4. 'స్వేచ్ఛ' నవల నామౌచిత్యాన్ని చర్చించండి.
5. స్వేచ్ఛ నవలలోని పాత్రల మనస్తత్వాలను విశ్లేషించండి.
6. అరుణ పాత్ర చిత్రణమును సమీక్షించండి.
7. 'స్వేచ్ఛ' కోసం పరితపించిన అరణ మానసిక క్షోభను వివరించండి.
8. ప్రకాశం పాత్ర స్వభావాన్ని సమీక్షించండి.
9. స్త్రీవాద నవలలను గురించి వ్రాయండి.
10. సమకాలీన నవలా సాహిత్యంలో "స్వేచ్ఛ" నవలకు గల స్థానాన్ని అంచనా వేయండి.

పాఠం - 20

# జానకి విముక్తి

## పాఠ్య నిర్మాణక్రమం :


20.1. ఉద్దేశ్యం

20.2. పాఠం

ఎ. కథా పరిచయం

బి. నవల దేశకాలాలు - సామాజిక స్థితిగతులు

సి. స్త్రీల సమస్యలు - స్త్రీల కోణం

డి. కుటుంబం

ఇ. స్త్రీల చైతన్యం - విముక్తి

20.3. విశ్లేషణ

20.4. సారాంశము

20.5. సాంకేతిక పదాలు

20.6. నమూనా ప్రశ్నలు

20.7. ఉపయుక్త గ్రంథాలు


## 20.1. ఉద్దేశ్యం :

మహిళాజీవన జీవిత అధ్యయనాలకు సాహిత్యం శక్తిమంతమైన ముడిసరుకు అనే విషయాన్ని నిరూపించటం, స్త్రీలే సాహిత్యరచయితలయిపప్పుడు స్వానుభవ గుణం వల్ల స్త్రీల సమస్యలు మరింత పదునుగా వ్యక్తమయ్యే అవకాశాలున్నాయని నిరూపించటం ప్రధానంగా ఈ పాఠం ఉద్దేశాలు. పితృస్వామ్యం గురించిన అవగాహన కలిగించటం, స్త్రీలు అభివృద్ధికి, విముక్తికి పెరగవలసిన స్త్రీల చైతన్యాన్ని గురించి సామాజిక చైతన్యాన్ని గురించి తెలియపరచటం ఈ పాఠం ఉద్దేశ్యాలు. ఒక నవలను అధ్యయనం చేయవలసిన పద్ధతిని నవల ద్వారా సమాజాన్ని, మానవ సంబంధాలను అధ్యయనం చేయవలసిన పద్ధతిని ఈ పాఠం చదవటం ద్వారా మీరు తెలుసుకోగలుగుతారు. మానవ జీవన సంస్కారాభివృద్ధిలో సాహిత్యం నిర్వహించే మహత్తర పాత్ర గురించి కూడా మీరు తెలుసుకోగలుగుతారు.

## 20.2 పాఠం :

జానకి విముక్తి నవలా రచయిత రంగనాయకమ్మ. రంగనాయకమ్మ 1939 సెప్టెంబరు 21న తాడేపల్లిగూడెం తాలూకా బొమ్మిడిలో నుండి కథలు వ్రాస్తున్నారు. 1958లో 'పల్లెటూరు' నవల వ్రాశారు. గుర్తింపు దశకంగా ప్రసిద్ధమైన పందొమ్మిది వందల అరవయ్యవ దశకంలో విస్తృతంగా నవలలు వ్రాశారు. నా డైరీలో ఒకపేజీ దగ్గర నుండి ప్రారంభించి పేకమేడలు, స్త్రీ, చదువుకున్న కమల, రచయిత్రి, బలిపీఠం, ఇదే నా న్యాయం, స్వీట్ హోమ్, కళ ఎందుకు ? అంధకారంలో మొదలైన నవలలు వ్రాశారు. దాదాపు ఈ నవలలన్నిటికీ స్త్రీల జీవితమే కేంద్రబిందువు. వ్యక్తిత్వ స్పృహను పొందుతున్న ఆధునిక స్త్రీ కుటుంబ జీవిత సంబంధాలలో పడే ఘర్షణ ఈ నవలలకు ఇతివృత్తం. భార్యభర్తల సంబంధాల్లో రావలసిన సహజీవన సమభావన

సంస్కృతి స్త్రీల ఆకాంక్షగా ఈ నవలల్లో వ్యక్తమైంది. ఆ ఆకాంక్షను ఆచరణ వాస్తవం చేసుకొనడం కోసం స్త్రీలు కుటుంబజీవిత పరిధిలోనే అయినా చేసిన నిరంతర ప్రయత్నం ఆక్రమంలో పొందిన గెలుపు, ఓటమి కూడా ఈ నవలేతి వృత్తాలలో భాగమయ్యాయి.

రంగనాయకమ్మ ఈ విధంగా స్త్రీల జీవితాన్ని వస్తువుగా చేసుకొని వ్రాయటంలో ప్రధానంగా స్త్రీగా పొందిన స్వీయ జీవితానుభవమే ఉపకరించి ఉంటుంది. రచయిత్రి నవల చదివి నార్ల వెంకటేశ్వరరావు రంగనాయకమ్మకు ఉత్తరం వ్రాస్తూ రచయిత ఎదుర్కొనే సమస్యలెన్నో కొంతవరకు నాకు తెలుసు. ఇవికాక రచయిత్రి కొన్ని ప్రత్యేక సందర్భాలలో కొన్ని ప్రత్యేక సమస్యలు ఎదుర్కొనవచ్చునని మీ నవల చదవటానికి ముందు నేను ఊహించనైనా లేదు'' అని అన్న మాటలనుబట్టి స్త్రీల రచనా రంగంలోకి రావటం వలన స్త్రీల జీవితంలోని అనేకానేక సమస్యలు, సంఘర్షణలు సాహిత్యానికి కొత్త ముడిసరుకుగా అందుబాటులోకి వచ్చాయన్న విషయం స్పష్టపడుతుంది. రంగనాయకమ్మ స్త్రీగా స్త్రీజాతికి ప్రతినిధిగా స్త్రీల జీవిత సంఘర్షణలను, ఆకాంక్షలను అతి సహజంగా తన నవలా వస్తువుగా మలుచుకోగలిగారు. పురుషాధిపత్య కుటుంబ వ్యవస్థలో భర్త పెత్తనం కింద వ్యక్తిత్వాలను చంపుకొంటూ బ్రతకాల్సి వస్తున్న స్త్రీల విముక్తి మార్గాన్వేషణ రంగనాయకమ్మ నవలల్లో కనబడుతుంది. దీనికి పరాకాష్ఠరూపమే "జానకి విముక్తి'' నవల.

జానకి విముక్తి నవల మూడు భాగాలుగా వచ్చింది. మొదటిభాగం రచనాకాలం **1977**. రెండవభాగం రచనాకాలం **1980** మూడవభాగంలో రెండు సంపుటులున్నాయి. వీటి రచనాకాలం **1981** జనవరి నుంచి **1982** జూన్ వరకు అరవైయ్యవ దశకపు చివరి నవల అంధకారంలో. అది వ్రాసిన మూడేళ్ళకు అంటే **1972**లో చుట్టాలు నవల వ్రాశారు. ఆ తరువాత వ్రాసిన పూర్తిస్థాయి నవల జానకి విముక్తి. చుట్టాలు అయినా, జానకి విముక్తి తరువాత వ్రాసిన ప్రేమకన్నా మధురమైనది **(1995)** అయినా పూర్తిస్థాయి నవలలు కావు. అంటే సమగ్రజీవిత చిత్రణ వాటిల్లో లేదు. తన అనుభవంలోకి వస్తున్నవి, తనకు పరిశీలనలో అర్థం అవుతున్నవి - స్త్రీల జీవిత సమస్యలు, చిన్న చిన్న ఆకాంక్షలు, అసంతృప్తులకు, ఆంతరిక సంఘర్షణలు, రాజీలు, అన్నీ తన నవలల్లోని స్త్రీల జీవితాలలో చూపించిన రంగనాయకమ్మకు వీటి మూలాలు సమాజంలో ఎక్కడో వున్నట్లు 'అంధకారంలో. . .' నవలా రచన కాలానికి కొంత తెలిపింది. చలం సాహిత్య ప్రభావంతో స్త్రీగా స్త్రీల జీవితం పట్ల ఒక దృక్పధాన్ని అలవరచుకొన్నారు. డెభ్భయ్యవ దశకపు ప్రారంభంలో తన సహనానికి పరీక్షగా పరిణమించిన వైవాహిక జీవితం నుండి బయటకు వచ్చి కొత్త జీవితం ఏర్పరచుకొన్నారు రంగనాయకమ్మ. ఈ దశలో రంగనాయకమ్మ మార్క్సిజానికి సంబంధించిన అధ్యయనాలు ప్రారంభించారు. **1975** నాటికి స్త్రీల జీవిత దౌర్భాగ్యానికి వర్గభేదాలు గల దోపిడీ సమాజానికి, పురుషాధిక్యత గల పక్షపాత సమాజానికి గల సంబంధం ఆమెకు స్పష్టపడింది. 'పేకమేడలు' నవలను 1975లో పునర్ముద్రిస్తూ వ్రాసిన కొత్త ముందుమాటలో ఈ అవగాహన కనబడుతుంది. ఈ అవగాహన బలపడుతున్న క్రమంలో రంగనాయకమ్మ స్త్రీల జీవిత సమస్యల పరిష్కారానికి భర్తల స్థానంలో వున్న పురుషుల దయాధర్మ లక్షణం కాక వర్గరహిత సమాజనిర్మాణ దిశగా సాగే స్త్రీ పురుషులు పెంచుకొనవలసిన ప్రజాస్వామిక సంస్కారాన్ని ఒక విలువగా ప్రతిపాదిస్తూ జానకివిముక్తి నవల వ్రాశారు. అందువల్ల మహిళాజీవన అధ్యయనపరులకు ఇది తప్పక చదవవలసిన పుస్తకం అవుతున్నది.

## ఎ) కథా పరిచయం :

చెల్లెలు జానకి సంసారం అత్తపోరుతో, భర్త పీడింపుతో దుర్భరంగా వుందన్న విషయం అన్న సత్యన్నారాయణకు తెలియటంతో నవల ప్రారంభమవుతుంది. చెల్లెల్ని ఆ కాపురం వదిలేసి తనతో వచ్చెయ్యమంటాడు సత్యం. అందుకు జానకి సంసిద్ధురాలు కావాలని అందుకు కావలసిన చైతన్యం ఆమెలో పెంచాలని అలాగాక ఆమెకోసం అన్నీ ఇతరులు చేయటం సరియైన పద్ధతి కాదని సత్యం స్నేహితుడు మూర్తి సత్యానికి నచ్చచెబుతాడు. మూర్తి దగ్గర నుండి చెల్లెలి ఇంటికి వచ్చిన సత్యం జానకిని భర్తకొట్టి అవమానకరంగా మాట్లాడటం అధికారం చెలాయింటం భరించలేకపోతాడు. జానకి భర్తతో పోట్లాడి జానకిని తీసుకొని వెళ్ళిపోతాడు.

జానకిని చదువుకోమని ప్రోత్సహిస్తాడు. మూడునెలలు గడిచేసరికి వెంకట్రావు వచ్చి మారిపోయానని చెప్తే, రాకపోతే తాను మళ్ళీ పెళ్ళి చేసుకొంటానని బెదిరిస్తే, తల్లి తీర్థయాత్రలకు పోయింది. మనమిద్దరమే అని ప్రేమ ఒలకపోస్తే నమ్మి అన్న అభ్యంతర పెడుతున్నా వినకుండా జానకి భర్తతో వెళ్ళిపోతుంది. మొదటి భాగంలో కథ ఇది.

జానకి వెంకట్రావుతో విజయవాడ బయలుదేరుతుంది. త్రోవపొడుగునా అతని ప్రవర్తన అతనేమీ మారలేదని జానక్కి తెలియజేసింది. ఇంటికి వెళ్ళేసరికి ఎదురుగా అత్తగారు కనబడటంతో భర్త అబద్ధమాడి వంచించి తనను తీసుకొచ్చాడని అర్థమైంది. తన ప్రవర్తనలోని వంచనా లక్షణాన్ని కప్పిపెట్టుకుంటూ జానకి మీదనే దోషారోపణలు చేస్తూ మాట్లాడిన తీరు జానకిని దిగ్భ్రాంతురాలిని చేసింది. చదువు మొదలుపెట్టినందుకు జానకిని వెంకట్రావు సాధించాడు. రోష పడింది. అయినా యథాప్రకారం అతనికి లొంగిపోయింది. కట్నకానుకల క్రింద రావలసిన వెండికవచం గురించి సాధింపులు, జానకి పనిలో వంకలు పెట్టి వేధించటం, ఇష్టంలేని పనులకు ఒత్తిడి పెట్టటం యథాప్రకారం సాగుతూనే వున్నాయి. సత్యం మూర్తితో కలిసి చెల్లెలి దగ్గరకు వచ్చి మాట్లాడి చదువుకొనమని పుస్తకాలిచ్చి వెళతాడు. పరీక్షలకు చదువుతున్నదని వెంకట్రావు జానకిని కొట్టి హద్దులో పెట్టుకొనే ప్రయత్నం చేశాడు. అన్న ఇచ్చి వెళ్ళిన చలం పుస్తకాలు తదితర పుస్తకాలు చదివి జానకి ఆలోచనలో పడుతుంది. జానకి ఆ పుస్తకాలు చదువుతున్నదని వెంకట్రావు నానా రభసా చేస్తాడు. పక్కింటి విశాలాక్షితో జానకి ఆడవాళ్ళ అగచాట్ల గురించి మాట్లాడుతుంది. భార్యాభర్తల మధ్య సంబంధం పోషణకు సంబంధించిందేనా అన్న ప్రశ్న. ఆడవాళ్ళ సమస్య ఆర్థిక స్వాతంత్ర్యంతో పరిష్కారమవుతుందా అన్న విచికిత్స ఆమెలో కలుగుతాయి. జానకి పరిస్థితి ఎలావుందోనని మూర్తి ఒకసారి వచ్చివెళతాడు. అతడితో ఏమీ మాట్లాడలేకపోతుంది. జానకి నిరాశా నిస్పృహలకు లోనవుతుంది. అన్నకు వ్రాసిన ఉత్తరంలో జానకి మనస్థితి వ్యక్తమైంది. సత్యం ఆమెను మందలిస్తూ జాబు వ్రాశాడు. విశాలాక్షి కొడుక్కు జ్వరం ఉందని సాయానికి వెళ్ళినందుకు అత్తా భర్త కలిసి చేసిన యాగీ జానకిని కాస్త ఎదిరించి మాట్లాడేటట్లు చేసింది. జానకి నెల తప్పింది. ఒక ఆమె తనను ధిక్కరించి ఎటూ పోదన్న ధైర్యం వచ్చింది వెంకట్రావుకి. వెంకట్రావుకు పరాయిస్త్రీలతో సంబంధాలు కూడా వున్నాయని తెలిశాక జానకి వైముఖ్యం మరింత పెరిగింది. మూర్తి సహాయంతో అన్న దగ్గరికి వెళ్ళిపోవాలనుకొంటుంది. మూర్తి ఊళ్ళోలేని కారణంగా రెండు మూడురోజులు ఆమె భర్త ఇంట్లోనే వుండాల్సి వస్తుంది. అతనితో కలిసి ఆడపడుచు వాసంతి పెళ్ళికని తిరుపతి కూడా వెళ్ళవలసి వస్తుంది. తిరుపతి నుండి వచ్చిన రాత్రి వెంకట్రావును భరించలేక జానకి గడప దాటి బయటకు రావటంతో రెండవభాగం ముగుస్తుంది.

మూడవభాగం మూర్తి జానకిని విజయవాడ నుండి హైదరాబాదుకు సత్యం దగ్గరకు చేర్చటంతో మొదలవుతుంది. మూర్తి ఏ పరిస్థితులలో జానకి తన దగ్గరకు వచ్చిందో వెంకట్రావుతో కాపురం అంటే ఎంత అసహ్యించుకొంటున్నదో చెప్పినది విన్నాక సత్యం జానకి పట్ల తాను బాధ్యతతో ప్రవర్తించాలనుకుంటాడు. కట్టుబట్టలతో వచ్చిన జానకిని చీరలు కొనటానికి సత్యం ఆమెతోపాటు బజారుకు బయలుదేరినప్పుడు ఖర్చులకు వుంటుందని మంగళసూత్రాలు అమ్మెయ్యమని ఇస్తుంది జానకి. జానకి ఇక మళ్ళీ వెంకట్రావు దగ్గరకు వెళ్ళే ఆలోచనలో లేదన్న విషయం దానితో స్పష్టమై సంతోషిస్తాడు సత్యం. జానకి తల్లి సుందరమ్మ మాత్రం ఆందోళన పడుతుంది. జానకి సంసారం కుదటపడే మార్గం ఏమైనా వుందేమో చూడాలని అంటుంది. జానకిని కాపురానికి తిరిగి పంపటమంటే చంపటమేనని సత్యం ఆమెకు చెప్తాడు. కుటుంబ హింసకు సంబంధించిన ఉదంతాలను పాతపేపర్ల నుండి చదివి వినిపించాడు తల్లికి. జానకి తాను భర్త దగ్గరకు తిరిగివెళ్ళే ప్రసక్తే లేదని తల్లికి తెగేసి చెప్తుంది. ముందు భర్త సంతానాన్ని కడుపులో మోయటానికి అసహ్యించుకొని గర్భస్రావం చేయించుకొందామనుకొన్న జానకి సత్యంతో మాట్లాడిన తరువాత ఆలోచనలో పడుతుంది. తల్లికి తన నిర్ణయం నిష్కర్షగా చెప్పిన సందర్భంలో అతని దిక్కరణకు తనకవసరం లేదని తనపిల్లని తానే పెంచుకొంటానని చెప్తుంది. తన బతుకు తాను బతకటానికి, పిల్లను కనటానికి చెల్లెలు తీసుకొన్న నిర్ణయం సత్యానికి సంతోషం కలిగిస్తుంది. ఆమ్మకు ఇష్టం వున్నాలేక పోయినా చెల్లెలి అభిప్రాయాల్ని తాను గౌరవిస్తానని సత్యం చెప్తాడు. కొడుకు కూతురు ఒకేమాట మీద వుండేసరికి సుందరమ్మ ఏమీ చెయ్యలేకపోతుంది.

పనికి ఆడా మగా తేడాలేదని చెప్పటమేకాక చేసి చూపించే అన్న సత్యం, సమాజంలో అభివృద్ధికర మార్పు గురించి తపనపడే స్టడీసర్కిల్ మిత్రులు మోహన్, ప్రభాకర్, శాంత, ఉష, శారద మొదలైన వాళ్ళ సాహచర్యంలో జానకి తేరుకొంటుంది. విశాలాక్షికి ఉత్తరాలు వ్రాస్తుంటుంది. వీళ్ళ మాటలు చర్చలు వింటూ జానకి కాపురం గురించి ఆందోళన పడే సుందరమ్మ 'ఇల్లూ వాకిలీ చూసుకుంటూ ఆడా ళ్ళు సుఖంగా బతకలేదూ ఇన్నాళ్లూ' అని అంటుంది. ఎక్కడికక్కడ నోరు మూసుకుంటే అంతా సుఖమే. చేసుకున్నవాడు కాస్త దయదలచి సవ్యంగా తిండిపడేస్తే తిన్నట్టూ, లేకపోతే లేనట్టూ. అదే ఆడాళ్ళు సుఖపడిపోయేది" అని తల్లి మాటలకు వొళ్ళుమండి జానకి జవాబిచ్చింది. చెల్లెలు ఆ మాత్రం మనసు విప్పి తన అభిప్రాయం నిష్కర్షగా చెప్పడం సత్యానికి సంతోషం కలిగిస్తుంది. సంభాషణావశాత్తు స్త్రీలకు బానిసలకు ఏమాత్రం తేడాలేదని ఒకపెద్ద పట్టీ వ్రాసి చూపిస్తాడు సత్యం. విశాలాక్షి బాధ్యతలేని భర్త కారణంగా ఆర్థికంగా ఇబ్బందిపడుతున్నది కనుక తానిక వేసుకోనని నిర్ణయించుకొన్న మంగళసూత్రాలు అమ్మి ఆ డబ్బు ఆవిడకు పంపితే కుట్టుమిషన్ కొనుక్కొని పనిచేసుకొంటుందని జానకి అంటుంది. సత్యం ఆమె నిర్ణయాన్ని అభినందిస్తాడు. పుట్టిన తరువాత స్వతంత్రంగా తానొక నిర్ణయం తీసుకొని అమలు చేయగలిగినందులకు జానకికి సంతోషం కలుగుతుంది.

జానకి కాపురాన్ని చక్కదిద్దాలని సుందరమ్మ అన్నగారి ద్వారా చేసిన ప్రయత్నం జానకికి సత్యానికి కోపం తెప్పిస్తుంది. తన విషయంలో జోక్యం చేసుకోవద్దని తల్లిని తీవ్రంగా హెచ్చరిస్తుంది. జానకి బిస్కట్ కంపెనీ ఉద్యోగంలో చేరుతుంది. సత్యం శాంత పట్ల చూపే అభిమానం అతను ఆమెను వివాహం చేసుకొంటాడేమోనన్న అభిప్రాయం కలిగిస్తుంది జానకికి. తల్లితో తనకు కలిగిన అభిప్రాయం చెప్పింది. కొడుకు అంతపనీ చేస్తాడేమోనని సుందరమ్మ దిగులుపడింది. శాంతా సత్యం స్నేహం పుస్తకాల దగ్గర ప్రారంభమై, పుస్తకాలు చదివాక కలిగే స్పందనలను అభిప్రాయాలను పంచుకొనటంతో పెరిగి ఒకళ్ళపట్ల ఒకరిని అభిమానంగా పరిణామం చెందింది. ఇద్దరూ పెళ్ళి చేసుకొనాలని నిర్ణయించుకొన్నారు. ప్రత్యేకంగా పెళ్ళి అనే ఒక తంతును వద్దని ఇద్దరూ అనుకొన్నారు. అందువల్ల స్త్రీకి చట్టపరమైన భద్రత, రక్షణ వుండదన్నప్పుడు శాంత తాను అతనిమీద ఆధారపడి బ్రతకాలనుకొనడం లేదు కనుక తనకు చట్టబద్ధత అవసరం లేదని ప్రేమ నిలుపుకోగలిగినంత కాలం ఇద్దరూ కలిసే వుంటామని, ప్రేమ లేనప్పుడు అతడి దగ్గర నుండి తాను ఆశించేదేమీ లేదని అంటుంది.

జానకికి ఆరో నెల వచ్చింది. ఆమెను సాయంత్రాలప్పుడు బయటకు తీసుకువెళ్ళి మంచి గాలి వున్న ప్రాంతాలలో తిప్పుకొని వస్తుంటాడు సత్యం. పెళ్ళి వంతుతో ప్రమేయం లేకుండా శాంత తమ ఇంటికి వస్తున్నదని సత్యం జానకికి చెప్తాడు. స్వంతాస్తి వ్యవస్థలోని నీచత్వం, క్రూరత్వం ఒక ఫాక్టరీ వర్కరుగా భార్యగా స్వంత అనుభవాల నుండి, సత్యం చెప్పిన మాటల నుండి అర్థం చేసుకొంటుంది జానకి. జానకిలో వస్తున్న ఈ పరిణామం సత్యానికి సంతృప్తి కలిగిస్తుంది. జానకికి ప్రభాకర్ తోటి చర్చల వల్ల హేతువాద దృక్పథం ఏర్పడింది. పరిశీలనాశక్తి, వాదించి ఒప్పించగల నేర్పు జానకికి అలవడ్డాయి.

శాంతవస్తే ఇప్పుడున్న ఇల్లు సరిపోదని అందరూ కలిసి ఇళ్ళ వేట ప్రారంభిస్తారు. చివరికి ప్రభాకర్ ఊరిబయట ఒక ఇంటి ఆచూకీ కనిపెట్టి చెప్పాడు. కావలసిన రిపేర్లవీ దగ్గరుండి చేయించాడు సత్యం. శాంత సత్యం ఇంటికి వచ్చింది. పిల్లల ఇష్టాలని సుఖాలను సంతోషాలను చివరికి బ్రతుకును కూడా మింగేసే కట్నాల పెళ్ళిళ్ళమీద, మేనకోడలి చావు సంగతి విన్నాక సుందరమ్మకు విరక్తి కలిగింది. అన్నగారిని పలకరించడానికి వచ్చిన సుందరమ్మకు గొప్ప పరివర్తన కలిగింది. చిన్నన్న కొడుకు కులాంతర వివాహం చేసుకొంటానంటే అభ్యంతర పెడుతున్న పెద్దవాళ్ళను మందలించింది. ఈ స్థితిలో సత్యం పెళ్ళితంతు ఏమీ లేకుండా శాంతను ఇంటికి తీసుకొని వచ్చానంటే సుందరమ్మ అభ్యంతర పెట్టలేకపోయింది. బంధుత్వ వరుసలతో కాకుండా ఒకరినొకరు పేర్లతో పిలుచుకొనే కొత్తరకం సంసారం వాళ్ళింట్లో ప్రారంభమైంది. శాంతాసత్యం సహజీవనం చూస్తూ జానకి ఆడబిడ్డ మొదలైన అధికార సంబంధాల లక్షణం తెలుసుకొని వదులుకోగలిగింది. తాను చేసిన కాపురంలోని వైనం శాంతాసత్యంల కాపురంలోని ఔన్నత్యం రెండూ ఆమెకు అవగతమయ్యాయి.

జానకికి తొమ్మిదవ నెల వచ్చింది. ఫ్యాక్టరీ పనికి వెళ్ళటం మాని ఇంట్లోనే వుంటున్నది. బైట నడిచి రావటానికి శాంత, సత్యం, మోహన్, ప్రభాకర్ ఎవరికి వీలయితే వాళ్ళు ఆమెకు తోడుగా వెళుతుంటారు. సుందరమ్మకు జానకి అలా మోహన్‌తోనే ప్రభాకర్‌తోనో బయటకు వెళ్ళటం నచ్చదు. సత్యం స్నేహానికి ఆడ మగా తేడాలేదని, నలుగురితో కలిస్తేనే ఎవరికైనా మంచీ చెడూ తెలుస్తుందని తల్లికి నచ్చచెప్పే ప్రయత్నం చేస్తాడు. శాంత సత్యం చైనాలో విప్లవానంతరం స్త్రీ పురుష సంబంధాలలో వచ్చిన మార్పుల గురించి ఉదాహరణలతో జానకికి సుందరమ్మకు చెప్తుంటారు. జానకి సుందరమ్మ స్త్రీల పక్షాన న్యాయం చేయగల కొత్త సమాజం గురించి, న్యాయవ్యవస్థ గురించి ఆశపడతారు.

జానకి ప్రసవించింది. మగపిల్లవాడు పుట్టాడు. అందరూ కలిసి ఆ పిల్లవాణ్ణి అపురూపంగా పెంచుతుంటారు. దేవుడికి వ్యతిరేకంగా సైన్సు విజ్ఞానాన్ని విశదీకరించిన బ్రూనో పేరును కొడుకుకు పెట్టుకుంది జానకి. ప్రేమించినవాడు మోసం చేసినప్పుడైనా, పెళ్ళాడిన వాడు వదిలేసినప్పుడయినా స్త్రీ గర్భకోశమో, కన్నవాళ్ళ కోసమో అవమానాలు ఆవేదనలుపడటం జీవితాలే కోల్పోవటం, జీవితమే లేదన్నట్లు ప్రవర్తించటం శాంతను ఆలోచనలో పడేస్తాయి. పిల్లల్ని కనటం కనకపోవటం స్త్రీ ఇష్టంగా వుండాలని శాంత తనకసలు పిల్లలే వద్దని అంటుంది. సత్యం ఆమె ఇష్టమే తన ఇష్టమంటాడు. జానకి స్నేహితురాలు శారద కాబోయే భర్తగా కిశోర్ తన జీవితం మీద చేయబోయే పెత్తనాన్ని తిరస్కరించి అతనితో పెళ్ళి తనకు ఇష్టం లేదని చెప్పేస్తుంది.

ప్రభాకర్‌కు జానకిపట్ల తన స్నేహితుడి చెల్లెలు, స్నేహితురాలు అన్న భావనకు మించిన ఆప్యాయతా భావం మరేదో వున్నదన్న స్పృహకలిగింది. జానకి పట్ల ఇష్టం ఆరాధన కల రూపంలో వచ్చాయి. అతనికి ఆ కలను గురించి జానకికి ఉత్తరం రాశాడు. జానకి ఆ ఉత్తరం చదవమని శాంతా సత్యంలకు ఇస్తుంది. వాళ్ళు ప్రభాకర్ జానకిని ఇష్టపడుతున్న విషయాన్ని గుర్తిస్తారు. జానకి అభిప్రాయం తెలిసేవరకు తాము మాట్లాడ కూడదనుకొంటారు. జానకి యథాప్రకారం ఫాక్టరీ పనికి వెళ్ళివస్తుంటుంది. సమ్మెలు నిరాహారదీక్షలు మొదలైనవి జానకికి ప్రపంచ పోకడను తెలియపరచడమేకాక తాను ఒక కార్మికురాలిగానే గడిపిన సాంసారిక జీవితం గురించిన విమర్శ దృక్పథాన్ని కూడా కలిగిస్తాయి. జానకికి ప్రభాకర్‌పై ఇష్టం బలపడుతుంది. ప్రభాకర్‌తో కలిసి జీవించటానికి సిద్ధపడుతుంది. తాను తీసుకున్న ఈ నిర్ణయం గురించి, తాను పాల్గొన్న ఒక కార్మికుల ఊరేగింపు గురించి, ఆ ఊరేగింపులో తిన్న దెబ్బల గురించి విశాలాక్షికి పెద్ద ఉత్తరం వ్రాసి అందులో తానూ ప్రభాకర్ బ్రూనో కలిసి తీయించుకొన్న ఫోటో పెట్టి పంపుతుంది. అది వెంకట్రావు చేతిలో పడుతుంది. అతనప్పటికి మళ్ళీ పెళ్ళి చేసుకొని ఒక పిల్లవాడి తండ్రి అయ్యాడు. అయినా భార్య మీద అధికారం మాత్రం యథాపూర్వకంగానే వుంది. జానకి మళ్ళీ పెళ్ళి చేసుకొన్నదని వెంకట్రావు భార్య ఆశ్చర్యపడుతుంది. విశాలాక్షి అతని చేతిలో పడ్డ ఉత్తరాన్ని తెచ్చి చదువుకొని జానకికి జవాబు వ్రాయటం ప్రారంభించటంతో నవల ముగుస్తుంది.

## 2) నవల దేశకాలాలు - సామాజిక స్థితిగతులు :

నవల అంటే సమగ్ర మానవజీవిత చిత్రణ. మానవ జీవితం కాలం మీద పరుచుకొని రూపొందుతుంది. పరిణామం చెందుతుంది. అందువల్ల నవలలో చిత్రించబడే జీవితం ఎంతకాలం మీద విస్తరించింది అనేది ముఖ్యమైన అంశం అవుతుంది. జానకి విముక్తి నవలలో కథ ఒక నాటి రాత్రి సత్యం ఇంటికి రావటంతో ప్రారంభమవుతుంది. జానకికి విశాలాక్షి ఉత్తరం వ్రాయటానికి ప్రారంభించటంతో నవల ముగుస్తుంది. ఈ రెండు సంఘటనలకు మధ్య జీవిత పరిణామాలకు పట్టిన కాలం ఎంత ? ఈ నవలలో జీవితం ప్రధానంగా జానకిది. సత్యం శాంతల జీవితం. శారదా విశాలాక్షుల జీవితం, ప్రభాకర్ జీవితం కూడా ఇందులో వున్నాయి. వర్తమాన జీవన స్థితిగతుల పట్ల విమర్శనాత్మకంగా ఉంటూ జీవితాన్ని ఆత్మగౌరవంతో, విలువలతో కూడినదిగా నిర్మించుకొనాలన్న తహతహలో ప్రవర్తించిన వాళ్ళే అంతా. ఆ క్రమంలో వాళ్ళంతా జానకి చైతన్య వికాసానికి ప్రేరక

శక్తులైనారు. జానకి జీవిత పరిణామాలు వీళ్ళందరితోటి స్నేహసంబంధాలవల్ల అభివృద్ధికరంగా రూపొందాయి. జానకి జీవితమే ఈ నవలలో ప్రధాన స్రవంతి. అందువల్ల జానకి జీవిత పరిణామాలు ఎంతకాలం మీద విస్తరించాయో గమనించాలి.

జానకి విముక్తి నవల మొదటి భాగంలో కథ అంతా **24** గంటల మీద నడిచింది. ఒకనాటిరాత్రి సత్యం జానకి ఇంటికి వచ్చాడు. మర్నాడు పగలు ఆమె తన కష్టసుఖాలు, సంసారంలో వేదనలు అన్నకు చెప్పుకొన్నది. ఆ సాయంత్రం సత్యం మూర్తి ఇంటికి వెళ్ళి రాత్రి తిరిగి వచ్చేసరికి జానకి భర్త వెంకట్రావు ఆమెను సాధిస్తూ వేధిస్తూ వున్నాడు. సత్యం ఆగ్రహం పట్టలేక వెంకట్రావుతో తగాదాపడి ఆరాత్రే జానకిని తీసుకొని తన ఊరికి బయలుదేరాడు.

జానకి అన్నగారితో పుట్టింటికి వచ్చి మూడునెలలవుతుంది. వెంకట్రావు ఆమెను తిరిగి రమ్మని ఉత్తరం వ్రాశాడు. తరువాత పదిహేనురోజులకు స్వయంగా తానే వస్తాడు. జానకి వెంకట్రావుతో కలిసి విజయవాడకు బయలుదేరటంతో రెండవభాగం ప్రారంభమవుతుంది. వెంకట్రావుతో విసిగిపోయి అతనిని ధిక్కరించి జానకి తనంతట తాను అతనింటి గడపదాటటంతో రెండవభాగం ముగుస్తుంది. తనకు భర్తకు వున్న సంబంధాలను కొత్తగా అర్థం చేసుకొనటానికి జానకి చేసినప్రయత్నం ఇందులో ప్రధానం. వెంకట్రావు మారకపోతాడా అన్న ఆశ అడుగింటి పోవటానికి ఇక్కడ పట్టిన సమయం నాలుగైదు నెలలు.

మూడవ భాగం కథ ఒకనాటి మధ్యాహ్నం ప్రారంభమవుతుంది. ముగియటం కూడా ఒకనాటి మధ్యాహ్నమే. ఆ మధ్యాహ్నానికి ఈ మధ్యాహ్నానికీ మధ్యకాలం రెండుమూడేళ్ళు. జానకి భర్తను వదిలి వచ్చేసరికి రెండునెలల గర్భవతి. ఆమె ప్రసవించటానికి పట్టిన ఏడెనిమిది నెల్లకాలం, పిల్లవాడి ఆటపాటలు అల్లరి ప్రస్తావనలను బట్టి వాడికి రెండేళ్ళయినా వుండటానికి వీలుంది కనుక ఆ కాలం కలుపుకుంటే ఈ భాగంలో కథ స్థూలంగా మూడేళ్ళు కాలం మీద నడిచినట్లే. సత్యంతో మొదటిసారి వచ్చి పుట్టింట్లో వున్న దాదాపు నాలుగునెల్ల కాలాన్ని, భర్తతో తిరిగివెళ్ళి గడిపిన దుర్భర సాంసారిక జీవితకాలం నాలుగైదు నెలలు కలుపుకొని చూస్తే మొత్తంమీద జానకి విముక్తి నవల కథ నాలుగేళ్ళ కాలంమీద విస్తరించిందనుకోవచ్చు. కథా ప్రారంభానికి జానకికి పందొమ్మిదేళ్ళు. **16** ఏళ్ళకే ఆమెకు పెళ్ళయింది. మూడేళ్ళ సంసార జీవితం ఆమెను ఏ ఆనందాన్ని మిగల్చలేదు. సహనం వృధా అయింది. తనను తాను ఎంత కుదించుకొన్నా ఎదుటి మనిషికి సంతృప్తి లేదని అర్థమయ్యే కొద్దీ అతని అధికారం ఆమెకు అసహ్యమైంది. అతనిని భరించలేక బయటకు వచ్చి ఒక ఆత్మగౌరవం కలిగిన వ్యక్తిగానూ,సామాజిక జీవిగాను ఎదగటానికి ఆమెకు పట్టినకాలం నాలుగేళ్ళు. చైతన్యం ఎదుగుదల ఒకనాడు ఆగిపోయేవికావు. నిరంతరం జీవిత సంబంధంలో చైతన్యాన్ని పదునెక్కించుకొనటం జరుగుతూనే ఉంటుంది. అందువల్ల ఈ నవల జీవితానికి ముగింపునకు చెప్పదు. జీవితం కొనసాగటాన్ని చెప్పుంది. విశాలాక్షి జానకికి ఉత్తరం వ్రాయటం ప్రారంభించటంగా నవలను ప్రారంభించటం దానినే సూచిస్తుంది.

జానకి జీవితంలో నాలుగేళ్ళ కాలం మీద వచ్చిన పరిణామాన్ని ఈ నవల చిత్రించింది. ఆ నాలుగేళ్ళు ఏ నిర్దిష్ఠ చారిత్రక క్రమంలో ఇముడుతాయో ఆ సూచన మాత్రం ఎక్కడాలేదు. రెండవ భాగంలో సత్యం జానకికి వ్రాసిన ఉత్తరంలో నా నీ తారీఖు లేని ఉత్తరం అందిందంటూ "ఉత్తరాల్లో తారీఖులు వెయ్యటం మరచిపోతావెందుకు ? లేకపోతే తారీఖుల పట్టింపు లేనంతగా కాలాతీతంగా ఆలోచిస్తున్నావా ?" అని అడుగుతాడు. సత్యం వ్రాసిన ఆ ఉత్తరంలోనైనా తేదీ సూచించబడితే ఈ నవల కథ ఏచారిత్రక నవలలో ప్రవర్తించిందో అంచనావేసే అవకాశం లభించేది. నవలలో కథ ఏకాలంలో ఇముడుతుందో నిర్దిష్టంగా సూచించకపోవటం ఒక లోపమే. అయితే ఈ నవలలో ఒకచోట పరోక్షంగా ఇంద్రవల్లి సంఘటన ప్రస్తావన వచ్చింది.

కమ్యూనిస్టు పార్టీలో గ్రూపుల గురించి ప్రస్తావిస్తూ వాళ్ళు నిర్వహిస్తున్న ఉద్యమాల తీరుతెన్నులను విమర్శిస్తున్నట్లుగా సత్యం జానకితో మాట్లాడటం మూడవభాగంలో వుంది. (పు. **620**) నువ్వు చెప్పే ఉద్యమాల్లో నాయకత్వం చేసిందేమిటి ? ముఖ్యమంత్రిని మార్చాలనీ, కాల్పుల మీద కోర్టు విచారణ జరపాలనీ, చచ్చిపోయిన వాళ్ళ కుటుంబాలకి నష్టపరిహారం ఇవ్వాలనీ,

అదీ ఒక ఉద్యమంలో కమ్యూనిస్టులు నేర్పవలసింది ? అని అంటాడు. ఈ డిమాండ్లు 1981లో ఇంద్రవెల్లిలో గిరిజనులు చేసుకొన తలపెట్టిన సభను భగ్నం చేయటానికి పోలీసులు కాల్పులు జరిపి గిరిజనులను చంపి భయభ్రాంతులను చేసిన సందర్భంలో ముందుకు వచ్చాయి. నాలుగేళ్ళు కథాకాలం కనుక 1976లోనో 1977లోనో జానకి విముక్తి నవల ప్రారంభమై ఇంద్రవెల్లి దుర్ఘటన జరిగిన కాలంలో కలుపుకొని ప్రవర్తించిందనుకోవాలి. అయితే నవలలో ఎక్కడా ఆ కాలంలో, ఆ కాలంలోని తదితర చారిత్రక ఘటనలతో కథకు సంబంధం సమకూర్చబడలేదు.

1975 అంతర్జాతీయ మహిళా సంవత్సరం - ఆ తరువాత అది మహిళాదశాబ్దంగా మార్చబడింది. 1975 నుండి 1985 మధ్యకాలం అది. ఆ కాలంలోనే స్త్రీ సమస్యకు సంబంధించిన అవగాహనలో కొత్త దృక్పధం అభివృద్ధి చెందింది. ఆ నేపధ్యంలో వచ్చిందే జానకి విముక్తి నవల కూడా. అటువంటప్పుడు జానకి విముక్తి నవలలో కథకు అంతర్జాతీయ మహిళా దశాబ్దిలో సంభవించిన ప్రధాన ఘటనలు రమీజాబీ అత్యాచారం మొదలైనవాటితో జానకి విముక్తి నవలేతివృత్తానికి ఒక సంబంధం సమకూర్చబడితే నవలకు చారిత్రక సంబద్ధతా నిర్దిష్టతా కూడా సమకూడేది. అలాగే ఆ నవలలో కధ అంతా అయితే హైదరాబాదులో లేకపోతే విజయవాడలో ప్రవర్తించింది. విజయవాడలో జానకి కాపురం. జానకి పుట్టిల్లు హైదరాబాదు. నవల కథాక్రమాన్ని అనుసరించి చూస్తే జానకి జీవితంలోని నాలుగేళ్ళలో నాలుగైదు నెలలు మాత్రమే విజయవాడలో గడిపింది. మిగిలిన కాలమంతా హైదరాబాదులోనే. జానకి విముక్తి నవలా కాలం 1975 తరువాత 1977 లోపల ఎప్పుడో ప్రారంభమై 1981 తరువాత కాలంలో ముగిస్తే ఆ కాలంలో హైదరాబాదులో స్త్రీ సమస్యకు సంబంధించిగానీ, వామపక్ష రాజకీయ ఉద్యమాలకు సంబంధించి గానీ, ప్రభుత్వ విధానాలకు సంబంధించి గానీ జరిగిన ఏ ఒక్క అంశమూ, ఏ చిన్న సంఘటనా ప్రస్తావనగానైనా నవల కథలోకి ప్రవేశించలేదు. అందువలన జానకి విముక్తి నవలకు నిర్దిష్ట దేశకాలాల నేపధ్యం లేకుండా పోయింది. ఇది ఎక్కడైనా ఎప్పుడైనా జరగగలిగిన జీవితపరిణామంగా చూపించబడింది. కనుకనే జానకి విముక్తిని భావాల నవల (Novel of Ideas) అంటే సరిపోతుంది. స్త్రీ సమస్యకు చర్చకు పెట్టటంలోనూ, స్త్రీ పురుష సంబంధాలలో పెరగవలసిన ప్రజాస్వామిక సంస్కృతిని స్పష్టంగా సూచించటంలోనూ ప్రజాస్వామికీకరించబడిన కుటుంబం నమూనాను ఇయ్యటంలోనూ జానకి విముక్తి నవల ఒక ప్రభావవంతమైన పాత్ర నిర్వహించిందని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు.

## సి) స్త్రీల సమస్యలు - స్త్రీల కోణం :

పితృస్వామిక వర్గసమాజం స్త్రీ పురుషుల మధ్య అసమానతకు కారణమైంది. కుటుంబం పురుషుడిది, అతనిని అనుసరిస్తూ అతని ప్రయోజనాల కనుగుణంగా తనను తాను మలచుకొంటూ జీవించటం స్త్రీ కర్తవ్యం. అలా జీవించటానికి వీలుగా సహనం, శాంతం మొదలైన గుణాలు, పాతివ్రత్యం వంటి విలువలు స్త్రీకి బోధించబడతాయి. ఆ గుణాలు, విలువలు మూర్తీభవించిన స్త్రీ నమూనాలు. సీత, సావిత్రి, సుమతి వంటివి తయారుచేయబడి స్త్రీలకు ఆదర్శంగా నిలబెట్టబడినాయి. ఈ నమూనాలు పితృస్వామిక అధికార ప్రయోజనావసరాల దృష్ట్యా రూపొందాయి కనుక ఈ నమూనాలలో ఇమడటం జీవించటం స్త్రీకి ఒక సమస్య అవుతుంది. అది సమస్య అనుకోకుండా సహజమని సరిపెట్టుకొని బతికెయ్యగలిగిన సంస్కారం పెంపకంలో కుటుంబం, బయట నుండి సమాజం స్త్రీలో అభివృద్ధిపరుస్తాయి. ఈ సంస్కారం ముసుగులో తానెంత హింసకు గురవుతున్నదో స్త్రీకి తెలుస్తూనే వున్నా దానిని వ్యక్తీకరించగలిగిన చైతన్యం, ధైర్యం లేవు. సమస్యలు ఒత్తిడి పెట్టినప్పుడు తమకు ఆదర్శంగా నిర్దేశింపబడిన నమూనాలపై జీవితవిధానాలపై వ్యక్తిగత స్థాయిలో స్త్రీలు నిరసనలు ప్రకటించకపోలేదు. చరిత్రను, సాహిత్యచరిత్రను జాగ్రత్తగా అధ్యయనం చేస్తే అటువంటి ఉదంతాలు మనకు కనబడతాయి.

అయితే స్త్రీ సమస్యను సామాజిక సమస్యగా గుర్తించటం, పరిష్కారాల కోసం ప్రయత్నాలు ప్రారంభించటం మాత్రం సంస్కరణోద్యమ కాలంలోనే ప్రారంభమైంది. సంస్కరణోద్యమం స్త్రీకి విద్యలేకపోవటాన్ని, బాల్యంలోనే పెళ్ళిళ్ళయి వితంతువులయి

జీవించవలసి రావటాన్ని, పునర్వివాహ అవకాశం లేకపోవటాన్ని స్త్రీల సమస్యలుగా గుర్తించింది. వాటి పరిష్కారానికి వ్యక్తులు సంస్కారవంతులు కావాలని ప్రభోధించటం, చట్టాలు తీసుకొని రావటానికి సామాజిక ఆమోదాన్ని సంపాదించటానికి ప్రయత్నించటం జరిగింది. స్త్రీల సమస్యలుగా ఉదార దృక్పథం కలిగిన పురుష సమాజం వేటిని గుర్తించిందో వాటిపట్ల స్త్రీలు తమ జీవతంలో ఏవి సమస్యలుగా వున్నాయని బాధపడుతున్నారో, ఆ సమస్యలకు ఎటువంటి పరిష్కారాన్ని ఆశిస్తున్నారో వాళ్ళ అనుభవ కోణం నుండి వ్యక్తం కాలేదన్నమాట. స్త్రీలు తమ గురించి తమ సమస్యల గురించి ఏమైనా అనుకోగలరన్న చైతన్యం గానీ, ఏమనుకొంటున్నారో తెలుసుకుందామన్న చొరవగానీ అప్పటికీ ఏర్పడలేదు. తెలుగు సాహిత్యరంగంలో సాంస్కృతిక సైనికుడి సాత్ర వహించిన గురజాడ అప్పారావు సంస్కరణోద్యమం స్త్రీల గురించే అయినా స్త్రీల కోణం అందులో లేదని గుర్తించాడు. ఒకానొక సంబంధం గురించి లోకమూ పురుషులు ఏమనుకుంటారో అదే స్త్రీ అనుకోకపోవచ్చు. అందువల్లనే ఆడవాళ్ళ జీవితానుభవాల పురుషుడు ఏమీ చెప్పలేని నిస్సహాయిడే అవుతున్నాడని అవుతున్నాడని గురజాడ తాను వ్రాయతలపెట్టిన నవలలో కోసం వ్రాసిపెట్టుకున్న నోట్సులో అన్నాడు. చలం సాహిత్యం అంతా స్త్రీ పురుష సంబంధాల గురించి సమాజం నిర్దేశించడానికి, పురుషుడు ఆశించిన దానికి భిన్నంగా స్త్రీలు ఏమనుకొనటానికి వీలుందో చూపించిన సాహిత్యమే. స్వాతంత్ర్యోదమ రాజకీయాల్లోనూ పురుషులతోపాటు సమాన సౌరసత్వాన్ని గురించి స్త్రీలు కన్న కలలు భగ్నం చేయబడి పురుష సమాజం స్త్రీల జీవితంలో ఏ అంశానికి ఎంత ప్రాధాన్యత వుండాలో నిర్దేశించిన సూత్రాలనుబట్టే స్త్రీ సమస్య చర్చించబడింది. **1960**లలో ప్రపంచ వ్యాపితంగా వచ్చిన గుర్తింపు ఉద్యమాలు ప్రత్యేకించి స్త్రీవాద ఉద్యమాలు కలిగించిన నూతన జనచైతన్యం నుండి స్త్రీలు తమ గురించి తాము ఆలోచించుకొని అభివ్యక్తీకరించుకొనగలిగిన వర్గంగా రూపొందారు. ఆ క్రమంలోనే స్త్రీల సమస్యకు స్త్రీల కోణం సమకూడింది.

స్త్రీలు గురించి స్త్రీలే వ్రాసిన దానిలో స్త్రీల అనుభవకోణం వుంటుంది. స్త్రీ సమస్య గురించి పురుషులు వ్రాసిన దానికన్నా సహజ వాస్తవికతను అవి దగ్గరగా వుంటాయి. వ్రాసిన స్త్రీల అస్తిత్వ చైతన్యస్థాయిని అవగాహనా స్థాయిని, దృక్పధానికి వున్న పదునును బట్టి ఆయా రచనలు స్త్రీల జీవిత సమస్యలను మూలాల నుండి సమర్థవంతంగా ప్రతిపాదించగలుగుతాయి, చర్చించగలుగుతాయి. అందువల్లనే స్త్రీవాద ఉద్యమం ఇన్నాళ్ళ మౌనజీవిత చరిత్రకు స్వస్తిచెప్పి నిశ్శబ్దాన్ని బద్దలుకొడుతూ స్త్రీలను తమ అనుభవాల గురించి మాట్లాడమని కోరింది. వ్యక్తిగతమనే నెపం మీదనో కుటుంబ మర్యాద, సామాజిక గౌరవం అనే పరిధులకు లోబడో స్త్రీలు స్వేచ్ఛగా బిగ్గరగా తమ అనుభవాలను తోటి స్త్రీలతో పంచుకొనే అవకాశాలు ఇన్నాళ్ళూ లేకుండా పోయాయి. **1975** తరువాత ప్రపంచ వ్యాప్తంగా స్త్రీలకు స్వీయ అనుభవాల అభిప్రాయాల ఆలోచనల వినిమయానికి అనుకూలమైన ఒక వాతావరణం రూపొందింది. ఆ నేపథ్యంలో రంగనాయకమ్మ జానకి విముక్తి నవల వ్రాశారు.

స్త్రీ కావటం కుటుంబంలో అసమానతలు, అధికారాలు అనుభవంలోకి రావటం, వాటిని గుర్తించి వేదన పడగలిగిన మానవీయ చైతన్యం వికసించటం - ఈ కారణాల వల్ల రంగనాయకమ్మ ప్రారంభ నవలల్లోనూ స్త్రీల అనుభవాలు, ఆలోచనలూ, అస్తిత్వవేదనలూ కనపడతాయి. భర్త తన అభిరుచులను, అభిప్రాయాలను గుర్తించి అర్థం చేసుకొనాలని కుటుంబ విషయాలలో తనను జీవితభాగస్వామిగా గౌరవించాలని పేకమేడలు, చదువుకున్న కమల, రచయిత్రి వంట నవలల్లో నాయికలు ఆశించారు. భంగపడ్డారు. రాజీపడ్డారు. స్త్రీల జీవిత సమస్యలను మరింత స్పష్టంగా పదునుగా గుర్తించటం, వాటి మూలకారణాల గురించిన అవగాహనను కనపరచటం, పరిష్కారానికి సంబంధించిన ధృక్పధాన్ని ప్రతిపాదించటం జానకి విముక్తి నవలలో కనబడతాయి. తెలుగులో స్త్రీల గురించి సైద్ధాంతిక నైశిత్యంతో స్త్రీల కోణం నుండి వ్రాయబడిన తొలినవల జానకివిముక్తి. ఈ నవలలో స్త్రీల సమస్యకు స్త్రీల కోణం అనేది రెండు స్థాయిలలో చూడాల్సిన అంశం. ఒకటి ఈ నవలలో పాత్రలుగా వచ్చే స్త్రీల కోణం ఏమిటి అనేది. రెండు రచయితగా రంగనాయకమ్మ కోణం ఏమిటి అనేది. పాత్రల విషయం తీసుకుంటే ప్రధానంగా జానకి, విశాలాక్షి స్త్రీ సమస్య అంటే ఏమిటనుకొంటున్నారో చూడాలి. ఆ సమస్యకు వాళ్ళకు తెలిసిన పరిష్కారం ఏమిటో దానిని

ఆచరణలోకి తెచ్చుకోగలిగిన స్థితి వాళ్ళకు వుందో లేదో చూడాలి. ఎందుకంటే సమస్యలను నిజంగా ఎదుర్కొన్నది వాళ్ళు గనుక. ఆ తరువాత శాంత గురించి చూడాలి. శాంతస్థాయి సాంఘికంగా, ఆర్థికంగా చైతన్యపరంగా జానకి, విశాలాక్షి వంటి స్త్రీల కంటే మెరుగైనది. అందువల్ల స్త్రీ సమస్య గురించి ఆమె దృక్పథం కొంత భిన్నంగా విశిష్టంగా వుంటడానికి వీలుంది.

జానకి విశాలాక్షి ఇరుగుపొరుగు ఇళ్ళవాళ్ళు. ఇద్దరికీ స్నేహం. సమానమైన అనుభవాలు, అభిప్రాయాలు కలిగిన వాళ్ళమధ్యనే స్నేహం ఏర్పడుతుంది. జానకి, విశాలాక్షి ఇద్దరూ కుటుంబంలో నోరువిప్పి మాట్లాడటానికే వీలులేని అసమసంబంధాలలో జీవిస్తున్న వాళ్ళు. భర్తల మూర్ఖమైన అధికారానికి తలవొగ్గి బ్రతుకుతున్నవాళ్ళు. వాళ్ళకు ఊరట, అంతరంగాలను విప్పిచెప్పుకొనే అవకాశం ఈ స్నేహసంబంధంలోనే సాధ్యమైంది. మూడో నెలలు పుట్టింట్లో వుండి మళ్ళీ భర్త వచ్చి పిలిచాడని అతని వెంట బయలుదేరిన జానకికి ఇంట్లోకి వెళ్ళగానే వచ్చి తనను పలకరించే విశాలాక్షి స్నేహం గుర్తొస్తుంది. వెళ్లేటప్పటికి విశాలాక్షి వూళ్ళో లేకపోవటం పెద్దదిగులు కలిగించింది జానకికి. కడుపులో మాటలు రెండు మాట్లాడుకొనటానికి విశాలాక్షి ఒక్కతే ఆమెకు ఆధారం అందువల్ల ఆమె లేకపోతే జానకికి పిచ్చెక్కినట్లే అవుతుంది. ఇదంతా చెప్పటం ఎందుకంటే కుటుంబంలో ఒంటరి వాళ్ళుగా చేయబడిన స్త్రీల వేదనలకు తోటి స్త్రీలతో స్నేహమే ఒక ఉపశమనంగా వుంటుందన్న విషయం సూచించటానికే.

అత్త భర్తల సాధింపుల వేధింపుల దుర్భరం కాపురంలో లోలోపల నలిగిపోతున్న జానకికి విశాలాక్షి రాక అమిత సంతోషం కలిగించింది. జానకి అనుభవాలు విని "బుద్ధిరాదమ్మ వీళ్ళకి" అని ఆమె అత్తను భర్తను గురించి అని జానకికి సానుభూతి ప్రకటించింది. విశాలాక్షి భర్త ఇల్లు బాధ్యతలు పట్టకుండా పెళ్ళాం పిల్లలను గాలికి వదిలేసి తిరుగుతాడని జానకికి బాధ. వాళ్ళు ఒకరికొకరు సాయం. ఒకరికొకరు ధైర్యం. వాళ్ళకు ప్రమీల ఒక "ఆదర్శ నమూనా". ఆమె ఈ నవలలో ప్రత్యక్షంగా కనబడదు. విశాలాక్షి, జానకి సంభాషణలలో ప్రసక్తికి వస్తుంటుంది. జానకి వాళ్ళ ఇంటి మూడో వాటాలో వుండే ప్రమీల ఉద్యోగస్తురాలు.

బహిష్టు సమయంలో నెలనెలా ఆ మూడు రోజులూ బయట కూర్చొనటం జానకికి ఇష్టం వుండదు. ఇంట్లోకి రావటానికి అత్త ఒప్పుకోదు. ఆ విషయమై జానకి విశాలాక్షి మధ్య సంభాషణ నడుస్తుంది ఒకసారి. అవసరాల ఒత్తిడి, ప్రమీల బోధతో తాను బయట కూర్చొనటం మానేసానని విశాలాక్షి చెప్తుంది. తానూ మానేస్తానని అన్నప్పుడు మా అక్కయ్యకు నచ్చదంటూ భర్త అభ్యంతర పెట్టిన విషయాన్ని, ఆ నాలుగు రోజులూ ఇంటికేరానని బెదిరించిన విషయాన్ని గుర్తు చేసుకొని విశాలాక్షి 'ఈ మొగాళ్ళకి వాళ్ళ అమ్మల యిష్టాలూ, అక్కల ఇష్టాలే పట్టింపుగానీ పెళ్ళాల యిష్టాలక్కర్లేదు' అని నిరసనగా అంటుంది. విశాలాక్షి అనుభవం పోషణ కోసమే ఆడది మొగుడి దగ్గర పడివుంటుందన్న అవగాహనను ఇచ్చింది. భార్యాభర్తల మధ్య జీవితకాలపు స్నేహసంబంధం ఆమెకు ఎక్కడా కనబడకపోవటమే అందుకు కారణం.

భర్తల పీడింపునకు భార్యలు ఇంకా గ్రహించుకోలేదు. గ్రహించుకోకనే వాళ్ళతో కాపురాలు చేస్తున్నారని సత్యం జానకికి వ్రాసిన ఉత్తరంలో చదివి విశాలాక్షి అతనింకా చిన్నవాడు. అంత కష్టసుఖాలేం తెలుసు అని భర్త సంగతి తెలిసినా ఏ ఆధారం లేకపోవటం వల్ల ఆడది ఎక్కడికీ పోలేకపోతున్నదని విశాలాక్షి అంటుంది. సత్యానికి కష్టసుఖాలు తెలుసు. ఆడవాళ్ళ కష్టసుఖాలు కొంత అర్థం చేసుకోగలిగిన లక్షణం వుంది. కానీ లోతు నుండి తెలుసుకోలేడని అందుకతని అనుభవం చాలదని ఎంతయినా అతనిది పురుషానుభవమే కానీ స్త్రీ అనుభవం కాదని స్త్రీపట్ల సానుభూతేకాని స్వానుభవం లేనివాడని విశాలాక్షి మాటకు లోతయిన అర్థం ఉంది. స్త్రీకి తన సమస్య అన్నిటికీ భర్తమీద ఆధారపడి బ్రతకటం. అందువల్ల భర్త నుండి వచ్చే పీడనను ధిక్కరించి బయటపడగలిగిన సాహసం చేయలేకపోతున్నారని అంటుంది ఆమె. విశాలాక్షి అనుభవం ఆడదానికి కాస్తో కూస్తో తనదైన సంపాదన వుండాలన్న అవగాహనను ఇచ్చింది. ఆర్థిక స్వావలంబనే వుంటే ఏ బాధ్యతాలేని మొగుడ్నితాను, కత్తులబోను లాంటి సంసారాన్ని తన చెల్లెలు వదులుకోగలిగే వాళ్ళమన్నది ఆమె అభిప్రాయం.

జానకికి అర్థంకాని విషయాలు, అర్థం చేసుకొనటానికి భయపడే విషయాలు జానకి కంటే ఎక్కువగా పందొమ్మిదేళ్ళ సంసార జీవితానుభవం వున్న విశాలాక్షి ఇట్టే గ్రహిస్తుంది. భర్త శత్రువో, స్నేహితుడో గ్రహించుకోవాలని మూర్తి వ్రాశాడని జానకి చెప్తే విశాలాక్షి నిజమే మొగుళ్ళు యముళ్ళేననటం, మొగడు శత్రువేగాక స్నేహితుడవుతాడా అనటం కటువుగా కనిపించినా కఠోర వాస్తవ జీవితానుభవం నుండి అలా తప్ప మరొకలాగా అనలేకపోయింది. ఆడదానికి తాను అనుకొన్న పని చేయటానికిగానీ, చేయకుండా వుండటానికి గానీ, భర్తల అధికారాన్ని పెత్తనాన్ని ధిక్కరించి బయటపడడానికి గానీ ఆర్థిక స్వావలంబన లేకపోవటం ప్రధాన సమస్యగా విశాలాక్షి గుర్తించింది. ఉద్యోగం చేస్తున్న ప్రమీల స్వతంత్రంగా తన అభిప్రాయాలు ప్రకటించంగాని నిర్ణయాలు తీసుకొనటం గానీ, ఆర్థిక స్వావలంబన వల్లనే సాధ్యమైందనీ, విశాలాక్షి నమ్మకం. విశాలాక్షికి భర్త నుండి ప్రేమ లభిస్తుందన్న ఆశలు భ్రమలు ఏమీ మిగల్చలేదు. ఆమె పందొమ్మిదేళ్ళ వైవాహిక జీవితం. నలుగురి పిల్లలను పోషించటం ఎట్లా అనేదే ఆమె సమస్య. పుట్టింటి సహాయం అంతో ఇంతో అప్పుడో ఇప్పుడో లభిస్తున్నా దానిని నమ్ముకొని పూర్తిగా అక్కడికి వెళ్ళలేదు. అందుకని ఆ భర్తనే పట్టుకొని వేళ్ళాడుతూ వుంది. విశాలాక్షి సమస్య, దానికి ఆమె ఆశించిన పరిష్కారం తెలుసు కనుకనే జానకి వెంకట్రావును వదలి అన్న దగ్గరకు వెళ్ళిపోయాక తాను ఇక ఎప్పటికీ మెడలో వుంచుకోదలచిన మంగళసూత్రాలు అమ్మి కుట్టుమిషన్ కొనుక్కోనమని విశాలాక్షికి పంపింది.

జానకి సమస్య భర్త ప్రేమ. భర్త నుండి ఆమె ఆశించేది కాస్త ప్రేమ. కాస్త మెప్పు. ఇంటికోసం ఆమె ఎంత సమయమైనా వెచ్చించగలదు. ఎంత చాకిరీ అయినా చేయగలదు. కానీ ఆమె ఆశించనవేమీ లభించవు. తన అందం, తన సంతోషం, తన శుభ్రత అతనిని ఆకర్షించవు. తననెప్పుడూ అదుపులో పెట్టి తన మీద అధికారం చలాయించి తనను అవమానపరచి దుఃఖపరిస్తే కానీ అతనికి భర్త పదవిని సక్రమంగా నిర్వర్తించానన్న సంతృప్తి లేదు. ఇది అనుభవంలో క్రమంగా గ్రహించింది జానకి. కొంచెం కొంచెం ప్రశ్నించటం కొంచెం కొంచెం ధిక్కరించటం జానకి నేరుస్తున్నప్పటి నుండి అతనికి ఆమె తనను వదలి వెళ్ళిపోతుందేమోనన్న భయం కలిగింది. జానకి గర్భవతి అని తెలియటంతో ఆ భయం తొలగిపోయింది. పిల్లల కోసమైనా జానకి తనను విడిచి వెళ్ళలేదన్న ధైర్యం వచ్చింది. తన అధికారం యధాప్రకారం సాగించవచ్చునని నమ్మకం చిక్కింది. ఇది గ్రహించగలిగి తెలివితేటలు జానకిలో వికసించటం మొదలైంది కనుకనే ఆమెకు ఆ గర్భం ఏ మాత్రం సంతోషం కలిగించలేదు. అబద్ధాలాడటం, అవమానపరచటం, కొట్టటం, అవసరాల కోసం ప్రేమ నటించటం, స్త్రీల పట్ల తేలికతనం, పరస్త్రీలతో సంబంధాలు - ఇన్ని దుర్గుణాలు వున్న భర్తతో కలిసి బ్రతకటమే ఒక సమస్య అయి అతని నుండి విడిపోయి రావటమే దానికి సరియైన పరిష్కారంగా జానకి భావించింది అన్న చెప్పాడని కాదు ఆమె భర్తను వదిలేసింది. వదిలెయ్యవలసినంత దుర్మార్గుడతను అని అనేక అనుభవాల తరువాత ధృఢపరచుకొనే ఆమె ఆ పని చేసింది.

విశాలాక్షి , జానకి దృష్టికోణాలు అస్తిత్వంలో వున్న వ్యవస్థలోని దుర్మార్గాన్ని గుర్తించేంత చురుకైనవి. పాత వ్యవస్థతో సంఘర్షించే పరిధికి విస్తరించినవి. జానకి ఒకడుగు ముందుకు వేసి కొత్తజీవితాన్ని నిర్మించుకొనే దృక్పధాన్ని అభివృద్ధి పరచుకొన్నది. తండ్రితో నిమిత్తం లేకుండా సంతానాన్ని తల్లిగా సర్వహక్కులతో కనిపెంచే గుండె దిటవునూ, స్వాభిమాన సంపదనూ అభివృద్ధి పరచుకొనటం, ప్రభాకర్‌తో సహజీవనానికి సిద్ధపడటం, తాను పనిచేసే చోటు శ్రామికవర్గం పక్షాన నిలబడి పని హక్కులకోసం పోరాడే తెగువను పెంచుకొనటం ఇవన్నీ స్త్రీగా స్త్రీ జీవితంపట్ల, సమాజ జీవితంలో పాత్రపట్ల పెరిగిన అవగాహనకు సంబంధించినవే. తన జీవితం మీద తన అధికారమే కానీ పెళ్ళి పేరిట ఆ అధికారాన్ని భర్తకు బదలాయించటానికి ఇష్టపడని శారద కుదిరిన సంబంధాన్ని త్రోసి రాజనటం అనుభవం నుండి చేసింది.

శాంత దృష్టికోణం అభివృద్ధికరమైన, ప్రజాస్వామికమైన, హక్కుల చైతన్యం కల నూతన మానవ సంబంధాల సమాజ నిర్మాణానికి నేలను చదునుచేసుకుంటూ చక్కని రహదారిని నిర్మించుకొంటూ ముందుకు సాగిపోయే ఆచరణ కార్యక్రమానికి

సంబంధించినది. లా చదువు, న్యాయవాదిగా వృత్తి నిర్వహణ, ఆమెలో హక్కుల చైతన్యాన్ని, స్వతంత్ర జీవనాభిలాషను అభివృద్ధి పరిచాయనుకోవచ్చు. మంచి సాహిత్యాన్ని చదవటం, ప్రజాస్వామిక భావాలు కలిగిన సీనియర్ దగ్గర పనిచేయటం, ఉష స్నేహం, సత్యంతో చర్చలు అన్నీ ఆమెలో కొత్తజీవితాన్ని నిర్మించుకొనే చొరవను పెంచాయి. అందుకోసమే ఆమె పాత సమాజంతో ఘర్షణ పడవలసి వచ్చింది కానీ పాతసమాజం పట్ల ఆమెకు ఎలాంటి భ్రమలు లేవు. శాంత సంఘర్షణ పెళ్ళికి సంబంధించింది. ఇన్నేళ్ళు వచ్చి లాయరుగా వృత్తి జీవితాన్ని ఏర్పరచుకొన్న తాను అక్కయ్యలు, అమ్మమ్మలు, నాన్నలు తెచ్చే సంబంధాలు చూచి పెళ్ళి చేసుకోలేనని చెప్పటంతో ఆ ఘర్షణకు తెరలేచింది. శాంతవి ఖచ్చితమైన అభిప్రాయాలు, నిర్ణయాలే కనుక వూగిసలాటకు తావేలేదు. ఒకసారి తన నిర్ణయం ప్రకటించాక ఆమెకిక సంఘర్షణ లేనేలేదు. అట్లాగే పెళ్ళి అనే పేరు మీద జరిగే ఏ రకమైన, ఏ రూపంలో వున్న తంతునైనా అంగీకరించనని ప్రకటించింది శాంత. అది ఆమె రెండవ తిరుగుబాటు. ఒక ఆదివారం బయలుదేరి సత్యం ఇంటికి తన బట్టలతో పుస్తకాలతో వచ్చెయ్యటంతో ఆమె నూతన జీవిత నిర్మాణానికి ప్రారంభం జరిగింది. అత్త, భర్త, ఆడపడచు అనే అధికార సంబంధాలు లేని అచ్చమైన మానవసంబంధాల సమస్థాయి వ్యక్తుల సంబంధాల జీవితాన్ని ఆచరణ సాధ్యం చేసుకొన్నది. భర్త అధికారానికి లోబడి అస్వతంత్రంగా జీవించే కాలంలో విశాలాక్షితోపాటు జానకికి కూడా ఉద్యోగం చేసుకుంటూ స్వతంత్రంగా ప్రవర్తించగలిగిన ప్రమీల ఆదర్శనమూనా అయితే స్వతంత్రమూ స్వేచ్ఛాయుతమూ అయిన జీవితాన్ని నిర్మించుకొనేందుకు చేస్తున్న ప్రస్థానంలో జానకికి శాంత ఆదర్శ నమూనా అయింది.

స్త్రీల అనుభవాలను కోర్టు కేసుల ద్వారా దగ్గరగా పరిశీలిస్తూ స్త్రీగా స్పందించే శాంత భార్యాభర్తలు విడిపోయినప్పుడు పిల్లలపై తండ్రిని హక్కును ఆమోదించే కోర్టు వ్యవహారాలలో ఆడపిల్లల కోసం తల్లులు పడే తపనను ఆరాటాన్ని స్వానుభవంగా చేసుకోగలిగింది. తన ఆత్మగౌరవాన్ని హీనపరచుకొనే స్థాయికి తల్లి దిగజారటానికి పిల్లలే కారణమవుతున్నప్పుడు ఆ పిల్లలను కనకుండా వుండటానికి స్త్రీకి సంపూర్ణమైన హక్కు వుందని ఆమె భావించింది. తనకు పిల్లలు వద్దని సత్యానికి చెప్పింది. పిల్లల్ని కనటం, పెంచటం స్త్రీల ధర్మాలుగా చెప్పే పాతవ్యవస్థలో ఆ పిల్లలే స్త్రీలకు మానసిక ధైర్యాన్ని నీరుగార్చే బంధనాలు అవుతున్నప్పుడు స్త్రీల కోణం నుండి చూచినపుడు కనాల్సిన స్త్రీకే పిల్లల్ని కనాలా వద్దా అన్న నిర్ణయాధికారం వుండాలి. ఈ న్యాయాన్ని గుర్తించాడు కనుకనే సత్యం శాంత అభిప్రాయాన్ని గౌరవించాడు.

స్త్రీల అనుభవాలు భిన్నభిన్నంగా వుంటాయి. అనుభవాల నుండి అవసరాల నుండి అవకాశాలను బట్టి వాళ్ళు వాళ్ళ వాళ్ళ జ్ఞానచైతన్యాలను బట్టి కొన్ని నిర్ధారణలకు వస్తుంటారు. తమ సమస్యలను గుర్తిస్తుంటారు. విముక్తి మార్గాలను ఎన్నుకొంటుంటారు. ఆ క్రమాన్ని నిరాటంకంగా కొనసాగనిస్తూ వాళ్ళ జ్ఞానచైతన్యాలు సరియైన మార్గంలో వికసించేటట్లు తోడ్పటమే సమాజంలో ఎవరైనా చేయవలసినది. స్త్రీల సమస్యల పట్ల రచయితగా రంగనాయకమ్మ కోణం అది. ఇవి నీ సమస్యలని స్త్రీలకు బోధపరచటం కానీ వీటికి ఇది పరిష్కారమని తామే నిర్ణయించి వాళ్ళను అందులోకి లాగటం కానీ సమాజంలో ఎవరూ చేయకూడదు. అది స్త్రీల నిజమైన వికాసానికి, శాశ్వతమైన అభివృద్ధికి దోహదం చేయదు. స్త్రీల సమస్య పట్ల రంగనాయకమ్మ కోణం ఇది కనుకనే చెల్లిలిని దుర్మార్గుడైన భర్త నుండి కాపాడాలన్న సత్యం అత్యుత్సాహానికి ఎప్పుడూ మూర్తి పాత్రచేత కళ్ళెం వేయిస్తూనే వచ్చారు. జానకి తనంతతాను తన సంసారంలోని దుర్భరత్వాన్ని గుర్తెరిగే వరకూ ఆమె ఆ దుర్భరత్వాన్ని గుర్తించేందుకు వీలయిన స్నేహమూ, ప్రేరణ అందియ్యవలసిదనే కానీ అంతకుమించి ముందుకు పోరాదని మూర్తి సత్యానికి చెప్తూ వచ్చాడు. కార్మికుల సంసిద్ధత లేకుండా నాయకత్వం సమ్మెకు పిలుపు ఇవ్వటం కానీ, ప్రజల సంసిద్ధత లేకుండా నాయకత్వం విప్లవోద్యమాన్ని వేగవంతం చేయటంకానీ ఎలా అభిలషణీయాలు కావో బాధితులైన స్త్రీలు తమ బాధలు స్వరూప స్వభావాలు గుర్తెరిగి వరకు వాళ్ళకు సంబంధించి వాళ్ళపట్ల ఎంత ప్రేమ కలవాళ్ళయినా ఏ నిర్ణయమూ తీసుకొనటం అభిలషణీయం కాదంటాడు. మూర్తి వాదనతో సమ్మతించాడు కనుకనే సత్యం ఆ తరువాత జానకిలో ఆలోచనలను రేకెత్తించే, ప్రశ్నలను రేకెత్తించే, ఆత్మగౌరవ చైతన్యాన్ని కలిగించే పుస్తకాలిచ్చి చదివించాడు. ఉత్తరాలు వ్రాసి నైతిక ధైర్యాన్నిచ్చాడు. తనంతటతాను

భర్త అధికారం నుండి పెత్తనం నుండి జానకి బయటపడేవరకు ఎదురుచూశాడు. ఆ తరువాత ఆమె సంతోషానికి వికాసానికి తాను చేయవలసినదంతా చేశాడు.

స్త్రీలు వ్యక్తిగత సమస్యల నుండి విముక్తి చెందితే సరిపోదు. అది స్త్రీలందరికీ స్వేచ్ఛాయుతమైన, స్వతంత్రమైన జీవితాన్ని ఇయ్యగలిగేదిగా ఉన్నతస్థాయికి పరిణితి చెందాలి. అందుకు పీడకులయిన పురుషుల స్వేచ్ఛను పితృస్వామిక అధికార శక్తులను నియంత్రించే నూతన సమాజం ఏర్పడాలి. ఆ నూతన సమాజం కమ్యూనిస్టు సమాజంలోనే సాధ్యమవుతుంది. ఆ నమ్మకాన్ని మూర్తి సత్యం తదితరులలో గాఢంగానే నాటాడు. కమ్యూనిస్టు దేశాలలో స్త్రీల సమస్యలు పరిష్కరింపబడే తీరును గురించి శాంత, సత్యం, జానకి, సుందరమ్మ కలసి కూర్చొని మాట్లాడుకొంటారు. స్త్రీలపై పీడన విషయంలో కమ్యూనిస్టు దేశాల కోర్టులు అవలంబిస్తున్న విధానాన్ని ఒక కేసు వివరాలను చదివి వినిపించటం వల్ల తెలుసుకున్న సుందరమ్మ కూడా మన దేశానికి అలాంటి కోర్టులు ఎప్పుడు వస్తాయని ఆసక్తిగా ప్రశ్నిస్తుంది. ఆ రకంగా స్త్రీ సమస్యకు శాశ్వత పరిష్కారాన్ని ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని ఇయ్యగలిగిన ప్రజాస్వామిక దృక్పథం కమ్యూనిస్టు సమాజాలలోనే సాధ్యమవుతుందన్నది రంగనాయకమ్మ కోణం.

స్త్రీల అనుభవకోణం, కమ్యూనిస్టు సిద్ధాంత అవగాహన కలిసినప్పుడు పీడ్యపీడక సంబంధాలు లేని సమసమాజ నిర్మాణంలో భాగంగా స్త్రీలపై పురుషులు పీడనకు, పితృస్వామిక పెత్తందారీతనానికి అవకాశం లేని నూతన మానవ సంబంధాలు ఏర్పడతాయని అందుకు స్త్రీలు పురుషులు స్వీయచైతన్యాన్ని అభివృద్ధి పరచుకొంటూ సంసిద్ధులు కావాలని రంగనాయకమ్మ ఈ నవల ద్వారా సూచించారు.

## డి) కుటుంబం :

స్త్రీల సమస్యలు అవి కుటుంబ హింసకు, ఆర్థిక అణచివేతకు, అస్వతంత్రకు, అభద్రతకు సంబంధించినవి ఏవైనా అన్నిటికి మూలం పితృస్వామ్యంలో వుంది. పితృస్వామ్యం అంటే తండ్రి వైపు నుండి హక్కులు, అధికారాలు అమలయ్యే సమాజం. పితృస్వామ్యానికి అచ్చమైన పరిపూర్ణమైన ప్రతినిధి వ్యవస్థ కుటుంబం. స్త్రీల మీద పురుషులు అధికారాన్ని చిన్నవాళ్ళ మీద పెద్దల అధికారాన్ని స్థిరీకరించిన వ్యవస్థ అది. ఈ అధికార లక్షణం కుటుంబం బయట వున్న అన్ని సామాజిక ఆర్థిక రాజకీయ వ్యవస్థలకు కూడా విస్తరించింది.

కుటుంబం అంటే భార్యాభర్త పిల్లలు ప్రేమానురాగాలతో నిండిన విడదీయరాని బంధంతో వుంటారనేది ఒక విశ్వాసం. అందువల్లనే ఏ సంస్థలోనైనా సహోద్యోగుల మధ్య సత్సంబంధాలు వున్నాయని చెప్పటానికి మేమంతా ఒక కుటుంబంలా కలిసి మెలిసి వుంటామని చెప్తుంటారు. కానీ వాస్తవానికి కుటుంబం ఆ రకంగా లేదు. అసమ సంబంధాలు కుటుంబంలో మనుషుల మధ్య స్నేహసౌహార్ద్రతలను అభావం చేస్తున్నాయి. ముఖ్యంగా 1975 తరువాత స్త్రీల సమస్యలకు మూలమైన పితృస్వామిక వ్యవస్థ గురించిన అవగాహన ప్రపంచ వ్యాపితంగా అభివృద్ధి చెందిన నేపథ్యంలో స్త్రీలకు కుటుంబం ఒక నియంత్రణా వ్యవస్థగా అర్థం కావటం మొదలైంది. 'లింగవివక్ష' అక్కడే ప్రారంభమై విశ్వరూపం వికృతరూపం ధరిస్తున్నదని తెలియవచ్చింది. దానితో కుటుంబం నుండి విముక్తి అనేది స్త్రీవాదంలో ఒక నినాదమైంది. కుటుంబం నుండి విముక్తి అనేమాట కుటుంబ విధ్వంసంగా, స్త్రీల విశృంఖల స్వేచ్ఛగా అర్థమై సమాజం గగ్గోలుపడింది. అటువంటి ప్రారంభ దశల్లోనే అస్తిత్వంలో వున్న కుటుంబ స్వరూప స్వభాఎకు చిత్రించు రంగనాయకమ్మ ఈ నవలలో ఇటువంటి కుటుంబాన్ని నిలుపుకొనాలని ఎవరైనా వాంఛిస్తారా ? అన్న ప్రశ్నకు ఇంతగా మానవ విలువలు ధ్వంసమైన కుటుంబం పతనంకాక తప్పదన్న హెచ్చరికను చేశారు. అంతటితో ఆగక భవిష్యత్తులో నిర్మించుకొనవలసిన కొత్త కుటుంబం నమూనాను కూడా అందించారు. ఈ రెండింటినీ ఇక్కడ పరిశీలిద్దాం.

అస్తిత్వంలో వున్న కుటంబ దుర్లక్షణాలన్నీ మూర్తీభవించిన కుటుంబం వెంకట్రావుది. కుటుంబాల్లో స్త్రీ మీద భర్తకు సంపూర్ణమైన హక్కు అధికారం సంక్రమిస్తాయి. స్త్రీల ఇష్టాలకు తావులేదక్కడ. బహిష్టు సమయంలో ఆ మూడురోజులు బయట కూర్చోవటం జానకికి ఇష్టంలేదు. అది వెంకట్రావుకు ఇష్టంలేదు కనుక జానకి తన ఇష్టాన్ని లోలోపలే అణచుకొని బయట కూర్చోనవలసిందే. జానకి అన్నకు ఉత్తరాలు వ్రాసుకొనటం అతనికి ఇష్టం ఉండదు. అతనికి తెలియకుండా చాటుగానైనా వ్రాసుకొనాలి. అలా ఎక్కువకాలం చేయలేక చివరికి ఉత్తరాలు వ్రాయటమేమానేసింది జానకి. "భర్తని అధికారిగా చేసే సమాజమే ఆ భర్త సంబంధీకులందర్నీ ఆ స్త్రీ మీదే అధికారులుగా చేస్తోంది" అని మూర్తి చేత చెప్పించారు రంగనాయకమ్మ (మొ.భా.పు. 59) అందువల్లనే జానకికి భర్త సాధింపులు, వేధింపులతోపాటు అత్తసాధింపుల వేధింపులు కూడా భరించవలసినవే అయినాయి.

భార్య అంటే చాకిరీకి నిర్దేశించబడిన వస్తువు. తెల్లవారుఝామున డ్యూటీకి వెళ్ళే భర్తకు కాఫీ కాచి యివ్వటం దగ్గర నుంచి పనిముగించుకొని వచ్చాక ఏకొరతా లేకుండా వండి వడ్డించేంతవరకు సవాలక్ష పనులు ఉదయాన్నేకాఫీ కాచి యివ్వలేదని ఒకసారి, పాలలో తోడు పెట్టటం మరచిపోయి భోజనంలోకి పెరుగు లేకుండా చేసిందని ఒకసారి వెంకట్రావు, అతని తల్లి కూడా జానకిని వేధించిన తీరు సాధించిన తీరు ఆమెనొక పనియంత్రంగా చూడటాన్నే సూచిస్తుంది. పాలూ, కాఫీడికాషను అక్కడే వున్నాయి కాస్తవెచ్చ బెట్టుకొని తాగకూడదా అన్నందుకు జానకికి లభించినవి చెంపదెబ్బలు. ఏం కొట్టావా అని సత్యం నిలదీస్తే నాయిష్టం నా పెళ్ళాన్ని నేను కొట్టుకొంటానన్నది వెంకట్రావు జవాబు. భార్యలను హింసించటానికి భర్తలకు సర్వాధికారాలిచ్చింది కుటుంబం.

భర్తకు భార్య చదువుకొనాలన్న కోరికను, ఆర్థిక స్వాతంత్రాభిలాషను అణచివేసే హక్కువుంది. స్త్రీలు చదువుకొని ఉద్యోగం చేసి వాళ్ల కాళ్ళమీద వాళ్ళు నిలబడేటట్లయితే మొగుడెందుకూ ఇంక అంటాడు వెంకట్రావు. స్త్రీలు తాము కాళ్ళమీద తాము నిలబడకుండా మొగుడిమీద ఆధారపడివుండాలి. ఆధారపడి వుంది కదా అని ఆమెను ఎంత లోకువ చేయటానికైనా అవకాశం ఆ రకంగా మిగుల్చుకొంటాడన్నమాట అతను. భర్త అన్న వాడికి తన శరీరం మీద సర్వహక్కులూ వున్నాయన్న భావనను స్త్రీలో పెంచి పోషిస్తుంది కుటుంబం. తన ఇష్టం, ఉత్సాహం, హక్కుల గురించిన కనీస స్పృహ కూడా వాళ్ళకు కలగనీయదు. అందుకే జానకి అత్త ఇంట్లో లేదని అబద్ధం చెప్పి తనను పుట్టినింటి నుండి తిరిగి తీసుకొచ్చాడన్న కోపంలో దుఃఖంలో వుండి వుత్సాహమే లేని మానసికస్థితిలో అతనితో సంబంధానికి ఇష్టపడదు. కానీ అతని కోరికను తాను తిరస్కరించటం అగౌరవకరంగా భావించి అపరాథ భావంతో బాధపడుతూ రెండవసారి అతని ఆహ్వానానికి ఏ అభ్యంతరమూ లేకుండా లొంగిపోతుంది. అంటే కుటుంబంలో స్త్రీ లైంగికత స్త్రీ ఇష్టానికి సంబంధించినది కాదు భర్త హక్కు అన్న భావన ఎంత బలంగా వేరూనుకున్నదో అర్థం చేసుకోవచ్చు. స్త్రీ శరీరానికి, స్త్రీ లైంగికాసక్తులకు స్త్రీని పరాయికరించిన అధికార వ్యవస్థ అస్తిత్వంలో వున్న కుటుంబం.

కుటుంబంలో భార్య అంటే ఇంటికి కావలసిన సమస్త చాకిరీ అవిశ్రాంతంగా చేసిపెట్టే యంత్రం మాత్రమేకాదు. భర్త కోసం పుట్టింటి నుండి ఎప్పుడయితే అప్పుడు అడిగినంత అదనపు కట్నం సమకూర్చిపెట్టే వనరు కూడా. పెళ్ళిలో జానకి తండ్రి పెడతానని పెట్టలేకపోయిన వెండి కంచం గురించిన సాధింపు దానిని సూచించేదే. జానకి జీవితం మీద జానకికి ఏ అధికారమూ లేదన్న విషయానికి పరీక్షలకు చదువుకొందామని ఆసక్తి వున్నా అన్న దానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నా భర్తను అడగకుండా, భర్త అనుమతి లేకుండా ఆ పని చేయటానికి వీలులేని స్థితిలో వుండటమే గుర్తు. ఇంట్లో పనులన్నీ చేసుకొన్నాకే చదువు కొంటానని అతని దయకు, అనుమతికి దేబరించి దెబ్బలు తిని భంగపడటంలోనే స్త్రీల జీవిత పరాధీనత వ్యక్తమవుతుంది.

పరీక్షల కోసమేకాదు జానకి ఏ మానసిక వికాసానికి, జ్ఞానాభివృద్ధికి కూడా చదువుకొనటానికి వీల్లేదు. ఆమె ఏమీ చదువుతున్నదా అని ఆరాలు తీయటం, రాత్రిళ్ళు చదువుకొంటుంటే కరెంటు ఖర్చు అవుతున్నదని యాగీ చేయటం, ఆమె చదువుతున్న పుస్తకాలను చింపిపోగులు పెట్టటం, ఎందుకు చదివావిని సాధించటం ఇవన్నీ కుటుంబంలో స్త్రీ జ్ఞానచైతన్యాలు వికసించకుండా తీసుకునే జాగ్రత్త యొక్క అత్యంత నికృష్ట వ్యక్తీకరణ. బహిష్టు సమయంలో బయట కూర్చొనటం ఇష్టంలేని జానకి తన అభిప్రాయాన్ని భర్త, అత్త గుర్తించి ఆమోదించటం లేదని నిరసనగా అన్నం తిననని కూర్చొంటుంది. ఎందుకు తినవని నిలదీస్తూ తినమని ఒత్తిడిపెట్టే వెంకట్రావును నా తిండి గురించి కూడా మీ పెత్తనమేనా అని ప్రశ్నిస్తుంది. ఇది అధికార ధిక్కారంగా భావించి వెంకట్రావు ఆమెను చెంపమీద నుంచి కొడతాడు. అన్నం తినకపోతే తన ఇంట్లో వుండటానికి వీల్లేదని ఎక్కడికి పోతావో పొమ్మని బెదిరిస్తాడు. పెళ్లయిన దగ్గర నుండి తన శ్రమనంతా ఏ ఇంటిని చక్కదిద్దటానికి ధారపోస్తున్నదో ఆ ఇల్లు ఇప్పటికీ స్త్రీది కాని ఒక సామాజిక దుస్థితిని ఇది ప్రతిబింబిస్తుంది.

స్త్రీ కుటుంబంలో భర్త మీద ఆధారపడి జీవించే మనిషి గనుక స్వతంత్రించి ఆమె పొరుగింటి వాళ్ళకు అప్పులియ్యటానికి కూడా వీలులేదు. జానకి విశాలాక్షికి కందిపప్పు ఇయ్యటాన్ని అత్త అభ్యంతర పెట్టటం, విశాలాక్షి కొడుకుకు ఒంట్లో బాగా లేనప్పుడు ఆర్థిక సహాయం చేయటం, తోడుగా డాక్టరు దగ్గరకు వెళ్ళటం ఇవన్నీ వెంకట్రావుకు అతని తల్లికీ అభ్యంతరకరమే అయినాయి. ఆమెను నిలదీసి యాగీ చేశారు. చాలా సందర్భాలలో అత్త పోలీసు స్థానంలోనూ భర్త న్యాయాధిపతి స్థానంలో నిలబడి జీవితాల మీద తీర్పులు ఇస్తుంటారు. వెంకట్రావు తల్లి వెంకట్రావు దీనికి మినహాయింపు కాదు. వెంకట్రావు తల్లి కోడలు ఎక్కడ నించుంది ఎవరితో మాట్లాడింది, ఏం చేసిందీ నిఘా వేసి చూస్తుంది. న్యాయాధిపతి విచారణ నేరారోపణ, నిందితురాలి వాదనకు జవాబు చెప్పలేని తికమకతో చెంపదెబ్బనే తీర్పుగా శిక్షను అమలుచెయ్యటం అతని పద్ధతి. ఎంత అల్పుడైనా మొగవాడైనా పాత కుటుంబ వ్యవస్థలో భార్య జీవితం మీద పెత్తందారై పీల్చుకు తినటానికి అలవాటుపడతాడన్న విషయాన్ని గట్టిగా నిరూపించింది ఈ నవలేతి వృత్తం.

జానకి ఇష్టాలను, జానకి శుభ్రతను, జానకి పనిపాటల శక్తిని, జానకి తల్లిదండ్రులను, అన్నను, స్నేహితులను, జానకి ప్రేమను, జానకి కోపాన్ని, జానకి నిరసనలను, జానకి శరీరాన్ని - సమస్తాన్ని నిర్లక్ష్యంచేసి, అవహేళన చేసి అవమానపరచి హింసించే కుటుంబం చివరికి జానకికి వదులుకోవలసే వచ్చింది. నిజానికి జానకి ఆ కుటుంబాన్ని పట్టుకొని నిలబడటానికి తన జీవశక్తులన్నింటిని కూడగట్టుకొని ప్రయత్నించింది. వెంకట్రావు దగాకోరుతనం ఎప్పటికప్పుడు తెలుస్తున్నా, అతనిలో ఏదో మంచి అనేది తన కోసం నిలచే వుందని నమ్ముతూ అతను తనపట్ల కాస్త దయగా ప్రవర్తిస్తే చాలుననుకొని ఎప్పటికప్పుడు తెలుస్తున్నా అతనిలో ఏదో మంచి అనేది తన కోసం నిలచివుందని నమ్ముతూ అతనుతనపట్ల కాస్త దయగా ప్రవర్తిస్తే చాలననుకొని ఎప్పటికప్పుడు అతనిని క్షమిస్తూనే వుంది. అటువంటి జానకి తానిక కుటుంబాన్ని విడిచి వెళ్ళటం అనివార్యం చేసినవాళ్ళు అత్త భర్త మాత్రమే. స్త్రీలు కుటుంబాన్ని ధిక్కరించటానికి స్త్రీల ఉద్దేశ్యమే కారణం కాదు. కుటుంబ యజమానులమనుకొనేవాళ్ళ అధికార దురహంకారం, ఆధిపత్య స్వభావం అధికృత హింస. వాటినుండి పురుషులు పురుషుల ప్రయోజనాల కోసం స్త్రీలతో వైరుధ్యంలోకి వచ్చే పురుషాధికారంలో భాగస్వాములైన అత్త ఆడబిడ్డవంటి బంధువులు తమ తమ అధికార దుర్మార్గ స్వభావం నుండి విముక్తయితే స్త్రీ కుటుంబం నుండి విముక్తిని ఆశించదు. కుటుంబంలో మనుషులు పితృస్వామిక అధికార స్వభావాన్ని వదులుకొనే కొద్దీ ఆ కుటుంబం సమస్థాయి మనుషుల సంబంధాల కూడలిగా స్నేహసౌహార్ద్ర భావాలకు, ఆచరణకు నిలయంగా మారుతుంది. అంటే కుటుంబం మాయం కాదు. కుటుంబం తన స్వభావాన్ని పూర్తిగా మార్చుకొని ప్రజాస్వామికీకరించబడుతుంది. పాత కుటుంబాల స్థానంలో ఈ ప్రజాస్వామిక సంబంధాల కుటుంబాన్ని ఊహించారు రంగనాయకమ్మ. సత్యం కుటుంబాన్ని ఆ ఊహ ప్రాతిపదికగానే నిర్మించారు. సత్యం కుటుంబం అంటే దానికతను యజమాని అని చెప్పటం కాదు. సత్యంతదితరులు కలిసివున్న కుటుంబాన్ని గుర్తించి చెప్పటానికి వాడేసంకేతం మాత్రమే అది. సత్యం చొరవతో ఆ కుటుంబం ప్రజాస్వామికీకరించబడిందనీ చెప్పటమే ఉద్దేశ్యం.

ఇంటిపని ఆడవాళ్ళపని అన్న భావన నుండి బయటపడి పురుషులు ఇంటిపని చేయటం ప్రారంభించటం కొత్త కుటుంబ నిర్మాణంలో ఒకభాగం. సత్యం పెద్ద వయసులో వున్న తల్లిని ఇబ్బందిపెట్టకూడదని తాను ఇంటిపనిని ఇష్టంగా చేయటం మొదలుపెట్టాడు. అత్తింట్లో పెద్ద కష్టం నుండి బయటపడి వచ్చిన చెల్లెలు జానకికి శారీరక మానసిక విశ్రాంతినివ్వాలని తాను ఇంటి పని చేస్తాడు. అన్నం వండుతాడు. టీలు, కాఫీలు పెడతాడు, బియ్యం చెరుగుతాడు. వంటిల్లు సర్దుతాడు ఇలా ఏ పనైనా చేస్తాడు. నేర్చుకుంటే అన్నీ మగాళ్ళకు కూడా వచ్చే పనులేనన్న చైతన్యం పెంచుకుంటాడు. తల్లి దగ్గర, చెల్లిలి దగ్గర బాగున్న పురుషులందరూ భర్తలుగా భార్యలతో అదే స్థాయి స్నేహసంబంధాలతో వుంటారన్న నియమం ఏదీలేదు. కానీ సత్యం శాంతతో కూడా అదే పద్దతిలో ప్రవర్తించటం అభ్యాసం చేశాడు. భార్యను తక్కువగా చూసే ఏరకమైన వ్యక్తీకరణనైనా పసికట్టెయ్యగల నిశిత పరిశీలన అతనికి అలవడిందంటే అతను భార్యాభర్తల సంబంధం ఎంత సమస్థాయి సంబంధంగా వుండాలో వూహించుకొన్నాడన్నమాటే. ఒక ఆడమనిషీ మగమనిషీ పదినిమిషాలుకలసి వుండటం చూస్తే వాళ్ళు భార్యాభర్తలు అవునో కాదో చెప్పెయ్యవచ్చాంటాడు సత్యం. నీ మొహం అనో, ఏడిశావ్‌లెద్దూ అనో అనకుండా భార్యతో భర్త పదినిమిషాలు కూడా మాట్లాడలేడని పరిశీలనలో అతను అర్థం చేసుకున్నాడు. చేసుకొన్నాడంటే తనను తాను సంప్రదాయ భర్త నమూనా నుండి విముక్తం చేసుకొనే ప్రయత్నం ప్రారంభించాడనే అర్థం.

శాంత సత్యం కాపురంలో బంధుత్వ సంబంధాల పిలుపులను మానుకోవడం కుటుంబాన్ని ప్రజాస్వామికీకరించుకునే క్రమంలో జరిగింది. శాంతను ఒదినా అని పిలుద్దామనుకుంటూనే పూర్వంలాగే శాంతగారూ అని పిలుస్తుంటుంది జానకి. శాంత తమ్ముడు హరికి సత్యం అంతకుపూర్వం నుండి పరిచయమే అయినా శాంత సత్యాల కాపురం మొదలయ్యాక సత్యాన్ని బావగారూ అని సంబోధిస్తే అతనిని వారించాడు సత్యం. శాంత సుందరమ్మ గారిని కూడా అత్తగారని పిలవదు. పేరుపెట్టే అని పిలుస్తుంది, ఆమెకది ఇష్టం కాకపోతే ఎలా అని జానకి అంటే అత్తా అని పిలవటం తనకు ఇష్టంలేదు కనుక పేరుతో పిలవటం మానేసినా ఏమండీ అని మాత్రమే సంబోధించగలనంటుంది. శాంత, ఒదిన, బావ, అత్త, ఇవి సహజ సంబంధాలు కావు. సాంఘిక సంబంధాలు. సాంఘిక సంబంధాలలో అధికార సంబంధాలు కలిసిపోతాయి. భార్య భర్తను ఏమండీ అని మన్నించి పిలవటం మొదలైనవన్నీ భర్త అత్త ఆడబిడ్డల అధికారాన్ని గుర్తించి చెప్పేవి. ఆ అధికారానికి లోబడి జీవించటాన్కి స్త్రీకి మప్పేవి. స్త్రీ వైపు పురుషులకు మప్పేవి. ఈ అధికార ఆధీన సంబంధాల కుటుంబ వ్యవస్థను మార్చుకొనదలచిన కొత్తతరానికి ప్రతినిధులుగా సత్యం శాంత అల్లుడు అనే హోదాను, పిలుపును, బావగారూ అనే మన్నింపును, కోడలు అనే స్థాయిని అంగీకరించటానికి, గుర్తు పెట్టుకొని ప్రవర్తించటానికి ప్రయత్నపూర్వకంగా విముఖులైనారు. జానకి ఈ పాత వాసనల నుండి ఇంకా బయటపడలేక ఒదిన గారి ఎంగిలి కంచం తీయటానికి సందేహించి వదిలేసినపుడు సత్యం జానకి ఇద్దరూ స్వభావాలనుబట్టి స్నేహాన్నిబట్టి మనుషులకు విలువ ఇవ్వాలి కానీ బంధుత్వ అధికార సంబంధాలనుబట్టే కాదని చెప్పి జానకిలో మిగిలివున్న పాత భావాల తుక్కును వదలగొట్టారు. శాంతా సత్యం చనువుగా, స్నేహంగా చేసే సహజీవనం ఒకరి కోపాన్ని ఒకరు సహనంతో భరించటం, ఒకరిపట్ల ఒకరు దయతో క్షమతో సహనంతో వుండటం చేసేకొద్దీ జానకికి భార్యాభర్తల సంబంధానికి సంబంధించిన కొత్త విలులు అనేకం అర్థం కాసాగాయి.

శాంత ఇంటిపని చేయాలన్న ఆలోచన సత్యానికి అసలు వుండదు. ఎవరి పనుల మీద వారు బయటకు పోవటం, ఎవరికి వీలయితే వారు ఇంటిపని వంటపని చూచుకొనటం అతి సహజంగా జరిగిపోతుంటాయి. ఆ ఇంట్లో ఎవరు ఎవరికి పని అధికారంతో చెప్పినట్లుండదు. అట్లాగే జానకికి పిల్లవాడు పుట్టాక మామూలు కుటుంబాలలో లాగా పిల్లలు పెంపకం కేవలం తల్లికి సంబంధించిన వ్యవహారంగానో, ఆడవాళ్ళకు సంబంధించిన విషయంగానో లేకుండా పోవడం కూడా ఆ కుటుంబం స్వభావంలో వచ్చిన మార్పును సూచిస్తుంది. పిల్లాడికి నీళ్ళు పోయటం, దొడ్డికి వెళితే కడగటం వరకు అన్నిపనులు చేయటానికి సంతోషంగా సిద్ధమవుతుంటాడు సత్యం. సత్యం పురుషుడిగా తనకు పితృస్వామిక సమాజం ఇచ్చిన సర్వాధికారాలను వదులుకొనే

క్రమంలో అధికారానికి చిహ్నమైన మొగాడన్న మాటను కూడా ఒక్కవెక్కిరింతగానే స్వీకరించాడు. అందుకే తల్లి జానకి కొడుకు అల్లరి గురించి చెప్తూ "సత్యాన్ని "పిల్లలకి మొగాళ్ళ భయం వుండాలి సత్యం !'' అని హెచ్చరించినప్పుడు అవును, మొగాళ్ళ భయం వుండాలి'' అని తల్లిని ఆమోదిస్తున్నట్లే మాట్లాడి మనింట్లో అందరం ఆడవాళ్ళమైపోతిమి అని విచారాన్ని వ్యక్తం చేశాడు. మగవాడిగా తన అధికార లక్షణాలను వదులుకొన్నాడు గనుక తాను మగవాడన్న మాటకు తగనని అతని అభిప్రాయం. అధికార లక్షణానికి చిహ్నమైన మగాడన్న మాటతో తనను తాను చూచుకొనటం తనను తాను వ్యక్తీకరించుకొనటం అతనికి ఇష్టంలేదు. అందుకే పిల్లవాడికి బుద్ధిచెప్పటానికి మనింట్లో అందరం ఆడవాళ్ళమై పోతిమి అని తనను ఆడవాళ్ళతో కలుపుకొనటమే గౌరవకరంగా భావించి చెప్పాడు సత్యం. ఆ రకంగా మగవాళ్ళు అధికార స్వభావాన్ని ఆడవాళ్ళు ఆధీనతా లక్షణాన్ని వదిలేసుకొనే ప్రయత్నంలో నిర్మించుకునే సహజీవన సౌందర్యం కుటుంబం రూపురేఖలనే మారుస్తుందని అలాంటి కుటుంబాల కోసమే పీడిత స్త్రీల వేదనా, పోరాటమూ అని సమర్థవంతంగా ఈ నవలేతి వృత్తంలో నిరూపించారు రంగనాయకమ్మ.

## ఇ) స్త్రీల చైతన్యం - విముక్తి :

జన్మజన్మల బంధం, పవిత్ర బంధం, పాతివ్రత్య బంధం, ధర్మార్థ కామమోక్ష సాధనకు ఆలంబనమైన కుటుంబ బంధం అంటూ స్త్రీ పురుష సంబంధాన్ని స్వర్గమర్త్యాలకు ముడివేస్తూ కీర్తించే సాంస్కృతిక భావజాలం ధర్మసూత్రాల రూపంలో, ఇతిహాస కథాజ్ఞాన రూపాలలో విస్తృతంగా సృష్టించబడింది. పుట్టినప్పటి నుండి ఆడపిల్లలను స్త్రీలుగా, మగపిల్లలను పురుషులుగా తయారుచేసే వివక్షా సంస్కృతి అందులోని హింసను పైకి కనబడనీయని మాయా స్వభావంతో తనపని తాను చేసుకొని పోతుంటుంది. అధికారం తమ సహజలక్షణంగా పురుషులు, అధీనత తమ సహజ లక్షణంగా స్త్రీలు ఆమోదించి ఆవలయాలలోనే పరిభ్రమిస్తుంటారు. ఇది మొత్తంగా స్త్రీల వ్యక్తిత్వ వికాసానికి అవరోధం కనుక స్త్రీలకు హానికరమైంది. పురుషులను సహజ మానవీయత నుండి దూరం చేస్తుంది కనుక ఆ మేరకు వాళ్ళకు కూడా హానికరమైందే. జానకి విముక్తి నవల స్త్రీలకు అత్యంతమూ హానికరమైన స్త్రీ పురుష సంబంధాలను విమర్శకు పెట్టింది. స్త్రీలు చైతన్యవంతులయి తమ అధీనతను గురించిన స్పృహను పొందితే అది స్త్రీ విముక్తికి మొదటి మెట్టవుతుంది. బానిసకు బానిసనన్న గ్రహింపు కలగటమే బానిస విముక్తికి మొదటి మెట్టన్న లెనిన్ మాట ఇక్కడ పూర్తిగా వర్తిస్తుంది. అందువల్లనే రంగనాయకమ్మ ఈ నవలలో స్త్రీ ఎంత బానిసత్వంలో వుందో ఎంత అధికారాన్ని భరిస్తున్నదో స్త్రీలకు తెలియజేయాలన్న ఉద్దేశంతో ఇతివృత్తాన్ని మలిచారు.

నీళ్ళతొట్లు రుద్దికడగటం, ఇళ్ళు బూజులు దులిపి కడగటం, బట్టలుతికి గంజిపెట్టి ఆరెయ్యటం, వంట చెయ్యటం ఇలాంటి సవాలక్ష పనులతో నిరంతరం ఇంటి చాకిరినీ చేస్తూ అత్తభర్తల అదిరింపులు బెదిరింపులు, సాధింపులు భరిస్తూ భర్తచేత దెబ్బలు తింటూ అవమానపడుతూ,దుఃఖపడుతూ, అతను కోరినప్పుడల్లా వాంఛా పరితృప్తికి దేహాన్ని అర్పిస్తూ, చదువుకొనటానికి గానీ, పరీక్షలకు కట్టటానికిగానీ, అవసరానికి పక్కింటివాళ్ళకి అప్పు ఇయ్యటానికిగానీ, వాళ్ళ కష్టంలో పాలుపంచుకొనటానికిగానీ స్వతంత్రం లేక ఎంతటి బానితస్వంలో జానకి మగ్గిపోతున్నదో చూపించారు. పోషణ బాధ్యత వహించిన భర్త చేసే అధికారం క్రింద విశాలాక్షి ఎలా మగ్గిపోతున్నదో చూపించారు. విశాలాక్షి చెల్లెలు సుశీలను ఆమె భర్త అక్కాచెళ్ళెళ్ళ ఇంటికి, పుట్టింటికీ కూడా పంపక ఎంత హింసిస్తాడో, ఆమె మీద తన సంపూర్ణాధికారాన్ని ఇంట్లోనైనా వీధిలోనైనా ఎలా చూపించుకొంటాడో చిత్రించారు. భార్య అందాన్ని భరించలేక పాడుచేసే భర్తని అలాంటి భర్తని గత్యంతరం లేక భరిస్తూ సంసారం చేసే పార్వతులను, భర్తకు ఇష్టంలేని ఉద్యోగ జీవితాలను వదులుకొనటానికి సిద్ధపడే శకుంతలను, సంధ్యలను చూపించారు. ఆ ఇంటా ఈ ఇంటా పనిపాటలు చేసుకుంటూ పిల్లల్ని భర్తను కూడా పోషించే నర్సమ్మమీద భర్త చేసే పెత్తనం, దౌర్జన్యం చూపించారు. తాను ప్రేమించి పెళ్ళాడానని తన జీవితం ఎంతో బాగుందని అనుకొనే హేమ జీవితంలో ఆమెకే తెలియని కనిపించని హింస ఎంత వుందో సూచించారు. ఇన్ని ఉదంతాల ద్వారా ఇందరు స్త్రీల జీవితానుభవాల ద్వారా స్త్రీల జీవితం బానిసత్వంలో వుందన్న

విషయాన్ని భర్త యజమాని భార్య బానిసగా జీవిస్తున్న దాంపత్య జీవిత విషాదాన్ని సూచించారు, చూపించారు. అయినా ఈ అవగాహనను మరింత స్పష్టంగా స్త్రీలకు కలిగించాలన్న తపనతో సత్యంచేత స్త్రీకి బానిసకు వున్న పోలికలను చూపించే ఒక పట్టికను తయారుచేయించి తల్లికి, చెల్లెలికి చూపించి వివరించినట్లుగా ఒక సన్నివేశాన్ని కల్పించారు.

కూతురు కాపురం వదిలివేసి వచ్చిందని బాధపడుతున్న సుందరమ్మతో తర్కిస్తూ సత్యం స్త్రీల జీవితం ఆమె అనుకొంటున్నట్లు సుఖంగా ఏమీలేదని అర్థం చేయించటానికి బానిసలకు స్త్రీలకు వున్న పన్నెండు పోలికలు చూపిస్తూ ఆ పట్టిక తయారుచేశాడు. 1) బానిసల బతుకులు యజమానుల దయాదాక్షిణ్యాలపైనా స్త్రీల బ్రతుకులు పురుషుల దయాదాక్షిణ్యాల పైనా ఆధారపడి వుంటాయి. 2) బానిసలు, స్త్రీలు కూడా స్వతంత్ర వ్యక్తులు కారు. 3) బానిసలకు స్త్రీలకు స్వంత ఇంటి పేర్లుండవు. 4) బానిసలకు స్త్రీలకు పిల్లల మీద హక్కులుండవు 6) బానిసలకు స్త్రీలకు తమ శరీరాల మీద శరీరాల మీద తమకే హక్కులుండవు. వాటిని యజమానుల సేవకు, కోర్కెలు తీర్చటానికి తమ ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా వినియోగించాల్సిందే. 7) బానిసలు స్త్రీలు యజమానుల భర్తల కోపాన్ని, శారీరక దౌర్జన్యాలకు భరించాలి. 8) ఇద్దరికీ ఓటు హక్కులేదు. స్త్రీ తన ఓటు హక్కును భర్త ఆజ్ఞనుబట్టే వినియోగించాలి. 9) బానిసలు స్త్రీలు నిరంతరం శ్రమ చేస్తూ వుండవలసినవాళ్ళే. 10) బానిసలకు స్త్రీలకు ఆర్థిక సాంఘిక రాజకీయ రంగాలలో యజమానులతో, భర్తలతోపాటు సమానత్వమనేదీలేదు. 11) బానిసలకు స్త్రీలకు వినయవిధేయతలు బోధిస్తాయి ధర్మశాస్త్రాలు. 12) బానిసకైనా, స్త్రీకైనా యజమానిని, భర్తను వదిలిపోవటం తగనిది, నేరం. అలా చేసినవాళ్ళకి సమాజంలో గౌరవం వుండదు. ఈ రకంగా ఇన్ని పోలికలను చూపించటం ద్వారా రంగనాయకమ్మ స్త్రీలు ఈ సమాజంలో ఎంత వివక్షతకు గురిఅవుతున్నారో, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, హక్కులు లేని జీవితాన్ని ఎలా జీవిస్తున్నారో తెలియజేశారు. తాను బానిసనన్న విషయం అనుభవం నుండి తెలుసుకొంటూ ఈలాంటి అధ్యయనాల నుండి ధృవపరచుకొంటూ వుంటే స్త్రీలు ఆ బానిససంకెళ్ళ నుండి విముక్తికి ప్రయత్నించే నూతన చైతన్యాన్ని అభివృద్ధి పరచుకొంటారు. జానకి ఈ రకమైన చైతన్యాన్ని అభివృద్ధిపరచుకొంది. శాంత అక్క హేమ లాంటి వాళ్ళు ఈ వాస్తవాన్ని గుర్తించటానికే నిరాకరిస్తూ అదే సుఖమని అందులో మునిగి తేలుతుంటారు. అలాంటి స్త్రీల పట్ల వ్యతిరేకత, ఏటికి ఎదురీదినట్లుగా అస్తిత్వంలో వున్న వివక్షాపూరిత విలువలతో సంస్కృతితో సంఘర్షిస్తూ స్వతంత్రులుగా ఎదగటానికి ప్రయత్నించే స్త్రీల పట్ల గౌరవం జానకి విముక్తి నవలలో స్పష్టంగా కనబడుతుంది.

## 20.3 విశ్లేషణ :

ఆడపిల్ల పుట్టింది మొదలు కుటుంబంలో కూతురిగా, అక్కగానో, చెల్లెలిగానో వివక్షకు గురిఅవుతుంటుంది. పెంపకంలో అవకాశాల పంపకంలో ఈ వివక్ష ప్రతిఫలిస్తుంది. పెళ్ళయితే అత్తగారింట కోడలిగా, ఒదినగానో మరదలుగానో వివక్షకు గురి అవుతుంది. అన్నిస్థాయి సంబంధాలలోనూ అణుకువ, విధేయతా, సేవాభావం, సహనం స్త్రీ నుండి ఆశిస్తుంది కుటుంబం. ఈ క్రమంలో స్త్రీ పడే వేదన, హింస, వివక్ష నుండి విముక్తికి చేసే పెనుగులాట ఈ నాణెంతో పరిగణలోనికి వస్తుంది.

స్త్రీ సమస్య గురించిన చర్చలో స్త్రీ పురుష సంబంధంలోని వివక్ష మరొక ముఖ్యాంశం. లైంగిక సంబంధాలలో పురుషుడి అనుభవం ప్రధానమై స్త్రీ సాధనం మాత్రమే అయిన స్థితి స్త్రీల లైంగికత మీద పురుషుడి ఆధిపత్యాన్ని స్థిరీకరించింది. ఇది పునరుత్పత్తి హక్కులను స్త్రీలకేమీ మిగల్చలేదు. స్త్రీ శరీరం మీద స్త్రీకి హక్కు, సంతానం మీద స్త్రీకి హక్కు ఈనాడు చర్చనీయాంశాలయినాయి.

పిల్లల్ని కనాలా వద్దా అన్న విషయంలో కానీ, ఎపుడు ఎంతమందిని కనాలా అనే విషయంలో కానీ నిర్ణయాధికారం లేని స్త్రీలు పిల్లల పోషణ విషయంలో మాత్రం పూర్తి బాధ్యత వహించవలసి రావటం స్త్రీకి సంబంధించిన మరొక సమస్య. నవమాసాలు

మోసి కనటమే కాక ఎంతో శ్రమకోర్చి నిద్రకాచి, పిల్లల్ని పెంచాలి. పిల్లల పోషణ విషయంలో ఆమె బరువు బాధ్యతలను పంచుకొనే వాళ్ళే వుండరు. పిల్లలు అభివృద్ధిలోకి వస్తే అది తండ్రి సామర్థ్యంగా చెడిపోతే తల్లి కారణంగా చెప్పబడే సంస్కృతి స్త్రీ మీద ఒత్తిడిని పెంచుతుంది. కనుక ఇది కూడా ఈనాడు చర్చనీయాంశమైంది.

ఇంటిపని స్త్రీకి సంబంధించిన మరొక ప్రధానమైన సమస్య. స్త్రీకి విద్య అంటే గృహకృత్య నిర్వహణమేనని ధర్మశాస్త్రాలు ఏనాడో స్థిరీకరించినదే స్త్రీ జీవితాన్ని ఈనాటికి నాలుగు గోడలకు బందీచేసి వుంచింది. నిరంతరం ఏ సృజనాత్మకతతో సంబంధం లేని విసుగు కలిగించే ఇంటిపనిలో స్త్రీలు మగ్గిపోతూ సామాజిక జీవనసంబంధాలకు పరాయీకరింపబడ్డారు. సామాజిక జీవన రంగంలోకి ప్రవేశించిన స్త్రీలకు కూడా ఇంటిచాకిరీ తప్పనిదే అవుతున్నది. ఇంటిపని బయటపని చక్కబెడుతూ స్త్రీ చేసే ద్విపాత్రాభినయం ఆమెను ఎంత హింసకు, అలసటకు, విరక్తికి గురిచేస్తుందో గుర్తించటం జరిగింది. ఇంటిపని విషయంలో చర్చకు అది కారణమైంది.

ఆర్జన లేని స్త్రీలు అస్వంత్రులు అనుకొంటే ఏదో ఒకరకమైన సంపాదనగల స్త్రీల పరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదు. డాక్టరు వంటి ఉన్నత వృత్తుల్లో వున్నవాళ్ళ దగ్గర నుండి పనిపాటలు చేసుకునే వాళ్ళవరకు స్త్రీలు తమ సంపాదన మీద తన జీవితాల మీద ఏ అధికారములేని అధీన స్థితిలోనే జీవించాల్సి వస్తున్నది. సమాజంలో, సామాజిక జ్ఞానరంగాలలో స్త్రీలు చివరి అంచులకు నెట్టివేయబడ్డారు. తద్వారా స్త్రీల మీద పురుషులకు కుటుంబానికి తిరుగులేని ఆధిపత్యం స్థిరపడుతున్నది. ఈ క్రమంలోని రాజకీయాల అవగాహన ఈనాడు పెంపొందింది. కుటుంబంలో స్త్రీ పురుష సంబంధాలలో, పునరుత్పత్తి విషయంలో, పిల్లల పెంపకం ఇంటిపని మొదలైన విషయాలలో సామాజిక జ్ఞానరంగాలలో స్త్రీ ఎదుర్కొంటున్న అణచివేతను దానికి మూలకారణాలను గుర్తించి స్త్రీ విముక్తికి కొత్త మార్గాలను, అన్వేషించే పని ప్రారంభమై కొనసాగుతున్న సామాజిక నేపథ్యం నుండి జానకి విముక్తి నవల వచ్చింది. కుటుంబంలో భార్యగా స్త్రీ వరకట్నం వంటి ఆర్థిక సమస్యకు, ఎడతెగని ఇంటిచాకిరికి, ఇష్టంగాకాక అధికారానికి లోబడి మొక్కుబడిగా శరీరాలను అర్పించుకొనటానికి, పిల్లల్ని కనిపెంచటానికి, ఒంటరిగా వాళ్ళబాధ్యతలు మోయటానికి, బలి అవుతున్న విధానాన్ని రకరకాల స్త్రీల జీవితాల ద్వారా చూపించింది. ఈ క్రమంలో రంగనాయకమ్మ స్త్రీ అణచివేతకు పితృస్వామ్యం కారణమని సరిగ్గా గుర్తించి చెప్పారు. పితృస్వామ్యం పురుషుడికి వారసత్వంగా సంక్రమించే ఆస్తిహక్కుతోటి, ఉత్పత్తి రంగం పురుషుడిగా, పునరుత్పత్తి విధులు స్త్రీవిగా చేయబడి పురుషుడి జీవితాన్ని సామాజిక రంగానికి విస్తరింపచేసి స్త్రీ జీవితాన్ని కుటుంబానికి కుదించివేసిన శ్రమ విభజనతోటి ముడిపడి వున్నది. పునాది అయిన స్వంత ఆస్తిని రద్దుచేయటం ద్వారా స్త్రీ సమస్యకు మూలంగా వున్న పితృస్వామ్యాన్ని కూడా తొలగించటానికి వీలవుతుంది. ఆ అవగాహనతోనే రంగనాయకమ్మ ఈ నవలలో స్త్రీ సమస్యను కమ్యూనిస్టు సమాజ నిర్మాణంతో అనుసంధించే చర్చించారు. మూర్తి సత్యం మధ్య జరిగిన చర్చలు, కమ్యూనిస్టు విప్లవాలు విజయవంతమైనప్పుడు ఆ సమాజాలు స్త్రీల సమస్యను చర్చించి పరిష్కరించే తీరును గురించి సత్యం జానకి లాంటి వాళ్ళు కన్నకలలు, శాంత వినిపించిన వాస్తవ జీవితానుభవంలోని విడాకుల కేసు వంటివి అందుకు మంచి సాక్ష్యాలు.

అయితే స్వంత ఆస్తిలేని కమ్యూనిస్టు సమాజ స్థాపనా ప్రక్రియ దీర్ఘకాలికమైంది. శ్రామికవర్గ రాజ్యాధికార పర్యంతం అది కొనసాగుతుంది. దానికోసం జరిగే ప్రయత్నాలు జరుపుతుండగానే పునాది మార్పుకు సంబంధించిన ఉద్యమాలు నిర్మించబడుతుండగానే ఉపరితలంలో తదనుగుణమైన భావజాలాన్ని ప్రోది చేయవలసి ఉంటుంది. స్త్రీ సమస్య ప్రస్తుత అంశం కనుక దానికి కారణమైన పితృస్వామ్య భావజాలాన్ని తొలగిస్తూ స్త్రీ పురుష సమానతా సంస్కృతిని నిర్మించుకునే పని చేసుకుంటూ పోవాలి. రంగనాయకమ్మ ఈ నవలలో చేసింది ఆ పనే. వంటపని ఆడవాళ్ళే చేయాలా అన్న ప్రశ్నను స్టడీసర్కిల్ మిత్రుల మధ్య చర్చకు తేవటం ఆడపనిగా మగపనిగా విభక్తమైన శ్రమవిభజన క్రమంలోని అంతరాన్ని ఎలా తగ్గించవచ్చునో

సత్యం, ప్రభాకర్ మొదలైన వాళ్ళ ఆచరణల ద్వారా చూపించటం, వంట చేయటం ఇల్లు సర్దటం మాత్రమే కాదు పిల్లవాడికి ముడ్డికడగటం వరకూ మగవాడైనా చేయదగిన పనులేనని సూచించటం శాంత ద్వారా స్త్రీల గర్భంపై స్త్రీల హక్కును ప్రతిపాదించటం, ఆ హక్కులను గౌరవించే సంస్కార స్థాయికి పురుషులు ఎదగటానికి సత్యం పాత్ర ద్వారా చూపించటం, సంతానంపై తల్లిహక్కును జానకి జీవితం ద్వారా స్త్రీ పురుషులు చేసిన చేయవలసిన సమిష్టి కృషికి స్థిరీకరించటం - ఇవన్నీ పితృస్వామ్య భావజాలాన్ని రద్దుచేసి స్త్రీ పురుష సమానతా సంస్కృతి నిర్మాణానికై సంబంధించినవ. అంతేకాదు రాజకీయాలు, సాహిత్యం, సామాజిక విజ్ఞానం మొదలైనవన్నీ స్త్రీలకు సంబంధించినవి కావన్న స్థితి నుండి అవి స్త్రీ పురుషులిద్దరూ పంచుకొనవలసినవేనన్న సంస్కారాన్నిఅభివృద్ధి చేసుకొనటం వరకు మనుషులు ఎదగటాన్ని ఆశించింది. సత్యం ఇంట్లో అటువంటి వాతావరణాన్ని సృష్టించి చూపింది. అందువల్లనే జానకి విముక్తి మంచి ఆలోచనా ప్రేరకమైన నవల కాగలిగింది.

## 20.4. సారాంశము :

జానకి విముక్తి నవలా కథ **1975** తరువాత **1981** వరకు ఆరేడేళ్ళకాలం మీద విజయవాడ హైదరాబాదు ప్రాంతాలను చుట్టుకొని ప్రవర్తించిందని, నవలేతి వృత్తంలోని అంతర్గత సాక్ష్యాలను బట్టి కూడా ఈ నవల కథ నాలుగేళ్ళకాలం మీద ప్రవర్తించినట్టు తెలుస్తుందని, స్త్రీల సమస్యల గురించి వీరేశలింగం పంతులు నుండి ఎంతోమంది సాహిత్యాన్ని సృష్టించినా స్త్రీ విముక్తికి సంస్కరణోద్యమం దగ్గర నుండి ఎన్ని ఉద్యమాలు పనిచేసినా స్త్రీల కోణం నుండి స్త్రీల సమస్యల గురించిన సాహిత్యం, ఉద్యమాలు **1960**ల తరువాతే వచ్చాయని, రంగనాయకమ్మ ఆ నేపథ్యంలో రచనలు చేసిన స్త్రీ కనుక స్త్రీల అనుభవకోణం ఒక ప్రత్యేకతను ఆమె సాహిత్యానికి కలిగించిందని, స్త్రీల అనుభవకోణం నుండి స్త్రీ సమస్య జానకి విముక్తి నవలలో చర్చకు వచ్చిందని ఈ పాఠాలలో నిరూపించడం జరిగింది. కుటుంబం యొక్క అణచివేత స్వభావాన్ని చిత్రించటంతోపాటు రంగనాయకమ్మ ప్రజాస్వామికీకరించబడే క్రమంలో రూపొందే మానవీయ సంబంధాల కుటుంబాన్ని కూడా ఈ నవలలో చక్కగా చూపించగలిగారని, కుటుంబం యొక్క అణచివేత స్వభావం అర్థమైతే కానీ స్త్రీలకు కుటుంబం నుండి విముక్తి లేదు కనుక వాళ్ళకు ఆ చైతన్యం కలిగించడం కమ్యూనిస్టుల కనీస కర్తవ్యం అని భావించిన రంగనాయకమ్మ బానిసలకు స్త్రీలకు వున్న పోలికలను పట్టిక ద్వారా సూచించారని, స్త్రీలను, రైతులు, కార్మికులుమొదలైన శ్రామిక వర్గంతో పోల్చి చెప్తూ నవలలో అక్కడక్కడా చేసిన వివరణలు సామాజిక మార్పుకు శ్రామిక వర్గాలతోపాటు శ్రమించాల్సినవాళ్ళు స్త్రీలన్న అవగాహనను కూడా అందించారని రెండవపాఠం పూర్తయ్యే సరికి మీకు అర్థం అవుతుంది.

మూడవ పాఠంలో స్త్రీవాదం ముందుకు తెచ్చిన ముఖ్యమైన అంశాలను లింగవివక్ష, లైంగికస్వేచ్ఛ, ఇంటిపని, ఆర్థిక స్వాతంత్ర్యం మొదలైన విషయాలు ఈ నవలేతి వృత్తంలో ఎలా భాగమైనాయో వివరించటం జరిగింది. మొత్తం మీద ఈ నవల జానకి పాత్ర ద్వారా భార్యగా కోడలిగా తనను తాను అభావం చేసుకొని ఎవరి అవసరాల కోసమో, ప్రయోజనాల కోసమో జీవించటం కన్నా స్త్రీ తన కోసం తాను బ్రతకటంలో వికాసం, ఆత్మగౌరవం, ఆనందం వున్నాయన్న విషయాన్ని స్పష్టం చేయగలిగింది. స్త్రీలను మరబొమ్మల స్థాయి నుండి సజీవమైన మానవ వ్యక్తులుగా ఎదగటానికి ఆశావహమైన కొత్త జీవితాచరణను స్త్రీ పురుషులకు ఈ నవలలో రంగనాయకమ్మ చూపగలిగారు.

## 5. సాంకేతిక పదాల వివరణ :

### 1) పితృస్వామ్యం :

తండ్రి పరిపాలన అని అర్థం. పురుషులు, పురుషులకు సంబంధించిన స్త్రీలు స్త్రీలపై ఆధిపత్యం చలాయించటానికి, అణచివేయటానికి దోపిడీ చేయటానికి అనువైన సాంఘిక నిర్మాణాలతో పద్ధతులతో కూడిన వ్యవస్థ, విధానమూ కూడా.

కుటుంబం మొదలైన సాంఘిక వ్యవస్థలు, ఆర్థిక రాజకీయ న్యాయ మత వ్యవస్థలు ఈ విధానంలో రూపొందివేనవే. కనుక అంతిమంగా అన్నీ స్త్రీలపట్ల అణచివేత సాధనాలుగానే వుంటాయి.

## 20.5 పునాది - ఉపరితలం :

మార్క్సిస్టు తత్వశాస్త్రంలో తరచు వీటిని వాడతారు. పునాది పైకి కనిపించకుండా లోపల ఉండేది. నిర్మాణం బరువునంతా మోసేది అదే. పునాది ఆర్థికరంగం. ఉత్పత్తి విధానం. ఆ పునాది పైన ఉపరితలంలో అంటే పైన అందరికీ కనిపించేవి. కుటుంబం, మతం, సాహిత్యం, కళలు,రాజకీయాలు అన్ని ఉపరితలాంశాలు. పునాదిలోని ఆర్థికాంశమే ఉపరితలాంశాల స్వరూప స్వభావాలను నిర్ధారిస్తుంది. ఉపరితలాంశాలు ఒకదానికొకటి ప్రభావితం చేసుకొంటున్నాయి. సమాజంలో పైకి కనబడే మార్పుల స్వభావాన్ని అర్థం చేసుకొనటానికి చక్కగా పనికి వచ్చే సాధనం పునాది - ఉపరితల భావన.

## 20.6. నమూనా ప్రశ్నలు :

1) జానకి విముక్తి నవలలో చర్చించబడిన స్త్రీ సమస్యలను గుర్తించి వివరించండి.
2) ప్రజాస్వామికీకరించబడిన కుటుంబం అంటే ఏమిటి ? జానకి విముక్తిలోని కుటుంబాలు ఆధారంగా వివరించండి.
3) జానకి విముక్తి నవల నుండి స్త్రీలు నేర్చుకోవలసినదేమిటి ? పురుషులు నేర్చుకొనవలసినదేమిటి ? చర్చించండి.
4) జానకి విముక్తి నవలలో స్త్రీల సామాజిక జీవిత సమస్యలు ఏవైనా చిత్రించబడినాయా ? పరిశీలించండి.

## 20.7. ఉపయుక్త గ్రంథాలు :

1) జానకి విముక్తి సమీక్షా వ్యాసం , ప్రచురించిన పత్రిక : సృజన, మార్చి, ఏప్రిల్, మే, జూన్, జులై సంచికలు, 1984.
2) పితృస్వామ్యం - ఒక పరిచయం - కమలాభసీన్, అనువాదం ఓల్గా వంటింటిమసి స్త్రీవాద ప్రచురణలు, మార్చి 1996.

- ఆచార్య కాత్యాయనీ విద్మహే

**305TL21**

# మాదిరి ప్రశ్నాపత్రం-1

## M.A. TELUGU

## SEMESTER - III - PAPER-V

## WOMEN STUDIES IN TELUGU LITERATURE

## తెలుగు సాహిత్యం - మహిళాభ్యుదయం

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

---

**ఈ క్రింది ప్రశ్నలలో ఐదింటికి సమాధానాలు రాయండి. అన్నింటికి మార్కులు సమానం.**

1. మాతృస్వామిక యుగంలో స్త్రీ స్థితిగతులను సమీక్షించండి?
2. పితృస్వామిక యుగారంభాన్ని వివరించండి?
3. ఋగ్వేదకాలం నాటి వివాహ వ్యవస్థను గురించి రాయండి?
4. శాస్త్ర కాలం నాటి స్త్రీల ప్రత్యేక ధర్మాలను వివరించండి?
5. రామాయణలోని స్త్రీల సమస్యలను విశదీకరించండి?
6. మహాభారత కాలంలోని స్త్రీల జీవిత చిత్రణ చేయండి?
7. హితసూచని స్త్రీల అభివృద్ధికి ఎలా దోహదపడిందో విశ్లేషించండి?
8. కన్యాశుల్కం నాటకంలోని స్త్రీ పాత్రలు సమాజాన్ని ఎలా ప్రభావితం చేశాయో రాయండి?
9. విశ్వనాధ సృష్టించిన స్త్రీ పాత్రలను విశ్లేషించండి?
10. చలం దృష్టికోణంలో స్త్రీని చిత్రించండి?

**305TL21**

# మాదిరి ప్రశ్నాపత్రం–II

## M.A. TELUGU

## SEMESTER - III - PAPER-V

## WOMEN STUDIES IN TELUGU LITERATURE

## తెలుగు సాహిత్యం – మహిళాభ్యుదయం

**సమయం: 3 గంటలు** **మార్కులు: 70**

---

**ఈ క్రింది ప్రశ్నలలో ఐదింటికి సమాధానాలు రాయండి. అన్నింటికి మార్కులు సమానం.**

1. సాహిత్యావిర్భావానికి పూర్వం స్త్రీ గురించి రాయండి?
2. పితృస్వామిక యుగారంభానికి కారణాలను చర్చించండి?
3. వైదికయుగపు సాంఘిక నియమాలను గురించి రాయండి?
4. ఋగ్వేద కాలం నాటి స్త్రీ పరిస్థితిని విశదీకరించండి?
5. మనుస్మృతిలోని ద్వంద్వ నీతి ప్రమాణాలను విశ్లేషించండి?
6. మహాభారత కాలపు స్త్రీల సమస్యలను చిత్రించండి?
7. రామాయణ కాలపు స్త్రీల సమస్యలను చిత్రించండి?
8. గురజాడ స్త్రీని చిత్రించిన విధానాన్ని విశ్లేషించండి?
9. వీర విక్రయంలోని స్త్రీ పాత్రల స్వభావ వైరుధ్యాన్ని ఆవిష్కరించండి?
10. రంగ నాయకమ్మ రచనలలో స్త్రీని తీర్చిదిద్దిన విధానాన్ని తెలుపండి?